UNIVERSAL
LIBRARY
OU_204231
UNIVERSAL
LIBRARY

SREEMATH ANDHRA VALMIKI

RAMAYANAMU



ANDHRA VALMIKI

VASUDASA SWAMY

ARANYA KANDAMU

A LITERAL METRICAL TRANSLATION OF
VALMIKI'S SANSKRIT RAMAYANAM

by

VAVILICOLANU SUBBA ROW,

alias VASUDASA SWAMY

late Telugu Pandit, Presidency College, Madras,

AND THE AUTHOR OF

Sree Kumarabhyudayam, Sree Kausalya Parinayam,
Bhagavad Gita (Dwipada), Sree Krishna Leelamritamu,
Krishnavatara Thathwamu Subhadra Vijaya Natakamu,
&c., &c., &c.,

WITH AUTHOR'S OWN COMMENTARY

CALLED

MANDARAM

IMPROVED SECOND EDITION

PUBLISHED BY

Sree Kodanda Rama Sevaka Dharma Samajam,

ANGALAKUDURU - TENALI

1954

(ALL RIGHTS RESERVED)

ది ఓరియంట్ పవర్ ప్రెస్, తెనాలి

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణము

విషయసూచిక

సర్గసంఖ్య	అరణ్యకాండము	పుటసంఖ్య
1.	మందరవ్యాఖ్యానారంభము	1
	శ్రీరాముఁడు దండకారణ్యముఁ జొచ్చుట	4
	మునులు తమ్ము రక్షింప శ్రీరామునిఁ బ్రార్థించుట	11
	న్యాస వివరణము	13
	రాజలక్షణము—మారుతాది వ్రతవివరణము	18
	భగవద్దేశవాసము తరణోపాయ మనుట భగవదనుగ్రహమే రక్షణోపాయ మనుట	21
	సిద్ధసాధన వివరణము	27
2.	విరాధుండు సీత నెత్తికొనిపోవుట	28
	రాజ్యశ్రీహరణముకంటె సీతాహరణ మెక్కుడు దుఃఖము కలిగించె ననుటచే రాజ్యహరణము కొంచెమైన దుఃఖము కలిగించెఁ గదా ? అయోధ్యాకాండమందుఁ దనవలనఁ బరులకుఁ గలిగిన దుఃఖమునకై తాను దుఃఖించెను గాని రాజ్యము పోయెనని దుఃఖింప లేదని చెప్పఁబడెనే అది యెట్లు ?	
	ఆపదలందు ధైర్యము సజ్జనలక్షణమని నీతిశాస్త్రముండ శ్రీరామచంద్రమూర్తి యేల యేడ్చెను ?	36
	కైక విషయమందు మువ్వురు ప్రసన్నులు గారు. నిష్ఠురములాడుచుండినవారే. ఏల ?	38
3.	రామలక్ష్మణులు విరాధుని వధించుట	41
4.	విరాధుఁడు లక్ష్మీభక్తుఁ డనుటను గుఱించి విరాధుఁడు శ్రీరామునకుఁ దనశాపవిధంబు నెఱిఁగించుట	45
5.	సీతారామలక్ష్మణులు శరభంగాశ్రమమునకుఁ బోవుట	52
	శరభంగుఁడు శ్రీరామునితో నింద్రుని రాకకుఁ గారణంబుఁ జెప్పుట	56
	వానప్రస్థుఁడు తానై శరీరమువిడుచుట యాత్మహత్యగాదు—అనుటను గుఱించి	60
	అర్చిరాదిమార్గవివరణము	61

సర్గసంఖ్య	ఆరణ్యకాండము	పుట సంఖ్య
6.	మునీంద్రులు శ్రీరామునితోఁ దమ కష్టంబులు చెప్పి శరణుఁ జొచ్చుట	63
	వైఖానస శబ్ద విచారము	64
	అనన్యత్వ వివరణము	72
	శ్రీరాముఁడు మునుల కభయం బొసంగుట	73
	శ్రీరాము వనవాసమున కాశ్రితరక్షణము ముఖ్యకారణమా ? పితృవాక్య పరిపాలనమా ?	74
7.	శ్రీరాముఁడు సుతీక్ష్ణాశ్రమమునకుఁ జేరుట	77
	మానసస్నాన మహిమ	77
8.	భగవదారాధన వైభవము	82
9.	సీతాదేవి శ్రీరామునకు హితోపదేశము చేయుట	89
	సీత శ్రీరామునకు శస్త్రసాంగత్య దోషమును దెలుపు నితిహాసముఁ జెప్పుట	94
10.	శ్రీరాముఁడు సీతకు నార్తరక్షణము పరమధర్మంబని చెప్పుట	101
11.	ప్రణవార్థ విచారము	111
	మాండకర్ణి వృత్తాంతము ధర్మభృతుఁడు శ్రీరామునకుఁ దెలుపుట	118
	శ్రీరాముఁ డగస్త్యాశ్రమంబునకుఁ బోవ సుతీక్ష్ణునిచే ననుజ్ఞ గొనుట	123
	భగవత్పూజకుఁ బనికివచ్చు పుష్పాదుల వివరణము	126
	శ్రీరాముఁడు లక్ష్మణునకుఁ వాతాపిల్వల చరిత్రఁ జెప్పుట	127
	శ్రీరాముఁ డగస్త్యాశ్రమముఁ జూచుట	132
12.	శ్రీరాముఁ డగస్త్యునకుఁ దనరాకఁ దెలుప లక్ష్మణుఁ బంపుట	136
	శ్రీరామలక్ష్మణు లగస్త్యాశ్రమంబులోనికిఁ బోవుట	137
	అగస్త్యాశ్రమములోని బ్రహ్మాదిస్థానవిషయిక చర్చ	139
	సీతారామలక్ష్మణు లగస్త్యు దర్శించుట	141
	అతిథిపూజావిచారము	142
	అగస్త్యుఁడు శ్రీరామునకు వైష్ణవాయుధంబులు సమర్పించుట	146
13.	అగస్త్యుఁడు శ్రీరామునితో సల్లాపంబు లాడుట	147
14.	శ్రీరాముఁడు జటాయువుఁ జూచుట	154
15.	సీతారామలక్ష్మణులు పంచవటిఁ బ్రవేశించుట	159
	లక్ష్మణుఁడు పంచవటిఁ బర్ణశాల నిర్మించుట	166
	పంచవటి	168
16	లక్ష్మణుఁడు హేమంతఋతువు వర్ణించి యన్నకుఁ జెప్పుట	170
17.	శూర్పణఖ శ్రీరామునిఁ జూచుట	186

	శ్రీరాముఁడు శూర్పణఖకుఁ దమ వృత్తాంతముఁ జెప్పుట	190
	శూర్పణఖ శ్రీరాముని మోహించుట	192
18.	లక్ష్మణుఁడు శూర్పణఖ ముక్కు సెవులు కోయుట	201
19.	ఖరుఁడు శూర్పణఖ వికృతవేషమును జూచి కోపించుట	203
	శూర్పణఖ ఖరునకు సీతారామలక్ష్మణుల వృత్తాంతముఁ జెప్పుట	205
	ఖరుండు పదునల్వురు రాక్షసుల శ్రీరాముని మీఁదికిఁ బంపుట	216
20.	శ్రీరాముఁడు పదునల్వురు రాక్షసులఁ జంపుట	219
21.	శూర్పణఖ ఖరుని రాముని మీఁదికి యుద్ధమునకుఁ బోవఁ బ్రేరేపించుట	223
22.	ఖరుఁడు సేనతోడ శ్రీరామునిమీఁదికి యుద్ధమునకుఁ బోవుట	225
23.	ఖరునకు దుశ్శకునంబు లగుట	230
24.	రాముఁడు లక్ష్మణునకు యుద్ధశకునంబులఁ జూపుట	235
	శ్రీరాముఁడు సీతాలక్ష్మణుల గుహనుండఁ బనిచి యుద్ధసన్నద్ధుఁ డగుట	237
	ఖరసైన్యము రామునిం జూచుట	242
25.	ఖరుఁడు సేనతోడ శ్రీరాముఁ దాకుట	244
	శ్రీరాముఁడు ఖరుసేనను నుఱుమాడుట	246
26.	దూషణుఁడు శ్రీరామునితో యుద్ధముఁ జేసి చచ్చుట	253
	కాలకార్ముకాది సేనాపతులు పన్నిద్దఱు శ్రీరామునిచేఁ జచ్చుట	256
27.	త్రిశిరుండు శ్రీరామునితోఁ బోరి చచ్చుట	258
28.	ఖరుఁడు శ్రీరామునితో రణం బొనర్చుట	261
	ఖరుఁడు శ్రీరామకవచంబు ఛేదించుట	264
29.	ఖరుని శ్రీరాముఁడు నిందించుట	266
30.	ఖరుఁడు శ్రీరాముచే హతుం డగుట	278
	మహర్షులు శ్రీరామునిఁ బ్రశంసించుట	280
	సీతాలక్ష్మణులు శ్రీరాముఁ జేరవచ్చుట	282
31.	అకంపనుఁడు రావణునకు ఖరాదివృత్తాంతముఁ జెప్పుట	288
	అకంపనుఁడు రావణునకు శ్రీరామ పరాక్రమంబు వర్ణించి జెప్పుట	292
	అకంపనుఁడు రావణునితో సీతాపహరణము శ్రీరామ వధోపాయంబుగఁ జెప్పుట	300

సర్గసంఖ్య	అరణ్యకాండము	పుట సంఖ్య
	రావణుఁడు మారీచుం జూడబోవుట	309
	మారీచుఁడు రావణునకు శ్రీరామునితోడి విరోధంబు వలదని చెప్పుట	310
32.	శూర్పణఖ లంక కేగి రావణుఁ జూచుట	314
33.	శూర్పణఖ రావణు నిందించుట	320
34.	శూర్పణఖ రావణుతో శ్రీరాముని వర్ణించి చెప్పుట	329
	శూర్పణఖ రావణుతో సీతను వర్ణించి చెప్పుట	331
35.	రావణుఁడు రహస్యంబుగ మారీచాశ్రమంబునకు బోవుట	336
36	రావణుఁడు మారీచుతో జనస్థాన వృత్తాంతముఁ జెప్పుట	344
	రావణుఁడు మారీచుని తోడుపడ వేఁడుట	348
37.	మారీచుఁడు రావణునకు శ్రీరాముని బలపరాక్రమములు దెల్పుట	350
38.	మారీచుఁడు రావణుతో శ్రీరామునిచేఁ దానుబడిన పాట్లు దెలుపుట	357
39.	మారీచుఁడు రావణుతోఁ దాను రాముని బారిబడి తప్పించుకొన్న విధముఁ దెలుపుట	364
40.	రావణుఁడు మారీచునిఁ బరుషంబు లాడి బలాత్కరించి తోడుపడ నంగీకరింపఁ జేయుట	370
41	మారీచుఁడు రావణు నిందించుట	375
42.	రావణ మారీచులు పంచవటికిఁ బ్రయాణ మగుట	380
	మారీచుఁడు మాయామృగం బగుట	382
43.	జానకి మాయామృగంబును జూచుట	384
	సీత మాయామృగంబును బట్టితెమ్మని కోరుట	386
	శ్రీరాముఁడు లక్ష్మణునకు సమాధానముఁ జెప్పుట	389
	శ్రీరాముఁడు లక్ష్మణునితో మారీచ మాయయేని మాయామృగం బవశ్య వధ్యంబని చెప్పుట	392
44.	శ్రీరాముఁడు మాయామృగము వెంటఁ బోవుట	397
	శ్రీరాముని బాణముచే మారీచుఁడు 'హా లక్ష్మణా' యని యఱచి చచ్చుట	400
45.	సీత లక్ష్మణుని రామునకు సహాయుండుగఁ బొమ్మనుట	405
	సీత లక్ష్మణునిఁ గోపించి పలుకుట	406
	లక్ష్మణుఁడు సీతకు సమాధానముఁ జెప్పుట	408
	సీత లక్ష్మణుని నిష్ఠురంబులు పలుకుట	410

ఆరణ్యకాండము

సర్గసంఖ్య		పుట సంఖ్య
	లక్ష్మణుఁడు సీతపైఁ గోపించి రాము నొద్దకుఁ బోవుట	413
46.	రావణుఁడు యతివేషము ధరించుట	418
	సన్న్యాసివేషాదుల గుఱించి	419
	రావణుఁడు యతివేషంబున సీతయొద్దకు వచ్చుట	423
	సీత యతివేషంబున నున్న రావణు సత్కరించుట	429
47.	సీత మాయాయతికిఁ దన వృత్తాంతముఁ జెప్పుట	434
	రావణుఁడు సీతకుఁ దన వృత్తాంతంబు జెప్పి యామెను దురుక్తులాడుట	441
	సీత రావణు నిష్ఠురంబులు పలుకుట	443
48.	సీతకు రావణుఁడు తన స్వరూపముఁ జూపి భయోక్తులాడుట	451
	సీత రావణు నిందించుట	458
49.	రావణుఁడు సీతను బలాత్కారముగ నెత్తికొనిపోవుట	461
	సీత రామలక్ష్మణులఁ బేర్కొని యేడ్చుట	468
	సీత జటాయువుం జూచి పలవించుట	472
50.	జటాయువు రావణుని దూషించుట	474
51.	జటాయు రావణుల యుద్ధము	482
	రావణుని జటాయువు పరుషోక్తు లాడుట	486
	రావణుఁడు జటాయువు ఱెక్కలు నఱకుట	490
52	సీత రామలక్ష్మణులఁ గూర్చి యాక్రోశించుట	491
	రావణుఁడు సీత నెత్తుకొని పరువెత్తుట	495
53.	సీత రావణు నిందించుట	502
54.	సీత తన యాభరణంబులు కపులముందట వైచుట	507
	రావణుఁడు సీతతో లంకఁ జొచ్చుట	509
	రావణుఁడు జనస్థానమునకుఁ గాపు పంచుట	511
55.	రావణుఁడు సీతకుఁ దన సౌధంబుఁ జూపుట	513
56.	సీత రావణునిఁ బరుషోక్తు లాడుట	522
	రావణుఁడు సీతమీఁద రాక్షసస్త్రీల కావలి యుంచుట	530
57.	రాముఁ డపశకునములఁ గని పరితపించుట	536
	రాముఁడు లక్ష్మణుం జూచి సీతఁ దలంచి దుఃఖించుట	538
58.	సర్గము	

సర్గసంఖ్య | ఆరణ్యకాండము | పుట సంఖ్య

సర్గసంఖ్య	ఆరణ్యకాండము	పుట సంఖ్య
59.	రాముఁడు లక్ష్మణుని సీతను విడిచి యేల వచ్చితివని యడుగుట	544
	రాముఁడు లక్ష్మణునితో నతఁడు సీతను విడిచి వచ్చుట తగనిపని యని చెప్పుట	547
60.	రాముఁడు పర్ణశాలలో సీత లేమిఁ గని దుఃఖించుట	550
	రాముఁడు సీతను వెదకుట	553
61.	లక్ష్మణుఁడు రామునకు సమాధానము జెప్పుట	567
62.	రాముఁ డున్మత్తుపలె దుఃఖించుచు సీతను రోయుట	570
	రాముఁడు లక్ష్మణుని నయోధ్యకుఁ బొమ్మనుట	573
63.	రాముని శోకమునుగూర్చి	574
64.	అడవిమృగములు రామునకు సీత పోబడి సూచించుట	584
	రాముఁడు సీతాదేవి భూషణాదుల నేలపైఁ జూచుట	588
	రాముఁడు దేవతలపైఁ గోపించి జగత్సంహారముఁ జేయఁ బూనుట	591
65.	లక్ష్మణుఁడు శ్రీరాముని శాంతునిఁ జేయుట	597
66.	సర్గము	602
67.	రాముఁడు లక్ష్మణు వాక్యంబుల శాంతుఁడై సీతను వెదకుట	607
	రామలక్ష్మణులు జటాయువును జూచుట	609
	జటాయువు రామునకు సీతాపహరణ వృత్తాంతముఁ జెప్పుట	613
	జటాయు దుస్థితికి రాముఁడు దుఃఖించుట	611
68.	జటాయువు రామునకు సీతావృత్తాంతము సవిస్తరంబుగఁ జెప్పుట	614
	జటాయు మృతికి రాముఁడు శోకించుట	618
	రాముఁడు జటాయువున కగ్నిసంస్కారాదులు చేయుట	623
69.	లక్ష్మణుఁ డయోముఖిని విరూపఁ జేయుట	662
	రామలక్ష్మణులు కబంధుని చేఁజిక్కుట	628
70.	రామలక్ష్మణులు కబంధుని బాహువులు నఱకుట	632
	లక్ష్మణుడు కబంధునకుఁ దమ వృత్తాంతముఁ జెప్పుట	634
71.	కబంధుఁడు రామలక్ష్మణులకుఁ దన వృత్తాంతముఁ జెప్పుట	635
72.	కబంధుఁడు స్వస్వరూపంబు నొందుట	640
	కబంధుఁడు రామునకు సుగ్రీవునితో మైత్రి చేసికొనఁ జెప్పుట	641
73.	కబంధుఁడు రామునకుఁ బంపామార్గంబుఁ జెప్పుట	644

సర్గసంఖ్య	ఆరణ్యకాండము	పుట సంఖ్య
	కబంధుఁడు రామునకుఁ బంపాసరస్సు వర్ణించి చెప్పుట	646
	కబంధుఁడు రామునితో శబరిక దర్శన మిమ్మని చెప్పుట	648
74.	రామలక్ష్మణులు శబరిం జూచుట	652
	ఆహారపదార్థ విచారము	653
	శబరి రామలక్ష్మణులకు మతంగాశ్రమమునందలి వింతలు చూపుట	659
	శబరి (భక్తిసంజీవని సముద్ధృతము)	662
	అంతేవాసి లక్షణము	681
	గురులక్షణము	692
	విద్యాబంధువగు గురువు లక్షణము	694
75.	రామలక్ష్మణులు పంపాతీరంబుఁ జేరుట	695
	అరణ్యకాండాంత పద్యములు	700
	గద్యము	702

శ్రీరామసేవ

శ్రీః.

శ్రీ సీతా లక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్సమేత శ్రీరామచన్ద్రపరబ్రహ్మణే నమః

శ్రీమతే రామానుజాయ నమః

శ్రీ శారదాయై నమః

శ్రీ హయగ్రీవ ప్రసన్న

శ్రీమదాంధ్రవాల్మీకిరామాయణము

సవ్యాఖ్యానము

ఆరణ్యకాండము

నారాయణ ! కరుణా
ధీనా ! దీనార్తిహరణ ! ధీమజ్జన ర
క్షానియమా ! యపవర్గ వి
ధానక్షమ ! యొంటిమిట్ట ! దశరథరామా !

మందరము

వ్యాఖ్యానారంభము

శ్రీరామచంద్ర ప్రభో పాహి పాహి !

సీ. తనపాదభక్తుల తనయునిగాఁ జేసెఁ, జెట్లూరి నరసింహ శిష్యుఁ జేసె
దయ దీనిఁ దా నంకితంబుగా గ్రహియించె, జగములఁ దనకీర్తి నెగడఁ జేసె
మందరభారంబు మహిమతో వహియించె, జనితవిఘ్నంబును సమయఁ జేసె
వాసుదాసుని దాను వాసిగాఁ జేసెఁ బ్రజలందుఁ దనభక్తిఁ బ్రబలఁ జేసెఁ

గీ. తనదు నీ గ్రంథమునకును దాన వ్యాఖ్య
గరిమ వ్రాయించుకొనె వనకాండమునకు
వాసుదాసునిచే దర్భ బ్రహ్మశరము
చేసి యప్రతిహతముగఁ జేసినట్లు.

తే. గీ. ఆలసించుట నొండె మాంద్యమున నొండె
నించుక యుపేక్ష చేసితినేని లెమ్మ
టంచుఁ బేర్వెట్టి లేపెడి యవనితనయ
రామచంద్రుఁడు గలుగ నాకేమిభయము ?

శ్రీనారాయణ=లక్ష్మీవిశిష్టుఁడవైన నారాయణా ! ఇచ్చట నీ నారాయణ శబ్దము ద్వయములోనిది, కేవలనారాయణుఁడైనచో హితబుద్ధిచేనైనను దనయాజ్ఞ నుల్లంఘించి యపరాధులైనవారిని "న క్షమామి" నేను క్షమింపను. "క్షిపామ్యజస్ర మశుభా నాసురీష్వేవ యోనిషు" శాశ్వతముగా నసురయోనులందే పడవేసెదను. అని తండ్రియందువలె శిక్షకత్వమే యుండును. ఆయన యామాట లనఁగానే "దేవ్యా కారుణ్యరూపయా" యన్నట్లు మూర్తీభవించిన దయ యగు శ్రీదేవి ప్రక్కనే యుండి చేతిని బట్టుకొని 'యేమి నాథా ! మీరిట్టులనెదరు. హేయగుణరహితులరు-కల్యాణగుణసహితులరు నగు మీ వాక్కున నిట్టి కఠినోక్తులు రావచ్చునా ? తప్పుచేసినవారి నెల్ల దండింపఁ బూనిన లోకమునఁ దప్పుచేయని వారెవ్వరు ? అందఱిని శిక్షింపఁబూనిన మీరు రక్షించునది యెవరిని ? ఎవనియం దేమి మేలిగుణమున్నదో అది యాధారము చేసికొని వానిని రక్షింతునా యని మీరు సద్గుణములను వెదకవలయునుగాని యెవఁడేమి తప్పు చేసెనో యని వెదకి యామాత్రమున వాని దండింపఁ బూనరాదు. దండము తమోగుణ భూయిష్ఠునకుఁదగును గాని శుద్ధసత్త్వగుణైక నిష్ఠ గలిగి జగద్రక్షాకార్యమే కృత్యముగా నుంచుకొనిన మీకుఁ దగినదికాదు. ఇంతకు నీ యపరాధము చేసినవారెవ్వరు ? నీ బిడ్డలుగారా ? మీ యంశ సంభూతులుగారా ? 'అహం స్మరామి - అహం సర్వభూతేభ్యో దదామి - అహం సర్వపాపేభ్యో మోక్షయిష్యామి' యనిన మీ వాక్యములను స్మరించి రక్షింపు"మని సౌమ్యునిఁ జేయును.

కరుణాధీనా = అన్ని గుణము లాయనకు వశములై యాయన సంకల్పము ప్రకారము వర్తించును. కరుణకు మాత్రమే యాయన వశపడి యది యాడించినట్లు లాడుచుండును. కావున నాయన కరుణ కధీనుండయ్యెను. "ఏవం సంసృతి చక్రస్థే భ్రామ్యమాణే స్వకర్మభిః, జీవే దుఃఖాకులే విష్ణోః కృపా కాప్యుపజాయతే" ఈ విధముగ సంసార చక్రమందుఁ దగులుకొని తన కర్మములచే దిమ్మతిరుగుచు దుఃఖముచే గలవరపడుచున్న జీవులను చూచి విష్ణువునకుఁ గృపకలుగును. ఈ విధముగ జగత్సృష్టికి, రక్షకు, సంహారమునకుఁ గరుణయే కారణము. అంతియకాదు- అటుల

కరుణకు వశుఁడైనవాఁ డేమి చేయు ననిన:—దీనా ర్తిహరణ=కష్టదశయందుండువాని బాధను హరించువాఁడా? ఇతరుల దుఃఖమును బోఁగొట్టుట దయచేత నే కదా. బాధ వచ్చిన పిమ్మట దీనులేడ్చిన నపుడు రక్షించునే గాని నిజముగా దయగలవాఁడైనచో బాధరాకయుండఁజేయుట యు త్తమపక్షము గదా. అట్లులు చేయును. ధీమజ్జన రక్షా నియమా=బుద్ధిమంతుల రక్షించు నియమము గలవాఁడా! తన కనుకూలముగ వ ర్తించు వారికి నాపదరాకుండఁ గాపాడును. తక్కినవారు మొఱబెట్టినపుడు కాపాడును. ఆయన యేమి మేలుచేయును. ఎట్లు కాపాడునందురా! అపవర్గ విధానక్షమ=మోక్ష మిచ్చుటయందు శ క్తిగలవాఁడా ! మరల జనన మరణములకు వచ్చి సంసారములో పడి పరితపింపకుండునట్లు మోక్షమిచ్చును. ఇంతటి మేలుచేయువాఁడు మఱి యెవ్వఁడు లేఁడుగదా. ఇంతకంటె మేలు లేదుగదా. నే నాయన నాశ్రయించినఁగదా మోక్షమిచ్చును. ఎక్కడనో మనకు గోచరుఁడుగాక వైకుంఠములోను బాల సముద్రములో నుండువానిని నే నెట్లు లాశ్రయింపఁగలను? ప్రజలయం దనురాగము కల వాఁడైనచో వారికి సులభసాధ్యుఁడుగా నుండవలయునుగాని యెక్కడనో గహన ప్రదేశమునఁ గానరాకయుండి మీ రిక్కడికి రండనిన నెవరుపోఁగలరు ? దయగల వాని లక్షణ మిదియా యనరాదు. ఒంటిమిట్ట దశరథరామా = భక్తులకు సులభుఁడై కనులకు గోచరించుచు నొంటిమిట్టయందు దశరథరాముఁడై సాక్షాత్కరించి యున్నాఁడు. ఇంతకంటెను సౌలభ్య మెందుఁగలదు. దశరథరామా=దశరథుని కుమా రుఁడవైన రామా యని మధ్యమపదలోపిసమాసముగ నైనఁ జెప్పవచ్చును. దశరథునియొక్క రాముఁడని శేషషష్ఠియైనఁ జెప్పవచ్చును. ఇచట శేషషష్ఠి పితృ పుత్ర భావరూపసంబంధార్థకము. లేక దశరథునకు రామా ఆనందకరుఁడా యని యైనఁ జెప్పవచ్చును. రథశబ్దమునకు దేహ మనియు నర్థముకలదు. 'రథః పౌరుష దేహయోః' త్రికాండశేషము. "ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవచ" భ. గీ. 'రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే' ఇత్యాది ప్రయోగములవలన రథమనఁగా దేహము. మత్స్యకూర్మాది దశవిధ దేహములుగల రామా యని యర్థము. దశ రథ=పక్షివాహనుఁడా. ఈ యర్థము బాలకాండమందు వ్రాయఁబడెను. కావున గరుడవాహనుఁడవైన రామాయని యర్థము. కావున నొంటిమిట్టయందు వేంచేసి యుండు రాముఁడే గరుడవాహనుఁ డనియు, దశరూపధారి యనియు శ్రీమన్నారా యణుఁ డనియు గ్రాహ్యము. ఇట్టి యో శ్రీరామచంద్రమూ ర్తీ! నీ వరణ్యమునఁ జేసినచర్య వినిపించెదను వినుము.

కరుణాధీనా యనునది నాశ్రితరక్షణార్థము, పితృవాక్యము నెపముగాఁగొని యరణ్యమునకు వచ్చుట తెలుపును. "పనిగొని యాత్మకార్యముగఁ బావుల నెల్ల నడంచు మీకు శోభన మొనగూర్ప ఋజ్జనకువాక్యము సాకుగ నేను వచ్చితి." (వ. ౮౮) అను రామచంద్రు వాక్యమే యీ యర్థమును దెలుపుచున్నది. "శక్తోపి

రాఘవ స్తస్మై, రాజ్యం సంత్యజ్యధర్మతః । దశగ్రీవవధార్థాయ పితుర్వచనహేతునా".
అను పాద్మవాక్యము దీనిని బలపఱచుచున్నది.

దీనార్తిహరణ=ఇది "రమ్మనిగో రాఘవ కనుఁగొమ్ము వనంబునను నసురకోటులచే నా। శమ్మునుగన్న మునీంద్రచయమ్ముల దేహము లెమ్ము"లను దానిని సూచించుచున్నది. ప. ౮౫. ధీసజ్జనరక్షానియమా = ఇది రామచంద్రమూర్తి శరభంగా. శ్రమవాసులయెడఁజేసిన ప్రతిజ్ఞయు ఆ విషయమున సీతాదేవి చెప్పిన కొన్ని వాక్యములకు రామచంద్రమూర్తి ప్రత్యుత్తర మిచ్చుటయు సూచించును. అపవర్గ ... క్షణ=ఇది జటాయువునకు మోక్ష మిచ్చిన విషయముఁదెలుపును.

—♦ శ్రీరాముఁడు దండకారణ్యముఁ జొచ్చుట. ♦—

ఉ. ధీరుఁడు రామభూవరుఁడు ♦ తీవ్రపరాక్రమశాలి చొచ్చి దు
ర్వారమహావనిన్, భయాళి ♦ ఘోరమృగావిలదండకాటవిన్,
హారివిహారి తాపస జ ♦ నాశ్రమమండల మందుఁ గాంచె నా
నారమణీయభూమిరుహ ♦ నవ్యము భవ్యము భూతసేవ్యమున్.

అవతారిక:—పూర్వకాండమున జగజ్జన్మాదికారణుండును, వేదాంతవేద్యుండును పరబ్రహ్మమగు శ్రీరామచంద్రమూర్తికి నవిద్యాదోషగంధశూన్యతయు, ఆనందపరిపూర్తియు, సర్వాంతర్యామిత్వము, అత్యుత్తమ ధర్మప్రవర్తకత్వము నను నిటువంటి యనేకగుణములు చెప్పఁబడెను. ఈ కాండమున సజ్జనరక్షణమనెడిధర్మము చెప్పఁబడును. పరిత్రాణాయ సాధూనామ్మను నవతార ప్రథమ ప్రయోజన మిందుఁ జెప్పఁబడును. సజ్జనసంరక్షణ మీ కాండమందలి సారాంశ మగుట నది మొదటి పద్యమున నే చెప్పఁబడెను.

అయోధ్యకాండమందు సామాన్యలౌకిక ధర్మములు - పుత్రధర్మము - రాజధర్మము - భ్రాతృధర్మము - మిత్రధర్మము - సత్య ధర్మనిష్ఠ లోనైనవి చెప్పఁబడెను. ఇందు విశేషధర్మములు చెప్పఁబడును.

శ్రీ మద్రామాయణమందు శ్రీ సీతారామలక్ష్మణులు ముఖ్యులు. తక్కిన వారు సందర్భానుసారముగ వచ్చినవారు. ఈ ముగ్గుర సంబంధము చిదచిదీశ్వరుల సంబంధమును దెల్పుచున్నది. ప్రకృతి కధిష్ఠానదేవత లక్ష్మి - సీత. ఈమె చైతన్య స్వరూపిణి - ప్రకృతిబద్ధాత్మస్థానమున నీమె చెప్పఁబడెను. లక్ష్మణుఁడు ప్రకృతి సంసర్గము లేని జీవుఁడు. కావున నే యీయనభార్యతోడి జంజాటము లేనివాఁడుగాఁ జెప్పబడెను. శ్రీరాముఁ డీశ్వరుఁడు. ప్రకృతిబద్ధజీవుఁడు, శుద్ధజీవుఁ డిరువురు నీశ్వరు నాశ్రయించి యాయనకు శేషభూతులైయుండువారే. ఈ తత్త్వము తెలిసినవాఁడు ముక్తుఁ డగునని భగవద్గీతయందుఁ బదునైదవయధ్యాయమునఁ జెప్పఁబడెను.

ద్వా విమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవచ
క్షరః సర్వాణి భూతాని, కూటస్థోఽక్షర ఉచ్యతే.

ఉత్తమః పురుష స్త్వన్యః, పరమాత్మే త్యుదాహృతః
యో లోకత్రయ మావిశ్య బిభ ర్త్యవ్యయ ఈశ్వరః
తస్మాత్ క్షరమతీతోహ మక్షరాదపి చోత్తమః
అతోస్మి లోకే వేదే చ, ప్రథితః పురుషోత్తమః
యో మా మేవ మసంమూఢో జానాతి పురుషోత్తమమ్
స సర్వవి ద్భజతి మాం సర్వభావేన భారత
ఇతి గుహ్యతమం శాస్త్ర మిదముక్తం మయానఘ
ఏత ద్బుద్ధ్వా బుద్ధిమాన్స్యాత్, కృతకృత్యశ్చ భారత ॥

అర్థము

క్షరుఁ డక్షరుఁడని యిరువురు పురుషులు లోకమునఁ బ్రసిద్ధులు. అందు క్షరుఁ డనువాఁడు అచిత్తు (ప్రకృతి) సాంగత్యము నొందిన బద్ధజీవుఁడు. ఈ యచిత్తు సంసర్గము లేని జీవుఁడు, ముక్తుఁడు, నిత్యుఁడు, రెండవవాఁడు-ఈ యిరువురకంటె నుత్తమపురుషుఁడు మఱియొకఁడు గలఁడు-అత డవ్యయుఁడు-ఆయనయే ప్రకృతినిఁ, బ్రకృతి బద్ధజీవునిఁ బ్రకృతి ముక్తజీవుని భరించువాఁడు.

నేనుమీఁదఁజెప్పిన క్షరాక్షరముల రెంటికంటె నుత్తముఁడను గావున లోకములందు వేదములందు నేను బురుషోత్తముఁడని ప్రసిద్ధి చెందితిని.

ఎవఁ డంతయు నొకటియే యని ప్రమాదపడక న న్నిట్టివానిఁగాఁ దెలిసికొనుచున్నాఁడో వాఁడు సర్వము తెలిసినవాఁడై న న్నన్నివిధముల భజించును.

ఇది మిక్కిలి రహస్యమైన శాస్త్రము - నీకుఁజెప్పితిని - దీనిఁదెలిసికొనిన బుద్ధిమంతుఁడు కృతకృత్యుఁడు.

శ్రీమద్రామాయణ మీ మువ్వురసంబంధమునే యాదినుండి యంత్యమువఱకు బోధించుచున్నది. ఈ విషయము మనస్సునం దుంచుకొనక రామాయణము చదువువాఁడు ఆఖ్యాయిక చదువువాఁడే. ఇందు సీతాలక్ష్మణులకు శ్రీరామచంద్రమూర్తి యందుగల ప్రేమ భక్తులు, బాలకాండమున సామాన్యముగ సూక్ష్మముగ వర్ణింపఁబడెను.

(చూ. ప. బాల. ౫౨౩-౫౩౨-౫౩౪-౧౩౬౫ - ౧౩౬౬-౧౩౬౭ - ౧౩౬౮) ఆవల నయోధ్యాకాండమందుఁ దమ సర్వసౌఖ్యములు వదలుకొని శ్రీరామచంద్రమూర్తి వెంటఁ బోవుటయేగాక నీకైంకర్యము లేక నే నుండజాలనని లక్ష్మణుఁడు నిన్ను విడనాడి నేనుండజాలనని సీత చెప్పుటచే ఆ ప్రేమభక్తులు విశేషించి చెప్పఁబడెను.

(చూ. అయో. ౭౯౦-౭౯౧-౮౨౮-౮౩౧- ౮౪౭- ౮౭౩- ౮౮౬- ౮౮౭- ౧౪౨౬.)

ఆరణ్యకాండమందుఁ గబంధుఁడు రామలక్ష్మణులఁ బట్టుకొన్నప్పుడు నన్ను వీనికిఁ దిననిచ్చి, వాఁడు నన్నుఁ దినులోపల నీవు తప్పించుకొని పాఱిపొమ్మని రామప్రాణరక్షణార్థము తన ప్రాణముల లక్ష్మణుఁ డియ్యఁబూనుటయు (౧౯౯౧ ప.) సీతాదేవి తా నొంటిగ నుండియు స్త్రీయయ్యు భయములేక కామములేక రాముని భూషించి రావణుని దూషించుటయు (ప. ౮౦౧) వారి భక్తిప్రేమలు విశేషముగఁ దెలుపుచున్నవి.

ధీరః=ధైర్యశాలి, ఘాతుకమృగములతోనిండి రాక్షసభూయిష్ఠమైనఘోరారణ్యముఁ బ్రవేశించుచున్నను భయపడనివాఁడు. ఆపదలందును మనసు చలింపని గుణము ధైర్యము. ఈ ధైర్యమునకుఁ గారణమేమనిన.— భూవరుఁడగుటయే = రాజగుటయే, రాజులకు ధైర్యము ప్రథమగుణము, ఉత్తరకుమారునివంటి పిఱికిపందలు లేరా యందురేమో, తీవ్ర పరాక్రమశాలియగుటయే, తీవ్ర=తీక్ష్ణమైన, పరాక్రమశాలి=ఎట్టివిరోధులనైన నాక్రమించు తీక్ష్ణమైన శౌర్యాదులచేఁ బ్రకాశించువాఁడు, దుష్క్రూరమహాటవీం = ఇటువంటి వానికిని మిక్కిలి క్రూరమని తోఁచునట్టి పెద్ద యడవిని, క్రూరమగు నడవి యనఁగాఁ క్రూరమృగములచేతను క్రూరరాక్షసులచేతను నిండిన దనిభావము, బహుళఘోరమృగావిల = మిగుల భయంకరమైన యడవిమృగములచేఁగలఁత నొందినది యగు, దండకాటవీం=దండకయను పేరుగల యడవియందు, సప్తమ్యర్థమున ద్వితీయ, హారి విహారి=మనోహరమగు సంచారముగలవాఁడు. ఇంత ఘోరారణ్యమందుఁ దిరుగుచున్నను నది యాయన కుద్యానవనమందు సంచరించుటవలె మనోహరమైయుండెనేకాని వికటముగ నుండలేదు, చొచ్చి=ప్రవేశించి, అందు= ఆ యరణ్యమందు, తాపసజనాశ్రమమండలమ్=తపస్సుచేసికొను వారి యాశ్రమప్రదేశము, కాంచెన్=చూచెను,అదియెట్టులున్నదనిన, నానా=పలువిధములైన,రమణీయ= అందమైన, భూమిరుహ=చెట్లచే, నవ్యము=సుందరమైనది, భవ్యము=శుభకరమైనది, భూతసేవ్యమున్ = సమస్తభూతములచేతను సేవింపఁబడ యోగ్యమైనది, ఇట్లనుటచే సహజవిరోధములుగల జంతువులును దమవైరము మానుకొని స్నేహభావముచేఁగలసి మెలసి తిరుగుచున్నవని భావము. (-౨) మృగములందు మైత్రిగానవచ్చునుగాని యంతకంటెఁ గ్రూరు లగు రాక్షసు లున్నవారుగదా యనిన వారును ఆశ్రమము పొలిమేర లోఁగా రాఁజాలరు. అది విడిచి యావలఁబోయిననే బాధింతురు. కావున రాక్షసులకు భయపడువారుకూడ నిర్భయముగా నందు వసింపవచ్చునని భావము. అటుగాక యాశ్రమములోనికి వారు రాఁగలిగియుండిన ఋషి, ముని, యని పేరులే లేకపోయి యుండవలెను. మండలము=ఆశ్రమముల సమూహము, 'చక్రవాళంతు మండల'మ్మని నిఘంటువు. దండక=దండుఁడను రాజు శుక్రాచార్యుని కూఁతును బలాత్కారముగఁ జెఱిచిన కారణముచే జనస్థానమందుఁ దప్పనతని రాష్ట్రముపై మట్టివాన గురియునట్లు

శుక్రుఁడు శపించెను. అట్లు పాడుపడినభూమి యతనిపేర దండకారణ్యమయ్యెను. ఈ విషయ ముత్తరరామాయణమునఁ జెప్పఁబడెను. చూ. ప. ౧౩౪౯.

తాత్పర్యము

తీవ్ర పరాక్రమముఁగలవాఁడును ధీరుఁడు నగు శ్రీరామచంద్రమూర్తి మిక్కిలి భయంకరములయిన మోసములచేఁ గలఁత నొందియు మిగులఁ గ్రూరమగు దండ కాటవిలోఁ బ్రవేశించి యందు నానావిధములైన సుందరములగు వృక్షములచే నంద మై శుభమై భూతసేవ్యమైన మునీంద్రుల యాశ్రమ సమూహమును జూచెను.

కం. చీర కుశ వ్యాప్తంబై, సారాగమకాంతిపూర ♦ సంపద మింటన్
  భూరిద్యుతిదుర్దర్శం, బౌ రవిమండలము భాతి ♦ సమరెడుదానిన్.   ౩

చీరకుశవ్యాప్తంబై =ఉదికియార వేసిన నారచీరలచేతను యజ్ఞమునకై తెచ్చిన దర్భలచేతను వ్యాపించినదై, సారాగమ=సారవంతములైన వేదాధ్యయనముచేఁ గలిగిన, కాంతి=బ్రహ్మవర్చస్సుయొక్క, పూర=ప్రవాహముయొక్క, సంపదన్ =అతిశయముచే, భూరిద్యుతి=అధికమైనకాంతిచే, దుర్దర్శంబు=చూడరానిది, రవిమండలము భాతి=సూర్యమండలమువలె, అమరెడుదానిన్=ఒప్పుచున్నదానిని, ఋషులసమూహమునకు సూర్యమండలమునకు బ్రహ్మతేజస్సునకు సూర్యరశ్మికి నుపమానోపమేయములు. ఇరువుర తేజస్సునకు వేదోక్తతపస్సే కారణము.

భూరిద్యుతి దుర్దర్శంబౌ రవిమండల మనుటచే నిది గ్రీష్మర్తువని యేర్పడుచున్నది. కావున నిది కార్తికమాసమను తిలకవ్యాఖ్యానము సందేహింపఁదగినదే. చెప్పవలసినదానిని బ్రత్యక్షముగాఁ జెప్పక మఱియొకవిధముగాఁ జెప్పుట వాల్మీకి శైలియైయున్నది. లంకలో హనుమంతుఁ డున్నప్పుడు సూర్యోదయము మఱికొన్ని చోటుల నిట్లే చెప్పియున్నాఁడు.

సూర్యుఁడు దర్శింపరాకుండుట మధ్యాహ్నమందేకదా. ఉదయాస్తమయముల సూర్యునకు మందేహాదిరాక్షసబాధ గలదు. కాని మధ్యాహ్న సూర్యునకు వారిబాధ యెట్లులేదో యట్లే యాశ్రమవాసులకు రాక్షసబాధ లేదని భావము.

అడవి కావున సారాగమ = సారవంతములైన చెట్లయొక్క యని యర్థము చెప్పవచ్చునుగాని యుపమానోపమేయములకుఁ బోలిక లేకపోవును.

తాత్పర్యము

నారచీరలచేతను దర్భలచేతను వ్యాపించినదై సారవంతములైన వేదాధ్యయనములచేఁ గలిగిన బ్రహ్మవర్చస్సంపదచే నొప్పి మిగులఁగాంతిచే దుర్దర్శమగు సూర్యమండలమువలె నొప్పుచున్నదానిని.

సీ. నానామృగాకీర్ణ♦మై నస్వవిష్కృర, కాంతమై యప్సరః♦కంజముఖుల
  యాటల బాటల♦నర్చావిధంబుల, హర్షదంబై విశా♦లాగ్నిశరణ

ములచేత స్రుగ్భాండ ♦ ములచేతఁ గృష్ణాజి,నములచే దర్భసం ♦ తతులచేత
నొప్పారి సమిధల ♦ నుదకకుంభంబుల, ఫలమూలతతుల రా ♦ జిలుచు స్వాదు
తే. ఫలసమావృతవన్యస ♦ ల్లలితభూరి, ధారణీరుహవారసం ♦ భార మగుచు
హోమబలిసత్కృతం బయి ♦ యుదితవేద, నాదమయి నీరజోజ్జ్వలనళిని యగుచు.

నానామృగాకీర్ణమై=భూతసేవ్యమనువది వివరింపఁబడుచున్నది, నానా=అనేకములగు, మృగ = జంతువులచే, ఆకీర్ణము = వ్యాపించినది, నవ్య = క్రొత్తక్రొత్తలగు, విష్కిర = పక్షులచే, కాంతము = మనోహరమైనది, అప్సరః కంజముఖుల = అప్సరసలనెడి స్త్రీలయొక్క, ఆటలన్ = క్రీడలచేతను, పాటఁన్ = గానములచేతను, అర్చావిధుల = పూజలచేతను, హర్షదము = సంతోషము నిచ్చునది, ఒక ఋషిగాకున్న మఱియొక ఋషి యతఁడు గాకుండిన వేఱొకఋషి విడువక యజ్ఞము చేయుటచే దానికై యాహ్వానింపఁబడి వచ్చినదేవతలవెంట దేవతాస్త్రీలు వచ్చి యాటలచేతను బాటలచేతను వారికి సంతోషము కలిగించుచుండిరని భావము, విశాల=వెడలుపైన, అగ్నిశరణములచేత = అగ్నిగృహములచేత అగ్నులు సర్వదా కాపాడఁబడవలసినవి కావున వానికై వేఱుగదు లేర్పాటు చేసియుంచఁబడును, స్రుగ్భాండములచేతన్, స్రుక్కులు = హోమసమయముల నేతిని నగ్నిలో హోమము చేయుటకై యుపయోగించు కొయ్యమిళ్లులు, భాండము = పాత్ర=స్రువము = "పాత్రం స్రువాదికమ్" అని యమరుఁడు, ధ్రువ, ఉపభృత్తు, జుహూ; ఇవి స్రుక్కులందు భేదములు, కృష్ణాజినములచే = జింకచర్మములచే, దర్భసంతతులచే = దర్భసమూహములచే, సమిధఁన్ = కొయ్యపుల్లలచే.

పలాశము=మోదుగు, ఖదిరము=చండ్ర, అశ్వత్థము = రావి, ఉదుంబరము = మేడి, అత్తి, వికంకతరు = పుల్లవెలగ, బిల్వ = మారేడు, శమి = జమ్మి, అర్కము = జిల్లేడు, వేతసము,=ప్రబ్బ, అపామార్గము = ఉత్తరేణి, దర్భ = దర్భలు, వీని పుల్లలు మాత్రమే హోమమునకుఁ బ్రశస్తములు, ఇందువెనుక వెనుకవానికంటె ముందు ముందువి శ్రేష్ఠములు ఇవి జుత్తిలి జిట్టెఁడు పొడుగుండవలయును. పైబొప్పత్తోడ నుండవలయును. వీనిలో పుచుగులు రంధ్రములు పువ్వు లుండరాదు. జీర్ణములైనవి తాముగ నేలవ్రాలినవి పనికిరావు, వెలయిచ్చికొన్నవి శూద్రులు తెచ్చినవానితోను హోమము సేయువాఁడు పతితుఁ డగును. ఆజ్యధార నాలుగంగుళములపొడుగు మినుపగింజంతలా వుండవలయును. అన్నాహుతి పచ్చి యుసిరికకాయంత యుండవలెను. ఆవునెయ్యి శ్రేష్ఠము, అది యభావమైనచో మాహిషము, ఉదకకుంభంబులన్=నీటికడవలచే, రాజిలుచున్ = ప్రకాశించుచు, స్వాదు = తియ్యనైన, మంచి రుచిగల, ఫల = పండ్లచే, సమావృత = ఆవరింపఁబడిన, వన్య = అడవియందుఁ బుట్టిన, సల్లలిత=మిగుల మనోహరమైన, భూరి=గొప్పవగు, ధారణీరుహ=చెట్లయొక్క, వార = సమూహముచే, సంభారము = నిండినది, హోమబలిసత్కృతంబు = వైశ్వదేవము మొదలగు హోమములచేతను, బలి=భూతబలి మొదలగు బలులచేతను, సత్కృతము=పూజింపఁ

బడినది, ఉదిత = పుట్టిన, వేదనాదము = వేదములధ్వని, అయి = కలిగి, నీరజ= కమలములచే, ఉజ్జ్వల = ప్రకాశించు, నళిని = సరస్సులు గలది.

తాత్పర్యము

పలుతెగలగు మృగములచే వ్యాపించి పురములం దెన్నఁడు కానరాని క్రొత్త క్రొత్త పక్షులచేఁ జూడఁ గనులకుఁ బండువై యజ్ఞార్థమైవచ్చిన దేవతలవెంట వచ్చిన యప్సరస్త్రీల యాటలు-పాటలు- పూజలు మొదలగువానిచే సంతోషము గలిగించు నదియై విశాలములైన యగ్నిహోత్ర గృహములచేతను-స్రుక్కులు - స్రువములు - దర్భలు - సమిధలు - జలకుంభములు - పండ్లు - కందమూలములు గలదై తియ్యని పండ్లచే నిండిన యడవియందుఁ బుట్టిన పెద్ద చెట్ల గుంపులచే నిండి హోమములు బలులు వీనిచే సత్కరింపఁ బడినదై-వేదపాఠరవము గలిగి కమలములు గల కొలఁకు లచే బ్రకాశించుచు,

కం. ఫలమూలాశనులును దాం, తులుఁ జీరాజినధరులును ♦ ద్యుమణికృశానూ
జ్జ్వల తేజు లగు పురాణము,నులు నిలువ నీడయయి మ♦నోహర మగుచున్. ౮

ఫలమూలాశనులును = పండ్లు, కందమూలములు ఆహారముగాఁ గలవారును, దాంతులు = ఇంద్రియనిగ్రహము గలవారు, చీరాజినధరులు = నారచీరలు, జింక చర్మములు ధరించినవారు, ద్యుమణి=సూర్యునివలె, కృశాను= అగ్నిహోత్రమువలె, ఉజ్జ్వల=ప్రకాశముగల, తేజులు=బ్రహ్మవర్చస్సుగలవారు నగు, పురాణమునులు = దీర్ఘకాలముగ వేలకొలఁది సంవత్సరములుగ తపోబలముచే జీవించియుండు మునులు, నిలువన్ = నిలుచుటకు, నీడయయి = ఉనికి పట్టయి, మనోహరము = మనస్సు నాకర్షించునది.

తాత్పర్యము

ఫలములు కందమూలము లాహారముగా నింద్రియ నిగ్రహము గలిగి నార చీరలు జింకచర్మములు గట్టి బ్రహ్మవర్చస్సుచే సూర్యాగ్నులవలెఁ బ్రకాశించుచుండు పురాతనమునులు నిలువ నునికిపట్టయి మనస్సున కింపై,

కం. బ్రహ్మభవనతుల్యం బై, బ్రహ్మరవస్ఫీత మగుచు ♦ బ్రహ్మజ్ఞము లా
బ్రాహ్మణకదంబములచే, బ్రహ్మర్షులచేతఁ గడు శు ♦ భం బగు తలమున్. ౯

బ్రహ్మభవనతుల్యంబై =బ్రహ్మలోకముతో సమానమై, సన్న్యాసులుగానుండి తపస్వులుగానుండి మరణించినవారందఱు బ్రహ్మలోకమందుఁగదా చేరుదురు. అట్టులే యిక్కడ నున్నారని భావము, బ్రహ్మరవస్ఫీతము = వేదముచే నతిశయించినది, బ్రహ్మజ్ఞములు = పరబ్రహ్మము నెఱిఁగినవారు, కడుశుభము = మిగుల మేలైనది, తలము = ప్రదేశము.

ప్రాజాపత్యం గృహస్థానం, బ్రాహ్మం సన్న్యాసినాం స్మృతమ్ ।
యోగినా మమృతం స్థానం, తద్విష్ణోః పరమంపదమ్ ॥

ఏకాంతిన స్సదా బ్రహ్మధ్యాయినో యోగినో హి యే
తేషాం తత్పరమం స్థానం యద్వై పశ్యంతి సూరయః
గత్వా గత్వా నివర్తంతే చంద్రసూర్యాదయో గ్రహాః
అద్యాపి న నివర్తంతే ద్వాదశాక్షరచింతకాః॥ వి. పు. ౧-౭-౩-౭

గృహస్థులకు ప్రాజాపత్యలోకము, (భృగ్వాదిలోకము) సన్న్యాసులకు బ్రహ్మలోకము (ఇరువురు వ్యాఖ్యాతలిది సత్యలోక మనియే వ్రాసిరి. 'సన్న్యాసాత్ బ్రహ్మస్థానం' అని యనేక ప్రమాణములు గలవు.) ప్రతీకోపాసనచేయు యోగులకు ధ్రువమండలమునకు మీఁదనుండు విష్ణుపద మను లోకము. సదా భగవంతు నుపాసనముచేయు ఏకాంతులకు (ప్రపన్నులకు) నిత్యసూరులు చూచుచుండు పరమాకాశ స్థానము. చంద్రసూర్యాది గ్రహము లన్నియుఁ బోయిపోయి మఱల మఱల వచ్చుచుండును. ద్వాదశాక్షరమంత్రోపాసకు లిప్పటికి మఱల వచ్చినవారు లేరు. ఇట్లు చెప్పుటచేఁ బరమాకాశ ముపాసకుల (నిష్కామభక్తులయుఁ బ్రపన్నులయు) దని యేర్పడుచున్నది.

తాత్పర్యము

వానప్రస్థ సన్న్యాసాశ్రమములనుండి మరణించినవారిచే నిండిన బ్రహ్మలోకమువలె జీవించియుండు తపస్వులచేతను హోమసమయమందును అధ్యయనసమయమందును వెలువడు వేదనాదముచేతను, బరబ్రహ్మజ్ఞానము గల వారిచేతను మిగుల శుభకరమైన ప్రదేశమును,

ఉ. దాపునఁ గాంచి యా దశర ♦ థప్రభవుండు తదాశ్రమంబుఁ దాఁ
జాపము నెక్కుడించి చన ♦ సంయమివర్యులు దివ్యతత్త్వమే
ధాపరిణీతు లెంతయు ము ♦ దంబున వేయెదు రేగి కాంచి రా
క్ష్మాపకుమారు రాముని య ♦ శస్విని జానకిఁ దమ్ము లక్ష్మణున్. ౭

దాపునన్=సమీపమందే, తదాశ్రమంబు = ఆ యాశ్రమము, దివ్యతత్త్వమేధాపరిణీతులు, దివ్య=అమానుషమైన, దేవతాసంబంధమైన, తత్త్వమేధా=తత్త్వజ్ఞానముచే, పరిణీతులు = విస్తారముగఁ గూడినవారు. ఇట్లు చెప్పుటచే శ్రీరామచంద్రమూర్తి సాక్షాద్భగవంతుఁడని సీతాదేవి సాక్షాల్లక్ష్మియని లక్ష్మణుఁడు భగవదంశమని యవతారరహస్య మెఱిఁగినవారు "జన్మకర్మచ మే దివ్యమేవం యో వేత్తి తత్త్వతః"యను భగద్వాక్య మనుసంధింపవలెను. యశస్విని=విస్తారకీర్తి గల దానిని.

తాత్పర్యము

ఇట్టి యాశ్రమమండలము సమీపమందే చూచి యా దశరథరాజకుమారుఁడు రామచంద్రమూర్తి యా యాశ్రమములలోని మృగములు తమ్ముఁజూచి భయపడకుండునట్లు చాప మెక్కు సడలించి సవినయముగాఁ బ్రవేశింపఁగా దివ్యదృష్టిగల యా ఋషీశ్వరు లవతార రహస్యమెఱిఁగినవారగుటచే వారిరాక ముందుగానే తెలిసి

కొని యున్న జన్మాలకు సాక్షాద్భగవద్దర్శనాలాపములు సమకూరెఁగదా, మనము వెదకుచుఁబోయినను దొరకనివాఁడు మనల ననుగ్రహింపఁ దానే వచ్చుచున్నాఁడు గదా! ఆహా! యేమిదయ, యేమి దీనజనరక్షాపరత్వము, ఏమిసౌలభ్యము, ఏమిభక్త వాత్సల్యమని సంతోషించుచు నెదురుగాఁ బోయి సీతారామలక్ష్మణులను జూచిరి.

రాముని, జానకిని, లక్ష్మణుని జూచిరని చెప్పుటచే ముందు శ్రీరామచంద్ర మూర్తి రాఁగా నాయన వెనుక సీతాదేవి వచ్చెననియు, ఆమెవెనుక లక్ష్మణుఁడు వచ్చెననియు గ్రహింపనగును. ఈ విషయము స్పష్టముగ ౧౮.౨ వ పద్యంబున వివరింపఁబడెను.

—♦ మునులు తమ్ము రక్షింప శ్రీరాముని బ్రార్థించుట. ♦—

ఉ. భాసుర సంభవత్కుముద ♦ బాంధవ తేజుని రామచంద్రునిన్
శ్రీసహితున్ సుమిత్రసుతు ♦ స్ఫీతయశస్విని జానకీసతిన్
మానసరక్తిపూర్ణ బహు ♦ మానపురస్సరయుక్తి మంగళా
శాసన సంప్రయుక్తిని బ్ర ♦ శస్తమతుల్ భజియించి రార్షమై. ౮

భాసుర=ప్రకాశించునట్టి, సంభవత్ = పుట్టుచున్న, కుముదబాంధవ = కలువ లకుఁ జుట్టమైన చంద్రుని కాంతివంటి, తేజుని = కాంతిగలవానిని, 'తస్మాత్సోమ రాజానో బ్రాహ్మణా'యని శ్రుతి చెప్పినట్లు చంద్రుడు బ్రాహ్మణులను రక్షించునట్లు రామచంద్రుఁ డీ ఋషిమండలమును రక్షించువాఁడని యీ యుపమానము సూచించును. కు + ముద + బాంధవ=కు=భూమికి, ముద = సంతోషమిచ్చు, బాంధ వుఁడు=చుట్టమగువాఁడు, భూమికంతయు ననఁగా సమస్త జీవజంతువులకు సంతోష మిచ్చువాఁడు. ఇట్టివాఁడు శ్రీరామచంద్రమూర్తి యని భావము. ఈ యుపమానము చంద్రోదయమును సూచించెడిని. కావుననే యాతిథ్యసమర్పణము ఫలములదానము చెప్పఁబడెను. ఇది బహుళప్రథమయో ద్వితీయయో యని తోఁచెడిని. బాల చంద్రుఁడు పూజ్యుఁడైనట్లు లీ రామచంద్రుఁడు పూజ్యుఁడని భావము. శ్రీసహితున్= భ్రాతృసేవారూపకలక్ష్మితోఁ గూడినవానిని, స్ఫీతయశస్విని = అధికమైన పతివ్రతా కీర్తిగలదానిని, మానసమగు, రక్తి = అనురాగముచే, పూర్ణ=నిండిన, బహుమాన పురస్సరయుక్తి=గౌరవము ముందుగాఁగల, మంగళాశాసన సంప్రయుక్తిని=శుభము కలిగించు దీవనలచే దీవించుటచేత, సీతారామలక్ష్మణులయం దా ఋషులు మిగుల ననురాగము గలవారగుటచే నిటువంటి దివ్యమంగళవిగ్రహములు గలవారికి నీ రాక్ష సులు నిండిన ఘోరారణ్యమందు నేమిలోపముగలుగునో యని శంకించి యవి పరిహార మగుటకై శుభకరములైన యాశీర్వచనములు చేసి రనిభావము. ఇదిగదా పరమభక్తి లక్షణము. ఇందు మానసరక్తి పూర్ణశబ్దము. 'పరానురక్తి రీశ్వరే' 'సా పరమప్రేమ రూపా' యనుభక్తిలక్షణములఁ దలఁపించి వీరు భక్తులని తెలుపుచున్నది. ప్రశస్త మతుల్=మిక్కిలిఁ గొనియాడఁబడిన మనస్సులు గలవారు. భక్తి పూర్ణులగుట

చేతనే ప్రశస్తమతులైరి. కావున భక్తిలేని జపతపస్సులు యోగములు ప్రశస్తములు గావని భావము; ఉదయించుచున్న చంద్రునివంటి తేజస్సుగల రామచంద్రుననుటచే నాయన తేజస్సుత్తరోత్తరాభివృద్ధి గాంచు నని భావము.

తాత్పర్యము

ఉదయించు చంద్రునివంటి కాంతిగల శ్రీరామచంద్రమూర్తికిని సీతాలక్ష్మీ సమేతుఁడయిన లక్ష్మణునికిని విశేషయశోవతి యగు సీతాదేవికిని వారు నిండారు ప్రేమచే సగౌరవముగ మంగళాశాసనములు గావించి నిండు మనస్సుతో సేవించిరి.

ఉదయించుచున్న చంద్రుఁడు చీఁకట్లను హరించునట్లు రామచంద్రమూర్తి యరణ్యప్రవేశము రాక్షసనాశసూచక మని భావము.

కం. ఆ వనవాసులు శ్రీ సీ,తావల్లభు సౌకుమార్య♦ధామ సువేష
శ్రీవపు సంహననము లా, పోవక కని విస్మయాబ్ధి ♦ మునిఁగిరి చిరమున్. ౯

అందు ఋషు లేకవాక్యముగా మంగళాశాసనము చేయవలసినంత పని యేమి కలిగెననినఁ గవి చెప్పుచున్నాఁడు.

వనవాసులు = అడవియం దుండువారు కావుననే యిట్టిదివ్యమంగళ విగ్రహోపేతుని వారెన్నఁడుఁ జూచినవారుకారని భావము, శ్రీ సీతావల్లభున్ = శ్రీయగు సీతయే యతిరూపవతి, 'అతిరూపవతీ సీతా' యని కలదు కదా! అటువంటి సీత వలచినవాఁ డెంతటి సుందరుఁడై యుండవలెను. కన్యకలు తమరూపము లెట్లున్నను వరుఁ డందగాఁడుగ నుండఁగోరుదురు. ఇఁక సుందరియగు కన్యక దనకంటె సుందరుఁడు తనవిభుఁడుగా నుండఁగోరుట సహజమేకదా! సౌకుమార్యధామ సువేష శ్రీవపున్=సుకుమారత్వమునకు స్థానమైన యాకారము కాంతి గల దేహముయొక్క, సంహననములు=అవయవము లెచ్చు తగ్గులులేక యేవేవి యెంతెంత యెట్లుట్లులుండ వలయునో యంతంత యట్లట్లుండుటలు, ఆపోవక = తృప్తిలేక, కని = చూచి, విస్మయాబ్ధిన్ = ఆశ్చర్యసముద్రమందు, చిరమున్ = దీర్ఘకాలము.

శ్లో. అంగప్రత్యంగకానాం, యస్సన్నివేశో యథోచితః
సుశ్లిష్ట సంధిబంధస్త, త్సౌందర్య మితి చోచ్యతే॥

తాత్పర్యము

అడవియందు నివసించు నా ఋషీశ్వరులు లక్ష్మీదేవియగు సీతాదేవికిఁ బ్రియుఁడైన వానిని, కోమలత్వమునకు స్థానమయిన యాకారము యొక్క కాంతిగల దేహసౌష్టవముగలవానిని నెంత చూచినను నింకను జూతమని తృప్తిలేక చూచి చూచి యాశ్చర్యసముద్రమున దీర్ఘకాలము మునిఁగిరి.

కం. జనకసుతామణిసిరిన్ ల,క్ష్మణునిన్ శ్రీరామచంద్రు ♦ సర్వఋషీశుల్
కనుఁగొని యచ్చెరుపాటున, ననిమేషత్వంబుఁ గనిరి ♦ యాఁటనితృప్తిన్. ౧౦

తాత్పర్యము

సీతాదేవిని లక్ష్మణుని శ్రీరామచంద్రమూర్తిని ఋషీశ్వరు లందఱు చూచి చూచి యాశ్చర్యపడి ఱెప్పవ్రాల్పక మఱిమఱి తృప్తిలేక చూచిరి.

దీనివలన రామచంద్రువిషయమైన యాశ్చర్యము సీతాలక్ష్మణులవిషయమై కూడఁ గలిగెను.

ఇంతసేపు తా మిట్లు చూచుటచేఁ దల్లికన్నులు దయ్యపుఁగన్నులన్నట్లు తమ దృష్టియే తాఁకెనేమో యని మంగళాశాసనములు గావించిరి. చూచిన పిమ్మట మంగళాశాసనమా? మంగళాశాసనము చేసి చూచుటయా? పూర్వాపరవ్యతిక్రమ మని యాక్షేపింపరాదు. కార్యము ముందుచెప్పి యట్టికార్యము చేయవలసిన కారణము వెనుకఁజెప్పఁబడెను. అనిమేషత్వము = (౧) ఱెప్పపాటులేకుండుట, (౨) దేవత్వము, శ్రీరామచంద్రమూర్తిని దర్శించినమాత్రముననే వారికి దేవత్వ మీలోకమందే ప్రాప్తించెనని భావము.

ఱెప్పలు వ్రాల్చిన శ్రీరామచంద్రదర్శనానందమునకు విఘ్నము కలుగునేమో యని వారలు ఱెప్పలు వ్రాల్పరైరి. 'కృష్ణా, నిన్ను ఱెప్పపాటులేక చూడకుండఁ గంటి కడ్డముగ ఱెప్పల నేల సృజించె విధాత క్రూరుఁడై' యని కదా గోపికలు విలపించిరి.

దీనివలన భక్తులకు నానందానుభవమే ముఖ్యమని యేర్పడుచున్నది. "పరిపూర్ణ బ్రహ్మానుభవాత్మికా ముక్తి" యనికదా ముక్తిలక్షణమును బూర్వులు చెప్పిరి. పరిపూర్ణ బ్రహ్మము ననుభవించుటే ముక్తియని భక్తముక్తిలక్షణము—నిరవధిక నిరతిశయ నిరంతరాయానంద మిందే కలదు.

ఇంతటి మహాభిలాషతో ఋషులు చూచి కౌఁగిలింపఁగోరి రనియు నాకోరిక యీ యవతారాంతరమునఁ గాదనియుఁ గృష్ణావతారంబునఁ దీరఁగల దని రామచంద్రమూర్తి చెప్పెననియు వీరందఱు గోపికలై బృందావనమునఁ గృష్ణునిఁ గౌఁగిలించిరనియుఁ గృష్ణోపనిషత్తునందుఁ గలదు.

"ఓం శ్రీ మహావిష్ణుం సచ్చిదానంద లక్షణం రామచంద్రం దృష్ట్వా సర్వాంగ సుందరం మునయో వనవాసినో విస్మితా బభూవు స్తం హోచు ర్నోవద్య మవతారాన్వై గణ్యంతే ఆలింగామో భవంత మితి భవాంతరే కృష్ణావతారే యూయం గోపికా భూత్వా మా మాలింగథ" దీనివలన గోపికలకు శ్రీకృష్ణునితో నాలింగన ప్రాప్తియేకాని సంభోగప్రాప్తి లేదని యేర్పడుచున్నది.

చం. అతిథిని నమ్మహాత్ముని స ♦ మస్తచరాచరభూతరక్షణో
న్నతిఁ దమపర్ణశాలలకు ♦ ధర్మరతుల్ గొనిపోయి యాసన
స్థితు నొనరించి యా యనల ♦ తేజులు మూలఫలప్రసూనసం
హతుల నిజాశ్రమంబులను ♦ నర్పణచేసి మొగిడ్చి హస్తముల్. ౧౧

ఈ ౧౧-౧౨ పద్యములందు ఋషీశ్వరులు శ్రీరామచంద్రమూర్తికి శరణాగతి చేసిరని తెల్పఁబడును.

సమస్త చరాచరభూతరక్షణోన్ముఖిక్ =సమస్తములైన చరములు అచరములు నగు భూతముల రక్షించుటయందు విశేషసంతోషము గలవానిని, ఎట్టివాఁడైనను నతిథి పూజ్యుఁడే. అందు మహాత్ముఁడు పూజ్యుఁడు; అతిథులు తమనిమిత్త మనఁగా గ్రాసార్థులయియో స్వకార్యార్థులయియో వచ్చువారు. ఈ యతిథి యట్టివాఁడు కాఁడు; చరాచరములనెల్ల రక్షింపవలయు నని సంతోషముతో వచ్చినవాఁడు. ఈయనరాకవలన లాభపడువారు ఆశ్రమస్థులే. సమస్త చరాచర రక్షకుఁడనుటచే భగవంతుఁడనియే యర్థము గ్రహింపవలయును. చరములను రాజులు రక్షింతురుగాని యచరములయిన వృక్షపర్వతపాషాణ గుల్మాదులను రక్షించురాజెవఁడు? కావున నట్టి వృక్షపాషాణాది శరీరములను దాలిచి జీవాత్మల నెల్లరక్షించి వాని కభ్యుదయము గోరువాఁడు భగవంతుఁడే. అనలతేజులు = అగ్నిహోత్రుని తేజస్సువంటి తేజస్సు గలవారు. వీరే యింతటి తేజస్సుగలవారయినచో వీ రాశ్రయించు రామచంద్ర మూర్తి యెంక నెంత తేజస్సుగలవాఁడయి యుండవలయునో, ధర్మరతుల్ = ధర్మమందుఁ బ్రీతిగలవారు, అనలతేజులు గావున రాక్షసులను దమ తపశ్శక్తిచే నాశము చేయఁగలిగియు మనము దాసులము బిడ్డలము మనదుఃఖము స్వామితోఁ దండ్రితోఁ జెప్పుకొనుటకు మనకు ధర్మముగాని స్వతంత్రునివలె వర్తించుట భక్తధర్మము గాదనియు "యోగక్షేమం వహా మ్యహ" మ్మని యాయన చెప్పుచుండఁగా నావని తాము చేయుటవలన భగవద్వాక్యమునందు విశ్వాసములేమిని, క్రోధదాస్యమును స్వాతంత్ర్యమును తెలుపు నని తలఁచియు భగవంతునిమీఁదనే యాధారపడి యుండుటే మనకు ధర్మమనియు నుండువారు.

"అజ్ఞశ్చాశ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి" యన్నట్టులు శాస్త్రవిశ్వాసములేనివారు చెడుదురు. త్రివిధం నరకస్యేదం ద్వారం నాశన మాత్మనః కామః క్రోధ స్తథాలోభ స్తస్మా దేత త్త్రయం త్యజేత్॥ భ. గీ. ౧౬-౨౧. ఆత్మను నాశము చేయుటకు నరకమునకు మార్గములు మూఁడు, కామము క్రోధము లోభము. కావున నీ మూఁటిని వదలవలెను. జీవుఁడు తాను భగవంతునకుఁ బరతంత్రుఁడనియు, భగవంతుఁడు స్వామియనియు నాయనయే సర్వస్వతంత్రుఁ డనియు నుండవలెను. తాను స్వతంత్రుఁ డనుకొనెనేని చెడును.

'ఏష సర్వేశ్వరః, ఏష భూతాధిపతిః, ఏషభూతపాలః' శ్రుతి, ఈయనయే సర్వేశ్వరుఁడు. ఈయనయే భూతముల కధిపతి. ఈయనయే భూతములఁ బాలించువాఁడు.

లక్ష్మ్యా హృషీకేశో దేవ్యా కారుణ్యరూపయా। రక్షక స్సర్వసిద్ధాంతే వేదాంతేషుచ గీయతే॥ వి. పు.

కరుణారూపిణియైన లక్ష్మితోఁగూడిన నారాయణుఁడే సర్వసిద్ధాంతములందు వేదాంతములందు రక్షకుఁడని చెప్పఁబడెను.

సర్వేషు దేశకాలేషు సర్వావస్థాసు చాచ్యుత
కింకరో స్మి హృషీకేశ భూయో భూయోఽస్మి కింకరః॥

సర్వదేశ, సర్వకాల, సర్వావస్థలయందు నారాయణా! నీకు నేను గింకరుఁడను. మఱలమఱలఁ జెప్పుచున్నాఁడను, కింకరుఁడను, కింకరుఁడను.

ఇట్టివిషయము తెలిసినవారు, తమ పర్ణశాలకుꣳ=తమ ఆకుటిండ్లకు, దీని వలన నతిథి గొప్పవాఁడని యాయనయోగ్యతకుఁ దగినట్లు సత్కరింపవలయు నను నిర్బంధము లేదు. తమకుఁగలిగినదే శ్రద్ధాభక్తులతో నతిథికి సమర్పింపవలయునని సూచించుచున్నది.

యదాహారోభవేత్తేన, పూజయే త్పితృదేవతాః
తేనైవపూజయే న్నిత్య, మతిథిం సముపాగతమ్॥ శంఖ.

తన కేది యాహారమో దానిచేఁ బితృదేవతలను అతిథులను బూజింపవలెను.

ఆసనస్థితుꣳ = ఆసనమందున్న వానిని, అనఁగా గూర్చుండుటకు బీటయో కృష్ణాజినమో సమర్పించిరని భావము. మూలఫల ప్రసూన సంహతులꣳ = కంద మూలములయుఁ, బండ్లయుఁ, బుష్పములయు గుంపులను, నిజాశ్రమంబులను = తా ముండు నాశ్రమంబులను, అర్పణచేసి = తీసికొమ్మని యిచ్చి, మొగిడ్చి=మోడ్చి, అతిథులకు, భోజనవస్తువులు, లేక వారు కోరిన వేనైన నిచ్చుట గృహస్థులకుఁ దగినకార్యమే, కాని తమకుఁదామే తమ యిండ్లు వాకిండ్లు భూములు పుట్టలు గొడ్డు గోద లిచ్చుట శాస్త్రీయముకాదు. ఆచారముకాదు. సర్వ మొకనికే యిచ్చిన గృహస్థ ధర్మమందుండు వాఁడు తక్కిన యతిథుల నెట్లు పూజింపఁగలఁడు? తన్నా మాలిన ధర్మము లేదుగదా. అదియునుగాక వామనునివలె మీసర్వము నాకిమ్మని రామచంద్రమూర్తి యడుగనులేదు గదా. ఇట్లుండ వారంతటవారే యాశ్రమ సమర్పణముచేసి రన నది "మదీయత్వేనాభిమతేన వస్తు సర్వస్వామినే నారాయణాయ తుభ్యమేవ" "మాం మదీయంచ నిఖిలం చేతనాచేతనాత్మకమ్, స్వకైంకర్యోప కరణం వరద స్వీకురు స్వయ"యను ప్రపత్తి వాక్యమును స్మరింపఁజేయుచున్నది. 'ఏది నాదని మదిఁదలతునో యది సర్వము స్వామివైన నారాయణ! నీయది కావునఁ గైకొనుమా' యనికదా ప్రపన్నులు చెప్పుదురు. మఱియును వారు నేను నాది యనుకొను చేతనాచేతనాత్మకమైన సర్వము (చేతనాత్మకము = జీవాత్మ భార్యలు పిల్లలు గొడ్డులు లోనైనవి. అచేతనాత్మకములు = దేహము, ఇల్లు, భూములు లోనైనవి). నీ కైంకర్యమునకుఁగాను దీసికొనుము, అని శరణాగతి భావమును దెలుపును.

"పితరం మాతరం దారాన్ పుత్రాన్ బంధూన్ సఖీన్ గురూన్
రత్నాని ధనధాన్యాని క్షేత్రాణి చ గృహాణి చ
సర్వధర్మాంశ్చ సంత్యజ్య సర్వకామాంశ్చ సాక్షరాన్
లోకవిక్రాంతచరణౌ శరణం తే వ్రజం విభో॥"

తండ్రిని తల్లిని, భార్యలను కొడుకులను బంధువులను, సఖులను గురువులను రత్నములను ధనధాన్యములను క్షేత్రములను, ఇండ్లను, మోక్షసాధనములని చెప్పఁబడు సర్వధర్మములను కర్మజ్ఞాన భక్తులను సర్వకామములను కైవల్యాదులను వదలి నేను విభూ! లోకముల నాక్రమించిన నీ చరణములనే శరణుజొచ్చితిని, అని కదా ప్రపన్నుఁడు చెప్పును.

మన సొత్తేదియు భగవంతున కీయలేదు. అజ్ఞానముచే భగవంతుని సొత్తును అహంకార మమకారదాసులమై మన దని తలఁచుచున్నాము. ఈ యజ్ఞానము తొలఁగి స్వామీ నీసొత్తు నీవు తీసికొమ్ము, అనుటే ప్రపన్నుని కార్యము. అతఁడు నా సొత్తు నీ కిచ్చుచున్నా ననఁడు. "ఇంతవఱకు నాది యని నేను దురభిమానము వహించిన దానిని నీ కైంకర్యార్థము తీసికొనుము" అని మాత్రమే చెప్పును.

అనాత్మ న్యాత్మబుద్ధి ర్యా చాస్వే స్వమితి యా మతిః
సంసారతరు సంభూతిబీజ మేత ద్ద్విధా స్థితమ్॥ వి. పు. ౬-౭-౧౧.
సంసార విషవృక్షస్య. పాఠాంతరము.

ఆత్మకానిదేహము నాత్మ యనుకొనుట, తన సొత్తుకాని వానిని దేహపోషక ధారణాది వస్తువులను తన వని యెంచుట యీ రెండు సంసారవృక్షము పుట్టుటకు బీజము.

స్వాతంత్ర్యం నిజరక్షణం సముచితావృత్తిశ్చ నాన్యోచితా
తస్యైవేతి హరే ర్వివిచ్య కథితం స్వస్యాపి నార్హం తతః॥

అను పూర్వాచార్యశ్లోక మనుసంధించునది. స్వాతంత్ర్యము, నన్ను రక్షించుకొనుట నా సర్వవిధ మనోవాక్కాయవృత్తులు ఇవన్నియు నాయనకే కాని యితరులకుఁగాదు. నాకుఁ గాదు.

ఈ కారణములచే నిటువంటి యభిప్రాయము గల యీ ఋషీశ్వరులు తమ యాశ్రమములను శ్రీరామచంద్రమూర్తి కర్పణముచేసిరి. అటుగాదేని యీ యాకు టిండ్లు రామచంద్రున కేల? దీనికే న్యాసమని పేరు. ఇదియే నిజమైన సన్న్యాసము.

తా త్ప ర్య ము

అతిథిని, నందు మహాత్ముని, నందుఁ దనంతటఁదానే సమస్త చరాచరముల రక్షించుటయందు సంతోషముగలవానిని నగ్నిహోత్రమువంటి బ్రహ్మవర్చస్సు గలిగి ధర్మమందు ప్రీతిగల యీ ఋషీశ్వరులు తమ పర్ణశాలలకు రామచంద్ర

మూర్తిని బిలుచుకొనిపోయి యాసనము సమర్పించి కూర్చుండఁజేసి కందమూల ఫలములు, పుష్పములు, తమ యాశ్రమములు సమర్పించి చేతులు జోడించి,

ఉ. ఈ మునికోటి కింతటికి ♦ నీవె శరణ్యుఁడ వీవె ధర్మ ర
క్షామహితుండ వో నుతయ ♦ శా! గురువర్యుఁడు బూజనీయుఁడున్
స్వామియు మాననీయుఁడును ♦ శాసకుఁడు న్నృపుఁ డీవ సుమ్మ మ
త్స్వామివి నీవ, నీవు వన ♦ ధారుణి నుండిన నూర నుండినన్. ౧౨

శరణ్యుఁడవు=రక్షించు యోగ్యత గలవాఁడవు, ధర్మరక్షామహితుండవు = వారివారి స్వధర్మమందు వారువారుండునట్లు రక్షించుటచే గొప్పవాఁడవు, నుతయశా=పొగడఁబడిన కీర్తిగలవాఁడా, గురువర్యుఁడు=గురువులందు శ్రేష్ఠుఁడవు, గురువుల కందఱకుఁ బరమగురువగువాఁడు భగవంతుఁడే కదా! ఈ యభిప్రాయము లేదేని యీ విశేషణము వ్యర్థము. గురువులందు రాజమాత్రుఁడు చేరఁడు. పూజనీయుఁడున్=ఆ కారణముచేతనే పూజింపఁదగినవాఁడవు, స్వామివి=స్వమ్ముగలవాఁడు స్వామి, స్వమ్ము అనఁగా సొమ్ము. సొమ్మెవరిదో వానికి స్వామి యని పేరు. నిర్విశిష్టముగ స్వామివని చెప్పుటచే సమస్తలోకములు నీసొమ్ము, నీవే యంతకు స్వామివి, నిన్ను విడిచి వీని కధికారి మఱియొకఁడు లేఁడని భావము. మాననీయుఁడు=గౌరవింపఁబడఁ దగినవాఁడవు.

అయోధ్యా పట్టణమందు సింహాసనమునఁ గూర్చుండి ప్రజల రక్షించునవు డైన మీకు సాహాయ్యము చేయఁగలను గాని యొంటరిగ నడవులపాలై వచ్చిన నే నేమి చేయఁగల నందు వేమో? వనధారుణినుండినన్=నీ వడవియందుండినను, ఊర నుండినన్=పట్టణమున సింహాసనమున నుండినను, నీవే స్వామివి, ఇట్లు సంపూర్ణ భర సమర్పణము వాక్కుచేతను, మనస్సుచేతను, క్రియారూపముగను భరన్యాసము చేయఁబడెను; తన్ను రక్షించుభారము భగవంతునియందే యుంచుట భరన్యాసము.

తాత్పర్యము

ఈ మునికోటుల నందఱ రక్షించు శక్తిగలవాఁడవు నీవే. వారివారి స్వధర్మము వారువారు చేయునట్లు రక్షింపఁగల గొప్పతనము గలవాఁడవు నీవే. కావున మా స్వధర్మమున మేము నిర్బాధముగ వర్తించునట్లు చేయుము. ఇట్టివాఁడ వని నీ కీర్తి నందఱు నిదివఱకే పొగడుచున్నారు. నీవు గురువులకెల్ల గురుఁడవగు పరమ గురువవు కావున పూజార్హుఁడవు. కావున మాచేయుపూజ నంగీకరించి బిడ్డలను దల్లిదండ్రులవలె రక్షింపుము. నే నేల రక్షించవలయునందు వేమో, నీవు స్వామివి మేము మాది యనుకొనునది యంతయు నీ సొమ్ముకాని మాసొమ్ముగాదు. నీసొమ్మును నీవు కాపాడుకొనకున్న మఱెవరు కాపాడఁగలరు? నీసొమ్ము నీవు కాపాడుకొనుటకు మా మనవేల? అది నీవే చేయవలసిన పనికదా, సర్వస్వామివి కనుకనే గౌరవింపఁబడఁ దగినవాఁడవు, మాయం దేదైన లోపముండిన శాసింపఁదగినవాఁడవు, నృపుఁడు –

నరులను బాలించువాఁడవు, నరులు అనఁగా జీవకోటులు, ఈ రక్షాభారము నీ వడవియందుండిన నున్నది, పట్టణమందు సింహాసనస్థుఁడవై యుండిన నున్నది, సింహాసనస్థులై రక్షించు సోపాధికరక్షకులు తా మితరుల రక్షించుటకుఁ జతురంగ బలములతో రావలె, నీకట్టికార్యము లేదు. నీ వసహాయుఁడవై యెంతకార్యమైనఁ జేయఁగలవు. కావున నిరుపాధిక రక్షకుఁడవగు నీవు మమ్మెల్లర రక్షింపవలసినది విధియై యున్నది.

కం. ఇంద్రుచతుర్భాగము ధర, ణీంద్రుఁడు గాని ప్రజలఁ బ్రోచి ♦ నృపతనయా! ని
  స్తంద్రత నతలోకుం డయి, సాంద్రసుఖము లనుభవించు ♦ సంతస మారన్. ౧౩

నేను రాజమాత్రుడనే నన్నేల మీరు విశేషముగఁ జెప్పెద రనిన నట్లైనను నా భారము నీకుఁ దప్పదనుచున్నారు.

ఇంద్రు చతుర్భాగము = ఇంద్రునియొక్క నాలవభాగము, ధరణీంద్రుఁడు = రాజు, నిస్తంద్రతన్ = హెచ్చరికతో, నతలోకుఁడు = నమస్కరించు లోకము గలవాఁడు, సాంద్ర=దట్టమైన, అధికమైన, సుఖములు=భోగములు, సంతసము = సంతోషము, ఆరన్ = పూర్ణముగా.

ఇచ్చట నింద్రశబ్దము తక్కిన దిక్పాలురకు నుపలక్షణము. "అష్టాభిర్లోకపాలానాం మాత్రాభి ర్నిర్మితో నృప" యని ప్రమాణము. చతుర్భాగమనుటచే నెనిమిది దిక్పాలుని తేజములో నాలవభాగము రాజు గ్రహించు నని భావము.

శ్లో. ఇంద్రానిల యమార్కాణా, మగ్నేశ్చ వరుణస్యచ
  చంద్రవిత్తేశయో శ్చైవ, మాత్రా నిర్హృత్య శాశ్వతీః॥ మను. ౭-౪,

రాజు లేక ప్రపంచము మర్యాదమీఱి చెడిపోవుచుండఁగా బ్రహ్మ జగమును రక్షించుటకై యింద్రుఁడు, వాయువు, యముఁడు, సూర్యుఁడు, అగ్ని, వరుణుఁడు చంద్రుఁడు, కుబేరుఁడు వీరియంశములను గ్రహించి రాజును సృజించెను.

శ్లో. తపత్యాదిత్యవ చ్చైష, చక్షూంషిచ మనాంసిచ
  నచైవం భువి శక్నోతి, కశ్చిద ప్యభివీక్షితుమ్॥

ఇతఁడు సూర్యునివలెఁ దన్నుఁజూచువారి చూపులను మనస్సులను జుఱచుఱ దహించుచున్నాఁడు. ఎవఁడును వీనిని దలయెత్తియైనఁ జూడఁజాలఁడు.

శ్లో. ఇంద్రస్యార్కస్య, వాయోశ్చ, యమస్య వరుణస్యచ
  చంద్రస్యాగ్నేః పృథివ్యాశ్చ, తేజోవృత్తం నృప శ్చరేత్॥ మను. ౯-౩౧౩

రాజు ఇంద్రుఁడు, సూర్యుఁడు, వాయువు, యముఁడు, వరుణుఁడు, చంద్రుఁడు, అగ్ని, భూమి వీరి తేజస్సును వర్తనమును గలవాఁడై మెలఁగవలయును.

శ్లో. వార్షికాం శ్చతురో మాసాన్, యథేంద్రోభిప్రవర్షతి
  తథాఽభివర్షే త్స్వం రాష్ట్రం, కామై రింద్రవ్రతం చరన్.

ఇంద్రుడు వర్షాకాలము నాలుగు నెలలు వర్షము గురియించి సస్యాదుల ఫలింపఁ జేయువిధముగ రా జింద్రునివలెఁ దన రాజ్యములోని ప్రజల కోరికలు పండు నట్లు చేయవలయును.

శ్లో. అష్టౌ మాసాన్ యథాదిత్య, స్తోయం హరతి రశ్మిభిః
　　తథాహరే త్కరం రాష్ట్రా, న్నిత్య మర్కవ్రతం హి తత్.

సూర్యుఁడు తక్కువ యెనిమిది నెలలు తనకిరణములచేఁ గొంచెము కొంచెము గానే భూమినుండి జలమును గ్రహించునట్లు రాజును నీతిమార్గము దప్పక ప్రజలకు బాధలేకుండునట్లు తనకు రావలసిన పన్నులను రాఁబట్టుకొనవలెను. దీనిపేరు సూర్య వ్రతము.

శ్లో. ప్రవిశ్య సర్వభూతాని, యథాచరతి మారుతః
　　తథా చారైః ప్రవేష్టవ్యం, వ్రత మేతద్ధి మారుతమ్.

ప్రాణవాయువు సకల ప్రాణులలోను బ్రవేశించి జీవింపఁజేయు విధముగ రాజు వేగుల మూలమున నందఱిలోను బ్రవేశించి వారి కష్టసుఖములు తెలిసి భరింప వలయును. దీనికి మారుతవ్రత మనిపేరు.

శ్లో. యథా యమః ప్రియద్వేష్యౌ ప్రాప్తేకాలే నియచ్ఛతి
　　తథా రాజ్ఞా నియంతవ్యాః, ప్రజా స్తద్ధి యమవ్రతమ్.

యమునికి శత్రువు లని మిత్రులని లేకున్నను వారివారి మరణకాలమున వారి వారి పుణ్యపాపములకొలఁది పక్షపాతములేక సమముగా నియమించునో అట్లే రాజును నేరము లొనర్చినవారిని స్నేహద్వేషములు లేక వారివారి దోషములకుఁ దగినయట్లు దండింపవలయును. ఇది యమవ్రతము.

శ్లో. వరుణేన యథాపాశై ర్బద్ధ ఏవాభిదృశ్యతే
　　తథా పాపా నిగృహ్ణీయా ద్వ్రత మేతద్ధి వారుణమ్.

ఎవఁడు వరుణుని పాశములకుఁ గట్టువడ నియ్యకొనునో యతఁడు నిస్సంశ యముగా వరుణపాశములచేఁ గట్టఁబడినవాఁడే. కావున రాజు పాపకారులెట్లు తమ యధికారమును నిర్వహింపరో యట్లు వారి నవ్విధంబున దండింపవలయును. ఇది వరుణవ్రతము.

శ్లో. పరిపూర్ణం యథాచంద్రం, దృష్ట్వా హృష్యంతి మానవాః
　　తథా ప్రకృతయో యస్మిన్, స చాంద్ర వ్రతికో నృపః.

పూర్ణచంద్రునిఁ జూచిన జను లెట్లు సంతోషింతురో యట్లు తన్నుఁ జూచిన వారు సంతోషించునట్లు రాజుండవలయును. ఇది చంద్రవ్రతము.

శ్లో. ప్రతాపయుక్త స్తేజస్వీ, నిత్యం స్యా త్పాపకర్మసు
　　దుష్టసామంత హింస్రశ్చ, తదాగ్నేయ వ్రతం స్మృతమ్.

రాజు ప్రతాపము తేజస్సు గలవాఁడై యెల్లప్పుడు పాపాత్ములను దుష్టులగు సామంతులను హింసించువాఁడై యుండవలయును. ఇది యాగ్నేయవ్రతము.

శ్లో. యథా సర్వాణి భూతాని, ధరా ధారయతే సమమ్
తథా సర్వాణి భూతాని బిభ్రతః, పార్థివం వ్రతమ్.

స్థావరములను జంగమములను నుత్తమనీచులను భూమి యెట్లు సమముగా భరించునో యట్లు రాజు పండిత మూర్ఖులను ధనిక దరిద్రులను దీనుల ననాథులను అందఱ భరింపవలయును. ఇది పృథ్వీవ్రతము. చూడుము మనుస్మృతి —
౭;౪-౫-౬-౭-౮

"ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజ"మ్మని నీవు మనుష్యుఁడ వని సాధారణరాజ వని నీవు చెప్పుకొన్నను నీ విన్ద్రునిలో (పరమాత్మలో) నాలుగవ భాగ మని మే మెఱుంగుదు మని భావము. అందఱ యైశ్వర్యము పరమాత్మ యైశ్వర్యములోని యంశమేకదా. "ఇంద్రో మాయాభిః పురురూప ఈయతే" యని శ్రుతి యందు నిన్ద్రశబ్దము పరమాత్మపరమేకదా. ఇందతీతీంద్రః = పరమైశ్వర్య యుక్తుఁడు. ఇతి పరమైశ్వర్యే, గురుబాల॥ అని యుండుటచేఁ బరమైశ్వర్యయుక్తుఁడు భగవంతుఁడే. ఐశ్వర్య మాయన యాఱుశక్తులలో నొకటికదా. స్వర్గమందలి యింద్రుఁడు రాజ్యము పోఁగొట్టుకొని యెన్నిమార్లో యల్లాడినట్లు గ్రంథములందుఁ గలదు. అట్టివానికిఁ బరమైశ్వర్య మెట్లు చెప్పవచ్చును? కావున వాస్తవమున నిన్ద్రుఁడు భగవంతుఁడే. "సమానానా ముత్తమ శ్లోకో అస్తు" అన్నట్లు దిక్పాలకుల కంటె నధికైశ్వర్యము గలవాఁడు కావున నతనియందు నిన్ద్రశబ్దము గౌణార్థమున నే; ముఖ్యార్థము భగవంతునందే యన్వయము. ఈ యభిప్రాయములోనే ఋషు లీ వాక్యము చెప్పిరి. అటుగాక యుండిన సాధారణ రాజమాత్రునకు వారు నమస్కరింతురా! ఇండ్లు వాకిండ్లు నీవే యని సమర్పింతురా, నీ గర్భమందు మే మున్నామందురా. "దివ్యతత్త్వమేధాపరిణీతులు" గావుననే భగవంతుఁ డిట్లవతరించె నని యెఱింగి గౌరవించిరి, శరణుచొచ్చిరి.

తాత్పర్యము

రాజు దేవేంద్రాది దిక్పాలురయందలి నాలుగవయంశము తేజస్సు గ్రహించి మిగుల హెచ్చరికతోఁ బ్రజల రక్షించుచు లోకులచే శ్లాఘింపఁబడి విశేష సుఖ సంతోషము లనుభవించును.

కం. కావున మే మెల్లరమును, నీ విషయమునందు నుంట ♦ నీచే నెపుడుఁ గా
గావంబడ నర్హులమో, భూవరతనయాగ్రణీ! ప్ర ♦ భూతపుఁగరుణన్. ౧౪

నీ విషయమునందును=నీ యధీనమున నీ పాలనమునకు లోబడియుండు దేశము నందు, ప్రభూతపుఁగరుణన్ = విశేషదయచే,

తాత్పర్యము

మే మండలము నీ దేశవాసుల మగుటచే నీచే రక్షింపఁబడ యోగ్యులము. కావున నీ వధికదయచే రక్షింపుము.

ఇచ్చట తాము రక్షింపఁబడుటకుఁ గారణము, భగవద్దేశవాసముగాఁ జెప్పఁ బడినది. తక్కినదేదియుండినను లేకున్నను రక్షింపఁబడ్డుటకు దివ్యదేశవాసము చాలును. ఆ యొక్కటి గ్రహించి మా యందు నుపాసనాదు లెవ్వియు లేకున్నను నీవు రక్షింపవలయును. మేమెల్లరము = పెక్కు కష్టములు పడుచు వానిని నివారించుకొను శక్తి యుపాయము లేక నీ వెప్పటికైన వచ్చి రక్షింతువను నమ్మకముతోఁ బ్రాణములు బిగఁబట్టుకొనియుండు మేమండలము. నీ విషయమునందు నుంటకా = నీ దేశమందున్న కారణమున. ఇది సమస్త జనులకు మోక్ష మేల యియ్యరాదను ప్రశ్నకు సమాధానము. అగ్ని తన్నాశ్రయించిన వారి చలి కదా పోఁగొట్టును. అట్టులే భగవంతు నేకారణముచేనైన నాశ్రయించినవారు రక్షింపఁబడుదురు. దూరస్థులు = దూరస్థులే, నీచేకా = సర్వలోక రక్షణమే స్వభావముగాఁగల నీచేత, ప్రభూతపుఁగరుణకా = వీరు రక్షింపఁబడుటకు యోగ్యులా యయోగ్యులా యని యాలోచింపఁవలదు. మాయందీశక్తి సామర్థ్యము లున్నవి. మేమేమియు దోషముచేయలేదు. కావున రక్షింపుమని విధించు యోగ్యత మాయందు లేదు. మేము దీనులము, కావున నీవు దయామూర్తివి గనుక నీగుణము నాలోచించి నేను వీరిని రక్షింపకుండిన నా స్వభావగుణమునకు భంగము వచ్చునే యని రక్షింపుము. అయోధ్యయందుఁ బుట్టిన చరాచరములు సదా నిన్ను దర్శించుట సేవించుట లోనగు నుపాయములచే నీయందుఁ బ్రేమగలవై యున్నవి. మాకట్టి భాగ్యము లేదు. మన దేశమందున్నారు గదా యనునది కారణముగా గ్రహించి రక్షింపుము. ఇతరోపాయములం దపాయము లున్నవి. నీవిషయము నందునుంట= మనుష్యభావమునఁ జూచినచో దక్షిణ సముద్ర మధ్యమువఱకు నిక్ష్వాకుల రాజ్యమే. కిష్కింధ ౧౮౹ూ సుందర ౯౯ వ. చూడుము. భగవద్దేశవాసమం దట్టి యపాయము లేదని ఋషుల యభిప్రాయమని యొక పక్షము. పూర్వోత్తర శ్లోకములఁ బ్రపత్తిచేసి యుండుటచేత నదికారణముగా మమ్ము రక్షింప వలసిన దని మఱియొకపక్షము.

మును పే ప్రపత్తిచేసియుండినచో నది యొకటే చాలునే. ఈ పద్యమందు భగవద్దేశవాసము రక్షహేతువుగాఁ జెప్ప నేల యని శంకింపరాదు. నీ యెదుటనుండు నపుడు మేము కష్టపడుట నీకు మఱింతలోపము గాదా యని తెలుపుటకై భగవద్దేశ వాస ప్రశంస చేయఁబడెనుగాని ప్రపత్తినిగాదని యిది ప్రశంసింపఁబడ లేదు. భగవద్దేశావాస మొక్కటియే రక్షణహేతువుగాఁ జెప్పవచ్చునే. ప్రపత్తి నేల చెప్పవలె ననరాదు. భగవద్రక్షణమునకు భగవద్దేశవాస మొకటియే చాలినంత కారణమైనను ఇతరవిధ రక్షణములందు భగద్దేశవాసముగాని యితరకారణములు గాని యెన్ని

యున్నను దోషముగాదు. ప్రపత్తికి విరోధమైనది కూడదు. దాని కనుకూలమైనవి యెన్నియున్నను దప్పుగాదు. ఇంతకు నీ ఋషీశ్వరులు మోక్షమును గోరినవారు గారు. దుష్టనిగ్రహమునే కోరిరి. కాఁబట్టి ప్రపత్తియు భగవద్దేశవాసము రెండును జెప్పుట యుక్తమే. ఇది తనిశ్లోకి వ్యాఖ్యానుసారము.

ఓ ఋషీశ్వరులారా! మీ నడవడిమూడ దాఁగఁబోయినచోట దయ్యాలపో రనునట్లున్నది. నే నన్నిజంజాటములు వ్యవహారములు వదలించుకొని యేకాంతమున నిశ్చింతముగ నుండవచ్చితిని. ఇచ్చట మీరు యుద్ధకార్యమునందు దించుచున్నారు. నేనెట్లు చేయఁగలనందువేమో? అది సరిగాదు. మేము నిన్ను భగవంతుఁడవని కేవల ధర్మరక్షణార్థమై యవతరించితివని నమ్మి శరణుచేసితిమి.

పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే. భ. గీ.
యని నీవు చెప్పలేదా.
అకారణా త్కారణా ద్వా, కారణాకారణా న్నచ
శరీరగ్రహణం వ్యాపిన్ ధర్మత్రాణాయ కేవలమ్॥ వి. పు. ౫-౧-౫౦

పాపులవలె నరక మనుభవించుటకుఁగాని పుణ్యులవలె స్వర్గ మనుభవించుటకుఁగాని మనుష్యులవలె సుఖదుఃఖము లనుభవించుటకుఁగాని నీవు శరీరము గ్రహించినవాఁడవు కావు. కేవల ధర్మరక్షణ నిమిత్తమే శరీరము ధరించితివి.

ప్రభూతపుఁ గరుణన్ = భగవంతుఁడు దన స్వభావ నిరవధిక నిరతిశయకరుణచే మనల రక్షింపవలెనుగాని మన శక్తిసామర్థ్యములచే జ్ఞాన, బల, క్రియాదులచే మనము కృతార్థుల మగుదుమనుట కల్లమాట. నీ దేశమం దున్నారముగావున నీవు మమ్ము రక్షింపవలసినది నీకు విధియని చెప్పియుండినది పూర్ణప్రపత్తియై యుండదు. అట్టి యభిప్రాయము ఆకించన్యము విరోధము. కావున నట్టి విరోధము రాకుండుటకై ప్రభూతకరుణ చెప్పఁబడెను. ఋషీశ్వరుల యభిప్రాయ మేమన:— మమ్ము రక్షింపవలసినదని మేము చెప్పుకొనుట మాకు విధి. (గోప్తృత్వవరణము) కావునఁ జెప్పితిమి. ఏమి నెపముపెట్టి మిమ్ము రక్షింతును, ఏవ్యాజములేక మిమ్మురక్షించిన లోకులందఱు మీవంటివారు గారా? కావున లీలావిభూతి మానుకోవలసివచ్చునే యందువేమో? అట్టి నెపము నీకుఁ గావలసియుండిన వీరు మన దేశవాసులను నెపముపెట్టి రక్షింపుము. అదియును మేమది మాకు స్వత్వముగా (హక్కు = right) గాఁ జెప్పము. నీ స్వభావసిద్ధకారుణ్యముచేఁ జేయుమనియే మా ప్రార్థనము. ఈ విషయమున విష్ణుపురాణమందలి యీ శ్లోకములు ముఖస్థములు చేయఁదగినవి.

శ్లో. యస్మాద్బ్రహ్మాచ, రుద్రశ్చ, చంద్రేంద్ర మరుదశ్వినః
వసవశ్చ సహాదిత్యై స్తస్య స్తోష్యామి కి న్వహమ్॥

బ్రహ్మ, రుద్రుఁడు, చంద్రుఁడు, ఇంద్రుఁడు, మరుత్తులు, అశ్వినులు, ఆదిత్యుల తోడి వసువు లెవనివలనఁ గలిగిరో యట్టివాని నే నేమని స్తుతింతును?

ఏకావయవ సూక్ష్మాంశాద్యస్యేద మఖిలం జగత్
కల్పనావయవస్యాంశ స్తస్య స్తోష్యామి కిన్న్వహమ్॥

ఎవని యవయవము లందలి యొక సూక్ష్మాంశముచే సమస్త ప్రపంచము కల్పితమయ్యెనో యెవని యవయవాంశ కల్పనము సంకల్పసిద్ధమో యట్టివాని నే నేమని స్తుతింతును?

సదసద్రూపిణో యస్య, బ్రహ్మాద్యా స్త్రిదశోత్తమాః
పరమార్థం నజానంతి, తస్య స్తోష్యామి కిన్న్వహమ్॥

సత్తు, అసత్తు తన రూపముగాఁ గల బ్రహ్మముయొక్క పరమార్థమును దేవ తోత్తములు కూడ నెఱుంగరో యట్టివాని నే నేమని స్తుతింతును?

బ్రహ్మాద్యై రర్చితో యస్తు గంధపుష్పానులేపనైః
నందనాది సముద్భూతై స్సోర్చ్యతే వా కథం మయా.

నందనవనాదులందలి సుగంధపుష్పానులేపనముల బ్రహ్మాదు లెవనిఁ బూజింతురో యట్టివాని నే నేమి యర్చింపఁగలను?

యస్యావతార రూపాణి దేవరాజ స్సదార్చతి
నవేత్తి పరమం రూపం సోర్చ్యతే వా కథం మయా.

ఇంద్రుఁడు పరమరూపము యెవని తెలియనివాఁడై యవతార రూపముల సదా యర్చించునో యట్టివాని నే నెట్టు లర్చింపఁగలను?

విషయేభ్య స్సమాహృత్య సర్వాక్షాణిచ యోగినః
యమర్చయంతి ధ్యానేన సోర్చ్యతే వా కథం మయా.

ఇంద్రియములను విషయములను నియమించి ధ్యానముచే యోగు లర్చించు వాని నే నెట్టు లర్చింపఁగలను?

హృది సంకల్ప్య యద్రూపం ధ్యానే నార్చంతి యోగినః
భావపుష్పాదినా నాథ సోర్చ్యతే వా కథం మయా.

ఏ రూపమును యోగులు హృదయమందు సంకల్పించుకొని భావపుష్పము లచే నర్చింతురో నాథా, యట్టివాని నే నెట్టు లర్చింతును?

సోహం దేవదేవేశ నార్చనాదా స్తుతౌ నచ
సామర్థ్యవాన్ కృపామాత్ర మనోవృత్తి ప్రసీద మే॥

దేవదేవ, యట్టి నేను నీ యర్చనాదులందు స్తోత్రాదులందు సమర్థుఁడను గాను కావునఁ గేవల కరుణయే మనోవృత్తిగాఁ గల నీవు న న్ననుగ్రహింపుము.

ఆటుగాక నీవు మనుష్యభావమున మమ్ము మోసగింపఁజూచెదవా, నీ పాల నను లోఁబడిన మమ్ముఁ గాపాడవేని నీకు నరకము తప్పదు.

అగోప్తారశ్చరాజానో బలిషడ్భాగతస్కరాః
సమర్థాశ్చాప్యదాతార స్తేవై నిరయగామినః॥ భార. ౧౨-౨౩-౯౦.

దొంగలై యాఱవభాగము పన్ను దీసికొనుచుఁ బ్రజారక్షణము చేయకుండు రాజులును సమర్థులైయుండి యీ పన్నియ్యనివారును నరకముపా లగుదురు,

అరక్షితారంరాజానం, బలిషడ్భాగహారిణమ్
తమాహుః సర్వలోకస్య సమగ్రంపాపచారిణమ్. భార. ౧-౨౧౩-౯.

ఆఱవభాగము కప్పము తీసికొని రక్షింపనిరాజు సర్వలోకములలో సంపూర్ణ పాపాత్ముఁడు.

ఉ. నిర్భర తేజ! దండము ము♦నిప్రకరంబుల మైన మా కసం
దర్భపుఁజేఁత, యాగ్రహముఁ ♦ దాల్పఁగ లేము జితేంద్రియాప్తి, నీ
గర్భముఁ బోలె నీ కెపుడుఁ ♦ గావగ మమ్ముఁ దగు న్మహాత్మ! ప్రా
దుర్భవదుత్కృపాపరతఁ ♦ దోయజనేత్ర! తపోధనాఢ్యులన్. ౧౫

మీ రెంతో తపశ్శాలులే, ఏల తపోబలముచే దుష్టులను ధ్వంసము చేయరాదు. ఏల బహుకాలము బాధపడుచుండవలయుననినఁ జెప్పుచున్నారు.

నిర్భర తేజ=అతిశయించునట్టి తేజము గలవాఁడా, ఇట్లనుటచే మా తేజస్సు కంటె నీ తేజస్సే గొప్పదని భావము, మునిప్రవరులము = మననశీలుఁడు ముని, ధ్యానము చేయుచుండువాఁడు. అందుఁ బ్రవరులము=శ్రేష్ఠులము, మాకు ధ్యానమే ప్రధానము, దండము=శిక్షించుట, శపించుట, అసందర్భపుఁజేఁత = తగని కార్యము; జితేంద్రియాప్తిన్=ఇంద్రియజయము నొందుటచే, కామక్రోధములను వదలుటచే, ఆగ్రహమున్=కోపమును, కోపమునకు ధ్యానయోగమునకు మిగులదూరము, మేము జయించిన కామక్రోధాదులకు మేము వశపడిన మే మిన్నాళ్లు శ్రమించినది వ్యర్థమే యగునుగదా! మేము కోపించుటచే మాచిరకాలార్జిత తపస్సులు నాశము లగునుకదా! కాఁబట్టి మేము శాపమిచ్చుటకు వలను పడదు. ఎపుడున్=సర్వకాల సర్వావస్థలందు, నీ గర్భమువోలెన్ = నీ కడుపునందున్న శిశువువలె, కుక్షిభ్రూణార్భగర్భాః అమరుఁడు. మహాత్మ=గొప్ప యుదారస్వభావము మనస్సుగలవాఁడా, ప్రాదుర్భవత్ =పుట్టుచున్న, ఉత్కృపాపరతన్ = అతిశయించిన దయాగుణమే విశేషముగఁ గలవాఁడవగుటచేత, తపోధనాఢ్యులన్ = తపస్సే ధనముగాఁగల సంపన్నుల మగువారిని, కావఁగాఁదగున్=రక్షించుట యోగ్యమగును. ఇందుఁ జెప్పఁబడిన తపస్సుపవాసాదులు ప్రాణాయామాదులు కావు. అన్ని తపస్సులలో శ్రేష్ఠమైన తపస్సేదియో దానినే యిచట గ్రహింపవలెను.

తస్మాన్న్యాస మేషాం తపసా మతిరిక్త మాహుః ॥తైత్తి॥ అను శ్రుతిప్రకారము అన్ని తపస్సులలో శ్రేష్ఠమైనది న్యాసమే. అనగా భగవంతుఁడా! నీవే మాకు రక్షకుఁడవు, మమ్ము రక్షించు భారము నీయందున్నది యని రక్షణభారము భగవం

తునిపై వైచి నిర్భయముగా భగవంతుఁ డవశ్యము రక్షించును. మోసగింపఁడను మహా విశ్వాసము గలిగియుండుట. ఇది గొప్ప తపస్సు, ఇట్టి తపస్సు మాకు ధనము. ఆధనమును నీయొద్ద దాఁచియుంచినవారము. ఇట్టి విశ్వాసము గలవారమగుటచేత మమ్ము మేము రక్షించుకోరాదు. దానికై యత్నింపను రాదు. నీవు రక్షించెదవని నమ్మియుండి మరల మమ్ము మేము రక్షించుకొనుట స్వాతంత్ర్యము వహించిన ట్లగుటయే కాక నీయందు విశ్వాసము లేనట్టేకదాయగును. ఇది స్వరూపహానికదా! నీయందు విశ్వాసము లేకపోయిన నీవేల రక్షింతువు? రక్షింపవు. మమ్ము మేము రక్షించుకొనఁజాలము. తల్లిగర్భము నందుండు శిశువు తల్లి తన్ను రక్షించునను నమ్మకములేక తన్నుఁదాను రక్షించుకొనఁగలదా? మా తపస్సుచేత మే మెందఱ నని దండింపఁగలము? తపస్సు వ్యర్థమగుటయే ఫలమయి రెంటను జెడుదుము. కావున మమ్ము నీవే రక్షింపవలయును.

ఇట్లనుటచే మునుల రక్షణము నిర్వ్యాజ మనుట సరికాదు. ఈ ఋషులు మోక్షార్థులే. కాని ఖరాదివధము మాత్రమే వారియుద్దేశము గాదు. ఖరాది శిక్షణమును శరభంగాశ్రమవాసులు ప్రార్థింపఁగలరు. ఇది గోవిందరాజాభిప్రాయము.

ఇది ౧౮ వ పద్యవ్యాఖ్యానము. (తనిశ్లోకి)తో విరోధించుచున్నది.

శ్లో. సాధనంచ ద్విధా కార్యం, ధర్మద్వేషి నిరాకృతౌ
శస్త్రాస్త్రవ్యూహరూపేణ, శాస్త్రరూపేణచైవహి. అహిర్బు.

ధర్మరక్షణము రెండు విధములఁ జేయఁబడును. శాస్త్రముచే హితాహితములు దెలుపుట, ధర్మమును విరోధించు వారిని శస్త్రాస్త్రములచే సంహరించుట. పైరు రక్షించుటయందు గడ్డి గాదము తీసివేయుట యెట్టిదో సాధు పరిత్రాణమందు దుష్టశిక్షణ మట్టిది. కావున మోక్షార్థులు దానిని వేఱుగఁగోరరు.

బ్రాహ్మణస్యతు దేహోయం నకామార్థాయ జాయతే
ఇహక్లేశాయ తపసే, ప్రేత్య త్వనుపమం సుఖమ్.

బ్రాహ్మణుని యీ దేహము కామార్థములకుఁగాను గలుగలేదు. ఈ లోకమునఁ దపోరూపకమైన దుఃఖము కొఱకును పరలోకమున నిరుపమాన సుఖమునకును గలిగినది.

తాత్పర్యము

చూచి భరించుటకు సాధ్యముగాని తేజస్సుగల శ్రీరామచంద్రమూర్తీ! సర్వదా ధ్యానతత్పరులమై మామనస్సులన్నియు నీయందే యుంచి యుండు కారణముచే నీసత్త్వగుణము కొంచెము మాయందును సంక్రమించుటచేతఁ దమోగుణకార్యమైన దండము చేయుట మాకుఁ దగినదికాదు. అట్లు చేసితిమేని మాతపస్సు నాశమగుటయేకాక మేము స్వతంత్రుల మను నహంకార మొకటి జనించును. దానిచే

మాకు స్వరూపహానియే కలుగును. కావున మే మట్టిపనిఁ బూనఁజాలము. నీగర్భమందుండువారము (నారాయణశబ్దార్థ మనుసంధించునది.) తల్లిగర్భమందుండు శిశువును దల్లిగాక మఱియెవరు రక్షింపఁగలరు? శిశువు తన్నుఁదాను రక్షించుకొనఁగలదా? కావున మమ్ము రక్షించుభారము సర్వకాల సర్వావస్థల నీయందే యున్నది. కావున నీవు మమ్ము రక్షింపఁదగును. నీవు మిగుల దయగలవాఁడవు గదా. నీయందు మా రక్షాభారమువైచి నిన్నే నమ్మియుండు మాయందుఁగాకున్న నీ యపారదయ యెవరి యందుఁ బ్రసరింపఁజేయఁగలవు."

క౦. అని యీగతి సీతాపతి, ననుజయుతుం బూజచేసి ♦ యమ్మును లెల్లన్
వనభవసుమఫలతతులను, గొనబగు మూలములఁ దన్వి♦గూరఁగఁ బ్రీతిన్. ౧౮

ఈగతిన్=ఈ విధముగ, సీతాపతిన్ = ఆ రఘుపతి ననక సీతాపతి ననుటచే సీతతోడంగూడిన రామునికి శరణాగతి చేయవలయుగాని యొకరికి మాత్రమే చేయరాదని సూచన. దంపతులను వేఱువేఱుగ విడఁదీసి పూజింపరాదు. అనుజయుతున్=తమ్మునితోఁ గూడినవానిని; శరణాగతి యుత్తమాటలతో ముగింపక క్రియారూపముగను జూపుట ముఖ్యముగాన 'పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి' యన్నట్లు వారికిఁ గలిగిన ఫలాదు లర్పించుచున్నారు. ఆ యుద్దేశము లేకున్న రెండవసారి ఫలములీయఁ బనిలేదుకదా. వనభవ=అడవియందుఁబుట్టిన, సుమఫలతతులను=పూలు పండ్లయొక్క సమూహములను, గొనబగు=చూచుటకు భుజించుటకు నింపైన, మూలములన్=కందమూలములను, తన్విగూరఁగన్=తృప్తికలుగునట్లు, ప్రీతిన్=యో మే భక్త్యా ప్రయచ్ఛతి యనుదానిని దెల్పుచున్నది. 'యద్భక్ష్యం స్యాత్తతో దద్యాత్ బలిం భిక్షాంచ శక్తితః అమ్మూలఫలభిక్షాభి రర్చయే దాశ్రమాగతాః॥ మను. ౬-౭.

తన కేది యాహారమో బలిభిక్షములు దానితో చేయవలెను. జలము మూలములు పండ్లు వీనిచే ఆశ్రమాగతులకు భిక్షచేయవలెను.

తాత్పర్యము

ఈ విధముగఁ జెప్పినవారై సీతారామలక్ష్మణులను బూజించి శుష్కాలాపములు శూన్యహస్తములు గాకుండునట్లు తమకుఁగల కందమూల ఫలాదులను వారు తృప్తిపడునట్లు లిచ్చిరి.

దీనివలన భగవంతుని బత్నీసమేతుఁగాఁ బరివారసమేతుఁగ నర్చించి భక్తితో దమకు భగవంతుఁ డిచ్చినదానిని నివేదింపవలయునని యేర్పడుచున్నది.

ఈ ఋషిచర్య భగవదారాధన క్రమము సూచించుచున్నది.

“ఆసనస్థితు నొనరించి” (౧౧-వ పద్యము) యనుటచే “కూర్మాదీన్ దివ్యలోక”మ్మను శ్లోకమ్మునఁ జెప్పఁబడిన యాసనము సూచింపఁబడెను. అనలతేజు లనుటచేఁ బూజకుల యుపనిషన్మంత్రపూర్వక భూతశుద్ధి తెలుపఁబడెను. ఆవల వారి

వాక్యములు = త్వద్యాగారాధన కామోఽయం । వ్రతం చరితు మిచ్ఛతి । సంకల్ప సిద్ధ్యై భగవన్ । పూరయాస్య మనోరథాన్ ॥ అను వాక్యములు. "అనన్యశరణ స్త్వత్ పాదారవింద యుగళం శరణం ప్రపద్యే" యను గద్యసూక్తులను దెలుపుచున్నవి. "సీతాలక్ష్మణసమేతు శ్రీరామచంద్రమూర్తి నర్చించుట" సపరివారం భగవంతమ్మను వాక్యార్థమును సూచించుచున్నది. సుమము లర్పణచేసి యనుట పూజావిధానమును సూచించుచున్నది. ఫలమూలాది సమర్పణము, నైవేద్య సమర్పణము తెలుపుచున్నది. ప్రతిదినముచేయు భగవదారాధన క్రమ మిదియే కదా.

వీరందఱు తపస్వులు యోగులు కావున హృద్యాగమునఁ బ్రతిదినము చేయుచున్నట్లు బాహ్యయాగమును జేసి రని సూచన.

తే. సిద్ధసాధననిష్ఠులు ♦ శిక్షసమాను, లన్య తాపసవర్యులు ♦ న్యాయ్యవృత్తు
లీశ్వరుని రాము నర్చించి♦రెలమి మిగుల, వారువారు యథాన్యాయ♦ పద్ధతులను.

సిద్ధసాధననిష్ఠులు=సాధ్యమని సిద్ధమని మోక్షసాధనములు రెండువిధములు. సాధనమనఁగా సాధించునుపాయము, సాధ్యమనునది మనుష్యప్రయత్నపూర్వకమైనది. కర్మయోగము, జ్ఞానయోగము, అష్టాంగయోగము, భక్తియోగము లోనైనవి, భగవత్ప్రాప్తికై మనము శ్రమించిచేయు నుపాయములు. ఉపేయము భగవంతుఁడు. ఈ మార్గమందు నుపాయము ఉపేయము వేఱువేఱు; మంత్రుల సాహాయ్యముచేఁ బ్రభువు ననుగ్రహము సంపాదించుకొన్నట్లు; రెండవదగు సిద్ధోపాయమందు నుపాయము ఉపేయము రెండు భగవంతుఁడే. భగవంతు ననుగ్రహము సంపాదించుకొనుటకు భగవంతునే యుపాయముగాఁ గొని యాయన పాదముల మీఁదనే "అపరాధ సహస్రభాజనం । పతితం భీమభవార్ణవోదరే । అగతిం శరణాగతం హరే। కృపయా కేవల మాత్మసాత్కురు." భగవంతుఁడా ! వేలకొలఁదు లపరాధములు చేసి యీ సంసార మహాసముద్రమందుఁ బడితిని, నాకు వేఱుగతిలేదు. నీవేగతి కావునఁ గేవలకృపచే నాత్మసాక్షాత్కారము గలిగింపుము. "అధర్మనిష్ఠోస్మి నచాత్మవేదీ । నభక్తిమాన్ త్వచ్చరణారవిందే । అకించనోఽనన్యగతి శ్శరణ్య త్వత్పాదమూలం శరణం ప్రపద్యే॥ సర్వలోకశరణ్యా! నేను ధర్మనిష్ఠుఁడనుగాను, నేను ధర్మములు లోపములు లేక చేయలేను. ఆత్మజ్ఞానము నాకులేదు. నాయందు భక్తియు లేదు. ఏవిధమైన యుపాయము సాధించుటకు శక్తిలేదు. ఆ మార్గము తెలియదు, నిన్ను విడిచిన నాకు వేఱుగతిలేదు. కావున నీ పాదములమీఁదఁ బడితిని, తరువాత నీ యిష్టము.

అని చెప్పి యీ ప్రకారము భగవంతునిమీఁద మహావిశ్వాసము ఆత్మరక్షాభరము నుంచి తల్లిపాదిగిటి శిశువువలె నిర్భయుఁడై యుండుట. దీనికి సిద్ధసాధన మని పేరు; వీరే వాస్తవ సిద్ధులు. క్షుద్రములైన యణిమాదులు సాధించినవారు గారు; వారియం దది గౌణము. ఇట్టి సాధనమందు నిష్ఠగలవారు సిద్ధసాధన నిష్ఠులు.

నిష్ఠ=ని+ష్ఠ=విశేషముగ నుండుట, దేనియందు మనస్సు విశేషముగ నుంచి తదనుకూలకార్యములు చేయుచుందుమో దానికి నిష్ఠయనిపేరు. ఇదియే భక్తి. తన్నిష్ఠస్య మోక్షోపదేశాత్. బ్ర. సూ. 1-1-7, శిఖిసమానులు = అగ్నిహోత్రమునకు సమానమైనవారు, అనఁగా దోషస్పర్శములేనివారు, భగవంతుఁడుగాక వేఱొకఁడు తనకు రక్షకుఁడు గలఁడనియెంచుట, భగవత్ప్రాప్తికి భగవంతుఁడు గాక యితరోపాయములను వెదకుట, ఫలము భగవత్సాయుజ్యముగాక స్వర్గకైవల్యాదులుగోరుట, సర్వమునకుఁ గర్తయు స్వామియు భగవంతుఁడని నమ్మక తాను గర్తయని స్వామియని తలఁచుట యివి దోషములు; సిద్ధసాధననిష్ఠు లీ దోషములు లేనివారై యుండవలయును. అన్యతాపసవర్యులు = మీఁదఁ జెప్పఁబడినవారికంటె నితరులు, పూర్వము చెప్పఁబడినవారు. తపోరూపక కాయక్లేశమును సహించినవారు. వీరు దానికి శక్తి లేనివారు, న్యాయవృత్తులు = సిద్ధసాధననిష్ఠకుఁదగి న్యాయముతోఁ గూడిన కార్యములు చేయువారు, అనఁగా స్తుతిప్రణామాదులు లోనైనవి, ఈశ్వరుని = సమస్తప్రపంచమునకుఁ బ్రభువై సమస్తచరాచరములు తనయాజ్ఞయం దుంచుకొని తన యిష్టప్రకారము ప్రవర్తింపఁజేయువానిని ''ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి, భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా''యని భగవద్వాక్యము గలదుగదా. ఇట్టి యీశ్వరుఁ డెవడనిన శ్రీరామచంద్రమూర్తియే కావున రాము నర్చించిరి=పూజించిరి. ఎలమిన్=సంతోషముతో, భగవంతు నీశ్వరు శ్రీరాముఁ జేతులతో నర్చించు భాగ్యము మనకుఁ గలిగెఁగదాయని యపారసంతోషము, జీవి కింతకంటె భాగ్యమిం కేదిగలదు? యథాన్యాయ్యపద్ధతులను=వారి వారి వర్ణాశ్రమాచార మార్గములను.

తా త్ప ర్య ము

సిద్ధసాధననిష్ఠులు, అగ్నిహోత్రసమానులు, ఇతర తాపసశ్రేష్ఠులు, న్యాయవృత్తులు వారివారి వర్ణాశ్రమాచార పద్ధతుల నీశ్వరు శ్రీరామచంద్రమూర్తిని మిగుల సంతోషముతోఁ బూజించిరి.

—♦ ౨-వ సర్గము. విరాధుఁడు సీత నెత్తుకొని పోవుట. ♦—

సీ. అంగీకృతాతిథ్యుఁ ♦ డై రామచంద్రుఁడు, వేగుఁబోకట గల్య ♦ విధులఁ దీర్చి
విశ్వమానులచేత ♦ వీడుకోల్వడసి యరణ్యంబునం బోయి ♦ పుణ్యమూర్తి
నానామృగాకీర్ణ ♦ నానాతరూదీర్ణ, శార్దూలసూకర ♦ సైరిభాచ్ఛ
భల్లసమాక్రాంత ♦ ఝిల్లీనినాదిత, నిష్కూజబహుళకు ♦ నిప్రవేశ

తే. ధ్వస్తవృక్షలతాగుల్మ ♦ వార వారి, హీనసలిలాశయారణ్య ♦ పృథివి దాని
నడుమఁ గనియెసుమిత్రాగ్ర♦నందనుఁడును, జానకియువెన్నడింపఁగ ♦ సంతసమున.

అవతారిక:—ఇట్లు సిద్ధసాధన నిష్ఠులును మోక్ష మపేక్షించు వారు నగు ఋషులు సీతారామలక్ష్మణులయెడఁ జేసిన కైంకర్యము లక్ష్మీదేవితోఁ గూడిన భగ

వంతునివిషయమై చేసినదిగను మఱియు నది భాగవతుని పర్యంతము చేసినదిగను నింతకుఁ బూర్వము కవి చెప్పెను. ఇఁక శరభంగాశ్రమమునులు రాక్షసవధార్థమై శ్రీరామునియెడఁ జేసిన శరణాగతిఁ జెప్పఁబోవుచున్నాఁడు: దానికి రామునియెడ శరణ్యత్వశక్తి పూర్తిని జూపఁదలఁచి విరాధవధ చరిత్రమును బ్రారంభించుచున్నాఁడు. కావుననే సంక్షేపరామాయణమున శ్రీరామచంద్రమూర్తి విరాధవధ శరభంగ దర్శనమునకుఁ గానుకఁగాఁ జేసికొని యతని దర్శించె నను తాత్పర్య మిచ్చునట్లు విరాధుని నుగ్రహించి శరభంగు దర్శించి యని చెప్పఁబడెను.

అంగీకృతాతిథ్యుఁడై = అంగీకరింపఁబడిన యతిథిపూజగలవాఁడై, శ్రీ భూవల్లభుఁడైన భగవంతుఁడు భక్తులర్పించు పదార్థముల వెల చూడఁడు, శ్రద్ధాభక్తులే మాత్రమో చూచును. కావున ఋషులు పూలు, పండ్లు సమర్పించినను వారి భక్త్యతిశయమునుబట్టి సంపూర్ణమనస్సుతో నంగీకరించెను. కావుననే యారాముఁడాతిథ్య మంగీకరించి యని జెప్పక యంగీకారమునకుఁ బ్రాధాన్య మిచ్చుచుఁ దొలుత నది చెప్పఁబడెను. "కం. దళమైనఁ బుష్పమైనను । ఫలమైనను సలిలమైనఁ బాయని భక్తిం । గొలిచిన జను లర్పించిన । నెలమిన్ రుచిరాన్నముగ నె యేను భజింతున్"॥ అను భగవద్వాక్య మిట స్మరింపనగు. వేగుఁబోకటన్ = ఉదయకాలమందు, కల్యవిధులు=ప్రాతఃకాల కృత్యములైన స్నాన సంధ్యావంద నాదులు, అథ కల్య మహస్సుఖే. నానా. విశ్వమానులు=సమస్తమునులు, వీడుకోలు=అనుజ్ఞ, అరణ్యంబునన్=అడవియందు, అచ్చటనే యుండ నిష్టపడలేదని భావము.

నానామృగాకీర్ణ=అనేకములైన మృగములచే వ్యాపించినదియు, నానాతరూదీర్ణ=అనేకములైన చెట్లచే గొప్పదైనదియు, శార్దూల = పులులచేతను, సూకర = అడవిపందులచేతను, సైరిభ=కారెనుబోతులచేతను, అచ్ఛభల్ల=ఎలుఁగుగొడ్లచేతను, సమాక్రాంత = ఆక్రమింపఁబడినదియు, ఝిల్లీనినాదిత = ఈలపురుగుల ధ్వనులుగలదానిని, నిష్కూజ = ధ్వనిలేని, బహు=అనేకములైన, శకుని ప్రవేశ=శ్రేష్ఠములైన పక్షులుగలదియును, విరాధుని భయముచేఁ బక్షులుగూడ శబ్దముచేయక యున్నవని భావము. ధ్వస్తవృక్షలతాగుల్మ=నశించినచెట్లు, తీఁగలు, పొదలు, వీని, వారము = సమూహము గలదానిని, వారిహీన = నీళ్ళులేని. సలిలాశయ = తటాకములు గలదియగు. అరణ్య పృథివి=అడవి ప్రదేశము, దాని నడుమన్=దాని మధ్యభాగమందు నడుమునన్ అనిరూపముండఁగా 'కేషాంచిదుదంతానాం నేతి విభక్త్యాపునోలుక్స్యాత్ - అ॥ కా॥ అను కారిక చొప్పున నడుమన్ అని యయ్యెను, వెన్నడింపఁగన్ = వెంట రాఁగా అనుటచే నిచ్చటను రామచంద్రమూర్తి పోవుచుండె నని యేర్పడుచున్నది.

తా త్ప ర్య ము

శ్రీరామచంద్రమూర్తి యాతిథ్యము నంగీకరించి నిద్రించి యుదయమున స్నానసంధ్యాది కార్యములనెల్లఁ దీర్చుకొని మునీశ్వరు లందఱు సాగనంపఁగా వారి

యనుజ్ఞ దీసికొని యడవియందే పోయి యనేకవిధములైన మృగములచే వ్యాపించి నదియు ననేకవిధములైన వృక్షములు గలదియు, పులులు, అడవిపందులు, కారుమన్నుపోతులు, ఎలుఁగులు విస్తారముగఁ గలదియు, గీఁయను నీలపుఁరుగుల ధ్వనిగలదియు, ధ్వనింపని యనేకములైన గొప్ప పక్షులు గలదియు, విరాధుని భయముచే నెవరు వచ్చి తీసికొని పోకుండుటచేఁ బడి చివికి నశించు చెట్లు తీఁగెలు పొదలు గలదియు, నీరులేని మడుగులు కలదియు నగు నడవి నడుమ దనవెంట సీతాలక్ష్మణులు రాగాఁ బోవుచుండెను.

సీ. ఆయెడ శైలశృం◆గాభు మహాస్వనుఁ, బురుషాదు గంభీర ◆ భూరినయను
వికటమహావక్త్రు◆విషమోదరు సుదీర్ఘ,విషమభీభత్సైక ◆ వికృతరూపు
హస్తిగఁ గ్రొవ్వగ్రొ◆న్నెత్తురు వడిసెడి, పులితోలు గట్టి త్రి◆భువనములను
మ్రింగెదనో యను◆భంగి నాస్యము విచ్చి, యంతకురీతి భూ◆తాళిభీతి
తే. కారణుం డయి నాల్గువ్యా◆ఘ్రములు రెండు
వృకములును మూఁడు సింగముల్ ◆ వృషతదశము
హస్తిశిరమును శూలాగ్ర◆మందు గుదిగఁ
గ్రుచ్చి పెడబొబ్బ లిడుచున్న ◆ క్రూరు గనియె. ౧౯

శైలశృంగాభుఁ=కొండశిఖరముతో సమానుని, మహాస్వనుఁ=గొప్పకంఠధ్వనిగలవానిని, పురుషాదుఁ=మనుష్యులఁ దినువానిని, గంభీరభూరినయనుఁ=లోఁతైన పెద్దవగు కన్నులుగలవానిని, వికటమహావక్త్రుఁ=భయంకరమైన పెద్దనోరుగలవానిని, విషమోదరుఁ=మిట్టలు పల్లములుగనుండు కడుపు గలవానిని, సుదీర్ఘవిషమ=మిక్కిలి నిడివియు నెచ్చుతగ్గులుగల, భీభత్సైక = మిక్కిలి భయంకరమగు, వికృతరూపుఁ = వికారస్వరూపము గలవానిని, ఆస్యము=నోరు, విచ్చి = తెఱచి, అంతకు రీతిఁ = యమునివలె, భూతాళిభీతికారణుండయి = ప్రాణికోటికి మిగుల భయము కలిగించువాఁడై, వృకములు=తోడేళ్ళు, వృషతదశము = పదిదుప్పులు, హస్తిశిరము = ఏనుఁగుతల, గుదిగ = గుంపుగ.

తాత్పర్యము

ఇట్లడవియందుఁ బోవుచుఁ బర్వతశిఖరమువలెఁ బొడవైన దేహము గలిగి గొప్పగా ధ్వనించుచు మనుష్యులఁ దినువాఁడును, లోఁతైన పెద్దకన్నులు భయంకరమైన పెద్దనోరు మిట్టపల్లములుగల కడుపు మిగుల నిడివియై భయంకరమైన వికారాకారము గలిగి క్రొత్తగా నెత్తురుకాఱుచుండు పులిచర్మము గట్టికొని మూఁడు లోకములను మ్రింగుటకా యేమి యన్నట్లు నోరు తెఱచుకొని యమునివలె భూతములకు భయంకరుఁడై నాలుగు పులులు, రెండు తోడేళ్ళు, పది దుప్పులు, ఏనుఁగుతల శూలము కొనయందు గ్రుచ్చి పెద్ద బొబ్బలు పెట్టుచున్న క్రూరునొకని రామచంద్రమూర్తి చూచెను.

చం. అతఁడును రామలక్ష్మణుల ♦ నా జనకాత్మజఁ జూచి క్రుద్ధుఁడై
క్షితితల మెల్లఁ దెల్లదర ♦ గేరి లయాంతకునట్లు భైరవా
తతనినదంబు నించుచు న ♦ దాటున మీఁదికిఁ బాఱి జానకీ
సతిఁ గొనిపోయి యంకమునఁ ♦ జయ్యనఁ జేర్చి వచించె వారితోఁ. ౨౦

క్రుద్ధుఁడై =కోపించినవాఁడై, క్షితితలము = భూప్రదేశము. ఎల్లు + అదరఁ = మిక్కిలి యదరఁగ; కేరి=విజృంభించి, లయాంతకునట్లు=ప్రలయకాలయమునివలె, భైరవ=భయంకరమైన, ఆతత=విస్తారమైన, నినదంబు = ధ్వని, అదాటునఁ = తటాలున, అంకమునఁ = (చంకను) ఒడియందు, చయ్యనఁ = త్వరగా.

తాత్పర్యము

ఆ విరాధుఁడు సీతారామలక్ష్మణులఁ జూచి కోపించినవాఁడై భూమి గడగడలాడునట్లు ప్రలయకాలము నాఁటి యమునివలె విజృంభించి భయంకర ధ్వనులు గావించుచుఁ దటాలున వారిమీఁదికి బరువెత్తి సీతాదేవిని గ్రహించి రొండియందుంచుకొని శ్రీరామలక్ష్మణులతో నిట్లనియె.

ఇచ్చట విరాధుఁడు సీతాదేవిని దాఁకి చంక నెత్తుకొన్నట్లు స్పష్టముగఁ జెప్పఁబడెను. రావణాసురుఁడు సీతను దాఁకుట సహింపక రావణుఁడు భూమితోనే పెళ్ళగించుకొనిపోయినాఁడనియు, అగ్నిలో దాఁగినదనియుఁ గల్పించినవారు దీనికేమి చెప్పెదరు. సత్యచరిత్రము వేఱు, భక్తికల్పితము వేఱు. భక్తిభావనచే సత్యము చెఱుపరాదు.

ఉ. ఎవ్వరు మీర లీ యడవి ♦ నిట్లు జటాజినధారులై కడుం
గ్రొవ్విన ఖడ్గచాపశర ♦ కోటి ధరించి చరింప భార్యతోఁ ?
జవ్వని యేల మానుల ? క ♦ సాధుచరిత్రకులార ! చూడ మీ
నవ్వడి వేఱు, పాపులరు ♦ చావఁగలారు, మునీశదూషకుల్. ౨౧

జటాజినధారులై =జడలు చర్మములు ధరించినవారలై, ఖడ్గచాపశరకోటిఁ= కత్తి, విల్లు, బాణములును, జవ్వని=యువతి, అసాధుచరిత్రకులార = చెడునడవడిగలవారలారా, నవ్వడి = జాడ, మునీశదూషకుల్= మునీశ్వరుల కపకీర్తి తెచ్చువారు, ఋషివేషమునకు విరుద్ధములగు నాయుధధారణము స్త్రీ సంగ్రహణ మపకీర్తికరములని భావము, భార్యతోఁ=విరాధుఁడు శ్రీరామలక్ష్మణులు నిరువురను జూచి సంబోధించుచు నీపద ముపయోగించుటచే వాఁ డిరువురు నొకతెనే భార్యగాఁ జేసికొనిరని యభిప్రాయపడి, యది దుష్టకార్యము గావున నసాధుచరిత్రకులార యనెను. కొందఱు దీనిని మఱియొకవిధముగ సమర్థింపఁజూచెదరు. భార్యయనఁగా భార్యయు వదినెయు నగు స్త్రీతో నని లక్షణావృత్తిచే నర్థము. ఎట్లన 'ప్రాణభృతి ఉపదధాతి' యను శ్రుతివాక్యమున ప్రాణభృతి యనుపదమునకు ప్రాణభృతులు నుభయులు నని యర్థము చెప్పఁబడెనుగదా. మఱియు నీన్యాయము 'ఋతం పిబంతౌ' యనుశ్రుతి

వాక్యము ననుసరించియున్నది గదా. కాఁబట్టి యిట నట్లే యర్థము చెప్పుట యుక్త మందురు. ఎట్లర్థము చెప్పినను సీత లక్ష్మణు భార్య యని విరాధుఁడు చెప్పెనని తప్ప ర్థము తోఁపకమానదు. అది ధ్వనిదోషమగును. కావున నీయర్థము సరిగాదు. వీరి వావివరుసలు విరాధున కేమి తెలియును? ఇరువురు మగవారు ఒకస్త్రీ యుండుటచే వా రిరువురకు నామె భార్య యనియే తలఁచెననుటయే సరియగు విధము. విరాధుఁడు లక్షణ గ్రంథములు చదివి లక్షణావృత్తి నెఱిఁగి సీతాలక్ష్మణులు వదిన మరఁదులని గ్రహించియుండడే నేని మునీంద్ర దూషకులని యేలదూషించెను? విల్లు బాణములు ధరించుటచే నందు రేని అగస్త్యుఁడు విల్లు బాణములు ధరించి వేఁటాడుచుండినవాఁడు కాఁడా – అది పూర్వకాలమున మునివిరుద్ధ చర్యకాదు. పరశురాముఁ డెవ్వఁడు?

తాత్పర్యము

మీ రెవ్వరు? ఋషులవలె జడలు, చర్మములు ధరించి మిక్కిలి పొగరుపట్టి కత్తి విల్లు బాణములు పూని భార్యతో నడవియందు సంచరించుచున్నారు. మునీశ్వరు లకు వయస్సాఁడుది యేల? దుష్టప్రవర్తనము గలవారలారా! మీజాడ వేఱుగాఁ గానవచ్చుచున్నది. మీరు పాపాత్ములు, మునుల కపకీర్తి తెచ్చువారు, మీరు నాచేఁ జావఁగలరు.

ఋషీశ్వరులకు భార్యలులేరా? అగస్త్యుఁ డాయుధములు ధరించి వేఁటాడ లేదా. ఇందేది ఋషులకు విరుద్ధచర్య? ఋషులకు భార్య లున్నను వారి నాశ్రమము లందే యుంచి మగవారు మాత్రమే బయట సంచరింతురుగాని వెంట వేసికొని తిరుగరు. ప్రయాణమై పోవుచున్నా రనిన నిరువురకు నొక భార్య యుండదు. ఇది వాని దృష్టికి విరుద్ధచర్యగాఁ దోఁచినది.

చం. వినుఁడు విరాధనామకుఁడ ♦ వీరుఁడ సంభృతశస్త్రపాణి నై
మునిజనమాంసఖాది నయి ♦ మోదమునం జరియింతు నీ వని౯
మునుకొని పాపశీలుర మి ♦ ముం బొరికొంచని నల్ల ద్రావి యీ
వనితను నాదు పెండ్లముగ ♦ వారక కైకొనువాఁడ నమ్ముఁడీ. ౨౨

సంభృతశస్త్రపాణినై = శస్త్రములను జేత ధరించినవాఁడనై, మునిజనమాంస ఖాదిని = మునుల మాంసమును భక్షించువాఁడను, అని౯ = యుద్ధమందు, నల్ల = నెత్తురు.

తాత్పర్యము

నా వృత్తాంతము చెప్పెద వినుఁడు, నా పేరు విరాధుఁడు, వీరుఁడను గావున నాయుధములు చేత ధరించి మునిజనులఁ జంపి వారి మాంసమును దినుచు సంతోష ముతో నీ యడవియందు సంచరించుచుందును. పాపాత్ములగు మిమ్ము యుద్ధమందుఁ జంపి మీ నెత్తురు ద్రావి యీయాఁడుదానిని నా పెండ్లాముగఁ జేసికొందును, నమ్ముఁడు.

కం. అనుచు విరాధుఁడు గావర, మునఁ బల్కినపల్కు విని ప్ర ♦ భూతవుభీతిన్
జనకసుత యోరుగాలికిఁ, బెనుపఱి కంపించు కదళి ♦ విధమున వడఁకెన్. ౧౭

గావరమునన్=గర్వమున, ప్రభూతవు భీతిన్ = అధిక భయముచే, పెనుపు అఱి = పెంపు చెడి, కంపించు = వణఁకు, కదళి = అరఁటిచెట్టు.

తాత్పర్యము

ఆ విరాధుఁడు చెప్పిన మాటలు విని సీతాదేవి మిగుల భయపడి పెద్దగాలికి నరఁటిచెట్టు వలె వడఁకెను.

కం. సీతాఁగని సాధ్వసమతి, దైతేయాధిపతియంక ♦ తలమున వణఁకన్
పీతసహజముఖరుచియై, సీతాపతి యనుజుతో వ ♦ చించెను వనటన్. ౧౮

సాధ్వసమతి = భయపడిన మనస్సుగలది, దైతేయాధిపతి = రాక్షసశ్రేష్ఠుని యొక్క, పీత=పోయిన, సహజ=స్వభావసిద్ధమైన, ముఖరుచియై= ముఖకాంతిగలదై, వనటన్ = దుఃఖముతో.

తాత్పర్యము

సీతాదేవి భయపడినదై స్వభావసిద్ధమైన ముఖకాంతి చెడి తెల్లఁబోయి రాక్షసుని రొండియందు వణఁకుచుండుట చూచి శ్రీరామచంద్రమూర్తి దుఃఖించుచు లక్ష్మణునితో నిట్లనెను.

ఉ. కంటివె లక్ష్మణా జనకు ♦ గాదిలిపుత్త్రిక నాదు భార్య వా
ల్గంటి నితాంత సౌఖ్యరత ♦ క్ష్మావరనందిని భవ్యశీల లో
నంటినభీతిఁ గ్రూరదను ♦ జాధము నంకమున న్వణంకెడిన్
బంటవలంతికన్న కెటు ♦ వంటి మహాపద వచ్చెఁ దమ్ముఁడా. ౧౯

గాదిలి=ప్రియమైన, వాల్గంటి = నిడుపాటి కన్నులు గలది, నితాంతసౌఖ్యరత= మిక్కిలి సౌఖ్యమందుఁ బ్రీతిగలది, క్ష్మావరనందిని = రాచకూఁతురు, భవ్యశీల=శుభకరమైన నడవడి గలది, లోన్=మనస్సులో, పంటవలంతి కన్నకు = భూమిపుత్త్రికకు.

తాత్పర్యము

లక్ష్మణా! జనకమహారాజు ప్రియపుత్త్రి, నా భార్య, నిడివికన్నులు గలది, రాచబిడ్డ, మిగుల సుఖ మపేక్షించునది యగు సీతాదేవి మనస్సులో నాటిన భయముచే రాక్షసు రొండియందు నెట్లు వణఁకుచున్నదో చూచితివా? తమ్ముఁడా! భూమి కన్యకకు నెటువంటి గొప్ప యాపద వచ్చెరా!

ఉ. ఏయది కోరి కానలకు ♦ నేగు మనన్నను మధ్యమాంబ కై
కేయి ఫలించె నిప్పు డది, ♦ కీప్రగతిం దన పట్టి రాజ్యముం
జేయుటమాత్ర గోరక వి ♦ శిష్టజనప్రియు నన్నుఁ గానలన్
ద్రోయఁగ దీర్ఘదర్శిని మ ♦ నోవిభుఁ గోరుట దీనికే కదా. ౨౦

మధ్యమాంబ=నడిమితల్లి, కౌసల్యాసుమిత్రలతోఁడఁ జెప్పినపుడు కైక మూఁడవది, భార్యల నందఱ నుద్దేశించి చెప్పినపుడు మధ్యమ లేక మఱియొక విధమున సమాధానము చెప్పవచ్చును. భారతమందు 'కుంతీసుతమధ్యముండు సమరస్థేమాభిరామాకృతిః,' అని యర్జునుఁడు చెప్పఁబడెను. కావున మధ్యముఁ డనఁగా మూఁడవ వాఁడని సమాధానము చెప్పుదురు. అటుగాకున్నఁ గుంతీపుత్రులలో నర్జునుఁడు నడపటివాఁడే కదా. శ్రీ ప్రకృతిః=శ్రేష్ఠురాలుగా, తనపట్టి=తనబిడ్డ, తన కొడుకు. పట్టి శబ్దము బిడ్డశబ్దమువలెఁ గొడుకునందుఁ గూఁతునందు వర్తించును. అపత్యశబ్దమువలె. విశిష్టజన ప్రియుః=అందఱ జనులకుఁ బ్రియుఁడైన వానిని. కైక రామచంద్రమూర్తిని నడవులకుఁ బంపఁగోరుటకు నాయన విశిష్టజనప్రియుఁ డగుటయే కారణము, దీర్ఘదర్శిని = దూరాలోచనగలది, మనోవిభుః = భర్తను, దీనికే = సీతాదేవి యిట్లు హరింపఁబడుటకే.

తాత్పర్యము

కైకేయి తాఁ బ్రయోజనముఁ గోరి నన్నడవులకుఁ బొమ్మనికోరెనో యది మిగులఁ దడవులేక యల్పకాలమందే లభించెను. ఆమె దూరాలోచన కలది కావున సర్వజనప్రియుఁడగు నేను నగరంబున నున్న భరతునకు రాజ్యము స్థిరపడదు. ప్రజలందఱు నతనికి వశపడరు; పైపెచ్చు నాయందలి ప్రీతిచే నతనితో విరోధింతురు, కావున నన్ను నడవులకుఁ బంపిన నావెంట సీతాదేవి పతివ్రత కావునఁ దప్పక వచ్చును. ఈ యడవులందే రాక్షసులవాతఁబడియో కష్టములు సహింపలేకయో చచ్చును. ఆమె చచ్చినా రాముఁడు బ్రదుకఁడు. ఆమె తోఁడ వాఁడును జచ్చును. రాజ్యము భరతునకు స్థిరపడును. అని యిట్లాలోచించి కదా తనకొడుకునకు రాజ్యముమాత్రము కోరక నన్ను నడవులకుఁ బొమ్మనెను. ఆమె కోరిక కొలఁదికాలమందే ఫలించెను.

కైకేయి తొలుతఁ దెలివితక్కువ దగుటచేఁ గాముకయై రాముని రాజ్యభ్రంశము గోరినను ఆవల సౌమ్యయై యా యభిప్రాయము వదలినట్టు చిత్రకూటంబునందలి చరిత్రమువలనఁ దెలియనగును గదా! అట్లు పశ్చాత్తాపపడిన పిమ్మట దోషుల దూషింపవచ్చునా?

చిత్రకూటమందలి చరిత్రము వలనఁ గైక యభిప్రాయము మాఱినదని చెప్పవలనుపడదు. ఆమె కట్టి మనస్సుండినఁ దన దోషమును జెప్పి యొప్పుకొని యూరికి రమ్మని ప్రత్యేకముగఁ బిలిచి యుండవచ్చును. ఆ మాట యామె నోర రాలేదు. భరతుఁడు తల్లికి బుద్ధిచెప్పితి ననెను. కాని యా బుద్ధి యెంతమాత్ర మామె తల కెక్కెనో తెలియదు. రాముఁ డూరికి రాకపోయిన భరతుఁడు రాజ్యముచేయక యేమి చేయఁగలఁడు అను నభిప్రాయ మామె గలదై యుండవచ్చును. అట్టులే యనుకొందము. అయినను,

సత్పురుషులకుఁ బరులు నింద్యులైనను నిందింపవచ్చునా? కావున రాముఁడు పరుల దోషములను హృదయమునఁ గలవాఁడు కాకపోలేదు, అవి మనస్సున నాఁటి యుండినను బైకి నిర్మత్సరునివలె నటించెను.

అట్లు చెప్పఁబనిలేదు. ఎదుటివారి దోషములు మఱచిపోయినను కష్టములు ప్రాప్తించినపుడు అవి మనస్సునకు రాకపోవు. మన స్వవిషయమునందుఁ బరాపకారమో బాధయో మఱచియుండినను ఏదైన సందర్భము పడినపు డది జ్ఞప్తికి వచ్చుట లేదా?

సామ్యదశయందు మనోగత మెంతదాఁచినను తీవ్రశోకమునందు స్వప్న మందుఁ బానాదులచేఁ గాని యితర కారణములచేఁ గాని మనస్సు స్వాధీనమందు లేనపుడు మనస్సునందున్నట్లు బయలుపడును, అను నీతి దీనివలన నెఱుఁగనగును.

కం. జనకుని మరణముకంటెను, గన రాజ్యశ్రీ హరణము కంటెను సీతా
వనజాక్షి నన్యుఁ డంటుట, ఘనతర మగు దుఃఖమునకుఁ గారణ మయ్యెన్. ౨౧

ఇప్పు డేమి యంత విపత్తు వచ్చెను? ఏల దుఃఖించెద వనఁ జెప్పుచున్నాఁడు. రాజ్యశ్రీ = రాజ్యలక్ష్మి, హరణము = అపహరింపఁబడుట.

తాత్పర్యము

జనకుని మరణవార్త వినుటవలనఁ గలిగిన దుఃఖముకంటెను రాజ్యము పోవుట వలనఁ గలిగిన దుఃఖముకంటెను సీతాదేవి నితరుఁడు తాఁకుట మిగుల దుఃఖమును గలిగించెను.

ఇచ్చటఁ జిన్నసందేహము: రాజ్యశ్రీ హరణముకంటె సీతాహరణ మెక్కువ దుఃఖము కలిగించె ననుటచే రాజ్యహరణము కొంచెమైన దుఃఖము కలిగించెఁ గదా! అయోధ్యాకాండమందుఁ దనవలనఁ బరులకుఁ గలిగిన దుఃఖమునకై తాను దుఃఖించెను, గాని రాజ్యము పోయెనని దుఃఖింపలేదని చెప్పఁబడెనే, అదియెట్లు?

శ్లో॥ మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణ సుఖదుఃఖదాః
ఆగమాపాయినోఽనిత్యా, స్తాం తితిక్షస్వ భారత. భ॥ గీ.

చలివేఁడుములు సుఖదుఃఖములు లోనైనవి మనము వల దన్నను గావలయు నన్నను వచ్చును బోవును, నిత్యములు గావు. కావున వీనిని సహించుకొనుము, అని కృష్ణభగవానుఁ డుపదేశించెను. సహించుకొమ్మని చెప్పెనుగాని యవి యంట కుండఁ జేసికొమ్మని చెప్పలేదు. ఏల? అది యసాధ్యకార్యము. కావున బుద్ధిమంతుఁ డగువాఁ డవి వచ్చినపుడు రానిమ్మని వానిని దనవశమున నుంచుకొనును గాని వానికి వశపడి యజ్ఞుని వలె సంతోషశోకములకుఁ బాలుపడఁడు. ఇది యోగిలక్షణము. సుఖము దుఃఖము మనస్సునకే తగులదని యీ జీవి తాయిమై యుండవలయును. చెట్లు కూడ శీతోష్ణబాధలు గల చిహ్నములు కనఁబఱచును, మనస్సున కంటనిది లేనట్లే.

కం. అని శోకబాష్పయుతలో, చనుఁడై వగపడెడి రామ ♦ చంద్రుని మోముం
గని క్రుద్ధుండై లక్ష్మణుఁ, డనియెన్ రోఁజుచును మారు♦తాశనలీలన్. ౨౮

శోకబాష్ప=శోకముచేఁ గలిగిన కన్నీళ్ళతో, యుత=కూడిన, లోచనుఁడై=కన్నులు గలవాఁడై, వగపడెడి=దుఃఖించు, రోఁజుచును=బుసకొట్టుచు, నిట్టూర్పులు విడుచుచు, మారుతాశనలీలన్=పామువలె, పాములకు గాలి యాహారము.

ఇచ్చట శ్రీరామచంద్రమూర్తి కన్నీరుగాఱ నేడ్చెనని యున్నది. ఆపదలందు ధైర్యగుణము సజ్జనలక్షణ మని నీతిశాస్త్రము చెప్పుచుండ శ్రీరామచంద్రమూర్తి యేల యేడ్చెను?

1. విరాధుఁడు సీత నెత్తికొనిపోయెను. ఇఁకఁ దనకు భార్య యనునది లేదనియా?

2. విరాధునిఁ దాను వధించినను విరాధుఁడు సీతను దాఁకెను గావున నామె పాతివ్రత్యము చెడెను. ఆ కారణముచే నిఁక నామెను భార్యగా స్వీకరింపరాదనియా?

3. సవతితల్లి కోరికయే నెఱవేఱెననియా?

4. రాక్షసుని చేతిలోఁ జిక్కి సీత యేమి బాధపడునో యనియా?

5. వానప్రస్థాశ్రమమునం దుండి హింసమాని తపంబుసేయఁ దలఁచు నాకీ హింసాకర్మము దాపరించెనే యనియా?

ఉత్త:—మొదటిదికాదు. పదునాలుగు సంవత్సరములు సీతారాములు బ్రహ్మచర్యదీక్ష వహించియుండిరి. సీతాదేవి తనకు వనయాత్ర దేహయాత్ర సుఖముగా జరుగుటయందు సహాయురాలని దుఃఖించెనే కాని రతిసుఖము లేదాయెనని యేడ్చిన వాఁడు కాఁడు. (ప. ౯౯౯-౧౦౦౦.)

రెండవదికాదు. పదినెలలు తన పరోక్షమున రావణాసురు స్వాధీనమందుండిన సీతయందుఁ దనకుఁ సందేహము లేదని చెప్పెను. అట్టివాఁడు తన యెదుటనే యున్నప్పుడు సందేహించునా? ఆమె దుఃఖ మా సందేమును బరిష్కరించుచున్నది.

మూఁడవదికాదు. కైకకోరిక నెఱవేఱునని తోఁచియే యుండినయెడలఁ బదునైదవ సంవత్సరము ప్రథమదినంబున నయోధ్యకు వచ్చెదమని చెప్పియే యుండఁడు. కనుక నా సందేహ మాయనకు లేదు.

నాలవదికాదు. సీతాదేవిని రాక్షసుఁడు చంపునని బాధపెట్టునని శ్రీరాముఁడు భయపడ లేదు. వాఁడట్టి కార్యము చేయఁజాలఁడని తెలియును.

ఐదవదియుఁ గాదు. వానప్రస్థాశ్రమ మందుండిన ఋషీశ్వరు లగస్త్యాదులు మాంసశ్రాద్ధము పెట్టుచుండిరి. అంతియగాక శ్రీరామచంద్రుఁడే మాంసాహారము గ్రహించినటు లొకటిరెండు చోటులఁ జెప్పఁబడెను. (ఇది సందిగ్ధవిషయము.) కావున నిదియు సరియైనఁగారణము గాదు. అసాధుహింస హింస గాదు. 'అహింసాఽసాధుహింసేతి శ్రేయాన్ ధర్మ పరిగ్రహః॥' భా. 12-15-49.

అటయిన వేఱొక కారణ మేమియనఁ గొందఱు విరాధుఁడు సీతాభర్తృఁడు, అట్టి వానిని జంపవలసి వచ్చెనే యని దుఃఖించె నందురు. వాస్తవకారణము రామచంద్రమూర్తియే పంటవలంతి కన్న కేటువంటి మహాపద వచ్చెఁ దఃఖ్మిఁడా యని తెలిపెను. ఇది యాశ్రిత విరహాసహన మను మార్దవ గుణమును పరదుఃఖాసహన మను కారుణ్యమును దెలుపును. "వ్యసనంబులు జనములకును బొసఁగినఁ దా నధిక దుఃఖమును బొందును." (అయోధ్య. ౬౬.) అనుదాని కిది లక్ష్యము.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి శోకముచేఁ గన్నీళ్లు కన్నులఁ గ్రమ్మఁగా వ్యసనపడుచున్న శ్రీరామచంద్రమూర్తి ముఖముఁజూచి కోపించి పామువలె బుసకొట్టుచు లక్ష్మణుఁ డిట్లనియెను.

శా. గీర్వాణాధిపతేజ! భూతములకుం ♦ గీర్తింప నాథుండవై
గర్వంబేది యనాథు నట్లు కడు దుః ♦ ఖం బందె దేలన్న? కిం
కుర్వాణుండను నేను లేనె? యిదె మ ♦ త్క్రూరాస్త్రధారాహతిన్
దుర్వారోద్యమబాహుకేళిని విరా ♦ ధు న్నేలపా ల్చేసెదన్. ౨౯

గీర్వాణాధిపతేజ = దేవతలకుఁ బ్రభువైన విష్ణుని తేజస్సువంటి తేజస్సుగలవాఁడా, గీర్వాణులు = దేవతలు, వీరిలో బ్రహ్మేంద్రాదులు చేరినవారే, వీరి కందఱకు నధిపతి భగవంతుఁడు విష్ణువే. కావున విష్ణుతేజా యనియే యర్థము చెప్పవలయును. అటుల చెప్పిననే భూతములకు నాథుండవై యనువాక్యముతో సామరస్యము కుదురును. విష్ణువు భూతముల కన్నిటికి నాథుఁడు కదా, భూతములకు సమస్త చరాచర రూపక ప్రాణులకు, గర్వంబేది = గర్వముచెడి, అనాథునట్లు = దేబవలె, కింకుర్వాణుఁడను = దాసుఁడను = ఏమి చెప్పినను జేయువాఁడు, మత్ = నాయొక్క, క్రూరాస్త్రధారా = క్రూరములైన కఱకు బాణముల, హతిన్ = దెబ్బచే, దుర్వార = అడ్డగింపరాని, ఉద్యమ = ప్రయత్నముగల, బాహు = భుజముల, కేళిని = ఆటలయందు, నేలపాల్ చేసెదను = నేఁలబడఁగొట్టెదను.

భూతములకుం గీర్తింప నాథుండవై యనుటచే స్వరూపజ్ఞానమును స్మరింపఁజేయుచున్నాఁడు. తన్ను నమ్మివచ్చిన దాని కింతకష్టము వచ్చెనేయని శోకావేశముచేఁ గలిగిన స్మృతి దొలఁగ స్వరూప స్వభావము స్మృతికిఁ దెచ్చుచున్నాఁడు. కావున వాస్తవార్థము వారు తెలియనివారు గారు. ఈ ప్రకారము లక్ష్మణుఁడు యుద్ధకాండమందు సీత నింద్రజిత్తు చంపెనని హనుమంతుఁడు చెప్పినపుడు రామచంద్రమూర్తి శోకావేశముచే మైమఱచియుండ "నిను మహాత్ముఁడైన యాత్మని నెఱుఁగలేక కట నీవ యిట్లు తపియింపఁజేయ నేనేమి నేర్తు"నని చెప్పెను. 'స్మారయే త్వాం న శిక్షయే' నీకు జ్ఞప్తికి దెచ్చుచున్నాను. కాని నేర్పలేదని సీతాదేవి చెప్పినట్లు లది స్మృతికిఁ దెచ్చుటమాత్రమే. పరులదుఃఖము తన దుఃఖముగా నెంచుకొనుటే దయ.

తాత్పర్యము

విష్ణుతేజా! సమస్త భూతకోటికి నీవే దిక్కయ్యుఁ దేజస్సత్వము విడచి దిక్కు లేని వానివలె నేల యిట్లు దుఃఖించెదవు. ఇప్పుడేమి చెడినదని నీకింత దుఃఖము, ఏ పనినైనఁ జేయుటకు నీ సేవకుఁడు వీఁడు లేఁడా? నీసేవచేయుటకే గదా వీఁడు వచ్చుట. అట్లైన నిప్పుడు నీ వేమి చేసెద వందువా, నా కఱకుబాణములచే వీనిని నా భుజ ప్రతాపకేళి నేల బడఁగొట్టెదను. వీఁడెక్కడికిఁ బోఁగలఁడు.

కం. భరతునిపైఁ బుట్టినదు,ర్భరకోపము నేఁడు వీని♦పై, శైలముపై
సురపతి వజ్రము విడిచిన, కరణిని నే విడుచువాఁడ♦ గాకుత్స్థవరా. 30

దుర్భరకోపము=సహింపరాని కోపము

తాత్పర్యము

ఆనాఁడు భరతునిపైఁ బుట్టిన కోపమునకు నాయన శరణాగతుఁ డగుటచేఁ బరిహారము లేక వ్యర్థమయిపోయెను. ఆ కోపమును నింద్రుఁడు కొండమీఁద వజ్రమును విడిచినట్లు వీనిపై విడిచెదను.

భరతుఁడు శ్రీరామచంద్రమూర్తిని జిత్రకూటమందు నీ వయోధ్యకు వచ్చి రాజ్యమేలు మని ప్రార్థించెను గదా. దీనివలన ముందు చేసినది యజ్ఞానకృత మని యేర్పడెను గదా.

అట్లుండ రామలక్ష్మణులు భరతాదులు రాజ్యాపహారకు లని యాక్షేపించుట తప్పుగాదా యని యాక్షేపము.

సీతారామలక్ష్మణులకు ముప్వురకుఁ జిత్రకూటమునకు భరతుఁడు వచ్చి పోయిన పిమ్మట నాయన విషయమై సదభిప్రాయమే కాని దురభిప్రాయము లేదు.

భ్రాతలందఱు భరతుని పాటిగారని శ్రీరామచంద్రమూర్తి చెప్పెను. లక్ష్మణుఁడో (అరణ్య. పద్యములు ౨౭౦ మొదలు ౨౭౮ చూడుఁడు) "మనుజులలోను దండ్రిని గుమారుఁడు పోలఁడు పోలుఁదల్లినే యనియెడి లోకవార్త వృథయై చనెఁ గైకయిపట్టియందు" నని చెప్పెను. సీతాదేవియు "భ్రాతృవత్సలుఁడైన భరతుండు నాకయి యక్షౌహిణీ సేన నంపునయ్యా" అని ప్రీతితోనే పలికెను.

కైక విషయమందు ముప్వురు ప్రసన్నులు గాను, నిష్ఠురము లాడుచుండిన వారే, ఏల?

కైక చిత్రకూటమందు నేను దెలివిమాలిన పని చేసితిని క్షమింపుమని శ్రీరామచంద్రమూర్తిని గోరలేదు. భరతునకు భయపడి యాయనకు నెదురాడలేక మౌనము వహించి యుండెనుగాని వాస్తవముగ నామె పశ్చాత్తప్తయైనదా యనునది సందిగ్ధ విషయమే. తన కొడుకుకూడ వానప్రస్థాశ్రమస్థునివలె సర్వభోగములు వదలి దుఃఖపడుచున్నాఁడే. శ్రీరామచంద్రమూర్తి మరల నయోధ్యకు వచ్చిన రాజ్యము లేకున్న మానెను. కడుపునిండఁ గూడు కంటినిండ నిద్ర ఒడలినిండ గుడ్డయైనఁ

గట్టుకొని సుఖపడనిమ్మని రామచంద్రమూర్తి యయోధ్యకు వచ్చుటకు సమ్మతించి యైన నుండవచ్చును. లేదా తా నాలోచించిన ప్రకారము శ్రీరామచంద్రమూర్తి యడవిలో మరణించెనా భరతుఁడు రాజ్యము గ్రహింపక యేమి చేయఁగలఁడు. కావున రామచంద్రమూర్తి యయోధ్యకు రాకపోనిమ్మని తలచినను దలఁచియుండ వచ్చును. ఇది యిట్లని నిర్ధారింపఁదగిన యాధారములు లేవు. ఆమె పశ్చాత్తాపపడి నట్లు భరతుని వాక్యము దప్ప మఱి యే యాధారములేదు. ఒకవేళ పశ్చాత్తప్త యైనదనియే గ్రహింతము. పగవాని కొట్టుగాల్చి వాఁతవేసి నాయనా తెలియక చేసితినిరా యని చెప్పినంత మాత్రమున బాధపోవునా! తెలియకచేసెనని సమా ధానపడినను వ్రణము సహింపరాని బాధకలిగించినపుడు డామె యిట్లు చేసెఁగదా యని స్మరణమునకు రాకయుండునా? కావునఁ గైకను సీతారామలక్ష్మణు లెగ్గాడుట స్వభావవిరుద్ధము కాదు. దీనిపై నొక యాక్షేపము. ఓయీ నీవు చెప్పినది లోక సామాన్యవిషయము. శ్రీరామచంద్రమూర్తి లోకసామాన్యుఁడుగాఁడు, "అపకార శతము సల్పిన విపరీతము నెంచఁ డాత్మవిజ్ఞుం డగుటన్" అని కదా యాయన విష యము చెప్పఁబడెను. "వానియెడ నుండెనేని నేదేని దోష మద్ది గర్హ్యంబుగాదు సదాఖిలకును" యుద్ధ ౩౬౫ ప. ఇట్టి రామచంద్రమూర్తి కైకయందు దోష మెంచ వచ్చునా? శ్రీరామచంద్రమూర్తి యపరాధము లెంచమి యెప్పుడు? యావజ్జీవము దోషములే చేయుచుండినను వాని నెంచఁడా? కొంతకాలముచేసి పశ్చాత్తప్తుఁడై రక్షింపుమని కోరినప్పుడా? అపరాధమే మనస్సునకు రాదనిన విరాధ రావణ వాలి ఖరదూషణ లవణాదుల దండింపవలసిన కారణమేలేదు. 'వినాశాయచ దుష్కృ తా'మ్మను మాటయే వ్యర్థమగును. లోకమున నింటింటఁ బాపములు ప్రబలిపోవును. గృహమునందు భార్యలు బిడ్డలు సేవకులు దండనమునకు వెఱచి లోబడియున్నవారే కాని యధర్మమునకు వెఱచి ధర్మమార్గమందుండువారు నూటికొక్కరులేరు. అట్లులే దేశమందును ప్రజలు రాజదండభీతి ధర్మమందున్నవారు కాని ధర్మము నిమిత్తమై ధర్మమందుండువారు లేరు. భగవంతునియందుఁ బ్రభువునందు గృహస్థునియందు నిగ్రహశక్తి లేకుండిన లోకయాత్ర యొకనాఁడైన జరుగదు. కావున నెవ రెన్ని దోషములు చేసినను పాహి పాహి యని పాదములపైఁ బడిన వారిని వారి దోషము లెంచక రక్షించును. సీత రావణుని కిదియేకదా బోధించెను.

'తా నహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్ క్షిపామ్యజస్ర మశుభా నాసురీ ష్వేవ యోనిషు.' భ-గీ. అట్టి విరోధులను క్రూరులను నరాధము లను సంసారమందు సర్వదా యసురయోనులందుఁ ద్రోయుదును' అనియే భగ వంతుఁడు చెప్పెనుగదా. "చెల్లియుండియు సైరణసేయునతఁడు" పుణ్యపురుషుఁడు గాని యసమర్థుని సైరణ శ్లాఘ్యమా? కావున శ్రీరామచంద్రమూర్తి కైకయందు దప్పెంచుట తప్పుగాదు. మఱియును నిది లోకవిడంబనార్థమని యెఱుంగవలయును.

కావున నిట్టి సందర్భముల నిట్లు తలఁచుట దోషముగాదని మనము గ్రహింప వలయును.

కం. విస్ఫుట మద్భుజబల వే, గస్ఫురదిషునికర మితనిఁ ♦ గ్రక్కున వక్షః
ప్రస్ఫోటంబుగ నాటుచుఁ, బ్రస్ఫీతజవంబునం బ ♦ రాసుఁ జేయున్. ౩౧

విస్ఫుట=స్పష్టమైన, మద్భుజ=నా బాహువులయొక్క, బల = బలముయొక్క, వేగ=వేగముచే, స్ఫురత్ = పోవుచున్న, ప్రకాశించుచున్న, ఇషునికరముగ్ = బాణ సమూహమును, వక్షః ప్రస్ఫోటంబుగ=ఱొమ్ముచీల్చునట్లుగ, ప్రస్ఫీతజవంబునన్= మిక్కిలి యధికమైన వేగమున, పరాసుఁగన్=పీనుఁగును (ప్రాణములు పోయినవాని)'

తాత్పర్యము

స్పష్టమైన నా భుజబలముచే విడువఁబడి వేగముగఁ బోవు బాణముల సమూహము శీఘ్రముగ వీనిఱొమ్మును బగులఁజీల్చుచు మిక్కిలి త్వరతో వీని బీనుఁగును జేయును.

౩-వ సర్గము.

కం. అని బలియుండు సుమిత్రా, తనయుఁడు రాక్షసునిఁ జూచి ♦ దరహాసముతో
నని నెవ్వఁడ వోరీ యీ, వనమున నీ వేల తిరుగు ♦ వాఁడవు సుఖివై. ౩౨

దరహాసము = చిఱునవ్వు.

తాత్పర్యము

ఈ ప్రకారము శ్రీరామచంద్రమూర్తితోఁజెప్పి రాక్షసువంకఁ దిరిగి బలవంతుఁడైన లక్ష్మణుఁడు చిఱునవ్వుతో ఓరీ! నీ వెవ్వఁడవు. ఈ వనమునందు నీ వేల తిరుగుచున్నాఁడవు.

కం. అని యడుగ నా విరాధుం, డని వారలఁ జూచి యెవఁడ ♦ వని నన్నడుగం
గను జాలెడి మీ రెవ్వరు, చనియెద రెట కనిన రామ ♦ చంద్రుం డనియెన్. ౩౩

తాత్పర్యము

ఈ ప్రకారము లక్ష్మణుఁ డడుగఁగా వారినిఁజూచి విరాధుఁడు నావనమునకు మీరు వచ్చి నన్నెవ్వఁడ వని మీ రడిగెదరే; మీ రెవ్వరు? మీ రెచ్చటికిఁ బోవుచున్నారు. అనిన శ్రీరామచంద్రమూర్తి యిట్లనియె

కం. తెలియుము రా యిక్ష్వాకుసు, కులులము క్షత్రియులము వన ♦ గోచరులము ని
ర్మలవృత్తుల మెవఁడవు? కా, నలలోనఁ జరింపఁ గార ♦ ణం బేమి? యనన్. ౩౪

తాత్పర్యము

ఓరీ వినరా! మే మిక్ష్వాకువంశమునఁ బుట్టిన క్షత్రియులము, అడవియందుఁ జరించువారము. నీ వనుకొన్నట్లు మేము పాపాత్ములముగాము. నిర్దోషమైన నడవడి గలవారము, నీవేమి ప్రభావము గలవాఁడవు. ఈ యడవిలో నేల తిరుగుచున్నాఁడవు, అనిన వాఁ డిట్లనియె.

వసంతమంజరి. వినుము నాజనకుండు జయుఁ డను♦వీరుఁ డంబ శతహ్రదా
ఖ్య నిఖిలావనిఁ గల్గు దనుజని♦కాయ మెల్లవిరాధుఁ డం
చును వచించును నన్నుఁ దపమున ♦ సూర్యవంశ్య! వరంబు నేఁ
గొనితి శస్త్రముచేత మరణముఁ ♦ గూర దుండఁగ బ్రహ్మచేన్. 3౫

తాత్పర్యము

నా తండ్రి జయుఁడు, నాతల్లి శతహ్రద, విరాధుఁడని భూమియందలి దనుజు లెల్ల నన్నుఁబిలుతురు. నేను దపస్సుచేసి శస్త్రముచేతఁ జావకుండ బ్రహ్మచే వరముఁగొంటిని; వి + రాధుఁడు=ప్రేమ లేనివాఁడు, క్రూరుఁడని యర్థము, కావుననే యారాధింపఁ దగనివాఁడు, గౌరవానర్హుఁడు, దనుజులు నన్ను విరాధుఁ డందు రను టచే నిది తల్లిదండ్రులు పెట్టిన పేరుగాదు, వృత్తముచే వచ్చిన పేరు.

వసంత మంజరి, నభభరరవ గణములు.

౧3 వ యక్షరము యతిస్థానము.

౪౦. ఛేదనభేదనముల వ్యా, పాదింపం బడక యుండఁ ♦ బడసితి వరమున్
బైదలిని విడిచి పాఱుఁడు మేదిని బ్రదుకంగ నిష్ట ♦ మేనియు మీరున్. 3౬

ఛేదన = తునుకలు తునుకలుగ నఱకుటచేతను, భేదనములన్ = పగులఁగొట్టఁ బడుటచేతను, వ్యాపాదింపఁబడక = చంపఁబడక, పైదలి = స్త్రీ, సీతాదేవిని, పాఱుఁడు = పరువెత్తిపొండు.

తాత్పర్యము

నఱుకఁబడుటచేతను జీల్పఁబడుటచేతను జంపఁబడక యుండునట్లు వరము సంపాదించితిని. బ్రదుక నిష్టముండిన నీ స్త్రీని వదలి మీరు పరుగెత్తిపొండు, ఈ స్త్రీని నాకు వదలిరేని మిమ్ముఁ జంపను.

రామలక్ష్మణులు విరాధుని వధించుట.

చ. అన విని కోపరక్తనయ ♦ నాంబుజుఁడై రఘురాముఁ డిట్లనున్
దనుజకులాధమా! ఖలగుణా! యిటు మృత్యువు రోసె దీవు, న
న్నని మొనఁ దాఁకియుం జనెద♦వా మెయితోడ, నటం చధిజ్య మౌ
ధనువున శాతమార్గణక♦దంబముఁ గూర్చి సురారి నేయుచున్. 3౭

కోపరక్తనయనాంబుజుఁడు = కోపముచే నెఱ్ఱనైన నేత్రకమలములు గల వాఁడు, రోసెదవు = వెదకెదవు, అనిమొనన్ = యుద్ధముఖమందు, మెయితోడన్ = దేహముతో, అధిజ్యము = ఎక్కుపెట్టఁబడినది, మార్గణ = బాణముల, కదంబము = సమూహము, సురారిన్ = రాక్షసుని.

తాత్పర్యము

ఈ ప్రకారము వాఁడు చెప్పఁగాఁ గోపముచేఁ గన్ను లెఱ్ఱచేసి శ్రీ రామ చంద్రమూర్తి యోరీ! నీచరాక్షసుఁడా! దుష్టుఁడా! నీవై మృత్యువును వెదకుచు వచ్చి

తివి. యుద్ధమున నా యెదుటఁబడి మరల దేహముతోడఁ బోఁగలవా యని విల్లెక్కుపెట్టి పదునైనబాణముల సమూహమున రాక్షసుని వేయుచు.

ఉ. వెండియు రుక్మపుంఖములు ♦ విశ్రుతవాయుసువర్ణ వేగితో
 చ్చండము లైన స ప్తశిత ♦ సాయకపంక్తి బుధారివక్షము
 ద్దండతఁ దూఱి వైన నది ♦ దారితదానవ దేహ శైల మై
 దండిగ రక్తదిగ్ధమయి ♦ ధారిణిఁ జొచ్చెఁ గృశానుతుల్యమై. ౩౮

వెండియుఙ్ = మఱియును, రుక్మపుంఖము=బంగారుపిడి, విశ్రుత=ప్రసిద్ధమైన, వాయు సువర్ణ=గాలి గరుడులయొక్క, వేగితోచ్చండము=వేగముచే మిగుల భయంకరమైన, సప్తశితసాయకపంక్తి = ఏడు పదునైన బాణములవరుస, బుధారివక్షము = రాక్షసుని ఱొమ్ము, బుధప్సురా సురే సౌమ్యే॥నా॥ దారిత=చీల్పఁబడిన, దానవ = రాక్షసునియొక్క, దేహశైలమై=పర్వతమువంటి దేహముగలదై, రక్తదిగ్ధము = నెత్తుటిచేఁబూయఁబడినది, కృశానుతుల్యమై = ఎఱ్ఱగా నుండుటచే నగ్నిహోత్రముతో సమానమైనదై.

తాత్పర్యము

మఱియును బంగారుపిడులు గలిగి గాలి యొక్కయు గరుడుని యొక్కయు వేగముగలవైన యేడు పదునైన బాణములు వానిఱొమ్ము దూఱిపోవునట్లు వేయఁగా నవి కొండవంటి వాని దేహముఁ బగులఁ జీల్చుకొని నెత్తుటితోఁ దడిసి యెఱ్ఱనై పోయి భూమిలోఁ బ్రవేశించెను.

చం. శరజనితోగ్రవేదనను ♦ జానకి డించియుఁ గేల శూలముఙ్
 సరభసవృత్తిఁ గొంచు రఘు ♦ సత్తమయుగ్మముఁ గిట్టి యార్భటుల్
 పరఁగ లయాంతకుం డనఁగ ♦ వక్త్రము విచ్చెడు నన్నదమ్ములుం
 గురిసిరి నిర్జరారి పయిఁ ♦ గ్రూరకలంబకదంబవర్షముఙ్. ౩౯

శర=బాణములచే, జనిత=పుట్టిన, ఉగ్రవేదనను=మిగులబాధచే, డించి = నేల విడిచి, సరభసవృత్తిఙ్ = తొందరపాటుతోఁ గూడిన వ్యాపారముతో, రఘుసత్తము యుగ్మము=ఇరువురు రాఘవులను, రామలక్ష్మణులను, కిట్టి = సమీపించి, లయాంతకుండు=ప్రలయకాలమునాఁటి యముఁడో యన, వక్త్రము=నోరు, నిర్జరారిపైఙ్ = రాక్షసునిమీఁద, క్రూర=తీక్ష్ణములైన, కలంబ = బాణములయొక్క, కదంబ = సమూహముయొక్క, వర్షముఙ్ = వానను.

తాత్పర్యము

బాణములు తాఁకుటవలనఁ గలిగిన బాధ సహింపలేక జానకిని నేల వదలిపెట్టి శూలము తీసికొని రామలక్ష్మణుల నిరువుర సమీపించి సింహనాదము చేయుచుఁ బ్రలయకాలమునాఁటి యమునివలె మ్రింగుటకై నోరు తెఱవఁగా రామలక్ష్మణు లిరువురు నా రాక్షసుమీఁద బదునగు బాణముల వర్షము గురియించిరి.

కం. ఆ మార్గణవృష్టికి నగి, భీమవపుష్మంతుఁ డగుచుఁ ♦ బెంచిన మేనిన్
భూమిని రాలెను విశిఖ, స్తోమము పతి పఱపె వెండి ♦ తోరపు ములుకుల్. ౪౦

మార్గణవృష్టికిన్=బాణవర్షమునకు, నగి= నవ్వి, ఇంతమాత్రమా మీ శౌర్యమని నవ్వెను. భీమవపుష్మంతుఁడు=భయంకరమైన పెద్దదేహము గలవాఁడు, విశిఖస్తోమము = బాణసమూహము, తోరపుములుకుల్ = విశేషముగ బాణములు.

తాత్పర్యము

శ్రీరామలక్ష్మణులు వేసిన యీ బాణవర్షముచూచి మీబాణములు నన్నేమి చేయగలవని నవ్వి తన భయంకరమైన దేహమును బెంచెను. ఇట్లు దేహము పెరుఁగఁగా నాటియుండిన బాణము లన్నియు రాలి నేలఁబడెను. శ్రీరామచంద్రమూర్తి మఱియు విస్తారముగ గొప్ప బాణములఁ బ్రయోగించెను.

ఉ. వారలు వేయు శాతశర ♦ వర్షముఁ గన్గొని నవ్వె రక్కసుం,
డారక వారినుం గురిసి ♦ యుగ్రఖగంబులు, దాన నొచ్చి దే
వారి వరంబు పెంపునను ♦ బ్రాణము లెంతయుఁ జిక్కఁబట్టి యా
శూరుల వైచె వజ్రనిభ ♦ శూలమున న్గగనంబు వెల్గగన్. ౪౧

శాతశరవర్షము = పదునుగల బాణములవాన, రక్కసుండు = రాక్షసుఁడు, ఉగ్రఖగంబులు = భయంకరములైన బాణములు, దేవారి = రాక్షసుఁడు, చిక్కఁబట్టి=బిగఁబట్టి, వజ్రముతోసమానమైన శూలముతో, గగనంబు=ఆకాశము,వరంబు పెంపునను = వరము వలన వచ్చిన యాధిక్యముచే, ఇచ్చట నీ వర మిచ్చినవాఁడు శివుఁడని మహేశ్వర తీర్థీయము. "విరాధో హాటకపురే విధివన్మా మపూజయత్ మదనుగ్రహాద్వై శస్త్రా దవధ్య స్స సురాసురైః" అను శ్లోక ముదహరింపబడెను. ౩౫ వ పద్యమున బ్రహ్మచేఁ దాను వరము గొన్నట్లు విరాధుఁడు చెప్పెను. వీఁడిరువురచేతను వరములు పొందెనేమో. ఖగము ఖ + గ = ఆకాశమునఁ బోవునది.

తాత్పర్యము

శ్రీరామలక్ష్మణులు కురియుచున్న పదునుగల బాణములవాన చూచి రాక్షసుఁడు నవ్వెను. వారును వదలక మీఁదమీఁద బాణములను బ్రయోగించిరి. దానిచే మిగుల నొప్పిచెందినవాఁడై యీ రాక్షసుఁడు ప్రాణములు పోకుండ బిగఁబట్టుకొని యీ శూరులపై నాకాశము వెలుగునట్లు వజ్రముతో సమానమైన శూలమును విసిరివైచెను.

కం. మండుచు వచ్చెడి శూలము, గండున రెండంబకముల ♦ ఖండించెను గో
దండగురుఁ డశని మేరువు, గుండన నది భూమియందువఁ ♦ గూలె న్నేలన్. ౪౨

గండునన్ = పౌరుషమున, బలమున, అంబకములన్ = బాణములచే, ఖండించెను = తునుకలుచేసెను, కోదండగురుఁడు = విలువిద్యయందు నాచార్యుఁడు, అశని = పిడుగు.

తాత్పర్యము

ముందుకు వచ్చుచున్న యా శూలమును జూచి శ్రీరామచంద్రమూర్తి దానిని రెండు బాణములచే నఱికెను. అదియును బిడుగు తాకున నేల దొరలు మేరువు నంవలి గుండువలె భూమి కంపించునట్లు నేలఁబడెను.

కం. శూలమును గూల్చి కృష్ణ, వ్యాలంబులఁ బోలు తమ కృ♦పాణంబుల దో
ర్లీల వెలుఁగంగ నడిచిరి, గాలాంతకతుల్యుఁ డప్ర♦కంప్యులఁ గేలన్. ౪౩

కృష్ణవ్యాలంబులు=నల్లత్రాచుపాములు, కృపాణంబులన్=కత్తులచే, దోర్లీల= భుజబలముయొక్క విలాసము, అడచిరన్ = కొట్టగా, కాలాంతకతుల్యుఁడు=ప్రలయ కాలమునాఁటి యమునితో సమానుఁడు, అప్రకంప్యులన్ = చలింపజేయ సాధ్యపడని వారిని, కేలన్ = చేతులతో.

తాత్పర్యము

వాని శూలము విఱిగి నేలఁబడఁగా రామలక్ష్మణు లిరువురు వానిమీఁద దుమికి నల్లత్రాచుపాములవలె నున్న తమ కత్తులతో వానిని గొట్టిరి. ధైర్యముచే నేమియుఁ జలింపక తన సమీపమునకు వచ్చియున్న వారలను బ్రలయకాలము నాఁటి యమునివంటివాఁడగు నా రాక్షసుఁడు.

తే. పట్టుకొని యెత్తుకొని మింటఁ ♦ బాఱె వాని
తలఁ పెఱుంగుచు రఘుపతి♦ దమ్ము ననియె
నితని యిచ్చకొలందిని ♦ నేగనిమ్ము
దనుజుఁ డరిగిన దే త్రోవ ♦ మనకు ననఁగ.

మింటన్ = ఆకాశమందు, పాఱన్ = పరువెత్తఁగా, తలఁపు = ఆలోచన.

తాత్పర్యము

వారి నిరువురను బట్టుకొని యెత్తికొని యాకాశమునఁ బరువెత్తెను. అడవి నడిమి ప్రదేశమునకుఁ దీసికొనిపోయి యక్కడ వధింపవలయు నన్న వాని యాలోచన తెలిసికొన్నవాఁడై శ్రీరామచంద్రమూర్తి 'లక్ష్మణా! వీనియిష్టము వచ్చిన త్రోవఁ బోపనిమ్ము! వాఁడు పోయిన దే మనకుఁ ద్రోవఁ' యనెను.

౪-వ సర్గము.

ఉ. మూఁపున వారి బాలకుల ♦ ముచ్చటఁ దాల్చి వనంబుఁబట్టి పో
దీఁవుర మద్దిగాంచి భయ ♦ తీవ్రత జానకి దుఃఖభారమున్
సైఁపక యేడ్చి బిగ్గఱగ ♦ సత్వరతన్ శుచి రాముఁ దమ్ముని
న్లేఁపఁగఁ గొంచుఁబోయెడిఁ గ ♦ దే దనుజుండు దయావిహీనుఁడై. ౪౫

బాలకుల ముచ్చటన్ = పిల్లవాండ్రనువలె, పోన్=పోఁగా, తీఁవురము=ఆగ డము, భయతీవ్రతన్ = భయముయొక్క యాధిక్యముచే, దుఃఖవారమున్=అతిశయ దుఃఖమును, సైఁపక = సహింపలేక, ఏఁపఁగన్ = బాధింపఁగ.

తాత్పర్యము

పిల్లవాండ్రఁ నెత్తుకొన్నట్లు వారిని భుజములమీఁది కెత్తుకొని యడవిదారిఁ బట్టి పోవుచుండఁగా నా యాగడము చూచి సీతాదేవి మిగుల భయపడి దుఃఖాతిశయము సహింపలేక 'యయ్యో రాక్షసుఁడు సత్యవాదియైన శ్రీరామచంద్రమూర్తిని నిర్మలాంతఃకరణముగల లక్ష్మణుని హింసించుటకై తీసికొనిపోవుచున్నాఁడే' యని గట్టిగా నేడ్చెను. సత్యవాది నిర్మలుఁ డను విశేషణములు శ్రీరామున కన్వయింపవచ్చును.

కం. నను మ్రింగు నిచట బెబ్బులు, లును దోడేళులును జిఱుత ♦ లును వినుము వా
రిని నన్నుఁ గొంచుఁ బొమ్మీ, దనుజోత్తమ నీకు మ్రొక్కెద ♦ దయఁగనవే. ౪౬

తాత్పర్యము

దానవోత్తముఁడా! నన్నొంటిగ విడిచి వారిని దీసికొని పోయితివేని నన్నిచ్చటఁ బెద్దపులులు తోడేళ్లు చిఱుతపులులు మ్రింగిపోవును. కావున వారిని వదలిపెట్టి నన్నుఁ గొనిపోయి చంపుము. అటులైన వారైనను సుఖముగ జీవింతురు. వారులేనియెడ నేను జచ్చినదాననే కావున నీకు నమస్కరించెదను. వారిని విడిచి నన్నుఁ గొని పొమ్ము.

చ. ధరణిసుతార్తవాక్యముల ♦ దాశరథుల్విని దైత్యుఁ జంపఁగాఁ
ద్వరపడి రందు లక్ష్మణుఁడు ♦ వామభుజంబును రామభద్రుఁ డా
శరు కుడిచేయియున్నఱక ♦ సాంద్రవలాహకసన్నిభుండు భీ
కరపవిధారఁ బర్వతము ♦ కైవడిఁ గూలె ధరాతలంబునన్. ౪౭

ధరణిసుతా = సీతాదేవియొక్క, ఆర్తవాక్యములన్ = వ్యసనముతోడి మాటలను, వామభుజము = ఎడమభుజము, ఆశరు = రాక్షసుని, అనఁగా, విరాధుఁడు లక్ష్మణుని కుడిభుజముమీఁద శ్రీరామచంద్రుని నెడమభుజముమీఁద నెత్తుకొనిపోవుచుండెను. కావున లక్ష్మణుఁడు వాని యెడమచేయి నఱుక సాధ్యపడెను. అట్లే శ్రీరామచంద్రమూర్తి కుడివైపు లక్ష్మణుఁ డుండెనని గ్రహింపనగు. సాంద్రవలాహకసన్నిభుండు = కారుమబ్బుతో సమానుఁడు. భీకరపవిధారన్ = భయంకరమైన వజ్రముయొక్క వాఁడి మొనచే.

తాత్పర్యము

సీతాదేవి యేడ్చిన మాటలు విని శ్రీరామలక్ష్మణులు రాక్షసుని జంపఁగాఁ ద్వరపడినవారైరి. అందు విరాధుని కుడిభుజమందున్న లక్ష్మణుఁడు వాని యెడమచేతిని నఱికెను. శ్రీరామచంద్రమూర్తి యెడమభుజమున నున్నవాఁడగుటచేఁ గుడిభుజమును నఱికెను.

ఇక్కడ భుజమనఁగా నంసముగాదు, రెట్టయనియే యర్థము చెప్పవలయును. అంసములమీఁద వారు కూర్చుండిన కారణముచేతను చేతులతో వారిని బిగఁబట్టియున్న కారణముచేతను రెట్టల నఱికిరని చెప్పవలయును. ఇట్లు నఱకఁగా నల్లని

మబ్బుతో సమానమైన దేహముగల యీ రాక్షసుడు వజ్రముచేఁ గొట్టఁబడిన పర్వతమువలె నేల దభాలునఁ బడెను.

ఈ విరాధుఁడు రావణాసురుని వంటి బలముగలవాఁడని యుద్ధకాండమునఁ జెప్పఁబడెను.

అటైన రావణాసురుఁ డొక లక్ష్మణుని మోయలేక పోయెను గదా. వీఁడు సీతారామలక్ష్మణుల ముగ్గుర నెట్లు మోయఁగలిగెను.

స్కాందపురాణమందలి యీ శ్లోకములను బట్టి దీనికి సమాధానము కుదుర్చుకొనవచ్చును.

అందు "సోపి తాం జానకీం దృష్ట్వా, శీఘ్రం సంజాత విక్రమః। ఇయం పరా మహాశక్తి స్స్వయం స్వర్గస్యకారణం, అస్యావిబోధో మోక్షేపి కారణం బంధనేపిచ। తస్మా దిమాం భజిష్యామి, దిష్ట్యా ప్రాప్తంహి దర్శనమ్। ఇతి దర్శనమాత్రేణ విముక్తాఘౌఘ పంజరః, భక్తియుక్తో జహారైనాం సీతాం చైతన్యరూపిణీమ్॥ స్కాందము.

వాఁడును జానకిని జూచి విక్రమించి "ఈమె మహాపరాశక్తి. ఈమెవలన స్వర్గప్రాప్తి కలదు. ఈమెను గుఱించిన విశేషజ్ఞానము మోక్షకారణము, తెలియమి బంధకారణము. ఈమెను నేను భజించెదను. నా యదృష్టవశముకొలఁది నాకీమె దర్శనము లభించెను." అని దర్శనముచేతనే పాపపుంజమునుండి విడివడి భక్తియుక్తుఁడై చైతన్యరూపిణి యగు సీతను హరించెను.

దీనివలన విరాధుఁడు లక్ష్మీభక్తుఁడని యేర్పడుచున్నది.

వీని పేరుకూడ భక్తుఁడనియే తెలుపుచున్నది. రాధశబ్దమునకు ఆరాధన మని యర్థము, వి + రాధుఁడు = విశేషముగ నారాధించువాఁడు, బ్రహ్మసూత్రమునందలి 'అపి సంరాధనే' యనుపద మీ యర్థము కలదై యున్నది. వీఁడు తమోగుణభూయిష్ఠుఁడగు తామసభక్తుఁడని వీని యాహారవిహారములు తెలుపుచున్నవి. అయినను భక్తుఁడు భక్తుఁడే. ఘంటాకర్ణుఁడు భక్తుఁడుగాఁడా? రావణాసురుఁడు భక్తిహీనుఁడు. కావున వానికి సాధ్యముకానిది వీనికి సాధ్యమయ్యెను. హనుమంతుఁడు అంగదుఁడు భక్తులౌటచేఁ గదా రామలక్ష్మణుల మోయఁగలిగిరి.

ఓయీ, విరాధుఁడు లక్ష్మీభక్తుఁడంటివి. భక్తిభావముతో సీతనెత్తికొనెనంటివి, సంతోషమేకాని, వాఁడు తన భక్తుఁ డని సీతకుఁ దెలియునా? తెలిసియుండిన నేల యామె వాఁ డెత్తికొన్నప్పుడు భయమున వణఁకెను? ఆమె భయముచే వణఁకలేదు. వాఁడు చంకకెత్తుకొన్నప్పుడు బిడ్డ యను భావముతో నూరకయుండెను. వాఁడు రామలక్ష్మణులఁ జంపెదనని యెప్పుడు చెప్పెనో యప్పుడు నా యందలి భక్తిచే వీఁడు వక్రమార్గమునఁ బోవుచున్నాఁడే. నే నాయన సంకల్పానుసారము పోవలసినదాననే కదా. ఆయనను గాదని నేను దేనిని జేయఁగలను. మా యిరువురను వీఁడు సమదృష్టిఁ జూచుటకు మాఱు వీఁడు భగవంతునితోను భాగవతునితో

విరోధము కట్టుకొనుచున్నాఁడు. వారివలన వీనికిఁ గీడు కలుగునే యని పుత్రవాత్సల్యముచే వానికి రాఁగల కీడు తలంచి వణఁకెను. కాని తనకుఁగాని రామలక్ష్మణులకుఁ గాని కీడు కలుగునని వణఁకినది కాదు.

అట్లైన శ్రీరామలక్ష్మణులను విరాధుఁ డెత్తుకొనిపోయినపుడు తన్ను పులులు తోడేళ్ళు మ్రింగు నని యేడ్చెనే !

అట్లేడ్చిన విరాధుఁడు తన దుఃఖము చూడలేక వారిని దనయొద్ద విడుచును. తన యెదుట శ్రీరామచంద్రుఁ డెవరిని హింసింపఁడు కావున వానికిఁ గీడు కలుగ దని యా యుపాయముచేసెను. దమయంతి యుత్తమపతివ్రతయైనను మనుష్యస్త్రీయేకదా. ఆమె నన్ను మ్రింగుఁడని పులులఁ దోడేళ్ళ సింహాదులయొద్దకుఁ బోయి నిలువఁబడినను నవి తొలఁగిపోయెనుగాని యామెను దాఁకినవిగావు. అడవి యేనుఁగులు బిడారునంతయు ధ్వంసము చేసినను ఆమెను సమీపించినవి కావు. అగ్నిహోత్రుఁడు చంద్రమతిని నేమియుఁ జేయఁజాలఁడయ్యెను. ఇది పాతివ్రత్య మహిమ. ఇట్టి విషయము దెలిసిన సీతాదేవి మృగములకా భయపడును ?

విరాధుఁడు సీతాసమక్షమునఁ దన్ను శ్రీరామచంద్రమూర్తి చంపఁ డని యెఱింగియే వారిని దూరముగఁ దీసికొని పోయెను. శ్రీరామునిచే మరణము వానికభీష్టము. రామలక్ష్మణులును వానిని దూరమునందే వధించి యావల సీతను జేర వచ్చిరి. వాని యభిప్రాయముఁ దెలిసికొని "యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహమ్." ఏవ రెవ రేయేవిధముగ నాయెడ భక్తి సేయుదురో వారిని నేనట్లే సేవింతు నను నియమము కలవాఁడు గనుక 'ఇతని యిచ్ఛకొలందిని నేగ నిమ్ము, దనుజుఁ డరిగినదే త్రోవ మనకు' నని రామచంద్రమూర్తి చెప్పెను.

సీతాదేవి పరోక్షమందే రామచంద్రమూర్తి విరాధ మారీచ ఖర కబంధ వాలి రావణాదుల సంహరించెను. ఆమె యనుగ్రహించిన కాకాసుర జటాయు సుగ్రీవ విభీషణులఁ దాను ననుగ్రహించెను; సుగ్రీవుని యందలి విశ్వాసముచేఁగదా సీతాదేవి తన యాభరణము లాయనముందు వైచెను. అది తెలిసి రాముఁడు సుగ్రీవుని స్వీకరించెను. విభీషణుఁడు తన భార్యను బిడ్డను సీత కనుకూలురాండ్రుగా నుండఁజేసెను.

కం. ఆఁకరమున మోఁచేతుల, మోఁకాళులఁ బాదములను ♦ ముష్టులఁ బైపైఁ
గాఁకమెయిఁ గుమ్మి గ్రుద్దుచు, వీఁకం బైకెత్తి మొత్తి ♦ విడుచుచు నేలన్. ౪౫

ఆఁకరమునన్ = ఆగ్రహముతో, ముష్టులన్ = పిడికిళ్ళచే, కాఁకమెయిన్ = తీక్ష్ణముగ.

తాత్పర్యము

విరాధుఁ డాయుధములచేఁ జచ్చువాఁడు కాఁడు, చేతులు లేనివాఁడయ్యెను. కావున వాఁడు మఱియొక విధముగఁ జావఁడని వానిని మోఁచేతులతో మోఁకాళ్లతోఁ గుమ్మి గ్రుద్ది వానిని పైకెత్తి క్రిందవైచిరి.

కం. నఱికినఁ గరవాలంబుల, గుఱుకొని శితబాణములను ♦ గ్రుచ్చిన నేలం
జఱచిన నెట్టును జావని, కఱకుటసురఁ జూచి పలుకు ♦ గాదిలితమ్మున్. ౪౯

కరవాలంబులన్ = కత్తులచే, చఱచినన్ = కొట్టినను.

తాత్పర్యము

కత్తులతో నఱికినను బాణములచేఁ గ్రుచ్చినను నేలపై మోఁదినను నే విధముగను జావని యా కఠినరాక్షసుని జూచి శ్రీరామచంద్రమూర్తి లక్ష్మణుతో నిట్లనెను.

కం. భీతజనాభయదుఁడు శ్రీ, సీతాపతి వరము బలముఁ ♦ జేసి యసుర దా
శాతశరాదులఁ జావఁడు, గోతిని బాఁతంగ మృతిని ♦ గూరెడు ననినన్. ౫౦

భీతజన = భయపడినవారికి, అభయదుఁడు = అభయమిచ్చువాఁడు, శాతశరాదులన్=పదును గల కత్తులచే, బాణములచే, గోతిని = గుంతలో, పాఁతంగన్ = పూడ్చిన పక్షమున.

తాత్పర్యము

ఎట్టి భయము గలవారికైనను నభయప్రదానము చేయు శ్రీరామచంద్రమూర్తి 'వీఁడు వరబలమున బాణములచేఁ గత్తులచేఁ జచ్చెడివాఁడు కాఁడు, కావున నొక గుంతదీసి దానిలో వీనిని బూడ్చినఁ జచ్చును' అని చెప్పెను.

తే. ఆ విరాధుఁడు రాము ప ♦ ల్కాలకించి, యిట్టు లను శక్రతుల్య స ♦ మిద్ధ తేజ
యేను నీచేతఁ జచ్చితి ♦ నెఱుఁగనైతిఁ, బూర్వ మజ్ఞానమున నిన్నుఁ బురుషసింహ. ౫౧

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి చెప్పిన యా మాట విని యావిరాధుఁ డాయనతో నిట్లనెను. 'ఇంద్రసమానతేజా! పురుషోత్తమా! నేను నీచేతఁ జచ్చినవాఁడనే. అజ్ఞానముచే నిన్ను నే నింతకుఁబూర్వ మెవఁడవైనది తెలిసికొనలేక పోయితిని.

ఈ సర్గమందు భగవంతుఁడగు శ్రీరామచంద్రమూర్తికి మహాభయకారణమున్నను నిర్భయత్వము చెప్పఁబడెను.

—♦ విరాధుఁడు శ్రీరామునకుఁ దనశాపవిధంబు నెఱింగించుట. ♦—

సీ. కౌసల్యనందనా ♦ కరుణాత్మ శ్రీరామ, యెఱిఁగితిఁ దండ్రి మి ♦ మ్మిప్పు డేను
ఈ మహాభాగ సీ ♦ తామహాదేవిని, లక్ష్మణు నీతని ♦ లలితయశుఁడఁ
దొలుత గంధర్వుండఁ ♦ దుంబురుఁ డనువాఁడఁ, గ్రమము దప్పిచరింప ♦ రంభఁగూడి
శ్రీదుండు శపియించెఁ ♦ జేకొనుమీ రాక్షసాకృతి నని దాని ♦ కడలి నేను

తే. బలుకవే శాపమోక్షణ ♦ భంగి ననిన, దశరథసుతుండు రాముండు ♦ దర్పకలన
నెప్పుడు వధించు నిన్నని ♦ నప్పు డీవు, పొందెదవు తొంటిరూపని ♦ సుందలించె. ౫౨

కౌసల్యానందనా = కౌసల్యకు సంతోషము కలిగించువాఁడా, ఈమహాభాగ= ఈమహాభాగ్యవతి, మహాభాగశబ్దము లక్ష్మినని సూచించుచున్నది. శ్రీదుండు = కుబేరుఁడు, అడలి = భయపడి, శాపమోక్షణభంగిన్ = శాపము వదలిపోవు నుపాయము, తొంటిరూపు = మునుపున్న యాకారము, మందలించెన్ = చెప్పెను.

తాత్పర్యము

కౌసల్యానందనా! కరుణాస్వరూప! శ్రీరామచంద్రా! తండ్రీ! మీ రెవ్వరైనది యిప్పుడు తెలిసికొంటిని. శ్రీరాముఁడవగుట యవతారమూర్తివైన భగవంతుఁడవని సీతాదేవి లక్ష్మియని తెలిసికొంటిని. నేను బూర్వమునందుఁ దుంబురుఁడను గంధర్వుఁడను. రంభతోఁ గూడినవాఁడనై కామావేశమున మర్యాద దప్పి సంచరింపఁగాఁ గుబేరుఁడు రాక్షసుఁడవు కమ్మని శపియించెను. దానికి భయపడి శాపము తొలఁగిపోవు నుపాయము చెప్పుమనిన దశరథకుమారుఁడు శ్రీరామచంద్రమూర్తి యెప్పుడు నిన్నుఁ జంపునో యప్పుడు నీకు రాక్షసత్వము పోయి యెప్పటివలె గంధర్వరూపము వహింతు వనెను.

క. శ్రీరఘురామా నీదయ, దారుణశాపంబు దొలఁగె ♦ ధన్యుఁడనైతిన్
గూరిమి సెల విచ్చెదవే, చేరెద నాకంబు మీకు ♦ శ్రేయం బగుతన్. ౫౩

దారుణశాపంబు=భయంకరమైన శాపమువలన వచ్చినరూపము, నాకము= స్వర్గము, కం = సుఖము, అదిలేనిది అకము, న + అకము = అకములేనిది నాకము, నాకము = కేవల సుఖముగలది, దీనివలన శ్రీరామచంద్రమూర్తి వీనికి శాపమోక్షణము కలిగింప నీప్రాంతములకు వచ్చెనని యేర్పడుచున్నది.

తాత్పర్యము

శ్రీరఘురామచంద్రమూర్తీ! నీ కరుణవలన భయంకరమైన శాపబాధ తొలఁగెను; మీ దర్శనమునఁ గృతకృత్యుఁడనైతిని. స్వర్గమునకుఁ బోయెదను. దయయుంచి యాజ్ఞ యిచ్చెదవా? మీకు మేలు గలుగునుగాక.

చం. ఇటు లొకసార్ధయోజనము ♦ నేగి కనుంగొను మందు స్వప్రభా
పటలహసత్పతంగు శర♦భంగు శుభంబగు నీకు నమ్మహా
వటమున నావటించి రఘు♦వర్య పదంపడి పొమ్ము, దీని ము
న్నటి పెదవారు ధర్మ మని ♦ పల్కిరి చచ్చిన సోఁకుమూఁకకున్. ౫౪

సార్ధయోజనము = ఒకటిన్నర యామడ, స్వప్రభాపటల = తనకాంతిసమూహముచే, హసత్ = నవ్వుచున్న, పతంగున్ = సూర్యుఁడుకలవానిని, శరభంగున్ = శరభంగుఁడను పేరుగల మహర్షిని, మహావటమున = పెద్దగుంతయందు, 'గర్తావటౌ భువిశ్వభ్రే' అమరుఁడు. ఆవటించి = ఉంచి, పదంపడి = ఆవల, పెదవారు = పెద్దవారు, సోఁకుమూఁకకున్ = దనుజుల సమూహమునకు.

తాత్పర్యము

ఈ ప్రదేశమునకు నొకటిన్నరయామడ దూరమున పోఁగా నందు సూర్యతేజుఁడగు శరభంగమహర్షి యున్నవాఁడు. ఆయనను మీరు దర్శింపుడు, మేలగును. నన్ను గోతిలోఁ బాఁతి శ్రీరామచంద్రమూర్తీ! యానలఁబొమ్ము. చచ్చినదనుజుల నీప్రకారము పూడ్చుటయే ధర్మమని పూర్వులగు పెద్దలు చెప్పిరి.

కం. ఏవాఁడు గుంత నిడఁబడు, నావాఁడు సనాతనంబు ♦ లగు లోకములం
దే వడిలు; నైఁపలేను మ,హావేదనఁ బ్రాణ మెగసి ♦ యరిగెడు ననినన్. ౫౫

తాత్పర్యము

ఎవఁడు భూమిలోఁ బాఁతి పెట్టఁబడునో వాఁడు సనాతన లోకములకుఁ బోవును అని వారు చెప్పిరి. ఇది మా కులమర్యాద; దేహమంతయు మీరు ముక్కలుగా ఖండించుటచే బాధసంహింపరాక యున్నది, ప్రాణమెగసి పోవుచున్నది, కావున నన్ను శీఘ్రముగఁ బూడ్చిపొండు.

కం. ఏనుఁగునకువలె లక్ష్మణ, దానవునకు గుంత యొకటి ♦ త్రవ్వు మటంచుం
దా నతనికంఠసీమను, బూనికఁ బాదంబు నుంచె ♦ భూపవరుండున్. ౫౬

తాత్పర్యము

'లక్ష్మణా! ఏనుఁగులను బూడ్చుట కెంతగుంత త్రవ్వుదురో యంతది త్రవ్వుము; వీనిని దానియందు వైతము' అని వాఁడు లేవకుండ శ్రీరామచంద్రమూర్తి వాని గొంతుపైఁ గాలుంచి యణఁగ ద్రొక్కెను.

కం. సౌమిత్రి ఖనిత్రముఁ గొని, యా మానవభోజిపార్శ్వ ♦ మం దొకబిల ము
ద్దామత్వరఁ ద్రవ్వ బల, స్థేమంబున వారు వాని ♦ దృఢగతిఁ ద్రోయన్. ౫౭

ఖనిత్రము=త్రవ్వుసాధనము, గడ్డపాఱ, మానవభోజి=మనుష్యులఁ దినువాని, పార్శ్వమందుఁ=ప్రక్కన, వాని దేహమున కానుకొని, బలస్థేమంబునన్ = బలాధిక్యముచే.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి చెప్పిన ప్రకారము లక్ష్మణుఁడు విరాధుని దేహము ప్రక్కననే యొకగుంత శీఘ్రముగఁ ద్రవ్వెను. తరువాత శ్రీరామలక్ష్మణు లిరువురు గలసి వాని దేహమును దానిలోనికి బలవంతముగాఁ ద్రోచిరి.

కం. భైరవరవమునఁ గూలెను; శ్రీరాఘవు లతఁడు శస్త్ర ♦ బృందంబులచే,
గూరఁడు మృతి నని వానిఁ బ్రహారంబులఁ జంపి రా బి ♦ లాంతరసీమన్. ౫౮

భైరవరవమునన్ = భయంకరధ్వనితో, శస్త్రబృందంబులచే=శస్త్రసమూహములచే, మంత్రవంతములుగాని కత్తి, బాణము, శూలము లోనైనవి శస్త్రములు. మంత్రవంతముగాఁ బ్రయోగింపఁబడునవి యస్త్రములు. ప్రహారంబులన్ = చేతిదెబ్బలచే, బిలాంతరసీమన్ = గోతిలోపలి ప్రదేశమందు.

తాత్పర్యము

శ్రీరామలక్ష్మణులు బలవంతముగా త్రోయఁగా వాఁడు భయంకర ధ్వని చేయుచు దానిలో దొరలెను. ఇట్లు వానిని గుంతలోఁ ద్రోచి కత్తులతోఁ గొట్టిన జావఁడని పిటికిటిపోటులచేఁ జంపిరి. ఊపిరియుండఁగా బూడ్చుట సరిగాదు గానఁ జంపి తరువాత వానిని బూడ్చిరి.

ఉ. రాముఁడు లక్ష్మణుండును వి♦రాధుని నీగతిఁ జంపి హృష్టు ల
ల్లై మహితాశ్మసంతతుల ♦ నబ్బిల మెల్లను బూడ్చి, కాంచనో
ద్దామశరాసనంబులను ♦ దాలిచి, జానకిఁ జేరి చంద్ర భా
ధాములు మింటఁబోలె రుచిధాములు వెల్గిరి కాననంబునన్. ౨౯

హృష్టులల్లై = సంతోషించినవారివలెనై, ఇట్లు చెప్పుటచే వారికి విరాధవధ యందు సంతోషము వాస్తవమున లేదని యేర్పడుచున్నది. మహిత = గొప్పవగు, అశ్మ = ఱాలయొక్క, సంతతులన్ = సమూహములచే, కాంచనోద్దామ = బంగారుచే నతిశయించిన, శరాసనంబులను = విండ్లను, శర + ఆసనము = బాణములను జిమ్మునది, జానకిఁ జేరి = జానకిని సమీపించి, ఇట్లు చెప్పుటచే నామె యీ ఘోర కార్యము చూడలేక దవ్వుగ నుండెనని యేర్పడుచున్నది. కేవల దయాస్వరూప గావున హింసాకార్య మామె చూడఁజాలదు. చంద్రభాధాములు = చంద్రునివంటి సూర్యునివంటి కాంతిగలవారు, భా = సూర్యుఁడు, "ఖరాంశుర్భా రవి ర్భగః" త్రి. శే చంద్రుని యుపమానము భార్యాసహితుఁడైన శ్రీరామచంద్రునికనియు సూర్యోపమానము భార్యలేని లక్ష్మణుని కనియు గోవిందరాజీయము. ఇరువురు చంద్రునివలెఁ గళాసంపన్నులనియు నిరువురు సూర్యునివలెఁ బ్రతాప సంపన్నులనియు నర్థమని మహేశ్వర తీర్థీయము.

ఫలశ్రుతి: "యో విరాధ వధం నిత్యం శృణోతి శ్రావయేత వా తస్య పాపాని సర్వాణి వినష్టాని నసంశయః" విరాధవధమును నెవఁ డెప్పుడు వినునో వినుపించునో వాని పాపములన్నియు నశించును. సందేహములేదు. (స్కాందపురాణము.) రుచి ధాములు = కాంతికి స్థానమైనవారు.

తాత్పర్యము

శ్రీరామలక్ష్మణులు విరాధు నీగతిఁ జంపి సంతోషించినవారివలెనై యా గోతిని బెద్దఱాలు అప్పలువేసి పూడ్చిరి. ఇట్లుచేసి దూరమునందుంచిన బంగారు మయమైన విండ్లను మరల గ్రహించి సీతాదేవి యున్నచోటికిఁ బోయి యాకానన మందు వా రాకాశమునఁ జంద్రసూర్యులవలెఁ బ్రకాశించిరి.

—♦ ౫-వ సర్గము. సీతారామలక్ష్మణులు శరభంగాశ్రమమునకుఁ బోవుట ♦—

సీ. జానకి నూఱార్చి ♦ సౌమిత్రిఁ గని రాముఁ, డిప్వని దుర్గమం ♦ బేగ మనకు
సాధ్యంబుగాదు క♦ష్టము శరభంగుని, దర్శింపఁ బద మని ♦ తరలి వేగ

మాశ్రమోపాంతంబు ♦ నందుఁ గనుంగొని, దివ్య సూర్యానల ♦ తేజు గగన
యానరథోత్సంగు ♦ నమరచయానుగు, నుర్వి యంటక మింట ♦ నుండువాని
తే. సుప్రభాభరభూషణు ♦ శుద్ధవసను
హరిహయునిఁ దన్నుఁ దనుఁబోల్మ ♦ హాత్మవితతి
యర్థి భజియింప వెలిఁగెడు ♦ హరిని, బాండు
రాభ్రశశిబింబ సన్నిభ ♦ చ్ఛత్రవిభవు. ౬౦

దుర్గమంబు = పోరానిది, వని = అడవి, ఆశ్రమఉపాంతంబునందు = ఆశ్రమసమీపమున, సూర్యానలతేజుఁ = సూర్యుని, అగ్నిహోత్రుని తేజస్సువంటి తేజస్సుగలవానిని, గగనయానరథోత్సంగుఁ = ఆకాశమునపోవు రథముతోఁగూడిన వానిని, అమరచయానుగుఁ = వెంబడివచ్చు దేవతలు గలవానిని, సుప్రభాభర = విశేషకాంతిగల, భూషణుఁ = ఆభరణములు గలవానిని, శుద్ధవసనుఁ = నిర్మలమైన వస్త్రము ధరించినవానిని, హరిహయుని = ఆకుపచ్చ గుఱ్ఱములు గలవానిని, వితతి=సమూహము, అర్థిన్=ఆసక్తితో, హరిని = ఇంద్రుని, పాండురాభ్ర = తెల్లని మేఘముతోను, శశిబింబ = చంద్రబింబముతోను, సన్నిభ = సమానమైన, ఛత్ర = గొడుగుయొక్క, విభవుఁ = సంపదగలవానిని.

తాత్పర్యము

భయశోకములచే ఖిన్నురాలై యున్న సీతాదేవిని సమాధానపఱిచి లక్ష్మణుఁ జూచి యీ యడవి త్రోవలులేక చెట్లు కంపలు బలిసి, పోవుటకు సాధ్యముగాక యున్నది. కావున శరభంగుని దర్శింప నా యాశ్రమమునకుఁ బోదమని యా యాశ్రమ సమీపమునకుఁ బోయి శ్రీరామచంద్రమూర్తి స్వర్గమందుండువాఁడును, సూర్యాగ్నుల తేజముగలవాఁడును, నాకాశమున సంచరించు రథమునుండి దిగినవాఁడును, వెంటవచ్చుచున్న దేవతలు గలవాఁడును, భూమిని దాఁకక యాకాశమం దుండువాడును, విశేషకాంతిగల యాభరణముల ధరించినవాఁడును, ఆకుపచ్చగుఱ్ఱములు గలవాఁడును, మహాత్ములసమూహము తన్ను సేవించుచుండ వెలుంగువాఁడును, చంద్రబింబమువలె గుండ్రమై తెల్లనై తెల్లనిమేఘమువలె విరివికాంతి గల దగు గొడుగు గలవాఁడు నగు నింద్రుని జూచెను.

తే. చారురూపవతీకర ♦ సారసధృత, ధర్మదండమహాధన ♦ వ్యజనచామ
రావళీమృదులాందోళ ♦ నైకజనిత, మందమారుతచలితమై ♦ కిండడింభు. ౬౧

ఇందును నింద్రుడే వర్ణింపఁబడుచున్నాఁడు.

చారు=మనోహరమైన, రూపవతీ = అందగత్తెయొక్క, కరసారస = కమలములవంటి చేతుల, ధృత=ధరింపఁబడిన, ధర్మదండ = బంగారుబెత్తములుగల, మహాధన=విశేషమువిలువగల, వ్యజనచామరావళీ=విసనకఱ్ఱలవలెనుండు చామరల సమూహముయొక్క, మృదుల = కోమలమైన, మెల్లని యని యర్థము. ఆందోళన = కద

లిక చే, ఏక=ముఖ్యముగా, జనిత=పుట్టిన, మందమారుత = మెల్లని గాలిచే, చలిత = కదలుచున్న, ఎగురుచున్న. మిళింద = తుమ్మెదల, డింభుల = పిల్లలుగలవానిని.

తాత్పర్యము

దేవతాసుందరులు తమ కరకమలములందు ధరించిన బంగారు పిడులు గలిగి మిగుల విలువగల చామరములు మెల్లగా విసరుటవలన జనించిన మెల్లనిగాలిచే నెగురుచున్న పిల్ల తుమ్మెదలు గలవానిని

కం. సురగంధర్వులు సిద్ధులు, పరమర్షులు గుములు గట్టి ♦ పరమస్తుతులన్
గర మభినందింపఁగ, దరసన వెలుఁగొందువానిఁ ♦ జక్కఁగఁ గాంచెన్. ౬౨

సురగంధర్వులు = దేవగంధర్వులు, మనుష్యగంధర్వులని వేఱు జాతి గలదు, గుములు గట్టి=గుంపులై, అభినందింపఁగన్ = సంతోషపడునట్లు చేయుచుండఁగా, దరసన = సమీపమందే.

తాత్పర్యము

దేవగంధర్వులు, సిద్ధులు, గొప్ప ఋషులు, గుంపులై గొప్ప స్తోత్రములచే మిక్కిలి సంతోషపడునట్లు చేయుచుండఁగా సమీపమందే ప్రకాశించు వానిని జక్కఁగా శ్రీరామచంద్రమూర్తి చూచెను.

చం. పరమవిభాఽవిభంగశర ♦ భంగునితోడుత ముచ్చటించు నా
సురపతిఁ గాంచి తమ్ముఁ గని ♦ చూచితె లక్ష్మణ! వింత జాజ్వల
ద్వరరుచిమంతుఁ దీవ్రకర ♦ వంతుని వంతున నంతరిక్షసం
చరణచణంబు నైన యొక ♦ స్యందనమందు వెలుంగు నాతనిన్. ౬౩

పరమవిభా=గొప్ప కాంతియొక్క, అవిభంగ=భంగములేని, ముచ్చటించు = మాట్లాడు, జాజ్వలత్ = మిక్కిలి ప్రకాశించు, వర = శ్రేష్ఠమైన, రుచిమంతున్ = కాంతిగలవానిని, తీవ్రకరవంతుని = సూర్యుని, వంతున = విధముగ, అంతరిక్ష = ఆకాశమందు, సంచరణ=సంచారముచేయుటయందు, చణంబునైన=సామర్థ్యముగల, స్యందనమందు = రథమందు.

తాత్పర్యము

విశేష బ్రహ్మతేజస్సుగల శరభంగునితో సంభాషించుచున్న యా యింద్రుని జూచి శ్రీరామచంద్రమూర్తి లక్ష్మణునితో నిట్లనియె. ప్రకాశించుచున్న మిగులఁ గాంతిగలవాఁడును సూర్యునివలె నాకాశమందే సంచరింప శక్తిగల తేరియందుఁ బ్రకాశించువాఁడును నగువానిని జూచితివా ?

ఉ. ఎట్టిహయంబు లుండు నని ♦ యింద్రునకు న్మన మెల్ల వింటిమో
యట్టివ యూఁకుపచ్చనిహ ♦ యంబులు మింట రహింపఁ గంటివే
చుట్టి శతాంగమున్ గొలుచు ♦ శూరులు భూరి కృపాణపాణులున్
దిట్టలు శోణవస్త్రకులు ♦ దీర్ఘభుజుల్ యువకుల్ సకుండలుల్. ౬౪

హయంబులు=గుఱ్ఱములు, రహింపఁగ=ప్రకాశింపఁగా, కలాంగముల=తెరిచి, భూరి=గొప్పవగు, కృపాణ=కత్తులను, పాణులు=చేతియందుఁ గలవారును, దిట్టలు=సమర్థులును, శోణవస్త్రకులు=ఎఱ్ఱవస్త్రములు ధరించినవారును, దీర్ఘభుజుల్=విడివి చేతులు గలవారును, యువకుల్=నడిమి ప్రాయమందుండు వారును, సకుండలుల్=కుండలములు ధరించినవారును.

తా త్ప ర్య ము

ఇంద్రుని కెటువంటి గుఱ్ఱము లుండునని మనము శాస్త్రములందుఁ జెప్పఁగా విని యున్నామో యటువంటి యాకుపచ్చ గుఱ్ఱము లాకాశమందున్నవి, అదో చూచితివా, ఆ రథము చుట్టునుండి సేవించు వారు శూరులు, చేతులఁ బెద్ద కత్తులు గలవారు, నడిప్రాయమువారు, కుండలములు ధరించినవారు.

ఉ. హారవిహారహారివిపులాంచితవక్షులు శౌర్యదర్పదు
ర్వారులు వ్యాఘ్రముల్పగిదిఁ బ్రాయమునం గనఁ బంచవింశతి
స్ఫారసముల్ సురావళికిఁ సంతత మిట్టిది ప్రాయ మాటచే
వీరలు దేవత, ల్క్ష్మణుఁడ ! వీరుఁడ నీవును సీత యిచ్చటన్. ౨౧

హార=సరములయొక్క, విహారసంచారముచే, హారి=మనోహరమైన, విపుల=విశాలమై, అంచిత=ప్రకాశించు, వక్షులు=ఱొమ్ములు గలవారు, శౌర్యదర్పదుర్వారులు=వారింపరాని శౌర్యము దర్పముగలవారు, పంచవింశతి=ఇరువదియైదగు టచే, స్ఫార=ప్రకాశించు, సముల్=ఏండ్లుగలవారు.

తా త్ప ర్య ము

వక్షస్థలమందుఁ బ్రకాశించు హారములు గలవారును అడ్డగింపరాని శౌర్య దర్పములు గలవారును, ఇరువదియైదు సంవత్సరముల వయస్సుగలిగి పులులవలె నుండువారునై యున్నారు. దేవతల కెప్పటికి నిదేకదా వయస్సు. కావున దేవతలే. లక్ష్మణా! నీవిందే సీతతోడ నిలువుము.

ఉ. వానివిధంబు నే నెఱిఁగి వచ్చెద నంచు మునీశు నాశ్రమం
బా నృపసూతి చేరఁ జన నాతనిరాకను గాంచి శక్రుఁ డ
మ్మానికి నేకతం బనియె మానసపాలుఁడు రాముఁ డిందు రాఁ
బూనినవాఁడు న న్గనఁగ బోలదు నా కిపు డీతనిం గనన్. ౨౨

శక్రుఁడు=ఇంద్రుఁడు, ఏకతంబు=రహస్యముగా.

తా త్ప ర్య ము

ఆ యింద్రునివృత్తాంతము నాయన యిచ్చటకేల వచ్చెనో తెలిసికొని వచ్చెదను అని చెప్పి మునీశుని యాశ్రమము చేరఁబోఁగా నాయన వచ్చుట చూచి యింద్రుఁడు రహస్యముగా శరభంగునితో శ్రీరామచంద్రుఁడు నన్నుఁ జూడ వచ్చుచున్నాఁడు, ఈయనను నే నిపుడు చూడరాదు.

ఉ. ఈయన చేయఁగాఁ దగిన ♦ యెంతయు దుష్కర మైనకార్యమున్
జేయఁగ నిమ్ముఁ ధన్యుఁడును ♦ జిష్ణుఁడు నై పొగ డొందఁ బిమ్మటన్
డాయుదు ముచ్చటింతు నని ♦ దానవవైరి వచించి మింటికై
పోయె శతాంగయుక్తి, నిటు ♦ పోవుడు నా పురుహూతుఁ డావలన్. ౬౭

దుష్కరము = ఇతరులు చేయుటకు నసాధ్యమైనది, జిష్ణుఁడు = జయశీలుఁడు, రావణుఁ జంపినవాఁడు, డాయుదున్ = సమీపింతును, ముచ్చటింతును = సంభాషింతును, దానవవైరి = ఇంద్రుఁడు, శతాంగయుక్తిన్ = రథముతో పురుహూతుఁడు = ఇంద్రుఁడు.

తాత్పర్యము

ఈయన చేయవలసిన యసాధ్యకార్యము రావణవధాదికము ముందున్నది. అది చేయనిమ్ము, అది యితరులు చేయలేనిది. అందుఁ గృతకృత్యుఁడై జయించినవాఁడై కీర్తిగన్నతరువాత నేను సమీపించి సంభాషించెదను. అని యింద్రుఁడు రథమెక్కి యాకాశమునఁ బోయెను. ఇట్లా యింద్రుఁడు వెడలిపోవఁగా.

రావణవధ మగునప్పటి కగును, ఇప్పుడేల మాటలాడరాదనిన నిప్పుడు నేను మాటలాడిన నాయన పరత్వము ప్రకటనము గాక తప్పదు. అయిన నేమంటివా, ఇప్పుడు పరత్వము ప్రకటనమైనచో రావణాసురుఁడు చావఁడు. అది యితరదేవతలకు సాధ్యము కానిది. మనుష్యవేషమున నీయనయే చేయవలసియున్నది. కావున నది యైన పిమ్మటఁ బరత్వము బయటఁబడినను భయము లేదు.

రావణుఁడు శ్రీరామచంద్రమూర్తి సామాన్య మనుష్యుఁ డను భావము కలవాఁడయియే యుండవలయును.

కం. నృపకులతిలకుఁడు రాముఁడు, చపలాయతనేత్రతోడ ♦ సహజన్మునితో
సపరిచ్ఛదు సజ్వలనుం, దపసిం జేరంగఁ జనియెఁ ♦ దాత్పర్యమునన్. ౬౮

చపలాయత నేత్రతోడన్=చలించు దీర్ఘములయిన కన్నులుగల సీతాదేవి తోడ, సహజన్మునితోన్=తమ్మునితో, సపరిచ్ఛదున్=పరికరములతో గూడినవానిని, సజ్వలనున్ = అగ్నిహోత్రముతోఁ గూడినవానిని.

ఇట్లు దేవేంద్రుఁడు వెడలిపోగా శ్రీరామచంద్రమూర్తి వెనుకకు మరల వచ్చి సీతాలక్ష్మణులఁ గలసికొని వారితోడఁ బరికరములతోను నగ్నిహోత్రముతోను బ్రకాశించు శరభంగ మహర్షిని భక్తితోడఁ జేరఁబోయెను.

ఉ. చేరి మునీశుపాదములు ♦ శీర్షము సోఁక నమస్కరింప న
వ్వారల నర్ఘ్యపీఠముల ♦ పై వసియింపఁగఁ బంచి మౌని, సీ
తారమణుండు శక్రుఁడు క ♦ తం బెది యుచ్చటి కేగుదేర నా
వారక సర్వముం దెలిపె ♦ వాసవురాకకుఁ గారణంబులన్. ౬౯

శీర్షము = తల, అర్హపీఠములపై = వారివారికిఁ దగిన పీటలయందు, పంచి = ఆజ్ఞాపించి, ఇచ్చటఁ జెప్పఁగా నని యర్థము. కతము = కారణము. ఇచ్చట శ్రీరామచంద్రమూర్తి నమస్కరించుట తన మానవత్వము, క్షత్రియత్వము, లోక సంగ్రహార్థము.

తాత్పర్యము

ఇట్లు రామచంద్రమూర్తి శరభంగునిఁ జేరఁబోయి యాయన పాదములు తన శిరస్సంట మ్రొక్కి నిలువఁగా నామౌని యామువ్వురకు వారికిఁ దగిన పీట లమర్చి కూర్చుండుఁ డని చెప్పెను. అప్పుడు శ్రీరామచంద్రమూర్తియు మునిని జూచి యింద్రుఁ డిచ్చటికి వచ్చిన కారణ మేమని యడుగఁగా నాయన యా కారణముఁ దెలిపెను.

—♦ శరభంగుండు శ్రీరామునితో నింద్రురాకకుఁ గారణంబుఁ జెప్పుట ♦—

సీ. దాశరథీ! నేను ♦ దపమున క్షుద్రదు, రాసదం బైనయా ♦ బ్రహ్మలోక
మును సమార్జించితి ♦ ననుఁ గొనిపోవఁగ, వాసవుం డిచటికి ♦ వచ్చినాఁడు
అధికప్రియుండ వౌ ♦ నతిథివి గావున, కరుదెంచి యుండుట ♦ యాత్మ నెఱిఁగి
నిన్ను దర్శింపక ♦ నే బ్రహ్మలోకంబుఁ, జనఁగ నాకేమియు ♦ మనసు రామి

ఆ. నిలిచినాఁడఁ, గలిగె ♦ నీదర్శనం బిఁక; దేవసేవితంబుఁ ♦ద్రిదివపదము
నరుగువాఁడ మత్స ♦ మార్జితాక్షయశుభ, లోకచయము గలదు ♦ లోకవంద్య. ౭౦

క్షుద్రదురాసదము = నీచులు పొందరానిది, దేవసేవితంబు = దేవతలచే సేవింపఁబడినది, మత్సమార్జిత = నాచే సంపాదింపఁబడిన, అక్షయ = క్షయములేని, ఎప్పటికి ఫలము చెడని; స్వర్గాది లోకములకుఁ బోయినచోఁ జేసిన పుణ్యము క్షయింపఁగానే మరల భూమియందు జన్మింపవలసియుండును. అట్లు పుణ్యక్షయము కాని లోకములను సంపాదించితిని.

తాత్పర్యము

రామచంద్రదేవా! నేను తపస్సుచేసి క్షుద్రులు పొందరాని బ్రహ్మలోకమును సంపాదించితిని. అచ్చటికి నన్ను బిలిచికొనిపోవ నింద్రుఁ డిచటికి వచ్చెను. ఆ బ్రహ్మలోకమునకంటెఁ బ్రియపడి కోరవలసిన నీ వతిథివై సమీపమునకు వచ్చియుండుట తెలిసి బ్రహ్మలోక ప్రాప్తికంటె నీ దర్శనము శ్రేష్ఠము కావున నిన్ను దర్శింపక యచ్చటికిఁబోవ మన స్సొల్లమిని నిలిచితిని. నీ దర్శనము కలిగెను. దేవతలు సేవించు త్రిదివమునకుఁ బోదును. నేను దపస్సుచే నార్జించినవి యెన్నటికి క్షయముకానివి పుణ్యలోకములు గలవు నిన్ను దర్శింపక నేను బ్రహ్మలోకమునకుఁ బోవ నేమియు మనస్సురాలేదనుటచే బ్రహ్మలోక ప్రాప్తికంటె శ్రీరామచంద్రమూర్తి దర్శనమే శ్రేష్ఠమని భావము. ఇఁక నీదర్శన మయ్యెను. దేవసేవితంబైన త్రిదివమునకుఁ బోయెద ననుటచే 'స్వరవ్యయం స్వర్గ నాక త్రిదివ త్రిదశాలయాః' యని నిఘం

టువునఁ జెప్పఁబడిన యింద్రలోకము కాదు. ఏలన బ్రహ్మలోకమునకంటె శ్రీరామ చంద్రమూర్తి దర్శనము శ్రేయస్కరమని కాచియుండి దర్శనము చేసికొనినవాఁడు బ్రహ్మలోకమునకైనఁ బోక స్వర్గలోకమునకుఁ బోయెదనని చెప్పినాఁడనుట తుచ్ఛము కావున, దేవసేవితము, "యత్ర పూర్వే సాధ్యాస్సంతి దేవా"యనుచోఁ జెప్పఁబడిన పరమపదమే; త్రిదివమన్నప్పుడు త్రిపాద్విభూతి, "పాదోస్యవిశ్వాభూతాని త్రిపాద స్యామృతం దివి" యనుచోఁ జెప్పఁబడినదే. అక్షయపుణ్యలోకమనుటచే బ్రహ్మలోక మునకు మీఁది యప్రాకృతలోకములే. "ఆబ్రహ్మభవనాల్లోకాః పునరావర్తినోర్జున" యని భగవద్గీతయందుఁ గలదుకదా! ఇంత రహస్య సంభాషణ కారణము రామ పరత్వము ప్రకటనము చేయరామియే. రహస్యము తెలియని వారిది యతిథిసత్కా రముగా గ్రహింతురు.

ఆ. స్వర్గలోకభవము♦బ్రహ్మలోకభవంబు, నైనసుకృత మెల్ల♦మానసీయ
　నీకు నొసఁగువాఁడఁ♦గైకొను మన సర్వ, శాస్త్రవేది రామ♦చంద్రుఁ డనియె. ౭౧

స్వర్గలోకభవము=స్వర్గలోకమునందు భోగప్రదేశ విశేషములు, బ్రహ్మలోక భవము = బ్రహ్మలోకమునందుఁగల భోగప్రదేశ విశేషములు, వీనిని సంపాదించుటకు నేను జేసిన సుకృతము=పుణ్యము, సర్వశాస్త్రవేది=సర్వశాస్త్రములు తెలిసినవాఁడు,

తాత్పర్యము

స్వర్గలోకమందలి భోగస్థానములను, బ్రహ్మలోకమందలి భోగస్థానములను సంపాదింప నేనేమి పుణ్యము చేసితినో యదియంతయు నీకు నిచ్చువాఁడ గ్రహింపు మనిన సకలశాస్త్రవేత్త యగు శ్రీరామచంద్రమూర్తి యిట్లనియె.

ఇది కర్మములను భగవదర్పణము చేయుట యగును. అట్లనఁగా ఫలసంగ మును కర్తృత్వము వదలి భగవత్కైంకర్య మను తలంపుతోఁ గర్మములు చేయుట తనిశ్లోకి. దీనికే ఫలసమర్పణమని పేరు.

మహేశ్వరతీర్థ వ్యాఖ్యయందును సర్వేశ్వరుఁడగు శ్రీరామునందు ఫల సమర్పణాభిప్రాయమునఁ జెప్పఁబడెనని కలదు.

చం. కొనదను నేన నీసుకృత♦కోటుల నెల్లను, మేము నిల్వ నీ
　వనమున వాసయోగ్య మగు♦పట్టిది చెప్పు, మటన్నఁ బ్రాజ్ఞుఁ డి
　ట్లనియె సుతీక్ష్ణనామక మ♦హాత్ముఁడు మీ కెఱిఁగించు నాతనిన్
　గనఁ జనుఁ డీ వనంబునన ♦ కల్గు నతంపు ఘటించు శ్రేయముల్. ౭౨

సుకృతకోటులన్ = అనేకపుణ్యసమూహములను.

తాత్పర్యము

"మునీంద్రా! నీ సుకృతములనెల్ల నేనే గ్రహించెదను, మేము నిలుచుటకు వాసయోగ్యమైన స్థలము చెప్పుము." అనినఁ బ్రకృష్టజ్ఞానము గల శరభంగుఁ డిట్లనియె. మీరుండుటకుఁ దగిన స్థలమును సుతీక్ష్ణుఁడను మునీంద్రుఁ డెఱిఁగించును.

ఈ యడవియందే యాయన యున్నవాఁడు. ఆయన మీకు శ్రేయస్కరమైనది చెప్పును.

శరభంగుఁ డెట్లు పరతత్త్వరహస్యము దాఁచి మాటలాడెనో యట్లే శ్రీరామచంద్రమూర్తియు నీ పుణ్యములనెల్ల నేనే కొనియెదను అనెను. అనఁగా నీవియ్య వలసిన పనిలేదు. నీవు నీ మనస్సున సంకల్పించినఁ జాలును. అది లేకున్నను లోపము లేదు; క్షత్రియధర్మము ననుసరించి పుచ్చుకోలు తగదు. కావున నట్లు చెప్పెనని ప్రతీతి; తనపుణ్యము లన్నియు నొకయతిథికి ధారవోసి యెవఁడు భ్రష్టుఁడగుటకుఁ గోరును. ఇచ్చట నట్లుగాదు. భగవంతునకు నిచ్చినది యొకటి కోటియగును. ఇది నష్టిలేని లాభకరమైన వ్యాపారము. భగవంతు నుద్దేశించి చేయు సాత్త్వికత్యాగము మనోవాక్కాయములలో దేనితోనైనఁ జేయవచ్చును.

నీ పుణ్యకోటులను నేనే తీసికొనెదను అనెనే, ఏల? అయ్యా! మునీంద్రా నీ వెంతకాలముగానో నాదర్శనము గోరి దానికై కాచి యుక్తకృత్యములనెల్లఁ జేయుచుండుట నే నెఱుఁగుదును. కావుననే నీ కంత్యకాలమున దర్శన మీయ వచ్చితిని. అట్లు నేను జేయనైతినేని యింతకాలముగ నీవు నన్నుగుఱించి పడినశ్రమ మను ఋణము నే నెట్లు తీర్చుకొనఁగలను? కావున నీకోర్కె నెఱవేర్చి యనుగ్రహించుటకే వచ్చితిని. ఎప్పుడు నిన్ననుగ్రహింప నిశ్చయించితినో యప్పుడే పుణ్యపాపరూపము లయిన నీ ప్రతిబంధముల నెల్ల నేను దొలఁగింపవలయును. ఇప్పుడు నా ప్రాప్తికి నీకుఁ దపస్సువలనఁ గలిగిన పుణ్యము ప్రతిబంధకము. ఎవ్వని నే ననుగ్రహింప నిశ్చయింతునో వాని సర్వస్వము నే నపహరింతునని చెప్పి బలివిషయమున నట్లే వర్తించితినిగదా. నీ ధనము నీ సుకృతము. కావున నీవిచ్చినను నీయకున్నను నేనే దాని హరింతును. ఆ విషయమున నీ ప్రయత్న మనావశ్యకము, నా కర్తవ్యము నాకు దెలియును

ఈ విషయమున నీశ్లోకములు స్మరణీయములు.
సత్యం బ్రవీమి మనుజాః స్వయ మూర్ధ్వబాహుః
యో మాం ముకుంద నరసింహ జనార్దనేతి
జీవన్ జప త్యనుదినం మరణే ఋణీవ
పాషాణ కాష్ఠ సదృశాయ దదామి ముక్తిమ్॥

ఓ మానవులారా! చేతులెత్తి ప్రమాణచేసి చెప్పుచున్నాను. ఎవరు నన్నుఁ దమ జీవితకాలమందు ముకుంద నరసింహ జనార్దన యని ప్రతిదినము జపింతురో వారు మరణకాలమునఁ గఫవాదులచే స్మృతిదప్పి కట్టెవలె రాతివలెఁ బడి యుండఁగా వాఁడు యావజ్జీవము చేసిన కృషి నేనే స్మరించుకొని యప్పుదీసికొనినవాఁడు అప్పు చెల్లించినట్లు ముక్తినిచ్చెదను. ఇది నరసింహ చరమశ్లోకము. ఇతర చరమశ్లోకముల నిట్లే స్మరింపుఁడు.

ఇంత పరత్వము సూచించుమాటలాడి వెంటనే యేమియుఁ దెలియని వాని వలె మాకుండుటకు స్థలము చెప్పుమని యడుగుట పరప్రతారణార్థము.

ఈ యావాసవిషయమున ఋషు లందఱు తోడుదొంగలు. ఎట్లులైన సీతారామలక్ష్మణులను బంచవటి చేర్చిన నచ్చట ఖరాదులతోనే కారణముచేనైనఁ గలహము గలుగును. అప్పుడు వారు చంపఁబడుదు రని వారు చేసిన యాలోచన. ఇది, వారే ౪౬౭ వ పద్యంబున జెప్పిరి. ఆ కారణముచే మెల్ల మెల్లఁగా నగస్త్యాశ్రమముఁ జేరఁజేసి యక్కడినుండి పంచవటిఁ జేర్చిరి.

ఉ. ఈ కడ నుండి మీర లెదు♦రేగుఁడు పాఱుచు నున్న యల్లమం
దాకిని కందునందును గ♦నం దగఁ బూవుల తెప్ప, లద్దియే
మీ కరుగంగ మార్గము, ని♦మేషము నిల్వము తండ్రి ! దేహముం
బోకడపెట్టుదుం గుబుస♦మున్ ఫణిరాజము వీడునట్లుగన్. ౭౩

పోకడపెట్టుదున్ = వదలిపెట్టుదును, కుబుసము=దేహముమీఁది పొర, కుప్పసము, ఫణిరాజము=శ్రేష్ఠమైన పాము, మందాకిని, ఇది భాగీరథి గాదు, పుణ్యనదు లెల్ల గంగలే, చిత్రకూటమునందలి నదియు నిట్లే చెప్పఁబడెను.

తాత్పర్యము

రామచంద్రా ! మీ రిక్కడనుండి తూర్పుగాఁ బాఱుచున్న యీ పుణ్యనదికి నెదురెక్కి పడమటిముఖముగాఁ బొండు. నడుమనడుమఁ బూవుల గుంపులు తెప్పలు తెప్పలుగా నదియందు నందందుఁ గానవచ్చును. అదియే సరియైన మార్గము. రామచంద్రా ! తండ్రీ! నాయనా, హోమము, కొంచెముసే పుండుము. నాగుఁబాము కుప్పసము వదలినట్లు దేహము వదలెదను.

ఉ. దానిని నీవు చూచి మఱి ♦ తర్లు మటంచును వేఁడి మంత్రపూ
తానల మాజ్యధారల ర♦యంబునఁ బ్రజ్వలితంబుఁ జేసి య
ద్దానను మాంసరక్తసహి♦తంబుగ నస్థులతోడ భస్మమై
మానియు వహ్నిసన్నిభకు♦మారకరూపముఁ దాల్చి క్రమ్మఱన్. ౭౪

తర్లుము=పయనింపుము, మంత్ర పూతానలము=మంత్రములచే బవిత్రమైన యగ్నిహోత్రమును, ఆజ్యధారలన్ = నేతిధారలచే, ప్రజ్వలితంబు = మండునదిగా, మాంసరక్త సహితంబుగన్ = మాంసముతోడను నెత్తుటితోడను, అస్థులతోడన్ = ఎముకలతోను, భస్మమై = బూదియై, వహ్నిసన్నిభ = అగ్నిహోత్రముతో సమానమైన, కుమారక రూపము = "బాలోఽథ పంచదశభి, త్రింశద్భిస్తు కుమారకః" రత్నాకరము; అని యుండుటచే నిరువదియైదేండ్ల ప్రాయపు రూపము.

తాత్పర్యము

నే నీ దేహమును వదలుటను జూచి యావలఁ బయనమై పొమ్మని ప్రార్థించి బ్రహ్మమేధ మంత్రములచేఁ బవిత్రమైన యగ్నిహోత్రమును బ్రజ్వలింపఁజేసి పరిస్త

రణాదులచే నలంకరించి యా యగ్నియందుఁ బ్రవేశించి మాంసము రక్తము ఎముకలతోడ భస్మమై శరభంగుఁడు మరలఁ గుమారుని రూపముదాల్చి,

సాధారణముగ శవమును గాల్చినపుడు సన్నయెముకలు భస్మమైనను పుత్తెలోనైన పెద్దయెముకలు భస్మముగాఁగావు. ఇక్కడ నట్లగుటకు యోగబలమే కారణము. భీష్ముని విషయమున "అమ్మహాత్ముం డవయవంబులఁ బ్రాణంబులు బాపికొనుచు వచ్చు నయ్యె చోట్లు శల్యరహితంబు లగుచుండె నట్లగుటఁ గాంచి కృష్ణాదు లగు నఖిలజనంబులు నాశ్చర్యభరితాంతఃకరణు లగుచుఁ గీర్తించిరి."

వానప్రస్థుఁడు తానై శరీరము నగ్నిలో దుమికి విడుచుట యాత్మహత్య గాదు. "అనుష్ఠానాసమర్థస్య, వానప్రస్తస్య జీర్యతః, భృగ్వగ్నిజలసంపాతైః మరణం ప్రవిధీయతే" వార్ధకముచే ననుష్ఠానము జరుపుకొనలేనివాఁడు కొండమీఁదనుండి పడిగాని, అగ్నిహోత్రమునందుఁగాని నీళ్ళలోఁ బడికాని దేహము విడువవచ్చును.

"వృద్ధః శౌచక్రియాలుప్తః, ప్రత్యాఖ్యాత భిషక్క్రియః ఆత్మానం ఘాతయే దస్తు భృగ్వగ్న్య నశనాదిభిః."

అనియుఁ బ్రమాణము గలదు. ఇట్లు శక్తిలేనివారు మాత్రమేకాదు అనుష్ఠానశక్తి గలవారైనను దేహముతో సాధింపవలసినది యిఁకలేదు. ఇఁక మరల జన్మ భయములేదని దేహముపై విరక్తి పుట్టినవాఁడు తపోబలముచే సాధింపవలసిన దంతయు సాధించినవాఁ డెప్పుడైనను త్యజింపవచ్చును. అది యాత్మహత్యకాదు. తపస్సుచే సాధింపవలసిన దంతయు సాధింపక పరలోకప్రాప్తి నిశ్చయములేక యవశిష్ట కర్మానుబద్ధులై కామక్రోధవశులై యుండువారు బలవంతముగ దేహమును వదలరాదు. దానివలన నధమలోకములు ప్రాప్తించును.

'ఆసన్న మరణార్థియైన యతీశుండు కాలదేశంబులఁ గాచికొనఁడు తనువు విసర్జించు తలఁపు జనించిన" ననియు "ఇచ్ఛలేని యోగియొక్క ముహూర్తార్థ,మింద్రియానుషంగ మింతలేక, ప్రాణములను వంచి బ్రహ్మరంధ్రముఁ జించి, బ్రహ్మమందుఁ గలియుఁ బార్థివేంద్ర" యని కలదుగదా - కావుననే "యద్యాత్యంతా తదావాప్తో, బ్రహ్మమేధానలం వ్రజేత్, నాభివక్త్రాత్మగా నగ్నినకరోప్యయథాస్థలం–" సంస్కారయేత్" అని చెప్పఁబడెను. ఈ కారణముచేతనే సహగమనము చేయు పతివ్రతలకును నాత్మహత్యాదోషము లేదు. సీతాదేవి యురిపోసికొనుటకు యత్నించినదియు సీతాదేవి చంద్రమతు లగ్ని ప్రవేశించినదియుఁ బాతివ్రత్య రూపక తపోబలము చేతనే.

చ. అనలమునుండి వెల్వడి మ ♦ హర్షి సురాళిజగంబు దాఁటి చ
య్యనఁ జని బ్రహ్మలోకమున ♦ యందు సహానుచరుం బితామహుఁ

గనియె నతండు పూనికిని ♦ గారవ మారఁగ స్వాగతంబుఁ బ
ల్కెను, మునిశక్తికి న్నగురుఁ ♦ గీర్తన చేసిరి విస్మయాత్ములై. ౭౫

అనలమునుండి = అగ్నిహోత్రమునుండి, బ్రహ్మలోకమునయందు=పరబ్రహ్మాత్మకలోకమందు, సహానుచరుః = అనుచరులతోఁగూడిన వానిని, పితామహుః = బ్రహ్మను, ఇచట బ్రహ్మ పితామహశబ్దములు సవిగ్రహ పరబ్రహ్మమునే బోధించును. ఈ బ్రహ్మశబ్దము భగవంతుఁడు సగుణుఁ డనియు (బృహత్త్వాత్ బృంహణత్వాత్) పితామహశబ్దము జగన్మూలకారణ మనియుఁ దెలుపును. లేనియెడలఁ బూర్వోత్తర విరోధము సంఘటించును.

విస్మయాత్మలై = ఆశ్చర్యపడిన మనస్సుగలవారై, పితాహ మస్య జగతో మాతా ధాతా పితామహః. భ. గీ. ౯–౧౭.

దీనివలన నుపాసకులు సన్న్యాసులవలె బ్రహ్మలోకమందు నిలువక పరమపదమును బొందెద రని యేర్పడెను. (పూను ౭౦ వ ప. వ్యాఖ్య – ఆరణ్య).

తా త్ప ర్య ము

అగ్నిహోత్రమునుండి లింగశరీరమైన కుమారకరూపముతో బయలుదేఱి దేవతల లోకము లన్నియు దాఁటి శీఘ్రముగ నందందు నిలువక పోయి పరబ్రహ్మలోకమందు భగవన్మూర్తిని జూచెను. ఆయనయు మునిని సుఖముగా వచ్చితివా యని ప్రశ్నించెను. ఈ ప్రశ్న కౌషీతక్యుపనిషత్తునందుఁ జెప్పఁబడిన ప్రశ్నయగును. సీతారామ లక్ష్మణులు మువ్వురును మునిశక్తి కాశ్చర్యపడిరి.

ఇచ్చట సురాళి జగంబును దాఁటి బ్రహ్మలోకమందుఁ బితామహుఁ గనియె ననుటచే నర్చిరాది మార్గము సూచింపఁబడెను.

తేఽర్చిష మభిసంభవం త్యర్చిషోఽహ రహ్న ఆపూర్యమాణపక్ష మాపూర్యమాణపక్షాద్యాన్ షడుదఙ్ఙేతి మాసాం స్తాన్ మాసేభ్య స్సంవత్సరమ్ సంవత్సరాదాదిత్య మాదిత్యా చ్చంద్రమసం చంద్రమసో విద్యుతం తత్పురుషోఽమానవస్స ఏనాన్ బ్రహ్మగమయతి' ఈ యర్థమునే యీ శ్లోకము విశదీకరించుచున్నది.

"ముక్తోర్చిర్దినపూర్వపక్ష షడుదఙ్మాసాబ్ద వాతాంశుమ ద్గ్లౌ విద్యు ద్వరుణేంద్ర ధాతృమహిత స్సీమాంతసింధ్వాప్లుతః । శ్రీ వైకుంఠముపేత్య నిత్య మజడ స్తస్మిన్ పరబ్రహ్మణ స్సాయుజ్యం సమవాప్య నందతి సమం తేనైవ ధన్యః పుమాన్."

దేహమును విడిచిన ముక్తజీవుని గతివాహకులను దేవతలు క్రమక్రమముగా నెదురువచ్చి తోడుకొని తమ తమ పొలిమేరవఱకుఁబోయి యచ్చట నావలి యతివాహకున కప్పగింతురు. ఆ దేవతలపేర్లేవన, అర్చిస్సు, దినమున పూర్వపక్షము, ఉత్తరాయణ మాఱునెలలు, సంవత్సరము, వాయువు, సూర్యుఁడు, చంద్రుఁడు, విద్యుత్తు, వరుణుఁడు, ఇంద్రుఁడు, ధాత, ఈధాత ప్రాకృతమండలమునకు నప్రాకృత

మండలమునకు నడుమ విరజానదీతీరమున విడుచును. ఇంతవఱకుఁ బ్రయాణము సాగుటకై జీవున కత్యంత సూక్ష్మ ప్రాకృతశరీర మంటియుండును. ఇక్కడ నా లింగ శరీర మూడిపోవును. ఆపల సంకల్పముచేతనే విరజానదిని దాఁటిపోవును.

జీవుఁ డణు స్వరూపుడు గనుకనే యీ ప్రయాణము సాధ్యపడెను. జీవుఁ డణు స్వరూపుఁ డనియే శ్రుతులు స్మృతులు చెప్పుచున్నవి.

వాలాగ్రశతభాగస్తు కల్పితశ్చ త్సహస్రధా
తస్యభాగా చ్ఛతతమో జీవ స్సూక్ష్మ ఉదాహృతః ॥శంఖ॥

వెంట్రుక కొనను నూఱుభాగములు చేసి యందొకభాగమును వేయిభాగములు చేసి ఆ యొకభాగమును నూఱుభాగములుగా విభజించితిమేని యెంత యుండునో జీవుఁ డంతటివాఁడు.

వ్రీహిర్వా యవోవా, శ్యామాకోవా, శ్యామాకతండులోవా, ఏవమయ మంతరాత్మన్ పురుషో హిరణ్మయో యథా జ్యోతి రధూమం॥ శతపథ. ౧-౬-౩.

వడ్లగింజంతగాని యవధాన్యపుగింజంతగాని శ్యామాకధాన్యమంతగాని శ్యామాకపు బియ్యపు గింజంతగాని సూక్ష్మమగు వాఁడగు నంతరాత్మ (జీవుని) యందు హిరణ్మయ పురుషుఁడు పొగలేని జ్యోతిస్సుగా నున్నాఁడు.

వాలాగ్రశతభాగస్య శతధా కల్పితస్యచ
భాగో జీవ స్స విజ్ఞేయః. ॥శ్వేతాశ్వ॥

వెంట్రుక కొనను నూఱుభాగములుచేసి యందొక్కొక్క దానిని మరల నూఱు భాగములు చేసినచో జీవుని పరిమాణ మేర్పడును.

ఆరాగ్రమాత్రో హ్యవరోపి దృష్టః.
జీవుఁడు ములుకొనయంత సూక్ష్మముగఁ జూడఁబడినాఁడు.
ఏషోణు రాత్మాచేతసా వేదితవ్యః॥ ముండ॥
ఈ జీవుఁడు అణువు - మనస్సుచేఁ దెలిసికొనఁదగినవాఁడు.

ఇట్లు చెప్పుటచేతను గమనాగమనములు చెప్పుటచేతను ముక్తపురుషునకు భోగము చెప్పుటచేతను, గాలిలోగాలి కలిసిన దను నాస్తిక వాదము నిరస్తము. అట్లే దేహమంత యాత్మయనువాదము నిరస్తము-ఆత్మసర్వవ్యాపి యనువాదమునిరస్తము.

శరభంగున కిట్టి యుత్తమలోకప్రాప్తి రామచంద్రమూర్తి సాన్నిధ్యమునఁ గలిగెనని యెఱుంగవలయును.

శరభంగునికిఁ బ్రాప్తించినది యప్రాకృత కేవలచైతన్యము శరీరము.
ముక్తుల కిట్టి శరీరము వారి సంకల్పానుసారము లభించును.

ఇక్కడ నొక చిన్నసందేహము - మీఁద వివరించినట్లు యోగసిద్ధుఁడు యోగబలముచే జీవుని సుషుమ్నానాడిలోనుండి పయనింపఁజేసి బ్రహ్మరంధ్రము భేదించుకొని పోవచ్చుగదా. అట్లుపోక శరభంగుఁ డగ్ని ప్రవేశము చేసెనేల? ఇది

క్లిష్టమార్గముకదా. శరభంగుని వంటివాని కిది క్లిష్టమార్గముగాదు. శిష్టమార్గమే. ఏలన - ఆయన నిర్ద్వంద్వుఁడు. ప్రత్యాహార సంయమములం దాఁటి తేఱిన వాఁడు. తపోగ్నిచేఁ బరిపూర్ణమగు శరీరము కలవాఁడు. కావునఁ బ్రాకృతాగ్నిబాధ యాయన కేమియు లేదు. అది నిమిత్తమాత్రమే - సీతాదేవిని జంద్రమతిని నగ్నిహోత్రుఁ డేమిచేయఁగలిగెను? ఇక్కడ లౌకికాగ్ని నిమిత్తమాత్రమే. లౌకికాగ్నిచే భస్మముగాని యెముకలు పుఱ్ఱెలు నెన్నియో చూచుచున్నారు. ఈయన కట్టి శేష మేదియు మిగులలేదు. ఇది పార్వతీదేవి యోగాగ్నిచే దగ్ధమైనట్టువంటిది. యోగమువలనఁ బ్రాణము విడిచియుండిన శేషము మిగిలియుండును. ఆ శవమునకు దహనాద్యుత్తర క్రియ లావశ్యకమై యుండును. తక్కిన కర్మకాండము వెన్నంటియే వచ్చును - ఇప్పు డా బాధ బడనాయము తప్పినది.

ఒక కార్యమును సాధింప రెండుపాయము లుండిన నందు సుకరమార్గ మవలంబించువాఁడు బుద్ధిమంతుఁడు కనుకనే మరణదండమునకు యోగ్యుఁడగు వాలిని వధించుటయందు రెండుపాయము లుండినను శ్రీరామచంద్రమూర్తి సుకరము శీఘ్రఫలదము శాస్త్రావిరుద్ధమునగు నుపాయము నవలంబించెను.

—♦ ౬-వ సర్గము మునీంద్రులు శ్రీరామునితోఁ దమ కష్టంబులు దెల్పి శరణుఁజొచ్చుట ♦—

ఉ. మాని దినంబుఁ జేర నతి♦మానుష తేజుని రామచంద్రు వై
ఖానసవాలఖిల్యులును ♦ గాత్రశయాను లశయ్యనీరప
త్రానిలభోజనుల్, సురప ♦ థాలయులుఁ, మహీశయ్యు, లశ్మకు
ట్టానల తేజులుఁ, ఘనర ♦ సాంతరమగ్నులు యోగలగ్నులుఁ.

అతిమానుషతేజునిఁ = దివ్యతేజస్సుగలవానిని, వైఖానసవాలఖిల్యులును = “యేనఖాః తేవైఖానసాః యే వాలాః తేవాలఖిల్యాః” యను శ్రుతిప్రకారము భగవంతుని నఖములఁ బుట్టినవారు వైఖానసులు, భగవంతుని రోమములందుఁ బుట్టినవారు వాలఖిల్యులు. ౨. వైఖానసులు = విఖనసుఁడను ఋషిప్రోక్తమైన సూత్రముల ప్రకారము వర్తించువారు, గాత్రశయానులు = కూర్చుండి తలఁను ఱొమ్మునందో భుజమునందో వ్రాల్చి నిద్రించువారు, వీరు నేలపైఁ బండుకొని నిద్రింపరు. అశయ్యులు=పండుకొనని వారు, నీరపత్రానిలభోజనుల్ = నీరభోజనులు = నీళ్ళుమాత్రము త్రావి జీవించువారు, పత్రభోజనులు = ఆకులుతిని జీవించువారు, అనిలభోజనులు=గాలియే యాహారముగాఁ గలవారు, సురపథాలయులు=ఆకాశమే యిల్లుగాఁ గలవారు, మహీశయ్యులు = కటికినేలమీఁద నేమియుఁ బఱచుకొనక పండుకొను వారు,అశ్మకుట్టులు=గింజలను రాతితో నలియఁగొట్టి తినువారు, అనఁగా నగ్నితప్తము కాని ధాన్యము తినువారు. ౨. రాలతోఁ దమ దేహమును ఛేదించుకొనువారు. అనలతేజులు = అగ్నిహోత్రము తేజస్సువంటి తేజస్సుగలవారు, ఘనరసాంతర = నీటి

లోపల, మగ్నులు = మునిఁగి తపస్సుచేయువారు, యోగలగ్నులు = యోగమభ్యసించువారు.

వైఖానస శబ్దవిచారము సందర్భోచితముగా నుండుటచేఁ గొంత యావిషయము వ్రాయవలసివచ్చెను.

అయోధ్య ౧౩౮౧౧-వ పద్యమందు శ్రీరామచంద్రమూర్తి వైఖానస మార్గస్థితుఁ డయ్యెనని చెప్పఁబడెను. అచ్చట వైఖానస మార్గ మనఁగా వానప్రస్థ ధర్మ మని వ్యాఖ్యాత లందఱు వ్రాసిరి. ఇది యిప్పటి వైఖానసులకుఁ గొందఱ కభిమతిము గాకున్నను దప్పని చెప్ప వలనుపడలేదు. గార్హస్థ్యమన్నట్లు వానప్రస్థ మనునది యాశ్రమము పేరు, గృహమునందుండు వాఁడు గృహస్థుఁడు, వనమందుండు వాఁడు వానప్రస్థుఁడు. గృహస్థుఁడు వానియిష్టమువచ్చిన దేవతలను సకాముఁడయియో నిష్కాముఁడయియో యర్చింపవచ్చును, వానప్రస్థుఁడు మోక్షార్థి కావున నేక దేవతోపాసకుఁడే కావలెను. ౭౬-౭౭ పద్యములందుఁ జెప్పబడినవారు వానప్రస్థులే, సన్న్యాసులుగారు.

అగ్ని పక్వాశనో వా స్యా త్కాలపక్వ భుగేవవా
అశ్మకుట్టో భవేద్వాపి దంతోలూఖలకోపివా
సద్యః ప్రక్షాళకో వా స్యా న్మాససంచయకోపివా
షాణ్మాస నిచయోవా స్యా త్సమానిచయ ఏవవా॥ వైద్య.

వ్రతభేదములను బట్టి నామభేదములు గలిగెను. అయినను వీరు మతమందు వైఖానసమతమువారే. అది యెట్టిదనినః—విఖనసుఁడని బ్రహ్మకుఁ బేరు. ఈయన నారాయణునిచే నుపదేశమునొంది మత మొకటి స్థాపించెను. దానికి వైఖానస మత మని పేరు. భృగువు, మరీచి, అత్రి, కాశ్యపుఁడు-వీ రా మతప్రవర్తకులు. వీరందఱు విష్ణుభక్తులు. వీరు విష్ణ్వారాధనము మోక్షోపాయములందు ముఖ్యముగ నెంతురు. ఈ యారాధనము అమూర్తికిఁగాని సమూర్తికిఁగాని చేయవచ్చును. అమూర్తి పూజ యనఁగా సగ్న్యాదులందు భగవంతు నారాధించుట, సమూర్తిపూజ యనఁగా బింబపూజ. దీనినే విగ్రహారాధనమని బేరపూజయని యందురు. వీరిమత మున రెండవదియే యుత్తమము. మోక్షసాధనయు భగవదారాధన మనియే వీరి మతము. అనఁగాఁ దక్షిణవాసికంటె నిది ముఖ్యము. దీనికి దక్షిణ వంగములు.

వానప్రస్థ మాశ్రమమని యందిలివారి మతము. వైఖానసమని మీఁదవ్రాసిన యభిప్రాయమును నీ క్రింది వాక్యములు బలపఱుచుచున్నవి.

వైఖానసో వనేవాసీ వానప్రస్థశ్చ తాపసః॥ యాదవ॥

క్రియలు మానఁదగదు గృహాగతునికిఁ
దపసి కూర నుండఁదగదు సన్న్యాసికి
వనితతోడి పొత్తు వలదు వలదు॥ భాగ.

ఇందుఁ దపసిశబ్దము వానప్రస్థపర్యాయముగఁ బ్రయోగింపఁబడెను.
విఖనసోమతం వైఖానసం తత్రపరిస్థితాః వైఖానసాః వానప్రస్థాశ్రమిణః
ఇతి తావత్, తదుక్తం మనునా
పుష్పమూల ఫలై ర్వాపి కేవలై ర్వర్తయే త్సదా
కాలపక్వైః స్వయంశీర్ణైః వైఖానస మతే స్థితః
విఖనా ఇతి సకారాంతో ప్యస్తి. తథాచ శ్రుతిః
ధేను ర్వహానా మదితి స్సురాణాం బ్రహ్మ ఋషీణాం విఖనా
మునీనా మితి వైఖానససూత్ర ఏవ.
వానప్రస్థాశ్రమస్యోక్తత్వాత్ తదాశ్రమానువర్తినాం వైఖానసత్వవ్యపదేశః
అని శ్రీనివాసాచార్యులవారు శాకుంతల వ్యాఖ్యయందు వ్రాసిరి.

ఈ వానప్రస్థాశ్రమము కలియుగమునఁ బరాశరులచే నిషేధింపఁ బడిన వానిలో నొకటి.

"మాంసదానం తదా శ్రాద్ధే వానప్రస్థాశ్రమ స్తథా॥

ఆశ్రమము నిషిద్ధమైనను వీరును, మనుస్మృతి, రామాయణమందుఁ జెప్పఁ బడినవా రొకవిధమువారా? భిన్నులా? యను విషయము విచార్యము. వైఖానస సూత్రావలంబుల మనువారు ఆ నియమములఁ బాటింపకున్నను నేఁటికిని గలరు. వారికి భగవదారాధనమే ముఖ్యవృత్తియై యున్నది.

ఇట్టిదే పాంచరాత్ర మని మఱియొకటి గలదు. అది సాక్షా ద్భగవత్ప్రోక్తము. దాని విచార మిచట నప్రస్తుతము.

యోగలగ్నులు=ఈదృశః పరమాత్మాయం, ప్రత్యగాత్మా తథేదృశః, తత్సంబంధానుసంధాన మితి యోగః ప్రకీర్తితః॥ యోగో నామేంద్రియై ర్వశ్యైః బుద్ధే ర్బ్రహ్మణి సంస్థితిః, ప్రయుక్తై రప్రయుక్తైర్వా భగవత్కర్మ విస్తరః॥

తాత్పర్యము

శరభంగుఁ డట్లు పరమపదంబుఁ జేరఁగా దివ్యతేజస్సుగల రామచంద్రమూర్తి నా యడవియందుఁగల ఋషులువాలఖిల్యులు, వైఖానసులు, కూర్చుండి నిద్రించువారు ఎప్పుడు పండుకొననివారు, నీరు నాహారముగాఁ గలవారు, వానలు గురిసినను ఎండలు కాసినను ఆరుబయటనే యుండువారు, నేలపైఁబండుకొనువారు, గింజల నుడికింపక రాతిపై నలియఁగొట్టి తినువారు, అగ్నిహోత్రమువంటి తేజస్సుగలవారు - జలములో మునిఁగి (యనఁగా శిరస్సు మాత్రము మీదికి గానవచ్చునట్లుచేసి గొంతు లోఁతు నీళ్లలోనుండి) తపస్సుచేయువారు, యోగమందే లగ్నమైన మనస్సులు గలవారు.

౧౦. వ్రతులును నపక్షిప్రాళులు, సతతార్ద్రపటాల్ మరీచి♦చయపానులు ని
ర్జితసకలేంద్రియులును స,మ్మతదంతోలూఖలు లైన ♦ మానివరేణ్యుల్. ౨౨

వ్రతులు = ఏ యాహారము తీసికొనక యెప్పుడుపవాస ముండువారు-సంప్రక్షాళులు (౧) ఎప్పుడు దేహము కడుగుచుండువారు (౨) భగవత్పాద ప్రక్షాళము నుండి పుట్టినవారు (3) ఏ దిన మాహార మా దినము సంపాదించి సర్వము భగవంతునికి నివేదించి మఱునాటికి నత్తిపెట్టుకొనక వినియోగించువారు-నిర్జిత=జయింపఁబడిన, సకలేంద్రియులు = అన్ని యింద్రియములు గలవారు - దంతోలూఖలులు = దంతములే ఱోలుగాఁ గలవారు - ధాన్యమును బొట్టు తీయక యట్టులే నమలి తినువారు.

తాత్పర్యము

నిరతోపవాసులు, ఱేపటి కనుమాట లేక యేదినము దొరికినది యా దినమందే భుజించువారు, దేహము నెప్పుడు తడుపుచుండువారు - సూర్యకిరణములు ద్రావి (ultra violet rays) జీవించువారు, ఇంద్రియజయము గలవారు, దంతములే ఱోళ్ళుగాఁ గలిగి యెట్లు దొరికిన ధాన్య మట్టులే నమలి తినువారును నగు మునిశ్రేష్ఠులు.

శం. ధర్మజ్ఞా లచలచిత్తులు, ధర్మభృదగ్రియుఁ బరమ ♦ ధర్మజ్ఞుని స
త్కర్మాచరణధురీణుని, నిర్మలు శ్రీరామచంద్రు♦నిఁ బలశాలిన్. ౭

ధర్మజ్ఞులు=ధర్మమెఱిఁగినవారు - అచలచిత్తులు=చలింపని మనస్సుగలవారు - ఇట్టి మహర్షులు - ధర్మభృత్ + అగ్రియున్ = విల్లుపట్టెడువారిలో మొదటి వానిని (౨) ధర్మమును జెడకుండ భరించువారిలో మొదటివానిని - పరమ ధర్మజ్ఞుని = శ్రేష్ఠమైన ధర్మము - దెలిసినవానిని - ఇది విశేషధర్మము. శరణాగతరక్షణము పరమ ధర్మము. సత్కర్మాచరణధురీణుని = మంచికార్యములు చేయుటయందు సమర్థుని - నిర్మలు = దోషరహితుని-బలశాలిన్ = తాము కోరఁబోవు కార్యమును సమర్థింపఁగావలసిన బలముగలవానిని.

తాత్పర్యము

ఆత్మరక్షణమందు మనము సమర్థులము గాము - పరాధీనులము - సర్వతంత్ర స్వతంత్రుఁడు సర్వజ్ఞుఁడు సర్వశక్తిమంతుఁడు ఆపద్బాంధవుఁడు భగవంతుఁడొక్కఁడే-ఆపదలయందాయనను రక్షరక్షయని శరణువేఁడుటే జీవునకు స్వధర్మమను ధర్మము నెఱిఁగినవారు-ఈ విషయమునఁ జలింపని చిత్తముగలవారు నగు మహర్షులు యోగులు మానులు 'పరిత్రాణాయ సాధూనా'మ్మని సాధు పరిత్రాణ ధర్మమందు మొదటివానిని, అట్లు పరిత్రాణమునకుఁ గావలసిన యాయుధము కోదండము ధరించిన వానిని - "సాధనంచ ద్విధా కార్యం ధర్మద్వేషినిరాకృతౌ। శస్త్రవ్యాహారరూపేణ శాస్త్రరూపేణచైవహి॥ ॥అహి॥ ధర్మద్వేషులను రెండు విధముల సాధింపవలెను - శస్త్రములచే నొకటి - శాస్త్రముచే నొకటి - శాస్త్రమునకు లోపడనివారిని శస్త్రములచేఁ జక్కపఱుపవలయును - ఈ రెండు విధముల సామర్థ్యము శ్రీ రామచంద్రమూర్తియందుఁ గలదని, భావము - కృష్ణభగ

వానుఁడు నుపదేశముచే బాగుపడగలవారికి నుపదేశము, అది వ్యర్థమని తోఁచిన చోటఁ దాడనము చేసెను - శక్తియుండిన మాత్రమునఁ బ్రయోజనము లేదు. కావున శరణాగత రక్షణమే పరమధర్మమను జ్ఞానము గలవానిని (కనుకనే తమ శరణాగతి వ్యర్థముకాదని నమ్మకము గలవార్లైరి.) సత్కార్యములు చేయుటయందు సామర్థ్యము గలవానిని, త్రికరణశుద్ధి గలవానిని, తమ కార్యము నెరవేర్చుటకుఁ గావలసిన బలముగలవానిని - శ్రీరామచంద్రమూర్తిని.

ఉ. చేరి రఘూత్తమా! మనుజ ♦ శేఖర! వేల్పులలో బలారి నా
శ్రీరఘువంశ్యకోటులను ♦ శ్రేష్ఠుఁడ, వుర్వికి భర్త, పీవ నీ
భూరి యశంబు విక్రమము ♦ భూనుతముల్, పితృభక్తి సత్యవా
చారతి ధర్మనిష్ఠయును ♦ సంతత మొప్పును బుష్కలంబుగన్. ౭౯

చేరి = సమీపించి - దీనిచే నాభిముఖ్యము - అభిగమనము చెప్పఁబడెను - బలారి = ఇంద్రుఁడు - నాన్ = అనునట్లుగ - పుష్కలంబుగన్ = దండిగ.

చేరి=స్వప్రకాశము పరబ్రహ్మ కకుత్స్థవంశమునందుఁ బుట్టి మన భాగ్యవిశేషమున మన కన్నులకు గోచరించుచున్నాఁడు - కావున మన తపస్సులు దానములు నేఁడు ఫలించెను. అని తలంచి కృతార్థులుగాఁ దలంచి నిజుపేదకు నిక్షేపము దొరికినట్లు నిర్భరానందముగ మునీశ్వరు లందఱు నానాదిక్కులనుండి చేరిరి - మహేశ్వర తీర్థులు.

మనుజ శేఖర వేల్పులలో బలారినాన్ = ఇది కాకువు. నీవు దేవతలలో నింద్రుని వంటివాఁడవా? కావు. నీవు జగద్ధారణ పోషణకర్తవు.

తాత్పర్యము

ఆశ్రయబుద్ధి సమీపించి రఘువంశసత్తమా - పురుషరత్నమా దేవతలం దింద్రుఁడో యనునట్లు రఘువంశమునఁ బుట్టిన వారిలో నీవు శ్రేష్ఠుడవు. కావున నీ యభిజాతత్వము (గొప్పవంశమునఁ బుట్టుట) శ్లాఘ్యమైనది - గొప్ప వంశమునఁ బుట్టినవారికి గొప్ప బుద్ధియేకదా యుండును - అట్లు వంశకీర్తికరమైన బుద్ధియుఁ గలవాఁడవు - అంతియకాక భూమికంతయు భర్తవు నీవే - శరభంగు ననుగ్రహించుటచే నీ కీర్తియు, విరాధవధచే నీ విక్రమమును లోకులు పొగడుచున్నారు.

అరణ్యమునకు వచ్చుటచేఁ దండ్రియందలి భక్తి, భరతుఁడు ప్రార్థించినను ప్రతిజ్ఞ భంగముసేయమి, సత్యవాక్యమందుఁ గల ప్రీతి, శరభంగానుగ్రహము వలన ధర్మమందు నిష్ఠ, యివి నీయందు సంపూర్ణముగాఁ గొఱఁతలేక నిండియున్నవి.

కం. నిను ధర్మవత్సలు మహాత్ముని, ధర్మజ్ఞుని మఱుంగు ♦ మొగిఁ జొచ్చితి మో
జనకసుతాహృదయేశ్వర, విను మర్థించెద మొకండు ♦ విషయము నాథా. ౮౦

ధర్మవత్సలున్=శరణాగత రక్షణ ధర్మమును బ్రీతితోననుష్ఠించువానిని-మహాత్మున్=పరమాత్మ స్వరూపుని - గొప్ప యుదారస్వభావము గలవానిని-ధర్మజ్ఞుని=

శరణాగత రక్షణ ధర్మ మపరిత్యాజ్య మని యవశ్యానుష్ఠేయ మని తెలిసినవానిని - మఱుంగు చొచ్చితిమి = శరణుజొచ్చితిమి. బిడ్డలకు భయమువొడమినపుడు తల్లిదండ్రుల చాటునకుఁ బోవునట్లు మేము నీ చాటున నిలిచితిమి - మొగిన్ = చక్కఁగా, త్రికరణశుద్ధిగా, జనకసుతాహృదయేశ్వర = జానకీవల్లభా - ఇది సీతాదేవి పురుష కారమును బ్రార్థించుట తెలిపెడిని - అర్థించెదము = యాచించెదము - నాథా = రక్షకుఁడా.

తాత్పర్యము

పరమాత్మ స్వరూపుఁడవై కావుననే గొప్ప యుదారగుణము గలవాఁడవై శరణాగతరక్షణ విధము దెలిసి దానిని బ్రీతితో ననుష్ఠించుచు మాకు నాథుఁడ వగుటచే సీతావల్లభా! నీ మఱుఁగును త్రికరణశుద్ధిగాఁ జొచ్చితిమి - నిన్ను మే మొక విషయము యాచించెదము.

ఉ. ఏ మొకమన్వి చేయ మది ♦ నెంచితి మింతునకె క్షమింపుమీ
భూమిధవుం డెవండు కర ♦ ముం గొని యాఱవపాలు పుత్రుల
ట్లా మనుజాళిఁ బ్రోవఁడొ మ ♦ హా త్తరపాపము వాఁడు పొందెడిన్
రామ! యటాట భూమిజన ♦ రక్షయె కార్యము నేలతేనికిన్. ౮౧

మన్వి = విన్నపము - కరమున్ = పన్నును - నేలతేనికిన్ = రాజునకు - భూపతికి.

తాత్పర్యము

రామచంద్రా! మే మొక విన్నపము చేయఁదలఁచినారము-సత్పు కార్యవతాం పుంసామల మేవాగ్రత స్థితి" యను న్యాయమున మీరు వచ్చుటే చాలదా మిమ్ము జూడఁగనే మీ యభిప్రాయ మెఱుఁగలేనా, అంతమాత్ర మింగితజ్ఞానము నాకు లేదని తలఁచితిరా యని కోపింపకుము. మేము కార్యార్థులమై వచ్చినవార మగుటచే నీకుఁ దెలిసినను దెలియకున్నను అడిగినను నడుగకున్నను చెప్పుకొనవలసినది మాకు విధి- చెప్పుకొనలేదను లోపము మాయందుండరాదు - ఆఱవభాగము పాలు కప్పము తీసికొని యేరాజు ప్రజలను దన బిడ్డలవలె రక్షింపఁడో యా రాజు మహాపాతక మును సంపాదించినవాఁ డగుచున్నాఁడు, కావున రామచంద్రా! ప్రజాపాలనమే రాజులకు ముఖ్యకార్యము.

అరక్షితారం రాజానం బలిషడ్భాగహారిణమ్
తమాహుః సర్వలోకస్య సమగ్ర మలహారకమ్॥ మను. 8-308

ఏరాజు ప్రజలవలన నాఱవభాగము కప్పము గొని వారిని బాలింపఁడో వాఁడు సకలజనుల పాపములను గొని నరకముల పాలగును.

(ఈ విషయ మయోధ్యాకాండమందు రామభరతసంవాదమున వివరింపఁ బడినది.)

కం. తనప్రాణంబులవగిదిని, దనప్రాణముకంటె నిష్టతాపాత్రములౌ
తనయుల గతి మనుజులఁ బ్రోచినపతి చిరకీర్తి బ్రహ్మచేఁ బూజఁ గనుఁ. ౧౨

ఇష్టతా పాత్రములు = ప్రేమకు యోగ్యులైనవారు-చిరకీర్తి = శాశ్వతమైన యశస్సు.

తాత్పర్యము

ఏరాజు తన ప్రాణములఁ దాను రక్షించురీతిని దన ప్రాణములకంటె నెక్కువ ప్రీతితోఁ గొడుకులను రక్షించు విధముగను బ్రజలను బరిపాలించునో యా రాజు శాశ్వతకీర్తి సంపాదించి పరలోకమున బ్రహ్మలోకమునకుఁ బోయి యచట బ్రహ్మచే గౌరవింపఁబడును.

కం. ఫలమూలంబులు మెసవుచు, నలఘుతపముఁ జేయు నా మహర్షులు తపమం
దలినాలవభాగముఁ బ్రజ, నెలమిని రక్షింప జేని కిడుదురుగాదే. ౧౩

తాత్పర్యము

తాము వేరు వెల్లంకులు ఆకు లలములు తినుచు గొప్ప తపస్సుచేయు మహర్షులు తమంత కష్టించి సంపాదించిన తపఃఫలమందు నాలవభాగము రాజున కిచ్చుట యతఁడు ప్రజలను రక్షించునిమిత్తమైయేకదా.

౧౦-వ పద్యమం దాఱవభాగమని చెప్పఁబడెను. ఇందు నాల్గవభాగమని చెప్పఁబడెను. మఱికొన్నిచోటుల రెండవభాగము కప్పము చెప్పఁబడినది. ఇందేది నిశ్చయము ?

సందర్భానుసారముగ నన్నియు సత్యములే.
"యస్యాన్నపాన పుష్టాంగః కురుతే ధర్మసంచయమ్
అన్నప్రదాతుస్తస్యార్ధం, కర్తుశ్చార్ధం నసంశయః॥

ధర్మకార్యములు చేయువాని నెవ్వఁ డన్నపానము లిచ్చి రక్షించునో వాఁ డా ధర్మమందు సగమభాగము పొందును, ధర్మము చేసినవాఁడు సగముఫలముఁ బొందును. అను స్మృతివాక్యప్రకార మన్నదాత సగము పంచుకొనును. ఉపవాసులు ప్రజల వలన భిక్ష గ్రహించి బ్రతుకువారు వీరి ధర్మమునందు నాఱవభాగము, రాజుచే రక్షింపఁబడు దేశమునఁ బుట్టినఫలములు దిని బ్రతుకువారి ధర్మమునందు నాలవభాగము రాజునకుఁ బోవును. ఇది యిప్పటివలెఁ గొని తినెడివారి విషయముగాదు.

శా. దీనార్తావనదక్ష ! విన్ము గలరీతిన్ బ్రహ్మభూయిష్ఠ మీ
వానప్రస్థగణంబు భూరిమహిమన్ వాసిల్లి త్వన్నాథమే
యైనన్ మిక్కిలి బాధలం గనెడి రాక్షసా దుష్టమాంసాశిసం
తానం బేఁపఁగ మాకు నిష్ఠభయదానం బీఁగదే ప్రేమిడిన్. ౧౪

దీనార్త్తావనదక్ష = పరులచేఁ బీడింపఁబడి దుఃఖించువారిని, బాధపడువారిని రక్షించు సామర్థ్యము గలవాఁడా, బ్రహ్మభూయిష్ఠము = బ్రాహ్మణులు విశేషముగాఁ గలది, బ్రహ్మజ్ఞానము గలవారిచే నిండినది, త్వన్నాథము=నీవే దిక్కుగాఁ గలది, దుష్టమాంసాశి సంతానంబు = చెడుగుణముగల రాక్షసుల సమూహము, ఏఁపఁగన్ = బాధింపఁగా; అభయము = భయపడవలదు, అని వాక్యదానమును, ప్రేముడిన్=ప్రేమచే.

బ్రహ్మభూయిష్ఠము = బ్రహ్మవిద్భూయిష్ఠము, త్వన్నాథము=నీవే దిక్కుగాఁ గలది, ఇట్లనుటచే అనన్యశేషత్వము చెప్పఁబడెను.

వారికి నాథుఁడ వనుటచే అనన్యసాధనత్వము, అనన్యభోగ్యత్వము చెప్పఁబడెను. దీనివలన మహానిరతిశయమహిమ చెప్పఁబడెను.

తాత్పర్యము

దుష్టులు పెట్టు బాధలచే దుఃఖించుచు బాధపడువారిని రక్షించు సామర్థ్యము గల శ్రీరామచంద్రమూర్తీ! యథార్థము చెప్పుచున్నాము, వినుము. ఈ వానప్రస్థుల సమూహమందు బ్రాహ్మణులు విశేషించియున్నారు. కొంచెముమంది క్షత్రియులు వైశ్యులుకూడ నున్నారు. ఈ యందఱుకూడ గొప్ప తపోమహిమచేఁ గీర్తి గాంచియు నీవే దిక్కని నమ్మియున్నారు. క్షత్రియులు వైశ్యులుకూడ స్వశక్తిచేఁ దమ్ము రక్షించుకొందమను తలంపు గలవారు గారు. ఇట్లు నిన్ను నమ్మి నీవే నాథుఁడుగ నెంచి యుండియు దుష్టులగు రాక్షసులు పెట్టెడి బాధ సహింపలేక మిగుల బాధపడుచున్నారు. ఇది యుపేక్షించుట నీకుఁ దగినదికాదు. మాయందుఁ బ్రేమగలవాఁడవై మా కభయదాన మిమ్ము, మాకు భయములేకుండఁ జేయుము.

కం. రమ్మవిగో రాఘవ కనుఁ,గొమ్ము వనంబునను నసుర♦కోటులచే నా
శమ్మును గన్న మునీంద్ర చ,యమ్ముల దేహమ్ములెమ్ము♦లంతటఁ గననౌ. ౧౫

ఎమ్ములు = ఎముకలు, అంతటన్=అన్నిప్రదేశములందు, కననౌన్ = చూడవచ్చును.

తాత్పర్యము

శ్రీరామచంద్రా! రాక్షససమూహములచే హింసింపఁబడిన మునుల దేహములందలి యెముకలు సర్వత్ర పడియున్నవి. అవిగో దూరమున గానవచ్చుచున్నవి. మావెంట రమ్ము, చూపెదము.

కం. పెంపఱ మందాకినితటిఁ, బంపానదిఁ జిత్రకూట♦పర్వతమున వా
సింపఁగ ఋషు లవ్వారిం, జంపెను నొంచెను సురారి♦సంఘము లీశా. ౧౬

పెంపఱన్=పెంపుచెడునట్లు, వాసింపఁగన్ = వసింపఁగా, మందాకిని = శరభంగాశ్రమమునొద్ద నుండునది.

తాత్పర్యము

మందాకినీ తీరమందు పంపానదియొడ్డున చిత్రకూటపర్వతమందు వసించు ఋషులను రాక్షసులు బాధించి చంపుచున్నారు.

ఇచ్చటఁ బంప నదిగాఁ జెప్పఁబడెను. ఈ కాండమందే ౭౩-వ సర్గమందు శీఘ్రోదకౌ ప్రహ్వః ౪౦-వ శ్లో. చల్లనీళ్ళ మడుఁగు, పుష్కరిణీం పంపాం=పంపయను పుష్కరిణి (కొలను) ౭౪-౪ లో పుష్కరిణ్యాః పంపాయాః; పంపా పుష్కరిణీ యని ౭౫-వ సర్గయందు పంపాపానీయవాహినీం అని, ఉదకవాహినీ యనియుఁ జెప్పఁబడెను. ఈ వాక్యములు పంపయనునది కొలనా నదియా యను సందేహము గలిగించుచున్నవి.

పానీయవాహినీ, ఉదకవాహినీ శబ్దములు నీళ్ళను వహించునది యను నర్థమున గ్రహించినను ఇందు నది యని స్పష్టముగా నున్నది. పుష్కరిణీ శబ్దము నకుఁ గమలములు గలది యని నదీపర్యాయముగ నర్థము గ్రహింతమనిన ప్రహ్వ శబ్దము బాధించుచున్నది. భవభూతి "తదేతత్పంపాభిధానం పద్మసర" యనియే వ్రాసెను. ఈ విషయము కిష్కింధాకాండము ౧-వ పద్యము వ్యాఖ్యయందు విచారింపఁబడును.

చ. మునిజనవిప్రకారము న ♦ మోఘబలా! సయిరింపలేమిచే
నిను శరణంబు జొచ్చితిమి ♦ నీవె శరణ్యుఁడ వాసురాళిచేఁ
బొనుఁగుపడంగనీకు, కృప ♦ భూమితలంబున నీవు తప్ప మా
కును గతిలేదు, మా వెతలు, ♦ కూలగ జేయవె జానకీపతీ. ౮౭

విప్రకారము=కీడు, అమోఘబలా=వ్యర్థముకాని బలముగలవాఁడా, శరణ్యుఁడవు = రక్షింప శక్తిగల యోగ్యుఁడవు, రక్షకుఁడవు, పొనుఁగుపడనీకు = నశింపనీయకుము, వెతలు = బాధలు, జానకీపతీ = ఈ పదము సీతాపురుషకారము సూచించుచున్నది, మమ్ము రక్షించువిషయమందు నీకు సందేహముండిన సీతాదేవి నడిగి చూడు మని భావము.

తాత్పర్యము

దేహాభిమానము వదలి మృత్యువును లక్ష్యముసేయక తపస్సుచేయు మా కేల యీ మరణభీతి యందువేమో, మాకుఁగా మేము దుఃఖింపలేదు. సంసారము రోసి యడవులం దుండి తపస్సుచేసికొందమని వచ్చిన మునిజనులకుఁ గలుగు నపకారము మేము చూచి సహింపలేక యున్నాము. కావున నీవు రక్షింపఁగలవాఁడవు. అమోఘబలుఁడవు కావున నిన్ను శరణుజొచ్చితిమి. మేము రాక్షసులచేఁ జావకుండ నీ దయాగుణము నాలోచించి కాపాడుము. నీవు మెచ్చునంతటి తపస్సు చేసితిమే, మమ్మేల కాపాడవని నిర్బంధింపము. బలముగలిగి దీనుల నార్తుల రక్షింపక పోవుట దయావంతుల లక్షణముగాదు. కావున నీ కల్యాణగుణము లాలోచించి

వానికి హాని రాకుండఁ గాపాడుకొనుము, ఎందఱో రాజులున్నారే వారిసహాయ మేల కోరినవారుగారు, ఇన్నాళ్ళేల సయిరించితి రనెదవేమో ? నీవుతప్ప మాకు వేఱు గతిలేదు. మే మనన్యులమగుటచే నీరక్షకత్వమే కోరి నీ వెప్పు డవతరింతువా ఎప్పుడు దర్శనమిత్తువా ఎప్పుడు మమ్ముఁ గృతార్థులఁజేసి రక్షింతువా, యని కాచి యున్నారము. కావున మాదుఃఖములు దొలఁగఁజేయుము. మా విషయమున దయ దలఁపవలయునా అక్కఱలేదా యను విషయమున సీతాదేవి నడిగిచూడుము.

ఇది యనన్యత్వమును బోధించుచున్నది – అనన్యత్వమనఁగా భగవంతునిఁ దప్ప వేఱొకని 1. రక్షకుఁడుగ దలఁపకుండుట, 2. భగవత్ప్రాప్తి తప్ప వేఱు ఫలము గోరకుండుట 3. భగవదనుగ్రహము సంపాదించుకొనుటకు భగవంతునే యుపాయముగఁగొని వేఱొక యుపాయము వెదకికొనకుండుట. మనము భగవంతుని వారమేకాని యితరులవారము కాము–ఆయనకు మనము స్వజనులము–కావున సన్ని భావముల నాయననే యాశ్రయించి యుండవలయు ననుట యనన్యభావము–భార్యా భర్తలు పితాపుత్రులు నెట్లేకీభావము వహించియుందురో యట్టిభావ మనన్యభావము అభేదబుద్ధియని యర్థము – అనఁగాఁ దండ్రి యెవఁడో నేనెవఁడో భిన్నపదార్థము లని కొడుకు దలఁచుట భేదాభిప్రాయము. తండ్రివాఁడను నేను, నాజన్మస్థితి పోషణా దుల కాయనయే యాధారము–ఆయనయంశుఁడనే కదా, కావున నభేదమని తలఁచుట యనన్యభావము. అట్టులే యల సముద్రము వేఱు, తాను వేఱని తలఁచుట ఎండ, తాను వేఱు, సూర్యుఁడు వేఱని తలఁచుట యన్యభావము – కారణమున కంటె మేము భిన్నులము కామని యవి తలఁచుట యనన్యభావము – సముద్రమే నేనని యల తలఁచుటవంటిదిగాదు.

నీవే శరణ్యుఁడవని యుపపదములేక చెప్పుటచే సర్వలోకశరణ్యుఁడనిభావము– అట్టి శరణ్యత్వమునకుఁ గావలసిన గుణములు బలము దయ యనునవి యమోఘ బలా – కృపయను పదములచేఁ దెలుపఁబడెను – స్వామిత్వము – వేఱుగతి లేదనుట తెలుపును–శరణంబు చొచ్చితి మనుటచే నీవే యుపాయాంతరస్థానమందున్నవాఁడ వని యర్థము – నీవే శరణ్యుఁడః నుటచే మహావిశ్వాసములోనుగాఁగల యంగసంపత్తి పూర్వకమైన రక్షాభరసమర్పణము చెప్పఁబడియె. మావెతలు గూలఁగఁజేయవె యనునది గోప్తృత్వవరణమును దెలుపును. గోప్తృత్వవరణ మనఁగాఁ దమ యభి ప్రాయము దెలుపుట. ఇది యనిష్టనివృత్తిరూపమగు ఫలమును ప్రార్థించుట తెలుపును– తనిశ్లోకి.

నీవు తప్ప మాకును గతిలేదనుచో "తమేవం విద్వాఁ సమృత ఇహ భవతి నాన్యః పంథా అయనాయ విద్యతే" యను సూక్తమును స్మరింపవలయును.

—♦ శ్రీరాముఁడు మునుల కభయం బొసంగుట. ♦—

చం. అన రఘునాథుఁ డిట్లను మ ♦ హాత్ముల రీరీతు నన్నుఁ బల్కఁగా
జనునె? త్వదాజ్ఞ వర్తిలుదు ♦ సంయములార! యరణ్యసీమకుఁ
బనిగొని యాత్మకార్యముగఁ ♦ బాపుల నెల్ల నడంచి మీకు శో
భన మొనగూర్ప మజ్జనకు ♦ వాక్యము సాకుగ నేను వచ్చితిన్. ౮౮

ఈరు=మీరు - తదాజ్ఞఁ = మీయాజ్ఞాప్రకారము-ఆత్మకార్యముగ = నా పనిగ - ఇందుఁ గృతిత్వమను భగవద్గుణము వర్ణింపఁబడినది.

తాత్పర్యము

అని ఋషు లందఱు చెప్పఁగా శ్రీరామచంద్రమూర్తి యిట్లనియె. మహానుభావులారా! మీరు నన్ను నిటు గొప్పచేసి పలకవచ్చునా? నేను మీయాజ్ఞా ప్రకారము వర్తించువాఁడనే - మీ రాజ్ఞాపింప నర్హులు గాని విజ్ఞాపింప నర్హులు గారు - నే నీయడవులకు నాస్వకార్యము మీఁదనే వచ్చితిని - ఏమి నీస్వకార్య మందురా? ఈ యడవులందుండు రాక్షసులనెల్ల వధించి మీకు మేలు గలిగించుటే నా స్వకార్యము - అయ్యా! యివి యిచ్చకములు - ఇప్పుడు మేము ప్రార్థింపఁగా మాముఖప్రీతికై మాటలాడుచున్నావు - నీ తండ్రిని సత్యవాదిని జేయఁగదా నీవు వనములకు వచ్చితివందురేమో - అది నెపమే కాని యథార్థము గాదు - ఇందు నీ స్వప్రయోజన మే మందువా యాశ్రితుల రక్షింపవలసినది రక్షకుని విధిగదా!! నా కార్యము నే నింతవఱకుఁ జేయక మీరు ప్రార్థించువఱకు నూరకుండుట నా లోపమే - మీరు సంయములు గనుక క్షమింపుఁడు.

భగవంతుఁడు భక్తపరాధీనుఁడు. గర్భస్థశిశువు కోరకున్నను తల్లిదండ్రులు దానిని బోషించువిధమున భక్తులు కోరకున్నను వారి యోగక్షేమములు నిర్వహించుట భగవంతుని కార్యము - అట్లు చేయకుండుట లోపము గదా - అయోధ్యాకాండమందలి ౪౬౭-౪౬౮ పద్యములం జూడుఁడు.

"శక్తోపి రాఘవస్తస్మై రాజ్యం సంత్యజ్య ధర్మతః దశగ్రీవవధార్థాయ పితుర్వచనహేతునా॥" పద్మ - రామచంద్రమూర్తి రాజ్యము గ్రహింప శక్తుఁడయ్యును రావణుని జంపు నిమిత్తము పితృవచనము కారణముగాఁగొని రాజ్యమును వదలిపెట్టెను.

శ్రీరామచంద్రమూర్తి జనకవాక్య పరిపాలనార్థ మరణ్యముల పాలాయెనని పెక్కుతావులఁ జెప్పఁబడెను - ఇచ్చటఁ దనకుఁ బ్రధానకార్యములను రాక్షస వధ యనియుఁ దండ్రి వాక్యము నిమిత్తమాత్రమని చెప్పుటచేఁ దండ్రివాక్య మప్రధానమయ్యెను - వారి యెదుర నా మాట వీరియెదుర నీమాట చెప్పవచ్చునా? రావణాసురుఁ జంపుట ముఖ్యకార్య మయ్యెనేని పట్టాభిషిక్తుఁడైన పిదప నేల చంపఁబోరాదు - లవణాసురవధ మట్లుగాదా చేసెను?

ఆశ్రిత రక్షణమును మునీశ్వర కార్యమునే ముఖ్యముగను దండ్రివాక్యము దానికి నిమిత్తమగుట గౌణముగను శ్రీరామచంద్రమూర్తి యెంచె ననియే చెప్ప వలసియున్నది - మొట్టమొదట అయోధ్యాకాండమున సుమిత్రుఁడు పిలువ వచ్చి నపుడు శ్రీరామచంద్రుఁడు సీతాదేవితోఁ జెప్పిన వాక్యముల ధోరణిచూడఁ (ప. ౪౯౭-౪౯౮) గా నాశ్రితరక్షణకార్యమందే యాయనకు మనస్సు లగ్నమై నిమిత్తమునకై యెదురు చూచుచున్నట్లు కానవచ్చుచున్నది - ఇఁకఁ గైకతో సంభాషించునపుడు మీతండ్రి నాకు వరములిచ్చెను - నీ వరణ్యమునకుఁ బొమ్మన గానే యామె మాట యామె నోరనుండఁగానే పోయెద నని చెప్పెను.

తల్లికిఁ బోషణాదులయం దధికారమే కాని యాజ్ఞాపించు నధికారము లేదని ముందే కౌసల్యావిషయమున విచారింపఁబడెను; కౌసల్యకు లేని యధికారము కైక కెందుండివచ్చెను? తండ్రిచెప్పనిమ్ము పోయెద ననియుండవచ్చును. అట్లు చెప్పినచోఁ దండ్రి చెప్పఁడు - ఇంతలో వసిష్ఠుఁడు లోనగువారు వచ్చి కైక ప్రయత్నము సాగ నిచ్చియుండరు - అరణ్యయాత్ర నిలిచిపోయి యుండును - అది రాముని యుద్దేశము గాదు. భరతుఁడు మొదలగువారు నిన్ను రాజ్యభ్రష్టుని జేయు నధికారము దశరథు నకు లేదని వాదించినపుడు దానికి సమాధానము నేను ప్రమాణము చేసియున్నానని చెప్పెను - ఈయనను ప్రమాణము చేయుమని యెవరు కోరిరి? - కైక చెప్పిన మాటలు విని యారక వెలుపలవచ్చి వసిష్ఠాదులతో లోపలి సందర్భము లిట్లున్నవి, నన్నేమి చేయు మనెదరని చెప్పి యుండవచ్చునుగదా - అరణ్యమునకుఁ బోవుటయందుఁ బట్టుదల లేకున్న నిట్లేల చేసియుండరాదు - అప్పుడు నేను ప్రమాణము చేసితి ననుమాట పుట్టఁ గారణము కలుగదు కదా - కావున నేదియోని నెపము కలిగించుకొని యరణ్యములకుఁ బోవలయు ననియే రాముని సంకల్పము.

ఇఁక బట్టాభిషిక్తుఁడై రావణాసురవధ సలిపి యుండరాదా యనిన విరాధ వధ కబంధవధ ఖరాసురాదివధ వాలివధ వీనిని బరిశీలించినచోఁ బ్రతిపక్షుల దోషము స్వయముగఁ జూచికాని రామచంద్రమూర్తి దండించువాఁడు కాఁడు. రావణాసురు జంపఁ గారణము కలుగదు. ఒకవేళఁ బోయినను నీయనకుఁ గలది యక్షోహిణీసేన - తక్కిన రాజులందఱు గలిసినను 5—6 అక్షోహిణులగునేమో! వీరు రాక్షసుల నోళ్ళకు వడియాలుగాఁగూడఁ జాలరు. వాలియు సామంతరాజే కదా వాఁడు వానరసేనతో సహాయపడియుండఁడా యనిన మఱిఁదలిని జెఱిచి వధ్యుఁ డైన దోషిని సాహాయ్యముచేయు నెట్లుకోరును? ఎప్పటికైన వాఁడు వధ్యుఁడే.

అదట్టులుండఁ దన్నాశ్రయించి శరణాగతులైన మునీశుల యాశ్రమము లందుఁ బదిసంవత్సరములు సంచరించి వారికోరిక ప్రకారము వారికి దర్శనమిచ్చెఁ గదా - సాధు పరిత్రాణమునందు దర్శన మిచ్చుటే కదా ప్రధానము. పట్టాభిషిక్తుఁ డైనచోఁ బదిసంవత్సరము లిట్లు తిరుగ సాధ్యపడునా? ఇప్పటి సౌలభ్య మప్పుడల

వడునా ? కావున నాశ్రితరక్షణము ముఖ్యమనియు దానికి నిమిత్తమగుటఁ బితృవాక్యపాలనము గౌణమనియు నీ విధముగఁ దండ్రిని సత్యవాదిని జేసెను - ఆశ్రితుల రక్షించెను - దుష్టుల శిక్షించి సర్వకార్యములు చక్కఁబఱిచె ననియు నెఱుఁగ వలయును.

కం. కాన మహాఫలదం బగుఁ, గానవాసంబు మాకు ♦ గం డడఁతు ననిన్
మానిజనశాత్రవుల నిఁక, సానుజమద్బాహుశక్తి ♦ సంపదఁ గనుఁడీ. ౨౬

మహాఫలదంబు = గొప్ప ఫలమును గలిగించునది - కాననవాసంబు = అడవి యందు వసించుట - అనిన్=యుద్ధమందు - గండడఁతున్ = గర్వమణఁచెదను - శాత్రవులన్=విరోధులను - సానుజ = తమ్మునితోఁగూడిన - మత్ =నాయొక్క - బాహుశక్తిసంపదన్ = భుజబలముయొక్క యాధిక్యమును.

తాత్పర్యము

ఈ కారణముచే మాకు నరణ్యవాసము గొప్ప ఫలము గలిగించునది యగును. యుద్ధమందు మునులకు విరోధులగువారిని నా తమ్మునితోడఁ గలిసి వధించెదను - అప్పుడు నా భుజశక్తి చూడుఁడు.

ఇక్కడఁ జెప్పఁబడిన మహాఫలము - ఆర్త శరణాగత రక్షణమే - అనఁగా ననిష్టనివృత్తి - ఇష్టప్రాప్తి - నా భుజబలము చూడుఁ డనునది గర్వోక్తి కాదు - మునులకు ధైర్యము కలుగుటకై పూనినకార్యమందుఁ దనకుఁగల యుత్సాహము దెలుపుటకై చెప్పినమాట - ఇష్టులకు ధైర్య సంతోషములును విరోధులకు భయమును గలిగించు కార్యసాధకుని వాక్యము లాత్మస్తుతులు గావు.

౭-వ సర్గము.

తే. ఇట్టు లభయం బొసఁగి ము♦నీశ్వరులకు, సత్యనిరతుండు లక్ష్మణ♦సహితుఁడగుచుఁ
జని సుతీక్ష్ణాశ్రమంబున♦జాడఁబట్టె, యెల్లద్విజులును దనతోడ ♦ నేగుదేర. ౧

సత్యనిరతుండు=సత్యమందు విశేషాసక్తి గలవాఁడు - అనుటచేఁ దాను మునీశ్వరులకుఁ జెప్పినమాట నిర్వహింప మిక్కిలి యభిలాష గలవాఁడు.

తాత్పర్యము

ఈ ప్రకార మాఋషీశ్వరుల కభయమిచ్చిన రామచంద్రమూర్తి తనమాట నిర్వహించుటయందు విశేషాభిలాషగలవాఁడై తనతోడ ఋషీశ్వరులందఱు రాఁగా లక్ష్మణుతోడ సుతీక్ష్ణాశ్రమమునకుఁ బోవు త్రోవఁబట్టి పయనించెను.

ఇచ్చట సీతాదేవిపేరు చెప్పలేదు - లక్ష్మణుని పేరుమాత్రము చెప్పఁబడెను. దీనివలన రాక్షసవధయందు శ్రీరామచంద్రమూర్తి కున్నంత యుత్సాహము లక్ష్మణునకుఁ గలదని యేర్పడుచున్నది - సీతాదేవికో మునిజనరక్షణము సమ్మతమే కాని నిష్కారణముగ రాక్షసవధ చేయుట సమ్మతముగాదు-కావున నీ విషయమున నన్నదమ్ములకున్న యుత్సాహ మామెకులేదు - ఇది సీతాదేవి రామచంద్రమూర్తి

కుపదేశించిన హితబోధవలన స్పష్టమగును - కావున నిది సూచించుటకే వాల్మీకి యిచ్చట సీతాదేవి పేరు చెప్పలేదు.

ఉ. ఒయ్యన దూరమేగి విపు ♦ లోదక వాహిని సంతరించెఁ దా
నయ్యెడ నంజనోన్నతఘ ♦ నాఘమహీధ్రముఁ గాంచి సంతతా
క్షయ్యఫలప్రతానసుమ ♦ సంతతి వింతలుగొల్వఁ గానలో
నయ్యమరేంద్రవంద్యుఁడు శు ♦ భాశ్రమముం గనెఁ జీరమాల్యముల్. ౯౧

ఒయ్యనన్ = మెల్లఁగా - గుంపుగా మాటలాడుచుఁ బోవుచున్న కారణముచే మెల్లగాఁ బయనించి రని సూచన - విపులోదకవాహిని = విస్తారముగ నీళ్ళుగల యేటిని - సంతరించెన్ = దాఁటెను, అంజనోన్నత = అంజనపర్వతమువలె నెత్తైన దియు - ఘనాఘ = మేఘముతో సమానమై వ్యాపించియుండునదియు - నగు మహీధ్రముల్ = పర్వతమును-సంతత = ఎల్లప్పుడు నెడఁదెగక - అక్షయ్య=క్షయముగాని ఫలప్రతాన సుమసంతతి = పండ్లసమూహము - పుష్పముల సమూహము - చీరమాల్యముల్ = నారచీరలపంక్తులు గలది - దూరము = శరభంగుఁడు సమీపముననే సుతీక్ష్ణాశ్రమ మున్నదని చెప్పెనే యనిన మెల్లగాఁ బోవుటచే దూరమని తోఁచి యుండవచ్చును.

తాత్పర్యము

తోడ వచ్చిన వానప్రస్థులతో ముచ్చటలాడుచు మెల్లగాఁ దూరముపోయి యచ్చట రేవు చూచుకొని నదిని దాఁటి యచ్చటఁ గాటుక కొండవలె నల్లగా మబ్బువలె వ్యాపించియుండు పర్వతమును జూచి యా పర్వతము ప్రాంతమందు సర్వకాలముల నుడిపోక ఫలములచేఁ బూలచే నిండియుండు చెట్లను జూచి వాని సౌందర్య సంపత్తులకు నాశ్చర్యపడుచుఁ బోయిపోయి యా యడవిలో గాలి కారఁ గట్టిన నారచీరల వరుసలచే నందమయిన శుభాశ్రమమును రామచంద్రమూర్తి చూచెను.

—♦ శ్రీరాముఁడు సుతీక్ష్ణాశ్రమంబుఁ జేరుట ♦—

కం. డాసి యటఁ దపసి ధూళీ, ధూసరితజటాకలాపు ♦ ధుతపాపుని సౌ
ఖ్యాసనయుక్తునిఁ గని యిట్లాసీతాహృదయనేత ♦ యాడెం బ్రీతిన్. ౯౨

డాసి=సమీపించి - ధూళీ=వార్ధక బాధచే స్నానము చేయమిని దేహమందుఁ బుట్టిన మురికిచేతను గాలికివచ్చి పైపడిన దుమ్ముచేతను- ధూసరిత = బూడిదవర్ణము గల - జటాకలాపున్=జడల సమూహము గలవానిని - ధుతపాపునిన్=చిమ్మివేయఁ బడిన పాపములు గలవానిని - సౌఖ్యాసన యుక్తుని = సుఖాసనమం దుండువానిని - సీతాహృదయనేత = శ్రీరామచంద్రమూర్తి.

తాత్పర్యము

ఇటువంటి యాశ్రమమును సమీపించి, యందు స్నానము చేయకుండుటచేతను గాలికి వచ్చిన దుమ్ముచేత బూజుపాటిన దేహము-జడల సమూహము గలవానిని బావరహితు యథాసుఖముగఁ గూర్చుండిన వానిని సుతీక్ష్ణుని శ్రీరామచంద్రమూర్తి చూచి ప్రీతితో నిట్లనియెను.

సుతీక్ష్ణుఁడు బ్రాహ్మణతపస్విగదా స్నానములేక నిత్యకర్మానుష్ఠానము చేసికొనవచ్చునా యని సందేహము - స్నానము చేయుట శుచిత్వమునకే కదా.

అపవిత్రః పవిత్రో వా, సర్వావస్థాం గతోపివా
యః స్మరేత్పుండరీకాక్షం, స బాహ్యాభ్యంతరశ్శుచిః॥

అపవిత్రుఁడైనను బవిత్రుఁడైనను నే దశయం దుండినను భగవంతు విష్ణునెవఁడు స్మరించుచుండునో వాఁడు లోపల వెలుపలఁ గూడ శుచియే.

జలస్నానము బాహ్యమలమును బోఁగొట్టునే కాని యాంతరమలమును బోఁగొట్ట జాలదు. 'మానసం విష్ణుచింతన'మ్మని భగవద్ధ్యానరూపక మానసిక స్నానము చేయువాఁడు లోపల వెలుపలఁ గూడ శుచియే యని ప్రమాణము.

"తత్పాద పద్మజాం గంగాం, నిపతంతీం స్వమూర్ధని
చింతయే ద్బ్రహ్మరంధ్రేణ, ప్రవిశంతీం స్వకాం తనూం
తయా సంక్షాళితం ధ్యాయేత్ బాహ్యాభ్యంతరం మలమ్
తత్క్షణా ద్విరజో మంత్రీ, జాయతే స్ఫటికోపమః
ఇమం మానసికం స్నానం, ప్రోక్తం హరిహరాదిభిః
ఇదం స్నానం వరం మంత్రాత్, త్సహస్రాదధికం స్మృతమ్
సార్ధత్రికోటితీర్థేషు, స్నానాత్కోటిగుణాధికమ్.
రజస్తమో మోహజాతాన్, జాగ్రత్స్వప్నసుషుప్తిజాన్
వాఙ్మనః కర్మజాన్ దోషాన్నవై వా న్నవభిర్హరేత్
యోనిత్య మాచరేత్తం తు, సవై నారాయణ స్స్మృతః
జ్ఞానహ్రదే, ధ్యానజలే, రాగద్వేషమలాపహే
యః స్నాతి మానసే తీర్థే, స యాతి పరమం పదమ్॥

ఆయన పాదపద్మములందుఁ బుట్టిన గంగ తన శిరస్సునఁ బడి బ్రహ్మరంధ్రములోఁ బ్రవేశించి తన దేహము లోపల వెలుపలఁ గడిగినట్లు ధ్యానింపవలెను. ఇట్లు మంత్రధ్యానము చేయువాఁడు రజోహీనుఁడై స్ఫటికమువలె నిర్మలుఁ డగును - ఈ మానసస్నానము హరిహరాదులచేఁ జెప్పఁబడెను - ఇది మంత్రస్నానమునకంటె వెయ్యింతలు శ్రేష్ఠము-మూఁడుకోట్ల యేఁబదిలక్షల తీర్థములలో స్నానము చేయుటకంటె దీనియం దెక్కువ గుణము గలదు - రజసు - తమస్సు - మోహము వలనఁ బుట్టినవియు జాగ్రత్స్వప్న సుషుప్తులయందుఁ బుట్టినవియు మనోవాక్కర్మ

ముల వలనఁ బుట్టినవియు నగు తొమ్మిది విధములైన పాపము లీ మంత్రములు హరించుచున్నవి-ఎవఁడు ప్రతిదిన మీ స్నానము చేయునో వాఁడు నారాయణుఁడే-జ్ఞాన మను మడుఁగునందు రాగద్వేష మలముల హరించు ధ్యానజలములందు మానసతీర్థమున నెవఁడు స్నానము చేయునో వాఁడు పరమపదము చెందును.

ఇట్లుండ సర్వదా భగవద్ధ్యానమందుండు నమ్మహామునికి దేహము మఱికిని పోఁగొట్టు నీళ్ళయందు స్నానము చేయకుండిన నేమి లోపము? అదియును గాక వానప్రస్థులకుఁ ద్రిషవణ స్నానమేల చెప్పఁబడె నన దానియందు విరక్తి పుట్టి చాలించుటకే యని పతంజలి చెప్పెను.

అనఁగా మూఁడు మార్లు స్నానముచేసినను దేహమునుండి మఱికి రాక తప్పదు-వచ్చునది వచ్చుచునేయుండును - అట్లుండ నన్ని స్నానములు చేసి యేమి ప్రయోజనము? లోపల మలము పుట్టకుండు నుపాయము చేయవలయునని ప్రయత్నించుటకే యిన్ని స్నానములు చెప్పబడెను.

ఉ. రాముఁడ నేను దాపసవ ♦ రా యనఘా భవదీయదర్శనో
ద్దామముదాన వచ్చితి, య ♦ థామతి సాదరదృష్టిఁ జూడవే
నా మునితల్లజుండు రఘు ♦ నందనుఁ గ్రుచ్చి కవుంగిలించి సీ
తా మహిళేశ! సేమము మ ♦ దంబు గదాయని వెండి యిట్లనున్. ౯౩

తాపసవరా = మునిశ్రేష్ఠుఁడా - అనఘా = పాప రహితుఁడా - భవదీయ దర్శనోద్దామముదానన్ = నిన్ను దర్శింపవలయు నను గొప్ప సంతోషముతో-సాదరదృష్టిన్ = ఆదరముతోఁ గూడిన చూపుచేఁ జూడుము.

తా త్ప ర్య ము

ఋషీశ్వరా - పాప రహితుఁడా - నేను రాముఁడను నిన్ను దర్శింపవలెనని మిగుల సంతోషముతో వచ్చితిని - కావున మనసార ప్రేమగల చూపులఁ జూడుము - అని వేఁడఁగా మునిశ్రేష్ఠుఁడు రాముని గౌఁగిలించుకొని సీతేశ్వరా! నీకు సేమమే కదా యని మఱియు నిట్లనియె.

క. నీవచ్చినకతనమునఁ గడు. పావనమై యర్కనాథ ♦ వంతంబై భూ
మీవర యీ యాశ్రమ మెం, తో వెలయుచు నున్న దిపుడు ♦ దుర్భరతేజా! ౯౪

దుర్భరతేజా = భరింపరాని తేజముగలవాఁడా.

తా త్ప ర్య ము

ఇతరులకుఁ జూచియు సహింపరాని తేజస్సుగలవాఁడా! నీవు వచ్చిన కారణముచే నీయాశ్రమము మిగులఁ బవిత్రమై తగిన దిక్కుగలదై యిపుడు మిగులఁ బ్రకాశించుచున్నది.

తే. దేహమును వీడి యోవీర ♦ దేవలోక, మేగ నొల్లక నీవచ్చు ♦ టెఱిఁగి యింద
వేచి యున్నాఁడ నీకొఱ ♦ కై చుమయ్య, వచ్చితీవిట మద్భాగ్య ♦ వశతఁ దండ్రి ౯౫

తా త్ప ర్య ము

ఓ వీరుఁడా! నీ విచ్చటికి వచ్చెదవని తెలిసి దేహమును వదలి దేవలోకము నకుఁ బోవుటకు సమ్మతింపక యిందే నీకొఱకై కాచియున్నాఁడను. నా పుణ్యము కొలఁది నాయనా! వచ్చితివి.

దీనిచే స్వర్గలోక బ్రహ్మలోక ప్రాప్తికంటె శ్రీరామచంద్ర ముఖారవింద దర్శనము శ్రేష్ఠమని భావము.

శ్రీరాముని దర్శించినవారికి ముక్తిగలదు. దేవలోక బ్రహ్మలోకమునకు బోయినవారికి మరల జన్మము గలిగినఁ గలుగవచ్చునుగదా. ఆకారణముచే రామ దర్శన నిమిత్తమై కాచియున్నాఁడు.

తస్యాంతరాయో మైత్రేయ, దేవేంద్రత్వాదికం ఫలమ్

మైత్రేయా దేవేంద్రత్వము లోనైనది మోక్షమునకు విరోధి. పునర్జన్మ కారణము. కావున స్వర్గమునకుఁ బోనైతినని గోవిందరాజీయము.

వాస్తవార్థ మేమనఁగా రావణవధ నిమిత్తమై రఘువంశమునఁ బుట్టిన నీ రాజ్యభ్రష్టత్వము చిత్రకూటవాసము నేను వింటిని. ఆ కారణముచే వానివధ నిమిత్తమై నీ వీప్రాంతములకు వచ్చెద వనియు వింటిని. కావున నీరాక కెదురు చూచుచు దేవలోకమునకుఁ బోనైతిని, పరమపురుషార్థమైన నీదర్శనమునకు స్వర్గము విఘ్నము. కావున దేహము విడువకయున్నాను. మహేశ్వర తీర్థీయము.

కం. వింటిని రాజ్యభ్రంశముఁ, గొంటయు మునిరూపుఁ జిత్ర♦కూటంబున వా
ల్గంటియుఁ దమ్ముండును నీ, వుంటయుఁ గాకుత్స్థవర్య ♦ యుగ్రసుశౌర్యా! ౭౮

రాజ్యభ్రంశము = రాజ్యముపోవుట-మునిరూపు = మునివేషము - వాల్గంటి= సదుపైన కన్నులుగలది-కాకుత్స్థవర్య=కకుత్స్థునివంశమునఁబుట్టినవారిలో శ్రేష్ఠుఁడా, ఉగ్రసుశౌర్యా = మిక్కిలి గొప్ప పరాక్రమము గలవాఁడా - కాకుత్స్థవర్య యనుటచే కకుత్స్థునివలె నీవు దేవకార్యము తీర్పవలసియున్నదని భావము.

తా త్ప ర్య ము

కకుత్స్థవంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుఁడవును మంచిపరాక్రమము గలిగిన శ్రీరామచంద్రమూర్తీ! రాజ్యమును వదలి మునివేషమునుదాల్చి చిత్రకూటపర్వత మున నీవు భార్యయగు సీతాదేవితోఁ దమ్ముఁడగు లక్ష్మణునితోనుండుటయు విన్నాను.

ఉ. రమ్మని పిల్వవచ్చె సుర♦రాజు ననుర్ సుకృతాప్తి దేవలో
కమ్ములు గెల్చినాఁడ నఁట♦కారుణి కాగ్రణి నీవు మత్ప్రసా
దమ్మున భార్యతో ననుఁగు♦దమ్మునితో విహరింపు వాన; నా
బమ్మను గళ్యపర్షి యనఁ ♦ బల్కె మహర్షిని రామచంద్రుఁడుర్. ౭౯

సుకృతాప్తి = పుణ్యము లభించుటచే కారుణికాగ్రణీ = దయావంతులలో శ్రేష్ఠుడా - మత్ప్రసాదమ్మునన్ = నాయందలి యనుగ్రహబుద్ధితో, వానన్ = వానయందు - విహరింపు మనుటచేఁ గర్మ ఫలత్యాగము చెప్పఁబడినది.

తాత్పర్యము

దయావంతులలో శ్రేష్ఠుఁడవైన రామచంద్రా! నేను సంపాదించిన పుణ్యములచే స్వర్గము సంపాదించితివని అచ్చటికి రమ్మని యింద్రుఁడు నన్నుఁ బిలువవచ్చెను. గాని నీవీయాశ్రమమునకు రాఁగలవని నే నెఱిఁగి యచ్చటికిఁ బోక నీ దర్శనమునకై కాచి యున్నాను - నాయందనుగ్రహించి యా లోకములందు నీవు నీ భార్యతో లక్ష్మణునితో విహరింపుము - అని చెప్పఁగాఁ గశ్యపర్షి బ్రహ్మతోఁ జెప్పినట్లు రామచంద్రుఁ డిట్లు చెప్పెను.

మత్ప్రసాదమ్మునన్ = నా యనుగ్రహముచే నని చెప్పరాదు. ఈ లోకములను జీవకోటి యనుభవించుటకై భగవంతుఁడు సృష్టించెను - అట్టివానిలో నాయనసంచరించుట కొఱకియనుగ్రహ మేల? కావున నీ యర్థము సరిగాదు, 'మదీయత్వేనాభిమతంచ వస్తు సర్వ స్వామినే నారాయణాయతుభ్య మేవ నమమ' నాది యనునభిమానము నాకు దేనియందుఁగలదో యది సర్వస్వామివైన నీకేగాని నాకుఁగాదని ప్రపన్ను లందురు - కావున వానిని నాయందలి కనికరముచే గ్రహించి నన్నుఁ గృతార్థుని జేయు మని భావము.

రామచంద్రమూర్తి క్షత్రియ ధర్మము పురస్కరించుకొని దానమున వతని పుణ్యమును స్వీకరింప నొల్లక యిట్లు చెప్పుచున్నాఁడు.

చం. కొనెదను నేన నీసుకృత ♦ కోటి స్వయమ్ముగ, మేము నిల్వ నీ
వనమున వాసయోగ్య మగు ♦ పట్టిది! నీ హితబుద్ధి శక్తులన్
వినిచెను గౌతమాన్వయుఁడు ♦ విశ్రుతుఁ డాశరభంగు డన్న, నా
ముని మధురోక్తి నిట్లనియె ♦ మోదరసాప్లుతుఁడై రఘూత్తమున్. ౧౯

విశ్రుతుఁడు=ప్రసిద్ధి కెక్కినవాఁడు - మోద రసాప్లుతుఁడై =సంతోషరసమున మునిఁగి స్నానము చేసినవాఁడై.

తాత్పర్యము

మునీంద్రా! నీతపఃఫలము నీవు నాకీయవలసిన పనిలేదు. ఫలకాంక్షలేక రామార్పణ మని నీవు సంకల్పించినఁజాలు-అవియే వచ్చి నన్నుఁ జెందును. అప్పుడు నేను గ్రహించెదను - మేము నిలుచుటకు వాసయోగ్యమైన స్థలమెయ్యది చెప్పుము- నీకు నాయందుఁగల హితబుద్ధి - నీ శక్తి గౌతమవంశము నందుఁబుట్టిన శరభంగుఁడు వినిపించెను - అని చెప్పఁగా నాముని యా తియ్యనిమాటల కలరి సంతోషరసమున మునిఁగి శ్రీరామచంద్రునితో నిట్లనెను - 'కొనెదను నేన' యనుటచేఁ గర్మ ఫల స్వీకారము చెప్పఁబడెను.

సీ. రామ యీ యాశ్రమ♦భూమియే రమ్యంబు, గుణవంతమును ఋషి♦కోటు లిందుఁ
దప మాచరించు స♦తతము ఫలాదులు, దండిగా నుండు మా♦ర్తాండ తేజ
యకుతోభయంబైన♦యాశ్రమభూమి ని,చ్ఛావిహారంబులు ♦ సలుపు మెకము
పిండు మాత్రము తపో♦విఘ్నంబుఁగలిగించు, నది తక్క మఱియేభ♦యంబులేదు
ఆ. నిలుమటన్న ననియె ♦ నిర్మల తేజ యా, మృగచయంబు శాత♦ఖగకదంబ
ములను జంప నీకుఁ♦గలుగు మనోవ్యథ, గానఁ బెక్కునాళ్లు♦గాదు నిలువ. ౯౯

అకుతోభయము=భయము లేనిది - మెకముపిండు = జింకల సమూహము - మృగచయంబున్ = మృగముల గుంపును - శాత = పదునైన - ఖగ = బాణముల - కదంబములను = సమూహములచే.

తాత్పర్యము

శ్రీరామచంద్రా ! యీ యాశ్రమభూమియే రమ్యమైనది - గుణముగలది - ఋషు లనేకు లిందుఁ దపము చేయుచుందురు - ఫలమూలములు దండిగా నన్ని వేళల దొరకును - ఇందు భయమెట్టిదో తెలియరాదు - గావున నిష్టమువచ్చినట్లు తిరుగు మృగముల సమూహముమాత్రము వచ్చి దేహములు రుద్దుకొనుటచేఁ దపస్సునకు విఘ్నము గలిగించును - అదితప్ప మఱి యే భయములేదు - కావున నిందే నిలుము - అని చెప్పఁగానే నా మృగములను బాణములచేఁ జంపితినేని నీకు మనోవ్యథ గలుగును - కావునఁ బెక్కుదినములు నే నిందు నిలువరాదు.

కం. అని యచట నిలిచి సాయం, తనసంధ్యన్ వార్చి మౌని♦దత్తాహారం
బును గొని యారే లక్ష్మణ,జనకసుతాయుక్తి రామ♦చంద్రుఁడు గడపెన్. ౧౦౦

సాయంతనసంధ్యన్ = సాయంకాల సంధ్యావందనమును - మౌని దత్తాహారంబును=ఆ సుతీక్ష్ణునిచే నీయఁబడిన యాహారమును - ఫలాదులను - ఆరే = ఆరాత్రి - మౌని దత్తమనుటచే నాయన యే తనచేతులార నాయనలార తినుఁడని బిడ్డలకుఁ దలిదండ్రులు బువ్వపెట్టునట్లు చేతిలో నుంచెనని భావము.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి యాచోటనే నిలిచి సరసునకుఁ బోయి సాయంసంధ్యను వార్చి వచ్చి యాముని యిచ్చిన యాహారమును గొని యా రాత్రి సీతాలక్ష్మణుల తోడ శ్రీరామచంద్రమూర్తి గడపెను.

లక్ష్మణ జనకసుతాయుక్తి యనుటచేఁ దాము ముగ్గురు నాశ్రమవిశేషములు ముని తపోమహిమ, తమయందలి ప్రేమ మొదలైనవానిని గుఱించి ముచ్చటలాడుచుండిరని భావము.

౮-వ సర్గము.

ఉ. వేవిన లక్ష్మణుండు పృథి♦వీజయుఁ దానును గమ్మకల్వపూఁ
దావులు గ్రాలు నంబువులఁ ♦ దాన మొనర్చి హుతాశదైవపూ

జావిధిఁ దీర్చి పూర్వగిరి♦సానుతటంబున కేఁగుదెంచు ఛా
యావరుఁ గూర్చి మ్రొక్కి ముని♦నంజలిఁ జేర్చి వచించె నీగతిన్. ౧౦౧

వేవినన్ = వేగినన్ = ఉదయము కాఁగా, లక్ష్మణుండు పృథివీజయుఁ దాను - అని చెప్పుటచే ముందు లక్ష్మణుఁడు లేచి స్నానము చేసెననియు నావల సీతయు లేచెనని గ్రహింపనగు - కమ్ర=మనోహరమైన రుచిగల, పూఁదావులు=పూలవాసనలు-అంబువులన్ = జలమందు-తానము = స్నానము-హుతాశ=అగ్నిహోత్రము - దైవ పూజావిధి = భగవదారాధనము - "విశాలాక్షిని బత్నిని గూడి రామభద్రుండనఘుఁడు నారాయణుని సమర్చన సలిపెన్" అని యయోధ్య ౧౫౦-వ పద్యమున నున్నది - తీర్చి=చక్కఁగా నెఱవేర్చి, పూర్వగిరి = తూరుపుఁగొండయొక్క, సాను తటంబునన్ = చఱియ ప్రదేశంబునందు, ఛాయావరున్ = సూర్యుని; "ఛాయా సూర్యప్రియా కాంతి స్సూర్యజాయా, ప్రతిబింబ మనాతపః" నానా॥ ఈ పద్యమందు ముందు హోమము ఆవల సూర్యోపస్థానము చేసెనని చెప్పుటచేఁ గాత్యాయన సూత్ర ప్రకారము శ్రీరామచంద్రమూర్తి కర్మానుష్ఠానముఁ గావించెనని తెలియుచున్నది; సూర్యోదయము కాక ముందు హోమము చేయుట కాత్యాయన సూత్ర ప్రకారము; మునిన్ = ముని నుద్దేశించి.

అగ్నిహోత్రము, దేవపూజ, సంధ్య చెప్పఁబడుటచే సాహచర్య బలమునఁ దక్కిన రెండు నెట్లు నిత్యకర్మములో యట్టులే భగవదారాధన మని యేర్పడుచున్నది.

> నహి విష్ణ్వారాధనా త్పుణ్యాం, విద్యతే కర్మ వైదికమ్ ।
> తస్మా దనాదిమధ్యాంతం, నిత్యమారాధయే ద్ధరిమ్
> తద్విష్ణో రితి మంత్రేణ సూక్తేన పురుషేణవా ॥ వ్యాసులు.

విష్ణ్వారాధనమునకంటెఁ బుణ్యమైన వైదికకర్మము లేదు; కావున నాది మధ్యాంతములు లేని హరిని నిత్య మారాధింపవలెను; ఇది తద్విష్ణో యను మంత్రముచేఁగాని పురుషసూక్తముచేఁగాని చేయవలెను. అని యుండుటచే భగవదారాధనము నిత్యకర్మమే. చేయకున్నఁ బ్రత్యవాయము కలదు. భగవంతునకు నివేదింపక తినువాఁడు పందియై పుట్టును. యజ్ఞ వేదాధ్యయనాదులకంటె విష్ణుపూజ కోటంత లెక్కుడు.

> స్నాత్వా నిత్యం శుచిః కుర్యా ద్దేవర్షి పితృతర్పణమ్
> దేవతాభ్యర్చనం చైవ సమిదాధాన మేవచ ॥
> బ్రహ్మచారీ గృహస్థోవా వానప్రస్థోఽథ భిక్షుకః
> కేశవారాధనం హిత్వా నైవ యాతి పరాంగతిమ్॥ పుండరీక నారదసంవాదము.
> యో మోహా దథవాలస్యా, దకృత్వా దేవతార్చనమ్
> భుంక్తే స యాతి నరకాన్ సూకరేష్వపి జాయతే॥ వ్యాసులు.

కేశవార్చా గృహే యస్య నతిష్ఠతి మహీతలే
తస్యాన్నం నభోక్తవ్య మభక్ష్యేణసమం హి తత్॥
అగ్నిహోత్రాశ్చ వేదాశ్చ తథా యజ్ఞా స్సదక్షిణాః
హరే ర్నిత్యార్చన స్యైతే నాపి కోట్యంశే నో సమాః॥

"మద్యాజీ మాం నమస్కురు" అను భ.గీ. వచనము నారాధనమునే బోధించుచున్నది.

వేవిసఁ=క్వచి ద్గకారో నః అను సూత్రప్రకారము వేగిసఁ వేవిసఁ అయ్యెను. 'వేవిన మేడపై వలభి వేణిక జంట వహించి' ఆముక్త. ౧-౬౨.

తాత్పర్యము

తెల్లవాఱుజాము రాఁగా లక్ష్మణుఁడు ముందుగా లేచి స్నానముచేసియుండఁగా సీతయు నిద్రలేచి యట్లే చేసెను. శ్రీరామచంద్రమూర్తియు మనోహరమైన కలువపూవుల వాసనగల చల్లని తటాకజలంబులందు స్నానమాడి హోమము ఇష్ట దైవమగు నారాయణు నర్చనగావించి సూర్యోదయము కాఁగా సూర్యోపస్థాన మొనరించి సూర్యునకు నమస్కరించి సుతీక్ష్ణమౌనిని సమీపించి యంజలి మోడ్చి యిట్లు చెప్పెను.

ఇందుఁ జెప్పఁబడినది హోమాగ్నియే కాని త్రేతాగ్నులు కావని తెలియనగును.

దైవపూజ యనుచో మూలమున సురాన్ అని యుండుటచే సపరివారుఁడైన నారాయణు నని గ్రహింపవలెను. "సహపత్న్యా విశాలాక్ష్యా నారాయణ ముపాగమత్" అని యయోధ్యాకాండమందుఁ గలదుకదా.

మ. చెలువారన్ సుఖవృత్తి రేగడచె నీ ♦ నేఁ బూజలం బొందుటన్
సెలవా మాకిఁకఁ, దీవరించిరి ముని ♦ శ్రేష్ఠుల్ స్వకీయాశ్రమం
బులకున్ రం డని దండకాలయులు, నేఁ ♦ బోవం దలంతున్ ఋషీ
శులతో, మమ్ము ననుగ్రహింపుము తప ♦ శ్శుద్ధాంతరంగాంబుజా. ౧౦౨

చెలువారన్ = మిక్కిలి చక్కఁగ, సంతోషకరముగ, తపశ్శుద్ధాంతరంగాంబుజా=తపస్సుచేఁ బావనమైన హృదయకమలము గలవాఁడా, సుఖవృత్తిన్ = సుఖమైన విధముగ, దండకాలయులు=దండకయందు వాసముచేయువారు, స్వకీయ ఆశ్రమంబులన్ = తమతమ పర్ణశాలలకు, తీవరించిరి = త్వరపెట్టిరి.

మార్గప్రదర్శనము నెపమున నీయాశ్రమము విడిచినది మొదలు పంచవటి చేరువఱకు ఋషులు కూడ నుండి రని తీర్థీయము.

తాత్పర్యము

తపస్సుచేఁ బవిత్రమైన హృదయముగల మునీంద్రా! నీవు మమ్ము గారవించి గారవించుటచే రాత్రి మాకు హాయిగాఁ గడచెను. ఇఁక బయలుదేఱి పోవుటకు ననుజ్ఞ యిచ్చెదరా? ఎచ్చటికిఁ బోఁదలఁచితి వందురేమో తమతమ యాశ్రమములకు

రండని మమ్ము దండకారణ్యమున వసించు మునిశ్రేష్ఠులు తీవరపెట్టుచున్నారు. వారి వెంట నేనును బోవఁదలఁచినాను. కావున మాయందు దయయుంచి యనుజ్ఞయిమ్ము.

నేఁ బోవం దలంతుఁ ఋషీశ్వరులతోఁ అనుటచేఁ దోవ తోడని మాత్రమే యర్థముకాదు; వారి కార్యము నెఱవేర్చుటకుఁగా నని తదనుసరవర్తనము తదాను కూల్యము సూచించుచున్నది. నేఁ బోవందలతుఁ అని యేకవచనమునఁ జెప్పిన వాఁడు మ మ్మనుగ్రహింపు మని బహువచనమునఁ జెప్పుటచే ఋషుల కార్యము సాధింప ముందు నేను బ్రవర్తింపవలసి యున్నది. ననుఁ గాదని వీ రాకార్యమున స్వతంత్రించి వర్తింపరు. కావున మేము ముగ్గురము మునుల కార్యమున వర్తించు వారమే. అట్లు చేయుటకు మా కనుజ్ఞ యిచ్చి జయము నాశీర్వదింపు మని భావము. నీవు తపశ్శుద్ధాంతరంగుఁడవు. కావున నీ యనుగ్రహము వ్యర్థముపోవదు.

చం. అనుచిత మార్గవృత్తి నడు ♦ మంతరపు న్సిరిఁ గన్న దుష్కులుం
డన రవి చేతులం గొఱవు ♦ లాని దహింపక ము న్నె పోదుమే
యని చరణంబు లంటినఁ బ్రి ♦ యంబునఁ గౌఁగిట నొత్తి యేకుఁడీ
జనకజ ఛాయవోలె నిను ♦ సంతతము న్భజియించి వెంట రాఁ. ౧౦౩

అనుచితమార్గవృత్తిఁ=అన్యాయమార్గమందు వర్తించుటచే, నడుమంతరపుఁ సిరి = తాతలుతండ్రులు సంపాదించినకాక మధ్యమునఁ జౌర్యాదుల సంపాదించిన సంపద, దుష్కులుఁడు = చెడ్డకులమునఁ బుట్టినవాఁడు, రవి = సూర్యుఁడు, ము న్నె = ముందే, ప్రియంబునఁ = సంతోషముతో, ఇది విశేషణమైనను భారతాదుల విశే ష్యముగాను బ్రయోగింపఁబడినది, "ప్రియములు పల్కి నిన్ననుసరింపఁగఁ బాత్రుఁడఁ గాను జుమ్ము." దేవతల కప్రియములు గావించి మనుష్యు లధముగతు లగుదు రిలఁ" "పాండవధర్మపత్ని ధర్మరత నయోనిజఁ బ్రకృతి మానవ భామినిఁగాఁ దలంచి దెప్పరములు పల్కఁగాఁ దగునె?" (దెప్పరములు=దెప్పరపుమాటలు. ఇష్టము= ఇష్ట కార్యము, బెట్టిదంబులంగాని చక్కంబడండు, బెట్టిదములు = బెట్టిదపు మాటలు. (ప్రౌ-వ్యా-శబ్ద ౧౨) పోదుమే = ప్రార్థనాద్యర్థకము, ఛాయవోలెఁ = నీడవోలె.

తాత్పర్యము

పుట్టువుచే దరిద్రుఁ డయ్యు వయస్సు వచ్చిన తరువాత నధర్మమార్గముల ధనము సంపాదించినవాఁడు. నడుమంతరపు సిరి నరాలమీఁది పుం డన్నట్లు పరులను విశేషము బాధించును. అందు వాఁడు నీచకులమునఁ బుట్టినవాఁ డగునేని వాని క్రౌర్య మడుగవలసిన పనియేలేదు. ఆ విధముగ సూర్యుఁడు తనచేతులఁ గొఱవులు ధరించి లోకమును దహింపకముందే (అనఁగా నెండ యెక్కకముందే) పోవ సెల విమ్మని ప్రార్థించెదము, అని పాదములు దాఁకి నమస్కరింపఁగా స్నేహభావముచే దగ్గఱకుఁ దీసి గట్టిగాఁ గౌఁగిలించి రామచంద్రా! నీనీడ నిన్ను విడనాడక నీవెంటనే వచ్చునట్లు సీత నిన్నుఁ గొలుచుచు రాఁగాఁ బోయిరమ్ము.

ఈ పద్యమున రాఁగల కార్యము సూచింపఁ బడినది.

అనుచిత మార్గవృత్తి నడుమంతరపుఁ సిరి గన్న దుష్కులుఁడు రావణుఁడు. రాక్షసరాజ్యము పిత్రార్జితముగాదు - రావణుఁడు వివాహితభార్యకుఁ బుట్టినవాఁడు కాఁడు. కావున దుష్కులుఁడు.

ఇఁక వీఁడు దుర్వృత్తిచేతనే సంపద సంపాదించినవాఁడు, అందు రాక్షసుఁడు కావున దుష్కులుఁడు, అనులోమజాతివాఁడు. ఇట్టి వీఁడు లోకమును బూర్ణముగాఁ దనదుర్వృత్తిచే నాశనముచేసి ఋషుల నందఱ బలివారకముందే వానివధ నిమిత్తమై పోవలసియున్న దని శ్రీరామచంద్రమూర్తి చెప్పఁగా సుతీక్ష్ణుఁడు "చేసెదను బాసఁ! సంజ్వల దగ్నిసాక్షిగ, వనినే రాముఁడు చొచ్చుచోఁ దలఁపుమా ప్రాగ్వర్తిగా నున్నదఁ", అని ప్రమాణముచేసిన లక్ష్మణుఁడు నీవుసంకల్పించిన కార్యము నెఱవేర్చుట యందు నీకంటె ముందంజయే యిడును, సీత యిట్టులు ప్రత్యక్షముగఁ గార్య నిర్వాహణ సమర్థురాలై రావణుని ద్రుంపఁజాలక పోయినను నీ నీడ నిన్నుడఁబాయక యెట్లనుసరించి వర్తించునో యట్టులే యీయామెయు నిన్ననుసరించియే యుండును. ఒక వేళ వియోగము కలిగినను నిన్ను వదలి పోయినదని యామె విషయమై సందేహింప కుము, నీ కార్యార్థ మయియే యామె యట్లు చేయును, నీ నీడ నిన్నువిడిచి వేఱొకని వెంటఁ బోవునా? అని సూచించెను.

వెన్నంటి యనుటచే నీడ యెప్పుడు వెనుక ప్రక్కనే యుండదు. సూర్యుఁడు వెనుకనుండిన నీడ ముం దుండును, సూర్యుఁడు ముందుండిన నీడ వెనుకప్రక్క నుండును. ఆ మాత్రమున నీడలేదని యర్థమా? రాత్రులందుఁ జీఁకటిలో నీడ కాన రాదు. అట్టులే సీత నీకుఁ గానరాకపోయినను బొత్తిగ విడిచిపోయిన దని తలంప కుము, అనిభావము. ఇట్టి అభిప్రాయము లేదేని నీ భార్య నీ వెంట వచ్చునని యీయమ యదియొక విశేషవిషయముగాఁ జెప్పవలయునా? అడవుల కెవరు చెప్పిన నామె వచ్చును?

ఉ. అచ్చపుఁబుణ్యశీలి ఋషులు ♦ హాయిగఁ బొమ్మ యరిష్టపద్ధతిఁ
విచ్చిన తామరల్ మిగుల ♦ వేడుకఁ గూర్చుకొలంకులుఁ గిరుల్
నిచ్చలుఁ బూచువృక్షములు ♦ నెమ్ముల కేకలు నిర్ఝరాళి మీ
కిచ్చిన నిండుసమ్మదము ♦ నిచ్చును లక్ష్మణ! పోయి రావనా. ౧౦౪

అరిష్టపద్ధతిఁ = (౧) రిష్టముగానిది యరిష్టము, రిష్టమనఁగా అశుభమునకు, క్షేమమునకు, నాశమునకు, కత్తికి, పాపమునకును పేరు, రిష్టం స్యా దశుభక్షేమ నాశ నిస్త్రింశ పాప్మసు॥ అని నానా ॥౪॥ (౨) అరిష్ట మశుభే తాక్రే. నానా ॥౪॥ అరిష్టమనఁగా అశుభమని యర్థము, ఈ విధముగా నీ పదము మేలును గీడును రెండును సూచించుచున్నది. "అరిష్టం గచ్ఛపంథాన"మ్మని మూలము. ఆశీర్వ దించువారు నీకు మేలగునుగాక యని దీవింతురుగాని యిట్లు సందిగ్ధముగా దీవింప

వచ్చునా! యందు రేని భవిష్యత్తు దెలిసియే యట్లాయన దీవించెను. ఎట్లన, నిప్పుడు శ్రీరామచంద్రమూర్తి పూనిన రావణవధకార్య మిప్పు డల్పకాల భార్యావియోగమునకు, ఆవల దీర్ఘకాలవియోగమునకుఁ గారణమై యశుభమునే సమకూర్చెను. కాని యిది లోకమునకు క్షేమకరమైన దయ్యెను, ఆయనకుఁ గీర్తికరమయినదయ్యెను. ఆ కారణముచే నరిష్ట శబ్దమునకుఁ గల రెండర్థములు గ్రాహ్యములే, విచ్చిన=విక సించిన, కొలంకులు=సరస్సులు, ఎల్లప్పుడు=అన్ని ఋతువులందును, పూచు వృక్షములు=పూచిన పూచుచున్న పూచఁగల చెట్లు, పూచు తద్ధర్మాద్యర్థకము, గావునఁ ద్రికాలముల బోధించును, నెమ్ముల=నెమిళ్లయొక్క, నిర్ఝరాళి=వంకల వరుసలు, రమ్ము+అన్నా=రావనా, మీఁది పద్యంబున సీతాదేవికిఁ జెప్పవలసిన బుద్ధి పరోక్షముగఁ జెప్పెను. ఈ పద్యమున లక్ష్మణునకు సమక్షముననే చెప్పెను.

తాత్పర్యము

శ్రీరామచంద్రా! యెవరివెంట నీవు పోఁదలఁచితివో యా యీ ఋషులు మిగులఁ బుణ్యాత్ములు; వారు నిన్నుఁ బాపకార్యములందుఁ బ్రేరింపరు; కావున వారి యిష్ట ప్రకారము పొమ్ము; దానివలన నీకుఁ గీడు లేదు; మేలే గలదు. లక్ష్మణా! విక సించిన తామరలు గలిగి మిక్కిలి యందమై సంతోషము గలిగించు సరస్సులు, ఈ ఋతు వా ఋతు వనక యెల్లవేళల వికసించు వృక్షములు గల కొండలు, అందలి నెమిళ్ల కేకలు, నడుమ నడుమఁ గొండవంకలు మీ కత్యంత సంతోషము గలిగించును. కావున లక్ష్మణా! సుఖముగఁ బోయి రమ్ము.

చ. అనఘ మదాశ్రమంబునకు ♦ నాదట వెండియు మీరు రండటం
 చను సెల వీయగా భువన ♦ సుందరి జానకి చాపదండముల్
 సునిశితఖడ్గతూణములు ♦ శూరవరాగ్ర్యుల సన్నిధమ్ములన్
 గొనుఁ డని యీయ వారలును ♦ గొంచు ధరించి ససజ్యచాపులై ౧౯

అనఘ=పాపరహితుఁడవైన శ్రీరామచంద్రా, మదాశ్రమంబునకున్=నాయా శ్రమమునకు, ఆదటన్=ప్రీతితో, వెండియున్=మఱియొకసారి, భువనసుందరి=లోకైక సుందరి, లోకములో నంతటికంటెను సౌందర్యము గలది. చాప దండముల్ = దండమువంటి విండ్లు, దండములని చెప్పుటచే నిచ్చట నెక్కు పెట్టఁబడని విండ్లని గ్రహింపవలెను, సునిశిత=మిగులఁ బదునుగల. ఖడ్గ=ఖడ్గములు, తూణములు= అమ్ములపొదులు, శూరవరాగ్ర్యులన్=శ్రేష్ఠులగు శూరులలో మొదటివారు, ససజ్య చాపులై=ఎక్కు పెట్టఁబడిన విండ్లుగలవారై.

ఇచ్చట సీతాదేవి విల్లునమ్ములు తెచ్చి రామలక్ష్మణులను దీసికొండని చెప్పి యిచ్చినట్లున్నది. మఱి యెందు నిట్లు చెప్పఁబడలేదు. ఇట్లు చెప్పుటకుఁ గారణ మారయఁగా ఋష్యాశ్రమము ప్రవేశింపఁగానే యిచ్చట గొన్నినాళ్లుండవచ్చును. ఇంద్రాయుధములతోఁ బనియుండదని తలఁచి సీతాదేవి యాయుధములనెల్ల నాశ్రమ

మందొక చోటఁ బదిలపఱిచెను. శ్రీరామచంద్రమూర్తి యనుచిత మార్గవృత్తి యని చెప్పుటయు నిరుపద్రవ మార్గమునఁ బొమ్మని ముని యాజ్ఞాపించుటయు, ఋషీశ్వరులు తమ బాధల గుఱించి చెప్పుమాటలు విని సీతాదేవి రాక్షసవధ జరుగఁగలదని యోజించి యా యాయుధములను దాఁచిన చోటినుండి తెచ్చి యిదిగో తీసికొండని వారి ప్రయత్నమునఁ దన సమ్మతియు నుత్సాహముఁ దెలుప నిచ్చెను; శూరవరాగ్ర్యుల ననుటచే రామలక్ష్మణులు యుద్ధమునకు నుద్యమించియుండిరని సూచించుచున్నది. భువనసుందరి యనుట రాక్షసవధకు నత్యంత సుందరి యగు సీతయే కారణ మనియు సూచన; రావణుఁ బ్రేరించిన దామె సౌందర్యమే కదా. ససజ్యచాపులై యని యచ్చట వింట్లెక్కుపెట్టి రనుటచే రాక్షసవధయందుఁ వారికిఁ గల యుత్సాహము తీవరపాటు తెలియనయ్యెడిని.

మఱియొక కారణము గలదు. ధరించిన కాలమందుఁ దప్పఁ దక్కిన కాలమందు నాయుధములను బదిలపఱిచి దినదినము సీతాదేవి పూజించుచుండెను.

కం॥ “సత మేను గంధమునను। వితతుల నర్చింప నాకుఁ బ్రియమగు కన కాంచితమగు నీ కార్ముక మీాగతిఁ బట్టెన నేఁడు దిక్కు కానక వీరా” యని యుద్ధ ౩౮౫-వ పద్యమున సీతాదేవి విలపించెను. దీనివలన భర్త యగ్నిహోత్రమువలె నాయుధములను రక్షించుట భార్య కృత్య మని యేర్పడుచున్నది. కావున నవి యామె స్వాధీన మందుండుటచే నామె తెచ్చి యిచ్చెనని తెలియునగు.

తాత్పర్యము

పాపరహితుఁడ వగు శ్రీరామచంద్రా! నాయాశ్రమమునకు మరలఁ బ్రీతిమై రండు’ అని సెలవీయఁగా లోకసుందరియగు సీత విండ్లను పదునుగల కత్తులు అంబుల పొదులు రామ లక్ష్మణులకుఁ దీసికొండని చెప్పి యీయఁగా వారలు వానిని దీసికొని ధరించి యెక్కుపెట్టినవారై.

పితృవాక్యపరిపాలనమును నా స్వకార్యము నిమిత్తముగ నే నడవిఁ బ్రవేశించితిని; దైవవశమున రాక్షసుల వధించి మీా బాధ పరిహారముచేయు కార్యము తటస్థించినదని శ్రీరామచంద్రమూర్తి రాక్షస వధయందు మనస్సు పెట్టుట చూచి హింస వానప్రస్థధర్మమునకు విరుద్ధకార్యము, దానివలన వ్రతభంగ మగునని తలఁచి యహింస శ్రేష్ఠమనియు, వానప్రస్థుఁడుగా నుండునంతవఱకు హింసాకార్యము మానుఁ డనియుఁ బ్రేమ రూపిణియగు సీతాదేవి భర్తకు బోధించుచున్నదని మహేశ్వర తీర్థీయము.

రామలక్ష్మణులు విండ్లు ధరించిన విధముఁజూచి యాయుధముల పట్టువిడుపులు తెలిసిన సీతాదేవి వారు యుద్ధసన్నద్ధులై యున్నారని తెలిసి యిట్లు చెప్పుచున్నది.

నాథా! నీవేమొ రాక్షసులతో యుద్ధమునకు సిద్ధపడి యున్నాఁడవు; మీారిరువురు యుద్ధకార్యమందు మగ్నులై యుండ రాక్షసులు నాకేదైనఁ గీడు గావింతురు.

నన్ను వారు హరించికొని పోయిరేని నా వియోగము నీకు దుఃఖకరము గాక మానదు. నా దుఃఖము నీ కెట్లో నీ దుఃఖము నాకట్లే కావున మన యిరువురకు దుఃఖకరమైన యీ కార్యమున కేల పూనెదరు? ఆయుధము లిందే యుంచి పోదమని సీతాదేవి బోధించుచున్నదని గోవిందరాజీయము.

—♦ ౯-వ సర్గము. సీతాదేవి శ్రీరామునకు హితోపదేశంబు సేయుట ♦—

కం. అందఱు చనునెడఁ దమి రఘు,నందను వదనంబుఁ గాంచి ♦ నవలా ప్రేమా
స్పందితహృదయంబున మృదు,మందమధురవచనరచన♦మానుగ ననియెన్. ౧౦౬

అందఱు = సీతారామ లక్ష్మణులు ఋషులు, చనునెడన్ = పోవు సమయమందు, తమిన్ = స్నేహభావముచే, వదనంబు = ముఖము, నవలా = స్త్రీ, సీత - ప్రేమాస్పందిత హృదయంబునన్ = ప్రేమచే మిక్కిలి చలించుచున్న హృదయముతో, మృదు = మెత్తనైన, మంద = మెల్లనైన, మధుర = తియ్యనైన, వచనరచన = మాటల కూర్పుతో, మానుగన్ = చక్కగా.

తాత్పర్యము

అందఱు బయలుదేఱి పోవనున్న సమయమున సీతాదేవి శ్రీరామచంద్రుని ముఖారవిందముఁ జూచి స్నేహభావముచేఁ బ్రేమచే నాందోళన మొందుచున్న డెందముగలదై మెత్తని మెల్లని తియ్యని మాటలచే నిట్లు చెప్పెను.

తమిన్ = సీతాదేవి చెప్పఁబోవు మాటలకుఁ గేవలస్నేహమే కారణము. చేయఁబోవునది కార్యమా యకార్యమా యను విచారము కాదు. కార్యమే యైనను అతిస్నేహము పాపశంకి గావున నా కార్యము యుద్ధము చేయుటయందు నాయనకుఁ గీడేమి కలుగునో యని యాయనకు రాఁగల విపత్తు సహింపలేక యని భావము.

రఘునందను వదనంబుఁగాంచి = అడవులందు బోవు నపుడు ౧౫౨ పద్యమునఁ జెప్పినట్లు ముందు శ్రీరామచంద్రమూర్తి యాయన వెనుక సీతాదేవి యామె వెనుక లక్ష్మణుఁడు పోవుచుండిరి. అట్టులే చెప్పినయెడల శ్రీరామునకు వెనుక ప్రక్కనుండి చెప్పినట్లగును. అప్పుడు సీతాదేవి ముఖమునందుఁగల దైన్యము స్నేహచంచల మయిన నేత్రముల తీరు శ్రీరామచంద్రమూర్తికి దృగ్గోచరములు గావు. తనవిధమును జూచిన శ్రీరామచంద్రమూర్తి మనస్సు కరఁగునని యామె తలంపు గావున నాయన కెదుట నిలువఁబడి చెప్పుచున్నది. ఇది నడిదోవలో జరిగిన సంభాషణము గాదు. ఆశ్రమసమీపమందే జరిగెననుట బాగు.

ప్రేమాస్పందిత హృదయంబునన్ = మీఁది పద్యంబున శ్రీరాముని యభిప్రాయంబుల గ్రహించి యుత్సాహముతోఁ దానే విల్లు నమ్ములు తెచ్చి యిచ్చిన సీతాదేవి యిప్పుడేల యిట్లు వెఱుపు మాటలు చెప్పుచున్న దనినఁ బ్రేమచేఁ జలించు

హృదయము కల దగుటచేతనే, అప్పటికి రాక్షసవధ నామోదించెను గాని దాని వలన రాఁబోవు కష్టముల నాలోచించి భర్త యన్నికష్టములకుఁ బాలుపడుట సహింప లేక కేవల ప్రేమావిష్టచిత్తయై చెప్పుచున్నదని భావము.

మృదువుగాఁ జెప్పె ననుటచే ధూర్తస్త్రీలవలెఁ బరుషముగాఁ జెప్పలేదని భావము. ధర్మరాజునకు హిత ముపదేశించిన ద్రౌపదివాక్యములఁ బోల్చునది.

మందముచే స్నేహముచే డగ్గుత్తికపడ మాటలాడెను సాధారణముగఁ బురుషులు స్త్రీలకు వశపడుట యిట్టి మధురవచనరచన చేతనే.

ఇప్పద్యంబున వృత్త్యనుప్రాసము గలదు.

మానుగ ననుటచే శాస్త్రసమ్మతమైన రీతి నని గ్రాహ్యము. అశాస్త్రీయ హితము హితముగాదు.

సీ. నీవనుష్ఠించెడి ♦ నిష్ఠాప్రకారంబు, కామజవ్యసనముల్ ♦ కడకుఁ బాయ
వదలియు నొందఁగ ♦ వచ్చును గాదొకో, సూక్ష్మమార్గంబున ♦ శూరవర్య
కామజవ్యసనముల్ ♦ గలవొక మూఁడందుఁ, బ్రథమంబు మిథ్యాభి ♦ భాషణంబు
దానికంటెను బర ♦ దారాభిగమనంబు,పగ లేకయును హింస ♦ పఱచుటయును

ఆ. గీడు; నీ వసత్య ♦ మాడిన యది లేవ, యిఁక నాడఁబోవు ♦ టెపుడు లేదు;
తలఁచు టైన లేదు ♦ వలుక నేటికి నన్య,దారసంగమేచ్ఛ ♦ ధర్మనిరత. ౧౦౭

అనుష్ఠించెడి=ఆచరించుచున్న, నిష్ఠాప్రకారంబు = వానప్రస్థధర్మము కామజ వ్యసనముల్ = కామమువలనఁ గలిగెడి వ్యసనములను, కడకు = దూరముగా, వదలియు=వదలిపెట్టికూడ, వదలి వదలక రెండు విధముల ననుష్ఠింపవచ్చునుగాని వానిని వదలి యనుష్ఠించుట శ్రేయస్కరము, శ్రేష్ఠముగదా, అగస్త్యుఁడు వానప్రస్థుఁడయ్యు వాతాపీల్వలుల వధింపలేదా, వేటలాడలేదా యని రామచంద్ర మూర్తియనునని తలఁచి యట్లుండుటకంటె నట్టిపనిచేయకుండుట శ్రేష్ఠమని సూచించు చున్నది. 'యు' అను సముచ్చయ మీయర్థము నిచ్చుచున్నది, మిథ్యాభి భాషణంబు = అసత్యములు చెప్పుట, పరదారాభిగమనంబు = ఇతరుల భార్యలతోఁ గూడుట, అన్యదార = ఇతరుల భార్యలతో, సంగమ = కూడుటయందలి, ఇచ్ఛ = కోరిక, ధర్మనిరత=ధర్మమందు విశేషప్రీతిగలవాఁడా, అభిభాషణ మనుచో, నుప సర్గమువలన నొక యర్థవిశేషము గాఁవచ్చెడి, నవ్వులకు నసత్యమాడుటయు మిథ్యా భాషణమే యగు, అయినను దానివలనఁ జెప్పినవానికిఁ బాపములేదు, పరులకు హానియులేదు, అటుగాక యభిభాషణ మయ్యోనేని యనఁగా నితరులకు నష్టకష్టములు కలుగునటు లసత్యము మాటలాడినచో నితరులకుఁ గలుగు నష్టకష్టములవలనఁ దనకుఁ బాపము కలుగును. ఇట్టి యసత్యము కామజవ్యసన మని యభిప్రాయము. దీనివలన సీతారామాంజనేయ సుగ్రీవు లాడిన యసత్యములు మిథ్యాభాషణము లయినను మిథ్యాభిభాషణములు గావు.

తాత్పర్యము

(ప్రాణేశ్వరా నీ వనుష్ఠింపఁబూనిన వానప్రస్థధర్మము కామమువలనఁ గలుగు వ్యసనముల వదలికూడ నూత్నమైన ధర్మమార్గమున ననుష్ఠింపవచ్చునుగదా, కామజ వ్యసనము లేవందువా, యవి మూఁడు. అందు మొదటిది యసత్యమాడుట, దాని కంటెను పెద్దది పరస్త్రీలతో సంభోగించుట, దానికంటెఁ పెద్దది పగలేక యితరుల నిష్కారణముగ హింసించుట, (దీనివలన నిష్కారణముగ నితరులు విరోధించి కీడు చేసిరేని హింసింపవచ్చునని యేర్పడుచున్నది.) ఈ మూఁటిలో మొదటి వ్యసనము మిథ్యాభిభాషణము నీయందు లేదు. ఇదివఱకు నీ వసత్యమాడినది లేదు, ఇఁక రెండవదియగు పరభార్యాసంగమము గుఱించి నీ కట్టి కోరికయే లేదు. ఇఁకఁ గార్య మున్నదని యెట్లు చెప్పనగు. నీవు ధర్మనిరతుఁడ వగుట నీయం దట్టిపాపములు గాన రావు. కావున నధర్మకరదోషము లేదు. రెండవది అధర్మకరము, ధర్మనాశనము.

కం. లేదిప్పుడింకఁ గలుగం, బో దెప్పుడు వలవు పరుల ♦ పూఁబోఁడులపై
భూదయితా! నీమదినే, న్నోదించెద వాత్మదార♦మోదముఁ గూర్పన్. ౧౦౨

పూఁబోఁడులపైన్ = స్త్రీలమీఁద; వలవు = మోహము.

తాత్పర్యము

ఇతరుల భార్యలపైఁ గామము నీకిపుడు లేదు, ఇఁకమీఁదఁ నెన్నఁడేని కలుగను బోదు, ఏలనః— నీ భార్య నీకు సంతోషము కలిగింప మనస్సునందే సంతోషించెదవు, వాచిక కాయిక వ్యాపారములు నీకు ముఖ్యములు గావు. నాఁటినుండియు నీ విప్పు డవలంబించియుండు బ్రహ్మచర్య దీక్షయే దీనికి దృష్టాంతము. అట్టులైన భార్య నన్ను సంతోషపెట్టవలయునే కాని నావలన నాభార్య కెట్టి సంతోషమగు లేదా యందువేమో, స్వభార్యకు సంతోషముఁ గూర్ప నీవు మనసునందే సంతోషపడుచుందువు. నే నెట్లు సంతోషించిన నా భార్యయు సంతోషించునని భార్యకు సంతోషముఁ గూర్ప నీవు సంతోషింతువు. మనసులోని సంతోషము ముఖనయన వికాసములవలన వెలుపలికిఁ గానవచ్చును గదా.

మనుస్మృతియందు,

మృగయాఽక్షో దివా స్వప్నః, పరివాదః స్త్రియో మదః
తౌర్యత్రికం వృథాట్యాచ, కామజో దశకో గుణః॥

వేఁట, జూదము, పగటినిద్ర, పరనింద, స్త్రీసంభోగము, మదము, నృత్త గీతాదులు, వ్యర్థముగఁ దిరుగుట యివి పది కామమువలనఁ గలుగు వ్యసనములు. ఇందు 'పాన మక్షాః స్త్రియశ్చైవ మృగయాచ యథాక్రమమ్, ఏతత్కష్టతమం విద్యా చ్చతుష్కం కామజేగణే॥ ఆ పదింటిలో పానము, జూదము, స్త్రీ సాంగత్యము, వేఁట, యివి క్రమముగా సాధింపఁ గష్టమైన కామజగుణములు అని యున్నది. 7-47-50.

చ. నిరతము సత్యధర్మరతి ♦ నిశ్చలబుద్ధివి లక్ష్మణాగ్రజా!
గురువచనస్థితుండవు న ♦ కుంఠిత సత్యము ధర్మ మెల్లనున్
స్థిరముగ నిల్చె నీ యెడ బ ♦ తీ! విజితేంద్రియు లైనవారికిన్
దొరకొను నవ్వి, నే నెఱుఁగు ♦ దున్ భవదీయ జితేంద్రియత్వమున్. ౧౦౯

లక్ష్మణాగ్రజా=లక్ష్మణుఁ డన్నా, భార్య యొద్దలేని లక్ష్మణుఁడెట్టి బ్రహ్మచర్యదీక్ష నవలంబించి యున్నాఁడో భార్యయొద్ద నుండియు నసిధారావ్రతనిష్ఠ నీ వట్టులే యున్నావు. కావున నీ వంతకంటె గొప్పవాఁడవే, ఏల? నిరతము=ఎల్లప్పుడు, నీవు, సత్యధర్మరతిన్= సత్యము ధర్మము వీని యందలి ప్రీతియందు, నిశ్చల బుద్ధివి = చలింపని మనస్సు గలవాఁడవు, సత్య ధర్మములనుండి నీ మనస్సు చలింపదు, గురువచనస్థితుండవు = తండ్రిమాటయం దున్నవాఁడవు, అకుంఠిత = మొక్కవోని, విజితేంద్రియులు=ఇంద్రియములను జక్కఁగా జయించిన వారికి, దొరకొనున్=లభించును, ఈ యర్థము సందర్భానుసారము లేదు.అవి=సత్య ధర్మములు, భవదీయ = నీయొక్క, జితేంద్రియత్వము = ఇంద్రియ జయముగల విధమును.

తాత్పర్యము

లక్ష్మణాగ్రజా! నాథా! నీవు సర్వదా సత్యమునందు ధర్మమునందు జలింపని మనస్సు గలవాఁడవు. కావుననే కదా తండ్రి వాక్యము పరిపాలింపఁ గంకణ శ్రమించు చున్నాఁడవు. తండ్రి నిమిత్తము సత్య ధర్మములు పూనుట మాత్రము కాదు. అవి నీ యం దెట్టి కొఱఁత లేక స్థిరముగ నిలిచియున్నవి. ఇంతటి సత్య ధర్మస్థిరత్వము విజితేంద్రియులకు లభించునే గాని యితరులకు లభింపదు నీ వంతటి జితేంద్రియుఁడవో యని నే నెఱుఁగుదును.

సీ. మూఁడవయది యగు ♦ మూఢభావ మగలేక, యితరుల ప్రాణంబు ♦ హింససేయు
రౌద్రకర్మము రామ ♦ భద్ర దొరకంకొంటి, వీ విష్ణు మానుల ♦ హేతువునను
దండకారణ్యవా ♦ స్తవ్యుల ననురులఁ, జంపఁ బ్రతిజ్ఞను ♦ జలిపి తీవు
యిది నిమిత్తంబుగా ♦ నిందు వచ్చితి వీవు, తమ్ముండు బాణ కో ♦ దండములను

తే. దాల్చి యిప్పుడు మీ రందుఁ ♦ దరలు చుండఁ, దావకీనశుభంబు హితంబుగోరు
దాన నగుటను నామది ♦ దల్లడిల్లె,నాదు విన్నప మాలింపు ♦ నాథ కరుణ. ౧౧౦

రౌద్రకర్మము = తమోగుణప్రధానమైన క్రూరకార్యము దొరకొంటివి = చేయఁ బ్రారంభించితివి, ఈ యర్థమం దీశబ్దమునకు సదర్థానుసారము గలదు, వాస్తవ్యులన్ = నసించువారలను, తరలుచుండన్ = ప్రయాణమై పోవుచుండ, తావకీన = నీ యొక్క, తల్లడిల్లెన్=సంకటపడుచున్నది, ఆలింపు=వినుము.

వ్యాకరణము. ఇందు వచ్చితి వీవు తమ్ముంకు, ఇందుఁ గ్రియ యేకవచనము, కర్త లిరువురు, తమ్మునితో వచ్చితి వని యర్థము గ్రహింపవలెను "ఒకానొకచో

సహార్థంబున యుష్మదస్మదర్థంబు లభిహితంబు లగునపుడు క్రియలు తత్కర్తృకంబులు విభావనగు." ప్రౌ-క్రియ-౨౬.

విప్రకులుండ వెల్వడుము వేగమ నీవును నీ నిషాదియుః భార-ఆది. ౨ ఆ. నరసఖుఁడ నీవు నరసఖుఁడును నరలోకమునం జనించి పీడలుడువుము. ఈ ద్రావిడ ప్రాణాయామ మేల? వచ్చితి రీవు తమ్ముండన వచ్చునే యందు రేని కర్త శ్రీరాముఁడే, లక్ష్మణుఁడు తోడ వచ్చినవాఁడే, బహువచనప్రయోగ మిరువురను సమాన కర్తలఁ జేయును, అది సరిగాదు. లక్ష్మణున కట్టి యుద్దేశము లేను, ఆయనకు రామ కైంకర్యముచేయు నుద్దేశము మాత్రమే.

తాత్పర్యము

రామచంద్రా! మిథ్యాభిభాషణము పరదార సంగమాభిలాష నీయందు లేవు. ఆ విషయమై నే నేమియుఁ జెప్ప రాలేదు కాని కామజవ్యసనములలో మూఁడవది తక్కిన రెంటికంటెఁ గ్రూరమైనది. నీవు చేయఁబూనితివి, అది జ్ఞానహీనులు పగ లేకయును నితరుల ప్రాణముఁ దీయు క్రూరకార్యమగు. అది వారికిఁ దగును గాని నీకుఁ దగదు. అది నీ కేల్లు తెలిసెనందువా, మునీశ్వరుల నిమిత్తమై దండకారణ్యవాసులైన రాక్షసులఁ జంపఁ బ్రతిజ్ఞ పలికితివి, ఆ నిమిత్తముగా నిందు వచ్చితివి, ఇచ్చటికి వచ్చిన తరువాతఁగదా నేను వారికిఁ జెప్పితి నందువేమో నీ కట్టి సంకల్పము లేకున్న మునివలెఁ జరించెదనన్న నీవు నీ తమ్ముఁడు విల్లు బాణములు లోనగు నాయుధము లేల తెచ్చితివి? అవి హింసించు సాధనములే కదా. ఆత్మరక్షణార్థమని తలఁపరాదా యందువేమో. ఈ మునులంద ఆత్మసంరక్షణార్థ మే యాయుధముల ధరించినారు! నేను సాయుధుఁడనై వచ్చుటచేత వీరువచ్చి రక్షింపుమని నన్నుఁ బ్రార్థించిరి, నన్ను రాక్షసులు హింసింప వచ్చినపుడు క్షత్రియుండనై నే నవరిఁ బ్రార్థింతును, అందువా, అట్లు వారు వచ్చినపుడు నీ వాయుధము లెత్త వచ్చును. ఇప్పుడు మీరు విల్లు బాణములు పట్టినతీరు చూడఁగా యుద్ధసన్నద్ధులై పోవున ట్లున్నది. ఆ కారణముచే మీకు శుభము హితముఁ గోరుదాన నగుట నిష్కారణవిరోధముచే మీ కేమి దుఃఖము కలుగనో యని సంకటపడుచున్నదానను. నీవు సత్యమునందు ధర్మమునందు స్థిరుఁడవు. ఇంతవఱకు రెంటిని సమముగాఁ గాపాడుకొని వచ్చుచున్నాఁడవు, సంతోష మే, ఇప్పుడు రెంటికి విరోధము పొసఁగున ట్లున్నది. సత్యముతో విరోధించు ధర్మము ధర్మముగాదు, ధర్మముతో విరోధించు సత్యము సత్యము గాదు.

అహింసార్థాయ భూతానాం, ధర్మప్రవచనం కృతమ్
య స్స్యా దహింసా సంయుక్త స్సధర్మ ఇతి నిశ్చయః. మ. భా. 12-101-12.

శాస్త్రములు చేయు ధర్మ ప్రవచనమంతయు భూతహింస నివారించుటకే కదా. ఏది యహింసతోఁ గూడినదో యది ధర్మము. ఏది హింసతోఁ గూడినదో

యది యధర్మము, అని కదా యీ ఋషులే వచించిరి. నీవు సత్యమందు నిలిచితివా నిష్కారణముగ రాక్షసహింస సేయక మానదు, హింస మానితివా సత్యహాని కలదు ఈ ద్వంద్వములోఁ బడుట బాగా? నీ సంకటము తీరు నుపాయమేది యందువా, విన్నవించెదను. నాయందు దయయుంచి యాఁడుదాని మాటలకేమిలే యనక వినుము.

ఉ. ఈరలపోక నాకు రుచి ♦ యింప, దదేల యటంటి రేని నేఁ
గారణముల్ వచించెదను ♦ గార్ముకబాణకృపాణపాణులై
వీరుల రీరు పోవు చట ♦ వీచరులం గని యొక్కఁ డేదియేన్
నారసము న్విడం గలరు ♦ నాథ యదే పగకారణం బగున్. ౧౧౧

ఈరల = మీయొక్క, పోక = ఋషులవెంటఁ బోవుట, మీరుయొక్క మొదటి రూపము ఈరు. కార్ముక బాణ కృపాణపాణులై = విల్లు, బాణము, ఖడ్గము చేత ధరించినవారై, అటవీచరులన్ = అడవియందు సంచరించువారిని, రాక్షసులను, నారసమున్ = బాణమును, నారాచశబ్దభవము.

తాత్పర్యము

మీ రిప్పు డడవులకుఁ బ్రయాణమై పోవుటయే సమ్మతమైన కార్యము గాదు. పోయినంత మాత్రమున నేమియందువా కారణము చెప్పెద వినుము. మీరు యుద్ధమునకు బోవు సన్నాహముతోఁ జేత విల్లు నమ్ములు కత్తులు ధరించిపోవుచున్నారు. త్రోవలో నెవఁడైన రాక్షసుఁడు కనఁబడెనా యిదిగో రాక్షసుఁడు దొరికెనని వానిపై బాణము ప్రయోగింపఁగలరు, ఆ దెబ్బ దిని వాఁడు చచ్చును. అదియే రాక్షసులకు మనకు విరోధకారణ మగును. రాక్షసులు మనకుఁ బ్రత్యక్షముగ నపకారము చేసినచో వారిని వధింపవచ్చును గాని యెవరినో ఋషీశ్వరులను నెవరో రాక్షసులు చంపినారని వారు చెప్పినంత మాత్రమున నెవరినో నిరపరాధి రాక్షసుని జంపి మనమై కచ్చుకుఁ గాలు త్రవ్వుట నాకు రుచింపలేదు. రాక్షసులమీఁద బాణము ప్రయోగింతునని నీ వెట్లూహించితివి? నీవు రాక్షసుల జంపుదునని ప్రతిజ్ఞ చేసితివి. నీవు సత్యప్రతిజ్ఞుఁడవు, కావునఁ జంపక మానవు, భయపడకుము, నిష్కారణముగ నే నెవరిని జంపను. మనలఁ హింసింపవచ్చిన వారినే హింసింతునని ధైర్యము చెప్పెదవా. అయిన నీ ప్రతిజ్ఞ నెఱవేఱుటెట్లు? దానికి సరియైన కారణము కలుగవలెను. ఆ కారణము నేనే యగుదును. అప్పుడు నానిమిత్తమై నీవు రాక్షసుల వధింపవచ్చును గాని నీ వేకపత్నీవ్రతుఁడవు. నన్ను విడనాడి నీ వెట్లుండఁ గలవు? నా వియోగమున నీ వెంత దుఃఖింతువో నీ దుఃఖము నేను సహింపఁజాలను. కావున మీ రరణ్యమునకుఁ బోవుట నాకు రుచింపలేదు. నా వియోగమున మిమ్ము దుఃఖపెట్టియైనఁ బ్రతిజ్ఞ మీరు నెఱవేర్పఁజేయుట బాగా, ప్రతిజ్ఞ చెడినఁ జెడనీ మీరు దుఃఖము పడకుండుట బాగా యని నా విచారము.

క. గంధవహబాంధవునకును, నింధనములపోల్కి క్షత్రి♦యేశ్వరతతికిన్
బంధురశస్త్రంబులసంబంధము వర్ధిల్లఁజేయు ♦ బలతేజములన్. ౧౧౨

గంధవహ=వాయువుయొక్క, బాంధవునకున్ = మిత్రునకు, అనఁగా నగ్నిదేవునకు, ఇంధనములు = కట్టెలు, బంధురశస్త్రములు = ప్రకాశమానములగుటచే సందములైన యాయుధములు, బలతేజములన్ = బలమును దేజమును, వర్ధిల్లఁజేయును = వృద్ధినొందించును.

తాత్పర్యము

అగ్నిహోత్రమునకుఁ గట్టెల సాంగత్యముచే నెట్లు బలము తేజము వృద్ధియగునో యట్లుతే క్షత్రియప్రభువుల సమూహమునకుఁ జేత నాయుధముండిన నది బలతేజముల వృద్ధిచేయును. కావునఁ గలహము మానుటకై యాయుధముల నిందే యుంచి పోదము.

—♦ సీత శ్రీరామునకు శస్త్రసాంగత్యదోషమును దెలుపు నితిహాసముఁ జెప్పుట ♦—

సీ. ప్రాణేశ మున్నొక్క ♦ యడవి సత్యాత్ముండు, ధర్మరతుండైన ♦ తపసి గలఁడు
కాననఖగమృగ ♦ కాండంబు లందతి,కరుణయు నమితరా ♦ గంబుఁ గలఁడు
అతనితపంబున ♦ కంతరాయముఁ గూర్ప, భటరూపధరుఁ డయి ♦ కుటిలమతిని
వాసవుం డొకనాఁడ ♦ భాసమానకృపాణ, మిల్లడ యుంచి తా ♦ నేగె దివికి

తే. న్యాసరక్షణతత్పరుం ♦ డైననియమి, దాని ధరియించి చరియించుఁ ♦ గానలోన
ఫలములును మూలములు దెచ్చు ♦ పట్లనైన, విడిచిపోవఁడు దానిన ♦ వ్వెడఁగుఁదపసి. ౧౧౩

కానన=అడవియందలి, ఖగ=పక్షులయు, మృగ=మృగములయు, కాండంబులందున్ = సమూహమందుఁ అమితరాగంబు=మిక్కిలి యనురాగము, ప్రేమ, అంతరాయము=విఘ్నము, భటరూపధరుఁడయి=భటునివేషము ధరించినవాఁడై, కుటిలమతిని=వంచనబుద్ధితో, వాసవుఁడు=ఇంద్రుఁడు, భాసమాన = తళతళ ప్రకాశించుచున్న, కృపాణము=కత్తి, ఇల్లడ=కొన్నిదినము లుంచుకొని మరల నిమ్మని, దివికిన్ = స్వర్గమునకు, న్యాసరక్షణ తత్పరుండు = ఇల్లడసొమ్మును గాపాడుటయందు మిగుల నాసక్తిగలవాఁడు, నియమి=ఆ వ్రతస్థుఁడు, కానలోన్=అడవియందు, చరియించున్= తిరుగుచుండెను, వెడఁగుఁదపసి=పిచ్చితపసి తపసి గలఁడు ప్రబంధముల భూతమునకు వర్తమానమగు సు. వ్యా. వాక్య. ౪౩. పోవఁడు = పోయినవాఁడు కాఁడు "పాఱఁడు లేచి దిక్కులకు బాహువు లొగ్గఁడు బంధురాజిలోఁ దూఱఁడు" భాగ-౭.

రాజ చోర భయా ద్దాయాదానాంచ వంచనాత్
స్థాప్య తే న్యస్య గృహే ద్రవ్యం, న్యాసస్య పరికీర్తితః

అన్నట్లు రాజుల చోరుల భయమువలనఁగాని దాయాదుల వంచనమువలనఁగాని యితరుల యింటిలో నుంచిన ద్రవ్యమునకు న్యాసమని పేరు.

తాత్పర్యము

ప్రాణేశ్వరా! రామచంద్రా!! పూర్వకాలమున సత్యధర్మములందాసక్తిగల యొక తపసియుండెను. అడవియందలి మృగపక్ష్యాదులందు మిగుల దయయు, ప్రేమును గలవాఁడు, ఆయన తపస్సునకు విఘ్నము కలిగింపనొకనాఁ డింద్రుఁడు భటునివేషము ధరించి వచ్చి దీనిని నీయొద్ద నుంచుకొమ్ము, మరల నేనువచ్చి తీసికొనెదనని యొక కత్తి యిచ్చి స్వర్గమునకుఁ బోయెను. ఇల్లడసొమ్ము జాగ్రత్తతోఁ గాపాడవలయు నను నాసక్తితో నా వెఱ్ఱితపసి పండ్లు వేళ్లు తెచ్చుకొనుటకుఁ బోవునపుడైనను దానిని విడిచిపోక కూడఁదీసికొని పోవుచుండెను

చ. ప్రతిదిన మిట్లు లా ముని కృ ♦ పాణముఁ దోకొని పోవు వాడుకన్
రతి జనియించె దానిపయి ♦ రౌద్రము దానన కల్గె, నైజ మా
మతి చెడి క్రూరకర్ముఁ డయి ♦ మత్తత ధర్మవిధుల్ దొరంగ దు
ర్గతి కతఁడేగెఁ నెంతటి ని ♦ కారమొ కంటివె శస్త్రసంగతిన్. ౧౧౪

తోకొని = వెంటఁదీసికొని, వాడుకన్ = అభ్యాసముచే, తృతీయార్థమున ద్వితీయ రతి = ప్రీతి, రౌద్రము = క్రౌర్యము, దానన = దానిచేతనే, అది ధరించియుండుటచేతనే, నైజము = సహజము, ఆ మతి = అయిన మనస్సు, అనఁగా దయతోఁ గూడిన మనస్సు, మత్తతన్ = మదముచే, ధర్మవిధుల్ = తాను దన యాశ్రమమునకుఁ దగిన కార్యములను, తొరంగి = వదలి, దుర్గతి = అధోలోకమునకు, నికారము = కీడో, శస్త్రసంగతిన్ = ఆయుధముతో గూడియుండుటచేత.

తాత్పర్యము

ఆ తపసి ప్రతిదినము కత్తిని జేతధరించి పోవుటకు వాడుకపడగా, 'సంగాత్సంజాయతే కామ' మన్నట్లు దానియందు నొక ప్రీతి జనించెను. అంతకు ముందు కాయలు గసుగులు చేతితోఁ గోయుచున్నవాఁడు కత్తితోఁ గోయసాగెను. అట్లే యగ్నిహోత్రమునకు సమిధలు చేతితో విఱుచువాఁడు కత్తిచేఁ గొమ్మలు కొట్ట నారంభించెను. ఆ తరువాత నడవిమృగము లెదురుగా వచ్చినఁ దానిని తొలఁగిపోవువాఁడు వానిని కత్తితోఁ గొట్టి తఱుమసాగెను. ఆవల హింసకే ప్రారంభించెను. ఈ క్రూరవినోదముల మరగి యతఁడు తాను జేయవలసిన నిత్యకృత్యము లుపేక్షించెను. ఆ కారణమున వాఁడధోగతులకుఁ బోయెను. ఆయుధము చేతనుండుటచే నెంత యనర్థము కలిగెనో చూచితిరా! ఆయుధము చేతనుండెనేని దానిని గొట్టుదమా దీనిని గొట్టుదమా యను క్రూరపు బుద్ధి పుట్టనే పుట్టును.

తే. ఇదియు నొండు పురాతన ♦ వృత్త మధిప, శస్త్రసంయోగకారణ ♦ సంకలితము
ఆశ్రయాశుసంయోగము ♦ నట్టి దండ్రు, శస్త్రసంయోగమును జూడ ♦ సారబుద్ధి ౧౧౫

పురాతనవృత్తము=పూర్వకాలమున జరిగినది, శస్త్రసంయోగకారణ సంకలితము=శస్త్రముతోఁ గూడియుండు కారణముచేఁ గలిగినది, శస్త్రసంయోగము = ఆయుధముతోఁ గూడియుండుట, ఆశ్రయాశుసంయోగమునట్టిది=అగ్నిహోత్రముతోఁ గూడి యుండుటవంటిది. ఆశ్రయాశుఁడు = ఆశ్రయమును నాహారముగాఁ గలవాఁడు, అగ్ని దేని నాశ్రయించునో దానిని దహించును. ఈపద మిచ్చట సార్థకము. అలంకారము పరికరాంకురము. అట్లే శస్త్రము దన్నెవ్వరు ధరింతురో వారిని నాశము చేయ యత్నించును. సంయోగము నట్టిది:—షష్ఠీసమాసంబున నుగాగమంబు.

తాత్పర్యము

ఇప్పుడు నేను జెప్పిన యితిహాసము నా కల్పితముగాదు. పూర్వకాలమున జరిగిన చరిత్రమే. ఇది శస్త్రసంయోగమువలనఁ గలుగు కీడును దెలుపును. అగ్నిహోత్రుఁడు దాను దేనిని (కట్టెలనో వస్త్రములనో) నాశ్రయించునో దానినే దహించునట్లు శస్త్రముకూడఁ దన్నెవరు ధరింతురో వారినే చెఱుచును.

చం. చనవున స్నేహభావమున ♦ సారసలోచన నీవు నన్ సదా
కను బహుమానదృష్టి నిది ♦ కాదని నిం దలఁపించితిం జుమీ
మనమున నీ వెఱుంగని సు ♦ మార్గము నేర్పుట గాద దెంత చూ
చిన రుచియింప దో సుజన ♦ శేఖర నీ దగు నెత్తికో లిటన్. ౧౧౬

చనవున = నీవు నాకిచ్చిన స్వాతంత్ర్యముచేఁ గలిగిన మచ్చికచేత, స్నేహభావమున = నాకు సహజముగా నీయందుఁగల యనురాగముచేత, సదా = ఎల్లప్పుడు, కను=చూచు, బహుమానదృష్టిన్=గౌరవముతోడి చూపుచేత, ఇది = మీరు సంకల్పించిన రాక్షసవధ; కాదు = సరిగాదు, తలఁపించితిని = స్మృతికి వచ్చునట్లు చేసితిని, సుమార్గము = మంచి త్రోవ, ఎత్తికోలు = ప్రయత్నము, ఇటన్ = ఈ సమయమం దీ ప్రదేశమందు.

తాత్పర్యము

నే నజ్ఞుఁడనని నాకు నీవు నేర్పవచ్చితివా యనకుము. మీరు నాకిచ్చిన చనవు చేతను నన్ను నీవు సగౌరవముగఁ జూచి నా మాటయం దాదరబుద్ధి వహించుట చేతను నాకు స్వభావసిద్ధమైన మీయందలి స్నేహముచేతను నేను మీకు మఱచిన దానిని జ్ఞప్తికి వచ్చునట్లు చేసితిని, గాన నీకుఁ దెలియని మంచి క్రొత్త విషయము నేర్పవచ్చిన దానఁగాను, కావున క్షమింపుము, నే నెంత దూర మాలోచించినను నీ సమయమం దిచ్చట మీ ప్రయత్నము నాకు రుచింప లేదు. నీవు సుజనశేఖరుఁడవే, కాని యేదో ప్రమాదవశమున సుజనకృత్యము మఱచితివి.

చం. ధనువు ధరించి పోవుటయు ♦ దర్పమునం బగ యేమి లేక యా
దనుజుల దండకాశ్రితులఁ ♦ దార్కొని చంపుట కాని కార్య మే
యనువున నెంతచూచిన ని ♦ రాగసులన్ వధియింపఁ బూనుటల్
జనసుతశీల! నామదికి ♦ సంతస మీయ దొకింతయేనియున్. ౧౧౭

దర్పమునన్ = బలగర్వముచే, కానికార్యము = సరిగానిపని, అనువునన్ = విధమున, నిరాగసులన్ = నిరపరాధులను.

తాత్పర్యము

మునివృత్తి నుండువారి కాయుధములతోఁ బనిలేదు. కావున నాయుధములను మీరు ధరించుట మొదటి సరికాని పని, అవల మనము బలవంతులము మన కెవ్వ రడ్డమని బలగర్వముచేఁ బగలేకయును నెందో దండకారణ్యములోఁ బడియుండు వారిని రాక్షసులను బైబడి పోయి చంపుట రెండవ సరిగానిపని, నే నెన్ని విధములనో యాలోచించి చూచితిని, రాక్షసులనైనను నిరపరాధుల దండించుట నాకు రుచింపలేదు. నా కొక కొంచెమైనను దృప్తి గలిగింపలేదు.

దీనివలన రామలక్ష్మణు లాయుధముల ధరించిన తీరు చూచి వీ రీ దినమే త్రోవలో నెవఁడో యొక రాక్షసుఁ డెదురైన వానిని నిష్కారణముగాఁ జంపుదురని యత్యంతదయావతియు మూర్తీభవించిన కృపారసమగు సీత తలంచి, యది సరిగాని కార్యమని తన యసమ్మతమును దెలిపెనుగాని పూర్వాపరాధులైన రాక్షసుల దండింప రాదని కాదు. రామచంద్రమూర్తి తన విషయమున నపరాధము చేసినవారిని, దన యెదుటఁ దనవారి కపరాధము చేసినవారిని దండింపవచ్చునని సీతాదేవి యభిప్రాయము. ఈ యభిప్రాయము శ్రీరామచంద్రమూర్తియుఁ గలవాఁడయి యే వాలి సుగ్రీవుల యుద్ధమందు వాలి సుగ్రీవుల హింసించు దశ వచ్చువఱకు నూరకుండి యిఁక నూరకుండినఁ దనమిత్రునకు శరణాగతునకు నపాయము తప్పదని నిశ్చయించి వాలిని బడఁగొట్టెను. కాని సుగ్రీవుఁడు చెప్పినంత మాత్రమున వాఁ డెదురుగా రాఁగానే చంపలేదు. నిరాగసులన్ అను బహువచన ప్రయోగము. ఎవఁడు తప్పు చేసెనో వానినిమాత్రమే చంపవలెనుగాని వానివారను కారణముచే నిర్దోషులను జంపరాదని సీతాదేవి యభిప్రాయము. ఆదండమైనను నేరమునకుఁ దగినదిగా నుండవలెనుగాని క్రూరముగా నుండరాదు. కావున సీతను మ్రింగవచ్చిన శూర్పణఖను దాటకనువలెఁ జంపక రామచంద్రమూర్తి ముక్కు చెవులు గోయించి పంపెను.

కం. వీరులు మఱి కాననసం,చారులు నగు క్షత్రియులకు ♦ సార్త్రివ్రజర
క్షారంభమునకుఁ గార్ముక,ధారణ మగుఁగాక రిత్త ♦ దండము తగునే. ౧౧౮

కాననసంచారులు = అడవియందుఁ దిరుగువారు, సార్తి = ఆర్తితోఁ గూడిన వారియొక్క, వ్రజ = సమూహముయొక్క, రక్షారంభమునకున్ = కాపాడు ప్రయ

త్నమానసః, కార్ముకధారణము = విల్లుపట్టుట, దండము = దండించుట, రిక్త = నిష్కారణముగ.

తాత్పర్యము

వీరులు, అడవియందుఁ దిరుగువారు, నగు క్షత్రియులు ఆర్తజనరక్షణమునకై విల్లు బాణములు పట్టవచ్చును, గాని తెరతెరకుఁ బరుల దండింపఁ బట్టవచ్చునా.

కం. ఎక్కడి శస్త్రము కానన, మెక్కడ క్షాత్రంబ దేడ ♦ నేటితపంబో
యిక్కార్యా లన్యోన్యము, మిక్కిలి వికటంబు చూడు ♦ మీ ప్రాణేశా. ౧౧౯

వికటంబు = విరుద్ధము, అలం. విషమము.

తాత్పర్యము

ప్రాణేశ్వరా ! శ్రీరామచంద్రా ! అడవులందు మునివృత్తి సంచరించుటకు శస్త్రము ధరించుటకు నేమి సంబంధము ? మునివృత్తి శాంతి ప్రధానము; ఆయుధ ధారణము క్రౌర్యప్రధానము; ఒకటి శుద్ధ సాత్త్వికము, మఱియొకటి శుద్ధ తామసము. ఇఁక నీకులోచితమైన క్షత్రియత్వమేడ ? బ్రాహ్మణోచితమైన తప సేడ ? రెంటికిఁ బొంతనము లెట్లు కుదురును ? నీవు చేయఁబూనిన యీ కార్యము పరస్పర విరుద్ధ గుణములు గలది. నీవే యాలోచింపుము; కావున రెంటిలో నొకటి విడువుము. వానప్రస్థమైన వదలుము, శస్త్రమైన వదలుము. క్షాత్రమైన వదలుము, తపస్సైన వదలుము; అటుగాని యెడల రెంటను జెడవలసి వచ్చును.

కం. ఏ దేశపు ధర్మంబుల, నా దేశమునందు నడప ♦ నర్హము కాదే
కాదే వని మునివృత్తిని, మోదించెడి నీకు నడవ ♦ మునిమార్గమునన్. ౧౨౦

'యత్ర దేశే యదాచారః తత్ర దేశే తథాశ్రమః' అను న్యాయ మనుసరించి సీతాదేవి చెప్పుచున్నది. కాదే = కదా; కాదే కదార్థంబగు, ప్రౌ-వ్యా. క్రియ ౩౧. శౌరి కృపఁగాదె నాకు నక్షయ బలంబు-జై--౨ ఆ.

తాత్పర్యము

ఏ దేశమునందు మనముందుమో యా దేశముల ధర్మముల ప్రకారమే మనము నడువవలయును. కావున ముని మార్గమున వర్తించెడి నీవు మునుల చర్య యగు నహింస నవలంబించుట సరియైన కార్యము గదా.

పూర్వార్ధమందలి యర్హము యను పదమును ఉత్తరార్ధమందును గ్రహింపవలయును.

తే. శస్త్రసంభృతి మతి కలు ♦ షత్వ మొందుఁ
గానఁ గానల శస్త్రసం ♦ గతిని విడుము;
క్షత్రధర్మంబు వహియింపఁ ♦ గార్యమగును
వెండియు నయోధ్యఁ జరియించు ♦ వేళ నీవు. ౧౨౧

శస్త్ర సంభృతిక = శస్త్రమును ధరించుటచే, మతి = మనస్సు, కలుష త్వము = పాపముతోఁ గూడుటను.

తాత్పర్యము

శస్త్రమును ధరించుటయే కలిగెనేని దాని నుపయోగింప వలయు నని పాపపు బుద్ధి పుట్టును. కావున నీ వడవుల నుండు కాలమందు శస్త్రము ధరింపవలదు. అటేని నిఁక నెప్పుడు నా కులోచిత ధర్మమనుసరించి శస్త్రము ధరించుటయందు వేని, నయోధ్యయందు నీవు మరల గృహస్థ ధర్మమందుండు సమయంబున ధర్మ రక్షణార్థము శస్త్రము ధరింపవచ్చును.

మంజుభాషిణి. సిరియుఁ ధరఁ విడిచి ♦ చేరి కానలఁ
జరియించు నీ విపుడు ♦ సంయమింబలెఁ
దిరుగం దపోనియతి ♦ దేవ మోదముం
బరఁగించు నత్తకును ♦ మామగారికిఁ. ౧౨౨

సిరి = శ్రీ = సంపద, ధరఁ = భూమిని, భూపరిపాలన కార్యమును, సంయమిం బలెఁ = మునీశ్వరువలె.

మంజుభాషిణీ వృత్తమునకు, సజసజగలు గణములు. ౯-వ యక్షరము యతి, మంజుభాషిణి సీతగావున, మంజుభాషిణీ వృత్తము సమంజసమే.

తాత్పర్యము

అనుభవింపవలసిన యైశ్వర్యము, పాలింపవలసిన భూమి వదలిపెట్టి మునివలె నడవులఁజేరిన నీవు మునివలెఁ దపస్సు చేయుచుంటివేని, రాముఁడు యథార్థవాది, నాయెదుటఁ జెప్పినట్లు చేయుచున్నాఁడని కైక సంతోషించును. నా కొడుకు విశేష శ్రమపడక సుఖముగా నున్నాఁడుగదా యని కౌసల్యయు సంతోషించును. వీరే గాక స్వర్గమందలి నా మామగారును నా కొడుకు నన్ను సత్యవాదిని జేయుచున్నాఁడని సంతోషింతురు. కావున నట్లు చేయుము.

కం. ధర్మంబున నర్థం బగు, ధర్మంబున సుఖము గలుగు ♦ ధర్మముచే స
త్కర్మంబులు ఫలియించెడి, శర్మకరా! జగము ధర్మ ♦ సారంబె కదా. ౧౨౩

అహింసా పరమోధర్మ యను న్యాయము ననుసరించి ధర్మాచరణమే శ్రేష్ఠమని చెప్పుచున్నది.

శర్మకరా=లోకమునకు సుఖమును గలిగించువాఁడా, అర్థము=ధనము, ధర్మ సారము = ధర్మమే సారముగాఁగలది.

తాత్పర్యము

ధర్మముచే ధనము లభించును, ధర్మముచే సుఖము కలుగును, ధర్మము నందు నిలిచినవాఁడుచేయు సత్కర్మములు మంచి ఫలము నిచ్చును. ధర్మహీనుఁడు చేయు

సత్కర్మములు ఫలింపవు, కావున శర్మకరా ! ప్రపంచము ధర్మమే సారముగాఁగలది, ధర్మము చెడిన జగమే చెడును.

కం. సుఖమున సుఖము లభింపదు, ప్రఖరవ్రతములకు నియమ ♦ పద్ధతులకు ను
న్ముఖుఁడై యాత్మ జయించిన, నఖిలోత్తమ మైన ధర్మ ♦ మలవడు నాథా. ౧౨౪

ప్రఖరవ్రతములకున్ = మిగుల కఠినములైన కృచ్ఛ్ర చాంద్రాయణాది వ్రతములకు, నియమపద్ధతులకున్ = ఆహారవిహారాది నియమములకు, మార్గములకు, ఉన్ముఖుఁడై = అభిముఖుఁడై, వానిని బూనుకొన్నవాఁడైన, ఆత్మన్ = మనస్సును, అలవడును = లభించును.

తాత్పర్యము

రామచంద్రా ! యీ ఋషీశ్వరులవెంట హాయిగా నీ యాశ్రమమున కా యాశ్రమమునకుఁ దిరుగుచుండిన సుఖములేదు. పరలోకసుఖముఁ గోరినవారు కఠిన వ్రతములు నియమము లనుష్ఠింపవలెను. "సుఖాసుఖే నేహాలభ్యం, దుఃఖేన సాధ్వీ లభతే సుఖాని. మ. భా. వన. ౨౩౩-౪. అని కలదుగదా వానివలన మనస్సు జయింపవచ్చును. మనస్సేకదా బంధమోక్షములకుఁ గారణము. మనస్సు జయించిన లోకోత్తరమైన ధర్మఫలము లభించును. కావున దానికై కృషిచేయుము.

కం. మానిత సౌమ్యుఁడవుగ శుచి, ధీనియతుండవును నీకుఁ ♦ దెలియని దున్నే
ప్రాణేశ మజ్జగంబుల, నే నెంతటిదాన నీకు ♦ నీతులు నేర్పన్. ౧౨౫

మానితసౌమ్యుఁడవున్ = గౌరవింపఁబడిన సాధుత్వముగలవాఁడవు, శుచిధీ నియతుండవు=శుచిధీ=పవిత్రమైన బుద్ధిచే, నియతుండవు = నియమింపఁబడువాఁడవు, ఉన్నే = ఉన్నదా ? లేదని యర్థము.

తాత్పర్యము

నీ సౌజన్యము సాధుత్వము లోకముచే గౌరవింపఁబడునవి, మనస్సు వచ్చిన ప్రకారము చరింపక నిష్కల్మషమైన బుద్ధిచేఁ గార్యనియతిగలవాఁడవు. ఇట్టి నీకు మూఁడులోకములందుఁ దెలియని దేమున్నది, ప్రాణేశ్వరా ! నీకు నీతులు నేర్ప నే నెంతదానను.

చ. విపినతలంబులం దిరుగు ♦ వేళ సహింపఁ జరింపరాదె, స్త్రీ
చపలత నాకుఁ దోఁచినది ♦ సజ్జనవందిత యాడితిన్, ధరన్
నిపుణుఁ డెవండు ధర్మములు ♦ నీ కుపదేశ మొనర్పఁ, దమ్ముఁడున్
నృపవర నీవు నారసి చ ♦ రింపుఁడు మీకు రుచించు చొప్పునన్. ౧౨౬

విపినతలంబులన్ = అడవిప్రదేశములందు, సజ్జనవందిత= సత్పురుషులచే నమస్కరింపఁబడువాఁడా, స్త్రీచపలత = స్త్రీలకు స్వభావసిద్ధమైన చపలబుద్ధిచే, నిపుణుఁడు=సమర్థుఁడు,నేర్పరి,'విదితేచాపివక్తవ్యం సుహృద్భిరనురాగతః'॥భార.౪-౪-౯. తెలిసినవారికైనను వారియందుఁ బ్రేమగల సుహృత్తులు హితము చెప్పవలెను.

తాత్పర్యము

నీ వడవులలోఁ దిరుగు కాలమందు హింసావ్యాపారములేక యుండ రాదా ? ఇదియే నేను గోరునది, నీవు సజ్జనవందితుఁడవు. హింసారతుఁడ వయ్యెదవేని సజ్జనులు మెచ్చరేమో! రాముఁడు క్రూరుఁ డందురేమో యని విచారపడెదను, స్త్రీలకు స్థిర బుద్ధిలేదు. ఇదమిత్థమని నిశ్చయింపఁజాలరు. కావున నాకు స్వభావసిద్ధమైన బుద్ధి చపలతచేఁ దోఁచినది చెప్పితిని. నీకు ధర్మములునేర్ప లోకమున సమర్థుఁ డెవఁడు గలఁడు. కావున నీవు నీతమ్ముఁడు నాలోచించి మీకు నేది మేలని తోఁచునో యట్లు జేయుము.

—♦ ౧౦ వ సర్గము. శ్రీరాముఁడు సీతకు నార్తరక్షణము పరమధర్మం బని చెప్పుట. ♦—

చం. అతులితభర్తృభక్తి సతి ♦ యాడినపల్కులు విని ధర్మసు
　స్థితమతి రాముఁ డిట్లనియె ♦ దేవి తమిఁ భవదీయసత్కులో
　చితముగ రాగతుల్యముగఁ ♦ జెప్పితి వియ్యెడ ధర్మబుద్ధి నా
　మతిగతిఁ బల్కెద న్వినుము ♦ మానుగ నంతయు బోధ మయ్యెడిన్.　　౧-౭౭

రాముఁడా యాడినమాటఁ దప్పువాఁడు కాఁడు, కావున రాక్షసవధ చేయును గాని మానఁడు. అట్లని నిష్కారణముగా వారిని వధింపఁగోరఁడు. రాక్షసులా దుష్టులు, ఊరకుండువారుగారు, రాముని ధనుస్సునుజూచి తమకుఁ గీడుచేయునని భయపడి యేదైనఁ గీడుచేయఁ బ్రారంభింతురు, రాముఁ డూరకున్నను వారూర కొనరు. ఏ ప్రయత్నము లేక చిత్రకూటమం దూరక యల్పదినము లుండిన మాత్రముననే రాముఁ డందున్నాఁడని యచటి మునులను రాక్షసులు పలువిధముల బాధించి రని వారు చెప్పిరిగదా, రాక్షసులు రామచంద్రునకు ముఖాముఖి యెదురు కట్ల నిలిచి కీడుచేయజాలరు. రామచంద్రునకుఁ గీడుచేయవలయు ననిన వారు నాకుఁ గీడు చేయవలయును. సీతతో మీ రిందుండవలదని చిత్రకూట మునులు బోధించిరి గదా. ఏమాయోపాయములనైన వారు నాకుఁ గీడు గలిగించెదరేని రామచంద్ర మూర్తి మిగుల దుఃఖించి ప్రపంచసుఖమే మానును. ఆయనకట్టి కష్టదశ వచ్చుటకు నేనట్లు కారణభూతురాల నగుదును. అని యాలోచించి రామునకుఁగల దుఃఖమూఁ పుటకై యీ విధముగాఁ జెప్పెనుగాని శ్రీరామచంద్రమూర్తియో, నీ వియో గము కలిగినఁ గలుగునుగాక, దుఃఖించిన దుఃఖితునుగాక, దుష్టరాక్షసవధ మానననని ప్రత్యుత్తర మిచ్చుచున్నాఁడు.

అతులిత భర్తృభక్తిః=అసమానమైనపతిభక్తిచే, భక్తిపరమప్రేమముగదా, ధర్మసుస్థితమతి=ధర్మమందే (అర్థకామములందుఁగాదు.) చక్కఁగా నిలిచిన మనసుగల వాఁడు, తమిః=ప్రేమముతో, భవదీయ=నీయొక్క, సత్కుల = మంచివంశమునకు,

ఉచితముగఁ=తగినట్లు, రాగతుల్యముగఁ = నాయందు నీకుఁగల యనురాగమునకు సమానమైనట్లు, మతిగతిఁ = ఆలోచనవిధము, మనస్సురీతి.

తాత్పర్యము

పతివ్రతయగు సీతాదేవి కేవల పరమప్రేమచే దన క్షేమముఁ గోరి చెప్పిన మాటలు విని యామె యభిప్రాయమును గ్రహించి సీతాదేవి చెప్పిన యర్థకామ సుఖంబులందుఁ గోరికలేక ధర్మమే పరమార్థమని దానియందే నెలకొన్న మనస్సు గలవాఁడై శ్రీరామచంద్రమూర్తి యిట్లు చెప్పెను.

దేవీ! నీవు ప్రేమతోడను నీవు జనించిన గొప్పవంశమునకుఁ దగినరీతిని నాయందు నీకుఁ గల యనురాగమునకుఁ దగినట్టు చెప్పితివి. ప్రేమను బురస్కరించుకొని కులధర్మహాని కలుగఁ జెప్పినదానవుకావు. నాకు దుఃఖము కలుగునే శ్రమపడుదునే యని నాకష్టము సహింపలేక నీకు నాయందుఁ గల యనురాగము కొలఁది చెప్పితివి. అటులని చెప్పరానిమాట చెప్పితివా, లేదు. ధర్మబుద్ధి చెప్పితివి, హింస మానుమంటివి, నిష్కారణవైరమెవ్వరితోను వలదంటివి. కాలము వ్యర్థముచేయక పరలోక సుఖమునకై తపస్సుచేయుమంటివి. ధర్మమార్గము వదలవలదంటివి. నా తల్లిదండ్రులకు సంతోషకరమైన మార్గమున నాశ్రమమునకుఁ దగిన ధర్మమనుష్ఠింపుమంటివి, ఇందేది చెడ్డది, కావున నీవు చెప్పినది తప్పని నేను జెప్పఁజాలను, అయినను నా మనస్థితి నాయాలోచనవిధము చెప్పెద వినుము. చక్కఁగా నీకు బోధపడును.

శా. నీవే పల్కితి కాదె క్షత్రియులకు♦న్దీనార్తరక్షార్థమై
దేవీ! చాపముఁ దాల్ప నర్హమని, భీ♦తిన్ మౌనినాథుల్మహా
భావుల్ దండకవారు తార కదవే♦ బాధార్తిమై వచ్చి న
న్నీవే దిక్కని మర్వ్వ జొచ్చి, రిత వే♦నే వారిఁ బోపొం డనన్. ౧౨౪

దీనార్తరక్షార్థమై = దీనులను ఆర్తులను రక్షించుకొఱకై, మహాభావుల్ = గొప్ప మనస్సు, గొప్ప మహిమగలవారు, తార=వా రంతటవారే, బాధ = అతిశయించిన, ఆర్తిన్ = వ్యథచే.

తాత్పర్యము

దేవీ! నీవు క్షత్రియులకు 'సార్త్త ప్రజరక్షారంభమునకుఁ గార్ముక ధారణమగు' నని యంగీకరించితివిగదా! ఇప్పుడు దండకయందుండు మహానుభావులు గొప్ప మనస్సుగలవారు, ఆ కారణముచేఁ బరులను వారు బాధింపరు. అనిమిత్తముగ నితరుల బ్రేరింపరు. అట్టి యహింసాపరులైన ఋషులు రాక్షసులకు భయపడి వారంతట నా ప్రయత్నము లేకయే మిక్కిలి దుఃఖపడుచు వచ్చి నీవే దిక్కని శరణు జొచ్చిరి. ఇట్లు నన్నొక్కనినే దిక్కని నమ్మియున్న నా యాశ్రితులను నెటులైనఁ బాడైపొం డని తిరస్కరించుట ధర్మమా! నీవే చెప్పుము.

హింస నిషేధించితివి, దాని నే నంగీకరించితిని. హింస యన నెటువంటిది? నిరపరాధులగు సాధువుల హింసించుట హింస యనఁబడును గాని యసాధువుల హింసించుట హింసయగునా?

అహింసా౽సాధుహింసేతి శ్రేయాన్ ధర్మపరిగ్రహః. భా. 12-15-49.

అహింస, అసాధుహింస రెండును శ్రేయస్కరములైన ధర్మములని శాస్త్రము చెప్పదా.

రాక్షస వధయందు నా యుద్దేశమేమి? అది వినోదక్రీడగా నెంచితివా? వారి రాజ్యము సంపద నాక్రమింపఁ దలఁచితినా? వారిని నేను గామముచేఁ గాని క్రోధముచేఁ గాని లోభముచేఁ గాని మద మాత్సర్యములచేఁ గాని మోహముచేఁ గాని చంపఁ బూనలేదు కదా, సాధువుల మేలునకై చేయు కార్యమందు దోషముగలదా!

చ. అడవులఁ గాయ కూర కడు ♦ పార భుజించి శరీరయాత్రలన్
నడుపుచు ధర్మపద్ధతి న ♦ నారతమున్ వ్రతులైన మౌనులన్
విడువని వైర మొత్తి కడు ♦ నిష్ఠురవృత్తి వధించుచున్న యా
చెడుగుల మానుషాదులను ♦ జెప్పు మధర్మమె త్రుంప బూనుటల్. ౧౨

ఋషీశ్వరులును దుష్టులైరేని వారు దుష్టులు, మీరు దుష్టులే యిష్టమెట్లైనఁ బొం డనవచ్చును. అట్లు లేదనుచున్నాఁడు.

కడుపారన్=కడుపు నిండ, అనారతమున్ = ఎల్లవేళల, వ్రతులు=వ్రతమూని యుండువారు, నిష్ఠురవృత్తిన్=నిర్దయమైన విధముగ, మానుషాదులను=మనుష్యులఁ దిను వారిని, త్రుంపన్ = చంపుటకు.

తాత్పర్యము

దేవీ! యీ మును లడవులందు నం దొరకు కాయ యిం దొరకు కూర తెచ్చుకొని దానితోనే కడుపు నించుకొని దేహయాత్ర జరపువారు. రాక్షసులో మృగములనే కాదు మనుష్యులను బీకి తిని భోగము లనుభవింపఁగోరు వారు. వీరు ధర్మపద్ధతి నడుచువారు, వారో దయాదాక్షిణ్యములు లేక క్రూరపద్ధతి వర్తించువారు. వీరు సర్వదా వ్రతము లూనినవా రగుటచే నితర కార్యప్రసక్తిగాని యితరవిచారము గాని లేని వారు. వారో శిశ్నోదరపరాయణులై యితరుల బాధించుటయే వ్రతముగా గలవారు, (పరస్వ, పరదార హరణము మాకు ధర్మమని రావణుఁడు చెప్పెనుగదా.) ఇట్లు నిష్కారణ హింసాపరాయణులైన రాక్షసుల వధించి శిష్టపరిత్రాణముచేయుట యధర్మమా? నీవే చెప్పుము.

కం. దండక వసియించెడు ముని, దండంబులు మమ్ముఁ జేరి ♦ తనుదుఃఖంబున్
గొండలుగఁ జెప్పుకొని కా,పుం డనుచున్ వేడ నేను ♦ బూఁపుం గొంటిన్. ౧౩

దండంబులు = సమూహములు,

తాత్పర్యము

దండకలో వసించు మునీశ్వరుల సమూహములు మా యిరువురం జేరవచ్చి కొండలు కొల్లుగఁ దమ దుఃఖము చెప్పి రక్షింపవలసిన దని ప్రార్థించిరి, అప్పుడు నేను,

తే. అంఘ్రిశుశ్రూషఁ దేర్చ సం♦యముల లజ్జ, యయ్యెమీర లెననుఁజూడ♦నరుగు దేరఁ
గరుణ శమియింపుఁ డెవ్వి మీ♦కాంక్షితంబు, లేమిచేయుదునో వచి♦యింపుడంటి
౧౩౧

అంఘ్రిశుశ్రూష = పాదసేవ, కాంక్షితంబులు = కోరికలు, ఇట్లు చెప్పుటచేఁ బెద్దలు వచ్చినపుడు వారిని గౌరవించి శుశ్రూష చేయవలయునని యేర్పడుచున్నది. లజ్జ=దుష్టులవలన బాధలేకుండ రక్షింపవలసినది నా కార్యమైయుండ వారై యింత దూరము వచ్చి చెప్పుకొనుచుండ నా కర్తవ్యము నేను జేయక యూరకున్నాను గదా యని సిగ్గు

తాత్పర్యము

వారి పాదములకు నమస్కరించి సంయములారా! నేను మిమ్ముఁజూడవచ్చుట ధర్మము. అట్టి నేను మీరు రాకముందే మిమ్ముఁ జూడ రాకపోయితినిగదా యని సిగ్గుపడుచున్నాను. నా యపరాధమును దయచే క్షమింపుఁడు. మీ కోరిక లెవ్వి? నేను మీకుఁ జేయవలసిన సాహాయ్యమేది చెప్పుఁడని ప్రార్థించితిని.

ఉ. మానిని వార లెల్ల నొక ♦ మాటగ దండకలోఁ జరించునా
మానవభోజు లెల్లపుడు ♦ మార్తురరీతిని హోమవేళలన్
మానక బాధపెట్టుదురు ♦ మారకులై రిది దిక్కటంచు మే
మానినభీతి నుండఁగ నృ ♦ పోత్తమ మా సుకృతంబు పెంపునన్. ౧౩౨

మార్తురరీతిని = విరోధులవలె, మారకులై = హింసించువారై, సుకృతంబు పెంపునన్ = పుణ్యాతిశయముచే.

తాత్పర్యము

అప్పుడు దేవీ! వారందఱు నేక వాక్యముగ నిట్లనిరి. దండకలోఁ దిరుగు రాక్షసులు విరోధము పూని మేము హోమముచేయు సమయమందు మమ్ము బాధ పెట్టుచు హింసించుచున్నారు. ఈ బాధ పడలేక యెవఁడు మనకు రక్షకుఁడని భయపడి విచారగ్రస్తులమై యుండఁగా. రాజేంద్రా! మా పుణ్యాతిశయముచే నీవు వచ్చితివి. 'దుర్బలస్య బలంరాజా' యని కలదు కదా.

ఉ. వచ్చితి, వీవ దిక్కు, జన ♦ వర్య తపంబున రాక్షసాధముల్
చచ్చి పడన్ శపింపఁ గల ♦ శక్తి వహించి చిరార్జితంబు నై
హెచ్చిన మత్తపంబులు వ్య ♦ యింపఁగ నొల్లక వారి చేతిలోఁ
జచ్చుచునున్న వార మతి ♦ శాంతి వహించి సహించి బాధలన్. ౧౩౩

చిరార్జితంబు=దీర్ఘకాలముగఁ గష్టపడి సంపాదించినది, వ్యయింపఁగన్ =వెచ్చపెట్టఁగ, ఒల్లక =సమ్మతింపక.

తాత్పర్యము

మనల రక్షించువాఁ డెవఁడా యెవనితోఁ జెప్పుకొందమాయని యాలోచించుచుండఁగా బలహీనులకు రాజే దిక్కుగావున రాజవగుటచే వచ్చితివి. మీరు తపోబలము గలవారుగదా, మీరు శపించిన వారు చావరా. ఇతరుల మీరు వేఁడవలయునా యందువేమో. సత్యమే. మా తపోబలము పెంపున నా రాక్షసాధములు చచ్చిపడ శపింపఁగలము కాని చిరకాలముగ నెంతో కష్టపడి యార్జించిన తపశ్శక్తి వెచ్చపెట్ట నిష్టములేక వారిచేతఁ జిక్కి బాధలు సహించి శాంతి వహించి చచ్చుచున్నాము. ఈ దేహము పోయిన మా ప్రయత్నము లేకయే మఱియొక దేహము వచ్చును. తపస్సు పోయిన మరల నెంతో కాలము శ్రమింపక రాదు కదా. తపోహీనులమై జీవించుటకంటెఁ దపస్సంపన్నులమై చచ్చుటే శ్రేయస్కరము. అయిన మా సాహాయ్యమేల యందువేమో మరల జన్మము రాకుండుటకై కదా మేము తపస్సులు చేయుట. అట్టి తపస్సు పూర్తి కాకముందే చచ్చిన మరల జన్మము కలదు గదా. ఆ తపస్సులు పూర్తి చేసికొనుటకై నీ సాహాయ్యము కోరుచున్నాము.

కం. సులభంబు గాదు తపమును, జలుపుట దుష్కరము విఘ్న♦సంతతు లెపుడున్
గలిగెడుఁ గావున నసురలు, సొలయక మము మ్రింగఁదిట్టఁ♦జూడుము మరలన్.

దుష్కరము = దుఃఖముతోఁ జేయదగినది, కష్టసాధ్యము. [౧౩౪

తాత్పర్యము

రామచంద్రా! తపముచేయుట సులువుగాదు. అది మిగులఁ గష్టమైన కార్యము. అంత కష్టించి చేయుదు మనిన నడుమ నడుమ విఘ్నము లెన్నియో వచ్చుచుండును ఇంత కష్టించి సంపాదించిన తపశ్శక్తిని మేము పోఁగొట్టుకొనలేక వారిని శపింపక యున్నాము. ఒకరా యిద్దఱా యెందఱనని శపింతుము? వచ్చినవారి నెల్లఁదిట్టఁబూనిన మా శక్తియేమి మిగులును. జీవించినను వ్యర్థపుఁ జావు చావవలసిన వారమే కదా.

కం. భావింపుము మాస్థితిఁ బ్రతి, గావింపుము మా తపంబు♦కడఁగను గతి సం
భావింపుము తమ్మునితో, నీవే మా కిచట దిక్కు ♦ నిర్మల కీర్తీ. ౧౩౫

నిర్మలకీర్తీ = ఆర్తత్రాణ పరాయణుఁడ వను నిర్మలమైన కీర్తిగలవాఁడా.

తాత్పర్యము

నిర్మలమైన కీర్తిగలవాఁడా, మాస్థితిగతు లాలోచింపుము, రాక్షసులు చేయు కార్యములకు మాఱుచేయుము. మా తపంబులు సాంతమగు రీతి మాయందు దయ

దలంచి మమ్ము గారవింపుము. నీవు సీతమ్మండే మాకిచట దిక్కు. వేఱు రక్షకులు లేరు. మీరు తప్ప మఱే మహారాజు లైనను వీరి బారిఁబడి బ్రతికిపోలేరు.

ఇచ్చట లక్ష్మణప్రశంస పురుషకార సూచకము; హింసాత్మకమైన కార్యము గావున సీతాదేవి సహాయపడదు. ఇది స్త్రీలవలన నగు కార్యము కాదు,

కం. అన విని సర్వముఁ దీర్పఁగ, ననఁబోణీ ప్రతిన చేసి ♦ నాఁడను జుమ్మీ
తనువునఁ బ్రాణము లుండఁగ, నని తప్పుట లేదు సత్య♦మతిహిత మగుటన్. ౧౬

ననఁబోణీ=పువ్వుకోమలా, పువ్వువలెఁ గోమలమగు దేహముగలదానా! ఇట్లనుటచే నీవత్యంత సుకుమారివి గావున రాఁగల కష్టములకు భయపడెదవే కాని కష్టించియైన నాశ్రితరక్ష చేయవలయునని యాలోచింపవైతి వని భావము. ప్రతిన = ప్రతిజ్ఞ, కాన, అతిహితము = మిగుల హితము.

తా త్ప ర్య ము

పూఁబోణీ! వారి ప్రకారము చెప్పఁగా వారికార్య మంతయుఁ జక్కఁబఱుపఁ బ్రతిజ్ఞ చేసితినిజుమీ! ఊరార్పుమాటలు చెప్పి కన్నీళ్ళు తుడిచి పంపినవాఁడఁగాను, నాకు సత్య మన్నిటికంటె నత్యంతహితకర మగుటచే దేహమునఁ బ్రాణము లుండఁగాఁ జెప్పి తప్పను.

కం. న న్నాశ్రయించి కీడుం, దెన్నన నెన్నఁడును బోని ♦ దీనుల నసురుల్
పన్నగఁ జంపిరి నీవే, యెన్నుమ యింతకు విరోధ ♦ హేతువు సుమతీ! ౧౭

తెన్నన=మార్గమందు, ఎన్నుమ = లెక్కింపుమా, విరోధహేతువు= పగకు గారణము, సుమతీ = మంచిమనస్సుగలదానా, అసురులు= రాక్షసులు, (అసు + ర) ప్రాణములు దీయువారు.

తా త్ప ర్య ము

నీవే దిక్కని న న్నాశ్రయించి యేసమయమందును బరులకు హానికరమగు మార్గము నంబోక దిక్కులేనివారిని జీవహింసాపరులైన రాక్షసులు పనిపూని వధించిరి. నీవు నిర్మలమైన మంచి మనస్సు గలదానవుగదా. ఇంతకంటె విరోధకారణ మేది గలదో చెప్పుము.

నన్నాశ్రయించువఱకు నెవ రేపాపములు చేసినను వారి పాపఫలము వారే యనుభవింతురని వారిని నేను రక్షింపఁ బ్రయత్నింపను. ఒకసారి నన్నాశ్రయించి నీవే దిక్కని వారిరక్షాభారమును నాయందు వైచి పాపకార్యములు చేయకయుండు దిక్కులేని వారిని రక్షించుట నా కార్యము. దానికి నేను బూఁటపడియున్నాను. అట్టి నా యాశ్రితులను గావున నా పోష్యవర్గములోఁ జేరిన వారిని రాక్షసులు ప్రాణముదీయుచున్నారు. నా భక్తులు నాప్రాణములుగదా! నాభక్తులను బాధించుట నన్ను బాధించుటేకదా! కావునఁ బగకారణము దీనికి మించిన దేదికలదో నీవే ప్రేలు మడఁచి యెంచి చెప్పుము. అట్లు చెప్పఁగలవేని, సుమతీ! నీవు చెప్పినట్లు చేసెదను.

నీవదిక్కు = నీవేదిక్కు, మాతపస్సులు మాకు రక్షకము లని మేము తలఁప లేదు. మాతపస్సులచే మమ్ము రక్షించుకొనఁదలంచుట మా స్వాతంత్ర్యము ప్రక టించుటేకదా. నీకుఁ బరతంత్రులమైయుండు మేము స్వతంత్రించి మాశక్తిచే మేము రక్షించుకొనఁబూనుట మాకు స్వరూపహానిగదా. మాతపస్సులు ఫలింపనీ ఫలింపక పోనీ, రాక్షసులచే మేము చావనీ బ్రతుకనీ నీ పారతంత్ర్యము మేము వదల మని సూచన.

ఇచట రాయబారమువేళ శ్రీకృష్ణమూర్తి దుర్యోధనునకుఁ జెప్పిన వాక్యములు స్మరింపనగు.

"కం. అలుగుదు పాండవులకు వా,రలు నాకుం బ్రాణములు ధరావల్లభ! యి
ట్టులుముగఁ దమ ప్రాణము లకు, నలుగు జనులు పగతు రనుట యనుమానంబే!

గీ. కారణంబులేక కొంతేయులకు బాల్య
మాదిగాఁగఁ గీడె యాచరింతు
పుణ్యపరులు తోడఁ బుట్టువు లార్యులు
వైరమె తఁదగునె వారితోడ.

ఇట్లున్న మీ యందఱియన్నంబులు దుష్టాన్నంబులు"

ఉద్యో. 3-౨౨౬-౨౨౭.

కృష్ణునకు దుర్యోధనుఁడు కీడుచేయకున్నను, ధర్మాత్ములైన పాండవులకుఁ గీడు చేయుటచే దుర్యోధనుఁడేకాక వానితోఁగలిసియుండు భీష్మద్రోణాదులుకూడ భగవంతునిచేఁ ద్యజింపఁబడిరి. రామాయణమున విభీషణునివలె విదురుఁడుమాత్ర మనుగ్రహింపఁబడెను.

కం. విడిచెదఁ బ్రాణము లైన, న్విడిచెద నిన్నైనఁ దమ్మునిన్ విడిచెద నే
విడుతునె ప్రతిజ్ఞ నందుం, బుడమిసురలతోడఁ బల్కి ముగ్ధా! యెపుడేన్. ౧౯

ముగ్ధా = సుందరీ! తెలియుదిదా నా.

తాత్పర్యము

ఇఁక నామనోనిశ్చయము చెప్పెద వినుము. సత్యము రక్షించునిమిత్తము ప్రాణములైనను విడిచెదను. ప్రాణములకంటెఁ బ్రియుమగు నిన్నైన విడిచెదను. నీకంటెఁ బ్రియుఁడగు తమ్ముని విడువవలసివచ్చినను విడుతును. కాని సామాన్య విషయమైన ప్రతిజ్ఞ విడువను. అందు ముఖ్యముగా బ్రాహ్మణులకు మాటచెప్పి తప్పను. కం. ఊరూరఁ గళత్రంబులు - నూరూరన్ బాంధవులును నొదవెదరకటా - యారయ భ్రాత సహోదరుఁ - డారఁగ లభియించు దేశ మవనిం గలదే॥ యుద్ధ. ౨౩౩వ ప. అనిచెప్పిన శ్రీరామచంద్రమూర్తి 'కం. చెడకుండ ధర్మవిధి నిను,విడిచితి సౌమిత్రి నాదు ప్రియసోదరుఁడా, పుడమిని సాధుల కిష్టుల విడుచుట చంపుటయు నొక్క విధమై యునికిన్. ఉత్తర. ౧౬౧వ పద్యము 'భ్రాతా స్వామ్యాత్మాత్రిరాత్మ' యనుమను

స్మృతి స్మరించునది. రామచంద్రమూర్తి సీతాదేవిని విడనాడుట ధర్మలోప భయమునను లక్ష్మణు విడనాడుట సత్యలోప భయమునను గదా. అయోధ్య ౨౧౫౭- ౨౧౫౮ పద్యవ్యాఖ్య చూచునది.

ప్రాణములైనను విడిచెదను = ఆత్మార్థం పృథ్వీంత్యజేత్, ఆత్మానం సర్వదా రక్షే ద్దారై రపి ధనై రపి. భార్యను ధనమును వదలియైనఁ దన్ను రక్షించుకొనవలెను అనునది స్మరణీయము. నిన్నైనన్ = అర్థోవా ఏష ఆత్మనో యత్పత్నీ = తన యాత్మలో సగము భార్యగదా, 'ఆత్మాహి దారా సర్వేషాం దార సంగ్రహ వర్తినామ్' కుటుంబులకు భార్యయే ఆత్మ - అయోధ్య ౩౭-౨౪.

'యోభర్తా సైవభార్యాస్మృతా-' వాజసనేయ బ్రాహ్మణము. 'యోభర్తా సాస్మృతాంగనా' మను ౯-౪౫.

భర్తయే భార్య.

శాస్త్రప్రయోగా ద్వివిధాచ్చ వేదా

దాత్మాహ్యనన్యః పురుషస్య దారాః॥ కిష్కింధ. ౧౮ స. ౩౯-

శాస్త్రప్రయోగమువలనను నానా వేదములచేతను పురుషునకు భార్య తనమాత్మకంటె వేఱుగాదు. సత్యము విడువవలయునా, యిట్టి నిన్ను విడువవలయునా కుని సందేహము వచ్చినప్పుడు నిన్ను వదలియైన సత్యమునే రక్షింతును. 'నజీవేయం ణమపి వినా తా మసితేక్షణా' మ్మన్నట్టు నిన్ను విడిచి క్షణమైన నేను జీవింపఁజాల న్నను ముందు నిన్ను విడిచి సత్యధర్మముల రక్షించి యాపలఁ బ్రాణమువిడిచెదను. ట్టి గుణమునకు ధైర్య మనిపేరు. (అయోధ్య ౨౧౫౭ వ వ్యాఖ్య చూచునది.)

౦. మునిజనకార్యము పరిపా, లన మే నొనరింపవలయు ♦ లలనా! వారల్
నను నడుగకయుండిన నన్, జనకసుతా! ప్రతిన సల్పి ♦ చనునే విడువన్. ౧౯

లలనా = సీతాదేవీ!

తా త్ప ర్య ము

ఆశ్రితరక్షాభారమును వహించిన నేను నాయాశ్రితులై మత్పరతంత్రులై ండు మునిజనులకార్యము రక్షింపవలసినది నావిధి. ఒకసారి వారు నీ యాశ్రి లము మారక్షాభారము నీదియని చెప్పినఁజాలదా; గడియగడియకు నాకుఁ జెప్పఁ ంపవలయునా, నేనంతటి మఱపువాఁడనా, వారి యోగక్షేమములు నేనేవిచారించు నవలెను. అట్లుండ వారు వచ్చి నాకృత్యము హెచ్చరించిన పిమ్మట వారికిఁ బ్రతిజ్ఞ కూడ నెట్లు నెఱవేర్పక విడుతును. నీవు జనకరాజు కూఁతురవే. ఇది నీకుఁ దెలి నివిషయమా? అప్పు దీసికొనినవాఁడు పలుమా ఱడిగించుకొని యిచ్చుట శ్లాఘ్య ? ఇయ్యకయే యుంట శ్లాఘ్యమా? రెండునుగావు. నన్నునమ్మినన్నుస్మరించినన్ను ్యానించి, యర్చించి, జపించి, సేవించి, వర్ణించి. కీర్తించి, నాపై ఋణమెక్కించిన వారి ణము నేను దీర్చుకొనవలదా? "అహం స్మరామి మద్భక్తం" నాభక్తుని నేనుస్మరిం

చెదను. అని నేను జెప్పినమాట నెఱవేర్చుటయం దాలస్యమైన దని నేను విచారపడు చుండ నాకార్యము నెరవేర్పక యెట్లు లుండఁగలను ?

కం. స్నేహంబున మోహంబున, సౌహార్దంబునను బోధ ♦ సలిపితివి వరా
  రోహా ! మెచ్చితి బుద్ధులు, స్నేహవిహీనులకు నోరులు♦చెప్పఁగ నురటవే. ౧౪౦

వరారోహా = ఉత్తమసతీ.

తాత్పర్యము

నాకు నీయందు నీకు నాయందుఁ గల స్నేహము మోహము కారణముచేతను మంచి మనస్సుగలదాన వగుటను బోధపఱిచితివి. రక్షోవధకుఁ బూనినపుడు నాకు నీయందు, నీకు నాయందుఁ గల స్నేహమోహప్రవాహమునకు విఘ్నము కలుగునే యను నీయనుతాపము గ్రహించితిని. అది సహించియైనఁ గార్యము నెఱవేర్పవల యును. ఉత్తమస్త్రీవి గావున నీ విట్టిబుద్ధులు చెప్పఁగలిగితివి. స్నేహము మోహము భర్తకుఁ దమయందు లేకున్నను భర్తలపైఁ దమకు లేకున్నను జెప్పనత్తురా ? చెప్పరు. కావున నీ వుత్తమగుణసంపన్న వని నిష్కపటవ్యాపార వని మెచ్చితిని.

చం. అనఘ భవత్కులంబునకు ♦ నంబుజపాణి ! భవచ్చరిత్రకున్
  గన ననురూప మర్హమగు ♦ కైవడిఁ బల్కితి నాకు నెప్పుడున్
  వనిత సధర్మచారిణివి ♦ ప్రాణచయంబునకంటె మిన్న వం
  చును వచియించి లక్ష్మణుఁడు ♦ సుందరియుం జనుదేర ధన్వియై. ౧౪౧

అనఘ=నిర్దోషురాలా, భవత్కులంబునకున్ = నీవంశమునకు, అంబుజపాణి= కమలములవంటి చేతులుగలదానా (౨) కమలములను జేతియందుఁగల లక్ష్మీదేవీ, దీనిచే నవతారరహస్యమును స్మృతికిఁ దెచ్చుచున్నాఁడు. నీవేకదా పతివ్రతల పాతి వ్రత్యము చెఱచు రాక్షసుల దునుమ నేను నిమిత్త మయ్యెదను, మీ రా కార్యము చేయ రండని ప్రేరేంచితివి. ఇప్పుడు నీవు వెనుకంజ పెట్టఁదగునా ? నీవు సహధర్మ చారిణి వని కదా నీ తండ్రి చెప్పెను. నీ తండ్రి వాక్యమును నీవు పాలించినట్లు సహ ధర్మచారిణివై నా తండ్రి వాక్యమును నేను బరిపాలించెదనని నీవు చెప్పలేదా. దాని నిప్పుడు స్మరింపుము. దానికి సమయము వచ్చినది. వెరుదీయకుము. గుండెనిబ్బరము చేసికొమ్ము, అను నీ యర్థము నీ పదము సూచించుచున్నది. భవచ్చరిత్రకున్=నీ శీల మునకు, పతివ్రతయగు స్త్రీ పతిహితపరురాలై 'కార్యేషు దాసీ కరణేషు మంత్రీ' యన్నట్లు గదా యుండవలెను.

నీ వంశమునకు ననురూపము. నీ నడవడికర్హము. నీవు జనక రాజుకూఁతురవు. నీ తండ్రి "కర్మణైవహి సంసిద్ధి మాస్థితా జనకాదయ" యని కర్మయోగముచేతనే యోగసిద్ధి పొందిన మహానుభావుఁడు. విత్తొకటివైన చెట్టు మఱియొకటగునా ?

ఇఁక నీ నడవడి యో-

కం. తన కుపకార మొనర్చిన, మనుజున కపకృతి నొనర్ప మదిఁ దలఁపఁడు స
జ్జనుఁ డీ నియతిం బ్రోవఁగఁ, బొనరుగ సజ్జనులు శీలభూషణు లెందున్.

కం. కపివర వృత్యులలోఁ బా, పపుజనములలోన వధకు బాత్రులపట్లన్
గృపఁజూపవలయు సజ్జనుఁ డపరాధము జేయనట్టి యతఁడును గలఁడే.

గీ. పాపములె చేయుచును గామరూపు లగుచు
భువనహింసా విహారులై పొలుచుచున్న
యసురులకుఁ గీడుసేఁత కార్యంబుగాదు.

అను నభిప్రాయము గలదానవై యట్లు వర్తించుదానవుగదా! కాఁబట్టి నీవు చెప్పినది నీవడవడికిఁ దగియున్నది.

దీనివలన యుత్తమస్త్రీత్వము దృఢపడుచున్నది. నీవేమి చేయరానిపని చేసి చెప్పరానిది చెప్పితి వని నేను నిన్ను గోపింతును.

సహధర్మచారిణివి= నే నే ధర్మమందుఁ బ్రవర్తింతునో యట్టి ధర్మమందే నీవు నుండు దానవుగదా. ఏదశయందును ననపాయినివైన నీ విపు డేల జంకెదవు, మిన్నవు= శ్రేష్ఠురాలవు, మణి శబ్దము మిన్న, ధన్వి = ధనువు ధరియించిన వాఁడు.

తాత్పర్యము

నిర్దోషురాలా! కమలహస్తా! నీవు పుట్టిన జనక వంశమునకు నీ శీలమునకుఁ దగినరీతిని జెప్పితివి. ఇందేమి దోషము గలదు. నీవు సహధర్మచారిణివి. ప్రాణముల కంటె నెక్కువ ప్రియమైనదానవు అని చెప్పి లక్ష్మణుఁడును సీతయుఁ దోడ రాఁ దాను విల్లు ధరించి,

౧౧-వ సర్గము

తే. అగ్రవర్తియై శ్రీరాముఁ ♦ డరుగుచుండె నువిద తనుమధ్య మధ్యమం ♦ దుండె సీత
మహితకోదండదండసం ♦ భరణహస్తుఁ, డోలి వెన్నంటెఁ లక్ష్మణుఁ ♦ డొప్పు ప్రేమ.
౧౪-౨

అగ్రవర్తియై = ముందు పోవువాఁడై, ఉవిద = యువతి శబ్ద భవము, తను మధ్య=సన్నని నడుముగలది, మధ్యమందున్=నడుమ, మహితము = మిగులఁ బూజ్యమైన, కోదండ దండ=వింటి బద్దను, సంభరణ = ధరించిన, హస్తుఁడు = చేయిగల వాఁడు, ఓలి = వరుసగా, ప్రేమన్ = అనురాగముతో, వెన్నంటెన్ = వెనుక ప్రక్కఁ బోవుచుండెను.

తాత్పర్యము

ముందు శ్రీరామచంద్రమూర్తి పోవుచుండెను. ఆయన వెనుక రామలక్ష్మణులకు నడుమ సన్నని నడుముగల సీత పోవుచుండెను. ఆమెకు వెనుక ధనుర్ధరుఁడై లక్ష్మణుఁడు ప్రేమ వశమునఁ బోవుచుండెను.

విశేషార్థము

ఇందు ప్రణవ స్వరూపము. ప్రణవార్థము కలదని పూర్వులు చెప్పిరి.

'ఓం' అను నక్షరమునకుఁ బ్రణవ మని పేరు. ఈ ఓం అనునది ఓమిత్యేకాక్షర మని చెప్పఁబడినను అది యొక యక్షరముగాదు. అందు "అకార ఉకార మకార ఇతి తానేకధా సమభవత్త దేత దో మితి"అని నారాయణోపనిషత్తునందు జెప్పఁబడిన ప్రకారము అ-ఉ-మకారములు మూఁడక్షరములు గలవు. అ+ఉ= సంధికలిసి ఓ యయ్యెను, దానికి మ్ చేరఁగా ఓమ్ అయ్యెను. ఇందు అకారము ఉకారము రెండును అచ్చులగుటచే సజాతీయములు ఒక విజాతీయము గలిసి యొకటిగా నైనదే యేకాక్షరమని చెప్పఁబడును.

ఈ పద్యమున మొదటి పాదము మొదట అకారమున్నది. రెండవ పాదము మొదట 'ఉవిద' ఉకారమున్నది. మూఁడవ పాదము మొదట మకార మున్నది. ఈ మూఁడుకలసి ఓమ్మని యాయె నని నాలుగవ పాదము మొదటి యక్షరము కడపటియక్షరము కలసి చెప్పుచున్నవి. ఈ విధముగా నీ పద్యము ప్రణవ స్వరూపము. ఇఁక నీప్రణవమున కర్థమేమో విచారింతము. అ ఇతి బ్రహ్మ. అ ఇతి భగవతో నారాయణస్య ప్రథమాభిధానం, అకారో విష్ణువాచకః ఇత్యాది ప్రమాణముల చేత అకారమునకు విష్ణువని యర్థము. భగవంతుఁడగు నారాయణుని మొదటి పేరు ఆయనయే.

ఎట్లనఁగా అకారము రక్షణ గతి హింసా ద్యర్థము గల 'అవ'ధాతువులవలనఁ బుట్టినది. అవధాతువునకు రక్షణము గతి హింస యని యర్థములు గలవు. ఈ మూఁడు కార్యములు చేయువాని నా శబ్దము బోధించును. యతో వా ఇమాని భూతాని జాయంతే యేన జాతాని జీవంతి యత్ప్రయం త్యభిసంవిశంతి॥ ఎవనివలన నీ భూతములు పుట్టుచున్నవో ఎవనివలన జీవించుచున్నవో ప్రళయమం దెవనియందుఁ బ్రవేశించుచున్నవో.

విష్ణో స్సకాశా దుద్భూతం, జగ త్తత్రైవచ స్థితమ్
స్థితిసంయమకర్తా సౌజగతోస్య జగచ్చ సః"

ఈ జగత్తు విష్ణువలనఁ బుట్టినది, ఆయనయందే యున్నది. ఈ ప్రపంచమునకు స్థితిసంయమకర్త యాయనయే, ఆయనయే జగత్తు, అనుటచే జగత్సృష్టి స్థితి సంహారములు చేయువాఁడు విష్ణు వనియు, నాయనయే అకారవాచ్యుఁ డనియు నేర్పడెను, పంచవింశోయం పురుషః పంచవింశ ఆత్మా భవతి, యన్నట్లు హల్లులందు నిరువదియైదవ యక్షరమగు మకారము జీవుని బోధించును. 'మకారో జీవవాచకః' యని కలదు గదా. ఇఁక నీ రెంటికి నడుమనుండు ఉకారము లక్ష్మీదేవిని బోధించుచున్నది.

అకారే ణోచ్యతే విష్ణుః సర్వలోకైకనాయకః
ఉకారే ణోచ్యతే లక్ష్మీ ర్మకారో దాసవాచకః॥
అని బ్రహ్మసంహితయందుఁ గలదు.
అకారే ణోచ్యతే విష్ణుః, సర్వదేవేశ్వరో హరిః
ఉద్ధృతా విష్ణునా లక్ష్మీ రుకారేణ తథోచ్యతే
మకారస్తు తయో ర్దాస, ఇతి ప్రణవలక్షణమ్॥

సర్వదేవేశ్వరుఁ డగు విష్ణువు అకారముచేఁ జెప్పఁబడెను. విష్ణువుచే నుద్ధృత యగు లక్ష్మీదేవి ఉకారముచేఁ జెప్పఁబడెను. వారిరువురకు దాసుఁడు జీవుఁడు మకారముచేఁ జెప్పఁబడెను. ఇది ప్రణవలక్షణము.

కావున అకారము విష్ణువును ఉకారము లక్ష్మిని మకారము శేషుఁడగు లక్ష్మణుని సూచించును. విష్ణువే శ్రీరామచంద్రమూర్తి, లక్ష్మియే సీత, శేషుఁడే లక్ష్మణుఁడు. ఈ తత్త్వము బోధింప వారీ వరుసనఁ బయనించిరి.

ఇందు విష్ణువు, సర్వదా లక్ష్మీవిశిష్టుఁడై యుండునుగాని విడిచి యుండఁడు. 'విష్ణో రేషానపాయినీ' యని కలదుకదా. 'భాస్కరేణ ప్రభా యథా' యని సీతయు రాముఁడు చెప్పిరికదా. ఈ కారణముచేఁ బ్రథమపాదంబున నూరక రాముఁ డనక అగ్రవర్తియనుటచే ఈయనకుఁ బైవారు లేరని యర్థము. కావున నాయనయే స్వతంత్రుఁడు.

పితాసి లోకస్య చరాచరస్య త్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్
న త్వత్సమో స్త్యభ్యధికః కుతోన్యో, లోకత్రయే ప్యప్రతిమప్రభావ.
భ. గీ. ౧౧-౪౩

ఇక ఉకారము లక్ష్మిని దెలుపు నంటిమి. ఈమె జీవునకు భగవంతునకు మధ్యమున నుండునది. ఆ కారణముచే జీవుఁ డీమెను దాటిగాని భగవంతుని జూడఁజాలఁడు. ఈమెకే మాయ యని పేరు, "యామా" ఏమె లక్ష్మీదేవియో యామెయే మాయ. ఈ మాయను దాటని వానికి భగవత్ప్రాప్తి లేదు. కావున జీవుఁ డామె ననుసరించి పోవలెను. జీవుని భగవంతుని బొందించుటయే యామె కృత్యము. దీనినే పురుషకార మందురు. కావున ఉకారము జీవాత్మ పరమాత్మలకు గల నిత్యసంబంధమును దెలుపుచున్నది ఈమె యిరువురకును నడుమ నుండుటచే భగవదనుగ్రహమామె మూలముననే రావలయును. 'లక్ష్మ్యా కారుణ్యరూపయా' యని యుండుటచే మూర్తీభవించిన భగవంతుని కరుణయే లక్ష్మీదేవి. భగవంతునిప్రాప్తి భగవంతుని కరుణచేతనే కదా కలుగవలయును. భగవంతుఁడును కరుణచేతనే గదా జీవుననుగ్రహింపవలయును. తనుమధ్యా శబ్దమునకు మఱియొకయర్థము గ్రహింపనగు. తను వనఁగా దేహము. కావున దేహమధ్యమం దుండునది యని యర్థము. విష్ణువు వక్షస్థలమందుఁగదా లక్ష్మీదేవియుండుట, తన హృదయమునకుఁ దెలియక యెవఁ

డైన సేవనిట్టియైన నట్లు చేయఁగలడు. కావున శిరస్సు విష్ణువనియుఁ గంఠము క్రింది నడిమిభాగము లక్ష్మీదేవి యనియు భగవత్సంకల్ప ప్రకారమే లక్ష్మీదేవియు (శిరస్సున సంకల్పించినదే చేతులు నడుము వగైరా;) చేయుచు నుండుననియు గ్రహింపనగు.

> లక్ష్మ్యాసహ హృషీకేశో దేవ్యా కారుణ్యరూపయా
> రక్షక స్సర్వసిద్ధాంతే వేదాంతేషుచ గీయతే॥

హృషీకేశుఁడగు విష్ణువు కారుణ్య రూపయగు లక్ష్మితోఁగూడి రక్షకుఁడగు చున్నాఁడని సర్వసిదాంతములందు వేదాంతములందుఁ జెప్పబడినది, అనునది యిచట స్మరింపనగు.

> అకారో విష్ణు రిత్యుక్తో, మకారో జీవవాచకః
> తయోస్తు నిత్యసంబంధ ఉకారేణ ప్రకీర్తితః ॥ అని ప్రమాణము.

మకారము జీవవాచకము, 'మకారో జీవవాచక' యనియు 'మకారోదాస వాచక' యనియు నుండుటచే జీవుఁడుదాసుఁడు. లక్ష్మీవిశిష్టుఁడైన భగవంతుని దాస్యమే జీవకృత్యము. వీఁడుచేయు కార్యము లన్నియుఁ భగవంతుని కొఱకే యని యర్థము. ఈ దాస్యమును దెలుపుటకే మహిత కోదండ సంధరణ హస్తుఁడని లక్ష్మణుఁడు చెప్పఁబడియె. జీవుఁడు చేయుకృత్యములు భగవంతుని కొఱకే యను నర్థము ప్రణవ మందే కలదు. ఎట్లన:—

మీఁద నుదహరించిన "అవ" ధాతువునకు క్విప్ప్రత్యయముచేయఁగా 'లోపో వ్యోర్వలి' యని వకారము లోపింపఁగా అవయందు అకారము మాత్రము మిగిలెను. ఈ యకారమునకు తాదర్థ్య (దానికొఱకు) చతుర్థియం దేకవచనరూపము ఆయయగు చున్నది. 'సుపాంసులుక్' అని సుబ్లోపముచేయఁగా అ యని చతుర్థ్యంతమున పాలయిత (పాలించువానికొఱకు) లుప్తచతుర్థీరూపమగుచున్నది. కావున అకార మున కిచట అకార వాచ్యునికొఱకు అని యర్థము చేయవలయును. ప్రథమగా నేల చెప్పరాదందు రేని ఓం నారాయణాయ యన్నప్పుడు విశేషణ విశేష్యములు సమాన విభక్తి యందుండవలయునుగదా. నారాయణుకొఱకు అని యర్థము చెప్పినపుడు ఆ యర్థమును దెలుపు అకారమున కా యర్థమునే చెప్పవలయును. "బ్రహ్మణే త్వామహస ఓమిత్యాత్మానం యుంజీత" యను ప్రణవవివరణరూపమగు శ్రుతివాక్యము నందు బ్రహ్మణేయని చతుర్థి చెప్పఁబడి యుండుటచే నిందును జతుర్థియే గ్రహింపవల యును. కాఁగా మకారవాచ్యుఁడగు జీవుఁడు అకారవాచ్యుఁడగు భగవంతునికొఱ కని కాగాఁ 'తదేవాగ్ని స్తద్వాయు స్తత్సూర్య స్తదుచంద్రమాః' అనుచో 'ఉ'కా రము అవధారణార్థకమునఁ బ్రయోగింపఁబడినట్లు అ ఉ అన్నప్పుడు అ కొఱకే యితరులకుఁగాదు, అను నర్థము స్ఫురించుచున్నది. లక్ష్మణుఁడు శ్రీరామునకు దాసుఁడు గాని యితరులకుఁ గాఁడుగదా. శ్రీరాముఁడు ముందుపోవుటచేతను ఆయన ననుస రించి సీతయు ఆమె వెనుక లక్ష్మణుఁడు పోవుటచే నీయిరువురకు రక్షకుఁడు రాముఁ

డైనట్లు, మా, ప్రకృతి, లక్ష్మి సమానార్థకము లగుటచే ప్రకృతి జీవునకును ధారణ పోషణకర్త భగవంతుఁడే యని యేర్పడుచున్నది. అందు లక్ష్మణుఁ డిరువురకు వెనుకఁబోవుటచే నాయనకు సీతారాములిరువురు సేవ్యులే యని తెలియనగును.

సర్వేషా మేవ లోకానా మీశ్వరీ మమవల్లభా
అస్యా మమ చ శేషంహి, విభూతి రుభయాత్మికా.

అనునది యిట ననుసంధించునది.

సా పరమప్రేమరూపాయను సూత్రప్రకారము ఇచటఁ బ్రేమయనునది భక్తియే. భక్తిచే దాసుఁడైకదా లక్ష్మణుఁడు సర్వము నేన తీర్చెదనని కైంకర్యపరుఁ డగుట.

ఇదంతయు సత్యమేకాని దీనివలన మనము దెలిసికొనవలసిన దేమి? సీతా రామ లక్ష్మణులు తొలుత నరణ్యమునఁ బ్రవేశించినపుడు లక్ష్మణుఁడు ద్రోవచూపుచు ముందుగ బోవుచుండెను. ఇది కింకరవృత్తికిఁ దగిన వ్యాపారమే? దండకయందుఁ బ్రవేశించి ఋషులతో సహవాస మేర్పడిన పిమ్మట రామచంద్రమూర్తి ముందు పోఁజొచ్చెను. ఈ మార్పున కేమి కారణము?

శ్రీ రామావతార మనుష్ఠానావతార మనియు శ్రీకృష్ణావతార మాచార్యావతారమనియు ముందే చెప్పఁబడెను. తన నడవడిచేతనే లోకులు సందేహదూరులై ధర్మము గ్రహింపఁజేసినవాఁడు శ్రీరామచంద్రమూర్తి. గంగఁ దాటి చిత్రకూటము చేరువఱకు నిషాదజనము లుండిరిగాని ఋషులు లేరు. దండకారణ్యము ఋషిమయము, ఋషులు తనవెంట వచ్చుచుండువారు. వీరు భగవద్ధర్మకర్మనిష్ఠులేయైనను నందఱు నొక్క తరగతివారు కారు. కావునఁ దత్త్వవిచారమందు సందేహములు గలవారైరి. ఏమి సందేహమనిన :—

శ్రుతి యొకచోట 'ఏక మే వా ద్వితీయం బ్రహ్మ' బ్రహ్మ మొక్కటియే రెండవది లేదు. అని చెప్పెను. మఱియొకచోట 'సర్వం ఖల్విదం బ్రహ్మ' ఈ ప్రపంచమంతయు బ్రహ్మమేయగును. మఱియు పృథివియం దెవఁడున్నాఁడో తనయందుండు నెవనిని పృథివి తెలిసికొనలేదో యెవనికిఁ బృథివి శరీరమో, ఎవఁడు పృథివిని నియమించుచున్నాఁడో యనియు నీ ప్రకారమే ఆత్మయం దెవఁడున్నాఁడో యాత్మ తనయందుండు వానిని నెవనిని దెలిసికొనలేదో యెవని కాత్మ శరీరమో యెవఁ డాత్మను నియమించుచున్నాఁడో వాఁడు బ్రహ్మమని అంతర్యామి బ్రాహ్మణము చెప్పెను. సర్వప్రపంచము బ్రహ్మమైనచో నచేతనములగు స్థూలశరీరములుకూడ బ్రహ్మమా? బ్రహ్మము చేతనుఁడుకదా? చేతనబ్రహ్మ మచేతనప్రపంచ మెట్లులయ్యెనని వారి సందేహము. ఈ సందేహము ప్రణవార్థమును స్వానుష్ఠానముచేఁ జూపినఁగాని చక్కఁబడదని మీఁద జెప్పినట్లు వర్తించెను. దానినే వాల్మీకి సూచించెను. ఇప్పుడు పరత్వము బయలుపఱుపవలసిన కాలము కాదు.

శ్రీరాముఁడు లట్లుపోవుటచే ఋషులసందేహము లెట్లు తీఱె ననిన:-- సంతతము ఋషులు బ్రహ్మవిచారమందుండువారు గనుక వీరి మగ్గురిస్థితి వారికిఁ బ్రణవము జ్ఞప్తికిఁ దేకమానదు. ప్రణవమున మూఁడక్షరములుండియు నేకాక్షరమని చెప్పఁబడునట్లే ప్రకృతిపురుష విశిష్టుఁడయినను బ్రహ్మమున కవి శరీర మని చెప్పుటచే శరీరము శరీరియొక్కటిగా లెక్కింపఁబడునట్లు బ్రహ్మ మొక్కఁడేయని వారు గ్రహించిరి. శ్రీరాముఁ డరణ్యవాసము చేసెననిన సీతాలక్ష్మణులతోడఁ జేసెద ననియేకదా యర్థము. ఆవుపోవుచున్న దనినఁ గొమ్ములు తోఁకపోవుచున్న వని చెప్పవలయునా? దేవదత్తుఁడు వచ్చెననిన దేహమువిడిచి వచ్చెనని యర్థమా?

వానిని గుఱించి ప్రత్యేకముగాఁ జెప్పవలసినప్పుడు వేఱువేఱుగాఁ జెప్పఁబడును. అట్టిపని లేనిచో విశిష్టవస్తువే చెప్పఁబడును. అట్లే ప్రపంచ మంతయు భగవంతుఁడన్నప్పుడు స్థూలముగ మనకు గోచరించు ప్రకృతిని దానికి జీవభూతుఁడైయుండు పురుషుని వీనిని శరీరముగాఁగల బ్రహ్మమును మూఁటిని నొక్కటిగ గ్రహింపవలెను. స్థూలశరీరము కానవచ్చుచున్నది. సూక్ష్మము (అంతర్యామి) మనకుఁ గానవచ్చుట లేదు. వ్యష్టిగా భేదదృష్టిచేఁజూచిన తత్త్వములు మూఁడుగాఁ జెప్పవలసియుండును. సమష్టిమీఁద నొక్కటనియే చెప్పవలయును. ఈ మూఁడేదశయందును వేఱు వేఱుగావు. ఏది యేకాలమునం దేయవస్థయందును వేఱుపడక నిత్యముగ సత్యముగ నంటియుండునో యది యాపదార్థముగానే చెప్పుట లోకవ్యవహారానుసారమై యున్నది. ఎండను జెప్పునపుడు సూర్యుఁడు లేనిదిగాను సూర్యుని జెప్పునపు డెండ లేనివానిఁగా గ్రహింపఁజాలము. మొదటి అకారస్వరమే స్థానభేదముచేఁ బ్రయత్న భేదముచే ఉకార మకారము లని మనకు స్పష్టముగాఁ దెలియునట్లే యిదియును గ్రహింపనగు.

మూఁడు వేఱువేఱనినను అనవచ్చును. ఒకటియే యనినను అనవచ్చును, జీవుఁడు కడతేఱుమార్గము లక్ష్మణచర్య కైంకర్యమువలన నేర్చుకొనవలెను. ఇప్పుడు జీవుఁడగు లక్ష్మణునకు పరమాత్మయగు రామచంద్రమూర్తికి నడుమ సీత (ప్రకృతి) యున్నది. ఆమె తెఱయడ్డముదీసినఁగాని రాముఁడు లక్ష్మణునకుఁ గానరాఁడు. వారిరువురకు సేవచేసిననే యా యడ్డము తొలఁగిపోవును. ఇది వారియనుగ్రహమువలనఁ గావలసినదేకాని మన ప్రయత్నముచే సాధ్య మగునదికాదు, అని యీ విధముగ ఋషీశ్వరులు గ్రహించి తమ సందేహములు తీర్చుకొనిరి. ఈ విషయమే యర్జునరథ (దేహ) మందున్న శ్రీకృష్ణమూర్తి (పరమాత్మ) యర్జునునకు (జీవునకు) స్పష్టముగ నుపదేశించెను. ఈ ప్రణవార్థము పరమార్థతత్త్వమున విపులముగఁ జూచునది.

మానిని. సారము లౌనవసారసకైరవ ♦ సౌరభవాసితభాసితకా
సారములుం దటినీతటసైకత ♦ సంచరదంచిత చక్రయుగీ

వారములుఁ గిరిసుందరకందర ♦ పాతసుపూతఝరీలహరీ
పూరములుఁ సుమమంజులకుంజక ♦ పుంజిత గుంజదలీంద్రములుఁ. ౧౪౩

నవ=క్రొ త్తగాబూచిన, సారస= తామరపూవులయొక్కయు, కైరవ = తెల్ల కలువపూవులయొక్కయు, సౌరభ = వాసనచేత, వాసిత = వాసనగలదిగాఁ జేయఁబడిన, భాసిత=ప్రకాశింపఁజేయఁబడిన, కాసారములుఁ = కొలఁకులును, తటినీ=ఏళ్ళ యొక్క, తట = గట్లయందలి, సైకత = ఇసుకదిబ్బలందు, సంచరత్ = తిరుగుచున్న వియు, అంచిత=ఒప్పిన, చక్రయుగీ=చక్రవాకలజంటలయొక్క, వారములుఁ=సమూహములును, గిరి=పర్వతముయొక్క, సుందర=అందమైన, కందర=గుహాలయందు, పాత=పడుచున్న, సుపూత=మిగులఁ బవిత్రములైన, ఝరీ=సెలయేళ్ళయొక్క, లహరీ = పెద్ద యలలుగల, పూరములుఁ =ప్రవాహములును, సుమ = పుష్పములచేత, మంజుల=మనోహరములగు, కుంజక=పొదలయందు, స్వార్థకప్రత్యయము, పుంజిత = గుంపుగాఁజేరిన, గుంజత్ = అవ్యక్తముగా శబ్దించుచున్న, అళీంద్రములుఁ = గొప్ప తుమ్మెదలయును.

మానినీవృత్తము - సప్తభగణములు - గురువు - ౧౩ వ యతి.

తాత్పర్యము

సారవంతములై క్రొత్తగా వికసించిన కమలములయు కలువలయు పరిమళ ముల గుమాయింపుచేఁ బ్రకాశించు కొలఁకులును, నదీతీరమునందలి యిసుకదిబ్బల యందుఁ దిరుగు నందములైన చక్రవాకదంపతుల సమూహములును, కొండలయందలి సుందరములైన గుహలలోఁ బడుచున్న నీళ్ళుగల పవిత్రములైన కొండవంకల ప్రవాహ ములును పూవులచే నందమయిన పొదలయందు గుంపులై ఝంకారముచేయు తుమ్మె దలును,

క౦. భీకరసూకరపృథుద, ర్వీకర కాసరకరాగ్ర♦విస్తృతహిమవ
చ్ఛీకరకరికేసరినిక, రాకరగహ్వరవితాన♦మాదటఁ గనుచుఁ. ౧౪౪

భీకర = భయముకలిగించు, సూకర=అడవిపందులయొక్కయు, పృథు=గొప్ప వగు, దర్వీకర=పాములయొక్కయు, కాసర=అడవిదున్నలయొక్కయు, కర=కొండ ములయొక్క, అగ్ర=కొననుండి, విస్తృత=విరివిగాఁ జేయఁబడిన, హిమవత్=చల్లని, శీకర=నీటితుంపురులుగల, కరి = ఏనుఁగుయొక్కయు, కేసరి=సింహములయు, నికర= సమూహమునకు, ఆకర=స్థానమైన, గహ్వర=గుహలయొక్క, వితానము = సమూ హము, ఆదటఁ = ప్రేమతో, కనుచుఁ = చూచుచు.

తాత్పర్యము

భయంకరములైన యడవిపందులయు, పెనుబాములయు, అడవిదున్నపోతు లయు, కొండములకొనల పూత్కారములచే విస్తారముగాఁజేయఁబడిన చల్లని

తుంపురులు గల యేనుఁగులయు, సింహములయు, సమూహములకు స్థానములైన గుహల సమూహములను బ్రీతితోఁ జూచుచు.

తే. అట్లు చని చని దవ్వుగ ♦ నంబరంబు
లంబమానదివాకర ♦ బింబ మగుచు
డంబుమీఱఁగ నొక యోజ ♦ నంబు చదర
మింబు గూర్చెడి యొక తటా ♦ కంబు శుభము. ౧౭౫

దవ్వుగన్ = దూరముగ, అంబరంబు = ఆకాశము, లంబమాన = వ్రేలాడుచున్న, దివాకరబింబము=సూర్యబింబముగలది, డంబు=కాంతి, చదరము=సమముగా నుండునది, ఇంబు = ఇంపు.

తా త్ప ర్య ము

ఇవియన్నియుఁజూచుచు దూరము పోయిపోయి సాయంకాలమగుటచే వ్రేలాడుచున్నట్లు కానవచ్చు సూర్యబింబముచేఁ బ్రకాశించుచు నొక యోజనము సమముగానుండు నొక యందమగు తటాకంబును.

కం. అలినీమలినీకృతమున్, నలినీదళనీరజాత ♦ నవ్యము ద్విజరా
డ్లలనాకలనాదితమున్, బలదానవదిభవితాన ♦ బాధితతటమున్. ౧౭౬

అలినీ=ఆఁడుతుమ్మెదలచే, మలినీకృతమున్ = నల్లగాఁ జేయబడినదియు, నలినీదళ=తామరాకులచేతను, నీరజాత=తామరపూవులచేతను, నవ్యము = మనోహరమైనదియు, ద్విజరాట్=మగహంసపక్షులచేతను, లలనా = ఆఁడుహంసలచేతను, కల = అవ్యక్త మధురముగా, నాదితము=ధ్వనికలదిగాఁ జేయబడినదియు, బలదానవత్ = బలము-మదపునీళ్ళుగల, ఇభ=ఏనుఁగుల, వితాన = సమూహముచే, బాధిత = బాధకలదిగాఁజేయఁబడిన, తటమున్ = ఒడ్డు.

తా త్ప ర్య ము

ఆఁడుతుమ్మెదలు గుంపులు గుంపులుగా ముసురుటచే నల్లగాఁ జేయఁబడినదియు, తామరాకులచేతను, తామరపూవులచేతను మనోహరమైనదియు, హంసల దంపతుల యవ్యక్తమధురధ్వనులు గలదియు, బలసి మదించిన యేనుఁగులు క్రీడుటచే బాధింపఁబడిన మీఁదఁ జెప్పఁబడిన తటాకముయొక్క యొడ్డును.

ఈవనతటాకవర్ణనము నారాయణశబ్దార్థమును సూచించుచున్నది. నారము = జలము, దానికి అయనము=స్థానము అయినవాఁడు నారాయణుఁడు,తటాకము నారాయణమేకదా. నరము = జీవకోటి, దానిసమూహము నారము, దానికయనమైనవాఁడు నారాయణుఁడు జీవకోటి ౧౭౭ వ ప. మున చెప్పఁబడెను.

కం. కని మనుజహీన మయ్యును, ఘనతతసంగీత జాత♦ఘనపూతరవం
బును నందు హృదయసమ్మద,జనకంబుగ నాలకించి♦సౌమిత్రియుఁ దాన్. ౧౭౭

కని=చూచి, మనుజహీనము = మనుష్యశూన్యమైనది, ఘన=తాళములచేతను, ఇది మర్దలములోనగు వాద్యములకు నుపలక్షణము. సంగీత = గానముచేతను, జాత =

పుట్టిన, ఘనపూతి = మిగులఁబవిత్రమయిన, రవంబును, అందు = ఆ తటాకమందు, హృదయసమ్మదజనకంబుగ = హృదయమునకు సంతోషము కలుగునట్లు, ఆలకించి = విని.

తాత్పర్యము

తటాకమును దానితీరమును జూచి మనుష్యులు లేకయును కంచుతాళములయు వీణాదులయు మనోహరధ్వని విని రామచంద్రుఁడును లక్ష్మణుఁడును.

—: మాండకర్ణి వృత్తాంతము ధర్మభృతుఁడు శ్రీరామునకుఁ దెల్పుట :—

సీ. తమతోడఁ జనుదెంచు ♦ ధర్మభృతుం డను, మునివరుఁ గనుఁగొని ♦ యనఘశీల
యిది యేమి వింత మా ♦ కెదఁ గౌతుకంబయ్యె, దీనిచరిత్రంబుఁ ♦ దెలియ వినఁగ
వక్తవ్యమేని గో ♦ ప్యంబును గాదేని, జెప్పవే యేమి యీ ♦ చిత్ర మనిన
జానకీనాయకు ♦ సల్లాప మాలించి, సరసివృత్తాంతంబు ♦ సర్వమిట్లు

ఆ. తపసి చెప్పఁదొడఁగె ♦ ధర్మాత్మ వినవయ్య, మాండకర్ణి యనెడి ♦ దండితపసి
గడునుఁదపము బలిమి గల్పించె దీనిని, సార్వకాలికంబు ♦ చారుతరము. ౧౧౩

అనఘశీల = పాపరహితమగు సదాచారముగలవాఁడా, కౌతుకము = కోరిక, వక్తవ్యము = చెప్పఁదగినది, గోప్యము = రహస్యము, చిత్రము = ఆశ్చర్యము, సరసి = సరస్సు యొక్క, సార్వకాలికంబు = సర్వకాలముండునది, ఎండిపోనిదని భావము.

తాత్పర్యము

తమతో వచ్చుచున్న ధర్మభృతుఁడను మునిని జూచి సదాచారసంపత్తిగలవాఁడా! యిది యేమి యాశ్చర్యము. మనుష్యులు లేకయు తాళములు మొదలగు వానిధ్వని వినవచ్చుచున్నది. దీని వృత్తాంతము విన నాశయగుచున్నది. నీవు చెప్పఁదగినదియై రహస్యముగాకుండుటచే మేము వినఁదగునది యగునేని యీ చిత్రమేమో చెప్పుము. అనిన రామచంద్రుని మాటలు విని యా తటాకంబు చరిత్రసంతయు నాయన యిట్లు చెప్పఁ బ్రారంభించెను. ధర్మాత్ముఁడా! వినుము. ఇచట మాండకర్ణి యను గొప్పతపస్వి తన తపోబలముచే దీనిని గల్పించెను. ఇది వానలు లేకున్నను నెండిపోవునదికాదు. చూచుటకును మనోహరముగా నుండును.

కం. పంచాప్సర మనఁబడు నిది, యంచితమగు దీని జలము ♦ నం దాతఁ డహో
పంచేంద్రియనిస్పృహుఁ డౌన,రించెం బదివేలయేండ్లు ♦ దృఢమతిఁ దపముల్. ౧౧౪

పంచేంద్రియనిస్పృహుఁడు = పంచేంద్రియములకోరికలు లేనివాఁడు, ఆహారాదులు లేనివాఁడు.

తాత్పర్యము

ఈ తటాకము పేరు పంచాప్సరము. ఈ నీళ్ళలోనుండి యతఁ డాహారాదులైన నాశింపక పదివేలయేండ్లు గాఢమైన తపస్సు గావించెను.

ఉ. నీర సమీరభక్షుఁ డయి ♦ నిష్ఠురమైనతపంబు సేయు నా
ధీరు సమీరమిత్రముఖ ♦ దేవత లెల్లరు గాంచి భీతులై

తా రొకచోటఁ జేరొక్కని ప ♦ దం బెది కోరెడినో యితం డదే
తీరున విఘ్నముం గొలుపఁ ♦ దెర్వగు నంచుఁ దలంచి వంచనన్. ౧౫౦

నీరసమీరభక్షుఁడు = జలము గాలి యాహారముగాఁగలవాఁడు, నిష్ఠురము= కఠినము, ధీరున్ = దృఢమైన మనస్సుగలవానిని, సమీరమిత్రు = వాయుసఖుఁ డగ్ని, ముఖ = మొదలుగాఁగల, భీతులై = భయపడినవారై, వంచనన్ = మోసపు బుద్ధిచేత స్వర్గఫలముఁగోరి కర్మములు, యోగములు, యాగములు, త్యాగములు, ధర్మములు చేయువారు వారివారి పుణ్యాతిశయమున దేవత లగుదురు. ఈ పరీక్షలందుఁ గడ తేఱినవారి కీయుద్యోగ మనునట్లు ఈ మాత్రము తపస్సు చేసినవాని కింద్రత్వము, ఇంత మాత్రము చేసినవానికిఁ జంద్రత్వము అను నేర్పాటు గలదు. ఆమాత్రము చేసిన వా రా యా పదవులం దుండుచుందురు. (నహుషుఁ డింద్రుఁడైనట్లు) ఆ కారణముచే మఱి యెవ్వరైన భూలోకమున గొప్ప తపస్సు చేసి స్వర్గమునకు వచ్చినఁ దమ పదవులకు హానికలుగు ననియుఁ దమ దేవభోగములకంటె వారు హెచ్చుభోగము లనుభవింతు రనియుఁ దలఁచి దేవత లసూయాపరులై వారితపస్సులు చెఱుప యత్నింతురు. ఒక దేశమునం దా దేశీయున కన్న నన్యదేశీయుఁడు గొప్పపదవికి వచ్చునన్నచో నచ్చటి వారి కసూయయుండునుగదా. అట్లనే దేవతలును. దేవతలు భక్తులను మాత్రము బాధింపరు ఏల? వారు తమపదవు లాశించువారుగారు. ఆ త్రోవకూడ ద్రొక్కరు. కావున దేవతలుకూడ సహాయముచేయుచు గౌరవింతురు.

తాత్పర్యము

ఆ మాండకర్ణి జలము కొన్నాళ్ళు, ఆవల గాలి కొన్నాళ్లు, ఆహారముగాఁగొని కఠినతపస్సు గావించెను. దృఢచిత్తముతో నాయన చేయు తపస్సుచూచి తమ పదవులం దేదికోరునో తమలో నెవ్వనికి స్థానభ్రంశము గలుగునోయని భయపడి యగ్ని మొదలగు దేవతలు గుంపుగా నొకచోటఁ జేరి యే విధముగ వీనితపస్సు చెఱుపవచ్చునని యాలోచించి వంచనచేసి మాయచే గామునిని జయింపనివాఁడగుటచే నామూలముగ నతని తపస్సు చెఱుప నాలోచించిరి.

క. మెఱుఁగులతుఱఁగలి గిఱికొను, తెఱగన్నుల తెఱవపిండుఁ ♦ దెంపునఁ బంపన్
మిఱుమిట్లు గొలుపు తేజునఁ, బఱిగొని రాతపసిదిటముఁ ♦ బడఁతుక లేవుర్ ౧౫౧

మెఱుఁగుల = మెఱుపులయొక్క. తుఱఁగలి = కాంతి, గిఱికొను = వ్యాపింపఁజేయు, తెఱఁగన్నుల = దేవతల, తెఱపికన్ను = తెఱగన్ను, కన్నులు తెఱచుకొనియే యుందురుగాని ఱెప్పలు మూఁతలుపడనివారు, అనిమేషులు, తెఱవపిండున్ = స్త్రీల సమూహమును (తెఱ + వాయి = తెఱవ), తెంపునన్ = శీఘ్రముగ, మిఱుమిట్లు = దృష్టి చెదరఁజేయు, తేజునన్ = కాంతిచే, ఏవురు పడఁతుకలు = ఐదుగురు స్త్రీలు, దిటము = ధైర్యము, పఱిగొనిరి = కొల్లపెట్టిరి - అపహరించిరి.

తాత్పర్యము

దేవత లాలోచించి యాయనయందుఁ గామముండుట తెలిసి యామూలమున నాయనను జెఱుపఁదలఁచి యెదుగురు అప్సరసలఁ బంపిరి. వారు మెఱుపుఁదీఁగల వంటి దేహములతోఁ దమ దేహకాంతు లాయనదృష్టులను మిఱుమిట్లు గొలుపుచుండ వచ్చి యాయన ధైర్యమును జెఱిచి వశపఱుచుకొనిరి.

క. దృష్టపరావరుఁ డగు నా, శిష్టవరుఁడు సురలు కార్య ♦ సిద్ధిం గన నా
కృష్టగుణుఁ డైన మరుశర, వృష్టికి నచ్చరలదృష్టి ♦ కెంతయు వణఁకెన్. ౧౫౨

దృష్టపరావరుఁడు = దృష్ట + పర + అవరుఁడు = సాక్షాత్కరింపఁబడిన పరమాత్మయు, అవరుఁడు=జీవాత్మయుఁ గలవాఁడు, శిష్టవరుఁడు=శిష్టులలో శ్రేష్ఠుఁడు-అగు నాఋషి, ఆకృష్టగుణుఁడు = లాగఁబడిన యల్లెత్రాడుగలవాఁడు, అగు మరు = మన్మథుని, శరవృష్టికిన్ = బాణవర్షమునకు, ఎంతయున్ = మిక్కిలి.

తాత్పర్యము

శిష్టులలో శ్రేష్ఠుఁడగు నా ఋషి, ఆత్మసాక్షాత్కారము భగవత్సాక్షాత్కారము కలవాఁడయ్యుఁ గామమును జయింపని కారణమున దేవతల కార్యము ఫలించునట్లు మన్మథుని బాణములవర్షమునకు నప్సరసల దృష్టిపాతములకు గడగడ వడఁకెను.

క. చేరిన వారల దారల, గారామునఁ జేసి లోనఁ ♦ గల్పించి గృహం
బా రామలతో నీ కా, సారమున రమించు యోగ ♦ సారము పేర్మిన్. ౧౫౩

రామలతో = స్త్రీలతో, కాసారమునన్ = సరస్సునందు, యోగసారము = యోగబలము, పేర్మిన్ = అతిశయముచే.

తాత్పర్యము

తన్ను సమీపించిన యా స్త్రీలను దన భార్యలుగాఁ జేసికొని యీ నీటిలో నొక గృహము నిర్మించి యా స్త్రీలతోఁ దన యోగబలముచేఁ గ్రీడించుచున్నాఁడు.

ఎంతయోగము సాధించినవారైనను భగవచ్ఛూన్యులైనచోఁ గామరోషములకు వశపడి చెడుదురని దీనివలనఁ దెలియనగు.

చం. యమనియమాది యోగముల నాత్మనియంత్రితమయ్యుఁ గామరోషములఁ
బ్రచోదితంబ యగు శాంతి వహింపదు విష్ణుభక్తిచేఁ గ్రమమున శాంతిఁగైకొనిన
కైవడి॥ భాగ.

భగవంతునకు ఫలసమర్పణముచేసి 'నమః' అననివాఁ డిట్లు భ్రష్టుఁడగును. న + మః నాకుఁగాదు. భగవంతునకే యని ఫలము సమర్పింపవలెను. అట్లుచేయనివాఁడు ఫలానుభవముపాలై యిట్లు చెడును. ఆ యోగబలము కొన్నిదినాలకు సమసిపోఁగా నావల దేనికిఁ గొఱగాఁడుకదా.

క. పావనయౌవనమున సం, భావన దేవనవిశేష ♦ పరుఁడై ముని దా
నావనజాక్షులతోడ మ, హావనమున నుండు నాద ♦ మదియ మహాత్మా. ౧౫౪

పావనయౌవనమునన్ = నిర్మలమైన యౌవనముచే ననఁగా గోదావరియన్నని యర్థము. దానియొక్క సంభావనన్ = కూడికచే, దేవన = క్రీడలయందు, విశేష పరుఁడై = విశేషప్రీతి గలవాఁడై క్రీడాయామునిదేవన మ్మని నానా॥ ర॥ వనజాక్షుల తోడన్ = కమలములవంటి కన్నులుగల స్త్రీలతో, మహానందమునన్ = మిగుల నానందముతో, నాదము = ధ్వని.

తాత్పర్యము

మహాత్మా! రామచంద్రా! యిది నడిమివయసు గలవాఁడై క్రీడాసక్తుఁడైన మునీశ్వరుఁ డా స్త్రీలతో సంతోషముతో నుండు చప్పుడు.

కం. పాటలగంధుల యింపగు, నాటలరవళియును భూష ♦ ణాళీరవముల్
　పాటల నినదము లీ గతి, వాటంబుగ వినఁబడున్ ది ♦ వాకరతేజా.　　౧౧౫

పాటలగంధుల = స్త్రీలయొక్క, రవళి = ధ్వని, భూషణాళీరవముల్ = సొమ్ముల సమూహముల ధ్వనులు, నినదము = ధ్వని, దివాకరతేజా = సూర్యుని కాంతి గలవాఁడా.

తాత్పర్యము

సూర్యతేజా! యీ స్త్రీల యాటలయు పాటలయు భూషణములయు ధ్వని యిట్లు చక్కఁగ వినఁబడుచుండును. కిష్కింధాకాండము ౩౬౧-పద్యమందు రామలక్ష్మణులు సప్తజనాఖ్యులు ఋషు లుండిపోయిన స్థలమునకును నమస్కరించిరి గాని యిచట మాండకర్ణికి నమస్కరించిన వారు గారు. దీనిచేఁ గామవశులైన యోగులు సన్న్యాసులు నమస్కారార్హులు గారని తెలియవలయును.

చ. అనవుడు నీరజేక్షణుఁడు ♦ నబ్బుర మందుచుఁ దోడఁ దమ్ముఁడున్
　జనకజ రాఁగఁ జీరకుశ ♦ సంవృతమున్ బహువిప్రపూర్ణమున్
　గనుఁగొని యాశ్రమంబు ఋషి ♦ కాండసమర్చితుఁడై యచ్చట మఱిన్
　జనిన తలంబె చొచ్చుచు ది ♦ నంబులు పుచ్చె శరాసపాణియై.　　౧౧౬

అనవుఁడు = అని చెప్పఁగా, అబ్బురము = ఆశ్చర్యము, చీరకుశసంవృతమున్ = చీరలచేతను దర్భలచేతను కూడినది. బహువిప్రపూర్ణమున్ = అనేకబ్రాహ్మణులతో నిండినది. ఋషికాండ = ఋషుల సమూహముచే, సమర్చితుఁడై = చక్కఁగఁ బూజింపఁబడినవాఁడై, శరాసపాణియై = విల్లు కేల ధరించినవాఁడై.

తాత్పర్యము

ఆ ముని యీ ప్రకారము చెప్పఁగా, శ్రీరామచంద్రమూర్తి విని యాశ్చర్య పడి తమ్ముఁడు భార్య కూడ రాఁగా, జెట్లయం దార వేయఁబడిన నారచీరలతోను దర్భలతోను గూడినదై బ్రాహ్మణసమూహముచే నిండినదైన యాశ్రమముఁ జూచి వారందఱు తన్నుఁ జక్కఁగఁ బూజింపఁగా నా ప్రకారమే మఱికొన్ని యాశ్రమములకుఁ బోయిన చోటికే పోవుచు వారికి రాక్షసబాధ లేకుండుటకై విల్లు ధరించి యాశ్రమంబులందు సంచరించెను.

ఈ కాలమందు రామలక్ష్మణు లాశ్రమములఁ గావలి కాచి తిరిగిరి. ఈ ప్రకారము చేయుచో నుత్తరమునుండి దక్షిణమునకుఁ బోయి మరలి యుత్తరమునకును అట్టులే తూర్పునుండి పడమర, పడమరనుండి తూర్పు రాకపోకలు చేయుచుండిన కారణమునఁ బోయిన యాశ్రమమునకే మరలఁ బోవలసిన కేర్పడెను. అదియును గాక రాక్షసబాధ యెక్కువగా నున్నచోటఁ బెక్కునాళ్లును, వారి బాధ విశేషము లేనిచోటఁ గొలఁది దినము లుండిరి. ఈ సమయమునందే మారీచుండు తన స్నేహితులతోడఁ బోయి చావు తప్పించుకొని పరువెత్తినది. చూ. పద్యము ౬౧౩

సీ. ఒకచోట బదుమూఁడు ♦ నొక్కచోఁ బదిరెండు
నొక్కెడ నాలు గిం ♦ కొక్కకడను
నైదును నాఱును ♦ నాఱు నొక్కటి యొక
పాతి కెక్కువగ ము ♦ ప్పాతికగను
మూఁడు నెన్మిది మాస ♦ ములు రాముఁ డతిసుఖ
మొందఁగాఁ గడపె నా ♦ యాయిచోట
నా ప్రకారంబు ఋ ♦ ష్యాశ్రమంబులయందు
జరిపెను బదియేండ్లు ♦ చాపగురుఁడు
తే. మరల నల్లసుతీక్ష్ణా శ్ర ♦ మంబునకును
వచ్చి యచ్చోట నా ♦ మునివరుఁడు వేడఁ
గొంతకాలంబు వసియించె ♦ నంత నొక్క
నాఁడు రఘువీరుఁ డా ముని ♦ నాథుతోడ. ౧౫౭

ఒక పాతి కెక్కువగ=౧ | ఒకటియు మీఁదఁ బాతిక నెలయని యర్థము. అనఁగా నైదు వారములు. ఒకచోట ముప్పాతిక = మూఁడు వారములు. ఇందుఁ జెప్పఁబడిన మాసములు ౧౩-౧౨-౮-౫-౬-౭-౧-౪-౩-౮ కలిపిన ౬౦ యగుచున్నవి అనఁగా ౫ సంవత్సరము లగుచున్నవి. కొందఱు చిత్రకూటమున ౫ సంవత్సరము లున్నట్లు వ్రాసియున్నారు. అది సరియని తోఁపదు. ఈ యాశ్రమవాస కాలమే ౧౦ సంవత్సరము లని తోఁచుచున్నది. ఏలన "ఋష్యాశ్రమములందు జరపెను బదియేండ్లు" అనునది ౧౦ ఆశ్రమములందు అయిదు సంవత్సరములు జరపెననియు నంతకు మించి దండకయం దాశ్రమములు లేవనియుఁ జెప్పుటయు సరిగాఁ దోఁపదు. విషయము ప్రత్యేకముగఁ జర్చింపఁబడును.

తాత్పర్యము

ఒకచోటఁ బదుమూఁడు ఒకచోటఁ బండ్రెండు, ఒకచోట నాలుగు మఱియొకచోట నైదు, మఱియొకచోట నాఱు మఱియొకచోట నేడు, ఒకచోట నొకటింబాతిక, ఒకచోట ముప్పాతిక, ఒకచోట మూఁడు, ఒకచోట నెనిమిది నెలలు ఈ ప్రకారము రామచంద్రమూర్తి పది సంవత్సరము లాశ్రమములందుఁ గడపెను. ఇట్లు

జరపి మరల సుతీక్ష్ణాశ్రమమునకు వచ్చి యచ్చట సుతీక్ష్ణుకోరిక మేరకుఁ గొంతకాల ముండెను. ఇట్లుండు సమయమున శ్రీరామచంద్రమూర్తి మునీశ్వరునితో నిట్లనియె.

—♦ శ్రీరాముఁ డగస్త్యాశ్రమంబునకుఁ బోవ సుతీక్ష్ణునిచే ననుజ్ఞగొనుట. ♦—

ఉ. ఈ వనమం దగస్త్యుఁడు మునీశ్వరుఁ డుండెడినంచు నిత్యముల్
నే వినుచున్నవాఁడను మునిప్రవరా స్థలమే నెఱుంగ స
ద్భావుని యమ్మునీశ్వరుపదంబులఁ గొల్వఁగ గోర్కి పుట్టె సీ
తావరజాన్వితంబుగఁ, దదాశ్రమమార్గ మెఱుంగఁ బల్కవే. ౧౫౮

సద్భావుని = మంచి మనస్సుగల, అమ్మునీశ్వరు = ఆ యగస్త్యునియొక్క, సీతావరజాన్వితంబుగన్ = సీతతోను, దమ్మునితోను, తదాశ్రమమార్గము = ఆ యగస్త్యుని యాశ్రమమునకుఁ బోవు త్రోవ.

తాత్పర్యము

మునీంద్రా! యీ వనమందే యగస్త్యమునీశ్వరుఁ డున్నవాఁడని ప్రతిదిన మందఱు చెప్పఁగా వినుచున్నాను గాని యాయన యుండు ప్రదేశము నే నెఱుంగను. నేను నాభార్యతోను లక్ష్మణునితోను ఆయనను దర్శింపఁ గోరిక గలదు. అచ్చటికిఁ బోవు మార్గ మేదియో తెలుపఁగోరెదను.

కం. నావుడు సుతీక్ష్ణుఁ డిట్లను, నీ విషయము నేన చెప్పనెంచెదులోనన్
నీవే ప్రస్తావించితి, భూవర! సంతోషమయ్యెఁ బొమ్మచ్చటికిన్. ౧౫౯

నావుఁడు = అని చెప్పఁగా.

తాత్పర్యము

అని శ్రీరామచంద్రమూర్తి యడుగఁగా సుతీక్ష్ణుఁడు నేనే నీకీవిషయము చెప్ప దలఁచియుంటిని. నీవే యడిగితివి. రాజా! సంతోషమయ్యెను. నీ వచ్చటికిఁ బొమ్ము.

చం. ఇట నొకనాల్గుయోజనము లేగితి వేనియు దక్షిణంబుగా
నట నొక రావితోఁపు గలదందు మిళిందకబృందసుందర
స్ఫుటదరవిందతుందిలవిశుద్ధజలాశయముల్ ఫలావళీ
విటపమనోహరోరుపృథివీరుహముల్ జలపక్షిసంఘముల్. ౧౬౦

మిళిందక=తుమ్మెదల, బృంద=సమూహముచే, సుందర=అందమై, స్ఫుటత్ = వికసించిన, అరవింద = కమలములచే, తుందిల = నిండిన, విశుద్ధ = నిర్మలమైన, జలాశయముల్ = మడుఁగులు, ఫలావళీ = పండ్లగుంపులచేతను, విటప = చిగుళ్ళు మొదలగువానిచే నిండిన కొమ్మలచే, మనోహర=ఇంపైన, ఉరు = పెద్ద, పృథివీరుహముల్ = చెట్లు, జలపక్షిసంఘముల్ = నీటిపక్షుల గుంపులు.

తాత్పర్యము

ఇచటికి దక్షిణముగా నాలుగు యోజనములు పొమ్ము. అచట నొక రావి తోఁపు గలదు. అందుఁ దుమ్మెదల గుంపులచే నందమై వికసించుచున్న కమలములచే

నిండిన నిర్మలోదకములు గల మడుగులు పండ్లచేతను చిగుళ్లచేతను నిండిన కొమ్మలచే పెద్దచెట్లు, నీటిపక్షుల గుంపులు కలవు.

చం. కల వదియే రఘూత్తమ యగ♦స్తిసహోదరునాశ్రమం బటన్
నిలువుము రేయి, వేగినను ♦ నీ వట పైఁ జను దక్షిణంబుగా
నల వనపాళిపార్శ్వమున ♦ నామడ యొక్కఁడు పోవ నం దగ
స్త్యులపరమాశ్రమస్థలిని ♦ జూచెదు కన్నులపండువై తగన్. ౧౬౧

అగస్తి=అగస్త్యుని, అగస్త్యునకు అగస్తియనియుఁ బేరుగలదు. 'దీని నగస్తినా బరఁగు' అని భారతప్రయోగము గలదు. వేగినను = ఉదయముకాఁగా, వనపాళి పార్శ్వమునన్ = తోఁపులగుంపుల ప్రక్కఁగా, అనఁగాఁ జెట్లులేనిచోట, అగస్త్యుల= పూజ్యతయందు బహువచనము.

తాత్పర్యము

అదియే యగస్త్యుని సోదరుఁడగు సుదర్శనమునియుండు నాశ్రమము, రాత్రి కందు నిలువుము. ఉదయముకాఁగా బయలుదేఱి దక్షిణముగాఁ దోఁపులప్రక్క చెట్లు లేనిచోట నొక యామడ పొమ్ము. అందు అగస్త్యుని గొప్ప యాశ్రమమును కన్నులపండువుగాఁ జూడఁగలవు.

కం. బహుపాదపసంవృతమై, మహితంబై వనతలంబు ♦ మానగుచుండున్
మహికన్యామణిలక్ష్మణ, సహితముగ రమింప నీకుఁ♦జను సౌఖ్యముగన్. ౧౬౨

బహుపాదపసంవృతమై = అనేకవృక్షములతోఁ గూడినదై, మహితంబై = గొప్పదై.

తాత్పర్యము

అనేకవృక్షములతోఁ గూడినదై గొప్పదియగు వనప్రదేశ మందమై కానవచ్చును. సీతాలక్ష్మణులతో నీవందు సుఖముగఁ గ్రీడింపవచ్చును.

కం. యతిహిత! నీ వతనిం గన, మతిఁగల్గినయేని యిపుడ ♦ మంచిది చనఁగా
జతనం బొనరింపు మనన్, క్షితిపతితనయుండు మౌని♦సెలవుం గొనుచున్. ౧౬౩

యతిహిత= మౌనులకు మేలుచేయువాఁడా! జతనము =యత్నము, సెలవు=ఆజ్ఞ.

తాత్పర్యము

మౌనిప్రియా! నీ వగస్త్యునిజూడ మనస్సు గలదేని యిది మంచి సమయము. ప్రయాణయత్నము చేయుము అని చెప్పఁగా నాయన యాజ్ఞ తీసికొని రామచంద్రమూర్తి.

తరలము. ముని వచించిన త్రోవచొప్పున ♦ ముప్పురున్ వనిఁ బోవుచున్
గనిరి త్రోవల క్రేవలన్ ఘన ♦ కంధరాకృతబంధురం
బును ధరప్రచయంబునున్ సుమ ♦ పూర్ణ రమ్యవనంబులన్
గొనబుమీఱిన వంకలం దమి ♦ గూర్చు మేలికొలంకులన్. ౧౬౪

వనిన్ = అడవియందు, క్రేవలన్ = ప్రక్కల, ఘన = గొప్పదియగు, కంధరా కృతిన్ = మేఘమువలె, బంధురము = విస్తారమైనది, ధర ప్రచయంబులన్ = కొండల గుంపును, సుమపూర్ణరమ్యవనంబులన్ = పూలచేనిండి మనోహరమైన వనములను, గొనబుమీఱిన = అందముచే నతిశయించిన.

తరలము - న భ ర స జ జ గ - గణములు పండ్రెండింట యతి.

తాత్పర్యము

సుతీక్ష్ణమహాముని చెప్పిన త్రోవపట్టుకొని యడవియందు మువ్వాగు బయలు దేఱిపోవుచు మార్గముల ప్రక్కల కారుమబ్బువలె విస్తారమైనది యగు కొండల గుంపును పూలచేనిండిన మనోహరమయిన వనములను అందమైన వంకలను సంతోషము గలిగించు సరస్సులను జూచిరి.

చం. అవి గని రాఘవుండు హృద ♦ యంబు ముదంబునఁ బల్లవింపఁగా
నవరజుతోడ ని ట్లనియె ♦ నన్న యగస్త్యునితమ్ము నాశ్రమం
బవు నిది నిక్కమా మనకు ♦ నమ్ముని చెప్పిన చిహ్నలన్నియున్
సవుఁగ నున్న వీ వనిని ♦ జారుతరంబు ముదాకరంబునై. ౧౬౫

పల్లవింపఁగాన్ = చిగిరింపఁగా, వికాసమునొందఁగా, అవరజుతోడన్ = తమ్మునితో, చిహ్నలు = గుఱుతులు, చిహ్నలు చిహ్నములని రెండు రూపములు గలవు. ఇది చరిత్రాదులందుఁ బఠితము.

ముత్ + ఆకరము = సంతోషమునకు స్థానము.

తాత్పర్యము

ఇవన్నియుఁ జూచి రామచంద్రుఁడు మనస్సు సంతోషముచే వికాసము నొందఁగా లక్ష్మణునితో నిట్లనియె లక్ష్మణా! మనకు సుతీక్ష్ణుఁడు చెప్పినగుర్తు లిందుఁ గానవచ్చుచున్నవి. అగస్త్యసోదరు నాశ్రమము నిజముగా నిదియే, మనోహరమై సంతోషకరమై యున్నది. దీనిని జూడుము.

సీ. ఫలపుష్పకుట్మల ♦ భారావనతములై, తరులు గంటివె నేలఁ దాఁకు చుంటఁ
బరిపక్వపిప్పలి ♦ ఫలముల నొగరైన, గంధంబుఁ గొనివచ్చి ♦ గంధవహుఁడు
యచ్చట నచ్చట ♦ ప్రచ్చినకట్టెల, ప్రోవులుపడియున్న ♦ పోలుపుఁ గంటె
వైదూర్యకాంతులు ♦ వఱలికోయఁగఁబడ్డ, దర్భల నదె చూడు ♦ ధరణిమీఁద
తే. నీలమేఘాగ్ర నిభమయి ♦ నెఱివహించు, పావకామలధూమాగ్ర ♦ పటలిఁ గంటె
యదె వివక్తంపు రేవుల ♦ యందు ద్విజులు, స్వార్జితామలపుష్పోప ♦ హార మిడిరి.

ఫలపుష్పకుట్మలభారావనతములై = పండ్లయొక్కయు, పూలయొక్కయు మొగ్గల యొక్కయు, భార = బరువుచే, అవనతములై = వంగినవై, తరులు = చెట్లు, పరిపక్వ = మిగులఁబండిన, పిప్పలిఫల = రావిపండ్లయొక్క, గంధవహుఁడు = గాలి, ప్రచ్చిన = చీల్చిన, ప్రోవులు = రాసులు, వైదూర్యకాంతులు = వైదూర్యమణులయొక్క కాంతులు,

నీలమేఘ=నల్లనిమబ్బుయొక్క, అగ్రనిభమయి=కొనతోసమానమై, పావక = అగ్నిహోత్రుని, అమల = నిర్మలమైన, ధూమాగ్ర=పొగకొనలయొక్క, పటల = సమూహము, దూరమునుండి చూచుటచే చెట్లకొమ్మలు బూడిదకొనలు తెలియుచున్నవని భావము. వివిక్తంపు=జనుల సందడిలేని, ద్విజులు=బ్రాహ్మణులు, స్వార్జిత=తామైసంపాదించిన, ఇతరులిచ్చిన పూలుపయోగించినయెడల సగము ఫలమవి యిచ్చినవారికిఁ బోవును. అమల=పరిశుద్ధములైన, పురుగులులేక వాడినవిగాక చేతితోను వస్త్రముతోను దెచ్చినవిగాక యని భావము. ఇట్టివి దేవపూజకుఁ బనికిరావు. పుష్పోపహారము = పూలకానుక, అనఁగాఁ బూలతో బలి యని యర్థము.

ఈ విషయమున నీశ్లోకము లనుసంధింపఁదగును.

సమిత్పుష్పకుశాదీని, శ్రోత్రియః స్వయ మాహరేత్

శూద్రాహృతైః క్రయక్రీతైః కర్మ కుర్వ న్పతత్యధః॥ సంవర్తుఁడు.

సమిధలు - పుష్పములు - దర్భలు - వీనిని బ్రాహ్మణుఁడు తానే తెచ్చుకోవలెను. శూద్రులు తెచ్చినవానితో, వెలయిచ్చి కొనినవానితోఁ గర్మముచేయువాఁడధోగతుఁడగును.

త్యాజ్యం పర్యుషితం జంతుదూషితం పాదలంఘితమ్

మ్లానం స్పృష్టం తథాఽస్పృశ్యైః నీతంచ ప్రతిలోమజైః॥

దినముమీరినపూలు, పురుగులుగలవి, కాళ్ళతో దాఁటినవి, వాడినవి, అస్పృశ్యులు స్పృశించినవి, ఎక్కువజాతి స్త్రీలయందుఁ దక్కువజాతి పురుషులకుఁ బుట్టినవారు తెచ్చినవి త్యాజ్యము.

తులసీమాహాత్మ్యమందు,

ఉత్తమం స్వార్జితం పుష్పం, మధ్యమం వన్య ముచ్యతే

అధమంతు క్రయక్రీతం, పారక్యం త్వధమాధమమ్॥

హస్తానీతం పటానీతం, స్వయం పతితమేవవా

దేవారామోద్భవం పుష్పం, గృహదేవాయ నార్చయేత్॥

తాను సంపాదించిన పుష్పములు శ్రేష్ఠములు. అడవులందు బుట్టినది మధ్యమము, వెలయిచ్చికొన్నది యధమము, పరులు తెచ్చి యిచ్చినది యధమాధమము, చేతితోఁ దెచ్చినవి, గుడ్డలో వేసికొని తెచ్చినవి, నేలఁ దమంతట రాలినవి, దేవోద్యానములందుఁ బుట్టినవి యగు పుష్పములను గృహదేవార్చనమం దుపయోగింపరాదు.

అశ్వమేధమందు,

అర్కపుష్పాణి చాన్యాని, అర్కపత్రస్థితానిచ

నిర్గంధానిచ పుష్పాణి, సర్వాణ్యేతాని వర్జయేత్॥

జిల్లేడుపూవులు జిల్లేడాకులలోఁ దెచ్చినపూలు, వాసనలేనిపూలు ఇవన్నియు దేవపూజయందుఁద్యాజ్యములు.

సగృహే కరవీరోత్థైః కుసుమై రర్చనం హితమ్

విశేషత స్సకామస్య, సిద్ధిభూతియుతస్యచ॥

ఇంటియందు ముఖ్యముగ సకాముఁడు సిద్ధిసంపదగలవాఁడు గన్నేరుపూలఁ బూజింపరాదు.

స్కాందమున,

స్త్రీభిర్వా యదివా శూద్రై రానీతై స్తులసీదళైః
యేఽర్చంతి నరా విష్ణుం, తేవై నిరయగామినః॥

స్త్రీలచేఁగాని శూద్రులచేఁగాని తేఁబడిన తులసీదళములచే నెవఁడు విష్ణువును బూజించునో వాఁడు నరకము పాలగును.

తాత్పర్యము

లక్ష్మణా! చూడుము. పండ్లు పూలు మొగ్గలు-వీనిబరువుచేఁ జెట్లకొమ్మలు నేల జీరాడుచున్నవి. పండినరావిపండ్ల యొగరువాసనను వాయుదేవుఁడు తెచ్చుచున్నాఁడు. అదిగో! నగ్నిహోత్రమునకై చీల్చివేయఁబడిన కట్టెలరాసులు పడియున్నవి. వైడూర్య కాంతులుగలిగి కోయఁబడిన దర్భలు నేలమీఁదఁబడియున్నవి. నల్లని మేఘము కొనవలె నగ్నిహోత్రుని పొగకొనలు కానవచ్చుచున్నవి. జనులులేని రేవులందుఁ దాము సంపాదించిన పుష్పములను బ్రాహ్మణులు బలిగా నుంచినారు.

తే. మనము వినిన యగస్త్యుని ♦ యనుజనాశ్రమంబ యిదెపో యెవఁడు లో ♦ కంబు మేలు
పడఁగ నసురుల వధియించి ♦ ప్రజలఁజేర్చె, దక్షిణంబున నతనికిఁ ♦ దమ్ముఁడితఁడు.

ఇదెపో = నిశ్చయముగా నిదియే, పో నిశ్చయార్థమును దెలుపును.

తాత్పర్యము

అగస్త్యుని తమ్ముని యాశ్రమ మని దేనిని వింటిమో యది నిశ్చయముగా నిదియే. ఇందున్న సుదర్శనుఁడు లోకము మేలునిమిత్తమై యెవఁడు రాక్షసుల వధించి ప్రజలు దక్షిణమున నుండఁజేసెనో యతని తమ్ముఁడు.

— ♦ శ్రీరాముఁడు లక్ష్మణునకు వాతాపీల్వలులచరిత్రఁ జెప్పుట ♦—

కం. వాతాపీల్వలు లనియెడి, భ్రాతలు బ్రహ్మఘ్ను లిచటఁ ♦ బ్రబలిరి దేవా
రాతులు మున్నొకప్పుడు, జాతిధరామరులరూప ♦ సంపద వెలయన్. ౧౬౮

బ్రహ్మఘ్నులు = బ్రాహ్మణులఁజంపువారు, దేవారాతులు = దేవతలకు విరోధులు, రాక్షసులు, జాతిధరామరుల = పుట్టువుచే బ్రాహ్మణులగువారి, రూపసంపద = ఆకార లక్ష్మి.

తాత్పర్యము

పూర్వ మొకప్పుడు వాతాపి ఇల్వలుఁడను సోదరులు బ్రాహ్మణవేషములు ధరించి బ్రాహ్మణులను జంపుచుండిరి.

ఉ. శ్రాద్ధము నేఁడు రండు ద్విజ ♦ సత్తములార యటంచు నంతయున్
శ్రద్ధ నటించి సంస్కృతము ♦ నం బిలుచున్ గృహమందు సర్వమున్
సిద్ధ మటంచు మేషముగఁ ♦ జేసి నిజానుజుఁ ద్రుంచి యిల్వలుం
డద్ధరణీసుపర్వులకు ♦ నా పలలంబె భుజింపఁ బెట్టుచున్. ౧౬౯

వా రేవిధముగ బ్రాహ్మణులను జంపుచుండిరో యని యిందు వివరింపఁబడును.

శ్రాద్ధము = పితృకార్యము, శ్రద్ధతోఁ జేయఁబడినది శ్రాద్ధము. అనఁగాఁ బైతృకకర్మయును శ్రద్ధ ప్రధానము, అదిలేకుండిన నది నిష్ఫలము, ద్విజసత్తములార= బ్రాహ్మణశ్రేష్ఠులారా! నటించి= శ్రద్ధలేకున్నను నున్నవారివలె వర్తించి, సంస్కృత భాషయందు, దీనివలన బ్రాహ్మణులు సంస్కృతమునందే మాటలాడుచుండిరనియు వీఁడు సంస్కృతము మాటలాడుటచే వీఁడు నిజమైన బ్రాహ్మణుఁడని వారు మోసపోవఁ గారణము కలిగెననియు నెఱుంగునది. ఇది తీర్థీయ వ్యాఖ్యానుసారము. గోవింద రాజీయమున 'వ్యాకరణ సంస్కారవతీం వాచం' అని కలదు. అప్పుడు వ్యాకరణ దోషములేక మాటలాడఁబడిన తెనుఁగు అఱవము కూడ సంస్కృతమే కాఁగలదు. అవి మాటలాడిన మునులు మోసపోదురా !

తాత్పర్యము

ఇల్వలుఁడనువాఁడు బ్రాహ్మణవేషము వేసికొని బ్రాహ్మణులయొద్దకుఁ బోయి యీదినము మాయింట శ్రాద్ధము, మీరు నిమంత్రణమునకు రండని సంస్కృతముతోఁ బిలుచును. సంస్కృతమునఁ బిలిచిన కారణముచే వాఁడు నిజమైన బ్రాహ్మణుఁడని వారు మోసపోయి యంగీకరించుచుండిరి. వాఁడు తనతమ్ముని మేకగాఁ జేసి చంపి వండి యా మాంసము బ్రాహ్మణులకుఁ బెట్టుచుండెను.

పూర్వకాలమున శ్రాద్ధములందు బ్రాహ్మణులు మాంసము భుజించుచుండిరి. దానియందలి చెడుగుణమును ఇటువంటి మోసమును దెలిసికొని దానిని నిషేధించిరి.

ఇట్టులే సారాయమువలని దోషమెఱిఁగి శుక్రాచార్యులు సారాయము త్రాగుట నిషేధించెను.

దేవతార్థమని యెంత సమాధానము చెప్పినను ఆత్మార్థ మనుభావము వీని యందు నిశ్శేషముగ నమయదు. ఆత్మార్థ మనుభావము లవముండినను హింసా దోషము తప్పదు. కావున మాంసభక్షణము మానుటే యెవరికైన శ్రేయస్కరము. తమోగుణభూయిష్ఠులు భుజింపవచ్చును. ఇంకను గొన్ని జన్మములు క్రూర మృగములవలె నుండవచ్చును. క్షుద్రశక్తులకుఁ దప్పఁ దక్కిన దేవతలకు మాంసము నివేదింపరాదు. శక్తులకైనను మాంసము నిషేధించుటే శ్రేయస్కరము.

తే. కుడిచి కూర్చుండి కడుపులు♦దడువుకొనెడి, ధరణిసురులను గాంచి వా♦తాపి రమ్మ
టంచుఁ బిలుచును వాతాపి ♦ యంతలోన, వారిపొట్టలు వ్రచ్చి తా♦వచ్చువెలికి.

కుడిచి = తిని, ధరణిసురులను = బ్రాహ్మణులను.

తాత్పర్యము

వారు నోరారఁ దిని పొట్టలు తడువుకొనుచుఁ గూర్చుండఁగానే యిల్వలుఁడు వాతాపీ! రమ్మని, అని పిలుచును. వాఁడు పిలువఁగానే మాంసరూపమున వారి కడుపులోనున్న వాతాపి వారిపొట్టలు వగులఁజీల్చుకొని వెలికివచ్చును. ఆ బ్రాహ్మణులు చచ్చిపడుదురు. వారిని వారిరువురు పీకితిందురు. శుక్రుని కడుపులోని కచుని వలె వాతాపి సంజీవని విద్యచే మరల బ్రతికెనని యూహింపవలయును.

కం. ఈ విధముగఁ గ్రవ్యాదుల,చే వేలకొలంది విప్ర♦శేఖరు లెల్లన్
జావుం గూరి రగస్త్యుఁడు, దేవత లర్థింప వారిఁ దీర్చెన్ మహిమన్. ౧౭౧

క్రవ్యాదులచే = రాక్షసులచే, (క్రవ్య + అదులు = మాంసముఁ దినువారు), అర్థింపన్ = కోరఁగా, మహిమన్ = తన ప్రభావముచే.

తాత్పర్యము

ఈ ప్రకారము రాక్షసులచే వేలకొలఁది బ్రాహ్మణులు చచ్చిరి. అప్పుడు దేవతలు ప్రార్థింపఁగా నగస్త్యుఁడు వారిని దన తపఃప్రభావముచే సమయఁజేసెను.

మ. కలశీసూనునకున్ నిమంత్రణము ప♦ల్కన్ వార లమ్మౌని య
ట్టుల కానిండని యోగి సర్వమును గు♦క్ష్యన్ మెక్కి హస్తోదకం
బుల సంపన్న మటంచు నీయఁగొనె న♦మోదంబుతో నంత ని
ల్వలుఁ డోతమ్ముఁడ! యన్న భ్రాతపయి నే♦లా భ్రాంతి రక్షోధవా. ౧౭౨

కలశీసూనునకున్ = కలశమునం దుదయించినవానికి నగస్త్యునకు (ఉత్తర కాండము ౧౧౦-౨ వ చూడుఁడు.) హస్తోదకంబులన్ = ఉత్తరాపోశనమునకు నీళ్లు, ఆమోదంబుతోన్=సంతోషముతో, అన్నన్=అని పిలువఁగా, ఆపోశనజల మొకరియ్య వలయును గాని తానై తీసికోరాదు.

తాత్పర్యము

ఒకనాఁడు వీరు అగస్త్యునకు నిమంత్రణము చెప్పఁగా నాయన యంగీకరించి భోజనమునకుఁ బోయి సర్వము భక్షించెను. అంతయు నయిన తరువాత 'అస్తు సంపన్నం - సుసంపన్న' మని చెప్పి శ్రాద్ధము ముగించినతరువాత నిల్వలుండు వాతాపి యని పిలిచెను. అప్పు డగస్త్యుఁడు 'నీతమ్ముఁడిమీఁద రాక్షసాధమా యింకను నేలరా భ్రాంతి. నీ తమ్ముఁడు జీవించియున్నాఁడని తలఁచితివా? నీ భ్రాత ప్రేతమైన సంగతి యెఱుఁగవా?'

కం. నా కడుపునఁబడి వెడలఁగ, మీకా సాధ్యంబు? వాఁడు ♦ మేషాకృతితో
నా కుక్షినిబడి జీర్ణం, బై కాలునిపురముఁ జేరె ♦ నది యెఱుఁగవుగా. ౧౭౩

మేషాకృతితోఁ = మేఁకరూపముతో, కుక్షిని = కడుపునందు, కాలునిపురము = యముని పట్టణము.

తాత్పర్యము

నా కడుపునఁ బడి మరల వెలికివచ్చుటకు మీకు సాధ్యమగునా? నీ తమ్ముఁ డెక్కడనున్నాఁడో చెప్పెద వినుము. మేఁకయై నా కడుపులోఁబడి జీర్ణమై యముని పట్టనమునకుఁ బోయినాఁడు. ఇది నీకుఁ దెలియలేదుగదా.

చం. అని చిఱునవ్వునం బలుక ♦ నాతఁడు భ్రాతృవధం బెఱింగి హు
మ్మని పటురోషవేగమున ♦ నమ్మునిముఖ్యుని హింసచేయఁ బూ
నిన ననలాభదృష్టులను ♦ నీఱుగఁ జేసె ఘటోద్భవుండు చ
య్యన నలమహాసోదరుని ♦ యాశ్రమ మియ్యది చుమ్ము లక్ష్మణా. ౧౭౪

భ్రాతృవధంబు = తమ్ముఁడు చంపఁబడుట, అనలాభదృష్టులను = అగ్నిహోత్రముతో సమానములైన చూపులచే, నీఱుగన్ = బూడిదగ, ఘటోద్భవుండు = అగస్త్యుఁడు, చయ్యనన్ = త్వరితముగా.

తాత్పర్యము

అని మందహాసముతోఁ బలుకఁగా దన తమ్ముఁడు చచ్చెనని తెలిసికొని యిల్వలుఁడు కోపముతో హుమ్మని యగస్త్యుఁ జంపఁ బైపడిరాఁగా నమ్ముని నిప్పులు గ్రక్కుచూపులచే నతని భస్మము చేసెను. అట్టి మహిమగలవాని తమ్ముని యాశ్రమ మిదే లక్ష్మణా!

భారతంబున నీ చరిత్ర మిట్లు వనపర్వంబునఁ జెప్పఁబడినది. అగస్త్యుఁడు ధనార్థియై ముగ్గురు రాజుల యాచించెను. ముగ్గురు ధనములేనివారై ధనవంతుఁడని పేరుపడిన యిల్వలునొద్ద కాయనను బిలుచుకొనిపోయిరి వాఁడు వాతాపిని జంపి కూరఁగా జేసిపెట్టఁగా రాజులు భయపడి తినరైరి. అగస్త్యుఁడు తిని వాతాపిని లోపలనే జీర్ణింపఁజేసికొని హతునిఁజేసెను. ఇల్వలుఁ డదియెఱిఁగి భయపడి వారు వచ్చిన కార్యంబడుగ నగస్త్యుఁడు ధనార్థులమై వచ్చితిమని చెప్పి యా రాజులకుఁ దనకుఁ గావలసినంత ధన మిప్పించుకొనిపోయెనుగాని యిల్వలుఁ డారాటము పట్టఁజాలక వారిని వెంబడించి చంపఁబోఁగా హుంకారముచే నగస్త్యుఁడు వానిని వధించెను.

చం. అను నెడఁ బ్రొద్దుగ్రుంకు నమ ♦ యం బగుటం గృతసాంధ్యుఁడై మునీం
ద్రునిఁ గని మ్రొక్కె యాతఁ డిడు ♦ తోరపుమూలములన్ ఫలంబులం
గొని యట రేయి పుచ్చి రఘు ♦ కుంజరుఁ డర్కుఁడు దోఁప మౌనితో
ననియె మహాత్మ నీకృపను ♦ హాయిగఁ బుచ్చితి మిందు రాతిరిన్. ౧౭౫

ప్రొద్దు = బ్రధ్నశబ్దభవము, నర్యుఁడు, కృతసాంధ్యుఁడై = సంధ్యవార్చినవాఁడై - తోరపుమూలములన్ = విస్తారములైన వేళ్ళను గడ్డలను.

తా త్ప ర్య ము

ఇట్లు చెప్పుచుండు సమయంబున సూర్యుఁ డస్తమించు సమయము కాఁగా సాయంసంధ్యవార్చి యా మునీశ్వరుఁడు దండిగ నిచ్చిన ఫలములను మూలములను దనివిదీర భుజించి యా రాత్రి యచ్చటఁగడపి రామచంద్రమూర్తి సూర్యుఁడు కాన రాఁగా మునీంద్రునిజూచి మహాత్మా! నీ దయవలన రాత్రి యిచ్చట సుఖముగాఁ గడపితిమి.

ప్రొద్దుగ్రుంకుసమయం బగుడుఁ అనుటచే సాయంసధ్య యర్ధాస్తసమయ మున వార్చవలయుగాన నట్టి సమయమయ్యె నని భావము.

క౦. మీయన్నను గనుఁగొనఁగాఁ, బోయెద మాజ్ఞప్తియే త ♦ పోధన యనుడుఁ
జేయుం డటు లని యానతి, యీయఁగ ముని విన్న త్రోవ ♦ నేగుచు వారల్. ౧౭౬

ఆజ్ఞప్తియే = ఆజ్ఞ యిచ్చెదరా.

తా త్ప ర్య ము

మీ యన్నను దర్శించుటకై పోయెదము, ఆనతిచ్చెదరా యనిన నటులే చేయుండు, పోయిరండని సెలవీయఁగా సీతారామలక్ష్మణులు పూర్వము సుతీక్ష్ణుఁడు చెప్పఁగా వినిన త్రోవ బట్టిరి.

సీ. మంజులవంజుల ♦ పుంజముల్ మాధవీ, కుంజముల్ బిల్వని ♦ కుంజములును
సాలంబు లుత్తాల ♦ తాలంబులును సువి, వారముల్ చిరిబిల్వ ♦ వారములును
సుందరతిందుక ♦ బృందముల్, కుందముల్, మధుపా త్తమధుపూర్ణ ♦ మధుకములును
సుమనోహరామల ♦ సుమనోవరాకల, నాగమతతులు పు ♦ న్నాగములును

తే. తిమిశపనసలు బహువిహం ♦ గమసమూహ
కలకలాంచితములు నైన ♦ కొమ్మరుహములు
కరికరాకృష్టములు కపి ♦ కంపితములు
గనులపండువుగాఁగ గ ♦ న్గొనిరి వనిని. ౧౭౭

మంజుల...పుంజముల్ = మనోహరములగు నశోకవృక్షముల తోఁపులును, మాధవీకుంజముల్ = పూలగురివెందతీఁగల పొదలును, నికుంజములు = పొదలును, సాలంబులు = మద్దిచెట్లును, ఉత్తాలతాలంబులు = ఎత్తైన తాటిచెట్లును, నివార ముల్ = ఆపేరి వృక్షవిశేషములును, చిరిబిల్వవారములును = కానుగు తోఁపు లును, సుందర...బృందముల్ = అందములగు తుమ్మికి తోఁపులును, కుందముల్ = మొల్లతీఁగలును, మధుప...మధుకములును = తుమ్మెదలచే, ఆత్త = గ్రహింపఁ బడిన, మధు = తేనెచేత, పూర్ణ = నిండిన, మధుకములును = ఇప్పచెట్లును, సుమనో హర = మిగుల నింపైనవియు, అమల = నిర్మలములు నగు, సుమనః + వర = మంచి వాసనగల, ఆగమ = వృక్షముల, తతులు = సమూహములు, పున్నాగములు = సుర పొన్నలు, తిమిశ...పనసలు = తిమిశవృక్షములు, పనసచెట్లు, తెనుఁగున కుశ, దర్భ

పనస, పీలికి మువర్ణకము(రాదు. కరి...ఆకృష్టములు=ఏనుఁగుల తొండముచే నీడ్వఁ బడినవి. కపికంపితములు = క్రోఁతులచే నూఁగులాడింపఁబడినవి.

తాత్పర్యము

మనోహరములైన యశోకవృక్షముల సమూహములును, బండిగురివెందల పొదలును, మారేడు తోఁపులును మద్దులును నెత్తైన తాటిచెట్లును, నివారములును, కానుగు తోఁపులును, అందములైన తుమ్మికిచెట్ల గుంపులును, మొల్ల తీఁగలును తుమ్మెదలచేఁ బొందఁబడిన తేనెతో నిండిన యిప్పచెట్లును, మిగుల మనోహరము లయిన శ్లేష్మములయి పూలుగల చెట్లును, సురపొన్నలును, తిమిశవృక్షములు, పనస చెట్లు అనేకములగు పక్షుల గుంపుల కోలాహలధ్వనులచే మనోహరములగు వృక్షములును, ఏనుగుల తొండములచే లాగఁబడినవియుఁ గ్రోఁతులచే నూఁగులాడింపఁబడినవియు నగు చెట్లను గన్నులపండువుగా వారా వనమందుఁ జూచిరి.

కం. తనవెనుకను గడుదాపునఁ, జనుదెంచెడి లక్ష్మణునకు ♦ జనవరుఁ డనియెన్
గనితివె స్నిగ్ధదళంబుల, ఘనశాంతమృగద్విజాళిఁ ♦ గావున నిటకున్. ౭౮

స్నిగ్ధదళంబుల = నునుపైన యాకులను, ఘనశాంత మృగద్విజావళిన్ = మిగుల శాంతిగల జింకలను బక్షులను.

తాత్పర్యము

తనకు వెనుకగ మిగుల సమీపమున వచ్చుచున్న లక్ష్మణుఁజూచి శ్రీరామచంద్రమూర్తి యిట్లనియె లక్ష్మణా! చూచితివా! యిచట నాకులు తపసులు నీళ్లు పోసి పెంచుటచే నునుపులైయున్నవి. జింకలు పక్షులు మిగుల శాంతిగుణము గలవై యున్నవి.

వెనుకవచ్చు చిన్నవారు పెద్దలదాఁటిపోరాదు గనుక లక్ష్మణుఁడు వెనుక ప్రక్కగఁ గేవలము సమీపముననే వచ్చుచుండెను. అడవియందలి మృగముల వలెఁ బక్షులవలెఁగాక ముని మాహాత్మ్యముచే నందలి మృగములు పక్షులు కూడ శాంతములై యదరు బెదరు లేక యున్నవి. ఈ కారణముచే వీరు అగస్త్యుని యాశ్రమ ప్రదేశము పొలిమేర జొచ్చిరని భావము.

—♦ శ్రీరాముఁ డగస్త్యాశ్రమంబుఁ జూచుట. ♦—

తే. అనతిదూరంబునందె మ♦హాత్ము నాశ్ర,మంబు గల దందు నిజమహి♦మంబు పేర్మి
నవనియందు నగస్త్యవి♦ఖ్యాతిఁ గాంచి,నట్టి మునీశ్వరుం డుండు♦నార్యవినుత. ౭౯

అనతిదూరంబునందె = సమీపమందే. అగస్త్యవిఖ్యాతి = అగస్త్యుఁడను కీర్తి, అగ + స్త=పర్వతము నణఁచుటచే నగస్త్యుఁడను పేరు పొందెనని యర్థము, అగం=పర్వతం, స్త్యతి = స్తభ్నాతి ఇతి అగస్త్యః అగః = కుంభః తత్రస్త్యానః సంస్థాతః, ఇది అగస్త్యః.

అగస్త్య, అగస్తి, అగస్త్యుని పేర్లు. ఈయన జన్మమును బట్టి యీయనకుఁ గుంభోద్భవుఁడు, కుంభోద్భవుఁడు, ఘటోద్భవుఁడు కలశీసూనుఁడు లోనగు పేర్లు గలవు. చర్యలఁబట్టి పీతాబ్ధి, వింధ్యదమనుఁడు అను పేర్లు గలవు. ఈయన భార్య పేరు లోపాముద్ర. ఆమెకు కౌశీతకి, వరప్రద యనియుఁ బేర్లు గలవు. రామాయణ కాలమున వింధ్యమునకు దక్షిణమునఁ గుంజరపర్వత మీయన వాసస్థానము.

తాత్పర్యము

లక్ష్మణా! యిచ్చటికి సమీపమందే తన మహిమచే నగస్త్యుఁడని ప్రసిద్ధి గాంచిన మునీశ్వరు నాశ్రమ ముండును.

తే. ప్రాజ్యధూమాకులవనంబు ♦ శ్రాంతలోక
సుఖదమును జీరమాలికా ♦ సుందరంబు
శాంత మృగయూధయుతము ని ♦ తాంతరమ్య
విహగనాదిత మయి యది ♦ వెలసెఁ గంటె. ౮౦

ప్రాజ్యధూమాకులవనంబు=ప్రాజ్య=అధికమైన, ప్ర + ఆజ్య = నేతియొక్క. ధూమ=పొగచేత' ఆకుల = నిండిన, వనంబు = అడవికలది, విశేషముగ నాజ్యాహుతులవలన వెలువడిన పొగలచే నిండినవనము, శ్రాంత = గాసిపడిన, లోక = సమూహమునకు, సుఖదము = సుఖము నిచ్చునది. చీరమాలికాసుందరంబు = ఆరవేసిన నారచీరల వరుసలచే నందమైనది. శాంత=అదరు, బెదరు, పైపడి పొడువవచ్చుట, యిటువంటి గుణములులేని మృగసమూహముచేఁ గూడినది, నితాంత = మిక్కిలి, రమ్య = మనోహరమైన, మృగ=పక్షులచే, నాదితము=ధ్వని గలదిగాఁ జేయఁబడినది, వెలసెన్ = ప్రకాశించుచున్నది.

తాత్పర్యము

ఈ వనము విశేషముగ హోమధూమముచే నిండియున్నది. బడలినవారు విశ్రమింపఁదగియున్నది. నారచీరల వరుసలచే నందమైనది. శాంతమైన మృగసమూహములు గలది. మిగుల రమ్యము లగు పక్షులధ్వని గలదియై ప్రకాశించుచున్నది. కావున నిది ఋష్యాశ్రమములలోఁ జేరిన భూమియే.

కం. ఈపుణ్యుం డీ దిక్కును, బ్రాపించిన మొదలు శాంతి ♦ పరులై యసురుల్
లోపలఁ దటతట మన వెఱ, చూపులఁ జూచెదర కాని ♦ చూపరు సూడుల్. ౮౧

సూడుల్ = విరోధము.

తాత్పర్యము

ఈ పుణ్యాత్ముఁ డీ దక్షిణదిక్కును జేరినపిమ్మట రాక్షసులు క్రూరస్వభావము మాని భయమున గుండెలు కొట్టుకొన బెదరుచూపుల దూరమునుండి చూచుచుందురే కాని ఋషుల సమీపించి విరోధించి హింసింపరు.

అనఁగా వారివారి యునికిపట్టులందే వారుండి యచ్చటికి వచ్చినవారిని నశుచులుగా నుండువారిని భక్షింతురు. ఈయన వచ్చినది మొదలు అంతకు ముందుండి నంత రాక్షసోపద్రవము లేదు.

ద్రావిడభాషాక్షరోత్పత్తి కగస్త్యుఁడే కారణమందురు. ఆ భాషయందు నగస్త్యునిపేర గ్రంథములు గలవు. అగస్త్యవైద్యము దక్షిణమునఁ బ్రసిద్ధి. ద్రావిడము శాపదుష్టము.

తే. ఇమ్మునీశ్వరు పేరట ♦ నెసఁగుఁ గాదె, దిక్కు దక్షిణ మితనిని ♦ దేశమునను
దీవ్రకరుని నిరోధింపఁ ♦ దివిరి వింధ్య, శైల మిప్పటికిని నుండు ♦ నేల నంటి. ౧౮౨

తీవ్రకరుని = సూర్యుని.

తాత్పర్యము

దక్షిణదిశ అగస్త్యుదిశ యనియే కదా పేరొందినది. సూర్యుని నడ్డగింపఁ బూనిన వింధ్యపర్వత మీయన యాజ్ఞచే నేలతోఁ బాటైనది.

సూర్యుఁడు మేరుపర్వతమునకుఁ బ్రదక్షిణము చేయనేల? నాకేల చేయరాదు. దానికంటె నేను తక్కువనా యని వింధ్యపర్వతము మేరువుపై నసూయ వహించి సూర్యుఁడు తన్నుఁ జుట్టివచ్చునట్లు చేయవలయును అని సూర్యమండల మెత్తున వింధ్య మూరక పెరిఁగి సూర్యునిమార్గ మరికట్టెను. దానివలన సూర్య చంద్ర నక్షత్రముల ప్రయాణము సాగక రాత్రిపగలు తారుమారయ్యెను. వైదిక కర్మములకు హానికల్గెను. దేశమున క్షోభ జనించెను. అప్పుడు దేవతలు అగస్త్యుని బ్రార్థించిరి. అప్పుడాయన యుత్తరమునుండి దక్షిణమునకు బయలుదేరి వింధ్య పర్వతమార్గమున వచ్చి వింధ్యపర్వతమును పర్వతోత్తమా! నేను ముసలివాఁడను, నా భార్య లోపాముద్ర స్త్రీ. నినుదాఁటి మేము దక్షిణము పోఁజాలము. కావున మాకు శ్రమములేకుండ నణఁగుమా యని ప్రార్థించెను. ఆయన కోరినట్లు చేయకున్న శపించునను భయముతో నాయన నడచిపోవ ననుకూలపడునట్లు వింధ్యము నేలతోపాటయ్యెను. ఆయన దాఁటివచ్చి మరల నేను వచ్చువఱకు నీ విట్లే యుండుమనెను. మరల నగస్త్యుఁ డుత్తరము పోను లేదు, వింధ్యము పెరుఁగను లేదు.

సీ. దీర్ఘాయువైన యా ♦ దీప్తతేజుని యాశ్రమము వినీతజనస ♦ మంచితంబు
ఈ జగదర్చితు ♦ నెలమి సేవించిన, మనకు శుభంబులు ♦ మొనయఁగలవు
వనవాసశేషంబు ♦ దినము లితనిఁ గొల్చి, యుంద యుందము మహా ♦ నందముగను
నిచట గంధర్వాది ♦ నిచయ మీ మితభోజిఁ, బర్యుపాసించును ♦ భక్తితోడ

తే. శఠుఁడు కల్లరి కూళ నృ ♦ శంసకుండు, కామవృత్తుండు నిట బ్రదు ♦ కంగఁ జాలఁ
డమరయక్షపతంగనా ♦ గాదు లిచట, నలరు ధర్మైకనిరతి ని ♦ యతాశనముల. ౧౮౩

దీర్ఘాయువు = చాలఁగాలము జీవించువాఁడు, దీప్తతేజుని = ప్రకాశించు బ్రహ్మవర్చస్సు గలవానిని, వినీతజన = అణఁకువగల జనులచే, సమంచితంబు = ఒప్పు

నది. జగదర్చితుఁ = ప్రపంచముచేఁ బూజింపఁబడువానిని, నిచయము = సమూహము, మితభోజి = మితముగా భుజించువాఁడు. పర్యుపాసించును = మిగుల సేవించును, శఠుఁడు=వంచకుఁడు, కల్లరి=అసత్యమాడువాఁడు, క్రూరి=క్రూరుఁడు, నృశంసకుఁడు = ఘాతకుఁడు, కామవృత్తుండు = స్వేచ్ఛానుసారము నియమములకు లోఁబడక వర్తించువాఁడు. అమర=దేవతలు, యక్ష=యక్షులు, పతంగ=గరుడాది పక్షిజాతులు, నాగాదులు=నాగజాతికిఁ జేరిన పాములు మొదలైనవి, ధర్మైకరతి = ధర్మమునందే ప్రీతిగలవై, నియతాశనములఁ = ఆహారనియమముగలవై, అలరుఁ = సంతోషించును.

తాత్పర్యము

ఈయన చిరకాలముగ జీవించియుండువాఁడు. ఈ తేజోవంతుని యాశ్రమమందందఱు వినయవంతులు భయభక్తులు గలవారు. ఈయనను వీరు వారనక లోకమునందలి యెల్లవారు సేవింతురు కావున మనము సేవించిన మనకును శుభమగును. మనము వనవాసము చేయవలసిన పదునాలుగేండ్లలోఁ గడచిపోయినకాలము పోను మిగిలిన కాల మీయనను గొల్చి యీ యాశ్రమమందే సంతోషముతో నుందము. ఈయన యాహారనియమము గలవాఁడై యల్పాహారముతో నుండువాఁడు కావున నీయనను గంధర్వులును గుంపులైవచ్చి భక్తితో సేవించి పోవుచుందురు. ఉప్పునీళ్ళలోని చేప మంచినీళ్ళలో బ్రతుకలేనట్టు వంచకుఁడు అసత్యవాది క్రూరుఁడు ఘాతకుఁడు స్వేచ్ఛావిహారి యీ యాశ్రమమందు బ్రతుకలేఁడు. దేవయక్షపతంగాదులు కూడ నీ యాశ్రమమందు నాహారనియమముగలవై యా కారణమున నిర్మలమనస్సులు గలవై ధర్మమందే ప్రీతిగలిగి వర్తించును.

కం. ఈ యెడ సిద్ధులు తమతమ, కాయంబులు విడిచి సూర్య ♦ కల్పద్యుతి వై
హాయనసమానములను నవ, కాయంబులఁ దాల్చి దివికి ♦ గమనించి రయా. ౧౩౪

సిద్ధులు=యోగసిద్ధులు, సూర్యకల్పద్యుతి = సూర్యకాంతితో సమానమైన కాంతిగలవారై, వైహాయస యానములను = దేవతావిమానములపై, నవకాయంబులను = క్రొత్త దేహములను, దివికి = స్వర్గమునకు, గమనించిరి = పోయిరి.

తాత్పర్యము

ఇచ్చటఁ దపస్సుచేసిన యనేకులు తమ తపస్సిద్ధిచే దేహములు వదలి సూర్యతేజముగలవారై విమానములమీఁద దేవలోకమునకుఁ బోయిరి.

కం. ఇందలి భూతావళిచే, వందితు లయి దేవతలు ప్రభు ♦ వంబుగ నిడుముఁ
బృందారక యక్షత్వము, లందంబుగ రాజ్యభోగ ♦ మైశ్వర్యంబుల్. ౧౩౫

భూతావళిచే = జీవుల సమూహముచే, వందితులయి = నమస్కరింపఁబడినవారై, వానికి దేవత్వము, యక్షత్వము, రాజ్యభోగము, ఐశ్వర్యము దీర్ఘకాలమనుభవింపనిత్తురు.

తాత్పర్యము

ఇచ్చటి ఋషులుమాత్రమే కాదు. ఇతర భూతములును నిచ్చటికి వచ్చుచుఁ బోవుచున్నవి. దేవతలను దర్శించి వారిని స్తుతించి నమస్కరించుటచే దేవతలు వారికిని, దేవత్వము యక్షత్వము రాజ్యభోగము ఐశ్వర్య మనుగ్రహింతురు.

క. వచ్చితి మాశ్రమమునకుఁ సచ్చరితా నీవు మున్నుచని జానకి నే
వచ్చుటలు విన్నవింపుము, చెచ్చెరఁజను మన్న నట్లు చేయుచు నతఁడుఁ. ౧౮౬

తాత్పర్యము

లక్ష్మణా! యగస్త్యుని యాశ్రమమునకు రానేవచ్చితిమి. నీవు ముందుగఁ బోయి నేను జానకి వచ్చియున్నామని విన్నవింపుము. త్వరగాఁ బొమ్మనిన నాయన యట్టులే చేయుచు,

౧౨-వ సర్గము. శ్రీరాముఁ డగస్త్యునకుఁ దనరాకఁ దెలుప లక్ష్మణుఁబంపుట.

తే. ఆశ్రమపదంబునం జొచ్చి యచట నున్న, కలశసంభవుశిష్యుని గాంచి పలికె
దశరథునిపెద్దకొడుకు సీతాధవుండు, రామచంద్రుండు చనుదెంచె రమణితోడ. ౧౮౭

తాత్పర్యము

ఆశ్రమప్రదేశము బ్రవేశించి యచ్చటనున్న యగస్త్యశిష్యునిఁ జూచి యయ్యా! దశరథమహారాజు పెద్దకొడుకు సీతాదేవి భర్త శ్రీరామచంద్రమూర్తి భార్యతోడ మునిదర్శనార్థమై వచ్చినవాఁడు.

సీతాదేవి నేను వచ్చినారమని చెప్పుమనుటచే నీ వాలోచించు రావణవధకుఁ గావలసిన కారయిత్రి, కర్త యిరువురము వచ్చితిమని చెప్పుమని భావము.

అగస్త్యుఁడు తక్కిన ఋషులు సీతారాములను బంచవటిఁజేర్చిన కారణ మదియె కదా.

క. మునిదర్శనార్థముగ; రామునితమ్ముఁడ లక్ష్మణుండ మునివర నన్నుఁ
వినవే హితుఁడఁ భక్తుఁడ, ననుకూలుఁడ నతని గొల్తు ననవరతంబుఁ. ౧౮౮

తాత్పర్యము

ఆ రాముని తమ్ముఁడను, నా పేరు లక్ష్మణుఁ డందురు. నే నాయనకు హితుఁడను భక్తుఁడను అనుకూలుఁడను, ఎల్లవేళల నాయనను సేవించువాఁడను, మా పేరు నీవు వినలేదా, హితుఁడు=మేలుకోరువాఁడు, ఇట్టివాఁడు పూజ్యులవిషయమునఁ బ్రేమగలవాఁడై యుండవలయును. ఇట్టివాఁడు భక్తుఁడు. వీఁడు అనుకూలకార్యములు చేయ తెలివిగలవాఁడై యుండవలయును. అట్టి యానుకూల్యము నాయందుఁగలదని భావము. ఆనుకూలస్య సంకల్పము ప్రాతికూలస్య వర్జనముఁగదా ప్రపన్నుని లక్షణము.

క. వినయంబున జనకుని యా,జ్ఞను వనములఁ జొచ్చితిమి ప్ర ♦ శస్తచరిత్రుం
 మునివరుఁ గనుఁగొనఁ గోరెద, మనఘాత్మక విన్నవింపు ♦ మా మారాకల్.

వినయంబుగన్ = నీతితోఁ గూడినట్లు.

తా త్ప ర్య ము

జనకాజ్ఞఁ బాలింపవలయు నన్ననీతి ననుసరించి యడవులకు వచ్చినారము. మిగులఁ గొనియాడఁబడిన చరిత్రముగల మీ గురువును అగస్త్యమునీంద్రుని దర్శింపఁ గోరెదము. మేము వచ్చుట యాయనకుఁ దెలిపి పుణ్యము కట్టుకొమ్ము. అనఘాత్మక యనుటచే నిది సమయముగాదు, మరల రా పో యనవల దని భావము.

చం. అనవుడు వల్లె యంచు నతఁ ♦ డగ్నిగృహంబును జొచ్చి యత్తపో
 ధనుఁ గని మ్రొక్కుచున్ దశర ♦ థ పృథ్విభుపుత్త్రులు రామలక్ష్మణుల్
 వనజదళాక్షి సీతయును ♦ వచ్చినవారలు నీదు సేవకై
 మనవియొనర్పమీ యనిరి ♦ మహాసివరా! ముద లేది? నావుడున్. ౧౯౦

వల్లె=ఇది యంగీకారమును సూచించుపదము, సరి-అగ్నిగృహంబును జొచ్చి= ఆ సమయమునకు నగస్త్యుఁడు హోమముచేయుచున్న ప్రదేశమును బ్రవేశించి, ముదల = ఆజ్ఞ.

తా త్ప ర్య ము

అని లక్ష్మణుఁడు చెప్పఁగా నట్లే చేసెద నని హోమగృహమందున్న యగస్త్యునిఁజూచి నమస్కరించి తపోధనా! దశరథరాజకుమారులు రామలక్ష్మణులు సీతయు నీసేవకై వచ్చియున్నారు. వారిట్లు నీతో మనవిచేయుమనిరి. మునీంద్రా యేమి యాజ్ఞ. తోడుకొనివత్తునా ?

—♦ శ్రీసీతారామలక్ష్మణు లగస్త్యాశ్రమంబులోనికిఁ బోవుట. ♦—

ఉ. భాగ్యము! రామచంద్రుఁ డిట ♦ వచ్చెనె యిన్నిదినాల కేని, యా
 యోగ్యచరిత్రు రాకకయి ♦ యుల్లమునం దొగిఁ గాచి యుంటి, న
 మ్మాన్యుతిభక్తి వారలను ♦ నాదట సత్కృతిఁ దన్పు మున్వరన్
 భోగ్యవిధన్ జవంబునను ♦ బొమ్మిట దోడ్కొని రమ్ము శిష్యుఁడా. ౧౯౧

ఆదట=ప్రీతితో, సత్కృతిన్ = సత్కారముచే, తన్పన్ = తృప్తులఁజేయుటకు, జవంబునను = శీఘ్రముగా.

గురువును జూడవచ్చినపుడు నమస్కారము, వెడలిపోవునపుడు నమస్కారము చేసినట్లు చెప్పుటచే నది శిష్యధర్మమని యెఱుఁగునది.

తా త్ప ర్య ము

ఔరా! నాయదృష్టము. ఇన్నాళ్ళకైనను రామచంద్రమూర్తియిచ్చటికివచ్చెను గదా! అంతియే చాలును. సాధుయోగ్యమైన నడవడిగల యాయన యెప్పుడు

వచ్చునా యని యెదురుచూచుచుంటిని. ఆ ముగ్వురను బూర్ణభక్తితో భోగ్యమైన విధముగా గౌరవింపవలయును. పొమ్ము, శిష్యుఁడా యిచటికిఁ దోడ్కొనిరమ్ము.

దీని వాస్తవార్థము: ఔరా నాయదృష్టము. నాకుంద్రైవతమై సర్వలోకశరణ్యుఁడైన శ్రీరామచంద్రమూర్తి సీతాలక్ష్మణులతో గొప్ప వ్యాధిచేఁ బీడింపఁబడువాని యొద్దకు వైద్యుఁడు వచ్చినట్లు దీర్ఘకాలమునకు నన్నుఁ జూడవచ్చెనా? ఏమి నా భాగ్యము. శ్రవణానంద మనుభవించితి నని మహేశ్వరతీర్థీయము.

ఉ. వారిని లోను రం డనక ♦ వల్వని జా గొనరించి తే లనన్
గూరినభక్తి నాతఁడును ♦ గొబ్బున మ్రొక్కి ససంభ్రమంబుగన్
జేరి సుమిత్రపట్టి! రఘు ♦ శేఖరుఁ డిచ్చట నున్నవాఁడో యే
తేరుఁడు మీర లన్న మహి ♦ దేవకుమారునితోడ నాతఁడున్. ౧౯౨

వల్వనిజాగు = అనావశ్యకమైన యాలస్యమును, ససంభ్రమంబుగన్ = తత్తఱపాటుతో, ఏతేరుఁడు = రండు, మహిదేవకుమారునితోడ = బ్రాహ్మణబాలునితో.

తాత్పర్యము

అనావశ్యకమైన యాలస్యమేలచేసితివి. సీతారామలక్ష్మణులను పేర్లు వినఁగానే వెంటనే లోపలికిఁ బిలుచుకొనిరావలెనా? నీవు రానుపోను యింతకాలము వ్యర్థము చేసి వారిని వాకిట నిలువఁబెట్టవలయునా? వారు మనవాకిట నిలువవలసినవారా? యనఁగానే శిష్యుఁడు గురువునకు నమస్కరించి తత్తఱపాటుతోఁ బరువునఁ బోయి లక్ష్మణా! యేఁడీ రామచంద్రమూర్తి? రండు మీరు అని చెప్పఁగా నా బ్రాహ్మణ కుమారునితో లక్ష్మణుఁడు.

చం. వెలుపల వచ్చి యందు రఘు♦వీరుని జానకిఁ జూపెఁ జూపినన్
సలలితరీతి మౌనివచ♦నంబులు శిష్యుఁడు చెప్పి రాము న
స్ఖలితవిధిన్ బహూకృతుని♦గా నొనరించిన వారు ప్రోది జిం
కల నలువంకలం గనుచుఁ ♦ గ్రన్నన లోనికిఁ బోవు చయ్యెడన్. ౧౯౩

అస్ఖలితవిధిన్ = లోపములేని విధముగా, బహూకృతునిఁగన్ = గౌరవింపఁబడినవానినిగా, నలువంకలన్ = నాలుగు ప్రక్కలందు, క్రన్నన = త్వరగా.

తాత్పర్యము

వెలుపల వచ్చి యా విప్రబాలునకు రామచంద్రమూర్తిని సీతను జూపెను. ఆయనయు ముని చెప్పిన మాటలు వారికిఁ జెప్పి వారిని శాస్త్రవిధానము చొప్పున గౌరవించెను. వారును నాలుగుప్రక్కల నుండు సాధుజింకలఁ జూచుచు శీఘ్రముగ లోపలికిఁ బోవుచు నక్కడ.

సీ. పరమేష్ఠిస్థానంబు ♦ పావక శ్రీవిష్ణు, శక్రదివాకర ♦ స్థానములును
బద్మారిస్థానంబు ♦ భగునిస్థానంబును, ధనదు ధాత విధాన ♦ స్థానములును

ననిలునిస్థానము ♦ ననంతుని స్థానంబు, గాయత్రిస్థానంబు ♦ గడచిపోవ
వసువులస్థానంబు ♦ వరుణునిస్థానంబు, స్కందుని ధర్ముని ♦ స్థానములును
తే. ననెడి పూజాప్రదేశముల్ ♦ గనుచుఁ బోవ, శిష్యపరివృతుఁడై ముని ♦ శేఖరుండు
దనకు నెదు రరుదేరఁగ ♦ ననుజుఁ జూచి, కంటె వచ్చెడివాఁడె య ♦ గస్త్యమౌని.

దేవపూజాగృహాగంబు శ్రీరామచంద్రమూర్తి చూచిన అగస్త్యుఁ డర్చించు దేవతలస్థానములు చెప్పుచున్నాఁడు. వీని నన్నిటిని దాఁటి యగస్త్యుని జూడఁ బోయెను. అవి యేవనిన, పరమేష్ఠిస్థానము = బ్రహ్మస్థానము, పావక = అగ్నిహోత్రునియొక్క. శక్ర = ఇంద్రుని, దివాకర = సూర్యుని, పద్మారి = చంద్రుని, ధనద = కుబేరుని, అనిలుని = వాయువుయొక్క, అనంతుని = శేషునియొక్క, స్కందుని = కుమారస్వామియొక్క, శిష్యపరివృతుఁడు = శిష్యులచేఁ జుట్టఁబడినవాఁడు.

తాత్పర్యము

బ్రహ్మస్థానము (ఇచట స్థానమునఁగా బ్రహ్మను ఆవహింపఁజేసి పూజించు ప్రదేశము) అగ్నిస్థానము శ్రీ విష్ణుస్థానము, ఇంద్రునిస్థానము, సూర్యస్థానము' చంద్రస్థానము, భగునిస్థానము, కుబేరస్థానము, ధాతస్థానము, విధాతస్థానము, వాయుస్థానము ఆదిశేషునిస్థానము, గాయత్రీస్థానము దీనిని దాఁటిపోవ వసువులస్థానము, వరుణునిస్థానము, కుమారస్వామిస్థానము, ధర్మునిస్థానము అను పూజాప్రదేశములు చూచుచుఁ బోవుచుండఁగా శిష్యులతోఁగూడి యగస్త్యుఁ డెదురుగరాఁగా నాయనఁ జూచి శ్రీరామచంద్రమూర్తి లక్ష్మణునితో లక్ష్మణా! యీవచ్చుచున్నాఁడే, యీయనయే యగస్త్యుఁడు.

ఈ స్థానములందు శివుని పేరుగాని రుద్రుని పేరుగాని లేదు. దీనివలన శివుఁడు పూజార్హుఁడుగాఁడని గోవిందరాజభాష్యమునం దిట్లు వ్రాయఁబడినది.

బ్రహ్మ-అగ్ని-విష్ణువు-మహేంద్రుఁడు-వివస్వతుఁడు - సోముఁడు - భగుఁడు, కుబేరుఁడు-ధాత-విధాత - వాయువు-అనంతుఁడు - గాయత్రి - వసువు - వరుణుఁడు-కార్తికేయుఁడు, ధర్ముఁడు వీరు పదునేడుగురు దేవతలు 'యోవైసప్తదశ' యను ననువాకమునఁ జెప్పఁబడిన పదునేడక్షరముల దేవతలు, యజ్ఞశీలుఁడైన మునిచేఁ బూజార్థము వీరు ప్రతిష్ఠితులు. అని తెలియఁదగు. ఇందుఁ బూజ్యులగు దేవతలందు రుద్రునిపేరు చెప్పఁబడమిని నాయన యపూజ్యుఁ డని చెప్పఁబడెను. ఇప్పుడు కొందఱాయనను బూజచేయుట తామసశాస్త్రముల ననుసరించి యని గ్రహించునది.

దీనికిఁ బ్రత్యుత్తరముగఁ గాఁబోలు నప్పయదీక్షితులవారు,

ఇచట గంధర్వాదినిచయ మీామితభోజిఁ
బర్యుపాసించును భక్తితోడ
అమరయక్షపతగనాగాదు లిచట
నలరు ధర్మైకరతి నియతాశనముల

వని (౧౯-౩-వ) ముందే చెప్పఁబడియుండుటచే నిచట స్థానములని చెప్పఁబడిన దేవత లగస్త్యుని నుపాసింపవచ్చినవారే. శివుఁడు వీరికంటె గొప్పవాఁడగుటచే రాలేదు. అని సమాధానము వ్రాసిరి. ఆక్షేప మెంత బాగున్నదో సమాధానమంత బాగు గనే యున్నది. ఇందు శివుని పేరు చెప్పనంతమాత్రమున సర్వత్ర సర్వజనులకు శివుఁ డపూజ్యుఁ డనరాదు. ప్రపన్నులు భక్తులేకభక్తులు అనన్యభక్తులుకావున ముముక్షువు లొక్క భగవంతు నారాధించుటే తగును. ఆ కారణముచే నితర దేవతలఁ దూలనాడ రాదు. పాంచరాత్రసంహితలందే సంకర్షణావతారము రుద్రుఁడని యున్నది. శ్రీ భాగవతమందే వైష్ణవులందు శంభునివలె పురాణములందు భాగవతము శ్రేష్ఠమని చెప్పఁబడెను. దేనికిఁ గొఱగాని వైష్ణవనామధారి బాహ్యవేషయుక్తుఁడే పూజ్యుఁ డైనచో వైష్ణవసత్తముఁడని తామే చెప్పు శివుడెట్లు పూజ్యుఁడుగాఁడు? అట్లు చెప్పుట భాగవతాపచారముకాదా. తల చుట్టము తోఁక వగయన్నట్లు స్కందుఁడు పూజ్యుఁడైనచో నాయన తండ్రి యేలగాఁడు? శ్రీవైష్ణవులు స్కందుని కుబేరుని వరు ణుని బూజించుచున్నారా. వీరే యగస్త్యునకుఁ బూజ్యులైనపుడు శివుఁడేల యపూజ్యుఁ డయ్యెను. 'యో రుద్రో అగ్నౌ యో అప్సుయ ఓషధీషు యో రుద్రో విశ్వా భువనావివేశ తస్మైరుద్రాయ నమోఅస్తు' అని వైష్ణవులు చెప్పుచున్నారా లేదా? అస్మత్పితామహం రుద్రరూపమ్మని చెప్పుచున్నారా లేదా? 'త్ర్యంబకం యజామహే' యనుచున్నారాలేదా. కావున శ్రీవైష్ణవులు శివుని భూషింపకుండినఁ బోనిండు, దూషింపరాదు.

సృష్టిస్థిత్యంతకరణాత్, బ్రహ్మవిష్ణు శివాత్మికామ్
స సంజ్ఞాం యాతి భగవాన్, ఏక ఏవ జనార్దనః ॥

భగవంతుఁడగు జనార్దనుఁడొకఁడే సృష్టిస్థితిలయములు చేయ బ్రహ్మ విష్ణు శివనామములం బొందుచున్నాఁడు (వి. పు. ౧-౩-౬౭.)

స ఏవ సృజ్యస్సచ సర్గకర్తా సఏవ పాత్యత్తిచ పాల్యతేచ॥ ఆయనయే సృజింపఁ బడుచున్నాఁడు సృజించుచున్నాఁడు రక్షించుచున్నాఁడు హరించుచున్నాఁడు పాలిం పఁబడుచున్నాఁడు. ఇట్టి ప్రమాణము లనేకములు గలవు. కార్యాంతరముననే వేషాంతరము వేయఁగానే తత్త్వజ్ఞులు గౌరవింపఁదగదా? సర్వం విష్ణుమయం జగత్తని చెప్పెడి వైష్ణవమతమందు గడ్డిపోఁచనైన ద్వేషింప నందుగలదా? శివునందు మోక్ష ప్రదత్వము లేకుండునుగాక, పూజ్యత లేకపోలేదు.

దీక్షితులవారి సమాధానము సరిగాదు. ముప్పది మూఁడుకోట్ల దేవతలు నగస్త్యు నారాధింపవత్తురేని కర్మకాండప్రకార మనువాకమునఁ జెప్పఁబడిన పదు నేడుగురికే స్థానములు కల్పింపనేల? తక్కినవారి గతియేమి? అగస్త్యుఁడు నిత్య మర్చించు దేవతలపేర్లు చెప్పఁబడెనుగాని యాయనను గొల్వవచ్చినవారి పేర్లు చెప్ప బడలేదు. ఈ పద్యమునందలి సోమ శబ్దమునకుఁ జంద్రుఁడని చెప్పక శివుఁడని

చెప్పిన నెవరేమి చేయఁగలరు? ఇందలి యగ్నిశబ్దమునకు 'అగ్నిరత్ర రుద్రః' అని తిలక వ్యాఖ్యయందును 'తత్రాగ్నిశబ్దేన శంభురుచ్యతే' యని శిరోమణి వ్యాఖ్య యందును గలదు. దీనికిఁ గారణ మీ యగ్నిశబ్దము బ్రహ్మవిష్ణు శబ్దములకు నడుమ నుండుటయే యని శిరోమణి. ఇది క్లిష్టకల్పనము.

—♦ సీతారామలక్ష్మణు లగస్త్యు దర్శించుట. ♦—

కం. కాంబోలు నతని తేజము, చేఁ బరికించితి నటంచుఁ ♦ జేరి రవినిభుఁ
గాఁ బదములఁ బ్రాలిన మతిఁ, బూఁబోఁడియు లక్ష్మణుండుఁ ♦ బూర్ణశ్రద్ధన్. ౧౫౫

తాత్పర్యము

ఈయనయే యగస్త్యుఁడు అని తోఁచుచున్నది. ఎట్లు తెలియు నన నాయన బ్రహ్మవర్చస్సునుబట్టి తెలిసికొంటిని, అని శ్రీరామచంద్రమూర్తి యాయనను సమీపించి పాదములపై వ్రాలఁగా నావల సీతాదేవియు లక్ష్మణుఁడును శ్రద్ధాభక్తులతో,

తే. మ్రొక్కి నిలుచున్న నమ్ముని ♦ ముఖ్యుఁ డెలమి
రాము నతిథిగ గ్రహియించి ♦ ప్రేమమునను
నర్ఘ్యపాద్యాదు లొసగుచు ♦ నర్చ సలిపి
సేమ మారసి కూర్చుండఁ ♦ జెప్పి పిదప. ౧౫౬

తాత్పర్యము

అభివందనముచేసి నిలిచియుండఁగా నామునిశ్రేష్ఠుఁడు శ్రీరామచంద్రమూర్తిని నతిథిగ గ్రహించి ప్రేమతో నతిథుల కీయదగిన యర్ఘ్యము పాద్యము మొదలయినవి యిచ్చి పూజించి యోగక్షేమములు విచారించి కూర్చుండు మని చెప్పి యావల.

తే. ప్రథితచరితుండు వైశ్వదే♦వంబు సలిపి, యర్ఘ్యమిడి నిర్వర్తింపఁగావించి♦ యతిథిపూజ
ధర్మవిదుఁడు వానప్రస్థ♦ధర్మసరణి, భోజనం బిడి తనరంగఁ ♦ బూర్ణతుష్టి. ౧౫౭

ప్రథితచరితుఁడు = కీర్తికెక్కిన యాచారము గలవాఁడు, పూర్ణతుష్టి = నిండు తృప్తి.

తాత్పర్యము

ప్రసిద్ధికెక్కిన యాచారము గల యగస్త్యుఁడు వైశ్వదేవము గావించి యర్ఘ్య మిచ్చి యతిథిపూజ సలిపి ధర్మము తెలిసినవాఁడగుటచే వానప్రస్థధర్మము ప్రకారము నిండు తృప్తి కలుగునట్లు భోజనము పెట్టెను.

వానప్రస్థసరణి భోజనంబిడి యనుటచేఁ దన కేది యాహారమో యదియే వారికిఁ బెట్టెనని గ్రహింపనగు.

యదాహారో భవేత్తేన, పూజ ♦ యే త్పితృదేవతాః
తేనైవ పూజయే న్నిత్య, మతిథిం సముపాగతమ్. ||శంఖ||

తన కేది యాహారమో తన పితృదేవతల నా యాహారముచేతనే పూజింపవలెను, దానిచేతనే యతిథులను బూజింపవలెను.

తే. తాను దొలుదొల్తఁ గూర్చుండి ♦ తత్త్వవేది
యంజలి ఘటించి కూర్చున్న ♦ యమలధర్మ
కోవిదుని రాముఁ గనుఁగొని ♦ కూర్మిమీఱ
నిట్టు లనియెను ధర్మంబు ♦ లెఱుకవడఁగ. ౧౯౭

తత్త్వవేది = జీవాత్మ పరమాత్మల విషయమైన యథార్థజ్ఞానము గలవాఁడు. అమలధర్మకోవిదుని = నిర్మలధర్మమందుఁ బండితుని. కః విదుఁడు = కోవిదుఁడు, బ్రహ్మజ్ఞానముకలవాఁ డని యర్థము. నిర్మలధర్మజ్ఞానము బ్రహ్మజ్ఞానమే కదా.

తాత్పర్యము

ఆత్మతత్త్వముఁ దెలిసిన యగస్త్యుఁడు తాను ముందుఁగూర్చుండి యావలఁ దన యనుమతిపై నంజలి జోడించి కూర్చుండిన నిర్మల ధర్మజ్ఞానమునందుఁ బండితుఁడైన శ్రీరామచంద్రునిఁ జూచి కూర్మితో వానప్రస్థ గృహస్థధర్మములు తెలియ నిట్లు పలికెను

శ్రీరామచంద్రమూర్తి యమలధర్మకోవిదుఁ డని చెప్పుచు మరల నాయనకు ధర్మ ముపదేశింపఁ బ్రయత్నించుట వ్యర్థశ్రమము గదా యను సందేహము రావచ్చును. ఈ చెప్పఁబోవు ధర్మము రామునకుఁ జెప్పినను వాస్తవమున సీత నుద్దేశించి చెప్పెడు మాటయే. రాఁబోవు రావణవృత్తాంతము దెలిసి హెచ్చరించుచున్నాఁడు అటుగాకున్నను దెలిసినవారికైనను వారిమేలు కోరువారు హిత ముపదేశింపవలయును.

కం. ఎఱుకగలవారికైనను । గఱపక తక్క రుచితప్రకారము లెల్లన్ ।
గొఱలు హితు లట్లగుట సం । దఱకును జెప్పంగవలయుఁ దగియెడు బుద్ధుల్॥

భార. విరాట ౧-౧౧౫.

కం. హోమంబు సలిపి యతిథికిఁ. శ్రీమహితా యర్ఘ్యమిచ్చి ♦ సేవింపఁగ నా
నా మెయిఁ జలుపని తపసి ని, జామిషమును గూటసాక్షి ♦ యటు లట మెక్కున్.

నిజామిషమును = తన మాంసమును, కూటసాక్షి = మోసపుసాక్ష్యము చెప్పువాఁడు, కూటము = మోసము, అటన్ = పరలోకమందు, ఆ మెయిన్ = ఆ విధముగా;

తాత్పర్యము

హోమము గావించి యతిథికి నావల నర్ఘ్యమునిచ్చి యాయనను సేవింపవలయును. ఆ విధముగఁ జేయని వానప్రస్థుఁడు పరలోకమందు మోసపుసాక్ష్యము చెప్పినవానివలె తన మాంసమును దానే తినుచుండును.

నయజ్ఞై ర్దక్షిణావద్భి, ర్వహ్నిశుశ్రూషయా తథా
గృహీ స్వర్గ మవాప్నోతి, యథాచాతిథిపూజనాత్ ॥
తస్మా త్సర్వప్రయత్నేన గృహస్థోఽతిథిమాగతమ్
ఆహార శయనాద్యేన విధివత్ప్రతిపూజయేత్ ॥

అతిథిపూజచేత గృహస్థుఁడుపోవు స్వర్గలోకమునకు దక్షిణలతోడ యజ్ఞములు చేసినవారు, అగ్నిహోత్రముల సేవించువారు పోఁజాలరు. కావున సర్వవిధముల గృహస్థుఁడు తన యింటికి వచ్చిన యతిథిని నాహారము నిచ్చియు శయనమిచ్చియు యథావిధి పూజింపవలెను.

ఇష్టోవా యదివా ద్వేష్యో, మూర్ఖః పండిత ఏవవా
స ప్రాప్తో వైశ్వదేవాంతే, సోఽతిథిః స్వర్గసంక్రమః ॥
చోరశ్చైవాథ చండాలః, శత్రుర్వా పితృఘాతుకః
దేశకాలేతు సంప్రాప్త, స్సోఽతిథి స్వర్గసంక్రమః ॥ పరాశరః.

తన మిత్రుఁడుగాని శత్రుఁడుగాని మూర్ఖుఁడుగాని పండితుఁడుగాని వైశ్వదేవము కడపటవచ్చెనేని వాఁడే యతిథి. వాఁడు స్వర్గము నొందఁజేయును.

దొంగగాని చండాలుఁడుగాని శత్రువుగాని తండ్రిని జంపినవాఁడుగాని సరియైన వేళయందుఁ బ్రదేశమందు వచ్చెనేని వాఁడు అతిథి. వాఁడు స్వర్గము నొందఁజేయును. 'ద్విషంతం నైవ భోజయేత్' పగవాని కన్నము పెట్టరాదనునది యదేశకాలముల వచ్చినవాని విషయము.

అశ్వమేధమందు,

దూరాధ్వగం శ్రాంత మనువ్రజంతి, దేవాశ్చసర్వే పితరోగ్నయశ్చ
తస్మిన్ద్విజే పూజితే పూజితాస్స్యుః దితేనిరాశా అపి తే ప్రయాంతి ॥

దూరము నడచి బడలినవానివెంట దేవతలెల్లరు పితరులు అగ్నులుకూడఁ బోదురు. కావున నాతని బూజించినవారు దేవతలనెల్లఁ బూజించినవా రగుదురు. వారు నిరాశులైపోయిరా దేవతలును బోదురు.

అతిథి ర్యస్య భగ్నాశో, గృహా త్ప్రతినివర్తతే
స తస్మై దుష్కృతం దత్వా, పుణ్య మాదాయ గచ్ఛతి ॥

అతిథి యెవనియింట నాశచెడినవాఁడై యాదరింపఁబడకపోవునో వాఁడు తన పాప మతని కిచ్చి యతని పుణ్యమును దీసికొనిపోవును.

శూద్రోవా ప్రతిలోమోవా యది శ్రాంతః క్షుధాతురః
భోజయే త్తం ప్రయత్నేన, గృహ మభ్యాగతో యది ॥ హారీతుఁడు.

బడలి యాఁకలిగొని యింటికివచ్చిన యభ్యాగతుఁడు శూద్రుఁడైనను, ఎక్కువ జాతి స్త్రీయందుఁ దక్కువజాతివానికిఁ బుట్టినవాఁడైనను వానికి నన్నముపెట్టవలెను. ఇది పాషండులుగానివారి విషయము. పాషండః పతితోవాపి, క్షుధార్తో గృహమాగతః। నైవదద్యా త్స పక్వాన్నం, మామమేవ ప్రదాపయేత్ ॥ పాషండుఁడు గాని పతితుఁడుగాని ఆఁకలిగొని యింటికివచ్చెనేని వానికిఁ బక్వాన్నముపెట్టరాదు, ధాన్యము పెట్టి పొమ్మనవలెను.

నపృచ్ఛేద్గోత్రచరణౌ, నస్వాధ్యాయో నచశ్రుతమ్
చిత్తే విభావయే త్తత్ర దేవోయం సముపస్థితః॥
అభ్యాగతో జ్ఞాతపూర్వం, అజ్ఞాతోఽతిథి రుచ్యతే॥

అతిథిని నీగోత్రమేమి నీసూత్రమేమి నీవేమి చదివితివి ఏమి వింటి వని యడుగ రాదు. దేవుఁడే యావిధముగ వచ్చినాఁడని యెంచవలెను. ముందు తెలిసినవాఁడు అభ్యాగతుఁడు. పూర్వపరిచయములేనివాఁడు అతిథి.

పాషండినో వికర్మస్థాన్ బైడాలవ్రతికాన్ శఠాన్
హైతుకాం బకవృత్తీంశ్చ, వాఙ్మాత్రేణాపి నార్చయేత్॥

పాషండులను కర్మహీనులను పిల్లివలె వ్రతమును బూనినవారిని కపటులను హైతుకులను బకధ్యానము చేయువారిని మాటలచేనైన నాదరింపరాదు.

నష్టశౌచే వ్రతభ్రష్టే, విప్రే వేదవివర్జితే
దీయమానం రుదత్యన్నం కిం మయా దుష్కృతం కృతమ్॥

శుచియగు నాచారము వదలినవారికి వ్రతభ్రష్టులకు వేదమువదలిన బ్రాహ్మణునకు, నన్నము పెట్టితిమేని యయ్యో! వీని కడుపులోనికిఁ బోవుట కెంతపాపము చేసితినో యని యన్న మేడ్చును.

వేదవిద్యావ్రతస్నాతే, శ్రోత్రియే గృహమాగతే
క్రీడంత్యోషధయ స్సర్వా, యాస్యామి పరమాం గతిమ్॥

వేదవిద్యయందు స్నాతుఁడైన శ్రోత్రియుఁడు ఇంటికి వచ్చెనేని పరమగతి మాకు లభించునని యా యింటిలోని ధాన్యము సంతోషముతో నృత్యము సలుపును. బృహస్పతి.

భోజనార్థంచ స్వే విప్రః కులగోత్రేన నివేదయేత్
భోజనార్థం హి తే శంసన్ వాంతాశీ త్యుచ్యతే బుధైః॥

భోజనార్థము వచ్చిన బ్రాహ్మణుఁడు తన కులగోత్రములు చెప్పరాదు. అట్లు చెప్పెనేని వాఁడు క్రక్కిన కూడు తినినవాఁడగును.

ఇది పూర్వకాలమునఁ జెల్లును. ఈ కాలమున నీచజాతివారునును బ్రాహ్మణుల మనియే వచ్చి మోసగించుచున్నారు. కావునఁ బరీక్షింపక విడువరాదు.

దేవపూజానంతరము గోదోహనమాత్రకాల మతిథి యభ్యాగతికై వాకిటఁ గాచి యుండవలెను. గోదోహన మనఁగా ఆవును పాలుపిండునంతకాలము.

గోదోహనమాత్ర మాకాంక్షేఽతిథిం ప్రతీక్షమాణ ఆసీత॥ శంఖుఁడు॥ నాడికాయా శ్చతుర్భాగం గోదోహం ప్రబువతే బుధాః॥ గడియలో నాలుగవభాగము గోదోహనకాల మని చెప్పఁబడును. అనఁగా ఆఱునిమిషములు అతిథి అభ్యాగతులకై కాచి యుండి ఆలోపల రాకేని భుజింపవచ్చును.

వైశ్వదేవకృతం పాపం, భిక్షురేకో వ్యపోహతి
నభిక్షుణా కృతం పాపం, వైశ్వదేవో వ్యపోహతి॥

అని యుండుటవలన వైశ్వదేవమునకు ముందు భిక్షువు వచ్చెనేని యతనికి ముందు పెట్టవలయును. వైశ్వదేవము చేయకున్నను దోషములేదు. అయినను, ఇది ఏకపాత్రపక్షవిషయము. రెండు మూఁడు పాత్రములలో నన్నము చేయఁబడియుండె నేని వైశ్వదేవము చేయవలయును. ఇది యతివిషయము. కూటసాక్ష్యము చెప్పిన వానికిఁ బ్రాయశ్చిత్తము ముందొకచోఁ జెప్పఁబడెను.

ఉ. రాజవు సర్వలోకనికరంబుల కీవు మహారథుండవున్
భ్రాజితధర్మమూర్తివి విరాజితకీర్తివి మాన్యమూర్తివిన్
బూజకుఁ బూర్ణయోగ్యుఁడవు భూప సచ్చితి కూర్మివింద వై
యోజ దలిర్ప మాకు సుకృతోదయ మింతకు నొంగ గల్గునే.	౨౦౦

అతిథిగా వచ్చిన యధమ మనుష్యు నాదరించినచో నెంతో మహాఫలము చెప్పఁబడుచుండ నిఁక నీవంటి యతిథి నాదరించినఁ గలుగు ఫలమునకు మేరలేదను చున్నాఁడు. సర్వలోకనికరంబులకున్ = సమస్త జనసమూహములకు, 2 అనంతకోటి బ్రహ్మాండములకు, నీవు రాజవు = భర్తవు, పతివి 'పతిం విశ్వస్య' యని శ్రుతి చెప్పు చున్నదికదా ! మహారథుండవు = గొప్ప వీరుఁడవు, 2 మహాత్ముఁడగు గరుత్మంతుని వాహనముగాఁగలవాఁడవు. భ్రాజితధర్మమూర్తివి=(1) ప్రకాశించు ధర్మమే యాకారముగా గలవాఁడవు, 2 లోకశిక్షార్థమై ధర్మముల ననుష్ఠించువాఁడవు, విరాజిత కీర్తివి=1 ప్రకాశించు కీర్తిగలవాఁడవు, 2 పరమాత్ముఁడ వని ప్రసిద్ధికీర్తిగన్నవాఁడవు 'విశ్వచక్షుషివోర్వ్యమ్నివాతే పరమాత్మని' నానా. ర॥ వి. అనఁగా పరమాత్మకుఁ బేరు. 'రామపదేనాసౌ పరంబ్రహ్మాభిధీయతే' యని యగస్త్యవాక్యమే కలదుగదా! మాన్య మూర్తివిన్ = 1 పూజింపఁదగినరూపము గలవాఁడవు, 2 యోగులకు ధ్యానింపఁదగిన యాకారముగలవాఁడవు, పూజకు = సర్వవిధపూజ్యకర్మములకు, పూర్ణయోగ్యుఁ డవు = పూర్ణముగఁ దగినవాఁడవు, కొందఱు దేవతలు కొన్నిటికే యోగ్యులు, నీవన్నిటికి యోగ్యుఁడవు, ఏదేవతలకుఁ జేయుపూజ నీపూజయేకదా ! 'ఇష్టాపూర్తం బహుధా జాతం జాయమానం విశ్వం బిభర్తి భువనస్యనాభి' యను శ్రుతి యిటఁ బ్రమాణము, భూమిప = 1 రాజా, 'హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ'యన్నట్లు శ్రీభూదేవులకుఁ బతియైనవాఁడవు. కూర్మివిందవు = ప్రియాతిథివి, సుకృతోదయము= పుణ్యఫలానుభవారంభము, ఇంతకున్ = ఇంతకంటె.

తాత్పర్యము

సమస్త ప్రపంచమునకు నందలి జనులకు నీవే ప్రభుఁడవు. నీవే మహారథుఁ డవు. నీవే మూర్తీభవించిన ధర్ముఁడవు. విశేషముగఁ బ్రకాశించు కీర్తిగలవాఁడవు, గౌరవింపఁదగు నాకారము గలవాఁడవు. ఎంతటి పూజకును బూర్ణముగఁదగినవాఁ

డవు, భూపతివి. ఇట్టి నీవు ప్రియాతిథివై వచ్చితివి. ఇంతకు మించిన పుణ్యఫలోద యము మఱియొకటి గలదా ?

కం. అని ఫలమూలసుమంబులు, తనివి చనఁగ వారి కిచ్చి ♦ తదనంతర మా
జనకసుతాధవునకు మౌని, ఘనచాపాక్షయశరాదిఁ ♦ గనిపించి యనెన్. ౨౦౧

ఫలమూలసుమంబులు=పండ్లు, వేళ్లు, పూలు, తనివి=తృప్తి, ఘన = గొప్పది యగు, చాప = విల్లు, అక్షయశరాది=తఱుఁగని బాణములు గల యంబులపొదులు, కనిపించి = చూపించి.

౧౯౭ వ పద్యంబున బ్రాహ్మణతుష్టి గలుగ భోజనమిడినట్లు చెప్పఁబడెను. ఇచ్చట ఫలమూలము లిచ్చినట్లు మరలఁ జెప్పఁబడెను. ఇది సీతాదేవికని యెఱుంగునది. భర్తలతోడ భార్యలు భుజింపరాదుగనుక నప్పుడామె భుజింపలేదు. స్త్రీలు పురుషు లేకపంక్తి భుజింపరాదు.

తాత్పర్యము

అని యీప్రకారము చెప్పి వారికిఁ గడుపునిండఁ బండ్లను వేళ్ళను పూలను దిన నిచ్చి యావల శ్రీరామచంద్రమూర్తికి నొక గొప్పవిల్లు అక్షయబాణములు తూణీ రములు చూపించి యిట్లనియె.

—♦ అగస్త్యుఁడు శ్రీరామునకు వైష్ణవాయుధంబులు సమర్పించుట. ♦—

సీ. ఈ దివ్యమహనీయ ♦ హేమమణీభూషి, తాసమవిష్ణుక ♦ రాసనంబు
నిర్మిత మల విశ్వ♦కర్మచే నీ శర, రాజ మమోఘుంబు ♦ రవినికాశ
మబ్జజదత్త మీ♦యక్షయ్యసాయక, ములు శితబాణ సం ♦ పూర్ణ తూణు
లనఘ సువర్ణాంచి ♦ తాసియుఁ గోశంబుఁ, బాకారిదత్తముల్ ♦ భానుతేజ
ఆ. యీశరాసనమున ♦ నింద్రవిరోధులఁ, సంగరమునఁ జంపి ♦ శార్ఙ్గధన్వి
జయముగొనియెఁ జుమ్మి♦శరములు నవ్వియు, నసియుఁ దరకసంబు♦లవియు రామ.

దివ్య=దేవలోకసంబంధమై, మహనీయ = పూజింపఁదగినదియై, హేమమణీ భూషిత = బంగారుచేతను మాణిక్యములచేతను నలంకరింపఁబడినదియు, అసమ = సమానములేని, శరరాజము = శ్రేష్ఠమయినబాణము, అమోఘంబు = వ్యర్థము పోనిది, రవినికాశము=సూర్యునితో సమానమైనది, అబ్జజదత్తము=బ్రహ్మచే నీయఁబడి నది, అక్షయ్యసాయకములు = క్షయముగాని బాణములు, శిత=పదునైన, బాణ = బాణములచే, సంపూర్ణ=నిండిన, తూణులు=పొదులు, సువర్ణాంచితాసియు=బంగారు పిడిచేఁ బ్రకాశించు కత్తియు, కోశంబు = ఒరయును, పాకారిదత్తము = ఇంద్రునిచే నీయఁబడినవి, భానుతేజ=సూర్యునికాంతివంటి కాంతిగలవాఁడా, శార్ఙ్గధన్వి=విష్ణువు, అసి = కత్తి, తరకసంబులు = అంబులపొదులు.

ఇది వైష్ణవధనుస్సు అని చెప్పుటచేఁ బరశురామునివలన శ్రీరామచంద్ర మూర్తి గ్రహించిన ధనువును అప్పుడు వరుణునిచేతి కిచ్చెను. అదియే యిప్పు డిందు

వరుణునిచే నుంచఁబడి ఖరాదివధకై రామచంద్రునకు మాల నీయఁబడెను. బ్రహ్మదేవుఁ డిచ్చినది బాణసమూహము. బాలకాండమున సంక్షేపరామాయణమందు ౧౧౧-వ పద్యము నైంద్రధను వనుట ఛత్రిన్యాయమున నని యెఱుంగవలయును.

తాత్పర్యము

దేవసంబంధమై, పూజ్యమై, బంగారు రత్నములచే నలంకరింపఁబడినదైన యసమానమైన యీ విష్ణుధనుస్సును విశ్వకర్మ నిర్మించెను. ఈ బాణసమూహము వ్యర్థముగఁ బోవునదికాదు. సూర్యుని కాంతివంటి కాంతిగలది. ఇది బ్రహ్మచే నీయఁబడినది. ఈ యక్షయబాణములు పదునైన బాణములతో నిండిన యమ్ములపొదులు, బంగారు పిడిగల కత్తియు దానియొరయు నింద్రుఁ డిచ్చినవి. సూర్యతేజా! యీ వింటిచే విష్ణుదేవుఁడు రాక్షసులను యుద్ధమందుఁ జంపి జయముగొనెను. ఈ బాణములు, కత్తి, పొదులు ఆయన యుద్ధమం దుపయోగించినవే.

ఆ. వఱల జయము నీకు ♦ వజ్రివజ్రంబును, గొనినభంగి వీనిఁ ♦ గొను మటంచుఁ
దద్వరాయుధముల ♦ దశరథసుతరత్న, మున కొసంగి యిట్టు ♦ లనియె మఱియు

వజ్రి = ఇంద్రుఁడు, వరాయుధములు = శ్రేష్ఠములయిన యాయుధములు.

తాత్పర్యము

నీకును జయము గలుగుటకు నింద్రుఁడు వజ్రంబును గ్రహియించినట్లు వీనిని గ్రహింపు మని యాశ్రేష్ఠము లయిన యాయుధములను శ్రీరామచంద్రమూర్తి కిచ్చి మఱియు నిట్లు చెప్పెను.

వజ్రి వజ్రమువలెఁ గొను మనుటచే నీ సొత్తు నీవే గ్రహింపుము. నీసొత్తు నీకిచ్చుటకు నేనెవ్వఁడను, అని భావము.

—♦ ౧౩-వ సర్గము. అగస్త్యుఁడు శ్రీరామునితో సల్లాపంబు లాడుట ♦—

శా. రామా! లక్ష్మణ! ప్రీతి సమ్మదము నా ♦ రంగంటి భూపుత్రితోఁ
బ్రేమ న్నన్గన మీరు వచ్చుటను, దా ♦ రిన్ గాసిపాలైతి రీ
రామారత్నముఁ జూడ వ్యక్తముగ వి ♦ శ్రాంతిన్ మనః గోరెడిన్,
భూమీశాత్మజ కోమలాంగి వ్యసనం ♦ బుం గాన దెప్పట్టుఁన్. ౨౦౪

తాత్పర్యము

శ్రీరామచంద్రా! లక్ష్మణా! మీరు సీతాదేవితోడ నన్నుఁజూడవచ్చుటచే మిక్కిలి సంతోషించితిని. మీరు త్రోవనడచుటచేఁ జాల బడలినారు. ఈ స్త్రీరత్నము సీతాదేవి స్పష్టముగ బడలిక పాపుకొన మనస్సునఁ గోరుచున్నది. ఏలన నీమె రాచకూఁతురు. సుకుమార దేహము గలది. ఎన్నఁడు కష్టపడినదిగాదు.

ఉ. అట్టి కుమారి కష్టనిచ ♦ యంబుల కెల్లను నాటపట్టులై
నట్టి వనంబులన్ ధవుని ♦ యందలి నిట్టలమైనభక్తిచే

నిట్టులు వచ్చి దుష్కరము ♦ నీమె ఘటించెను, గాన నీమె కె
ట్టెట్టు సుఖంబో యట్లు చరి ♦ యింపుము సొంపుగ నిందు రాఘవా. ౨౦౫

కుమారి = చిన్నవయస్సుది, ఇప్పటికి సీతాదేవికి ముప్పది సంవత్సరముల వయస్సు, కష్టోచ్చయంబులకుఁ = కష్టసమూహములకు, ఆటపట్టులు = క్రీడాస్థానములు, నిట్టలము = గాఢము, దుష్కరము = కష్టకార్యము.

తాత్పర్యము

అటువంటి చిన్నవయస్సుది, కష్టసమూహములకెల్లను స్థానమైన యడవులందు భర్తయుండుగల గాఢమైన భక్తిచే నీప్రకారము వచ్చి యసాధ్యకార్యము చేసిన దయ్యెను. కావున నీవు నుపేక్షలేక యామె కేది సుఖమో దానినే శ్రీరామచంద్రా ! చేయుచుండుము. మీ రిక్కడనే హాయిగా నుండవచ్చును.

కం. సృష్టి మొదలొక్కని జగమున, స్పష్టముగ స్త్రీలు మగని ♦ సౌఖ్యదశం దా
రిష్టుం డని రంజింతురు, కష్టంబులు వచ్చెనేని ♦ కడ కీడ్తురు మూ. ౨౦౬

తాత్పర్యము

ప్రపంచము పుట్టినది మొదలు స్త్రీలెక్కువ మేమందురు భర్తయొక్క సుఖదశయందుండెనా యతఁడు ప్రియుడని సంతోషింపఁజేయుదురు తామును సంతోషింతురు - కష్టదశ ప్రాప్తించెనా వానిని దూరముగాఁ ద్రోచి స్వేచ్ఛగాఁ జరింతురు.

కం. మెఱపుల చాంచల్యంబును, గఱకు ... ♦ కత్తులబిఱుసుఁ
నెఱవడి గరుడానిలములు, పఱపును దెఱవలకు నెందుఁ ♦ బ్రకృతిగుణంబుల్. ౨౦౭

నెఱవడిఁ = మిక్కిలి వేగము, తెఱవలకు = స్త్రీలకు.

తాత్పర్యము

మెఱపు లెంత చంచలములో స్త్రీల మనస్సు లంత చంచలములు - కఱకుదనమునఁ బదునైన కత్తుల బిఱుసెట్టిదో వారిహృదయము లట్టివి - ఎన్నిదినాల స్నేహమైనను వారు నిమిషమునఁ దెగఁగోయఁగలరు. ఇక విషయములందు గరుడుని వేగము వాయువేగము గలవై వారిమనస్సులు నిండు వేగమునఁ బరువెత్తును. మెఱపువలె వక్రమైన బుద్ధిస నొకపురుషునియందును డి నంతియొక పురుషుని మీఁదకి మెఱపు మెఱిసినంతలో పూర్వపుగల స్నేహ తెగఁదీయుటయందుఁ బదునైన కత్తితో నటికినట్లే - దయాదాక్షిణ్యాదులేమియు వారికుండదు. ఇవి స్త్రీలకుఁ బుట్టుకతోనే వచ్చిన స్వభావగుణములు.

కం. ఈ నీ యిల్లాలియెడం, గానంగా రాదు దోష ♦ కణమేనియు ని
మ్మానవతి సతీజనస, మ్మానితయ యరుంధతీస ♦ మాన తలంపఁగ. ౨౦౮

ఇది సాధారణ స్త్రీసముదాయముయొక్క లక్షణము - నీ భార్యయం దిట్టి లక్షణములు లేవనుచున్నాఁడు.

దోషకణము=అల్పదోషము-సతీజన=పతివ్రతాజనులచే, సమ్మానితయు=గౌరవింపఁబడినదే - పతివ్రతలగువారుకూడ నీమె గొప్ప పతివ్రత యని యీమెను బూజింతురు.

తాత్పర్యము

ఈ నీ యిల్లాలగు సీతాదేవియందు నిట్టి దోష మొకటియైన నల్పమైన లేదు - ఈమె పతివ్రతలచేఁ బూజింపఁబడినది - ఆ యరుంధతితో యీమెకు సమానురాలు.

ఈ ప్రకారము సీతాదేవి నగస్త్యుఁడు స్తుతించుట యామె మనస్సును బాతివ్రత్యమునందు స్థిరపఱచుటకేకాక పరపురుషసాంగత్యమున నొక్కక రావణునకు లోపడక చెఱసాలయందు నవయు దేవతాదిస్త్రీలనుగూర్చి చెఱను విడిపింప వలయు నను బుద్ధి యామెకుఁబుట్టుటకే - ఆమె చెఱ యనుభవించినది యీ యుద్దేశము తోనేకదా.

కం. ఈ వైదేహియు లక్ష్మణుఁ, డీవును వసియింపఁ గలుగు•నీ దేశము రా
మా! వితతాలంకృతమై, పావన మగుచున్న రామ♦భద్రుఁడ వలికెన్. ౨౦౯

తాత్పర్యము

ఇటువంటి యీ సీతాదేవియు నీ సేవకై స్వార్థము సర్వము త్యాగముచేసిన యీలక్ష్మణుఁడు, ఇటువంటివారి సేవకు యోగ్యుఁడవు నీవును, నీ దేశమం దుందువేని రామచంద్రా! యిది మిక్కిలి యలంకరింపఁబడినదై పవిత్రమగును - అని చెప్పఁగా రామచంద్రమూర్తి యిట్లనెను.

కం. దారానుజయుక్తుఁడనై, ఘోరాటవిఁ దిరుగు నాదు♦గుణములు నీకున్
గూరిచె ముద మటుగాన ను,దారగుణా! నీమక్రుపను♦ధన్యుఁడ నైతిన్. ౨౧౦

దారానుజయుక్తుఁడనై=భార్యతోను దమ్మునితోను గూడినవాఁడనై-ఘోరాటవిన్ = భయంకరమైన యరణ్యమందు.

తాత్పర్యము

భార్యతోను దమ్మునితో భయంకరమైన యడవియందుఁ దిరుగు నాగుణములు నీకు సంతోషము గలిగించెఁ గావున నీ దయచే నేను ధన్యుఁడనైతిని.

ఆ. నీటివలను గలిగి ♦ నిండార నడవులు, గలుగు నాశ్రమంబుఁ ♦ గరుణ మీఱ
నానతీయవయ్య♦యచ్చోటఁ గాలంబు, గడుపు దీఱు నాఁక♦గడపువాఁడ. ౨౧౧

తాత్పర్యము

జలసౌకర్యముగలదై దట్టముగ నడవులుగల ప్రదేశమేదో దానిని దెలుపుము. అచ్చటనుండి వ్రతకాలము దీఱునటులఁ గాలముఁ గడపెదను.

కం. ఇటు రాముఁ డడుగఁగా నొక, త్రుటి యాలోచించి వికత♦దోషుఁడు పలికెన్
స్ఫుటధీరతగో క్షులంలో, బటుతరగుణభద్ర! రామ♦భద్రా! వినుమా. ౨౧౨

త్రుటి=అల్పకాలము, విగతదోషుఁడు=దోషములేనివాఁడు, స్ఫుట=స్పష్టమైన, ధీరతర = మిగుల ధైర్యముగల, ఉక్తులతో = మాటలతో.

తాత్పర్యము

ఈ ప్రకారము శ్రీరామచంద్రమూర్తి యడుగఁగా నల్పకాల మాలోచించి దోషరహితుఁడగు నగస్త్యుఁడు స్పష్టమై ధీరములయిన మాటలతో మిగుల గొప్ప కల్యాణగుణములు గలవాఁడా! శ్రీరామభద్రా! వినుము.

ఒకత్రుటి యాలోచించి = ఋషీశ్వరు లందఱు తోడుదొంగలు - సీతారామలక్ష్మణులను ఎట్టులైనఁ బంచవటిఁ జేర్పవలయునని యందఱు కలసి యాలోచించినవారే. ఆ కారణముచేతనే దానికి సమీపమున నుండు నగస్త్యాశ్రమమునకుఁ గడపటఁ దెచ్చి చేర్చిరి. కాఁబట్టి స్థలవిషయమై యాలోచింపవలసినది లేదు. ఇఁక నాలోచన యేమనఁగా వీ రక్కడఁ జేరిరేని వీరికిఁ గష్టములు తప్పవు. రాక్షసులతోఁ బోరు సిద్ధము; సీతాపహరణము సత్యము; దుస్సహదుఃఖానుభవము సత్యము. దీనికిఁ గారణభూతుఁడను నేనె యాదోష మనుభవింపవలసివచ్చునేమోయని యాలోచన. అదియునుగాక యిక్కడనే యుండుమని వచ్చినవాఁడు వేఱొకచోటికిఁ బోయెద ననుచున్నాఁడే యేమికారణమో యుండునని యాలోచన.

విగతదోషుఁడు: ఇది దోషముగాదని యీ పదము తెలుపుచున్నది. సీతారామలక్ష్మణులను బంచవటిని జేర్చుటయందు వారు కష్టములపాలై దుఃఖము లనుభవింపవలయునను క్రోధ మగస్త్యునందు లేదు - ఆయనకు స్వార్థలాభము లేదు - అది లోకక్షేమంకరకార్యము - కావున దోషము లేదని తీరుమానించుకొనెను - అదియునుగాక రామచంద్రమూర్తియే యచటకుఁ బోవ నాలోచించినపుడు ప్రేరకత్వముకూడ నగస్త్యునందు లేదు - భగవత్సంకల్పమున కనుకూలుఁ డగుటయే కదా భక్తునకుఁ బ్రథమకార్యము.

ఇట్లు దోషములేదని నిశ్చయించుకొని వారికిఁ గష్టము గలిగినను దానివలనఁ జెడిపోవునది యేదియును లేదు. సీతకును భయములేదు. రామలక్ష్మణులకు భయము లేదు. ఒకసంవత్సరము వీరు కష్టపడినఁ గలకాలము లోకము సుఖపడును. అని ధైర్యము తెచ్చుకొని నిస్సందేహవాక్యులతో ధీరుఁడై చెప్పెనని గ్రాహ్యము.

రామభద్రా యనుటలో భద్రశబ్దము మంగళాశాసనము. స్ఫుటతర గుణభద్ర యనుటలో నీ కల్యాణగుణములే నీకు మేలుకలుగఁజేయును అని హెచ్చరిక.

కం. బహుమూలఫలోదకమై, బహుమృగసంకీర్ణ మగుచుఁ ♦ బంచవటి యనన్
మహితమగు తలము సౌఖ్యా,వహ మిట కామడలు రెండు♦వర్తిలు దవ్వై. ౧౩

బహుమూలఫలోదకమై = విస్తారముగ మూలములు ఫలములు జలములు గలదై - బహుమృగ సంకీర్ణము=అనేక జంతువులచే వ్యాపించినది, సౌఖ్యావహము= సుఖము గలిగించునది.

తాత్పర్యము

విస్తారముగ పూలములు ఫలములు జలములు గలదై నానా మృగములచేఁ గూడినదై పంచవటి యను పేరుగల యొక గొప్పస్థల మిచ్చటికి రెండామడదూరమం దున్నది. అది సుఖమైన ప్రదేశము.

కం. చని యట నాశ్రమసంస్థా, పన మొనరించి యీ సౌమిత్రి ♦ పత్నియు మీరున్
జనకుని వాక్యము నడపుఁడు, చనియెం బెద్దయుఁ ద్వదీయ♦సమయాబ్దంబుల్. ౨౧౪

త్వదీయసమయాబ్దంబుల్ = మీరు నియమించుకొనిన గడువు సంవత్సరములు, పెద్దయు = చాలభాగము-౧౪-సంవత్సరములు-చనియెన్.

తాత్పర్యము

మీరు నియమించుకొనిన గడువు పదునాలుగు సంవత్సరములలోఁ జాల కాలము గడచిపోయినది, తక్కినకాలము మీ రచట నాశ్రమము స్థాపించుకొని మీరు దంపతులును లక్ష్మణుడును దండ్రివాక్యముఁ బాలింపుఁడు.

కం. ప్రతినను దీరిచి ధరణిం, బతివై సుఖపడెదు రామ ♦ భద్రా! మునుపున్
క్షితిపతి యయాతివలెఁ దొలి,సుతుఁ డగు నీచేఁ దరించి♦సుగతిం బడసెన్. ౨౧౫

ప్రతినను = ప్రతిజ్ఞను, క్షితిపతి = దశరథుఁడు, సుగతిన్ = పుణ్యలోకమును.

తాత్పర్యము

రామచంద్రా! నీవు పదునాలుగు సంవత్సరములు వనవాసము చేసెద నని చేసిన ప్రతిజ్ఞను బూర్ణముగ నెఱవేర్చి రాజవై సుఖించెదవు. నీవు పెద్దకొడుకు కగుటచే నీ తండ్రి తనకొడుకు యయాతి తనకోరిక నెరవేర్చుకొని సుఖించినటు పుణ్యలోకమును బొందెను.

కం. ఎఱిఁగితి నీవృత్తాంతముఁ, గొఱలెడి దశరథమహీశు ♦ కూరిమిచేతన్
గఱుకొని తపోబలంబున, మఱియును నీ లోని తలఁపు♦మార్గముఁ గంటిన్. ౨౧౬

తాత్పర్యము

దశరథునిపై నాకుఁగల ప్రేమచే నతనికుమారుఁడవైన నీ చరిత్ర మంతయును నీలోని యాలోచనవిధమును నా తపోబలముచేఁ దెలిసికొంటిని. నే నేమి యాలోచించితి నంటివా. నీ విచ్చటికి వచ్చుచు "వనవాస శేషంబు దినము నీతనిఁ గొల్చి యుందయుందము మహానందముగను" అని చెప్పితివి. ఆ యభిప్రాయము ననుసరించి నేనును మీ రిందు నుండుఁ డంటిని. నీ వా యభిప్రాయము మార్చుకొని 'నీటివలను గలిగి నిండారు నడవులు గలుగు నాశ్రమంబు దెలుపు' మంటివి. ఇక్కడ నుండఁ దలఁచిన వాఁ డేల వేఱొకస్థల మడుగుచున్నాఁడని త్రుటి యాలోచించితిని. నీ యభిప్రాయము దెలిసికొని నేనును మీరు పంచవటికిఁ బొండని చెప్పితిని.

కం. కావున మీ రిట నాకో, నావాసము జేయుఁ డనుచు ♦ ననుమతి యడిగియున్
బోవలయుఁ బంచవటి కని, నే వలసెం జెప్ప మీకు ♦ నీరజనేత్రా. ౨౧౭

తా త్ప ర్య ము

ఈ కారణముచే నాతోడ మీరు నివసింపుడని మొలుతఁ జెప్పియు మరలఁ బంచవటికిఁ బొండని మీకుఁ జెప్పవలసివచ్చెను. నీ సంకల్పమునకు నన్యథా నేనేల వర్తింతును.

శా. రామా ! యయ్యది శ్లాఘనీయము, గదుర్ ♦ రమ్యంబు, గోదావరీ
శ్రీమన్నిమ్నగ దాపు, పండ్లు సుమనో ♦ బృందంబు కొల్లల్, ఖగ
స్తోమంబుల్ మృగముల్ మహాద్భుతముగా ♦ నుండు నిచ్చ, లేకాంత, మెం
తే మోదంబు ఘటించు సీత, కిట కెం ♦ తే దూరముం గాదు సూ. ౨౦

శ్లాఘనీయము = పొగడఁదగినది శ్రీమన్నిమ్నగ = అందమైనది, దాపు = సమీపమందేయున్నది, సుమనోబృందంబు = పూలసమూహము, ఖగస్తోమంబుల్ = పక్షులగుంపులు, నిచ్చలు = సర్వదా, ఏకాంతము = నిర్జనము, ఎంతేన్ = మిక్కిలి.

తా త్ప ర్య ము

శ్రీరామచంద్రా! యది మిగులఁ గొనియాడఁదగిన ప్రదేశము. మిక్కిలి యందమైనది. గోదావరినది సమీపమందే యున్నది. పండ్లు పూలు దండి, పక్షులు మృగములు ఆశ్చర్యము కలిగించుచు, జను లుండినదికాదు, సీతకు మిక్కిలి సంతోషకరముగా నుండును, ఇచ్చటికిఁ జాలదూరమును గాదు.

కం. మీరును జానకితోఁ ద, ద్ధారిణి వసియించి కాచి ♦ తాపసజనముల్
పేరిమి విహరింపుఁడు చను, దారి నెఱింగింతు నీకుఁ ♦ దత్స్థలమునకున్. ౨౧

తా త్ప ర్య ము

మీరును జానకితో నా ప్రదేశమందుండి తపస్వులను రక్షించి గొప్ప పేరు వహించి సంచరింపుఁడు – అచ్చటికిఁ బోవు మార్గముఁ దెలిపెదను.

మీ రా ధారిణి వసియించి యనినఁజాలు నే– జానకితోనని యామెను ప్రత్యేకించి చెప్పనేల ? కాచి తాపసజనముల్ =నిర్మనుష్యమైన ప్రదేశము. అందు రాక్షస భూమి అక్కడనుండియే తపస్వులను రక్షింప నెట్లు సాధ్యము ? అక్కడనుండిన 'పేరేమి' యెట్లు గలుగును ? ఇవన్ని యాలోచించి చూడఁ గాఁగల విషయముల నెఱిఁగియే యగస్త్యుఁడు మాట్లాడుచున్నాఁ డనుట స్పష్టము.

మ. అదిగోఁ జూడుము యిప్పలోఁపు రఘురా ♦ మా ! కాన నౌ; దాని కా
యుదగాశం జనితేని మఱ్ఱి యట డా ♦ యుఁ మిమ్ము, నా పిమ్మటన్
బొదలున్ మిఱ్ఱుతలంబు నిర్వణము, ద ♦ ద్భూమిం దరింపంగ నం
దొదవుం బర్వత మొందు, పంచవటి పొ ♦ ల్పొప్పం జుమీ చేరునన్. ౨౨

ఉదగాశన్ = ఉత్తరపు దిక్కునందు – నిర్వణము – నిర్ + వనము = వనము లేనిది – బయలు – తరింపంగన్ = దాఁటిపోవ – చేరునన్ = ఆ పర్వతసమీపమందు.

తాత్పర్యము

రామచంద్రా! యిదిగోఁ జూడుము - ఇప్పుడేఁ కానవచ్చుచున్నది - దానికు త్తరముగఁ బోయిన నొక మఱ్ఱిచెట్టు గానవచ్చును. ఆవల మిట్ట ప్రదేశము-చెట్లులేని బయలున్నది. అది దాఁటిపోయిన నొక పర్వతము గలదు - దాని సమీపమందే పంచవటి యున్నది.

తే. నావుడును ముని కభివాద♦నం బొనర్చి, సెలవుఁగొని రణవీరులు ♦ సీతతోడ
నుద్ధృతాయుధహస్తులై ♦ యొయ్యఁ జనిరి, పంచవటికిని నిర్దిష్ట♦పథముఁ బట్టి.

అభివాదనము = సాష్టాంగనమస్కారము, రణవీరులు = యుద్ధమునందు పరాక్రమము గలవారు, ఉద్ధృతాయుధహస్తులై = ఎత్తఁబడిన యాయుధములు గల చేతులుగలవారై, నిర్దిష్టపథముఁబట్టి = అగస్త్యుఁడు చెప్పిన జాడపట్టుకొని.

తాత్పర్యము

అని చెప్పఁగా రామలక్ష్మణులు మునీశ్వరునకు నమస్కరించి యాయనయొద్ద సెలవు తీసికొని యెత్తఁబడిన యాయుధములుగల చేతులుగలవారై యా రణవీరులు సీతతోడ, నగస్త్యుఁడు చూపిన జాడపట్టుకొని పంచవటికి మెల్లగాఁ బోయిరి.

ఈ పద్యమునందలి రణవీరులు, ఉద్ధృతాయుధహస్తులు అనుపదములు వీరు యుద్ధసన్నద్ధులై పోయిరని తెలుపుచున్నవి. ఇచ్చట బాఠకుల కొక సందేహము కలుగ వచ్చును. అనసూయాదేవి సీతాదేవి నాదరించినట్లు లగస్త్యునిభార్య లోపాముద్రి యేల గామెను నాదరింపలేదు. ఆమె పేరు ప్రస్తావనకూడ లేదే, యేల?

ఆశ్రమమందు లోపాముద్ర లేదు. అగస్త్యున కనేకాశ్రమములు గలవు. బ్రహ్మగిరి (కూర్గుమండలమున) యను పర్వతమం దగస్త్యుఁ డొకసారి తపస్సుచేయుచు తన భార్యను లోపాముద్ర నొంటిగా విడిచియుండ నొల్లక యామెను దన కమండలు పాత్రమునందుంచి తపమునకుఁ బోయెను. ఆవల నొక కాకి వచ్చి యా పాత్రమును బోరగిలఁ ద్రోసెను. ఆ నిర్బంధమును సహింపలేకయుండిన లోపాముద్ర తన తపశ్శక్తిచే నేతైపాఱెను. ఆ నదికే కావేరియను పేరు. ఈ కావేరిపేరు సుగ్రీవుఁడు చెప్పుటచే (కిష్కింధ. ౧౦౫౮) నిప్పటికే యామె నదియైనట్లు తెలియనగు. ఉత్తరము వారికి గంగయెట్టిదో దాక్షిణాత్యులకుఁ గావేరి యట్టిది. దానిని వారు గంగయనియే పిలుతురు.

—♦ ౧౪-వ సర్గము. శ్రీరాముఁడు జటాయువుం జూచుట. ♦—

సీ. అరుగుచో వారు మ♦హాకాయు గృధ్రేశు, భూరివిక్రము వట♦భూజసంస్థుఁ
గని దైత్యుఁ డనియెంచి కడిమి నీ వెవ్వఁడ, వన నాతఁ డనియె న♦త్యంతసౌమ్య
భంగివి మధురోక్తిఁ ♦ బరమసంప్రీతిని, వత్స! మీ తండ్రికిఁ ♦ బరమసఖుఁడ
నా విని వార లా♦నందంబుతో నాత్మ, జనకవయస్యుని ♦ సత్కరించి

ఆ. యేమి పేర టన్న ♦ నెలమి నాతఁడు దన, పూర్వవంశకథను ♦ బూర్ణముగను
చెప్పఁ దొడఁగె నిట్లు ♦ శ్రీరాముతోడుత, సర్వభూతజన్మ ♦ సహితముగను.

మహాకాయుఁ=గొప్ప దేహముగలవానిని, గృధ్రేశుఁ = గ్రద్దలకు రాజైన వానిని, భూరివిక్రముఁ=అధికపరాక్రమము గలవానిని, వటభూజసంస్థుఁ = మఱ్ఱిచెట్టుపై నున్న వానిని, అత్యంత సౌమ్యభంగిని=మిక్కిలి మంచిమాటలతో, మధురోక్తిఁ= తియ్యనిమాటలతో, వత్స=నాయనా, దీనిని కొందఱు శబ్దానభిజ్ఞులు ప్రథమ బహుయందు వత్సలనుచున్నారు. అది సరిగాదు, పరమసఖుఁడ = మిక్కిలి మిత్రుఁడను, ఆత్మజనక వయస్యుని=తమ తండ్రిస్నేహితుని, సత్కరించి=తండ్రిని గౌరవించునట్లు గౌరవించి, తండ్రికి ముఖ్యస్నేహితులు తండ్రివలెనే పూజ్యులు. సర్వభూత జన్మసహితముగను=సమస్తభూతములు పుట్టిన విధముతో.

తాత్పర్యము

అట్టివారు పోవునపుడు పెద్దదేహముగల గ్రద్దరాజును మహాపరాక్రమవంతుని అగస్త్యుఁడు చెప్పిన మఱ్ఱిచెట్టుపై నుండు వానిని జూచి రాక్షసుఁ డీరూపము ధరించి యున్నాఁడని తలఁచి బలముదెలియ నెవ్వఁడవు నీవు అని యడుగఁగా నతఁడు మిగుల మంచిమాటలతోఁ దియ్యనిపలుకులతో సంతోషముతో నాయనా! రామచంద్రా! మీ తండ్రికి నేను మిక్కిలి ప్రియమైన స్నేహితుఁడను అని చెప్పఁగా వారు మిగుల సంతోషించి తమతండ్రి మిత్రుని దండ్రినివలె గౌరవించి, యయ్యా! నీ పేరేమనిన జటాయువు తన పూర్వకథను భూతములు పుట్టినవిధము మొదలుకొని చెప్పఁ దొడఁగెను.

సీ. భూతసృష్టికి బీజ ♦ భూతులై మును ప్రజాపతు లనఁ గలిగిరి ♦ పరమయశులు
వారిలోఁ బ్రథముఁడు ♦ వఱలెఁ గర్దముఁ డన, విక్రీతుఁ డాతని ♦ వెనుక శేష
సంశ్రియుల్ పిమ్మట ♦ స్థాణుమరీచ్యత్రులును గ్రతువు పులస్త్యుఁ ♦ డును గలిగిరి
యంగిరుండు ప్రచేతుఁ ♦ డావలఁ బులహుండు, దక్ష వివస్వంతు ♦ లక్షయమతి

తే. కశ్యపుఁడు కడగొట్టుగాఁ ♦ గలిగి రందు
దక్షునకు నఱువదిగురు ♦ తనయ లుద్భ
వింప నెనమండ్రు వారిలోఁ ♦ బెండ్లి యాడెఁ
గశ్యపుఁడు వారి పేరులు ♦ కరుణ వినుము. ౨౩

బీజభూతులై = విత్తనమువంటివారై, కారణమై.

తాత్పర్యము

భూతసృష్టికిఁ గారణభూతులై పూర్వము కొందఱు ప్రజాపతులు గలిగిరి. వారిలో మొదటివాఁడు కర్దముఁడు, ఆవల విక్రీతుఁడు, శేషుఁడు, సంశ్రయుఁడు, స్థాణువు. మరీచి, అత్రి, క్రతువు, పులస్త్యుఁడు, అంగిరుఁడు, ప్రచేతుఁడు. పులహుఁడు, దక్షుఁడు, వివస్వతుఁడు, కడపటివాఁడు, కశ్యపుఁడు. వీరిలో దక్షునకు నఱువదిగురు

పుత్రికలు పుట్టిరి. వారిలో నెనమండ్రను కశ్యపుఁడు పెండ్లియాడెను. వా రెవ్వరనిన వారి పేరులు వినుము.

తే. అదితి దితియును దనువును ♦ నతులచరిత !
కాళియును క్రోధవశ యను♦కలికి తామ్ర
మనువు ననలయు నందురు ♦ మానవతులు
నెండ్రఁ గనుఁగొని కశ్యపుఁ ♦ డనియె నిట్లు. ౩-౧౪

తాత్పర్యము

అదితి - దితి - దనువు - కాళి - క్రోధవశ-తామ్ర - మనువు - అనల: ఈ యెనమండ్రను భార్యలుగా గ్రహించి కశ్యపుఁడు వారితో నిట్లనియె.

కం. మీరు త్రిలోకీరక్షణ, భూరిక్షము లైనవారిఁ ♦ బుత్రులఁ గనుఁడీ
పేరిమి మత్తుల్యుల నన, నారులు తొలినల్వు రొప్పి♦నం దక్కసతుల్. ౩-౧౫

త్రిలోకీ=మూఁడులోకముల, సమాహారద్విగుసమాసము, కావున త్రిలోకీ యని రూపము, రక్షణ=రక్షించుటయందు, భూరిక్షములు=మిగుల సమర్థులు, మత్తుల్యులన్=నాతో సమానులైనవారిని, నారలు=స్త్రీలు, తొలినల్వురు=మొదటఁ జెప్పఁబడిన నలువురు.

తాత్పర్యము

మీరు మూఁడులోకములను రక్షించుటకు సమర్థులైన వారిని నాతో సమానులను గొడుకులఁ గనుఁడు. అని చెప్పఁగా మొదటఁ జెప్పిన నలువురు అదితి దితి దనువు కాళి యనువారు దాని కంగీకరించిరి.

ఆ. సమ్మతింపరైరి ♦ సరవి ముప్పది ముప్వు,రైన సుతులఁ గనియె ♦ నదితి యందు
వారలైరి రుద్ర ♦ వస్వాశ్వినేయు లా,దిత్యు లనఁగఁ బరఁగ ♦ దేవవరులు. ౩-౧౬

తాత్పర్యము

తక్కినస్త్రీలు భర్తమాట నంగీకరింపరైరి. అందు అదితి పదునొకండ్రు రుద్రులను, ఎనమండుగురు వసువులను, ఇరువు రాశ్వినేయులను, పండ్రెండుగురు ఆదిత్యులను, ముప్పదిమువ్వురను దేవతలను గనెను. వీరు స్వర్గవాసులు.

తే. దితికి దైత్యులు గలిగి రి ♦ క్షితితలంబు, వారలదియు ససాగర♦వనము మున్ను
దనువునకు నశ్వ గీవుం♦డనఁగఁబుట్టెఁ, గాళికకు నరకుండును♦ గాలకుండు. ౩-౧౭

తాత్పర్యము

దితికి దైత్యులు గలిగిరి. సముద్రముతో వనములతోఁ దొలుత నీ భూమి యంతయు వారిదే. దనువునకు నశ్వగ్రీవుఁ డనువాఁడును కాళికకు నరకుఁడు కాలకుఁడు ననువారు జన్మించిరి.

దీనివలన భర్తయందలి భక్తికొలఁది ఫలము గలిగెనని గ్రాహ్యము.

సీ. కలిగిరి తామ్రకుఁ ♦ గ్రౌంచియుఁ భాసియు, శ్యేనియు ధృతరాష్ట్రి ♦ చెలఁగి శుకియుఁ
కన్యక లేవురు ♦ క్రౌంచి యులూకాళి, భాసి భాసంబులఁ ♦ బ్రసవ మయ్యె
శ్యేనియు గృధ్రాళి ♦ శ్యేనంబులను గనె, ధృతరాష్ట్రి హంసలు ♦ నతులకాదం
బ కలహంసచక్రవా ♦ కంబుల శుకియును, నతఁ గాంచె, నతకు వి ♦ నత జనించెఁ
తే. క్రోధవశకును బదుగురు ♦ కూతులైరి
సురస మృగమంద హరి శ్వేత ♦ సురభి భద్ర
మదయు మాతంగి శార్దూలి ♦ మఱియుఁ గద్రు
కయును మృగియును; మృగికి మృ ♦ గంబు లొదవె. ౨౧-౨౪

తాత్పర్యము

తామ్రయనుదానికి క్రౌంచి, భాసి, శ్యేని, ధృతరాష్ట్రి, శుకి యను కన్యక లైదుగురు గలిగిరి. అందు క్రౌంచి యులూకములను (గూబలను) భాసి భాసములను బ్రసవించెను. శ్యేని గ్రద్దలను డేగలను గనెను. ధృతరాష్ట్రి హంసలను కలహంసలను చక్రవాకములను గనెను. శుకి నతను గనెను. నత వినతను గాంచెను. క్రోధయను భార్యకుఁ బదుగురుకూఁతులు సురస, మృగమంద, హరి, శ్వేత, సురభి, భద్రమద, మాతంగి, శార్దూలి, కద్రుక, మృగియుఁ గలిగిరి. మృగికి జింకలు గలిగెను.

సీ. మృగమంద కనను గల్గె ♦ ఋక్షముల్ సృమరముల్, చమరముల్, హరికి సిం ♦ హములుఁ
భద్రమదకు రామ ♦ భద్ర! యిరావతి, దానికి నైరావ ♦ తంబు గజము [గవులు
మాతంగికిఁ బుట్టె ♦ మాతంగములు, వ్యాఘ్రములును గోలాంగూల ♦ ములునుగలిగె
శార్దూలికిని; దిగ్గజంబులు శ్వేతకు, సురభికి రోహిణి ♦ సురుచిరాంగ
తే. మఱియు గంధర్వి, నాలుగం ♦ భవము లయ్యె
రోహిణికిని, గంధర్వికి ♦ వాహవితతి;
సురస బహుఫణముల నాగ ♦ వరులఁ గాంచెఁ
గద్రువకుఁ బన్నగంబులు ♦ గలిగె నయ్య.

తాత్పర్యము

మృగమంద యనుదానికి ఎలుఁగులు సృమరములు చమరములు జనించెను. హరి యనుదానికి సింహములు భద్రమదకు నిరావతి, దానికైరావతగజము, మాతంగములు, శార్దూలికి వ్యాఘ్రములు గోలాంగూలములు, శ్వేతకు దిగ్గజములు, సురభికి రోహిణి, గంధర్వి, అందు రోహిణికి గోవులు గంధర్వికి గుఱ్ఱములు జనించెను. సురస పెక్కు పడగలుగల నాగులఁ గాంచెను. కద్రువకుఁ బాములు కలిగెను.

సీ. మను వనుదానికి ♦ మనుజులు పుట్టిరి, బ్రాహ్మణ క్షత్రియ ♦ వైశ్య శూద్రు
లనువారు సర్వపు ♦ ణ్యఫలవృక్షంబుల, ననలాఖ్య గనియెను ♦ వినతయనెడు
శుకి సుతాసుతకును ♦ సుతు లరుణుండును, గరుడుండు నాఁగను ♦ గలిగిరయ్య
సురస తోఁబుట్టువా ♦ సుదతికిఁ గద్రువ,కును ధరణీభరం ♦ బును వహించు

తే. వేయిపడగల శేషుండు ♦ వెలసె నందు, నరుణసుతుఁ డను సంపాతి ♦ ఖవరజుండ
నసఘ నన్ను జటాయు వం♦టండ్రు శ్యేని, కాత్మజుఁడ నిష్టమేని సా♦యం బొనర్తు.

తాత్పర్యము.

మనువను వానికి మనుష్యులు పుట్టిరి. మానవులు మనుజులు అను శబ్దమునకు నిదియే సరియైన వ్యుత్పత్తిగా నున్నది. మనుస్మృతికారుఁడైన మనువుచేఁ బాలింపఁ బడువారు మానవులు మనుజులు ననవచ్చును. ఈ మనుజులలో నాలుగుభేదములు, బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రు లనువారు. అనలకు సమస్తమైన ఫలవృక్షములు జనించెను. శుకి కూఁతురగు నతకూఁతురయిన వినతకు అరుణుఁడు గరుడుఁడను యిరువురు కొడుకులు. సురస చెల్లెలగు కద్రువకు భూమిని మోయు వేయిపడగల శేషుండు వెలసె. కద్రూశబ్ద మూకారాంతమైనను తత్సమమైన కద్రువయను రూపమే కాని కద్రువు అని కాదు. కద్రువ నాగమాత, రా. వ్యా. కద్రువవంశమును మరలఁ జెప్పుటకు అట్టి లోకానిష్టకారులైన పాములను వధించి విష్ణువు వాహనమైన గరుత్మంతుని వంశమువాఁడను నేనని తన ప్రఖ్యాతికై జటాయువు చెప్పెనని కొందఱు తన వంశమువలెఁ గద్రువవంశము ప్రసిద్ధమని తెలుపుటకై యని మఱికొందఱు మరలఁ జెప్పఁబడె నందురు. అరుణుని సుతుఁడను, తొడలు లేనివాఁడు కావున నీ యరుణునకు ననూరుఁడని పేరు. ఎఱ్ఱనివాఁడు కావున నరుణుఁ డనిపేరు. సంపాతి యనువానికిఁ దమ్ముఁడను, నా పేరు జటాయువని యందురు. శ్యేనికుమారుఁడను. నీకిష్టమేని నీకు నేను సహాయము చేసెదను.

జటాయు వంశ పరంపర.

కశ్యపుఁడు – శుకి – నత – వినత – అనూరుఁడు – జటాయువు, కావునఁ గశ్యపునకు నాలుగవవాఁడు జటాయువు.

శ్యేని శుకియను వా రిరువురు కశ్యపుని భార్యయగు తామ్ర కూఁతుండ్రు. ఈ శ్యేని మునిమనుమని భార్య యెట్లయ్యె నని సందేహము. తన తల్లిపేరు శ్యేనియని జటాయువు చెప్పెనే కాని తనకు ముత్తవ్వయని చెప్పలేదు. కావుని ఆమె పేరుగలది మఱియొకతె యని తలంపవలయును. అటుగాదు, శుకి సోదరి శ్యేనియందు రేని మనుజులందఱు నొక మనువు బిడ్డలే కదా, సోదరన్యాయమేకదా ? ఎట్లు స్త్రీపురుషు లొకరి నొకరు వివాహమాడుచున్నారు. విధినిషేధములు మనుష్యులందే కాని మృగపక్షులందు లేవు పురాణాంతరములందు సృష్టివిధము మరియొకరీతిగా నున్నది. ఇది వైవస్వత మన్వంతర వృత్తాంతము.

కం. కాంతారము దుర్గము దు, ర్దాంతము రక్షోన్వితంబు ♦ రామా ! మృగయా
స్వాంతమున మీరు చన నే, కాంతంబుగ నున్నసీతఁ ♦ గడిమిం గాతున్. ౨౩౧

కాంతారము=అడవి, దుర్గము=చొరరానిది. రక్షః + అన్వితము = రాక్షసులతోఁగూడినది, దుర్దాంతము=త్రోవలుకొట్టుటకు రాక్షసబాధ యణఁచుటకు సాధ్యము

కానిది - మృగయాస్వాంతమునన్ = వేటయందలి మనస్సుచే - ఏకాంతంబుగ = ఒంటరిగ - కడిమిన్ = నా బలముచే - కాతున్ = రక్షింతును.

తాత్పర్యము

మా కితరుల సాహాయ్య మేల? నీవేమి సహాయము చేయఁగల వందువేమో? ఈ యడవి ప్రవేశింపరానిది. త్రోవలు డొంకలు సరిగా లేవు - జనసంచారము లేనిది - కంపలుకొట్టి త్రోవలుచేయుటకు సాధ్యపడదు - అదియును గాక రాక్షసు లుండు చోటు. ఈ సందర్భమున మీ రిరువురు వేటకై పోయినపుడు సీతాదేవి యొంటరిగాఁ గదా యుండును. అప్పుడు మృగబాధ రాక్షసబాధ లేకుండ నా బలముచే నామెను రక్షింతును.

చం. అనుడు జటాయువాక్యముల ♦ నంతయు నాదట నాలకించి యా
జనకహితుం గవుంగిటను ♦ సమ్మతిఁ గ్రుచ్చుచు మైత్రిగాథలన్
వినుచును నప్పగించి పృథి ♦ వీసుత నాతనికిన్ సహాయుఁడై
యనఘుఁడు తోడ రాఁగఁ జని ♦ రందఱుఁ బంచవటిం గనుంగొనన్. ౨౩౨

ఆదటన్ = ప్రీతితో - మైత్రిగాథలన్ = జటాయువునకు దశరథునకుఁ గలిగిన స్నేహ విధము-ఎప్పుడేల యది యెట్లు గలిగెనో తెలియదు. కౌసల్యాపరిణయము చూచునది.

తాత్పర్యము

అని జటాయువు చెప్పఁగా నాయన వాక్యము లన్నియుఁ బ్రీతితో విని తన తండ్రి మిత్రుఁడగు నాయనను సంతోషముతోఁ గౌఁగిలించుకొని తన తండ్రికిని నాయనకును గలిగిన స్నేహవిధ మాయన చెప్పఁగా వినుచు నిఁకను సీతను రక్షింప వలసినది నీ భారమని యాయన కప్పగించి యా పుణ్యమూర్తి తమకుఁ దోడురాఁగా నందఱును బంచవటిఁ జూడఁబోయిరి.

కం. వడిగొని మండెడి జ్వలనుఁడు, మిడుతల దహియించుగతి న♦మిత్రజనములన్
బొడ యడఁగింపఁగ జొచ్చెం, దొడి తొడి రాముండు తమ్ము♦తోఁ బంచవటిన్.

జ్వలనుఁడు = అగ్నిహోత్రుఁడు - అమిత్రజనములన్ = విరోధులను -పొడ = రూపు-తొడితొడి = బిఱబిఱ-అగ్నిహోత్రుఁడు మిడుతలవలె నని చెప్పుటచే శత్రు వధము రామునకుఁ గష్టకార్యముకాదని సూచితము.

అదియునుగాక మిడుతలున్న చోటికి నగ్నిహోత్రము పోదు. మిడుతలే వచ్చి యగ్నిలోఁబడి చచ్చును. అట్టులే రాక్షసులును రామునిపై పడి వచ్చి చత్తురని భావము.

తాత్పర్యము

గాలికి రేఁగి మండెడు మంట తనలోఁబడిన మిడుతలను దహించునట్లు విరోధి జనముల రూపుమాపుటకు శ్రీరామచంద్రమూర్తి లక్ష్మణుతో శీఘ్రముగఁ బంచ వటిని బ్రవేశించెను.

-- ♦ ౧౫-వ సర్గము సీతారామలక్ష్మణులు పంచవటిఁ బ్రవేశించుట. ♦ -

కం. నానావ్యాళమృగాయుత, మా నా పంచవటిఁ గాంచి ♦ యంబుజనేత్రుం
డానందితు సౌమిత్రిని, మానిత మధురోక్తి ననియె ♦ మన ముప్పొంగన్. ౨౩౪

నానావ్యాళమృగాయుతము = అనేకములయిన పాములు మృగములు గలది. అయుతము=పదివేలు-శతం సహస్ర మయుత మ్మన్నట్లు లిక్కడ నానంత్యార్థకము - ఆనందితున్ =సీతారాములకు సేవ యథేచ్ఛముగాఁ జేయుటకు దగిన స్థలము దొరికె నని సంతోషముచే నుప్పొంగువాని, మధురోక్తిన్ = తియ్యని మాటచే-లక్ష్మణునకు సంతోషమగుటచే రామునకును మిగుల సంతోషకర మయ్యెనని భావము- కార్యము చేయవలసిన చోటికి వచ్చితిమిగదా యని రామునకు సంతోషము - సౌమిత్రి యను టచే 'రాముఁడ యెఱుంగు మీ దశరథుఁడు'అని సుమిత్ర చెప్పిన మాటలప్రకారము కైంకర్యముచేయ సిద్ధపడియుండు వానిని.

తాత్పర్యము

అనేకములగు సర్పములు మృగములు గల యీ పంచవటిని జూచి రామ చంద్రుఁడు నిరంకుశ పూర్ణసీతారామశుశ్రూషకుఁ దగిన స్థలము దొరికెఁగదా యని యుప్పొంగు లక్ష్మణునితోఁ గార్యము చేయవలసిన చోటికి వచ్చితిమిగదా, ఇది లక్ష్మ ణునకు సంతోషకరముగా నున్నది గదా యని యుప్పొంగుచు గౌరవముతోడి తియ్యనిమాటల నిట్లనెను.

శా. అన్నా! పంచవటీ ప్రతీతి గల ర ♦ మ్యంబైన దేశం బిదే
కన్నారం గను నా సుపుష్పితలతా ♦ గుల్మజాతిజాతంబు లో
విన్నాణీ! పరికించి చెప్పు మిక బృ ♦ థ్వీకన్యకున్ నీకు నా
కు న్నుండార ముదంబు నాశ్రమ మెటం ♦ గూర్పంగ నౌ లక్ష్మణా. ౨౩౫

అన్నా = ఇది ప్రీతిని సూచించును. పంచవటీప్రతీతి=పంచవటియను ప్రఖ్యాతి గల - రమ్యము = మనోహరము - చూతపున్నాగాది వృక్షము లుండుటచే వనము రమ్యము. చదరముగా మిత్తస తెల్లని యిసుకగలదగుటచే స్థలము రమ్యము - పంచ వటి యని ప్రఖ్యాతిగన్న ప్రదేశమనుటచే నీ పేరు మునులు పలుమాఱు చెప్పఁగా శ్రీరాముఁడు వినియుండెనని గ్రహింపనగు - ఈయనను ఇక్కడఁ జేర్పవలయు ననియే మునుల యాలోచన - ఆ కారణముచే దీనియందు రుచిపుట్టుటకై యీ పేరు నలువురు పలుమాఱు చెప్పుచుండిరి. సుపుష్పిత లతాగుల్మజాత జాతంబులు=మిగులఁ బుష్పించిన తీఁగలయు చెట్లయు సమూహములు - విన్నాణీ= నేర్పరీ; అనఁగా నడవు లందు నిది మంచి స్థలము, ఇది చెడ్డస్థల మని నిర్ణయించుటయందు సామర్థ్యముగల వాఁడని భావము; పరికించి= పరీక్షించి - నలువంకలు శోధించి - పృథ్వీకన్యకున్ = సీతకు - ఔ = తగును.

తాత్పర్యము

అన్నా! లక్ష్మణా! పంచవటి పంచవటి యను ప్రఖ్యాతిగన్న రమ్యమైన ప్రదేశ మిదియే- చక్కఁగాఁ బూచిన తీఁగలు చెట్లు గుంపులు గుంపులుగాఁ గన్నులపండువుగాఁ గానవచ్చుచున్నవి. అడవులం దాశ్రమస్థలము నిర్ణయించుటయందు నేర్పుగలవాఁడా - ఇందు సీతకు నీకు నాకు మన ముగ్వురకు ననుకూలమై సంతోషకరమైన స్థల మేదో చూచి చెప్పుము.

ఉ. నీటికి దవ్వుగాక రమ ♦ ణీయవనీహృదయంగమస్థలీ
వాటులు గల్గి మిట్టలును ♦ బల్లము లేక సముప్రదేశమై
గాటముగాఁగఁ బూవులును ♦ గట్టెలులుం గుశలుల్ సమీపమై
నేలగు సైకతం బయిన ♦ నిర్మలదేశముఁ జూడుమా యనన్. ౨౩౬

నీటికి దవ్వుగాక = నీళ్ళు మఱీ దూరముగ నుండిన మనము స్నానసంధ్యాదులకు నీళ్లు తెచ్చుటకు నెండయందుఁ జీకటివేళఁ గష్టముగా నుండును. కావున నీటిపట్లు సమీపమందుండవలెను - రమణీయవనీ = అందమైన యడవియందు కంపచెట్లు మొదలైనవి లేక ఫలవృక్షములు నీడలుగల వృక్షములుగల ప్రదేశములు. హృదయంగమస్థలీవాటులు = మనస్సునాకర్షింపఁగల ప్రదేశము లుండవలెను - ఇట్లున్నయెడల సీతావిహారమునకు ననుకూలపడును - మిట్టలు పల్లము లేక = నేల చదరముగా నుండిన నాకుఁ బండుకొనను ననుకూలపడును - గాటముగాఁగఁ బూవులు కట్టెలు కుశలు - సమీపమై = నీవు సేకరించుటకు దూరముపోవలసిన పనిలేక పూవులు కట్టెలు దర్భలు సమీపమందే లభించునవియై యుండవలయును - సైకతంబు = ఇసుకనేలగా నుండవలెను - గులకరాలు గలదియైనఁ బండుకొనుటకు ననుకూలపడదుగదా - నిర్మలదేశము = మృగముల పేఁడ పెంట లేనిది.

తాత్పర్యము

నీటికి దూరముగా నుండరాదు - మనస్సున కింపైనదేశముగా నీటికి దూరము గాక యిచ్ఛావిహారమునమునకు యోగ్యమైనదిగా నుండవలెను - నేలచదరమైపండుకొన సుఖకరమైనదిగా నుండవలెను - నీవు తెచ్చుటకుఁ బూలు కట్టెలు దర్భలు దండిగా సమీపమందే యుండవలయును. ఎత్తుగొట్టునేల గాక పండుకొనుటకుఁ గూర్చుండుటకు ననుకూలమైన మెత్తని నేలగా నుండవలెను - పెంటలు పేఁడ కుప్పలు లేక నిర్మలమైయుండవలెను. ఇట్టి ప్రదేశముగా నిర్ణయింపుము - మనము కొన్నాళ్లిందుండవలసినవారము. కావున ననుకూలప్రదేశము బాగుగదా! కావున మన ముగ్వురకు సౌఖ్యకరమగు స్థలము చూడుము.

ఉ. అంజలిచేసి జానకి స ♦ మక్షమునం దను లక్ష్మణుండు భూ
రంజనశీల యియ్యెడఁ ద ♦ రంబుగ మీరు శతాబ్దముల్ ముదా

త్వా జరియింప మీకుఁ బరతంత్రుఁడ నే, నటుగాన మీరె నా
కుం జనవార నాజ్ఞ యిడఁ గోరెద మీకు రుచించు స్థానమున్. ౨౩౭

అంజలిచేసి=చేతులు జోడించి నమస్కరించి, జానకి సమక్షమునన్=సీతాదేవి చూచుచుండఁగా, భూరంజనశీల=ప్రజలను సంతోషపెట్టు స్వభావముగలవాఁడా - తిరంబుగన్=నిలుకడగ - శతాబ్దముల్=నూఱుసంవత్సరములు - శత మానంతార్థకము - కావున పెక్కులేండ్లు - ముదాత్మన్=సంతోషించు మనస్సుతో - పరతంత్రుఁడను=దాసుఁడను - మీయాజ్ఞ చొప్పున వర్తించువాఁడను.

తాత్పర్యము

ఈప్రకారము శ్రీరామచంద్రమూర్తి చెప్పఁగా లక్ష్మణుఁడు చేతులు జోడించి నమస్కరించి సీతాదేవి సమక్షమందు ని ట్లనియెను. భూమిాజనులను సంతోషింపఁ జేయు స్వభావముగలవాఁడా - మీరిచ్చట నూర్లకొలఁది సంవత్సరములు సంతోషముతో స్థిరముగ నుండినను మీకు నేను దాసుఁడనే కాని స్వతంత్రుఁడగాను. కావున మీరే ప్రేమతో మీకు సమ్మతమైన స్థలమందు నాశ్రమము నిర్మింప నాజ్ఞ యిడఁ గోరెదను.

విశేషార్థము

లక్ష్మణుఁడు - రామకైంకర్యమే చిహ్నముగాఁగలవాఁడు - సన్న్యాసులకుఁ గాషాయవస్త్రము దండకమండలువులు చిహ్నములైనట్లు లీయనకుఁ గైంకర్యమే చిహ్నము. దీనివలన దండకమండలువులను విడిచిన సన్న్యాసి యెట్లు పతితుఁడో యట్లే కైంకర్యము విడిచిన భగవత్పరతంత్రుఁడగు భక్తుఁడును బతితుఁ డని భావము.

అంజలిచేసి=నమస్కారముద్ర, "అంజలిః పరమాముద్రా" యని యన్ని ముద్రలలో నిది శ్రేష్ఠమైనది. ఇప్పు డంజలి చేయవలసిన కారణమేమి? గురువు నొద్ద శిష్యుఁడు కాని స్వామియొద్ద భృత్యుఁడు కాని మాటలాడునపుడు అంజలి జోడించి వినయమున మాటలాడవలయును. 2. తప్పుచేసినవారు చేతులు జోడించి నమస్కరించి క్షమాపణ కోరుదురుగదా! తాను రామచంద్రునకుఁ బరతంత్రుఁడ నని యాయనకుఁ దెలిసియుండియు నీకు సుఖకరమైన తావు వెదుకుమని యనె నే తన సుఖమే నాసుఖము గాని నాకుఁ బ్రత్యేకసుఖ మెచ్చటిది? ప్రత్యేకసుఖము నేను గోరుట స్వతంత్రుఁడ నను తలంపున్నఁగదా. నేను స్వాతంత్ర్యము వహించితినేని పతితుఁడనే కదా. నా పారతంత్ర్యమున కది శత్రువుగదా. నే నేదో యపరాధమును ఈయనయెడఁ జేసియుండవలె. లేకున్న నట్లు చెప్పఁడు. చిత్రకూటమునఁ బర్ణశాల కట్టుమని చెప్పెనే కాని నీకు సుఖకరమైనచోటఁ గట్టుమని చెప్పలేదే. ఇప్పుడు చెప్పుటకు నాయం దేదే మహాపరాధ ముండవలెను. ఆ యపరాధమునకుఁ బ్రాయశ్చిత్తము వీరికు పురకు నమస్కరించుటే. ప్రపన్నునకు దానికి మించిన ప్రాయశ్చిత్తము లేదు కదా యని తలంచి యంజలి మోడ్చెను. జానకి సమక్షమునన్ = సీత యంగీకరింపకున్న రామ

మంత్రముఁ దంగీకరింపఁడు. సీత యనుగ్రహించినా రాముననుగ్రహము నిశ్చయము. "అలమేషా పరిత్రాతుం రాఘవాత్ రాక్షసీగణమ్" రాముని వలన భయమునుండి రక్షింప నీమె సమర్థురాలని కలదుగదా. ఆకారణముచే ముందామెను జేమోద్ధృతోఁ జూచి రామచంద్రునితో ననుచున్నాఁడు. ఆమె పురుషకారభూత కావున నామె యనుగ్రహ మావశ్యము. అదియునుగాక రామవాక్యసరణిఁ బట్టి నే నేదో మహాపరాధము చేసితినని తోఁచుచున్నది. ఈయపరాధమునకుఁ బ్రాయశ్చిత్త మెట్లు?

ప్రాయశ్చిత్త ప్రసంగేతు, సర్వపాప సముద్భవే
మా మేకాం దేవదేవస్య మహిషీం శరణం వ్రజేత్ ॥

అని యుండుటచే ఏ పాపమును జేసినను బ్రాయశ్చిత్తము పెట్టుకోవలసివచ్చె నేని ప్రపన్నుఁడు లక్ష్మి శరణమే కోరవలయును అను శాస్త్రనియమ ప్రకారము ఆమె యనుగ్రహమును గోరెను. భూరంజనశీల = భూమిజనుల రంజింపఁజేయుచు, రాజవై రాముఁడవై, ఇయ్యోడక = ఈలోకమందు, ఈ లీలా విభూతియందు అనుటచే నీ పరస్వరూపమందు నిత్యవిభూతియందు నేను శేషుఁడనై నీకు నివాసముగాను నీవు పండుకొనఁ దలఁచినపుడు శయ్యగాను, కూర్చుండఁ దలఁచినపుడు సింహాసనముగాను, లేచి నడచునపుడు పాదుకలుగాను, కావలసినపుడు పై వస్త్రముగాను, పండుకొనునపుడు తలదిండుగాను, మీరు బైటఁబోవునపుడు గొడుగుగాను నేను శరీరభేదముచే నీకు సేవచేయుదునో యదేవిధముగనే యిందును శేషవృత్తి నవలంబించి దాస్యము చేయుదును. అందు నిందుఁగూడ దాస్యమే నాస్వరూపము.

తిరంబుగక = ఎన్నాళ్లు మీరు లీలావిభూతిలో నుందురో యన్ని దినాలు చేసెదను.

మీరు=భార్యాభర్తలు, ఇట్లు చెప్పుటచే సీతారాము లిరువురు సేవ్యులే. ఒకరిని విడిచి మఱియొకరిని సేవింపరాదు. నారదీయమందు.

గృహీచ గృహిణీచైవ సలక్ష్మీకం హరిం యజేత్
అన్యథా దోషమాప్నోతి వసుదేవసుతం వినా
కృష్ణమూర్తౌ సలక్ష్మీక నియమో నాస్తి భూపతే
లక్ష్మ్యాయుక్తో హ్యయుక్తోవా కృష్ణః పూజ్యో నసంశయః॥

గృహస్థుఁడు గృహిణి (ఇల్లాలు) లక్ష్మీదేవితోఁ గూడియుండు విష్ణువునే (వసుదేవ సుతుని విడిచి) పూజింపవలెను. కృష్ణమూర్తిపూజయందు లక్ష్మి యుండవలయునను నియమము లేదు. లక్ష్మి కూడనుండినను లేకుండినను గృష్ణుఁడు పూజ్యుఁడే. కావున రాముని విడిచి సీతను బూజింపరాదు. సీతను విడిచి రామచంద్రుని బూజింపరాదు.

శతాబ్దముల్ = ద్విగురేకవచన మ్మను వ్యాకరణసూత్రప్రకారము శతాబ్దమని యేకవచనముగానే యుండవలెను. బహువచనముచే నట్టినూర్లు అనేకములని గ్రహింపవలెను. పరతంత్రుఁడనే = ఎప్పుడు నేను నీకు నమస్కరించితినో యప్పుడే నీవు

స్వామివి, నేను భృత్యుఁడను, భార్యయు దాసుఁడు స్వతంత్రులుగారుగదా. సీతాదేవి నీ కెట్టులో మీాయిరువురకు నే నట్టివాఁడనే కావున మీా యిష్టముప్రకారము నేను వర్తించువాఁడనేకాని నా కిష్టమనునది యేదిగలదు. ఇట్లుండ నాకు సుఖమైనది నేను జూచుకొని యిది నాకు సుఖముగానున్నది మీారు నిందే యుండుఁడని చెప్పుమనా ? అది మహాపరాధముకదా. కావున మీారే నా కాజ్ఞయిందు. స్వాతంత్ర్యము మీాకు స్వత్వమయినట్టు పారతంత్ర్యము నాకు స్వత్వము. దానిని మీారు విడువరాదు. దీనిని నేను విడువరాదు. నీకున్న స్వాతంత్ర్య మెట్లితరులకు లేదో నా కున్నంత పారతంత్ర్య మితరులకు లేదు. కావున నితరులకు దుర్లభమైన నా పారతంత్ర్యమును నాశముచేయఁ గోరక నన్నాజ్ఞాపించి నాచేఁ బనిగొనుము. ఈ యర్థమునే ద్వయ మందలి యుత్తరభాగము దెలుపుచున్నది. పరమార్థతత్త్వము చూచునది.

భగవంతుఁ డీప్రకారము తనవారిని మోసగించి వారి మనస్సులు పరీక్షింపఁ జూచును. హెచ్చరిక గలిగి మోసపోనివాఁడు ధన్యుఁడు. అట్టివాఁడుకదా యథార్థ భక్తిగల లక్ష్మణుఁడు. కైంకర్యపరుఁడు. తనకు నష్టమైనను గష్టమైనను అనిష్టమైనను భగవంతుని యిష్టప్రకారము కైంకర్యము చేయవలయునుగాని తన యిష్టప్రకారము చేయరాదని యేర్పడుచున్నది.

చం. అనవుడు రాఘవుండును మ♦హాత్ముని లక్ష్మణుమాట కెంతయుఁ
దనిసని హర్షమంది యుచి♦తం బగు దేశము రోసిఁ దమ్ము కే
లిని దన కేలఁ బట్టుకొని ♦ లీలమెయిన్ వచియించె నీ స్థలం
బనుజ ! సమంబు పుష్పితన♦గాన్విత మాశ్రమ మిందుఁ గూర్పుమీా. ౨౩౮

రోసి = వెదకి, సమంబు = చదరమై మిట్టపల్లములు లేక యున్నది. పుష్పిత నగాన్వితము = పూచిన చెట్లతోఁ గూడినది.

తాత్పర్యము

అని లక్ష్మణుఁడు చెప్పఁగా గొప్పమనస్సు గొప్ప స్వభావము గల లక్ష్మణుని మాటకు మిక్కిలి సంతోషించి వెదకి తగినస్థలము నిశ్చయించి లక్ష్మణునిచేయి ప్రేమ సూచకముగఁ దనచేతఁ బట్టుకొని యిట్లు చెప్పెను. తమ్ముఁడా యీప్రదేశము మిట్టపల్లములు లేక చదరముగానున్నది. పూఁచిన చెట్లును గలవు. ఇం దాశ్రమము నిర్మింపుము.

తే. అదిగో నాదిత్యసంకాశ♦మైన సురభి, గంధిపద్మాళిఁ గోమ రయి♦బంధురముగఁ
బద్మసేవితమైనట్టి♦పద్మసరసి, దాపునం దున్నయది సుమి♦త్రాతనూజ. ౨౩౯

ఆదిత్యసంకాశము=సూర్యునితో సమానము, అట్టి యెఱ్ఱని కాంతిగలది, సురభి గంధి=మంచివాసనగల, పద్మాళిన్=ఎఱ్ఱతామరలచే, కోమరయి=అందమై, బంధురముగన్=మనోహరముగ, పద్మసేవితయు=లక్ష్మిచే సేవింపఁబడినది, లక్ష్మి పద్మాలయ గదా, పద్మసరసి=తామరకొలను, పద్మసేవితము= (౧) ఇది సాధ్యసమాన మని కాని

(౨) "జ్యాపో(హ్రస్వః సంజ్ఞాచ్ఛందసో ర్బహుళ" మను సూత్రప్రకారము పద్మాపద్మ హ్రస్వ మయ్యెననికాని గ్రహింపవలెను. సంజ్ఞయనఁగాఁ బేరు. పద్మ యనునది పేరు గావున సమాసమున హ్రస్వమయ్యెను. నదిసుతగురుకర్ణ శల్యనాగపురీశుల్ అన్నట్టులు,

తా త్ప ర్య ము

సూర్యకాంతియు మంచి వాసనయుఁ గల యెఱ్ఱతామరలచే నందమై లక్ష్మీదేవిచే సేవింపఁబడు తామరకొలను సమీపమందే యున్నది. ఏటికిఁ బోవ వలనుపడ నప్పుడు మన మీ జలమే వాడుకొనవచ్చును.

తులసీ కాననం యత్ర యత్ర పద్మవనానిచ।
వసంతి వైష్ణవా యత్ర తత్ర సన్నిహితో హరిః॥

అను వాక్యమును బట్టి యిచ్చట 'ఆదిత్యసంకాశ'మనుటచే సూర్యమండలమందుండు విష్ణువువలె నిందును విష్ణు వున్నాఁడనియు, సురభిగంధిపద్మాళిఁ గొమరయి యనుటచే 'సర్వగంధ స్సర్వరస' యను శ్రుతిప్రకారము ఆతుని పరిమళమే గుమాయించు చున్నదనియు పద్మసేవిత మయినట్టి పద్మసరసియనుటచే పుట్టినింట నాఁడు బిడ్డ లున్నట్టు లిందు లక్ష్మి కమలములందు వసించుచున్నదనియు ఆ కారణముచే నిది సరసి కావున సర్వదా మనకు సేవ్యమనియు వ్యంగ్యము.

కం. సురుచిరపుష్పితతరువై, వరసారసహంసచక్ర ♦ వాకాన్విత యై
పరమర్షి యనిన గోదా, వరి యిదె కడురమ్య మగుచు ♦ వఱలెడిఁ గంటే. ౨౪౦

సురుచిర=మిగుల మనోహరముగ, పుష్పిత=పూచిన, తరువై=చెట్లుగలదై, వర=శ్రేష్ఠములైన, సారస=కమలములు, హంస=హంసలు, చక్రవాక=జక్కవలు, అన్వితయై=వీనితోఁ గూడినదై, పరమర్షి= మునిశ్రేష్ఠుఁడు, అగస్త్యుఁడు, వఱలెడిఁ=ప్రకాశించుచున్నది. ఉభయవిధ మహతీనా మ్మనుటచే చక్రవాకాన్వితయై యని చెప్పఁబడియె.

తా త్ప ర్య ము

మిగులఁ బూచిన చెట్లను తీరమందుఁగలదై, కమలములు, హంసలు, చక్రవాకములు గలదై యగస్త్యుఁడు చెప్పిన గోదావరి ప్రకాశించుచున్నది. చూచితివా? ఇది మిగుల దవ్వునుగాదు, దాపునుగాదు.

ఇది ముత్తైదువు దర్శనమువలె శుభసూచకమని చెప్పుచున్నాఁడు - గోదావరి కొప్పునందుఁ బూలు తుఱిమి కమలములవంటి కన్నులు హంస నడకవంటి నడక చక్రవాకములవంటి స్తనములు గల సువాసినివలె నున్నదని వ్యంగ్యము.

ఉ. సుందరకందరంబులను ♦ సొంపును నింపు రహింపఁ గేకికా
బృంద మమందనాదమున ♦ నెల్గిడ నల్లడ బూచి కాచి యా
నందము కందళింపఁగ ఘ ♦ నంబులు భూమిరుహంబు లొప్పఁగా
దండడి పర్వతంబు లివి ♦ దవ్వును దాపును గాక యుండెడిఁ. ౨౪౧

సుందరకందరంబులును=అందమైన గుహలును, కేకిబృందము = ఆఁడు నెమిళ్ల సమూహము. అమందనాదమునన్ = పెద్ద ధ్వనితో, ఎల్గిడన్ = ధ్వనింపఁగా, కందళింపఁగన్=మొలకెత్తఁగా, ఘనంబులు = గొప్పవి, భూమిరుహంబులు = చెట్లు, దండడి = తలుచు.

తాత్పర్యము

అందములైన గుహలు మిక్కిలి యింపుగా నాఁడు నెమిళ్లు బిగ్గరగా నలు ప్రక్కలఁ గూయు ధ్వనులు పూచి కాచి సంతోషము విస్తరింపఁజేయు పెద్ద వృక్షములు కలవై పర్వతంబులు మిగుల దూరముగాక దగ్గరగాక యున్నవి.

తే. పెక్కుతావులఁ బైడియు ♦ వెండి రాగి, ధాతువులచేత నొప్పు ధా ♦ త్రీతలములు
వన్నెల నలంకరించిన ♦ వారణముల, చెన్ను వహియించుచున్న వో ♦ యన్నకంటె
౨౮౨

పెక్కుతావుల్ = అనేక స్థలములందు, పైడి = బంగారు, ధాతువులు = శుద్ధిచేయని లోహములు, వారణముల చెన్ను = ఏనుగుల కాంతి.

తాత్పర్యము

తమ్ముఁడా! యనేక స్థలములందు బంగారు వెండి రాగి యీ లోహములచే నొప్పు భూప్రదేశములు రంగులు పూసిన యేనుఁగుల విధమున నున్నవి, చూచితివా

మత్తకోకిలము. సాలతాలతమాలతుంగర ♦ సాలజాలమధూకకు
ద్దాలవంజుల నక్తమాలవి ♦ తానసిందుక చందనో
ద్దాలచంపక పారిజాతక ♦ దంబనింబకపిత్థత
క్కోలకేసరజంభకింశుక ♦ కూలపాటలకోటులన్. ౨౮౩

సాల=మద్దిచెట్లు - తాల=తాటిచెట్లు - తమాల=చీఁకటిమ్రాఁకులు - తుంగ=ఎత్తైన, రసాల=తియ్యమామిడిచెట్లు, జాల=సమూహము, మధూక=ఇప్ప, కుద్దాల=కాంచనచెట్లు, వంజుల=అశోకములు, నక్తమాల= కానుగుచెట్లయొక్క, వితాన = సమూహము, సిందుక చెట్లు, చందన = శ్రీగంధపుచెట్లు, ఉద్దాల = విరిగినమ్రాఁకులు, చంపక=సంపంగిచెట్లు, పారిజాత=పారిజాతముల, కదంబ=కుంపు, నింబ = వేపచెట్లు, కపిత్థ=వెలగచెట్లు, తక్కోల=తక్కోలపుచెట్లు, కేసర = పొన్నచెట్లు, జంభ = నిమ్మచెట్లు, కింశుక=మోదుగుచెట్ల. కూట=సమూహము, పాటల=పాదిరిచెట్లు: వీని యొక్క కోటులన్=సమూహములచే.

మత్తకోకిలము. ర స జ జ భ ర గణములు. ౧౧-వ యింట యతి (అన్నియుఁ జెట్లపేరులే కావునఁ దాత్పర్యము వ్రాయలేదు.)

చ. గిరులు రహించె నీతలము ♦ కీర్తితముల్ మృగపక్షిలోకనుం
దరమును బుణ్యదంబు నిటఁ ♦ దమ్ముఁడ పక్షివిభుండు బాసటై

పరఁగ వసింత మన్న వెసఁ ♦ బర్ణకుటీరము సద్విశాలముం
ఖరకరవంశవర్ధనుఁడు ♦ గట్టె సుమిత్రతనూజుఁ డన్నకై. ౨౭౨

గిరులు = పర్వతములు, రహించెం = ప్రకాశించుచున్నవి. తలము = స్థలము, కీర్తితముం=పొగడఁదగినది. మృగపక్షిలోకసుందరము=మృగములయు పక్షులయు సమూహముచే నందమైనదియు, పుణ్యదంబు = పుణ్యమిచ్చునది. పక్షివిభుండు = జటాయువు, బాసట=సహాయుఁడు, వెసం=త్వరగా, పర్ణకుటీరముం = ఆకుటింటిని, సద్విశాలముం=మిగుల విశాలమైనది, ఖరకరవంశవర్ధనుఁడు = సూర్యవంశమునువృద్ధి చేయువాఁడు, సుమిత్రతనూజుఁడు=లక్ష్మణుఁడు అన్నకై=రామచంద్రుని నిమిత్తమై.

తాత్పర్యము

పర్వతములు ప్రకాశించుచున్నవి. ఈ ప్రదేశము శ్లాఘ్యమైనది మృగములయుఁ బక్షులయు గుంపులచే నందమైనది. పుణ్యము నిచ్చునది. కావున నిచ్చట మనకు జటాయువుతోడు కాఁగా నుందము. త్వరగాఁ బర్ణశాల నిర్మింపుము. అనఁగా లక్ష్మణుఁడు శీఘ్రముగ నొక పూరికుటింటిని గట్టెను.

—♦ లక్ష్మణుఁడు పంచవటిఁ బర్ణశాల నిర్మించుట ♦—

ఉ. నేలఁ బునాది త్రవ్వి కడు ♦ నేటుగ గోడలు పెట్టి బొంగుకం
బాలను నిల్పి వానిపయి ♦ ప్రక్క వెదుళ్లను బర్చి జమ్మివా
సాలు గుదిర్చి నారలను ♦ జక్క బిగించియు బోద తెల్లునం
జాలఁగఁ గప్పి దిమ్మెసను ♦ సారెకు దంచి సపాటుగా మహిం. ౨౭౫

పునాది = ఆస్తిభారము - నేటుగ = చక్కఁగా - సపాటుగా = చదరముగా- ఎచ్చు తక్కువలు లేకుండ-

తాత్పర్యము

భూమియందుఁ బునాది తీసి చక్కగ గోడలు పెట్టి లావువెదుళ్లు స్తంభాలుగ నాటి వానిమీద ప్రక్క వెదుళ్ళు సన్ననివి పఱచి జమ్మికొమ్మలు వాసాలుచేసి నారలతో గట్టిగ బిగించి యా వెదుళ్ళమీఁద బోదెతెల్లును దట్టముగఁ గప్పి నేలనుగట్టియు చదరము నునుపు నగునట్లు దిమ్మెసతో మూఁడు నాలుగుమార్లు నీళ్ళు చల్లిచల్లిదంచి,

సీ. గోదావరికిఁ బోయి ♦ స్రుంకి సత్వరుఁడయి,పండ్లుఁ బూవులుఁ దెచ్చి ♦ బలినొసర్చి
శాంతికార్యంబుల ♦ సాంతము గ్గావించి, యన్నకుఁ గాన్పించె ♦ నాశ్రమంబు
సీతాసమేతుఁడై ♦ శ్రీరాముఁ డది చూచి, యానందరసభరి♦తాత్ముఁ డగుచుఁ
దమ్ముఁ జేరఁగ దీసి ♦ తనకౌగిటను గ్రుచ్చి,యనురాగ ముప్పొంగ ♦ ననియె నిట్లు
తే. ఘనమతీ! భవత్కృతమహా♦కార్యమునకు, నీడుగాఁ బారితోషకం♦బేమి యీయఁ
గలను గావున నర్మిలిఁ ♦ గౌఁగిలించి,నాఁడ నీశక్తి కేమను♦వాఁడఁ గుఱ్ఱ. ౨౭౬

స్రుంకి=స్నానముచేసి, సత్వరుఁడయి=త్వరతోఁ గూడినవాఁడై, ఆనందరసముచే నిండిన మనస్సుగలవాఁడు - భవత్కృత = నీచేఁ జేయఁబడిన - మహాకార్యము

నరుణ=గొప్పపనికి-పారితోషకము=కానుక, అర్పిలిక=ప్రేమతో-వత్స=చిన్నవాఁడా-"తపోవనే-మఠే - బ్రహ్మచర్యాదా వాశ్రమో స్త్రియా"మ్మని భానుఁడు - ఆశ్రమ మనఁగా తపోవనమునకు మఠమునకు బ్రహ్మచర్యాదులకుఁ బేరు.

తా త్ప ర్య ము

ఇట్లు కుటీరము సిద్ధముచేసి గోదావరికిఁ బోయి స్నానముచేసి జాగుచేయక పండ్లు పూలు తెచ్చి వాస్తుబలి యిచ్చి శాంతికార్యములు గావించి యాశ్రమము నన్నకుఁ జూపించెను. (ఇంతవఱకు సీతారాములు ప్రక్కతోఁపులో నుండిరి) సీతతోఁ గూడి రామచంద్రుఁ డదిచూచి మిగుల సంతోషించి తమ్ముని గౌఁగిలించి ప్రేమ యుప్పొంగుచుండ నిట్లనియె. గొప్ప మనస్సుగల లక్ష్మణా! నీవు చేసిన గొప్ప కార్య మునకు సమానమైన కానుక నేనేమి యీయఁగలను. కావునఁ బ్రేమతోఁ గౌఁగి లించెదను. చిన్నవాఁడా నీ శక్తి నేమని మెచ్చుదును.

చం. అనఘ తలం పెఱుంగుదు సమర్యజ్ఞ! కృతజ్ఞుఁడ విట్టి నీ దనూ
జునిఁగను గన్నతండ్రి యతిశుద్ధుఁడు ధర్మ్ముఁడు నాదుపాలికిన్
వినుమనియున్నవాఁడ యని నెమ్మి వచించి సుఖంబుగా వసిం
చెను నటఁ గొంతకాలము వసిష్ఠుఁడు వేల్పు దివంబునం బలెన్. ౨౮౩

అనఘ=స్వార్థమను దోషము లేనివాఁడా! తలంపెఱుఁగుదు=నా యభి ప్రాయము నేను జెప్పకున్నను అన్న కేప్రకారముండుట యిష్టముగదా! యాప్రకారము గట్టిన వదినెతోడ నాయన యేకాంత ముండ సంతోషించునుగదా యని తెలిసికొని చేయువాఁడవు. నయజ్ఞ=నీవు నావలె రాజకుమారుఁడవై భోగముల మరగినవాఁడ వయ్యు నాశ్రమనిర్మాణమపుడు అన్నకిది, నాకిది యని నీకొరక యనుకూలస్థలము నేర్పఱచుకొనక నాకు సుఖముగలిగించు నేర్పాటులుమాత్రము చేసితివి. కృతజ్ఞుఁ డవు=ఏది యెట్లు చేయవలయునో తెలిసినవాఁడవు. రామచంద్రుఁడు దశరథునకు లేక లేక కలిగిన కొడుకుకావున నాయన విషయములో నేమి యనిష్టము కొట్లునో యన్నికార్యములు చంద్ర తారాబలములు లోనైనవి విచారించి చేయును. ఇల్లును నన్లే కట్టించి యిచ్చెను. ఇదంతయుఁ దెలిసినవాఁడగుటచే లక్ష్మణుఁడును అన్నియు నాలోచించి పర్ణకుటీరము నిర్మించెను. అతిశుద్ధుఁడు=మిగుల నిర్మలుఁడు - తండ్రి యంతటి శుద్ధుఁడుగనుక నే నీవు నింతటివాఁడవైతివి ధర్మ్ముఁడు=ధర్మాత్ముఁడు-మనియున్న వాఁడు=జీవించియున్నవాఁడు - తాను జీవించియున్నంతకాలము నావిషయమై యే కొఱత లేకుండ విచారించుచున్నవాఁడు. కావునఁ దాను బోవుచుఁ దన స్థానమున నిన్ను నుంచెనని భావము.

తా త్ప ర్య ము

పాపరహితుఁడా! నా యభిప్రాయమెట్టిదో నేను జెప్పకయే తెలిసికొనఁగలవు. నీతి నెఱిఁగినవాఁడవు. ఏది యెట్లు చేసిన నాకు హితమో తెలిసినవాఁడవు. ఇట్టి

నిన్నుఁ గని మిగుల శుద్ధుఁడును ధర్మాత్ముఁడు నైన తండ్రి మరణించినను నా పాలిటికి బ్రతికియే యున్నవాఁడు. నీ వుండుటనుబట్టి యాయన లేఁడను కొఱఁత దోఁపలేదు. అని చెప్పి సుఖముగా స్వర్గమున విష్ణువువలె నందుఁ గొంతకాలము వసించెను.

పంచవటి

పంచవటీస్థల మేదియను విచారము చిరకాలముగ ననేకుల బాధించుచున్నది. భద్రాచలమునొద్ద పర్ణశాల యని కొందఱు నాసికయని కొందఱు నభిప్రాయపడు చున్నారు. ఇం దేది సత్యమో రామాయణముఁబట్టి స్థలశోధనముఁబట్టి నిర్ధారింప వలసియున్నది. (1) పంచవటి గోదావరీతీరస్థ మనుట నిర్వివాదవిషయము. (2) పంచవటియొద్ద గోదావరి యుత్తరమునుండి దక్షిణమునకుఁ బాఱుచుండవలెను. ఏలన – రామలక్ష్మణులు సీతాదేవిని గోదావరివెంట వెదకుచు వచ్చిరి. (చూ. ౧౦౮౦–౧౦౮౧–౧౦౦౭) ఇట్లు వచ్చునపుడు మృగములు దక్షిణపువైపు సీత పోయినదని చూపఁగా రామలక్ష్మణులు –

చక్కఁ దక్షిణముపోక (ఏ అడ్డముగనుక) నైఋతిదిశగాఁ బోయి జటాయువును గోదావరీతీరమందుఁ జూచిరి – ఈ కారణముచే గోదావరి జటాయుపడిన స్థలమువరకు దక్షిణాభిముఖముగానే పాఱుచుండవలయును – జటాయువునకు గోదావరి జలముంతో నివాపములు విడిచిన కారణముచే గోదావరీతీరమై యుండవలెను – (చూ. ౧౧౭౮ ౩–పాదము) ఇక్కడనుండి రామలక్ష్మణులు నైఋతిదిశయందే మూఁడుకోసులు పయనించిరి – ఇంతవఱకుఁ దూర్పుగాఁ బోవుటకు నే అడ్డమువచ్చును. కనుకఁ దూర్పుగాఁ బోలేదు. కొంత తూర్పుపోయినఁగాని జటాయువు చెప్పిన దక్షిణమార్గము లభింపదు – కావున నచ్చటనుండి మూఁడుకోసులు తూర్పుగాఁ బోయిరి. ఇప్పు డిప్పటి భద్రాచలమునొద్ద గోదావరికి దక్షిణదిశయం దున్నవారైరి. ఇట్లు వచ్చిన కారణముచే వారు గోదావరిని దాఁటవలసిన పనిసరిలేదు. ఈ కారణముచేఁ బంచవటి గోదావరికిఁ బడమటితీరమందే యుండెనని యంగీకరింపక తప్పదు. తూర్పునం దుండె నేని గోదావరి దాఁటియేయుండవలెను – ఆ విషయము వాల్మీకి చెప్పలేదు. అది యునుగాక యిప్పటి పర్ణశాలనే పంచవటి యని గ్రహించినచో వారు నైఋతి ప్రయాణము చేసియుండిరేని యేటిపాలు గావలసియుండును – భద్రాచలమునొద్ద నేఱుదాఁటిన ట్లొకరు వ్రాసిరిగాని యది విచారించి వ్రాసిన వ్రాఁతకాదు – ఇప్పటి పర్ణశాల కాదుకాని దాని కెదురొడ్డునఁ జక్కఁగఁ బంచవటి యుండెనని చెప్పవచ్చును– నవీనచంద్రదాసు, ఎం. ఏ., గారు ప్రకటించిన మనదేశపటమునందు నాసికను బంచవటిచేసి యక్కడనుండి చక్కఁ దక్షిణమువచ్చినట్లు వ్రాసియున్నారు – ఇది రామాయణమునకు విరుద్ధము – పంచవటి గోదావరీ పశ్చిమతీరమం దుండె ననుటకు స్థలము సహాయపడుచున్నది – పర్ణశాల కెదురుగ రథగుట్టయని యున్నది – ఇందు రావణాసురుఁడు తేరిని దాఁచియుంచెనని చెప్పుదురు – ౮౧౩–వ పద్యమున రావణుఁడు సీతా


పంచవటి పటము
పంచవటి
సీతగుట్టలు
రధముగుట్ట
జటాయుగుట్ట
పర్ణశాల (ఇప్పటిది)
దుమ్ముగూడెము
ఉత్తరము
భద్రాచలము తాలూకా
తూర్పు
భద్రాచలము
రేకపల్లి
దక్షిణము
శ్రీరామగిరి
పడమర

దేవి నెత్తుకొనివచ్చెనో లేదో తెలియ సిద్ధముగానుండెనని చెప్పఁబడెను. సమీపముందే యది కానరాకయుండుటచేత నీవసికొనసాగెనుగాని యేటికొక యొద్దునఁ దేరు,సీతయు రావణుఁడు నేటియొక్క యొద్దున నుండిన నిది సాగియుండదు. కావునఁ బంచవటి పడమటివైపునసే యుండవలెను. హరణ మాంగ్రవక్కనసే యయియుండవలెను. అంతియ కాదు. దీనికి సమీపమందే సీతగుట్టలని పెద్ద పర్వతము గలదు. ఇందు ఖరుఁడు యుద్ధమునకు వచ్చినపుడు సీతాలక్ష్మణు లుండిరనియు నా కారణమున కా గుట్టల కా పేరు వచ్చెననియుఁ జెప్పెదురు. కాదనుటకుఁ గారణము కానరాదు. తూర్పుటొడ్డున నుండి రేవి యేఱుదాటిపోయి యా యా గుట్టలలో నుండవలసియుండును. ఈ గుట్ట కింద పడమటివైపునఁ బెద్ద బయలున్నది. అందుఁ బదునాలుగువేల రాక్షసులు నిలిచి యుద్ధముచేయ విశువు స్థలము గలదఁట. సీతాలక్ష్మణులకీ ప్రదేశమున జరిగు యుద్ధము కానవచ్చుచుండును.

అదియునుగాక ౨౩౯–వ పద్యమందుఁ బద్మసరస్సు పంచవటి సమీపమందే యున్నట్లు చెప్పఁబడెను. అదియే యింతవఱకున్నదో లేదో చెప్ప సాధ్యపడదు గాని యిట్టివంటి పెద్ద చెఱు వున్నట్లు కోయలు చెప్పిరి. ఈ చెఱువునకు గోదావరికి నడుమఁ బంచవటి, వర్షకాలమందు నేటినీళ్లు బురదగా నున్నప్పు డీ చెఱువు నీళ్లు సీతారామలక్ష్మణులు వాడుకొనుచు వచ్చిరి. ఇప్పటి పర్ణశాలకు దక్షిణమున గోదావరీతీరమున భద్రాచలమునకువచ్చుమార్గము నడుమ దుమ్ముగూడెమని యొక గ్రామము గలదు. దీని కెదురుగ నేటి కావలియొద్దున నొక చిన్న గుట్ట కలదు. దీని సమీపమందు జటాయు రావణుల యుద్ధము జరిగె నందురు. కాదనుటకుఁ దగిన కారణములు లేవు. ఇప్పుడు గోదావరి తూర్పుటొడ్డు కోసికొని వచ్చుచున్నది. ఇప్పటి యేటినడుమ దుమ్ముగూడెము వీధులు కొన్ని యుండెనఁట. అచ్చటఁ జూచినవారే చెప్పుచున్నారు. ధూమగూడెము దుమ్ముగూడె మయ్యెను. ఆ గుట్టయొద్దనే జటాయువును రామచంద్రమూర్తి సంస్కరించెను. ఇప్పటి హంపియే పంపయనియు నిందుఁ జెప్పినచోటఁ బర్ణశాలయుండెననియు జెప్ప మఱియొక నిరాకరింపరాని ప్రబల కారణము గలదు. రామలక్ష్మణులు లంకకుఁబోవునపు డేమార్గమునఁబోయినను లంక నుండి మరలునపుడు విమానమున జక్కఁగాఁ బయనించిరిగాని వంకరటింకర త్రోవఁ బోయియుండరనుట స్పష్టము. లంకనుండి సముద్రము దాఁటివచ్చినపిమ్మట రామేశ్వర ముందు స్థలమునుండి యయోధ్యకుఁ బయనించిరనుట యందఱు నంగీకరించి యున్నారు. అది సత్యమేని రామేశ్వరమునుండి చక్కఁగా నయోధ్యకు గీతగీఁచి నచో నాగీఁతకు సమీపమందే యెడమవైపునఁ గిష్కింధయుఁ గుడివైపునఁ బంచవటియు నుండవలెను. ఈ రెండు స్థలములను రామచంద్రమూర్తి సీతాదేవికిఁ జూపించెఁ గదా! (చూ. ౨౮ ౦౦, ౨౮ ౦౮, ౨౮ ౧౨) ఈ మార్గమునకు నాసికకు సంబంధము లేదు. కావునఁ బంచవటి నాసిక కానేరదు. నాసిక యనునది మొదటిపేరుగాదనియు

నవశిఖ యనునది నాసిక=నాసిక యయ్యెననియుఁ బురాణములందుఁ బ్రసిద్ధికెక్కిన నాసిక శూర్పణఖదే యగుటచే నా కథకు దానికి ముడిపెట్టిరనియు నొకరు వ్రాసియున్నారు నాసిక పంచవటి కాదనుటకు మఱికొన్ని కారణములు గలవు. నవీన చంద్రదాసుగారు ప్రకటించిన పటమునందు సీతారామలక్ష్మణులు చిత్రకూటము నుండి దక్షిణముగా ఋక్షవంతమునకు వచ్చి యచ్చటనుండి పశ్చిమాభిముఖులై నాసిక చేరినట్లు వ్రాసియున్నారు. వారు చెప్పినమార్గమునందు వింధ్యపర్వతము నే గాక సర్మదా తపతులను దాఁటి విదర్భలోనుండి నాసికకుఁ బోవలసియున్నది. ఇది చాల దుర్గమమార్గముటుండ వాల్మీకి సీతారామలక్ష్మణులు వింధ్యమునుగాని నర్మదా తపతులనుగాని దాఁటినట్లు చెప్పలేదు. వారు దాఁటియేయుండిన నాసుప్రసిద్ధనదులను వాల్మీకి చెప్పియేయుండును. అదియునుగాక నాసికనుండి బయలుదేఱి రామలక్ష్మణులు నిందు దక్షిణమువచ్చి యావల నాగ్నేయమునఁ గిష్కింధకువచ్చినట్లు నవీనచంద్ర దాసుగారు వ్రాసియున్నారు. ఇది రామాయణమునకుఁ బ్రత్యక్షవిరుద్ధము. రామ లక్ష్మణులు నైఋతిమూలగ (౧౦౭౭-వ.) నావలఁ గొంత మరల నైఋతిగఁ (౧౧౭౦) బోయి యచ్చటినుండి తూర్పుగఁ (౧౧౭౧) బోయి కబంధుని జంపి యచట నుండి మరలఁ బడమరగాఁబోయి పంప (తుంగభద్ర) చేరి యచటకుఁ బడమరనుండి శబరి గుహకుఁ బోయిరి. (౧.౨౫౩-వ.)

మీఁద వ్రాసినట్లు జటాయు గుట్టయొద్దనుండి నైఋతిగా వచ్చిననే కిష్కింధకు రాఁగలరుగాని నాసికావాదులు చెప్పునట్లు లాగ్నేయమూలగాఁ బోయి యుండిన సముద్రతీరము చేరియుందురు గాని కిష్కింధ చేరియుండరు. ఆగ్నేయ మూలగాఁ బ్రయాణముచేసినట్లు రామాయణమున నొక మాటయైన లేదు. నాసికా పక్షవాదులును పంప హంపి కిష్కింధ యనియే వ్రాసియున్నారు.

భద్రాచలమునొద్ద నుష్ణగుండము సీతాదేవి స్నానము చేయుచుండెననుటయు రేకపల్లెయొద్ద జటాయు ఱెక్క పడెననియుఁ జెప్పుట కల్పితములు.

—♦ ౧౬-వ సర్గము. లక్ష్మణుఁడు హేమంతఋతువును వర్ణించి యన్నకుఁ జెప్పుట. ♦ –

కం. కాంతానుజయుతుఁడై యా, కాంతసుఖము మీఱ నుండఁ ♦ గా శారదవే
శాంతమున నిష్టమగు హే,మంతము పొడసూపె సురుచి ♦ మంతం బగుచున్.

కాంతానుజయుతుఁడై = భార్యతోను దమ్మునితోను గూడినవాఁడై, ఏకాంత సుఖము=విస్తారసుఖము, సుఖము దుఃఖము ననునవి మనస్సునందున్నవిగాని బయటి పదార్థము లందులేవు తృప్తుఁడే సుఖపురుషుఁడు. సుఖస్య దుఃఖస్య నకోపి దాతా యని కలదుగదా. నిత్యతృప్తున కెందున్నను సుఖమే. శారదవేళాంతమునన్ = శరత్కాలము కడచిపోయిన తరువాత, హేమంతము=మంచుకాలము=పొడసూపెన్ = కానవచ్చెను, సురుచిమంతము=మిగులఁ గాంతిగలది, ఇష్టము=ఋషులకుఁ దపము

చేయ ననుకూలమైనది, ఖరాదుల సంహరించి జయముఁబొందుటకు మూలమగు శూర్పణఖను తనయొద్దకు రప్పించుటచే రామునకు నిష్టమైనది.

ఈ ప్రకరణమున శూర్పణఖాగమనసూచకముగ హేమంతాగమమును లక్ష్మణుండు వర్ణించుచున్నాఁడు.

తాత్పర్యము

ఆ పర్ణశాలయందు నిష్టురాలగు సీతతోను తమ్ముఁడగు లక్ష్మణుతోను మిగుల సుఖముగ శ్రీరామచంద్రమూర్తి యున్నసమయమున శరత్కాలము ముగిసిపోఁగా నిష్టమగు మంచుకాలము ప్రాప్తించెను.

ఉ. ఆవల నొక్క వేకువ ము ♦ హాత్ముఁడు రాముఁడు స్నాన మాడ గో
దావరికిం జనంగ వని ♦ తాయుతుఁడై బడిఁ బాత్రహస్తుఁడై
పోవుచు లక్ష్మణుం డనియెఁ ♦ బొల్పయి యబ్దము దేన రాజిలున్
వావిరి నీ కభీష్ట మది ♦ వచ్చెనుగా యల సీతు వీయెడన్. ౨౮౯

అబ్దము=సంవత్సరము, దేనన్=దేనిచే, వావిరి= మిక్కిలి, సీతువు = మంచు కాలము, నీకభీష్టము=నీకుఁ బ్రియమైనది. మాసానాం మార్గశీర్షోస్మి యని మార్గశిరము, తానే యని కృష్ణభగవానుఁడు చెప్పెనుగదా. నయనైదేవ నవోపగూహానాని యన్నట్లు ఎండకాలమందువలెఁ గాక చలికాలమందు భార్యాభర్తలు కౌఁగిలించుకొని పండుకొందురు.

శ్రీరామచంద్రమూర్తి తపోవిశేషము తెలియుటకై హేమంతఋతువు వర్ణింపఁబడుచున్నది.

తాత్పర్యము

ఇట్లు హేమంతఋతువు రాఁగా ఆ ఋతువునం దొకనాఁటి తెల్లవాఱుజామున రామచంద్రమూర్తి గోదావరియందు స్నానముచేయ సీతాదేవితోఁ బోవుచుండఁగా లక్ష్మణుఁడు కమండలువు దీసికొని వెంటఁబోవుచుండెను. అప్పుడు లక్ష్మణుఁడు రామచంద్రునితో నిట్లనియె. అన్నా ! యే ఋతువుచే సంవత్సరము ప్రకాశించునో నీకు నిష్టమైన మాస మేదియో యట్టి మార్గశిరము హేమంతఋతువు నగు మంచుకాల మిపుడు ప్రాప్తించెనుగదా.

వ్యాకరణము

దేనన్=అది ఇది ఏది యనువానికిఁ దృతీయాసప్తమ్యేకవచనంబులందు దాన దీన దేన ననియు వాని బహువచనములందు వాన వీన వేన ననియు రూపంబులగు. త్రి. శే. ౬౨.

కం. బిఱు సెక్కె మేను ప్రజలకుఁ, గఱ కెక్కెను నీటి కనవ ♦ గాహ్యముగ నిలన్
మెఱుఁ గెక్కెఁ బైరుపచ్చలు, నఱమఱలేకాప్రుఁడయ్యె ♦ హవ్యవహుండున్.

బిఱుసు=కాఠిన్యము, కఱుకు=క్రూరత్వము, అనవగాహ్యముగన్=స్నానముచేయ సాధ్యముగాకుండునట్లు, అఱమఱలేక= భేదభావములేక, ఆప్రుఁడు = కావలసినవాఁడు మేలుకోరువాఁడు, హవ్యవహుండు = అగ్నిహోత్రుఁడు, స్వభావోక్త్యలంకారము.

అగు స్వభావోక్తి జాత్యాదులందుఁగల స్వభావ మొంతేని వర్ణింపఁబడియెనేని, 'హరిణములు చూచె నుత్తరాంగాక్షములును స్తబ్ధకర్ణములుఁగుచునట్టి చందమునను' ఈ స్వభావోక్తి రసవంతమైన వర్ణనముగా నుండవలెను, గాని

మాహిష్మతీ పురీమధ్యే ముహు ర్నాఘ్రాయ మేదినీమ్
ఏకపాదం సముద్ధృత్య శ్వా మూత్రం విసృజత్యహో॥

మహిష్మతీపురము నడుమ నొక కుక్క నేల పలుమాఱు వాసనచూచి యొక కాలెత్తి మూత్రము విడిచెను. ఔరా! అను నట్టులుండరాదు.

తాత్పర్యము

ప్రజలకు దేహము కఠినమాయెను. స్నానముచేయుటకు సాధ్యపడకుండునట్లు నీటికిఁ బండ్లువచ్చి కలుపసాగెను. పైరుపచ్చలు కాంతితోఁ గూడినవాయెను. అగ్నిహోత్రుఁడు మునుపటివలెఁగాక యిప్పుడె దగ్గఱకుఁ బ్రజల రానీయసాగెను.

కం. పొంగళ్ళను బొంగింతురు, ముంగడ దేవతలకు బితృముఖ్యులకు బుధుల్
రంగారు క్రొత్తధాన్యము, లం గడు గతపాపు లగుదు ♦ లాలితచరితా. ౨౫౧

రంగారు=కాంతిగల, బుధుల్=తమకు శ్రేయస్కరమగు దాని నెఱిఁగినవారు.

తాత్పర్యము

తమకు శ్రేయస్కరము లగు వానిఁ దెలిసినవారు క్రొత్తధాన్యము రాఁగానే దానిని పాలలోఁ బొంగించి దానిని బితృదేవతలకు దేవతలకు నివేదించి పాపరహితు లగుచున్నారు.

దీనికే యాగ్రయణమని పేరు. 'నాసిష్ట్వాగ్రయణే నాహితాగ్ని ర్నవస్య ధాన్యస్యాశ్నీయా ద్వ్రీహీణాం యవానాం శ్యామాకానా మగ్రే పాకస్య యజేత॥' యను సూత్రమున నాపస్తంబు లీకార్య మవశ్యము చేయఁదగినదని చెప్పినారు

తే. దండయాత్రాభిరక్తిని ♦ ధరణిపతులు
పరమగోరససంపన్న♦తరులు ప్రాజ్య
కాము లయి జానపదులును ♦ గ్రాలుచుండ్రు
గాదె యన్నయ్య యీ మంచు♦కాలమునను. ౨౫౨

దండయాత్రాభిరక్తిని = యుద్ధయాత్రయందలి విశేషప్రీతిచే, ధరణిపతులు = రాజులును, పరమగోరససంపన్నతరులు=మిగుల శ్రేష్ఠమైన యావుపాలు పెరుగు లోనైనవిగలవారు, ప్రాజ్యకాములు=మిక్కిలి కామముగలవారు, జానపదులును = ఊళ్ళయం దుండువారు.

తాత్పర్యము

అన్నా! రాజులు యుద్ధమునకై యాత్రపోవుటయందును పెద్దగ్రామములయం దుండువారు పాలు పెరుగు మొదలయినవి తినుటయందును మిగులఁ గోరికగల వారై యీ మంచుకాలమందు వర్తింతురుకదా !

క. దక్షిణదిశయందు జగ, చ్చక్షువు రాణించుచుండ ♦ శశ్వచ్ఛోభా
  లక్షణతిలకచ్యుతహరి, ణాక్షి యనఁగ నుత్తరదిశ ♦ యమరెడిఁ గంటే. ౨౫౩

జగచ్చక్షువు = సూర్యుఁడు, శశ్వచ్ఛోభా = శాశ్వతకాంతి, లక్షణ = చిహ్నమైన, తిలక = నొసటనుంచుకొను బొట్టుచేత, హరిణాక్షి = స్త్రీ ఉత్ప్రేక్షాలంకారము వ్యంగ్యము.

తాత్పర్యము

దక్షిణదిశయందు సూర్యుఁడున్న కారణముచే నుత్తరదిశ ముత్తైదువుచిహ్నమైన ముఖమునకు శాశ్వతకాంతిని గలిగించు కుంకుమబొట్టులేని యొకసుదాసివలె నున్నది. ఇది దక్షిణాయనమగుటచే సూర్యుఁడు దక్షిణదిశయందే యుండును. శ్రీరామచంద్రమూర్తి యుత్తరదేశమున లేమిని నది విధవవలె నున్నది.

తే. సహజముగ మంచుగడ్డల ♦ స్థానమైన
  వాఁడు హిమవంతుఁ డీ తఱి ♦ వేఁడి వెలుఁగు
  మిగుల దూరగుఁ డౌటను ♦ మీఱె సార్థ
  కాఖ్యుఁడై కాలనుహిమంబు ♦ నగ్గలికను. ౨౫౪

సార్థకాఖ్యుఁడై = సార్థకమగు పేరితోఁ గూడినవాఁడై, అగ్గలికను = అతిశయముచే, నిరుక్త్యలంకారము.

తాత్పర్యము

హిమవత్పర్వతము స్వభావముగానే మంచుగడ్డలస్థానము. అందు నీకాలమున సూర్యుఁడు దూరమందుండుటచే మంచుకరఁగుట మానుటచే హిమవంతుఁడు(మంచుగడ్డలుకలవాఁడు)అను పేరర్థముతోఁ గూడినవాఁడై కాలముహిమచే నొప్పుచున్నాఁడు.

సీ. మధ్యాహ్నముల జనుల్ ♦ మలయ సుఖంబుగా, సింపైన నునువెచ్చ ♦ యెండలొప్ప
  సలలితార్కంబులై ♦ చాయల జిల్లను, జలములు గ్రాలె దు ♦ స్సహము లగుచు
  మృదులసూర్యంబులై ♦ మిహికావృతంబులై, వలిగాలి వీవఁగ ♦ వనము లెల్ల
  మానవ సంచార ♦ హీనంబులుగ ముద్దు, కట్లు కట్టిన నిజాం ♦ గములు గలుగు
తే. జనులతో దివసంబులు ♦ సాగు నిపుడు, కానఁగా రాని వెలిపడ ♦ కలను గలిగి
  పుష్యనీతములయి మంచు ♦ బూఁజువాఱి, యీఁదగాలిని రేలిప్డు ♦ వృద్ధిఁ జెందె.

మలయన్ = సంచరింప, నునువెచ్చ = కొంచెము వేఁడిమి, సలలితార్కంబులై = వేఁడిమిలేని సూర్యునిగలవై, చాయల = చెట్లనీడల, దుస్సహము = సహింపఁగష్టమైనది, మృదులసూర్యంబులు = తీక్ష్ణముగాని సూర్యకిరణములుగలవై, మిహికావృతంబులై = మంచుచే నావరింపఁబడినవై, వలిగాలి = చల్లనిగాలి, మానవసంచార హీనంబుగన్ = మనుష్యులు తిరుగుటలేక, నిజాంగములు = తమ దేహములు, దివసంబులు = పగళ్లు, వెలిపడకలు = బయళ్లయందలి పండుకొనుటలు, పుష్యనీతములయి = పుష్యనక్షత్రముచే జరుపఁబడినవియై, మంచుకాలమున రాత్రులు పుష్యనక్షత్రముచేఁ దెలిసికొందురు. బూఁజువాఱి = బూఁజుపట్టినట్లు తెల్లనై, ఈఁదగాలి = చల్లనిగాలిచే

వృద్ధిచెందెన్ = పగటికాలముకంటె రాత్రులందుఁ బ్రొద్దెక్కువ యయ్యెను. "అహములు సన్నములయ్యెను, దహనుఁడు హితవయ్యె శీఘ్రదశలయ్యె నిశల్" భాగ.

తాత్పర్యము

ఉదయమున సాయంకాలమున మంచు విశేషించి యుండును, గావున జనులకు సంచారయోగ్యములు గావు. మధ్యాహ్నమందు జనులు సుఖముగ సంచరించుటకుఁ గొంచెము వేడిమిగల యెండ లొప్పుచుండును. చెట్లనీడలయందు సూర్యకిరణములు విశేషముగఁ దగులని కారణమున నీళ్ళు జల్లుమని తాఁకుటకే కష్టముగా నుండును. ఎండలు కొంచెముగా వ్యాపించుటచేతను మంచుచేఁ గప్పఁబడుటను జల్లనిగాలి విసరుటచేతను వనములందు మనుష్యసంచారము లేదు. ఇఁక వానియందలి పక్షులో వాయువునొప్పలచేఁ గిళ్లు పట్టుకుపోయినవారివలెఁ దమ యవయవములు ముద్దకట్టుకొని పడియుండును. పగ ళ్ళీవిధముగా జరుగుచున్నవి. రాత్రులందు బయలందుఁ బండుకొనువారు లేరు. పుష్యనక్షత్రమును జూచి ప్రొద్దు తెలిసికొనవలసియున్నది. రాత్రులు బూఁజుపట్టినట్లు తెల్లవాఱి చలిగాలిచే వృద్ధినిపొందుచున్నవి. పుష్యనీతము= పుష్యముతోఁ గూడిన పున్నమ ప్రధానముగాఁ గలది. పుష్యమాసమునకు సమీపించినవై.

రేలు వృద్ధిచెందెననుటచేఁ దమోగుణము ప్రధానముగాఁగల రాక్షసాదులకు వృద్ధియు, సాధుజనసంచారమాంద్యము, జ్ఞానహీనత గల కాలమును సూచించుచు రాక్షసబాధచే నిప్పుడు దేశమిట్లున్నదని భావము సూచితము.

కం. వావిరి నిజసౌభాగ్యం, బీ విధుఁ డర్కున కొసంగి ♦ హిమబిందువులన్
గావి గొని తేజ మఱె నో,టావిరిచే గ్రుడ్డియైన♦యద్దము పోల్కిన్. ౨౫౬

ఈ విధుఁడు=ఈ చంద్రుఁడు అనుటచే నింకను సూర్యోదయము కాలేదు. అంతకుముందే కదా స్నానముచేసి యర్ఘ్యమియ్యవలెను. నిజసౌభాగ్యము=లోకమునకు నాహ్లాదము కలిగించు తన శక్తిని, అర్కునకున్=సూర్యునకు, హిమబిందువులన్ = మంచు తుంపురులచే, కావిగొని = ఎఱ్ఱబాఱి, తేజమఱెన్ = కాంతిహీనుఁడయ్యెను, నోటావిరిచే=నోటితో నూఁదఁగా నా యావిరిక్రమ్ముటచే, గ్రుడ్డియైన = సరిగాఁ గానరాని, ఉపమాలంకారము.

తాత్పర్యము

ఆహ్లాదము కలిగించువాఁడు కావునఁ జంద్రునకుఁ జంద్రుఁడని పేరు. ఇప్పుడా పేరు తనకు వ్యర్థము చేసికొని లోకుల సంతోషింపఁజేయు శక్తిని సూర్యున కిచ్చెను. ఆ కారణముచేఁ దపనుఁ డను పేరు (తపింపఁజేయువాఁడు) సూర్యునందు వ్యర్థమై చంద్రునివలె నయ్యెను. అనఁగా సూర్యుఁడు చంద్రునివలెఁ బ్రజలకు సంతోషకరుఁడయ్యెను. చంద్రుఁడో మంచు కురియుటచే జనులకు బాధ కలిగించువాఁ డయ్యెను. అంతియగాక మంచుతుంపరలు వ్యాపించుటచేఁ జంద్రబింబము నోటియావిరి క్రమ్మఁగా

గ్రుడ్డియైన యద్దమువలెఁ గానవచ్చును. వ్యతిరేకాలంకారము. ఐశ్వర్యవంతుఁడని పేరుగల యింద్రుఁడు తన యైశ్వర్యమును రావణాసురుని కిచ్చి తాను దేజోహీనుఁడై యున్నాఁడని సూచితము.

తే. నిండుపున్నమనాఁటివెన్నెలలరేయి, యినముచే మలినం బయి యెలమి నీయ
దెండఁ గావిరివాఱిన పృథివికన్య, మాడ్కి నుండియుఁ దత్కాంతి మహిమ లేదు.

ఇనము = మంచు, హిమశబ్దభవము.

తాత్పర్యము

నిండుపున్నమనాఁటిరాత్రి మంచుచే మలినమగుటచే సంతోషము గలిగింపకున్నది. ఇది యెండచేఁ గావిగొన్న సీతాదేవివలె నున్నదికాని యామె కున్న కాంతిమాత్రము లేదు. దీనిచే సీతాదేవి యెండఁగొట్టుపడినను గాంతి యుత్సాహము గోలుపోయినదికాదు, అని యేర్పడుచున్నది. దీనిచే సీతాదేవి రావణుచే బాధింపఁబడినను దేహము గాసిపడినను ముఖవర్చస్సు, మనస్సునందలి ధైర్యోత్సాహములు గోలుపోదని వ్యంగ్యము.

కం. సహజంబుగ శీతలుఁడై, మిహికాయోగమున నిపుడు మిహిరకులేంద్రా
రహి ద్విగుణితశీతలుఁడై, యహర్ముఖములందుఁ బశ్చిమానిలుఁ డొప్పెన్.

పశ్చిమానిలుఁడు=పడమటిగాలి, సహజముగ=స్వభావముచేతనే, శీతలుఁడై=చల్లనివాఁడై, మిహికాయోగమునన్ = మంచుతోఁ గూడుటచే, ద్విగుణీకృత శీతలుఁడై=ఇబ్బడించిన చలిమిరి కలవాఁడై, అహర్ముఖములందున్=ఉదయకాలములందు.

తాత్పర్యము

పడమటిగాలి స్వభావముచేతనే చల్లనిది, (౧) వాయువునకు శీతస్పర్శ స్వభావసిద్ధమని గోవిందరాజీయము, (౨) వాయువున కనుష్ణాశీతస్పర్శము స్వభావమని తీర్థీయము. వాయువునందు వేఁడిమి కాని చలిమిరి కాని స్వభావముగ లేదు. ఉష్ణపదార్థసంగతిచే గాలియు వేఁడియగును, శీతపదార్థసాంగత్యముచేఁ జల్లనగును. తేజస్సు జలము వాయువునకు వెనుకఁ బుట్టినవే కదా. అయినను ఉదయకాలమందు వేఁడిమిగలిగించు సూర్యకిరణములు లేవు. రాత్రులందు వేఁడిమిపోయి యుందు ముఖ్యముగ నాలుగవజామున నెండకాలమందును గాలి చల్లగానే వీచును. ఇప్పుడో దానికిఁదోడు మంచుబిందువులును జేరినవి. కావున నుదయమువేళ గాలి యిబ్బడించిన చలిమిరి కలదై యుండును.

శ్రీరామచంద్రమూర్తి స్వభావముచే దయగలవాఁడు, శాంతుఁడు. క్రోధమాహారయ తీవ్రం వధార్థం సర్వరక్షసా మ్మన్నట్లు రాక్షసవధవేళ నాకార్యము నిమిత్తమై కోపము తెచ్చుకొనును. ఇప్పుడు ఋషీశ్వరులు తమబాధలు చెప్పుకొనుటచే నాయన దయాగుణ మతిశయించినదని భావము.

భగవంతుఁడు స్వాభావికముగఁ గృపాళు వనియు రామావతారకాలమున బ్రహ్మాదిస్తోత్రముచే నాయనకృప మఱింత యధికమయ్యెననియు ఋష్యాశ్రమ ఋషుల ప్రార్థనచే నది మఱింత యధికతరమైనదనియు సూచితము. గోవిందరాజీయము.

కం. యవగోధూమవిరాజిత, మవు బాష్పచ్ఛన్నవిపిన ♦ మర్కోదయమం
దవిరళక్రౌంచీసారస, రవముల శోభిల్లఁ దొడఁగె ♦ రాఘవ కంటే! ౨౫౮

యవగోధూమ విరాజితము = యవలచేతను గోధుమలచేతను, (ఈ పైరుచే) ప్రకాశించునది, బాష్పచ్ఛన్నవిపినము = మంచుతుంపరలచేఁ గప్పఁబడిన యడవి, అర్కోదయమందు = సూర్యోదయకాలమున, అవిరళక్రౌంచీసారసరవములన్ = దట్టములయిన ఆఁడు క్రౌంచపక్షులయు బెగ్గురులయు ధ్వనులచే, శోభిల్లఁదొడఁగెన్ = ప్రకాశింపఁ బ్రారంభించెను.

తాత్పర్యము

యవగోధూమములపైరుచేఁ బ్రకాశించుచు మంచుబిందువులచేఁ గప్పఁబడిన యడవి సూర్యోదయసమయముకాఁగా ఆఁడు క్రౌంచపక్షులు బెగ్గురులు వీనిధ్వనిచేఁ బ్రకాశించుచున్నది.

మంచుకాలమున నీటిమీఁదనుండి యావిరిలేచునట్లు పైరులమీఁదినుండియు నావిరిలేచి పొగవలెఁ గానవచ్చుచుండును.

యవగోధూమవిరాజితము; బాష్పచ్ఛన్నమైన విపినము అనుటచే రావణుబాధకు వెఱచి లోకము గగ్గురుపాటొంది కన్నీరు గార్చుచుండెనని సూచించును.

అర్కోదయము – రామజననము సూచించును.

క్రౌంచీసారసనినాదములు = రాత్రివేళ మంచునకు వెఱచి గూళ్ళలోఁ బడియుండిన ఆఁడు క్రౌంచములు బెగ్గురులు సూర్యోదయమున సంతోషముచే నెలుఁగు నిచ్చినట్లు రావణునిచే బాధింపఁబడిన స్త్రీలు పురుషులు రాముఁ డుదయించెను. రావణుఁడు చచ్చెనని సంతోషముతో ధ్వనించిరని సూచితము.

బాష్పశబ్దముచే రామకృప సూచితము. యవగోధూమయనుటచే ఋషితపోవృద్ధి సూచితము రవములనుటచే వేదాధ్యయనము సూచితము. ఇఁకఁ బై రామకృపాతిశయముచే ఋషుల తపస్సులు వర్ధిల్లి యాశ్రమములు వేదఘోషములు గలవగునని సూచితము. గోవిందరాజీయము.

తే. కలితఖర్జూరసుమములు ♦ కాంతి గలిగి, పూర్ణతండుల మగు శిరం ♦ బును నొకింత
వంచి యపరంజిబంగరు ♦ వన్నె మెఱసి, యున్న వరిపైరుఁ గంటి వే ♦ యుల్ల మలర.

కలితఖర్జూరసుమములకాంతి = అందమైన ఖర్జూరపుష్పముల కాంతి, పూర్ణతండులము = వడ్లగింజలతో నిండినది, ఉల్లము + అలరన్ = మనస్సునకు సంతోషము కలుగునట్లు.

తాత్పర్యము

ఖర్జూరపుఁ బూలవంటి కాంతి గలిగి యెన్నులు వడ్లగింజలతో నిండి యీ బరువునఁ దలలువంచి పండుటచే నపరంజి బంగారువన్నె గలిగిన పైరు చూచితిరా ?

విద్య యొసఁగును వినయమన్నట్లు సుజనులందు విద్యాధనసంపత్తి వర్ధమగు కొలఁది వినయము హెచ్చుచుండును, అని సూచితము. జడలుగల వృద్ధఋషులును శ్రీరామచంద్రమూర్తికి నమస్కరించెద రని సూచిత మని గోవిందరాజీయము.

తే. మంచుతుంపర బెరసి వ్యా ♦ పించు చున్న
　కిరణములతోడ సూర్యుఁడు ♦ కరము దవ్వు
　నంను నభ్యుదితుం డయి ♦ చందమామ
　పోలె నున్నాఁడు కనుఁగొమ్ము ♦ పుణ్యశీల.　　౨౬౧

అభ్యుదితుఁడు = ఉదయించినవాఁడు.

తాత్పర్యము

సూర్యుఁ డుదయించినను మంచంతయుఁ బోలేదు. తుంపరగా సన్నగా వ్యాపించియే యున్నది. ఆ కారణముచే సూర్యుఁ డుదయించి చాలఁ బ్రొద్దెక్కినను జందమామవలె నున్నాఁడు.

నీ వడవికివచ్చి బహుకాలమయ్యును, దుర్బలునివలె రాక్షసులచే నేల యవమానింపఁబడుచు నూరకున్నావని సూచితము.

తే రామ పూర్వాహ్ణమునఁ బస ♦ యేమి లేక
　హాయిగా మేను సోఁకి మ ♦ ధ్యాహ్న వేళఁ
　గించిదాపాండురంబులు ♦ నించుకంత
　మెఱుపులై యున్నయవి చూడు ♦ మెండ లిపుడు.　　౨౬౨

పూర్వాహ్ణమునన్ = మధ్యాహ్నమునకు ముందటికాలమునందు, పస = సత్త, కించిత్ + ఆ పాండురంబులు = కొంచెము తెల్లనైనవి.

తాత్పర్యము

శ్రీరామచంద్రా ! మధ్యాహ్నమునకు ముందు ఎండ వేఁడిమిలేక సుఖముగా దేహమునకు సోకుచు మధ్యాహ్నమందుఁ గొంచెము తెలుపు కొంచె మెఱుపునై సూర్యకిరణము లున్నవి.

రాక్షసులు వర్ధిల్లి నీశక్తి లోకమునకుఁ గానరాకుండఁ జేయుచుండఁగా శక్తిగలిగియు వారి నుపేక్షించి యూరకుండుట సరిగాదని సూచితమని గోవిందరాజీయము.

తే. ఇవము తువ్వర రాలుట ♦ నించుకంత, తడిసి యున్నట్టి పచ్చిక ♦ తావులందు
　హేళి యీరెండ ప్రాలిన ♦ లీలఁ గంటె, మంచుబొట్టులు వజ్రాల ♦ మాడ్కిఁ దనరె.

ఇవముతువ్వర = మంచుతుంపర, హేళి = సూర్యుఁడు, ఈరెండ = కొంచెము ఎండ.

తా త్ప ర్య ము

మంచుతుంపర రాలుటచేఁ గొంచెము తడిసియున్న లేఁబచ్చిక పట్టులందు సూర్యుని యీరెండ పడినవిధము చూచితివా! సూర్యకాంతి యా బిందువులపైఁ బడుటచే నవి వజ్రాలవలెఁ గానవచ్చుచున్నవి.

రాక్షసోపద్రవముచేత ఋషులు దుఃఖింపఁగా నాపై రాముని కృపగల్గుట సూచిత మని గోవిందరాజీయము.

తే. అడవియేనుఁగు పెనుదప్పిఁ ♦ బడియు మిగులఁ
జిల్లు మని యున్ననీటిని ♦ నల్ల యదిగో
నంటియును ద్రావకయ తొండ ♦ మల్ల ముడుఁచు
కొనుచు నున్నది తిలకింపు ♦ కులవతంస. ౨౬౪

పెనుడప్పిఁబడి యు=మిగుల దాహముగొనియు, జిల్లుమని= చల్లగా (అనుకరణ శబ్దము), కులవతంస = సూర్యునివంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుఁడా!

తా త్ప ర్య ము

అన్నా! యీ యడవి యేనుఁగును జూడుము. అది మిక్కిలి దప్పిచే బాధ పడుచుండి నీళ్లు ద్రావవలె నని తొండము కొనచే నీటిని దాఁకియు నది జిల్లుమని యుండుటచేఁ ద్రావక తొండమును ముడుచుకొనుచున్నది.

రావణభయ మధికముగా నున్నదనుట సూచితము, అని గోవిందరాజీయము. దేవత లిష్టభోగము లనుభవింప నెంతో కోరిక గలిగియు ననుభవించుటకై భోగ్యములఁ దాఁకియు రాక్షసభయముచే మానుకొనుచున్నా రని భావము.

తే. నీటిపక్షులు గూర్చుండి ♦ నీటివెంట
మునుఁగఁగా జంకుచున్నవి ♦ యనఘచరిత
దురమునను గోఁచలగువారు ♦ చొఱఁగలేని
తీరు దలపించుచును వాని ♦ తెఱఁగుఁ గంటె. ౨౬౫

దురమునను = యుద్ధమందు, కోఁచలు=పిఱికులు, తలపించుచును = జ్ఞప్తికిఁ దెచ్చుచు.

తా త్ప ర్య ము

నీటిపక్షులు ఎప్పుడు నీళ్ళలో నుండునవియైనను నీటివెంటఁ దీరమునఁ గూర్చుండి నీటిలో దిగుటకు భయపడుచున్నవి. వీనినిజూడఁ బిఱికివారు యుద్ధరంగమునఁ బ్రవేశింప జంకువిధమును జ్ఞప్తికిఁ దెచ్చుచున్నవి.

యుద్ధమునం దాఱితేఱి లక్ష్యములేనివాఁడ వయ్యు రాక్షసులతోడి యుద్ధమునకు శంకించుచుండుటచే నీవు పిఱికివలెఁ గానవచ్చెద వనియు నా జంకు వదలి పూనిన కార్యము నిర్వహింపు మనియు భావము.

కం. లో నీహారపుఁజీఁకటి, పైని యవశ్యాయతమము ♦ పటుగతిఁ గప్పం
గా నిద్రించెడివిధమునఁ, గాననము విపుష్ప మగుచుఁ ♦ గ్రాలెడి నన్నా. ౨౬

నీహారపుఁ జీఁకటి = మంచు అనెడి యంధకారము, అవశ్యాయ = మంచు యొక్క, తమము = చీఁకటి, పటుగతిన్ = విస్తారముగ, విపుష్ప = పుష్పములు లేనిది, మంచుచేఁ బూ లన్నియుఁ జెడి రాలిన వని యర్థము.

తాత్పర్యము

లోపలను బయటను మంచు అనెడి చీఁకటి, విస్తారముగఁ గప్పఁగా నడవి పూలులేని దగుచు నొప్పియున్నది. అన్నా ! చూచినావా ?

మంచుకురియుటచే నానీటిబరువునకు ఆకులు చిగుళ్లు కదలమిని నడవి చీఁకటి క్రమ్మఁగా నిదురించువారివలె నున్నది. మీఁద గ్రమ్మిన మంచుటావిరి నిదురించువారు దుప్పట్లు కప్పుకొన్న ట్లున్నది. పుష్పములు లేకుండుటచేఁ గన్నులు మూసికొన్నట్లున్నవి. ఈకారణముచే వనములు నిదురపోవుచున్నట్లున్నవి. గోవింద రాజీయము, ఉత్ప్రేక్షాలంకారము.

నిద్రించువారికి రాత్రికాలపుఁ జీఁకటియు నిద్ర యనెడి చీఁకటియు రెండును నావశ్యకములే. అప్పుడు వారు కన్నులు మూసికొని నిద్రింతురు. ప్రకృతము రెండు విధములయిన మంచు లనెడి రెండు చీఁకట్లు క్రమ్ముకొనఁగా నడవి నిద్రించున ట్లుత్ప్రేక్షింపఁబడెను. విపుష్ప మనుట కన్నులు మూసికొనుట సూచితము. మహేశ్వర తీర్థీయము.

కం. ఆవిరి గ్రమ్మినసీటను, రావముచేఁ దెలియఁబడెడి ♦ రహిఁ బెగ్గురులన్
దూవరమంచునఁ దడిసిన, యీ వాలుకపంక్తి నేఁడు ♦ లలరెడిఁ గనుమా. ౨౭

తూవర = తుష్వార తుంపర, వాలుకపంక్తి = ఇసుక వరుస

తాత్పర్యము

నీళ్లలో నుండు బెగ్గురుపక్షులు మంచుయొక్క యావిరి కప్పుటచే వెలికిఁ గానరాకున్నను వాని ధ్వనులచేఁ దెలియఁబడుచున్నవి. భూమియో మంచుతుంపరలచేఁ దడిసియున్నది.

ఇందు నదు లనుటచే ఋషులను గ్రహింపవలెను. ఏటినీళ్లావిరిచేఁ గప్పఁబడుట, బెగ్గురులు ధ్వనులచేఁ దెలియఁబడుట వీనిచే ఋషు లాశ్రమంబులందే యుండి దుఃఖాక్రాంతులై వెలికివచ్చిన రాక్షసులు చంపుదు రను భయముచే దాఁగి మూలుగుచుండుట సూచితము.

కం. ఇవ మిదె పయిపయి రాలుట, రవికరములు మృదువు లగుట ♦ రామా చలికిన్
బ్రవిమల మగు శిలమీఁదం, దవిలినసలిలములు రసవి♦ ధంబుగ నయ్యెన్. ౨౮

రవికరములు = సూర్యకిరణములు, మృదువులు = వేఁడిమిలేనివి, సలిలములు = జలములు, ఇవము = హిమము.

తాత్పర్యము

మీఁదమీఁద మంచు రాలుటచేతను సూర్యకిరణములందు వేఁడిమి లేకుండుటచేతను రామచంద్రా! నిర్మలమగు కొలమీఁదఁ బడిన నీళ్ళుగూడ విషములయియే యున్నవి.

మీఁదమీఁద మంచుగురియుట మీఁదమీఁద రాక్షసులు పైఁబడి వచ్చుట. సూర్యకిరణములు వేఁడిమిలేకుండుట నీవు మాంద్యము వహించుట. కావునఁ గొండలమీఁదనుండు ఋషులుగూడ దుఃఖింపవలసివచ్చెను.

రసమనఁగా విషమనుటకు, "శృంగారముఖ్యమధురాది సువర్ణ రేతో నిర్యాస రాగ గరళ ద్రవపారదేషు" నానా॥ర॥

కం. ప్రాలేయధ్వస్తంబును, జాల జరాజర్ఝరితము ♦ జాతెడి కింజ
ల్కాళియును బిసశేషంబగు, నాళీకముతోడఁ గొలను ♦ నాశౌనఁ బొసఁగె. ౨౬

ప్రాలేయధ్వస్తంబు = మంచుచే నాశముచేయఁబడినది. జరా = ముసలితనముచే, జర్ఝరితము = సంధికాంతి చెడినది, కింజల్కాళి = అకరువులు, దుద్దులు (దిమ్మెలు), బిసశేషము = తామరకాఁడమాత్రము మిగిలినది, నాళీకము = తామర, నాశౌనమున్ = అందమును, కమలములకు మంచుకాలము నాశకాలము.

తాత్పర్యము

తామరపువ్వులు మంచుగాలముగుటచే మంచుచే నందము చెడి వాడి కాంతిఁ బాసి యకరువులు దిమ్మెలు రాలిపోఁగాఁ గాఁడలమాత్రము మిగిలిన తామరలతోఁ గొలఁకు లందము చెడియున్నవి.

ఇచ్చటఁ గొలఁకులు ఋష్యాశ్రమములు, రాక్షసులు తమవారి నందఱను జంపఁగా ముసలివారై యుంటరిసంటరిగా ఋషులు మిగులుటచే నందము చెడిన యాశ్రమముల విధము సూచితము.

అవతారిక:—ఇంతవఱకు శ్రీరాముల యుపేక్షచే ఋషీశ్వరులు పడుబాధలు వారుండుస్థితి యన్యాపదేశముగఁ జెప్పఁబడెను. ఇఁక నక్కడ నయోధ్యలో భరతుని స్థితిఁ దెలుపుచు నాయనను జూడఁబోవుకాలము సమీపించుచున్నది కావున నీ విందువచ్చిన కార్యము పూర్ణముచేయ యత్నింపుమని హెచ్చరించుచున్నాఁడు.

చం. కన నిటు పుండువంటి చలి ♦ కాలమునన్ భరతుండయోధ్యలో
ఘనతరదుఃఖవేదనను ♦ గ్రాఁగుచు, రాజ్యము మాని, భోగముల్
గొనక, తపస్వియై, నిదురఁ ♦ గూరుచు నేలనయిన్, మితాన్నమున్
గొనుచును, నీపయిం గలుగు ♦ కూరిమి పెంపున నున్నవాఁడుగా. ౨౭

క్రాఁగుచున్ = తపించుచు.

తాత్పర్యము

ఇటువంటి పుండువలె బాధాకరమైన మంచుకాలమందు నయోధ్యలో మిగుల

దుఃఖబాధచేఁ దపించుచు రాజ్యసంపద వదలి భోగములాసింపక, యుపవాసము లుండి జడలు నారలు ధరించి మంచములు పఱుపులు వదలి యారుబయట నేలమీఁదఁ బండుకొనుచుఁ గొంచెముగా ఫలాదులు దినుచు నీపయిఁగల భక్తిచే భరతుఁడు నవయుచున్నాఁడు గదా.

క౦. ఇదియే వేళ కతండును, నిదురన్ మేలుకొని దేటి ♦ నీట మునుంగన్
గదుకొని ప్రకృతులు గొలువఁగ, సదమల మతిఁ జనుచు నుండు ♦ సరయువుఁ జేరన్.

ప్రకృతులు = మంత్రులు మొదలగువారు, కొలువఁగన్ = ఆయనపైనున్న భక్తిగౌరవములచే నా సమయమందును సేవించి వెంట రాఁగా.

తాత్పర్యము

అన్నయ్యా! మనము లేచినవేళకే భరతుఁడును నిద్రలేచి సరయూనదిలో స్నానముచేయుటకై మంత్రులు మొదలగువారు చుట్టు క్రమ్ముకొని సేవింపఁగా నిర్మలమగు మనస్సుతోఁ బోవలసివచ్చెనే యను విచారములేక పోవుచుండును గదా.

భరతుఁడును వానప్రస్థధర్మ జరుపుచు నందిగ్రామంబున నున్నవాఁడు. ఆశ్రమ స్వీకారము చేయలేదు కావున నాయన గ్రామమందుండుట దోషముగాదు, ఇంట నుండియు సన్న్యసివలె వర్తింపవచ్చును గదా.

క౦ గారామునఁ బెరిగిన సుకు, మారుఁడు భరతుండు సుఖము ♦ మఱిగిన యాతం
డేరీతి నపరనిశలన్, సారసనయనుండు క్రుంకు ♦ సరయువునందున్. ౨౯

గారామున = అల్లారు ముద్దుగా, పెరిఁగిన = తండ్రి భరతుని ప్రేమతోఁ బెంచెను. నీ వన్నను నతని విశేషప్రేమచేఁ బెంచితివి, సుకుమారుఁడు = ప్రేమరస భరితములయిన నీ చూపులు మీఁద సోఁకినను వాడిపోవునంతటి కోమలదేహము గలవాఁడు, అపరనిశలన్ = అపరరాత్రములందు, కాలవిధవలగు స్త్రీలు మనుష్యులు తమ ముఖమును నుదయముననే చూచిన జారత్వమున మగనిఁ జంపిన యీ ముండ ముఖము ప్రొద్దుననే చూచితిమి. నేఁడేమో కీడు కలుగునని యెల్లు తమ్ము దూషింతురని యెవరు నిద్రలేవకముందే లేచి వెలికార్యములు తీర్చుకొందురో యట్లే జనులు నిద్రలేచిన తరువాతఁ దానును లేచి బయటవచ్చినఁ దన ముఖముఁ జూచువారు ఈ పాపివలనఁ గదా రాజ్యమునకు శ్రీరామచంద్రమూర్తికి నింతకష్టము వచ్చెనని దూషింతురని భయపడి మనుష్యసంచారములేని యపరరాత్రులందు స్నానమునకుఁ బోవునని భావము. సరయువునందుఁ గ్రుంకున్ = సరయువు వేగముగాఁ బాఱుచున్నను తాఁబేళ్ళు విశేషముగ నున్నను మనస్సునందు గల దుఃఖాతిశయముచే దానిని లక్ష్యపెట్టక నిర్భయముగా మునిఁగి స్నానముచేయును. సారసనయనుండు = కమలములు రాత్రివేళ ముకుళించును.

అట్లు హాయిగా నిద్రింపవలసిన కాలమందు నేటి చల్లని నీటిలో మునుఁగును, క్రుంకున్ = మునుఁగును. ఒడ్డుననుండి చెంబుతో నీళ్ళుముంచి పోసి

కొనుటకాదు, నీళ్ళలో మునుఁగును. ఎంతసేపు? ఎంతలోఁతున మునిఁగినఁ బరులు వెలుపలికిఁ దీసికొని రావలసియుండునో యంతసేపు మునుఁగును. ఇటువంటి వాఁడెల్లు చల్లని యేటినీళ్ళలో మునుఁగును అని లక్ష్మణుఁడు సందేహించుచున్నాఁడు. ఏలనఁ దనకు రామవిరహతాపము లేదు, ఇతరవిచారము లేదు. కనుక లక్ష్మణునకు నీళ్ళు చలి యని వేఁడిమి యని తెలియుచున్నవి. కావునఁ దనవలెనే భరతుఁ డనుకొని సందేహించుచున్నాఁడు. కాని రామవియోగతాపవహ్ని లోపలఁ బ్రజ్వరిల్లుటచే వెలుపలిచలి యాయన మనస్సునకుఁ దగిలినదే కాదు. అదియును గాక 'ఉపతప్తోదకా నద్యః' యను రామవిరహముచే నదులు కూడఁ దపించినవియని యుండుటచేఁ జలిప్రశంసయే లేదు. తీవ్రమనోవేదన గల కాలములో వెలుపలి సుఖదుఃఖములు మనస్సున నంటవు.

సీ. మహనీయతరసుకు ♦ మారుండు వీరుండు, సురుచిరానుదరుండు ♦ సుందరుండు
రాజితసద్ధ ♦ ర్మజ్ఞుండు, ప్రాజ్ఞుండు, సత్ప్రమదాపాది ♦ సత్యవాది
నిర్దుష్టకార్యక ♦ నిరతుండు భరతుండు, మత్తారిమదశోషి ♦ మధురభాషి
యాజానుదీర్ఘబా ♦ హుం డరాగుండు, హ్రీసమేధుండు జి ♦ తేంద్రియుండు

ఆ. భక్తిమేదురుండు ♦ భవదీయసోదరుం, డఖిలభోగరాశి ♦ యాసఁ బాసి
స్వర్గమును జయించె ♦ వనసీమఁ జరియించు, నిన్నుఁబోలి తపము ♦ నిష్ఠఁ దాలి.

మహనీయతర సుకుమారుండు = మిక్కిలి యతిశయించిన కోమలదేహము గలఁవాఁడు. పెద్దకొడుకవని నిన్నుఁ బెంచిన గోమునకంటెఁ దన ప్రియురాలగు కైక కొడుకను కారణమునఁ బ్రీతికొను, ఏమి యుపేక్షించినఁ గైక కోపించునో యను భీతిచేతను నెక్కువ గోమున మనతండ్రిచే పెంపఁబడినవాఁడు మహనీయ సుకుమారుఁడు, వీరుండు=అంతటి సుకుమారుఁడయ్యు యుద్ధరంగమున నెంతగాసికైన నోర్చు పరాక్రమముగలవాఁడు సురుచిరానుదరుండు=సుందరమై స్వల్పమైన కడుపు గలవాఁడు. సుకుమారులు కష్టముచేయక తిండిమాత్ర మెక్కువ దినుటచేఁ బొట్టలు ముందటికి వచ్చియుండును. ఈయన కట్టులేక, అనఁగా కడుపే లేదని యర్థము కాదు. ఉదరము స్వల్పముగా నున్నదని యర్థము. నకారమునకు అల్పమనియు నర్థము గలదు. హేరంబేనః పుమాన్నాస్త్రీ నాభావం జ్ఞానవాద్యయోః వంధ్యానూక్ష్మ పరిక్షిప్త శూన్యభేదేషు నస్త్రిషు, నానా॥ ర॥ న+ఉదరుఁడు = అనుదరుఁడు, నకారమునకుఁ బరముగ వృత్తియందు నచ్చువచ్చెనేని 'న' అన్ అగును, అనుదరుఁ డనఁగా అరచేతివలె లోపలికిఁబోయియుండు కడుపుకలవాఁడు, సుందరుఁడు = అందగాఁడు, రాజిత ధర్మజ్ఞుఁడు=ప్రకాశించు సమస్తధర్మములు తెలిసినవాఁడు, ప్రాజ్ఞుఁడు= చదువుటచేఁ దెలియుట మాత్రమే కాదు. వానిని జక్కఁగా నాలోచించి యవలోడనము చేసినవాఁడు, సత్+ప్రమదాపాది = సత్పురుషులకు సంతోషము గలిగించువాఁడు, సత్యవాది=ఇతరులకు సంతోషము గలిగింపవలయునని యసత్యము చెప్ప

వాఁడునుగాఁడు. నిర్దుష్ట = దోషములేని, కార్యైక = కార్యములందే, నిరతుండు = అతిప్రీతిగలవాఁడు, మత్తారి మదశోషి = మదించిన శత్రువుల గర్వమును నెండ జేయువాఁడు, మధురభాషి = శత్రువుల గర్వము నణఁచుటయందును కఠినముగ మాటలాడువాఁడు కాఁడు, ఆ + జాను + దీర్ఘ బాహుఁడు = మోఁకాళ్ళవఱకుఁ గల నిడుపులైన చేతులుగలవాఁడు, అరాగుండు = మాత్సర్యము లేనివాఁడు, 'రాగోను రాగో మాత్సర్య'యని నిఘంటువు, హ్రీనిషేధుండు = చేయరాని పనులు చేయుట యందు సిగ్గుపడువాఁడు, జితేంద్రియుండు = ఇంద్రియముల జయించినవాఁడు, భక్తిమేదురుండు = నీయందు గాఢమైన భక్తిగలవాఁడు, భవదీయ సోదరుండు = నీ తోడఁ బుట్టినవాఁడు, తమ్ముఁడు, అఖిలభోగరాశి = సమస్తభోగముల కుప్పయైనవాఁడు.

తాత్పర్యము

నీకంటెను మిగుల సుకుమారుఁడును వీరుఁడును పలుచని కడుపుగలవాఁడును చక్కనివాఁడును కావునఁ గష్టింపఁదగినవాఁడును, సమస్తధర్మములు తెలిసిన వాఁడును, వానిని జక్కఁగ నవలోడనము చేసినవాఁడును, సజ్జనులకు సంతోషకరుఁడును, సత్యవాదియు, దోషములేని కార్యములఁ జేయువాఁడును. మదించిన శత్రువుల గర్వ మణఁచువాఁడును, తియ్యని పలుకులు పలుకువాఁడును, మోఁకాళ్ల నంటు చేతులు గలవాఁడును, మాత్సర్యము దుష్క్రమము లేనివాఁడును, చేయరానిపనులు చేయుటయందు సిగ్గుపడువాఁడును, ఇంద్రియజయము గలవాఁడును, గాఢభక్తి గల వాఁడును, అఖిలభోగముల రాశియగువాఁడును నగు నీ తమ్ముఁడు భరతుఁడు ఆశను వదలి యడవియందుఁ దపించు నీవలెఁ దపమున నిష్ఠఁ బూని స్వర్గమును దిరస్కరించిన వాఁడయ్యెను.

నిద్రాహారము లుజ్జగించి, యుపవాసతపఃక్లేశముల బుజ్జగించి నీవిరహతాపాతిశయమున దేహము విడిచినేని తపఃఫలముగ స్వర్గ మెచ్చట దాపరించునో యది నీ దర్శనమునకు విఘ్నకారి యగుటయే గాక నీ దర్శనమువలనఁ గలుగు ఫలముతో నది సరికాదు కావునఁ బ్రాణములు పోకుండ బిగఁబట్టుకొనియున్నాఁడు.

ఇట్లు నీ వడవులకు వచ్చి దీర్ఘకాలమైనను నీవు సంకల్పించిన ప్రకారము ఋషులు గోరినప్రకారము, రాక్షసవధయుఁ జేయవైతివి. నీకై ప్రాణములు బిగఁ బట్టుకొనియున్న తమ్ముని నాదరించిన వాఁడవు కావైతివి. కాలమా సమీపించు చున్నది. పెట్టుకొన్నకార్యమా బహుప్రయాస సాధ్యమైనదని హెచ్చరించి యందఱ యన్ని యనర్థముల మూలకారణమైన కైకను నిందించుచున్నాఁడు.

చం. మనుజులలోనఁ దండ్రిని గు ♦ మారుఁడు పోలఁడు, పోలుఁ దల్లినే,
యనియెడి లోకవార్త వృథ ♦ యై చనెఁ గైకయిపట్టి యందు; నే
మన నుతశీలి యాజి పతి ♦ యె, గుణియౌ భరతుండు పుత్త్రుఁడై
చనియెడి కైక యట్టి ఖల ♦ శాతమనస్విని యౌట యెట్లొకో. ౨౭౪

యాజి = దశరథుఁడు, ఖల = దుష్టురాలు, శాతమనస్విని = తీక్ష్ణమైన మనస్సు గలది, ఇట్టి = అంతటి ఘోరకార్యము చేయఁ దెగించినది.

తాత్పర్యము

ధన్యా పితృముఖీ కన్యా, ధన్యో మాతృముఖ స్సుతః.

తండ్రిని బోలిన కూఁతురు తల్లినిబోలిన కొడుకు ధన్యులని సామెతయుండఁగా, సముద్రములోఁ గలిసిన నీరు సముద్రమువంటిది కావలసియుండఁగా ధర్మస్వభావుఁడైన దశరథునకు భార్యయై యిటువంటి సుగుణసంపత్తిగల కొడుకునకుఁ దల్లియగు కైక యింతటి దుష్టురాలు, వాఁడిగల మనస్సుగలది యెట్లయ్యెనో.

సీతారాములు నిష్కారణముగ మంచులో గాలిలో నెండలలోఁ బడెడి కష్టములు చూచి సహింపలేక వీనికి మూలకందమైన కైకను దూషింపఁదలఁచి యారంభమందే యామె పేరెత్తిన శ్రీరామచంద్రమూర్తి కోపించునని తోఁచుత "అనారంభో మనుష్యాణాం ప్రథమం బుద్ధిలక్షణమ్, ఆరంభస్యాంతగమనం ద్వితీయం బుద్ధిలక్షణమ్॥ ఒక కార్యమునకుఁ బూనుకొనకయుండుట మొదటి బుద్ధిలక్షణము. పూనుకొనినా నాంతముగ నెఱవేర్చుట రెండవ బుద్ధిలక్షణము, అను న్యాయము ననుసరించి పూనినకార్యము నెఱవేర్చవలెనన్నావని యన్యాపదేశముగ హెచ్చరించి యుపమానముచే భరతుని ప్రస్తావన దెచ్చి దాని కనుగుణముగఁ గైక ప్రశంస తెచ్చి యామెను లక్ష్మణుఁడు నిందించుచున్నాఁడు.

లక్ష్మణుసందేహము న్యాయమైనదే కాని రామలక్ష్మణ భరతశత్రుఘ్నుల జన్మమునకు బీజము కారణముగాదు. క్షేత్రము కారణముగాదు. పాయసరూపము వహించిన భగవత్తేజము కారణము కావున తల్లిదండ్రుల గుణములు వీరి నంటవలసినది లేదు.

చం. అన విని కైక నేల దురు ♦ సాడఁగ! రాఘువవంశనాథు త
త్తనయుచరిత్రేఁ జెప్పుము ము ♦ దం బగు, నే వనవాసవిఘ్నపై
మనము దిటంబు చేసియును ♦ మాన్యుని నబ్భాతుం దలంచినక్
వనటను మానసంబు కడు ♦ బాలిశవృత్తి భజించు లక్ష్మణా. ౨౬౫

అనక్ = తనయందలి భరతునందలి ప్రేమచే నిట్లు చెప్పఁగా, దురుసు + ఆడఁగక్ = కఠినవాక్కులు పలుకఁగా. రాఘువవంశనాథుతత్తనయుచరిత్ర = రఘువంశమున బుట్టినవారిలో గొప్పవాఁడైన, తత్ = ఆ కైకయొక్క, తనయు చరిత్ర= కొడుకు వర్తాంతము, ముదంబగుక్ = సంతోషించెదను. ఆమెచేసిన కార్యము వలన మన కిప్పటి కేమియుఁ గీడు మూఁడలేదుగదా. నిష్కారణముగ నేల యామెను దూషింపవలెను! పుణ్యాత్ముఁడభరతునే ప్రశంసింపుము. "ఆస్ఫోటయంతి పితరః ప్రనృత్యంతి పితామహాః" యనుట యుట్టివాని విషయమేకదా, వనటను=శోకముచే, బాలిశవృత్తిని=పామరవ్యాపారమును, సంయోగవియోగములు దైవకృతములు, దేహి

స్వభావగుణములని తెలిసియు నది తెలియని పామరుఁడు దుఃఖించునట్లు దుఃఖింప మన స్సగుచున్నది.

తా త్ప ర్య ము

ఆ ప్రకారము లక్ష్మణుఁడు చెప్పఁగా లక్ష్మణా యేల నిర్నిమిత్తముగఁ గైకను దూషించెదవు. రఘువంశనాథుఁడగు నామె కొడుకును బ్రశంసింపుము. అది నాకు సంతోషముఁ గలిగించును. వనవాసము సాంతముగ నెఱవేర్చవలయునని మనస్సు దృఢము చేసికొనియును భరతుని దలంచినపు డయ్యో భరతునియొద్దకుఁ బోయిన బాగుండునే ఆయనను విడిచివచ్చితినే యని పామరులకు వలె నాకును దుఃఖము గలుగుచున్నది.

క౦. ఆమధురభాషణంబులు, నామహిత ప్రియోక్తి హృద్యమై యమృతరస స్తోమసిభం బయి యెప్పుడు, నామనమున మఱపురాదు నాయన వింటే. ౨౭౬

ఆ మధుర భాషణంబులు=ఆనాఁడు భరతుఁడాడిన తియ్యని మాటలు, ఆమహిత ప్రియోక్తి=ఉత్తమమధురమైనదు ప్రియములైన మాటలు, అమృతరసస్తోమసిభంబు= అమృతరస సమూహముతో సమానమై, ఎప్పుడు = ఏకాలమందును.

ఛందస్సు. మహితఽఇందలి తకారము లఘువు.

తా త్ప ర్య ము

నాయనా! లక్ష్మణా! కొందఱమాటలు కొంతవఱకు మధురములుగానే యుండును గాని తుదకు వియప్రియములై పరిణమించును. భరతునిమాట లట్టి యుచ్చక ములుగావు. కొన్ని పదార్థములు నాలుకకుఁ దియ్యగా నుండినను లోపలికిఁ బోయిన వికారకారణ మగుచుగదా, భరతునిమాట లట్టివిగాక యమృతమువంటివి. లోపలికిఁ బోయినను దేహారోగ్యము గలిగించు నోషధివంటివి. అదియును నొక చుక్క రెండుచుక్కలు గాదు. అమృతరసప్రవాహము గావున సర్వదా యాయన మాటలు నాకు నిప్పటికి మఱపురావు.

క౦. నిను భరతుని శత్రుఘ్నుని, జనకజ నేఁ గూడియుండు నెన్నఁడ మొన్నం
బొనరునొకో యని వగచుచుఁ, జనియెం గోతమికి రామచంద్రుం డపుడా. ౨౭౭

తా త్ప ర్య ము

నిన్ను భరతుని శత్రుఘ్నుని సీతను నేను గూడుకొని సంతోషముతో నుండు టెన్నఁడో కదా యని వ్యసనపడుచు గోదావరికి స్నానార్థమై శ్రీరామచంద్రమూర్తి పోయెను.

ఉన్నవారిని విడిచి లేనివారికై వగపనేల యనరాదు. ఇంటియం దేదైన పండుగు జరిగినప్పుడు పనిమంది కొడుకు లెదురుగానుండి యొకఁడు దూరముం దుండినను దల్లిదండ్రుల మనస్సు వానిమీఁదనే యుండును. ఆమాత్రమున నున్నవారిపైఁ బ్రేమ లేదనరాదు. చంద్రుని పదునాఱుకళలలో నొక కళ తక్కువైనను కొంతకొంత తయేకదా.

కం. చని సీతానుజయుతుఁడై, యినముని పితృదైవతముల ♦ కెరఁగి కృతాసే
చనుఁడై గిరిజానందులు, తనుఁ గొలువంగ నుండు రుద్ర♦తద్గతి నుండెన్. ౨౭౮

సీతానుజయుతుఁడై=సీతతోను దమ్మునితోను గూడినవాఁడై, ఇనముని పితృదైవతములకుఁ=సూర్యునకు ఋషులకు పితరులకు, దేవతలకు, ఎరఁగి=నమస్కరించి, కృతాసేచనుఁడై=స్నానముచేసినవాఁడై, గిరిజానందులు = పార్వతియు నందికేశ్వరుఁడు, రుద్రతద్గతి=రుద్రునివలె. రుద్రుఁడు=ప్రజలను ప్రలయమందు నేడిపించువాఁడు.

తాత్పర్యము

సీతాలక్ష్మణులతో స్నానము చేసివచ్చి సంధ్యాది కృత్యములను బ్రహ్మయజ్ఞమును జేసినవాఁడై పార్వతీ నందులతోఁగూడిన రుద్రునివలె నుండెను.

ఇచ్చట రుద్రుని నుపమానముగాఁ జెప్పుటచేఁ గాఁబోవు సంహారకార్యము సూచింపఁబడుచున్నది.

—♦ ౧౭-వ సర్గము. శూర్పణఖ శ్రీరాముని జూచుట. ♦—

ఉ. ఆహతలక్షణుండు వసు♦ధాత్మజ లక్ష్మణుఁ గూడి గౌతమీ
వాహినిఁ దాన మాడి నిజ♦పర్ణ కుటీరముఁ జేరి యందు ని
ష్ఠాహితకల్యకృత్యముల ♦ నన్నిటిఁ దీరిచి శాలలో వరా
రోహయుఁ దానుఁ దమ్ముఁడు ని♦రూఢమతిం జని యిష్టగోష్ఠికి. ౨౭౯

వనవాసమునకు సంకల్పించిన పదునాలుగు సంవత్సరములలో నిప్పుడు పదుమూఁడవ సంవత్సరము జరుగుచున్నది, అందిది మార్గశిరము.

తస్మిం త్రయోదశాబ్దాని, రామస్య సమతిక్రమః ।
గోదావర్యాస్తటే పుణ్యే, పంచవట్యాం మనోరమే ॥ పాద్మ.

ఏపాపిని సీతాసుఖలతా కుఠారమో, యెవతె సోదరవంశముస్తాకుద్దాలమో, యెవతె సీతాపాతివ్రత్య శ్రీరామకల్యాణగుణ బలపరాక్రమ రత్నములకు నికషోపలమో, యెవతె కాముకీవిధవలకు నెట్టిదండము సముచితమని లోకమునకు స్వానుభవమునఁ బ్రకటించెనో, చెడిపెలగు నాఁడుబిడ్డల మాట వినినఁ గొంపలు గూలుననుటకు నెవతె లక్ష్యభూత యయ్యెనో యట్టి శూర్పణఖ వచ్చుట యిఁకఁ జెప్పఁబడును.

ఆహతలక్షణుండు=గుణములచే ప్రసిద్ధిచెందినవాఁడు శ్రీరామచంద్రమూర్తి, గౌతమీవాహినిఁ=గోదావరియందు, తానము=స్నానము, ఆడి=చేసి, నిజపర్ణకుటీరముఁ=తనయొక్కకుటీంటెని, నిష్ఠా-హిత-కల్య-కృత్యములఁ=శ్రద్ధచేఁ జేయఁబడిన ప్రాతః కాలమునఁ జేయదగిన కార్యములను, హోమము, బ్రహ్మయజ్ఞాదులని కొంద ఱనిరి. రాముఁడు సూర్యోదయమునకుఁ బూర్వము హోమము చేయువాఁడని ముందు వ్యాఖ్యాతలు వ్రాసిరి. దాని ననుసరించి చూచిన నిప్పుడు చేయు కార్యములు బ్రహ్మయజ్ఞాదు లనుట సముచితమేకాని ౨౬౩-వ పద్యమువలన ౨౭౧-వ పద్యము

వలన గోదావరికిఁ బోవు సమయమందే సూర్యోదయమైనట్లు తేల్పడుచున్నది. అంతియుకాదు. ప్రొద్దెక్కినట్లును నర్థముకాఁగలదు. ఇది యానాఁటి వర్తమానకాల వృత్తాంత మన వలనుపడదు. ప్రతిదినము జరుగునది యానాఁడు చెప్పెను, గాని యప్పుడే సూర్యుఁడు పుట్టె బారెడు ప్రొద్దెక్కినతరువాత స్నానానికిఁ బోయినారనుట విరుద్ధచర్యయే కాక పూర్వోత్తర విరుద్ధచర్యయు నగును. శాలలోఁ=ఇట్లు చెప్పుటచే నిత్యకర్మానుష్ఠానము పర్ణశాల వెలుపలనే చేసి యావల లోపలికి వచ్చిరని తెలియ వలెను. నిత్యకర్మానుష్ఠానములు పర్ణశాలకు వెలుపలనే చేయవలెను. వరా రోహాయు=సీతయు, వర + ఆరోహ = పెద్ద పిఱుఁదులు గలది, నిరూఢమతిఁ=గొప్ప మనస్సుతో, గౌతమమహర్షి తపస్సుచేసి తెచ్చినది, కావున గోదావరికి గౌతమి యని పేరు. భాగీరథివలె.

తాత్పర్యము

కల్యాణగుణములచేఁ బ్రసిద్ధికెక్కిన శ్రీరామచంద్రమూర్తి సీతాలక్ష్మణులఁ గూడి గోదావరిని స్నానముచేసి తన తపోవనముఁజేరి యందు నిత్యమౌ ప్రాతఃకాల కృత్యములన్నియు నాశ్రమముననే వెలుపలఁ దీరిచి వడసాలలో సీతయుఁ దాను లక్ష్మణుఁడు పూర్వులు పెద్దల కథలు చెప్పుచు ముచ్చటలాడుచుండ.

కం. ఆసీనుం డయి లసదితి, హాసంబులఁ జెప్పుచుండ ♦ నా సౌమ్యుఁడు సీ
 తాసహితుం డయి దివిఁ జిత్రాసంగతుఁ డైన చంద్రు♦రాణఁ దనర్చెన్. ౫౫౧

ఆసీనుండయి=కూర్చుండి, లసత్=ప్రకాశించు, ప్రసిద్ధులగు పురుషుల, ఇతి హాసంబులు=చరిత్రములు, పూర్వ మిట్లు జరిగెనని చెప్పఁబడునది యితిహాసము, చిత్రాసంగతుఁడైన = చిత్రానక్షత్రముతోఁ గూడిన.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి కూర్చుండి పూర్వరాజులయు రాజర్షులయుఁ జరిత్ర ములు చెప్పుచుండ నా సాధుగుణలక్షితుఁడు చైత్రశుద్ధపూర్ణిమనాఁడు చిత్రానక్షత్ర ముతోఁ గూడియుండు చంద్రునివలెఁ బ్రకాశించెను. చిత్రా మార్తికమేక మ్మన్నట్లు చిత్ర యొంటినక్షత్రమే శుద్ధమైన తెల్లని కాంతి గలది. అట్లులే సీతయు,

ఆ. కతలు చెప్పుచున్న ♦ కాకుత్స్థమణి దేవ, విభు నదాటుగాఁగ ♦ నిర్జరారి
 యైన పంక్తివదను♦ననుజాత శూర్పణ, ఖాఖ్య చూచి చొచ్చె♦నాశ్రమంబు. ౫౫౨

అదాటుగాఁగఁ=అకస్మికముగ, పూర్వసంకల్పములేక యాదృచ్ఛికముగ, పంక్తివదను=పదిముఖములుగల రావణాసురుని, అనుజాత=చెల్లెలు,శూర్పణఖాఖ్య= శూర్పణఖ యను పేరుగలది, చేఁటలంత గోళ్లుగలది. కావున దీనికి శూర్పణఖ (శూర్ప + నఖ) యనిపేరు. దీని మగఁడు విద్యుజ్జిహ్వుఁడు. వీఁడు రావణాసురునిచేఁ జంపఁబడెను. ఈ కథ యుత్తరకాండమునఁ గలదు, చొచ్చెఁ = ప్రవేశించెను.

కం. చని సీతానుజయుతుఁడై, యినముని పితృదైవతముల • కెఱఁగి కృతాసే
చనుఁడై గిరిజానందులు, తనుఁ గొలువంగ నుండు రుద్ర•తద్గతి నుండెన్. ౨౭౮

సీతానుజయుతుఁడై=సీతతోను దమ్మునితోను గూడినవాఁడై, ఇనముని పితృదైవతములకున్ =సూర్యునకు ఋషులకు పితరులకు, దేవతలకు, ఎఱఁగి=నమస్కరించి, కృతాసేచనుఁడై=స్నానముచేసినవాఁడై, గిరిజానందులు = పార్వతియు నందికేశ్వరుఁడు, రుద్రతద్గతి=రుద్రునివలె. రుద్రుఁడు=ప్రజలను ప్రలయమందు నేడిపించువాఁడు.

తాత్పర్యము

సీతాలక్ష్మణులతో స్నానము చేసివచ్చి సంధ్యాది కృత్యములను బ్రహ్మయజ్ఞమును జేసినవాఁడై పార్వతీ నందులతోఁగూడిన రుద్రునివలె నుండెను.

ఇచ్చట రుద్రుని నుపమానముగాఁ జెప్పుటచేఁ గాఁబోవు సంహారకార్యము సూచింపఁబడుచున్నది.

—• ౧౭-వ సర్గము. శూర్పణఖ శ్రీరాముని జూచుట. •—

ఉ. ఆహతలక్షణుండు వసు•ధాత్మజ లక్ష్మణుఁ గూడి గౌతమీ
వాహినిఁ దాన మాడి నిజ•పర్ణ కుటీరముఁ జేరి యందు ని
ష్ఠాహితకల్యకృత్యముల • నన్నిటిఁ దీరిచి శాలలో వరా
రోహయుఁ దానుఁ దమ్ముఁడు ని•గూఢమతిం జని యిష్టగోష్ఠికిన్. ౨౭౯

వనవాసమునకు సంకల్పించిన పదునాలుగు సంవత్సరములలో నిప్పుడు పదుమూఁడవ సంవత్సరము జరుగుచున్నది, అందిది మార్గశిరము.

తస్మిం త్రయోదశాబ్దాని, రామస్య సమతిక్రమః ।
గోదావర్యాస్తటే పుణ్యే, పంచవట్యాం మనోరమే ॥ పాద్మ.

ఏపాపిని సీతాసుఖలతా కుఠారమో, యెవతె సోదరవంశముస్తాకుద్దాలమో, యెవతె సీతాపాతివ్రత్య శ్రీరామకల్యాణగుణ బలపరాక్రమ రత్నములకు నికషోపలమో, యెవతె కాముకవిధవలకు నెట్టిదండము సముచితమని లోకమునకు స్వానుభవమునఁ బ్రకటించెనో, చెడిపెలగు నాఁడుబిడ్డల మాట విననఁ గొంపలు గూలుననుటకు నెవతె లక్ష్యభూత యయ్యెనో యట్టి శూర్పణఖ వచ్చుట యిఁకఁ జెప్పఁబడును.

ఆహతలక్షణుండు=గుణములచే బ్రసిద్ధిచెందినవాఁడు శ్రీరామచంద్రమూర్తి, గౌతమీవాహినిన్=గోదావరియందు, తానము=స్నానము, ఆడి=చేసి, నిజపర్ణకుటీరమున్=తనయాకుటింటిని,నిష్ఠా-హిత-కల్య-కృత్యములన్=శ్రద్ధచేఁ జేయఁబడిన ప్రాతఃకాలమునఁ జేయదగిన కార్యములను, హోమము, బ్రహ్మయజ్ఞాదులని కొంద ఱనిరి. రాముఁడు సూర్యోదయమునకుఁ బూర్వము హోమము చేయువాఁడని ముందు వ్యాఖ్యాతలు వ్రాసిరి. దాని ననుసరించి చూచిన నిప్పుడు చేయు కార్యములు బ్రహ్మయజ్ఞాదు లనుట సముచితమేకాని ౨౬౩-వ పద్యమువలన ౨౬౧-వ పద్యము

వలన గోదావరికిఁ బోవు సమయముండే సూర్యోదయమైనట్లు తేల్పడుచున్నది. అంతియుకాదు. ప్రొద్దెక్కినట్లును నర్థముకాఁగలదు. ఇది యానాఁటి వర్తమానకాల వృత్తాంత మన వలనుపడదు. ప్రతిదినము జరుగునది యానాఁడు చెప్పెను, గాని యిప్పుడే సూర్యుఁడు పుట్టి బారెఁడు ప్రొద్దెక్కినతరువాత స్నానానికిఁ బోయినారనుట విరుద్ధచర్యయే కాక పూర్వోత్తర విరుద్ధచర్యయు నగును. కాలోక్=ఇట్లు చెప్పుటచే నిత్యకర్మానుష్ఠానము పర్ణశాల వెలుపలనే చేసి యావల లోపలికి వచ్చిరని తెలియు వలెను. నిత్యకర్మానుష్ఠానములు పర్ణశాలకు వెలుపలనే చేయవలెను. వరారోహాయు=సీతయు, వర+ఆరోహా = పెద్ద పిఱుఁదులు గలది, నిరూఢమతిః=గొప్ప మనస్సుతో, గౌతమమహర్షి తపస్సుచేసి తెచ్చినది, కావున గోదావరికి గౌతమి యని పేరు. భాగీరథివలె.

తాత్పర్యము

కల్యాణగుణములచేఁ బ్రసిద్ధికెక్కిన శ్రీరామచంద్రమూర్తి సీతాలక్ష్మణులఁ గూడి గోదావరిని స్నానముచేసి తన తపోవనముఁజేరి యందు నిష్ఠచేఁ బ్రాతఃకాల కృత్యములనెల్ల నాశ్రమముననే వెలుపలఁ దీరిచి పడసాలలో సీతయుఁ దాను లక్ష్మణుఁడు పూర్వులు పెద్దల కథలు చెప్పుచు ముచ్చటలాడుచుండ.

కం. ఆసీనుం డయి లసదితి, హాసంబులఁ జెప్పు చుండ ♦ నాసౌమిత్రుఁడు సీ
తాసహితుం డయి దివిఁ జిత్రాసంగతుఁ డైన చంద్రు♦రాణఁ దనర్చెన్. ౨౮౧

ఆసీనుండయి=కూర్చుండి, లసత్=ప్రకాశించు, ప్రసిద్ధులగు పురుషుల, ఇతిహాసంబులు=చరిత్రములు, పూర్వ మిట్లు జరిగెనని చెప్పఁబడునది యితిహాసము, చిత్రాసంగతుఁడైన = చిత్తానక్షత్రముతోఁ గూడిన.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి కూర్చుండి పూర్వరాజులయు రాజర్షులయుఁ జరిత్రములు చెప్పుచుండ నా సాధుగుణలక్షితుఁడు చైత్రశుద్ధపూర్ణిమ నాఁడు చిత్తానక్షత్రముతోఁ గూడియుండు చంద్రునివలెఁ బ్రకాశించెను. చిత్రా మౌక్తికమేక మ్మన్నట్లు చిత్త యొంటినక్షత్రమే శుద్ధమైన తెల్లని కాంతి గలది. అట్లులే సీతయు,

ఆ. కతలు చెప్పుచున్న ♦ కాకుత్స్థమణి దేవ, విభు నదాటుగాఁగ ♦ నిర్జరారి
యైన పంక్తివదను♦ననుజాత శూర్పణ, ఖాఖ్య చూచి చొచ్చె♦నాశ్రమంబు. ౩౮౧

అదాటుగాఁగన్=ఆకస్మికముగ, పూర్వసంకల్పములేక యాదృచ్ఛికముగ, పంక్తివదను=పదిముఖములుగల రావణాసురుని, అనుజాత=చెల్లెలు, శూర్పణఖాఖ్యా=శూర్పణఖ యను పేరుగలది, చేఁటలంత గోళ్లుగలది. కావున దీనికి శూర్పణఖ (శూర్ప+నఖ) యనిపేరు. దీని మగఁడు విద్యుజ్జిహ్వుఁడు. వీఁడు రావణాసురునిచేఁ జంపఁబడెను. ఈ కథ యుత్తరకాండమునఁ గలదు, చొచ్చెన్ = ప్రవేశించెను.

తాత్పర్యము

కథలు చెప్పుచున్న విష్ణుసన్నిభుఁడైన శ్రీరాముని పదాటునకు రావణాసురుని చెల్లెలు శూర్పణఖ యను పేరుగలది చూచి యాశ్రమమునకు బ్రవేశించెను.

సీ. హర్యృక్షనిభవక్షు ♦ నరవిందపత్రాక్షు, సంతతోత్సాహు నా♦జానుబాహు
సలలిత దీప్తాస్యు ♦ సజ్జనతోపాస్యు, నింద్రసమాను గ♦జేంద్రయాను
వర్ణితసుకుమారు ♦ బహుళజటాభారు, సమధిక ప్రియదర్శు ♦ శత్రుకర్శు
నిందీవరశ్యాము ♦ సౌందర్యజితకాము, భూపలక్షణయుక్తు ♦ భూరిశక్తు

తే. రాముఁ గనుఁగొని కుసుమనా♦రాచశాత, బాణదారితచిత్తయై♦పాపశీల
రాక్షసాంగన యతనిఁ జే♦రంగ వచ్చె, వృత్తమధ్యు మహోదరి♦వికటవృత్త.

హర్యృక్షనిభవక్షున్ = సింహము ఱొమ్ముతో సమానమైన ఱొమ్ముగలవానిని, అనఁగా విశాలమైన ఱొమ్ముగలవానిని, అరవిందపత్రాక్షున్ = తామరరేకులవంటి కన్నులు గలవానిని, సంతతోత్సాహున్ = ఎల్లప్పుడుత్సాహముగలవానిని, ఆజానుబాహున్ = మోఁకాళ్ళనంటు చేతులుగలవానిని, సలలితదీప్తాస్యున్ = మనోహరమై ప్రకాశించు ముఖముఁగలవానిని, సజ్జనతా + ఉపాస్యున్ = సత్పురుష సమూహముచే నుపాసింపఁబడ యోగ్యుఁడగువానిని, గజేంద్రయానున్ = గొప్ప యేనుఁగు నడక గలవానిని, వర్ణిత = కీర్తింపఁబడిన, సుకుమారున్ = కోమలదేహముగలవానిని, బహుళ జటాభారున్ = విస్తారమైన జడలభారముగలవానిని, సమధికప్రియదర్శున్ = మిక్కిలి ప్రియమైన దర్శనముగలవానిని, శత్రుకర్శున్ = శత్రువులను కృశింపఁజేయువానిని, ఇందీవరశ్యామున్ = నల్లకలువలవలె నల్లనగువానిని, సౌందర్యజితకామున్ = చక్కఁదనముచే జయింపఁబడిన మన్మథునిగలవానిని, భూపలక్షణయుక్తున్ = రాజచిహ్నములు గలవానిని, కుసుమనారాచ = పూలు బాణములుగాఁగల మన్మథుని యొక్క, శాత = పదునైన, బాణ = బాణములచే, దారిత = చీల్చఁబడిన, చిత్తయై = మనస్సుగలదియై, పాపశీల = పాపముచేయుటే స్వభావముగాఁగలది, వృత్తమధ్యున్ = గుండ్రని నడుము గలవానిని. మహోదరి = పెద్ద పొట్టగలది, వికటవృత్త = భయంకర చర్యగలది.

తాత్పర్యము

సింహము ఱొమ్మువలె విశాలమైన ఱొమ్ముగలవానిని, తామరరేకులవంటి కన్నులుగలవానిని, నెడఁదెగని యుత్సాహముగలవానిని, దీర్ఘములై మోఁకాళ్ళనంటు చేతులుగలవానిని, అందమై ప్రకాశించు ముఖము గలవానిని, సత్పురుషులచే నుపాసింపఁబడువానిని, ఇంద్రునితో సమానుని, యేనుఁగు నడకవంటి నడక గలవానిని, కీర్తింపఁబడిన కోమలత్వము గలవానిని, విస్తారముగ జడలు ధరించినవానిని, ఎంత చూచినను దనివి తీరని ప్రియమైన దర్శనము గలవానిని, శత్రువులఁ గృశింపఁజేయు వానిని, నల్లకలువల చామని చాయ గలవానిని, సౌందర్యమున మన్మథుని జయించినవానిని, రాజచిహ్నములుగలవానిని, మిగుల శక్తిగలవానిని,

సన్నని నడుము గలవానిని. శ్రీరామచంద్రమూర్తినిజూచి కామదగ్ధచిత్తయై పాపపు స్వభావము గల యా రాక్షసి పెద్ద పొట్టగలది భయంకరస్వరూపముగలది చేరవచ్చెను.

విశాలమైన లోమ్మనుటచే దానిని జూడగానే స్త్రీలకు గాఢాలింగనమందుఁ గోరికగలిగించుచున్నదని భావము. ఇట్లే తిక్కనవి యూహించునది.

ఇందు శూర్పణఖ శ్రీరామచంద్రుని జూచి కామమోహితయైనట్లు చెప్పఁబడెను ఇది విధవగుటయోగాక తలవెంట్రుకలు నెరసిన ముసలిదియనికూడ రామాయణము యుద్ధకాండము ౨౨౦౦-వ పద్యమువలనఁ దెలియవచ్చెడిని.

సీ. తానేడ నిండారుఁదముల మోము కుగూప
యతఁడేడ రాకాసుధాంశుముఖుఁడు,
తానేడ నరసిన తలవెంట్రుకల డొక్క
యతఁడేడ నిందింది రాలకుండు.

అని లంకలో రాక్షసస్త్రీలు పలికిరి. శూర్పణఖ పరిహాస్యమును దన దుశ్చేష్టను కిప్పపెట్టి బొంకెనుగాని యదియెట్టులో (బహుశః సీతాదేవి వలననై యుండును) పరిహాస్యము బయలుపడెను. రాక్షసజాతి విధవలు తలవెంట్రుకలు ధరింతురని దీనివలనఁ దెలియనయ్యెడి.

దేహము ముడుతలు పడి తలవెంట్రుకలు నరసి ముట్లుడిగిన స్త్రీకిని గామము గలుగునవనియు వయస్సునుబట్టి కామమును జంపఁజాలదనియు దీనివలన నేర్పడు చున్నది. ఇది సత్యము. ఈయర్థమునే యప్పావ్యకుడు నుత్తరదిక్కును నిట్లని బోధించెను.

స్థవిరాణామపి స్త్రీణాం, బాధతే మైథునజ్వరః
ముసలివారైన స్త్రీలనుగూడ మైథునజ్వరము బాధించును
ఇద మనుచితి మక్రమశ్చ పుంసాం
యదిహ జరాస్వపి మాన్మథవికారాః
యదపి చ నకృతం నితంబినీనాం
స్తనపతనావధిజీవితం వా రతంవా. భర్తృహరి.
ఈ విషయమే శృంగారశతకమున నీ శ్లోకమందు జెప్పియున్నాఁడు.

చ. సుముఖుని దుర్ముఖీమణి, విశుద్ధసుశీలుని బాపశీల, యు
త్తమశుభరూపవేషుని నితాంత వికార విరూప, సుస్వరుఁ
సముదితభైరవస్వన, విశాలవిలోచను భీకరాక్షి, యా
భ్రమరవినీలకుంతలవిరాజితుఁ దామ్రశిరోజ, దక్షిణుఁ. ౭౮౩

సుముఖుని = చంద్రబింబమువలె సుందరమైన ముఖముగల వానిని, దుర్ముఖమణి=వికారముఖముగల స్త్రీలలో శ్రేష్ఠురాలు, విశుద్ధసుశీలుని = నిర్మలమైన మంచి నడవడిగల వానిని, పాపశీల=పాపముచేయు స్వభావముగలది. ఉత్తమ శుభరూప వేషుని=శ్రేష్ఠమై మంగళకరమైన చక్కదనము అలంకారము గలవానిని, నితాంత

వికార విరూప = మిక్కిలి యేవపుట్టఁజేయు కురూపము గలది. సుస్వరుః = మంచి కంఠస్వరముగల వానిని, సమధికభైరవస్వర=మిగుల భయంకరమైన కంఠస్వరము గలది. విశాలవిలోచనుః=వెడలుపాటికన్నులుగలవానిని, భీకరాక్షీ = భయంకరములైన మిడిగ్రుడ్లుగలది. భ్రమర = తుమ్మెదలవలె నల్లనైన, వినీతకుంతలవిరాజితుః= అణఁగియున్న వెండ్రుకలచేఁ బ్రకాశించువానిని, తామ్రశిరోజ = గుజ్జుపువెండ్రుకల వలె నల్లనైన రేఁగిన వెండ్రుకలు గలది.

తాత్పర్యము

మంచియందమైన ముఖముగలవానిని వికారమైన ముఖముగలది, పవిత్ర చరిత్రుని పాపస్వభావ, శ్రేష్ఠమైనయందము నలంకారము గలవానిని మిక్కిలి కురూప, వినసింపైన కంఠస్వరముగలవానిని భయంకర ఖరస్వర, వెడలుపాటికన్నులు గలవానిని గూబకన్నువంటి మిడిగ్రుడ్లుకలది, తుమ్మెదలవలె నల్లపై నునుపైన వెండ్రుకలు గలవానిని ఎఱుపైన వెండ్రుకలు గలది. పైపద్యముతో నన్వయము.

తే. వామభాషిణి, తరుణుని ♦ బలితదేహ, దారుణాకార ప్రియుని ను ♦ ద్గాఢభయద
వేష యిట్లనుఁ బంచశ ♦ రేషుదగ్ధ,చిత్తయగుచును మోహంపుఁ ♦ దత్తరమున. ౨౭౮

దక్షిణుః=కపటములేని మాటలవానిని, వామభాషిణి = వక్రభాషలుగలది, తరుణునిః=వయస్సువానిని, పలితదేహ=నరసిన దేహముగలది, దారుణాకార = భయంకరాకారముగలది, ప్రియుని = చూడఁ బ్రియమైన యాకారముగలవానిని, ఉద్గాఢభయదవేష=మిగుల భయంకరమైన వేషముగలది, పంచశర=మన్మథుని, "అరవింద మశోకంచ చూతంచ నవమల్లికా, నీలోత్పలంచ పంచైతే పంచబాణస్య సాయకాః" కమలము, అశోకము, తేమామిడి, మల్లె, నల్లకలువ ఈ పుష్పములు మన్మథబాణములు, ఇషు=బాణములచే, దగ్ధ=కాల్పఁబడిన, చిత్త = మనస్సుగలది, మోహంపుఁదత్తరమునః = మోహమువలనఁగలిగిన తత్తఱపాటుతో.

తాత్పర్యము

ఋజుభాషుని వక్రభాషిణి, వయసువానిని తలవెండ్రుకలు నరసిన ముసలిది, భయంకరాకార ప్రియుఁడగువాని భయంకరవేషముగలది, మన్మథబాణములచే దహింపఁబడిన మనస్సుగలదై మోహావేశముచే నిట్లనెను.

దగ్ధచిత్తయనుటచే వివేకము పూర్ణముగ నాశమయ్యెనని భావము. కాముకునకుఁ గన్నులు లేవు. తన యయోగ్యత ఎదుటివానియోగ్యత పరిశీలించు వివేకము కాముకునకుఁ గలుగదు అని తెలుపుటకే యిరువురను గవి పోల్చి చెప్పెను.

దీనివలనఁ గామ మెట్లు బుద్ధిని నాశనముచేయునో తెలియనగు

♦— శ్రీరాముఁడు శూర్పణఖకుఁ దన వృత్తాంతముఁ జెప్పుట ♦—

ఉ. ఎవ్వఁడ వీవు? చెప్పుము మునీశ్వరవేషముఁ దాల్చి భార్యతో
నివ్వనభూమిఁ జాపనిశి ♦ తేషుచయంబులఁ బూని రాక్షసుల్

క్రొవ్విన సంచరించు నెడఁ ♦ గ్రుమ్మర నేల ? నిమిత్త మేమి యీ
రివ్విధి నిందు నుండ ? నన ♦ నిట్లనియెన్ ఋజుబుద్ధి రాముఁడున్. ౧౫

నిశితేషుచయంబులు = పదునైన బాణముల సమూహములు.

తా త్ప ర్య ము

నీ వెవ్వఁడవు, జడలచే మునీశ్వరులవేషము ధరించి కాముకుఁడవై భార్యతోను క్షత్రియరూపమున విల్లు బాణములతోను రాక్షసులు స్వేచ్ఛగాఁ దిరుగు నీ స్థలమునకేల వచ్చితివి ? ఈ ప్రకార మిచ్చటనుండఁ గారణమేమి ? అని యడి యడుగఁగా శ్రీరామచంద్రమూర్తి వంచనలేక యథార్థము నిట్లు చెప్పెను.

జడలు ధరించి నీవు మునివేషము వేసియుఁ గాముకుఁడవై భార్యతోడనున్నావు. క్షత్రియశూరునివలె విల్లు బాణములు ధరించియున్నావు. ఇచ్చటి రాక్షసులు నీ వొక మగవానివలె భార్యతోనుండుటయు సహింపరు, శూరునివలె విల్లు బాణములు ధరించియుండుటయు సహింపరు, అని భావము.

కం. రాముని కనృతం బాడుట, యేమాత్రం బైనఁ గా ద ♦ భీష్టం, బందున్
రామానికటమునఁ దప, శ్శ్రీమహితావస్థ నింక ♦ జెప్పఁగ నేలా. ౧౬

అనృతము=అసత్యము, ఏమాత్రంబైనఁ = ఎంత కొంచెమైనను, రామానికటమునన్ = స్త్రీసన్నిధానమందు, తపశ్శ్రీమహితావస్థ = తపస్సంపదచే నుండు నుత్తమస్థితియందు.

తా త్ప ర్య ము

ఎట్టి సందర్భమందు నవ్వులకైనను అసత్యమాడుట రామున కిష్టమైన కార్యము గాదు. అందు నాఁడువారి యెదుటఁ దపస్సుచేయుచుండు స్థితియం దబద్ధమాడఁ డని చెప్పనలెనా.

స్త్రీలయెదుట నసత్యమాడరా దనుటచే పరోక్షమున నాడనచ్చునని యభిప్రాయముగాదు. పరోక్షమున నసత్య మాడువారుకూడ వారియెదుట నసత్యమాడరాదు. వీఁడిట్టిపంచకుఁడా యని వారు తలఁచుటచే గౌరవహాని యగుటయేగాక భర్త లసత్యమాడిన మే మేల యాడరాదని వారు నసత్యమాడుదురు. ఆ కారణమున వారిపాపము తాము పంచుకొనవలసివచ్చును. భార్యలయెదుట నసత్యమాడువాడును భార్య యుండియు జారత్వము చేయువాఁడును, వారి కసత్యమాడుటకు జారుడౌటకు ననుజ్ఞయిచ్చినవాఁడే, మార్గము చూపినవాఁడే. రెండవదియగు వ్రతదీక్షాకాలమందు నసత్యమాడినదపఃఫలము నాశనమగును. ఒకొక్కటియిట్టిదై యుండగా రెండును గలసియున్నదశలో శ్రీరామచంద్రమూర్తియై యెట్లసత్యమాడఁగలఁడు.

సీ. ధరణీతలేంద్రుండు ♦ దశరథనాముండు, త్రిదశతేజుఁ డొకండు ♦ తేజరిల్లు
నారాజుకొడుకుల♦యం దగ్రజుడ నేను, రాముఁ డందురు నన్ను ♦ భూమిజనులు
నాతమ్ముఁ డీతండు ♦ నావెంటఁ జనుదెంచె, లక్ష్మణాఖ్యాతుండు ♦ లలితగుణుఁడు
ఈతన్వి నాభార్య ♦ సీత యందురు పేరఁ, దల్లిదండ్రులయాజ్ఞఁ ♦ దప్పనోడి

ఆ. ధర్మకాంక్షఁ జేసి ♦ ధర్మార్థమై యిట, వచ్చినార మేము ♦ వనిత యింక
యింక జెప్పు మెవతె ♦ వీవు? నీపే రేది? తథ్యమాడు మెవరి ♦ దాన వీవు? ౨౮౭

త్రిదశతేజుఁడు = దేవతల తేజస్సువంటి తేజస్సుగలవాఁడు, అగ్రజుఁడును = పెద్దవాఁడును, ధర్మకాంక్ష = పితృవాక్యపరిపాలన మనెడి ధర్మము నిర్వహించుకోరికచే, ధర్మార్థమై = తపోరూపధర్మము సాధించుకొఱకు; శరణాగత రక్షారూపక రాక్షసవధము నిమిత్తమని ధ్వని, తథ్యము = సత్యము.

తాత్పర్యము

దశరథుఁడను పేరుగల రాజు దేవసముఁడొకఁడు గలఁడు. ఆయనకొడుకులలో నేను పెద్దవాఁడను. నన్ను రాముఁడని లోకులు పిలుతురు వీఁడు నా తమ్ముఁడు, లక్ష్మణుఁ డనువాఁడు, నావెంటవచ్చెను, ఈ స్త్రీ నా భార్య, సీతయనుపేరుగలది. తల్లిదండ్రుల యాజ్ఞ మీఱలేక పితృవాక్యపరిపాలన మను ధర్మము నిర్వహించుకోరికతోఁ దపోరూపధర్మము స్థాపించుకొఱకై మేము వచ్చినారము.

మాచరిత్రము వింటివిగదా. ఇఁక నీవేజాతిదానవు ? నీపేరేమి ! ఎవ్వరిదానవు! సత్యము చెప్పుము.

తే. వయ్య సమనోజ్ఞవేషంబు ♦ నొప్పుఁగాన, రాక్షసి వటంచుఁబల్కఁగ ♦ రాదె చెపుమ
యిచ్చటికి నీవు రాఁగతెం ♦ బేమి? యునిన, సత్యము వచింతు నో రామ ♦ చంద్ర! వినుము.

తాత్పర్యము

ఇది రాక్షసభూమియైనను నీ మనోహరాకారము చూచిన రాక్షసి వనుచు చెప్పరాదు. ఇచ్చటికి నీవు వచ్చుట కేమి కారణమని రామచంద్రమూర్తియడుగఁగా రామచంద్రా నిజము చెప్పెద వినుము.

వయ్య + సమనోజ్ఞవేషము, కాఁగ = కాఁగా, ఆ రాక్షసివి కావని చెప్పరాదు రాక్షసివవుదువని చెప్పవచ్చున ?

దీనివలన రామచంద్రుని సమీపించినపుడు శూర్పణఖ సుందరరూపము ధరించి వచ్చెనని యేర్పడుచున్నది. దానిని విరూపగా కవి వర్ణించుట వాస్తవార్థము తెలుపుటకే.

వయ్య + సమనోజ్ఞవేషము = మనోహరముకాని వేషము, రాక్షసివి గావటంచుఁ = రాక్షసివి కావని చెప్పసాధ్యపడదు, రాక్షసివే, ఇది రాక్షసులు సంచారము చేయు స్థలమని నీవు చెప్పుటచే నీవు రాక్షసివనియే తోఁచుచున్నది. కావునఁ గవి యున్న రూపమునే వర్ణించెను.

— శూర్పణఖ శ్రీరాముని మోహించుట —

సీ. నేను శూర్పణఖ నా ♦ నగడిన రాక్షస, తరుణి నేరూపైనఁ ♦ దాల్పనేర్తు
నీయరణ్యంబున ♦ నేకతఁ జరియింతు, సర్వభయంకర ♦ చరిత నగుచు

వినలేదె నీ వల ♦ విశ్రవసుఃపుత్రు, రాక్షసనాయకు ♦ రావణాఖ్యు
నాతండె మాయన్న ♦ యధికనిద్రాళువౌ, కుంభకర్ణుం డతి ♦ కూరబలుఁడు
తే. దనుజచేష్టితదూరుండు ♦ ధర్మచిత్తుఁ, డగు విభీషణుఁడును దోడు ♦ లమరరూప !
తోడఁబుట్టువు లా ఖర ♦ దూషణులును, నతులసంగ్రామశూరు లో ♦ యుందగాఁడ !

ఏకతః=ఒంటరిగా, సర్వలోకభయంకరచరితను=సమస్తప్రాణికోట్లకు భయము కలిగించు నడవడిగలదానను, ఇట్లు చెప్పుటచే నేన జెప్పఁబోవు రతికార్యము మనము చేయునపుడు అడ్డమువచ్చుటకు నెట్టివారును భయపడుదురు అని భావము. అధికనిద్రాళువు=విశేషముగ నిద్రించు స్వభావముగలవాఁడు, దనుజచేష్టితదూరుఁడు=రాక్షసకృత్యములకు దూరమైనవాఁడు, ధర్మచిత్తుఁడు = ధర్మమందు మనస్సుగలవాఁడు, తోడులు=తోడఁబుట్టినవారు, ఆ=ప్రసిద్ధికెక్కిన, అతులసంగ్రామశూరులు = యుద్ధమం దసమానశూరులు, విభీషణుఁడును= విభీషణుఁడుకూడ ననుటచే, మా రాక్షసచేష్టలు లేనివాఁడు కావున మీ లో నుండఁదగినవాఁడని కాని నీవు ధర్మాత్ముఁడవని చెప్పకొంటివే, అట్టి ధర్మాత్ముఁడు, మాలో నాకు సోదరుఁడై యున్నాఁడనికాని భావము.

తాత్పర్యము

ఓ దేవస్వరూప, సుందరుఁడా ! నేను శూర్పణఖ యను రాక్షసస్త్రీని, కోరిన రూపము ధరింపఁగలను, ప్రాణికోటులకు భయము గలిగించుదాననై యీ యడవులలో నేను నొంటరిగఁ దిరుగుచుందును. విశ్రవసునికొడుకు రాక్షసరాజు నగు రావణునిపేరు నీవు వినలేదా. అతఁడు మా యన్న. నిదురబోతు కుంభకర్ణుఁడు, ధర్మాత్ముఁడై రాక్షసచేష్టలులేని విభీషణుఁడుకూడ నా తోడఁబుట్టినవారు. ఖరదూషణులుకూడఁ నాకు దోడఁబుట్టువులే. వారు యుద్ధములందు మహాశూరులు.

ఉ. వారి నతిక్రమించి మది ♦ వచ్చినచొప్పు చరించుచుందు, నా
కారమునందు నీ సమునిఁ ♦ గానమి నెందును నిన్ను నేను గ
న్నారఁగఁ గన్నదాది హృద ♦ యంబున నీవ మగండు గాఁగ నేఁ
గోరితి నిన్నుఁ జేరితి న ♦ కుంఠితవృత్తిని బూరుషోత్తమా. ౨౯౦

అతిక్రమించి=వారియాజ్ఞకు లోపడక, మదివచ్చినచొప్పున = నా యిష్టప్రకారము, అకుంఠితవృత్తిని = అడ్డములేని విధముగా, పూరుషోత్తమా=మగవారిలలో శ్రేష్ఠుఁడా.

తాత్పర్యము

వావివరుసలకై వారు నా యన్నలని చెప్పితినేకాని వారి యాజ్ఞకు లోపడి వర్తించుదాననుగాను, నా యిష్టప్రకారము నేను దిరుగుచుందును. కావున నీవు నన్ను గ్రహించితివా వారు నీపైఁ గోపింతురని నీవు భయపడవలదు. చక్కఁదనమునందు నీవంటివానిని నేను జూడలేదు. కావునఁ గన్నులార నిన్నుఁ జూచినది మొదలు దొడ్డమగవాఁడా! నీవు నాకుఁ దగిన మగఁడవని నిన్నుఁ గోరితిని. నీవు నన్నుఁ దిరస్క

రించితివా మా యన్నల నందఱను నీ మీఁదికి యుద్ధమునకుఁ బిలిచికొనివచ్చి చంపిం చెదను.

ఉ. ఏ మనుకొంటివో నను మ ♦ హీశ! యమేయతరప్రభావల
క్ష్మీమిత స్వైరసంచరణ ♦ సిద్ధబలాన్విత; నా మగండవై
హామిక సౌఖ్యముల్ పడయు ♦ మా, యిది యేమిటి సీత రోఁత, నీ
కీ మదిరాక్షి యర్హ యగు ♦ నే వికృతాంగి విరూప యిస్సిసీ. ౨౯-౧

మహీశ=రాజా, అమేయతర ప్రభావలక్ష్మీమితన్=కొలఁది చెప్పరాని ప్రభావ సంపదచేఁ దెలియఁబడుదానను, స్వైర = నా యిచ్ఛచొప్పున, సంచరణ=తిరుగుట యందు, సిద్ధ=ప్రసిద్ధమైన లేక సిద్ధిపొందిన బలముతో, అన్విత=కూడినదానను, హామికన్=గర్వముతో, అహమహమికా శబ్దభవము, వికృతాంగి = వికారమైన దేహము గలది, విరూప = ఎచ్చుతగ్గు రూపముగలది, ఇస్సిసీ = ఛీ ఛీ.

తాత్పర్యము

రామా! నన్నేమిగా నీవు తలఁచితివి ఎవతో త్రోవఁబోవు నాఁడుది యను కొంటివా? నేను మహీశుఁడ నను గర్వము నీకక్కఱలేదు. నేను ఇంతంతని పరి మాణము చెప్పరాని ప్రభావసంపదచే స్తోత్రము చేయఁబడుదానను, నీవు భూమికిఁ బ్రభు వైనచో నన్నుఁ బ్రభావలక్ష్మియే కొనియాడుచున్నది. అంతియకాదు. నీవు కాల్మడఁ గొవలసినవాఁడవే. నేను నా యిష్టముచొప్పున సంచారము చేయు బలమునందు సిద్ధి పొందినదానను, కాఁబట్టి నా మగండవై నేను శూర్పణఖ మగఁడనని గర్వపడుము. నా కిదివఱకే భార్య యిది యున్నదికదా యందువేమో, ఛీ ఛీ యిది యేమి సీత, చూడ రోఁతపుట్టుచున్నది. వ్రేలెఁడు ముక్కు, వెన్నంటు డొక్క, విఱిచిన బొందె, తుంటలవలె విఱుగు కాలు సేతులు, చింతాకంత కన్నులు, దీనికి గోళ్ళే లేవే, నా సొగసు నేనే చెప్పరాదుకాని నాడొక్క నాపిక్క నా ముక్కు నా చెక్కు నా గోళ్ళు నా కాళ్ళు నా కన్నులు నా చన్నులు నా చేతు లెట్లున్నవో చూడు. ఇది వికార రూప, దీనిని వదలిపెట్టు. పొమ్మనుము దూరముగ, నీవంటివానికి నిటువంటిదా తగిన పెండ్లాము. కాదు కాదు. నేనే యద్దుముద్దు పెండ్లామను.

శా. ఏనే నీకనురూపభార్యను జుమీ ♦ యిల్లాలిఁగాఁ గొమ్మ న
న్నీ సీతఁ గరాళ దుష్టవనితన్ ♦ హేయన్ మనుష్యాంగనన్
నే నీ తమ్మునితోడ మ్రింగెద నిదే ♦ నీ వేను శైలాటవీ
నానాకందరసుందరోర్వుల మగం ♦ డా! వేడ్కఁ గ్రీడింతమా. ౨౯-౨

నీ కనురూపభార్యను = నీ రూపమునకుఁ దగిన రూపముగల భార్యను నేనే, కరాళన్=భయము గలిగించుదానిని, దుష్టవనితన్=దుర్మార్గురాలగుస్త్రీని, హేయన్= నీచను, మనుష్యాంగనన్=మనుష్యస్త్రీని, శైల=పర్వతములందలి, నానా=అనేకము లయిన, కందర=గుహలయందును, ఉర్వులన్=భూములయందును, లేక గుహాప్రదేశము

లందును, వేడ్కన్=విలాసముగా, ఉల్లాసముగా, క్రీడింతమా! ముద్దుమగఁడా! మగఁడా! ఆలుమగనియాట లాడుకొందమా.

తాత్పర్యము

నన్ను సరిగాఁ జూడుము. నేనే నీకుఁ దగినభార్యనుగదా? అవు ననుము. కావున నన్ను నీ భార్యగాఁ గైకొనుము. దీని నేమిచేయు మనెదవా? దీనిని జూచిన నాకే భయమగుచున్నదే, నీ వెట్లు భయపడకున్నావు. దానికి భయపడియే నీవు దానికి వణఁగిపడియున్నావు కాఁబోలు. దుర్మార్గురాలు కావున సవతి మచ్చరమున నన్ను హింసించును. నాకు వశబడితివని నిన్నుఁ జంపును. కావుననే నీచురాలు. అది యునుగాక మనుష్యస్త్రీ. నాకు భోజ్యమైనది. కావున దీనిని నీ తమ్మునితోడ నిపుడే గుటుక్కున మ్రింగెదను. ఆపల నీ కే జంజాటములేదు. కావున నాముద్దు మగఁడా! కొండలలో నడవులలో గుహలలో స్వేచ్ఛగా నాడుకొందమా?

౧౮-వ సర్గము.

క౦ అనవుడుఁ జెలువ వ్వాలయుఁగ, దనుజాంగన కసమబాణ ♦ తాడితకును వా
 క్యనిపుణుఁడు మృదులవాక్యం,బున విస్పష్టార్థయుక్త ♦ ముగ నిట్లనియెన్. ౨౯౩

అసమబాణ=బేసిబాణములుగల మన్మథునిచే, తాడితకున్=తన్నఁబడినదానికి, వాక్యనిపుణుఁడు=మాటలయందు నేర్పుగలవాఁడు, మృదులవాక్యంబునన్ = మెత్తని మాటలచే, విస్పష్టార్థయుక్తముగన్=మిగుల స్పష్టమైన యర్థముతోఁగూడినట్లు.

శూర్పణఖ=నఖముఖా త్సంజ్ఞాయామ్. పాణిని, 4-1-58 ప్రకారము శూర్పణఖ యనియే రూపము. అటు సంజ్ఞార్థకముగఁ గాక శూర్ప ఇవనఖా యస్యాస్సాయని విగ్రహము చెప్ప నెడల శూర్పనఖయని చెప్పవలెను. సంజ్ఞావాచకము కాదు గావున 'పూర్వపదా త్సంజ్ఞాయా' మను సూత్రప్రకారము నకారము ణకారముగా మాఱదు.

తాత్పర్యము

అని శూర్పణఖ చెప్పఁగాఁ గామవశ యయిన యా రాక్షసికి మాటలయందు నేర్పుగల శ్రీరామచంద్రమూర్తి కోపపడక మెత్తనిమాటలతో సందేహము గలుగకుండునట్లు తాను జెప్పినది స్పష్టముగ బోధపడునట్లు చెప్పెను.

ఉ. ఆడితి దీనిఁ బెండ్లి, ప్రియు ♦ రా లిది నా, కెటు వీడ నేరుతున్
 జూడుము నిన్నువంటి పెను ♦ సుందరికిన్ సవతాలిపోరు నా
 వీడనిదుఃఖకారణము ♦ వీనిఁ గనుంగొను శీలవంతు, నా
 తోడుఁ, బ్రియావలోకను, సు ♦ దుర్భర తేజుని, లక్ష్మణాఖ్యునిన్. ౨౯౪

ప్రియావలోకనున్ = చూచుటకుఁ బ్రియమైనవానిని, సుదుర్భరతేజునిన్ = మిక్కిలి సహింపరాని తేజముగలవానిని, లక్ష్మణాఖ్యునిన్ = లక్ష్మణుఁ డను పేరుగల వానిని.

తాత్పర్యము

రాక్షసీ ! దీనిని ముందు మించి పెండ్లాడితిని, అయిన మించినదేమి విడువుమనెదవా? ఇప్పుడు ప్రియురాలైన దీనిని నేనెట్లు విడుతును. అది ధర్మముగాదే. అది యుండనీ నేను నుండెదనందువా ? నీ వంటి యత్యద్భుతమగు నందగత్తెకు సవతాలిపోరు సహింపరానిది. కావున నీకు దుఃఖము కలుగకతప్పదు. నిన్ను దుఃఖపెట్టుటకా పెండ్లిచేసికొనుట ? కావున నా మీఁది భ్రాంతి వదలుము, నేను కామము నిలుపలేనందువా? ఇడిగో వీనిని జూడుము. మంచి శీలము గలవాఁడు. నాతమ్ముఁడు. చూచుటకుఁ బ్రియమైనవాఁడు. సహింపరాని తేజముగలవాఁడు. లక్ష్మణుఁ డను పేరుగలవాఁడు.

శ్రీరామచంద్రమూర్తి యిట్లు పరిహాసమాడవచ్చునా యందురేని "గురుణాపి సమం హాస్యం కర్తవ్యం కుటిలం వినా" కౌటిల్యము అవమానించు తలంపులేక గురువుతోనైనను నెగతాళిగ మాటలాడవచ్చును, అను న్యాయము కలదు.

ఉ. వీఁ డస భార్యుఁ డేఁ, డతుల ♦ వీరవరుండును, జాణ, ప్రాయపుం
బోఁడిమి గల్గుసుందరుఁ. డ ♦ పూర్వ, సతీగుణశీలాలసుండు, పూఁ
బోఁడి ! భవత్స్వరూపమును ♦ బోల్పఁగ నీకపతిత్వయోగ్యుఁడౌ
వాఁడె, భజింపు వీని నస ♦ పత్నత నెండ సుమేరురీతిగన్. ౨౯౫

భార్యలేఁడు = భార్యలేనివాఁడు, పెండ్లికానివాఁడని శూర్పణఖ గ్రహించెను. నావలె భార్యసమీపమందు లేనివాఁ డని రాముని యర్థము, దీనికి మూలము 'అకృతదారః' అని అనఁగా అ + కృతదారః = అకారమునకు సంతోషపురమని యర్థము. అకారో బ్రహ్మవిష్ణీశ కమఠేష్వంగణే గౌర వేంతఃపురే హేతౌ అని నానా. ర. అనఁగా సంతోషపురము నుంచఁబడిన భార్యగలవాఁడని యర్థము. అతుల వీరవరుండు = శ్రేష్ఠులగు వీరులయందు దనకన్నుఁడు, జాణ = సమర్థుఁడు, ప్రాయపుంబోఁడిమి = యౌవనముతోఁకూడినవాఁడు, 'న చితేథా పరిహాస కథాస్వపి' పరిహాస విరుద్ధకథాభిలాషిగాఁడు. అనియు 'అనృతం నోక్తపూర్వం మే నచ వక్ష్యే కదాచన' అనృతము ముందు చెప్పినది లేదు, ఇఁకఁ జెప్పఁబోవునదిలేదు అన్న రాముని వాక్యము దసత్యదోష మారోపింపరాదు గనుక నిట్టి యర్థమే గ్రహింపవలెను. ఇట్లు రెండర్థములు కలుగునట్లు చెప్పుట యసత్యమగునా కాదా? రెండర్థములు కలుగఁజెప్పిన ధర్మరాజు దోషియగునేని శ్రీరామచంద్రమూర్తి యేలకాఁడు? రెంటను బనులు మోసపోయిరికదా? యను సందేహము రావచ్చునుగాని యది సరిగాదు.

ధర్మరాజు స్వలాభతత్పరుఁడై సత్యము చెప్పవెఱచి మోసపువిధముగఁ జెప్పెను. అది ద్రోణునకుఁ బ్రాణహాని కలిగించెను. శ్రీరామచంద్రుఁ డాడినమాటలవలన శూర్పణఖకు వచ్చిన నష్టిలేదు. ఆయనకు వచ్చిన లాభములేదు. పరిహాసించి పంపవలయుననియే యాయన యుద్దేశము. పరిహాసమునకై కూడు నసత్యమందు దోషములేదని శ్రీకృష్ణభగవానుఁడే చెప్పెను.

ఉ. ప్రాణభయంబు పట్టుల, వివాహము వేళల, సర్వ బంధువుల్
మానక చావ నున్నెడ, సమస్త ధనంబును మూలముట్టుగా
హానిగ, హాస్యమాడు సమయంబునయందు ననృత్యమాడినన్
దానిని దోషముం చనరు ధర్మవిధిజ్ఞులు పాండునందనా.

కృష్ణలీలామృతము, సూతకృష్ణలీల.

అపూర్వీ=ఇంతకుముందు భార్యాసుఖ మెఱింగినవాఁడు పూర్వీ. అదిలేనివాఁ డపూర్వీ, అనఁగాఁ జిరకాలముగ భార్యను జూచినవాఁడును గాఁడు, కాఁబట్టియే సతీ మణీలాలసుఁడు — భార్యయందుఁ గోరిక గలవాఁడు. అనఁగా వేఱొకభార్యను గ్రహించు కోరికగలవాఁడని భావము ఆ భార్యనే మరలఁ జూడఁ గోరికగలవాఁడనియు భావము. ఈ రెండును రెంటి నుద్దేశించి చెప్పఁబడెనని యంతరాశయము. భార్యా యుక్తుఁడై యుండు తన సౌఖ్యస్థితిని, భార్యాహీనుఁడై యుండు లక్ష్మణుని స్థితిని జూచి యయ్యో! యూర్మిళ మగనిముఖము చూచుటకు పుణ్యమైన లేదాయెఁగా యని యెంత తపించుచున్నదో, ఆమెను బిలుచుకొని వచ్చియుండిన నామెను సంతోష ముగా నుండును. లక్ష్మణునకు సంతోషముగా నుండును. సీతకుఁ దోడుగానుండును గదా యని రాముఁడు తపించువాఁడు. ఆ యుద్దేశమును లక్ష్మణుని మీఁదఁ బెట్టి బయలుపఱుచుచున్నాఁడు, భవత్స్వరూపమును=నీ సౌందర్యమును, నీకు=నీకే, పతిత్వ యోగ్యుఁడౌ=పతిగా నుండ నర్హుఁడగును, నీకు + అపతిత్వయోగ్యుఁడౌ=పతిగా నుండఁదగఁడు, ఫూ అనుది ఫూ=ఛీ, యనుకరణముగ గ్రహించి ('ఫూఅని')బోఁడీ = బోడిముండా! నీకా వాఁడు పతిగా నుండదగినవాఁడని యన్వయింపవచ్చును. శ్లేష యందు సఖండ బిందువులకు సమ్మేళనము శాస్త్రీయము కావున నట్టి యర్థము యుక్తమే కావున గ్రహింపవలెను. నీకా పతిత్వయోగ్యుఁడని భావము. అస పత్నీక=సవతిపోరులేకుండునట్లు, ఎండ సుమేరు రీతిగన్=ఎండ మేరుపర్వతముమీఁదఁ గొంతభాగమునఁ గొంతసే పెట్లుండునో యట్లనిభావము. "ఆఁడుదాని బజీతు సేయుంగఁ జూడకున్న" మొదటచే పొమ్మంరాదా యనిన నది యెంతో కామాతిశయ మునఁ గొండంతయాసతో సుఖపడఁగోరి వచ్చెనుగాని దుర్బుద్ధియై వచ్చినదికాదు. కావునఁ దటాలున గద్దరించి పొమ్మనిన నది యెంత మనస్సులో నొచ్చుకొనునో, మంచి మాటలచేతనే కాదనిపించి పంపిన నంత మనోవ్యథ యుండదు. మంచి మాటలకేమి దారిద్ర్యమా యని దయాళువై యిట్లు రామచంద్రమూర్తి మాటలాడెనని తెలియ వలయును.

తాత్పర్యము

ఈలక్ష్మణుఁడు భార్యలేనివాఁడు. అసమానశౌర్యవంతుఁడు, సమర్థుఁడు. యౌవనమందున్నవాఁడు, అందగాఁడు, ఇదివఱకు భార్యాసుఖ మెఱుఁగఁడు, భార్య గావలెనని కోరువాఁడు, నీ యందమైన రూపమును జూడఁగా వీఁడు నీకు పతిత్వయోగ్యుఁ డగును, ఫూ బోఁడీ! సవతిపోరు లేనిదానవై యతని భజింపుము.

కం. అను రామునిపల్కులు విని, దనుజాంగన కామమోహి♦తస్వాంతమునన్
జని కని లక్ష్మణుతో ని, ట్లనియె వృథా కాలయాప♦నాసహమతి యై. ౨౯౬

దనుజాంగన=రాక్షసస్త్రీ, కామముచే మోహింపఁబడిన మనస్సుతో, వృథా= వ్యర్థముగా, కాలయాపన = కాలముగడుపుటను, అసహన = ఓర్పులేని, మతియై = మనస్సుగలదై, చని=పోయి యనుటచే లక్ష్మణుఁడు పర్ణశాల వెలుపల నున్నాఁడని గ్రాహ్యము.

తాత్పర్యము

అని శ్రీరామచంద్రమూర్తి చెప్పఁగా విని యా రాక్షసి కామమోహము కన్నులఁగప్పి యుండుటచేఁ దన విధవాగర్భాధాన నూతన మహోత్సవము నిమిత్తమైన జాగకట సహింపలేక లక్ష్మణుతో నిట్లనెను.

కం. నీచక్కఁదనమునకు సరి,యా చెలువను నేన నీకు ♦ నాలయ్యెద, న
న్నో చెలువుఁడ! కైకొమ్మా, వే చనుదమ వనుల గిరుల♦విహరింపంగన్. ౨౯౭

తాత్పర్యము

ఓయి యందగాఁడా ! నీ చక్కఁదనమునకు సరియైన యందగత్తెను నేనే, నీకుఁ బెండ్లామయ్యెదను. నీవు వివాహము చేసికొమ్ము (కై + కొమ్ము=పాణిగ్రహణముచేయుము) (వే = త్వరగా) వనులయందుఁ గొండలయందు సంచారము చేయఁ బోదమా, రా-రా ! పోదము !

చం. అన విని లక్ష్మణుండు పరి♦హాసముగా నను నేను దాసుఁ
డను, ననుఁ బెండ్లియాడి యక♦టా చెలి దాసివి నీవు నౌదె? నా
యనువునననబ్జవర్ణిని మ♦హాత్మున కన్నకు నేను బంట నై
మనుట యెఱుంగవో యిటులు♦మాటలు చెప్పదె నీ వెఱింగినన్. ౨౯౮

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి పరిహాసముగా మాటలాడిన భావము తెలిసికొని లక్ష్మణుఁడును బరిహాసముగానే యనుచున్నాఁడు. ఓసీ! వెఱ్ఱిపిల్లా! నేను దాసుఁడను. నన్నుఁ బెండ్లాడి నీవు దాసివై వీరిసేవ సేయుచుందువా? నీ చక్కఁదనమునకు నీవు దాసిగానా యుండఁగోరెదవు? అబ్జవర్ణి-అనబ్జవర్ణిని యని పరిచ్ఛేదము గ్రహింపనగు. ఈ మహాత్మునకు నేను బంటనై సేవచేయుచున్నానే, అది నీకుఁ దెలియదా యేమే! నీకుఁ దెలియదులే. తెలిసియుండిన నేనేమి దాసుని వానిని మగనిఁగాఁ జేసికొనుటయేమి యని తలఁచియుందువు.

తే. ఆ సమృద్ధార్థునకునసి♦ద్ధార్థ! నిజము,ముదిత వమలవర్ణిని నీవ♦ముద్దు లొలుకు
భార్యవు కనిష్ఠురాలవై ♦ బ్రదుకు చుందు,వింత తలఁపవ నన్ను నే♦ నేమటందు.

ఆ సమృద్ధార్థునకున = ఆ యధికలాభము గలవానికే. ఓసి సిద్ధార్థురాలా! నిజమ=నిశ్చయము, ముదితవు = సంతోషపెట్టుదానవు. (౨) ఆ సమృద్ధార్థునకున్ +

అసిద్ధార్థరాలా, నిజము + అముదితవు, అని వాస్తవార్థము, అమల వర్ణినివి = నిర్మల వర్ణము (కాంతి) గలదానవు.

ముదితవు + అ = ముదితవ, మలవర్ణినివి = మైలతోఁగూడిన కాంతిగలదానవు, కనిష్ఠరాలవు = చిన్న భార్యవు.

తాత్పర్యము

అటువంటి సమృద్ధమైన యర్థముగలవానిని సిద్ధార్థవు నీవే సంతోషింపఁజేయఁ గలదానవు. నిర్మలకాంతిగల దానవు కావున నీ వాయననే వరించితివా, నీవు చిన్న పెండ్లామవై కులుకుచు ముద్దులొలుకుచుందువు. మగవారికిఁ బెద్దపెండ్లాలమీఁదనుండు ప్రేమకంటెఁ జిన్నపెండ్లాలమీఁదఁ బ్రేమ యెక్కువ కదా. ఈ మాత్ర మాలోచింపలేవే, నిన్నే నే నేమందును.

తే. ఈవిరూపఁ గరాళను ♦ నీయసతిని, నిర్ణతోదరి వృద్ధను ♦ నట్టి నిన్ను
భార్యఁ గైకొను నిటువంటి♦పరమరూప, విడిచి మానవి నెవ్వఁడే♦ వేడ్క సేయు?

విరూపను = వికారస్వరూపముగలదానిని. కరాళను = భయంకరమైనదానిని, అసతిని = దుష్టస్త్రీని, నిర్ణతోదరి = పెద్ద పొట్టగలదానిని, వృద్ధను = ముసలిదానిని, అగు నిన్ను నట్టి యని యొక యర్థము. ఇట్టి సీతను నట్టి యని రెండవయర్థము, పరమ + రూపయని యొక యర్థము, పరమ్ + అరూప యని రెండవయర్థము.

అటుగాక విరూపాది శబ్దములు సీతాపర్యాయములుగా భావించు నెడ.

విరూపను = విశేషసౌందర్యము గలదానిని. "రూపస్స్వభావే శుక్లాదా సౌందర్యే నాటకేపిచ॥ నానా॥ ర॥ త్రిలోకైకసుందరి యని యర్థము.

అసతిని, "నవిద్యతే అన్యాసతీ సా" అటువంటిది మఱియొక స్త్రీలేనిది, అనుత్తమ, అఘోరశబ్దములవలె.

కరాళను = పొడవైన దంతములుగల దానిని, కరాళో దంతురే తుంగే దారుణేపిచ కథ్యత ఇతి.

నిర్ణతోదరి = నిమ్నమైన యుదరము గలది. తనుమధ్య యని యర్థము.

వృద్ధను = జ్ఞానగుణశీలముల యందు వృద్ధను. ఎవ్వఁడే = (౧) ఎవ్వఁడైనను, (౨) వ్యతిరేకార్థము బోధించు ప్రశ్న.

ఈ యర్థము మహేశ్వరతీర్థీయానుసారము.

తాత్పర్యము

ఇటువంటి వికారస్వరూపను భయంకరను నసతిని పెద్ద పొట్ట గలదానిని ముసలిదానిని జానకిని నట్టి నిన్ను భార్యగాఁ గైకొనును. ఇటువంటి పరమసుందరిని విడిచి యెవఁడు మనుష్యస్త్రీకై వేడుకపడును, పడఁ డని భావము.

రెండవది ఇటువంటివికారను...అగు నిన్ను నట్టి,భార్యయగు సీతను గైకొనును గాని పరమవికారస్వరూపవైన నిన్నెవఁడే గ్రహించునని వాస్తవార్థము.

కం. అని లక్ష్మణుండు పలికిన, విని యది పరిహాస మగుట ♦ వెకలి యెఱుఁగకే
చని పర్ణకుటీరములో, జనకసుతాయుతున కసమె ♦ స్మరమర్దిత యై. ౩౦౨

వెకలి = బుద్ధిలేనిది, స్మరమర్దితయై = మన్మథునిచే గొట్టఁబడినదై.

తాత్పర్యము

అని లక్ష్మణుఁడు పలుకఁగా నా బుద్ధిలేనది యవి పరిహాసవచనము లని తెలిసి కొనలేక నిజమని నమ్మి పర్ణశాలలో సీతతోనుండు శ్రీరామచంద్రునొద్దకుఁ బోయి మదనతాపవశమున నిట్లనెను.

తే. ఈ విరూపను నసతిని ♦ నీకరాళ, నిర్ణతోదరిఁ జేపట్టి ♦ నీవు నన్ను
గారవింపవ మ్రింగి యీ♦కరిత నిపుడు, సవతిపోరాటములు లేక ♦ సౌఖ్యపడుదు.

తాత్పర్యము

ఈ విరూపను నసతిని ఈ కరాళను నిర్ణతోదరిని గ్రహించి నీవు నన్ను గారవింపకున్నావు, కావున దీని నిపుడే మ్రింగి సవతిపోరు లేక సౌఖ్యపడుదును.

తరలము. అని కురంగకిశోరలోచన ♦ నాయలాతనిభాక్షి హూ
మ్మనుచు రోహిణిమీఁదఁ బాఱు మ♦హోత్తరోల్క యనంగ రాఁ
గని మహాబలశాలి రాముఁడు ♦ గ్రక్కునం బిగఁబట్టి కిం
కను సుమిత్రతనూజుతో ననుఁ ♦ గంటె లక్ష్మణ రక్కసిన్. ౩౦౩

కురంగకిశోరలోచనన్ = జింకపిల్ల కన్నులవంటి కన్నులుగలదానిని, అలాతనిభాక్షి = కొఱవితో సమానమైన కన్నులుగలది, హూమ్మనుచున్ = హూంకారము చేయుచు, మహోత్తర = మిగుల గొప్పదగు, ఉల్క = కొఱవి నక్షత్రమువలె, రాన్ = వచ్చుటను, గ్రక్కునన్ = శీఘ్రముగ, కింకను = కోపముతో, రక్కసిని, రాక్షసీ శబ్దభవము, దీనివలన నిప్పుడు శూర్పణఖ నిజస్వరూపముతో నున్నట్లు గ్రహింపఁదగు.
తరలము. న భ ర స జ జ గ లు ౧౨-వ యింట యతి.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పినదై జింకపిల్ల కన్నులవంటి కన్నులుగల సీతపైఁ గొఱవుల వంటి కన్నులుగల శూర్పణఖ రోహిణిమీఁదికి గొఱవి నక్షత్రముపోయినట్లు రాఁగాఁ జూచి మిగుల బలశాలియగు శ్రీరామచంద్రమూర్తి దానిని బిగఁబట్టి కోపముతో లక్ష్మణుఁ జూచి యిట్లనెను.

పరిహాసమాడిన వీరికిఁ దనయందుఁ గామము లేదని యెఱిఁగి పోవును గదా యని శ్రీరామచంద్రమూర్తి తలఁచెను గాని యది విపరీతముగఁ బరిణమించెను గావునఁ గోపగించెను.

కం. నీచులతో నెప్పుడుఁ బరిహాసక మాడంగఁ గూడ ♦ దక్కట యిదె సీ
తాచపలాక్షియు స్వస్థత, నే చందంబునను బ్రతికి ♦ యొసఁగునొ కనుమీ. ౩౦౪

నీచులతో = నీచకులము, నీచగుణము నీచబుద్ధి గలవారితో, పరియాచకము = హాస్యము, హాస్య మెఱుఁగనివారితోను బరిహాసమాడరాదు, స్వస్థః = నెమ్మదిని.

లక్ష్మణా ! నీచులతోఁ బరిహాసమాడుట తప్పు, అట్లు మనము చేయుటచే నీకష్టము కలిగెను. దీనివాతఁబడక సీతాదేవి యెట్లు బ్రతికి సుఖించునో యాలోచింపుము.

—♦ లక్ష్మణుఁడు శూర్పణఖ ముక్కు సెవులను గోయుట ♦—

తే. ఈ సహోదరి నసతిని ♦ నీ విరూప
నీమదోన్మత్త రాకాసి ♦ నిపుడ పట్టి
చేయుము విరూప నన్న న♦మేయబలుఁడు
కోపమున దాని ముకుసెవుల్ ♦ గోసె నసిని. ౩౦౫

మదోన్మత్తః = గర్వముచే దేహము తెలియనిదానిని, విరూపను = రూపము మాలినదానిఁగా, ఇది తొలుతనే విరూప కావున దీనిని మఱింత విరూపనుగాఁ జేయుము, అమేయబలుఁడు = పరిమాణములేని బలముగలవాఁడు, అసినిః = కత్తిచే.

తాత్పర్యము

ఇది స్త్రీ. ఆయుధము ధరించి యుద్ధమునకు వచ్చినదికాదు. కావునఁ జంపరాదు. శిక్షింపకున్న నిది పోదు కావున నీ మహోదరిని నసతిని విరూపను బలగర్వముచే దేహము తెలియనిదానిని రాకాసిని నిపుడే పట్టుకొని విరూపనుగాఁ జేయుము. అనిన మహాబలశాలిస్వామైన శూర్పణఖకంటె మహాబలశాలియగు లక్ష్మణుఁడు ఱెటాలునఁ గత్తిదూసి యది యెదిరించినను విడువక పట్టి దాని ముక్కుచెవులు తెగఁగోసి ముక్కిడిసేసెను.

తాం ఖడ్గ ముద్గమ్య, కర్ణానాసాం ప్రచిచ్ఛేద ॥ పద్మ, అని రాముఁడే ముక్కు సెవులు కోసెనని యున్నది. యుద్ధమున భటులు జయించిన రాజు జయించినాఁడందురు. భటు లోడిన రా జోడె నందురు. అట్టులే యిదియు నని గ్రహించునది.

నేరములేక దండింపరాదను న్యాయము ననుసరించి యింతవఱకు వారు సైరించిరి. ఇప్పుడు సీతను మ్రింగఁ బ్రయత్నించుటచే శిక్షింపవలసివచ్చెను. ఇది సీతాదేవికిని సమ్మతమైన కార్యమే.

శ్రీరామచంద్రమూర్తియందు శూర్పణఖ స్నేహబద్ధభావయేకాని విరోధభావము కలది కాదుగదా, అట్టిదానిని దండింపవచ్చునా ?

తనయందుఁ బ్రీతిగలవారైనను దనవారియందుఁ బ్రీతిలేక వారిని ద్వేషించువారిని భగవంతుఁడు సైఁపఁడు. కావున శూర్పణఖ కీ దండనము. రామచంద్రుని ద్వేషించి సీతయందు మనస్సుంచిన రావణుఁడును దండ్యుఁడే. కావున సీతారాముల

నిరువురను సేవింపవలయును. అదియునుగాక దాని కామము ధర్మవిరుద్ధము. విధవయయ్యు రతిగోరుట దుష్టము కావున దండ్యయయ్యె.

ఇచట ముక్కు సెవులు గోసెనని కలదు. ఇవి స్తనోష్ఠముల కుపలక్షణము. అనఁగా ముక్కు చెవులు మాత్రమే కాక చన్నులు పెదవులుకూడఁ గోయఁబడెనని యర్థము. కామాంధలైన స్త్రీల కిటుసేసిన మరల వ్యభిచరింపకుందురని కాఁబోలు రాముని యభిప్రాయము. "నికృత్త కర్ణనాసోష్ఠాం చకార రఘునందనః" అను భారత వాక్యము మహేశ్వరతీర్థీయమం దుదాహరింపఁబడెనుగాని యేలొకో యిది ముద్రిత ప్రతులందుఁ గానరాకున్నది. శూర్పణఖ రావణుని జూచినపట్టున "హతేషు తేషు రక్షస్సు తత శ్శూర్పణఖా పునః। యయౌ నికృత్తనాసోష్ఠీ లంకాం భ్రాతు ర్నివేశన" మ్మని కలదు. స్కాందమున, "లక్ష్మణః తూర్ణముత్థాయ కరవాలేన వీర్యవాన్, కర్ణౌ స్తనౌ నాసికాంచ అచ్ఛిన ద్రామశాసనాత్" అని కలదు. మహేశ్వరతీర్థీయము.

ఉ. ముక్కును వీను లీకరణి ♦ మొక్కలు వోయిన మొత్తుకొంచుఁ బే
రుక్కునఁ గారుమబ్బు వలె ♦ హోయని కానయు మాఱుమ్రోయ నా
రక్కసి బొబ్బ వెట్టుచును ♦ రక్తము గాఱ వికారరూపయై
యక్కసుతోడ నేడ్చుచు వ♦నాంతరవీథులఁ బాఱె గ్రక్కునన్. ౩౦౬

వీనులు=చెవులు, ఈ కరణిన్=ఈ విధముగ, కారుమబ్బు=వానకాలమందలి మేఘము, కానయున్=అడవికూడ, గోడలు,కొండలు ఇటువంటి వస్తువులు ప్రతిధ్వని యిచ్చునుగాని నడుమ విచ్ఛిత్తిగల చెట్లు మొదలయినవి ప్రతిధ్వని నీయవు అయినను దాని కూఁతదెబ్బకుఁ జెట్లుకూడఁ బ్రతిధ్వను లిచ్చెనని తెలియునది. లేదా దూరముగనుండు కొండలు ప్రతిధ్వనించె నని యెఱుఁగనగు; అక్కసు=ఆక్రోశ శబ్దభవము, శూర్పణఖ యింతగ నేడ్చినది గాయముల బాధచేఁగాదు. నలుగురు నవ్వుదురని మనుష్యులచే విరూపనైతినే యని యవమానముచే.

తాత్పర్యము

ముక్కుసెవు లీవిధముగా మొక్కలుపోఁగా లబలబ నోరుకొట్టుకొనుచు రొమ్ము గ్రుద్దికొనుచు వానకాలమందలి మేఘ ముఱిమినట్లు, లడవి ప్రతిధ్వను లీనునట్లు పెద్ద ధ్వనితో బొబ్బలు పెట్టుచు నెత్తురు గాఱుచుండ వికారరూపము మఱింత వికారము కాఁగా మనుష్యులు తన్నిట్లు చేసిరే నలుగురు నవ్వుదురే యని యాక్రోశముతో నేడ్చుచు నడవులలోఁ బడి వేగముగఁ బరువెత్తెను.

తే. చని జనస్థానమందు రా♦క్షసపరీతుఁ, డైనసోదరు ఖరుఁ గని ♦ యార్తనాద
మడర దివినుండి పడియెడి♦పిడుగుపగిది, నేలఁబడి పెద్ద యెలుఁగున ♦ నేడ్చుచుండె.

రాక్షసపరీతుఁడు = రాక్షసులచేఁ జుట్టఁబడినవాఁడు, పిడుగు - ఇది వేగమును రాఁగల యనిష్టమును దెలుపును.

తాత్పర్యము

ఇట్లు పరుగెత్తిపోయి జనస్థానమందు రాక్షసులచేఁ జుట్టుకొనఁబడియుండు తన తమ్ముని ఖరుని జూచి యేడుపు ధ్వనితో నాకాశమునుండి పిడుగు పడినట్లు దబాలున నేలఁబడి పెద్దపెట్టున నేడ్చుచుండెను.

—♦ ౧౯-వ సర్గము. ఖరుఁడు శూర్పణఖ వికృతవేషమును జూచి కోపించుట ♦—

కం. తడియుఁగ నెత్తుట దేహము, పుడమిం బడి వికృతరూప♦మున నేడ్చెడు న
ప్పడఁతుకఁ గని యాగ్రహమున, నుడుకుచు ఖరుఁ డిట్లు లనియె ♦ నుగ్రాకృతియై.

ఉగ్రాకృతియై = భయంకరమైన యాకారముగలవాఁడై.

తాత్పర్యము

దేహము నెత్తుటఁ దడియుచుండఁగా నేలమీఁదఁబడి వికారరూపమున నేడ్చుచున్నదానిని జూచి ఖరుఁ డిట్టులనియె.

ఉ. ఎవ్వఁ డనాగసాచలమ ♦ హిష్ఠవిషోజ్జ్వలకృష్ణసర్పముఁ
గ్రొవ్వున వ్రేలితోఁ జెనకెఁ ♦ గ్రోలె నెవండు విషంబుఁ? గంఠమం
దెవ్వఁడు చుట్టుకోఁ గలిగె ♦ హీనమనీషను గాలపాశ? మే
నెవ్వడి నేగి వాని యిదె ♦ నేలను గూల్చెద, నెత్రు పీల్చెదన్. ౩౦౯

అనాగసు=అపకారముచేయక (బుస్సుమసరైన నసక), అచల=కదలక యొక చోటఁ దనపుట్టలోఁ దానుండు, మహిష్ఠ=పెద్ద, విషోజ్జ్వల=విషముచేఁ బ్రకాశించు, కృష్ణసర్పమున్=నల్లత్రాఁచుపామును, క్రొవ్వునన్=కండకావరముచేఁ బాముగదా కఱచు ననుభయములేక, వ్రేలితోఁ జెనకెన్=వ్రేలితోగిల్లెను, వ్రేలితోఁ జెనకుటచేఁ బాము తటాలున దానిని గఱచుటకు ననుకూలపడును, హీనమనీషను=బుద్ధిలేమిచే, కాలపాశమును=మృత్యువుచేతియందలి త్రాళ్ళను మృత్యువుతానై వేయక యూరకున్నను బుద్ధిలేనివాఁ డగుటచే దానిని దానే మెడకువేసికొనెను నెఱ + వడి=నిండు వేగమున, నెత్రు=నెత్తురు.

తాత్పర్యము

ఎవరిని దఱుక బెదరింపక బుసకొట్టక తనంతటఁ దాను బుట్టలోఁ గదలక యుండు మహాభయంకర విషమును గల నల్లత్రాఁచుపామును నెవఁడు వ్రేలితోఁ బొడిచెను? ఎవఁడు విషము త్రావెను? ఎవఁడు తనకై తానే మృత్యుపాశమును దన కంఠమునకుఁ దగిలించి బిగించుకొనెను? చెప్పుము. నే నిప్పుడే తెప్పునఁ బోయి వానిని జంపి నెత్తురు త్రావెదను.

కం. బలవిక్రమసంపన్నవు, వలచినచో వలచినట్లు ♦ వలచిన వేషం
బులఁ దిరిగెద వీ దుర్దశఁ, గలిగి యర్ధాయు వెవఁడు ♦ గలిగించె నొకో. ౩౧౦

బలవిక్రమసంపన్నవు = నీవు దేహబలసంపత్తి, విశేషవిక్రమము గలవు. వలచినచోన్=కోరినచోట్ల, వలచినట్లు=నీ కోరినప్రకారము, వలచిన వేషంబులన్ = కోరిన రూపము ధరించి, దుర్దశ=కష్టస్థితి, అర్ధాయువు = సగముప్రాయమునందే చచ్చువాఁడు.

తాత్పర్యము

నీవు బలము విక్రమము విశేషముగఁ గలదానవు. కావున సామాన్య బలవంతులు నిన్నుఁ బరిభవింపలేరు. నీవు కోరినచోట్లఁ గోరిన రూపముతోఁ గోరినట్లు తిరుగుదానవు నిన్నడ్డగించువారు లేరు. ఇట్టి నిన్ను నెవఁడే దీర్ఘకాలము బ్రతుకనిచ్చలేనివాఁ డిట్టి కష్టస్థితికిఁ దెచ్చెను.

క౦. సురవరగంధర్వాదులఁ, బరమర్షులనే నెవండు ♦ పరమాపకృతిన్
దురుసునఁ జేయ దెగించిన, గురుసాహసుఁ డెవఁడు చెప్పుము ♦ కూల్చెద వానిన్.

పరమాపకృతిన్ = గొప్ప యపకారమును, దురుసునన్ = దుష్టుతనముచేత, గురుసాహసుఁడు = గొప్ప తెంపు గలవాఁడు.

తాత్పర్యము

సురలందుఁగాని గంధర్వులందుఁగాని పరమర్షులందుఁగాని దౌర్జన్యముచే నిటువంటి గొప్ప యపకారము చేయఁ దెగించినవాఁడెవఁడు చెప్పుము. వాని వధించెదను.

ఆ. సురలయందుఁ బాక♦సూదనుఁడును సహ
స్రాక్షుఁ డగు మహేంద్రుఁ ♦ డైన నాకు
నప్రియంబుఁ గూర్ప ♦ నడలెడి నా నెవ్వఁ
డోకొ నాకనిష్ట ♦ మొనరఁ జేయు. ౩౧౭

పాకసూదనుఁడును=ఇంద్రుఁడును, అడలెడిన్=భయపడును, అనిష్టము=అప్రియమైన కార్యము, పాకాసురుఁడు = వృత్రాసురుని సోదరుఁడు.

తాత్పర్యము

దేవతలలోఁ బాకాసురుని జంపిన వేయిగన్నుల యింద్రుఁ డయినను నాకు నప్రియమైన కార్యముచేయ భయపడుచుండును. మఱియెవ్వఁడు నాకు నప్రియము చేయఁగలవాఁడు.

క౦. నీరముల నున్న క్షీరము, సారస మానెడు విధానఁ ♦ జయ్యన నిదె నా
నారాచంబుల నాతని, ధారుణిఁ బడవైచి త్రావెదన్ బ్రాణంబుల్. ౩౧౮

తాత్పర్యము

నీళ్లలో నున్న పాలను హంస త్రావినట్లు శీఘ్రముగ నిదిగో నిప్పుడే నాబాణములచే నతని భూమిని గూల్చి వాని ప్రాణవాయువులు త్రావెదను.

ఉ. క్రూరరణాంగణంబునను ♦ గూలిచి వేని సఫేనరక్తమున్
ఘోరమనాకునోత్కరము ♦ గ్రోలఁగఁ గోరెదు? శాతబాణని
ర్దారితమర్మసంఘుఁ డయి ♦ దారుణగృధ్ర పతత్రిజాతి కా
హారముగా నెవండో యిటు ♦ లాఁతిడిపెట్టె నినున్ సహోదరీ. ౩౧౮

క్రూరరణాంగణంబునను=భయంకరమైన యుద్ధభూమియందు. వేనిన్ = ఎవనిని, సఫేన=నురుగుతోఁగూడిన, రక్తమున్ = నెత్తుటిని, ఘోర = భయంకరమైన,

మదాశుగోత్కరము=నా బాణముల సమూహము, క్రోలఁగన్=త్రావఁగా, శాత = పదునైన, శర=బాణములచే, నిర్దారిత = చీల్పఁబడిన, మర్మసంఘుఁడై=గుండెలు మొదలగు మర్మస్థానసమూహములు గలవాఁడయి, దారుణ=భయంకరమైన, గృధ్ర=గ్రద్దలయు, పతత్రి=పక్షులయు, జాతికిన్=జాతికి, ఆఱడిపెట్టను=బాధించెను.

తాత్పర్యము

అయ్యో! నాముద్దుటక్కా! యుద్ధభూమియందు నెవ్వని జంపి వాని నెత్తురును నురుగుతోడ నాబాణములు త్రావఁగఁ గోరెదవు? నా పదునైన బాణములచేఁ జీల్పఁబడిన యెవఁడు గ్రద్దలు మొదలగు పక్షిజాతి కాహారము గాఁగోరెదవు. ముద్దు ముద్దుగా ముక్కరకు నోయకుండ నెవ్వఁడు ని న్నిట్లు బాధపఱిచెను?

ఉ. కావఁగ వాని దేవతలు ♦ గారు సమర్థులు, కారు రాక్షసుల్,
చావు నిజంబు వానికిని ♦ శాతశరాహతి; సేదదేఱి నీ
వే విధినైన వాని గుఱు ♦ తేర్పడఁ జెప్పు మటన్న భ్రాతృవా
క్యావళి నాలకించి బహు♦శాస్త్రములు వెల్లిగొనంగ ని ట్లనున్. ౩౧౫

తాత్పర్యము

అటువంటి వానిని రక్షించుటకు దేవతలు సమర్థులుగారు, రాక్షసులుగారు, నా బాణముల దెబ్బచే వానికిఁ జావు సత్యము, కావున బడలిక దీర్చుకొని నిన్నీప్రకారముచేసిన వాని గుఱుతులు చెప్పుము, అని ఖరుఁ డడుగఁగా దోఁబుట్టిన వాని మాటలు విని విస్తారముగఁ గన్నీళ్లు కాల్వలుపాఱ నీప్రకారము చెప్పెను.

—♦ శూర్పణఖ ఖరునకు సీతారామలక్ష్మణుల వృత్తాంతముఁ జెప్పుట ♦—

చం. తరుణులు ప్రాప్తరూపులును ♦ దాపసవేషులు సౌకుమార్య భా
స్వరులు మహాబలుల్ విశద ♦ వారిజ నేత్రులు వల్కలాజినాం
బరులును వన్యమూలఫల ♦ భక్షులు దాంతులు ధర్మ్మలున్ సహో
దరులును రామలక్ష్మణులు ♦ దాశరథుల్ సుమి వారు రాక్షసా. ౧౩౬

తరుణులు=యౌవనవంతులు, ప్రాప్తరూపులు=సుందరులు, తాపసవేషులు = తపస్వులవేషములు వేసినవారు, సౌకుమార్య = సుకుమారత్వముచే, భాస్వరులు = ప్రకాశించువారు, మహాబలుల్ = మిగుల బలముగలవారు, విశదవారిజలోచనులు = వికసించిన కమలములవంటి కన్నులుగలవారు. వల్కలాజినాంబరులు = నారచీరలు, కృష్ణాజినము వస్త్రముగాఁ గలవారు, వన్య=అడవియందుఁ బుట్టిన, మూల ఫల భక్షులు=గడ్డలు పండ్లు దినువారు, దాంతులు = ఇంద్రియనిగ్రహము గలవారు, ధర్మ్మలున్ = ధర్మమందుండువారు, సహోదరులు = అన్నదమ్ములును, శ్రీరామలక్ష్మణులును = శ్రీరాముఁడు లక్ష్మణుఁ డను పేర్లుగలవారు, దాశరథుల్ = దశరథ రాజ కుమారులు.

తా త్ప ర్య ము

ఈ స్థితి ప్రకారము చేసినవా రెవ్వరనెదవా. చెప్పెద వినుము! రాక్షసుడా! వారు యౌవనవంతులు, చక్కదనము గలవారు, మునులవేషముల వేసినవారు, కోమలదేహులు, మహాబలసంపన్నులు, వికసించిన తామరపూవులవంటి కన్నులు గలవారు, నారచీరలు కృష్ణాజినములు వస్త్రములుగాఁ గలవారు, అడవియందుఁ బుట్టిన గడ్డలు పండ్లు దినువారు, ఇంద్రియనిగ్రహము గలవారు, ధర్మమార్గమున నుండువారు, అన్నదమ్ములు, దశరథరాజకుమారులు, శ్రీరామలక్ష్మణు లను పేర్లు గలవారు.

నిన్ను విరూపను జేసినవా రెవ్వరు అను ప్రశ్నకు సరియైన ప్రత్యుత్తరము దశరథ రాజకుమారులు శ్రీరామలక్ష్మణు లని చెప్పవలసియుండఁగా తరుణులు అని యేల వారి సౌందర్యవర్ణనము ప్రారంభించెను? కామము విఘ్నమై క్రోధముగాఁ బరిణమించినను లోని కామము చావలేదు; వైరాగ్యము జనింపనులేదు. గాఢముగ శ్రీరామలక్ష్మణ రూపములందు మనస్సు నాటియుండుటచే వారిమూర్తులే దానికిఁ గన్నులయెదుటఁ గానవచ్చుచున్నవి. అట్లు కామమోహిత యగుటచే దానిని నిగ్రహింపలేక సోదరుని యెదుటను లోని భావమునే ప్రకటించుచున్నది. ఇచ్చట గోపికల "గురుణా మగ్రతో వక్తుం కింబ్రవీమి న నః క్షమమ్। గురవః కింకరిష్యంతి, దగ్ధానాం విరహాగ్నినా" పెద్దవారియెదుట నిటుల మాటలాడుట మాకుఁ దగదని చెప్పెదవా! విరహ మనెడి యగ్నిచే దగ్ధమైన మమ్ముఁ బెద్దవా రేమి చేయఁగలరు? వి-పు. "కామాతురాణాం న భయం నలజ్జా" కామాతురులకు భయములేదు, లజ్జ లేదు. ఈ కారణముచే రామలక్ష్మణుల సౌందర్యవర్ణనముచేఁ బ్రారంభించెను. ఇది స్త్రీయగు శూర్పణఖయందు విశేషముగాదు శ్రీరామచంద్రమూర్తిని జూచినవా రందఱు అనుకూలురు గాని ప్రతికూలురుగాని యిట్టివారే యగుదురు. పురుషుఁడు బ్రహ్మచారి వానరుఁడైన హనుమంతుఁడు సీతాదేవితో నా మగని లక్షణము లెవ్వి యని యడిగినపుడు త్రిస్థిరుఁడు త్రిప్రలంబుఁడు అని చెప్పవలసియుండఁగా "రాముండు కమల పత్రవిశాలలోచనుండు" అని సౌందర్యమునే చెప్పెను.

2. "సుప్త ప్రమత్తకుపితానాం భావజ్ఞానాం దృష్ట" మను న్యాయము ప్రకారము నిద్రించువారియందు ఒడలెఱుఁగని మత్తులందుఁ గోపించినవారియందు యథార్థము బయలుపడును. కావున శూర్పణఖ ముక్కుచెవులు ఛేదించుటచేఁ బ్రమత్తయుఁ గుపితయునై యిది చెప్పవచ్చును, ఇది చెప్పరా దను తెలివి మఱచి హృదయమున నుండినది బయలుపఱిచెను.

"కన్యా వరయతే రూప" మనునటులు కామినుల నాకర్షించునది పురుషుల వయసును, సౌందర్యముగదా, కావున వానినే చెప్పెను.

౩. తన్ను శ్రీరామచంద్రుఁడు కదా విరూపను జేయించినవాఁడు. ఆయన యాజ్ఞకు లోబడి లక్ష్మణుఁ డా కార్యము చేసెను. కావున నపరాధి శ్రీరాముఁడే. కావున శ్రీరామచంద్రు నొకనినే దూషింపవలసి యుండఁగా నిరువురను గలిపి చెప్ప నేల ? కర్త కార్యముచేసినవాఁడు, కారయిత చేయించినవాఁడు, నిరువురు దోషులే, ఇరువురు రూపసంపన్నులే. ఇరువురు సమాన వయస్కులే, ఇరువురను శూర్పణఖ వలచినదే, ఇరువురు మహాబలులే, అన్నిట నిరువురు సమానులే, కావున నిరువురను గలిపి చెప్పెను.

ప్రాప్త+రూపులు, ప్ర+ఆప్తరూపులు ప్రకృష్టముగఁ బొందఁబడిన సౌందర్యము గలవారు. అనఁగా లోకమున సుందరపురుషు లని ప్రఖ్యాతి వహించిన కంతు జయంత వసంత నలకూబరాదులకు సౌందర్యభిక్ష యీయాయన పెట్టినదే. ముష్టిసౌందర్యమే యిట్లుండ నిఁక సౌందర్యసౌభాగ్యఖనుల సౌందర్య మెట్లుండవలె అంతటి సుందరు లని భావము.

భిక్ష మెట్లనిన "అంగాదంగాత్సంభవసి" అనునట్లు తండ్రి యంగములోఁ గొంత తీసికొనియే కదా కొడుకు పుట్టును. అట్టులే మన్మథుఁడు దండ్రి యందములోఁ గొంతయే గలవాఁడు. కావుననే కదా 'సాక్షాన్మన్మథమన్మథ' యని భగవంతుఁడు చెప్పఁబడెను.

ప్రాప్తరూపులు, "ఉత్పన్నం ద్రవ్యం క్షణ మగుణం తిష్ఠతి" పుట్టిన ద్రవ్యము క్షణకాలము గుణహీనమై యుండును, అను న్యాయము ప్రకారము లోకములోని వస్తువు లన్నియుఁ బుట్టినతరువాత గుణములను బొందినవే రూపదాక్షిణ్య సంపన్నునిఁ గౌసల్య గనెను అని చెప్పుటచే వీరు గుణములతోనే పుట్టినవారు కాఁబట్టి వీరి కివి క్రొత్తగా వచ్చినవికావు, సహజములు. ఈ కారణముచే వారి సౌందర్యమునకు వయస్సు కారణము గాదు. దానివలన నది యెక్కువయుఁ గాలేదు.

"రామేతి రామేతి సదైవబుద్ధ్యా విచింత్య వాచా బ్రువతీ తమేవ," రాముఁడు రాముఁ డని యాయననే బుద్ధియం దాలోచించి నోరను నాయననే చెప్పెను. అన్నట్లును స్త్రీలు సర్వదా స్మరింపఁదగినది సుమా ఆయన రూపము.

స్త్రీలు కామినులు, కాముకలు వారు మోహించుట గొప్పయా యనకుము "పుంసాం మోహనరూపాయ" పురుషుల దృష్టిని గూడ హరించునది సుమీ వారి సౌందర్యము. సౌందర్య మంతయు ననుభవింపగలవా రెవ్వరు? కన్నో ముఖమో యే యవయవముమీఁద దృష్టిపడునో యా దృష్టి మనస్సా యవయవముపై నంతతో నిలిచిపోవును. దాని సౌందర్య మనుభవించుచు నందే మేఁకు కొట్టి బిగించినట్టు నిలిచిపోవునంతటి సౌందర్యము త్రిభువనసుందరి సీతయు.

"చూడదు రాక్షసాంగనలఁ జూడదు పుష్పఫల ద్రుమంబులం,జూడదు రమ్యహర్మ్యముల సుందరి డెందము నందు నెప్పుడుఁ జూడఁగఁ గోరుచుఁ భువనసుందరు

రాముని నొక్కసిరి" అన్నట్లు రాముని సౌందర్యమును జూచి సిగ్గుపడుచుండెను. మనుష్యులమాట యేల?

ధన్యా దేవా స్సగంధర్వా స్సిద్ధాశ్చ పరమర్షయః
మమ పశ్యంతి యే నాథం రామం రాజీవలోచనమ్॥

అన్నట్టు లోకకన్నులను జూచినంత మాత్రముననే దేవతలుగూడ ధన్యులగుదురు. వారు నేత్రాలోకముచేతనే ధ్యానధారణాసమాధులు కుదిరి బ్రహ్మానంద వశు లగుదురు. తక్కిన యవయవసౌందర్యానుభవము వారికి లేదు అట్టిదిసుమీ వారి సౌందర్యము.

అటయిన వారి కాసౌందర్యము వయస్సువలన వచ్చినదా? కాకుండిన వేషము వలన హెచ్చినదా.

తాపసవేషులు = పాడుగోడకైనఁ బైపూఁత శృంగార మన్నట్టులు కొందఱు విశేషసౌందర్యముగలవారు గాకపోయినను సొమ్ములచేత వస్త్రములచేత నలంకరింపఁబడి విశేషసుందరులుగానే కానవత్తురు. వీరి దిట్లు పెట్టుసాగసా పుట్టుసాగసా యనిన వారికి వస్త్రభూషణాద్యలంకారములు లేవు రాజవేషములు లేవు. నీ వెవ్వడు చూచు మునులవేషముతో జడలు ధరించి యున్నారు. ఈ వేషముతోనే యింత సుందరముగాఁ గానవచ్చు వా రలంకరించుకొన్నప్పుడు మఱియెట్లు గానవచ్చెదరో.

అయినఁ దపసులై గాలిలో నెండలో వానలోఁ దిరుగువారై రేని వారిదేహములు కఠినములై యుండును గదా. అది సౌందర్యహానికరముగాదా యందువేమో, కాదు సౌకుమార్యభాస్వరులు = సుకుమారత్వముచేఁ బ్రకాశించువారు. కన్నులు ముక్కు లోనైన యవయవములు పుట్టువుతో నెట్లువచ్చెనో యట్లు సౌకుమార్యము పుట్టువుతోనే వచ్చినది. కావున గాలికి వానకుఁ బోవునది కాదు. కావున మీ దేహములవలెఁ గర్కశములైనవి కావు. పుష్పములవలె సహజకోమలములు. కావుననే కదా వారిదేహములను బూవులతోఁ బోల్చి "అతసీపుష్పసంకాశ"మ్మని చెప్పఁబడెను. ఎటువంటి సౌకుమార్య మనుకొంటివో పరులు వ్రేలితోఁ దాఁకుటచేఁగాదు పూలతోఁ దాఁకినను నక్కడ దేహము కందును, అంతియేకాదు. ప్రౌఢస్త్రీల దృష్టిపాతమునుగూడ సహింపలేనంతటి సౌకుమార్యముసుమా, సుకుమారత్వమే సౌకుమార్యము. సు + కుమారుఁడు = కుమారుఁడు మన్మథుఁడు, 'కుమారో మాసు తే స్కందే' నానా॥ ఆ మన్మథునికంటె సుష్ఠువైనవాఁడు. దేహములేని సౌందర్య మదియేమి సౌందర్యము? దాని ననుభవించువారెవరు? వీ రట్లుగాదు, సు + కు + మార + భాస్వరులు = సు = బాగుగా, కు = భూమియందు, మారభాస్వరులు = మన్మథత్వముచేఁ బ్రకాశించువారు. దేవలోకమున దేహములేక యెవరికిఁ గానరాక యుండు మన్మథుని వంటివారుగారు. భూమియం దందఱకుఁ గానవచ్చునట్లు లిరువురై యున్న

వారు. వారు నన్నుఁ బట్టుకొనినపు డా స్పర్శసుఖముచే నావంటిదానికిని దేహము తెలియలేదు. అట్టిస్థితిలో వారు నా ముక్కు చెవులు గోసిరి. అటుగాకున్న వారు కత్తియెత్తఁగానే పరువెత్తి రాకపోయితినా ? వారు నన్ను విడుచువఱకు నా ముక్కు చెవులు పోయినవిషయమే నాకుఁ దెలియదు, అంతటి సుకుమారులు.

మహాబలులు=అంతటి కోమలదేహులైన నా బాణములఘాత నేమి సహింపఁగలరు, నిమిషములోఁ జంపెద నందువేమో జాగ్రత్త సుమా.

మహాబలులు = మిగుల బలవంతులు, వారిబలము నీ వెఱుఁగవు, మారీచాదు లెఱుఁగుదురు. 'కింక గొననేని యసాధ్యుఁడు నిందువెల్లినేఁ । ఘనతరబాణపంక్తి నరికట్టు సతారము స్రగహంబు నా । ఘనపదముఁ శరంబులఁ బగుల్చుఁ జుమీ రఘురాముఁ డుద్ధతిఁ.' కావున బలహీనులని తలంపకుము, మహాబలుల్ = ఇది తన కామోద్రేకము ననుసరించి చెప్పుచున్నది. "రామస్తు సీతయా సార్థం విజహార బహూన్ ఋతూన్" అన్నట్లు లెడఁదెగక స్త్రీలతో సంవత్సరముల కొలది భోగించినను క్షీణింపని బలముగలవారు. అనుభవింప సామర్థ్యము బలము కావున నిట్టిబలము గలవాఁడు. దీనివలన దుర్బలులగు మనుష్యస్త్రీలకేగాక నావంటి రాక్షస స్త్రీలకుఁగూడ రతితృప్తి గలిగింపఁగలవాఁడు. సాధారణముగ లోకమున స్త్రీలు తమ చాతుర్యవిశేషములచే మగవారిని మఱపి తమయందు వారి కాశపుట్టించి లోపఱుచు కొనఁగలవారు. అట్టి స్త్రీలే వారిని జూడఁగానే తామే కామపరవశ లగుచుండ నిఁక వారిని గెలుచు ప్రయత్నము లేమి చేయఁగలరు.

ఓసీ, సముదాయావయవశోభ బాగుగనే యుండవచ్చునుగాని యవయవములఁ బ్రత్యేకముగఁ జూచిన నెట్లుండునో యనెదవా.

విశదవారిజలోచనలు = వికసించుటచే విశాలమైన కమలములవంటి కన్నులు గలవారుగాని 'సంరక్తనయనా ఘోరా' యన్నట్లు నీవలె నెఱ్ఱని మిడిగ్రుడ్లుకలవారు గారు. "ధన్యులు రాజీవాక్షునిఁగను దేవ సిద్ధ మానిప్రవరుల్" అన్నట్లు దేవసిద్ధమానులను గూడ నా నేత్రసౌందర్యసంపత్తి ధన్యులను జేయఁగలదు. ఇచ్చట నేత్ర శబ్దమునకు దృష్టియనియే యర్థము గ్రహింపవలెను. ఇట్లు చెప్పుటచే సీతవలె రాముఁడును గాటుకకంటివాఁడని, రక్తాపాంగుఁడని చెప్పుటతో విరోధింపదు. అవి మహాపురుషలక్షణములు. విశదమనఁగా దెలుపు, "విశదో ధవళేవ్యక్తే శుచౌ త్రిషు గుణేతువా॥" నానా ॥౪॥ కావున దెల్లని కమలములవంటి దృష్టులు గలవారను టచే సత్వగుణము కన్నులఁ గురియుచున్నదని భావము. తమోగుణము గల కన్నులందుఁ దూఁగుబోతుతనము, కావిరంగు నుండును. రజోగుణము ప్రబలిన కన్నులు కోపముతోఁ గూడినవై యుండును. అట్టివి లేక వారికన్ను లెల్లవేళ సత్వప్రసన్నములై యుండును. ఇట్లు చెప్పుటచే వీరి కన్నులయందు శాంతిరసము కుదురై నిలిచెనని భావము. "శాంతి నిర్మలహీరకాంతిగతుల" నని, శాంతిరసము వజ్రమువలెఁ దెల్లనిది.

రహస్యవిషయములను మనస్సు దాఁపగలిగినను దానిగుట్టును కన్నులు రట్టు చేయును. కామము కోపము లోనైనవి కన్నులవలననే తెలిసికొనవచ్చును. ఆ కారణముచే 'ఆత్మానం మానుషం మన్యే' నేను మనుష్యుఁడ నని తలఁచెదను, అని పరత్వము దాఁచి మాటలాడినను, ఈయన కన్నులు చూడఁగానే "యథా కప్యాసం పుండరీక మేవ మక్షిణీ" యను శ్రుతిని స్మృతికిఁ దెచ్చి యీయన పుండరీకాక్షుఁడైన పరమపురుషుఁడని చాటించుచున్నట్లున్నవి సుమా !

కన్నులు తేటగా నుండుటచే విశదవారిజనేత్రు లని చెప్పఁబడెనుగాని కమల మెంత వికసించినను మూరెడు వైశాల్యము గల దగునా, బారెడు వైశాల్యము గల దగునా ? ఈ కన్ను లట్టివిగావు. లీలావిభూతిని నిత్యముక్త బద్ధాఖ్యులగు వారిని నేక కాలమందు లోఁగొని యనుగ్రహించు సామర్థ్యము గలవి. కావున వాని వైశద్య మనిర్వచనీయము.

మహాబలులు, విశదవారిజనేత్రులు, భుజబలముచే నితరులపైఁ దూపులు ప్రయోగించకయు చూపులచేతనే వశపఱచుకొనఁగలవారు. వారి చూపులు సోఁకి నంతన నెట్టి స్త్రీలును బురుషులును బాధాక్రాంతు లగుదురు.

చేతులు తిమబలముచేఁ బరులఁ బాధాక్రాంతులఁ జేయఁగా ప్రసన్నదృష్టులు వారిభయముఁ బాపి యనుగ్రహించును.

వల్కలాజినాంబరులు = కృష్ణాజినము ను వస్త్రముగాఁ గట్టుకొన్నవారు, 'ఇయ మధికం నోజ్ఞా వల్కలేనాపి తన్వీ' "కిమివహి మధురాణాం మండనం నాకృతీనా" మ్మన్నట్లు, ఈ శకుంతల నారచీరెలు గట్టుకొనియున్నను మిగుల రమణీయమై యున్నది. సౌందర్యముగలవారి కేది యాభరణము కాఁజాలదు! శాకుంతల. ఏది కట్టుకొన్నను ఏదిపెట్టుకొన్నను సుందరుల సౌందర్యము పోవి లేదు. అది యొక సొగసుగానే యుండును. సుస్వరముగలవా రేడ్చినను బాగుండునుగదా.

ఇట్లు వారు నారచీరలు గట్టుకొన్నను మిక్కిలి సుందరులుగానే కానవచ్చుచున్నారు.

మఱియొక యోజన :—

ఖరుఁడు రావణుఁ డను మా పేర్లు వినఁగానే దేవతలుకూడ గడగడలాడుచుండ మా సోదరి నిట్లు పరిభవించి దీనిమూలమున మమ్ముఁ బరిభవింపఁదలఁచిన మహావీరు లెంతటి బలశాలులో యని ఖరుఁడు భయపడుఁగా వాని ముఖనేత్రవికారములచే వాని మనస్థితిఁ దెలిసికొని వానికి ధైర్యమువచ్చునట్లు చెప్పి యుద్ధమునకుఁ బురికొల్పుటకై శూర్పణఖ యిట్లు చెప్పుచున్నది. తరుణులు = యౌవనదశయం దుండువారు, నీవలెఁ బ్రౌఢులుగారు. యౌవనే విషమైషిణా మ్మనునట్లు, స్త్రీలతోఁ గూడి సుఖింతమను కోరిక గలవారేకాని, చావునకుఁ దెగించి యుద్ధమునకు వచ్చువారు గారు.

ప్రాప్తరూపులు=ప్రాప్తరూప సురూపాభిరూపాః పండిత సౌమ్యయోః, ప్రాప్తరూప, సురూప, అభిరూపశబ్దములు పండితునందును, సుందరమైన దానియందు వర్తించును. వీరు పండితు లగుటచే వాక్కలహమందు గెలువఁగలవారే కాని బాణయుద్ధమందు గెలువ శక్తిగలవారు కారు. 'కన్యా కామయతే రూప'మ్మను నటులు సౌందర్యమున వీరు స్త్రీలను వశపఱచుకొనఁగలరు గాని పరాక్రమముచే శత్రువులను వశపఱచుకొను సామర్థ్యముగలవారు కారు.

వన్నె బొమ్మలవలె పైపై వన్నెల్ పచరించువారేకాని లోఁ బసగలవారు కారు.

తాపసవేషులు ముక్కుపట్టుకొని యొకమూలఁ గూర్చుండ నేర్చిన వారే కాని వీరులవలె రణరంగమున వ్యవహరించువారు గారు.

సౌకుమార్యభాగ్యగులు. పుష్పములవలె మిగులఁ గోమలమైన దేహముగల వారు. నీ బాణఘాతము నేమి యోర్వఁగలరు? అదియును గాక శ్రీమంతులు = శ్రీమంతుని పుత్రులు. అల్లారు ముద్దుగా నెండకన్ను వానకన్ను ఎఱుఁగక పుట్టి పెరిఁగినవారు. ఇట్టివారు ఖరకరుఁడవైన నీ బాణపరంపరకుఁ బ్రతాపమునకు నేమి యోర్వఁగలరు? వారిని జూచితివా, వీరా మనతో యుద్ధము చేయఁగలవారని నీకే తెలియఁగలదు.

మహాబలులు = కేవలము బలహీనులు, దేహబలము, ధనబలము, మనో బలము, బంధుబలము, సేనాబలము లోనగు బలములేవియు లేనివారు. ఇట్టివారు ఈ బలసంపత్తి పూర్తిగాఁగల నీతో నేమి యుద్ధముచేయఁగలరు కేవలము దుర్బలు లగుట నేకార్యమునందు సమర్థులుగారు. అదియును గాక మహతీ=రక్షణీయా + అబలా యయోస్తౌ మహాబలౌ, కాళ్ళబందము మెడకురిత్రాడువలెఁ దమచే రక్షణీయ యగు భార్యగలవారు. మనము యుద్ధములోఁ జచ్చిన నిది యెవరిపాలగునో యని దానిని రక్షించుటకై పరువెత్తిపోదురుగాని చచ్చినఁ జచ్చితిమని సాహసము చేయఁ గలవారు గారు.

అంతటి దుర్బలులు గాకున్న నొక యాడుదానిమాటఁ దిరస్కరింపక యడవుల పాలగుదురా? "న యుద్ధయోగ్యతా మస్యపశ్యామి సహ రాక్షసైః॥" రాక్షసులతో యుద్ధముచేయ నా కొడుకు సమర్థుఁడుగాడని వారితండ్రియే చెప్పునంతటి బలహీనులు. తమకొడుకులు మొనగాండ్రు సమర్థులని తండ్రులు చెప్పుట లోక ధర్మము. ఎంతో విశేషకారణము లేకున్న నిట్లు తండ్రి చెప్పునా! విదళవారిజ నేత్రులు, అయ్యయ్యో ముందు మించి యీ రాక్షసి నవమానించితిమే. దీని కన్నలు ప్రబలు లున్నారే! వారందఱు మనపై వత్తురేమో. ఏమిరా దైవమా యని ముఖ మంతయు కన్నులు చేసికొని భయముచే విశాలముగా విచ్చి తెప్పపాటులేక దిక్కులు చూచుచున్నవారు.

వారిజము=కమలము, వారియందు = నీళ్ళయందున్నప్పుడు స్వస్థానబలముచే బాగుగనే యుండును. కాని ఆస్థలము విడిచి వెలుపల వచ్చినఁ జెడును. అట్లులే వీరును దను పట్టనమందు గొప్పగ రాణించువారైనను వనములందు వీరిబల మేమి పనిచేయును. నీకా స్థానబలము గలదు. వారి కదిలేదు. ఇట్టి స్థితియందు వారి మనస్సు విధమును వారి కన్నులే తెలుపుచున్నవి.

వారు స్వదేహబలహీనులే యగుదురుగాక! ధనమూలమున బలము సంపాదింపవచ్చును గదా యందువేమో అందును వారు సమర్థులుగారు.

వల్కలాజినాంబరులు = వస్త్రములు కొనుటకు ధనములేక దరిద్రులై చెట్లపట్టలు, మృగచర్మములు కట్టుకొని కప్పుకొని తిరుగుచున్నారు. కట్టుగుడ్డలకు గతిలేని వారు జీతముల నిచ్చి యుద్ధభటులనా తోడితేఁగలరు ? కట్టుకొనను గప్పుకొనను ఏకవిధమైన యాచ్ఛాదనము లేదు. చెట్లను యాచించి నారపట్టలు మృగముల హింసించి చర్మములు సంపాదించి కాలక్షేపము చేయుచున్నారు.

వన్యమూలఫలభక్షులు = అంత దుర్బలత్వమునకుఁ గారణ మేమందువా ? కడుపునిండఁ దిన బలకరమైన యాహారము లేదు. అడవులలోనుండు కందమూలములఁ దినువారి కేమి దేహబల ముండును ?

దాంతులు. – ఆ కారణముచే నింద్రియవ్యాపారము లుడిగియుండువారు.

ఆ కారణముచేతనే 'భగ్నాత్కృ(?)షేః భాగవతా భవంతి' యన్నట్లు ధర్మమార్గమం దున్నవారు.

వారిలో బలిష్ఠుఁ డెవ్వఁడు బలహీనుఁ డెవ్వఁ డందువా ? ఇద్దఱు సమానులే.

మఱియొక యోజన :—

కయ్యమునకు నెయ్యమునకు వియ్యమునకు సమత వలయు నన్నట్లు నాతో సమానునితో యుద్ధముచేసినఁ బేరు ప్రతిష్ఠయుఁ గలుగునుగాని యిటువంటి దుర్బలులతో యుద్ధముచేసి గెలిచినను లాభ మేమి యని నిస్పృహుఁ డగునేమో యని తలఁచి వానికి రోషపౌరుషములు వర్ధిల్లఁ జెప్పుచున్నది.

ఓరీ ఖరా! యిదివఱకు నీవు దండకయందు ముక్కుపట్టుకొని తపస్సుచేయుచుఁ బ్రతికృతిచేయలేని పేదబాఁపలను హింసించినవాఁడవే కాని నిలువఁబడి యుద్ధము చేసినవారితోఁ బోరినవాఁడవు కావు. ఆ కారణమున నేను బలశాలిని, పరాక్రమవంతుఁడ ననుకొనుచున్నావు. ఇఁక నా యాటలు చెల్లవు. నా ముక్కు సెవులు గోసినవా రెటువంటివా రనుకొంటివో తెలియునా ?

తరుణులు = మంచి కోడెవయస్సున నుండువారు, యౌవనమదముచే యుద్ధమనిన సిద్ధమనువారు. అట్టివారితో యుద్ధముచేసినఁగదా నీ మగతనము బయటపడును. వా రింకను నెటువంటివా రని తలఁచితివో, తరుణులు = బాలురుగారు, ముసళ్ళుగారు. క్రొవ్విన కోడెవయస్సునం దుండువారు పరిభవమును సహింపనీని

వయస్సునందుండువారు. 'యౌవనే విజిగీషూణా' మ్మన్నట్లు యుద్ధముచేయవలె. గెలువవలె నను నుత్సాహముగల వయస్సునందుండువారు. నీశక్తి కిట్టివాఁడొక్కఁడే చాలియుండఁగా నిరువు రట్టివారున్నారు. నీవంటి పిఱికిపంద యటువంటివారితో నేమి యుద్ధముచేయఁగలఁడు.

ప్రాయ మున్నంతమాత్రముననే లాభ మేమి ? యుద్ధమునందు జయమిచ్చునది యిదియొకటియా యందువేమో, ప్రాప్తరూపులు. 'సింహోరస్కౌ మహాబాహూ' మ్మన్నట్లు శత్రువులను గెలుచుటకు వారి కాయుధములతోఁ బనియే లేదు. వా రుత్తచేతులతో వచ్చినను మీరు వారిని గెలువలేరు. వారి భుజములతీరు వక్షము సౌరు చూడఁగానే అబ్బా మహావీరు లని శత్రువులు భయపడి కాలికి బుద్ధిచెప్పుదురు. దేనిచే నిరూపింపఁబడుదురో యది రూపము. వీరు బాల్యమునుండి శత్రువుల గెలిచి కీర్తికి ముఖ్యస్థాన మను ప్రసిద్ధిగాంచినవారు. ఏ యప్రసిద్ధులను నెంతప్రయాసపడి గెలిచిరో యందువేమో సౌకుమార్యభాస్వరులు = అనాయాసముగ శత్రువుల గెలుచువారు. ఏసాహాయ్యముచే వా రట్లు చేయఁగల రందువేమో.

మహాబలులు = దేహబలము మనోబలము ఉపాయబలము వీనిచేత "కిన్ను సాగరమేఖలాం మహీం దహతి కోపేన" కోపించి సముద్రములతోడి భూమిని నింకను దహింపలేదా యను నంతటి శక్తిసామర్థ్యముగలవారు. అంతియకాదు.

కం. ఈనిఖిలావని యక్షుల, దానవ రక్షఃపిశాచపతులను వలతేఁ, భానుజ యంగుళి
కొనచే, నేనిమిషములోనఁ జిమ్మనే మిత్తిఁగనన్. యుద్ధ. అన్నట్లు లింతకార్యము చేయఁగలవారు. ఇట్టివారియెదుట నీ చతురంగబలముతో నీవేమి చేయఁగలవు. అవమానము సహించి ప్రాణభీతి నింటనే యుండుము. అదే నీకు శరణము.

మహాబలులు = ఎంతకాలము నిద్రాహారాదులు వదలి యుద్ధముచేసినను శ్రమము గలిగింపని అతిబల మహాబల యను విద్యలు గలవారు. మీ రట్టు లాఁకలి దప్పు లోర్వఁగలరా ? ఇది నీ కెట్లు తెలియునందువేమో.

విశదవారిజనేత్రులు -ఇన్ని సంవత్సరములుగ వా రెండలో గాలిలో వానలో మంచులోఁ దిరిగి తగిన నిద్రాహారములు లేక కాల్నడఁ దిరుగుచున్నను గొంచెమైన నేత్రకాంతి సౌందర్యము తగ్గినదికాదు. మనస్సునకు నేమిసంకటము దోఁచినను గన్నులవలనఁ దెలియునుగదా ? వారి కన్నులు నీటియందలి తామరలవలె నున్నవి. ఎంతటి శత్రులనైనను యుద్ధమందుఁ దృణప్రాయముగాఁ జూచువారు గావున వారికి వెఱపును గఱదలును లేవు. వీరుం డగుటక్ అన్నట్లు వారి కన్నులకు సంకోచవికాసములు లేవు. ఎల్లవేళల నేకవిధముగానే యుండును.

'ప్రీతివిస్ఫారితేక్షణా' మ్మన్నట్లు వారి కన్నులు శత్రువులను జూచునపుడును క్రోధముచే నెఱ్ఱనగావు. క్రౌర్యము దోఁపదు. ఉత్సాహముచే మఱిమఱి యంతకంతకు వికాసము గల్గ వగుచుండును. అయ్యో! మీ రెంతటి మతిహీనులు,శరణు అనిన

రక్షించెదనే, నిష్కారణముగ వీరు చావసిద్ధపడియున్నారే, పైఁబడి వచ్చినపుడు కొట్టకవిధిలేదు. నేనేమిచేయుదునని శత్రువుల విషయమందును 'రిపూణామపి వత్సలః' యన్నట్లు పరితాపమే యీయన కన్నులు తెలుపును.

వల్కలాజినాంబరులు=తాపసులంటివే, ఆకస్మికముగ పైఁబడిన నేమిచేయఁగల రందువా? దేహాభిమానము ప్రాణభయముగల భీరువులకుఁ గవచాదులు, వారికవియనావశ్యకములు. వారెప్పుడును నారవస్త్రమును నడుమునకుఁగట్టి కృష్ణాజినమును బైన బిగించికొని యుందురు. వారి దేహరక్షణమునకవి చాలును, వానిని భేదించు మగవాఁడేఁడీ. 'ధనుషా యుధి శాత్రవాన్' వింటిచేత రాముఁడు శత్రువులను గెలుచును. అని యుండుటచే వారికిఁ జేతవిల్లుండినఁ జాలును. కవచాదులు లేకున్న లోపములేదు. కనుక నీవు వారిమీఁదికి బోయితివా నేను ముక్కు కోయించుకొన్నరీతిని నీవు తల కోయించుకొందువు. కనుక నీ వింటనే యాఁడువారియెదుట దంభములు చెప్పుచుందుము. అదియే నీకు క్షేమమార్గము. నా యవమానము నేనెట్లైన సహింతును.

“ఒప్పని వాఁడైయెన, నొక యొప్పమి దండితుఁడైన దూఱఁగా నెప్పుడెఱుంగ నే నెదుర నేవిధముఁ జాటుగనేని రామునిన్” అనునట్లు సర్వలోకస్పృహణీయుఁడైన శ్రీరాముని కల్యాణగుణములు మిత్రులకు నమిత్రులకుఁ గూడ నానందకరములు గావునఁ దాను విరూపతనొందినను ఆయన రూపగుణవర్ణనాదులచే నానంద మనుభవింపఁగోరి యిట్లు వర్ణించె నని మహేశ్వరతీర్థీయము.

అంకాడుట, అందు విధవయై అంకాడుట దుష్టకార్యమని యే యాఁడుదానికి దెలియదు? తెలిసియుఁ గామబలంబునఁ దానే పైపడిపోయి పురుషుని వరించియు నతఁడు నిరాకరించెనేని యది పెద్దయవమానముగ నెంచి చిత్రాంగివలెఁ బ్రవర్తించుట దుష్టస్త్రీలయం దండఱయందు నుండుగుణమే. స్త్రీ మగవాఁడు తన్ను వలచి తన్నుఁ బ్రార్థింపవలయుననియే కోరుచుండును. అటువంటిది తానై కోరినను పురుషుఁడు నిరాకరించెనేని దానికిఁ గోపము రాకయుండునా? ఊర్వశి యర్జునుని శపింపలేదా? అట్లే శూర్పణఖయును తన్నవమానించుటచే వారల దండింపవలయునన్న క్రోధముండినను శ్రీరామచంద్రమూర్తి సౌందర్యాదులను మనస్సునుండి త్రోసివేయఁజాలక మఱియు నా ధోరణినే చెప్పుచున్నది.

క. భూవల్లభ చిహ్నాంకితు, లా వరగంధర్వనాయ ♦ కాభులు వారల్
దేవతలో మానవులో, భావింపఁగరాదు తేజ ♦ పరికించినచోన్. ౩౧౭

భూవల్లభచిహ్నాంకితులు=రాజచిహ్నములు గలవారు, వరగంధర్వనాయకాభులు = శ్రేష్ఠుఁడగు గంధర్వరాజుతో సమానులు.

తాత్పర్యము

తాము దశరథరాజకుమారులమని చెప్పిరికాని వారి తేజస్సు చూచిన వారి మాట నమ్మరాకున్నది. అయినను వారసత్యమాడువారు గారు. కావున వారి మాట

ప్రకారము వారు మనుష్యులో, నా యభిప్రాయము ప్రకారము దేవతలో చెప్పఁజాలను. చూచుటకు రాజచిహ్నములు ధరించినను గంధర్వరాజులతో సమానులుగా నున్నారు.

క౦. వారలమధ్యంబున నొక, నారీమణిఁ గంటిఁ దరుణి ♦ సర్వమనోజ్ఞా
కార సమస్తాభరణో, దార సుమధ్యమ సరోజ ♦ దళనేత్ర నటన్. ౩౧౮

సర్వమనోజ్ఞాకారన్ = శ్రోత్రయగు నింపైన యాకారముగల దానిని, సమస్తాభరణోదారన్ = అన్నివిధములయిన సొమ్ములు ధరించుటచే గొప్పదైనదానిని, సుమధ్యమన్ = సన్నని నడుముగలదానిని, సరోజదళనేత్రన్ = తామర రేకులవంటి కన్నులు గలదానిని, అటన్ = ఆ యాశ్రమమందు.

తాత్పర్యము

ఆ యిరువురనడుమ నొక ప్రాయంపుఁబడుచును సమస్తాభరణములు ధరించిన దానిని సన్ననినడుము గలదానిని తామర రేకులవంటి కన్నులు గలదానిని జూచితిని. అటువంటి సుందరిని నే నిదివఱకుఁ జూచియుండలేదు.

క౦. ఆ యువతి నిమిత్తంబుగ, నా యిద్దఱు నొక్క టగుచు ♦ సతతం బలె నీ
చాయ సనాథయునుంబలె, ఘాయని దురవస్థలకును ♦ ఘాల్పఱిచి రయా. ౩౧౯

తాత్పర్యము

ఆ పడుచు నిమిత్తమై వా రిద్దఱొక్కటై సన్న అంకటాలినివలె దిక్కులేనిదానివలె నిటువంటి దురవస్థల పాలుచేసిరి, అయా = తండ్రీ. జ్యేష్ఠభ్రాత కావున.

ఒకఁడు దండింపుమని చెప్పుట మఱియొకఁ డట్లు చేయుటచే నిరువురు రేకీభవించి రని భావము.

సీత యెట్లు నిమిత్త మాయెనో యామెకుఁ దనకు నేమి సంబంధమో చెప్పినది కాదు. రామునొద్దఁ జెప్పిన కారణ మిక్కడ నొప్పదు. మఱి యేమి చెప్పుటకుఁ దోఁపలేదు. ఆ కటాలినివలె ననుటచే అంకటాలి కిది తగినశిక్ష యని యేర్పడుచున్నది.

క౦. ఆ కుటిలశీలరక్తము, నీకహతుల వారి నురువు ♦ నెత్తురుఁ దమిచే
నాకంఠముఁ గ్రోలఁగ ని,మ్మా కోరిక నిదియె మొదటి ♦ యభిలాష సుమీ. ౩౨౦

కుటిలశీలరక్తము = వంచనము స్వభావముగాఁ గల యాసీతయొక్క నెత్తురును, అనీకహతుల = యుద్ధమందుఁ జంపఁబడిన వారియొక్క, తమిచేన్ = కోరికదీర, ఆకంఠము = కుత్తుకబంటిగ, క్రోలఁగనిమ్మా = త్రాగునట్లుచేయుమా? మొదటి యభిలాష = ముఖ్యమైన యభిలాష.

తాత్పర్యము

తాను రామలక్ష్మణుల వర్ణించినవిధమును బట్టియు తన పరిభవమునకు సీత యెట్లు నిమిత్తమయ్యెనో యదియు శూర్పణఖ చెప్పకుండుటచేతను నిది కండక్రొవ్వునఁ గాముకయై పోయి పరిభవింపఁబడెను. దీని కీ శిక్షన్యాయ్యమే యని ఖరుఁడు దలంచునేమోయని వాని సందేహముదీరుటకై తానుసీతాదేవి నెత్తురు త్రావఁబోఁగా వారిరు

వురు తన్నుఁబరిభవించిరని చెప్పుచున్నది. దీని మాటలవలనను, నుత్తరకాండమందలి కుంభీనస వాక్యములవలన రాక్షసవిధవాస్త్రీలయందును జారత్వము విధవావివాహము గర్హ్యము లని యేర్పడుచున్నది.

ఆ కారణముచే నేను వంచనగుణము గల సీత నెత్తురు త్రాగవలెను. వారు జీవించియుండఁగా నది సాధ్యపడదు. కావున వారిని యుద్ధములో నీవు చంపవలెను. నురువుతోడి వారి నెత్తురు గొంతున కానుసట్లు నేను ద్రాగవలెను. ఇది నాముఖ్యమైన కోరిక. దీనిని గొనసాగనిమ్ము.

ఇట్లు చెప్పుటచే దీనికి సీతయందుఁ గ్రోధమే కాని రామలక్ష్మణులకు దీనికిఁ బ్రత్యక్షసంబంధము లేదని ఖరు డర్థము చేసికొనవలె నని దాని యుపాయము.

సీతానిమిత్తమై తన కిట్టిపరాభవము గలిగెననుట కేవల మసత్యముగాదు. సీతను జంపఁబోవుటచేఁగదా వా రామెనిమిత్తమై దాని నిట్లు పరిభవించిరి. సీత లేకుండిన రామలక్ష్మణులు తన్ను భార్యగా గ్రహించియుందు రనియే దాని యభిప్రాయము. కావున దోషము సీతయం దారోపించెను.

మహేశ్వరతీర్థీయమం దీ ఖరుని విషయ మిట్లు వ్రాయఁబడినది. "తస్మాద్యః క్రూరరూపేణ దేహేన హరతామృతమ్। విష్ణుర్దాశరథిర్భూత్వా, మోక్షయిష్యతి సువ్రత॥" అని విష్ణువు దశరథరాముఁడై పుట్టి శివశాపముచే రాక్షసత్వము నొందిన నీకు శాపమోక్షణము గావించునని యాయనచే ననుగ్రహింపఁబడిన చంద్రకాంతుఁ డను యాజ్ఞవల్క్యుని కొడు కీ ఖరుఁడు. ఆ కారణముచేతనే రామవృత్తాంతమును శూర్పణఖ చెప్పఁగా విని శ్రీరామచంద్రమూర్తి విష్ణువని యెఱిఁగి సపరివారముగ శ్రీరామచంద్రునిచేఁ జావఁగోరి చెల్లెలి ప్రీతికై పోలె యుద్ధార్థము రాక్షసులను బంపుచున్నాఁడు. ఈ సందర్భమున శేషధర్మములందలి భీష్మయుధిష్ఠిర సంవాదమందలి ఈ శ్లోకముల ననుసంధింపవలెను భీష్ముఁడు - యాజ్ఞవల్క్య సుతా రాజన్, త్రయోవై లోకవిశ్రుతాః। చంద్రకాంత మహామేధ, విజయా బ్రాహ్మణోత్తమాః। ఖరశ్చదూషణశ్చైతి, త్రిశిరా బ్రహ్మవిత్తమాః। ఆసన్ తేషాంచ శిష్యాంచ చతుర్దశ సహస్రధా॥ ధర్మరాజా! యాజ్ఞవల్క్యునకు చంద్రకాంతుఁడు మహామేధుఁడు విజయుఁడను మువ్వురు కొడుకులు గలరు. వారే ఖరుఁడు దూషణుఁడు త్రిశిరుఁడు ననువారైరి. వారి శిష్యులు పదునాలుగు వేవురు రాక్షసులైరి. కావున వారి వాక్యములు బాహ్యదృష్టికి బనుషములైనను వాస్తవమున సౌమ్యములే.

—♦ ఖరుండు పదునల్వురు రాక్షసుల శ్రీరాముని మీఁదికిఁ బంపుట ♦—

చం. అన విని దానిమాటలకు ♦ నాగ్రహమెత్తి ఖరుండు క్రూరులన్
దనుజవరేణ్యులం బదియు ♦ నల్వుర నంతకతుల్యతేజులన్
గని యనె దుశ్చరిత్రయగు ♦ కామినితో మనుజుల్ శరాసనో
ద్ఘనులు మృగాజినాంబరులు ♦ దారొకని నిల్చిరి దండకాటవిన్, ౩౨౧

అంతకతుల్యతేజులన్ = యమునితో సమానమైన తేజస్సుగలవారిని, దుశ్చరిత్ర = చెడునడవడిగలది-శరాసనోద్యతులు=కోదండములను ధరించుటచే గొప్పవారు, మృగాజినాంబరులు=జింకచర్మము వస్త్రముగాఁ గలవారు, దుశ్చరిత్ర=ఎటువంటి చరిత్రము కష్టసాధ్యమో యటువంటి చరిత్రముగలది సీతాదేవి. అనఁగా మహాపతివ్రత యని మహేశ్వరతీర్థీయము.

తా త్ప ర్య ము

అని యిట్లు శూర్పణఖ చెప్పఁగా ఖరుఁడు కోపించి క్రూరులు యమునితో సమానులు, నగు పదునలుగురు రాక్షసులను జూచి దండకారణ్యమందు నొక చెడు నడవడిగల యాఁడుదానితో నిరువురు మనుష్యులు కోదండధరులు కృష్ణాజినములు గట్టినవారు వచ్చినవారు.

తే. వారు హతులుగ మాయక్క • వాంఛపడియెఁ, జుండు నెత్తురు త్రావంగ • శూరులార
యప్పకోరిక దీర్పంగ • నరుగుఁడనిన, వీరు లరిగిరి యాసతి • వెంట రాఁగ. ౩౨౨

హతులుగన్ = చంపఁబడఁగా, వాంఛపడియె = కోరెను, అప్ప = అక్క.

తా త్ప ర్య ము

వారు చంపఁబడఁగా వారి నెత్తురుత్రావ మా యక్క కోరుచున్నది. కావున మీరు మాయక్కకోరిక నెఱవేర్పఁ బొండనఁగా వారు శూర్పణఖ రామలక్ష్మణులను జూపుటకై తమతోడ రాఁగా దండకారణ్యమునకుఁ బోయిరి.

రహస్యార్థము, హతులుగన్ =మనము చావఁగా, నెత్తురు త్రావంగన్ = మన నెత్తురుత్రావుటకుఁ గోరుచున్నది. కావున మీరు హతులుగన్ "హనహింసాగత్యోః" గత్యర్థములన్నియు జ్ఞానార్థకములు గావున హతులుగాఁగన్ = తెలిసికోఁబడినవారు అగుటకు, మీరు పోయి వారి వృత్తాంతముఁ దెలిసికొనిరండు పొండు. తీర్థీయాను సారము.

౨౦-వ సర్గము.

శా. వాతోత్క్షిప్తఘనోత్కరంబుపగిదిన్ • వారేగి యా భ్రాతలన్
సీతాయుక్తుల నాశ్రమస్థలసమా • సీనప్రభావంతులన్
దైతేయాంగన చూపఁ జూచి రల సీ • తానాథుఁ డా రాక్షసా
న్వీతన్ శూర్పణఖం గనుంగొని యను • దీప్తాస్యుఁడౌ లక్ష్మణున్. ౩౨౩

వాత = గాలిచే, ఉత్క్షిప్త = ఎగురఁగొట్టఁబడిన, ఘన = మేఘముల, ఉత్కరంబు = సమూహము, ఆశ్రమస్థల = ఆశ్రమప్రదేశమందు, సమాసీన = కూర్చుండిన, ప్రభావంతులన్ = తేజస్సుచేఁ బ్రకాశించువారిని, దైతేయాంగన=రాక్షసస్త్రీయగు శూర్పణఖ, రాక్షసాన్వీతన్ = రాక్షసులతోఁ గూడినదానిని, దీప్తాస్యుఁడౌ = కోపముతో మండుచున్న ముఖముగలవాఁ డగు.

తా త్ప ర్య ము

గాలిచే నెగురఁగొట్టబడిన మేఘములవలె వారువచ్చి సీతతోఁ గూడినవారిని, ఆశ్రమమందుఁ గూర్చుండిన తేజోవంతులగు నన్నదమ్ములను శూర్పణఖ చూపఁగా

జూచిరి. శ్రీరామచంద్రమూర్తి రాక్షసులతోడ వచ్చినదానిని జూచి కోపముచే మండుచున్న లక్ష్మణునితో నిట్లనుచున్నాఁడు.

ఉ. ఇంచుక నిల్వు మీ విచట ♦ నీ యెలనాఁగను గాచి వీరలం
ద్రుంచెద నన్న వల్లె యనఁ ♦ దూర్ణము సజ్యశరాసనుండు నై
కాంచనపుంఖబాణములఁ ♦ గైకొని కంజవిలోచనుండు దు
ర్వాంచకరాక్షసాధముల ♦ నంతఁ గనుంగొని పల్కె నీ గతిన్. ౩౨౮

ఇంచుక = కొంచెముసేపు, ఎలనాఁగను = స్త్రీని, సీతననుట, వల్లె = సరి, తూర్ణము = త్వరగా, సజ్య = ఎక్కుపెట్టఁబడిన, శరాసనుండు = విల్లు కలవాఁడై, కాంచనపుంఖ = బంగారు పిడులు గల, కంజవిలోచనుండు = కమలములవంటి కన్నులు గలవాఁడు. యుద్ధము తటస్థించినను నేత్రములందు వికారము లేక మునుపటివలెనే యున్నవాఁడని భావము, దుర్వాంచక = చెడుమోహముగల.

తాత్పర్యము

లక్ష్మణా! కొంచెముసేపు నీ విచట సీతను రక్షించుకొనుచుండుము. వీరి నేను జంపి వచ్చెదను. అని చెప్పఁగా నాయన యంగీకరించెను. అంతఁ గమలనేత్రుఁడగు శ్రీరామచంద్రమూర్తి విల్లెక్కుపెట్టి బంగారు పిడి గల బాణములఁ దీసికొని ద్రోహులను రాక్షసులను జూచి యిట్లు చెప్పెను.

సీ. రామలక్ష్మణులను ♦ భ్రాతల మే మల,దశరథు సుతులము ♦ దండకాట
విని సీతతోఁ గూడ ♦ విహరింపవచ్చిన, వారము ఫలమూల ♦ వారభక్ష
కులము తాపసులము♦లలి ధర్మరతులము, దాంతుల మే మిటు♦దండకవని
నిచ్చ వసింతు మి♦ టేల మాపై మీరు, వచ్చుట మి మ్మఘ♦వర్తనులను
తే. మునులయాదేశమునఁ జేసి ♦ యనిని గిట్టి, ద్రచ్చి వధయింప వచ్చిన♦ వార మేము
ధైర్యవంతుల రేనియుఁ ♦ దలఁగకుండు, బ్రతుకుపై నాశ గలిగినఁ♦ బాఱిపొండు.

ధర్మరతులము=ధర్మమందు దాసక్తిగలవారము. దాంతులము = ఇంద్రియనిగ్రహము గలవారము. అటచే మీవలె నొకరిని మేమై బాధించువారము గాము. అఘవర్తనులను = పాపపు నడవడి గలవారిని, కిట్టి = సమీపించి, ద్రచ్చి = చీల్చి.

తాత్పర్యము

ఓరాక్షసులారా! మే మన్నదమ్ములము, రామలక్ష్మణు లనువారము, ప్రసిద్ధుఁడైన దశరథమహారాజ కుమారులము. ఈ దండకారణ్యమందు నీ సీతతో సంచారము చేయు వచ్చినారము; కందమూలఫలములను భక్షించువారము; తపస్సుచేయువారము; ధర్మమందు దాసక్తిగలవారము. ఇంద్రియనిగ్రహము గలవారము. కావున మావలన నెవ్వరికే కీడును లేదు. మా యిష్టప్రకారము మేము సర్వజనసాధారణమైన దండకయందు వసింతుము. మీ యిండ్లయొద్దకైన వచ్చినవారము గాము. మిమ్ము బాధించినవారము గాము. ఇట్టి మామీఁద నిష్కారణముగ మీరేల క్రోధమువహించి యిచ్చటికి వచ్చి

తిరి. ఇంత దండకారణ్యమున్న దే. అందే యెందైన నుండరాదా యందురేమో. మీరైె మమ్ముఁ జెనకితిరా మునులయాజ్ఞచే దుష్టవర్తను లగు రాక్షసుఁను మిమ్ము యుద్ధమందుఁ జంప వచ్చినవారము. మీరు ధైర్యముగలవారైతిరా నిలిచి యుద్ధము చేయుఁడు. బ్రతుకుమీఁదఁ గోరిక యుండెనా పాఱిపొండు, మిమ్ము బాధింపను.

కం. అన నా పదునల్వురు కింకను రాముని కిట్లు లనిరి ♦ కరముల వెలుఁగన్
సునిశితశూలాయుధములు, విను రామా! మేము వచ్చు♦వృత్తాంతంబున్. ౩౨౬

కింకను=కోపముచే. కరములన్ = చేతులందు, సునిశితశూలాయుధములు = పదునుగల యీటెలను నాయుధములను.

తాత్పర్యము

ఆ పదునాలుగుమంది రాక్షసు లామాటవిని కోపించినవారై చేతఁ బదునైన శూలములు పట్టుకొని రామా మేము వచ్చిన వృత్తాంతము వినుము.

ఉ. కోపముఁ బుట్టఁ జేసితి న♦కుంఠపరాక్రమవంతుఁ డైన మా
భూపతికిన్ ఖరేంద్రునకుఁ ♦ బోయెద రెం దికమీఁద మేనితో
నీ పదునల్వురం గదిసి ♦ యొక్కటి నిల్వఁగనైన శక్యమే
యేపున సంగరస్థలిని ♦ నేద్దెఱ మార్కొను మాట లేటికిన్. ౩౨౭

అకుంఠపరాక్రమవంతుఁడు = మొక్కవోని పరాక్రమము గలవాఁడు, మేనితోన్ = శరీరముతో, సంగరస్థలిని = యుద్ధభూమియందు.

రహస్యార్థమున, పోయెదరెం దికమీఁద మేనితో, అనఁగా మీరు దేహ మున్నంతవఱకు మాకు భయపడి యెక్కడికిఁ బోవలసిన పనిలేదు. ఇచటనే యథా సుఖముగా నుండవచ్చును. మీరు మిమ్ముఁ జంపవచ్చితిరే మేమెట్లు లిందు నుండఁగల మందురేమో, పదునల్వురన్ = ప్రథమార్థంబున ద్వితీయ, కావున నీ పదునాలుగురును ససహాయుఁడైన నిన్నుఁ గదిసి నిల్వఁగనైన సాధ్యమా, మా రాజు పంపెను. వచ్చితిమి, ఇఁక నీయొద్ద నిలుచుటకే సాధ్యముగానప్పుడు నీతో యుద్ధమునందు నెదిరించుట యనుమాట యేల? కావున నీవు సుఖముండవచ్చును.

తాత్పర్యము

రామా! పూర్ణపరాక్రమవంతుఁడైన మా ఖరమహారాజునకు మీరు కోపము వచ్చునట్లు చేసితిరి. ఇఁక మీఁద దేహముతో నెందుఁబోఁగలరు మరణించిపోవలసిన వారే, ఈ వచ్చియుండు పదునాలుగురు రాక్షసులయెదుట నొంటరివాఁడవై నిలువఁగానైన సాధ్యమా? అదియే సాధ్యము గానప్పుడు మమ్మెదిరించి యుద్ధము సేయుట యనుమాట తలంపనేల.

— ♦ శ్రీరాముఁడు పదునల్వురు రాక్షసుల జంపుట. ♦ —

మ. ఇవి మద్బాహువిముక్త ఘోరపరిఘా ♦ హీనోజ్జ్వలచ్ఛూలముల్
దవులన్ వీర్యము విల్లు బాణములు చే♦లా వీడుదం చద ఱో

క్కవడిం జిమ్మిన శూలసంఘముల లోకస్తుత్యుఁ డాయన్నిటిన్
రవలై నేలఁ దొరంగ నేసెను సువర్ణస్ఫారబాణావళిన్.

మద్బాహువిముక్త = మాబాహువులచే విడువఁబడిన, ఘోర = భయంకరమైన, పరిఘ = ఇనుపకట్లగుదియలు, అహీన = గొప్పవగు, ఉజ్జ్వలత్ = మెఱయుచున్న, శూలముల్ = శూలములు, తపులన్ = నిన్నుఁదాఁకఁగా, వేలా = మతిహీనుఁడా, ఒక్కవడిన్ = ఒక్కసారిగ, ఏకకాలమందు, లోకస్తుత్యుఁడు = లోకముల వారిచే స్తోత్రముచేయఁబడినవాఁడు, రవలై = చిన్న చిన్నతునుకలై, తొరంగన్ = పడునట్లు, సువర్ణస్ఫారబాణావళిన్ = బంగారుచేఁ బ్రకాశించు బాణసమూహములచే

తాత్పర్యము

ఇదె చూడుము, మేము ప్రయోగించు గుదియలు శూలములు నిన్నుఁ దాఁకఁగా నీవు వీర్యము విల్లు బాణములు నన్నియు వదలెదవు. అని యందఱొక్కసారిగ శూలములను విసరివైవఁగా జగద్వందితుఁడైన శ్రీరామచంద్రుఁడు బంగారు చెక్కఁబడిన బాణములచే వానినెల్లఁ జిన్నచిన్నతునుకలై నేల రాలఁగొట్టెను.

సీతాదేవి నిరపరాధులు రాక్షసులనైనను జంపరాదని బోధించియుండెను. దానిని శ్రీరామచంద్రమూర్తియు నామోదించెను. శూర్పణఖ నిర్నిమిత్తముగ సీతాదేవిని జంపవచ్చెను. కావున శ్రీరామచంద్రమూర్తి కాముకియగు విధవకుఁ జేయవలసిన శిక్ష చేసి పంపెను. అది దేహబలము బంధుబలము గలది కావున రాక్షసులను గలహమునకుఁ దోడితెచ్చెను "నసామరక్షస్సుగుణాయ కల్ప్యతే" యన్నట్లు రాక్షసులయందు సామము నిష్ప్రయోజనము, వారు దండైకసాధ్యులు, కావున రామచంద్రమూర్తి స్వరక్షణార్థము యుద్ధము చేయవలసివచ్చెను.

ఇప్పుడు రాక్షసులు తన్నుఁజంప నాయుధములు ప్రయోగించి ప్రథమాపరాధులైరి. వీరును సామసాధ్యులుగారు. కావున వారి యాయుధములను దొలుత ఖండించి తరువాత వారినే వధించుచున్నాఁడు.

ఉ. ఏసియు నంతఁ బోక మనుజేంద్రవరుండు శిలాశితార్కభా
భాసుర రుక్మపుంఖశితబాణచతుర్దశ మూని వింటఁ గ్రూ
రాసురసంహతిం గని బలారి శతారమునట్లు వైవఁగా
దూసి యురంబులన్ ధరణిఁదూఱె శరంబులు, రాక్షసాధముల్. ౩౨౯

శిలాశిత = (1) ఒఱపు రాతిమీఁదఁ బదునుపెట్టఁబడిన (2) రాతియందును వాఁడియైనది. అనగాఁ బాషాణములనైన భేదించునది, అర్కభా = సూర్యకాంతితో, భాసుర = ప్రకాశించు, రుక్మపుంఖ = బంగారు పింజగలిగిన, శిత = కఱుకైన, బాణచతుర్దశము = పదునాలుగు బాణములను, వింటన్ = ధనుస్సునందు, ఊని = సంధించి, క్రూర = కఠినచిత్తులై హింసచేయు, అసుర = రాక్షసుల, సంహతిన్ = సమూహమును, బలారి = ఇంద్రుఁడు, శతారము = నూఱంచులుగల వజ్రమును,

తా త్ప ర్య ము

రాక్షసుల శూలములు తునుకలై పోవునట్లు వేసియు సంతతో నూరకుండుట ప్రమాద మని తలంచి వారిపైఁ బదునైన మెఱుఁగులీనుచు సూర్యునివలెఁ బ్రకాశించు బంగారు పిడులుగల పదునాలుగు బాణములను బ్రయోగింపఁగా నవి వారి ఱొమ్ములందు దూఱి వీఁపున వెడలి నేలపై రాలెను.

తే. ఛిన్నమూలద్రుమంబుల♦ చెలువు దోఁప, శోణితార్ద్రాంగులై గత♦ప్రాణు లగుచుఁ బడిరి పుడమిని వారల♦పాటు చూచి, భీతిగొని పాఱె నాచుప్ప♦నాతి మరలి. ౩౨౦

ఛిన్నమూల=వేళ్లు ఛేదింపఁబడిన, ద్రుమంబుల= చెట్లయొక్క, శోణితార్ద్రాంగులై = నెత్తుటిచేఁ దడిసిన శరీరములు గలవారై, గతప్రాణులు = ప్రాణములు పోయినవారు, పుడమిని = నేలమీఁద, చుప్పనాతి = శూర్పణఖ.

తా త్ప ర్య ము

ఆ రాక్షసాధములు వేళ్ళు ఛేదించినఁ బడుచెట్ల వలె నెత్తుటఁదడిసిన దేహములతోఁ బ్రాణములు పోయినవారై భూమిమీఁద బడిరి. వా రట్లు పడఁగాఁ జూచి భయపడి శూర్పణఖ తిరిగి పరుగెత్తెను.

రాక్షసుల శూలములు విఱిసిపడఁగా వారు నిరాయుధులైరికదా వారిని రామచంద్రమూర్తి వధించుట న్యాయ్యమా? వారు నిరాయుధులుగారు. పరిఘములు వారి యొద్ద నున్నట్లు మీఁదఁ జెప్పఁబడెను. అదిగాక రాక్షసు లాయుధములు లేకున్నను జేతులతోఁగూడ యుద్ధముచేయుదురు. అట్టివారు నిరాయుధులా ! వాలిసుగ్రీవు లేయాయుధములతో యుద్ధముచేసిరి? శూలము విఱిగిన తరువాతఁ గుంభకర్ణుఁ డేయాయుధములతో యుద్ధము చేసెను ? కబంధుఁ డేయాయుధములు గలవాఁడు ? నిరాయుధు డనఁగా యుద్ధము చేయలేక ప్రథమయుద్ధమందు రావణునివలె నిలఁబడిన వాని విషయమేకాని యాయుధము లేకున్నను యుద్ధోన్ముఖుఁడైన వాని విషయము గాదు. అట్లుగాదేని శత్రువులు ముష్టులచేఁ గొట్టుచున్నను, గొంతు పిసుకుచున్నను నిరాయుధులని సహించి యూరకుండవచ్చునా ?

౨౧-వ సర్గము.

తే. పెద్దపెట్టున నఱచుచు ♦ భీషణముగ, నాజనస్థానమందు ఖ ♦ రాము రారి సన్నిధిని బడ నిర్యాస ♦ సల్లకి యన, నాయనర్థసమాగత ♦కనియె నతఁడు. ౩౨౧

పెద్దపెట్టునన్=గట్టిగా, భీషణముగన్=భయంకరముగ, జనస్థానమందు=దండకారణ్యమునందు నిప్పుడు రాక్షసులుండు స్థలము ఆయడవిపైకి జనులకు వాసయోగ్యమైనస్థలము. దీని చరిత్ర ము త్తరకాండమునఁ గలదు నిర్యాససల్లకి = బంక కాఱుచున్న యందుగుతీఁగవలె, అనర్థసమాగతకు=రాక్షసనాశనముకై వచ్చినవానికి, జనస్థానము=ఖరుని రాజధాని త్రికంటకము ఇప్పటి త్ర్యంబక మని కొందఱు. ఇది నాసికకు సమీపమున నున్నది నాసికయే పంచవటి యగునేని రెండు సంవత్సరముల కాల

మంత సమీపముననున్న వారిని రాక్షసులెట్లుండిననూట విశ్వాసపాత్రముగాదు.

తాత్పర్యము

భయంకరముగ గట్టిగ నఱచుచు నేడ్చుచు జనస్థానమందున్న ఖరాసురుని యెదుట బంక కాఱుచున్నయందుగుఱీఁగవలెఁ బడఁగా రాక్షసనాశమునకై వచ్చిన దానినిజూచి ఖరుఁ డిట్టు లనియెను.

ఉ. ఏమిటి కేడ్చెదే మరల ♦ నెంతయు శూరుల రాక్షసేంద్రులన్
నీమత మాచరింప నటు ♦ నీబడిఁ బంచితిఁ గాదె? వారలో
మామక భక్తులున్ హితులు ♦ మానరు కార్యముఁ జేయకుండ ధై
ర్యామలులున్ సురక్షు లప♦రాజితు లాహవభూమి సోదరీ! 33౨

అపరాజితులు = పరాజయము నొందనివారు.

తాత్పర్యము

దేనికే మరల నేడ్చుచు వచ్చితివి? నీకోరిన ప్రకారము మిగుల శూరు లయిన రాక్షసశ్రేష్ఠులను నీ యిష్టప్రకారము చేయుటకు నీ వెంటనే పంచితినిగదా? ఇంకను నేడువనేల? ఆ పదునాలుగురు నాయందు భక్తిగలవారు నాహితము గోరువారు. నేను జెప్పిన కార్యముచేయకమానరు. మిగుల ధీరులు. అనురాగము గలవారు. యుద్ధమునందుఁ బరులకు జయింపరానివారు.

కం. ఈయేడ్పునకుం గారణ, మేయది? హానాథ యనుచు ♦ నిటు పొర్లెద వే
లా యాశీవిషభామిని, చాయను ధర వ్రాలి? చెప్పుము ♦ సందర్భంబున్. 333

ఆశీవిషభామిని = ఆఁడుపాము. హా నాథ యనుటచే నామగఁ డుండిన నాకిట్టి గతి వచ్చియుండునా యని భావము.

తాత్పర్యము

అయ్యో! నాథా యని యాఁడుపామువలె నేఁబడి పొరలిపొరలి యేడ్చెదవే? ఏమి కారణము మరలఁ గలిగెనే! ఉన్న విషయమేమో చెప్పుము.

కం. దిక్కై నే నుండఁగ నిల, దికెవ్వరు లేనియట్లు ♦ దీనత నేలా
స్రుక్కెదు లే లెమ్మిఁక నా, కక్కడికథఁ దెలుపు విడువు ♦ మాన్యను భీతిన్. 33౪

తాత్పర్యము

దీనురాలవై యయ్యో! నాకు దిక్కెవ్వరులేరేయని యేడ్చెదవేమి? నేనున్నాను గదా దిక్కు. లేవే? అక్కడ నేమిజరిగెనో చెప్పవే? భయము వదలవే?

ఆ. అనినఁ గనుల నీరు ♦ హస్తతలంబులఁ, దుడిచికొనుచు లేచి ♦ తోడఁబుట్టుఁ
జూచి యనియె నాదు♦నూడుకీర్పఁగఁ బదు, నలువు రసురవరుల♦బలుల నీవు. 33౫

నూడు = పగ.

తాత్పర్యము

అని ఖరుఁ డడుగఁగాఁ గన్నీరు చేతులతోఁ దుడిచికొనుచు లేచి కూర్చుండి తోడఁబుట్టువును జూచి నా పగ దీర్చుటకై నీవు బలవంతులనే పదునలువుర రాక్షసులఁ బంపుట నిజమే.

—♦ శూర్పణఖ ఖరుని రామునిమీఁదికి యుద్ధమునకుఁ బోవఁ బ్రేరించుట ♦—

చం. పనుచుట నిక్క, మా యసుర ♦ పర్యులు రామనిశాత ఘోరరో
పనికరదారితాంగు లయి ♦ వ్రాలఁగ నేల క్షణంబులోన భీ
తిని గాని పర్వువాఱితిని ♦ దెవ్వన నీకడ, కేమి చెప్పుదుఁ
దనువునఁ గంప మిప్పటికిఁ ♦ దాఱ దొకింతయుఁ జూడుమా ఖరా. ౩౩౬

రామ = రామునియొక్క, నిశాత = పదునైన, ఘోర = భయంకరమైన, రోప = బాణములయొక్క, నికర = సమూహముచే, దారిత = చీల్చఁబడిన, అంగులు = దేహములు గలవారు, తాఱదు = తగ్గదు.

తాత్పర్యము

అయిననేమి నీవు పంపినవారు రాముని పదునైన భయంకరములైన బాణములచేఁ జీల్చఁబడిన దేహముగలవారై క్షణకాలములో నేలఁబడి చచ్చిరి. అది చూచి యిఁక నక్కడనుండిన నన్నేమిచేయుదురో వెంటఁబడుదురో యను భయముచే, గాలికొలఁది పరువెత్తి వచ్చితిని. అప్పుడు పుట్టినవణఁ కిప్పటికిఁ దగ్గలేదు. ఖరుఁడా! చూడుము నా మాట యసత్యమేమో?

తే. ఘనతరవిషాదనక్రసం♦కలిత మగుచు, మహితతరపరిత్రాసోర్మి ♦ మాలి యయిన
భూరిదుఃఖాంబుసధిలోనఁ♦దీఁ మునఁగి, యున్న న న్నుద్ధరింపుమా♦ యూఱడించి.

ఘనతర = మిక్కిలి గొప్పదియగు, విషాద = ఏమియుఁ దోఁపకుండఁ జేయు మనోదుఃఖము నెడి, నక్ర = మొసళ్ళతోడ, సంకలితము = కూడినది, మహితతర = మిక్కిలి గొప్పదగు, పరిత్రాస = భయము నెడి, ఊర్మి = అలలయొక్క, మాలి = వరుసగలది, తీరఁ = పూర్ణముగ, ఉద్ధరింపుము = లేవఁదీయుము.

తాత్పర్యము

గొప్ప విషాదమను మొసళ్లను మహాభయమనెడు వలలను గలదైన పెద్ద దుఃఖమను సముద్రములో మునిఁగిన నన్ను లేవఁదీయుము.

ఉ. నీ కయి కూలినట్టి రజ ♦ నీచరముఖ్యులయందు నాపయిన్
నీ కొకయింతయేని దయ ♦ నిక్కముగా మదిఁ గల్గెనేనియున్
నీకును రామునిం దొడరి ♦ నిల్వ బలంబు దిటంబు నున్న నే
దీ కనుఁగొందు వెల్వడుము ♦ దెవ్వన జంప నిశాటకంటకున్. ౩౩౮

నిశాటకంటకున్ = రాక్షసులపాలికి ముల్లైన వానిని.

తాత్పర్యము

నీపనికై పోయి చచ్చిన రాక్షసులందు నాఁబుట్టిన నాయందు నీకుఁ గొంచెమైన దయ నిజముగా నుండెనా, నీవు రాముని నెదిరించి యుద్ధముచేయ ధైర్యముండెనా, యేదీ చూతును తక్షణమే యారాక్షసులపాలికి ముల్లైన రామునిమీఁదికి యుద్ధమునకై బయలు దేఱుము.

చచ్చిన రాక్షసులమీఁదను బ్రదికియుండు నా మీఁదను దయ లేకున్నను రాము నెదిరించి యుద్ధముచేయు ధైర్యములేకున్నను నాతోపాటు నీవు నింటనే యుండుము. నే నేడ్చుచునుందును. నీవు సంతోషముగ నవ్వుచుండుము. ఆయన నిశాటకంటకుఁడు గావున నీ విటఁ గూర్చుండినను నిన్ను విడువఁడు. ఎప్పటికైనను బ్రక్క ముల్లు గ్రుచ్చుకొనక యూరకుండునా ?

కం. నాకుం బగవాఁ డగునా, కాకుత్స్థుని నీవు చంపఁ ♦ గడఁగవయేనిన్
పోకడపెట్టుదుఁ బ్రాణము, నీకడ నే నిపుడు నిజము ♦ నిరపత్రపనై. ౧౭

కడఁగవయేనిన్ = ప్రయత్నముఁజేయకపోయితివా? పోకడపెట్టుదున్ = పోఁగొట్టుకొందును, నిరపత్రపనై = అవమానము విడిచినదాననై.

తాత్పర్యము

నాకు శత్రువగు శ్రీరామచంద్రమూర్తిని నీవు చంపఁబ్రయత్నింపక పోయితివా నీవు చూచుచుండ నీ యెదుటనే ప్రాణములు వదలుదును. ముక్కు చెవులు గోయించుకొనియుఁ బగదీర్చుకొననేరనేని యీ యవమానపు బ్రతుకు బ్రదుకుట కంటెఁ జచ్చుట మేలుగదా ?

కం. నీవును నీ సైన్యముతో, నా వీరుని మ్రోల సంగ ♦ రాననిలువన్
లేవని నామదిఁ దోఁచెను, నీ వెచ్చట నాతఁ డెచట ♦ నతి బలధృతులన్. ౧౮

తాత్పర్యము

నా యారాటముకొలఁది నేను చెప్పుచున్నానుగాని వాస్తవ మాలోచించిన నీవు నీ సేనతోడఁ బోయినను యుద్ధభూమియందు నాయన యెదుట నిలువలేవని తోఁచుచున్నది. ఆయనబలము ఆయన ధైర్య మది యెక్కడ? పిఱికిపందవు, దుర్బలుఁడవు, నీ వెక్కడ !

పౌరుషము హెచ్చింప నిట్లు చెప్పుచున్నది ఈ యుక్తులు పౌరుషోద్రేకకరములగు వాక్కులు స్త్రీలయందు దండి. నిష్ఠుర మగు వారిభావము దెలిసికొనలేక ముందు వెనుక లాలోచింపక చెవులు వ్రేలవేయువారు ఖరునివలెఁ జెడుటయు సిద్ధము. స్త్రీలు విశేషస్వార్థపరలు. తమకార్యము నిమిత్తమై యెంత సాహసమైన నెట్టి యకార్యమైనఁ జేయుదురు. చేయింతురు. 'స్త్రీబుద్ధిః ప్రలయంకరీ' యనుట సత్యము. ఆఁడుదాని మాటలు విని ముందువెనుక లాలోచింపక కలహమునకు దిగువాఁడు ఖరుఁడే (మగగాడిద). ఎవ రెట్లు పాడైపోయినను దమపట్టు సాగవలెననియే వారిపట్టుదల. దీనికై యెన్నివేషములైన వేయుదురు.

ఆ. శూరమాని వీవు ♦ శూరుండవా కావు, బలము గల దటంచు ♦ భ్రాంతి పడెదు
రాక్షసుండ వయ్యు ♦ రామలక్ష్మణులను, మానవులను జంపఁ♦ బూనలేవు. ౧౯

దానినే యింకను విస్పష్టముగాఁ జెప్పుచున్నది.

శూరమానివి = శూరుఁడ నని నీవు ప్రగల్భములు చెప్పితివి కాని నీవు నిజమైన

శూరుఁడవు కావు. నీకు బలము గలదని నీకు భ్రమమాత్రము గలదు గాని వాస్తవమున నీకు బలము లేదు. మనుష్యులను దిను రాక్షసుఁడవుగాఁ బుట్టియు లక్షలుగారు కోట్లుగారు ఇరువురు మనుష్యు లింత యవమానపఱిచి నిన్ను ధిక్కరించి నీవారిని జంపినను వారిని జంప నీవు యత్నింపలేక యున్నావు. వాస్తవశూరుఁడు బలశాలి యిట్లింతసే పూరకుండునా ?

ఉ. రామునితోడ డీకొన దు♦రంబున నీకును శక్తి గల్గినన్
భీమబలంబుతో వెడలు ♦ వేగ, బలంబు దిటంబు లేని నీ
కీ మహితాటవీస్థలము ♦ నేటికిరా ? కులపాంసనా ? వెసన్
బో మరి యొండుచోటికిఁ ♦ బూడ్చును రాముఁడు జాగుచేసినన్. ౩౮౨

తాత్పర్యము

నా కేమి ? బలశౌర్యములు లేకపోవుటయేమి !! దేవతలను జయించినవాఁడనందువా ? అట్లైన నేడి నీ బలశౌర్యములు చూతము, వెంటనే శ్రీరామచంద్రుని యుద్ధమున నెదుర్కొన సేనతో బయలుదేఱుము. అటు చేయఁజాలవైతివా బలము ధైర్యము లేని పిఱికిపందకు నీ కీ దండకాటవి యేమిటికిరా? ఓరి కులదూషకా! రాక్షసకులమునకు నపకీర్తి తెచ్చుటకుఁ బుట్టితివా ? ఇఁక నిక్కడ జాగుచేసితివా ? అదిగో రాముఁడు వచ్చుచున్నాఁడు. నిన్నిక్కడనే పూడ్చును. మఱియొకచోటికిఁ బరువెత్తుము.

ఉ. ఏ మనుకొంటివో రఘుకు♦లేశ్వరు రాముని వాని తమ్మునిన్
నా ముకుపీనులన్ నఱికి ♦ నన్నిటుచేసిన వీరు నంచు ను
ద్దామపిచండ చండిక యు♦దారతఁ గడ్పును మోఁదికొంచు దుః
ఖామితతప్తయైన నసు♦రాధిపుఁ డిట్లను నా నెలంతకున్. ౩౮౩

ఉద్దామపిచండ = పెద్దకడుపుగలది, చండిక = మొండికోపముగలది.

తాత్పర్యము

నా ముక్కుచెవులు గోసి నన్నిట్లు లవమానించిన వీరుని రఘువంశనాయకుని శ్రీరామచంద్రమూర్తిని ఆయన తమ్ముని లక్ష్మణుని నీ వేమని తలఁచితివిరా ? సామాన్య మనుష్యు లనుకొంటివా ? పదిమంది నూఱుమంది యాయనను గెలువఁగలరని తలఁచితివా ? అని చెప్పి పెద్దపొట్టగల యాచండి దబాదబా యని పెద్ద నగారా వాయించినట్లు కడుపుమీఁద బాఁదుకొనుచు దుఃఖాగ్నిచేఁ దపించుచుండఁగా రాక్షసనాయకుఁడు దాని కిట్లనెను.

౨౨-వ సర్గము.

—♦ ఖరుఁడు సేనతోడ శ్రీరామునిమీఁదికి యుద్ధమునకుఁ బోవుట ♦—

చం. భవదవమానసంజనిత ♦ బాధమదాగ్రహమున్ సమృద్ధిమ
ల్లవణపయోధిభంగిని ద♦లం బిఁకఁ గా దణఁగింప, హీనమా
నవు నొక క్షీణజీవితు మ♦నంబున రాముని లెక్కగొందునే
భువిఁ దన దుష్టచేష్టలన ♦ పోయెడిఁ గాక స్వనామశేషుఁడై. ౩౮

భవత్ = నీయొక్క, అవమాన = పరాభవముచే, సంజనిత = పుట్టిన, బాధ = అధికమైన, మత్ = నాయొక్క, ఆగ్రహమున్ = కోపమును, సమృద్ధిమత్ = ఉప్పొంగి వచ్చుచున్న, లవణపయోధిభంగిని = ఉప్పునీళ్ళ సముద్రమువలె, తలము = సాధ్యము, 'తలమే బ్రహ్మకునైన' అని అల్లసాని పెద్దన్న, హీనమానవున్ = నీచ మనుష్యుని, క్షీణజీవితున్ = క్షయించిన యాయువుగలవానిని, స్వనామశేషుడై = తన పేరుమాత్రము లోకమున నిలిచినవాడై.

తాత్పర్యము

నా తోబుట్టువగు నిన్ను నవమానపఱిచిరన్న యవమానముచే బుట్టిన కోపమును, పొంగివచ్చు సముద్రము నణపరానట్టు లణచ సాధ్యపడదు. నీచమనుష్యుని చచ్చినవారితో సమానుడైనవానిని నేను లక్ష్యపెట్టుదునా? వానిని నేను జంపవలసిన పనిలేదు. వాని దుష్టచేష్టలచే వాడే లోకమున జంపబడును. ఇట్టివా డిట్టి కార్యము చేసి చచ్చెనని పేరుమాత్రము నిలుచును.

ఉ. ఏడువ కేల యేడ్చెద విదే చని రాము సహానుజున్ జముం
గూడగ బంపువాడ జమి ♦ క్రూరకఠోరకుఠారధార న
క్కీడరి వేడినెత్తురులు ♦ కేలికొలందిని జుఱ్ఱుకొమ్ము నీ
నూడు దొలంగ నన్న విని ♦ శూర్పణఖాసతి హృష్టచిత్తయై. ౩౮౫

జమున్ = యమధర్మరాజును, క్రూర = పదునైన, కఠోర = కఠినమైన, కుఠార = కత్తియొక్క, ధారన్ = వాదరచే, కీడరి = కీడుచేయువాని, నూడు = పగ, హృష్టచిత్తయై = సంతోషించిన మనస్సుగలదై.

తాత్పర్యము

ఏలయేడ్చెద వేడువకుము. ఇదిగో నిపుడే పోయి తమ్మునితోడ రామచంద్రుని నా పదునై కఠినమైన కత్తిచే జంపెదను. ఆ దుష్టుని వేడివేడి నెత్తురులు చేతుల కొలంది నీ పగదీర జుఱ్ఱుకొమ్ము. అని చెప్పగా విని శూర్పణఖ సంతోషించినదయ్యెను.

కం. వెండియు మాత్సర్యంబున ఖరు, డొండాడిన నతడు రేగి ♦ క్రూరతతో ను
చ్చండుని దళవాయిని బలు,గండని దూషణుని జూచి ♦ కడునడి బలికెన్. ౩౮౬

కొండాడినన్ = పొగడగా, రేగి = విజృంభించి, ఉచ్చండునిన్ = మిగుల భయంకరుని, దళవాయినిన్ = సేనానాయకుని, బలుగండనిన్ = మిగుల పౌరుషము గలవానిని, కడువడిన్ = మిగుల తొందరతో.

తాత్పర్యము

అట్లు వాడు చెప్పినదానితో దృప్తిపడి యూరకుండక పట్టినపట్టు సాధింపవలయునన్న తలంపుతో నది మిగుల బొగడెను. వాడు గ్రోలికి సారాయము పోసినట్లులై విజృంభించి మిగుల పౌరుషము కోపము గల సేనానాయకుని దూషణు డనువానిని జూచి మిగుల దొందరపాటుతో.

సీ. పదునాల్గువేవుర ♦ బలభీమవేగుల, సమరానివర్తుల ♦ సాహసికుల
నీలజీమూత స ♦ న్నిభవర్ణదేహులఁ, గ్రూరుల హింసావి ♦ హారరతుల
సింహవిక్రముల మ ♦ చ్చిత్తానువర్తుల, నుద్యోగవంతుల ♦ నుగ్రబలులఁ
గూర్పుమీా వేగమ ♦ కోదండశరఖడ్గ, వివిధసాధనముల ♦ వెలయునట్టి
తే. మద్రథంబును గొనిరమ్ము ♦ మహితతేజ
చనుదు మున్నుగఁ బౌలస్త్య ♦ సంతతులకుఁ
జావు గూడఁగ శ్రీరామ ♦ చంద్రునకును
జయము వెలయఁగఁ బేర్కొందు ♦ జగములందు.　　　౩౪౭

బలభీమవేగులన్ = బలముచే భయంకరమైన వేగముగలవారిని, సమరానివర్తులన్ = యుద్ధమునందు వెనుకదీయనివారిని, సాహసికులన్ = తెంపుగలవారిని, నీలజీమూత సన్నిభ వర్ణదేహులన్ = నల్లమేఘమువంటి కాంతిగల దేహములుగలవారిని, క్రూరులన్ = దయలేనివారిని, హింసావిహారరతులన్ = హింసచేయు క్రీడలయందుఁ బ్రీతిగలవారిని, సింహవిక్రములన్ = సింహము పరాక్రమమువంటి పరాక్రమము గలవారిని, మచ్చిత్తానువర్తులన్ = నామనస్సు చొప్పున నడచువారిని, ఉద్యోగవంతులన్ = యుద్ధమునం దెక్కువ ప్రయత్నమును గలవారిని, ఉగ్రబలులన్ = భయంకరమైన బలముగలవారిని. పౌలస్త్యసంతతులకు = పులస్త్యవంశమునఁ బుట్టిన వారి గుంపునకు, పేర్కొందున్ = ప్రసిద్ధి వహించెదను.

తా త్ప ర్య ము

బలముచే భయంకరమైన వేగము గలవారిని, యుద్ధమునందు వీఁపు చూపని వారిని, సాహసవంతులను, నల్లని మేఘమువంటి వన్నెగల దేహముగలవారిని, దయ లేనివారిని, హింసచేయు క్రీడలయందుఁ బ్రీతిగలవారిని, సింహమువలె బరాక్రమించు వారిని, నాయిష్టము చొప్పున నడచువారిని, రణప్రయత్నముగలవారిని, భయంకర మైన బలముగలవారిని, పదునాలుగువేల రాక్షసులను శీఘ్రముగ సమకూర్పుము. విండ్లు, బాణములు, కత్తులు, ఇతరానేకాయుధములు గల నా తేరిని దీసికొని రమ్ము. పౌలస్త్యవంశమునఁబుట్టిన యీా రాక్షసులకు ముందుగా నేఁ బోదును. నావెనుక వారు రావచ్చును. శ్రీరామచంద్రునకుఁ జావు గూడునట్లుచేసి జయముఁ గైకొని లోక మునఁ బ్రసిద్ధి వహింతును. ఇది వాఁ డనుకొన్నవిధము. వాఁ డన్న మాటలకు వేఱొక యర్థము గలదు. పౌలస్త్యసంతతులకుఁ జావు గూడఁగ, శ్రీరామచంద్రునకు జయము వెలయఁగ నేను ముందుగాఁ బోదును. శ్రీరామునిచేఁ జచ్చి లోకమునఁ గీర్తిని సంపాదింతును. 'సత్యావాణీ సరస్వతీ' యని కలదుగదా ? కాఁగలది ముందుగానే సరస్వతి వాని నోరఁ బలికించెను.

వం. అన విని దూషణుండు ప్రశ ♦ యార్కనిభంబు మహారథంబుఁ జ
య్యన శబళాశ్వయుక్తముగ ♦ నాతని ముంగలను నిల్పెఁ దప్త కాం

చనలసితంబు హేమమయ ♦ చక్రము మత్స్యసుమద్రుమాద్రిప
క్షినికర చంద్రసూర్యగముఁ ♦ గేతనఖడ్గ కృపాణకింకిణీ
వినిచయ యుక్తముఁ రథము ♦ వే ఖరు డెక్కె నమర్షచిత్తుఁడై. ౩౮౮

ప్రలయార్కనిభంబు=ప్రలయకాలమందలి సూర్యునితో సమానము, శబల+అశ్వయుక్తముగ = నానావర్ణములుగల గుఱ్ఱములు కట్టఁబడిన దానినిగా, తప్త=పుటము వేయఁబడిన, కాంచన=బంగారమువలె, లసితంబు = ప్రకాశించునది, హేమమయ చక్రము = బంగారుమయమైన గాండ్లుగలది. మత్స్య...సూర్యగము = బంగారుతోఁ జేయఁబడిన చేఁపలు చెట్లు పూలు కొండలు పక్షిసమూహములు చంద్రుఁడు సూర్యుఁడుగలది, కేతన=ధ్వజము, ఖడ్గ=బాకు, కృపాణ=కత్తులు, కింకిణీవినిచయము=చిఱుగజ్జెల సమూహము, వీనితో యుక్తముఁ = కూడినది, అమర్షచిత్తుఁడై=కోపముతోఁ గూడిన మనస్సుగలవాఁడై.

తాత్పర్యము

ఆ ప్రకారము ఖరుఁడు చెప్పఁగా విని దూషణుఁడు ప్రలయకాలమునాఁటి సూర్యునితో సమానమైన నానావర్ణములుగల గుఱ్ఱములను గట్టిన తేరిని నతని ముందటఁ దెచ్చి నిలిపెను. ఇట్లు నిలువగాఁ బుటము వేసిన బంగారువలెఁ బ్రకాశించునదియు బంగారుమయములైన చక్రములు కలదియు బంగారుతోఁ జేసిన చేఁపలు పూలు చెట్లు కొండలు పక్షులు సూర్యుఁడు చంద్రుడు ఇటువంటి బొమ్మలచేఁ గట్టఁబడినదియు, ధ్వజము బాకులు కత్తులు మువ్వలు గలదియు నగు తేరిని గోపముతో ఖరుఁ డెక్కెను.

ఉ. అంతట దూషణుండును మ ♦ హాధ్వజినీయుతుఁడై ఖరేంద్రుత
త్ప్రాంతముఁ జేరి నిల్వ నతఁ ♦ డాజ్ఞ యొసంగెఁ జనంగ నంత దు
ర్దాంతజవంబునం గదలె ♦ రావము దిక్కులఁ బిక్కటిల్ల సం
భ్రాంతము లౌచు సత్త్వములు ♦ బమ్మెరపోవఁగ సొమ్మసిల్లఁగన్. ౩౮౯

మహాధ్వజినీయుతుఁడై = గొప్ప సేనతోఁగూడినవాఁడై, ఖరేంద్రుతత్ప్రాంతము=ఖరాసురుని ప్రక్కన, దుర్దాంతజవంబునన్=అణఁపరాని వేగముతో, రావము=ధ్వని, సత్త్వములు=అడవిమృగములు, బమ్మెరపోవఁగన్ = భ్రమశబ్దభవము బమ్మెర. భ్రమగాని తిరుగుడువడఁగా, సొమ్మసిల్లఁగన్ = మూర్ఛపోయి కూలఁగా.

తాత్పర్యము

ఖరుఁడు తేరెక్కఁగా దూషణుఁడు గొప్ప సేనతో ఖరుని ప్రక్కన నిలువఁబడెను. అప్పుడు సేన కదలనిమ్మని ఖరుఁ డాజ్ఞాపింపఁగా నడ్డములేని వేగమున సేన పయనమయ్యెను. ఆధ్వని దిక్కులందెల్ల మిక్కుటము గాఁగా నడవియందలి మృగములు తత్తఱపాటుతోఁ గాని దిగ్భ్రమగాని యెటుపోవుటకుఁ దోఁపక తికమక లాడెను. కొన్ని భయమున మూర్ఛపోయెను.

క. భాసుర శూలముద్గరకృ♦పాణపరశ్వధఖడ్గవజ్రఘో
రాసిక పట్టిసాళిపరి♦ఘాదిక కార్ముకబాణహస్తులై
వేసము భీతు గొల్పఁ బృథి♦వీతల మెల్ల వణంక రాక్షసుల్
రోసముతోడ వెల్వడిరి ♦ రూక్షమతుల్ పదునాల్గు వేవురున్. ౩౫౦

భాసుర=ప్రకాశించు, శూల=సలాకువంటి మొనగల యాయుధము, ముద్గర=కుఱుచ యినుపదుడ్డుకఱ్ఱలు, కృపాణ=కత్తులు, పరశ్వధ=గండ్రగొడ్డండ్లు, ఖడ్గ=బాకులు, వజ్ర=వజ్రాయుధమువలె, ఘోర=భయంకరమైన, అసిక=చిన్నకత్తి, పట్టిస=బల్లెము, ఆళి=సమూహము, పరిఘ=ఇనుపకట్లగుదియ, కార్ముక=విల్లు, భీతు=భీతి, రూక్షమతుల్=కఠినమనస్సులుగలవారు.

తాత్పర్యము

సలాకులు, ముద్గరములు, కత్తులు, గండ్రగొడ్డండ్లు, బాకులు, వజ్రాయుధములవంటి కత్తులు, బల్లెములు, ఇనుపకట్లగుదియలు, విండ్లు, బాణములు చేతులందు ధరించినవారై వారి వేషములే చూచువారికి భయము కలిగించుచుండ భూమి గడగడ వడఁక రోషముతోఁ బదునాలుగువేలమంది రాక్షసులు వెల్వడిరి.

మొదట వచ్చినవారు పదునాలుగురు, ఇప్పుడు పదునాలుగువేవురు.

కం. ఖరుచిత్తమెఱిఁగి సారథి, సరభసముగఁ దేరు దోలె ♦ సైన్యము వెంటన్
ధరణియు దిశలు విదిక్కులు, నెర వయ్యెం దద్రథాంగ♦నిబిడధ్వనిచేన్. ౩౫౧

సరభసముగన్=తీవరముగ, విదిక్కులు=మూలలు, నెరవయ్యెన్=నిండెను.

తాత్పర్యము

ఖరుని మనస్సెఱిఁగి యతనిసారథి సైన్యము వెంబడి తీవరముగ రథమును దోలెను. ఆ రథగమన వేగమునఁ బుట్టిన ధ్వనిచే భూమియు దిక్కులు దిక్కుల మూలలు నిండెను.

చ. గురుతరకోపయుక్తుఁడయి ♦ క్రూరచరిత్రుఁడు నిర్జరారి భీ
కరఖరకంఠరావమున ♦ గాఢమహాపవనేరితంబు ప్ర
స్తరచయవృష్టిహేతుజల♦దంబు మహోందుఘనంబు పొల్పున
కృరణిని సారథిం బొడిచె ♦ గ్రక్కునఁ దోలుము తోలు మంచొగిన్. ౩౫౨

గురుతరకోపయుక్తుఁడయి=మిగుల నతిశయించిన కోపముతోఁ గూడినవాఁడై, భీకర=భయంకరమైన, ఖర=కఠినమైన, కంఠరావమునన్=గొంతుధ్వనితో, గాఢ=అధికమైన, పవన=గాలిచే, ఈరితంబు=ప్రేరింపఁబడినది, ప్రస్తరచయ=రాల సమూహముల, వానకు హేతువైన, జలదంబు=మేఘము, ఘనంబు=మేఘము.

తాత్పర్యము

మిగుల నతిశయించిన కోపముగలవాఁడై క్రూరపునడవడి గల ఖరుఁడు భయంకరమైన గాడిదధ్వనివంటి కఠినధ్వనిచేఁ బెద్దగాలిచేఁ బ్రేరింపఁబడి రాలవాన

గురియు నొక మేఘము మఱియొక మేఘమును బొడిచినట్లు సారథిని దోలుము తోలు మని పొడిచెను.

—♦ ౨౩-వ సర్గము. ఖరునకు దుశ్శకునంబు లగుట ♦—

ఉ. ఈ నెఱి రాక్షసావళి స♦మీకసముత్సుకితాత్మ నా జన
స్థానము వీడ గార్దభము♦ఛాయను మేఘము రక్తతోయ మా
వానను జెల్లుగాఁ గురిసె ♦ వాహ్యాచయంబు యదృచ్ఛఁ బుష్పసం
తానచితప్రదేశమున ♦ దబ్బున జాఱిపడెన్ సమస్థలిన్. ౩౫౩

ఈ నెఱిన్ = ఈవిధముగ, సమీక = యుద్ధమందు, సముత్సుకిత = మిక్కిలి సంతోషముగల, ఆత్మన్ = మనస్సుతో, జనస్థానము=ఖరాదులు కాఁపురము చేయు స్థలము పేరు, గార్దభము = గాడిద, రక్తతోయము = నెత్తురువంటి నీళ్లు, వాహ్యాచయంబు=గుఱ్ఱముల సమూహము, యదృచ్ఛన్ = అకస్మికముగ, తమంతటఁదామే, పుష్పసంతాన = పూలసమూహముచే, చిత=నిండిన, సమస్థలిన్=చదరపునేల.

తాత్పర్యము

ఈ విధముగ రాక్షసులు యుద్ధకాంక్షచేఁ బోవుచుండఁగా గాడిదరంగుగల మేఘము రక్తవర్ణముగల నీళ్ళను వానగాఁ గురిసెను. తేరికిఁ గట్టిన గుఱ్ఱములు సమప్రదేశమునందు గుంతలు మిట్టలు లేకున్నను బూలచే నిండినచోటఁ దటాలున జాఱిపడెను.

ఉ. శ్యామము లోహితాంత మయి ♦ యప్పుడు సూర్యు నలాతచక్రమై
భీమతరంబు నై పరిధి ♦ వేగమ చుట్టెను, గ్రద్ద యొక్కఁడు
న్హేమసమిద్ధదండమున ♦ నెమ్మది నెక్కొని యుండె, విస్వరో
ద్దామము లై చెలంగె భయ ♦ దంబుగ నందుఁ బలాదసత్త్వముల్. ౩౫౪

పరిధి = పరివేషము, గుడి, సూర్యచంద్రులచుట్టు గుండ్రముగాఁ గానవచ్చు వెలుతురు, ఇది శ్యామము = నల్లనిది, లోహితాంతము = అంచున నెఱుపుగలది, అలాతచక్రమై = కొఱవి త్రిప్పిన నేర్పడు చక్రమువంటి చక్రమై, భీమతరంబునై = మిగుల భయంకరమైన, హేమసమిద్ధదండమునన్ = బంగారుతోఁ గూడిన దండమునందు, నెక్కొని = నెలవుకొని, వ్రాలి, విస్వరోద్దాములై = వికారస్వరములచే గొప్పవై, పలాదసత్త్వముల్ = మాంసము దిను జంతువులు.

తాత్పర్యము

సూర్యునిచుట్టు కొఱవిచక్రమువలె గుండ్రమై నల్లనై యంచున నెఱ్ఱనై భయంకరముగ పరివేషము గానవచ్చెను. బంగారు ధ్వజదండముపై గ్రద్ద వ్రాలి కూర్చుండెను. మాంసము దిను జంతువులు వికారస్వరములు నిండించెను.

ఉ. నక్కలు కూయఁ జొచ్చె దిన ♦ నాథు దెసం గని, శైలపాళి పెన్
ప్రక్కలఁ బోలి నెత్తురుల ♦ వర్షపు ధారలు గార్చె, మబ్బు పిం

డొక్కటఁ జిమ్మచీఁకటులు ♦ నుర్వియు దిక్కులు దోఁపకుండఁగా
రెక్కొనె, వేళగామి దన ♦ రెన్ క్షతజార్ద్రపటాభసంధ్యయున్. ౩౫౫

దిననాథుదెసన్ = సూర్యునివంక, పిండు = సమూహము, రెక్కొనెన్ = వృద్ధిచెందెను, క్షతజ = నెత్తుటిచే, ఆర్ద్ర = తడిసిన, పటాభ = వస్త్రముతో సమానమైన, సంధ్యాకాలము.

తాత్పర్యము

సూర్యునికెదురై యాయనను జూచి నక్కలు కూయసాగెను. కొండల గుంపు వజ్రధారచే నింద్రుఁడు ఱెక్కలు నఱికినపుడు నెత్తురు గాఱినట్లు లప్పుడు నెత్తురు గార్పఁజొచ్చెను. ఇది భూమి ఇవి దిక్కు లని తెలియరాకుండునట్లు చిమ్మ చీఁకటులు గ్రమ్మి మబ్బుల పిండు వృద్ధిచెందెను. సంధ్యాకాలము కాకపోయినను, ఆకాశము నెత్తుటఁ దడిసిన గుడ్డవలెఁ గానవచ్చెను.

కం. ఖరునకు నభిముఖ మగుచును, ఖరతర రవములను నినిచె, ♦ గంకవృకాదుల్
పరుసపుమంటలు గ్రక్కుచుఁ, బరఁగించెను వఱడు లెల్ల ♦ భయదస్వనముల్. ౩౫౬

అభిముఖము = ఎదురు, ఖరతరరవములను = మిగులఁబరుషములయిన ధ్వనులను, కంక వృకాదుల్ = గ్రద్దలు తోడేళ్లు మొదలయినవి, వఱడులు = నక్కలు, భయదస్వనముల్ = భయంకరధ్వనులు.

తాత్పర్యము

ఖరున కెదురుముఖమై గ్రద్దలు తోడేళ్ళు మిగులఁ బరుషములైనధ్వనులు చేసెను. నక్కలు మంటలు గ్రక్కుచు భయంకరముగఁ గూసెను.

సీ. పర్వంబు గాకయు ♦ భాను స్వర్భానువు, పట్టె దినేశుని ♦ పజ్జఁ గ్రమ్మె
నేక పరిఘాకార ♦ వికటకబంధంబు, ఱివ్వనఁ బెనుగాలి ♦ వీచె నెదుట
దేజంబు చెడియె నం ♦ భోజబంధువు నిశ, గామియుఁ దారకల్ ♦ గ్రహచయంబు
ద్యోతలంబునను ఖ ♦ ద్యోతకాంతిని దోఁచె, సంలీనపృథురోమ ♦ సంఘ మగుచు
ఆ. శుష్కకంజ మగుచుఁ ♦ జొప్పఱెఁ గొలఁకులు, భూజతతులు విగత♦పుష్పములును
ఫలయుతంబు లగుచుఁ ♦ బాడఱెఁ గెందూళు, లలమె గాలిరేక ♦ యభిముఖముగ.

స్వర్భానువు = రాహువు, దినేశుని = సూర్యునియొక్క, పరిఘాకార = గుదియ వంటి యాకారముగల, వికటకబంధంబు = భయంకరమైన మొండెము వంటి మేఘము. అంభోజబంధువు = సూర్యుఁడు, నిశ = రాత్రి, ద్యోతలంబునను = ఆకాశమునందు, ఖద్యోతకాంతిని = మిణుఁగురుబూఁచులకాంతితో, సంలీన = దాఁగిన, పృథురోమ = చేఁపలయొక్క, సంఘము = గుంపుకలది, శుష్కకంజము = ఎండిన కమలములు గలది, చొప్పఱెన్ = అందము చెడెను, భూజతతులు = చెట్ల గుంపులు, విగతపుష్పములు = రాలిన పూలు గలవి, కెందూళులు = ఎఱ్ఱని దుమ్ములు, కుంపు + దూళి = కెందూళి.

తాత్పర్యము

అమావాస్య రాకపోయినను రాహువు సూర్యుని బట్టెను. సూర్యునకు బ్రక్కన భయంకరంబైన మొండెము మొకటి గానవచ్చెను. ఎదురు ముఖముగ బెద్ద గాలి తీవ్రముగవీచెను. సూర్యకాంతి క్షయించెను. రాత్రిగాకున్నను దారకలు గ్రహము లాకాశమున మిణుఁగురుపురుగులవలెఁ గానవచ్చెను. నీళ్ళలో దాఁగిన చేపలు కమలములు గల్గిన సరస్సు లుండెను. చెట్లనుండి పూలు పండ్లు రాలిపోయెను. గాలి లేకయున్నను నదురుగ నెఱ్ఱని దుమ్ములు ప్రబలెను.

కం. శారికతతి వీచీకూ, చీరవముల నించె నపుడు ♦ చెలఁగెను భయదా
కారములను నిర్ఘాతో, ల్కారథసజ్జ్యోతిరనిల ♦ కాండము లంతన్. ౩౫౭

శారికతతి = ఆఁడుగోరువంకలు, వీచీకూచీరవములన్ = వీచి, కూచి యను ధ్వనులను, నిర్ఘాత=పిడుగు, ఉల్క=కొఱవి, రభస=వేగముతోఁగూడిన, జ్యోతిన్= కాంతి, అనిల = గాలియొక్క, కాండము = సమూహము, ఉల్క యనునది యొక విధమైన తేజస్సు, నిర్ఘాతము వాయువిశేషము, "ఉల్కా శిరసి విశాలా, నిపతంతీ వర్ధతే తనుప్రభయా, పవనాభిహతా గగనా, దవనౌచ యదా సమాపతతి। భవతి తదానిర్ఘాత స్సచపాపో దీర్ఘఖగవిరుతః" వరాహమిహిరుఁడు.

తాత్పర్యము

గోరువంకపక్షులు వీచి కూచి యని యఱవసాగెను భయంకరాకారములతో నిర్ఘాతవాయువులు ఉల్కాతేజస్సులు నతిశయించెను.

చం. వడఁకె వసుంధరాస్థలి స ♦ పర్వతకాననమై యవార్యమై
యెడమభుజంబు బిట్టదరె ♦ నంతయు గర్జల నింపఁ బోయినన్
జడిమ గొనం గళం బసుర ♦ నాథునకుం గనునీరు గాఱె నొ
వ్వడరె లలాటమందు జడుఁ ♦ డాఁగఁడు యాత్రను వీనిఁ జూచియున్. ౩౫౮

గర్జలన్=సింహనాదముల, జడిమ= మొద్దుతనము, జడుఁడు = మూఢుఁడు, ఆఁగఁడు = నిలువఁడు.

తాత్పర్యము

భూమి కొండలతో నదులతో వడఁకెను. ఖరునకు నెడమభుజ మదరెను. సింహనాదము చేయుద మనిన గొంతు మొద్దుపాఱి ధ్వనిరాదయ్యెను; నిష్కారణ ముగఁ గన్నుల నీరు కాఱెను; నొసట నొప్పిపుట్టెను; ఇన్ని యపశకునములు దోఁచి నను ఆ మూఢుఁడు ప్రయాణము నిలిపినవాఁడు కాఁడు.

కం. భీతిప్రద మైన మహో, త్పాతంబుల నన్ని దెసలఁ ♦ బరికించియునున్
ద్దైతేయభర్త రక్షో, వ్రాతంబును గాంచి నగుచు ♦ బలగర్వమునన్. ౩౬౦

భీతిప్రదము=భయము కలిగించునది, మహోత్పాతంబులు = గొప్ప యుపశకు నములు, పరికించియును=చూచియును, తత్స. పరీక్షించు; వ్రాతము = సమూహము

తాత్పర్యము

ఈ విధముగ భయంకరములగు గొప్ప యుపశకునములు నాలుగు ప్రక్కలం గలుగుట చూచియును ఆ రాక్షసనాయకుండు బలగర్వముచే వాని నలక్ష్యపెట్టి రాక్షసుల గుంపుతో వా రధైర్యపడుదురేమో యని తలంచి యిట్లనుచున్నాడు.

కం. ప్రకటముగం దోంచు నీ యుపశకునంబుల కేను జంక ♦ సైనికులారా
వికలుండగు బిఱికి వీనికి, నకుటిలభుజబలుండు ♦ వీని నాత్మం గొనునే. ౩౬౧

జంకక = భయపడను. తాత్పర్యము

స్పష్టముగం గానవచ్చు నీ యుపశకునములకు సైనికులారా! నేను జంకువాండను గాను. పిఱికివాండు వీనికిం గలంతపడును గాని వాస్తవముగ భుజబలము గలవాండు వీనిని మనస్సున లక్ష్యపెట్టునా ?

కం. తారలనైనను మచ్ఛర, ధారల ధరం గూల్తు దండి ♦ దండింతుం జండీ
యా రాఘవుల వధింపక, క్రూరాహవమందు వెనుకకుం మరలుదునే. ౩౬౨

మచ్ఛరధారలక = నా బాణవర్షముచే, దండి=యముని, దండముగలవాండు దండి, క్రూరాహవమందుక = క్రూరమైన యుద్ధమందు.

తాత్పర్యము

నా బాణవర్షముచే నక్షత్రములనైనను నేలం బడంగొట్టుదును, యముని దండింతును, అట్టి బలపరాక్రమములు గల నేను రామలక్ష్మణుల యుద్ధమునందుం జంపక వెనుకకుం బోదునా ?

ఉ. కోరిక దీర నా భగిని ♦ క్రోలెడింగావుత వారి రక్తముల్
ఘోరసమీకమందు మును ♦ గూరదు నాకుం బరాభవంబు లీ
మేరకు మీర సాక్షులు సు♦మీ యనృతంబు వచింప, నింద్రుంగ
బోర జయించినాండ నంట ♦ పొల్లు మనుష్యులచేతం జత్తునే ౩౬౩

భగిని=అక్క, అప్ప, "అత్తికా భగినీ జ్యేష్ఠా" యని నిఘంటువు. క్రోలెడింగ= త్రావును, సమీకమందుక = యుద్ధమందు, పరాభవంబు = అపజయము, పొల్లు = నిస్సారము. తాత్పర్యము

మా యక్క తన కోరికదీర వారి రక్తములను త్రావునుగాక. యుద్ధమందింతకుం బూర్వ మెప్పుడు నా కపజయము వచ్చినది లేదు. ఇది మీరే కన్నులారం జూచియున్నారు. అసత్యము చెప్పను. యుద్ధమందు నింద్రుని జయించినాండను. అట్టి వాండను నీ నిస్సారపు మనుష్యులచేం జత్తునా ?

మ. అని గర్జింపంగ దన్నినాదమున ర♦క్షోధీశు లానందవా
ర్ధిని దేలాడిరి కాలపాశముల బం♦దీభూతులై ; యుద్ధద
ర్శన కాంక్షాగత దేవసిద్ధ ఋషిరాజవ్రాత గంధర్వ లో
ర్యన గోబ్రాహ్మణ లోకసంగత జనే♦భ్య స్స్వస్తియంచుక్ మఱిక. ౩౬౪

గర్జింపఁగన్ = సింహనాదము చేయఁగా, తత్ + నినాదమునన్ = ఆధ్వనికి, బంధీభూతులై = కట్టుపడినవారై, యుద్ధదర్శన = యుద్ధము చూడవలయు నను, కాంక్షా = కోరికచేత, ఆగత = వచ్చిన, గోవులకు, బ్రాహ్మణ = బ్రాహ్మణులకు, లోకసంగత = లోకమునకు మేలుచేయు జనేభ్యః = జనులకు, స్వస్తి = మేలు కలుగునుగాక, దేవతలు కావున వారి భాషలో వారు మాట్లాడిరి.

తేలాడు = ఇది శబ్దపల్లవక్రియ, వేఱు వేఱర్థములు గల రెండుక్రియ లొక యర్థమునే యిచ్చునపుడు శబ్దపల్లవక్రియ యనఁబడును, తేలు + ఆడు = తేలాడు, ఇట్టులే, అందు + ఇచ్చు = అందిచ్చు, ఇందుఁ గ్వార్థకసంధి గలదని కొందఱు భ్రమింతురు, ఇం దవయవార్థము గ్రాహ్యము కాదు. నిలుచుండు అనునదియు శబ్దపల్లవక్రియయే. నిలుచు + ఉండు. ఇందుఁ గ్వార్థకసంధి గలదేని నిలిచుండు అని కావలయును గాని నిలుచుండు అని కానేరదు గదా, నిలిచుండు అను రూప మాంధ్రంబున లేదు. చాపము + నా కందిమ్మనుచో, అందిమ్ము అనునది శబ్దపల్లవము. నాకు నందున టిమ్మని యర్థమేకాని నీ వంది నాకు నిమ్మని యర్థముకాదు. సులభవ్యా — క్రియ. ౧౨౯-వ సూ.

తాత్పర్యము

ఇట్లు చెప్పి సింహనాదము చేయఁగా రాక్షసశ్రేష్ఠు లందఱు యముని పాశములచేఁ గట్టఁబడినవారై యా ధ్వనికి సంతోషసముద్రమునఁ దేలాడిరి. యుద్ధము చూడవలయునని వచ్చి యాకాశమున నిలిచిన దేవతలు సిద్ధులు ఋషిశ్రేష్ఠులు గంధర్వులు గోవులకు బ్రాహ్మణులకు లోకహితకారులకు మేలు కలుగునుగాక యని మఱియును.

మాలిని. జయతు జయతు రామ ♦ స్సంయుగే సర్వదైత్యా
న్నయగుణహిత చక్రీ ♦ వాశరా న్హంచు మింటన్
రయమునఁ జనుదేరన్ ♦ రాక్షస క్రూరసేనా
చయములఁ గని రంతన్ ♦ సంభ్రమోత్సాహదీప్తిన్. ౩౦

జయతు = జయించునుగాక, జయించునుగాక ఆదరమున ద్విరుక్తి, రామః = రాముఁడు, సంయుగే = యుద్ధమందు, సర్వదైత్యాన్ = సమస్తరాక్షసులను, అయగుణహిత చక్రీవ = శుభముఁగలిగించు గుణములచేఁ బ్రకాశించు హితుఁడైన విష్ణువువలె, ఆశరాన్ = రాక్షసులను, మింటన్ = ఆకాశమునందు, మాలిని, ననమయయగణంబులు, తొమ్మిదవ యింట యతి.

తాత్పర్యము

లోకహితముఁగోరి శుభకార్యములుచేయు సుదర్శనచక్రధారియైన విష్ణువు రాక్షసులను జయించునట్లు శ్రీరామచంద్రుఁడు సర్వరాక్షసులను యుద్ధమందు జయించునుగాక యని చెప్పుచు నాకాశమందుండి రాక్షససేన సంభ్రమముచేతను ఉత్సాహముచేతను బ్రకాశించుచు రాఁగాఁ జూచిరి.

సీ. ఖరుఁడు శతాంగ వే♦గంబున సైన్యంబుఁ, దలమీఱి చన నమా♦త్యులును శ్యేన
గామి పృథుగ్రీవ ♦ కాలకార్ముక యజ్ఞ,శత్రు సర్పాస్య దు ♦ ర్జయులు మేఘ
మాలి పరుష మహా ♦ మాలి విహంగమ,రుధిరాశనులు యశో ♦ రాధు లతుల
వీరుండు నా కర ♦ వీరాక్షుఁ డనఁ గను, బన్నిద్ద ఱాతని ♦ బడిని జనిరి
తే. యంత దూషణుఁ గొల్చి స్థూ ♦ లాక్షుఁడును బ్ర
మాథియు మహాకపాలుండు ♦ మఱి త్రిశిరుఁడు
ననఁగ నల్వురు చనిరి యు ♦ ద్ధాభికాంక్ష
నిజపదోద్ధూతరజములు ♦ నిశ ఘటింప. ౩౬౬

శతాంగవేగంబునన్=రథవేగముచే, తలమీఱి=సేన నంతయు దాఁటి. బడిన్=వెంట, నిజపద=తమ కాళ్ళచే, ఉద్ధూత = ఎగురఁగొట్టఁబడిన, రజములు = దుమ్ములు, నిశఘటింపన్=రాత్రిని గలిగింపఁగా.

తాత్పర్యము

తాను గోరినంత వేగముగ సేన నడవకుండుటచే ఖరుఁడు జాగుసైఁపక మిగుల వేగంబున సేనయంతయు వెనుకఁబడునట్లు ముందుగాఁ దన తేరిని దోలించెను. అతని వెంటనే యమాత్యులు శ్యేనగామి, పృథుగ్రీవుఁడు, కాలకార్ముకుఁడు, యజ్ఞశత్రువు, సర్పాస్యుఁడు, దుర్జయుఁడు, మేఘమాలి, పరుషుఁడు, మహామాలి, విహంగముఁడు, రుధిరాశనుఁడు, కరవీరాక్షుఁడు, ననువారు పండ్రెండుగురు పోయిరి. అంత దూషణుని వెంట స్థూలాక్షుఁడు, ప్రమాథి, మహాకపాలుఁడు, త్రిశిరుఁడు నను నల్వురుపోఁగా వారి పాదఘట్టనచే రేఁగిన ధూళి రాత్రివచ్చినదా యేమి యనునట్లు చీఁకట్లు గ్రమ్మజేసెను.

కం. ఖరకరనిశాకరులపైఁ, బురుగతిఁ జను గ్రహచయంబు ♦ బోలిక రక్షో
వరసైన్యము సరగం జనె, ఖరకరకులమణులఁ దాఁకఁ ♦ గలహప్రియమై. ౩౬౭

ఖరకరనిశాకరులపై = సూర్యచంద్రులమీఁద, పురుగతిన్ = అధిక వేగమున, గ్రహచయము=రాహుకేతువులు, ఖరకరకులమణులన్ = సూర్యవంశములో శ్రేష్ఠులగు వారిని, కలహప్రియమై = యుద్ధమునం దాసక్తిగలదై.

తాత్పర్యము

సూర్యచంద్రులపైఁ గ్రూరగ్రహముల గుంపు పరువెత్తునట్లు సూర్యవంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠులగు శ్రీరామలక్ష్మణులమీఁదికి యుద్ధకాంక్షచే రాక్షససైన్యము బయనించెను.

—♦ ౨౪-వ సర్గము. రాముఁడు లక్ష్మణునకు యుద్ధశకునంబులఁ జూపుట. ♦—

ఉ. ఆ తఱుణంబునన్ రఘుకు ♦ లాగ్రణి యెల్లెడ నారఁదోఁచు న
ుత్పాతము లెల్లఁ జూపి పిన ♦ తమ్మున కిట్లనుఁ గంటె లక్ష్మణా
భూతభయావహం బగు ప్ర ♦ భూతపిశాచరనాశసూచకో
త్పాతము లెల్లెడం బ్రబలెఁ ♦ దప్పదు మువ్వు ఘటిల్లు జూడఁగన్. ౩౬౮

ఆ తరుణంబునన్ = ఆ సమయమందు, దేశ్యమునందే యీ శబ్దమున కీ యర్థము. నిజము, కరము, నిరతము, లంపట లోనగు శబ్దము లుభయభాష లందును గలవు. అర్థము భిన్నము. అది తెలియనివారు నిజానిజము లని దేహాలంపట యని వాడెదరు. అరన్ = బాగుగ, పినతమ్ముఁడు = లక్ష్మణుఁడు, పెద్దతమ్ముఁడు భరతుఁడు, భూతభయావహము = ప్రాణికోటికి భయముగలిగించునది, ప్రభూత = అధికమైన, నిశాచర = రాక్షసులయొక్క, నాశ = చేటును, సూచక = సూచించు ఉత్పాత = అపశకునములు.

తాత్పర్యము

ఆ సమయమందు శ్రీరామచంద్రమూర్తి యన్ని దిక్కులయందు స్పష్టముగాఁ గానవచ్చు నపశకునముల నన్నిటిని జూచి చిన్నతమ్మున కిట్లనియెను. లక్ష్మణా! చూచితివా! రాక్షసులకు వినాశమును సూచించు నపశకునము లన్నిచోటుల విస్తారముగాఁ గానవచ్చుచున్నవి. ఏదియో కీడు రాఁగలదు, ఈశకునములు వ్యర్థములగునవి కావు.

కం. చావఁగలవారిమోములు, వేవిన్నఁదనంబుఁ జెందు ♦ విగ్రహమందున్
నీవదనము సప్రభమై, శ్రీ వెలసి ప్రసన్నమగుచుఁ ♦ జెల్వారెఁ జుమీ! ౩౧౯

విన్నఁదనంబు = దీనత్వము. విగ్రహమందున్ = కలహమందు, వదనము = ముఖము, సప్రభమై = కాంతితోఁగూడినదై, శ్రీన్ = శోభనమునే, ప్రసన్నము = నిర్మలము, సంతుష్టము, చెల్వారెన్ = అందమైయున్నది.

తాత్పర్యము

మరణము సమీపించిన వారి ముఖములు యుద్ధసమయమున వెల్లనై కాంతిహీనములై యుండును. నీముఖము కాంతితోఁగూడి శోభాయుక్తమై నిర్మలమై యందమైయున్నది. కావున జయము నాకు మాత్రమేకాదు, నీకును జయము గలదు. మనకు భయములేదు. తన ముఖము తనకుఁ గానరాదు. కావున లక్ష్మణుఁ జూచి చెప్పుచున్నాఁడు.

సీ. గర్దభారుణములై ♦ ఖరనిస్వనంబులై, రక్తధారంబులై ♦ రాలెఁ గంటె
చదల మేఘంబులు ♦ చలియించుచున్నవి, మచ్చాపములు సధూ ♦ మంబు లగుచు
జ్వలియించె శరములు ♦ వనరాజిఁ గలవిహం,గముల యులివుచం ♦ డంబుఁ జూడఁ
ప్రాణగొడ్డంబె న♦భయ ముప్పతిలు వేగ,శత్రువుల్ చత్తురు ♦ జయము మనకుఁ
తే. గల్గు గడు ఘోరమైన సం ♦ గ్రామ మొదవు
నదరెడిని మఱిమఱి కుడి ♦ హస్త మిపుడు
రాక్షసాళి భయంకరా ♦ రావములును
భేరికాభాంకృతులు నవె ♦ వినఁగ నయ్యె. ౩౨౦

చదలన్ = ఆకాశమందు, గర్దభారుణములై = గాడిదవలె బూడిదరంగు గలవై, ఖరనిస్వనంబుల = గాడిదధ్వనివలెఁ గఠోరధ్వని గలవి, రక్తధారంబులు = నెత్తురువంటి

ధారలుగలవై, సధూమంబులు=పొగతోఁగూడినవి. మచ్చాపములు = మన విండ్లు, నీది నాది యని భావము, జ్వలియించెన్=మండుచున్నవి, శరములు = బాణములు, వనరాజన్=వనసమూహమందు, విహంగంబుల=పక్షుల, ఉలివు చందంబుల్ = ధ్వని విధము, ప్రాణగొడ్డము = ప్రాణహింసకము, ఇది యనింద్య గ్రామ్య మని బాల వ్యాకరణము-ప్రాణకుట్టక శబ్ద భవమని ప్రౌఢవ్యాకరణము,ప్రాణగొడ్డమ గ్రామ్యంబు నాఁదగు, అంచపడము, అంచయాన లోనగువాని వంటిది. ప్రౌ. వ్యా. సంజ్ఞ. ౧౨ సూ. దీనికి భారతంబునఁ బ్రయోగము గలదు ''లోభనిరతిఁ బెద్ద కాసపడి పాడి దొఱంగినఁ బ్రాణగొడ్డపుం బనులగు భా. అను ర. ఆ. కం. విను రాజ్య మిమముం గొనఁ బలువురచేతఁ బ్రాణగొడ్డంబై యున్నను ధీరుఁ డేమఱమి, నది, దనకుం దక్కించుకొను బుధస్తుత్యముగన్'' శాంతి. ౨ ఆ. ౧౬౪ ప. సంగ్రామము = యుద్ధము, రాక్షసాళి=రాక్షసుల సమూహములయొక్క, భయంకరారావములును= భయముగలిగించు ధ్వనులును, భేరికాభాంకృతులు = నగారాల భాం భాం అను ధ్వనులును.

తా త్ప ర్య ము

ఆకాశమునందు మేఘములు గాడిదకాంతి గలవై, గాడిదల కఠోరధ్వనులు గలవై నెత్తురువంటి జలధారలుగలవై యున్నవి. మనవిండ్లు పొగలెగయుచుఁ దమం తటఁ దామే కదలుచున్నవి. చాపములందు మంట లెగయుచున్నవి అడవుల యందుఁ బక్షులధ్వనివిధము జూడఁ బ్రాణహింసాత్మకమైన భయము కలుగును. శత్రువులు చత్తురు, మనకు జయము గలదు. మిగుల భయంకరమైన యుద్ధము కలు గును. కుడిచేయి యదరుచున్నది. రాక్షసుల భయంకరధ్వనులు నగారాల మోఁతలు, వినవచ్చుచున్నవి. కావున శత్రువులు సమీపమందే వచ్చుచున్నారు.

కం. ఆపద రాఁగల దని, మది, లోపలఁ దోఁపగ మనీషి ♦ లోలుఁడు గాకా
యాపద దొలఁగు నుపాయము, వే పూర్వమ చేసికొనును ♦ విమలప్రజ్ఞన్. ౩౭౧

మనీషి=ఆలోచనపరుఁడు, లోలుఁడు=చలించినవాఁడు.

తా త్ప ర్య ము

ఆపద రాఁబోవుచున్నదని తెలియఁగానే యనాగతవిధాత యగు నాలోచన పరుఁడు చలింపక యా యాపదఁ దొలఁగఁదోయునుపాయ మేదో దానిని ముందు గానే తనబుద్ధిచే నాలోచించి చేయును.

—♦ శ్రీరాముఁడు సీతాలక్ష్మణుల గుహ నుండఁ బనిచి యుద్ధసన్నద్ధుఁ డగుట. ♦—

కం. కావున శరచాపంబుల, వావిరి ధరియించి నీవు ♦ వైదేహిఁ బ్రభూ
తావనిరుహనిబిరీస,గ్రావాంతరదరికిఁ బొమ్ము ♦ కదలుము లెమ్మా. ౩౭౨

ప్రభూత=విస్తారము, అవనిరుహ=చెట్లచే. నిబిరీస=దట్టమైన, గ్రావాంతర= కొండలలోనుండు, దరికిన్=గుహకు.

తాత్పర్యము

కాబట్టి యిప్పుడు నీవు చేయవలసినపని చెప్పెదను. సీతాదేవి యిందుండినా యామెకు వారు కీడు గలిగింతురు. కావున నామె యిం దుండరాదు. ఒంటరిగా నెందును బంపరాదు. కావున నీ వామెను బిలుచుకొని విల్లుబాణములు ధరించినవాడవై దట్టముగ బలసిన చెట్లగుంపులుగల కొండగుహలోనికి బొమ్ము. ఆమెను లోపలనుంచి నీవు వెలుపలఁ గావలియుండుము. ప్రయాణముకమ్ము, లేలెమ్ము, నే నొకపని నీ వొకపని చేయవలసియున్నది. రెండును ముఖ్యములైనవేసుమా.

వీని నిప్పుడు సీతమ్మగుట్టలందురు. రాక్షససేన తూర్పుముఖమై వచ్చెను. సీతాలక్ష్మణులు లేటియొద్దు వెంట నుత్తరముఖముగఁ బోయిరి.

కం. బదు లాడితి వేనియు నా, పదములపై నాన సుమ్మి ♦ బలవంతుఁ డవుగ
 గదనప్రియ! శూరుఁడ వం, చెద నెఱుఁగుదుఁ గలవు వీరి ♦ నల్ల వధింపగ. 323

ఆన = ఒట్టు.

తాత్పర్యము

నేను జెప్పినమాటకు బదులుచెప్పితివా నా పాదములమీఁద నొట్టు. యుద్ధప్రియా! నీవు బలహీనుఁడ వని వీరితో యుద్ధముచేసి గెలువలేవని నిన్నాపనికి నేర్పాటుచేయలేదు. నీవు బలవంతుఁడవు, శూరుఁడవు, వీరి నందఱను జయింపఁగలవు.

కం. అం దొకయింతయు నా మది, సందేహము లే దటైన ♦ స్వయముగ రక్షో
 బృందంబుఁ జంపఁగోరెద, ముందుగ నీ వరుగు మన్న ♦ మునుకొని త్వరమై. 324

తాత్పర్యము

ఇందు సందేహములేదు. అయినను నీరాక్షసులను నేనే స్వయముగఁ జంపఁగోరెదను. అంతియకాని మఱే యేకారణములేదు. వారు రాకముందే బయలుదేఱి పొమ్ము. మునులకు వాగ్దానము చేసినవాఁడను నేను. కావునఁ బ్రధమప్రయత్నము నాదిగా నుండుట నాకు యశస్కరము. అటుగాక నిన్ను యుద్ధమునకు విడిచి నేను జాటుగఁ బోయితినేని రాముఁడు మాటలవాఁడేకాని సమయమునకు ముఖము తప్పించి తాను దనపెండ్లాము గుహలో డాఁగి చిన్నవానిని ముందుఁ ద్రోచెనందురు. నీవు నన్నిట్టి యపకీర్తిపాలు చేయవచ్చునా? కావున నేనే యుద్ధముచేసెదను.

కం. శరచాపంబులు దాలిచి, ధరణీసుతతో సుమిత్ర ♦ తనయుం డరుగగ
 సరి వెళ్ళిరిగా వారని, పరమముదంబునను రామ ♦ భద్రుఁడు గడఁకగ. 325

తాత్పర్యము

రామచంద్రమూర్తి చెప్పిన ప్రకారము త్వరపడి లక్ష్మణుఁడు విల్లుబాణములు ధరించి సీతాదేవితో వెళ్ళిపోయెను. సరి యిక సీతవిచారము లేదు. అని సంతోషపడి రామచంద్రమూర్తి యుద్ధప్రయత్నము చేసినవాఁడై.

చం. అనలనికాశభూరికవ ♦ చావృతుఁడై పెనుఁజీఁకటిం బొగకఁ
గానని కృశాను నట్లు రుచిఁ ♦ గూరి యుదగ్రనిశాతబాణముల్
ధనువును గేలఁ బూని గుణ ♦ దారుణ రావము దిగ్వితానభే
దన మొనరింప నిల్చె వసు ♦ ధావరపుత్రుఁ డుదీర్ణగాత్రుఁడై. ౩౨౧

అనిలనికాశ= అగ్నిహోత్రముతో సమానమైన, భూరి = గొప్పదగు, కవచావృతుఁడై =కవచముచేఁ గప్పఁబడినవాఁడై, పెనుఁజీఁకటిఁ= దట్టమైన చీఁకటియందు, పొగంగానని=పొగలేని, కృశానునట్లు=అగ్నిహోత్రునివలె, రుచిఁ= కాంతిని, కూరి=పొంది, ఉదగ్ర =భయంకరమైన, నిశాత= పదునైన, గుణ = అల్లెత్రాటియొక్క, దిగ్వితాన=దిక్సమూహములయొక్క, ఉదీర్ణ=ఉత్సాహముచేఁ బెరిఁగిన, గాత్రుఁడై = దేహముగలవాఁడై, పొగలేని కృశానునట్లు అనుటచే శత్రునిరాసము క్షణమాత్ర కార్యమని భావము.

తాత్పర్యము

మండుచున్న యగ్నితో సమానమైన గొప్పకవచము తొడిగికొనినవాఁడై గాఢాంధకారములోఁ బొగలేని యగ్నిహోత్రునివలెఁ గాంతిని బొంది పదునైన బాణములను వింటిని చేతులఁ బట్టుకొని యల్లెత్రాటి ధ్వనిచే దిక్కులు భేదిల్లఁగా రామచంద్రమూర్తి యుత్సాహముచేఁ బెరిఁగిన దేహముగలవాఁడై విజృంభించి నిలిచెను

సీ. అప్పుడు గంధర్వ ♦ లాదిగా దేవతల్, చారణుల్ గుంపులై ♦ సమరదర్శ
నాసక్తిఁ జనుదెంచి ♦ యంబరమ్మున నిల్చి, ఋషు లొండొరులతోడ ♦ నిట్టులనిరి
'స్వస్తి గోబ్రాహ్మణే ♦ భ్యోస్తు యే త్రిభువనా, నా మభిసంగతా ♦ భీయయామి
నీ చరాఁ పౌలస్త్య♦ నిచయాఁ రణే రామ,చంద్రమహీశ్వరో♦ జయతు జయతు

తే. చక్రపాణి ర్యథా రణే♦ సర్వదైత్య, పుంగవా' న్నంచు మఱి ధర్మ ♦ బుద్ధి నృపతి
వీరుఁ డొకరుఁడు పదునాల్గు♦ వేలు చెనఁటి,సేఁకు లెట్లగునో యని♦చూఁత మనుచు. ౩౨౨

సమరదర్శనాసక్తిఁ = యుద్ధముచూచుకోరికచే, ఋషులు 'వారిలో' లేక 'అందు' ననుపద మధ్యాహారము.

భూతార్థసమాపకక్రియ పలయుచో వాక్యాంతర జనిస్థానంబగు, అగుచోఁ గర్త తత్కర్త లందలిదియు యెద్దియే నొండగు. ప్రౌ–వ్యా–వాక్య–౧౬–సూ. "ధవళాక్షుల్ చని కాంచి రంత నెదుటఁ, దత్తీరదేశంబునం, దవదాతాంబుజ ఫేనపుంజ నిభు నయ్యశ్వోత్తముఁ దవ్వులఁ" నని కద్రువ వినతం జూచి' భార–ఆది–౨–౮, అని యనుటకు ధవళాక్షుల్ అనునది కర్త. చూచి యనుటకు కద్రువ కర్తృపదము, అని అందు కద్రువ యని యర్థము. "దేవలోకంబున కరుగు వారెదుర ద్వాపరం

బుత్తో వచ్చు కలిం గని శక్రుం డిది యేమి యెందుఁ బోయెద రని యడిగిన యింద్రునకుఁ గలి యిట్లనియెం భార-అరణ్య.

ఇచ్చట 'కవి' యనఁగా 'కనిరి' అందు నని యర్థము గ్రహింపవలెను. ఇట్టులే యిచ్చటను 'నిల్చి' యనఁగా నిల్చిరి. అనియు నందు నధ్యాహార మనియు గ్రహింపనగు. యే = ఎవ్వరు, త్రిభువనానాం = మూఁడులోకములకు, అభిసంగతాః = మేలు చేయువారో, అట్టి, గోబ్రాహ్మణేభ్యః=గోవులకు,బ్రాహ్మణులకు, స్వస్తిఅస్తు=శుభము కలుగునుగాక, రామచంద్రమహీశ్వరః = రామచంద్రభూపాలుఁడు, భీమయామినీ చరాన్=క్రూరరాక్షసులను, పౌలస్త్యనిచయాన్ = పులస్త్యవంశమునఁ బుట్టినవారి గుంపును, రణే=యుద్ధమునందు, చక్రపాణిః = విష్ణువు, రణే సర్వదైత్యపుంగవాన్, యథా=యుద్ధమందు సమస్తదైత్యశ్రేష్ఠులనువలె, జయతుజయతు=జయించునుగాక జయించునుగాక, ఆదరమున ద్విరుక్తి. పుంగవాన్ + అంచు, అనుకరణంబునం దుది హల్లునకు ద్విర్వచనంబగు. సు-వ్యా సంధి ౧౫-సూ కింతత్ + అనియె. కింత త్తనియె-కస్త్వమ్ + అనియె - కస్త్వమ్మనియె. ఇట్లే యిందును గ్రహింపవలెను, 'లుక్సంశ్లేషే నాచి' యను సూత్రమున కిది విషయముగాదు. పుంగవాన్ = ద్రుత ప్రకృతికముగాదు, సంస్కృతమునందు ద్రుతప్రకృతికములు లేవు, చెనఁటిసోఁకులు = దుష్టరాక్షసులు, గంధర్వులాదిగా ననుటచే ౩౬-౪-వ పద్యమునఁ జెప్పఁబడిన దేవ సిద్ధ ఋషి రాజవ్రాత గంధర్వు లని గ్రహింపనగు. ఆకాశమున ఖరసేనల వెంట వచ్చుట జెప్పఁబడెను. ౩౬౫ వ పద్యంబునందు దేవతలు ఇచ్చటవచ్చి రణభూమికి సరిగా మింట నిలుచుట చెప్పఁబడెను. కావునఁ బునరుక్తిదోషము లేదు.

గోవులు బ్రాహ్మణులు లోకమునకుఁ జేయు మేలేది యనిన,

అగ్నౌ ప్రాస్తాహుతి స్సమ్యగాదిత్య ముపతిష్ఠతే
ఆదిత్యాజ్జాయతే వృష్టిః వృష్టే రన్నం తతః ప్రజాః.

అని కలదు. అగ్నియందు, వేల్వఁబడిన యాహుతి సూర్యుని చెందును. సూర్యునివలన వర్షము, వర్షమువలన నన్నము, దానివలనఁ బ్రజలు కలుగుదురు. జీవించుదురు.

హోమమునకు గవ్యములే శ్రేష్ఠములు-కావున ఆవుపాలు - ఆవునెయ్యి-ఆవు పెరుఁగు-ఇవియే ముఖ్యపదార్థములు. వీనిచే బ్రాహ్మణులు హోమము చేయుదురు. కావున గో బ్రాహ్మణులు లోకహితాభిలాషులు.

అన్నాద్భవంతి భూతాని, పర్జన్యా దన్నసంభవః
యజ్ఞాద్భవతి పర్జన్యో, యజ్ఞః కర్మసముద్భవః
కర్మబ్రహ్మోద్భవం విద్ధి, బ్రహ్మాక్షరసముద్భవమ్
తస్మాత్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్॥ భ. గీ. ౩-౧౪.

లోకాస్సమస్తాస్సుఖినో భవంతు. అని త్రిసంధ్యములందు వారు చెప్పుచుందురు.

తా. ఉత్సాహ ప్రబుద్ధుఁడై యుద్ధసన్నద్ధుఁడై నిలిచిన రామభద్రునిఁ జూచి యుద్ధముఁ జూచు కోరికచే వచ్చి యాకాశమున గంధర్వులు దేవతలు చారణులు లోనగువారు వచ్చి నిలిచిరి. అందు ఋషులు తమలో నొకరితో నొకరు మూఁడు లోకములకు మేలు గోరువారైరో యట్టి గోబ్రాహ్మణులకు శుభమగును గాక. చక్రపాణి యగు విష్ణువు దైత్యశ్రేష్ఠుల నెల్ల నెట్లు యుద్ధమున జయించెనో యట్లు రామభద్రుఁడు పులస్త్యవంశమునఁ బుట్టిన భయంకర రాక్షసుల నెల్ల యుద్ధమునందు జయించును గాక జయించును గాక యనిరి. మఱియు ధర్మాత్ముఁడు రాజవీరుఁడు రామభద్రుఁ డొకఁడు; అధర్మవర్తులగు దుష్టరాక్షసులు పదునాలుగు వేవురు. యుద్ధమెట్లగునో-ధర్మమే జయించునో అధర్మమే జయించునో చూడవలయు నని; చక్రపాణి విశేష్యము సాభిప్రాయము గావున పరికరాలంకారము.

కం. కౌతూహలమున నుండిరి, జాతోగ్రరుషాపినాకి ♦ సమవేషం బా
భూతాధికభీత్యావహ, సీతాపతిరూపుఁ గాంచి ♦ చేష్పడె జగముల్. ౩౨౮

కౌతూహలమునన్ = సంతోషముతో, జాత = పుట్టిన, ఉగ్ర = భయంకరమైన, రుషా = కోపముగల, పినాకి = రుద్రునితో, సమ = సమానమైన, వేషంబా = ఆకారముగల, చేయుఁబోవునది సంహారకార్యము కావున - పినాకహస్తుఁడైన రుద్రుఁ డుపమింపఁబడెను. భూత = ప్రాణికోట్లకు, అధిక = విస్తారమైన, భీతి = భయమును, ఆవహ = కలిగించు, సీతాపతి = రామచంద్రుని, రూపున్ = రూపమును, సంస్కృతసమాసంబునఁ గడపటిపదము వైకృతరూపము గలది యగును. చేష్పడెన్ = బాధకొందెను. చేటుపడు = చేడ్పడునయ్యెనని తోఁచెడిని. పినాకి సమవేషము ఖరాదుల వధింపఁ బూనిన రామచంద్రునందు ప్రళయకాల రుద్రుని వంటి రూపమే దేవతలకుఁ గానవచ్చెను.

"రుద్రతేజోవిలసితం-దృష్ట్వా రామకళేబరమ్.
శంఖం చక్రంచ శూలంచ, పినాకం ఖేటమేవచ
ఖట్వాంచ ఘంటాం డమురుం బాణపాశాంకుశం తథా
చాపం వజ్రంచ ఖడ్గంచ పరశుం త్రాసకారణమ్
జయశ్రియంచ గంగాంచ దదృశుః సిద్ధచారణాః"
అని స్కాందమునఁ గలదు. మహేశ్వరతీర్థీయము.

తా. మిగుల నాశగొనియుండిరి. కోపాతిశయముచే జగత్సంహారకార్యమున నున్ముఖుఁడైన పినాకహస్తుఁడైన రుద్రుని యాకారముతో సమానమైన భయంకరాకారము వహించి భూతములకు భీతిని గలిగించు రామభద్రునిరూపముఁ గాంచి లోకములు బాధపడెను.

—♦ ఖరసైన్యము రామునిం జూచుట ♦—

సీ. అంత గంభీరని ♦ ర్హ్రాదయు ఘోరవ, ర్మాయుధధ్వజయునౌ ♦ నసురసేన
చటులహుంకారంబు ♦ చాపటంకారంబు, భేరిభాంకారంబు ♦ భీమరథిక
వరులధిక్కారంబు ♦ పదదభత్కారంబు, తోఁపఁ దోతెంచుచుఁ ♦ దుములముగను
నారవంబునకుఁ గాం ♦ తారమండలిజంతు, నికరంబు భీతిల్లి ♦ యఖిలదిశల

తే. బఱచి పఱచి నిశ్శబ్దంపుఁ ♦ బట్టుఁ జేరి, తిరిగి చూచెను రాక్షస ♦ వరులసేన
రామచంద్రుఁ డదియు సం ♦ గ్రామకేళి, పండితుఁడు దాని నల్లఁ ♦ బాఱఁజూచి.

నిర్హ్రాదము = ధ్వని, వర్మ = కవచము, ధ్వజ = టెక్కెము, చటుల = భయంకరమైన, తుములముగను = సంకులముగ, రవంబునకుఁ = ధ్వనికి, కాంతారమండలి = అడవియందలి, నికరంబు = సమూహము, భీతిల్లి = భయపడి, పఱచి = పరుగెత్తి.

తా. అంతట గంభీరధ్వనియు, భయంకరమైన కవచములు, ఆయుధములు, ధ్వజములు గలదియునైన రాక్షససేనయందలి భటులయొక్క హుమ్మను కంఠధ్వనులు విండ్లయల్లెత్రాడుల టంటమ్మనుధ్వనులును, నగారాల భాంభామ్మను ధ్వనులును, రథికుల ధిక్కారంబులును, వారు నడచునపుడు వారికాళ్ళ దభదభను చప్పుడులును గలుగఁగా పెద్దసంకులమయ్యెను. ఆ ధ్వనికి నడవులందలి మృగసమూహము భయపడి నలుదిక్కులఁ బరువెత్తి పరువెత్తి యే చప్పుడు వినరాని స్థలముఁజేరి తిరిగిచూచెను. అంత రాక్షసులసేన రాముని సమీపింపఁగా దానినంతయు యుద్ధపండితుఁడగు రామభద్రుఁడు వారి నందఱఁ బాఱజూచెను.

శా. వింటన్ బాణముఁ గూర్చి యీడ్చి వలభు ♦ గ్వీరాసుపాళీమరు
ల్లుంటాకుండుగఁ దెచ్చికొంచుఁ గినుకన్ ♦ లోలాక్షుఁడై కల్పవు
న్నంటల్ గ్రక్కుకృశానుచందమగుచు ♦ న్దక్షాధ్వరాలంభము
క్కంటింబోలి దిదృక్షు భీకరతరా ♦ కారంబునం గ్రాలెనన్. ౩౨౦

వలభుక్ + వీర + అసు + పాళీ + మరుత్ + లుంటాకుండుగన్ = మాంసభక్షకులైన రాక్షసవీరుల ప్రాణసమూహము లను వాయువును హరించువాఁడుగ, కినుకన్ = కోపమును, తెచ్చికొని = కోపము స్వభావముగ నాయనయందు లేదు, కార్యార్థమై కావలసియున్నది కావున నాసమయంబునకుఁ జలిచే వణఁకువాఁడు దూరమున నున్న వస్త్రమును లాగుకొని కప్పుకొన్నట్లు కోపమును దెచ్చుకొనెను. ఇది జితేంద్రియుని లక్షణము. వారు కావలయునన్నప్పుడు కోపము వచ్చును. పొమ్మనినఁ బోవును. తక్కినవారికివలె వారి యనుమతిలేక రాదు. పనితీరిన తరువాత నిలువదు. లోల + అక్షుఁడై = చలించుకన్నులు గలవాఁడై,

కల్పపుస్మాంటలన్ = ప్రలయకాలమందలి మంటలను, కృశానుచండమునన్ = అగ్ని హోత్రునివలె, దక్షాధ్వరాలంభ = దక్షునియజ్ఞము ధ్వంసము చేయు, ఆలంభ స్స్పర్శహింసయోః; నానా. ర. ముక్కంటికిన్ = మూఁడుకన్నులుగల శివునికి, దిదృక్షు = చూచుకోరికగలవారికి, భీకరతర = మిగుల భయంకరమైన, ఆకారంబునన్ = రూపముతో, ప్రాలినన్ = ప్రకాశింపఁగా.

తా. అస్త్రశాలయందు బాణము సంధించి ప్రయోగమునకు సిద్ధముగా నిడ్చి రాక్షసుల ప్రాణవాయువు లపహరించుటకై కోపము దెచ్చుకొని చలించు కన్నులు గలవాఁడై ప్రలయకాలమునందలి యగ్నిహోత్రునివలె మండుచు దక్షాధ్వరధ్వంసమునాటి శివునివలె చూపఱులకు భయంకరమైన యాకారముతో నొప్పఁగా.

క౦. భీషణకోపుం డగురఘు, భూషణు వేషంబుఁ జూచి ♦ భూతములు మహా
ఘోషంబునఁ బఱచెను సం,తోషముచెడి భూరిభీతిఁ ♦ దొక్కటపడుచున్. ౩౮౧

భీషణకోపుండు = భయంకరమైన కోపముగలవాఁడు.

తా. భయంకరమైన కోపముఁ దెచ్చుకొన్నవాఁడైన రామభద్రుని యాకారముఁ జూచి భూతములు పెద్దధ్వనులతో సంతోషముచెడి యధికభయమునఁ దొక్కటపడుచుఁ బరువెత్తెను.

క౦. ధ్వజకోదండాభరణ, వ్రజజాజ్వలదగ్నితుల్య ♦ వర్మాన్వితమై
రజనీచరసైన్యము పం,కజహితజనివేళ జలద ♦ గణ మన నొప్పెన్. ౩౮౨

ధ్వజ = టెక్కెములు, కోదండ = విండ్లు, ఆభరణవ్రజ = భూషణముల సమూహములు, జాజ్వలదగ్నితుల్య = మండుచున్న యగ్నితోసమానమైన, వర్మ = కవచములు, వీనితో, అన్వితమై = కూడినదై, రజనీచరసైన్యము = రాక్షససేన, పంకజహిత = సూర్యునియొక్క, జనివేళన్ = పుట్టుసమయమందు, జలదగణము = మేఘసమూహము—సూర్యోదయముకాఁగానే మేఘములు క్షీణించును. వేఁడిమికి సంతయు నావిరియై కానరాక పోవును.

రామచంద్రునికి ప్రలయకాలవహ్నిని, దక్షాధ్వరధ్వంసకుఁడగు శివుని నుపమానములుగఁ జెప్పుటచే శత్రుసంహారము జయము సిద్ధమని యేర్పడెను.

రాక్షసులను ప్రాతఃకాలమేఘములకుఁ బోల్చుటచే క్షయము సిద్ధమని సూచింపఁబడెను.

తా. ధ్వజములు, విండ్లు, ఆభరణసమూహము మండుచున్న యగ్నివంటి కవచములుగల రాక్షససేన సూర్యోదయమందలి మేఘములవలెఁ గానిపించెను.

—♦ ౨౫-వ సర్గము. ఖరుఁడు సేనతోడ శ్రీరాముఁ దాఁకుట ♦—

క౦. క్రుద్ధు రిపుఘాతి రణసన్నద్ధు నవష్టబ్ధచాపు ♦ నరపతితనయున్
బద్ధాంగుళిత్రుఁ గని ఖరుఁ, డిద్ధగతిన్ సూత వఱుపు♦మీ యట కనియెన్. ౩౭౩

క్రుద్ధున్ = కోపించియుండు వానిని, రిపుఘాతిన్ = శత్రుసంహారమందు దక్షుని, రణసన్నద్ధున్ = యుద్ధమునకు సిద్ధపడియుండు వానిని, అవష్టబ్ధచాపున్ = వింటిని ధరించిన వానిని, బద్ధాంగుళిత్రున్ = చేతివ్రేళ్ళకు రక్షకముగాఁ గట్టుకొనఁబడిన చేతి జిరా కలవానిని, వఱుపుమీ = తోలుమా, అటకున్ = రామచంద్రుఁడున్నచోటికి.

తా. కోపించినవాఁడును, శత్రుసంహారకుఁడును, యుద్ధసన్నద్ధుఁడును, కోదండధరుండును, కట్టుకొనఁబడిన వ్రేళ్ళకవచము గలవాఁడునగు రామభద్రునిఁ జూచి ఖరుఁడు సారథీ! తేరిని నాతఁడున్నచోటికిఁ దోలు మనెను.

ఉ. ఆతనిఁ జుట్టి రాత్రిచరు ♦ లార్భటి సించి రతండు తారకో
పేతకుజాకృతిన్ వెలిఁగి ♦ భీమశితేషు పరంపరల్ వెసన్
వ్యాతతరీతి వైచె నృపు ♦ సందఱుఁబట్టిసశూలముద్గర
వ్రాతపరశ్వధాసు లని ♦ వారణ వైచిరి వారిజాక్షుపై. ౩౭౪

ఆర్భటిన్ = కంఠధ్వనిని, తారకా = నక్షత్రములతో, ఉపేత= కూడిన, కుజాకృతిన్ = అంగారకగ్రహమువలె, భీమశితేషుపరంపరల్ = భయంకరములైన పదునైన బాణముల వరుసలు, వ్యాతతరీతిన్ = మిగుల విస్తారముగ, పట్టిస...అసులు = అడ్డకత్తులు, శూలములు, ఇనుపగుదియలు పీని సమూహములు, గండ్రగొడ్డండ్లు, కత్తులు, అనివారణన్ = అడ్డములేక.

తా. ఖరుఁ డిట్లు రామభద్రుని మీఁదికిఁ దేరు తోలింపఁగా నతని చుట్టుముట్టుకొని రాక్షసులు సింహనాదములు గావించిరి. ఖరుఁడును నక్షత్రములతోఁ గూడిన యంగారకువలె వెలిఁగి భయంకరములై పదునైన బాణముల పరంపరలను విస్తారముగ ఆలస్యములేక రామునిపై వైచెను. తక్కిన వారందఱు రాముని చుట్టుముట్టి గుదియలు, శూలములు, గండ్రగొడ్డండ్లు, కత్తులు నాయనపై విసరి విసరి వైచిరి. ఇవ్విధమున అగరగొండ్లు రాక్షసులే; శ్రీరాముఁ డాత్మరక్షణ పరాయణుఁడయియే నిలిచెను.

క౦. కాండములతోడ మదవేతండంబులతోడ ఘన♦రథంబులతోడన్
మెండుగఁ బైపడి రసురులు, చండాంశుకులావతంసు ♦ జక్కాడంగన్. ౩౭౫

కాండములతోడన్ = బాణములతో, మద = మదించిన, వేతండము

తోడన్ = ఏనుఁగులతో, చండాంశుకులావతంసున్ = సూర్యవంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుఁడగు రామభద్రుని, చక్కాడంగన్ = సంహరించుటకు.

తా. రామభద్రుని వధించుటకై రాక్షసులు బాణములతోడను, ఏనుఁగుల తోడను, రథములతోడను నొక్కసారిగఁ బైపడివచ్చిరి.

౬౦. ధారాధరసంఘము జలధారాపూరములచేత ♦ ధరణీధరమున్
బోరన ముంచెడిగతి శర, పూరంబులు రామువిూఁద ♦ వర్షించి రొగిన్. ౩౮౬

ధారాధరసంఘము = మేఘసమూహము, జలధారాపూరములచేత = నీటి ధారల ప్రవాహములచేత, ధరణీధరమున్ = పర్వతమును.

తా. మేఘములు నీటిధారల ప్రవాహములచేఁ బర్వతమును బోరన ముంచు రీతిగ రామునివిూఁద బాణవర్షము గురియించిరి.

దీనివలన నీయుద్ధమందును బ్రథమాపరాధులు రాక్షసులే యని యేర్పడెను.

౬౧. పారావారము తటినీపూరము లోఁగొనెడిరీతిఁ ♦ బురుషోత్తముఁ డా
క్రూరతరసాధనంబుల, నారాచవితానముల ♦ నణఁచెన్. ౩౮౭

పారావారము = సముద్రము, తటినీపూరమున్ = ఏఱ్ఱ ప్రవాహమును, లోఁగొనెడిరీతి = లోపలికి కొను విధముగ, నారాచవితానంబులన్ = బాణ సమూహములచే.

తా. తనను చేరవచ్చిన నదులను సముద్రుఁడు పేరు రూపము లేకుండఁ జేయునట్లు రామభద్రుఁడు తన బాణసమూహముచే వారల సర్వాయుధములను రూపుమాపెను.

ఉ. ధీరత దీప్తవజ్రనిహ ♦ తిన్ వ్యథఁ గూరసిభూరిశైలమో
నా రఘువీరుఁ డుగ్రముగ ♦ నాటినసాధనకోటి నింతయున్
గారణఁ బొందఁ డయ్యె మెయిఁ ♦ గాఱెడి రక్తముతో దినాంతమే
ఘోరుచయావృతార్కుఁడన ♦ నొప్పె నవీనవిలాసభాసియై. ౩౮౮

ధీరతన్ = ధైర్యముచే, దీప్తవజ్రనిహతిన్ = మండుచున్న పిడుగుదెబ్బలచే, వ్యథ = బాధ, మనోవేదన-నాన్ = అనునట్లు, కారణన్ = వేదనను, “ కారణాతు యాతనాతీవ్రవేదనా ” అమరకోశము, దినాంత = సాయంకాలమందలి, మేఘోరు చయ = మబ్బులగొప్ప గుంపుచే, ఆవృత=ఆవరింపఁబడిన, అర్కుఁడు = సూర్యుఁడు, నవీన=క్రొత్తయగు, విలాస=సౌందర్యముచే, భాసి=ప్రకాశించువాఁడు.

తా. మండుచున్న పిడుగుదెబ్బలచే బాధనొందని పెద్దపర్వతమో యనునట్లు రామభద్రుఁడు ధైర్యవంతుఁడై తనకుఁ దగిలిన సాధనములచేఁ గొంచెమైన వేదనఁ

పొందినవాఁడు కాఁడయ్యె. దేహమున నెత్తురు గాఱుచుండ సాయంకాలమందలి మేఘములచే నావరింపఁబడిన సూర్యునివలెఁ గ్రొత్తయందముతోఁ బ్రకాశించెను.

ఉ. అక్కట రామచంద్రుఁ డసుగుణాంబుధి నొక్కఁడఁ జుట్టుముట్టి యా
క్షుద్రనిశాచరుల్ గలసి ♦ కొట్టెదరే యని దేవతల్ ఋషుల్
మిక్కిలి పొక్కి, రంత మితి♦మీఱిన కిన్కఁ రఘూత్తముండు దా
నక్కున మండలీకృతసు♦ కార్ముకుఁడై విశిఖోత్కరంబులన్. 3౮౯

అక్కట = అయ్యో, హా కష్టమ్. దీనితద్భవము అక్కట. సుగుణాంబుధిన్ = మంచిగుణములకు సముద్రుఁడైనవానిని, క్షుద్ర = క్షుద్రమైన, నిశాచరుల = రాక్షసులగుంపులు, కొట్టెదరే = కొట్టుచున్నారే, పొక్కిరి = పరితాపపడిరి, కిన్కన్ = కోపముచే, మండలీకృత = ఆకర్ణాంతము లాగుటచే గుండ్రముగాఁ జేయఁబడిన, కార్ముకుఁడై = విల్లుగలవాఁడై, విశిఖ + ఉత్కరంబులన్ = బాణసమూహములను.

తా. అయ్యో, మంచిగుణముల నెడి రత్నములకు సముద్రుఁడైన శ్రీరామచంద్రమూర్తిని క్షుద్రరాక్షససమూహము చుట్టుకొని యాయుధములచేఁ గొట్టుచున్నదే యని దేవతలు ఋషులు మిగులఁ బరితపించిరి. అంతట రామభద్రుఁడు మిక్కిలి కోపించి వింటిని నాకర్ణాంతము లాగి బాణములను.

—♦ శ్రీరాముఁడు ఖరుసేనను నుఱుమాడుట. ♦—

ఉ. నూఱులు వేలు దుర్విషహ♦నూతనసూర్యజదండతుల్యముల్
తేఱి గనంగరాక పటు♦తీవ్రత వైచిన రాక్షసాళులన్
దూఱి కృతాంతపాశగతి ♦ దోఁపఁగ వారల మేను వ్రచ్చి న
ల్లేఱులఁ దోఁగి యభ్రపద♦ మేగె జ్వలద్దహనార్చులో యనన్. 3౯౦

దుర్విషహ = ఏమియు సహింపరాని, నూతన = క్రొత్తయగు, సూర్యజదండ = యమునిదండముతో, తుల్యముల్ = సమానములు, కృతాంతపాశగతిన్ = యమునిపాశమువిధమున, మేను = దేహము, వ్రచ్చి = చీల్చి, నల్ల + ఏఱుల = నెత్తురునదులందు, తోఁగి = మునిఁగి, అభ్రపదము = ఆకాశము, జ్వలత్ = మండుచున్న, దహన = అగ్నియొక్క, అర్చులో = జ్వాలలో యనునట్లు.

తా. సహింపరాని యమునదండములవంటివానిని, కన్నెత్తి చూచుటకైన సాధ్యపడకుండునట్లు నూర్లు వేలుగ మిక్కిలివేగముగ నేనఁగ నవి రాక్షసగుంపులను దూఱి యమునిపాశములవలె వారి దేహములను జీల్చి వార నెత్తురు నదులందు మునిఁగి వెడలి మండుచున్న యగ్నిజ్వాలలవలె నాకాశమునకుఁ బోయెను.

ఉ. ఎన్నఁగరాని బాణములఁ ♦ నేసియుఁ గోసియు వ్రచ్చి త్రుచ్చియుం
బన్నగ శత్రుసంఘముల ♦ బాహులఁ గాళ్ల నూరులం దలల్
ద్రొన్నగలం ధ్వజాగ్రములఁ ♦ నుప్పలు నుప్పలు వెట్టఁ గ్రోధసం
ఛన్నహృదంతరాళుఁ డయి ♦ శత్రులు తత్తఱ మంద రాముఁడుం 3౯౧

ఎన్నఁగరాని = లెక్కింప సాధ్యముగాని, క్రోధ = కోపముచే, సంఛన్న = కప్పఁబడిన, హృత్ + అంతరాళుఁడయి = హృదయములోపలి ప్రదేశము గలవాఁడై.

తా. రామభద్రమూర్తి లెక్కలేని బాణములను బ్రయోగించి చీల్చి త్రుచ్చి శత్రువుల కాళ్ళుకీళ్ళు, చేతులు వాతులు – తొడలు మెడలు – తలలు మొలలు – నగలు, టెక్కెముల పై భాగములు తెగనఱకి నుప్పలునుప్పలుగాఁ బెట్టి క్రోధముచేఁ గప్పఁబడిన హృదయప్రదేశము గలవాఁడై విరోధులు తత్తఱలాడునట్లు.

సీ. కాంచనభూషణో ♦ దంచితహయములఁ సాదులతోడుతఁ ♦ జమరి చమరి
మాపటివాండ్రతో ♦ మత్తగజంబుల, నంత లంతలు దును ♦ మాడి యాడి
రథికసారథులతో ♦ రథనికరంబులఁ, గఱుకు టంపరలచే ♦ నఱకి నఱకి
పటుతరగర్వదు ♦ ర్భరభటచ్ఛటలను, గూరబ్రద్దలుగోలెఁ ♦ గోసి కోసి

తే. మండలీకృతచండకో ♦ దండదండ, సర్వతోముఖనిర్గళ ♦ చ్చటులవిశిఖ
ఖరగభస్తిఖరాంశుని ♦ కరణి వెలుఁగ, నసురతతి భీతిఁ గూపెట్ట ♦ నంగలార్చి.

కాంచనభూషణ = బంగారుసొమ్ములచే, ఉదంచిత=అలంకరింపఁబడిన, హయములం = గుఱ్ఱములను సాదులతోడుతం = రౌతులతో, చమరిచమరి = చంపిచంపి, అతిశయార్థకమున ద్విరుక్తి – అంతలంతలు = కొంచెము కొంచెము తునుకలుగా, తునుమాడియాడి = తునుమాడి తునుమాడి, శబ్దపల్లవక్రియలు కొన్ని ద్విరుక్తంబులగుచో నుత్తపదంబు పూర్వావయవంబునకు లోపంబగు. త్రి – శే – క్రి ౨౪. తునుము + ఆడు = తునుమాడు, రథికుఁడు = రథస్వామి, సారథి = రథము తోలువాఁడు, కఱకు + అంపరం = పదునైన బాణములచే, పటుతర = మిక్కిలి యధికమైన, గర్వ = మదముచే, దుర్భర = అధికులైన, భట = భటులయొక్క, ఛటలను = సమూహములను, మండలీకృత = గుండ్రముగాఁ జేయఁబడిన, చండ = భయంకరమైన, కోదండదండ = దండమువంటి వింటినుండి, సర్వతోముఖ = అన్ని దిక్కులకు, నిర్గళత్ = బయలుదేఱు, చటుల = తీక్ష్ణమైన, విశిఖ = బాణములనెడి, ఖరగభస్తి = తీక్ష్ణములైన కిరణములుగల, ఖరాంశుని = సూర్యుని, కరణి = వలె, కూపెట్టం = కట్టో మొట్టో యని యఱచెను, అంగలార్చెం = దుఃఖించెను.

తా. బంగారుసొమ్ములచే నలంకరింపఁబడిన గుఱ్ఱములను జంపిచంపి,

మాపటివాండ్రతోడ మదించిన యేనుఁగులను తునకలు తునకలుగాఁ గొట్టికొట్టి రథికులతోడను సారథులతోడను రథసమూహములను పదునగు బాణములచే నఱకి నఱకి, మిక్కిలి మదించిన భటుల గుంపులను వండఁదఱిఁగిన కూరముక్కలవలెఁ గోసి కోసి. యల్లెత్రాడు చెవివఱకు లాగుటచే గుండ్రమైన వింటినుండి నలుముఖముల వెలువడు బాణములనడి వేఁడికిరణముల నూర్యునివలెఁ బ్రకాశింపఁగ రాక్షససేన యఱచి దుఃఖించెను.

కం. శుష్కం బగు ని దవశ్లోఁ, చిష్కాశునిచేతఁ బోలెఁ జిత్రింబుగ నా పుష్కరనేత్రునిచే నా, ముష్కరపరపాళి యూఁచముట్టుగ నూలెన్. ౩౯౩

శుష్కంబగు = యెండిన, దవశోచిష్కాశునిచేతన్ = కాఱుచిచ్చుచేత, పుష్కరనేత్రుచేతన్ = కమలములవంటి కన్నులుగల రామభద్రునిచే, ముష్కర పరపాళి = మూర్ఖులగు శత్రువుల సమూహము, ఊచముట్టుగన్ = మొదలంట, దుష్కరపాత్రము.

తా. నిండినయడవి దావాగ్నిచేవలె నాశ్చర్యముగ నా రామభద్రునిచే నా మూర్ఖులగు రాక్షసుల గుంపు మొదలుముట్టఁ జావఁగా.

ఉ. వారలలోనఁ గొంద అనివారణ వారణ విక్రమక్రముల్
శూరులు మండలాగ్రసృగ శూలపరశ్వధహస్తులై బలో
దారుని రాము వైచిన నితాంతశితాశుగసంహతిన్ వెసన్
వారల సాధనంబులను వారిశిరంబులఁ ద్రుంచె నొక్కటన్. ౩౯౪

అనివారణ = అడ్డములేని, వారణ = ఏనుఁగుయొక్క, విక్రమక్రముల్ = బలముగలవారు, మండలాగ్ర = కత్తి, సృగ = సంగు-భిండివాలము- పరశ్వధ = గండ్రగొడ్డలి, హస్తులై = వీనిని చేతులయందుఁ గలవారై, బల + ఉదారుని= అధిక బలము గలవానిని, నితాంత=మిక్కిలి, శిత=పదునైన, ఆశుగసంహతిన్=బాణసమూ హముచే, వెసన్ = శీఘ్రముగ.

తా. వారిలో నేనుఁగుబలమంత బలముగలవారు కొందఱు శూరులు కత్తులు భిండివాలములు, శూలములు, గండ్రగొడ్డండ్లు లోనగునవి చేతఁ దీకొని బల సంపన్నుఁడైన రామభద్రునిపై వైవఁగా నాయన మిగులఁ బదునైన బాణముల సమూహముచే వారి యాయుధములను, వారి తలలను నేకకాలమందు నఱకి వైచెను.

కం. శరములు కరములు శిరములు, శరాసనములుగూలి యమునిశత్రులు చావన్ బరికించి తక్కునసురో, త్కరము వెఱచి పఱచఁదొడఁగె ఖరునూఱునకున్.

తా. రాక్షసుల బాహువులు, చేతులు, తలలు, చావములు, నేలఁగూలి చచ్చుటఁజూచి మిగిలిన రాక్షసులగుమి భయపడి ఖరునిచాటునకుఁబోయి నిలిచిరి.

సుగంధి. మానవేంద్రముక్తశాత ♦ మార్గణాసహిష్ణులై
వైనతేయపక్షజాత ♦ వాతధూతభూజసం
తానరీతి భీతయాతు♦ధానకోటి యోటమై
దీనవృత్తిఁ బాఱి జొచ్చె ♦ దేవవైరి డాయఁగన్. ౩౯౬

మానవేంద్ర = రామభూపాలునిచే, ముక్త = విడువఁబడిన, శాత = పదునైన, మార్గణ = బాణముల ఘాతకు, అసహిష్ణులై = సహింపలేనివారై, వైనతేయ = వినతకొడుకగు గరుత్మంతుని, పక్ష = ఱెక్కలవలన, జాత = పుట్టిన, వాత = గాలిచే, ధూత = ఎగురఁగొట్టఁబడిన, భూజ = చెట్లయొక్క, సంతానరీతిన్ = సమూహమువలె, భీత = భయపడిన, యాతుధానకోటి = రాక్షస సమూహము, ఓటమై = పరాభవపడి, దీనవృత్తి = భయమున, దేవవైరి = దేవతలకు విరోధియగు ఖరుని; సుగంధి, రజరజర, తొమ్మిదింట యతి. సుగంధుల నుత్సాహము లనవచ్చునుగాని యుత్సాహములన్నియు సుగంధులు గావు.

తా. రామభద్రభూపాలునిచే విడువఁబడిన పదునైన బాణములను సహింపలేనివారై గరుడుని ఱెక్కల గాలిచే నెగురఁగొట్టఁబడిన చెట్లగుంపువలె భయపడిన రాక్షసుల సమూహము పరాభవపడి దుఃఖించుచు ఖరుని మాటునకుఁ బోయిరి.

సీ. వారల కెల్లను ♦ ధీరతఁ గల్పించి, భీషణరోషుఁడై ♦ దూషణుండు
కాకుత్స్థతిలకుపైఁ ♦ గవిసినంతోడన, మునుపటివారును ♦ మూఁగి తోడరి
సాలతాలశిలాది♦సాధనంబులతోడఁ, బైపడఁ జొచ్చినఁ ♦ బార్థివుండు
ఘోరతరాకృతిఁ ♦ గురియించె శరవృష్టి, యనుగులు పిఱువోవ ♦ కని యొనర్ప

తే. రోమహర్షణమయ్యె సం♦గ్రామ మప్పు, డంతఁ బోవక యసుగు ల♦త్యంతరోష
మొదవ దెసలందుఁ జీకట్లు♦గదుర నొక్క, పెట్ట పైపడి రాముసిఁ ♦ జుట్టుముట్టె

కల్పించి = కలుగునట్లుచేసి. భీషణరోషుఁడై = భయంకరమైన కోపము గలవాఁడై, సాలతాలశిలాది = మద్దిచెట్లు, తాడిచెట్లు, ఱాలు మొదలైన, పిఱువోవక = వెనుదీయక, అని = యుద్ధము, రోమహర్షణమయ్యెన్ = భయముచే గగ్గురుపాటు గలిగించునది యయ్యెను.

తా. ధైర్యము గోలుపోయి వెనుకకుఁ దిరిగివచ్చిన వారి కందఱకు మరల ధైర్యము వచ్చునట్లుచేసి దూషణుఁడు భీషణరోషుఁడై రామభద్రుపైఁ గవిసెను. వెంటనే యిదివఱకు మరలినవారును గుంపుగూడి తమ యాయుధములు ముందు

ఖండితములగుటచే మద్దిచెట్లు, తాటిచెట్లు, తాలు నాయుధములుగాఁ దీసికొని రామభద్రునిమీఁదఁ బైఁబడవచ్చిరి. రామభద్రుఁడును భయంకర బాణవర్షము వారిపైఁ గురియించెను. రాక్షసులు వెనుదీయక యుద్ధమొనర్చిరి. అప్పుడు యుద్ధము చూచువారికి గగుర్పాటు కలిగించెను. ఆ తరిఁ గ్రోధకర రాక్షసులు మన మిందఱము. వీఁడొక్కఁడు. వీనిని గెలువలేమేని యవమానముగదా యని మిగులఁ గోపించినవారై రామభద్రునిపైఁబడవచ్చి చుట్టుముట్టుకొని.

స్రగ్ధర. ఘోరప్రాసాసిఖడ్గా♦కుటిలశరతతుల్ ♦ గ్గుప్పగా మీఁద గుప్పన్
జ్యారావోద్భిన్నశత్రూ♦చ్ఛయహృదయపుటీ♦సద్ముఁడై కంఠరావో
దారుండై శత్రుఘాతా♦ర్థముగ భయదగాం♦ధర్వనారాచ మేసెన్
నీరంధ్రంబై దిశాళుల్ ♦ నిశితఖగతతిన్ ♦నిండ నీతేశుఁ డంతన్. ౩౯౮

ఘోర=భయంకరమైన, ప్రాస-అసి-ఖడ్గ-అకుటిలశరతతుల్ – ప్రాసము = ఈఁటె; గుప్పన్ = వేయఁగా, జ్యారావ = అల్లెత్రాటి మ్రోఁతచేత, ఉద్భిన్న= పగిలిన, శత్రు + ఉచ్ఛయ = పగవారి సమూహముయొక్క, హృదయపుటీ సద్ముఁడై = దొప్పవంటి హృదయస్థానము గలవాఁడై, కంఠరావోదారుండై = సింహ నాదముచే గొప్పవాఁడై, శత్రుఘాతార్థము = శత్రువులను సంహరించుకొఱకు, నీరంధ్రము – నిర్—రంధ్రము = సందు లేనిది, నిశితఖగతతిన్ = పదునైన బాణ సమూహములచే; స్రగ్ధర. మరభనయయయ ఎనిమిదింట నెనిమిదింట యతులు.

తా. భయంకరములైన యీఁటెలు, కత్తులు, బాణపరంపరలు కుప్పలు కుప్పలుగా వారు తనమీఁద నేయఁగా రామభద్రుఁడు ధనుష్టంకారముచే వారి గుండెలు పగులఁజేసి సింహనాదము గావించి శత్రుసంహారమునకై దిక్కులందు సందులేక కఱకుబాణములు నిండునట్లు గాంధర్వాస్త్రమును బ్రయోగించెను.

శా. ఆగాంధర్వమహాస్త్రసంజనితనా♦నాకారఘోరాస్త్రసం
పూగాంధీకృత మయ్యె వ్యోమము, దివిం ♦ బూషుండు మోఘాంశుఁడై
పోగెన్, సేనయుఁ దూలి వ్రాలి పడి నా♦శం బంది తుత్తున్కలై
ప్రేవుల్ ద్రెస్సిన సోలి కూలి తుము రై ♦ భీభత్స మై పొడతెన్. ౩౯౯

గాంధర్వమహాస్త్ర=ఆగాంధర్వాస్త్రమువలన,సంజనిత=పుట్టిన,నానాకార = అనేకములగు రూపములుగల, ఘోరాస్త్ర = భయంకరములైన యస్త్రముల యొక్క, సంపూగ = సమూహముచే, అంధీకృతమయ్యెన్ = చీఁకటిగాఁ జేయఁ బడినదయ్యెను, వ్యోమము = ఆకాశము, దివిన్ = ఆకాశమందు, పూషుండు = సూర్యుఁడు, మోఘాంశుఁడై = వ్యర్థములయిన కిరణములుగలవాఁడై.

తా. ఆ గాంధర్వమహాస్త్రమునందుఁ బుట్టిన యనేకాకారములు గల

భయంకరాస్త్రసమూహముచే, నాకాశము చీఁకట్లు గ్రమ్మినదయ్యెను. ఆకాశమున సూర్యుఁడు భూమిపైఁ బడనివగుటచే వ్యర్థకిరణములు గలవాఁడై పోయెను. రాక్షససేన తూలి, వ్రాలి, పడి, తునుకలు తునుకలై వ్రేఁగులు దెగిపడఁగా మూర్ఛపోయి కూలి, పొడిపొడియై భయంకరమై నాశమైపోయెను.

కం. శరనికరాదానంబును, శరసంధానంబు మోక్ష ♦ శరగమనంబుల్
పరికింప రాశరులు కర, చరణనికృంతనము దక్క ♦ స్వవ్యూహమునన్. ౪౦౦

శరనికర = బాణసమూహములయొక్క, ఆదానంబును = లాగుటను, శరసంధానంబు = బాణములను వింటఁగూర్చుటయు, మోక్ష = విడుచుటయు, శరగమనంబుల్ = బాణములుపోవుటయు, ఆశరులు = రాక్షసులు, పరికింపరు = చూడఁజాలినవారు కారైరి, కరచరణనికృంతనము = కాలుసేతులు నఱకఁబడుట, తక్కన్ = తప్ప, స్వవ్యూహమునన్ = తమసేనయందు.

తా. రాక్షసులు తమ సేనయందు భటుల కాలుసేతులు తెగిపడుట తప్ప రామభద్రుఁడు బాణములు పొదులనుండి తీయుటగాని విడుచుటగాని బాణము పోవుటగాని చూచినవారు కారు.

కం. ఆలోకబాంధవుండు దు, రాలోకుఁడుఁ గాఁగ దెసల ♦ నలముఁగ నిరులా
భీలపుగతి రఘుపతిశర, జాలమ్ములు గ్రక్కుచున్న ♦ చందముఁ దోఁచెన్. ౪౦౧

లోకబాంధవుఁడు=సూర్యుఁడు, దురాలోకుఁడు = కానరానివాఁడు, ఇరులు = చీఁకటులు, అలముఁగన్ = వ్యాపింపఁగా.

తా. సూర్యుఁడు కానరాకుండునట్లు దెసలయందుఁ జీఁకట్లు వ్యాపించునట్లు రామచంద్రుఁడు బాణములు గ్రక్కుచున్నాఁడా యేమి యున్నట్లుండెను.

కం. తెగులుట నొగులుట చచ్చుట, పగతురు ప్రోవులుగ నేలఁ ♦ బడుటయుఁ జూడన్
యుగపత్క్రియ వెలసెను గడు, వెగ డందిరి మింటఁ జూచు ♦ వేల్పులు మునుల్.

యుగపత్క్రియ = ఏకకాలమందు జరిగినపని

తా. రాక్షసులకు బాణములు తెగులుట, అవయవములు విఱుగుట, చచ్చుట, పగవారు కుప్పలు కుప్పలుగా నేలఁబడుట, యివి యన్నియు నాకాశమునుండి చూచు దేవతలకు మునులకు నేక కాలమందు జరిగిన పనిగాఁ దోఁచెను.

సీ. ఉష్ణీషములతోడి ♦ యుత్తమాంగంబులు, నవనిపైఁ బడి దొర ♦ లాడు చుండ
సంగదకటకక ♦ మన్వితబాహువుల్, కట్టలు కట్టలై ♦ ప్రాలు చుండ
ఊరుమహాస్కంధాళి ♦ కరణిఁ గృత్తంబులై, కుఱువులు ధరనిండఁ ♦ బఱచియుండ
వివిధవిభూషణా ♦ న్వితజానుజంఘముల్, ఖండఖండంబులై ♦ కదిమియుండ

తే. చండవేదండరథహయ ♦ చ్ఛత్రచామర, ధ్వజవ్యజనంబులు ♦ రవరవలుగఁ

బుడమి నిండారి నిశ్శేషభూతజాత, భీతిజాతకమయ్యె దృగ్భీషణముగను. ౪౦౩

ఉష్ణీషములతోడి=తలపాగాలతోడ, ఉత్తమాంగంబులు=శిరస్సులు, అంగద=బాహుపురులతో, కటక = కడియములతో, సమన్విత = కూడిన, బాహువ్రజల్ = చేతులు, ద్రుమ్మరుహా = చెట్లయొక్క, స్కంధాళి = బోదెల సమూహముల, కరణిన్ = విధముగా, కృత్తంబులై = నరకఁబడినవై, ఊరువులు = తొడలు, వివిధభూషణ = పలుతెగలగు నాభరణములతో, అన్విత = కూడిన, జానుసంఘముల్ = మోఁకాళ్ళ గుంపులు, ఖండ ఖండంబులై = తునుకలు తునుకలై, కడమి = సంక్రమించుకొని, చండ = భయంకరములగు, వేదండ = ఏనుఁగులు, రథ = తేరులు, హయ = గుఱ్ఱములు, ఛత్ర = గొడుగులు, చామర = వింజామరలు, ధ్వజ = టెక్కెములు, వ్యజనములు = విసనకఱ్ఱలు, రవరవలుగన్ = తునుకలు తునుకలుగ, పుడమిన్ = భూమియందు, నిండారి = పూర్ణముగ వ్యాపించి, నిశ్శేష = సమస్త, భూతజాత = భూతముల సమూహములకు, భీతిజాతకము = భయము గలిగించునది, దృగ్భీషణముగను = చూపునకు భయంకరము.

తా. తలగుడ్డలతోడి తలలు నేలమీఁద దొరలుచుండెను. భుజకీర్తులు, కడియములు, వీనితోఁగూడిన చేతులు కట్టలుకట్టలుగఁ బడియుండెను. చెట్లబోదెలవలె నరకఁబడి తొడలు భూమిమీఁదఁ బరచినట్లుండెను. నానాలంకారములతోఁ గూడిన మోఁకాళ్ళు తుంటలు తుంటలుగాఁ నాక్రమించుకొనియుండెను. భయంకరంబులైన ఏనుఁగులు, తేరులు, గుఱ్ఱములు, గొడుగులు, చామరములు, టెక్కెములు, వీవనలు, నన్నివిధములై భూమియంతయునిండి సమస్తభూతసంఘములకు భయజనకంబులై చూపునకు ఘోరముగ నుండెను.

కవిరాజవిరాజితము

విఱిగిన తేరులు కూలినశూరులు ♦ వ్రీలినకేతువులున్ గొడుగుల్
తెఱచిననోరులు పాఱెడివీరులు ♦ వ్రేల్చినగాయలు పొర్లుహరుల్
తెఱిగిన చేతులు తున్గినమూతులు ♦ తాఱెడిభీతులు మిక్కుటమై
తెఱఁగఱి రాక్షససైన్యము సర్వము ♦ దీఱుచు నుండఁగ దూషణుఁడున్.

వ్రీలిన = పడిపోయిన, తెఱఁగు + అఱ = మునుపున్న విధము చెడి, తీఱుచు = నాశమగుచు, గారు = ఏనుఁగు.

కవిరాజవిరాజితము. ఒక్క నగణము. ఆఱు జగణములు. వగణము ౧౪-వ యింట యతి. దీని భేదము అయోధ్యాకాండమునఁ జర్చితము.

తా. విఱిగిన రథములు, చచ్చిపడిన శూరులు, నేలవాలిన ధ్వజములు, గొడుగులు, తెఱచిన నోరులు, పరువెత్తుచున్న వీరులు, పడిపోయిన యేనుఁగులు,

దొర్లాడు గుఱ్ఱములు, కోయఁబడిన చేతులు, తునుకలైనమూఁతులు, ప్రక్కలకునొరుగు పిఱుఁదులు, నధికమైమునుపటివిధము చెడి రాక్షససైన్యము సర్వము నాశనముగు చుండఁగ నవ్వుచు దూషణుఁడు.

౨౬-వ సర్గము. దూషణుఁడు శ్రీరామునితో యుద్ధముఁ జేసి చచ్చుట.

ఆ. ఐదువేల కఠినకాయాసురుల రామువధార్థ మంపవారు ♦ నశనితుల్య
శూలఖడ్గబాణ♦జాలవర్షము మున్న, రాఁగఁ గవిసుఁ జూచి ♦ కడిమి మెఱసి.

అశనితుల్య = వజ్రములతో సమానములైన, కడిమి = పరాక్రమము.

తా. ఐదువేలమంది కఠిన దేహములు మనస్సులు గల రాక్షసులను రామభద్రునిఁ జంపుటకై పంపఁగా వారు వజ్రములతో సమానములైన శూలములను ఖడ్గములను బాణములను వర్షము గురియించుచు తనమీఁదికి రాఁగాఁ జూచి పరాక్రమించి,

సీ. శరవర్షంబున వారిసాధనములు ♦ చక్కాడి వర్షంబు పై
నొరఁగం బోల్చు వృషభుభంగి రఘునా♦థుఁ డొప్పి సక్రోధుఁడై
శరధారావృష్టి దూషణాస్త్రతమము ♦ సైన్యంబు దైన్యంబు నొం
ద రణోద్యం జెలరేఁగి కార్ముకలుచం♦దం బారఁగా ముంచినన్. ౪౦౬

శరవర్షంబునన్ = బాణముల వానచే, చక్కాడి = నఱకి, వృషంబుభంగిన్ = ఎద్దువలె శరధారావృష్టి = బాణధారల నెడి నీటిధారల స్నానముచే; దైన్యంబు = దీనదశను, కార్ముకులు = వానకాలమునందలి మేఘము.

తా. శ్రీరామభద్రుఁడు తన బాణవర్షముచే వారి యాయుధముల నన్నిటిని ఖండించి తనమీఁద వానకురియుచున్నను జలింపని కోడెవలెనై కోపించినవాఁడై దూషణుని సైన్యమంతయు దుఃఖితముకాఁగా యుద్ధభూమియందు విజృంభించి వానకాలమునందలి మేఘము నీటిధారలచే ముంచునట్లు బాణవర్షముచే స్నానము చేయించెను.

కం. రోషంబున శాత్రవచయ, దూషణుఁ డగుదూషణుండు ♦ దోర్బలలీలా
భీషణుఁడై వజ్రనిభా, శేషుఫ్రలం బఱపుటయును ♦ నినకులుఁ డలుకన్. ౪౦౭

శాత్రవచయదూషణుఁడు = శత్రుసమూహముల నాశనము చేయువాఁడు, దోర్బల = భుజముల బలముయొక్క, లీలా = విలాసముచే, భీషణుఁడై = భయంకరుఁడై, వజ్రనిభా = వజ్రముతో సమానములైన, ఇషుఫ్రలన్ = బాణములను, పఱపుటయును = ప్రయోగింపఁగా, ఇనకులుఁడు = సూర్యవంశమున బుట్టినవాఁడు - శ్రీరామభద్రుఁడు.

తా. శత్రుసమూహములను నాశనము చేయఁగల దూషణుఁడు రోషముతో

భుజబలవిలాసముచే భయంకరుఁడై వజ్రముతో సమానములైన బాణములను ప్రయోగింపఁగా రామభద్రుఁడును కోపించినవాఁడై.

చం. క్షురమునఁ జాపముం దునిమి ♦ క్రూర చతుశ్శితమార్గణాహతిన్
హరులను నాల్గిటిం జదిపి ♦ యావలఁ గూలఁగ నేసి సూతుకం
ధరమును నర్ధచంద్రమున ♦ ధాత్రి శరత్రిక మూని దూషణున్
బరువడి వక్షము జొరఁగఁ ♦ బార్థివవర్యుఁడు వైవ దైత్యుఁడున్. ౪౦౮

క్షురమునన్ = మంగలికత్తివంటి బాణముచే, చతుశ్శితమార్గణాహతిన్ = వాడియైన నాలుగుబాణముల దెబ్బచే — హరులను = గుఱ్ఱములను, చదిపి = చంపి సూతుకంధరమును = సారథికంఠమును, శరత్రికము = మూఁడు బాణములు.

మంగలికత్తివంటి బాణముచే విల్లుద్రుంచి వాడుగల నాలుగుబాణములచే నాలుగుగుఱ్ఱములను జంపి, తరువాత సారథికంఠమును అర్ధచంద్రబాణముచే నఱకి మూఁడు బాణములు దూషణునిఱొమ్మున నాటునట్లు రామభద్రుఁడు వేయఁగా రాక్షసుఁడును;

ఉ. కాంచనపట్టవేష్టితము ♦ క్ష్మాధరశృంగసభంబు దేవతా
సంచయమర్దనక్షమము ♦ శంకువికీర్ణము వైరిరాడ్వసో
దంచితమున్ మహాశనిశ ♦ తారసమంబు విరోధిపట్టన
ప్రాంచితగోపురోద్దళన ♦ బంధుర మాపరిఘంబు గ్రాలఁగన్. ౪౦౯

కాంచనపట్టవేష్టితము = బంగారుకట్టువేసినది, క్ష్మాధరశృంగనిభంబు = పర్వతశిఖరముతో సమానమైనది, దేవతాసంచయ = దేవతల సమూహమును, మర్దన = కొట్టుటయందు, క్షమము = యోగ్యమైనది, శంకువికీర్ణము = మేకులచే నిండినది, వైరిరాట్ + వసా + ఉదంచితము = గొప్పశత్రువుల క్రొవ్వుచేఁ బ్రకాశించునది, మహాశనిశతారసమంబు = గొప్పపిడుగుతోను, వజ్రముతోను, సమానమైనది, విరోధిపట్టన = శత్రువుల పట్టణములందలి, ప్రాంచిత గోపుర = గొప్పగోపురములను, ఉద్దళన = చీల్చుటయందు, బంధురము = గొప్పదైనది, పరిఘంబు=గుదియ.

తా. బంగారుకట్లుగలిగి కొండశిఖరములతో సమానమై దేవతలను మర్దింపశక్తిగలదై మేకులుగలిగి శత్రువుల క్రొవ్వుచే నొప్పి, పిడుగుతోను, వజ్రముతోను, సమానమై విరోధుల పట్టనమునందలి గోపురముల విఱుగఁదన్నునదియైన కట్లగుదియను ధరించినవాఁడై

కం. ఉక్కుమిగిలి సరభసముగ, నక్కరణివి మీఁదఁ బడఁగ ♦ నరుదేరఁగఁ దా
గ్రక్కున నిరుశరములఁ దోడి, రక్కసునిరుకేలు నఱకె ♦ రాముండు వడిన్. ౪౧౧

ఉత్క్ర = బలము, సరభసముగన్ = శీఘ్రముగ, ఇరుశరములన్ = రెండు బాణములను, తొడి = తొడిగి-సంధించి, ఇరుకేలు = రెండుచేతులు, కేలు ఇది నిత్యైకవచనాంతము. దీనికి బహువచనమైన వేఱురూపములేదు.

తా. బలమునే నతిశయించి మిగుల శీఘ్రముగ మీఁదఁ జెప్పినట్లు తన మీఁదఁబడుటకై వచ్చుచుండఁగా రామభద్రుఁడు తటాలున రెండు బాణములచే వాని రెండుచేతులను నఱికెను.

కం. కరయుగముతోడ నాయస,పరిఘము ధరఁ గూలె వాస♦వధ్వజ మనఁగన్
గరములు దెగ నసురుఁడు వడె, ధరణిని సిగ్గారదంత ♦ దంతి యనంగన్. ౪౧౧

కరయుగముతోడ = రెండుచేతులతో, ఆయసపరిఘము = ఇనుపగుదియ, వాసవధ్వజము = ఇంద్రధ్వజము, సిగ్గారదంతదంతి = కొమ్ములూడఁబెఱికిన యేనుఁగు.

తా. రెండుచేతులతో నినుపగుదియను బట్టుకొని పైకెత్తికొట్టుటకై తన యొద్దకు వచ్చుచున్న దూషణుని రెండుచేతులను రెండుబాణములచే రామభద్రుఁడు నఱకఁగా నద యింద్రోత్సవమందు నింద్రధ్వజమువలె నేలఁగూలెను. చేతులు రెండు తెగుటచే దూషణుఁడును కొమ్ములు పెఱికిన యేనుఁగువలెనై చచ్చెను.

ఆ. అసురు నిహతుఁ జూచి ♦ యఖిలభూతంబులు, మేలు మే లటంచు ♦ మెచ్చె రాము
నంతలోన దూష♦ణాంతికమై రోష,వివశు లగుచు నసుర ♦ వీరవరులు. ౪౧౨

నిహతున్ = చంపఁబడినవానిని.

తా. చచ్చిపడిన దూషణుఁ జూచి భూతంబులన్నియు మేలుమేలని శ్రీరామభద్రుని బొగడెను. ఆలోపలనే ముగ్గురు రాక్షసవీరులు కోపముచే దేహము దెలియనివారై రామభద్రుమీఁదికి

కం. స్థూలాక్షుఁడు పట్టిసమున్, శూలంబు మహాకపాల ♦ సురవైరియు నా
భీలపరశువుఁ బ్రమాథియుఁ, గేలం ద్రిప్పుచును వేగ ♦ గిట్టి కవియుఁగన్. ౪౧౩

తా. స్థూలాక్షుఁడనువాఁడు పట్టిసమును, మహాకపాలుఁడను రాక్షసుఁడు శూలమును, ప్రమాథియనువాఁడు భయంకరమైన గండ్రగొడ్డలిని దీసికొని చేతులతోఁ ద్రిప్పుచు సమీపించి పైపడరాఁగా

సీ. మైథిలీపతి శిత ♦ మార్గణపంక్తి మ, హాకపాలుశిరంబు ♦ నవనిఁ గూల్చి
మహితబాణమునఁ బ్ర♦మాథిని వధియించి, స్థూలాక్షునకుల గా♦ణాళిఁ గూరి
పంచసహస్రరా ♦ త్రించరవరులను, బంచసహస్రరో ♦ పముల నొకట
ఖండింపఁగా దూష♦ణుండు స్వసైన్యుఁ డై, రూపటిపోక ఖ♦రుండు చూచి

ఆ. కినుక గదుర నీచ♦మనుజునిచేఁ జచ్చె, దూషణుండు సేన ♦ తోడ మీరు
చని వధింపుఁ డతని♦ననుచు యోధులఁ బంపి, తాను జనియె రాముఁ♦దాఁకుమతిని.

పంచసహస్రరాత్రించరులను = ఐదువేల రాక్షసశ్రేష్ఠులను, కోపములను = బాణములచే, ససైన్యుఁడై = సేనతోడ, రూపఱిపోక = రూపు మాసిపోవుటను, కినుక = కోపము, కదురక = కలఁగక.

తా. రామభద్రుఁడు పదునైన బాణములనుగుసలచే మహాకపాలుని తల నేలఁ బడఁగొట్టి యొక గొప్పబాణమునఁ బ్రమాథిని జంపి స్థూలాక్షుని కనులలో బాణములను జొనిపి యైదువేల రాక్షసులను నైదువేలబాణములచే నొక్కసారిగ ఖండింపఁగా దూషణుఁడు తనసేనతోడ రూపుమాసిపోవుటచూచి ఖరుఁడు క్షుద్ర మనుష్యులచే దూషణుఁడు సేనతోడఁ జచ్చెను. మీరు పోయి రామభద్రుని జంపుఁడని యోధుల కాజ్ఞాపించి రామునితో యుద్ధముచేయ దానే బయలుదేఱెను.

— కాలకార్ముకాది సేనాపతులు పన్నిద్దఱు శ్రీరామునిచేఁ జచ్చుట —

సీ. కాలకార్ముక మేఘ మాలి మహామాలి, దుర్జయ యజ్ఞశత్రులు విహంగ
ముండును రుధిరాశ నుండు సర్పాస్యుండు, స్థిరపృథుగ్రీవుండు శ్యేనగామి
విశ్రుతబలికర వీరాక్షుండును బరుషుండను వారు పండ్రెండుమంది
దళవాయు లొక్కట దాశరథిని దాఁకి, విశిఖచయంబుల వృష్టి గురియ

ఆ. వారిబాణములను వారించి రాముండు, వజ్రతుల్యబాణ వర్షమునను
దరులఁ బోలె నఱకి ధరణికి బలియిచ్చె, నిర్జరారిగణుల నిమిషమునను. ౨౮౫

దళవాయులు = సేనానాయకులు, విశిఖచయంబులవృష్టి = బాణసమూహములవాన, తరులఁబోలెక = చెట్లవలె, నిర్జరారిగణుల = రాక్షసశ్రేష్ఠులను.

తా. కాలకార్ముకుఁడు, మేఘమాలి, మహామాలి, దుర్జయుఁడు, యజ్ఞశత్రుఁడు, విహంగముఁడు, రుధిరాశనుఁడు, సర్పాస్యుఁడు, పృథుగ్రీవుఁడు, శ్యేనగామి, కరవీరాక్షుఁడు, పరుషుఁడు ననువారు పండ్రెండుగురు సేనానాయకులు లొక్కసారి రామభద్రుని జేరి బాణవర్షముఁ గురియింపఁగా వారిబాణములను ఖండించి రామభద్రుఁడును వజ్రముతో సమానములైన బాణములవర్షముఁ గురియించి చెట్లను నఱికి పడఁద్రోచినట్లు వారిని నఱికి భూదేవికి నిమిషములో బలియిచ్చెను.

కం. కర్ణాకారేషుల నాకర్ణాంతము లాగి నూటికి ఖలశేఖరంబుల
దూర్ణమ వేయింటను సము, దీర్ణ బలుం డగుచు నేసెఁ దెగ వేవు రనిక. ౨౮౬

కర్ణికాకారేషుల = కన్నెరాకులవంటి యాకారముగల బాణముల, ఆకర్ణాంతము = చెవికొనవఱకు, ఖలశేఖరంబుల = నూర్వురుదుష్టులను, తూర్ణము = వేగము, సముదీర్ణబలుండు = వృద్ధిపొందిన బలముగలవాఁడు, తెగ = ఖండము లగునట్లు, వేవురు = వేయిమంది.

ఉద్విగ్నబలుఁడనుటచే యుద్ధము చేయుకొలఁది బలము హెచ్చుచుండెను గాని క్షయింపలేదని భావము.

తా. గన్నేరాకులవంటి బాణములను నూటిని నాకర్ణాంతము లాగి నూటు గురిని, వెయ్యిబాణములచే వేయిమందిని నఱకి భూమికి బలియిచ్చెను.

ఉ. కూలిన చాపదండములు ♦ గుప్పలు రాలిన భూషణంబులున్
వ్రాలిన టెక్కెయంబులును ♦ బ్రద్దలువాఱిన స్యందనంబులున్
జాలుగఁ గాఱు రక్తములు ♦ చాలిఁక నన్నవిధంబు దోఁపఁగా
గాలునివంటయిల్లనఁగఁ ♦ గ్రాలె రణావని రక్తసిక్తమై. ౪౧౭

చాపదండములు = దండములవంటివిండ్లు, స్యందనములు = తేర్లు, చాలుగన్ = ప్రవాహముగ, చాలును = సమృద్ధి, కాలుని = యముని, రణావని = యుద్ధభూమి, రక్తసిక్తమై = నెత్తుటితోఁ దడిసినదై.

తా. పడిపోయినవిండ్లు, కుప్పలుపడిన సొమ్ములు, ఒఱిగిన ధ్వజములు, తునకలయిన తేరులు, వంకలుపాఱు నెత్తురులు. ఇఁకఁజాలును. దండియన్నట్లు కానరాఁగా సిది యేమి యముని వంటయిల్లా యనునట్లు యుద్ధభూమి నెత్తుటితోఁ దడిసి కానవచ్చెను.

ఆ. రక్తసిక్తు లగుచు ♦ ముక్తకేశంబులఁ, గూడ ధరణిఁ బడిన ♦ దుష్టదివిజ
వైరిచయము కేశ ♦ వర్గంబుతో నిల, కుశసమేతవేది ♦ కొమరు దాల్చె. ౪౧౮

రక్తసిక్తులు = నెత్తుటితోఁ దడిసినవారు, ముక్తకేశంబులఁగూడన్ = ముడివీడి వ్రేలాడు వెండ్రుకలతో, దుష్ట = దుర్మార్గులయిన, దివిజవైరి = రాక్షసులయొక్క, చయము = సమూహము, కేశవర్గంబులతోన్ = వెండ్రుకలగుంపులతో, కుశసమేతవేదికొమరు = దర్భలతోడి వేదివిధమును.

తా. నెత్తుటఁ దడిసి, విరిసిన వెండ్రుకలతో నేలమీఁదబడిన దుష్టరాక్షససమూహముయొక్క వెండ్రుకలతో భూమి దర్భలతోడి వేదివలెఁ గానవచ్చెను.

కం. పదునాలుగువేవురఁ దుర్మదుల మహాక్రూరకర్మ ♦ రాక్షసవరులన్
బదికుఁడు నెక్కటిసరుఁ డగు, సదమలమతి రామమూర్తి ♦ చంపెం గడిమిన్.

వేవురన్ = వేయిమందిని, దుర్మదులన్ = పెద్దపొగరు గలవారిని, మహాక్రూరకర్మ = మిక్కిలి క్రూరములైన పనులు చేయు, పదికుఁడు = కాల్నడనుండువాఁడు, ఎక్కటి = అసహాయుఁడు, ఒక్కఁడు—నరుఁడు = మనుష్యుఁడు, సదమలమతి = నిర్మలమనస్సుగలవాఁడు, కడిమిన్ = బలముచే.

తా. దుష్టగర్వనిష్ఠులును మిగులఁ గ్రూరకార్యములు చేయువారును నగు

రాక్షసులను పదునాలుగు వేలమందిని, కాలినడనుండువాడు ఒంటరిగాడు మనుష్యుఁడునగు నిర్మలమనస్సుగల రామమూర్తి భుజబలముచేఁ జంపెను.

క. దురమునకుం బూనయూ, యిరువాఁగున నప్డు డొప్పి ♦ రిల జీవముతో
 ఖరుఁడు త్రిశిరుండు శాత్రవ, హరుఁడగు రాముండుఁ దక్కి ♦నంతయుఁ దీఱెన్.

దురమునకున్ = యుద్ధమునకు, ఇరువాఁగునన్ = రెండుపక్షములందును, తీఱెన్ = నమసెను.

తా. యుద్ధమునకుఁ బూనుకొన్న రెండుపక్షములవారిలో నప్పుడు ఖరుఁడు, త్రిశిరుఁడు, రామభద్రుఁడు తప్పఁ దక్కిన యందఱుఁ జచ్చిరి.

—♦ ౨౭-వ సర్గము. త్రిశిరుఁడు శ్రీరామునితోఁ బోరి చచ్చుట. ♦—

చ. ఖరుఁ డది చూచి రామునకుఁ ♦ గట్టెదురై చనఁ బూన వాహినీ
 వరుఁడు త్రిశీర్షుఁ డడ్డపడి ♦ వాసవమర్దన నేను గల్గఁగాఁ
 బరువయి నీవు పోవు టిది ♦ భావ్యమె? రాముని గీటుఁ బట్టి మ
 చ్ఛరములఁ ద్రుంచి వైతు నిమిషంబున, బాస నొనర్తు వింటిపై.

కట్టెదురు = కడు + ఎదురు - ఎట్టెదురు. కడు, నడు, నిడు, కుఱు, చిఱు శబ్దంబులకు నచ్చు పరంబగునప్పుడు ద్విరుక్తటకారం బగు, వాహినీవరుఁడు = సేనానాయకుఁడు, వాసవమర్దన = ఇంద్రుని దండించినవాఁడా, పరువయి = విరోధిమీఁదికి, భావ్యమే = సరియా. గీముల్, నిందయుంను గా, గీలగు. రాముఁడు గీముఁడు ఇట్లు.

తా. సేనఅంతయు నాశమైపోవుటచూచి ఖరుఁడు రామున కభిముఖుఁడై పోవఁ బ్రయత్నింపఁగా సేనానాయకుఁడగు త్రిశిరుఁడు ఇంద్రుని గెలిచినవాఁడా నేను జీవించియుండఁగా శత్రువుమీఁదికి నీవు పోవుట మర్యాదయా? ఇట్టి యాలోచన నీవు చేయవచ్చునా? తుచ్ఛుఁడైన రాముని బట్టి నా బాణములచే నిమిషములో నఱకివైచెదను. ఈ వింటిమీఁదఁ బ్రమాణముచేసి చెప్పెదను.

చ. అతనికి నేనొ నా కతఁడొ ♦ యంతకుఁ డయ్యెడు, నిల్చి చూడుమీ
 హతుఁడుగ రాముఁడుం జనుదు ♦ వంత నిజాలయమున్ ముదాన, నే
 మృతుఁడుగ నైన నీ వతని ♦ మేటిరణంబునఁ గిట్టి పట్టి యు
 ద్ధతి నడగింపు, మన్న నతఁ ♦ డట్లగుఁ గావుతఁ బొమ్మటం చనన్. ౪౨౨

అంతకుఁడు = యముఁడు, చంపువాఁడు, నిజాలయమున్ = నీ యింటిని, ముదానన్ = సంతోషముతో, ఖరదూషణత్రిశిరులు మువ్వురేక కాలమున రామచంద్రుని దాఁకియుండిన గెలిచియుందురేమో యని కొందఱకు భ్రాంతి. జయాప

జయము లెల్లఁ డిచెను పూర్వకాలమునఁ వీరులగు వారు వీరులతోఁ బోరునపుడు పరసహాయ్యమపేక్షించుట యవమానకరమని తలఁచుచుండిరి. ఒకవీరునిమీఁదికి నొకవీరుఁడే పోవలెనుగాని యెక్కువమందిపోయి జయించుటయు నవమానకరమే. ఒకవీరునిపైఁ జిల్లరమూఁకయెందఱైనఁ బైబడవచ్చునుగాని వీరుఁడ ననుకొను వాఁడు రెండవవాని సాహాయ్యముకోరక "యశోవా మృత్యుర్వా" యని యఱ హాయుఁడై యుద్ధముచేయును. మఱియెవఁడైన సాహాయ్యముచేసిన నది తన్నవ మానించినట్లెంచును. కావుననేకదా లక్ష్మణునిమీఁద రావణుఁడు శక్తివైచి నపుడు రాముఁడూరక చూచుచుండెను గాని ఖండింపఁడయ్యెను. కుంభకర్ణుఁడు సుగ్రీవునిఁ బట్టుకొని పోవునపుడు హనుమంతుఁ డూరక వెంటఁబోయెను గాని విడి పించినవాఁడు కాఁడు.

ఈ ధర్మము ద్వాపరముననే చెడినది అభిమన్యువధయే దృష్టాంతము. ఏ విధముననో యొకవిధముగ శత్రువును జంపుట యిప్పటివారికి ముఖ్యము ధర్మ ముతోఁ బనిలేదు. నేఁటికాలపు యుద్ధమును యుద్ధమనరాదు. వేఁట యనవల యును. వంచనము ప్రధానముగాని పౌరుషము ప్రధానము గాదు.

తా. రాముని నేనో నన్ను రాముఁడో చంపుట నిజము. దీని నీవు నిల్చి చూచుచుండుము. రాముఁడు చచ్చినా నీవు సంతోషముతో నింటికిఁ బొమ్ము. నేను జచ్చితినా నీవు రామునిమీఁదికి యుద్ధమునకుఁ బోయి యతని గర్వమణఁ గింపుము. అని చెప్పఁగా ఖరుఁ డట్టులేయగును గాక పొమ్మనెను.

చ. చనియెఁ ద్రిశృంగపర్వతము ♦ చాడ్పున స్యందన మెక్కి రాముపై
సునిశితబాణజాలముల ♦ జోరున వర్షముఁ బోలె వైచి క్రం
దున జలసిక్తమైన పెను ♦ దుందుభి నాఁ ద్రిశిరుండు గర్జలన్
వినిచిన, విల్లు ద్రిప్పుచును ♦ నిష్ఠుర బాణము లూని రాముఁడున్. ౪౨౩

త్రిశృంగపర్వతము = మూఁడుశిఖరములుగల కొండ, జలసిక్తమైన = నీటితోఁ దడిసిన, దుందుభి = నగారా.

తా. త్రిశిరుఁడు మూఁడు శిఖరముల కొండవలెనై రథమెక్కిపోయి రామ భద్రుని మీఁద జోరున వర్షమువలె బాణములు గురియించి నీటఁదడిసిన నగారా ధ్వనివలె సింహనాదములు సేయఁగా రామభద్రుఁడును రావస్సుని తనవిల్లు గిర గిర ద్రిప్పుచు కఠిన బాణములు ధరించి.

చ. త్రిశిరుని వైచె నాతఁడును ♦ తీవ్రతరాగ్రహావృత్తి రేఁగినన్
దశరథు నాత్మ సూతికిని ♦ నాకివిరోధికి నద్భుతావహం

బళమితతీవ్రతం దగ మృగాధిపదంతిరణం బనంగ, నా
త్రిశిరుఁడు భల్లకత్రయ మరీణగతిన్ నృపుఫాలభాగమున్. ౪౨౪

తీవ్రతర + ఆగ్రహ + వృత్తి = మిక్కిలితీవ్రమైన కోపముయొక్క వ్యాపారముచే, నాకివిరోధి = దేవశత్రువగు త్రిశిరునకు, ఆత్మసూతికిన్=కుమారునకు, అద్భుతావహంబు = ఆశ్చర్యకరమైనయుద్ధము, అశమితతీవ్రతన్ = అణఁగని తీవ్రత్వముచే, మృగాధిపదంతిరణంబు = సింహమునకు నేనుఁగునకు జరిగిన యుద్ధము, ఈయుపమానము రామత్రిశిరుల బలతారతమ్యమును దెలుపుటేగాక జయము రామచంద్రునకే సిద్ధమనియుఁ దెలుపుచున్నది. భల్లత్రయమున్ = మూఁడు బాణములను, అరీణరీతిన్ = నూటిగా, ఫాలభాగమున్ = నొసటి ప్రదేశమును.

తా. త్రిశిరునిమీఁద వేయఁగా నతఁడును మిగులఁగోపించి విజృంభింపఁగా రామభద్రునకు రాక్షసునకు యుడుగని వేగమున నద్భుతమైనయుద్ధము సింహమునకు నేనుఁగునకువలె జరిగెను. అప్పుడు త్రిశిరుఁడు మూఁడు బాణములను రామభద్రునినొసట నాటునట్లు వైచెను.

ఉ. క్రుచ్చినఁ గోప మెత్తి రఘు ♦ కుంజరుఁ డిట్లను రాక్షసాధమా
మెచ్చితి నిన్ను శూరుఁడవు ♦ మెత్తనిపూవులువోలె బాణముల్
గ్రుచ్చితి నాలలాటమునఁ ♦ గొమ్మిదె మచ్ఛరపాళి యంచుఁ బెం
పచ్చుపడంగ వాని యుర ♦ మందు శరంబులు నాల్గుం బడిన్. ౪౨౫

తా. ఇట్లు త్రిశిరుఁడు నొసట నాట బాణములు వేయఁగా రామభద్రుఁడు కోపించి ఓరి నీచరాక్షసుఁడా, నిన్ను శూరుఁడవని మెచ్చితిని. (ఇది పరిహాస వచనము) మెత్తనిపూవులు వేసినట్లు బాణములు నానొసట నాట వేసితివి ఇదిగో నా బాణములను గ్రహింపుము అని పదునాల్గు బాణములను వాని ఱొమ్మునందు.

ఉ. నాటఁగ వైచి గుఱ్ఱముల ♦ నాల్గిట నూతుని నెత్తిఁదిట నొ
క్కేటునఁ డెక్కెముం దునిమి ♦ పృథ్వికి దాఁటుపళాటువక్ష మా
స్ఫోటముగాఁగఁ దీవ్రశర♦పూగము వైచిన వీతచేష్టుఁడై
పోటఱి చచ్చి నేఁ బడెఁ ♦ బూర్వనికృత్తనిజోత్తమాంగుఁడై. ౪౨౬

నిశాటు = రాక్షసునియొక్క, ఆస్ఫోటముగాఁగ = పగులునట్లు, తీవ్రశరపూగమున్ = తీక్ష్ణములైన బాణసమూహమును, వీతచేష్టుఁడై = చేష్టలుడిగినవాఁడై, పోటఱి = శక్తిహీనుఁడై, పూర్వ = ముందే, నికృత్త = నఱకఁబడిన, నిజ = తనయొక్క, ఉత్తమాంగుఁడై = శిరస్సుగలవాఁడై.

తా. నాటునట్లు వేసి గుఱ్ఱముల నాలుగు బాణములచేతను, సారథి నెనిమిదింటను, ఒక్కదెబ్బతో టెక్కెమును ద్రుంచి భూమిమీఁదికి దుముకఁబోవు రాక్ష

సుని వక్షము చీలునట్లు తీవ్రబాణము వైచిన పౌరుషహీనుఁడై చేష్ట లుడిగి ఖండింపఁబడిన శిరస్సుగలవాఁడై నేలఁబడెను.

ఉ. ఆతనిపాటుఁ గన్గొని ఖ ♦ రాశ్రయసేవక రాక్షసుల్ మహా
భీతిని బాఱి రెల్లయెడ ♦ బెబ్బులిఁ జూచినలేళ్ళ వోలె నా
భీతుల నెల్ల ద్రిప్పికొని ♦ పేరలుకన్ ఖరుఁ డిందు రాహుప
ట్లాతతలీల నాదశరథాధిపనందను మార్కొనం జనెన్. ౪౨౭

భీతులన్ = భయపడినవారిని, పేరలుకన్ = పెద్దకోపముతో, పేర్వాదుల లుగాగమము విభాషనగుఁ గావున నిచట లుగాగమము లేదు. ఇందున్ = చంద్రుని, ఉభయసేనలయందు ముప్పదినాల్గువేలవా రుండిరని ౪౨౦-వ పద్య మునఁ జెప్పబడెను. ఇచ్చటఁ గొందఱు శేషించినట్లు చెప్పఁబడినది. వీరెవ్వరు ?

౪౨౦-వ పద్యమున యుద్ధమునకై వచ్చిన వారిలో నని చెప్పఁబడెను. యుద్ధమునకై వచ్చినవారు పదునాల్గు వేవురు. వీరందఱు జంపఁబడిరి, ౪౧౯-వ పద్యమునఁ జెప్పఁబడెను.

యుద్ధయాత్ర పోవునపుడు యుద్ధభటులకు సహాయులై బాణములు మోసి కొని పోవువారు లోనగుపరిచారకులు కొందఱు పోవుచుందురు ఇందుఁ జెప్పఁబడినవా రా తెగలోని వారు. రామభద్రుఁడు యుద్ధమునకై వచ్చిన వారిని మాత్రమే చంపెనుగాని వారి సేవకులను జంపినవాఁడు కాఁడు. కావుననే యిచ్చట ఖరా శ్రయ సేవకరాక్షసులని చెప్పఁబడెను గాని యుద్ధభటులని చెప్పఁబడలేదు. కావు ననే వీరిపై బాణము ప్రయోగించినట్లు చెప్పఁబడలేదు ఇదియకదా సీతోపదేశము. దోషముచేయని వానిని జంపరాదు. ఒకఁడు దోషముచేసినను వాని దోషమునకై వానితోఁ గలసియున్న మాత్రమున నిర్దోషులను జంపరాదు. ఇచ్చట రామచంద్రునిచే నీ ధర్మమనుష్ఠింపఁబడెను.

తా. త్రిశిరుఁడు పడిపోవుటచూచి ఖరుని నాశ్రయించియుండు సేవకులగు రాక్షసులు రామభద్రుఁ డిఁకఁ దమ్ముఁ జంపునే యని మహాభయమున పెద్దపులిని జూచిన లేళ్ళవలె నాలుగు దిక్కులకుఁ బరువెత్తిరి. నేనుండఁగా మీకేమి ప్రాణ భయమని వారికి ధైర్యముచెప్పి వారినందఱఁ బిలుచుకొనివచ్చి సిందుకోపమున ఖరుఁడు చంద్రునిమీఁదికి రాహువుపోవునట్లు పోయెను.

—♦ ౨౮-వ సర్గము. ఖరుఁడు శ్రీరామునితో రణం బొనర్చుట, ♦—

సీ. అని దూషణత్రిశి ♦ రాదుల గతిఁ జూచి, గుండె ఝల్లనఁగ ఖ ♦ రుం డి దేమి
విక్రమం బపుర దో ♦ ర్విక్రమవంతులఁ, బదులాల్గువేవురఁ ♦ బ్రథితబలులఁ

త్రిశిరుని దూషణుఁ ద్రిక్కక ఖండించె, రాముఁ డెక్కటి నేమి భీమబలము!
కానిమ్ము చూచెదఁ గాక యం చింద్రుని, నముచిమార్కొనిన చందంబుదోఁపఁ

తే. గవిసి యాశీవిషోపమ కాండములను, గుప్పఁగూరలుగా వైచి గుణము మీటు
చస్త్రశస్త్రకళాదిసామర్థ్య మెల్లఁ, బ్రకటితంబుగఁ జలిపెను రణము ఖరుఁడు.

అనిన్ = యుద్ధమందు, ఝల్లనఁగఁ = ఇది యనుకరణపదము గావున వర్గ చతుర్థాక్షరము గలదయ్యెను. ఋ ౠ ఌ ౡ విసర్గ వర్గయు గ్జ ఇ + శమలు. తత్సమాన్య దేశ్యానుకరణంబులఁగూడి యాంధ్రభాషంజొచ్చును. వ్యా. సంజ్ఞా ౧౭ సూ.

దోర్విక్రమవంతులన్ = భుజబలము పరాక్రమముగల వారిని. ప్రథితబలులన్ = ప్రసిద్ధులైన బలశాలురను, త్రిక్కక = తప్పక, ఎక్కటి = అసహాయుఁడై. నముచి = ఒకానొక రాక్షసుఁడు, ఆశీవిషోపమ = పాములతో సమానములైన, కాండములను = బాణములను, గుప్పఁగూరలుగాన్ = కుప్పలుపడునట్లు, గుణము = అల్లెత్రాడు.

తా. యుద్ధమునందు దూషణుఁడు త్రిశిరుఁడు చచ్చుటంజూచి గుండె ఝల్లుమన ఖరుఁ డిట్టులనుకొనెను: 'ఆహా! యదియేమి విక్రమము? ఔరా? ప్రసిద్ధికెక్కిన బలశాలులను బదునాలుగువేలమందిని, దూషణుని త్రిశిరుని నొక్కనినైన నదలక యొంటరిగాఁడైన రాముఁడు ఖండించెను. ఏమి భయంకరబలము! నేనొక్కఁడను వీనికి లక్ష్యమా? అయినను గానిమ్ము చూచెదనుగాక' అని యింద్రుని మీఁదికి నముచిపోయినట్లు కవిసిపాపములవలెఁ గ్రూరములైన బాణములను కుప్పలు కుప్పలుగాఁ బ్రయోగించి నారి మీటుచు తన యస్త్రశస్త్ర విద్యాపాండిత్యమంతయు వెల్లడియగునట్లు ఖరుఁడు యుద్ధముచేసెను.

మ. సకలాశాపరిపూరణంబుగ మహాశస్త్రాస్త్రసంతానముల్
భ్రుకుటీభంగముతోడ రాముపయిఁ జొప్పం దప్ప నీ కేసినన్
వికలత్వం బొకయింత లేక నిజదోర్విక్రాంతి దీపింప సా
యకముల్ దుర్విషహస్ఫులింగ చటులవ్యాపారముల్ గ్రక్కఁగన్. ౭౨

సకల + ఆశా + పరిపూరణంబుగన్ = సమస్తదిక్కులు నిండునట్లు, మహాశస్త్రాస్త్రసంతానముల్ = గొప్పశస్త్రములయు నస్త్రములయు సమూహములు, భ్రుకుటీభంగముతోడ = బొమముడితో, వికలత్వంబు = నిబ్బరము లేమి, నిజ = తన, దోః = భుజముల, విక్రాంతి = పరాక్రమము, దీపింపన్ = వెలుగఁగా, సాయకముల్ = బాణములు, దుర్విషహ = సైఁపరాని, స్ఫులింగ = మిణుఁగురులుగలవి, చటులవ్యాపారముల్ = వేగముగల మనస్సుగలవి.

తా. ఖరుఁడు కోపముచే కనుబొమలు ముడిచివైచి సమస్తదిక్కులు నిండునట్లు గొప్ప యస్త్రములను శస్త్రములను సమూహములను రామభద్రుఁడు కొంచెమైన మనస్సు చెదరనీక తన భుజపరాక్రమము ప్రకాశించునట్లు లోరుపరాని మిణుఁగురులుగలవియు మహావేగముతోఁ బోవునవియునగు బాణములను జాగు లేక.

శా. ఆకాశం బవకాశశూన్యముగ నే యన్ బాణజాలావృతుం
డై కానంబడఁ డయ్యె సూర్యుఁ డటు లన్యోన్యప్రఘాతార్థులై
క్ష్మాకాంతుం డసురాధినేత పెనఁగన్ శాతాశుగాళిన్ ఖరుం
డా కౌసల్యతనూజు నొంచె సృణి మత్తానేకపంబుం బలెన్. ౮౩౦

అవకాశశూన్యముగన్ = ఎడములేకుండునట్లు, బాణజాల + ఆవృతుండై = బాణసమూహములచేఁ గప్పఁబడినవాఁడై, అన్యోన్యప్రఘాతార్థులై = ఒండొరులను గొట్టఁ గోరికగలవారై, శాతాశుగాళిన్ = పదునైన బాణముల వరుసచే, సృణిన్ = అంకుశముచే, మత్త = మదించిన, అనేకపంబుం బలెన్ = ఏనుఁగునువలె.

తా. ఆకాశమున సందులేనట్లు వేయఁగా నాబాణముల సమూహముచే నావరింపఁబడినవాఁడై సూర్యుఁడు కానరాఁడయ్యె. ఆ ప్రకార మొకరినొకరు కొట్టవలయునను కోరికతో రామభద్రుఁడు ఖరుఁడు యుద్ధము సేయు నెడ మదించిన యేనుఁగును నంకుశముతోఁ బొడిచినట్లు ఖరుఁడు పదునైన బాణముల వరుసలచే రామభద్రు నొప్పించెను.

ఉ. నొంచి యుగావసానశమనుం దలఁపించుచు నిల్చి ఘోర రా
త్రించరకోటితోడఁ గడుఁ దీవ్రత నీతఁడు పోరి పోరి తా
నించుక డయ్యఁడే యనుచు నెంచె, మృగేంద్రపరాక్రమున్ ఖరున్
గాంచె నరేంద్రుఁ డల్పపుమృగంబును సింహము చూచుకైవడిన్. ౮౩౧

యుగావసానశమనున్ = ప్రలయకాలమందలి యమధర్మరాజును, తలపించుచున్ = జ్ఞప్తికిఁ దెచ్చుచు, ఘోరరాత్రించరకోటితోడన్ = భయంకరులైన రాక్షసుల సమూహముతో, కడుఁ దీవ్రతన్ = మిక్కిలియధికముగ, పోరిపోరి = ఎంతో యుద్ధముచేసియు, ఇంచుక = కొంచెమైనను, డయ్యఁడే = అలసటచెందినవాఁడుగాఁడే, మృగేంద్రపరాక్రమున్ = సింహవిక్రమునిఁ, కైవడిన్ = విధముగ.

తా. ఈ ప్రకారము నొప్పించి ప్రలయకాలయమునిఁ దలఁపునకుఁ దెచ్చునట్లు నిలిచి భయంకరులైన యిందఱు రాక్షసుల గుంపుతో నెంతో యుద్ధము చేసియుఁ గొంచెమైన నీ సింహవిక్రముఁ డలయకున్నాఁడే యేమి యీయనబల మని యాలోచించెను. రామభద్రుఁడును వాని సింహ మొక యల్పమృగమును

జూచినట్లు చూచెనే కాని వాఁడొక బలవంతుఁ డగు రాక్షసుఁడని తలంచిన వాఁడును గాఁడు.

క౦. క్రించుఁడు భాస్కరసన్నిభ, కాంచనరథతలమునందుఁ ♦ గాండాసనముం
బంచద్గతిఁ ద్రిప్పుచుఁ బా,శాంచితకరశమనుభంగి ♦ నవనిపుఁ గదిసెన్. ౪౩౨

క్రించుఁడు = అల్పుఁడగు ఖరుఁడు, భాస్కర = సూర్యునితోఁ, సన్నిభ = సమానమైన, కాంచనరథతలమునందు = బంగారుతేరియందు, కాండాసనమున్ = వింటిని, కాండ + ఆసనము = బాణములను జిమ్మునది, చంచత్ + గతిన్ = గిఱగిఱ తిరుగువిధముగా, పాశాంచితకర = పాశముచేఁ బ్రకాశించు హస్తముగల, శమనుభంగిన్ = యమునివలె, అవనిపున్ = రాజును, కదిసెన్ = సమీపించెను.

తా. అల్పుఁడైన ఖరుఁడు సూర్యునివలెఁ బ్రకాశించు బంగారుతేరిపైనుండి గిఱగిఱ వింటిని ద్రిప్పుచు పాశమును చేత ధరించిన యమునివలె రామభద్రు సమీపించి,

— ♦ ఖరుఁడు శ్రీరాముకవచంబు భేదించుట. ♦ —

చ. వనదహనంబు డాయుశల ♦ భం బన రామునిఁ దాఁకి విల్లు చ
య్యనఁ గరలాఘవంబు మెఱ ♦ యన్ దృఢముష్టితలంబు వ్రయ్యఁగా
సునిశితబాణముల్ వఱపి ♦ సూర్యనికాశకలంబసప్తకం
బున రఘువీరుకంకటము ♦ భూమిపయిం బడ నేసెఁ దీవ్రుఁడై. ౪౩౩

వనదహనంబున్ = కారుచిచ్చును, డాయు = సమీపించు, శలభంబనన్ = మిడుతయనునట్లు, సూర్యనికాశ = సూర్యునితో సమానమైన, కలంబసప్తకంబునన్ = ఏడుబాణములతోడ, కంకటము = కవచము, తీవ్రుఁడై = వేగముగలవాఁడై.

తా. కాఱుచిచ్చును సమీపించు మిడుతవలె రామునిఁ దాఁకి తన హస్తలాఘవము మెఱయునట్లు రామభద్రుఁడు పట్టినవిల్లు, వింటిని పట్టుకొన్న పిడికిలి చీలునట్లుగా కఱకుములుకులఁ బ్రయోగించి, సూర్యునితో సమానమైనకాంతిగల యేడు బాణములచే రామభద్రుని కవచము నేలమీఁదఁ బడునట్లు వేగముగఁ గొట్టెను.

చ. కవచము నేలఁ గూల్చి లయ ♦ కాలభయంకరగర్జలట్టి యా
రవముల నించుచున్ శితశ ♦ రంబు లసంఖ్యముగాఁగఁ గప్ప భూ
ధవుఁడు ఖరాసురారి శర ♦ తాడితుఁడై గతధూమవహ్నినా
మిగుల వెలింగె భీషణస ♦ మీకతలంబున రోషదీప్తుఁడై. ౪౩౪

లయకాల = ప్రలయమందలియమునివి, భయంకరమైన, గర్జలట్టి = సింహనాదములవంటి, ఆరవములన్ = ధ్వనులను, శర = బాణములచే, తాడితుఁడై = కొట్టఁబడినవాఁడై, గతధూమ = పోయినపొగగల, పొగలేని వహ్నినాన్ =

అగ్నిరివా యనునట్లు, మిథ్రుల = మిక్కిలి, రోషదిప్తుఁడై = కోపముచే మండుచున్నవాఁడై, భీమరణసమిత్తలంబునన్ = భయంకరమైన యుద్ధప్రదేశమందు, వెలిఁగెన్ = ప్రకాశించెను.

తా. ఇట్లు ఖరుఁడు రామభద్రుని కవచము నేలఁబడఁ గొట్టి ప్రలయకాలమందలి యముని సింహనాదములవంటి సింహనాదములు గావించుచు పదునుగల బాణములు లెక్కలేక గురియింపఁగా రామభద్రుఁడును రాక్షసునిబాణములచేఁ గొట్టఁబడి పొగలేనిమంటవలె రోషముచే మండుచు భయంకరమగు యుద్ధభూమి యందుఁ బ్రకాశించెను.

ఉ. కోపము రూపముం గొనిన ♦ కోపున నాతఁడు రూపుమాపఁగా
వేఁపున వక్రచాపము ము ♦ నీశ్వరదత్తము వైష్ణవంబు నీ
తాపతి పూని రోపములఁ ♦ దారుణరీతి ఖరధ్వజంబు ధా
త్రీపతితంబుఁ జేయ నది ♦ ద్రెళ్ళె సురాజ్ఞను సూర్యుఁడోయనన్. ౪౩౫

కోపునన్ = విధముగ, మునీశ్వరదత్తము = అగస్త్యునిచే నీయఁబడిన వైష్ణవధనుస్సును, రోపములన్ = బాణములను, ధాత్రీపతితంబున్ = నేలఁబడినది.

తా. కోపము రూపము ధరించినట్లయి యతని జంపుటకుఁగాను అగస్త్యుఁడిచ్చిన వైష్ణవధనుస్సును దీసికొని రామభద్రుఁడు బాణముల సంధించి ఖరుని ధ్వజము విఱిగి నేలఁబడునట్లు కొట్టఁగా నది దేవతల శాపముచేఁ బడు సూర్యునివలెఁ బడెను.

ఉ. సంగరమర్మకోవిదుఁడు ♦ శాతశరంబుల రామచంద్రుమ
ర్మాంగము లోలి దూఁటఁ బ్రద ♦ రాగ్ర్యచతుష్కము నేసి రక్తసి
క్తాంగునిఁ జేయ, మూర్ధమున ♦ నాయతబాహు లురంబు నాటఁగా
రింగునఁ గ్రుచ్చెఁ దా నొకట ♦ రెంటను మూఁటను రాముఁ డాఖరున్. ౪౩౬

సంగరమర్మకోవిదుఁడు = యుద్ధరహస్యములందుఁ బండితుఁడు, శాతశరంబులన్ = పదునైనబాణములచే, మర్మాంగములు = ఆయువుపట్టులు, ఓలిన్ = వరుసగా, దూఁటన్ = పొడుచునట్లు, ప్రదరాగ్ర్యచతుష్కము = నాలుగుమేలిబాణములను, రక్తసిక్తాంగునిన్ = నెత్తుటఁ దడిసిన దేహముగలవానిని, మూర్ధము = శిరస్సు.

తా. యుద్ధరహస్యము దెలిసిన ఖరుఁడు నాలుగు పదునుగల బాణములచే రామభద్రుని యాయువుపట్టులు పొడుచునట్లువేసి నెత్తుటఁదడిసిన దేహముగలవానినిగాఁ జేయఁగా నాయనయు నొక బాణమును శిరస్సునందు, రెండు బాణములను బాహువులందు, మూఁడుబాణములు వక్షస్థలమునందు నాటనేసెను.

చ. ఉఱక విభుండు వేడియుఁ ద్రయోదశ బాణములూని వైరిపెం
పఱఁగ నొకంటఁ గాఁడియు హయంబుల నాల్గిట సూతు నొక్కటన్
బిఱుసన మూఁటిచే నొగయు వేగమ యక్షము రెంటఁ ద్రుంచి త్ర
చ్ఛఱ సవలీల బాణయుతచాపముఁ ద్రెంచెను ద్వాదశంబునన్. ౪౩౭

ఉఱక = లక్ష్యము చేయక, త్రయోదశబాణములు = పదుమూఁడుబాణములు, పెంపు + అఱఁగన్ = విజృంభణ మణఁగునట్లు, త్రచ్ఛఱన్ = శీఘ్రముగ, అవలీలన్ = సునాయాసముగ, బాణయుతచాపమున్ = బాణములతోఁగూడియుండిన వింటిని, ద్వాదశంబున = పండ్రెండవదానిచే.

తా. ఖరుఁడు వేయు బాణములను లక్ష్యపెట్టక రామభద్రుఁడు పదుమూఁడు బాణములు సంధించి శత్రువు విజృంభణ మణఁగునట్లు ఒకదానితో కాఁడియు, నాలుగింటిచే గుఱ్ఱములను, సారథి నొక్కదానిచేతను, మూఁడు బాణములచే నొగయు, ఇరుసును రెండింటిచేతను, బాణముతోడి వింటిని పండ్రెండవబాణమునను ద్రుంచెను.

క. పతి వెండియుఁ బదుమూఁడవ, శితశరమున ఖరుని మేను చీల్చిన నతఁడున్
హతసారథి హతహయుఁడై, క్షితికిని లంఘించె గదను గేలం గొనుచున్. ౪౩౮

తా. పదునగుపదమూఁడవ బాణముచే ఖరుని దేహము చీల్చునట్లు వేయఁగా నతఁడు చంపఁబడిన సారథియు గుఱ్ఱములు గలవాఁడై చేత గద తీసికొని భూమి మీఁదికి దాఁటెను.

క. అద్భుత మగుకౌసల్యా ప్రోద్భవుచారిత్రమునకుఁ పుష్కరవీథిన్
ముద్భారంబునఁ బొదలుచు, సద్భావముతోడఁ బూజ సలిపిరి వేల్పుల్. ౪౩౯

కౌసల్యాప్రోద్భవు = కౌసల్య కుమారుడగు రామభద్రుని, పుష్కరవీథిన్ = ఆకాశమార్గంబున, ముత్ + భారంబునన్ = సంతోషాతిశయముచే, సద్భావము తోడన్ = మంచి తలంపుతో, వేల్పుల్ = దేవతలు

—♦ ౨౯-వ సర్గము. ఖరుని శ్రీరాముఁడు నిందించుట. ♦—

చ. గద గొని నిల్చియున్న ఖరుఁ గాంచి ధరాతనయాధవుం డనున్
మృదువుగ హృద్వ్రణంబులగు నిష్ఠురవాక్కుల రాక్షసాధమా!
గొదగొని తేరులన్ హరులఁ గుంజరముల్ పొలుపార గర్వివై
యుదయుత లోకదూష్య మగు నాఁడిచేఁతలు చేసి తిస్సిరో. ౪౪౦

హృద్వ్రణంబులు = హృదయమునఁ బుండువంటివి, గొదకొని = అతిశయించి, ఆఁడిచేఁతలన్ = చెడ్డకార్యములను, ఇస్సిరో = ఛీఛీ, కుంజరములు = ఏనుఁగులు,

లోకదూష్యము = జనులచే నిందింపఁబడునది; ధరణీతనయావిభుండనుటచే సీతాదేవి రక్షణ ప్రధానకార్య మని చెప్పిన మాటలు స్మరించినవాఁడని భావము.

ఈ ఘోరయుద్ధమందు మాటల కెడము లేకున్నను గర్వకారణములగు సర్వము, సేనయు, నాయుధములు సమయుటచే నిప్పుడైనఁ దెలివి తెచ్చుకొని బాగుపడునేమో రక్షింతమను నుద్దేశ్యముతో నయము భయము దోఁప రామభద్రుఁడు ఖరునితోఁ జెప్పుచున్నాఁడు—౨౨౫ వఱకు నీతిని బోధించునవి; ఆవల భీతిని కలిగించునవి. ఇవియే యీ సర్గమునందు న్యాయమునది. నిష్ఠుర వాక్యములని చెప్పఁబడెను.

తా. చేత గద బట్టుకొని నిలిచియుండు ఖరుని జూచి సీతాపతి మెత్తని మాటలచేతను హృదయమునఁ బుండువంటి కఠినవాక్కులచేతను నిట్లనెను. ఓరీ! నీచ రాక్షసుడా! విస్తారముగ రథములు, గుఱ్ఱములు, ఏనుఁగు లుండుటచే గర్వించినవాఁడవై, దయలేనివాఁడవై లోకులు నిందించు చెడ్డపనులు చేసితివి. ఛీ, ఛీ.

క. తాపముఁ గూర్చుచు జనులకుఁ, బాపంబులఁ జేయువాఁడు ♦ పరమేశ్వరుఁ డేన్
బ్రాపించుఁ గీడుఁ దప్పక, పాపాత్మా! నీవిధంబుఁ ♦ బలుకఁగ నేలా. ౨౨౧

తా. జనులకు బాధ గలిగించుపావకార్యములను జేయువాఁడు పరమేశ్వరుఁడైనను దప్పక కీడులకుఁ బాలుపడును. పాపీ! ఇఁక నీవనఁగా నెంతవాఁడవు?

చ. భువనవిరుద్ధ మైనపనిఁ ♦ బూని యొనర్చుచు దుష్టచిత్తుఁడై
పొవరున సంచరించుఖలు ♦ పొం గణఁగింపఁగఁ జూతు రెల్లరున్
భవనసమాగతోగ్రఫణి ♦ భంగిని; ధూర్తుస్వలోభకామసం
భవకలుషంబులం జెడును ♦ బ్రాహ్మణి దా వడగండ్లచే బలెన్. ౨౨-౨

భువనవిరుద్ధము = లోకమునకు విరోధమైనది, పొంగు = గర్వము, భవనసమాగత = ఇంటిలోఁ జేరిన; ఫణిభంగిని = పామువలె, ధూర్తు = దుష్టుఁడు; వృద్ధ, నీచ, మూర్ఖ, ధూర్త, గృహస్థ చార్వాక శబ్దములకు ప్రథమావిభక్తి ప్రత్యయము "డు" లేకయు రూపములుగలవు. ఇవి ఉకారాంతము లగును; ధూర్తుఁడు, ధూర్తు రెండును సాధురూపంబులే. స్వలోభకామ = తనలోభము కామముచే, సంభవ = పుట్టిన, కలుషంబులన్ = పాపములచే, బ్రాహ్మణి = [illegible] లికండ్ల పాము.

తా. ఇంటిలోఁజేరిన పామును జంపుటకు నెట్లు జనములు యత్నము చేయుదురో యట్లులే లోకమునకుఁ గీడు కలిగించు కార్యములను జేయుచు చెడ్డ మనస్సు గలవాఁడై గర్వియై తిరుగు దుష్టుని గర్వ మణఁగింప లోకులెల్లరు సాధువు లసాధువులుకూడఁ బ్రయత్నింతురు. దుష్టుఁడు, తా నొకరికి నీయరా దనులోభగుణము

చేతను పరులది తనకు రావలయు నను కామముచేతను కలిగినపాపములచే నలి కండ్లపాము పడగండ్లను దిని చచ్చినట్లు చెడుదు.

ఉ. ఏమిఫలంబుఁ బొందెదవొ ♦ హీననిశాటుఁడ ! దండకాటవీ
భూమిఁ జరించుసాధుముని ♦ పుంగవులన్ వరధర్మనిష్ఠులన్
హామికఁ జంపి చంపి; కలు♦షాత్మ! సంపద శీర్ణమూల మౌ
భూమిరుహంబుభంగి నిలఁ♦బోవదు దీర్ఘముగా దురాత్మకా. ౨౨౩

హీననిశాటుఁడ = నీచరాక్షసుఁడా! హామికన్ = గర్వముచే, శీర్ణమూలము = వేరు తెగినది, భూమిరుహము = చెట్టు, దీర్ఘముగా = చిరకాలము.

తా. నేనేమి పాపము చేసితిని నేను పాపము చేసియుండిన నాకీసంపద యెట్లు వచ్చెను ? అందువేమో. ఓరీ నీచరాక్షసా ! దండకారణ్యమునందు సంచరించు మునిశ్రేష్ఠులను గొప్ప ధర్మమునందు నిలుకడగలవారై యాకారణముచేఁ బరుల కెవ్వరికి నేబాధయుఁ గలిగింపని సాధువులను నీ యిష్టము ప్రకారము గర్వించి చంపితివి కదా. దానివలన నేమి మేలు గలుగునని తలఁచితివి ? సాధారణముగ నీ జన్మమునఁ జేసిన పుణ్యపాప ఫలము లీ జన్మమందే యనుభవమునకు రావు. పోయిన జన్మములందుఁ జేసిన పుణ్యమువలన నీ జన్మమున సంపద గలుగును. అయిన నేమి లాభము ? పుణ్యముచేతఁగదా మన కైశ్వర్యము గలిగెనను జ్ఞానము లేక మదముచేఁ బాపములు చేయువారి సంపద వేరుచెడిన చెట్టువలె దీర్ఘకాలము నిలువదు. త్వరలోనే నశించును. అట్టులే పోయిన జన్మమున నీవు చేసిన పుణ్యఫలము తీఱినది. పాపఫల మనుభవించుకాలము వచ్చినది.

కం. ఋతువులు సమకూరినచో, క్షితిజము తగుపూలు పూచు♦చెలువున నరుఁ డు
ద్ధతిఁ జేసినయఘములఫల, మతఁడ యవశ్యంబునొందు ♦ నయ్యైయి వేళన్. ౨౨౪

క్షితిజము = చెట్టు.

తా. విత్తనము నాటఁగానే పూలు పండ్లు చేతికి రానట్లు పాపముచేసిన వెంటనే పాపఫలము రాదు. చెట్లు ఋతువులు ప్రాప్తించినపుడు గదా పూలు పూచును. అట్టులే మనుష్యుఁడు తానుజేసిన పాపఫలము దానికాలము వచ్చినపుడు తప్పక యనుభవించును.

కం. విసమును గూడినయన్నము, గ్రసియించినవానిపగిదిఁ♦గలుషఫలము లౌ
దొసఁగులు పాపాత్ముం డిటు, వెసఁగుడుచుం; బాపఫలము ♦ వృథపో దెపుడున్.

గ్రసియించిన = తినిన, దొసఁగులు = కీడులు, వెసన్ = శీఘ్రముగా.

తా. విసముతోఁ గలసిన యన్నము దినినచోఁ దప్పక కీడెట్లు కలుగునో

యట్టులే పాపఫలములయిన కీడులను శీఘ్రముగనందే యేవిధముగనైన మనుష్యుఁ డనుభవించునుగాని తప్పదు.

ఆ. పాప మాచరించు ♦ పాపాత్మకుల భువ, నాహితార్థులైన ♦ యట్టిఖలుల
సంహరించుటకును ♦ జననాథుచే నాజ్ఞఁ, బొందివచ్చినాఁడఁ ♦ బోలసుదిండి. ౭౭౬

భువనాహితార్థులు = జనులకుఁ గీడుచేయఁగోరువారలు, ఖలులఁన్ = దుష్టులను, పోలసుదిండి = మాంసభక్షకుఁడ.

తా. పాపకార్యములుచేయు పాపాత్ములను లోకమునకుఁ గీడుచేయఁదలఁచు దుష్టులను జంపుటకై రాజాజ్ఞగొని, రాక్షసుఁడా వచ్చితిని.

"కుమతులకుం గర్తయగుచుఁ గోపింపంగా । నమితాజ్ఞాప్రభుఁడగు । శమనుండా వీఁడు నేఁడు జగములకెల్లన్" అన్నట్లు లోకములోని పాపాత్ముల దండించుటకు నీ వేమి యమధర్మరాజవా ? మే మెట్లుండిన నీ కేమి ? అందువేమో. పరలోకమున దండించువాఁడు యముఁడైనచో నీలోకమునఁ బాపుల దండించువాఁడు రాజు. కావున నేను బాపాత్ముల దండించ రాజాజ్ఞ గొని వచ్చితిని.

రాజపుత్రకమ్మ నీవు జనరాజికి, వన్యమృగాళి కయ్యెదన్ రాజను దండకాటవికి గ్రక్కునఁ, బోయెదఁ బొమ్ము వీటికిన్. అను (అయోధ్య ౨౭౨ పద్యము) వాక్య మిచ్చట స్మరణీయము. ఇంతవఱకు నయముగఁజెప్పి వానియందు మార్పులేకపోవుటచే నికభయముచేనైన మంచిమార్గమునకు వచ్చునేమో యని కఠినముగఁ జెప్పుచున్నాఁడు.

ఉ. పాములు పుట్టలోనికిని ♦ బాఱెడుభంగి మదీయమార్గణ
స్తోమము నీశరీరమునఁ ♦ దూఱి నినున్ సహాసైన్యమిత్రుఁగా
నీమునుచంపినట్టివ్రత ♦ నిష్ఠులవెంబడిఁ గాపు పుచ్చురా
నీమొయి కండగర్వమును ♦ నేఁడిటఁ జూపర చూతు రాక్షసా. ౭౭౭

మదీయ = నాయొక్క, మార్గణ = బాణముల, స్తోమము = సమూహము.

తా. పుట్టలోనికిఁ బాములు పోవు విధముగ నా బాణములు నీ శరీరమునఁ దూఱి నిన్ను నీ సైనికులతోడను, మిత్రులతోడను, ముందు నీవు చంపిన ఋషుల వెంటఁ గాపు పోనఁజేయును. నీ దేహమునఁ గండగర్వ మెంతగలదో యంతయు నిప్పుడే చూపుము చూచెదను.

ఇటువంటి దుష్టరాక్షసులు పుణ్యాత్ములైన మునులుపోవు లోకమునకే పోదురా ?

"ద్వావిమౌపురుషౌలోకే, సూర్యమండల భేదినౌ, పరివ్రాడ్యోగయుక్తశ్చ రణేచాభిముఖో హతః," అన్నట్లు యుద్ధమున వెనుకంజపెట్టక యభిముఖుఁడై చచ్చిన వీరునకు స్వర్గముకలదు. ఇది సర్వవీరసామాన్యము. ఇఁక శ్రీరామునిచే యుద్ధమునఁ జచ్చినవారికి స్వర్గ మాప్తిమేల మోక్షప్రాప్తియుఁ గలుగును. మరణ కాలమున భగవద్ధ్యానము, భగవచ్చింత గలవారికి నరకమేల వచ్చును? కావున రాక్షసధ్యానము రాక్షసచింతచే రాక్షసులచేతఁ జచ్చినమునులకంటె వీరికే గొప్ప ఫలము కలదు. కావుననే స్కాందమున "రామ! త్వాం సంశ్రితా రాక్షసా నిర్మలానా సుఖా డితాః రామమాసాద్యసమరే సాయుజ్యపదవీం గతా" యని రాక్షసులకు సాయుజ్యము వచ్చినట్లు చెప్పబడెను.

"యం యం వాపిస్మరన్ భావం త్యజత్యంతే కళేబరమ్
తం తమేవైతి కౌంతేయ సదా మద్భావితః" భ. గీ. ౮. ౬.

ఈ విషయమున శ్రీ భాగవతంబున

కం. వైరానుబంధనంబునఁ
జేరిన చందమునవిష్ణుఁ జిరతరభక్తిన్
జేరఁగరాదని తోఁచెను
నారాయణభక్తియుక్తి నా చిత్తమునన్.

అను నారదసూక్తి స్మరణీయము.

పరమభక్తివలెఁ బరమవైరము సాయుజ్యము కలిగించును. "ఏనకేనా ప్యుపాయేన మనః కృష్ణే నివేశయేత్" తని యే యుపాయముచేతనైన సరియె మనస్సు భగవంతునందు నిలుపుట ప్రధానము. ఈ యుద్ధమునఁ జచ్చిన ఏడునాలుగువేల రాక్షసులకు సాయుజ్యము కలదా? లేదు. వీరికి శ్రీరామచంద్రమూర్తియందుఁ బరత్వ బుద్ధిలేదు. తీవ్రధ్యానములేదు. యుద్ధమునఁ జచ్చినవారి విషయమై భారతంబున నిట్లు చెప్పఁబడినది.

యైర్హుతాని శరీరాణి హవ్యాష్టేః పరమసంయుగే
దేవరాజసమాన్ లోకా తతాస్తే సత్యవిక్రమాః
యే త్వప్రాప్తేన మనసా మర్తవ్య మితి భారత
యుధ్యమానా హతాః సంఖ్యే, గాంధర్వైః సహసంగతాః
యేచ సంగ్రామభూమిష్ఠా, యాచమానాః పరాఙ్ముఖాః
శస్త్రేణ నిధనం ప్రాప్తా గతాస్తే గుహ్యకా న్ప్రతి
పాత్యమానాః పరైర్యేతు హీయమానా నిరాయుధాః

ప్రీణయిత్వా మహాత్మానః పరానభిముఖా రణే
భిద్యమానాః శరైః శస్త్రైః క్షత్రధర్మపరాయణాః
హతాస్తే బ్రహ్మసదనం గతా వీరాః సువర్చసః॥

యుద్ధమందు శరీరములను సంతోషముతో శత్రువుల బాణాగ్నియందు హోమము చేసినవారికి నింద్రలోకము, మనస్సున సంతోషములేక చావవలసినదే గనుక యుద్ధము చేయుదమని చేసి చచ్చినవారికి గంధర్వలోకము, సంగ్రామమునందు యాచించుచునో పరాఙ్ముఖులయియో పోవుతఱి బాణములు తగిలి చచ్చినవారు గుహ్యలోకమునకు, క్షత్రధర్మమెఱింగి పలాయనమగుట యవమానకరమని తలంచి శత్రువుల నెదిరించి నిరాయుధులై పోయి చంపఁబడినవారు బ్రహ్మలోకమునకుఁ బోదురు. అందియు కాని యుండదను సమానలోకము గదా.

చ. నిరయము నొంద యుద్ధధర ♦ నేస్థలి మామక తీవ్రమార్గణో
త్కరములఁ గూలియున్న నిను ♦ గాఢముదాన విమానసుస్థితుల్
దురుసున నీవధించినవ్ర♦తుల్ గనుగొందురు, తాటిపండును
ప్పురుస భవచ్ఛిరంబుఁ బడ ♦ నైచెద నీబల మెంతో చూపుమా. ౮౮౮

నిరయము = నరకబాధవంటిబాధ, మామక = నాయొక్క, తీవ్ర = పదునైన, మార్గణ = బాణముల, ఉత్కరములన్ = సమూహములచే, కూలియున్న = చచ్చిపడిన, గాఢముదాన = అత్యంతసంతోషముతో, విమానసుస్థితుల్ = విమానమందుఁ జక్కఁగా నున్నవారు, దురుసునన్ = దుష్టతనముచే, వ్రతుల్ = మునులు, ఇందు నిరయమనఁగా యమనరకముగాదు; బాణఘాతములచే గలుగు నరక బాధ వంటి బాధయని యర్థము. అట్లుగాకున్న మీఁది వద్యమునఁ జెప్పఁబడినది వ్యర్థమగును.

తా. యుద్ధరంగమందు నా బాణముల నేలఁగూలి బాధపడు నిన్నుఁ జూచి నీవు వధించిన మునులు ఆకాశమున విమానము లందున్నవారై మిగుల సంతోషముతోఁ జూతురు.

తాటిపండు నేలఁబడఁగొట్టినట్లు నీ శరీరమును నేలఁబడఁగొట్టెదను. కావున నీ బలమెంత యున్నదో దాని నంతయుఁ జూపుము. నీ బలమంతయు నీవు చూపిన పిమ్మటనే నిన్నుఁ జంపెదను. బలమంతయుఁ జూపిన రాముఁడేమై యుండునో యను కొఱంత నీకు నీ వారికి నక్కఱలేదు,

చ. అని తను నాడు రామమను♦జాధిపుఁ గన్గొని కోపరక్తలో
చనుఁడయి నవ్వి రాక్షసుఁడు ♦ చప్పిడిమాఁకను జంపినంతనే

కనుఁగవ గానలేక కడు ♦ గర్వమునన్ నిను నీవ మెచ్చుకో
ఘనత లభించునే? విను వి♦కత్థనముల్ బలియుండు పల్కునే? ౭౭౯

చప్పిడి = సారహీనమయినది, వికత్థనముల్ = తన్నుఁదాను బొగడుకొను మాటలు, బలియుండు = బలవంతుఁడు.

తా. అని తన్ను నిష్ఠురములాడుచున్న రామభద్రునిఁ జూచి యవి తన మేలునకై చెప్పఁబడుచున్నవని తెలిసికొనలేని యాఖరుఁడు యుద్ధమునందు సాధారణముగ నందఱచేఁ జెప్పఁబడు బిభీషికోక్తులని (బెదరింపుమాటలని) తలఁచి కోపముచేఁ గన్నులెఱ్ఱచేసి నవ్వి యిట్లనెను. ఓరీ! నిస్సారమైన యీ గుంపును జంపినంతనే గర్వముచేఁ గన్నులు గానలేక మహాశూరుఁడ నని నిన్ను నీవు మెచ్చుకొనఁగానే గౌరవము వచ్చునా? బలవంతుఁ డగువాఁడు తన్నుఁ దా మెచ్చుకొనునా?

మఱియొకయర్థము-నవ్వి = మహాత్ములుకూడ నొక్కొక్కసారి తమ యోగ్యతకుఁ దగనికార్యములు చేయుదురుకదా యని నవ్వి.

చప్పిడి...లభించునే = రామచంద్రా నీవు మహానుభావుఁడవు. భగవంతుఁడవు నీవు సంకల్పముచేతనే అనేకకోటి బ్రహ్మాండముల సృష్టింపఁగలవు. సంహరింపఁగలవు. అట్టి నీవీచచ్చుమూఁకలఁ గొందఱఁజంపి యదియొక గొప్ప కార్యముగఁ జెప్పెదవేల? అది నీయోగ్యతకుఁ దగినకార్యమా? నీవంటిబలిష్ఠుఁడు కూడ నాత్మస్తుతియను దోషమునకుఁ బాలుపడునా? నీ వహంకారము మమకారములు లేనివాఁడవే. ఈ యహంకారమెందుండివచ్చెను. నన్నుభయపెట్టుట కందువా? నీవెవఁడవో నాకు వాస్తవము తెలియకుండినఁగదా నీకు భయపడుదును. నా శాపమోక్షణము చేయవచ్చిన విష్ణువవే. నా మేలుకోరివచ్చిన నీకు భయపడుదునా? నన్ను భయముపెట్టి యింకను జీవింపఁజేసి శాపఫల మింకను ననుభవించుచు నీ పాపజన్మమునందే యుండుమనెదవా? ఇట్టియభిప్రాయము నీకుఁదగునా?

సీ. పౌరుషశాలి యగు ♦ బలవంతుఁ డేయెడఁ, దాఁజెప్పునే స్వకృ ♦ త్యములఁ బొగడి
నీచులా ధారిణి ♦ నేతలు నీయట్లు, రజ్జులాడెదరు ని ♦ రర్థకముగ
దన మహాకులప్రసూ ♦ తత్త్వంబుఁ జాటుచు, ననవసరంబుగ ♦ మనుజుఁ డెవఁడు
మృత్యుకాలంబున ♦ మేకొనుఁ బొగడుకో? దర్భాగ్రమున నున్న ♦ దవానుమాడ్కి

తే. నిట్టు నిను నీవ పొగడుకోఁ ♦ బట్టి తెలిసె నీలఘుత్వంబు; గదఁగొని ♦ కేల నిలువ
ధాతుచిత్రమ ప్రకంప్యమా ♦ ధరణిధరము, చొప్పమైయున్న నన్నిటఁ ♦ జూడఁడొక్కొ.

రజ్జులు = పొగడుకోలుమాటలు, నిరర్థకముగన్ = నిష్ప్రయోజనముగ, మహాకులప్రసూతత్వము = గొప్పవంశమునఁబుట్టుట, చాటుచున్ = ప్రకటించుచు,

అనవసరంబునఁ = సమయముగానప్పుడు, దర్భాగ్రమునఁ = దర్భకొనయందు, దహనుమాడ్కిఁ = అగ్నివలె, లఘుత్వంబు = పలుచఁదనము, ధాతుచితము = ధాతువులఁగూడినది, అప్రకంప్యము = కదలింపరానిది, ధరణీధరము = కొండ, నీచులౌ ధారుణీనేతలు = నీవు నీచుఁడవు రాజవుగావు, వారివలె మహాత్ముఁడవగు నీవేల నటించెదవు? మృత్యుకాలంబునఁ = శత్రువులకు మరణకాలము ప్రాప్తించినదని తెలిసియు వారియెదుట నెవఁడు తన్నుఁదాను బొగడుకొనును? అది నిష్ప్రయోజనకార్యముగదా. చచ్చెడివారియెదుటనా పౌరుషోక్తులు.

తా. మగతనముగల బలశాలి తన కార్యములను దాను జెప్పుకొనఁడు. నీచులగు రాజులే నీవలె నిష్ప్రయోజనముగ వ్యర్థభాషణము లాడుదురు. తాను గొప్పవంశమునఁ బుట్టితినని ప్రకటించుచు నసమర్థంబుగ నీవలె మరణము సమీపించినసమయంబునఁ దన్నుఁదాను బొగడుకొన నంగీకరించును. నిన్ను నీవు పొగడుకొనఁబట్టి దర్భకొనయందలి యగ్నివలె నీ వెంతటి నీచుఁడవో తెలిసెను. చేత గదఁ బట్టుకొని ధాతువులఁగూడి కదలింపరాని పర్వతమువలెనుండు నేను నీకుఁ గానరాలేదా.

ఆ. పాశహస్తుఁడైన♦భాస్కరసూనుఁడు, జగము లన్ని బారి♦సమరుమాడ్కి
నీగదానిహతిని♦నిప్పుడ నినుఁ జంప, జాలువాఁడఁ జూడు♦సత్త్వహీన. ౭౪౧

భాస్కరసూనుఁడు = యముఁడు, బారిసమరుమాడ్కిఁ = హింసించురీతి, సత్త్వహీన = బలహీనుఁడా.

తా. ప్రలయకాలమందు యముఁడొక పాశముచేతనే లోకముల నన్నిటిని హింసించునట్లు నే నీ యొకగదచేతనే లోకములనెల్ల హింసింపఁగలను గాని నిన్నుఁ జంపఁజాలువాఁడనా! కాను. అని యర్థము.

సత్త్వహీన = ఇచ్చట సత్త్వము తక్కిన రెండు ప్రకృతిగుణములకు నుపలక్షణము; అనఁగాఁ బ్రకృతిసంబంధములైన సత్త్వరజస్తమస్సులు నీయందు లేవు.

అప్రాకృతపురుషుఁడవగుట శుద్ధసత్త్వమయదివ్యమంగళవిగ్రహోపేతుఁడవు.

తా. ప్రలయకాలమున యముఁడు పాశము జేతఁ బట్టుకొని ప్రపంచమునఁ గల జీవులనెల్ల హింసించునట్టు లీ గదదెబ్బచేత నిప్పుడే నిన్నుఁ జంపెదను. బలహీనుఁడా! చూడుము.

ఉ. నిన్ననఁ బూనుకొన్నను న♦నేకము లున్నవి, వల్కనెల్ల, నా
సన్నదినాంత మయ్యె, రవి♦జాఱిన యుద్ధవిఘాత మబ్బెడిన్

చన్నసురారిపాళులకుఁ ♦ జయ్యన త్వద్వధ నశ్రుమార్జనం
బున్నది చేయఁగాఁగలుగు ♦ నుత్తమకార్యము, మాట లేటికిన్ ? ౪౫ ౨

ఆసన్నదినాంతము = సమీపించిన సాయంకాలము, యుద్ధవిఘాతము = యుద్ధమునకు విఘ్నము, చన్న = మరణించిన, సురారిపాళులకున్ = రాక్షస సమూహములకు, త్వత్ వధ = నిన్నుఁజంపుటచే, అశ్రుమార్జనంబు = కన్నీళ్లు తుడుచుట, ఉత్తమకార్యము = గొప్పపని, నీవలనఁజచ్చుటచే దర్భాగ్రమున నున్న దహనుమాడ్కి = దర్భాగ్రముననున్న యగ్ని బంగారువలె నతివేగముగామండి ప్రకాశించినను, నల్పకాలమందే చల్లాఱి వేఱొక వస్తువును గాల్పలేనట్లు, నీ పొగడు కోలుచే నీవు గొప్పవాఁడవుగా కొంచెముసేపు కానవచ్చినను, వెంటనే నీ వేమియుఁ జేయఁజాలనివాఁడవని యేర్పడునని గోవిందరాజీయము — బంగారును దహించు నగ్నిచే బంగారువలెనుండు పిత్తళినిగాల్చిన నల్లగాఁ గానవచ్చును. అట్లే శూరులకుఁ దగినమాటలు నీవు చెప్పుటచే నీశూరమానిత్వము బయలుపడెనని మహేశ్వర తీర్థీయము.

తా. నిన్ను నే నసఁబూనిన ననవలసినవెన్నియో యున్నవి కాని యన నిష్టము లేదు. ఏలయందువా ? సాయంకాలము సమీపించినది. సూర్యు డస్తమించెనా యుద్ధము నిలుపవలసివచ్చును. రాత్రి మీకనుకూలకాలమే కదా. ఏల నిలుపవలె నందువా ?

నీవు మనుష్యుఁడవు; రాత్రులందుఁ జీఁకటిలో నీవు యుద్ధము చేయలేవు. అట్టి ప్రతికూలసమయమందు నిన్నుఁ జంపుట నా పౌరుషమునకుఁ దగినది కాదు. అదియునుగాక నిన్ను ప్రొద్దుగ్రుంకులోపలఁ జంపి నీచేఁ జచ్చినవారికై యేడ్చువారి బంధువులకు నేను గన్నీళ్ళుదుడిచి సమాధానపెట్టవలసిన గొప్పకార్యమున్నది. నీతో ముచ్చటలపెట్టుకొంటినేని యది యెట్లు నెఱవేఱును?

వాస్తవార్థము — నీచేఁ జచ్చినవారిస్త్రీలు బాంధవులు నీ పాపాత్మచే వీనికై మామగవారందఱుఁ జచ్చిరని నన్ను దూషించుచున్నారు. వారివలె నేను నీచేఁ జచ్చితినా వారు సమాధానపడి నన్ను దూషింపకుందురు. నేనొకఁడు బ్రదికి యింటికిఁబోయితినా వారిదుఃఖము నేను జూడలేను కావున నీచే నాకు మరణమే శ్రేయస్కరము. ఈ యర్థమున త్వద్వధన్, త్వత్ = త్వత్తః, నీవలని వధను అని అన్వయింపవలెను. ఈ కారణముచే నీవు నాకు హితముపదేశించినను ఆ ప్రకారము వర్తింపఁజాలకున్నాను.

చ. అని గదఁ గేలఁ ద్రిప్పి మను ♦ జాధిపుఁ బిడ్గునుబోలె వైచినన్
ఘనతరవృక్షగుల్మముల ♦ నాశమొనర్చుచుఁ గిట్టి రాఁగ మిం

టన రఘురామచంద్రుఁడు ఘ♦నప్రదరప్రకరంబునన్ వడిన్
దునుకలుగాఁగఁ గూల్చె ఫణిఁ ♦ దోరపుమంత్రబలంబునం బలెన్. ౪౫౩

పిడుగుబోలె = పిడుగునుబోలె — ఆచ్ఛికంబులఁబదమధ్య నులుడుకుల యుత్వంబునకు లోపంబు బహుళంబు. సు. వ్యా. సంధి ౨౧. అడుగడ్డునకు మాధవానుచింతన, భాగ; ఘనతరవృక్షగుల్మముల = గొప్పచెట్లను, బొదలను, కిట్టి = సమీపించి, మింటన = ఆకాశమునందే, ఘనప్రదరప్రకరంబునన్ = గొప్ప బాణముల సమూహముచే, ఫణిన్ = పామును, ఘనతరవృక్షగుల్మముల నాశ మొనర్చుచు ననుటచే వీరు యుద్ధముచేయుస్థలము పెద్ద అరణ్యములుగాదని యేర్పడుచున్నది. అంతటి ఘోరారణ్యములో నిండఱు నిలుచుటకు యుద్ధముచేయుటకుఁ జాలినంత బయ లెందుండి వచ్చును.

తా. ఈప్రకారము చెప్పి గదను చేతితోఁ ద్రిప్పి విసరి పిడుగును వైచినట్లు రామభద్రునిపై వైచెను. అదియును మార్గమందున్న చెట్లను పొదలను నాశము చేయుచు పైపడిరాఁగ దాని నాకాశమందే రామభద్రుఁడు గొప్ప బాణసమూహముచే మహామంత్రముచేఁ బామునువలెఁ దునుకలుగాఁ గూల్చెను.

ఉ. కూలిచి దిగ్భ్రమన్ బెగడు♦కూళను ధర్మరతాత్ముఁ డిట్లనన్
ప్రేలితి వేమిరో బలము♦పెంపును జూపితి వింతమాత్ర కే
బాలిశ ! రజ్జు లాడితివి ♦ బాణవిదారిత మై ధరాస్థలిన్
దూలిననీగదం గనుము ♦ తూర్ణమ రమ్ము వచఃప్రగల్భుఁడా. ౪౫౪

దిగ్భ్రమన్ = దిక్కు తెలియక, బెగడు = భయపడు, కూళను = క్రూరుని, ధర్మరతాత్ముఁడు = నిరాయుధుని వేయరాదను ధర్మము దెలిసిన రామభద్రుఁడు— ప్రేలితివి = వదరితివి, బాలిశ = మూర్ఖుఁడా, రజ్జులు = వ్యర్థభాషణములు, బాణవిదారితమై = బాణముచేఁ జీల్పఁబడినదై, ధరాస్థలిన్ = భూమిమీఁద, తూర్ణమ = త్వరగా, వచఃప్రగల్భుఁడా = మాటలయందు సమర్థుఁడా.

తా. గదను నేలఁ బడఁగొట్టి యయ్యో గద పోయెనే యిఁక నేమిగతి యని దిక్కుదోఁపక భయపడి నిలుచున్న ఖరునిఁజూచి, ఓరీ ! యేమేమిరో వదరితివి గదా. నీబలాతిశయమంతయుఁ జూపితివిగదా. చెప్పినను దెలిసికొనలేని మూర్ఖుఁడా ! యీమాత్రమునకా యట్లు వ్యర్థపుమాటలాడితివి. నీయొక్క గదచేతనే లోకముల నెల్ల నాశులపఱిచెదనంటివే. అది యేగతిఁ బట్టినో బాణములచేఁ జీల్పఁబడి యెట్లు నేలఁబడియున్నదో చూచితివా ? మాటలనేర్పరీ ! ఇఁక రమ్ము.

కం. కూలిన రాక్షసులకు బా,ష్పాళిని మార్జన మొనర్తు♦నని యాడిన నీ
యాలాపము లనృతములై, యాలోనన వెలసెఁ గంటె♦హీనచరిత్రా. ౪౫౫

తా. చచ్చినవారికి కన్పించునటులుండు దినముల యుండినట్లే. నీకుండా నీమాట లెట్లసత్యములయ్యెనో యంతలోనె చూచితివిగదా.

క. గరుటామంతుం డమృతము, హరియించినరీతి నీదు ♦ ప్రాణము లివిగో
హరియింప నాశరంబులు, నురుఁగుల నెత్తుటిసి గ్రోల ♦ నుసలెను మహియుఙ్.

గరుటామంతుఁడు = గరుడుఁడు, గరుత్మంతుని తద్భవము గరుడ = గరుటా మంతుఁడు — గరుటాలమంతుఁడు, ఇవి రూపాంతరములు.

తా. గరుత్మంతుఁడు అమృతము హరించినట్లు నా బాణములు నీ ప్రాణములను హరింపఁగా నురుఁగులతోడి నెత్తుటిని త్రాగుటకు భూమి యెదురుచూచుచున్నది.

ఉ. భూమిని బ్రుంగ మేను నిజ ♦ దోర్యుగ మొర్విని జాఁచి దుర్లభా
లోలవిశాలనేత్ర నవి ♦ లోలతఁ గాఁగిటఁ జేర్చుచాడ్పునన్
నేలను గ్రుచ్చి దీర్ఘముగ ♦ నిద్దురవోయెద, వంత భూమ్ములన్
గేలిడి నిద్రవోయెదరు ♦ కీర్తిప్రపుణ్యులు సంయమీశ్వరుల్. ౮౫౭

బ్రుంగన్ = మునుఁగఁగా, నిజదోర్యుగము = నీ రెండుచేతులను — దుర్లభా లోల విశాలనేత్రన్ = కష్టపడి సంపాదించిన చలించు వెడలుపాటి కన్నులుగల స్త్రీని — అవిలోలిత = ఏకమనస్సుతోఁ జపలతలేక — దీర్ఘముగ నిద్దురవోయెదవు = చచ్చెదవు — సంయమీశ్వరుల్ = మునిశ్రేష్ఠులు.

తా. నీదేహము భూమిలో మునిఁగి చేతులు చాఁచుకొని యపురూపముగ నతి కష్టముపై లభించిన స్త్రీని నేకచిత్తముతో గాఁగిలించి పండుకొన్నట్లు బోర్లపడి భూమిని గాఁగిలించుకొని చావఁగలవు. అంతట నీబాధ తొలఁగునని భూమ్ముల మీఁదఁ జేతులుంచుకొని నిర్భయముగా నిర్విచారముగ సుఖముగా మునీంద్రులు నిద్రపోవుదురు. ప్రాణము పోయినఁగదా చేతులుచాఁచి నేలను గ్రుచ్చినటుట. మునుపటి చెప్ప నేలయనిన గుఱక నెట్టి నిద్రపోయినట్లని యెఱుఁగనది.

సీ. రాక్షసా! మచ్ఛర ♦ ప్రకరంబులను జనస్థాన మిప్పుడు హత ♦ స్థానమైన
నిర్భయతను మునినికురుంబములు సంచరించు నీదండకఁ ♦ గొంచ కిదను
భయపెట్టిరక్కసుల్ ♦ భయముపాటున నలుదెసలఁ బాఱెదరు చూ ♦ దిక్కులేక
కన్నీళ్ళఁ దడిసిన ♦ విన్నపిమోములు, నీకనుఁరూప లౌ ♦ నీదుభార్య

ఆ లెట్టిముగని విన్నుఁ ♦ గట్టికొంటను కష్టు. తెలిసి శోకరసము ♦ తెఱఁగుఁగాను
సౌఖ్యములకుఁ బాసి ♦ చని సిరర్థకజీవ, లగుదు రింక రాక్ష ♦ సాపసదుఁడ. ౮౫౯

మత్ + శర + ప్రకరంబులను = నాయొక్క బాణముల సమూహములచే, హతస్థానము = చచ్చినవారి గృహములు గలది. నికురుంబములు = సమూహములు, శంకిత = సందేహించుచు, రక్కసుల్ = రాక్షసస్త్రీలు, నిరర్థకజీవులు = విధవలగుటచే ప్రయోజనములేని బ్రదుకుగలవారు. రాక్షసులందును వితంతువివాహములు లేవు (ఉత్తర, ౫౫౧ వ, చూడుము) రాక్షసాపసదుడ = నీచరాక్షసుడా.

తా. ఓరీ రాక్షసుడా! నాబాణములచే జనస్థానము ప్రేతస్థానముకాఁగా మునులగుంపులు నిర్భయముగా నీదండకయందు నింక సంకోచములేక తిరుగఁగలరు. ఇంతవఱకుఁ మునులను భయపెట్టుచున్న రాక్షసస్త్రీలు ఇంక వారు వచ్చి నాకు చెప్పుదు రేమో నేను దమ్ము చంపుదునేమో యని భయపడుచు దిక్కులేనివారై దిక్కుల వెంటఁ బరువెత్తుదురు. నీకుఁదగిన నీభార్యలు కన్నీళ్లతోఁ దడిసి వెలవెలఁబోయిన ముఖములతో దొంగ వానిభార్య యెవ్వటికిని నగుండదయో యన్నట్లు నీవంటి మగనిఁ గట్టుకొనుటచే నిప్పుడు శోకరసమెట్టిదో తెలిసికొని కామసౌఖ్యములవదలి నీచరాక్షసుడా బ్రతికియు ప్రయోజనములేని బ్రదుకు బ్రదికెదరు. తాను జచ్చినఁ దనపెండ్లాలు విధవలై దిక్కులేనివారై యల్లాడుదు రేయను విచారముచేనైన యుద్ధము చాలించి శరణాగతుఁడగునేమో రక్షింతమను తలంపుతో నాఁడు వారి ప్రశంస కావింపఁబడెను. అనురూపభార్యలందుఁ బ్రేమయుండునుగదా.

ఉ. ఓరి నృశంస నీచ విను ♦ మోరిదురాత్మక విప్రకంటకా
క్రూరమనీష మీవలనఁ ♦ గూరినభీతిని మౌనిపుంగవుల్
దారు హవిస్సు నగ్ని నిడు♦దాఁకను సంశయలోలచిత్తులై
సారెకుఁ గంప మొందెదరు ♦ సాగు నొకో యిఁక నట్టిచేఁతలుః. ౪౫౯

నృశంస = ఘాతకుఁడా, విప్రకంటకా = బ్రాహ్మణబాధకా, క్రూరమనీష = దయలేని మనస్సుగలవాఁడా, కూరిన = కలిగిన, సంశయలోలచిత్తులై = సందేహముతోఁ జలించు మనస్సుగలవారై, చేఁతలు = చేష్టలు.

తా. నీకుఁదగిన భార్యలంటివే నేనట్టివాఁడనంటువా, ఓరీ ఘాతకుఁడా! నీచుఁడా, పాపాత్ముఁడా- బ్రాహ్మణద్వేషి- నిర్దయుఁడైన మనస్సుగలవాఁడా! మీవలనఁ గలిగిన భయముచే మునిశ్రేష్ఠులు హోమసమయంబులందుఁ దాము హవిస్సును నగ్నిలో వేయువఱకు నెక్కడ నేరాక్షసుండు వచ్చునో యెవఁడు విఘ్నము చేయునో యని సందేహముచేఁ జలించు మనస్సుగలవారై పలుమారు గడగడలాడుచుందురు. ఇఁక నట్టిచేష్టలు జరుగునని తలఁచితివా.

క. అన విని ఖరతరవచనంబున ఖరుఁ డిట్లనియెఁ బ్రాణ ♦ ములు పోయెడివే
ళను గూడ గర్వపడియెదు, మనుజాధమ ! నీ వదెట్టి ♦ మానిసి వొక్కో. ౪౬౦

ఖరతర వచనంబులన్ = మిగులఁ గఠినమైన మాటచే.

తా. ఈ ప్రకారము రామభద్రుఁడనఁగా మిక్కిలి కఠినములైన మాటలచే ఖరుఁ డిట్లనియెను. ఓరీ నీచమనుష్యుఁడా ? నీవెట్టిమనుష్యుఁడవురా. ప్రాణముపోవుటకు సిద్ధముగానుండు సమయమందుఁగూడఁ బొగరుపడుచున్నావు.

ఉ. కాలము దీఱినాతఁ డెఱుఁ ♦ గం గలఁడే యిది పల్కవచ్చు నీ
లీల వచింపరా దనెడి ♦ లీలలు, కార్య మకార్యముల్ మదిన్
జాలు నొకో తలంప మతి ♦ సత్త్వము వాసి షడింద్రియప్రభల్
దూలుటఁ జేసి; నీవిధము ♦ దోఁచెడి నట్టులు గాఁగ రాముఁడా. ౮౬౧

కాలముతీఱినాతఁడు = జీవితకాలము ముగిసినవాఁడు, మతిసత్త్వము = మనోబలము, షట్ + ఇంద్రియప్రభల్ = ఆఱు ఇంద్రియముల తేజస్సు జ్ఞానము.

తా. మృత్యువాసన్నమై వచ్చినవాఁడు ఇదిమాటలాడవచ్చును ఇది మాటలాడరాదు అనువిధముగాని యిదిచేయఁదగును, ఇది చేయరాదను విధముగాని బుద్ధి బలముపోయి ఆఱింద్రియములు జ్ఞానము తొలఁగుటచే తెలిసికొనఁగలఁడా ? లేఁడు- నీవిధముకూడ నట్టులే తోఁచుచున్నది.

చ. అని కలయంగ నాల్గుదెస ♦ లారసి దవ్వున నున్న పెన్నగం
బును మొద లంటఁ బీఁకి కను ♦ బొమ్మలు నాట్యము లాడ ఱివ్వు ఱి
వ్వున వడిఁ ద్రిప్పి నెత్తురులు ♦ పుట్ట రదంబుల మోవి నొత్తి యే
పున గుఱి చూచి చచ్చితివి ♦ పో మనుజాధమ యంచు వైచినన్. ౮౬౨

ఆరసి = వెదకి, దవ్వున = దూరమందు, రదంబుల = దంతములచే, మోవిన్ = పెదవిని.

తా. ఇట్లు పలికి నాలుగుప్రక్కలు పాఱఁజూచి వెదకి దూరమందున్న పెద్ద వృక్షము నొకదాని వ్రేళ్ళతోఁ బీఁకి కనుబొమ్మలు చలించుచుండఁగా ఱివ్వుఱివ్వన వేగముగాఁ ద్రిప్పి నెత్తురుకాఱునట్టు పెదవులుకొఱుకుచు గుఱిచూచి నీచమనుష్యుఁడా చచ్చితివి పో యని విసరివైచెను. అంతట యినుపగదను నఱికినవానికి నీ చెట్టేమాత్రమని కాలబలమున వానికిఁ దోఁచినదికాదు. జూదమునందు యుద్ధమందు నెంతెంత యోటుపడునో యంతంత చలము హెచ్చుచుండును.

—♦ ఖరుఁడు శ్రీరాముచే హతుం డగుట. ♦—

ఉ. వచ్చెడు దానిఁ జూచి రఘు ♦ వర్యుఁడు శాతకలంబకంబులన్
బిచ్చెలు పిచ్చెలై పడఁగ ♦ వ్రేల్మిడిఁ ద్రుంచి యలంతిఁ బోడ యీ

కుచ్చితుఁ డంచుఁ దీవ్రమగు ♦ క్రోధముఁ దాలిచి మేనఁ జెమ్మటల్
పిచ్చిల రక్తనేత్రుఁడయి ♦ భీకరమార్గణసంచయంబులన్. ౭౬౩

శాతకలంబకంబులన్ = వాఁడిబాణములచే, వ్రేల్మిడి = చిటికె వేయునంతలో, అలంతి = కొంచెముతో, పిచ్చిలన్ = ఉబ్బుచుండఁగా, భీకరమార్గణసంచయంబులన్ = భయంకరమైన బాణసమూహముచే.

తా. అట్లు వచ్చుచున్న యా వృక్షమును జూచి రామభద్రుఁడు వాఁడి బాణములచే చిన్నచిన్న తునుకలై పడునట్లు చిటికె వేయునంతలో నఱికి యీ దుష్టుఁడు కొంచెముతోఁ బోవువాఁడు కాఁడు. వీనియందు దయ నిరర్థకమని నిశ్చయించుకొని మిగులఁ గోపము దెచ్చుకొని దేహమునఁ జెమ్మట లుబ్బుచుండ కన్ను లెఱ్ఱనగాఁగా భీతినిగలిగించు బాణముల సమూహముచే.

ఉ. చిల్లులు వోవ మేను వెసఁ ♦ జేసిన నెత్తురు కొండవంక నాఁ
బెల్లుగఁ దొర్గ వేదనను ♦ బెల్కుటి తాళఁగలేక మత్తు సం
ధిల్లఁ గృతాస్త్రుపై పడఁగఁ ♦ దేకువ తివ్వన రాఁగ నెత్రు చి
ప్పిల్లెడు మేనివానిఁ గని ♦ వెన్కడు గుంచి జవైకగామియై. ౭౬౪

తా. దేహమంతయు రంధ్రములు పడునట్లు కొట్టఁగా కొండవంకవలె నెత్తురు గారుచుండెను. ఆ బాధ సహింపలేక యవయవములు విలవిలఁబోవుచుండఁగా దేహము తెలియక వింట బాణము సంధించియుండు రామభద్రునిపైఁ బడుటకు ధైర్యముతో తివ్వనరాఁగా నెత్తురుకాఱుచున్న దేహము గలవానిని జూచి బాణము ప్రయోగించుటకు నడమండుటకై యొక యడుగు వెనుకకుఁ బెట్టి యతివేగగమనము గలవాఁడై ముందు పెట్టిన కాలు వెనుకకుఁ బెట్టుట వీరునికిఁ దగినకార్యము గాదు. అయినను జేనెడు సందైనలేకున్న శస్త్రప్రయోగము సాధ్యము కాదు. కావున దానికై వెనుకడుగు పెట్టెనుగాని వెఱచి కాదు. దీనిని బురస్కరించుకొని "క్వచి దతిసంకటవిషయే సుభటానా మభితో యవపసర్ప" యని వేదాంతదేశిక వాక్యము గలదు.

ఉ. కాంతిసి బ్రహ్మదండమున ♦ కంటె ఘనం బగు పావకాభ దు
ర్దాంతశరంబు శక్రదము ♦ గ్రక్కున వైవఁగ బిడ్గువోలె నా
శాంతము మాఱుమ్రోయఁ జని ♦ నాఖరువక్షము గాఁడఁ గూలె నా
ద్యంతము దగ్ధుఁడౌచుఁ ద్రిపు ♦ రాంతక దగ్ధఖలాంధకుం డనన్. ౭౬౫

బ్రహ్మదండమునకంటె - బ్రహ్మాస్త్రమునకంటె, పావకాభ = అగ్నితో సమానమైన, దుర్దాంతశరంబు = అమోఘమైన బాణము, శక్రదము = ఇంద్రుఁడిచ్చినది, ఆశాంతము = దిక్కులకడవఱకు, గాఁడన్ = నాటఁగా, ఆద్యంతము =

తల మొదలు పాదమువఱకు, దగ్ధుఁడు = కాలినవాఁడు, త్రిపురాంతక = శివునిచే, దగ్ధ = దహింపఁబడిన, ఖల = దుష్టుఁడైన, అంధకుంబలెన్ = అంధకాసురునివలె. ఈ అంధకాసురుఁడు శ్వేతారణ్యమున నుండినవాఁడు. ఈ శ్వేతారణ్యము కావేరి సముద్రసంగమమునకు సమీపముననుండు ప్రదేశము.

తా. బ్రహ్మదండమునకంటె నెక్కువ కాంతిగలదై యగ్నిహోత్రమువలె జ్వలించుచు నింద్రునిచే నీయఁబడిన యమోఘబాణమును శీఘ్రముగ వేయఁగా పిడుగువలె దిక్కులు ధ్వని యిచ్చునట్లు ధ్వనించుచుఁ బోయి యా ఖరుని వక్షము నందు నాటఁగా దానిచే దేహమంతయుఁ గాలి రుద్రునిచే దగ్ధుఁడైన యంధకాసురుని వలెఁ బడెను.

క. ఫేనమున నముచి పవిధా, రాసిహతిని వృత్రబలులు ♦ రమణను శ్రీసీ
తానాథునిమార్గణమున, మానవభుగ్వరుఁడు గూలె ♦ మహిఁ భస్మితుఁడై.

ఫేనమునన్ = నురుఁగుచే, నముచిరమణను = నముచివలె, పవిధారానిహతిని = వజ్రాయుధమునందు దెబ్బచే వృత్రాసుర బలాసురుల రమణను, మానవభుగ్వరుఁడు = రాక్షసశ్రేష్ఠుఁడు = మనుష్యుల భుజించువాఁడు. మానవభుక్కు — కొన్ని యెడల నుపమానంబులు పెక్కులగుచో నివి కడ దాని కొక్కటిక చూపట్టెడి. ప్రౌ. వ్యా. సమాస ౮౦ సూత్రము ప్రకారము ఉపమావాచకము రమణ యను నది యొక్కచోటనే గూర్పఁబడియె.

నముచి యను రాక్షసుఁడు ఆర్ద్రముచే, శుష్కముచేఁ జావకుండ వరముఁ దీసికొనుటచే నింద్రుఁడు తడిది ఎండినది కాని నురుగును వజ్రాయుధమునకుఁ దగిలించి దానితో వానిని గొట్టి చంపెను.

తా. నురుగుచే నముచియు, వజ్రముచే వృత్రుఁడు బలుఁడను రాక్షసులు చచ్చినట్లు శ్రీరామచంద్రుని బాణముచే భస్మమై యా ఖరాసురుఁడు చచ్చిపడెను.

— ♦ మహర్షులు శ్రీరాముని ప్రశంసించుట. ♦ —

ఉ. అంతట గుంపుగూడి విది ♦ తాత్ములు రాజఋషుల్ మునుల్ ధరా
కాంతుని వేడ్క ని ట్లనిరి ♦ గౌరవ మార మహాత్మ నిన్ను నీ
ప్రాంతముఁ జేరఁ బంప శర ♦ భంగుసిఁ జూడఁగ వచ్చె నాఁడు పా
కాంతకుఁ డామహర్షులు ను ♦ పాయమునన్ నినుఁ జేర్చె రీయెడన్. ౮౬౭

విదితాత్ములు = ఆత్మసాక్షాత్కారము గలవారు, ధరాకాంతుని = రామచంద్రభూపాలుని, ప్రాంతము = ఈ సమీపప్రదేశము, పాకాంతకుఁడు = ఇంద్రుఁడు.

తా. ఇట్లు ఖరుఁడు చావఁగానే గుంపుగూడి యాత్మసాక్షాత్కారముగల రాజఋషులు మునులు శ్రీరామచంద్రభూపతితో గౌరవమున నిట్లనిరి. మహాత్మా నిన్ను నీ ప్రదేశమునఁ జేరఁ బంపుమని కోరుటకై యింద్రుఁ డానాఁడు శరభంగుని జూడవచ్చెను. ఆ శరభంగసుతీక్ష్ణాగస్త్యాది మహర్షు లుపాయముచేసి నిన్ను నిచటఁ జేర్చిరి.

శా. త్రుంపింపం గలుషాత్మకంబు నసుర♦స్తోమంబు ని న్నింటను రప్పింపం గల్గెను, దీరె మాపనులు, నీ♦పే రెన్నుచున్ హాయి రా జింపన్ మాను లు దండకాటవిని దం♦డీ! యింక ధర్మంబు దీ పింపన్ నిచ్చలు సంచరించెదరు ని♦ర్భీతిన్ స్వధర్మంబులన్. 　　౮౬౮

త్రుంపింపన్ = సంహారింపఁజేయుటకై, కలుషాత్మకంబు = పాపస్వభావము గల, అసురస్తోమంబున్ = రాక్షసనమూహమును, తీరెన్ = చక్కఁబడెను, హాయి=సుఖము, నిచ్చలు=సర్వదా, నిర్భీతిన్ = భయమువిడిచి, స్వధర్మంబులన్ = తమధర్మంబులందు, సంచరించెదరు.

తా. పాపస్వభావముగల రాక్షససమూహమును జంపించుటకై నిన్నిందు వచ్చునట్లు చేసితిమి. మా పనులు చక్కఁబడెను. నీ పేరు చెప్పుకొనుచు సుఖముగాఁ దండ్రీ! మునులు దండకాటవియందు నన్నివేళల భయమువిడిచి వారివారి ధర్మంబులందు వారువారు తిరుగఁగలరు.

కం. అను నీలోనన చారణ, జనయుతముగ దేవతలును ♦ జననాథుని పై ఘనపుష్పవృష్టి గురిసిరి, వినువీథిని నిండె దుందు♦భిధ్వానంబుల్. 　　౮౬౯

తా. ఈ రీతిప్రకారము చెప్పుచుండఁగనే యాకాశమునుండి చారణులతోడఁ గూడి దేవతలు రామచంద్రుపై పెద్ద పుష్పవర్షము గురియంజేసిరి. ఆకాశమార్గమున దేవదుందుభిధ్వనులు నిండెను.

శా. ఔరా యేమి పరాక్రమం, బరరె యే♦మా దాక్ష్యసత్త్వంబు, ల య్యారే యా పదునాల్గువేలు మనుజా♦దానీకముల్ డాకనీ శ్రీరాముండు పదాతియై యొకఁడ త్రుం♦చెన్ వాసిగన్ భీకరా కారుండై ఘటికాత్రయంబునను సా♦క్షాద్విష్ణు వౌఁ జూడఁగన్. 　　౮౭౦

దాక్ష్యసత్త్వంబులు=దాక్ష్యము, దక్షత్వము, కార్యనిర్వాహణశక్తి, అనఁగా రాక్షసులనందఱఁ జంపఁజాలినశక్తి, సత్త్వము=బలము, మనుజాద + అనీకముల్ = రాక్షసుల సేనలు, పదాతియై = కాల్నడగలవాఁడై, ఘటికాత్రయంబునను = మూఁడు గడియలలోఁ (డెబ్బదిరెండు నిమిషములు,) సాక్షాద్విష్ణువు = ప్రత్యక్ష విష్ణువు.

తా. ఆహా! ఏమి పరాక్రమము! ఏమి కార్యసాధనసామర్థ్యము! ఔరా! బలము ఏమని చెప్పవచ్చును! ఒంటరిగాఁడు కాళ్ళమీఁద నిలఁబడి పదునాలుగు వేల రాక్షసులను మూఁడుగడియలలో సంహరించెనే యిది యితరులకు సాధ్యమా కాదు కావున నీయన ప్రత్యక్షవిష్ణువే.

♦— సీతాలక్ష్మణులు శ్రీరాముఁ జేరవచ్చుట. ♦—

కం. అని కొండాడుచుఁ దమ తమ, మనికులకుం జనిరి లోని ♦ మనికితె మాఱన్
గనవచ్చెనసుర; లంతం, జనుదెంచెను లక్ష్మణుండు ♦ జానకితోడన్. ౪౭౧

కొండాడుచున్ = పొగడుచు, మనికులకున్ = ఉనికిపట్టులకు, లోనిమనికి తెము = మనస్సులోని దుఃఖము, ఆఱన్ = క్షయింపఁగా.

తా. అని పొగడుచు దేవతలు, తమమనోవేదన శమింపఁగాఁ దమతమ స్థానంబులకుఁబోయిరి. అంతట లక్ష్మణుండు సీతాదేవితో వచ్చెను.

కం. విజయి యయి యచటిమౌని, వ్రజములు పూజింపఁ దోడ ♦ రా లక్ష్మణుఁడున్
గజగమనంబునఁ జనియెను, నజితపరాక్రముఁడు స్వాశ్ర ♦ మావనిఁ జేరన్. ౪౭౨

విజయి = గెలుపొందినవాఁడు, గజగమనంబునన్ = ఏనుఁగు నడకవంటి నడకతో, అజితపరాక్రముఁడు = జయింపఁబడని పరాక్రమముగలవాఁడు, స్వాశ్రమావనిన్ = తమ యాశ్రమభూమిని, దీనివలన నాశ్రమమునకు దూరమునందే యుద్ధము జరిగెనని తెలియనగు. సీతాలక్ష్మణులు యుద్ధము జరిగినచోటికే వచ్చిరి.

తా. గెలుపుగొన్నవాఁడై యచట మునిసమూహము పూజింపఁగా సీతాలక్ష్మణులు తనతోడరాఁగా నేనుఁగు నడకలవంటి నడకతో విలాసముగ నపరాజితుఁడగు రామచంద్రమూర్తి తన యాశ్రమముఁ జేరవచ్చెను.

కం. అంతట నాయనఁగని యరి, హంతను బరమర్షులకు సు ♦ ఖావహు హర్షా
క్రాంతయయి భర్త జగతీ, కాంతుని వైదేహి బిగ్గ ♦ కౌఁగిటఁ గ్రుచ్చెన్. ౪౭౩

అంతటన్ = ఆశ్రమముఁ జేరిన తరువాత, ఆయనన్ = శ్రీరామచంద్రమూర్తిని, కని = చూచి, అరిహంతనున్ = శత్రువుల సంహరించినవానిని, పరమర్షులకున్ = ఋషిశ్రేష్ఠులకు, సుఖావహున్ = సుఖము కలిగించినవానిని, హర్షాక్రాంత = సంతోషముచే నాక్రమింపఁబడినది, అయి, భర్తన్ = పతిని, జగతీకాంతుని = రాజును, వైదేహి = సీత, బిగ్గ = గట్టిగా, కౌఁగిటఁగ్రుచ్చెన్ = కౌఁగిలించెను.

తా. ఆశ్రమప్రదేశముఁ జేరిన తరువాత సీతాదేవి శత్రుసంహారకుఁడును ఋషులకు సంతోషము గలిగించినవాఁడును, భర్తయు నగు శ్రీరామచంద్రమూర్తిని గట్టిగఁ గౌఁగిలించెను.

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే—భ.గీ.

సాధువుల రక్షించుటకును పాపాత్ముల నాశముచేయుటకును, ధర్మసంస్థాపనము చేయుటకును ప్రతి యుగంబున నేను బుట్టుచుందును. అని శ్రీకృష్ణభగవానుఁడు చెప్పెను. ఈ విషయమే యుత్తరకాండమున నిట్లు చెప్పఁబడెను.

అవతారము సార్థకముచేయ నుపక్రమించుట యీ పద్యముఁ దెలుపుచున్నది.

అరిహంతను ననునది దుష్టశిక్షణమును పరమర్షులకు సుఖావహు ననునది సాధురక్షణమును దెలిపెడి.

ఇ తకుముందు చెప్పఁబడిన చరిత్రము దీనికిఁ బీఠికవంటిదై దుష్టులెవరు? శిష్టులెవరు? వారికిఁగలిగిన బాధయెట్టిది? అను విషయమును ఈ కార్యము నిమిత్తమై శ్రీరామచంద్రమూర్తి దండకకు వచ్చుటయునై యున్నది. మీఁది భగవద్గీతయందలి శ్లోకము సాధువులను రక్షించుటకై దుష్టుల శిక్షించుట యుద్దేశ్యముగాఁ జెప్పఁబడెను. దీనివలన దుష్టుల శిక్షించుట ప్రథమకార్య మగుచున్నది. కార్యముచేయఁబూనినపుడు మొదటఁ జేయవలసినది మొదటఁ జేయవలయు ననుగనుక నరిహంతను అని దుష్టశిక్షణము తొలుతఁజెప్పి దానివలనఁ గలిగిన సాధుపరిత్రాణము రెండవదిగాఁ జెప్పఁబడెను. ఖరాదివధకుఁ గారణము దానివలని ప్రయోజనము ఋషిసంరక్షణమె కదా.

శ్రీమహాలక్ష్మిదేవి స్త్రీలను బాధించు రాక్షసుల సమూలము నాశముచేయఁగదా భర్తను భూమిపై నవతరింపఁగోరి తానును నవతరించెను. అట్టి తన కోరిక నెరవేర్పఁ బ్రారంభించుటచే సీతాదేవి తనకోరిక నెరవేరు కాలము సమీపించెఁగదా యని సంతోషించి తనకార్యమును స్వకార్యముగ నెంచిన భర్తను తన సంతోషము సమ్మతి దెలుపఁ గౌఁగిలించుకొనుచున్నది.

ఆయననుగని కౌఁగిలించెను, రాక్షసులా వేలకొలఁది వచ్చుచున్నారు. రామచంద్రమూర్తియా యొంటరి గాఁడు. యుద్ధ మెట్లు పర్యవసించునో మరల నీయనను నేను గన్నారఁ జూడఁగలనాయని భయపడుచున్న సీత రామచంద్రమూర్తిని మరలఁ జూచి నీరుల తారతమ్యజ్ఞాన మెఱింగిన వంశమునఁ బుట్టినదగుటచే సగౌరవముగఁ గౌఁగిలించుకొనెను.

ఆయనను ౧. పూర్వము యుద్ధకాలమున గుంపులోఁ గానరాకయున్న వానిని ౨. వీరవ్రణములచే కాఱుచున్న నెత్తుటిచే రోమకూపములనుండి వెలువడు చెమటబొట్లచేఁ గూడియున్నవానిని 3. కోదండదండము నాధారము చేసికొని నిలఁబడి కొంచెము శ్రమముదీర్చుకొనుచున్నవానిని ౪. వ్రేలాడు వెండ్రుకలను దీఁగలచేఁగట్టినవానిని ౫. బిగించిన నడికట్టుగలవానిని ౬. బాహువులందు ధరించిన రెండమ్ములపొదులు గలవానిని ౭. యుద్ధము ముగియుటచేఁ గోప మాప శమింపఁగాఁ బ్రసన్నమైన వదనముగలవానిని ౮. సీతాలక్ష్మణు లింకను రాలేదే యని తమ రాకకై యెదురుచూచువానిని ౯. పదునలుగురుపోయిన పదునాలుగు వేలనుండి వచ్చినట్లు లంకను రాక్షసులువచ్చెదరేమో యని నలుప్రక్కలఁ జూచు వానిని ౧౦ పూర్వము లోకులు రాముఁడు మహావీరుఁడని తాను వినియుండి యిప్పు డావీరకార్యము జేసినవానిని.

కని = ఒకరు చెప్పఁగా విని కాదు. తానే కన్నారఁజూచి - ఆయనఁ గని రిపుహంతను అనుటచే నెందుండి చూచిన యుద్ధము కానవచ్చునో యట్టిచోట సీతా లక్ష్మణులుండిరని తెలియనగు. సీత గుహలోపలనుండుటచే యుద్ధము చూచి యుండదు. ఎటువంటివానిని జూచి యనిన అరిహంతను ౧. శత్రువులఁజంపినవానిని శత్రువుల జంపినవానిననుటచే తనయందు విరోధబుద్ధిలేక తనతో యుద్ధము చేయు కోరికతో రాక యుండు సేనానాయకులసేవకులు మొదలైనవారిని జంపలేదనిభావము. దీనిచే దుష్టనిగ్రహము చెప్పఁబడెను.

౨. అరిహంతను=అనుటచే హననవ్యాపారముమాత్రమే సీతచూచెనుగాని బాణముదీయుట, సంధించుట, విడుచుట, బాణముపోవుట, యిదియేమియు నామెనుఁ గానవచ్చినదికాదు. అత్యంతగమనవేగముచే నని యెఱుఁగవలయును.

పరమర్షులకు సుఖావహాః = తపోలేశముచే సర్వరాక్షసులను ధ్వంసము చేయఁగలవారు ఋషులు. ఇఁక పరమర్షుల కసాధ్యమైనదేలేదు. అయినను ఎవరెవ రికి స్వధర్మమందు వారు వారు నిలువవలయుననియే వారివ్రతము. రక్షించుధర్మము. భగవంతునిది. రక్షింపఁబడు ధర్మము జీవునిది. కావున రక్ష్యుఁడగువాఁడు రక్ష కత్వమును వహించుట స్వధర్మముగాదు. పరధర్మమగును. “మరణమైనను స్వధర్మంబు మేలు, పరధర్మమెప్పుడు భయకారణం”బగుటచే భగవంతుఁడే రావలె, ఆయనకార్యమాయన చేయవలె. ఆయన చేయవలసినకార్యము మనము చేయ రాదు. అట్లు చేసిన స్వరూపహానియగునని యెన్నిబాధలైన సహించుచు శ్రీరామ చంద్రమూర్తిరాకయు, నాయన ప్రతిజ్ఞానిర్వాహణము వీనికై యెదురు చూచుచుండిన వారు. సీతాదేవియు నిట్లు చేసినదే కదా.

సుఖావహః = "మిక్కిలి బాధలంగనెడి రామా దుష్టమాంసాశిసంతానంబే వఁగ" నన్నట్లు "రమ్మని గో రాఘవ శరణంగామ్ము అసురకోటులచే నాశమ్మైను గన్న మునీంద్రులమెమ్ము"లన్నట్లు దుఃఖపడువారి దుఃఖమును నాశముచేసి సుఖము కలిగించినవానిని,

హర్షాక్రాంత = సంతోషముచే నాక్రమింపఁబడినది.

'సతి ధర్మిణి ధర్మాః' ధర్మియుండును. ధర్మముండును. అను న్యాయముచే రామవిజయరూపమైన ధర్మి లభించుటచే దానిధర్మమైన హర్షము లభించెను. జయము హర్షమను గుణముకలది. గుణియుండిన గుణము దానితోడనే యుండును. (౨) హర్షమనఁగా = గగుర్పాటు, లోపలనుండు సంతోషము పొంగి రోమకూపములమూలమున వెలుపలికి వచ్చెనా యన్నట్లు దేహమునందు గగుర్పాటుగలదానిని.

భర్తారం = పతిని "లోకభర్తారం సుషువే యా" మన్నట్లు లోకముల నన్నిటిని భరించువానిని; భర్త భార్య నెట్లు భరించునో లోకములనన్నిటిని నట్లే భరించువాఁడని భావము. దీనివలనఁ జిదచిత్తులకు నీశ్వరునకు భార్యాభర్తృ సంబంధము చెప్పఁబడెను.

జగతీకాంతుని = కామ్యత ఇతి కాంతః – కాంక్షింపఁబడునది కస్య సుఖస్య, అంతో నిశ్చయో, ఉక్తేతివా కాంతం – సుఖముయొక్క నిశ్చయము దీనియందుఁ గలదు. గురు. ప్ర.

ఈ వ్యుత్పత్తులవలన కాంతుఁడనఁగాఁ గోరఁబడువాఁడనియు, ఏల కోరఁబడునని సుఖనిశ్చయము, నిశ్చయసుఖము వానియందుఁ గలదు కావునఁ గోరఁబడుననియు నేర్పడెను. ఎవరిచేఁ గోరఁబడినాఁడనిన జగతిచే, జగతిశబ్దము స్త్రీలింగమగుటచే స్త్రీ తనకు సుఖము గలిగించు ప్రియు నెట్లు కోరునో యట్లు జగతిచేఁ గోరఁబడెనని భావము. స్త్రీ ప్రాయమితరత్సర్వం జగద్బ్రహ్మపురస్సరమ్మని కలదు కదా. భర్తయను పదమున భర్తృధర్మమునకుఁ బ్రాధాన్య మీయఁబడెను. జగతీకాంతుఁడనుచో సతీధర్మమునకుఁ బ్రాధాన్య మీయఁబడెను. ఇట్లు చెప్పుటచే జగదీశ్వరులకు నన్యోన్యానన్యత్వము చెప్పఁబడెను. అనఁగా రామునకు జగతితప్ప భరింపవలసినది వేఱులేదు. జగతికి రాముఁడుతప్ప నిశ్చయసుఖమునకై కోరఁబడఁదగినవాఁడు వేఱొకఁడులేఁడు అని భావము.

"కోరి వసుమతీకాంత తనకుఁ బ్రచ్ఛన్నవల్లభుఁడుగ" నని యయోధ్య ౨౨వ పద్యమునఁ జెప్పఁబడెనుగదా.

కావున నిశ్చయసుఖము (మోక్షము) కోరువారు శ్రీరామచంద్రమూర్తిని దమకాంతుఁడుగ భర్తగా వరింపవలెనని భావము. కాంతుఁడు = మనోహరుఁడు, లోకములో భర్తలు పతివ్రతలగు స్త్రీలకు మనోహరులగుట వింతగాదు. శ్రీరామ చంద్రమూర్తి యట్టివాఁడుగాఁడు. దర్శనమాత్రమునఁ జూచునట్టి యెల్లవారి మనస్సులు హరించువాఁడు.

వైదేహీ = జనకరాజు కూఁతురు, స్త్రీలు సహజముగా భీరువులు, అందు ఘోర యుద్ధము చూచినపుడు భయపడుట స్వభావము. అట్టిచో సీతాదేవి మారణ వ్యాపారాసక్తుఁడైన రామచంద్రునిఁజూచి యెట్లు సంతోషించెను. సీతాదేవి బ్రాహ్మణ స్త్రీ కాదు. 'మిథిలాధిపతిర్వీర' యన్నట్లు వీరుఁడైన జనకునింటఁ బెరఁగినది. కావున యుద్ధవిషయము వీరధర్మము చక్కఁగాఁ దెలిసినది. అందు వీర్యశుల్క కావున రామచంద్రమూర్తిశౌర్యమునకు సంతోషించెను.

బిగ్గఁ గాఁగిటఁగ్రుచ్చెఁ = గట్టిగాఁ గాఁగిలించుకొనెను. హృదయమందు నిర వధికప్రేమ యెంతగాఢముగనున్నదో యంత గాఢముగఁ గాఁగిలించెను. లోకభర్త శ్రీరామచంద్రమూర్తి, లోకమాత సీత. కావునఁ దనబిడ్డలను రక్షింప శ్రమపడు భర్తవిషయమై ద్విగుణితప్రేమగలదై గట్టిగఁ గాఁగిలించెను. గాయములకు వేఁడి వేఁడి నిమ్మకాయ పొట్లములు గాఁచుట లోకప్రసిద్ధము. అట్లే శ్రీరామచంద్ర మూర్తి దేహమునందలి గాయములను తన చనులవేఁడిమిచేఁ గాఁచునట్లు కౌఁగి లించెను.

అత్యంత ప్రేమవశలయిన స్త్రీలు తమప్రేమ నెట్లు చూపఁగలరు? కౌఁగి లించుటచేతనే, కావునఁ గాఁగిలించెను.

రామచంద్రమూర్తిలేని సీత గుహనుండివచ్చినదై రాముని గాఁగిలించె నను టచే హృదయగుహనుండు జీవుఁడు పరతంత్రుఁడై ఆచార్యువలన సర్వస్వామిని దర్శించి దానిచే సర్వవిరోధివర్గము నశింపఁగా నందుండి వెలువడి నిత్యసూరుల గోష్ఠియందుండు స్వామిని దర్శించి తద్భోగపరివాహ మనుభవించు నని ధ్వని. గోవిందరాజీయము. ఆయసక్ = "తేషు యావంత ఏవాజౌ తావాంస్తద్దృశేసతైః" అన్నట్లు తత్కాలమున స్వేచ్ఛగా గ్రహింపఁబడిన పదునాలుగువేల దివ్యమంగళ విగ్రహములు గలవాఁడై యొక్కొక్క రాక్షసునకుఁ బ్రత్యేకముగ నొక్కొక్క రామునిచలెనుండి కానవచ్చిన వానిని (౨) ఇంద్రాదులందఱుఁగలసియు జయింప రాని పదునాలుగువేలరాక్షసులను నవలీలగా నొకటిన్నరముహూర్తము లో జయించి తాను గాయపడక తనయెదుటనున్నవానిని (3) "నాదు జనకుండు మిథిలాధినాథుఁడు రామ। జామాత పురుషవిగ్రహముగొన్న స్త్రీయటంచును దలఁ

పడే"యని యజ్ఞానముచేఁ దాను బరిహసించినవానిని (౪) "ఎన్నఁగరానిబాణముల నేసియుఁ గోసియుఁ బ్రచ్చిత్రుచ్చియుఁ । బన్నుగ శత్రుసంఘముల బాహులఁ గాళుల నూరులందలల్ఁ క్రొన్నగలన్ ధ్వజాగ్రముల గుప్పలుకుప్పలువెట్టి" యన్నట్లు శత్రువుల వధించినవానిని (౫) 'పరిత్రాణాయ సాధూనా' మ్మన్నట్లు తన ప్రతిజ్ఞను బరిపాలింప నవతరించి దుష్టులగు రాక్షసుల సంహరించి సాధువులకు ఋషులకు జగన్మోహన దివ్యమంగళ విగ్రహసాక్షాత్కారముచేఁ బరమానందము కలిగించిన వానిని-కౌఁగిటఁగ్రుచ్చెన్ = ఆయుధములచేనైన గాయములను స్తనముల వేఁడిమిచే పరిహరించుటకై గాఢాలింగనము గావించెను.

క౦. ఉక్కునఁ బేరెక్కిన యా,రక్కసులం ద్రుంచి మౌని♦రాజినుతుం డై
చెక్కుచెమర్పని రాముని, నక్కువలహితాస్య మఱియు♦నక్కున నొత్తెన్.

ఉక్కునన్ = బలమునందు, పేరెక్కిన = ప్రసిద్ధికెక్కిన, చెక్కుచెమర్పని = ఏమియుఘూతపడని, అక్కువలహితాస్య = ఆకలువల మిత్రుఁడైన చంద్రునివంటి ముఖముకలది, అక్కునన్ = ఱొమ్ముచే, కువలము = కువలయము,

మీఁది పద్యమునందలి విశేషమే మఱియుఁ జెప్పుచున్నాఁడు.

తా. బలమునందుఁ బ్రసిద్ధులైన రాక్షసుల వధించి మునీంద్రులచే నుతింపఁబడి ఘూతపడని రామచంద్రమూర్తిని, చంద్రవదనయగు సీత ఱొమ్ముల నొత్తెను.

శ్రుత్వా శ్రీరామవిజయం, పాపబంధాత్ ప్రముచ్యతే ।
తథైవశ్శృంఖలాబంధా, దృణబంధా ద్విముచ్యతే ।
శ్రుత్వా పుష్పవతీ నారీ, తనయం వంశవర్ధనమ్ ।
లభతే రాఘవేంద్రస్య, ప్రసాదా త్కీర్తివర్ధనమ్ ॥ స్కాంద.

శ్రీరామచంద్రమూర్తిజయము విన్నవారు పాపబంధములవలనను కారాగృహబంధంబులవలనను ఋణబాధవలనను, విడువఁబడుదురు. పుష్పవతి యగు స్త్రీ విననేని రామచంద్రమూర్తి యనుగ్రహమువలన వంశోద్ధారకుఁ గొడుకును గనును

శరణాగతిమంత్రవివరణరూపమగు శ్రీరామాయణమునందు నింతవఱకుఁ జెప్పఁబడిన గ్రంథసందర్భముచే ఉత్తరఖండార్థము వివరింపఁబడెను. ఆ మంత్రము నందుఁగల రెండుఖండములలో ననుష్ఠానదశయందు ప్రథమఖండార్థము ముఖ్యము. వ్యుత్పత్తిదశయందు ఉత్తరఖండార్థము ముఖ్యము. ఫలానుసారముగా నుపాయ ప్రవృత్తి కావున వ్యుత్పత్తికలుగుటకై యుత్తరఖండార్థ మింతవఱకుఁగల గ్రంథమునఁ జెప్పఁబడెను. అందు బాలకాండమందు మంత్రమందలి మొదటిమాటకు నర్థమగు పురుషకారయోగము దెలుపఁబడెను. అయోధ్యాకాండమందు రెండవ మాటకు నర్థమైన సౌలభ్యాదిగుణయోగము చెప్పఁబడెను. ఆరణ్యకాండమందు

శూర్పణఖ రాకముందు జరిగిన వృత్తాంతముచే చతుర్థీవిభక్తి ప్రత్యయమైన పదమున కర్థమగు కైంకర్యవృత్తి చెప్పఁబడెను. ఆపిమ్మట ఖరవధాంతవృత్తాంతముచే చరమపదమునకు నర్థమగు విరోధినివృత్తి చెప్పఁబడెను. ఇఁకమీఁద మిగిలిన గ్రంథముచే పూర్వఖండముయొక్క యర్థము చెప్పఁబడును. అది యెట్లనః- అరణ్యకాండశేషముచే విభీషణునికి లభించిన పురుషకారసాన్నిధ్యము చెప్పఁబడును. కిష్కింధాకాండముచే నారాయణపదమునకు నర్థమైన వాత్సల్యము — సుందరాకాండముచే చరణశబ్దముచే చెప్పఁబడిన దివ్యమంగళవిగ్రహముయొక్క విశిష్టత్వము — రాముఁడు కమలపత్రవిశాలలోచనుండు లోనగు వాక్యములచేఁ జెప్పఁబడెను. యుద్ధకాండమందు శరణాగతి చెప్పఁబడెను. ఉత్తరకాండమువలనఁ బ్రపన్నుని చర్య తెలియనగు. దేవతల శరణాగతికి ఫలము రావణవధ. ఇది యంగి. దీని కంగముగా మునుల శరణాగతి దాని ఫలమైన ఖరాదివధ చెప్పఁబడెను. ఇఁక రావణవధకు నిమిత్తమైన సీతాపహరణరూపబీజమును వేయుచున్నాఁడు.

— ♦ ౩౧.వ సర్గము. అకంపనుఁడు రావణునకు ఖరాదివధవృత్తాంతము జెప్పుట ♦ —

సీ. అట నకంపనుఁ డను ♦ నసురుండు వడి జన,స్థానంబునందుండి ♦ తరలి పోయి
లంకాపురముఁ జొచ్చి ♦ లంకేశ్వరునిఁ గాంచి, రాజ! జనస్థాన ♦ రాక్షసాళి
ఖరుఁ డాదిగాఁగ సం ♦ గ్రామవీథిని జంపఁబడిరి నెట్లొట్లొ నేఁ ♦ బ్రాణములను
దక్కించుకొని యీయు ♦ దంతముఁ దెల్పఁగ, వచ్చితి నన దశ ♦ వదనుఁ డదరి

తే. కనుల నిప్పులు రాల నా♦తనికి ననియె, నెవఁడురా యోరి మిక్కిలి♦హృద్యమైన
నాజనస్థానము ను గూల్చి♦నాఁడు నేఁడ, డెట్టిలోకంబునందు వాఁ ♦ డింక బ్రదుకు.

అటన్ = ఇచ్చట, నాశ్రమమందలి సీతారామచర్య దెలిపి ఖరవధానంతరము జనస్థానమున జరిగినవిషయము చెప్పుచున్నాఁడు, అటన్ = జనస్థానమందు, హృద్యము = మనోహరము.

తా. జనస్థానమునుండి యకంపనుఁడను రావణు వేగులవాఁడు శీఘ్రముగ బయలుదేఱిపోయి లంకఁ బ్రవేశించి లంకాధిపతియైన రావణాసురునిజూచి రాజా! జనస్థానమందున్న రాక్షసులు ఖరుఁడు మొదలగు వారందఱు యుద్ధమునఁ జంపఁబడిరి. నే నెట్లొట్లో (స్త్రీవేషము వేసికొని) యతి కష్టముపైన ప్రాణములను దక్కించుకొని యీ వృత్తాంతము నీకుఁ జెప్పవచ్చితిని అని చెప్పఁగా రావణుఁ డదరిపడి కన్నులందు నిప్పులు రాలుచుండ, ఓరీ! నాకు మనోహరమైన జనస్థానమును నేఁడు నాశముచేసినవాఁ డెవఁడురా? వాఁడిఁక నే లోకమందును బ్రదుకురా.

పడితే = శూర్పణఖకంటె వేగముగ, అదియాంచుది. కావున దానికంటె ముందకంపనుఁడు పోఁగల్గెను. వీఁడు ముందుపోవుటకు వేఱొక కారణము గలదు. శూర్పణఖ లంకకుఁబోయి రావణున కీవార్త చెప్పునని అకంపనుఁ డెఱుఁగును. అది ముందుచెప్పినేని వేగులవాఁడనై యుండి యింతకార్యము జరుగఁగానే నాకేల వెంటనే చెప్పలేదని రావణుఁడు వీనిని దండించును. ఆ భయముచే ముందుగ వీఁడు పోయెను. రాజా! రాక్షసరాజా! నీవు రాక్షసులకు రాజవు. రాక్షసులు చచ్చిన నీ వెవరికి రాజవు? కావున నీ రాజత్వము కాపాడుకొన యత్నింపుము. నా రాక్షసరాజత్వమున కేమిరా హానివచ్చెను? జనస్థాన రాక్షసాళి చంపఁబడియె. బలవంతులగు సహాయు లొకరిద్దఱు పోయినను బలము తగ్గుచుండ నిఁక నందఱు జచ్చిన నీవు బలహీనుఁడ వగుట చెప్పవలయునా?

లంకాపురము = లంకానగర మొక్కటియె - దానికిఁ జేరికగాఁ బల్లెలుగాని పట్టణములుగానిలేవు. దానికి ద్వారమువంటిది జనస్థానము. అది చెడుటయనఁగా లంకకోట గవనివాకిండ్లు తెఱచినట్లు. ఉత్తరమునుండి రాజులెవ్వరు లంకమీఁదికి రాకుండునట్లు ఖరాదులు కాపాడుచుండిరి. వారు హతులగుటచే తలుపులు దెఱచిన యింటిలోనికి నెవ్వరైన దూఱినట్లు లంక నెవ్వరైన నాటంకములేక రావచ్చును. ఇట్టిది జనస్థాన మొకటియె కాని పెక్కులులేవు. అది నాశనమగుట యనిన రాక్షసులకు లంకయందుఁదప్ప మఱి యెందును నిలువ నీడలేని దయ్యెనని యర్థము.

రాక్షసాళి చంపఁబడియె = రాక్షసులు చచ్చుచుండిన ఖరాదు లేమి చేయుచుండిరిరా

ఖరదూషణాదిగాఁగ = ఖరుఁడు, దూషణుఁడు, త్రిశిరుఁడు, వీరి మంత్రులు, సైనికులు, అందఱు హతులైరి.

అందఱు చచ్చిన నీవెట్లు వచ్చితివి? స్త్రీ వేషము వేసికొని యెట్లో తప్పించుకొని వచ్చితిని.

“స్త్రీవధంబు శంకచేసినట్టి యమ్మహాత్ముచేత నెమ్మెయినో విడువంగఁ బడుటనోర్తు బ్రదికి యిటకు వచ్చితి” నని శూర్పణఖ చెప్పెను. ఇది గోవిందరాజీయానుసారము. అందొక యాక్షేపము దోఁచెడిని. అకంపనుఁడు యుద్ధభూమియందున్నవాఁడైనచో వీరికి స్త్రీ వేషమునకు గావలసిన చీర, పాపటకొండ తలనిండ వెండ్రుక లివి యెందుండి వచ్చెను? దీనికి సమాధానము కామరూపి కావున నని చెప్పవలయును.

నేను కేవలసాక్షిగాఁ జూచుచుండిన కారణముచే నాకు రామబాణములు తగులలేదని - మహేశ్వరతీర్థీయము - వీఁడు వేగులవాఁడు కావున నిరాయుధుఁడు.

దూరమునుండి యుద్ధము చూచుచుండినవాఁడు. కావునఁ దప్పించుకొనఁ గలిగెను. ఏఁడు రామచంద్రమూర్తియందు ప్రతికూలభావము లేనివాఁడు. రామచంద్రమూర్తి యుద్ధము చేయువిధము చూచి యిది యమానుషచర్యయని యనుకూలభావమునుగలవాఁడుగానుండవలెను. కావుననే వీనికి భగవజ్ఞానము లభించినది

ఉ. నా కపకార మేదియు నొ ♦ నర్చి సుఖంపడ లేరు దిక్కు మా
నాకపదండపాణులును ♦ యక్షపవిష్ణులు, దండి దండితో
పీకునఁ జేయుదుర్ దహను ♦ వేఁడిమి దగ్ధ మొనర్చు మృత్యువున్
జోక వధించెదం బవన ♦ మూర్ఖులఁ గట్టెదఁ గాలఁ బెట్టెదన్. ౭౨౮

నాకప + దండపాణులును = ఇంద్రుఁడు, యముఁడు, యక్షపవిష్ణులు = కుబేర విష్ణువులు, ఇచ్చటి విష్ణుశబ్దము వరుణుని బోధించుచున్నది. ఏలన నాలుగు దిక్కుల యధిపతులఁ జెప్పుచు ఇంద్రుఁడు, యముఁడు, కుబేరుఁడు, విష్ణువని చెప్పునపుడు వరుణునిగదా గ్రహింపవలెను. అదియునుగాక “ఇమం మే వరుణ శ్రుధీహవ” యను మంత్రమును విశ్వామిత్రుఁడు శునశ్శేపున కుపదేశించెను. శునశ్శేపోహ్యహ్వ ద్గృభీతస్త్రిష్వాదిత్యం ద్రుపదేషుబద్ధః అవైనంరాజా వరుణః ససృజ్యాద్విద్వాగ్ అదబ్ధో విము మోక్తు పాశాన్ అని చెప్పఁబడెను.

ఇట్లు ఇంద్రుని వరుణుని నుపాసింపుమని విశ్వామిత్రుఁడు చెప్పఁగా శునశ్శేపుఁడు ఇంద్రుని నింద్రానుజుని (ఉపేంద్రుని) ధ్యానించి వారిచే బంధముక్తుఁడయ్యెనని రామాయణమునఁ జెప్పఁబడెను. అదియునుగాక విష్ణువరుణ శబ్దములు సమానార్థకములు; వరుణ మనఁగా ఆవరణము. వరుణుఁ డనఁగా నావరించి యుండువాఁడు. సర్వవ్యాపియని యర్థము. విష్ణుశబ్దార్థ మిదియే కదా. కావున నిచట విష్ణు శబ్దమునకు వరుణుఁడని యర్థము గ్రాహ్యము. ఇట్లులే మహాదేవ శబ్దము ఇంద్రపర్యాయముగ వాల్మీకి యుపయోగించెను. అరణ్య ౭ సర్గ ౧౧ శ్లోకము - దేవరాజ శ్శతక్రతుః, ఉపాగమ్యచ మాం దేవో మహాదేవస్సురేశ్వరః॥ అని కలదు. ‘అత్ర పూర్వం మహాదేవ’ యని సముద్రపర్యాయమునఁ బ్రయోగింపఁబడెను. కావునఁ బ్రకరణానుసారముగఁ బూర్వోత్తర సందర్భము లాలోచించి యర్థము చెప్ప టొప్పు. అర్థాత్ప్రకరణాల్లింగా దౌచిత్యా దర్థనిర్ణయః, అని కదా యర్థనిర్ణయమం దాలోచింపవలసిన విషయములు. వాల్మీకి యమరకోశము చూచి పదములు ప్రయోగింప లేదు. పీకునన్ = పరాక్రమముచే, కాలఁబెట్టెదను = నేలఁబెట్టి కాలరాచెదను.

తా. దిక్పాలురైన యింద్ర యమ వరుణ కుబేరులు నా కేకొంచె మపకారము చేసినను సుఖముగ నుండఁజాలరు. దండము ధరించి యముఁడు వచ్చి

నను దండించెదను. దహనుని దహించెదను. మృత్యువునకు నేనే మృత్యువ నయ్యెదను. సూర్యచంద్రులను నేలఁబెట్టి కాలరాచెదను.

చ. అనిన నకంపనుండు భయ♦మంది విభూ! యభయం బొసంగ దే
నిని నిజముగన్ వచింతు నన♦నీ కభయం బిడినాఁడఁ జెప్పుమీ
మనమునఁ గొంక కెల్ల నన♦మానవభోజననాథుతో నకం
పనుఁ డనియెం గరద్వయము♦భక్తిభయంబుల మోడ్చి యాగతిన్. ౪౭౭

కరద్వయము = రెండు చేతులు, మోడ్చి = ముకుళించి.

తా. రావణుఁ డిట్లు పలుకఁగా నకంపనుఁడు చెడ్డవార్త చెప్పిన నన్నేమి చేయునో యని భయపడి చెప్పక విధిలేకుండుటచే నిట్లనియె. "ప్రభూ! నీకు భయము లేదు. నిన్నేమియు ననను. నిజము చెప్పు"మని యభయ మిచ్చెదవేని యున్నదున్నట్లు చెప్పెదను. అనిన 'నీ కభయమిచ్చితిని. సందేహము లేక వాస్తవము చెప్పుము." అనిన రెండు చేతులు జోడించి భయభక్తులతో నకంపనుఁ డిట్లనియె.

ఉ. మానితవృత్తబాహుఁ డస♦మానబలుండు వృషాంసుఁ డిందుతు
ల్యాననబింబుఁడున్ దశర♦థాత్మజుఁ డుత్తమకీర్తి బాణకీ
లానలమూర్తి రాముఁ డప♦రాజితవిక్రముఁ డాతఁడే జన
స్థానముఁ బాడుచేసెను వె♦సన్ ఖరదూషణసంయుతంబుగన్. ౪౭౮

మానితవృత్తబాహుఁడు = గౌరవయోగ్యమైన గుండ్రమగు బాహువులు కలవాఁడు, వృష + అంసుఁడు = ఆఁబోతు మూఁపురములవంటి మూఁపురములు గలవాఁడు, ఇందుతుల్య = చంద్రునితో సమానమైన, ఆననబింబుఁడు = ముఖబింబము గలవాఁడు, బాణకీలానలమూర్తి = బాణములనెడి జ్వాలలు గల యగ్నిహోత్రుఁడు, అపరాజితవిక్రముఁడు = పరాజయములేని పరాక్రముఁడు, విష్ణుపరాక్రమమువంటి పరాక్రమము గలవాఁడు. అపరాజితౌ, హరీశౌ, నానా ||౪|| అతఁడే = అతఁడొక్కఁడే—ఇతర సాహాయ్యము లేక.

తా. గౌరవింపఁదగిన గుండ్రని బాహువులు గలవాఁడు, సమానములేని బలము గలవాఁడు, ఆఁబోతు మూఁపురములవలె నెత్తైన మూఁపురములు గలవాఁడు, చంద్రబింబమువంటి ముఖము గలవాఁడు, దశరథమహారాజు కుమారుఁడు, మంచి కీర్తి గలవాఁడు, బాణములనెడి జ్వాలలుగల యగ్నిహోత్రుఁడు, పరాజయమెఱుఁగని పరాక్రమము గలవాఁడు, అతఁడొక్కఁడే ఖరదూషణాదులతోడ మిక్కిలి వేగముగ జనస్థానము నాశముచేసెను.

కం. అన విని పెనుఁబా మన న,ద్దనుజవరుఁడు రోఁజుచున్ యథాస్థితి చెపుమా
చనుదెంచెనో యింద్రామర,జనయుతుఁడై యటకు రామ♦చంద్రుం డనినన్.

రోఁజుచున్ = బుసగొట్టుచు, ఇంద్రామరజనయుతుఁడై = ఇంద్రుఁడు మొదలగు దేవతలతోఁ గూడి.

తా. అది చెప్పఁగా విని రావణాసురుఁడు పెద్ద పామువలె శ్వాసము విడుచుచు నోరీ నిజము చెప్పుము. రామచంద్రుఁడు యుద్ధమునకు నింద్రాదులను దోడు తెచ్చుకొని వచ్చెనా ? నీవు చెప్పినది యొంటరివానికి సాధ్యమగు పనికాదు. కావున నెవరి తోడు తెచ్చుకొనె నని భావము.

—♦ అకంపనుఁడు రావణునకు శ్రీరామపరాక్రమంబు వర్ణించి చెప్పుట. ♦—

కం. తెలుపుమనుచు రావణుతోఁ, బలికె నకంపనుఁడు రామ♦భద్రుని తేజో
బలవిక్రమవిధ మంతయుఁ, గలది గలట్టుగను వీత♦గర్వుం డగుచున్. ౪౮౦

తేజోబలవిక్రమవిధము = తేజము, బలము, పరాక్రమము, వీనితీరు. వీతగర్వుఁడు = గర్వము లేనివాఁడు.

తా. చెప్పుమని రావణుఁ డడుగఁగా నకంపనుఁడు రామచంద్రమూర్తి యొక్క తేజస్సు, బలము, పరాక్రమము వీనిని గర్వము విడిచి యున్నదున్నట్లు లిట్టు లనెను.

తే. విల్లు పట్టెడివారిలో♦ నెల్లమేటి, బహుళదివ్యాస్త్రసుగుణసం♦పన్నవర్యుఁ
డాహవమునఁ బురందరునంతివాఁడు, రామనాముఁడు దివ్యప♦రాక్రముండు.

బహుళ = అనేకములైన, దివ్యాస్త్రములు, సుగుణములు వీని సంపత్తి గలవారిలో శ్రేష్ఠుఁడు, ఆహవమునన్ = యుద్ధమందు, పురందరునంతవాఁడు = ఇంద్రునితో సమానుఁడు, దివ్యపరాక్రముండు = దేవతల పరాక్రమమువంటి పరాక్రమము గలవాఁడు.

తా. రాముఁ డను పేరు గలవాఁడు. విల్లాయుధములు ధరించువారిలో నెల్ల గొప్పవాఁడు. అనేక దివ్యాస్త్రములు సుగుణసంపత్తి గలవాఁడు. యుద్ధమునందు నింద్రునితో సమానుఁడు. దేవతల పరాక్రమమువంటి పరాక్రమము గలవాఁడు.

ఉ. ఆలనిసోదరుండు తన♦యన్నకుఁ దుల్యుఁడు శక్తి, దుందుభి
స్నిగ్ధతరవుండు రక్తనర♦సీరుహనేత్రుఁడు లక్ష్మణుండు సిం
హతముఖుండు, నన్నకును♦సంతతము సంగడుఁడూర్చు నగ్నికి
న్వాతముఁబోలి, రాముబల♦సం జెడియెన్ మనపట్టు దండకన్. ౪౮౧

తుల్యుఁడు = సమానుఁడు, దుందుభిస్నిగ్ధతరవుండు = భేరిధ్వనివంటి గొప్పకంఠ

ధ్వనిగలవాఁడు, రక్తసరసీరుహనేత్రుఁడు = ఎఱ్ఱకమలమువంటి కన్నులు గలవాఁడు, కంజాతముఖుఁడు = కమలమువంటి ముఖము గలవాఁడు.

తా. ఆ రామునకుఁ దమ్ముఁడొకఁడు గలఁడు. వాఁడు శక్తియందు నన్నకు సమానుఁడు. ఎఱ్ఱతామరవంటి కన్నులు గలవాఁడు. ఆయనపేరు లక్ష్మణుఁడు. కమలమువంటి ముఖము గలవాఁడు. ఎల్లప్పు డన్నకు నగ్నికి వాయువువలె ననుకూలుఁడు. అయినను ఈయన యుద్ధమందు లేఁడు. ఒక రామునివలననే దండకయందు మనయునికిట్లు పాడయ్యెను.

ఉ. ఆ రనిఁ దోడు దేవతలు ♦ రాఁడు బలారియు, రాముఁ డొక్కఁడే
క్రూరనిశాతబాణములఁ ♦ గూల్చెను రాక్షసకోటి నెల్ల, బం
గారపుఁబింజకూపులు తె ♦ గన్ విడి వెల్వడి పంచవక్త్రయు
క్తోరగపంక్తు లౌచు నసు ♦ రోత్తములన్ గబళించె నాజిలోన్. ౮౮౩

అనిన్ = యుద్ధమందు, తోడు = సహాయము, బలారి = ఇంద్రుఁడు, బంగారపుఁ బింజకూపులు = బంగారు పిడులుగల బాణములు, తెగన్ = అల్లెత్రాటిని, విడి = విడిచి, పంచవక్త్ర = అయిదు తలలతో, యుక్త = కూడిన, ఉరగ = పాముల, పంక్తులు = వరుసలు, కబళించెన్ = మ్రింగెను, ఆజిలోన్ = యుద్ధమందు.

తా. నీవు సందేహించినట్లును రామచంద్రునకు దేవతలు సాహాయ్యము చేయలేదు. ఇంద్రుఁడును రాలేదు. రామచంద్రమూర్తి యొక్కఁడే పదునైన బాణములే యాయుధములుగాఁ గొని రాక్షససమూహమునంతయు వధించెను. ఆ బాణములను నాయన ప్రయోగించుటయు లేదు. బంగారుపిడులు గల యా బాణములు తమంతటఁ దామె యల్లెత్రాటినుండి బయలుదేఱి యైదుతలల పాములై యుద్ధమందు రాక్షసుల నెల్ల మ్రింగెను.

కం. ఏయే తెఱఁగుల దిగులున, నేయే తెరువులను బోవు ♦ నెల్లపగఱ క
య్యాయి తెఱంగుల మఱి నా, యాయిపథంబులను దోఁచు ♦ నని రాముండున్.

తా. ఏయేవిధముల యేయేమార్గములందు రాక్షసులు భయపడిపోవుదురో యాయావిధముల నాయామార్గముల శత్రువుల కందఱకు రామచంద్రుఁడు యుద్ధమందుఁ గానవచ్చుచుండెను.

ఇచ్చటఁ గొందఱు రామచంద్రమూర్తి పెక్కు రూపముల ధరించి రాక్షసులకుఁ గానవచ్చినట్లు చెప్పెదరు. కొఱవి త్రిప్పినప్పుడు నిప్పొక చోటనున్నను అన్నిచోటుల నున్నట్లు కానవచ్చిన విధముగా నత్యంత గమనవేగముచే నట్లందఱ కన్నిచోటులఁ గానవచ్చెను. మూలబలయుద్ధమునందు నిట్టులే వర్తించెను. ఇది యింద్ర

జాలము గాదు యోగవిద్యకాదు. అద్భుతగమనశక్తి, దిగులున నను విశేషణ సామర్థ్యముచే రామదర్శనమునకు భయము కారణమని గోవిందరాజీయము. కంసు నకు సర్వత్ర కృష్ణదర్శనమునకు భయమే కదా కారణము.

ఏయే తెఱఁగుల నేయే తెరువుల, భయపడిన రాక్షసులు రాక్షసస్వరూప మును దాఁచుట కేయే రూపము లెత్తుదురో వారివారికి నెదుట రామచంద్రుఁడే కానవచ్చెను. ఎవరేయే వస్తువుల చాటున దాఁచుకొనఁబోవుదురో వారివారి కా యావస్తువు లందు రామచంద్రమూర్తి కానవచ్చుచుండెను. ఆవస్తువులే రామ చంద్రమూర్తిగాఁ గానవచ్చెను. ఏయే తెరువుల నెవరెవరు స్వరక్షణార్థము పోదురో వారివారి కాయా మార్గములం దెదుట రామమూర్తియే కానవచ్చెను. దీనిచే ప్రతి రాక్షసుని యెదుట "స్వేచ్ఛా గృహీత" దేహములతో రామమూర్తి కానవచ్చెను. మహేశ్వరతీర్థీయము. తనిశ్లోకి.

కం. ఈ నెఱిఁ బాడయ్యె జన,స్థానం బన నాలకించి ♦ దశవదనుఁడు రో
షాననమున నని నరిగెద, నేనిదె మానవులఁ బట్టి ♦ హింసింపంగన్. ౪౮౫

ఈ నెఱిన్ = ఈ విధముగ, ఆలకించి = విని, దశవదనుఁడు = రావణుఁడు, రోష + ఆననమునన్ = కోపముతోడ నెఱ్ఱనైన ముఖముతో.

తా. ఈ విధముగ జనస్థానమంతయుఁ బాడయ్యెను అని యకంపనుఁడు చెప్పఁగా విని రావణుఁడు ముఖ మెఱ్ఱచేసి యిదిగో యిప్పుడే యా మనుష్యులను జంప బయలుదేఱెదను.

చం. అనిన నకంపనుం డనియె ♦ నాస్పృపువిశ్రుతవిక్రమంబులన్
విను మనుజేంద్ర! కింక గొన ♦ నేని యసాధ్యుఁడు, నిండువెల్లినేన్
ఘనతరబాణపంక్తి నరి ♦ కట్టు, సతారము సగ్రహంబు నా
ఘనపదమున్ శరంబులఁ బగిల్చుఁ జుమీ రఘురాముఁ డుద్ధతిన్. ౪౮౬

విశ్రుత = ప్రసిద్ధమైన, కింక = కోపము, ఇందలి పూర్ణబిందువు కినుక యందలి నువర్ణస్థానమున వచ్చినదిగాదు. కినుక = కినుక యగునుగాని కింక కాదు. ఇక్కడఁ గింక యనఁగా మితిమీఱిన కోపమని గ్రహింపవలెను. అసాధ్యుఁడు = గెలువరానివాఁడు, వీరికివారికని వ్యవస్థ చెప్పకుండుటచే నీకే కాదు బ్రహ్మ రుద్రేంద్రాదులకైన నసాధ్యుఁడని భావము (తీర్థీయము) నిండువెల్లినేన్ = పూర్ణ ప్రవాహమునైనను, అరికట్టున్ = అడ్డగించును, ఘనపదమున్ = ఆకాశమును.

తా. రావణుఁ డిట్లు చెప్పఁగా రామచంద్రుని బలపరాక్రమంబులను వివ రించి యకంపనుఁడు చెప్పుచున్నాఁడు. రాక్షసరాజా! నీ వాయనమీఁదికి యుద్ధము

నకుఁ బోయిన మేలు లేదు. ఆయనకుఁ గోపము వచ్చెనా నీవే కాదు. బ్రహ్మేంద్రాదులును ఆయనను గెలువలేరు. పొంగి పొరలివచ్చిన సంపూర్ణప్రవాహము నైనను బాణములచే రాకుండ నిలుపఁగలఁడు. గ్రహములతో నక్షత్రములతోఁ గూడిన యాకాశమునైనను బాణములచేఁ జీల్చఁగలఁడు.

విశ్రుతవిక్రమంబులన్ = (1) అతిమానుషకర్మములను. (2) ఇతిహాస పురాణములందుఁ బ్రసిద్ధమైన యతని చర్యలను; విక్రమము = పరుల నాశ్రయించి లోపరచుకొను సామర్థ్యము — ఇది త్రివిక్రమావతారమును సూచించుచున్నది; విక్రమంబు = విక్రమము చూపఁ బ్రారంభించెనా నివారింప సాధ్యము కాని వాఁడు, నిండువెల్లి నరికట్టు ననుటచే రాఁగల కృష్ణావతారమో గడచిన కృష్టావతారమో సూచితము. భయానకావర్తశతాకులనదీ మార్గందదాసింధు రిహ శ్రియఃపతే — యని భాగవతము. ఇది మత్స్యావతారమును సూచించునని కొందఱు. తారలు, అశ్విని మొదలుగాఁగల యిరువదియేడు నక్షత్రములు, గ్రహములు, సూర్యాదులు, ఘనపదము ఆకాశ మనుటచే నది యధిష్ఠానముగాఁ గల యండకోశమని యర్థము. వగల్చున్ = దీనిచేఁ ద్రివిక్రమావతారమునఁ జేసిన కార్యము సూచితము. "యోఅస్యభాయదుత్తరగ్ం సదస్థం విచక్రమాణ స్త్రేధోరుగాయ" యని శ్రుతి. గోవిందరాజ తీర్థీయము.

"విక్రమంబుల న్వామనసురేంద్ర కింకగోనినేసి" యను వో నిత్యయతి యని యప్పకవి — ఇది యుభయ యతులలోఁ జేరినది – వాస్తవార్థమున నిది యఖండ యతియే.

శా. శ్రీమంతుం డతఁ డుద్ధరింపఁగలఁ డుర్విన్, లీలఁ గూపార వే
లామర్యాద నడంచి యంబునిధి కీలాలంబులన్ వే జగ
త్స్తోమం బెల్లను ముంపఁజాలు గురుశక్తుం, డంబురాశిత్రయం
బామూలంబు హరించు, మారుతము నేనాఁకట్టు బాణంబులన్. ౪౮౭

శ్రీమంతుఁడు = ఆయన కెట్టి లీశక్తి గలిగెనందువేని యాయన శ్రీమంతుఁడు — అడవులలో కూటికి గుడ్డకు లేక తిరుగువాఁడు, ధనసంపన్నుఁ డనరాదు. లక్ష్మీదేవియుక్తుఁడనియే చెప్పవలెను. ఇచట మతుప్రత్యయము నిత్యయోగమును దెలుపును. భూమనిందా ప్రశంసాసు, నిత్యయోగేతిశాయనే సంబంధేస్తి వివక్షాయాం భవంతి మతు బాదయ — సిద్ధాంతకౌముది. సర్వదా శ్రీతోఁ గూడి యుండువాఁడని యర్థము. 'విష్ణోరేషానపాయినీ' యని వి. పు. శ్రీమంతుఁడు గనుకనే యింతటి శక్తిసంపన్నుఁడు. ఆ శ్రీ లేదాయెనా నిర్వ్యాపారుఁడే. ఈ విషయమునే, అప్రమేయంహి తత్తేజో యస్య సా జానకాత్మజా - సీతాదేవి యెవనిదో

వాని తేజ మప్రమేయము అను మారీచవాక్యము స్మరణీయము. ఉర్వీం = భూమిని, ఉద్ధరింపఁగలఁడు = సముద్రములో మునుఁగు భూమిని నెత్తఁగలఁడు. ఇది వరాహావతారమును సూచించుచున్నది. 'తాం వరాహో భూత్వాహర' త్తని శ్రుతి. కూపార = సముద్రముయొక్క, అకూపారశ్చ కూపారో యని ద్విరూపకోశము. వేలామర్యాద = చెలియలికట్ట దాఁటి రారాదను నియమము, కీలాలంబులం = నీటియందు, జగత్సర్వంబెల్లను = సమస్త ప్రపంచంబును, గురుశక్తుఁడు = గొప్ప శక్తి గలవాఁడు, ఉర్వీం = అనఁగా భూమియం దలి జనుల నని గ్రహింపవలెను. శ్రీమంతుఁడు కావున సంసారసాగరమున మునిఁగిన జనుల నుద్ధరించుననుటచే లక్ష్మీపురుషకారమువలననే జను లుద్ధరింపఁబడుదురని సూచితము. కావున దేవీయుక్తుఁడైన భగవంతుఁడే సేవ్యుఁడు - శ్రీమంతుఁ డుర్వి నుద్ధరించుననుటచే శ్రీదేవికి భూదేవికి సవతిమచ్చరము లేదని యెఱుఁగవలయు. శ్రీయంశమే భూమి.

సీతావిశిష్టుఁడగు రామచంద్రమూర్తి భూమిమీఁదఁ బుట్టి సంసారసాగరమున మునిఁగినవారి నుద్ధరించుననుటచే నాయన పరాత్పరుఁడని యాయన మోక్షప్రదానసామర్థ్యము చెప్పఁబడెను.

జగత్సర్వం బెల్లను కీలాలంబులం ముంపఁజాలు ననుటచే జగత్సంహారశక్తియుఁ జెప్పఁబడెను. సంహారకారణముకూడ శ్రీరాముఁడే యని తీర్థము. ఇందు సంకర్షణావతారమును సూచించునని. గో॥రా॥

గురుశక్తుఁడు = పరాస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞాన బల క్రియాచ॥ ఈయన పరశక్తియే యనేకవిధములు ప్రసిద్ధిచెందినది. అవి యేవన, స్వభావసిద్ధములైన జ్ఞానము బలము క్రియ మొదలయినవి. అంబురాశిస్త్రయము = సముద్రగర్వము, ఆమూలము = మూలముట్టుగ, హరింపంజాలు ననుటచే రామచంద్రమూర్తి చేయఁబోవు సేతుబంధనకార్యము సూచింపఁబడియె. మారుతము నేఁ = వాయువునైనను, ఆఁకట్టు = అడ్డగించును, ఆఁగు + కట్టు = ఆఁకట్టు, ఇచ్చట మారుత మనునది అన్నిభూతముల కుపలక్షణము. పృథివ్యప్సుప్రలీయతే ఆప స్తేజసి లీయంతే యని చెప్పిన క్రమప్రకారము ప్రళయము చేయఁగలఁడని భావము.

ఎల్లలోకసికరముఁ హరించి యని క్రిందిపద్యమునఁ జెప్పఁబడుటచే నిచట సంహారక్రమమే గ్రాహ్యము.

తా. శ్రీమంతుఁడగు రామచంద్రమూర్తి భూమిని నుద్ధరింపఁగలఁడు. అవలీలగ సముద్రము చెలియలికట్ట దాఁటి రారాదను నియమము నణఁచి భూమి నంతయు సముద్రములో ముంపఁగల శక్తిగలవాఁడు. సముద్రగర్వమును మొదలు

ముట్ట నాశము చేయ గలఁడు. బాణములచే వాయువునైనను పడఁగొట్టఁ గలఁడు.

చం ఘనతరవిక్రమంబునను ♦ గాఢమహాయశుఁ డాతఁ డెల్లలో
కనికరముఁ గా హరించియును ♦ క్రమ్మర సృష్టి యొనర్పఁ జాలు, నా
మనుజవృగేంద్రుఁ డీప్రజల ♦ మానుగ నట్టులె చేయు, నీకు నా
మనుజవరుం డసాధ్యుఁ డని ♦ మన్మత మియ్యది పంక్తికంధరా! ౪౮౮

ఘనతరవిక్రమంబునను = మిగుల గొప్పది యగు పరాక్రమముచే, గాఢమహాయశుఁడు = అధికమైన గొప్ప కీర్తి గలవాఁడు, ఎల్లలోకనికరముఁ గా = సమస్తములైన లోకముల సమూహమును, మన్మతము = నా యభిప్రాయము, పంక్తికంధరా = పదితలలు గలవాఁడా, ప్రజలఁ గా = మనుష్యులను, ప్రజాస్యాత్సంతతే జనే. అమరకోశము, అథ ప్రజానామధిపప్రభాతః రుపు.

తా. అధికమైన పరాక్రమముచే విశేషకీర్తిమంతుఁడైన రామచంద్రుఁడు సమస్త లోకములను సంహరించి మరల సృష్టింపఁగలఁడు. ఈ ప్రజల నట్టులే చేయఁగలఁడు, రామచంద్రమూర్తి నీకు గెలువ సాధ్యముకాని వాఁడని నాయభిప్రాయము.

విక్రమంబునను = సంకల్పమాత్రముచే, "నారాయణో కామయత" – "ఇచ్ఛామాత్రప్రభోస్సృష్టి" ఇత్యాదులు, మహాయశుఁడు = షడ్గుణైశ్వర్యవంతుఁడని ప్రసిద్ధిగన్నవాఁడు, ఎల్లలోకనికరముఁ గా = ఇట్లనుటచే నండములలోఁ గూడిన సమస్త లోకములు సూచితము. క్రమ్మర సృష్టి యొనర్పఁజాలు = ఇట్లు చెప్పుటచే పూర్వకల్పాంతమున సంహరించిన యీతనయే మరల సృష్టియుఁ గావించెను. ఈ రెండు కార్యములు చేసినవాఁడొకఁడేయని సూచితము ఈ విధముగ సృష్టి స్థితి సంహారములకు మూఁటికిఁ గర్త రామచంద్రమూర్తియే యని చెప్పఁబడెను. ఇవియే కదా పరబ్రహ్మ లక్షణములు — ఓయి.

"ఏకోహవై నారాయణ ఆసీత్, న బ్రహ్మ నేశానో, నాపో, నాగ్నిషోమౌ, నేమేద్యావా పృథివీ, ననక్షత్రాణి ననార్యో నచంద్రమా స్స ఏకాకీ నరమేత", మహోపనిషత్తు.

నారాయణుఁ డొక్కఁడే యుండెను, బ్రహ్మలేఁడు, శివుఁడు లేఁడు. జలములు లేవు. అగ్ని సోముఁడు లేరు. ఈ భూమి, యాకాశము లేదు. నక్షత్రములు లేవు. సూర్యుఁడు లేఁడు. చంద్రుఁడు లేఁడు. ఆయన యొక్కఁడే క్రీడింపలేనివాఁడయ్యెను.

అని యీ ప్రకారము జగత్సృష్టి సంహారకత్వములు నారాయణు కృత్యము లని యుపనిషత్తులు చెప్పుచుండ నీవు రామచంద్రమూర్తి యనియెదవే

యది యెట్లనిన - ఆ నరసింహమూర్తియే యీయన 'రావణుఁ జంప దేవతా బృందకృతిక సనాతనుఁడు విష్ణువుదోఁచె ధరిక నరాకృతిక' అనుటచే (అయో-౭) నారాయణుఁడే యీ రామచంద్రమూర్తిగాని తద్భిన్నుఁడు గాఁడు. లోకనికర మని సముదాయముగఁ జెప్పుటచే తమస్సు మొదలుపృథివివఱకు నానా వికార ములు పొందిన ప్రకృతియనియుఁ బ్రజల నను బహువచనప్రయోగముచే (ప+జ) జీవాత్మలనియు గ్రాహ్యము. జీవప్రకృతులు నిత్యములైయుండ వానికి సృష్టి చెప్పవచ్చునా యందువేని సృష్టి శబ్దమునకు విడుచుట యని యర్థముగాని లేనిది నూతనముగాఁ గల్పించుట యనికాదు. కావున హరించుట యనఁగా లోప లికిఁ దీసికొనుటయనియు, సృష్టి యనఁగా వెలుపలికి విడుచుట యనియు గ్రహింప వలయును. ఇచ్చటఁ జెప్పఁబడిన జీవాత్మలు ప్రకృతిలో లీనమై యుండినవి యని గ్రహింపనగు. మనుజవరుండు=పురుషోత్తముఁడు = పురుషులకంటె (క్షరాక్షరముల కంటె) నుత్తముఁడు. పురుషోత్తముఁ డన్నట్లు మనుజులకంటె శ్రేష్ఠుఁడు మనుజ వరుఁడు. వరశబ్దమునకు శ్రేష్ఠుఁడని యర్థము.

మత్ + మతము=నా యభిప్రాయము ఆయనపరాక్రమమును గన్నులారఁ జూచిన నాయభిప్రాయము.

మన్మతము =(1) నేను రాక్షసజాతిలోఁ జేరినను పూర్వజన్మకృత సుకృత పరిపాకవశమున శ్రీరామమహత్త్వవిషయజ్ఞానము గలిగిన నాయభిప్రాయము.

నీవో 'ఆసురంయోని మాపన్నా మూఢా జన్మని జన్మని.' యన్నట్లు పాప వశమున నాసురప్రకృతిగల మూఢుఁడవు. నీ వసురుఁడవు కావున (అసు + ర) ప్రాణహింస చేయు టొక్కటే యెఱిఁగినవాఁడవు. కావున నీ వాయనమహిమ యెఱుఁగఁజాలవు. 'మాంసము నమలెడి దుష్టనృశంసులు కానంగలేరు ధర్మ' మన్నట్లు హింసాలోలురైన క్రూరులకు రామతత్త్వ మెట్లు తెలియఁగలదు? (2) సనత్కుమారాదులు చెప్పిన యితిహాస శ్రవణాదుల వలనఁ గలిగిన రామ పరత్వ జ్ఞానము గలిగిన నాయొక్క; వేగులవాఁడగుటచే మాఱువేషములతో ఋషుల యాశ్రమములకుఁ బోయి వారువారు చెప్పు తత్త్వజ్ఞానము వినికిడిగలవాఁడు. (3) మాల్యవంతుఁడు మొదలగువారు చెప్పిన మాలి - సుమాలి వధాది వృత్తాంత శ్రవణమువలన వాస్తవ విషయ మెఱిఁగిన నాయొక్క (4) విశ్వరూప దర్శనము వలెఁ బదునాలుగువేల రాక్షసుల యుద్ధమందు ప్రతి రాక్షసునకు రామ విగ్రహ భేదాది ప్రతిపత్తి గల నాకు-యుద్ధమందలి రాక్షసుఁ డొక్క రామునే చూడఁ గలిగెను. నేనో యొక్కొక్క రాక్షసుని యెదుట నొక్కొక్క రాముని చొప్పున ననేకరాముల నేకకాలమందుఁ జూచితిని. అట్టి నాయొక్క యభిప్రాయము, అటు

గాదేని యకంపనుని నెపమున ఋషియే రామపరత్వము స్తుతించెనని యెఱుఁగ నగు. గోవిందరాజీయము. ఈ వ్యాఖ్యాత యభిప్రాయ మేమన:- అకంపనుఁడు తనకుఁ బ్రతికూలుఁడుగాక యేమి జరుగునో చూతమని సాక్షిగా వచ్చినవాఁడగుటచేఁ దనమహిమఁ జూచి యబ్బురపోయిన వీనిచేత వాస్తవ విషయము రావణునకుఁ జెప్పించిన నిఁకనైన వాఁడు మేలుకొని తన కనుకూలుఁడై ప్రవర్తించును గాక యని రావణు మేలుకోరి వీని కిట్టి జ్ఞానమును రామచంద్రమూర్తియే యనుగ్రహించెను అని.

పంక్తికంధరా=రాముఁ డొక్క తల గలవాఁడు. నేను బదితలలు గలవాఁడ నని గర్వపడెదవేమో. సహస్రశీర్షా యని చెప్పినట్లు రామలక్ష్మణు లిరువురు వేయేసి తలలుగలవారు (ఆదిశేషుఁ డగుటచే లక్ష్మణునకు వేయి తలలని యెఱుఁగ నగు) కంధర శబ్దమునకు మేఘ మనియు నర్థము. కావున వారు గట్టిగ శ్వాస విడిచిరేని యీ వాయువునకు మేఘమువలె నీ వెక్కడ నెగిరిపోదువో; ఎదుట నిలువనైన నిలువఁగలవా? ఇఁక యుద్ధమేమి చేయఁగలవు? అల్పశక్తి గల నీవు అనంతశక్తుఁడగు వానితో నెట్లు యుద్ధము చేయఁగలవు? ఆయన మనుజవరుఁడు. నీకు మనుజులచేఁ జావకుండ వరము లేదుగదా కావున నీపాలిటి మృత్యుదేవతయే.

ఉ. ఈ వొకఁడంచుఁ బల్క నది • యేటికి లోకమునందుఁ గల్గు ర
క్షోవరలోక మంతయును • గూడియు నాతని డాయలేదు పా
పావహకర్మశాలి దివి • జాలయముం జొర నేరనట్టు; లా
భూవిభుఁ జంపుయుక్తిఁ బరి • పూర్ణమనంబున విన్ము చెప్పెదన్. ౪౮౯

రక్షోవరలోకము = రాక్షసశ్రేష్ఠులు, నముచి హిరణ్యకశిపు శంబర, బలి మొదలగువారలు, అంతయు = అందఱుకలిసి యొక్కటిగఁ జేరియు, డాయలేదు = సమీపింపనైనఁ జాలదు. ఇఁక నీ వొక్కఁడ వేమి చేయఁగలవు? సమష్ట్యర్థమున నేకవచనప్రయోగము. లేదు అనునది యసమర్థకద్యోతకము. అచేతనము లెన్నియైన నొక చేతనమునకు సరి రాఁగలవు! అని భావము. పాపావహకర్మశాలి= పాపము గలిగించు కార్యములు చేయువారి సమూహము, దివిజాలయమున్ = స్వర్గమును.

తా. రామచంద్రమూర్తిని గెలువలేనివాఁడవు నీ వొకఁడవే కాదు. లోకమునఁ గలుగు రాక్షసశ్రేష్ఠు లందఱును మనుష్యులును అందఱు నేకమైనను ఆయన సమీపమునకునైనఁ బోలేరు. ఆయన యొకఁడు; మే మిందఱము చేరిన నేల యాయనను గెలువలే మందువేమో — ఎందరు పాపాత్ములు గుమిచేరినను స్వర్గమునకుఁ బోఁగలరా? పాపాత్ములకు స్వర్గప్రాప్తి లేనట్లు పాపాత్ముఁడవైన నీకు

రామ సాలోక్యప్రాప్తియు లేదని భావము. కావున రామచంద్రమూర్తిని నీవు చంపఁదలఁచిన (చచ్చినవానితో సమానునిఁగఁ జేయఁదలఁచిన) నే నొక యుపాయము చెప్పెదను. ఏకాగ్రచిత్తముతో వినుము.

{అకంపనుఁడు రావణునితో సీతాపహరణము శ్రీరామవధోపాయంబుగఁ జెప్పుట}

ఉ. ఏమని చెప్పువాఁడ నసురేంద్ర! రఘూత్తముభార్య సీత నా
భామ త్రిలోకసుందరి యిభప్రతిమానసుయాన యౌవనో
ద్దామ నితంబినీమణి యుదంచిరత్నవిభూషితాంగి, యా
సామజవైరిమధ్యకును సాటి జగంబున లేదు రాక్షసా. ౪౯౦

ఇభప్రతిమానసుయాన = ఇభ = ఏనుఁగు నడకతో, ప్రతిమాన = సమానమైన, యాన = గమనము గలది, యౌవనోద్దామ = ప్రాయముచే గొప్పది, నితంబినీమణి = స్త్రీలయందు శ్రేష్ఠురాలు, ఉదంచిత = మిక్కిలి ప్రకాశించు, రత్నవిభూషితాంగి = రత్నములచేఁ జెక్కఁబడిన భూషణములచే నలంకరింపఁబడిన దేహము గలది, సామజవైరి = సింహము నడుమువంటి, మధ్య = నడుము గలది.

తా. ఓ యసురరాజా! రామచంద్రుని భార్యయగు సీతను గురించి నే నేమి చెప్పఁగలను? రామచంద్రునిగురించి వృత్తభావుఁడని, వృషాంసుఁడని చెప్పితిని. సీతావిషయమై చెప్పుటకు నాకు సాధ్యము గాదు. అయినను చెప్ప వలయును గావునఁ జెప్పెదను. ఆమె సౌందర్యమువంటి సౌందర్యముగలది మూఁడు లోకములయందును లేదు. ఆమె నడక యేనుఁగునడక వంటిది. నడిమి ప్రాయమందున్నది.

'త్యజేదంత్యకులోద్భూతాం వృద్ధస్త్రీం కన్యకాంత్యజే' త్తనునట్లు ముసలిది గాదు. లేత వయస్సుది గాదు. నితంబినీమణి = స్త్రీలయందు రత్నము వంటిది. ఇప్పుడు నీకుండు స్త్రీలందఱు బంగారుముద్దలు. వీరిలో నామెను దెచ్చి యుంచితివా రత్నములు చెక్కిన యాభరణమువంటి దగును. ఆమె స్వభావముచేతనే సుందరి. 'సొమ్ములాయుధములు ముద్దుగుమ్మలకు' నన్నట్లు భూషణములు ధరించుటచే మరింత సౌందర్యము హెచ్చినది. సింహము నడుమువంటి సన్నని నడుము గలది. ఆమెకు సమానమైనది లోకమున లేదు.

రఘూత్తముభార్య = రామచంద్రుని మహిమ నీకుఁ జెప్పితిని గదా. అటువంటివాఁడు 'ప్రాణేభ్యోపి గరీయసీ' యని తన ప్రాణములకంటె గొప్పగాఁ జూచుకొనునది మరి యెంత మహిమగలదిగా నుండవలెనో చెప్పుటకు నాకు సాధ్యమా?

త్రిలోక సుందరి = మూఁడు లోకములం దుండు సుందరపదార్థముల సౌందర్య మెల్ల నొక్కటిగ నొక్కచోఁ గుప్ప చేసినను ఆమె సౌందర్యమునకు సరిరాదు.

కం. సురులను గంధర్వుల న,చ్చరలను నాశరుల నైన ♦ జానకి సనయుం
　దరుణీమణి లేదనఁగా, నరసతుల వచింప నేల ♦ నమదమరేంద్రా.　　　౨౯౧

సురులను = దేవతాస్త్రీలయందైనను - సుర శబ్దమునకు స్త్రీలింగరూపము సురీ, దాని తత్సమము సురి. దాని బహువచనరూపము సురులు, దేవతలు అను నర్థమున సురలనియే రూపము. కొన్ని యెడలనజడంబు తృతీయాస ప్తములకును బహుత్వంబున ద్వితీయ చూపట్టెడి, ప్రౌ. వ్యా కారక ౧౮. 'బలిమిఁగొనినధనము పదివేలమొంటలఁ బెటిశిరాఁగ వైరిభీకరుంపు నచ్చె నకులుఁడు' భార. సభా. ౧ ఆ. 'అనిన నలుగాలవాన గోవును సశేష శబ్దముల సూత్రమును లోహజాతిఁ గాంచ,న మును మనుజుల విప్రుండు సముధికత్వభాజనములంద్రు వేదప్రపంచవిదులు,' భార - శాంతి. ౧ ఆ. గంధర్వులన్ = గంధర్వస్త్రీలయందు, అచ్చరలను = అప్సరసస్త్రీల యందు, ఆశరులన్ = రాక్షసస్త్రీలయందు - నమత్ + అమరేంద్రా = నమస్కరించుచున్న యింద్రుఁడు గలవాఁడా.

తా. దేవతాస్త్రీలయందుఁగాని గంధర్వస్త్రీలయందుఁగాని అప్సరసలందుఁగాని రాక్షసస్త్రీలయందుఁగాని జానకితో సమానమైనస్త్రీ లేదు. ఇఁక మనుష్యస్త్రీలయందు లేదని చెప్పవలెనా.

దేవతా స్త్రీలకంటె గొప్పదనుటచే సాక్షాల్లక్ష్మియే యని భావము.

కం. ఆమెను నీ విటఁ దెచ్చినఁ, గామి రఘూత్తముఁడు చచ్చుఁ ♦ గాంతావిరహో
　ద్దామానలమునఁ బడి యన. నామాటల నాదరించి ♦ యసురేంద్రుఁ డనున్.

ఆమెను - ఆ + అమ్మ - ఆ + అమ = ఆమె - కావున ఆమెను అనఁగా ఆ యమ్మను నని యర్థము. ఇట్టి మాతృబుద్ధి సీతయందుఁగలవాఁడగుటచే దానిని నని చెప్పక ఆమె నని చెప్పెను. ఇటన్ = ఈ ప్రదేశమునకు - లంకకు - కామి = ఆమె యందుఁ గామముగలవాఁడు, కాంతా విరహోద్దామానలమునన్ = ప్రియురాలి వియోగమను గొప్ప యగ్నియందు, ఆదరించి = ఆలోచన బాగున్నదని యామోదించి.

తా. ఆమెను నీ విచ్చటికిఁ దెచ్చితివా యామెయందు గామముగల రాముఁడు ప్రియురాలిని నెడఁబాయుటచేఁ గలిగిన తాప మనెడి యగ్నిలోఁబడి చచ్చును. అని చెప్పఁగా రావణుఁ డా యాలోచన బాగున్నదని యామోదించెను. తేర కాఁడుది దొరకుట యొకటి, యుద్ధము లేకయే శత్రువు చచ్చుటి యొకటి. ఈ కారణములచే నా యాలోచన వానికి రుచించెను,

పూర్వపుణ్యవశమున జ్ఞానముగలిగి రామునందుఁ బరతత్త్వబుద్ధి గలిగిన యకంపనుఁ డిట్టి దురాలోచన మేల చెప్పెను?

౧. 'యథా రాజా తథా ప్రజా' యన్నట్లు రాజు లెటువంటివారో ప్రజ లట్టి వార లగుదురని చెప్పునపుడు ఇఁక రాజసేవకు లట్టివారగుట యేమి యాశ్చర్యము?

౨. 'అర్థదాసా జనాస్సర్వే' యన్నట్లు కడుపుకూటికై యొకరియొద్దఁ గొలువునకుఁ గుదిరినవాఁ డెంత గుణసంపన్నుఁడైనను దనయేలినవానికిఁ బ్రియముగ మాటలాడకుండిన నతనియనుగ్రహము రాదు.

3. జరిగినది చెప్పి యూరకుండవచ్చునుగదా. ఈ దురాలోచన యేల చెప్పవలె ననిన రావణాసురుఁడు తలంచినట్లు యుద్ధమునకుఁబోయెనా దండకలోనే రామచంద్రమూర్తిచే హతుఁడగుట నిజము. తరువాతఁ గుంభకర్ణుఁడు తూఁగుఁ బోతు. ఇంద్రజిత్తు బాలుఁడగుటచేఁ దండ్రిపగదీర్చుకొనుటకై వాఁడు, లెక్కన కొడుకులు, బంధువులు, యుద్ధమునకు వత్తురు. చత్తురు. విభీషణుఁడు రాజగును. తనకూటిలో మట్టిపడును. కావున మంథర తనసౌఖ్యమునకై కైకకు దురాలోచన చెప్పినట్లు వీఁడును రావణుఁడు యుద్ధమునకుఁ బోకుండునట్లు వానికిఁ బ్రియముగ నుండునట్లు చెప్పెను. రావణుఁడు దుష్కామి. స్త్రీవ్యసనాసక్తుఁడు గావున నది వానికి రుచించెను. తన కోరికయూఁడుది లభించిన ట్లగును. రాముఁడు చచ్చిన ట్లగును. కావున నీయాలోచన నామోదించెను.

౪. ఇచ్చట నొక్కవిషయ మాలోచింపవలసియున్నది. నీవు సీతాదేవిని హరించితివేని రామచంద్రమూర్తి కామి గావున భార్యావియోగతాపమునఁ జచ్చునని యకంపనుఁడు చెప్పెనుగదా. ఇది శాస్త్రసిద్ధమా లోకసిద్ధమా? మరణించిన భార్యవెంట భర్త సహగమనము చేయవలయునని శాస్త్రము విధింపలేదు. కాముకుఁ డయ్యెనేని రెండవవివాహము చేసికొనవచ్చును, "దేశే దేశే కళత్రాణి" యని రాముఁడే చెప్పెనుగదా. లేదా విధురుఁడై బ్రహ్మచర్య మవలంబించి యుండవచ్చును. కావున నిది శాస్త్రసిద్ధము కాదు. లోకసిద్ధమా యనిన భర్తవెంట సహగమనముచేసిన స్త్రీలు గలరుగాని భార్యవెంట సహగమనముచేసినవారు కాని యా విరహమునఁ జచ్చినవారుగాని మగవారియందింతవఱకులేరు. శాస్త్రము లోకాచార మిట్లుండ సీత నపహరించిన రామచంద్రుఁడు చచ్చునని యకంపనుఁ డేమని యుపదేశించెను! అనుభవమునకు వచ్చినవిధముగ దీనివలన విపరీతఫలము గలిగినఁ గలుగవచ్చును. భార్య చచ్చినదనిన 'భార్యాదుఃఖం పునర్భార్యా' రెండవభార్య వచ్చునంతకే చచ్చిన మొదటిభార్యవిషయమైన దుఃఖ మన్నట్లు, కొన్నాళ్లేడ్చి యూరకుండును. అటుగాక పరుఁడు హరించికొని పోయినాఁడనిన నాయవ

మానముచే రోషముపెరిగి యా దొంగను జంపఁబూనెను. కావున నీ యుపాయ మపాయముతోఁగూడినది. అయినదేమో యైనది పోయినదేమో పోయినదని యూరకున్నను గలహములేదు. నా చెల్లెలి ముక్కుచెవులు కోసితివిగావున నీ పెండ్లాము గొంతు కోసెదనని సీతాదేవిని జంపి పీనుఁగును అక్కడనే పాఱవేసియుండిన రాముఁడు దానిని జూచి యెవరో రాక్షసులు చంపిపోయినారని కొంతసేపేడ్చి యూరకయుండియుండును. లేదా యకంపనుఁడూహించినట్లు రామచంద్రుఁడుచచ్చినా వ్యసనములేదు. అటుగాక యిటుగాక లంకలోఁ దెచ్చిపెట్టుకొనుట చూరులోఁ గొఱవి చెక్కినట్లేగదా. ఈ క్షుద్రాలోచన యకంపనుఁడు రావణు మేలుకోరి చెప్పెనా కీడుకోరి చెప్పెనా? వీని క్షేమము సుఖము రావణుక్షేమముపై నాధారపడి యుండుటచే బుద్ధిపూర్వకముగా నతని కీడుకోరి చెప్పినాఁడనుట సమంజసము గాదు. కావున వానియాలోచన వేఱువిధమై యుండవలయును. "జనకాత్మజ సంబంధంబున రాముం డప్రమేయతేజుండయ్యెను" అని మారీచునకుఁ గలిగిన జ్ఞానమే యకంపనునకుఁ గలిగియుండవచ్చును. రామచంద్రుఁడు శ్రీమంతుఁడని యకంపనుఁడును చెప్పెను. అనఁగా శ్రీచేఁ బ్రసిద్ధికివచ్చినవాఁడని యర్థము. శ్రీ సీతాదేవి లేకపోయిన నప్రమేయతేజము రామునకు లేదు. ఆ యప్రమేయతేజ మెట్టిదైనది యనుభవ జన్యజ్ఞానము గలవాఁడగుటచే మారీచుఁడు సీతాదేవిని హరింపవలదని రావణునకు బోధించెను. అనుభవజన్యజ్ఞాన మకంపనునకు లేదు. కావున సీతారాముల వేఱుపఱువవచ్చునని యకంపనుఁడు తలఁచెను.

సృష్టిస్థిత్యంతకారేణ నిగ్రహానుగ్రహాత్మనా ॥అహి॥ అన్నట్లు భగవంతునందు పంచవిధ సంకల్పశక్తులు గలవు. అనుగ్రహశక్తికే కృపయని పేరు ఈ కృపాశక్తిచేతనే భగవంతుఁడు సృష్టి, స్థితి, లయము, నిగ్రహము కావించుచుండును. ఇన్నిఁటికిఁ గృపయే కారణము. ఈ కృపాశక్తియే లక్ష్మి. "లక్ష్మ్యాసహ హృషీకేశో దేవ్యాకారుణ్యరూపయా । రక్షకస్సర్వసిద్ధాంతే, వేదాంతేషు చ గీయతే" కారుణ్యరూపిణియగు లక్ష్మీదేవితోడ నారాయణుఁడు జగద్రక్షకుఁడు అని వేదములు వేదాంతములు సిద్ధాంతము చేయుచున్నవని యర్థము. కావున వాస్తవమున సృష్టి స్థితి సంహారకార్యముల కవ్యవధానకర్త్రి లక్ష్మీదేవియే. ఎండచేత సూర్యుఁ డెట్లు కార్యములు చేయుచున్నాఁడో యట్టులే యామెచే భగవంతుఁడు కార్యములు చేయుచున్నాఁడు. సీతోపనిషత్తునందు — "శ్రీరామసాన్నిధ్యవశాజ్జగదాధారకారిణీ (జగదానందకారిణీ అని పాఠాంతరము) ఉత్పత్తి స్థితి సంహారకారిణీ సర్వదేహినామ్ సీతాభగవతీ జ్ఞేయా మూలప్రకృతి సంజ్ఞితా ప్రణవత్వాత్ ప్రకృతిరితి వదంతి బ్రహ్మవాదినః" సాదేవీ త్రివిధాభవతి శక్త్యాత్మనా ఇచ్ఛాశక్తి క్రియాశక్తి సాక్షాచ్ఛక్తిరితి; ఇచ్ఛాశక్తి స్త్రివిధాభవతి శ్రీభూమి

సీతాత్మికా శ్రీదేవీ త్రివిధం రూపం కృత్వా భగవత్సంకల్పానుగుణ్యేన లోకరక్షణార్థం రూపం ధారయతి.

శ్రీరామసాన్నిధ్యవశమున సీమె జగదాధారయు సర్వదేవుల యుత్పత్తి స్థితి సంహారకారిణియు నగుచున్నది. భగవతియగు సీతకే మూలప్రకృతి యని పేరు. ప్రణవమగుటచేఁ బ్రకృతియని బ్రహ్మవాదు లందురు. ఆమె త్రివిధ శక్త్యాత్మికా - ఇచ్ఛాశక్తి - క్రియాశక్తి - సాక్షాచ్ఛక్తి - ఈ యిచ్ఛాశక్తి శ్రీ భూమినీళ లని మూఁడువిధములు - ఈ శ్రీదేవి త్రివిధరూపములు ధరించి భగవత్సంకల్పానుసారముగ లోకరక్షణార్థము రూపము ధరించుచుండును. సర్వభూతసృష్టి యీమెవలన జరుగుటచే సీమె సర్వలోకజనని యనఁబడుచుండును. ఇదియే సంగ్రహముగ మాయ యయ్యెను. మాయా యనఁగా, యా = ఎవతె, మా = తల్లియో యామె మాయ — "లోకమాతా మా రమా మంగళదేవతా" దాని సంగ్రహరూపమే మా = అమ్మ.

తల్లిని బిలుచునపుడు అమ్మా యందుమేగాని నా యమ్మ యనముకదా. కావునఁ దల్లియను నర్థముగల మా శబ్దముచే లక్ష్మీదేవి పిలువఁబడును. ఈమె లోకమునకుఁ దల్లి యగుటచేఁగదా లోకమునకు సంతయుఁ జంద్రుఁడు చందమామ యయ్యెను.

మమ యోనిర్మహద్బ్రహ్మ, తస్మిన్ గర్భం దధామ్యహమ్।
సంభవః సర్వభూతానాం తతో భవతి భారత॥
సర్వయోనిషు కౌంతేయ, మూర్తయః సంభవంతి యాః॥
తాసాం బ్రహ్మ మహద్యోని, రహం బీజప్రదః పితా॥ భ.గీ. ౧౪, శ్లో. ౩॥౪

భగవంతుఁ డేయే యవతార మెత్తుచుండునో యామెయుఁ దదనుగుణమైన రూప మెత్తుచుండును. ఇంతటి శక్తి తన స్వాధీనమం దుండుటచేఁగదా రామచంద్రుఁ డింతటివాఁడైనాఁడు. ఈమె రావణుస్వాధీనమం దుండిన రావణుఁ డింతి వాఁ డగును. అప్పుడు రాముఁడు జీవించినను మృతప్రాయుఁ డగును. ఇప్పుడు శ్రీమంతుఁడగువాఁడు సీతను వేఱువఱచిన నశ్రీమంతుఁడు అనఁగాఁ దరిద్రుఁ డగును. అంతియకాదు. శ్రీమంతునిలో శ్రీ పోఁగా మంతుఁడుమాత్రమే మిగులును. మంతుఁడు అనఁగా మనుష్యుఁడు - "మర్త్యాపరాధయోర్మంతుః" అని నానా - అనఁగా పరశురామునందుండిన భగవత్తేజస్సు పోఁగానే యాయన నిర్వీర్యుఁడై బ్రాహ్మణత్వమాత్రము మిగిలినవాఁడయినట్లు రాముఁడును మనుష్యమాత్రత్వము మిగిలినవాఁడగును. అప్పుడు సులభముగ జయింపవచ్చును. తమ రాజు బాగుండినఁ దాము బాగుండవచ్చునని యాలోచించి సద్భావముతోనే

యీయాలోచన చెప్పెనుగాని సూర్యునినుండి యెండను విడఁదీసినట్టు వారి నిద్దఱి వేఱుపఱువ సాధ్యమా యనిమాత్ర మాలోచించినవాఁడు కాఁడు.

నీ విట్టి పొరపా టభిప్రాయముగలవాఁడవై యున్నావు. నీ యభిప్రాయము సరిగాదని తెలుపుటకే "అనన్యా రాఘవే ణాహం భాస్కరేణ ప్రభా యథా" సూర్యునకు నెండవలె రామునకు నే ననన్యను నీవు వేఱుపఱుపలే వని సీతాదేవి రావణునకు బోధించెనుగాని యవి వాని చెవులలో దూఱినవి కావు.

ఈ పద్యంబున నాదరించి యనుమాటకు మహేశ్వరతీర్థీయ వ్యాఖ్యయం దిట్లు వ్రాయఁబడెను.

అథాపరాం కథాం దివ్యాం, శృణు రాజన్ పురాతనీమ్,
యదర్థం రామవైదేహీ, రావణేన హృతా పురా
పురా కృతయుగే రామ, ప్రజాపతిసుతం ప్రభుమ్.
సనత్కుమారమాసీనం, రావణో వాక్య మబ్రవీత్.
రావణః॥ దైత్యదానవ రక్షాంసి యే హతా స్సురేశ్వరైః
కాం గతిం ప్రతిపద్యంతే, కేన తే హరిణాహతాః.

సనత్కుమారః॥ యేయేహతాశ్చక్రధరేణ రాజన్। త్రైలోక్యనాథేన జనార్దనేన। తేతే గతా స్తన్నిలయం నరేంద్రా, క్రోధోపి దేవస్యవరేణ తుల్యః॥ శ్రుత్వా తత స్తద్వచనం నిశాచర, స్సనత్కుమారస్య ముఖాద్వినిర్గతమ్। తథాప్రహృష్టస్స బభూవవిస్మితః కథం ను యాస్యామి హరిం మహాహవే॥

మునిః॥ మనసస్సేప్సితం యత్ర ద్భవిష్యతి తదాహవే।
సుఖీభవ మహాబాహో, కించిత్కాలం ప్రతీక్షయ॥
అథవా రాక్షసేంద్ర! త్వం యదీదం ద్రష్టుమిచ్ఛసి।
కథయిష్యామి తే సర్వం, శ్రూయతాం యది రోచతే॥
కృతయుగే వ్యతీతే వై, ముఖే త్రేతాయుగస్య తు।
హితార్థం దేవమర్త్యానాం, భవితా నృపరిగ్రహః॥
ఇక్ష్వాకూణాం చ యో రాజా, భావ్యో దశరథో భువి।
తస్య సూను ర్మహాతేజా, రామోనామ భవిష్యతి॥
ఏవం శ్రుత్వా మహాబాహుః, రాక్షసేంద్రః ప్రతాపవాన్।
త్వయా సహ విరోధేచ్ఛు, శ్చింతయామాస రాఘవ॥
సనత్కుమారా త్తద్వాక్యం, చింతయానో ముహుర్ముహుః।
రావణే ముముదే మోహః, ద్యుద్ధార్థీ విచచార హ।
ఏతదర్థం మహాబాహో, రావణేన దురాత్మనా।

సుతా జనకరాజస్య, హృతా రామ మహామతే॥
లంకామానీయ యత్నేన, మాతేవ పరిరక్షితా.

ఇత్యాది అతఏవ రావణస్య సీతారామభృత్యత్వేన తాద్బుద్ధ్యా తేన వక్ష్యమాణాని బాహ్యదృష్ట్యా దుర్భాషణవత్ప్రతీయమానాన్యపి వాక్యాని, వస్తుతః స్తుతిపరాణ్యేవ, తథా తత్తత్ర వ్యాఖ్యాస్యామః”

అగస్త్యుఁడు, రామా! సీతను రావణుఁ డేల హరించెనో చెప్పెదవినుము. పూర్వకాలమునఁ గృతయుగమందు బ్రహ్మకుమారుఁడైన సనత్కుమారుని జూచి రావణుఁడు విష్ణువుచేఁ జచ్చినవారికగతి యేమి యని ప్రశ్నింపగా విష్ణువుచేఁ జచ్చినవారు విష్ణులోకమునకుఁ బోదురు. భగవంతుని క్రోధముకూడ ననుగ్రహముతో సమానమే అని చెప్పఁగా రావణుఁడు సంతోషించి యాయనతో నాకెట్లు యుద్ధము చేయఁ బొసఁగునని యడిగిన మునీంద్రుఁ డిట్లనియె. ఎవరికోరిక యెట్లున్నదో యట్లే కాఁగలదు. కొంచెముకాల మోపుమాపుము. అయినను నిట్టిది నాకు నెట్లు లభించునందువా త్రేతాయుగారంభమున దేవమనుష్యహితార్థముగ నాయన మనుష్యరూపముతో దశరథరాజకుమారుఁడై రామనామమున జన్మించును. ఆ మాటలు రావణుఁడు విని సీతతో యుద్ధముచేయఁ గోరికగలవాఁడై యెట్లు యుద్ధము తటస్థించునా యని యాలోచించుచుండెను. ఈ నిమిత్తము దురాత్ముఁడగు రావణునిచే సీతాదేవి హరింపఁబడి తల్లివలె రక్షింపఁబడెను. దీనిఁబట్టి సీతారాములను రావణుఁడు పలుకుమాటలు దూషణములుగాఁ దోఁచినను వాస్తవమున స్తుతివాక్యములే యగును గాన నచ్చటచ్చట స్తుతిపరముగఁ గూడ వ్యాఖ్యానము చేయుదుము అని మహేశ్వరతీర్థులు వ్రాసిరి.

మీఁద ననువదింపఁబడిన శ్లోకము లుత్తరకాండమున ప్రక్షిప్తసర్గములలో 3, 4 సర్గములం దున్నవి.

‘ఏతదర్థం మహాబాహో’ అను శ్లోకము లందుఁ గానరాలేదు. ఈ ప్రక్షిప్త సర్గములకు మహేశ్వరతీర్థులు వ్యాఖ్యానమును వ్రాసినవారుగారు. గోవిందరాజీయ వ్యాఖ్యయులేదు. కావునఁ బ్రక్షిప్తములు ప్రమాణములు గాఁజాలవు. అదియునుగాక ఈ జన్మమున రావణునకు విష్ణులోకప్రాప్తి లేదు. మోక్షమే లభించి యుండినచో మరల వీఁడు శిశుపాలుఁగాఁ బుట్టవలసినకారణము గలుగదు. జయవిజయులు శీఘ్రముగ మరల వైకుంఠప్రాప్తికోరి మూఁడుజన్మముల విరోధమునుగదా కోరిరి. ఇట్లుండ హిరణ్యకశిపు శిశుపాలురు కేవల విరోధులైయుండ రావణుఁ డెట్లు భక్తుఁడయ్యెనో – అదియునుగాక వీనికి విష్ణులోకప్రాప్తి లేనట్లు విష్ణుపురాణమున స్పష్టముగఁగలదు. ఎట్లన :—

తత్రైతు హిరణ్యకశిపౌ విష్ణురయ మిత్యే తన్న మనస్యభూత్ ॥౪॥ నిరతిశయ పుణ్యజాతసముద్భూత మేతత్సత్త్వమితిరజోద్రేకాన్య గ్రహీణ్యేకాగ్రమతి స్తద్భావనాయోగాత్తతో ప్రాప్తవధహైతుకీం నిరతిశయమేవాఖిలత్రైలోక్యాధిక్యకారిణీం దశాననత్వే భోగసంపద మవాప ॥౫॥ తత స్తస్మిన్ననాదినిధనే పరబ్రహ్మభూతే భగవత్యనాలంబినికృతమనస్తల్లయం దశాననత్వే హ్యనంగపరాధీనయా జానకీసక్తచేతసా దాశరథిరూపధారిణ స్తద్రూపదర్శనమేవాసీత్ నాయమచ్యుత ఇత్యాసక్తి ర్వ్యపద్యోంతఃకరణస్య మానుషబుద్ధిరేవ కేవల మస్యాభూత్ ॥౬॥ పునరప్యచ్యుత వినిపాతనమాత్రఫల మఖిలభూమండలశ్లాఘ్య చేదిరాజకులే జన్మావ్యాహతం చైశ్వర్యం శిశుపాలత్వేప్యవాప॥

దీనివలన రావణుఁడు కామపరవశుఁడై సీతను హరించెననియు నా జన్మమున వానికి విష్ణుప్రాప్తి లేదనియు స్పష్టపడియెను.

రామునితో యుద్ధముచేసి చచ్చుటయే వానికి ముఖ్యోద్దేశ్య మయ్యెనేని యీ ద్రావిడప్రాణాయామ మేల? యుద్ధకారణము కలిగెఁగాపునఁ చక్కఁగా సేనలతోనే యొంటరిగాఁ దిగ్విజయమునకుఁ బోవుచుండినవిధముగఁ బోయి యుద్ధము చేసి చచ్చియుండవచ్చునే.

ప్రక్షిప్తశ్లోకములలో నున్నట్లు రావణునకు రామచంద్రమూర్తియందు మనుష్యభావములేక దేవభావముండెనేని యీయనచేఁ జచ్చుట యెట్లు సంభవించెను? ఇది బ్రహ్మవరమునకు విరోధముగాదా?

అదియునుగాక సీతాదేవిని లంకలోనుంచిన పక్షమున రామచంద్రమూర్తి యచ్చటికి రాఁజాలఁడనికదా వాని యభిప్రాయము. ఇది కంఠోక్తిగా నెన్నిమాఱులో రావణుఁడే చెప్పెనుగదా! యుద్ధముగోరినవాఁ డిట్లు చేయునా? తల్లివలె సీతాదేవిని రక్షించెననికదా ప్రక్షిప్తశ్లోకములు చెప్పుచున్నవి. అట్లు వానికి మాతృభావముండెనేని తల్లి నెట్లు గౌరవింపవలయునో యట్లు గౌరవించెనా? తన తల్లిని నీ ప్రకారమే వనములోనుంచి నిన్నుఁ జంపెదను కోసెదను తినెదనని బెదరించుచుండెనా? దుర్భాటవాక్యములు పలికెనా?

తన్ను రావణుఁడు భక్తిచే గ్రహించెనో కాముకుఁడై గ్రహించెనో తెలిసికోలేనంతటి మూఢురాలా జానకీదేవి? ఏల రావణుఁడు సమూలము హతుఁడగువఱకు లంక విడిచిరానని యామె చెప్పెను! భక్తునియం దింత కాఠిన్యము సీతాదేవియా వహించును?

రావణునకుఁ దల్లి యను భావము సీతాదేవియం దుండెనేని నీ చన్నులిట్లు

న్నవి, నీ తొడలట్టున్నవి, నీ పిఱ్ఱ లిట్టున్న వనునా ? తనతల్లి నిట్లెవ్వఁడైన నెంత పాపిష్ఠయైన ననునా ? తాయిగండమతమువాఁ డనునేమో.

భక్తుఁడు తాను మోక్షము గోరునుగాని సర్వాంశమై పోవు కార్యముఁ జేయునా ?

భారతంబున - వనపర్వంబున - ౨౮౨ అధ్యాయము.
రావణః కామబాణార్తో దదర్శోపససర్పచ.
దేవదానవగంధర్వయక్షకింపురుషై ర్యధి.

అజితోశోకవనికాం, యయౌ తాం కందర్పపీడితః. ఇందు రావణుఁడు కామబాణార్తుఁడు. కందర్పపీడితుఁడని చెప్పఁబడెనుగదా.

రావణుఁడు సీతాదేవి భక్తుఁడో కాముకుఁడో ఈ క్రింద పద్యములవలనఁ దెలియఁదగు.

మహాపార్శ్వుఁడనువాఁడు నీవు సీతాదేవిని కోడిపుంజువలె బలాత్కారముగఁ జెఱుపరాదా యని బోధింపఁగా రావణుఁడు తాను పరస్త్రీలను బలాత్కరించి చెఱుపకుండఁ దనకుఁగల బ్రహ్మశాపమును జెప్పుచు.

కం. ఈ శాపభీతిఁగాదే, యాశింపకయున్నవాఁడ నవనిజఁగాదే
నాశయనంబున నెపుడో, యాశంపాదేహఁగూడనా జంకుదునా ?

యని ప్రత్యుత్తర మిచ్చెను.

ఇది రావణుఁడు సీతను దల్లివలె రక్షించిన విధము. ఇంద్రజిత్తు వధానంతరము రావణుఁడు సీతాదేవిని జంపఁబోయి తన మాతృభక్తిని వెల్లడించెను. సీతయందు భక్తిగలవాఁడైనచో రాముఁడు చచ్చెనని మాయాధనుస్సు - శిరము నేల సీతకుఁ జూపవలెను! ఎటులైన నయభయముల సీతను దనకు వశవఱుపుఁడని యేల రాక్షసస్త్రీలకు బోధింపవలెను ?

రామచంద్రమూర్తిచేఁ జావవలయునని కోరికగలవాని కార్యములా యివి!

ప్రక్షిప్తశ్లోకములందు రామావతారము త్రేతాది నని వ్రాయఁబడెను. అది సరిగాదు. త్రేతాద్వాపరసంధియందు రామావతారము. తక్కినవి యందందు వ్రాయఁబడును. రావణుఁడు సీతాభక్తుఁడేని లోకవంద్యుఁడే కాని యిది నిలువఁగాళ్ళులేని కల్పితాభిప్రాయము.

రాము నాశ్రయించి సీతను ద్వేషించిన శూర్పణఖవలెను,సీతనుగోరి రాముని ద్వేషించిన రావణువలెను నగుదురు.

— ♦ రావణుఁడు మారీచుం జూడఁ బోవుట. ♦ —

శా. కానీ నేవఱువాత నేగి ధరణీ ♦ కన్యామణిం దెత్తు మో
దానన్ నీ విఁకఁ బొమ్మటం చనిపి దై ♦ త్యస్వామి సూర్యాభతే
జోనిస్తుల్యము రాసభాంచితము నై ♦ శుభ్రంబునౌ తేరిపైఁ
దా నొక్కండుగ సూతయుక్తుఁ డయి యధ్యాసీనుఁడై వెల్వడెన్. ౮౯౩

కానీ = కానిమ్ము, నీవు చెప్పినటులే చేసెదను. ఇచ్చునకు సర్వత్ర యీయ యగు, ఇవ్వ అనుట యపశబ్దము. వఱువాతన్ = ఉదయమున, సూర్యాభ = సూర్యునితో సమానమైన, తేజస్ = కాంతిచే, నిస్తుల్యము = అసమానమైనది, రాసభాంచితము = కంచరగాడిదలచే నొప్పునది, శుభ్రము = తెల్లనిది, అధ్యాసీనుఁడై = కూర్చున్నవాఁడై, వెల్వడెన్ = బయలుదేఱెను. అశ్వశాస్త్రమునఁ గంచరగాడిదల లక్షణమిట్లు చెప్పఁబడెను.

అశ్వస్యగ్భస్సముత్పన్నా, స్తస్మాదశ్వతరాః ఖరాః,
ఖరరూక్షస్వరా స్తీక్ష్ణాః, ఖరశీలాః ఖరాంఘ్రయః.
ఆఁడుగుఱ్ఱములకు మగగాడిదలకుఁ బుట్టినవి యశ్వతరులు, కంచరగాడిదలు.

తా. నీవు చెప్పినటులే చేసెదను. ఉదయమునఁబోయి సీతాదేవిని దెత్తును. నీవు పొమ్మని పంపి రావణుఁడు సూర్యునివలెఁ బ్రకాశించు కంచరగాడిదలు కట్టిన తెల్లని తేరిపై సారథితోఁ దానొక్కఁడే బయలుదేఱెను.

కం. వినువీధిఁ జనెడు నాస్యందన మయ్యెడఁ దోఁచె మేఘ ♦ తతిమధ్యమునన్
గానబారుచంద్రమండల, మన నటు చని తాటకేయు ♦ నాశ్రమమందున్.

వినువీధి = ఆకాశమార్గము, వీధీశబ్దభవమువీధి—స్యందనము = రథము, తాటకేయు = తాటకకొడుకైన మారీచుని, అపత్యార్థకతద్ధితము, ఆశ్రమము = తపోవనము.

తా. ఆకాశమార్గమునఁ బోవుచున్న యారథ మాసమయంబున మేఘముల నడుమనుండు చంద్రమండలమువలెఁ గానవచ్చెను. అట్లుపోయి మారీచుని యాశ్రమమందు (చంద్రుఁడు పోకున్నను, పోవుచున్న మేఘముల నడుమ నున్నప్పుడు చంద్రుఁడు పోవుచున్నట్లు కానవచ్చును.)

తే. అవతరించిన మారీచుఁ ♦ డరుగుదెంచి, భవ్యము లగునమానుష ♦ భక్ష్య భోజ్య
ములను దృప్తునిఁగాఁజేసి ♦ పూజసలిపి, యర్ఘ్యపాద్యాదు లర్పించి ♦ యనియెనిట్లు.

అవతరించినన్ = దిగఁగా, అమానుష = మనుష్యులకు దుర్లభములైన, ఇందుఁ గ్రమ మపేక్షితము.

తా. తేరు దిగఁగా మారీచుఁడు వచ్చి యర్ఘ్యపాద్యము లిచ్చి యాసన మర్పించి మనుష్యులకు దుర్లభములయిన మేలగు భక్ష్యములు భోజ్యములు నిచ్చి తృప్తునిఁగా జేసి యిట్లనెను.

క. సేమంబే యసురేశ్వర, సేమంబే రాక్షసులకుఁ ♦ జెచ్చెర నీ విం
దీమెయి నరుదెంచుటచే, నేమో కలదనుచు శంక ♦ యెద జనియించెన్. ౪౫౬

చెచ్చెరన్ = శీఘ్రముగ, ఈమెయిన్ = ఈ విధముగ, ఒంటరిగా, ఏమో = ఏదియో విశేషము గొప్పకార్యము, ఎదన్ = హృదయమందు.

తా. రాక్షసరాజా! నీకు రాక్షసుల కందఱకు క్షేమమే కదా. ఉపద్రవ మేదియు సంభవింపలేదుగదా. ఈ ప్రకారము తోడెవ్వఁడును లేక యొంటరివాఁడవై యెకాయెకీన వచ్చుటచూడ నేదియో గొప్పకార్యము తటస్థించినదని సందేహము కలుగుచున్నది.

ఉ. ఆ నుడు లాలకించి యసు♦రాధిపుఁ డిట్లనుఁ దండ్రి! రాముఁ డన్
మానవుఁ డొక్కరుండు దుసు♦మాలిచి రక్షకకోటులన్ జన
స్థానముఁ బాడుచేసె రణ♦శౌండత, నాతనిభార్యఁ దెచ్చెదన్
మానుగ నాకుఁ దోడగుము ♦ మానుతు♦నాపగఁ దీర్చెదంబుగన్. ౪౫౭

నుడులు = మాటలు, ఉసుఱుమాలిచి = చంపి, రణశౌండత = యుద్ధసామర్థ్యముచే.

తా. ఆ మాటలు విని రావణాసురుఁ డిట్లనియె. తండ్రీ! రాముఁడను నొక్క మానవుఁడు రాక్షసులనందఱ యుద్ధసామర్థ్యముచే వధించి జనస్థానము పాడుపడఁ జేసెను. ఆతనిభార్యను నే నపహరించి తేఁదలఁచితిని. ఈ విషయమున నీవు నాకుఁ దోడగుము. ఆ విధముగ నా పగఁ దీర్చుకొందును.

—♦ మారీచుఁడు రావణునకు శ్రీరామునితోడి విరోధంబు వలదని చెప్పుట ♦—

క. నావుడు మారీచుండును, నేవాఁ డొకొ నీకుఁ దెల్పె ♦ హితశత్రుండై
యా వైదేహిని గూరిచి, యేవాఁ డొకొ నీమచేటు ♦ నెదురుం జూచున్. ౪౫౮

నావుఁడు = అనవుడు, అని చెప్పఁగా, హితశత్రుండై = హితునివలెఁ గనఁబడు వాస్తవశత్రువు.

తా. రావణుఁ డీప్రకారము చెప్పఁగా విని సీతాదేవినిగుఱించి నీకు లోపల శత్రుత్వము, వెలుపల మిత్రత్వముగలవాఁ డెవఁడు చెప్పెను. ఎవఁడు నీ వెప్పు డెప్పుడు చెడుదువాయని యెదురుచూచుచున్నాఁడు.

ఉ. నీకు హితుండు గాఁడు ధరణీసుతఁ దెమ్మనినట్టివాఁడు, ము
ల్లోకము లేలువానికిని లోలత శృంగము భంగ మొందఁగాఁ
జేనఁ జేయ నెవ్వఁడు? ప్రసిద్ధవిషోరగదంష్ట్రి బీకఁగా
నీ కెవఁడో వచించె? నిటు నిద్రితుఁడై దలఁ దన్ని నెవ్వఁడో? ౪౯౯

శృంగము = ప్రాధాన్యము. "శృంగం ప్రాధాన్యసాన్వోశ్చ" అమరకోశము. విషోరగ = విషముతోఁగూడిన పాముయొక్క, దంష్ట్రి = కోఱ, నిద్రితుఁడై = హెచ్చరిక తప్పియుండువాఁడవై.

తా. సీతను దెమ్మని చెప్పినవాఁడు నీ మేలుకోరినవాఁడు కాఁడు. ఇప్పుడు మూఁడులోకములు పరిపాలించు నీ ప్రముఖత్వముఁజూచి సహింపలేక యది భగ్నమై పోవఁ జేయ నెవ్వఁడు ప్రయత్నించెను? ప్రసిద్ధమైన విషసర్పముకోఱ పీఁకుమని నీ కెవఁడు చెప్పెను? ఏమఱి వాస్తవము తెలియక నిద్రపోవువానివలె నుండు నీ తల నెవ్వఁడు తన్నెను?

చ. సురవరవైరి భూనుత విశుద్ధకులాభిజనాగ్రహస్తమై
యురుతరశౌర్యదాన మయి యుగ్రభుజార్గళసద్విషాణమై
పరజనభీకరం బగుచు వాలెడు రాఘవగంధహస్తి నీ
దురమునఁ దేఱిచూచుటకు నూల్కొన కిప్పుడు రాక్షసోత్తమా. ౫౦౦

సురవరవైరి = ఇంద్రునకు విరోధీ! భూ = భూలోకములోని జనులచే; నుత = స్తోత్రముచేయఁబడిన, విశుద్ధ = ఎట్టిదోషములేని, కుల = వంశమున, అభిజన = పుట్టుక యనెడి, అగ్రహస్తమై = తొండము కొన గలదై, ఏనుఁగునకుఁ దొండ మెంత ముఖ్యమో మనుష్యులకు గొప్పవంశమునఁ బుట్టుట యంత ముఖ్యము. కావున రెంటికి రూపకము. ఉరుతర = మిగుల నధికమైన, శౌర్య = పరాక్రమ మనెడి, దానము = మదపునీళ్ళు గలది, పరాక్రమ మదములు జనులు తిరస్కరింపకుండుటకు హేతువులు. కావున రెంటికి రూపకము - ఉగ్ర = భయంకరమైన, భుజార్గళ = గడియమ్రాఁకులవంటి భుజములనెడి, సద్విషాణమై = మంచికొమ్ములు గలదై - ఏనుఁగునకు కొమ్ములెట్టివో భుజములట్టివని రూపకము. వాలెడు = అతిశయించెడి, రాఘవగంధహస్తిని = రామచంద్రమూర్తి యనెడు మదపుటేనుఁగును, దురమునన్ = యుద్ధమందు, తేఱిచూచుటకున్ = తెప్పలెత్తిచూచుటకు, నూల్కొనకు = ప్రయత్నింపకుము.

తా. రాక్షసరాజా! జగత్ప్రసిద్ధమైన గొప్ప వంశమునఁ బుట్టుట యనెడి తొండముకొన, గొప్ప పరాక్రమమనెడి మదపునీళ్ళు, గడియమ్రాఁకులవంటి చేతులనెడి దంతములు, శత్రువులకు భయము గలిగించు రాముఁడనెడి మదపుటేనుఁ

గను నింద్రవిరోధీ! యిప్పుడు కనుతెప్ప లెత్తియైనఁ జూచుటకు యత్నింపకుము; సురవరవైరి = అనుటచే నింద్రుని జయించితిని గదా, మనుష్యుఁ డెంతయని గర్వింపకు మని భావము. రాక్షసోత్తమా = నీవు రాక్షసులందు మాత్రము శ్రేష్ఠుఁడవు. రామచంద్రుఁడో భూజనుల యందఱచేత గొప్పవాఁడని స్తోత్రము చేయఁబడు వాఁడు. నాలుగవపాదమున అనునాసికాక్షరయతి.

మ. కలహాంతస్థితిసంధివాలమును రక్షఃకాండసత్త్వాపహాం
బలఘుస్ఫారకలంబసన్నఖము శాతాసిస్ఫురద్దంష్ట్రిమున్
బలితంబైన నృసింహమూర్తి నిదురన్ మ్రాన్పాటుమై నుండఁగా
చలముం బూనుచు నీవు లేపఁదగునే చర్చింపు లంకేశ్వరా. ౫౦౧

అంతకు నతిశయము చెప్పఁదలఁచి సింహముగా రూపించుచున్నాఁడు. కలహ + అంత + స్థితి = యుద్ధము మొదట నిలుచుట యనెడి సంధివాలము = వీఁపు పై నుండెడి వాలము. అనఁగా సింహము మిగులఁ గోపించినపుడు తోఁక పైకెత్తుకొనును. అది కలహమునఁ బైఁకి దూఁకుటను సూచించును. కావున యుద్ధముఖమున నిలుచుటకు - సింహము తోఁక పైకెత్తుటకు రూపకము. రక్షఃకాండ = రాక్షససమూహమనెడి, సత్త్వ = జంతువులకు, అపహము = చంపునది, అలఘు = గొప్పవై, స్ఫార = ప్రకాశముగల, కలంబ = బాణములనెడి, సన్నఖము = వాఁడిగోళ్ళు గలది, శాతాసి = పదునైన కత్తియనెడి, స్ఫురత్ = ప్రకాశించు, దంష్ట్రిము = కోఱలు గలది, బలితము = బలము గలది, నృసింహమూర్తి = నరుఁడుగా జనించిన శ్రీరాముఁడనెడి సింహము, నిదురన్ = శ్రీరామచంద్రమూర్తి విషయమున, ఏ కార్యము చేయక యూరకయుండువాని స్థితియందు, మ్రాన్పాటుమైన్ = నిశ్చలత్వముచే, చలము = హఠము, చర్చింపు = చక్కఁగా నాలోచింపుము.

తా. యుద్ధముఖమున నిలుచుట యను పైకెత్తఁబడిన తోఁక గలదియు, రాక్షససమూహమను మృగముల సంహరించునదియు, గొప్ప బాణములనెడు వాఁడిగోళ్ళు గలదియు, వాఁడిగల కత్తులను కోఱలు గలదియు నగు బలిష్ఠమైన నరరూపమును వహించిన రాముఁడను సింహము తానెందో యొకరిని బాధింపక నిద్రించుచుండఁగా జెట్టు కొట్టి మీఁదఁ ద్రోచికొనునట్లు దానిని లేపవచ్చునా. చక్కఁగా నాలోచింపుము.

కం. చాపాపహారము భుజా,టోపాధికపంకమును బటుశరోర్మికమున్
దీపితరణౌఘ మగు సీ,తాపతి పాతాళమందుఁ దగదు పడంగన్. ౫౦౨

సింహము బారినుండి తప్పించుకొనిన జంతువులు లేవా యను నే నేమో యని. సింహముబారిఁబడి తప్పించుకొనినఁ దప్పించుకొనవచ్చునుగాని రాముని బారిని బడినవారు తప్పించుకొన రని పాతాళము నుపమానముగాఁ జెప్పు

చున్నాడు. చాప + అవహారము = విల్లనెడు మొసలికలది, సమీపింపఁగానే గబ క్కున వాతవేసి కొనునది యని భావము. భుజాటోప = భుజబలముయొక్క వేగ మనెడి, అధికపంకము = మిగుల బురద గలది, బురదలో దిగఁబడినవాఁడు మరల నెట్లు వెలికి రాజాలఁడో యట్టులే రాముని భుజబలమున కగ్గమైనవాఁడు మరల నూపిరితో రాఁడని భావము. సముద్రమునందు నలలమీఁద నలలువచ్చి, సముద్ర ములోఁబడిన వానిని లోఁగొని యెట్లు హింసించునో యట్టులే రామబాణ పరం పరలు పైఁబడి ముంచి హతునిఁ జేయునని భావము. పటు = దృఢములయిన, శర = బాణము లనెడి, ఊర్మికముఁ = అలలు గలది, దీపిత = బాణకాంతులచేఁ బ్రకా శించు, రణౌఘ = యుద్ధమనెడి ప్రవాహముగల, సీతాపతి పాతాళమందు = సీతా పతియను పాతాళమందు = సముద్రమందు (మహేశ్వర తీర్థీయము).

తా. పాతాళమందుఁబడినవారు మరలఁ బైకి రాఁజాలనట్లు రామ పాతాళమున నీవు పడితివా మరల నూపిరితో వెలుపల రాఁజాలవు. రామపాతాళ మెట్టి దనెదవా, విల్లే మొసలిగాఁ గలది. నీళ్ళలో నడుగుపెట్టి పెట్టక ముందే వాత వేసికొనును. దానిని దాఁటిపోయితివా భుజవేగ మను పెద్ద బురద గలదు. అందు దిగఁబడితివా యంతతోనే చెల్లు. అది దాఁటి పోయితివా బాణపరంపరలను నలలు మీఁదమీఁద వచ్చి పడి లోపలికి నీడ్చుకొని హతుని జేయును. ఇట్టి యుద్ధ ప్రవాహము గల రామపాతాళమందుఁ బడిన జీవితాశ లేదు.

కం. క్షమియింపుము లంకేశ్వర, శమమున లంకకును బొమ్ము ♦ స్వసుతులతోడఁ
రమియింపుము వనసీమను, రమియించుత భార్యతోడ ♦ రాముఁడు ప్రీతిఁ. ౫౦३

ఇట్లు వాస్తవార్థమును జెప్పి ప్రేమాధిక్యమునఁ బ్రార్థించుచున్నాఁడు.

తా. లంకాధిపతీ! నేను బరుషముగఁ జెప్పితి నని కోపింపకుము. క్షమిం పుము. వాస్తవమును నీమేలుగోరి చెప్పితిని. కోప ముడిగి లంకకుఁ బొమ్ము. నీ భార్యలతో నీవు పురమునఁ గ్రీడింపుము. అడవిలో నాయనభార్యతో నాయన క్రీడించుఁ గాక. ఆయన భార్యతో నాయన క్రీడింపకుండఁ జేసితివా నీ భార్యలతో నీవు క్రీడింపఁబోవు.

కం. అనుచును మారీచుం డిటు, తను బోధింపఁగను విబుధ ♦ దమనుఁడు వల్లె
యనుచును లంకాపురికిని, జని తనమందిరముఁ జొచ్చె ♦ సంతుష్టుండై. ౫०४

తా. ఇట్లు మారీచుఁడు హిత ముపదేశింపఁగా నట్టులె చేసెదనని యంగీకరించి లంకకుఁ బోయి సంతోషముతోఁ దన గృహము ప్రవేశించెను.

ఇప్పటికి రావణునకు శూర్పణఖావిరూపకరణ వృత్తాంతము తెలియదు, అకంపనుఁడు తెలిసియుఁ జెప్పలేదు. ఏల చెప్ప లేదు ? రావణాసురుఁడు ఖరాదు

లకు రామచంద్రునకు యుద్ధమేల తటస్థించె నని యడిగినవాఁడు కాఁడు. అందఱు ఋషులను జంపఁబోయినట్లు రామునిఁ జంపఁబోయి చచ్చిరేమో యని తలఁచి రావణుఁడు ప్రశ్నింపలేదు. తానై చెప్పుటకు నకంపనుఁ డంతటి ధైర్యవంతుఁడు గాఁడు. సీతయుఁ గాదు. నీ చెల్లెలి ముక్కు చెవులు రామలక్ష్మణులు గోసిరి. ఆ కారణమున యుద్ధము పొసఁగెనని శూర్పణఖ వారియొద్ద కేల పోయెనని రావణుఁ డడుగును. సేవకుఁడు నీ చెల్లెలు ఆంకాడఁబోయినదని యెట్లు చెప్పును! మఱియేదైన గారణము చెప్పిన శూర్పణఖవచ్చి యేమి చెప్పునో - అది వచ్చును. చెప్పును. ఆ వెంట మన కేల యని యకంపనుఁ డా విషయము ప్రస్తావించిన వాఁడు కాఁడు కావున రామునితో బలవద్విరోధ మేల? నే నొకఁడను బోయిన నందఱఁ జంపిన వానిని నేను జయింపఁగలనని యేమి నమ్మకముని యాలోచించి సంతుష్టుఁడై యింటికిఁ బోయెను.

—♦ ౩౨-వ సర్గము. శూర్పణఖ లంక కేగి రావణుఁ జూచుట ♦—

సీ. ఈరేడు వేవురు ♦ క్రూరరాక్షసవరుల్, ఖరుఁడు దూషణుఁడు త్రి♦శిరుఁడు లోను
గా నొక్కరాముచేఁ ♦ గదనతలంబునఁ, గూలుట గనుఁగొని ♦ యోలిఁగొనుచు
భూరిరావమున వా♦పోవు చనన్యదుష్కర మైన రామవి♦క్రమముఁ గాంచి
యుద్విగ్న యగుచును ♦ నురవడిఁ జని దశ, కంఠరక్షితము లంకాపురంబుఁ
తే. గదియ నరిగి విమానాగ్ర♦గతుని దీప్త
తేజు సురపరివృత సుర♦రాజుఁబోలి
సచివయుతుఁ డగువాని భా♦స్కరనిభంబు
కాంచనాసనమున యథా♦కామితముగ. ౫౦౫

ఈరేడు = రెండేడులు = పదునాలుగు, వేవురు = వేయిమంది, ఒక్క రాముచేఁ = ఒంటరివాఁడైన రామచంద్రమూర్తిచే, కదనతలంబునన్ = యుద్ధభూమియందు, ఓలిఁగొనుచున్ = అఱచుచు, వాపోవుచున్ = ఏడ్చుచు, అనన్యదుష్కరము = ఇతరులకు సాధ్యముకానిది, ఉద్విగ్న = మిక్కిలి భయపడినది, ఉరవడిన్ = మిగుల వేగముగ, విమానాగ్రగతునిన్ = పుష్పకమందున్నవానిని, సురపరివృత = దేవతలచేఁ జుట్టఁబడిన, సురరాజున్ = ఇంద్రుని, సచివయుతుఁడు = మంత్రులతోఁ గూడినవాఁడు, భాస్కరనిభంబు = సూర్యునితో సమానమైనది యగు, కాంచనాసనమునన్ = బంగారుపీఠమునందు, యథాకామితముగన్ = ఇష్టప్రకారము.

తా. పదునాలుగువేలు క్రూరులైన రాక్షసశ్రేష్ఠులు ఖరుఁడు దూషణుఁడు త్రిశిరుఁడు మొదలైనవా రొంటరివాఁడైన రామచంద్రుచే యుద్ధమందుఁ జచ్చుట

చూచి బొబ్బలుపెట్టుచు గట్టిగ నేడ్చుచు నితరులకు సాధ్యముగాని రాము పరాక్రమము చూచి మిగుల భయపడి శీఘ్రముగ రావణుఁడు పాలించు లంకకుఁ బోయి దేవతలచేఁ జుట్టఁబడిన యింద్రునివలె పుష్పకవిమానమందు మంత్రులతోడ సూర్యునిబోలిన బంగారుపీఠమందుఁ దన యిష్టప్రకారము.

తే. జాతరూప వేదీస్థజా♦జ్వల్యమాన, జాత వేదునిగతి నొప్పు♦సకల దేవ
భూతగంధర్వతాపస♦జాతముల క,జయ్యుఁ డగువాని శమనుని♦సాటివాని. ౫౦౬

జాతరూప = బంగారుమయమైన, వేదీస్థ = వేదియందు, జాజ్వల్యమాన = మండుచున్న, జాతవేదునిగతిన్ = అగ్నిహోత్రునివలె, అజయ్యుఁడు = జయింప శక్యముగానివాఁడు, శమనుని = యముని.

తా. బంగారిటికలతోఁ గట్టబడిన వేదియందు డి నేతితో హోమము చేయుటచే మండుచున్న నగ్నిహోత్రునివలె సమస్తభూతములకు గంధర్వులకు తాపస జాతములకు = తపస్వుల సమూహములకు జయింప సాధ్యపడనివానిని యమునివంటి వానిని.

కం. అసురసురవిషమసంయుగ, రస నతులితనిశితకులిశ ♦ ప్రహారణకలితో
ల్లసితవ్రణు సురకరిసర, భసదంతకృతకిణకలిత♦పటువత్సతలున్. ౫౦౭

అసుర = రాక్షసులయు, సుర = దేవతలయు, విషమ = భయంకరమైన, సంయుగ + రసన్ = యుద్ధభూమియందు, అతులిత = అసమానమైన, నిశిత = పదునైన, కులిశ = వజ్రాయుధముయొక్క, ప్రహారణ = దెబ్బచే, కలిత = చేయఁబడిన, ఉల్లసిత = ప్రకాశించు, వ్రణున్ = గాయముగలవానిని, వజ్రాయుధముచే గాయము మాత్రమే కలిగెనుగాని మరణము లేదని భావము. సురకరి = ఐరావతముయొక్క, సరభస = వేగముతోఁగూడిన, దంత = దంతములచే, కృత = చేయఁబడిన, కిణ = కాయలచే, కలిత = కూడిన, పటు = దృఢమైన, వత్సతలున్ = వక్షముగల వానిని.

తా. దేవాసురులకు జరిగిన ఘోరయుద్ధమందు అసమానమైన పదునుగల వజ్రాయుధము దెబ్బచే గాయముమాత్రము పడిన వక్షముగలవానిని, ఐరావతము కొమ్ములచేఁ బొడువఁగా కాయలుకాచిన ఱొమ్ము గలవానిని.

కం. ఇరువది నిడుకరములు, పది,శిరములు వింజామరములు♦ శ్వేతచ్ఛత్రం
బురువిపులోరము భూపతి, వరలక్షణములును గలుగు♦వానిని వీరున్. ౫౦౮

ఉరు = గొప్పతనము, విపుల = విశాలమైన, ఉరము = ఱొమ్ము.

ఇందు రావణునకుఁ బదితలలు ఇరువదిచేతు లున్నట్లు చెప్పఁబడినది. వీనికి నాలుగు కాళ్ళున్నట్లు కొన్ని ప్రమాణములు గలవు.

ఇత్యుక్తా మునినా తేన దుఃఖహర్ష సమన్వితా। అచిరేణైవ కాలేన, సుషువే పుత్ర మద్భుతమ్। దశాస్యం వింశతిభుజం భిన్నాంజనచయోపమమ్। పాదైశ్చతుర్భి రత్యుగ్రం తామ్రోష్ఠం తామ్రమూర్ధజమ్॥ నారదీయే జైమినీ రామాయణే ద్వాదశేధ్యాయే సప్తదశశ్లోకః॥ రఘువంశే అష్టాదశసర్గే — భుజమూర్ధోరు బాహుళ్యా దేకోపిధనదానుజః — జానకీపరిణయనాటకే. శిరోదశకమగ్రతః పదచతుష్టయం చాన్యోః

దశాస్యోవింశతి భుజశ్చతుష్పాన్మానమందిరం. ఇత్యభిధాన రత్నమాలా.
వీనితలలగుఱించిన చర్చ వేఱొకచోఁ గానసగు.

తా. దీర్ఘములైన ఇరువది చేతులు, పది తలలు, తెల్లని చామరములు, తెల్లగొడుగు, విశాలమై యెత్తైన ఱొమ్ము రాజచిహ్నములుగల వీనిని.

తే. స్నిగ్ధవైడూర్యసంకాశు।నిగనిగత్సు, వర్ణ మణికుండలుని మహా।వదను శుక్ల
దశను విష్ణుచక్రాదిసా।ధనశతాన్య, శస్త్రతాడితు నాహత।సకలదేహు. ౫౦౯

స్నిగ్ధ = మినమిన మెఱయుచున్న, వైడూర్యసంకాశుఁ = వైడూర్యముతో సమానమైనవానిని, వైదూర్యము ॥రూ॥ నిగనిగత్ = నిగనిగలాడుచున్న, సువర్ణ = బంగారుతోఁజేయఁబడిన, మణికుండలునిఁ = రత్నములు చెక్కఁబడిన చెవికుండలములు గలవానిని, మహావదను = పెద్దముఖము గలవానిని, శుక్లదశను = తెల్లని దంతములు గలవానిని, విష్ణుచక్ర = విష్ణుచక్రము, ఆది = మొదలుగాఁగల, సాధనశత = అనేకాయుధములచేతను, అన్యశస్త్ర = ఇతరములయిన శస్త్రములచేతను, తాడితుఁ = కొట్టఁబడినవానిని, ఆహత = కొట్టఁబడిన, సకలదేహుఁ = సమస్తావయవములు గలవానిని, వానిదేహమునందు దెబ్బతగులనిభాగము లేదని భావము. విష్ణుచక్రము = విష్ణుచక్రమనఁగా నారాయణు సుదర్శనమని భ్రమింపరాదు. మాల్యవదాదులతో యుద్ధముచేసినట్లు రావణునితో విష్ణువు యుద్ధముచేసినట్లు రామాయణమున లేదు. కావున సుదర్శనప్రయోగమునకుఁ గారణములేదు. ఈ విష్ణుచక్రమనునది ఆ పేరుగల యాయుధము. దీనిని విశ్వామిత్రుఁడు రామచంద్రమూర్తి కుపదేశించెను. (బాల ౬౭౨ పద్యము చూచునది.) దీనినే విశ్వామిత్రుఁడు వసిష్ఠునిపైఁ బ్రయోగించెను. (చూడు ప ౧౦౭౦. బాల.) సుదర్శనచక్రము విశ్వామిత్రున కెట్లు లభించె? అతఁ డది ప్రయోగింప వ్యర్థమెట్లయ్యె? ఇంతకు సుదర్శనమనునది భగవంతుని సంకల్పశక్తి. అది తదితరుల కెట్లు లభ్యపడును?

ప్రాణో మాయా క్రియాశక్తిః। భావ ఉన్మేష ఉద్యమః
సుదర్శనం చ సంకల్పః। శబ్దాః పర్యాయ వాచకాః అహిర్బుధ్న్య॥౧॥

ఉన్మేషః పరమః శక్తేర్విష్ణోః కోట్యంశకోట్యశః, । భావ్యభావక భేదేన సా ద్విధా వ్యవతిష్ఠతే, భావకో విష్ణుసంకల్పః । సుదర్శనవరాహ్వయః॥

కావున నీపేరటియస్త్రమును ఇంద్రుఁడో మఱియెవరో ప్రయోగించిన రావణు నది గాయపఱచియుండును. అంతియకాని యది సుదర్శనచక్రముగాదు.

తా. వైదూర్యమువలె మినమిన మెఱయువానిని, నిగనిగలాడు రత్నములు చెక్కిన బంగారుకుండలములు గలవానిని, పెద్దముఖముగలవానిని, తెల్లని దంతములు గలవానిని, విష్ణుచక్రము లోనగు ననేకాయుధములచేఁ గొట్టఁబడి గాయఁబడిన సకలావయవములు గలవానిని.

కం. అక్షోభ్యార్ణవనిచయ, ప్రక్షోభణు సకలభూరి ♦ వసుధాధరసం
  ప్రక్షేప్తను సురవరబల,విక్షేపకు రాక్షసైక ♦ విభు భీప్రదునిన్. ॥౧౦

అక్షోభ్య = ఇతరులకుఁగలఁతపెట్టసాధ్యపడని, ఆర్ణవనిచయ = సముద్ర సమూహములను, ప్రక్షోభణున్ = కలఁతపెట్టువానిని, సకల = సమస్తములైన, భూరి = గొప్పవగు, వసుధాధర = పర్వతములను, ప్రక్షేప్తను = విసరివేయుఁగలవానిని, సురవరబల = దేవతాశ్రేష్ఠులబలమును, విక్షేపకున్ = తిరస్కరించువానిని, రాక్షసైకవిభున్ = రాక్షసుల కొక్కఁడే ప్రభువగువానిని, భీప్రదునిన్ = భయముకలిగించువానిని.

తా. ఇతరులకుఁ గలఁతపెట్ట సాధ్యపడని సముద్రములను గలవరపఱచు శక్తిగలవానిని, సమస్తపర్వతములను నెగమీటఁగలవానిని, దేవేంద్రాదుల బలమును దిరస్కరించినవానిని, చూచువారికి భయముగలిగించువానిని, రాక్షసులకు నొక్కఁడే ప్రభువగువానిని.

తే. అన్యదారాభిమర్శను ♦ నఖిలదివ్య,శస్త్రయోక్తను దాపస ♦ సప్తతంతు
  విఘ్నకరు భోగవతి సర్ప♦విభుని వాసు,కినిబరాజితుఁ జేసి ప్ర ♦ ధనమునందు. ॥౧౧

అన్యదార = ఇతరులభార్యలను, అభిమర్శను=అపహరించువానిని, అఖిల ... యోక్తను = సమస్తదివ్యములైన శస్త్రములతోఁగూడినవానిని, సప్తతంతు = యజ్ఞములను, ప్రధనమునందు = యుద్ధమందు, పరాజితుఁజేసి = ఓడించి.

తా. ఇతరులభార్య నపహరించువానిని, సమస్తములైన దివ్యాయుధములతోఁగూడినవానిని, ఋషుల యజ్ఞముల విఘ్నపఱచువానిని, భోగవతీపురమున సర్పరాజైన వాసుకిని యుద్ధమందు నోడించి.

కం. తక్షకుని నోడిచి తద్వన,జేక్షణ హరియించి హారన ♦ గేంద్రమునందున్
  యక్షపతి గెలిచి పుష్పక, మాక్షణమునఁ దెచ్చినట్టి♦యతిశూరవరున్. ॥౧౨

ఒడిచి = గెల్చి, తద్వనజేక్షణన్ = వానిభార్యను, హరనగేంద్రమునందున్ = కైలాసపర్వతమందు, యక్షపతిన్ = కుబేరుని.

తా. తక్షకుని గెలిచి యాతనిభార్య నపహరించినవానిని, కైలాసమునందుఁ గుబేరుని గెలిచి పుష్పకమను విమానమును దెచ్చిన శూరుని.

క. నందనచైత్రరథంబుల, సుందరనుతనళిని గినుక ♦ జొచ్చి వినాశం
బొనరించినబలి నుదయాంబాదిరవిశశులఁ జేత ♦ నాఁగెడు బలియున్. ౧౩

నందన = దేవతల యుద్యానవనము, చైత్రరథము = కుబేరుని యుద్యానము, నళిని = సరస్సును, రూ. నళినము, కినుక = కోపము, రవిశశుల = సూర్యచంద్రుల 'వరాంత శి, బహువచనంబున ను' యగు ఆఁగెడు = అడ్డగించు.

ఇంద్రుని యుద్యానవనమును, కుబేరుని యుద్యానమందుగల నళినియను సరస్సును, కోపించి నాశనముచేసిన బలిష్ఠుని, ఉదయించు సూర్యచంద్రులను, చేతితో నడ్డగింపఁగల శక్తిమంతుని.

సీ. హా యన లోకముల్ ♦ హాయనదశసహస్రకము తపంబును ♦ జలిపి మున్ను
పరమేష్ఠి గూరిచి ♦ శిరములు దెగఁగోసి, యర్పించి పూజించి ♦ యతనిచేత
దైతేయదేవగం ♦ ధర్వపిశాచపతంగోరగములచే ♦ తను మనుష్య
జాతీతరములచే ♦ నగ్రాహ్యమున మృతి, లేకుండ వరములఁ ♦ జేకొనుచును
ఆ. హోమములను జెఱిచి ♦ సోమంబు హరియించి, ప్రాప్తయజ్ఞములను ♦ బాధచేయు
బ్రహ్మహంత దుష్టు ♦ బాధకర్కశు దయా, హీను నహితరతుని ♦ నింద్రవైరి.

హా = అయ్యో, హాయనదశసహస్రకము = పదివేలసంవత్సరములు — పరమేష్ఠిన్ = బ్రహ్మను, మనుష్యజాతీతరములచే = మనుష్యజాతికంటె నితరములయిన జాతులచేత, ప్రాప్తయజ్ఞములను = దక్షిణాదానమువఱకు వచ్చిన యజ్ఞములను, బ్రహ్మహంతన్ — బ్రాహ్మణులను జంపువానిని బాధకర్కశున్ = మిగులఁగఠినుని, దయాహీనున్ = దయలేనివానిని — ఇంద్రవైరిన్ = ఇంద్రునకుఁ బగవానిని.

ఉ. రావణు సర్వభూతచయ ♦ రావణు నిర్జరలోకలోకవి
ద్రావణు నట్టహాసకృత ♦ దైవతకంజముఖాళిగర్భవి
స్రావణు భూరిదోశ్చయప ♦ రాక్రమభంజితగాఢదంతకై
రావణు లోకపీడన ♦ పరాయణుఁ గుత్సితధీతురాయణున్. ౧౫

రావణున్ = రావణుఁడను బిరుదును బొందినవానిని, రావణుఁడను పేరు నకును వచ్చినదే కాని నామకరణము నాఁడు పెట్టఁబడినది కాదు. మొదటి పేరు దశకంఠుఁడు.

క౦. విశదయశుండును ధాత్రుస,ద్విశుఁడగు సమ్మానివచ్చి ♦ దృష్టించి సుతుఁ౯ ।
దశకంధరుఁడగుకతమున, దశకంధరుఁడనుచు నిడియెఁ ♦ దన్నామంబు౯ ॥
ఉత్తర. ౧౯౨.

విశ్రవశ్శబ్దము నకు నపత్యార్థక తద్ధితము పుల్లింగంబున రావణుఁడయ్యె. ఇది వైయాకరణమతము. కైలాసపర్వతముక్రింద జేతులుపడి నలిగినపుడు లోకము నిండ ధ్వనించుటచేఁగాని, లోకమును హాహారావపూరితము చేయుటచేఁగాని, రావణుఁ డయ్యెనని పౌరాణికమతము.

ఇది యుత్తర రామాయణమున క. శైలాక్రాంతుఁడవై నీవిలిల మహా రవంబు నెల్లజగంబుల్ వ్యాలోలంబుగఁజేయుట, హాళి౯ ఘటియించు రావణాఖ్యను నీకు౯॥ "౩౩౬" అని శివుఁడు చెప్పెను.

రామపత్నీం. వనస్థాం, నిన్రా యేతి రావణః॥ అని మాంత్రికులందురు. ఇది మాంత్రికమతము. రామపత్నిని, వనస్థను, నపహరించినవాఁడు రావణుఁడు.

రవణస్యాపత్యం పుమా౯ రావణః, రవణుని కొమారుఁడు కావున రావణుఁ డని యొక వ్యుత్పత్తి గలదు.

సర్వభూతభయావహు౯ = సమస్తప్రాణులను మిక్కిలియుని యఱపించు వానిని, గర్జల్లోక = స్వర్గముందలి, లోక = జనులను, విద్రావణు౯ = పరు వెత్తునట్లు చేయువానిని, అట్టహాస = పెద్దనవ్వుచే, కృత = చేయఁబడిన, దైవత = దేవతలయొక్క, కంజముఖాళి = స్త్రీసమూహముల, గర్భ = గర్భముల, విస్రావ ణు౯ = జాఱిపోవుట గలవానిని, భూరి = గొప్పవగు, దోః + చయ = బాహు సమూహములయొక్క, పరాక్రమబలముచే, భజింత = విఱుగఁగొట్టఁబడిన, గాఢ = అధికమైన, దంతక = దంతములుగల, ఐరావణు౯ = ఐరావతమను నేనుఁగుగల వానిని, లోకపీడన = లోకములను బాధించుటయును, పరాయణు౯ = సర్వము నయినవానిని, లోకమును బాధించుటతప్ప వానికి వేఱు కోరికలేదనుట. 'పరమా సక్తే రయనం పరాయణం' పరమాసక్తికి స్థానమైనవాఁడు, కుత్సితధీ = కుచ్చితపు బుద్ధియందుఁ దొందరగలవానిని, తుర = త్వరగా—తురస్యాయనం = తురాయణం.

తా. సమస్తప్రాణులను మిక్కిలియుని యేడిపించువానిని, దేవతలను బాఱఁ దోలినవానిని, పెద్దనవ్వుచేతనే దేవతాస్త్రీలకు గర్భస్రావమగునట్లు చేయువానిని, (గర్భిణీస్త్రీలు పెద్దయుఱుము పిడుగుధ్వని వినినను ఉన్నట్లుండి ఉక్కిలి భయ పడినను గర్భము పడిపోవును.) భుజశౌర్యముచేత విఱువఁబడిన యైరావతము

యొక్క దంతములు గలవానిని, జనుల బాధించుటయందే పరమాసక్తి గలవానిని, కుచ్ఛితపుటాలోచనయందు తొందరగలవానిని.

కం. రాక్షసకులవర్ధనుఁ బ్రత్యక్షలయాంతకుని భూషణాలంకృతునిన్
వీక్షించి నిజభ్రాతను, రాక్షసి శూర్పణఖ భయభరంబునఁ బలికెన్. ౫౧౬

రాక్షసకులవర్ధనున్ = రాక్షసవంశమును వృద్ధిచేసినవానిని, 'వర్ధనం ఛేద నేపిస్యాత్.' నానా ॥ర॥ అని యుండుటచే నింతవఱకు రాక్షసకులము వృద్ధిచేసిన వానిని, ఇఁక ఛేదించువాని నని గ్రహింపవలయును.

ప్రత్యక్షలయాంతకునిన్ — కన్నులకుఁ గానవచ్చు ప్రళయకాలమందలి యముని, ఆ యముని జూచినవారు లేరు, ఇప్పుడు వీనినిఁ జూచిన ప్రళయకాలయముఁ డిట్టివాఁడు గదా యని తెలిసికొనవచ్చును. భూషణాలంకృతునిన్ = భూషణము లచే నలంకరింపఁబడినవానిని, భయభరంబునన్ = భయాతిశయముచే.

తా. ఇంతవఱకు రాక్షసవంశమును వృద్ధిపఱిచినవాని, కన్నులకుఁ గాన వచ్చు ప్రళయకాలయముని, ఆభరణములచే నలంకరింపఁబడినవానిని, తన యన్నను జూచి శూర్పణఖ రామునివలనఁ గలిగిన భయాతిశయమున నిట్లనెను.

—♦ 33-వ సర్గము. శూర్పణఖ రావణు నిందించుట. ♦—

ఉ. మంత్రులు లాలింప నవమానముపాటును దుఃఖపాటు మ
ర్త్యాంతకుఁ డట్టిచూడఁగ దురాగ్రహ మెత్తి ప్రమత్త! దుర్మదా!
సంతతకామభోగముల జాల్ముఁడవై మ నిరంకుశుండవై
చెంతల నిన్ను ద్రుంగ వెసఁ జేరినమృత్తిని గానలేవుగా. ౫౧౭

మర్త్యాంతకుఁడు = రాక్షసుఁడగు రావణుఁడు, అట్టిచూడఁగ = ముఖ నయనవికారములు లేక చూడఁగా, అది మనస్సునందుఁ దన్నుఁ జూడఁగానే రావ ణుఁడు, ఏమే చెల్లెలా! నిన్నెవ్వఁడే యిట్లుచేసెను? అని లేచివచ్చి యాదరించునని తలఁచియుండునది. రావణుఁడు దాని నెగాదిగ చూచుచుండెను గాని యది యను కొన్నట్లు చేసినవాఁడుగాఁడు. ప్రమత్తా = దేహము తెలియనివాఁడా, దుర్మదా = చెడ్డగర్వముగలవాఁడా, జాల్ముఁడవు = మూఢుఁడవు, నిరంకుశుండవై = అడ్డము లేనివాఁడవై, మృత్తిని = మృత్యువును.

తా. తనకుఁ గలిగిన యవమానము తన దుఃఖము చూచికూడ నాదరిం పక యూరక చూచుచున్న రావణుఁజూచి మంత్రులు వినుచుండ మంత్రుల సన్నిధి నిట్లు పలుకవచ్చునా యనికూడఁ దలంపక దురాగ్రహముచే నిట్లనియె : ఓరి! కండక్రొవ్వున మదించి దేహము తెలియనివాఁడా (నీ దేహమే నీకుఁ దెలియ

నపుడు నన్ను నీ కెట్లు తెలియు నని భావము) ఎల్లవేళలఁ గామసుఖములందు నాసక్తిగలిగి యడ్డములేక దండించువాఁడును లేక మూఢుడవై నీప్రక్కన నిన్ను వాత వేసికొనుటకై కాచియుండు మృత్యుదేవతను నీవు తెలిసికోలేక యున్న వాఁడవుకదా.

చ. సతతము గ్రామ్యభోగముల ♦ సక్తుఁడు రక్తుఁడుఁ గామవృత్తుఁ డౌ
క్షితిపతినిఁ స్మశానపుశిఖింబలె లోకులు గౌరవింతురే!
మతిచెడి రాజ్యకార్యముల ♦ మానుగఁ దాన యొనర్పనట్టి భూ
పతి సహకార్యజాలుఁ డయి ♦ పాడయి పోవు స్వరాజ్యయుక్తుఁడై. ౫౧౮

గ్రామ్యభోగంబులఁ = మైథునాది కార్యములయందు, సక్తుఁడు = తగిలిన మనస్సుగలవాఁడు, రక్తుఁడు = ప్రీతిగలవాఁడు, కామవృత్తుఁడు = ఇచ్ఛవచ్చినట్లు నడుచువాఁడు, క్షితిపతినిఁ = రాజును, స్మశానపుశిఖింబలెఁ = వల్లకాటియందలి నిప్పువలె, అగ్నిహోత్రము సర్వదా పవిత్రమైనదే జనులచే నాదరింపఁ బడవలసిన నదే అయినను స్మశానాగ్ని త్యాజ్యము గదా-అట్లు రాజు సర్వజనసేవ్యుఁడే యైనను గామాసక్తుఁడై లోకమువారికి నిష్ప్రయోజకుఁ డగుటచేఁ ద్యాజ్యుఁడే.

మతిచెడి = బుద్ధిచెడిపోయి, అనఁగా నాలోకించు శక్తిలేక- 'వినుమక సతులం దగిలెడి జనునకు నెక్కుడివి బుద్ధిచాతుర్యంబుల్' అన్నట్లు స్త్రీలతో నెక్కువగా రమించువానికి బుద్ధిబలము ఉడుగు.

తా. ఎల్లప్పుడు స్త్రీలతో రతిక్రీడలనే మరగి వానియందే ప్రీతిగలవాఁడై తనయిచ్ఛవచ్చినచొప్పున సంచరించురాజును ప్రజలు స్మశానాగ్నివలె గౌరవింతురా! నీయందట్టి దోషములుండుట వలననే నిన్ను లోకులు గౌరవింపరు. స్త్రీలతో విశేషముగ సంభోగించుటచే బుద్ధిబలముచెడి కార్యాకార్యము లాలోచించుశక్తిలేక రాజకార్యములు తాన్నె చేయుని రాజు తాను చెడును. వాఁడు పూనిన కార్యములు చెడును. వాని రాజ్యము చెడును. నీ పిగతికే రానున్నావు.

ఇదివఱకే రావణుడు స్త్రీవ్యసనమున మతిచెడినాఁడని దూషించుచు సీతాదేవిని భార్యగా గ్రహింపుమని తాను బోధించుచున్నది.

ఉ. చారుల నేరి నుంపక వి♦చారవిదూరతఁ బోకొట్టికిఁ
సారెకు దన్యవంబిడక ♦ చాటున మాటున నుండి కార్యపు
భారములందు నెవ్వరివో ♦ మాటల నమ్ముచు నస్వతంత్రుఁ డౌ
ఘోరమహేంద్రుఁ బంకమును ♦ సామజరీతి నరుల్ త్యజింపరే. ౫౧౯

చారులఁ = వేగువాండ్రను, విచారవిదూరత = ఆలోచనములేక, అస్వతంత్రుఁడు = పరాధీనుఁడు, ౧ భార్యాదిపరతంత్రుఁడు, ౨. దోషీఁబోవువారికిఁ

బరతంత్రుఁడు, 3. మంత్రులకుఁ బరతంత్రుఁడు, పంకమును=బురదను, సామజరీతి = ఏనుఁగువలె, త్యజింపరే = వదలరా.

తా. వేగులవారి నేర్పాటుచేసి యెక్కడెక్కడ నేయే కార్యములు జరుగుచున్నవో— యెవరు మిత్రులో యెవరు శత్రువులో మొదలయినవి తెలిసికొనక— ఆలోచనయు లేక — ప్రజలకుఁ బలుమారు దర్శన మీయక యంతఃపురమున కాంతాసంగతుఁడై చాటున నుండుచు కార్యములు తానై చేయవలసివచ్చినపుడు పూర్వోత్తరసందర్భములు తెలియమిచే నవరో సంబంధము లేనివారో, స్వార్థపరులో చెప్పిన మాటలు నమ్ముచు భార్యలు, మంత్రులు, త్రోవనఁబోవువారు చెప్పినమాటలు నమ్మి పరాధీనుఁడైన రాజును, బురదనుండి యేనుఁగు దూరమునందే తొలఁగునట్లు లోకులు తొలఁగిపోదురు.

చ. తమతమ పెత్తనంబు చెడఁ ♦ దారు స్వతంత్రులు గాక ధారిణీ
రమణులు వేరిచేతఁ దమ ♦ రాష్ట్రము నేలఁగఁ జేయఁ జూతురో
క్రమమున వారిచేత జల ♦ రాశి నగంబులపోల్కి మున్గి రూ
పము చెడిపోవుచుందురు ♦ ప్రాభవముల్ మును మున్న నాశిలన్. ౫౨౦

పెత్తనము = పెద్దతనము, నగంబులపోల్కి = పర్వతములవలె, ప్రాభవముల్ = ప్రభుత్వ గౌరవసంపదలు.

తా. అన్ని కార్యములందుఁ దాను పెద్దగానుండి తన యిష్టప్రకారము స్వతంత్రించి కార్యములుచేయక యితరులకుఁ బెత్తనమిచ్చి వారిచేఁ గార్యములు చేయించు రాజులు సముద్రములోఁ బర్వతములు మునిఁగినట్లు వారిచేతనే చెడుదురు. వారి ప్రభుత్వము, అధికారము సంపద వారికంటె ముందుగానే నశించును.

ఉ. నీ కపకారము న్నలప ♦ నిచ్చలు సందులు రోయుచుండ నా
నాకనివాసదానవగ ♦ ణంబులు చారవిచారదూరతన్
బ్రాకటబుద్ధిచంచలతఁ ♦ గ్రాలెదు నీ వెటు లింక రాజవై
యీకరణిన్ మనంగఁ గల ♦ వీయిలఁ బ్రాణములోడ నేనియున్. ౫౨౧

నిచ్చలు = నిత్యము, నాకనివాస = దేవతల, చారవిచారదూరతన్ = వేగులవాండ్రుగాని యాలోచనగాని లేకుండుటచే, బుద్ధిచంచలతన్ = స్థిరమైన బుద్ధిలేమి.

తా. నీకుఁ గీడుచేయ నెపుడు సందుదొరకునా యని దేవతలు దానవులు నెల్లప్పుడు సమయము వెదకుచుండ వేగులులేక కార్యాలోచనపరత్వము లేక స్థిరబుద్ధిలేక చపలుఁడవై యుండు నీవు రాజవై యీ ప్రకారము ప్రాణములతోనైన నెటులుండఁగలవు ?

క0. పో దింతకుఁ బసితనముల్, రా దేమియుఁ దెలివి నీకు ♦ రాక్షస నాథా!
లే దెఱుక వలయుపట్లన్, భూదయితుఁడ వగుచు నెట్లు ♦ పొలుపొందెదవో.

ఇంతకున్ = ఇంతవఱకు, పసితనము = బాల్యము, భూదయితుఁడవు = రాజవు.

తా. ఇన్ని యేండ్లు చెల్లి యింతవయస్సు వచ్చినను అవివేకము పోలేదు. వివేకము రాలేదు. ఏ పని తెలియఁదగినదో యది నీ వెఱుఁగవు. ఇట్టివాఁడవు. రాజవై యెట్లు బాగుపడెదవు.

క0. వేగుల బండారంబుల, నా గనునీతులను నెనఁడు ♦ పరతంత్రుం డౌ
నాగర్వితనపుమన్నీఁ, డోగద్దరి ప్రకృతిజనుల ♦ కుదియ సుమ్మీ. ౯౨3

వేగుల్ = వేగులవాండ్ర, శత్రురాజుల చరిత్రము, తన రాజ్యములోని వారి నడవడి విషయమునను, బండారంబులను = ధనగృహంబులందును, గర్వితనపుమన్నీఁడు = గర్వముగలరాజు, గద్దరి = దిట్టతనము గలవాఁడా, ప్రకృతిజనులకున్ = పామరులకు, పుట్టినవారు పుట్టినట్లు తెలివితేటలు లేక యుండువారు యథాజాతులు, ఉద్ది = సమానము.

తా. తనకు స్వంత వేగులవాండ్రులేక యితరు లేర్పాటుచేసిన వేగులవాండ్ర మాటలు నమ్మి వర్తించువాఁడును, ధనకోశమునఁ బరులకుఁ బెత్తన మిచ్చినవాఁడును, ఇతరులు చెప్పిన నీతుల ననుసరించువాఁడును, వాఁ డెంత దిట్టతనము గల ప్రభువైనను పామరునకు సమానుఁడే.

క0. దూరస్థపువిషయంబులఁ, జారులచే నెఱుఁగుఁ గాన ♦ క్ష్మారమణునకున్
దూరపుఁజూపరి యనుపే, రారయ సార్థకము; లేద ♦ యది నీయందున్. ౯౨౪

తా. దూరదేశంబుల జరుగు విషయంబులను వేగులమూలమునఁ దాను సమక్షమునఁ జూచువాఁడే యగును. కాన రాజునకు (నీతిచక్షువు) దూరపుఁ జూపు గలవాఁడని పేరు. నీకు వేగులు లేరు గావున నీ కా చూపు లేదు.

క0. ఈ నటిక సచివవర్గము, మానక సేవింప సుఖము ♦ మరగుట నేచం
దాన నటిఁగెదు స్వజనవి, తానజనస్థానలయముఁ ♦ దద్వైరులచేన్. ౯౨౫

నటిక్ = విధముగ, సచివవర్గము = మంత్రుల సమూహము, స్వజనవితాన = నీవారి సమూహముగల, జనస్థానలయము = జనస్థానము నాశమగుట, త్వత్ = నీ, వైరులచేన్ = విరోధులచే.

తా. ఈ విధముగ నిప్పుడు నీవున్నట్లు మంత్రులగుంపు సేవింపఁగా వారి మాటలు వినుచు సుఖము మరగిన కారణముచే నీ జనస్థానమున నీ బంధువు

లందఱుఁ జచ్చిన వార్త నీ వెఱుఁగఁగలవు? తాను జెప్పఁబోవు నాలోచనను మంత్రులు విఱుపు చెప్పనీరను నభిప్రాయముతో ముందుగనే వారిమీఁద దెబ్బ తీయుచున్నది.

కం. పదునాలుగువేవురరణపదమున ఖరదూషణాదిబంధుయుతముగా
సదమదము చేసెఁ ద్రిజగద్విదితంబుగ రామఁడొకఁడ♦వింటిబలమునన్. ॥ ౧౬

సదమదము = నాశము, త్రిజగద్విదితంబుగన్ = మూఁడులోకములకుఁ దెలియునట్లు.

తా. ఖరదూషణాది బంధువులతోడఁ బదునాలుగు వేల రాక్షసులను రామచంద్రమూర్తి యొకఁడే తన వింటిబలముచే యుద్ధభూమిని నాశము చేసెను.

ఆ. నీ సహోదరాళి♦నిర్మూలము మొనరించె, ఋషులకెల్ల నభయ♦మిచ్చి కాచె
నిర్భయంబుఁ జేసె♦నీదండకాటవి, సాంద్రబలుఁడు రామ♦చంద్రుఁ డిపుడు.

తా. నీ తమ్ములను బంధువులను నందఱను మొదలుముట్ట నొకఁడైన లేకుండునట్లు నాశముచేసెను. నీకు విరోధులై నీ కీడుగోరు ఋషుల కందఱకు మీ కిఁక రావణభయము లేదు. నేను రక్షించెదనని చెప్పెను. దండకారణ్యమున నీవారిభయము లేకుండఁ జేసెను. ఇవియన్నియు మిగుల బలముగల రామచంద్రుఁ డొక్కఁడే చేసెను.

చ. పిసినివి, వేగువారలకు ♦ వేతన మీయవు, లెస్స మత్తుచే
వసపడి కార్యతంత్రములు♦వారికి వీరికి మందబుద్ధివై
యసమటి మీఁ దెఱుంగవు, భ♦యంబు స్వదేశమునందుఁ బుట్టె నీ
పిసిరొ యెఱుంగ విందనుక ♦ నేమని నిన్ననవచ్చు రావణా! ॥ ౧౭

పిసినివి = లోభివి, వేతనము = జీతము, వసవడి = వశపడి, మందబుద్ధివై బుద్ధిలేనివాఁడవై, అసము = కీర్తి, అటి = క్షయించి, మీఁదు = రాఁగలది. =

తా. లోభివి కావున వేగులవారికి జీతము లీయవు కావున వారందు జరుగు వృత్తాంతములు నీకు వెంటవెంటనే తెలుపరు. బాగుగ మదించి యితరులకు స్వాధీనపడి స్వతంత్రశక్తి లేక యా మంత్రి యీ మంత్రి చెప్పినట్లు వినుచు రాఁగల కీడు తెలిసికోలేక యున్నావు. నీ రాష్ట్రమునందే భయముపుట్టుట నీ కింతవరకుఁ దెలియదు గదా. రావణా నిన్నేమనవచ్చును.

ఉ. కొంచెపు జీతమిచ్చు నృపుఁ ♦ గ్రూరుని మత్తుని గర్వితున్ శఠున్
ముంచినవేళ నాపదలు ♦ మోటుకొనం డొకభృత్యుఁడేనిఁ, గో
పించు చకారణంబ యతి♦భీష్మత నామికఁ దన్నుఁ దాన భూ
షించు నసభ్యు భూపతిని ♦ సేవకులున్ స్వజనంబె చంపెడిన్. ॥ ౧౮

శఠుఁ = రహస్యముగాఁ గీడుచేయు ద్రోహిని, మోటుకొనఁడు = పూను కొనఁడు అతిభీమ్మతఁ = మిక్కిలి భయంకరత్వముచే, అలుకఁ = గర్వముచే.

తా. కష్టమునకుఁ దగినట్లీయక సేవకులకు జీతము కొంచెముగా నిచ్చు క్రూరునికి, మదముపట్టినవానికి, పొగరుఁబోతునకు, ద్రోహికి నాపదలు ప్రాప్తించు నపుడు సేవకులం దొకఁడైనను సహాయముచేయ యత్నింపఁడు. కారణములేక కోపించును. ఇతరులు భయపడునట్లు వర్తించుచు గర్విష్ఠుఁడై తన్నుఁ దానే పొగడు కొను రాజును వాని బంధువులు వాని సేవకులే చంపుదురు.

చ. తెలివిగఁ గార్యతంత్రములు ♦ దీర్పక యాపదలందు శంకచేఁ
చలితుఁడు గానిభూపతికి ♦ సంపద లెల్లను వేగ రూపఱం
బలుచని గడ్డిపోఁచకు స ♦ మానుఁడు వాఁడయి దుఃఖ మొందఁగాఁ
జులకనఁ జూతు రెల్లరును ♦ శోకముఁ బొందరు వాని భంగికిన్. ౩౦

కార్యతంత్రములు = కార్యాలోచనములు, శంకచేన్ = భయముచే, సందేహముచే, 'శంకాత్రాస వితర్కయోః' నానా॥ర॥ చలితుఁడు = చలించినవాఁడు, రూపఱన్ = నాశమైపోవఁగా,

తా. తాఁను దప్పులు దెలిసి చక్కని యాలోచనతోఁ గార్యములు చేయక యాపదలు వచ్చినను భయముచేఁ దన కార్యములందే స్థిరుఁడయిన రాజునకు నైశ్వర్యమంతయు నాశమై పోఁగా వాఁడు సన్న గడ్డిపోఁచకు సమానుఁడయి దుఃఖించుచుండఁగా వాని నందఱు నలక్ష్యముగఁ జూతురేకాని యయ్యో పాపము వాని కెట్టి గతి వచ్చెనే యని యొకరైన వ్యసనపడరు.

మత్తకోకిలము. ఎండుకట్టెల మంటిపెళ్ళల ♦ నేనియున్ మఱి దుమ్ముచే
నొండుకార్యము కల్గుఁ గాని స ♦ మూహ చేయుఁగ రాజుగా
నుండి భ్రష్టత నొందినట్టి న ♦ రోత్తముం డొకగవ్వకేన్
ఖండితాహితసంచయా! కొఱ ♦ గాఁడు నిక్కము నమ్ముమీ. ౩౧

సమూహ = చక్కని యాలోచన, ఖండిత = నఱకఁబడిన, అహితసంచయ = శత్రు సమూహము గలవాఁడా.

తా. లోకమున దేనికిఁ బనికిరాని వని తలఁచిన యల్పములగు నెండిన కట్టెలు, మంటిపెళ్ళలు, నేలదుమ్ము, వీనితోనైన నేదో యొక సమయమునఁ బని యుండును గాని యెంత యాలోచించినను రాజుగానుండి రాజ్యము పోఁగొట్టుకొనిన వాఁడు గవ్వకైనను గొఱగాఁడు.

మత్తకోకిలము, రసజజభరగణములు. ౧౧-వ యింట యతి.

తే. కట్టివిడిచిన వస్త్రంబు ♦ బెట్టి తీసి,నట్టి మాల్యంబుఁబోలుచ ♦ నవనివిభుఁడు
రాజపదమునునుండి తా ♦ భ్రష్టుఁడైన, నాతఁ డెంతటివాఁడేని ♦ నర్థకుండు.

తా. ఎంతటి వెలగలదిగాని విడిచిన వస్త్రము, ఎంత రమ్యమైనదిగాని ధరించి తీసిన పూలదండ యెట్లు మరల నుపయోగమునకు యోగ్యములు గావో యట్లు రాజుగానుండి భ్రష్టుఁడైనవాఁ డెంత గొప్పగా బ్రతికినవాఁడైనను గొఱ గానివాఁడే. దీనివలనఁ దాను గట్టివిడిచినదైనను మరల నా వస్త్రము తడిపి యుదికి యారవేయువఱకు ధరింపరాదు. మరియొకరి వస్త్రము తాను గట్టనే రాదు. అట్టులే యొకరు ముడిచి విడిచినది వాసన చూచినదియు నగు పూలదండను ధరింప రాదు.

ఆ. అప్రమాదబుద్ధి ♦ యయి యున్ని యెఱుఁగుచు, నింద్రియముల గెలిచి ♦ కృతము దెలిసి
ధర్మశీలుఁడైన ♦ ధారిణీనాథుండు, చిరముగా సుఖించు ♦ సిరులతోడ. ॥33

అప్రమాదబుద్ధి = హెచ్చరికతోఁ గూడిన బుద్ధి.

తా. హెచ్చరికగలవాఁడై మీఁదఁజెప్పఁబడిన వన్నియుఁ దెలిసికొని యింద్రియములకు వశపడక వానిని దనవశమున నుంచుకొని—తన రాజ్యమునందుఁ బరుల రాజ్యములందేనేవి యెట్లెట్లు జరుగుచున్నవో తెలిసికొనుచుఁ బరులు తనకుఁ జేసిన మేలు మఱవక ధర్మస్వభావుఁడైన రాజు దీర్ఘకాలము సంపదతో సుఖించును. దుర్మార్గులు తా మెంత యధర్మమందుఁ బ్రవర్తించుచుండినను బరులకు హితోపదేశము చేయునపుడు ధర్మమునే యుపదేశింతురు.

కం. నయనంబుల నిదురించియు, నయదృక్కుల మేలుకొని య ♦ నయ ముండి రుషా
దయలను వ్యక్తముఁ జేసెడు, నయకార్యుని నృపతిఁ గొలుచు ♦ నఖిలజనంబుల్.

నయనంబులన్ = కన్నులచే, నయదృక్కులన్ = నీతి యనెడు కన్నులచే, అనయము = ఎల్లప్పుడు, రుషా=కోపమును, వ్యక్తము = స్పష్టము, నయకార్యుని = నీతితప్పక కార్యములు చేయువానిని.

తా. కన్నులు మూసికొని నిదురించుచుండినను, నీతిశాస్త్ర మనెడి కన్నులచే మేలుకొని యెప్పుడు నుండినవాఁడై యాయా సమయమునకుఁ దగినట్లు దోషులపైఁ గోపము, సాధువులపై దయ, కనఁబరచుచు నీతిమార్గమున వర్తించు రాజును సర్వసేవకులు భయభక్తులఁ గొలుచుచుందురు.

చ. వెదకిన లేదు నీయెడను ♦ వీటిఁడి యిట్టిగుణంబు లొక్కటేన్
గదనమునందు రక్కసు ల ♦ కాలయమంబున దండకాటవిన్
సదమద మాట నీ వెఱుఁగ ♦ జాలవు చారులు లేమి, శత్రులన్
మదిని నుపేక్ష చేసెదవు ♦ మానిత సౌఖ్యరసావశాత్మతన్. ॥34

పీతఃడీ = దుర్బుద్ధీ, అకాలలయంబునః = కాలముకాని కాలమందు వచ్చిన ప్రలయంబునందు, సదమదమాట = చచ్చుట, మానిత = కాముకులచే గౌరవింపఁబడు, సౌఖ్యరస = సౌఖ్యానందముచే, అవశ = స్వాధీనము తప్పిన, ఆత్మతః = మనస్సుగలవాఁడవగుటచేత.

తా. అవివేకీ ! నీ యందు వెదకిచూచినను రాజుల కుండవలసిన మీఁద వివరించిన గుణములందొక్కటియైన లేదు. వానలేని వట్టిపిడుగువలె నకాలమున వచ్చిన ప్రలయమందు దండకారణ్యమున నీవు కాపుగా నుంచినవారందఱు యుద్ధమునఁ జచ్చుట వేగులులేమిచే నీవు తెలియకున్నావు. సౌఖ్యములం దాసక్తుఁడవై నిన్నుఁ జంపనున్న శత్రువుల ను పేక్షించుచున్నావు.

శూర్పణఖ యాక్షేపించినది ఖరాదివధవిషయమైమాత్రమే కాదు. నీకు లోఁబడి నీరాజ్యమునకుఁ జేరిన దండకారణ్యమందు నీకు విరోధులైన మునులకు నభయహస్తమిచ్చి, రాక్షసులఁ జంపెదనని ప్రతిజ్ఞచేసి, తాను రాక్షసులఁ జంపుటకై వచ్చితి నని, రామచంద్రమూర్తి విస్పష్టముగఁ జెప్పుచు విరాధాదిరాక్షసుల నందందు వధించుచు రెండు మూఁడు సంవత్సరములుగాఁ గడుపులోఁ బుండువలె జనస్థాన సమీపమందే వచ్చియుండినను నీవు తెలిసికోలేకయున్నావు. నీకు వేగులవారున్నపక్షమున నీవిషయ మప్పుడే తెలిసియుండును. ప్రతిక్రియ చేసియు నుండువని దాని యాక్షేపము.

గావః పశ్యంతి గంధేన, వేదైః పశ్యంతి పండితాః।
చారైః పశ్యంతి రాజాన, శ్చక్షుర్భ్యా మితరే జనాః॥

ఆవులు వాసనపట్టి తెలిసికొనుచున్నవి. పండితులు వేదములచేఁ దెలిసికొనుచున్నారు. రాజులు వేగులచేఁ దెలిసికొనుచున్నారు. ఇతరమనుష్యులు కన్నులఁజూచి తెలిసికొనుచున్నారు. పండితులకు శాస్త్రము కన్నువంటిది, కన్నులెదుట నుండు వానినిమాత్రమే చూడఁగలవు. ఇంద్రియములకు గోచరింపనివానిని లక్షణము శాస్త్రము దెలుపును. అట్లులే వేగులును సమక్షమునఁ జూడకున్నను, వేగులచే నెవఁడెవఁ డేయేదేశమున నేయేకాలమున నేమేమి చేయుచున్నాఁడో చేయఁగలఁడో తెలిసికొనుచున్నాఁడు.

తే. దేశకాలవిభేదంబుఁ ♦ దెలియలేవు, గుణము దోషంబు నెఱిఁగెడి ♦ కొలఁది లేదు
　కాన నోరక్కసులతేఁడ♦కలిమిఁ బాసి, వ్యసనములనొందెదవుచూడు♦వైశమీవు.

దేశకాలవిభేదంబు = దేశభేదము, కాలభేదము, రక్కసులతేఁడ = రాక్షసరాజా! కలిమి = సంపద, వైశము = శీఘ్రకాలమందే.

తా. అన్ని దేశములును మనకనుకూలమైన స్వదేశములే. అన్ని కాలములు

మన కనుకూలములయినవే. యనుకొనుచున్నావుగాని భిన్నదేశములందు భిన్న కాలములందు జరుగు విషయములను కామాసక్తుఁడవై, భోగపరతంత్రుఁడ వగుటచేఁ దెలిసికొనలేకయున్నావు. ఎవరియందు దేని యందు నే మంచి కలదో యే చెడ్డ కలదో యది తెలిసికొను శక్తిలేదు. కావున నో రాక్షసరాజా! శీఘ్రకాలము నందే నీవు సంపదను బోఁగొట్టుకొనఁగలవు.

శూర్పణఖ సత్యమే చెప్పెను. గుణదోషజ్ఞానము లేకపోవుటచేతను కేవల కామాసక్తుఁడగుటచేతనుగదా శూర్పణఖ చెప్పఁబోవువిధముగఁ జేసి నాశమయ్యెను.

౩౪-వ సర్గము.

చ. అనుచునభీతచారి యిటు ♦ లాడిన స్త్రీయను దోషజాలముఁ
 ధనబలదర్పదర్పితుఁడు ♦ తద్ద విచారముఁ జేసి యిట్లనుఁ
 గనుఁగవ జేవురింపఁగను ♦ గ్రక్కున మాఁడెడి చుప్పనాతితో
 ననుజ! వచింపు సర్వమును ♦ నచ్చటి వార్తలనెంతయుఁ దెలియుఁ. ॥౧॥

అభీతచార = భయములేక సంచరించునది. అనఁగా నీ పురుషునొద్దకుఁ బోవచ్చును, ఈ పురుషుని యొద్దకుఁ బోరాదనికాని, యీప్రదేశమునకుఁ బోవచ్చును ఈ ప్రదేశమునకుఁ బోరాదనికాని సిగ్గు భయము విడిచి తిరుగునది. ధన-బల-దర్ప-దర్పితుఁడు = ధనగర్వము, బలగర్వము కలవాఁడు, దర్పదర్పితుఁడు = పాకంపచతి యన్నట్లు, కనుఁగవ = రెండుకన్నులు, జేవురింపఁగను = ఎఱ్ఱపడఁగా, గ్రక్కునను = కఠినపుమాటలు, చుప్పనాతి = శూర్పణఖ-యూ-చుప్పనాక, అనుజ = చెల్లెలా.

తన వికారస్వరూపముతో నిండుకొలువున మంత్రులతోడ నుండునపుడు ఆఁడుది, రాజు చెల్లెలు, అంతఃపురమున నుండవలసినది బజారులవలె నిండుకొలువులోనికి వచ్చి యేమిగోషముపచ్చునో యని యాలోచింపక మాట్లాడినపుడే యది సిగ్గు బిడియము భయము విడిచిన దని స్పష్టపడెను. ఇంతవఱకు శూర్పణఖ తనపరాభవ కారణముగాని పరాభవించినవాని పేరుగాని చెప్పినదికాదు. ఏల? ఆవిషయము ముందుగాఁ జెప్పిన దన్నవమానించిన కారణముచేఁ తన్నుదూషించుచున్నదని యభిప్రాయపడునేమో, అట్టియభిప్రాయము కలిగినేని తాను జెప్పినట్లు చేయఁడేమో చేయకుండిన రాముని మరలఁ బరాభవింపవలెఁ జంపవలె ననిన కోరిక కొనసాగదే యని తలంచి నీవారిని నీశత్రువులు వచ్చి మూలముట్టుగఁ జంపినను నీవు తెలిసికొనలేక వారికి సాహాయ్యముచేయక నిర్విచారుఁడవై యున్నావని తనదోషముమాత్రము ప్రకటించుటచేతను అకంపనుని మాటలవలన నిది సత్యమని యేర్పడుట చేతను మన మిప్పు డేమి చేయవచ్చునో యెంత ప్రమాదమో తటస్థింపకుండిన నిది యిట్లు సముగుములోనికి వచ్చి యిట్లు చెప్పునాయని యిది చెప్పినట్లు దండకలో సదు

మూఁడు సంవత్సరములుగా దండకలో జరుగు శత్రువుల యాలోచన తెలిసికొన లేకుండుట మన దోషమేకదా యని యాలోచించి

దశరథుని విషయమునఁ గైక యెట్టి యుపాయము చేసెనో యట్టి యుపాయమే శూర్పణఖయుఁ జేసెను. అక్కడఁ గామము. ఇక్కడఁ గ్రోధము.

తా. ఈప్రకారము సిగ్గు బిడియము భయము లేని యా శూర్పణఖ చెప్పిన తనదోషములగుఱించి ధనగర్వము, దేహబలగర్వము, సేనాబలగర్వము గలవాఁడగుటచే నన్నెవ్వఁడేమిచేయఁగలఁడని మదాంధుఁడై యుండిన రావణుఁడు తన చెల్లెలు చెప్పిన విషయ మాలోచించి కోపము చేఁ గన్నులెఱ్ఱచేసి తన్ను నిష్ఠురములాడు చుప్పనాతితోఁ జెల్లెలా యచ్చటి వృత్తాంతమంతయుఁ జెప్పుమని మఱియు నిట్లనియె.

ఉ. రాముఁ డనంగ నెవ్వఁడు ప ♦ రాక్రమ మెట్టిది రూప మెట్టి దా
రాముఁడు దండకాటవికి ♦ రాఁ గత మేమి ఖరాదిరాక్షస
స్తోమము నేమి యాయుధము ♦ తో వధియించెను జెప్పు మన్న నా
భామిని చెప్పఁగాఁ దొడఁగె ♦ భానుకులేంద్రు చరిత్ర మంతయున్. ౫౩౮

కతము = కారణము.

తా. రాముఁడనువాఁ డెవ్వఁడు ? వాఁ డెట్టిపరాక్రమముగలవాఁడు ? దేవతారూపమా. మనుష్యస్వరూపమా. మఱి యెట్టి స్వరూపముగలవాఁడు ? ఏల దండకాటవికి వచ్చెను ? ఖరాదిరాక్షసుల నేయాయుధముతోఁ జంపెను? విల్లు బాణములతోనా లేక ఏవైన నూతనాయుధములతోనా ? యని యడుగఁగా నా శూర్పణఖ రామచరిత్ర మిట్లు చెప్పఁ బ్రారంభించెను.

—♦ శూర్పణఖ రావణుతో శ్రీరాముని వర్ణించి చెప్పుట. ♦—

సీ. నిడుదబాహులవాఁడు ♦ వెడఁదకన్నులవాఁడు, వల్కకృష్ణాజినాం ♦ బరమువాఁడు
దర్పకరూపుఁడు ♦ దశరథతనయుఁడు, రాముఁడు భయదప ♦ రాక్రముండు
హేమపట్టావృత ♦ భీమచాపముఁ దాల్చి, చిమ్ము బాణముల స ♦ ర్పమ్ము లట్ల
కాండసంధానంబుఁ ♦ గాండవికర్షంబుఁ, గాండప్రయోగంబుఁ ♦ గాన నైతిఁ
ఆ. బండియున్నపైరు ♦ వడగండ్లవ్రేటున, నేలఁ బడెడిరీతిఁ ♦ గూలు చున్న
సేనమాత్రఁ గంటిఁ ♦ జెప్పుదు నేమని, యతనిజవము బలము ♦ నస్త్రబలము.

రాముఁడేమి పరాక్రమము వాఁడు, ఏ యాయుధము గలవాఁడు, మనుష్యుఁడా దేవతయా యని రావణుఁడు తనకుఁ దెలియవలసిన విషయములనుగుఱించి ప్రశ్నింపఁగా శూర్పణఖ కామోపహతచిత్త గావున రాముని యాకారము మఱచెద

మన్నను మఱపురాక కన్నులఁ గట్టినట్లుండుటచే నాయన యాకారస్వరూపసౌందర్య వర్ణనముతోఁ బ్రారంభించుచున్నది.

నిడుద = నిడుపాటి, వెడఁద = విశాలములైన, వల్క = నారవస్త్రము, కృష్ణాజిన = జింకచర్మము, అంబరము = వస్త్రము, దర్పకరూపుఁడు = మన్మథుని సౌందర్యమువంటి సౌందర్యము గలవాఁడు, భయద = భయముగలిగించు, పరాక్రముండు = శౌర్యముగలవాఁడు, హేమపట్టావృత = బంగారుపట్టతోఁ గప్పఁబడిన, భీమచాపము = భయంకరమైన వింటిని, కాండసంధానంబు = బాణముఁ గూర్చుట, కాండవికర్షంబు = బాణములాగుట, కాండప్రయోగంబు = బాణమును విడుచుట, కానన్నైతి = చూచినదానఁగాను.

తా. దీర్ఘములైన భుజములుగలవాఁడు, విశాలములైన కన్నులుగలవాఁడు, నారచీరెలు జింకచర్మము వస్త్రములుగాఁ గలవాఁడు. మన్మథునివలె సుందరుఁడు. దశరథుని కుమారుఁడు. ఆయనపేరు రాముఁడు. భయంకరమైన శౌర్యముగలవాఁడు. బంగారుపట్టతోఁ గూడిన భయంకరమైన విల్లుగలవాఁడు. దానితోఁ బుట్టలోని పాములు వెలికివచ్చునట్లు బాణములను జిమ్మెను.

ఫలమునుబట్టి బాణములను వైచినాఁడని గ్రహింపవలయునే కాని బాణము వింటఁగూర్చుటగాని యల్లెత్రాడు లాగుటగాని విడుచుటగాని నాకుఁ గానరాలేదు. పండినపైరు వడగండ్లదెబ్బచే నెట్లు నేలపైఁ బడిపోవునో యట్లు పడుచున్న సేననుమాత్రము చూడఁగలిగితిని. ఇఁక నతని వేగము, భుజబలము, అస్త్రబలము నే నేమని చెప్పుదును.

కం. ఖరదూషణసహితంబుగఁ, బరఁగిన పదునాల్గువేలు ♦ పటురాక్షసులన్
సరి మూఁడు గడియలను దా, శరముల నుఱుమాడె నొకఁడ ♦ చరణస్థితుఁడై.

తా. ఖరుఁడు దూషణుఁడు లోనుగాగల పదునాలుగువేలమంది రాక్షసులను సరిగా మూఁడుగడియలలోఁ గాళ్ళమీఁద నిలచి యొంటరిగాఁడు బాణములచే నాశముచేసెను.

ఆ. అభయ మొసఁగె దండ♦కాటవిమునులకు, స్త్రీవధంబు శంక♦చేసినట్టి
యమ్మహాత్ముచేత ♦ నెమ్మెయినో విడువంగఁ బడుట నోర్తు♦బ్రదికి యిటకు.

దండకారణ్యమందలి మునులకు నిఁక మీరు రాక్షసులకు భయపడవలదని వారికి నభయహస్తమిచ్చెను. అందఱు చావఁగా నీవుమాత్ర మెట్లు బ్రతికివచ్చితివి. నీ వచ్చట లేవా. చూచి చెప్పుచున్నావా వినికిడిచేఁ జెప్పుచున్నావా యందువేమో నే నాగుంపులోనే యుంటిని. కాని నే నాఁడుదాననగుటచే స్త్రీహత్యవలన దోషము వచ్చునని యాయన గొప్ప మనసుగలవాఁడగుటచే జంపక వదలెను.

మతియొకఁడై నచోఁ దొలుతఁ బదునాలుగురఁ దరువాత పదునాల్గువేవురఁ దోడి తెచ్చినది. దీని నూపిరితో విడిచిన నిఁక నెంతటిఁ దెచ్చునో యని చంపియుండును. ఎండఱువచ్చి నన్నేమి చేయఁగలరని యాయనకు ధైర్యము.

విడువఁబడుట యనుటచేఁ జేచిక్కినదానిని బుద్ధిపూర్వకముగా వదలె నని భావము.

ఉ. వచ్చితి, రాముతమ్ముఁ డనివారణతేజుఁడు లక్ష్మణుండు దా
వచ్చు సమంబు రామునకు వాలి మహాగుణసంపదన్ సతిం
బచ్చపుభక్తిఁ గొల్చును మహోగ్రహశీలి యజయ్యుఁ డాజిలో
సచ్చరితుండు రాము నప సవ్యభుజంబు బహిశ్చరాసువున్. ౫౪౨

అనివారణతేజుఁడు = నివారింపరాని తేజముగలవాఁడు, వాలి = అతిశయించి, అజయ్యుఁడు = జయింపసాధ్యముగానివాఁడు, అపసవ్యభుజంబు = కుడిభుజమైనవాఁడు, బహిశ్చరాసువున్ = వెలుపలిప్రాణము.

తా. అట్లు చిక్కినను పోపొమ్మని విడుచుటచేత బ్రతికివచ్చితిని. ఆరామునకుఁ దమ్ముఁడు లక్ష్మణుఁడనువాఁడు కలఁడు. తేజోధికత నన్నకు నన్నిట సమానుఁడు. అన్నను భక్తితో సేవించువాఁడు. మిగులఁ గోపముగలవాఁడు. యుద్ధమందు జయింపరానివాఁడు. సాధువర్తనముగలవాఁడు. రామునకుఁ గుడిభుజము వెలుపలిప్రాణము నైనవాఁడు.

—శూర్పణఖ రావణునితో సీతను వర్ణించి చెప్పుట—

సీ. రాముని ప్రియదార రమణీయసంచార, యురుకీర్తికలిత రం భోరులలిత
చంపకసుమనాస చంద్రికాదరహాస, సౌందర్యసదన రా కేందువదన
పతిహితమతిపూర్ణ భవ్యకాంచనవర్ణ, నీలకుంతలభార నీతిసార
హర్యక్షనిభమధ్య యఖిలలోకారాధ్య, సీతాభిధాన సు శ్రీనిధాన
ఆ. మపరలక్ష్మివోలె నావనలక్ష్మి నా, వెలుఁగుచున్నయదియు వేల్పుఁజెలులఁ
గిన్నరాంగనలను గీర్తితగంధర్వసతులఁ గంటి నిట్టి సతిని గాన. ౫౪౩

ప్రియదార = ఇష్టురాలైన భార్య, రమణీయసంచార = అందమైన నడకగలది, ఉరుకీర్తికలిత = మిక్కిలి కీర్తితోఁగూడినది, రంభా + ఊరు + లలిత = అరఁటిస్తంభములవంటి తొడలచే నందమైనది, చంపకసుమనాస = సంపెంగపువ్వువంటి ముక్కుగలది, చంద్రికాదరహాస = వెన్నెలవంటి చిరునవ్వుగలది, సౌందర్యసదన = అందమునకు నిల్లైనది, రాకేందువదన = పదునాఱుకళలతోఁగూడిన చంద్రుని గల రాత్రి నాఁటి చంద్రునివంటి ముఖముగలది, పతిహితమతిపూర్ణ = భర్తకుమేలు

చేయు మనస్సుచే నిండినది, భవ్యకాంచనవర్ణ = శ్రేష్ఠమైన బంగారువన్నెగలది, నీలకుంతలభారం = నల్లనివెండ్రుకలను విశేషముగఁగలది, నీతిసార = నీతియందలి సారమైనది, హర్యక్షనిభమధ్య = సింహమునడుమువంటి నడుము గలది, అఖిలలోకారాధ్య = సమస్తజనులచే నర్చింపఁబడునది, సీతాభిధాన = సీతయనుపేరు గలది, సుశ్రీనిధానము = మంచికాంతికి నిధియైనది, అపరలక్ష్మి = లక్ష్మీదేవికిఁ బ్రతిరూపమైనది.

రావణునకుఁ గామోద్రేకము గలుగుటకై సీతాదేవిని ప్రత్యవయవము వర్ణించి చెప్పుచున్నది.

తా. రామచంద్రునకు నిష్టురాలైనభార్య సీత యనుపేరుగలది యొకతె గలదు. ఆమె యందమైన గమనము గలది. సమస్త సద్గుణములచేత గొప్పకీర్తిని గాంచినది. ఆమెతొడ లరఁటి స్తంభములవలె నున్నవి. ఆమెముక్కు సంపెఁగ పువ్వువలె నున్నది. వెన్నెలవంటి చిఱునవ్వు గలది. ఆమె సౌందర్యమునకు నునికిపట్టు, షోడశకళాపూర్ణుఁడైన చంద్రునివంటి ముఖము గలది. పతికి హితము చేయు కోరిక నిండుగఁ గలది. మంచి బంగారువన్నె గలది. తలనిండ నల్లనివెండ్రుకలు గలది. నీతియందలి స్థిరాంశ మేదియో యది. సింహమునడుమువంటి సన్నని నడుము గలది. సమస్త జనులచే నారాధింపఁబడునది. మంచి శోభకు గనియైనది. రెండవ లక్ష్మియై వనదేవతవలె వెలుఁగుచున్నది. నేను దేవతాస్త్రీలను, కిన్నర స్త్రీలను, పేరైన గంధర్వస్త్రీలను జూచితినిగాని, యిటువంటి స్త్రీని నే నెందును జూడ లేదు.

ఉ. కంటిని యక్షకాంతలను ♦ గంటిని గింపురుషాంబుజాక్షులఁ
గంటిని దైత్యకామినులఁ ♦ గాని రఘూద్వహుదేవివంటి దై
కంటికిఁ బండువౌ కలువ ♦ కంటిని మూఁడుజగంబులందు నేఁ
గంటయు వింట లేదు గజ ♦ గామినిచంద మిఁ కేమి చెప్పుదున్. ౫౪౪

తా. నేను యక్షస్త్రీలను, కింపురుషస్త్రీలను, దైత్యస్త్రీలను, చూచితినిగాని రామచంద్రునిభార్యవంటిదై కన్నులకు నానందము గలిగించు కలువపూవులవంటి కన్నులుగలదానిని మూఁడులోకంబులందును నేను జూడలేను. ఇట్టిది మఱి యొకటి యున్నదని వినను లేదు. ఇంత కెక్కువ నే నేమి చెప్పఁగలను.

కం. ఎవ్వనికి సీత భార్యయొ, యెవ్వనిఁ గవుఁగింటఁ జేర్చు ♦ నింతి యెలమిచే
నవ్వాఁడు మజ్జగంబుల, నవ్వాసవుకంటె నధికుఁ ♦ డై వర్ధిల్లున్. ౫౪౫

ఎలమిచేన్ = సంతోషముతో.

తా. సీత యెవ్వనికి భార్యయో, యెవ్వని నామె సంతోషముతోఁ గవుఁగి లించునో యా పురుషుఁడు మూఁడు లోకంబులందు నింద్రునికంటె గొప్పవాఁడయి వృద్ధిచెందును.

భార్యయై = సీతాలింగనసౌఖ్యము లేకున్నను ఆమె నూరక యింట నుంచుకొని భరించుచుండినను జాలును. అట్టివాఁ డింద్రునివంటి యైశ్వర్యభోగము లనుభవించును. లక్ష్మీదేవిని నింద్రుఁడు, 'ప్రసీద దేవి పద్మాక్షి మాస్మాం స్త్యాక్షీః కదాచన' యనియేకదా కోరెను. లక్ష్మీసాన్నిధ్యమే సకలైశ్వర్యప్రదము గదా.

ఎలమిచేఁ గవుఁగిటఁ జేర్చును = సంతోషముతోఁ గౌఁగిలించునో, భార్య గాకున్నను పుత్రభావముతోనైన సంతోషముతో నామెయే యెవనిఁ గౌఁగిలించునో వాఁ డిందునికంటె గొప్పవాఁడై బ్రహ్మవంటివాఁ డగును. ఇఁక నామె యిల్లాలే యైనచో నట్టి పురుషుని విషయము మేమి చెప్పను ?

ఉ. ఆ రమణీలలామ యసమాంచితరూప సుశీల యౌవనో
దారవిహార నీకుఁ దగు ♦ దార సతీమణి కీవె యర్హుఁ డౌ
పూరుషుఁ డంచు నిద్దఱను ♦ బోలిచి చూచి ధరాత్మజాతఁ దో
తేరఁగ నందుఁ బోయితిని ♦ దేరకు ముక్కును గోలుపోయితిన్. ౫౪౬

అసమాంచితరూప = ఈడులేక ప్రకాశించు సౌందర్యము గలది, సుశీల = మంచి నడవడిగలది, యౌవనోదారవిహార = వయస్సువలని యతిశయముచే సంచరించునది, దార = భార్య, తోతేరఁగన్ = తీసికొనివచ్చుటకు, తేరకు = నిష్కారణముగ, వృథాగా, కోలుపోయితిన్ = పోఁగొట్టుకొంటిని.

తా. మంచి సౌందర్యముచేతను, నడవడిచేతను వయస్సుచేతను స్త్రీల యందు శ్రేష్ఠురాలైన యా సీత నీకుఁ దగిన భార్య. ఆమెకు నీవు దగిన భర్తవని యిద్దరను బోలిచిచూచి యా సీతను దెచ్చి నీ కీయఁదలఁచి యందుఁ బోయితిని. ముక్కును బోఁగొట్టుకొంటిని. 'అంకాడ నేర్చినమ్మ బొంకాడ నేరువకున్న బొంత నక్కల పాలాయె' నను సామెత గలదుగదా. దీనివలన స్త్రీలు పురుషుల చిత్తవృత్తి యెఱింగి వారు నచ్చునట్టి యచ్చికబుచ్చికవు టిచ్చకపుమాటలు చెప్పి వారిచేఁ దమ కార్యము సాధించుకొందురని యేర్పడుచున్నది. స్త్రీ లిచ్చకము లాడినను, విశేష వినయవిధేయతలు కనఁబఱచినను దమవలన నేదో కార్యము కావలసియు వేషము వేసినారని పురుషు లెంచి హెచ్చరిక గలవారుగా నుండవలయును. నయము పనిచేయ దేని నిష్ఠురములు అవి పనిచేయుని యెడఁ బ్రత్యక్షవిరోధము పూని తమపని స్త్రీలు సాధింతురు. వారితోడి యతిస్నేహము కీడే గలిగించును. విరోధము కీడే గలిగించును. పురుషునకు మధ్యస్థవృత్తి క్షేమంకరము.

రామాయణమునం జెప్పఁబడుటచే కైక, మంథర, శూర్పణఖ, ప్రసిద్ధికి వచ్చిరి గాని వారిని మించిన స్త్రీ లీనాఁడును గలరు. అటులని యందఱు నట్టివారని భ్రమింపరాదు. కైకయున్న యింటనే కౌసల్యా సుమిత్ర లుండిరి. శూర్పణఖ యింటియందే మండోదరి సరమాదు లుండిరి. ఎవ రెట్టివారై నది నిర్ధారించుట పురుషుని తెలివితేటలపై నున్నది. ఇట్లు స్త్రీల దోషము చెప్పుటచేఁ బురుషు లందఱు పరమసాధువులని యభిప్రాయము గాదు. కల్లకపటము తెలియఁగని నిష్కల్మష హృదయులగు నిల్లాండ్రను దుశ్చరిత్రులై నిష్కారణముగ వేఁచి బొక్కలాడు దుష్టపురుషు లెందఱో గలరు.

కం. అట్టాడుచు నట నిట నతి,యట్టునకుం బోవ మోస ♦ మది గని తన క
న్నఱ్ఱగ లక్ష్మణుఁ డదయత, మొఱ్ఱోయని యఱవఁ గోసె ♦ ముక్కుం జెవులున్.

అటనిటన్ = అక్కడనిక్కడ, అట్టాడుచున్ = తిరుగుచు, అట్టునకు = సమీపమునకు, మోసము = నా కుటిలభావమును, కన్నఱగన్ = కోపముచేఁ గన్నులు ఎఱ్ఱనగాఁగా, అదయత = దయలేమి.

తా. మగవారికిఁ దెలియకుండ సీతాదేవి నెత్తుకొనివచ్చి నీ కియ్యఁదలఁచి చుట్టుపట్ల తిరుగుచుండి సీతయొద్దకుఁ బోయితిని. నా కుటిలవర్తన మెఱిఁగి లక్ష్మణుఁడు నేను మొఱ్ఱోయని మొత్తుకొనుచున్నను వినువక పట్టుకొని నా ముక్కు సెవులు మొదలంటఁ గోసెను.

కం. నీ వేగి కన్నులారఁగ, నా వగకత్తియను బూర్ణి ♦ మాబ్జాస్యఁ గనన్
బూవిలుతువేల్పుదాసరి,వై విడవే బిగువు గిగువు ♦ నా క్షణమందున్. ౫౮౬

వగకత్తియను = వగలాఁడిని, అందగత్తెను, పూర్ణిమా + అబ్జ + ఆస్యన్ = పున్నమనాఁటి చంద్రునివంటి ముఖము గలదానిని, కనన్ = చూచితివేని, పూవిలుతువేల్పు = పూవులు విల్లుగాఁగల మన్మథునకు, దాసరివై = దాసుఁడవై. దాస శబ్దభవము దాసరి, గిగువు = నిందయందు గిగ్గిలగు.

తా. నీవే పోయి యా సొగసుకత్తెను గన్నులారఁ జూచితివా మన్మథునకు దాసుఁడవై యా క్షణమందే నీ బిగువు వదలెదవు.

ఉ. పమ్మినప్రేమ జానకిని ♦ భార్యగఁ గైకొన నిష్టమేని లే
తె మ్మపసవ్యపాదమును ♦ లేవఁగ నెత్తు జయార్థ, ముందుఁ బో
పొ మ్మిపుడే, రఘూత్తములఁ ♦ బోర వధించి యనాథ సీతఁ దే
తెమ్మి, సుఖోపభోగములఁ ♦ దేలుము తత్సతితోడ రావణా. ౫౮౭

పమ్మిన = అతిశయించిన, అపసవ్యపాదము = కుడికాలు, కుడికాలు ముందు పెట్టుట శుభసూచకము, ఎడమకాలు ముందుపెట్టుట నాశసూచకము. జయార్థము

= గెలువుకొలకు, అనాథ = దిక్కులేనిది, సుఖోపభోగములఁ = సౌఖ్యానుభవములను.

తా. అధికప్రేమచే నీవు జానకిని భార్యగఁ గైకొనుట సమ్మత మయ్యెనేని మేలు గలుగుకొఱకై కుడికాలు ముందుంచి, యిప్పుడే లే లెమ్ము. ఇప్పుడే దండకారణ్యమున సీత యుండుచోటికిఁ బొమ్ము. రామలక్ష్మణులను యుద్ధమునందు జంపుము, మగఁడుచచ్చి దిక్కులేకయుండు సీతను దీసికొనివచ్చి నీ యిష్టము వచ్చిన చొప్పున రమింపుము.

మీఁది వ్యాఖ్యానమందు స్త్రీలతోడి యతిస్నేహము కీడునకుఁ గారణమగును. విరోధము కీడునకుఁ గారణముగు నని చెప్పఁబడెను. అతి స్నేహముచేఁ జెడిన వాఁడు దశరథుఁడు. ఇఁక విరోధించినచో వారెంత కీడైనఁ జేయు నట్లు యత్నింతురో యది శూర్పణఖాచర్యవలన స్పష్టమగుచున్నది. రామచంద్రమూర్తి తనకు వశుఁడు గాకుండుటచే నాయనను జంపింపవలయు నని ఖరుని సిష్యాదులాడి యుద్ధమునకుఁ బంపెను. ఇప్పు డిన్నికములాడి రావణుఁ బ్రేరించుచున్నది. దొంగతనముగా సీతనుదెచ్చుట మాత్రముతో సంతుష్టిపడక రామలక్ష్మణులఁ జంపు మనుచున్నది. అప్పు డామెప్పురమీఁదఁ దనపగ సాధించిన ట్లగును.

ఉ. రామునిచేతఁ జచ్చినఖరప్రముఖాసురకోటిమీఁద నీ
కేమియుఁ బ్రేమ యుండిన నహీనముదంబుగ వారి కెల్ల నా
రామునిఁ దోడివారలను ♦ రాక్షసరాజ! వధించి రమ్ము, నీ
కేమియి సమ్మతం బయిన ♦ నేగుము నేఁ డటకుం దిరుండవై. ౫౫౦

ఆఁడుదానివిషయమై బలవద్విరోధ మేల యని రావణుఁ డుపేక్షించునో యని మఱి రోషమెక్కించుచున్నది.

ఏమియు = ఏమాత్రమైనను, అహీనముదము = ఎక్కువసంతోషము, తిరుండవై = స్థిరచిత్తము ధైర్యము గలవాఁడవయి.

తా. రామునిచేతఁ జచ్చిన ఖరుఁడు మొదలగు రాక్షససమూహములో నొకనిమీఁదనైన నొకించుకయైనఁ బ్రేమ యనునది నీమనస్సునందుండెనా రాముని వానిని సహాయులగువారినిగూడఁ జంపిరమ్ము. ఇది నీకు సమ్మతమైననే ధైర్యముతోఁ బొమ్ము.

కం. రుచియించె నేనియును నా,వచనంబులు నీకు నసుర ♦ వల్లభ ! వేవే
విచికిత్సాహీనుఁడవై, విచికిలగంధిఁ గ్రహింప ♦ వెడలుము మఱియుఁ. ౫౫౧

విచికిత్స = సందేహము, విచికిలగంధి = పూవులవాసనవంటి వాసన గలదానిని.

తా. నామాటలు నీకు రుచించెనా శీఘ్రముగ బాగుచేయుక సందేహము విడిచి మల్లెపూవుంవాసనగల సీతను దోడుకొనిరమ్ము. బయలుదేఱుము.

ఉ. నీబల మెంతమాత్రమొ ము ♦ నిప్రకరార్దన ! మున్న చూచి యా
పై బలవత్కృతంబుగ స్వ ♦ పాలనుతన్ హరియింపఁ బూనుమీ
దేబెలువోలె దండకను ♦ దీఱిన యాఖరదూషణాదిర
క్షోబలవీరులం దలఁచి ♦ చూచి ప్రతిక్రియకై కడంగుమీ. ౫౫ ౧

మునిప్రకరార్దన = మునులసమూహమును దుఃఖపెట్టువాఁడా, బలవత్కృతంబుగన్ = బలాత్కారముగ.

తా. రావణా ! నేను జెప్పితినని నింద నామీఁదఁ బెట్టకుము నాకుఁదోఁచినది నేను జెప్పితిని. ఎదుటిబలముగుఱించి చెప్పితిని. నీబల మెంతమాత్రమో నీవే యాలోచించి యంత కెక్కువబలము నీకున్నఁ బోయి బలవంతముగ సీతను దెమ్ము. ఇది నీసుఖమునిమిత్తమై.

ఇఁక నీనిమిత్తమై దండకయందు దిక్కులేనివారివలెఁ జచ్చిన ఖరాది రాక్షసులయందలి కృతజ్ఞతకై వారికి వచ్చిన యకాలమరణ మాలోచించి దానికి బదు లేమి చేయవలయునో యది చేయుము.

నింద నామీఁద జెప్పకుము. ఇది స్త్రీలు చెప్పు సమాధానమే. వారు చెప్పినట్టు విని పనిచేయఁగా నాపనివలనఁ గీడుకలిగినప్పుడు నీవు చెప్పినట్లు వినుటచే నా కీకష్ట మవమానమువచ్చెనని మగవాఁడనిన అది యేమో నాకేమి తెలియును. నాకుఁ దోఁచినది నేను జెప్పితిని. ఆఁడుదానను అంతదూర మాలోచించు తెలివి మాకున్నదా ? నీవును మగవాఁడవే యాలోచించి సరిగానే చేయగాదా, నేను వద్దంటినా యనును. అట్లుతే శూర్పణఖయుఁ గార్యము చెడనేని నింద తనమీఁద రాకుండుటకై హెచ్చరిక చెప్పుచున్నది.

—♦ ౩౫-వ సర్గము. రావణుఁడు రహస్యంబుగ మారీచాశ్రమంబునకుఁబోవుట ♦—

సీ. అన రోమహర్షణం ♦ బైన శూర్పణఖవాక్యంబుల విని రావ ♦ ణాసురుండు
మంత్రులతోఁ జింత ♦ మంతనం బుండి కార్యంబుచందంబును ♦ నాత్మ నెఱిఁగి
వారికి సెలవిచ్చి ♦ వనిచి తానును బోయి, యోజించి కార్యంబు ♦ లున్న తెఱఁగు
తనతలపోఁతవి ♦ ధంబునఁ గలమేలు, హానియు వాని బ ♦ లాబలములు
తే. నట్టియోజించి యిదమిత్థ ♦ మనుచు నిశ్చ, యించిస్థిరబుద్ధివాహాన ♦ గృహముఁ జేరి
గూఢగతిసారథిని డేకు ♦ గూర్పఁ బనుప, నతఁడు గ్రక్కునసమకట్టె ♦ స్యందనంబు.

రోమహర్షణము = భయము కలిగించునది యగుటచే గగ్గురుపాటు కలిగించునది. శూర్పణఖ = (౧) శూర్పేణ యజ్ఞాది సత్క్రియాం నఖతి విదూషయతీతి శూర్పనఖా. నఖ విదూషణ ఇతి ధాతుః. చేటచే యజ్ఞాది సత్క్రియలు పాడుచేయునది. (౨) చేటవంటి గోళ్ళుగలది, మంత్రంబుఁడి = ఆలోచించి, కార్యంబుచందంబు నాత్మనెఱిఁగి = కార్యవిధము తెలిసికొన్నవాఁడై, ఇదమిత్థమ్మనుచు = ఇది యీ ప్రకారము చేయవలసినదనుచు, స్వాంతంబు = తే...

తా. దేహమున గగుర్పాటు గలిగించు భయోత్పాదకములయిన శూర్పణఖ మాటల విని మంత్రులతో నాలోచించి కార్య మున్నవిధము నెఱిఁగి వారిని పొండని పంపి కార్యము జరుగవలసిన విధము నిట్లు లాలోచించెను. (౧) రాముఁడు చేసిన కార్యములకు నన్నఁగా శూర్పణఖను విరూపనుచేయుట, (౨) ఖరాదుల వధించుట యీ రెంటికిఁ బ్రతిచేయక తప్పదు. ఊరకయుండినఁ బౌరుషవిహీనుఁడని బలహీనుఁడని లోకులు దేవతలు నవ్వుదురు. 'సంభావితస్య చాకీర్తి ర్మరణా దతిరిచ్యతే' మానవంతునకు మరణమునకంటె నపకీర్తి చెడ్డది.

'ప్రాణమేవ పరిత్యజ్య మానమేవాభిరక్షతు' = ప్రాణము పోఁగొట్టుకొనియైన మానము రక్షించుకొనవలయును. కావున నూరకుండుట మానహానికరము, అపకీర్తికరము. అట్లు కార్యము చేయవలసియుండెనేని యేది చేయవలె ? ఎట్లు చేయవలెను ? బహిరంగముగా యుద్ధమునకుఁ బోదునా, పదునాలుగువేల మహాబలశాలుల నొక్కఁడే కాళ్ళమీఁద నిలఁబడి మూఁడు గడియలలోఁ జంపినవాఁడు సామాన్యుఁడు గాఁడు ఇట్టివానితోడి యుద్ధమందు నేనే జయింతునని యేమి నమ్మకము ? కనుక నది సాపాయము. వంచనచేసి సీతను హరించి తెచ్చితినా - ఎక్కడనో యున్న వారి నింటిమీఁదికి నేనై తెచ్చినట్లగును. వా రిచ్చటికివచ్చిరా యూరకపోరు. రామలక్ష్మణులు నా పోబడి తెలియుట, తెలిసినను సముద్రము దాఁటుట, లంకకు వచ్చుట, యుద్ధమున గెలుచుట, యిది యిరువురు మనుష్యులకసంభావితము.

ఒకవేళ నట్లు చేయకున్న భార్యను గోలుపోయితి నన్న వ్యసనముతోనో యవమానముతోనో చావనే చచ్చెనా మఱిమేలు. సీతను వశపఱచుకొంటినా - నా కేభయము లేదు. ఆ విషయము వారికిఁ దెలియఁగానే చత్తురు.

రావణునకు సీత వశపడినను నవమానము పోఁగొట్టుకొనుటకై రావణుని రామచంద్రమూర్తి వధించియే యుండును. రావణవధాంతము సీతారామ సంభాషణము దీనిని స్థిరపఱుచుచున్నది. సీతయు దక్కను. ఇది నిరపాయమైన మార్గము. సుకరము. కావున నిట్లు చేయుట మేలని యాలోచించి తీర్మానించు

కొనెను. ఇట్లు నిశ్చయించుకొని మనస్సు దృఢము చేసికొని గుఱ్ఱముల లాయము నకుఁ బోయి రహస్యముగఁ దేరు సిద్ధముచేసి తెమ్మని సారథికిఁ జెప్పగా వాఁ డట్లులే చేసెను.

రహస్యముగ = (౧) బహిరంగముగఁ జేసిన వృద్ధులును విభీషణుఁడు మండోదరి మొదలగువారు పాపీయుఁడను భావముతో వేఁకొలఁది స్త్రీలను వారి మగవారి యెదుట బలాత్కారముగఁ దెచ్చిన నీవొక స్త్రీని గౌఁగిలించి తేఁదలఁచు టకు నీకు సిగ్గులేదా యని చీకొట్టి యుందురు. (౨) శూరధర్మము పౌరుషము విడిచి చోరధర్మము నాశ్రయించుట లజ్జాకరమని రహస్యముగ (౩) మీఁదఁ జెప్పిన మంత్రాలోచన యీ విషయమై కాదు. ఏవో యితర కార్యముల యాలోచనము కావున నీ విషయము మంత్రులకును దెలియదు. కావున రహస్యముగ.

'రామ సౌమిత్రి సంరక్షణీయను సీత నపహరించి వేరి యడిగి నీవు' ఇత్యాది కుంభకర్ణుని వాక్యములవలన (యుద్ధ ప. ౨౮౧) రావణుఁ డీ విషయము మంత్రులతో నాలోచించినవాఁడు కాఁడని యేర్పడుచున్నది.

సీ కామసంచారంబుఁ ♦ గాంచనాంచితమును, ఖరపిశాచవదన ♦ ఖరయుతంబు
నంబుదధ్వానమై ♦ నరద మంబుధి డాయ, ధవళాతపత్రంబు ♦ ధవళమైన
వాలవ్యజనమును ♦ వాలఁగఁ గాంచన,కుండలంబులు తేజఁ ♦ గురియ నెక్కి
స్నిగ్ధవైడూర్యస ♦ న్నిభుఁడును వింశతి,కరుఁడును బంక్తికం ♦ ధరుండు నగుచు
తే దర్శనీయపరిచ్ఛద ♦ తతుల వెలిఁగి, భయదదశశీర్షశైలంబు ♦ పగిది నొప్పి
చంచలాబలాకసహిత ♦ శరద మనఁగఁ, గ్రూరచరితుండు మానికంట ♦ కుండు చనియె

కామసంచారంబు = ఇష్టము వచ్చినట్లు ఇష్టమైన మార్గమునఁ బోవఁగలది, కాంచనాంచితము = బంగారు రేకులచేఁ బ్రకాశించునది, ఖరపిశాచవదన ఖరయుతంబు = క్రూరములైన పిశాచముఖములతోఁ గూడిన కంచరగాడిదలను గట్టినది, అంబుదధ్వానము = మేఘము ఉఱిమినట్లు ధ్వనించునది, అరదము = రథ శబ్ద భవము - అకారమాగమము, అంబుధిడాయన్ = సముద్రతీరము చేరఁగా—అనుటచే రథము నింటియొద్ద నెక్కినవాఁడు కాఁడు. సముద్రతీరమునకుఁ దేరు తెమ్మని సారథికిఁ జెప్పి తాను వేఱొకమార్గమున నచటికిఁ బోయి యెవరు లేనిచోట రథ మెక్కె నని యేర్పడుచున్నది. ధవళాతపత్రంబు = తెల్లని గొడుగు, ఆతప + త్రము = ఎండ నుండి రక్షించునది, ధవళమైన = తెల్లని, వాలవ్యజనము = చామరము (తోఁక విసనకఱ్ఱ), వాలఁగన్ = అతిశయింపఁగ, కాంచనకుండలములు = బంగారు కర్ణాభరణములు, స్నిగ్ధ వైడూర్యసన్నిభుఁడును = నిగనిగ మను వైడూర్యముతో సమానుఁడు, వింశతికరుఁడును = ఇరువది చేతులు గలవాఁడును, పంక్తికంధరుఁడు =

పదిమొడలు గలవాఁడు, దర్శనీయ = చూచుట కందమైన, పరిచ్ఛద = వస్త్రముల సమూహములచేత, భయద = భయంకరమైన, దశశీర్ష = పదితలలుగల, శైలంబు = పర్వతము, చంచలా = మెఱపులతోను, బలాక = కొంగలతోను, సహిత = కూడిన, శరదము = మేఘము, మునికంటకుండు = మునులకు బాధ గలిగించు వాఁడు.

తా. ఇచ్ఛవచ్చినట్లు పోఁగలదై బంగారు రేకులతో బ్రకాశించుచు పిశాచ ముఖములు గల కంచరగాడిదలతోఁగూడి మేఘగర్జనమువంటిధ్వనిగల తేరిని సముద్రతీరమునకు సారథి తీసికొని రాఁగాఁ దెల్లని గొడుగు వెలిచామరము లతిశయింపఁగా బంగారు చెవుల పోగులు తళుక్కని మెఱయ దానిపై నెక్కి మినమిన మెఱయు వైడూర్యకాంతియు నిరువది చేతులు పదితలలు గలవాఁడై సుందరములైన వస్త్రములతో చూచుటకు భయము కలిగించు పదిశిఖరముల కొండవలె నొప్పి మెఱపులతోఁ గొంగలతోఁ గూడిన మేఘమువలె నాకాశ మార్గమునఁ గ్రూరపు నడవడిగల యా మునివిరోధి పోయెను.

రావణునకు మేఘమునకు, తేరికిఁ గొంగలకు, సొమ్ములకు మెఱుపులకు నుపమానంబులు.

ఇందు రావణుఁడు పదితలలు నిరువదిచేతులు గలవాఁడై యున్నట్లు చెప్పఁ బడెను.

సీ. శీతమంగళతోయ ♦ పూతసరస్సుల, బహుపుష్పఫలవృక్ష ♦ పటలిచేత
వేదీసమావృత ♦ విస్ఫుటాశ్రమముల, సాలతాలతమాల ♦ నాళికేర
కదళికాఢకిపూగ ♦ క్రముకవృక్షంబుల, నాగసువర్ణగం ♦ ధర్వకిన్న
రాళులచేత న ♦ త్యంతమితాహార, మునులచే జితకామ ♦ ఘనులచేత

తే. నజుల వైఖానసులచేత ♦ ననఘమాష, వంశజులచే మరీచప ♦ వాలఖిల్య
గణముచేతను సిద్ధచా ♦ రణులచేతఁ, జెలఁగు వేలాప్రదేశంబుఁ ♦ జేరజనియె. ౧౫

శీత = చల్లని, మంగళ = శుభకరములైన, తోయ = నీళ్ళచే, పూత = పవిత్రములయిన, సరస్సులఁ = కొలకులచేత, పటల = సమూహము, వేదీ సమావృత విస్ఫుటాశ్రమములఁ = వేదులతోఁ గూడిన మిగుల స్ఫుటమైన యాశ్రమములచేతను, యజ్ఞశాలయందలి యరుఁగు వేది-సాల=మద్దిచెట్లు, తాల = తాటిచెట్లు, తమాల = చీఁకటిమ్రాఁకులు, నాళికేర = టెంకాయచెట్లు, రూ. నారి కేళము, కదళికా = అరఁటిచెట్లు, ఆఢకి = కందిచెట్లు, పూగ = పోఁకచెట్లు, ఈ మొదలగు క్రముకవృక్షంబుల్ = ఇప్పైన చెట్లచే, నాగ = పాములు, సువర్ణ గరుడపక్షులు, అత్యంత = మిక్కిలి, మితాహార = కొంచెము ఆహారముగల

వారిచేతను, జితకామఘనులచేతను=జయింపఁబడిన కామములుగల గొప్పవారిచేతను, అజాలు = తల్లిగర్భమునుండి పుట్టని, వైఖానసులచేత = బ్రహ్మగోటినుండి పుట్టిన వారిచేతను, 'యోఽఖాః వైఖానసాః' అని శ్రుతి, అఘ = దోషరహితమైన, మాషవంశజులచే = మాషవంశమునఁ బుట్టినవారి చేతను, మరీచప = సూర్యకిరణములను (Ultra Vislet rays) త్రావువారిచేతను, ప్రాణాధారశక్తి యీ కిరణము లందుఁ గలదు వాలఖిల్యగణముచేతను = వాలఖిల్యు లను ఋషుల సమూహము చేతను, బ్రహ్మవాలమునఁ బుట్టినవారు. 'యేవాలాః తే వాలఖిల్యాః' అని శ్రుతి. వాలము లనఁగా వెంట్రుకలు.

తా. చల్లని మంచినీళ్ళచేఁ బవిత్రములైన కొలఁకులచేతను, అనేకములగు పూలు పండ్లు గల వృక్షములచేతను, యజ్ఞమున వేయఁబడిన తిన్నెలచే నొప్పు నాశ్రమములచేతను, మద్ది, తాటి, చీఁకటి, టెంకాయ, పోఁక, కంది, యనుంటిచెట్ల చేతను, నాగులు, గరుడులు, గంధర్వులు, కిన్నరులు మొదలగువారి సమూహముల చేతను మిక్కిలి మితాహారముగల మునులచేతను, కామము జయించిన గొప్ప వారిచేతను, వైఖానస, మాష, వాలఖిల్యులచేతను, సిద్ధచారణులచేతను, నొప్పు చున్న సముద్రతీరముఁ జేరఁబోయెను.

సీ. ఆటలఁ బాటలఁ ♦ బాటన వేలుపుఁ, బాటలాధర లెల్ల ♦ నీటు మెఱయు
సంచారగానములు ♦ సంచితంబుగ స్వర్గ, సంచయంబులఁజెన్నుల్ ♦ నించునుండ
హారసంభారముల్ ♦ హారివిశాలముల్, నీహారతుల్యముల్ ♦ నిర్మలనాలు
నరమనోహరగీత ♦ వాదిత్రసంజుష్ట, దేవయానంబులు ♦ దేజరిల్ల
తే. నచ్చరలను గంధర్వవి ♦ యచ్చరులను, నిజతపోబలజితలోక ♦ నిచయఘనుల
మతిరూని ర్యాసరసమాల ♦ మహితచందన, నాగరుధరారుహంబుల ♦ నందనుగుమ

పాటనల = అలంకారముచే, పాటలాధరలు = ఎఱ్ఱనిపెదవులుగలవారు స్త్రీలు, నీహారతుల్యముల్ = మంచుతో సమానమైనవి, దేవయానంబులు = విమానంబులు, నిచ్చరులను = దేవతలను, నిజతపోబల = తమ తపోబలముచే, జిత = జయింపఁబడిన, లోకనిచయఘనులన్ = పుణ్యలోకసమూహములు గల గొప్పవారిచేత, నిర్యాసరస = ఇంగువరసముగల, మాల = మాలమను పేరుగల ఔషధులచేతను (మాలమను వేరునుండి స్రవించునీరు ఇంగువయని ప్రసిద్ధి), మహిత = గొప్పనగు, చందన = శ్రీగంధము, అగరుధరారుహంబులన్ = అగరు చెట్లచేత.

తా. ఆటలచేతఁ బాటలచేత నలంకారములచేత దేవతాస్త్రీలు నీటు మెఱయుచుండఁగా (పూర్వగ్రంథపరిచయములేని యాంగ్లభాషాభిజ్ఞులు నీటుశబ్ద

మా భాషలోని సీటు తెలుఁగున సంక్రమించిన దందురు. ఆంగ్లేయు లీ దేశమునకు రాని కాలమున వ్రాయఁబడిన గ్రంథములం దీ పదము కానవచ్చుచున్నది.) హంసలు, క్రౌంచములు మనోహరధ్వనులు నించుచుండ, హారములచే నిండినవి మనోహరముగ విశాలములయినవి మంచుతో సమానమైనవి నిర్మలములయి నవి యింపైన సంగీతము వాద్యము వీనిచేఁ గూడిన విమానములు ప్రకాశించు చుండ, అప్సరసలను గంధర్వులను దేవతలను - తమ తపోబలముచేఁ బుణ్యలోక ముల జయించినవారిని మార్గమధ్యమునఁ జూచెను. ఇవి వనములు వర్ణింపఁబడు చున్నవి. ఇంగువ రసములుగాఁ గల మూలమను పేరుగల యోషధులచేతను, శ్రీగంధము చెట్లు, అగరుచెట్లు వీనిచేతను నందమై.

తే. ఘ్రాణతృప్తికరంబులై ♦ కాలువనుల, నేత్రతృప్తికరంబులై ♦ నెగడుస్థలుల
శ్రవణతృప్తికరంబులై♦వాగ్ధ్వనుల, హృదయతృప్తికరంబుగఁ ♦ బొదలుదాని

ఘ్రాణతృప్తికరంబులు = మంచివాసనచే ముక్కులకు సంతోషము గలిగించు నవి, నేత్రతృప్తికరంబులు = అందముచేఁ గన్నులకు సంతోషము గలిగించునవి, శ్రవణతృప్తికరంబులు = చెవులకు విన నింపైనవి, హృదయ తృప్తికరంబులు = హృదయమునకు సంతోషము గలిగించునవి.

తా. పరిమళములచే ముక్కులకు సంతోషము కలిగించు వనములచేతను, చూచుట కింపైన వస్తువులుగల స్థలములచేతను, వినుట కింపైన ధ్వనులు గలవాని చేతను హృదయాహ్లాదకరమగుదానిని.

కం. ముక్తాప్రవాళనీరజ,సక్తము నిర్మలతటాక♦చంచల్లహరీ
యుక్తము మరీచగుల్మ,వ్యక్తము నై విత్తధాన్య♦వనితాయుతమై. 38౫

ముక్తా = ముత్యములచేతను, ప్రవాళ = పగడములచేతను, నీరజ = కమల ములచేతను, సక్తము = కూడినది, నిర్మలతటాక = పరిశుద్ధమైన చెఱువులందు, చంచత్ = ప్రకాశించుచున్న, లహరీయుక్తము = అలలతోఁ గూడినది, మరీచ గుల్మవ్యక్తమునై = మిరియాల పొదలచే స్పష్టముగాఁ దెలియఁబడునది, విత్త = ధనముతోను, ధాన్య = ధాన్యముతోను, వనితా = స్త్రీలతోను, యుతము = కూడినది.

తా. ముత్యములు పగడములు కమలములు వీనితోఁ గూడినదియు, నిర్మ లములయిన చెఱువులయందుఁ బ్రకాశించు నలలు గలదియు, మిరియాల పొదలు గలదియు, ధనధాన్యస్త్రీసమృద్ధిగలదియు.

కం. కరితురగస్యందనసం,భరితం బయి హృద్యమైన♦పట్టనవితతిఁ
బరిఁకించుచుఁ దెమ్మెర లై, సురనగరసమాన మైన♦సుందర వేలన్. 38౬

కరి, తురగ, స్యందన సంభరితము = ఏనుఁగులచేతను గుఱ్ఱములచేతను, రథములచేతను నిండినది యగు మనోహరమైన పట్టనసమూహామును, తెమ్మెరలై = చల్లని గాలిగలదై, సురనగరసమానమైన = దేవతాపట్టనముతో సమానమైన, వేలన్ = వాగర్తను - సముద్రతీరమును.

తా. ఏనుఁగులు, గుఱ్ఱములు, తేరులు, వీనిచే నిండిన పట్టనములను జూచుచుఁ జల్లని గాలిగలిగి సుందరమైన సముద్రతీరమును జూచెను.

సీ. కనుఁగొని యటఁ గాంచె ♦ ఘనసన్నిభం బయి, శతయోజనాయత ♦ శాఖ లొప్పు
పెనుమఱ్ఱివృక్షంబు ♦ మును వైనతేయుండు, కవణంబుగా గజకచ్ఛపముల
గోళ్లలో నిఱికి తా ♦ గొబ్బునఁ జని దాని, కొమ్మను వ్రాల భా ♦ రమ్ముచేత
బల్లున విఱిగిన ♦ వాలఖిల్యాదులు, తప మందుఁ జేయుట ♦ నయ దలంచి

తే. ముక్కునను దానిఁ గొని జవ ♦ మొక్కడుగను
జనుచుఁ ద్రోవన యొంటికా ♦ లను భుజించె
నామిషము నిషాదవిషయ ♦ మంత చెఱిచి
మునుల ముక్తుల నొసరించి ♦ ముదముఁ జెంది. ౫౬౦

ఘనసన్నిభము = మేఘముతో సమానము, శతయోజనాయత = నూఱామడ పొడవుగల, శాఖలు = కొమ్మలు, వైనతేయుండు = వినత కుమారుఁడైన గరుత్మంతుఁడు, కవణంబుగాన్ = ఆహారముగా, గజకచ్ఛపములన్ = ఏనుఁగును దాఁబేటిని, ఆమిషము = మాంసము, నిషాదవిషయము = బోయదేశము.

తా. ఇట్లుచూచి యీ ప్రదేశమందు మేఘములతో సమానమై నూఱామడ పొడవుగల కొమ్మలుగలిగిన పెద్ద మఱ్ఱిచెట్టును జూచెను. అది పూర్వము గరుత్మంతుఁడు స్వర్గమునకుఁబోవు సమయంబునఁ దన కాహారముగాఁ దమలోఁ దాము పోరాడుచున్న గజకచ్ఛపములను, గోళ్లలో నిఱికించుకొని తటాలున దాని కొమ్మమీఁద వ్రాలఁగా నాభారము సహింపలేక నాకొమ్మ ఫెళక్కని విఱిగెను. ఆ కొమ్మను బట్టుకొని వాలఖిల్యాదులు తపము సేయుచుండిరి. కొమ్మ క్రిందఁబడిన వారు తమతపస్సు విఘ్నమయ్యెనని శపింతురని వెఱచి యాకొమ్మను ముక్కుతోఁ బట్టుకొని త్వరగాఁ బోవుచు నొంటికాలితో నామాంసము భుజించి ఆ మునులను ప్రార్థించి వారు వెడలిపోఁగా బోయపల్లెను నాశముచేసి సంతోషించి.

కం. ద్విగుణీకృతవిక్రముఁ డయి, గగనంబున కెగసి యినుప ♦ కమ్ములకిటికీల్
పగిలిచి దులిచి మణీమయ, మగునింద్రగృహంబు నమృత ♦ మతఁడు హరించెన్.

ద్విగుణీకృతవిక్రముఁడయి = ఆహారము సంతుష్టిగ లభించుటచే నిబ్బడించిన బలశౌర్యములు గలవాఁడై, గగనమునకున్ = ఆకాశమునకు.

రెండింతలు బలశౌర్యములుగలవాఁడయి యాకాశమున కెగిరి యినుపకమ్ముల కిటికీలు పగులఁగొట్టి రాల్చి మణులతోనిండిన యింద్రునిగృహము ప్రవేశించి యాగరుత్మంతుఁడు అమృతము హరించెను.

తే. అట్టితాపసగణజుష్ట ♦ మైనదాని, నరుణసోదరకృతచిహ్న ♦ మైనదాని
పేరున సుభద్రమనఁగను ♦ వెలయుదాని, వటకుజంబును గని దాఁటి ♦ వనధి నసుర.

అరుణసోదర = అనూరుని తమ్ముఁడైన గరుత్మంతునిచే, కృత = చేయఁబడిన, చిహ్నము = గుఱుతు, వటకుజంబును = మఱ్ఱిచెట్టును.

తా. అటువంటి తాపసుల సమూహముతోఁ గూడినదానిని, గరుత్మంతునిచే గుర్తుపెట్టఁబడిన దానిని, సుభద్రమను పేరుగల దానిని మఱ్ఱిచెట్టును జూచి, సముద్రము దాఁటి యా రావణాసురుఁడు.

ఉ. అందొక చోటఁ బావనవ ♦ నాంతరసీమ మితాశనుండు న
స్పందనితేంద్రియుండు మృగ ♦ చర్మధరుండు జటాభరుండు నై
పొందుగ నారలూని తప ♦ ముం బచరించుచు నున్న తాటకా
నందనుఁ జేరఁబోవఁగ ఘ ♦ నంబు నమానుష మైనరీతిగన్. ౫౬౩

పావన = నిర్మలమైన, వనాంతరసీమన్ = వనములోపలిప్రదేశమున, మితాశనుండు = ఆహారనియమముగలిగి కొంచెముగ భుజించువాఁడు, అస్పందితేంద్రియుండు = చలింపని యింద్రియములుగలవాఁడు, మృగచర్మధరుండు = జింకచర్మము ధరించినవాఁడు, జటాభరుండు = విశేషము జడలుగలవాఁడు. నారలు = నారవస్త్రములు, తాటకానందనున్ = మారీచుని, అమానుషము = మనుష్యులకుదుర్లభమైన విధముగ, అంతఁగా దేవతను బూజించునట్లు పూజించెను. ఇది గోకర్ణక్షేత్రము. ఇప్పటి రామేశ్వరము.

తా. ఆవనమందొక ప్రదేశమున నిర్మలమైన ప్రదేశమున మితాహారుఁడై చలింపని యింద్రియములు గలవాఁడై జింకచర్మముధరించి జడలుగలవాఁడై నారవస్త్రములు కట్టుకొని తపముచేయుచున్న మారీచునిఁ జేరఁబోఁగా నతఁడు మనుష్యులకు దుర్లభమైన విధముగ.

కం. పూజించి పావనోదక, భోజనములఁ దృప్తుఁ జేసి ♦ పొరి మఱి పలభు
గ్రాజుం గని సేమమె కద, రాజా యీలోన మరల ♦ రాఁ గత మేమీ. ౫౬౪

పలభుక్ రాజు = మాంసముదిను రాక్షసులకు రాజు, కతము = కారణము, ఈలోనన్ = ఇంతలోపలనే మొన్నపోయినవాఁడవు. ఈ దినము మరల వచ్చుటకు కారణ మేమని యడుగుటచే నకంపను వృత్తాంతము ప్రస్తుతమను వాదము నిరస్తము. ఇదియే మొదటిసారి అయియుండిన సీతలో మరలనని చెప్పఁ గారణ

యుండదు. మొదటిసారి రావణుఁడు వచ్చినపు డీమార్గవర్ణనము చెప్పఁబడలేదే. ఇప్పు డేల యీ గొడవ యని సందేహింపరాదు. ఎంతదూరము ఎంతకష్టపడి వచ్చినది తెలుపుటకును ఇంత శ్రమపడి రెండవసారివచ్చినవాఁ డూరక కార్యము సాధింపకపోఁడని తెలుపుటకే యిది చెప్పఁబడెను. సుగ్రీవుఁడు తొలిసారి వాలిమీఁదికిఁ బోయినపుడు వర్ణింపని మార్గవిశేషములు రెండవసారి చెప్పలేదా. గరుత్మంతుని వృత్తాంతకథన మప్రస్తుతము కాదా యనరాదు. భగవంతుని వాహనమైన పక్షిమాత్రమునకు నింత జవసత్త్వములుండఁగా భగవంతుఁడగు రామున కెంత జవసత్త్వంబు లుండునో యదియైన నెఱుఁగఁజాలఁ డయ్యెఁగదా యని రావణుని మౌఢ్యము దెలుపఁగవి యీవృత్తాంతముఁ జెప్పెను.

—♦ ౩౬–వ సర్గము. రావణుఁడు మారీచునితో జనస్థానవృత్తాంతముఁ జెప్పుట. ♦—

క౦. అనపుడు రావణుఁ డిట్లను, విను తండ్రీ! నాదువాక్య ♦ విస్తరమును నేఁ
జను దెంచితి నార్తుఁడనై, కన నీ యార్తునకు నీవ ♦ గతివి మహాత్మా. ౧౼౨

వాక్యవిస్తరము = మాటలవిరివి, తండ్రీ, మహాత్మా యీ మాటలు చండదుష్టకరణార్థియును సామంతకు లక్ష్యభూతములయినవి.

తా. అని యిట్లడుగఁగా రావణుఁడు ముందు నయముగ నిట్లనియె. తండ్రీ! విశదముగ వివరముగఁ జెప్పెదను వినుము. ఆర్తుఁడనై వచ్చితిని. మహాత్మా! నాయార్తి బోఁగొట్టుటకు నీవుతప్ప నేఁకుగతి లేదు.

సీ. నీ వెఱుంగుదువు గదా ♦ నిశిచరేశ్వర జనస్థానంబునందు నా ♦ తమ్ముఁడైన
ఖరుఁడు దూషణుఁడును ♦ గాదిలి చెలియలు, చుప్పనాతియు నతి♦శూరుఁడైన
త్రిశిరుండు లోనుగ ♦ తీవ్రతేజులు చతుర్దశసహస్రాసురుల్ ♦ రమణ నాదు
నాదేశముఁ జేసి ♦ యావాస మొనరించి, బహుధర్మరతులను ♦ బఱచుచుంట
ఆ. యట్టివారలిపుడు ♦ నట్టన క్రుద్ధులై, వివిధసాధనసము ♦ పేతు లగుచుఁ
గూడి కొట్టపెట్ట ♦ క్రూరత రామునిఁ, జెనయు నతఁడు కోప ♦ చిత్తుఁ డగుచు.

రజనీచరేశ్వర = రాక్షసశ్రేష్ఠుఁడా, ఆదేశమునఁ జేసి = ఆజ్ఞచేత, ఆవాస మొనరించి = కాఁపురముండి.

తా. నిశాచరశ్రేష్ఠుఁడా! నా యాజ్ఞ ప్రకారము నా తమ్ములు ఖరుఁడు దూషణుఁడు నా చెల్లెలు శూర్పణఖ అతిశూరుఁడైన త్రిశిరుఁడు మొదలగువారు పదునాలుగువేలమంది రాక్షసులు జనస్థానమునఁ గాఁపురముండి ధర్మాత్ములగువారిని బాధలుపెట్టుచుండుట నీకుఁ దెలియునుగదా. అట్టివా రిపుడు మిక్కిలి కోపించినవారై నానావిధాయుధములను నొక్కసారిగ రామునిఁదాఁకగా నతఁడు కోపించినవాఁడై,

మ. పరుషం బాడక యొక్కఁడేని విశిఖ♦వ్యాపారకోదండుఁడై
సరగం గూల్చెఁ జతుర్దశాసురసహా♦స్రంబుం ద్రిశీర్షాదులన్
నరుఁడుం దాను బదాతియై ఖరు బలిన్ ♦ శక్రారినిన్ దూషణున్
వరుసన్ రూపము మాపెఁ, జల్పె నభయవ్యాయామమున్ దండకన్. ౫౬

పరుషము = నిష్ఠురము, విశిఖవ్యాపార కోదండుఁడై = బాణములను జిమ్ము విల్లుగలవాఁడై, సరగన్ = శీఘ్రముగ, చతుర్దశాసురసహస్రంబున్ = పదునాలుగు వేల రాక్షసులను, త్రిశీర్షాదులన్ = త్రిశిరుఁడు మొదలగువారిని, పదాతి = కాలినడకగలవాఁడై, బలిన్ = బలవంతుని, శక్రారిన్ = ఇంద్రవిరోధిని, అభయవ్యాయామమున్ = నిర్భయముగా సంచరించుటకును, "పరుషంబాడక = అనుక్త్వా విక్రమేద్యస్తు। తద్వై సత్పురుషవ్రతమ్." భార. 7. 158. 19.

తా. మిక్కిలి గాంభీర్యగుణముగలవాఁడు కావున నిష్ఠుర మొక్కటియైనఁ బలుకక వింటిచే బాణములను బ్రయోగించుచు త్రిశిరుఁడు మొదలగు పదునాలుగు వేలమంది రాక్షసులను ఆ మనుష్యుఁడు కాలిమీఁద నిలఁబడి బలవంతుఁడైన ఖరుని, ఇంద్రవైరియగు దూషణుని వరుసగాఁ జంపెను. అంతియగాక మునులు లోనగువారు దండకయందు నునభయము లేక స్వేచ్ఛగా సంచరింపఁజేసెను.

కం. జనకుఁడు వెడలం గొట్టిన, వనులందు సభార్యుఁడతఁడు ♦ వనరెడు నృపపాం
సనుఁడు కుశీలుఁడు తీక్ష్ణుం, డనయుం డజితేంద్రియుఁడు ద♦యారహితుండున్.

వనరెడు = దుఃఖించువాఁడు, నృపపాంసనుఁడు = నీచపు క్షత్రియుఁడు, కుశీలుఁడు = కుత్సిత స్వభావుఁడు, తీక్ష్ణుఁడు = క్రూరుఁడు, అనయుఁడు = నీతిలేని వాఁడు, అజితేంద్రియుఁడు = ఇంద్రియనిగ్రహము లేనివాఁడు, దయారహితుఁడు = కృపలేనివాఁడు.

తా. తండ్రి వెడలఁగొట్టఁగా భార్యతోడ నడవులలోఁబడి దుఃఖించు నీచ క్షత్రియుఁడు కుచ్ఛితపు నడవడిగలవాఁడు కోపగుణముగలవాఁడు నీతి తప్పినవాఁడు ఇంద్రియజయములేనివాఁడు కరుణాశూన్యుఁడు.

కం. భూతాహితలోలాత్ముఁడు, వీతసుధర్ముండు మిగుల ♦ వివేకి పగనున్
హేతువు లేకయె నా యను,జాతకు ముకుసెవులు కోసె ♦ సత్త్వమదమునన్.

భూత = జీవకోటికి, అహిత = కీడుచేయుటయందు, లోల = ఆసక్తిగల, "లోలశ్చలస తృష్ణయోః" నానా. ౨. ఆత్ముఁడు = మనస్సుగలవాఁడు, వీత సుధర్ముండు = సరియగు ధర్మప్రవర్తనము లేనివాఁడు, వివేకి = వివేకము లేని వాఁడు, సత్త్వమదమునన్ = బలగర్వముచే.

తా. జీవకోటికిఁ గీడుచేయు నాశగలమనస్సుగలవాఁడు - ధర్మమును వదలిన వాఁడు వివేకమేమియు లేనివాఁడు - నాతో విరోధింపఁ గారణము లేకున్నను నిష్కారణముగ నా చెల్లెలి ముక్కు చెవులను బలగర్వముచేఁ గోసెను.

రావణాసురుని మాట కొకవిధమున నర్థము సమర్థింపవచ్చును.

నృపపాంసనుఁడు = నిష్కారణముగఁ దండ్రి యడవులకుఁ బొమ్మనఁగానే తన క్షాత్రముఁ జూపి రాజ్యము దక్కించుకొనక బీదవాఁడనివలె భయపడి యడవులకు వచ్చినవాఁడు క్షత్రియుఁ డెట్లగును? కావున నధమక్షత్రియుఁడే కావున నే.

దుశ్శీలుఁడు = మంచి క్షత్రియప్రవృత్తిగలవాఁడు కాఁడు,

తీక్ష్ణుఁడు = వేఁడిమిగలవాఁడు, ఉత్తమక్షత్రియుఁడు సర్వదా తీక్ష్ణుఁడయి యుండరాదు, సర్వదా శాంతుఁడయియు నుండరాదు. కనుకనే.

అనయుఁడు = రాజనీతి తెలియనివాఁడు.

అజితేంద్రియుఁడు = కనుకనే భార్యను విడిచియుండలేక యడవులకును భార్యను బిలిచికొనివచ్చెను.

దయారహితుఁడు కనుకనే యందఱ నేకకాలమునందుఁ జంపిన వీరి భార్యల గతి యేమి బిడ్డలగతి యేమి యని యాలోచించినవాఁడు కాఁడు.

భూతాహితలోలాత్ముఁడు = ఎప్పుడు దయావంతుఁడు కాఁడో యప్పుడే భూతకోటికిఁ గీడుచేయువాఁడగును.

వీతసుధర్ముఁడు = స్వధర్మము సుధర్మము దానిని వదలి బ్రాహ్మణులవలెఁ దపస్సుచేసికొనుటకై పరధర్మమవలంబించినవాఁడు.

వీతేఁడి = వివేకహీనుఁడు, తాఁను దప్పు లాలోచింపలేనివాఁడు. ఈ యాఁడుది యొంటరిది యని చూచెనే కాని దీని నవమానపఱచిన దీనివలన నెంతప్రమాదము రాఁగలదో యని యాలోచించినవాఁడు కాఁడు.

పూర్వప్రతిజ్ఞ ప్రకారము రావణవాక్యములకు సాధ్వర్థము మహేశ్వరతీర్థీయమందిట్లు సమర్థింపఁబడినది. వారివాదము గోడలేని చిత్తరువని ముందే చెప్పఁబడెను. అయినను రావణునివాక్యములు భక్తవాక్యములని వారు వ్రాసిన యర్థము విశదీకరింపఁబడుచున్నది.

జనకుండు వెడలంగొట్టిన... తండ్రికోపించి వెడలఁగొట్టగా నడవులకువచ్చి వసరుచున్నాఁడా యేమి, కాదు. కైకేయీ వరదానమోహితుఁడై తనసత్యము కాపాడుకొనఁ బొమ్మనిన వచ్చినవాఁడు, సభార్యుఁడు, సభా + ఆర్యుఁడు = సభయందుఁబూజ్యుఁడు = సభ్యుఁడనుట. నృపపాంసనుఁడు = నరులను పాలించు

వాఁడు నృపుఁడు—నృప + వ-నృపాన్ + పాతీతి నృపపః. రాజులను పాలించు వాఁడు నృపపుఁడు, వాఁడే అంసనుఁడు = అనఁగా నాశముసేయువాఁడు. అంసన మాఘాతె ఇతిధాతుః-అనఁగా శత్రువులనాశముచేయువాఁడు. అట్టివాఁడు కుశీలుఁడు. కుశీలుఁడగునా యేమి కాఁడనుట కాక్వర్థకము-కిమ్మనునది అధ్యాహారము. కావున సద్వృత్తుఁడే. తీక్ష్ణుఁడు అనఁగాఁ గార్యములం దలసుఁడు గాఁడనుట. అట్టి వాఁడు అనయుండ. అనయుఁడా? కాఁడనుట. జితేంద్రియుఁడు, అనయుఁడ + జితేంద్రియుఁడని పదచ్ఛేదము, దయా + అరహితుఁడు = దయలేనివాఁడు కాఁడు, కావున భూత + అహిత + లోలాత్ముఁడు = భూతములకుఁ బూర్ణముగ హితముచేయుటయందాసక్తిగలవాఁడు, అట్టి పీతధర్ముఁడు, పీతధర్ముఁడు = పీత + విరుద్ధ + ధర్ముఁడు, పీతధర్ముఁడు, మధ్యమపదలోపిసమాసము, విరుద్ధధర్మముల వదలినవాఁడు, పీఱేఁడి = అవివేకియా యేమి కాఁడు.

యథాశ్రుతముగు నర్థము స్పష్టమే - వాస్తవముగ సనత్కుమారవచనములచే విష్ణురూపుఁడగు శ్రీరామునిచేఁ జంపఁబడి యాయనలోకముఁ బొందుటకు నాయన భార్యను దెచ్చెదను. ద్రోహబుద్ధిచేఁ గాదు. తీర్థీయము. సనత్కుమారం వచనములని చెప్పఁబడిన శ్లోకములు ప్రక్షిప్తములసి మున్నే చెప్పఁబడెను. కావున వీరి వాస్తవార్థ మనునదియు నిరాధారమే. అదియునుగాక యసందర్భపు గాకువులచే మధ్యమపదలోపులచే, లక్షణావృత్తిచే నర్థము జెప్పుమార్గము ప్రశస్తమైనదికాదు. శ్రుతార్థము స్పష్టముగాలేక సందేహముకలిగించెనేని యపుడు లక్షణావృత్తి, మధ్యమపదలోపి, కాకువు గ్రహింపవచ్చునుగాని యిచ్చవచ్చినటులెల్ల గ్రహింపరాదు. గంగలో గొల్లపల్లె యున్నది అనుచో గంగనీళ్ళలో పల్లె యుండఁజాలదు కావున గంగాతీరమం దని లక్షణచే గ్రహింపవచ్చును. ౫౭౮ వ పద్యమున కాకుస్వరమున్నది. బియ్యపు రామయ్య వచ్చినాఁడు. అన్నప్పుడు బియ్యమమ్మురామయ్యయో కొనురామయ్యయో ఆ యింటిపేరుగల రామయ్యయో యను సందేహము వచ్చినపుడు బియ్యము + అమ్మ + రామయ్య యని మధ్యమపదలోపి సమాసము చెప్పవచ్చును. అట్టివ్యవస్థలేదేని ప్రతివాక్యమునకు విరుద్ధార్థము కల్పింపవచ్చును. ఒకస్త్రీని మఱియొకఁడు నీపుగఁడని యడిగిన మధ్యమపదలోపి సమాసమని నీ అంకుమగఁడని వాస్తవప్రశ్న యనవచ్చును. రాముఁడా మహాధర్మాత్ముఁడే యనిన కాకువుచే ధర్మాత్ముఁడుకాఁడని యర్థము చేయవచ్చును. ఎల్లయ్యకొడుకు పుల్లయ్య యన్నప్పుడు ఎల్లయ్య కొరసుఁడు పుల్లయ్యయని యర్థము కాదు. ఎల్లయ్య యింటిలోనో పొరుగింటిలోనో యుండిన వానికొడుకు పుల్లయ్య యని లక్షణావృత్తిచేఁ జెప్పవచ్చును. ఇట్టియర్థములు శాస్త్ర మంగీకరింపదు. కావున వీనిపై నాధారపడిన మతములు వాదములు నంగీకార్యములు కావు. వీరు

'వాస్తవార్థమేమనఁగా' యనివ్రాసిరికదా. వీరియభిప్రాయప్రకారము వాస్తవము + కాని + అర్థము = వాస్తవార్థమని మధ్యమపదలోపి చెప్పవచ్చునుగదా. వాస్తవార్థమేమి! ఇది వాస్తవార్థ మనుకొంటివాయేమి కాదు సుమా. అని కావున్వు. వాస్తవార్థము అనఁగా యథార్థమైన యర్థముగాదు. దానికి దూరమైనదని యర్థము అని లక్షణచేఁ జెప్పవచ్చును గదా. కావున వీరు వ్రాసినది యవాస్తవార్థమని వీరి మార్గ మనుసరించియే చెప్పవచ్చును. కావున నీ వ్యాఖ్యార్థము యథార్థము గాదు. ఆ యర్థమును సాధించిన మార్గము ప్రశస్తమైనది కాదు. రావణుఁడు భక్తుఁడను వీరి యభిప్రాయము సరిగాదని తిలక వ్యాఖ్యాతయు వ్రాసియున్నాఁడు.

ప్రస్తుతమునఁ గొందఱు రావణభక్తులు-రావణుఁడు పరమభక్తుఁడు సాధువనియు రాముఁడే దోషియనియు వాదించుటచే ఆ వాదదౌర్బల్యము, నిరాకరత్వము తెలుపఁదఁ వ్రాయవలసి వచ్చెను. రావణువంటి రామభక్తులు, శూర్పణఖవంటి సీతాభక్తులు బయలుదేఱిన నిఁక మనదేశమున కేమికొఱఁత?

— ♦ రావణుఁడు మారీచుని దోడుపడ వేఁడుట. ♦ —

ఉ. కావున వానిభార్య సుర ♦ కాంతనుబోనిసురూప జానకిన్
నే వెసఁ దేరఁగాఁ జనెద ♦ నీవు సహాయుఁడు గమ్ము, తమ్ములున్
నీవును నాకు బాసటగ ♦ నిర్జరకోటులనైన నాజిలో
భావన సేయుదున్ దృణము ♦ భంగి నిజం బిది రాక్షసోత్తమా. ౫౮౦

సురకాంతనుబోని = దేవతాస్త్రీలతో సమానురాలైన.

తా. రాముఁ డిట్టివాఁ డగుటచే దేవతాస్త్రీలతో సమానమైన సౌందర్యము గల యతని భార్యను జానకిని నేను తెచ్చుటకు శీఘ్రముగాఁ బోవుచున్నాను. నీవు నాకుఁ దోడురావలయును. నాతమ్ములు నీవు నాకు సహాయులైయుండ యుద్ధములో దేవతలనైన గడ్డిపోఁచవలెఁ జూతును. ఇది నానిశ్చయము.

ఉ. కావున నాకుఁ దోడ్పడుము ♦ కానను నీకు సముండు వీర్యసం
భావన నేని దర్పనదు ♦ పాయములందున యేని నాజిలో
నీ వొనరింప లేవియవి ♦ నిస్తులమాయలు లేవు లోకమం
దీవిషయం బెఱింగి కద ♦ యే నిటు వచ్చితి నిన్నుఁ జూడఁగన్. ౫౮౧

తోడ్పడుము = సాహాయ్యముచేయుము, దర్పనదుపాయములందునయేని = బలగర్వమునందు మంచియుపాయములు చేయుటయందు.

తా. ఇది నాయభిప్రాయము కావున నీవు నాకు సహాయుఁడవు కమ్ము. శౌర్యమందు బలమందు మంచియుపాయము చేయుటయందు నీకు సమానులు

లేదు. యుద్ధమునందు నీవు పన్నలేని మాయలు లేవు. నీ విట్టివాఁడ వని తెలిసికదా నిన్నుఁ జూడ నింతదూరము వచ్చితిని.

ఉ. ఏ నొనరించు సంగాఁ దగిన • దెయ్యది యంటివ యేని విన్ము జాం
బూనదచిత్రబిందుమృగ•మూర్తి ధరించి చరింప రాముఁడుఁ
జానకి యున్న యాశ్రమము•చక్కటి, భ్రాతలఁ బంపుఁ బట్టఁగా
మానిని, రాహు చంద్రప్రభ•మాడ్కి హరించెద నొంటి మైథిలిన్. ౫౭౨

జాంబూనద = బంగారువంటి, చిత్ర = ఆశ్చర్యకరములైన, బిందు = చుక్కలుగల, మృగమూర్తి = జింకయాకారము. చక్కటిన్ = ప్రదేశమున.

తా. నే నేమి సాహాయ్యముఁ జేయుదునని యడిగెదవేమో నీవు చేయవలసిన పని చెప్పెద వినుము. బంగారు వన్నె విచిత్రపుఁ జుక్కలు గల జింకవై రాముఁడు సీత యున్న యాశ్రమప్రదేశమందు సంచరించుచుండుము. నిన్నుఁ బట్టుటకై యా రామలక్ష్మణులఁ బంపుదు. అప్పుడు నేను రాహువు చంద్రకాంతిని హరించినట్లు లోంటరిగానుండు జానకిని హరించెదను.

రాహువు చంద్రకాంతిని హరించిన ట్లనుటచే రాహువు కొంచెము కాలము లోకమున నా కాంతి గానరాకుండఁజేయునట్లు రావణుఁడు కొంతకాలము సీత లోకమునకుఁ గానరాకుండఁ జేయఁగలఁడు. రాహువు చంద్రబింబము నేమియుఁ జేయఁ జాలనట్లు రావణుఁడును సీత నేమియుఁ జేయఁజాలఁడని భావము. లోకమునందలి చీఁకటి చంద్రకాంతి తగులఁగానే యది స్వరూపము లేకపోవును. అట్లే సీతాసాన్నిధ్యము దొరకినవాఁడు తన యజ్ఞానముఁ బోఁగొట్టుకొని బాగుపడుచున్నాఁడు. తమోగ్రహమైన రాహువు అట్లు తన చీఁకటి పోఁగొట్టుకొనలేకయున్నాఁడు. అట్లే రావణుఁడు సీతాసాన్నిధ్యము లభించియుఁ దన యజ్ఞానముఁ బోఁగొట్టుకొనక పోవును.

రాహ్వాదులకు వు లోపంబు వైకల్పికంబు. ఉ. రాహు-రాహువు, బాహు - బాహువు, సాధు - సాధువు, శరద్రు - శరద్రువు - కావున ఇందు రాహు అనియే ప్రయోగింపఁబడెను.

కం. జాయావియోగకర్శితుఁ, డై యడలెడి రామచంద్రు • నంత వధింతున్
హాయిగ సుఖయింతును మఱి, మాయయ్యా కలుపు మింత•మాత్రం బనినన్.

జాయావియోగకర్శితుఁడు = భార్య నెడఁబాయుటచే నా దుఃఖమున కృశించినవాఁడు, అడలెడి=దుఃఖించెడి, మాయయ్యా = మా తండ్రీ, ఇది కార్యసాధనమునకై ప్రార్థన.

తా. భార్య లేకపోవుటచేఁ గృశించి దుఃఖించు రామచంద్రుని నంతట

వధించి సుఖముగా నిర్విచారముగ నుందును. మాతండ్రీ యింతమాత్రము సాహాయ్యము చేయుము.

శా. మారీచుండును రావణుం డనినరా ♦ మక్ష్మాధవోదంతముం
దీర విన్నను గుండె ఝల్లు మనఁగా ♦ నిశ్చేష్టుఁడై కంపియై
నోరెండం గనుచూపు నిట్టగొన నెం ♦ డునా వాతెఱల్ నాకుచున్
ధీరత్వం బఱి ప్రేతకల్పుఁ డయి దై ♦ తేయాధిపుం జూచుచున్. ౫౭౪

రామ + క్ష్మాధవ + ఉదంతమున్ = రామచంద్రరాజు వృత్తాంతము, తీరన్= పాంతముగ. నిశ్చేష్టుఁడై = చేష్టలుడిగినవాఁడై, కంపియై = వణఁకుగలవాఁడై, నిట్టగొనన్ = తెప్పపాటు లేకయుండఁగా, వాతెఱల్ = పెదవులు వాయి + తెఱ= వాతెఱ, అఱి = తుయించి, ప్రేతకల్పుఁడయి = శవమునకుఁ గొంచెము తక్కువగా సమానుఁడయి, దైతేయాధిపున్ = రావణుని.

తా. రావణుఁడు చెప్పిన రామచంద్రమహారాజు వృత్తాంతమును బూర్ణముగా మారీచుఁడు విని నా ప్రాణమునకే ముప్పువచ్చెఁగదా యని గుండెలు ఝల్లన భయపడి తొలుత నిశ్చేష్టుఁడైయుండి తెప్పిరిలి వణఁకుచు నోట తడిలేకపోఁగా నిలువు చూపులఁ జూచుచు పెదవులు నాకుచు ధైర్యము చెడఁగా శవముతో సమానుఁడయి రావణుని జూచుచు.

కం. రామపరాక్రమవిజ్ఞుం, డామానవభోజి భీతి ♦ హతచిత్తను
త్రామారికిఁ దనకును గడు, సేమముగా నిట్లు పలికెఁ ♦ జేమోడుపుతోన్. ౫౭౫

విజ్ఞుఁడు = చక్కఁగాఁ దెలిసినవాఁడు, మానవభోజి = మనుష్యులను భుజించువాఁడు — రాక్షసుఁడు, భీతిహతచిత్తతన్ = భయముచేఁ గొట్టఁబడిన మనస్సుతో, సుత్రామారికి = ఇంద్రునకు విరోధియగు రావణునకు, చేమోడుపుతోన్ = అంజలి పూర్వకముగ.

తా. రామచంద్రమూర్తి శౌర్యవిధ మనుభవముచే బాగుగఁ దెలిసికొనినవాఁడగు మారీచుఁడు భయపడి రెండుచేతులు జోడించి రావణునకుఁ దనకు క్షేమకరమైనవిధముగ నిట్లనియె.

—♦ { ౩౭-వ సర్గము. మారీచుఁడు రావణునకు శ్రీరాముని బలపరాక్రమములు దెల్పుట } ♦—

కం. అనయము ప్రియవాక్యంబుల, ననియెడి జను లెందు సులభు ♦ లప్రియ మయ్యున్
గనఁ బథ్యమైనసూక్తిని, ననువాఁడును వినెడివాఁడు ♦ నరు దసురేంద్రా. ౫౭౬

అనయము = ఎల్లప్పుడు, ప్రియవాక్యంబులు = సుఖప్రీతిమాటలు, పథ్యము= హితము, సూక్తిని = మంచిమాటను.

తా. రావణా ! లోకమునందు స్వార్థలాభపరులై వినుట కింపైన యిచ్చకములాడువారు సులభముగా లభింతురు. వారిని వెదకి తెచ్చుకొనవలసిన శ్రమముతోఁ బనిలేదు. ఆపత్కాలమందైనను వినుటకుఁ గటువై ప్రియముగాకున్నను హితమై కాలాంతరమున మేలుగలిగించు మాటలను జెప్పువాఁడును వినువాఁడును దుర్లభుఁడు. ఒకవేళ యెదుటివాని మేలుగోరి చెప్పువాఁడు దొరకినను వినెడివాఁడు దొరకఁడు. కావున నేను జెప్పఁబోవు మాటలు వినుటకు నీకుఁ బ్రియములు గాకున్నను గాలాంతరమున మేలిచ్చునవి యగును కావున వానిని నుపేక్షింపకుము.

ఉ. ఆ మహనీయవిక్రము గుణాధికు రాముని బాశహస్తసు
త్రామసమాను నీ వెఱుఁగరాదు చలాత్ముఁడ! వేగు లేమి చే
రాముని కాగ్రహంబు గదిరాజక యుండెడిఁగాక యీ జగ
త్స్తోమ మరాక్షసం బగుచుఁదూలక యుండెడిఁగాక నాయనా. ౬౭౭

పాశహస్త = వరుణునితోను, సుత్రామ = ఇంద్రునితోను, సమానుఁ = సాటియైనవానిని, చలాత్ముఁడ = చపలచిత్తుఁడ - తాను జెప్పినది విని యంగీకరించి పోయి వెంటనే మరల వచ్చుటచే చపలచిత్తుఁడు. వేగులేమిచేఁ = చారులు లేని కారణమున, జగత్ + స్తోమము = లోకసమూహము, అరాక్షసంబగుచు = రాక్షసశూన్యమై, తూలక = జీవకోటినుండి తొలఁగక.

తా. రావణా ! రామచంద్రునితో విరోధము వలదని మొన్న నేను జెప్పితిని. సరియని యంగీకరించి పోయితివి. ఇంతలో మనస్సు మార్చుకొని మరల వచ్చితివి. ఇంతటి చపలచిత్తుఁడవు నే నేమిచెప్పిన నీ వేమి వినఁగలవు లాభపడఁగలవు. అయినను నీ మేలుగోరువాఁడ నగుటచే నీకు పథ్యములయిన మాటలనే చెప్పెదను. నీకా లోకములో నెక్కడెక్కడ నేమేమి జరుగుచున్నదో వెంట వెంటఁ దెలియఁ జెప్పుటకు వేగులవాండ్రు లేరు. ఆ కారణముచే గొప్ప పరాక్రమము గలవాఁడు సుగుణసంపత్తిచే నధికుఁడు వరుణునితో నింద్రునితో బలమున సమానుఁడు నగు రాముని వృత్తాంతము నీ వెఱుఁగవు. నీవు రామచంద్రునకుఁ గోపమువచ్చు కార్యములు చేయకుము. ఆయనకుఁ గోపమువచ్చినా లోకమున రాక్షసజాతియని పేరు కూడ నుండదు.

సీ. నీ ప్రాణములు నిట్టనిల్పునఁ దీయఁగ, జన్మమెత్తడుగదా జనకతనయ
ధారిణిసుతనిమిత్తంబుగ నాకేమి, కలుగకుండెడుఁగాక కష్టములును
గామవృత్తుఁడ వీవుగావుట నాథుండు, గాసిగాకున్న లంకాపురంబు
స్వచ్ఛందవృత్తినిజరియించు నినుఁ గూడి, పాడుగాకుందురా బంధుజనులు

ఆ. నిన్ను బోఁటికుమతి ♦ నిష్ఠురశీలుండు, పాపమంత్రితుండు ♦ ప్రభుతఁ గాంచి
తన్ను రాష్ట్రమెల్లఁ ♦ దనవారిఁ గూడ, మూలముట్టు జెఱుచు ♦ మూర్ఖుఁడగుచు.

సిట్టనిల్వనక్ = నిలఁబడినవాఁడు నిలువఁబడినట్లు, కామవృత్తుఁడవు = కామము స్వభావముగాఁ గలవాఁడవు. కాపురుష్ = అగుటచేత, స్వచ్ఛందవృత్తిని = ఇష్టమువచ్చినట్లు, పాపమంత్రితుండు = పాపపుటాలోచన గలవాఁడు జన్మమెత్తదు గదా యనుచోఁ గాకువు. జన్మమెత్తినట్లేయున్నది. లేకున్న నీకీబుద్ధిపుట్టదనిభావము. ఆమె యట్టిదగునో కాదో నీవు చేయుకార్యముచే నిర్ధారింపఁబడియున్నది.

తా. లోకమున సాధారణముగాఁ బ్రాణులు నేలపైఁబడి ప్రాణములు విడుతురు. నీకంతటి యుపకారముకూడ నీయుక నిలువఁబడిన వాని ప్రాణములు నిలిచి యుండఁగనే తీయుటకై సీతాదేవి పుట్టినదా యేమి? నీ గతి యెట్లులైన నగును గాక - చేసెడివాఁడ వనుభవించెదవు. ఆమె నెపమున నాకేమి కీడుకలుగకుండ నిమ్ము- కామమే శీలముగాఁగల నీవు రాజగుటచే లంకాపురము కష్టములపాలు గాకుండునా? కానేయగును. మనస్సువచ్చినట్లెల్లపోకలుపోవు నీతోడ బంధువులందఱు నాశమైపోకయుందురా? నీవంటి చెడుబుద్ధిగలవాఁడు, కఠినస్వభావముగలవాఁడు, పాపపుటాలోచనలుగలవాఁడు, ప్రభువై చెప్పినను దెలిసికోలేనివాఁడు స్వాపరాధమునఁ దాను జెడుటయేగాక రాజ్యమునందలి ప్రజలను జెఱుచును. ఇతరులతోఁ బోవునా యనిన తనబంధువులనుగూడ సమూలముగఁ జెఱుచును.

ఉ. కాఁడయ కాఁడు రాముఁ డిల ♦ క్షత్రియపాంసనుఁడుం గుశీలుఁడున్
కాఁడయు లోభిధర్మగుణ ♦ కాండవిహీనుఁడు గాఁడు తీక్ష్ణుఁడున్
గాఁడు సమస్తభూతహిత ♦ కార్యవిదూరుఁడు గాఁడు కాననన్
రాఁడయు తండ్రి నెట్టినను ♦ రావణ! నీ కెవ రట్లు చెప్పిరో. ౯౭౯

తా. రావణా! రామచంద్రమూర్తియందు నీ వారోపించిన దోషములం దొకటియైన నాయనయందు లేదు. ఆయన నీచక్షత్రియుఁడు కాఁడు. కుత్సిత స్వభావము గలవాఁడు కాఁడు. లోభిగాఁడు. ధర్మగుణ సమూహము లేనివాఁడు కాఁడు. తీక్ష్ణుఁడు కాఁడు. భూతములకు నహితము చేయువాఁడు కాఁడయ్యా కాఁడు. తండ్రి కోపించి నెట్టఁగా నడవికి వచ్చినవాఁడు కాఁడు. ఎవరు నీ కావిధముగఁ జెప్పిరో కాని యన్నియు నసత్యములే.

కం. తనజనకుఁడు కైకయిచే,తను వంచితుఁ డగుట గాంచి ♦ తండ్రిని ఋజువా
దిని జేయఁ గైక ప్రీతికి, జనకుని ప్రీతికిని వనికిఁ ♦ జనెఁ జ్యోతసుఖుఁడై. ౯౮౦

తా. తన తండ్రి కైకేయిచే వంచింపఁబడినాఁడని తెలిసి యాయనను సత్య

వాదిని జేయుటకై, కైకకుఁ బ్రీతి కలిగించుటకు సర్వసౌఖ్యములు తానె విడిచి మనస్సుతో వదలి యడవులకుఁ బోయెను.

కం. విను రఘురాముఁడు కర్కశుఁ, డును గాఁడు కళావిహీనుఁ ♦ డుం గాఁ డవశుం
డును గాఁడు నిక్కమింతియు, ననృతము దుశ్శ్రుతము లేల ♦ యాడెదు తఁడ్రీ. ౫౮౧

కర్కశుఁడు = కఠినుఁడు, కళావిహీనుఁడు = విద్యావిహీనుఁడు. అవశుఁడు = పరతంత్రుఁడై నీవలె నొకరు చెప్పినట్లు వినువాఁడు గాఁడు, నిక్కము = నిజము, అనృతము = అసత్యము - లేనిది కల్పించి చెప్పుట, దుశ్శ్రుతము = విపరీతముగ వినినది, ఉన్నదానికి విరుద్ధముగఁ జెప్పుట.

తా. రామచంద్రమూర్తి కఠినచిత్తుఁడు గాఁడు. విద్య లేనివాఁడు గాఁడు. ఇతరుల యిష్టము ప్రకారము వర్తించువాఁడు కాఁడు. ఇది నిజము - ఏల లేనివి కల్పించి యున్నవి కానివిగాఁ జెప్పెదవు నాయనా.

ఉ. రాముఁడు ధర్మమూర్తి యప ♦ రాజిత సత్యపరాక్రముండు, సు
త్రాముఁడు దేవతాతతికి ♦ రాణ విభుండు సమస్త మా జగ
త్త్రోమము పాలికిన్, సుమతి ♦ సూర్యునికాంతి హరించునట్లు స్వో
ద్దామసుశీలగుప్త వసు ♦ ధాసుత నా హరియింపఁ జూడఁగన్? ౫౮౨

ఇఁక రామచంద్రమూర్తిని గుఱించి వాస్తవమును జెప్పెదను విను మనుచున్నాఁడు. అపరాజిత = ఓటమి లేని - సత్యపరాక్రముఁడు = సత్యమైన శౌర్యము గలవాఁడు. యుద్ధమునందు నోడిపోవుట యనునది లేదు. ధర్మమార్గమందు నిలిచియే గెలుచును. సత్యపరాక్రముఁడు = సత్యమే పరాక్రమముగాఁ గలవాఁడు, ఆయన సత్యమే యెట్టివారినైన నోడించి లోఁబడఁజేయును. సుత్రాముఁడు = ఇంద్రుఁడు, సుమతి = మంచిమనస్సుగలవాఁడు, స్వోద్దామసుశీలగుప్తన్ — స్వ = తనయొక్క, ఉద్దామ = గొప్పదైన, సుశీల = పాతివ్రత్యముచే, గుప్త = రక్షింపఁబడునది, వసుధాసుత నా = సీత నా.

తా. రామచంద్రుఁడు ఆకారముగొన్న ధర్మము. యుద్ధమునందుఁ బరాజయము లేనివాఁడు. సత్యమైన శౌర్యము గలవాఁడు. కావున మోసపు యుద్ధము లాయన చేయఁడు. దేవతలకు నింద్రుఁ డెట్లో సమస్తజగములకు నాయన యా విధముగ ప్రభువు. మంచిమనస్సుగలవాఁడు, సూర్యుని కాంతిని హరింప యత్నించునట్టు లట్టి రామునినుండి సీతను వేఱుపఱుపఁ జూచెదవు! ఇది నీకు సాధ్యమా? రామచంద్రమూర్తిచే నామె రక్షింపఁబడుచున్నది. రామునినుండి వేఱుగఁ దీసిన రక్షకుఁడు లేక నీవు చెప్పినట్లు విను నని తలఁచితివి. ఆమె తన పాతివ్రత్యముచేఁ దన్నుఁ దాను గాపాడుకొనుచున్నది. తన రక్షాభార మితరుల

యందు వైచినదికాదు. కావున నీవు హరించినను నీకు లోపడు నని తలంపకుము. తమున్నం దామును కాపాడుకొనలేనివారుగదా పరరక్షణము కోరవలె. కావున నీ యుద్దేశము కొనసాగదు.

క౦. శరకీలామాలికలన్, దరిఁ జేరఁగ రాని దాని ♦ ధనురింధనసం
భరితంబు సంప్రదీప్తము, వరరాఘవవహ్నిఁ బడఁగఁ ♦ బాఱఁగఁ దగునే. ౫౫౩

శరకీలామాలికలన్ = బాణము లను జ్వాలలవరుసలచే, దరిన్ = సమీపమందు, ధనురింధనసంభరితంబు = విల్లనెడి కట్టెలచే భరింపఁ బడినది, సంప్రదీప్తము = భగభగ మండుచుండునది, వరరాఘవవహ్ని = శ్రేష్ఠమైన రామచంద్రుఁడను నగ్ని.

తా. సీతాదేవిని నీవు హరింపఁ జూచెదవు. ఆమెసమీపమునకు నీవు పోఁగలిగినఁ గదా హరించుట. ఆమెను రాముఁ డను నగ్నిహోత్రము చుట్టుకొని రక్షించుచున్నది. ఆ యగ్ని యెట్టి దనెదవా? దానికి బాణములే జ్వాలలు. దూరమున నుండఁగానే దహించును. ఇఁక సమీపమునకుఁ బోయి బ్రదుకు టెట్లు? ఆ యగ్నిని ప్రజ్వలింపఁజేయు సమిధ ధనస్సు. ఇట్టి యగ్ని నివురుకప్పియున్నదని తలఁచెదవేమో? అది భగభగ మండుచునే యున్నది. ఇట్టి యగ్నియందు మిడుతవలెఁ బోయి చావ నేల కోరెదవు?

శా. చాపవ్యాదితదీప్తవక్త్రుని మహా ♦ శస్త్రజ్వాలు సామర్షునిన్
జాపోద్దీపితపాశధారిని విప ♦ క్షవ్రాతసంహారు సీ
తాపద్మాయతలోచనాహృదయనా ♦ థ శ్రాద్ధదేవున్ సుఖ
వ్యాపారాసువు లెల్లవీడి చన నే ♦ లా తండ్రి డాయన్ వెసన్. ౫౫౪

చాపవ్యాదితదీప్తవక్త్రునిన్ = విల్లనెడి తెఱవఁబడినదియు మండునదియు నగు నోరుగలవానిని, మహాశస్త్రజ్వాలున్ = గొప్ప యస్త్రము లనెడి శిఖలు గలవానిని, సామర్షునిన్ = సీతను జెనకిన కారణమునఁ గోపముతోఁ గూడిన వానిని, చాపోద్దీపిత పాశహస్తునిన్ = విల్లనెడి ప్రకాశించెడి పాశమును చేతియందుఁ గలవానిని, విపక్షవ్రాత సంహారున్ = శత్రుసమూహములను సంహరించువానిని, సీతాపద్మాయతలోచనా హృదయనాథ శ్రాద్ధదేవున్ = పద్మమువలె విశాలమైన కన్నులుగల సీతకు హృదయేశ్వరుఁడనెడి యముని, సుఖవ్యాపారాసువులు = సౌఖ్యము, రాజ్యమేలుట, ప్రాణములు-నాలుగపపాదంబున పుతియతి. భీతి - శోక - తర్క - గీత - దూరాహ్వాన । సంశయార్థములను జరగుఁబ్లుతము - ఈ యర్థములందుఁ బ్లుతముగలదు - కాకుస్వరమనఁగా స్వరవికారము (స్వరము మాఱిపోవుట).

తా. తండ్రీ! విల్లనెడి తెలిసిన మండుచున్న నోరుగలవానిని, గొప్ప యస్త్రములనెడి శిఖలు గలవానిని, సీతను నీవు చెనకుటచేఁ గోపించినవానిని, చాపమనెడి ప్రకాశించు పాశమును ధరించినవానిని, శత్రుసమూహముల సంహరించువానిని, సీతాపతి యనెడి యముని సమీపించుటకు సుఖము రాజ్యకార్యము ప్రాణములు అన్నియు వదలి నాయనా యేల పోయెదవు?

శ్లో. జనకాత్మజసంబంధం,బున రాముం డప్రమేయ♦పురుతేజుం డ
య్యెను నట్టిరాముచాపము, తనుఁ గావఁగ నున్నసీతఁ♦దరమా తేరన్. ౫౫

తా. సీతాదేవిసంబంధమునఁ జేసి రాముఁడు ఛేదింపరాని గొప్ప తేజముకలవాఁ డయ్యెను. అటువంటి రాముని విల్లు తన్ను రక్షింపఁగానున్న సీతను దెచ్చుటకు నీకు సాధ్యమా.

జనకాత్మజ = జనకరాజు కూఁతురు, 'ఇదం బ్రాహ్మ మిదం క్షాత్రం శాపాదపి శరాదపి' యని యోగబలముచే శపింపనుగలఁడు విల్లుపట్టి యుద్ధముచేసి శత్రువులఁ జంపను గలఁడు. అట్టివాని కూఁతురు అని సీతకు వంశమువలన వచ్చిన మాహాత్మ్యము చెప్పఁబడెను.

"శ్రద్ధయా దేవో దేవత్వమశ్నుతే" యన్నట్లు సీతాసంబంధముచేత రాముసంతటివాఁడు విశేష తేజోవంతుఁ డయ్యెను అనుటచే సీతాదేవి మాహాత్మ్యము చెప్పఁబడెను.

రాముచాపము తనుఁ గావఁగన్ = సీతాదేవివలన వచ్చిన మాహాత్మ్యమే కాని రామునకు నైజమాహాత్మ్యము లేదా యందువేమో. అంతటి మహిమగల సీతను రాముని విల్లు గాచుచున్నది. రామసంబంధమున నచేతనమైన వింటికే యంతటి మహాత్ములైన సీతను రక్షించుశక్తియుండిన నిఁక రామునం దెంత శక్తియుండవలెను? రామచంద్రమూర్తి లవకాలమాత్రము చేతఁబట్టుటచే దర్భపోచ బ్రహ్మాస్త్రమై బ్రహ్మరుద్రేంద్రాదుల కభేద్యముకాఁగాఁ జిరకాలము చేతఁబట్టిన వింటియం దెంత మహిమ యుండదు! — నిజవంశమాహాత్మ్యము రామునివంటివానికిఁ దేజము కలిగించు మాహాత్మ్యముగల సీతను కోదండధరుఁడైన రామచంద్రమూర్తి రక్షించుచుండఁగా దీసికొనివచ్చుటకు నీకు సాధ్యమా?

జనకాత్మజసంబంధమున రాముం డప్రమేయ పురుతేజుం డనుటచే = రామునందు లేని తేజస్సును సీతాదేవి రామునందుఁ బ్రవేశపెట్టె నని యర్థముకాదు. రామతేజస్సే (శక్తియే) సీత కావునఁ బూర్వము లేనిది క్రొత్తదొకటి దేహమునఁ బ్రవేశపెట్టఁబడెననుట సరిగాదు. ౧౨-వ పద్యంబున సీతాదేవి చెప్పినట్లు సీతాసన్నిధిని రాముని తేజస్సు ఆమె లేనప్పటికంటె నెక్కువగా విజృంభించును. ఇది

వారివారి యనుభవమునందే చూడవచ్చును. ఎంత చచ్చు విధవనాగన్నయైనను స్త్రీలయెదుట లేసి పౌరుషము నటించును. ఆడువారి దృష్టికిఁ దా నసమర్థుఁడుగాఁ గానరాఁగూడదని వాని యభిప్రాయము.

క౦. సింహోరస్కుండగు నరసింహునిపత్నిఁ గ్షమి సత్య♦శీలాఢ్య వ్యపే
తాంహశ్చరితను రాక్షససింహా! డాయంగఁబోకు ♦ చెప్పితి హితమున్.

సింహోరస్కుని = సింహము ఱొమ్మువలె విశాలమగు ఱొమ్ము గల వానిని. నరసింహునిపత్నిన్ = పురుషశ్రేష్ఠుఁడగు రామచంద్రుని భార్యను, సత్యశీలాఢ్య = సత్యము పాతివ్రత్యము అను సంపద గలది. లేక యథార్థ పాతివ్రత్య సంపద గలది. వ్యపేత + అంహస్ + చరితను = పాపపుఁనడవడి లేనిదానిని, రాక్షససింహా = రాక్షసులందు శ్రేష్ఠుఁడా, డాయంగఁబోకుమ = సమీపింపకుము.

తా. సింహము ఱొమ్మువంటి విశాల వక్షస్థలము గలవాఁడును, పురుష శ్రేష్ఠుఁ డగు శ్రీరాముని భార్యను, సత్యశీలసంపన్నను, పాపచరిత్ర మేమియు లేని దానిని సమీపింపకుము. నీ మేలుగోరి చెప్పుచున్నాను. రావణా! నీవు రాక్షస సింహుఁడవు. ఆయన నరసింహుఁడు. హిరణ్యకశిపునంతటివాఁడు నరసింహుని బారిఁ బడి యేమయ్యెనో యెఱుఁగవా? అట్టివాఁడు రక్షించుదానిని, అంతియగాక సత్యము పాతివ్రత్యము రక్షించుదానిని, కొంచెమైనను పాప మనునది లేనిదానిని నీవు సమీపింపకుము. నీవు రామునకుఁ గోపమువచ్చినను జెడుదువు, సీతకుఁ గోపమువచ్చినను జెడుదువు. ఇఁక సింహపురుషునకుఁ గోపము వచ్చిన నీ గతియేమి? ఆలోచించి యూరకపోకుము.

శా. నీకును బ్రాణముకంటెను రామునకుఁ బ్రియహితను సీత ♦ మోహముచేతన్
వహ్నిశిఖను బట్టఁగఁ, జనుపోలిక నిగ్రహింపఁ♦జనకుము శుభమా. ౨౦

తా. సీత యనఁగా నేమనుకొంటివో - రామచంద్రమూర్తి యామెను తన ప్రాణముకంటెను బ్రియమైనదానినిగాను హితమైనదానినిగను రక్షించుచున్నాఁడు. అట్టి సీతను నీ యజ్ఞానివై వంచి నిగ్రహింపఁదలఁచుట కాలుచిచ్చు శిఖను బట్టుకొనఁ బోవుటే. నీ ప్రయత్నము నీకు మరణాంతకమగునుగాని మానదు. అట్లు పోకుండిన నీకు క్షేమముగలదు. వారైనీమీఁదికి రారు. కావున నీకు భయములేదు.

క౦. కొనసాగనియీకార్యము, పనివూని సురారి! యేమి♦ఫలము గుడిచెదో
విను మతనికంటఁ బడితే, నని నంతటఁ దీఱు నీదు♦నాయుష్యంబున్. ౨౧

వడితేన్ = పడితివని.

తా. నీ వనుకొన్న కార్యము కొనసాగునది కాదు. అట్టి యసాధ్యము

సాహాయమునైన పనికిఁ బూని నీవేమి లాభ మనుభవించెదవో నాకుఁ దెలియుటలేదు. సీతను హరించుచూట యటుండనీ, ఆ రాముని కన్నులకు నీవు కనఁబడితివా నీయాయుస్సు ఆ గడియలోఁ దీఱిన దని తలంపుము.

ఉ. రామునితోఁ విరోధమును ♦ రాక్షసనాయక ! కొంటి వేని నీ
కామితరాజ్యభోగసుఖ ♦ కాంతలుఁ బ్రాణములుఁ దక్కఁగఁ బోదు నీ
కేమియుఁ గొంతకాల మిల ♦ నింకను సౌఖ్యపడంగ నిష్టమేఁ
రాముమనంబు నొచ్చ్చవని ♦ రావణ చేయకు మన్య మేఁడెదన్. ౫౮౯

తా. రాక్షసరాజా! రామచంద్రమూర్తితో నీవు విరోధించితివా నీ కోరికలు రాజ్యభోగములు, సుఖములు ప్రాణము వీనిలో నొకటియు నీకు మిగులదు. కాఁబట్టి నీ కింకను గొంతకాలము సుఖపడఁగోరిక యేమైన నుండెనా రామచంద్ర మూర్తి మనస్సు నొచ్చునట్లు పనిచేయకుము. నిన్ను నేను ప్రార్థించెదను.

చ. చనుము పురంబు, ధర్మహిత ♦ సత్తము లైన విభీషణాదులం
గనుము సభన్, మదిం దలఁచు ♦ కార్యమునందు గుణాగుణంబులన్
వినుము, బలాబలంబులను ♦ వెండియు స్వాన్యబలప్రమాణ ము
య్యన మది నిశ్చయింపుము, హి ♦ తాహిత మెంచి యొనర్పు కార్యమున్.

తా. నీవు లంకకుఁ బొమ్ము. అందు ధర్మబుద్ధి గలిగి నీ మేలు గోరు విభీషణుఁడు మొదలగువారిని రహస్యముగాఁ గాదు సభయందుఁ జూడుము. నీ వనుకొన్న కార్యమునందు గుణమెంతో యగుణమెంతో వారు చెప్పఁగా వినుము. వానిలో నేది బలమో యేది దుర్బలమో మఱియు నీబలమెంతో రాముని బలమెంతో నిశ్చయింపుము. ఆవల నిది మనకు మేలు ఇది కీడు అని యెంచి కార్యము చేయుము.

కం. నాకుం దోఁచిన యది యిది కుకోసలరాజపుత్రు ♦ నాహవమందున్
నీకు నెఱి గాదు డాయఁగఁ, జేకొను నాబుద్ధి నీకుఁ ♦ జెలఁగు శుభంబుల్. ౫౯౦

ఆహవమందున్ = యుద్ధమునందు, నెఱిగాదు = నీతిగాదు, క్రమముగాదు.

తా. నాకుఁదోఁచినది నేను జెప్పెదను. రామచంద్రుని నీవు యుద్ధరంగమున సమీపింపఁదగదు. నాబుద్ధి వినుము. నీకు మేలు కలుగును.

—♦ { ౩౮-వ సర్గము. మారీచుఁడు రావణునితో శ్రీరామునిచేఁ దాను బడినపాట్లు దెలుపుట. } ♦—

సీ. వినుము పూర్వ దశకంఠ ♦ విపులాతలంబునఁ జెల్ల, వేయిగజంబుల ♦ విపులబలముఁ
దాలిచి పర్వతతో ♦ త్తాలరూపంబున, నీలజీమూతసు ♦ స్నిగ్ధశరీర

కాంతితో సంతప్త ♦ కాంచనకుండల,ధారి నై పరిఘాయు ♦ ధంబుఁ బూని
లోకంబు భీతిమై ♦ నాకులపా టొంద, దండకాటవిఁ దపో ♦ ధనుల మాంస

తే. ములను మెక్కుచుఁ దిరుగఁగ ♦ మునివరుండు
గాధిజుఁడు భీతి దశరథుఁ ♦ గాంచి యిపుడు
భయము ఘటియిల్లె మారీచు ♦ వలన నాకు
రామభద్రునిఁ బనుపవే ♦ క్రతువుఁ గావ. ౭౯-౨

విపులాతలంబు = భూప్రదేశము, విపుల = విస్తారము, పర్వతోత్తాలరూపంబునన్ = కొండవలె నెత్తైనయాకారముకలిగి, నీలజీమూతసన్నిభ = నల్లనిమేఘముతో సమానమైన శరీరకాంతితో, సంతప్తకాంచనకుండలధారి నై = పుటము వేయఁబడిన బంగారుకుండలముల ధరించినవాఁడనై, పరిఘాయుధంబు = ఇనుపకట్ల గుదియ యను ఆయుధమును, క్రతువు = యజ్ఞము.

తా. దశగ్రీవా! వినుము. నేను వేయి యేనుఁగుల విస్తారబలముగలవాఁడనై పర్వతమువలె నెత్తైన యాకారము ధరించి కాఱుమొగిలువంటి దేహకాంతితో నవరంజి బంగారుకుండలములతో గుదియఁ జేతఁ బట్టుకొని నన్నుఁ జూచి భూతములన్నియు భయమున వ్యాకులపడుచుండ, మునులమాంసముఁ దినుచు భూప్రదేశమంతయుఁ దిరుగుచుండ విశ్వామిత్రముని భయపడి దశరథరాజును జూచి రాజేంద్రా! మారీచునివలన నాకు భయము సంభవించెను. నాయజ్ఞము రక్షింప రామభద్రుని బంపుమా యని వేఁడెను.

చ. అనవుడుఁ గౌశికోక్తులకు ♦ నా నరపాలకుఁ డిట్లనుం దపో
ధన పసివాఁడు రాఘవుఁడు ♦ ద్వాదశవత్సరుఁ డస్త్రకౌశలం
బును గలుగండు కావునఁ జ♦మూసహితంబుగ నేన వచ్చి యా
దనుజులఁ ద్రుంచి మీకును ని♦తాంతము సంతస మారఁ జేసెదన్. ౭౯-౩

కౌశికోక్తులకున్ = విశ్వామిత్రుమాటలకు, ద్వాదశవత్సరుఁడు = పండ్రెండేండ్లవాఁడు, అస్త్రకౌశలంబును = అస్త్రప్రయోగములందు నేర్పు, కలుగండు = కలిగినవాఁడు కాఁడు, చమూసహితంబుగన్ = సేనతోడ, నితాంతము = మిక్కిలి సంతసము = సంతోషము.

తా. ఆవిశ్వామిత్రుఁడు చెప్పినమాటలు విని దశరథుఁ డిట్లనియె. మునీశ్వరా! రామచంద్రుఁడు పసిబాలుఁడు. పండ్రెండేండ్లవాఁడు. అస్త్రవిద్యయందు నేర్పరి గాఁడు. కావున సేనతోడ నేనే వచ్చి యారాక్షసులఁ జంపి మీకు మిక్కిలి సంతోషము గలిగించెదను.

ఇచ్చట విశ్వామిత్రయాగసంరక్షణకాలమునకు రామచంద్రమూర్తి పంద్రెండేండ్లవాఁడని కంఠోక్తిగ నున్నది. కావున బాలకాండమందుఁ జెప్పిన ఊనషోడశాబ్దుఁడనుటకు పంద్రెండేండ్లవాఁడని యర్థము గ్రహించుటయె సమంజసము. ఇది రావణు బెదరించుటకై తక్కువవయస్సు చెప్పెనని తీర్థీయము. రాముని విషయమై చెప్పిన తక్కిన మాటలకు భయపడని రావణుఁడు పంద్రెండేండ్లవాఁడనఁగానే భయపడునని మారీచుఁడు తలఁచెఁగాఁబోలు. అట్లు బెదరింపఁ జెప్పెనేని మఱింత భయపెట్టుటకై యెనిమిదేండ్లవాఁడనియే చెప్పియుండును ఈ పద్యావిచారము మఱియొకచోటఁ జేయఁబడును.

శా. ఆమాటల్విని కౌశికుం డనియె రాజా! రాముఁ డొక్కండు గా
 కామాంసాశనపర్యునిం దలపడంగాఁ జాలఁ డెవ్వండు, స్వ
 ర్ధామస్తోమము నీవు గాచుట ప్రసిద్ధంబే కదా సైన్యముల్
 సీమం బారఁగ నుండని మ్మిచట నీశ్రీరాముఁ గొంపోయెదన్. ౫౯౪

మాంసాశనపర్యునిన్ = రాక్షసశ్రేష్ఠుని, తలపడంగాన్ = ఎదిరింపఁగా, స్వర్ధామస్తోమము = దేవతాసమూహమును.

తా. ఆ దశరథుమాటలు విని విశ్వామిత్రుఁ డిట్లనియెను. రాజా! యారాక్షసుని నెదిరింపఁగలవాఁడు రాముఁడుదప్ప మఱియొకఁడు లేఁడు. నీ విదివఱకు దేవతలను రక్షించుట జగత్ప్రసిద్ధమే కదా. నీ సేనలచటికివచ్చి రాక్షసులచే నిష్కారణముగఁ జావనేల? ఇందే సుఖంబుండనిమ్ము. శ్రీరాముని దీసికొనిపో యెదను

కం. బాలుండయ్యును నాతఁడు, చాలున్ రాక్షసుల నొంపఁ బరమధిక తేజో
 లాలితుఁ డగుటకును నీకుం, జాలశుభంబులు ఘటిల్లు నృపచంద్రా. ౫౯౫

తా. శ్రీరామచంద్రమూర్తి పిల్లవాఁడైనను రాక్షసులఁ జంప సమర్థుఁడు. అంత యధికమైన తేజస్సు గలవాఁడు. నీవు రామచంద్రుని నావెంటఁ బంపితివా నీకు మిక్కిలి శుభములు గలుగును.

కం. అనుచున్ రాముని దోడ్కొని, చని విశ్వామిత్రమౌని సంతోషమునన్
 దన యాశ్రమమున దండకఁ, బనిపూనెన్ సవమునకును పవనదేశమునన్. ౫౯౬

సవమునకున్ = యజ్ఞమునకు.

తా. అని చెప్పి రామచంద్రమూర్తిని దనవెంటఁ దీసికొని సంతోషముతో దండకలోని తన యాశ్రమమునకుఁ బోయి యా వనములో యజ్ఞముచేయ నారంభించెను.

ఉ. ఆయెడ రాముఁ డేకవస♦నాంచితుఁ డై, శిఖియై, సరోజప
త్త్రాయతనేత్రుఁడై, మెఱయు♦హాటకమాలిక లీల వ్రేలఁగా
శ్రీయుతమూర్తియై, ముఖము♦చెల్వముచందముఁ జాటుచుండ లేఁ
బ్రాయము, విల్లు మీటుచును ♦ స్వద్యుతిఁ గాన వెలుంగఁజేయుచున్. ౫౯-౭

ఏకవసనాంచితుఁడై = ఒంటిగుడ్డ గలవాఁడై, శిఖియై = శిఖ (జులుపాలు) గలవాఁడై, సరోజపత్త్రాయతనేత్రుఁడై = ఉదయమున తామరకొలనులోఁ బూచిన తామరరేకులవలె విశాలములైన నేత్రములుగలవాఁడై, హాటకమాలిక = బాల్యమున ధరింపఁ బులిగోళ్ళు మొదలగునవి గ్రుచ్చిచేసిన బంగారు సరము, శ్రీయుతమూర్తియై = లక్ష్మీదేవితోఁగూడిన యాకారము గలవాఁడై, శోభతోఁ గూడిన యాకారముగలవాఁడై, ముఖము చెల్వముచందము = ముఖముయొక్క యందముయొక్క విధము = మీసకట్టులేని ముఖము, లేఁబ్రాయము = లేఁత వయస్సు, స్వద్యుతిన్ = నెమలి మెడవంటి తన దేహకాంతితో.

తా. శ్రీరాముఁ డాకాలమున బ్రహ్మచారిగావున నొంటివస్త్రము మొలకుఁ జుట్టుకొని జుట్టులుగలిగి యుదయమునఁ దామరకొలనిలోఁ బూచిన తామరపుష్పముయొక్క విశాలములగు రేకులవంటి కన్నులు గలవాఁడై, పులిగోళ్ళు మొదలైనవి గ్రుచ్చిన బంగారుతీఁగ మెడలో వ్రేలాడుచుండ, మిగుల శోభతోఁగూడిన దేహము గలవాఁడై, మీసకట్టుకూడ నేర్పడని ముఖము, తీరు లేఁబ్రాయమును స్పష్టముగఁ దెలుపుచుండఁగా విల్లు తంత్రమ్మని మ్రోయించుచు నడవియంతయు నెమలిమెడవంటి దన దేహకాంతిచే శ్యామారుణముగాఁ బ్రకాశింపఁజేయుచు.

కం. పొడతెంచు బాలచంద్రుని, వడువున శోభిల్ల లబ్ధ♦వరగర్వమునన్
గడువడిఁ జనుదెంచితి న,య్యెడ నన్ మేఘాభకాంతి♦యెసక మెసంగన్. ౫౯-౮

పొడతెంచు = ఉదయించు, వడువునన్ = విధమున.

తా. అట్టివాఁడయ్యు నుదయించు బాలచంద్రునివలె సౌమ్యుఁడై ప్రకాశించుచుండ వరములు గలవను గర్వముచే మేఘకాంతి యతిశయించుచుండ విసవిస నచ్చటికి వచ్చితిని.

ఉదయించు బాలచంద్రుఁ డనుటచే జన్మప్రభృతి శత్రుసంహరణము సహజగుణముగాఁ గలవాఁడని భావము. బాలచంద్రుఁ డనుటచే నుత్తరోత్తరాభివృద్ధి సూచితము. ఏకవసనాంచితుఁడనుటచేఁ గవచముకూడ తొడగలేదని భావము.

చ. ఇటు చనుదెంచు నన్నుఁగని ♦ యింతయు భ్రాంతుఁడు గాక చాపమున్
బటుగతి నెక్కుపెట్టఁ బసి♦బాలకుఁ డంచు నుపేక్షఁజేసి యా

జటిలుని వేదిచాయకు వె ♦ సం జను నన్నుఁ జిమ్మె రాముఁడున్
జటులశరంబునం బడఁగ ♦ సంద్రమునన్ శతయోజనంబులన్. ౫౯౯

ఇంచుకను = కొంచెమైనను, భ్రాంతుఁడు = తత్తరపడినవాఁడు, జటిలుని = జడలు ధరించినవానియొక్క-మునియొక్క, వెసన్ = త్వరగా.

తా. ఇటువచ్చుచున్న నన్నుఁ జూచి రామచంద్రుఁడు కొంచెమైనను తత్తరపాటులేక విల్లెక్కుపెట్టి నిలిచియుండఁగాఁ బసిబాలుఁడు వీఁడని నేను యలక్ష్యభావముతో విశ్వామిత్రుఁడు హోమముచేయు వేదియొద్దకుఁ బోఁగా నొక తీవ్రమైన బాణముచే నూఱామడదూరమున నున్న సముద్రములోఁ బడునట్లు చిమ్మెను.

కం. ఊపిరితో నను విడుచుటఁ, గూపారమునందు మూర్ఛఁ ♦ గూలియు నెంతో
సేపునకు దెలిసి కని లం, కాపురికిం జనితి తేఁక ♦ గర్వం బూనన్. ౬౦౦

కూపారమునందున్ = సముద్రమునందు.

తా. చంపక నన్నుఁ బ్రాణములతో వదలినకారణమున మూర్ఛపోయి సముద్రములోఁబడియు నెంతో సేపునకు స్మృతిరాఁగా గర్వము వాసి లంకకుఁ బోయితిని.

కం. బాలుఁడు నకృతాస్త్రుఁడు, గోలయు నన్నట్లు వఱచెఁ ♦ గూలిచె సైన్యం
బాలమునకు నిపు డెత్తిన, నేలా వచియింప రాక్ష ♦ సేశ్వర! ఫలముల్. ౬౦౧

అకృతాస్త్రుఁడు = అస్త్రాభ్యాసము సరిగా లేనివాఁడు, గోల = ముగ్ధుఁడు, వఱచెన్ = బాధించెను, ఆలమునకున్ = యుద్ధమునకు, ఇపుడు = ఈ వయస్సున, ఎత్తినన్ = దండెత్తిన,

తా. పసివాఁడు, అస్త్రవిద్య తెలియనివాఁడు, ముగ్ధుఁడు నగువాఁడే నన్నట్లు బాధించెను. సైన్యమంతయు ధ్వంసముచేసెను. ఇప్పుడాయన మంచివయస్సునం దున్నవాఁడు. ఇప్పుడు నీవు యుద్ధమునకై దండెత్తితివా కలుగఁబోవుఫలము నేనేల చెప్పవలె? అనుభవించి నీవే తెలిసికొనఁగలవు.

ఉ. కావున రామునిం జెనకఁ ♦ గార్యము గాదని నీ ప్రయత్నమున్
రావణ! మానఁగా వలసె ♦ రామునితోఁ బగ గొంటివేనియున్
బోవదు రిత్త కయ్యదియు ♦ భూరితరాపద రాక్షసాళికిన్
నీవ ఘటించినట్ల యగు ♦ నిక్కము నమ్ముము పంక్తికంధరా. ౬౦౨

తా. ఈ కారణముచేత రామచంద్రుని నీవు యుద్ధమం దెదిరించుట తగిన పనిగాదని నీ ప్రయత్నము నడఁగింపవలసెను. రామచంద్రునితో విరోధించితివా యది యూరకపోదు. రాక్షససమూహమునకు నీవే గొప్పవిపత్తు కలిగించినవాఁడ వగుదువు. నిజము. రావణా! నామాట నమ్ముము.

ఉ. క్రీడలు సొంపు పెంపుఁ దన ♦ రిఁ పఁగ నింపగు నుత్సవంబులన్
గూడి చరించు నీయసుర ♦ కోటికిఁ దాపము కీడుఁ గూర్పఁగాఁ
జూడకు, భర్మహర్మ్యతల ♦ సుందర సౌధవితాన లంకయుం
గా డయి పోవఁ జూచెదవు ♦ మైథిలికై విను రాక్షసోత్తమా. ౬౦౩

భర్మ = బంగారుమయమైన, హర్మ్యతల = ధనికుల మేడల ప్రదేశము గలదియు, సుందర సౌధవితాన = అందమైన రాజగృహముల సముదాయముగలదియు, మైథిలికై = సీతాదేవికొఱకై.

తా. ఆటలును సంతోషాతిశయమును గలిగించు పండుగులందు సందడిఁ గలసిమెలసి తిరుగు నీరాక్షసులకు నీవే సంతాపము ముప్పు గలుగఁజేయఁ జూడకుము. బంగరు హర్మ్యములు, సుందరములగు రాజగృహములు గల లంక సీతాదేవికొఱకై పాడైపోవునాలోచన చేయుచున్నావు.

ఉ. పాపముఁ జేయ కెంతయును ♦ బావనరీతిఁ జరించుచుండియున్,
బాపులసంగతిం బరుల ♦ పాపములం జెడుఁ జుమ్ము సజ్జనుల్;
డాపఁద నొందుఁ బన్నగజ ♦ లాశయమందలి చేఁపవిందు, నీ
పాపమునన్ సుఖానుభవ ♦ భవ్యులఁ జూచెదు నేలపాలుగాన్. ౬౦౪

పావనరీతిన్ = శుద్ధమైనవిధమున, పన్నగజలాశయమందలి = పాముగల మడుఁగునందలి, చేఁపపిందు = చేఁపలసమూహము, సుఖానుభవభవ్యులన్ = సుఖము ననుభవించు మంచిసడవడిగలవారిని.

తా. సత్పురుషుఁడు తానేపాపము చేయక శుద్ధవర్తనముగలవాఁడై యుండినను పాపులతో సహవాసము గలిగెనేని వారిపాపములచేఁ దానుగూడఁ జెడును. ఎట్లనెనవా? పాములుగల మడుఁగునందుండు చేఁపలెవరికే యాపద గలిగింపకున్నను వానితోడనుండినకారణముచే వానిని జంపవచ్చినవారిచేతనో గరుత్మంతునిచేతనో తాము చచ్చును. ఆ విధముగ నీవు పాపము చేసి నీవు చెడుటయేగాక హాయిగా నిర్వికారముగా నేదోషములేక సుఖ మనుభవించువారినిగూడ నాశము చేయఁ జూచుచున్నావు.

కం. ఏపాప మెఱుఁగకున్నను, నీపాపముకతన దివ్య ♦ నిరుపమమణిభూ
షాపటలదివ్యచందన, లేపనయుత రాక్షసావ ♦ళిం దెగఁ గనదే. ౬౦౫

దివ్య = దేవతాసంబంధమైన, నిరుపమ = సమానములేని, మణిభూషాపటల = రత్నములు చెక్కిన యాభరణసమూహములతోను. దివ్యచందనలేపన = దివ్యమైన గంధపుఁబూఁతలతోను, యుత = కూడిన, రాక్షసావళిన్ = రాక్షససమూహమును, తెగన్ = చావఁగా.

తా. నా మేపాపముచేయుమి యటులుండఁ దెలియక యుండియును నీవు చేయు పాపముచే దివ్యరత్నభూషణములచే దివ్యగంధములపూఁతలచే సంతోషించు రాక్షసులను నాశఁ జేసెదవా ?

చ. అనిమొనఁ జావఁగా మిగిలి♦నట్టినిశాచరు లాత్మదారలం
గొనియును నా పిడియో దెరలి♦కుం బరువెత్తఁగ దిక్కుమాలి లం
కను గల కొంపలెల్ల శర♦కాండహుతాశనహేతిపాళిచే
తను దెగఁగాలి నీఱుగుట♦తప్పక చూచెదు నీవ రావణా. ౬0౬

అనిమొన = యుద్ధముఖమునందు, దిక్కుమాలి=రక్షకులులేక, శరకాండ = బాణసమూహములనెడు, హుతాశన = అగ్నిహోత్రునియొక్క, హేతి = జ్వాలల - హేతిర్జ్వాలాయుధాంశుషు - నానా ॥ర॥ పాళిచేఁ = సమూహముచే, నీఱు = బూడిది.

తా. యుద్ధముఖమున రామచంద్రునిచేఁ జావఁగ మిగిలిన రాక్షసులు తమ భార్యలను దమవెంటఁ దీసికొనియైనా లేక వదలిపెట్టియైనా దిక్కులవెంట రక్షకులు లేక పరువెత్తఁగా లంకయందుండు నిండ్లన్నియు బాణసమూహములను నగ్నిజ్వాలలచేఁ గాలి బూడిదయయిపోవుట నీవే కన్నులారఁ జూచెదవు.

కం. పరదార వలచుకంటెం, బరికింపఁగ వేఱె భూరి♦పాపము గలదే ?
సురవైరి నీ భార్యలు, తరుణులు పదివేలు లేరె♦తర్కింపు మదిన్. ౬0౭

పరదారన్ = ఇతరునిభార్యను, వలచుకంటెన్ = మోహించుటకంటె, పరికింపఁగన్ = ఎంతయాలోచించినను, ఇహమునఁ జెడినఁ బరమందైన నీకు మేలు లేదు. మహాపాపముచేసినవానికి పరలోకసౌఖ్య మెట్లు వచ్చును ?

తా. ఇతరునిభార్యను మోహించుటకంటె గొప్పపాపము వేఱేదియైనఁ గలదా ! లేదు. నీవా భార్యలేనివాఁడవు కావు. పదివేలమందిభార్యలు వయస్సునందుండువారు గలరు. వారితో నీ యిష్టముచొప్పున భోగింపవచ్చునుగదా. ఆపదతోఁ గూడిన సీతాసాంగత్య మేల కోరెదవు ? నీవే యాలోచింపుము. ఈ కార్యముచే నీవు నుభయలోకములఁ జెడెదవు.

ఉ. కమ్ము స్వదారలోలుఁడవు ♦ కావుము నీదుకులంబు రాక్షసా
నెమ్మదిగా సురూప లగు♦నీ ప్రియభార్యలతోడఁ గూర్మి మి
త్రమ్ములతోడ సింకయుఁ జి♦రంబుగ సౌఖ్యము నందఁగోరితే
నెమ్మియి రామచంద్రునకు♦నెగ్గొనరింపకు చాటి చెప్పితిన్. ౬0౮

స్వదారలోలుఁడవు = నీ భార్యలయందు నాసక్తి గలవాఁడవు, కోరితేన్ = కోరితివేని, ఎగ్గు = కీడు.

తా. నీ భార్యలతోడ యథేచ్ఛగా నీవు క్రీడింపుము. నీవంశము రక్షింపుము. అందగత్తెలగు నీ భార్యలతో ప్రేమగల స్నేహితులతో నింకను దీర్ఘకాలము సుఖింపవలయునను కోరికయుండెనా రామచంద్రునకుఁ గీడు గావింపకుము. స్పష్టముగాఁ జెప్పుచున్నాను. ఇది రహస్యవిషయము గాదు.

మాలిని వలదు వలదు సీతా ♦ వారిజాక్షిన్ గ్రహింపన్
జెలిమిఁ గలిమి నీకుం ♦ జెప్పెదం, గాదటంచున్
బలిమిని గ్రహియింపన్ ♦ బంధుమిత్రాళితోడన్
గలవు కలనఁ గూలన్ ♦ క్ష్మాసుతానాథుచేతన్. ౬౦౯

తా. రావణా! సీతాదేవిని నీవు హరింపవలదు వలదు. నే నీమాట నీమీఁద నాకుఁగల ప్రేమచే నీ క్షేమముఁగోరి చెప్పుచున్నాను. నామాట వినక బలాత్కారముగ సీతను గ్రహించితివా బంధువులతో మిత్రులతో యుద్ధమునందు రామునిచేఁ జావఁగలవు.

మాలిని = న నమయ య గణంబుల్. తొమ్మిదింట యతి.

{ ౩౯-వ సర్గము. మారీచుఁడు రావణుతోఁ దాను రామునిబారి బడి తప్పించుకొన్నవిధముఁ దెల్పుట. }

శా. ఎట్టెట్టో విడిపించె నన్నపుడు ధా ♦ త్రీశుండు సంగ్రామమం
దిట్టట్టాడక విన్ము చెప్పెదను ద ♦ ద్వృత్తంబు నూత్నంబు, నే
నెట్టుల్ స్రుక్కియు రామునిచేఁ బడి యిదే ♦ యారణ్యవీథిన్ బడిన్
దిట్టల్ దైత్యులు జంకగూవముల నే ♦ తే సిద్ద తే నుద్ధతిన్. ౬౧౦

ధాత్రీశుండు = రామచంద్రుఁడు, ఇట్టట్టాడక = అడ్డమాటలు చెప్పక, నూత్నంబు = క్రొత్తది, బడిన్ = నావెంబడి, ఉద్ధతిన్ = గర్వముచే, ఎట్టో + ఎట్టో = ఎట్టెట్టో, అపుడు = విశ్వామిత్రయాగరక్షణకాలమున.

తా. విశ్వామిత్రయాగరక్షణకాలమందు రామచంద్రుఁడు యుద్ధరంగమున నన్ను నూపిరితో విడిచెనుగాని యందఱను జంపినవాఁడు నన్నొక్కని నెట్లు విడిపించెనో యేల విడిపించెనో నే నెఱుఁగను. బ్రదికియుండుటమాత్ర మెఱుఁగుదును. ఇది ప్రాఁతవృత్తాంతము. క్రొత్తగా నిటీవల జరిగినది చెప్పెద అడ్డమాటలు చెప్పక సావధానచిత్తుఁడవై వినుము. ఆ ప్రకారము రామునిచే దెబ్బతిని దండకారణ్యమందే నావెంబడి యుద్ధులు యోధులు దిట్టలైనను గొందఱు జంకగూవములతో రాఁగా నేను గర్వించినవాఁడనై.

తే. దీప్తజిహ్వాయుఁ బెనుమేను ♦ దీర్ఘదంష్ట్రి
లమరు ఘోరమృగంబయి ♦ యగ్నిహోత్ర
గృహములను దీర్థములఁ జైత్య ♦ వృక్షములను
గ్రుమ్మరితి మాంసభోజి నై ♦ క్రూరమతిని. ౬౧౧

దీప్తజిహ్వ = మండుచున్నట్లుండు నల్లనినాలుకయు, పెనుమేను = పెద్ద దేహము, దీర్ఘదంష్ట్రి = నిడివియగు కోఱలు, ఘోరమృగంబయి = భయంకర మయిన జంతువయి, చైత్యవృక్షములన్ = రచ్చమ్రాఁకులను

తా. ఇతరులను హింసించి తినుటకుఁ గావలసిన మండుచున్న దానివలెనుండు నాలుక, పెద్దదేహము, నిడుపాటికోఱలు గల భయంకర మృగమనై, ఋష్యాశ్రమంబులందలి యగ్నిహోత్రములందును, తీర్థములందును, రచ్చమ్రాఁకులందును, మాంసమును దినువాఁడనై, క్రూరమైన మనస్సుతో సంచరించితిని.

తే. దండకారణ్యతాపస ♦ కాండములను
గూల నడిచియు రుధిరంబుఁ ♦ గ్రోలి వారి
మాంసముల మెక్కుచు నధర్మ ♦ మార్గపరత
నొడలు దెలియక మత్తెక్కి ♦ యెక్కినాఁడు. ౬౧౨

రుధిరము = నెత్తురు, అధర్మమార్గపరతన్ = అధర్మమార్గమందలి యాసక్తిచే, ఒడలు = దేహము, మత్తు = మదము.

తా. దండకారణ్యమందుండు తపస్వుల సమూహములను బడఁదన్ని వారి నెత్తురు త్రాగుచు వారిమాంసముఁ దినుచు నధర్మమార్గమునందలి యాసక్తిచే దేహము తెలియక మదించి యెక్కానొక దినమున.

సీ. తాపసవేషంబుఁ ♦ దాల్చి మితాహార,యుక్తి భూతావనా ♦ సక్తిగల్గు
రామభద్రుఁడు మహా ♦ వ్రత ధరాకన్యయు, మిత్రతేజుండు సౌ ♦ మిత్రి యుండు
చక్కటికిని బోయి ♦ చిక్కరా ముని యని, పూర్వవైరంబును ♦ బుద్ధిఁ దలఁచి
వాఁడికొమ్ములు వంచి ♦ వేఁడిమి దీపింప, బుద్ధిహీనుఁడ నై ♦ పొడువఁ బోవఁ

తే. జాప మెక్కిడి నాయున్న ♦ చాయఁ జూచి, గరుడమారుతనిస్వన ♦ కలితవజ్ర
సన్నిభాశుగముల మూఁటి ♦ సరగ విడువ, నుఱికితిని వాని వేగంబు ♦ నెఱుఁగుకతన.

మితాహారయుక్తిన్ = మితముగా నాహారమును దీసికొనువాఁడై, భూత + ఆవన + ఆసక్తి = ప్రాణులను రక్షింపఁ గోరికగలిగి, మహావ్రత = పరమపతివ్రత, మిత్రతేజుండు = సూర్యునివంటి తేజస్సుగలవాఁడు, చక్కటికిని = ప్రదేశమునకు,

గరుడమారుతస్వన = గరుడునియొక్కయు గాలియొక్కయు ధ్వనితో, కలిత = కూడిన, వజ్రసన్నిభ = వజ్రముతో సమానమైన, ఆశుగములన్ = బాణములను.

తా. తపసివేషము ధరించి మితాహారము గొనుచు ప్రాణికోటుల రక్షింపఁ గోరికగల రామచంద్రుఁడును, పరమపతివ్రతయగు సీతాదేవియు, సూర్యకాంతి వంటి కాంతిగల లక్ష్మణుఁడును, నొకచో నుండఁగా నక్కడికిఁ బోయి చిక్కరా మునీశ్వరుఁ డని పూర్వవైరంబుఁ దలఁచి పదునగుకొమ్ములు వంచి వేఁడిమి పరిజ్వరిల్ల తెక్కనయుండఱు తపస్వులవలె హింసాపరుఁడుకాఁడు కావున మనల నేమి చేయఁ డని బుద్ధిలేనివాఁడనై తలఁచి రామచంద్రుని బొడువఁబోయితిని. ఆయన నావంకఁజూచి చాపమెక్కుపెట్టి గరుడుఁడు గాలి తీవ్రవ బోవు నప్పు డెట్లు శబ్దముగునో యట్టిశబ్దముగల వజ్రమువంటి మూఁడుబాణములను విడిచెను. ఆ బాణవేగముదెబ్బ తెలిసినవాఁడనగుట నాయన బాణము సంధించిసంధింపకముందే పరువెత్తితిని.

కం. కావున నే బ్రతికితి నా,తోవచ్చినవారు వాఁడి ♦ తూపులు దాఁకన్
బోవిడిచిరి ప్రాణంబుల, నేవానికి వశము రాము ♦ నెదిరియు బ్రదుకన్. ౬౧౪

తా. రామచంద్రబాణములు వెనుకనుండి తాఁకవు. కావున నేను బ్రదికితిని. నాతోడ వచ్చినవా రిద్ద ఱాబాణములు దవిలి చచ్చిరి. రామచంద్రు నెదిరించియు బ్రతుక నెవరికి సాధ్యము.

చ. విదితబలాఢ్యుఁ డైన రఘు ♦ వీరునిబారికిఁ దప్పి యెట్టెటో
బ్రదికితి నాఁటఁగోలె నిట ♦ రాక్షసనాయక! సన్న్యసించి ని
ర్మదమున యోగయుక్తి ముని ♦ మాడ్కిఁ జరించుచు నున్నవాఁడ, నా
హృదయముపాటు నే మనుదు ♦ శ్రీరఘురాముని సంస్మరించినన్. ౬౧౫

విదితబలాఢ్యుఁడు = ప్రసిద్ధికెక్కిన బలసంపదగలవాఁడు, ఎట్టెటో = ఏ విధముగనో, అతి కష్టముపై, నాఁటఁగోలె = ఆ దినము మొదలు, ఇట = ఈ యాశ్రమమునందు, నిర్మదమునన్ = మదము లేమిచే.

తా. ప్రసిద్ధబలసంపదగల రామచంద్రునిబారిఁబడి తప్పించుకొని యెట్టెటో బ్రతికి యిఁక మెదలాడినఁ జంపు నను భయముచే నా దినము మొదలుకొని యీ ప్రదేశమందు గర్వహీనుఁడనై యోగాభ్యాసముచేయుచు, మునివలె నున్నాఁడను. ఆ శ్రీరాముని మనస్సునఁ దలఁచితినా నా హృదయము పడెడుపాటు నేనేమని చెప్పుదును.

కం. భూరిధనుస్సు మృగాజిన,చీరంబులు దాల్చి చెట్టు ♦ చెట్టున దశకం
ఠా! రాముఁడు గనఁబడెడి న,నారతముం బాశహస్తుఁ ♦ డగు యము పోల్కన్.

భూరిధనుస్సు = గొప్పవిల్లు, మృగాజినచీరంబులు = జింకచర్మము నార చీరలు, అనారతముఁ = ఎల్లప్పుడు.

తా. పెద్ద విల్లు పట్టుకొని నారచీరలు జింకచర్మము ధరించి రావణా చెట్టు చెట్టునందు నెల్లవేళలఁ జూచినప్పుడంతయు పాశము ధరించిన యమునివలె గానవచ్చుచున్నాఁడు.

ఉ. రాములు వేనవేలుగను ♦ రావణ! తోఁచెద రెల్లవేళలన్
రామమయంబుగాఁగ విపి ♦ నంబు సమస్తము గోచరించెడిన్
రాముఁడు లేనిపట్టులను ♦ రాముఁడ కన్పడు, స్వప్నమందునున్
రాముని గాంచి బొబ్బరిలి ♦ రాత్రుల నిద్దుర లేక యుందునున్. ౬౧౭

విపినము = అడవి, గోచరించెడిన్ = కానవచ్చుచున్నది, బొబ్బరిలి = బొబ్బలుపెట్టి.

తా. రాముఁడు చెట్లమీఁదనెక్కి కూర్చుండి నీకుఁ గానవచ్చునందువేమో, అట్లుగాదు, ఒక్కచోట నొకరాముఁడు కనఁబడిన నీ యూహ సరియనవచ్చును. ఎల్లవేళల వేనవేలుగ రామచంద్రమూర్తులు గానవచ్చుచుందురు. అడవి యంతయు రామమయముగాఁ గానవచ్చుచున్నది. ఇంద్రజాలము నిదవేమో? రాముఁడు లేని దూరపుఁ బ్రదేశములం దుండమని పోయిన నచ్చటను రాముఁడే కానవచ్చుచున్నాఁడు. పగటనే కాదు, రాత్రి కన్నులు మూసికొనినను, రాముఁడు కనఁబడఁగా బొబ్బలుపెట్టి లేతును. ఆ కారణమున నిద్దుర యనునది లేక కన్నులు మూసినను రాముఁడే కానవచ్చును. నే నేమి చేయుదును? (భాగవత దశమస్కంధము ౪౫-౪౭ ప ప. చూచునది.)

కం. రామునిపే రన విబుధవి,రామా! వేఱ చెప్ప నేల♦రత్నము రథముల్
రామ లని రాదిశబ్దస్తోమము చెవిఁబడిన మనము ♦సుడివడు భీతిన్. ౬౧౮

విబుధవిరామా = దేవతల సంతసమొందించువాఁడా.

తా. రాముని జూచి భయపడుట యటుండనీ, రాముని పేరవిన భయపడుచున్నాను. రాముని పేరేగాదు. రత్నము, రథము, రామ లని యిట్టి రకారము మొదటఁగల శబ్దములు విన్నను రెండవయక్షరము వచ్చునేమో రాముఁడే వచ్చెనేమో యని మనస్సు కలవరపడుచున్నది.

చ. వలపదు నీకు రామునెడ♦వైరము, యుద్ధమునందు నమ్మహా
బలు నెనయంగ లేవు, రఘు♦వర్యుపరాక్రమ మే నెఱుంగుదుం
బలి నముచిన్ వధింపఁగ స♦మర్థుఁడు, శక్తుఁడ వేని నీవ య
చ్చలమునఁ బోరు, కానియెడ♦సైరణ సేయుము బంధుతామ్మతిన్. ౬౧౯

బంధుతా = బంధుసమూహములయొక్క, మృతిః = మరణమును, ఈ - 'తా' (తల్) సమూహార్థంబున గ్రామ, జన, బంధు, సహాయ, గజ శబ్దములకుఁ బరముగాఁ జేర్పఁబడును.

తా. రావణా ! రామచంద్రునందు నీవు వైరిబుద్ధి విడువుము. యుద్ధమునందు నీ వాయనకు సమానుఁడవు కావు. నీశక్తి నాకుఁ దెలియును. ఆయనశక్తి నాకుఁ దెలియును. ఆయన బలి నముచులన్నను వధింపఁగల శక్తిసంపన్నుఁడు. నీకు శక్తి యుండెనా నీవే పోయి యాగ్రహముతో యుద్ధముసేయుము; బలము లేదాయెనా యయినదయినది ఏమి చేయవచ్చునని బంధువుల మరణము సహించి యూరకుండుము. మీ యిరువురనడుమ నా ప్రాణమేల తీయ నాలోచించెదవు ? ఆ రెంటిలో నొకటిచేయు మింతియ కాని దొంగతనము చేయకుము.

కం. నే వసుధఁ గొన్నిదినములు, జీవించుట యిష్టమేని ♦ చెప్పకు మయ్యా
రావణ ! నాతో నా సీతా,విభుకథఁ జాలుఁ జాలుఁ♦దలపై వచ్చున్. ౬౨౦

తా. ఇంకను నేను గొన్ని దినములు బ్రదికి భూమిపైనుండుట నీ కిష్టమాయెనా, యా సీతాపతికథ నాతోఁ జెప్పకుము. అది నా తలపోవుపని యగును.

ఉ. పెక్కురుసాధువుల్ జగతిఁ ♦ బెద్దయు ధర్మరతాత్ములయ్యును
దక్కినవారిదోషమునఁ ♦ దారు నశించెద, రట్లు నేను నీ
మ్రుక్కిడిచేఁతలం జెడుట ♦ రూఢియ, నీబడి రాను నేను, నీ
యిక్కృతి నీ కభీష్టమగు ♦ వృత్తిఁ జరింపుము, నన్ను వీడుమీ. ౬౨౧

తా. అనేకులు సాధువులు దాము మిగుల ధర్మాత్ములయినను, నితరుల దోషముచేఁ దాము నశింతురు. అట్లే నేను నీవు మాలిమాలిచేయు కార్యములచేఁ జెడఁగలను. ఇది నిజము. నీవెంట నేను రాను. ఈ కార్యమందు నీ యిష్టమువచ్చిన చొప్పున చేసికొనుము. నన్ను వదలిపెట్టుము.

కం. రాముఁడు నిస్తులసత్త్వో,ద్దాముఁడు పటుతేజుఁ డధిక ♦ దర్పస్థైర్య
స్థేముఁడు రాక్షసలోకవి, రాముఁడు గా నేల నీకు ♦ రావణ చలువల్. ౬౨౨

నిస్తుల = అసమానమైన, సత్త్వ = బలముచే, ఉద్దాముఁడు = గొప్పవాఁడు, అధిక = విశేషమైన, దర్పస్థైర్యస్థేముఁడు = గర్వము, మనోదార్ఢ్యము, శరీర బలము గలవాఁడు, రాక్షసలోక విరాముఁడు = రాక్షసప్రపంచమును నాశము చేసినవాఁడు.

తా. రామచంద్రమూర్తి యసమాన బలాతిశయము గలవాఁడు. దృఢమైన

తేజస్సుగలవాఁడు. అధికమగు గర్వము, మనోదార్ఢ్యము, శరీరబలము గలవాఁడు, ఇట్టివానిని రాక్షసజననాశకుఁడుగా నేల చేసెదవు.

ఉ. హాంమికతోడ నా దశరథాత్మజులన్ మన చుప్పనాతి దా
నే మని డాసె? నంతఁ జనకీసు మెయిం బెరరేచ నాఖరున్
స్తోమముతోడ వాఁడు చని దొమ్మి యొనర్చి గతించె రాముచే,
రాముఁడు చేసినట్టి యపరాధ మదేదియొ పల్కు రావణా. ౨౩

కారణము లేక శూర్పణఖ ముక్కుచెవులు గోసెనన్న మాటకుఁ బ్రత్యుత్తరమిచ్చుచున్నాఁడు.

హాంమికతోడన్ = గర్వముతోడ, పెరరేచన్ = పురికొలిపెను, దొమ్మి = యుద్ధము.

తా. అడవులలో వారంతట వారొక యాశ్రమము కల్పించుకొని యొకరి పేరు ప్రస్తావన లేక యుండఁగా మన శూర్పణఖ పొగరుఁబోతుతనముచే నేమని వారిని బెదరింపఁ బోయెను. అంతతోఁ బోక ఖరాదులను యుద్ధమునకుఁ బురికొలిపెను. వారు గుంపుగాఁ బోయి యుద్ధము చేసిరి. రాముచేఁ జచ్చిరి. ఇందు రామచంద్రమూర్తి చేసిన నేరమేమో చెప్పుము.

కం. చుట్టముల హితముఁ గోరుచుఁ, బట్టుగ నాయాడు మేలుపలుకులు చేఁదై
లెట్టిన రామునిచే నని, గిట్టెదు సహబంధుమిత్రకీర్తిగ ననిన్. ౨౪

తా. బంధువుల మేలుగోరి పట్టుమని గట్టిగ నే చెప్పినమాటలు నీకుఁ జేఁదై తోఁచెనా బంధువులతో స్నేహితులతో కీర్తితో యుద్ధమందుఁ జచ్చెదవు.

౪౦-వ సర్గము.

కం. యుక్తంబు క్షమము నగుతత్సూక్తిని గొనఁడయ్యె దనకశుభమని మరణా
సక్తుం డౌషధములను విరక్తిని గ్రహియింపనట్లు రావణుఁ డాత్మన్. ౨౫

యుక్తంబు = న్యాయ్యమైనది, క్షమము = పనిచేయుటకుఁ దగినది, తత్ = ఆ మారీచుని, సూక్తిని = హితవాక్యములను, మరణాసక్తుఁడు = చావఁగోరువాఁడు, విరక్తిని = వైరాగ్యముచే, చచ్చినఁ జచ్చెదను బ్రతికిన బ్రతికెద నను భావముతో.

తా. న్యాయముతోఁగూడినది కార్యసాధనమునకు నుపయోగించునది యగు మారీచు హితవాక్యమును చావఁగోరెడివాఁడు వైరాగ్యముచే మందు తీసికొననట్లు గ్రహింపఁడయ్యెను.

{ రావణుఁడు మారీచునిఁ బరుషంబు లాడి బలాత్కరించి తోడుపడ నంగీకరింపఁ జేయుట. }

క. ఈచొప్పున నయహితవాచాచతురత బోధ సేయు సచివాగ్రణి మా
రీచు విధిచోదితుఁడు క్షణదాచరపతి పరుషఫణితిఁ దా నిట్లనియెన్. ౯౯

నయహితవాచాచతురత = న్యాయము హితముతోఁ గూడి వాక్యనిపుణత్వముచే - బోధించు మంత్రిశ్రేష్ఠుఁడయిన మారీచునిఁ జూచి, విధిచోదితుఁడు = దైవముచేఁ బ్రేరేపింపఁబడినవాఁడు, క్షణదాచర = రాత్రియందుఁ దిరుగు రాక్షసులను, పతి = పాలించువాఁడు, పరుషఫణితిన్ = కఠినమైన మాటలతో.

తా. ఈ విధముగ నీతియుక్తమై హితమైన మాటలను, మాటల నేర్పుకొలఁది బోధించు మంత్రిశ్రేష్ఠుఁడైన మారీచునిఁ జూచి రావణుఁడు నిష్ఠుర వాక్యములతో నిట్లనెను.

శా. మారీచా! నిను నెవ్వఁ డీ కథల సంభాషింపఁగా గోరె? నో
రారం బ్రేలితి వేలరా చవుట బీజావాపమో నాఁగ వ్యా
హారంబుల్? మనుజుండు మూర్ఖుఁడును బాపాత్ముండు రాముండు; నా
యారాజన్యు నెడాటపుంబనులు నీవా నేర్తు ఛేదింపఁగన్. ౧౦౦

ప్రేలితివి = వదరితివి, చవుటన్ = చవిటి నేలయందు, బీజావాపమో = విత్తనము నాఁటుటయో, వ్యాహారంబుల్ = మాటలు, నా = నాయొక్క, ఆరాజన్యు = రాజయిన యారామువిషయమునఁ జేయు, పనులు = కార్యములు, సీతాహరణాదులు, ఛేదింపఁగన్ = నిలిపివేయుటకా.

నాలుగవపాదంబున వృత్తయతి.

తా. నయమునఁ దన యిష్టప్రకారము చేయునేమో యని తండ్రీ యని సంబోధించెను. నయమును వ్యర్థ మనుకొని ప్రభువు మాటలాడినట్లు మాటలాడుచున్నాఁడు ఓరీ మారీచుఁడా? నిన్నెవఁడురా యీ కథలు చెప్పుమని యడిగెను. చవిటినేలయందు విత్తనములు చల్లినట్లు నోరెండ నేలరా వదరితివి. రాముఁడు మనుష్యుఁడు, మూర్ఖుఁడు, పాపాత్ముఁడు, అట్టివాని సరిచేసికొని నేను యుద్ధము చేయఁ బోదునా? ఆ రాజు విషయమై నేను జేయు పనులను నివారింపఁ జేయుటకు నీవా శక్తుఁడవు. నీచే నది యగునని తలఁచితివా.

ఇందు రాముఁడు మనుజుండు మూర్ఖుఁడు పాపాత్ముఁడను రావణ వాక్యములకు వాస్తవార్థమని తీర్థీయమున వ్యాఖ్య లేదు. ఇందు రాముఁడు మనుజుఁ డని రావణుఁడు చెప్పుటచే వానికి రాముఁడు మనుష్యుఁడను భావమేకాని విష్ణువను భావము లేదని తెలియుచున్నది.

ఆ. ఆఁడుదాని మొఱుఁగు ♦ లాలించి రాజ్యంబుఁ, దల్లిఁ దండ్రి హితవి ♦ తానములను
విడిచి తత్క్షణంబ ♦ నడచు నరణ్యంబు,లందుఁ జొచ్చె నెంత ♦ మందుఁ డతఁడు.

తా. ఆఁడుదాని వ్యర్థ ప్రలాపములను విని రాజ్యమును దల్లిని దండ్రిని హిత సమూహమును వదలి తటాలున నడవులకు వచ్చినవాఁ డెంత బుద్ధిహీనుఁడుగా నుండవలెను. ఇట్టివాని నీ వొక గొప్పగాఁ జెప్పెదవే. నీ వెంత బుద్ధిహీనుఁడవు?

కం. నీవ కన ఖరనిహంతకు, భూవరతనయునకుఁ బ్రాణ ♦ ములకుం బ్రియయౌ
శ్రీ వైదేహి గ్రహించెద, నీవశమా త్రిప్ప నాదు ♦ నిశ్చితబుద్ధిన్. ౬౨౯

తా. నీవే చూచుచుండఁగా నీ కన్నుల యెదుటనే ఖరుని జంపిన రాముని కతని ప్రాణంబులకంటె ప్రియురాలగు సీతను పట్టితెచ్చెదను. నేను నిశ్చయించిన దానిని త్రిప్పుటకు నీకు సాధ్యమా.

ఉ. వాసవుఁ డాదిగా విబుధ ♦ వర్గము లైన మదుద్యమంబులన్
వీసమునంతఁ ద్రిప్ప వన ♦ నీ వటరా ననుఁ జక్కదిద్దఁగా?
వాసి గుణంబు దోషము ను ♦ పాయ మపాయము చెప్ప మన్నఁ గా
దే సచివుండు చెప్పఁదగుఁ ♦ దెల్వగఁ గార్యవినిశ్చయంబునన్? ౬౩౦

వాసవుఁడు = ఇంద్రుఁడు, విబుధ వర్గములు = దేవతా సమూహములు, మత్ + ఉద్యమంబులన్ = నా ప్రయత్నములను, వీసమునంతన్ = వీసమంత యైనను, త్రిప్పవు = త్రిప్పఁజాలవు.

తా. ఇంద్రుఁడు మొదలగు దేవతాసమూహము లన్ని కలిసియైనను నా ప్రయత్నములందు నొక కొంచెమైనను త్రిప్పఁజాల వనఁగా నిఁక నీవా నన్ను దిద్దువాఁడవు. ఏమి నీ యహంకారము, కార్యము చేయవలయునా వని లేదా యని నిశ్చయించుటకై దీనియందు గుణమేమి దోషమేమి ఏది యుపాయము ఎట్లు చేసిన నపాయము గలదు. అను విషయములను రాజడిగినప్పుడుకదా మంత్రి యగువాఁడు వాసిని చెప్పవలయును.

కం. ఇది యెట్లని ప్రభు వడిగిన, బ్రదుకం గాంక్షించుమంత్రి ♦ బద్ధాంజలి యై
మదిఁ గలరీతి నణంకువ, విదితము సేయంగఁ దగును ♦ వెర వొనరంగన్. ౬౩౧

తా. ఈ కార్యము నెట్లు చేయవలయు నని రాజడిగినప్పుడు బ్రదుకుమీఁద నాశగల మంత్రి చేతులు జోడించుకొని వినయముతోఁ దన మనస్సునఁ గలది సదుపాయముగ విన్నవింపవలెను.

కం. హితమును మృదుపూర్వము న,ప్రతికూలము శుభము నైన ♦ వాక్యముచేతన్
బతికి వివరింపఁ దగు స,మ్మతముగ మంత్రి వినయ ♦ మండనయుక్తిన్. ౬౩౨

తా. అదియైన నెట్లు చెప్పవలయును? ఆ చెప్పెడి మాట ప్రభువునకు మేలిచ్చునదిగ నుండవలెను. మెత్తని మాటలఁ జెప్పవలెను. పరుషముగఁ జెప్ప రాదు. ప్రతికూలముగఁ జెప్పరాదు. అనుకూలించిన విధముగఁ జెప్పవలెను. శుభమైన వాక్కులచేత వినయమును నలంకారముగఁగలవాఁడై రాజునకు సమ్మతి మగు విధముగఁ జెప్పవలయును.

కం. మానార్హుఁడై నభూపతి, మానవివర్జితములైన ♦ మహితశుభోక్తుల్
  వీనులఁ బెట్టఁడ దెంతటి, మానిసి వచియించె నేని ♦ మారీచుండా. ౬౩౩

మానార్హుఁడు = గౌరవ యోగ్యుఁడు, మానవివర్జితములు = మానముచే వదలిపెట్టఁబడినవి, మానిసి = మనుష్యుఁడు, మనుష్య శబ్దభవము, రాకాసి - రక్కసి శబ్దములవలె దీనికి నుభయ లింగముల నొక రూపమే.

తా. గౌరవ యోగ్యుఁడగు రాజు మానము విడిచిన మాట లవి యెంత శుభములైన వైనను ఎంతటి పెద్దమనుష్యుఁడు చెప్పినను చెవులఁ బెట్టఁడు. 'మారీచుఁడా, నీ తమ్ము లందఱుఁ జచ్చిరఁ జావనీ. నీ చెల్లెలి ముక్కు చెవులు గోసిరఁ గోయనీ నా కేమి యని యూరక యింటఁ గూర్చుండు' మనిన నవమానము సహించి మానము గోలుపోయి నీవు చెప్పితి వని యెట్లూరకుండును.

ఆ. వాసవాగ్నిసోమ ♦ భానుజవరుణుల, విక్రమాగ్న్యములును ♦ విపులసౌమ్య
  దండములుఁ బ్రసన్న ♦ తయుఁ దాల్చుభూపతి, యెల్లవేళఁబూజ్యుఁ ♦ డింతిసుజము.

వాసవ = ఇంద్రుని, అగ్ని = అగ్నిహోత్రుని, సోమ = చంద్రుని, భానుజ = యముని, వరుణ = వరుణుని, విక్రమము, వేడిమి, ఆహ్లాదకత్వము, దండము, ప్రసన్నత.

తా. రాజనువాఁడు వాసవునివలె విక్రమము, అగ్నివలె, దీక్ష్ణత, చంద్రుని వలె సంతోషకరత్వము, యమునివలె దండము, వరుణునివలెఁ బ్రసన్నత గల వాఁడై యాయా సమయంబుల నాయా వారిపట్ల నుపయోగించు చుండెనేని పూజ్యుఁడగును.

ఉ. నీవును ధర్మముం దెలియ ♦ నేరక కేవలమోహితుండ వై
  యేవియొ కాఱు లాడెదవు ♦ హీనమతీ! పనిపొంటె రాఁగ, ని
  న్నీ విషయంబునం దడిగె ♦ నెవ్వఁడు కీడును మేలు? నీకృతిన్
  నీ వొనరింపు సాహ్య మని ♦ నే వచియింప ని చేల ప్రేలఁగన్? ౬౩౪

ధర్మమున్ = ఇది మంత్రి ధర్మము. ఇది రాజ ధర్మము అని, మోహితుండవై = జ్ఞానహీనుఁడవై, కాఱులు = వ్యర్థపు మాటలు, హీనమతీ = బుద్ధి లేనివాఁడా, పనిపొంటెన్ = ఒక కార్యము చేయుకొఱకు.

తా. బుద్ధిహీనుఁడా! నే నొక కార్యము చేయుకొఱకు నీ సాహాయ్యము గోరి రాఁగా సచివధర్మ మిది యను తెలివిలేక నీ వేవియో యింతసేపు పనికిరాని మాట లన్ని వదరితివి. ఈ విషయమునఁ గీడు మేలు ని న్నడుగుచుఁ యడిగెను. నే నడుగలేదుగదా - ఈ కార్యమందు నీవు సాహాయ్యము చేయవలసినదని నే నడుగఁగా వాఁగెద వేల?

సీ. వినుము నీసాయంబు♦విధము వచించెద, రజతబిందువులచే♦రమ్యమైన
బంగరుజింకవై♦రంగుగ రామాశ్రమముపొంత రాముని♦మహిళ యెదుటఁ
దిరుగుచుండుము నీదు♦తీరుఁ గనుంగొని, విస్మయపడుచును♦విభునితోడఁ
బట్టి తెమ్మను నంత, దవ్వుగఁ గొనిపోయి♦దాశరథిని
తే. జానకీ! లక్ష్మణా! యని♦ చావుకూఁత
రామవాక్యానురూపంబు♦గా మహీజ
వినఁగ వేయుము యద్దాన వికల♦ యగుచు
మెలఁత రాముని జూడ సౌ♦మిత్రిఁ బనుచు. ౬౩౬

సాయము = తోడుపాటు, సాహ్య శబ్దభవము, సాహాయ్య శబ్దభవ మని యైనఁ జెప్పవచ్చును.

రజత బిందువులచే = వెండిచుక్కలచే, మహిళ = స్త్రీ, రామవాక్యానురూపంబుగ = రామునివాక్యము ననుసరించి, మహీజ = సీత.

తా. నీవు నాకుఁ జేయవలసిన సాహాయ్యవిధము చెప్పెద వినుము. వెండి చుక్కలు గల బంగారుజింకవు గమ్ము. రామాశ్రమమునొద్ద సీత కెదుట సంచరింపుము. నీ విధముఁ జూచి నిజముగా నీవు జింకవని నమ్మి యాశ్చర్యపడి సీతాదేవి నిన్నుఁ బట్టుకొనిరమ్మని మగనిని బనుచును. నీ వా రాముని దూరముగఁ దీసికొనిపోయి యక్కడ జానకీ లక్ష్మణా యని చచ్చెడువారి కంఠధ్వనితో రాముని కంఠమువంటి కంఠముతో బిగ్గ నఱపుము. అది రాముని కంఠధ్వని యని సీత నమ్మి మనస్సు వికలముగాఁగా రాముని జూడ లక్ష్మణుని బంపును.

కం. సౌమిత్రియు సౌహృదమున, రాముని నెమకంగఁ బోవు♦రాకొమరులు పో
రాముని రామ హరించెద, నామఘవుఁడు శచినిబోలె♦హాయిగ నేనుర్. ౬౩౭

సౌహృద(ము)మునన్ = అన్నయందుండు ప్రేమచే, నెమకంగన్ = వెదకుటకై, రాకొమరులు = రాజకుమారులు, పోన్ = పోఁగా, రామన్ = స్త్రీని, మఘవుఁడు = ఇంద్రుఁడు, శచిని = తనభార్య యగు పులోమజను.

తా. అన్నయందలి స్నేహముచే లక్ష్మణుఁడు రాముని వెదకుటకై పోవును. ఆ రాజకుమారు లిరువురు వెడలిపోఁగా రామునిభార్యను సీతను నింద్రుఁడు పులో

మునియొద్దనుండి శచిని హరించి తన భార్యగాఁ జేసికొన్నట్లు నేను హరించి భార్యగాఁ జేసికొని సుఖపడెదను. ఇంద్రుఁడు శచివలె నని చెప్పిన యుపమానము రావణు దురుద్దేశమును స్పష్టపఱుచుచున్నది. రావణభక్తిపరముగా నీ యుపమానము తీర్థీయమున సమర్థింపఁబడలేదు. కావున రావణుఁడు దురుద్దేశముతోనే సీత నపహరించెనుట స్పష్టము.

తే. ఇంతమాత్ర మొనర్చి నీ వేగవయ్య, యిచ్చె మెయి నర్ధరాజ్యంబు♦నిచ్చువాఁడ
ముందు నీ వేగు కార్యసం♦పూర్తిపొంటె, నిన్ను వెనుకొందు రథమున ♦ నిర్జరారి.

తా. ఈమాత్రము సాహాయ్యము నీవు చేసి నీ యిష్టమువచ్చినట్లు పొమ్ము. నీకు నా రాజ్యములో సగ మిచ్చెదను. కార్యము పూర్తిచేయుకొఱకు నీవు ముందు పొమ్ము. నీవెంట నేను దేరిమీఁద వచ్చెదను.

కం. వంచించి రాము సీత గ్రహించి రణముమాట లేక♦యేగెద సుఖినై
యించుక సేవున లంకకుఁ, గొంచెపుఁబని దీని నీవ♦గూర్పక యున్నన్. ౬౩౯

తా. రాముని మోసగించి సీతను హరించి యుద్ధమను మాటలేక సుఖముగాఁ గొంచెముసేపులో నింటికిఁ బోయెదను. నీవు దీనిని జేయకపోయితివా.

ఉ. కూరుచువాఁడ మృత్యువును ♦ గొబ్బున, నీ కిది సమ్మతంబయేన్
గోరిక సంఘటింపు, మటు ♦ గూడదటంచును బ్రేలెదే బలా
త్కారమునన్ ఘటించెదవు ♦ తప్పదు, తెల్విని దెచ్చుకో, సుఖో
దారత నుందురే బ్రదికి ♦ ధారిణిపప్రతికూలభాషణుల్ ? ౬౪౦

ధారిణిపప్రతికూలభాషణుల్ = రాజాజ్ఞ ధిక్కరించి మాటలాడువారు.

తా. నిన్ను శీఘ్రముగఁ జంపెదను. అటుగాక నేను జెప్పినది నీకు సమ్మతమాయెనా, నేను జెప్పినట్లు చేయుము. అటుగాదు నాకు సమ్మతము లేదని పలికెదవా. నీచేత బలవంతముగానైనఁ జేయించెదను. తప్పదు. కావునఁ దెలివిని దెచ్చుకొమ్ము. రాజునకు విరోధించి మాటలాడువారు సుఖపడుదురా?

కం. అట కేగ సందియము మృతి, యిటఁ బ్రేలుచునున్న ధ్రువము♦మృత్యువు నాచే
నటు మేలో యిటు మేలో, పటుమతి యోజించి కార్య♦పరుఁడవు కమ్మా. ౬౪౧

తా. నేను జెప్పినట్లు అక్కడికిఁ బోయితివా నీవు చచ్చుట సందేహము. ఒకవేళఁ దప్పించుకొనవచ్చును. ఇక్కడ నిట్టులే వదరుచుంటివా, నాచేత నీకుఁ జావు నిజము. అచ్చటికిఁ బోవుట మేలో యిచ్చటనే చచ్చుట మేలో యాలోచించి యేది తగిన కార్యమో యదిచేయుము.

—♦ ౪౧-వ సర్గము మారీచుఁడు రావణు నిందించుట. ♦—

కం. అని రాజకరణి ముదలిడ, విని మారీచుండు పరుష ♦ వికటోక్తుల న
దనుజాధిపునకు ననియెం, గనఁగాఁ బ్రతికూల మైన ♦ గతి నీగతిగన్. ౬౪౨

రాజుకరణిన్ = రాజువలె, ముదల = ఆజ్ఞ, పరుషవికటోక్తులన్ = కఠినములు, వికటములు — విరుద్ధములు నగు మాటలను - రాజువలె ననుటచే రాము చంద్రమూర్తితో నెపుడు విరోధించెనో యపుడే వాని రాజత్వము పోయిన దని మున్యాశయము. కావున రాజులు చెప్ప యోగ్యమగు దాని వీఁడు చెప్పినాఁడు. కాని వీని కిట్లు చెప్ప యోగ్యత తప్పినది. లేక మీఁదఁజెప్పినట్లు లౌద్ధత్యము గలవాఁడై యని చెప్పవచ్చును. కావున మారీచుఁడు ధిక్కరించి రాజను గౌరవ మెంచక మాటలాడెను.

తా. అని రాజువలె నాజ్ఞాపింపఁగా మారీచుఁడు విని నిష్ఠురములు, విరుద్ధములగు ప్రతికూలవాక్యముల నిట్లు రావణుతో ననెను.

సీ. పుత్రభృత్యామాత్య ♦ మిత్రాన్వితంబుగాఁ, జేటు గూర్చెడి యిట్టి ♦ చెనఁటిపనిని
రావణా! యేపాపి ♦ రా నీకు బోధించె, సుఖముగా నీ వుంట ♦ చూడలేక
యెవ్వఁడోనీకు♦మృత్యువక్త్రముఁ జూపెఁ,బదుపోవ్వుటంచును♦పాయమునను
బలహీను లగుభవ ♦ త్పరిపంథు లిట్లీవు, బలవద్విరోధాన ♦ భంగపడఁగ

ఆ. దలఁపు గూర్చినారు ♦ తెలియంగ లే వది, హితముఁ జెప్పునట్లు♦హీనుఁ డెవఁడో
నీదుకూళసేత ♦ నీవ నశింపఁగఁ, గోరుచున్న వాఁడు ♦ కుటిలబుద్ధి. ౬౪౩

వక్త్రము = నోరు, భవత్పరిపంథులు = నీ శత్రువులు, బలవద్విరోధానన్ = బలవంతునితోడి విరోధముచే,

తా. కొడుకులతో సేవకులతో మంత్రులతో స్నేహితులతో నీకుఁ గీడు గలిగించు నీ దుష్టకార్యమును నీకు బోధించిన నీచుఁ డెవఁడు, వాఁడు నీచుఁడు గావుననే తాను జెడక నీవు చెడునట్లు చెప్పెను. ఉత్తముఁ డైనచోఁ బ్రత్యక్షము గనే నీతో విరోధించి యుండును. నీవు సుఖముగా నుండుట చూడలేక పోయి పడు మని యుపాయముచేసి యీనెపమున నీకు మృత్యుదేవత నోరు చూపించెను. నిన్ను యుద్ధమున జయింప బలములేని నీ శత్రువులు నీ వీవిధముగ బలవంతునితో విరోధము కట్టుకొని చెడిపోవ నాలోచించినారు. అది నీవు తెలిసికొలేక యున్నావు. నీకు మేలు చెప్పువానివలె నెవఁడో దుష్టుఁడు నీవు చేయు పాపకార్యముతో నీవే నశింపఁ గోరుచున్నాఁడు.

శా. లేరా నీకు నమాత్యవర్యు? లిటు లే♦ల్పేం బూసి వర్తించు నీ
గారా దంచు వచింపరా? హితముఁ బల్కం జూడరే వార లే
లా రక్షోధిప! భూమి నింకఁ గల రే ♦ ప్రాణాన? దుర్మార్గసం
చారుఁ భూపతి దిద్దనట్టిసచివుల్ ♦ చావున్నఁ గీడౌఁ దుదిన్. ౬౪౪

తా. నీకు వేగులు లేనట్లు మంత్రులుకూడా లేరా యేమి? అట్లుండిన వారింకను జీవించియుండినఁ దెలివిలేక నీవు చేయు నీపని సరిగాదని చెప్పలేదా. అట్లు నీమేలు కోరి చెప్పని మంత్రు లుండిన నేమి లాభము! లేకున్న నేమి కొఱఁత! వా రింకను బ్రదికి యున్నారా? వక్రమార్గమునఁ బోవు రాజును సరిదిద్దని మంత్రులు చచ్చుటే మేలు. వారు బ్రదికియుండినఁ గడపటఁ గీడే కలుగును.

మూఁడవపాదంబున ప్లుతయతి.

కం. జనపతి ప్రసన్నుఁ డైనను, మొనయును ధర్మార్థకామ♦ములు సచివులకున్
వినుము విపర్యయమునఁ బ్రజ, వసటం బడు మంత్రులకవి ♦ వ్యర్థంబు లగున్.

జనపతి = రాజు, ప్రసన్నుఁడైనను = సద్గుణవంతుఁ డయ్యేనేని — నిర్మల చిత్తుఁడైనయెడల, సచివులకున్ = మంత్రులకు. విపర్యయమున = విపరీతమైన యెడల, అనఁగా రాజు నిర్మలచిత్తుఁడు కానియెడల, వసటంబడున్ = దుఃఖ మొందును, అవి = ధర్మార్థకామములు.

తా. రాజు సుగుణసంపత్తి నిర్మలమైనమనస్సు గలవాఁ డయ్యేనేని మంత్రులు ధర్మార్థకామములు కలిగి ధర్మములు చేయుదురు. ధనము సంపాదింతురు. కామము ననుభవింతురు. రా జట్టివాఁడుగాకున్న, మంత్రులకు ధర్మార్థకామములు లేవు. జనులు దుఃఖపడుదురు.

తే. రాజమూలంబు విజయధ♦ర్మంబు లగుట, రక్షితవ్యుండు సర్వదా ♦ రాజవరుఁడు
క్రూరుఁడ వినీతుఁడును బ్రతి♦కూలుఁడైన, నృపతియెట్టులురాజ్యంబు♦నేలఁగలఁడు

విజయధర్మంబులు = గెలుపు, ధర్మము, రాజమూలము = రాజకారణము - రక్షితవ్యుఁడు = రక్షింపఁబడ యోగ్యుఁడు, అవినీతుఁడు = ఇంద్రియజయము లేని వాఁడు. "వినయోహీంద్రియజయు" యని కామందకుఁడు.

తా. వేరు బాగుండిన నాకులు పూలు పండ్లు బాగుండునట్లు రాజు బాగుండిన విజయము ధర్మము ప్రజలకుఁ గలుగుచుండును. ఆ కారణముచే సర్వ వేళల రాజు రక్షింపఁబడఁదగినవాఁడు - అటుగాక రాజు క్రూరదండనము ఇంద్రియ లోలత్వము జనవిరుద్ధతగలవాఁ డయ్యేనేని ప్రజల నెట్లు పరిపాలింపఁగలఁడు!

కం. క్రూరులు ప్రధాను లైనను, భూరమణునితోడఁ గూలి ♦ పోదురు తారున్
సారథి మందుం డైనను, వారువములు వానితోడఁ ♦ బడు గుంతలలోన్.

తా. ఇట్టి మంత్రులు క్రూరములైన యుపాయములు చెప్పువారైరా రాజుతోడఁ దాము నశింతురు. ఎట్లన్న సారథి బుద్ధిలేనివాఁడై గుఱ్ఱములఁ జక్కఁదిద్దుకొనలేనివాఁడు గుఱ్ఱములతోడఁ దాను గుంతలోఁ బడును.

ఉ. పెక్కురుసాధువుల్ జగతిఁ ♦ బెద్దయు ధర్మరతాత్ములయ్యునన్
దక్కటివారిదోషమునఁ ♦ దారు నశింతురు బంధుయుక్తులై
నిక్కన భూవిరుద్ధమతి ♦ నిష్ఠురుఁడై పతి రాజ్యమేలినన్
నక్కలు గాచుమేకలన ♦ నాశముఁ బొందెదువారు లోకులున్. ౬౪౮

తా. అనేకులు సాధువులు లోకమునఁ దాము మిగుల ధర్మమందాసక్తిగల మనస్సుగలవారై యట్టులే వర్తించుచున్నను ఇతరులు చేసిన పాపములచే వారును బంధువులతోడ నశింతురు. ఇది నిజము. భూజనులకు విరుద్ధమైన మనస్సుగలవాఁడై రాజు రాజ్యమేలెనేని నక్కలు రక్షించు మేఁకలవలె లోకులు రాజుచేతనే చెడుదురు. కాఁబట్టి రాజును సరియైనమార్గమందు నుంచవలసినది మంత్రులకుఁ బ్రజలకు విధి. అట్లుండఁడేని వానిని దొలఁగించి మఱియొకని రాజుగాఁ జేయవలయును. ప్రజలకొఱకు రాజుగాని రాజుకొఱకు ప్రజలు గారు.

ఉ. నాయెడ నాకుఁ గాఁగ వ్యస♦నంబు జనింపదు సుమ్ము కాకతా
లీయముగాఁగ వచ్చెఁ బ♦లిష్ఠపుఁ జేటున, కీవు మూర్ఖతన్
న్యాయముఁ దప్పి యింద్రియజ♦యంబు గణింపక దుర్మనీష న
త్యాయతసేనతోఁ జెడెద♦వంచుఁ దపించెదఁ ద్వన్నిమిత్తమై. ౬౪౯

నే నింతదూరము నిర్బంధముగాఁ జెప్పుటకుఁ గారణము నాకు రాఁగల కీడునకు వెఱచియని తలఁచెదవేమో, అది సరిగాదనుచున్నాఁడు. కాకతాళీయము = ఆకస్మికముగ వచ్చునది, కాకి వ్రాలుటకు తాటిపండు పడుటకు సరిపోయినట్లు, దుర్మనీషన్ = చెడుబుద్ధితో, అత్యాయతసేనతో = విస్తారసేనతో, నీవుచేసిన పాపమునకు నీ వొకఁడవే పోవునట్లుండిన వ్యసనములేదు. విస్తారముగ సేనయంతయు నీ నిమిత్తముగఁ జచ్చెదరు. త్వన్నిమిత్తమై = నీకొఱకై.

తా. ఆకస్మికముగ నిర్నిమిత్తముగ నాకీ చెడ్డకీడు గలిగెనని నేను దుఃఖింపలేదు. చెప్పినను దెలిసికొనలేక న్యాయము వదలి యింద్రియదాసుఁడవై కావుననే చెడుబుద్ధిగలవాఁడవై నీ వొకఁడవేకాక సర్వసైన్యముతోఁ జెడెదవే యని నీకై తపించెదను.

కం. ననుఁ జంపి రామచంద్రుఁడు, నిను వెంటనె చంపుఁ జుమ్ము ♦ నిక్కముగా శ
త్రునిచేఁ దునుమంబడుటను, దనుజకులాధీశ నేను ♦ ధన్యుఁడ నగుదున్. ౬౫౦

తా. నాకు రాఁగల మరణమునకై నేను శోకింపను అని తాను జెప్పిన మాటకుఁ గారణము చెప్పుచున్నాఁడు.

నన్ను రామచంద్రుఁడు చంపి వెంటనే నిన్నును జంపును. ఇది నిజము గావున పరమపాపాత్ముఁడవైన నీచేతఁ జచ్చుటకంటె నీశత్రువై పరమపుణ్యాత్ముఁడైన రామునిచేఁ జచ్చితినేని ధన్యుఁడ నగుదును.

విశ్వామిత్ర యాగరక్షణము మొదలుకొని ఖరాదివధపర్యంతముఁ గల రామచంద్రుని యమానుషచరిత్రమువలన నీయన మనుష్యమాత్రుఁడుగాఁడు, భగవంతుఁడే యిట్లవతరించియుండవలెను. లేకున్న విశ్వామిత్రయాగమున నన్నుఁ బరిభవించుట, అహల్యాశాపవిమోచనము, శివధనుర్భంగము, పరశురామపరాభవము, పరిసత్యరక్షావ్రతము, రావణుతో సమానబలుఁడగు విరాధు వధించుట, ఖరాదుల వధించుట, యివి మనుష్యసాధ్యములు కావు. భగవత్కృతములే యని నిశ్చయించుకొని రావణునిచేఁ జచ్చుటకంటె రామునిచేఁ జచ్చుటే శ్రేయస్కరమని చెప్పుచున్నాఁడు. ఈ సందర్భమున.

"రామాదపిహి మర్తవ్యం, మర్తవ్యం రావణాదపి, ఉభయోరపి మర్తవ్యే' వరం రామా న్నరావణాత్" రామునిచేనైనఁ జావవలె. రావణుచేనైనఁ జావవలె. చావవలసినది యొకటి నిశ్చయమై యుండ రావణుచేతఁ జచ్చుటకంటె రామునిచేఁ జచ్చుటే మేలు, అను నృసింహపురాణోక్తి స్మరింపనగు.

ఉ. ఆ రఘురాముకంటఁ బడి ♦ నప్పుడె చచ్చినవాఁడ నేను, నీ
వారమణిన్ హరించి హతుఁ ♦ డయ్యెదు నమ్ముము బాంధవాళితో,
వారిజనేత్ర నెత్తికొని ♦ వచ్చితి వేనియు నీవ దేడ నీ
యూ రది యేడ రాక్షసకు ♦ లోత్తము లెక్కడ నే నదెక్కడన్. ౬౫౧

తా. నేను జెప్పినట్లు నీవు చేసిపోయిన నీ కేల రామునివలన భయ మందువేమో? నీవుచెప్పిన వేషము వేసికొని యెప్పుడు పోదునో యప్పుడే యాయన యిది నా వంచన యని యెఱుఁగఁగలఁడు. వంచన యని దుష్టభావముతో వచ్చితి నని యెప్పుడు తెలిసికొననో యప్పుడే చంపక వదలఁడు. నేను పోవుటే తరవాయి చచ్చుటే నిజము. ఆయన కన్నులకుఁ గనఁబడువఱకే నా జీవితము. ఇట్లు నేనొకఁడనే చచ్చెదను నీవో సీతను హరించికొనిపోయి బంధువులతోడఁ జచ్చెదవు. నమ్ముము. నన్నుఁ జంపించి నీవు బ్రదుకుట కల్ల. సీతాదేవిని కొనిపోయితివా నీ వెక్కడ నీ యూరెక్కడ రాక్షసశ్రేష్ఠులెక్కడ, నే నెక్కడ అందఱు అన్ని గతులఁ బోవలసినవారే.

వసంతతిలక. నీమేలు గోరి యిటు ♦ నేను హితంబుఁ బల్కన్
నామాట నీ వెద న♦నాదృతిఁ జేసె దయ్యో
యే మందు రావణ సు♦హృజ్జనపథ్యవాక్యం
బేమాడ్కి మృత్యువశుఁ ♦ డేర్పడ నాలకించున్. ౬౯౨

అనాదృతి = అనాదరణము, సుహృజ్జన = మిత్రులయొక్క, పథ్యవాక్యంబు = మేలుకలిగించుమాటను, మృత్యువశుఁడు = మృత్యుదేవతకుఁ జిక్కినవాఁడు, ఆలకించున్ = వినును,

వసంతతిలక = త భ జ జ గ గ గణములు, ఎనిమిదింటయతి.

తా. నీమేలుగోరి రావణా నీకు హితమైనదాని బోధింపఁగా నామాట నీ వలక్ష్యముచేసెదవు. అయ్యో నిన్ను నేనేమనఁగలను! మృత్యువునకు వశపడి చావనుండువాఁడు మిత్రులు చెప్పెడు పథ్యవాక్యములు వినఁగలఁడా ?

౪౨-వ సర్గము

చ. అని యసురేశ్వరుం గని భ♦యంబునఁ బోదము లెమ్ము రావణా
ధనురసిబాణపాణి వసు♦ధాతనయాపతి మద్వధోద్యమున్
గనుఁగొన నిట్టనిల్వన ది♦గాలునఁ జావఁ గలాఁడ, రామచం
ద్రుని నని దాఁకియు న్ననుల♦తో మరలం గలవాఁడుఁ గల్గునే. ౬౯౩

భయంబునన్ = చంపుననుభీతిచేత, ధనురసిబాణపాణి = విల్లు, శక్తి, బాణములు చేతియందుఁగలవాఁడు, మద్వధోద్యమున్ = నన్నుఁజంపఁ బ్రయత్నించువానిని, దిగాలున = నివ్వెరతో, అనిన్ = యుద్ధమందు, అనులతోన్ = ప్రాణములతో.

తా. అని రావణాసురునిఁ జూచి యాలసించిన నిపుడే చంపునను భయముచే రావణా పోదము లెమ్ము. విల్లు బాణములు శక్తి చేతధరించిన రాముని నన్నుఁ జంపఁబూనిన వానిఁ జూడఁగనే దిగుల్పడి నిలుచుండినవాఁడను నిలుచుండినట్లె చావఁగలను. నన్నుఁజంపుట కాయనదర్శనమే చాలును. వాస్తవ మిట్లుండ యుద్ధమందు రామచంద్రుని దాఁకియు నూపిరితో మరలి వచ్చువాఁడున్నాఁడా ?

తే. దండధరదండమున నిహా♦తుండ వైన, నీకు నాకును సరిపోయె ♦ నేస్త మిచటఁ
జేటుకాలంబునకుఁ దగు♦చెనఁటిబుద్ధిఁ, జేసి చెడిపోవు ని స్నేమి ♦ చేయవచ్చు.

దండధర = యముని, దండమున = దండము చే, నిహతుండవు = కొట్టబడినవాఁడవు, నేస్తము = స్నేహము.

తా. యమదండముచేఁ గొట్టఁబడినవారమగుట నీకును నాకును స్నేహము సరిగానే కుదిరినది. చెడిపోవుకాలము వచ్చుటఁజేసి చెడుబుద్ధిగల నిన్నేమి చేయఁ వచ్చును. చచ్చుటకే సిద్ధముగానుండు నీకంతకుమించిన దండన మెవఁడేమిచేయఁ గలఁడు ?

తే. నాయనా యిదెపోవుచున్నాఁడ నీకు, స్వస్తియగుఁగాత మనినను ♦ సంప్రహృష్ట
చిత్తుఁడై పల్కు రాక్షస ♦ శేఖరుండు, దనదుకౌఁగిట జేర్చియు ♦ తనిసి దనివి.

సంప్రహృష్టచిత్తుఁడై = సంతోషించినమనస్సుగలవాఁడై, తమిస=ప్రేమతో, మేలగునుగాక! యని చెప్పఁగా రావణుఁడు సంతోషించి ప్రేమతో నతనిఁ గౌఁగిలించెను.

శా. సైరా! యిట్టులు మాటలాడ వలదా ♦ శౌండీర్యయుక్తంబుగా
నారంజూచిన మద్వచస్సరణిగా ♦ హా యిప్డవై నీవు మా
మారీచుండవు పూర్వమివ్వఁడవొ, మా ♦ మారీచుఁ డట్లాడునే,
యారోహింపుము రత్నభూషితమదీ ♦ యస్యందనంబున్ వెసన్, ౬౫౯

సైరా = అంగీకారమునుసూచించు శ్లాఘావాక్యము ప్రశంసార్థకము, శౌండీర్యయుక్తంబుగాన్ = వీర్యముతోఁగూడినట్లు, శౌండీరభావము, శౌండీర్యము, వీర్యమువలె, "శౌండీరస్త్యాగివీరయోః" నిఘంటు, మద్వచస్సరణిగాన్ = నా మాటలవిధముగ, హా=ప్రశంసార్థకము, ఆరోహింపుము=ఎక్కుము, రత్నభూషిత = రత్నములచే నలంకరింపఁబడిన, మదీయ = నాయొక్క, స్యందనంబున్ = రథమును. వెసన్ = త్వరగా.

తా. సై రామారీచా!! పౌరుషముతోఁగూడినమాట లిట్లుగదా మాటలాడవలె. నామాటల ననుకరించియున్నది యిదిగదా. ఇప్పుడు నీవు నిజమైన మారీచుఁడవు. పూర్వమెవ్వఁడవో మామారీచుఁ డా విధముగఁ బిఱికివలె మాటలాడునా! రత్నములచే నలంకరింపఁబడిన నారథ మెక్కుము. త్వరగా నెక్కుము. పోదము.

—♦ రావణమారీచులు పంచవటికిఁ బ్రయాణ మగుట. ♦—

ఉ. వచ్చెద నేను దోస, యట ♦ వచ్చి ధరాసుతి మోసగించి నీ
యిచ్చను బొమ్ము, నేనును మ ♦ హీసుత నొంటిగ నుండ బల్మిమైఁ
జెచ్చెర సంగ్రహించికొని ♦ చేరెద లంక, నటంచుఁ దద్రథం
బచ్చలపాది యెక్కి చన ♦ నాశ్రమమండలి దాఁటి చయ్యనన్. ౬౬౦

సహ = తోడన, నీవెంట, బల్మిమై = బలాత్కారముగ, చలపాది = మాత్సర్యస్వభావము గలవాఁడు.

తా. నేను నీతోడనే వచ్చెదను. అచటికివచ్చి జానకిని మోసగించి నీయిష్టము వచ్చినట్లు పొమ్ము. నేను నొంటరిగానుండు సీతను బలాత్కారమున గ్రహించి లంకకుఁ బోయెదను. అని యా మచ్చరి యా రథమెక్కి యా యాశ్రమప్రదేశము త్వరగా దాఁటిపోయెను.

చ. చని చని రాక్షసేశ్వరుఁడు ♦ శైలసరిద్వనభూరిరాష్ట్రప
త్తననగరంబులం గడచి ♦ దండకలో రఘురామునాశ్రమం
బును గని తేరు డిగ్గి కర♦మునం దనకేలఁ గదించి మిత్రుతో
ననియె సరంటిచెట్లు గల♦యద్దియె రాముని వాసమోసఖా.		౬౫

చనిచని = పోయిపోయి, దూరప్రదేశగమనము కావున ద్విరుక్తి, శైల, సరిత్, వన, భూరిరాష్ట్ర, పత్తన, నగరంబులన్ = కొండలను, నదులను, అడవులను, పెద్దరాష్ట్రములను, పట్టనములను, నగరములను, కరమునన్ = మారీచుని చేతిని - నగరము = క్రీడార్థము వృక్షములు నగ (పర్వతములు) ములుగ లది నగరము. పర్వతసమానములైన రాజగృహములు గలది నగరము. నగరీ యని రూపాంతరము గలదు. పత్తకులు దీనింగుఱించి సత్తుగ గనుక పత్తనము—పట్టనము. ఈ భేదము లీ శ్లోకములవలనఁ దెలియనగు.

గ్రామశ్చ నగరంచైవ పట్టనం ఖర్వటం పురం। ఖేటకం కుసుమంచైవ। శిబిరం రాజధానికం, సేనాముఖ మితిత్యేవం దశధాకీర్తితంబుధైః॥ విప్రాణాంచ సభృత్యానాం వాసోగ్రామ ఇతీరితః। సఏవ విప్రై రాకీర్ణ స్స్వగ్రహార ఇతిస్మృతః॥ కుటుంబి భేదై రేకోనత్రింశద్భిశ్చ సమన్వితః। అనేకనారీసంబద్ధం నానాశిల్పజనైర్వృతం, క్రయవిక్రయకైః కీర్ణం సర్వదేవైస్సమన్వితం నగరం త్వితి విఖ్యాతం పట్టనం శృణు సాంప్రతం, ద్వీపాంతరాగత ద్రవ్య క్రయవిక్రయకైర్యుతం, పట్టనం త్వభిధీరే స్యాత్తయోర్మిశ్రే తు ఖర్వటం, క్రయవిక్రయ కైర్యుక్తం నానాజాతి సమన్వితం, తంతువాయ సమాయుక్తం తత్పురం త్వితి కథ్యతే, ఏతై రధిష్ఠితం యత్తత్ ఖేటకం పరికీర్తితమ్। తేషామేకాంతరేష్వేవ వాసః కుసుమముచ్యతే॥ వాస్తుశాస్త్రము.

తా. ఇట్లు పోయిపోయి రావణుఁడు కొండలను, నదులను, వనములను, రాష్ట్రములను, పత్తనములను, నగరములను దాఁటి దండకయందుండు రామచంద్రుని యాశ్రమముఁజూచి తేరుదిగి మారీచునిచేతిని తనచేతఁ బట్టుకొని, మిత్రమా! యదిగో సరఁటిచెట్లు గలదే రాముని నివాసభూమి.

— మారీచుఁడు మాయామృగం బగుట. —

సీ. మనము వచ్చినయట్టి పనిని గావిమ్మన, ననఘమణీద్ధశృం గాగ్రములను
 దెలుపు నలుపును గల లలితముఖంబును, గెందమ్మికల్వడా లంద మైన
 యాస్యంబు సింద్రనీ లాభశ్రవణములు, కించిదభ్యున్నత గ్రీవ మొనరి
 నీలదళాధరం బోలెఁ గుందేందువ, జ్రాభంబు నుదరంబు నబ్జకేస

తే. రములఁ బోలెడివీఁపు పా ర్శ్వము మధూక
 కాంతి వైడూర్యనిభఖుర గణము సుతను
 జంఘలును గల్గి వాసవ చాపతుల్య
 మూర్ధ్వపుచ్ఛంబు మెఱుఁగుల యొప్ప గలిగి. ౬౫౯

అనఘమణి = గొప్ప రత్నమైన యింద్రనీలమువలె, ఇద్ధ = ప్రకాశింపఁజేయఁబడిన, శృంగ + అగ్రములు = కొమ్ములకొనలు, లలితముఖము = ముద్దుమోము. కెందమ్మి = ఎఱ్ఱతామర, కల్వడాలు = కలువకాంతి, ఆస్యంబు = ముఖములోని పైభాగము, ఇంద్రనీలాభ = ఇంద్రనీలముల కాంతిగల, శ్రవణములు = చెవులు, కించిత్ = కొంచెముగా, అభ్యున్నత = ఎత్తైన, గ్రీవము = మెడ, నీలదళాధరంబు = ఇంద్రనీలముల తునకలవంటి పెదవి, కుందేందువజ్రాభంబు = మొల్లలు, చంద్రుఁడు, వజ్రము, వీనివంటిదగు. ఉదరంబు = కడుపు, అబ్జకేసరములు = తామరలయందలి యకరువులు, మధూకకాంతి = ఇప్పపూవువంటి రంగుగలది, పార్శ్వము = ప్రక్క, ఒక్కప్రక్కయే యిట్లుండునది. రెండవప్రక్క పసిఁడి వెండి జిగుల్ మీఱు ప్రక్కలని. ౬౬౫ పద్యంబునఁ గలదు. వైడూర్యనిభ = వైడూర్యములతో సమానమైన, ఖురగణము = గిట్టలసమూహము, సుతనుజంఘలు = అందమై సన్ననైన పిక్కలు, వాసవచాపతుల్యము = ఇంద్రధనుస్సుతో సమానము అనఁగా ననేకవర్ణములుగలది, ఊర్ధ్వపుచ్ఛము = తోఁక పైభాగము. పై పద్యముతో నన్వయము.

తా. మన మేమిపనికై వచ్చితిమో యాపని చేయుమని రావణుఁడు చెప్పఁగా నింద్రనీలమణుల కాంతిగల కొనకొమ్ములును తెలుపు నలుపు గల యందమైన ముఖమును, ఎఱ్ఱతామర - కల్వరంగు గల ముఖము, ఇంద్రనీలములవంటి చెవులు, కొంచె మెత్తైన మెడ, నీలముల పలుకులవంటి పెదవి, మొల్లలు చంద్రుఁడు వజ్రము వలెఁ దెల్లనైన కడుపు, తామరలయందలి యకరులవంటి వీఁపు, ఇప్పపూవుల వంటి ప్రక్క, వైడూర్యములవంటి గిట్టలు, సన్నని పిక్కలు, ఇంద్రధనుస్సువలెఁ బలు రంగులు గల తోఁక పైభాగముయొక్క మెఱుపులు గలిగి.

కం. నిమిషంబున మారీచుఁడు, రమణీయుంబైన హరిణ రాజం బగుచున్
 గ్రమముగఁ దిరుగుచు రామా, శ్రమమున్ వెలిఁగించె నాయ రణ్యమునందున్,

హరిణరాజము = శ్రేష్ఠమైన జింక.

తా. నిమిషములో మారీచుఁడు శ్రేష్ఠమైన జింకయై క్రమముగఁ దిరుగుచు నాయరణ్యమునందు రాముని తపోవనమును బ్రకాశింపఁజేసెను.

ఉ. జానకి బేలుపుచ్చుదను♦జప్రవరుం డట లేఁజిగుళ్ళులన్
మానుగఁ ద్రుంచు, లేఁగసవు♦నం జరియించు, గ్రసించు, నెండి రం
భానవగేహకంబుల న♦మందగతిన్ విహరించుఁ, దన్ను న
జ్జానకి చూడఁగల్గుతెల♦మందు యథామతి సంచరించెడున్. ౬౬౧

బేలుపుచ్చన్ = మోసగింప, లేఁగసవునన్ = లేఁతపచ్చికయందు, గ్రసించు = తిను, రంభానవగేహకంబులన్ = అరఁటిచెట్లచేఁ జేయఁబడిన క్రొత్త కల్పితగృహములందు, అమందగతిన్ = వడిగా, యథామతి = మనస్సునకువచ్చిన చొప్పున.

తా. జానకీదేవిని మోసగించుటకై యా రాక్షసుఁడు లేఁతచిగుళ్ళను ద్రుంచుచు లేఁతపచ్చికపట్టుల సంచరించును. దానిని గొరికి తినును. అరఁటిచెట్లతోఁ గల్పింపఁ బడిన క్రొత్తయిండ్లయందు వడివడిగాఁ దిరుగును. ఎచ్చటఁ దిరిగిన సీత తన్నుఁ జూడఁగలదో యచ్చట నిచ్చకొలఁదిఁ దిరుగును.

కం. పఱచున్ దవ్వుగఁ బచ్చికఁ, గఱచున్ మృగయూథములను♦ గలయున్ ధ్వనికిన్
వెఱచుం జను మరలున్ వా, తెఱచుం బన్నుండు కొన్ని♦ తెరువులయందున్.

పఱచున్ = పరువెత్తును, వా = నోరు, పన్నుండున్ = పండుకొనును.

తా. దూరముగఁ బరువెత్తును, పచ్చిక కొఱుకును. ఇతరములయిన జింకల గుంపులలోఁ గలయును. చప్పుడైన నులికిపడును. పోవును, మరల వెనుకకు వచ్చును. ఆవలించినట్లు నోరు తెఱచును, కొన్నిమార్గములందుఁ బండుకొనును.

కం. ఆశ్రమము జేర వచ్చున్, మైశ్రమము హరించునట్లు♦ మహిఁ బచ్చికపై
విశ్రమ మొనరఁ బరుండు గ, తశ్రమ మైనట్లు లేచి♦ తటుకునఁ బోవున్. ౬౬౩

తా. ఆశ్రమసమీపమునకు వచ్చును. దేహమున బడలికఁ బాపుకొను దాని వలె భూమిమీఁదఁ బచ్చికపై కొంచెముసేపు పండుకొనును. బడలిక తీరినదానివలె లేచి తటాలున బోవును.

కం. పలురంగుల మెయిబిందులు, తళుకొత్త చివాలటంచు♦ దాఁటున్ దోఁటన్
నిలుచుం దరలున్ మరలుం, దొలఁగున్ మలఁగున్ హరింగు♦దోరముగాఁగన్.

తా. పెక్కువిధములయిన రంగులుగల దేహమునందలి చుక్కలు తళుక్కను నట్లు చివాలున దాఁటును. తోఁటయందు నిలుచును. మరల బయలుదేఱిపో

వును. కొంచెముసేపు దూరముగఁ దొలఁగిపోవును. దేహకాంతి యతిశయించునట్లు మరలును.

ఉ. మండలనుండి వచ్చు నవ♦మండలచిత్రగతిం జరించు నా
సుందరి చూడ నట్టటులు ♦ చూచును నిట్లు చరింపఁగా ననం
బందలియన్యజంతుచయ ♦ మాదట వాసియు మూరుకొంచు వే
చిందఱవంగ నై భయము♦చేఁ బఱచుఁ దశది క్తటంబులన్. ౩౫

మండలచిత్రగతిన్ = గుండ్రము గుండ్రముగా వింతవిధముగ, అన్యజంతుచయము = ఇతర జంతుసమూహము, ఆదటన్ = ప్రేమతో, మూరుకొంచున్ = వాసనచూచుచు, చిందఱవందరై = చెల్లాచెదరై పఱచున్, = పరువెత్తును, దశదిక్తటంబులన్ = పదిదిక్కులయందలి ప్రదేశములను.

తా. మృగములగుంపులతోడ, బోయి మరలివచ్చును. క్రొత్తగా మండలాకారముగా గావా తిరిగినట్లు తిరుగును. సీతను జూడనివిధముగ నీ ప్రక్క నా ప్రక్క చూచును. ఈ ప్రకార ముడవిలోఁ దిరుగుచుండఁగా తక్కిన మృగములు నిజమైన మృగమని సమీపించి వాసన చూచి భయపడి చెదఱిపోయి భయముచే దిక్కుదిక్కులకుఁ బరువెత్తును. వాసనచే వాస్తవము తెలిసికొనుశక్తి మృగములకుగలదు.

కం. మృగవధరతుఁ డయ్యును నా, మృగలోచన మోసగింప ♦ స్పృశియించును ద
న్మృగముల మఱుఁ గిడుచును నై,జగుణముఁ దత్కాలమంద ♦ జానకి నమ్మన్.

మృగవధరతుఁడు = మృగములఁ జంపుటయందుఁ బ్రీతిగలవాఁడు, మృగలోచనన్ = జింకకన్నులవంటి కన్నులుగల సీతను-నైజగుణము = స్వభావగుణము, మఱుఁగిడుచును = దాఁచుచు.

తా. మృగములఁ జంపుటయందు నాసక్తిగలవాఁడయ్యును సీతాదేవి యిది నిజమైన జింక యని తలఁచునుగాక యని యవి సమీపమునకు వచ్చినను దన స్వభావము దాఁచి వానిని నూరక స్పృశించునేకాని చంపఁడు. ఇట్లది తిరుగుచున్న కాలమందే జానకి సంతోషముతో.

—♦ ౪౩-వ సర్గము. జానకి మాయామృగంబును జూచుట. ♦—

కం. కుసుమావచయ క్రీడా,లసమాన యశోకచూత ♦ లాలితసుమనో
విసరంబులఁ గోయుచు నా,యసమానమృగంబుఁ గాంచి ♦ యబ్బురపోయెన్.

కుసుమావచయ = పూలుగోయు, క్రీడా = అటచే, లసమాన = ప్రకాశించునది, అశోక + చూత + లాలిత + సుమనో + విసరంబులన్ = అశోకవనములయు

మామిళ్ళయు కోయఁదగినట్టి పూలసమూహంబులను-దీనివలన నిది వసంతఋతువని యేర్పడెను.

తా. పూలుకోయు క్రీడచేఁ బ్రకాశించుచు అశోకములందలి మామిళ్ళయందలి పూలుగోయుచు నా యీడులేని జింకను జూచి యాశ్చర్యపడెను.

తే. హారిదంతోష్ఠి విస్మయ♦హసిత నేత్ర
స్నేహపూర్వంబుగాఁ జూచెఁ ♦ జిత్రమృగము
మదిరలోచన తనుఁ జూచి ♦ ముదము గొనెడి
కొలఁది నడుఁగుసు వింత వే♦డ్కల నొసర్చు.　　　　౬౬౮

హారి = మనోహరమైన, దంతోష్ఠి = దంతములు, పెదవులుగలది, విస్మయ = ఆశ్చర్యముచే, హసిత = నవ్వుచున్న, నేత్ర = కన్నులుగలది, మదిరలోచన = ఆనందము గలిగించు చూపులుగలది.

తా. మనోహరమైన దంతములు, పెదవులు గలిగి ఆశ్చర్యముచే నవ్వుచున్న కన్నులుగలదై వింతజింకను ప్రేమతోఁ జూచెను. సీతాదేవి తన్నుఁజూచి సంతోషించు కొలఁది నడుఁగును వింతవింత వేడుకలు సేయును.

తే. పసిఁడి వెండిజిగుల్ మీఱు♦ప్రక్కలమరఁ, గాన వెలిగించుచిత్రమృ♦గంబుఁగాంచి
రండు రండని సతి పిల్చెఁ ♦ బ్రాణనాథు, సంభృతాయుధు లక్ష్మణు సత్వరముగ.

జిగుల్ = కాంతులు, సంభృతాయుధుఁ = ధరింపఁబడిన యాయుధము గలవానిని, ఇట్లు చెప్పుటచే నాయుధములతోడ రండని, సీత పిలిచె నని యూహింపఁ దగును.

తా. వెండిబంగారు కాంతులుగల ప్రక్క లొప్పుచు నడవినిఁ బ్రకాశింపఁజేయు చున్న వింతజింకను జూచి సీత తనభర్తను రామచంద్రుని, ఆయుధధరుఁడైన లక్ష్మణు రండురండని పిలిచెను.

శా. చేర న్వచ్చి సుమిత్రిపట్టి కని యా♦జింకం గనుఁ శంకచే
శ్రీరాముం గని యిట్లు నాకొనియె, మా♦రీచాసురుం డేతదా
కారం బూని మునీశపాళి మృగయా♦కాంక్షాగతోర్వీశులఁ
గ్రూరుండై వధియించు నీ కడవిఁ గా♦కుత్స్థాన్వయగ్రామణీ.　　　　౬౭౦

ఏతదాకారంబు = ఇటువంటి రూపమును, మునీశపాళిఁ = మునీశ్వరుల సమూహమును, మృగయా = వేటయందలి, కాంక్షా = కోరికచే, ఆగత = వచ్చిన, ఉర్వీశులఁ = రాజులను, కాకుత్స్థాన్వయగ్రామణీ = కకుత్స్థుని వంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుఁడా, నాకొనియెను = చెప్పెను.

తా. దగ్గఱకు వచ్చి లక్ష్మణుఁడు దానిని జూచి సందేహించి శ్రీరాములతో నిట్లు చెప్పెను. రఘూత్తమా! మారీచుఁడను రాక్షసుఁ డిటువంటి యాకారమును బూని మునీశ్వరులను వేటకై వచ్చిన రాజులను క్రూరుఁడై వధించుచుండును.

కం. మాయావి యల్లరక్కసుఁ డీ, మాయామృగరూప మెత్తి ♦ మలయును గంధ
ర్వాయతపురి యట్టిది యీ, కాయము నిక్కంబు గాదు ♦ కంజదళాక్షా. ౬౭౧

మాయావి = మాయగలవాఁడు,-కల యను నర్థమున విన్ ప్రత్యయము వచ్చెను. అస్మాయామేధాస్రజో వినిః -పాణిని. 5, 2, 121. మాయావి-మేధావి-స్రగ్వి - తేజస్వి - మలయును = తిరుగును, గంధర్వాయతపురి = విశాలమైన గంధర్వనగరము - ఆశ్చర్యముగఁ గనఁబడి క్షణములో నశించెడి మేఘాకారము గంధర్వనగర మనఁబడును. మాయామృగరూపము = అద్భుతమైన యోగశక్తిచేఁ గల్పించుకొనిన జింకరూపము.

తా. యోగశక్తి గల మారాక్షసుఁడే తన యద్భుతయోగశక్తిచే జింకవలెనై తిరుగుచున్నాను. ఈ యాకారము గంధర్వనగరము వంటిది, నిజము కాదు. నిజమైన జింక యెట్లుపయోగపడునో యిది యట్లు లుపయోగపడదు.

—♦ సీత మాయామృగంబును బట్టి తెమ్మని కోరుట. ♦—

ఉ. కంటిమె వింటిమే కనక ♦ కాంతిమణీమయమౌ మృగంబు, నా
కంటికిఁ జూడ మాయ యనఁ♦గా, శుచిహాసిని భర్తఁ జేరి వా
ల్గంటి మఱంది నాఁగి నిజ♦కాంతునితో మృగచర్మమందు లో
నంటినమక్కువం బలికెఁ ♦ బ్రాణధవా! విను మాన సొల్పెడిన్. ౬౭౨

కనకకాంతిమణీమయము = బంగారుకాంతియు మణులకాంతులచే నిండియుండునదియు, మాయ = వంచన, శుచిహాసిని = పరిశుద్ధమైన నవ్వుగలది, ఆఁగి = అడ్డగించి.

తా. బంగారువన్నె కలదియు నవరత్నముల కాంతులుగల చుక్కలు సనయనములు గలదియు నగు జింక యిన్నిసంవత్సరము లడవులలోఁ దిరిగినను మనము చూచితిమా, లేక శాస్త్రములు-లోకులు చెప్పఁగా వింటిమా? లేదు. కావున నిది మోసపువేషము అని చెప్పుచుండఁగా లక్ష్మణుని నిలిపి, చిఱునవ్వుతో భర్తయొద్దకుఁబోయి యావాలుఁగంటి మృగచర్మమందు మనస్సున నలిగిన ప్రేమచే నిట్లనెను. ప్రాణేశ్వరా! వినుము. ఇది యాశ గలిగించుచున్నది.

ఉ. దాని మహాభుజా! లఘువి♦ధంబునఁ బట్టుము, కేళి కౌను, నీ
కాననమందుఁ జూడమె మృ♦గంబుల భల్లుకకిన్నరాఖుల

వానరచామరంబులను ♦ వానికి నీ తనుశోభగల్గెనే?
కానము దీనితుల్య మగు♦కాంతమృగంబు నిజంబు వల్లభా. ౬౩

మహాభుజా = గొప్పభుజములు గలవాఁడా, ఇంత పెద్ద చేతులు బలము గల వాఁడవు. ఈ జింకను బట్టలేవా యని భావము. లఘువిధంబున = సునాయాసముగ, కేళికిన్ = ఆటకు, భల్లుక = ఎలుగులయు, కిన్నర = కిన్నర పక్షులయు, ఆళులన్ = వరుసలను, వానర = కోఁతులను, చామరంబులన్ = చమరిమృగంబులను, తనుశోభ = దేహకాంతి, కాంతమృగంబు = మనోహరమైన జింక, వల్లభా = ప్రియుఁడా, అనుటచే నాయందుఁ బ్రీతియుండిన దీనిని బట్టి తెమ్మని భావము.

తా. వల్లభా, మహాబాహూ, దీనిని సులభోపాయముగఁ బట్టుము. నే నడిగితి నని ప్రయాసపడవలదు. నీకేల యిది యందురా ఆడుకొన నుపయోగించును. ఈ యడవియందు మనమెన్ని యెలుఁగుగొడ్లను, చమరమృగములను, కోఁతులను కిన్నరములను చూడలేదు. దీని దేహకాంతి దేనికైనఁ గలదా? ఇంత వింతయైన కాంతిగల మృగము మనము చూడలేదుగదా.

ఉ. జింకలు లేవె లోకమునఁ ♦ జిత్రమృగంబుల నెన్నిచూడ, మీ
పొంకపువన్నెయుం జనవు♦పోణిమి కంటిమె దేనియందు? న
ల్వంకల మేనికాంతులు ద♦ళంబుగఁ జల్లుచుఁ గానలోన నే
ణాంకునిఁబోలి యున్నది ప్రి♦యా! దయ దానిని బట్టి తేఁగదే. ౬౪

ఏణాంకునిన్ = చంద్రుని.

తా. లోకములో నెన్నిజింకలు లేవు. వింతమృగంబు లెన్ని లేవు. వానినెల్ల మనము చూడలేదా. ఈ యందమైనవన్నె, జనవుపొందిక దేనియందైనఁ గంటిమా? దీనిని జూడుఁడు. నాలుగుప్రక్కలఁ దన దేహకాంతులు దట్టముగఁ జల్లుచు చంద్రుని వలె నున్నది. నాయందు దయయుంచి దానిని బట్టుకొని రమ్ము.

తే. ఔర రూపంబు బళిబళీ♦యరరె లక్ష్మి, స్వరముసంపద బళిర ప్ర♦శస్త మనఘ
మద్భుతంబైనయీ లేడి ♦ ప్రాణనాథ, లాగుమన్నది నామది ♦ బాగుగాను.

తా. ఆహా! యేమి దీనియందము. ఔరా! దీని కాంతిసంపద. బలే! దీని స్వరమాధుర్యము. ప్రశస్తము, నిర్దుష్టము అయిన యీ జింక ప్రాణేశ్వరా! నా మనస్సును బాగుగా లాగుచున్నది.

ఉ. జీవముతోడఁ బట్టుపడఁ ♦ జిత్రము గల్గునె దీనికంటె నో
డావలఁ, గానస్థితి స♦మాప్తము చెందఁ బురంబుఁ జేర మో
దావహభూషణం బగుచు ♦ నశ్రిపురంబు నలంకరింపదే
భావనచేసి చూడుము నృ♦పాలశిరోమణి! మద్వచస్థితుల్. ౬౫

కాననస్థితి — అడవులయందునికి, మోదావహభూషణంబు = సంతోషకరమైన యాభరణము, అంతిపురము — అంతఃపురము, మత్ + వచస్ + స్థితుల్ = నామాటలయొక్క విధము.

తా. ఈ మృగము ప్రాణములతోఁ జిక్కినదేనా యింతకంటెఁ జిత్రమైనది మఱియొకటి యేది యున్నది? మన వనవాసకాలము పూర్తి కాఁగా మనము పురమునకుఁ బోయినపుడు మనయంతఃపురమునం దిది యొకభూషణమై దానిని సింగారింపదా? రాజనందనమణీ! నేను జెప్పినది నిజముగునో కాదో యాలోచింపుము.

కం. భరతునకున్ మామను నా, కరయుము మామయత్తలకును ♦ వ్యక్తంబుగ నీ
హరిణము విస్మయజనకము, పురుషోత్తమ దీనిభంగి ♦ బుద్ధిం గనుమీ. ౬౨౨

తా. దీనిని జూచి సంతోషించుదానను నేనొకతెనే కాను. భరతునకు, తక్కిన పినతమ్ములకు, నాకు, మామయత్తలకును, స్పష్టంబుగ నీజింక యాశ్చర్యము కలిగించును. పురుషశ్రేష్ఠా! దీనిని విచారింపుము.

తే. ప్రాణములతోడ నియ్యది ♦ పట్టుపడక, పోయినను దీనిచర్మ మ♦మేయముదముఁ
గూర్చుఁ బచ్చికబ్బసిమీఁదఁ♦బఱచి దీనిఁ, గోర్కెఁ జేసెద నీతోడఁ♦గూరుచుండ.

అమేయముదము = అపరిమితసంతోషము, పచ్చికబ్బసిమీఁద = గడ్డియాసనముమీఁద. "వ్రతీనా మాసనం బృసీ" అమరకోశము.

తా. ఒకవేళ నిది ప్రాణములతోఁ బట్టువడకపోయినను దీని చర్మమైనను నపరిమితానందము గలిగించును. కావున లేఁబచ్చికతోఁ జేయఁబడిన దర్భాసనముపై దీనిని బఱచి నీతోడఁ గూర్చుండఁ గోరుచున్నాను.

చ. అది యిది లేదు గానలయు ♦ నంచుఁ బతిన్ వ్యథపెట్టు టెంతయున్
సుదతికిఁ గ్రూరమైనపని ♦ సుమ్మి, మదాశయ మిద్ది, గాన ని
య్యది తన మేనికాంతిఁ గడు♦నచ్చెరువున్ ఘటియించె నా కనన్
విదితపరాక్రముండ మృగ ♦ విస్మయకారణవర్ణశృంగముల్. ౬౨౪

మదాశయము — నాయభిప్రాయము, విదితపరాక్రముండు — ప్రసిద్ధికెక్కిన శౌర్యముగలవాఁడు, మృగ = జింకయొక్క, విస్మయకారణ — ఆశ్చర్యమునకు హేతువైన, వర్ణ = వన్నెగల, శృంగముల్ — కొమ్ములు.

తా. ప్రాణేశ్వరా! నా కది లేదు ఇది లేదు. అది కావలె నిది కావలె నని (నాకవలె) స్త్రీలు భర్తను సంకటపెట్టుట మిక్కిలి క్రూరమైనపని సుమీ. ఇది తగినది కాదని నాయభిప్రాయము. ఆకారణముచే నేనేదియు మిమ్మడిగినదానఁ

గాను. ఇట్టిది నిష్పాదము మాత్ర మిది కావలెనని యేల కోరెదనందువా? దీని దేహకాంతి నాకు మిక్కిలి యాశ్చర్యమును గలిగించెను. ఆఁడుదానను గాన నిబ్బరించుకొనలేకయున్నను, ఇది మీకు సులభసాధ్య మగుటను, ఊరికిఁ బోయినపుడు ఇన్నాళ్ళడవులలో నుంటివిగదే - ఏమి వింతవస్తువు తెచ్చితి వని నా చెల్లెండ్రు స్నేహితురాండ్రడుగుదురేమో యనియు దీనిని గోరితిని. (సముచ్చయ విశేషార్థములఁ స్ఫురింపఁజేయుచున్నది.) ముందు మించి నోరు జారెను. క్షమింపుడు. అని సీతాదేవి చెప్పఁగా ప్రసిద్ధికెక్కిన పరాక్రమముగల రామచంద్రమూర్తి యీ జింకయొక్క యాశ్చర్యకరమైన కొమ్ములు.

కం. కాంచనరోమంబులు ర, త్నాంచితశృంగములు సిరి♦జాప్తప్రభయుక్
మించిన నక్షత్రంబుల, సంపను, వెర గొల్పు మిగుల♦సమ్మదపరుఁడై. ౬౮౦

కాంచనరోమంబులు = బంగారువన్నె గల వెండ్రుకలు. రత్నాంచిత శృంగములు = రత్నములవలెఁ బ్రకాశించు కొమ్ములు, నీరజాప్తప్రభయుక్ = సూర్యుని కాంతియు, వెర = ఆశ్చర్యము. సమ్మదపరుఁడై -- సంతోషించినవాఁడై.

తా. బంగారువన్నె వెండ్రుకలు, రత్నకాంతులుగల కొమ్ములు సూర్యుని కాంతియు నక్షత్రములవంటి చుక్కలు మిగుల నాశ్చర్యము గలిగింప సంతోషించినవాఁడై.

♦ శ్రీరాముఁడు లక్ష్మణునకు సమాధానముఁ జెప్పుట ♦

కం. సీతావాక్యము విని మృగ, రీతిం గని యాసపడుచు ♦ శ్రీరఘుపతి భూ
జాతాప్రచోదితుండై, భ్రాతం గని యిట్టులనియె ♦ బరమముదమునన్. ౬౮౧

భూజాతాప్రచోదితుండై = సీతచేఁ బ్రేరింపఁబడినవాఁడై, భ్రాతన్ = తమ్ముఁడగు లక్ష్మణుని-మీఁది పద్యమునందలి ' వెరగొల్పు ' ననునదియు నీ పద్యమునందలి ' యాసపడుచు ' ననునదియు శ్రీరాముఁడు కేవల భార్యాసంతుష్టికై యామెచేఁ బ్రేరింపఁబడి మృగము వెంటఁ బోలేదనియు నది యాయనకుఁగూడ నాశ్చర్యము గలిగించుటచే నాయన యాసపడిపోయె ననియు గ్రహింపనగు.

తా. సీతాదేవి మాటలు మృగమునీటులు చూచి జానకిచేఁ బ్రేరింపఁబడినవాఁడై పట్టుకొనఁగోరి శ్రీరామచంద్రమూర్తి సంతోషముతో లక్ష్మణునితో నిట్టులనెను.

ఉ. కంటివె లక్ష్మణా! ధరణి♦కన్యకకుం గల జింకయాశ, ము
న్గంటిమె యిట్టిరూపమును ♦ గల్గుమృగం, బిఁక గల్గ నేర్చునే
వింటిమె నందనంబునఁ గు♦బేరవనంబున నైన నుంట, మి
న్నంటెను దేహ హాటకస♦ముంచిత బిందుకబృంహరమ్యమై. ౬౮౨

మిన్ను = ఆకాశము, హాటక = బంగారువలె, సముంచిత = బాగుగఁ ప్రకాశించు, బిందుక = చిన్నచుక్కలయొక్క, బృంద = సమూహముచే, రమ్యమై = అందమై.

తా. లక్ష్మణా! చూచితివా, యీమృగముమీఁద సీతకెంత యాస యున్నదో. ఆఁడువారిమాటలకు వారికోరికలకు నేమిలే యందువా యామెమాట నటుండ నిమ్ము. మనమైనను నిటువంటి సౌందర్యముగల జింకను జూచితిమా. ఇఁకమీఁదఁ జూడఁగలమా. ప్రపంచమంతయు మనము చూచితిమా. ఎందేమున్నదో యందు వేమో. చూడకున్నఁబోనిమ్ము. ఈలోకమునఁగాకున్నఁ బోనిమ్ము. ఇంద్రుని నందన వనమున కుబేరుని చైత్రరథమున నున్న దని యెవ్వరైనఁ జెప్పఁగా విన్నామా? లేదుకదా. దీనికాంతి యాకాశ మంటుచున్నదే. బంగారువన్నెచేఁ బ్రకాశించు చుక్కలసమూహముచే నందమై.

తే. రోమములు ప్రతిలోమాను♦లోమముగను
గొనబు మీఱెడి నావలిం♦చినను వెడలె
మేఘమున నుండి వెల్వడు♦మెఱుఁగువోలె
నగ్నిశిఖవోలు నాలుక ♦ యాననమున. ౬౮౩

రోమములు = వెండ్రుకలు, ప్రతిలోమానులోమముగను = పైనుండి క్రింది వైపుగా వ్రాలియుండునవి అనులోమరోమములు, వానికెదురుగా క్రిందినుండి పైకి వ్యాపించినవి ప్రతిలోమరోమములు-ఒక ప్రదేశమున నటులు నొకప్రదేశమున నిటు లుండును. గొనబు = అందము, ఆననమునన్ = నోటియందు.

తా. వెండ్రుకలు కొన్ని యనులోమముగను గొన్ని ప్రతిలోమముగను నందమై యున్నవి. అది యావలింపఁగా మేఘమునుండి వెలువడిన మెఱుఁగువలె నగ్నిజ్వాలవంటి నాలుక నోటినుండి వెడలుచున్నది.

తే. ఇంద్రనీలసమం బయి ♦ యెసఁగు మోము, శంఖముక్తానిభం బగు ♦ జఠరసీమ
మేలిసౌందర్యములదీవి ♦ మృగముశీవి, యెవనిమానసమును హరి♦యింప లేదొ.

శంఖ, ముక్తా, నిభంబు = శంఖముతోను ముత్యములతోను సమాన మైనది, జఠరసీమ = ఉదరము, దీవి = ద్వీపము.

తా. ఇంద్రనీలకాంతిగల ముఖము శంఖమువలె ముత్యములవలెఁ దెల్లనైన కడుపు గలిగి యీజింక శ్రీవి సౌందర్యముల కెల్ల దీవిగా నున్నది. ఇట్టిది యెవని మనస్సును హరింపఁ జాలదు? ఎట్టివాని మనస్సునైన హరించు ననుట.

కం. నానారత్నమయము జాంబూనదశుభవర్ణకలిత♦ముగా రూపంబున్
మానుఁగ గనఁ గరఁగదె యే,మానసమును బాలసీత♦మాటేమిటికిన్. ౬౮౪

నానారత్నమయము = నానారత్నముల కాంతులతో నిండినది, జాంబూనద శుభవర్ణ కలితము = బంగారుయొక్క మంచివన్నెతోఁ గూడినది.

తా. అనేకవిధములయిన రత్నకాంతులతో నిండినదియు. బంగారుయొక్క మంచి వన్నెతోఁ గూడినదియునైన రూపమును చూడఁగానే బాలసీత మాట యేల కాని యే మనుష్యుని మనస్సు కరగకుండును.

సీ. ఆమిషార్థము విహా♦రార్థంబు మృగముల ధానుష్కులై నట్టి♦ధరణిపతులు
మృగయాభిరతిఁ జంపు♦పృథ్వీతలేంద్రులు, ధాతువు ల్మణిహేమ♦ధననిచయము
లాఖేటమునఁ గాదె♦యార్జింత్రు శుక్ర సం, కల్పకల్పితవస్తు♦కాండము లన
వసుభేశ్వరునకు స♦ర్వంబును వనమునఁ, గలిగినదే కదా ♦ లలితచరిత
తే. యర్థకాముకు లెట్టిప♦దార్థమందు, నాసచేతను వనచారు ♦ లగుచు దాని
సంగ్రహించెదరో యర్థ ♦ శాస్త్రవేత్త, లైనవిబుధులు దానినే యర్థ్యమంద్రు.

ఆమిషార్థము = మాంసముకొఱకు, విహారార్థంబు = వినోద సంచారము కొఱకు, ధానుష్కులు = విలుకాండ్రు, మృగయాభిరతి = వేఁటయందలి విశేషమగు నాశతో, మణిహేమధన నిచయము = రత్నములు, బంగారు ధనసమూహములను, వేఁటయందు నేనుఁగుల జంపి, వాని కుంభస్థలమందలి ముత్యములు, ధాతువులందుఁ గల బంగారు వెండి మొదలగు లోహములు, శుక్రసంకల్ప = శుక్రుఁడు సంకల్పించిన వస్తుకాండములు = పదార్థ సమూహములు, శుక్రుఁడే వస్తువు కోరిన నదిసంకల్పము చేతనే కూయనకుఁ గలుగునని ప్రసిద్ధి. మనుష్యులు చేయు వ్యర్థసంకల్పము లన్నియు శుక్రునకు ఫలవంతములగును. 'మనుష్యేభ్యః సమాదత్తే శుక్రశ్చిత్తార్జితం ధన' మ్మని భారతము, ఉద్యోగపర్వము. అర్థకాముకులు = అపూర్వధనము కోరినవారు, అర్థశాస్త్రవేత్తలు = నీతి విషయమైన శాస్త్రమును తెలిసినవారు, అర్థ్యము = అమూల్యవస్తువు, ఏది విశేషము శ్రమించి సంపాదించెదమో యదియే యమూల్యము.

తా. విల్లుకాండ్రగు రాజులు మాంసము నిమిత్తము విహారము నిమిత్తము వేఁటయందలి యాసక్తిచేత మృగములను జంపుదురు. భూపాలనము చేయు రాజులు ధాతువులను మణులు, బంగారు, ధనసమూహమును వేఁటయందే కదా సంపాదింతురు. శుక్రుఁడు తన సంకల్పముచేతఁ గోరిన పదార్థములను సృష్టి చేయునట్లు రాజునకు సర్వము వనములవలనఁ గదా కలుగుచున్నది. అపూర్వవస్తువుల నపేక్షించువారు ఏ పదార్థము గోరి వనములఁ దిరుగుచు దానిని సంగ్రహించెదరో నీతిశాస్త్రవిదులు పండితులు దానినేకదా ప్రశస్తపదార్థ మనుచున్నారు.

కం. ఈమృగమణికాంచనమయ, మౌమహితాజినమునందు ♦ నవనీసుతయుఁ
దా మేలుపడియె నాతోఁ, సౌమిత్రీ! కూరుచుండ ♦ సమ్మదమారన్. ౬౮౭

మృగమణి = మృగశ్రేష్ఠముయొక్క, కాంచనమయ = బంగారుమయమైన, మహితాజినమునందు = మేలైనచర్మమునందు, మేలుపడియెఁ = ముచ్చటపడియెను.

తా. ఈయొక మృగమును జంపుటవలన నేమి విశేషార్థలాభము గలుగఁగలదనెదవా-బంగారుమయమైన యాశ్రేష్ఠమగు జింకచర్మముమీఁద సీతాదేవి నాతోఁడ సంతోషముతోఁ గూర్చుండ నాశపడుచున్నది.

కం. మృదులతఁ బ్రసిద్ధిగాంచిన, కదళీప్రియకప్రవేణి♦కాచర్మములుఁ
విదిత మగుమేషచర్మము, మదిఁ జూడుము దీనితో సమానం బగునే. ౬౮౮

మృదులతఁ = మెత్తని దగుటయందు, కదళీ = నల్లచారల యిఱ్ఱి, ప్రియకీ = బొల్లి యిఱ్ఱి, ప్రవేణికా = ఇది మృగజాతి భేదము. వీని చర్మము లయినను ప్రసిద్ధమైన మేఁకచర్మమైనను, దీనితో సమాన మగునా? మృగచర్మములం దింతకు మేలైనచర్మము మనకు లభింపదు. కావున దీనిని సంపాదింపఁ దగును.

కం. ధారిణి యీమృగరత్నము,తారాపథమందు వెలుఁగు♦దైవతహరిణం
బీరెండు నాకుఁ జూడంగా రమణీయములు దక్క ♦ గావు నిజముగఁ. ౬౮౯

తా. మృగజాతులలో భూమిమీఁద నీ జింక, ఆకాశమున చంద్రునిలోని జింక, యివి రెండే మనోహరములుగాని తక్కినవి కావు. అని నాయభిప్రాయము. అవునన్నా నీవు చెప్పినది నిజమే. ఇది నిజమైన జింక యయినఁ గదా. ఇది మాయామృగము. ఇది జీవితముతోను బట్టుపడదు. చంపితివా జింక చర్మము నీకు లభింపదు. వ్యర్థశ్రమము. మీకోరిక నెఱవేఱుఁబో దనెదవా? అట్లైనను దీనిని జంపవలసినదే.

(శ్రీరాముఁడు లక్ష్మణుతో మారీచమాయచే నీ మాయామృగం బవశ్యవధ్యం బని చెప్పుట)

ఉ. నీవు వచించినట్లు రజ♦నీచరమాయయ యేని దీని
ర్భావ మడంగఁ జంపుటయె ♦ భవ్యము చూ, యిటు తొటకేయుఁడే
కావలెఁ దైవ మునీశ్వరజ♦ఘాంసువు నై చరియింగు నృప
లావళి రాఁగ వేఁటలకు ♦ నట్టె వధించును వారి నందనన్. ౬౯౦

రజనీచరమాయ = రాక్షసుఁడు తనయద్భుతయోగశక్తిచే నీ రూపము ధరించె నందువా? దీని చెడ్డతలఁపు పోవునట్లు దీనిని జంపుటే శ్రేష్ఠమైన పని

సుమా. ఈ ప్రకారముగ తాటకాకుమారుఁడైన మారీచుఁడు గర్వించినవాఁడై మునీశ్వరులను జంపఁగోరి తిరుగుచు వేఁటకువచ్చిన రాజులను మోహగించి చంపుచున్నాఁడు.

ఉ. ఏపున దీనిఁ జంపుటయె ♦ యెంతయుఁ గార్యము పూర్వ మిందు వా
తాపి యనంగ రక్కసుఁడు ♦ తాపసగర్భములందుఁ జొచ్చి యా
లోపలనుండి తేలువలె ♦ లూనతదీయ పిచిండుఁడౌచు హిం
సాపరుఁడై చరించు చవ ♦ సానమునం దొకనాఁ డగస్త్యుచేన్. ౫౮౧

ఏపునన్ = పరాక్రమముచే, లూన = చీల్పఁబడిన, తదీయ = ఆ బ్రాహ్మణుల, పిచిండుఁడు = కడుపులు గలవాఁడు, తేలువలె = తేలునకు గర్భము వచ్చెనేని లోపలిపిల్లలు దల్లికడుపు చీల్చుకొని వెలికి వచ్చును. అవసానమునన్ = కడపట.

తా. ఈ కారణముచేఁ బరాక్రమించి దీనిని జంపుటే తగినకార్యము. ఈ ప్రదేశమందే పూర్వము వాతాపి యను రాక్షసుఁడు మునులకడుపులలోఁ బ్రవేశించి తేలువలె వారిపొట్టలు పగులఁ జీల్చుకొని హింసాపరుఁడై యుండి కడపట నొకనాఁ డగస్త్యమునీశ్వరుచే

కం. భక్షింపఁబడి యాతఁడు, కుక్షి వెడలి లేవ నున్నఁ ♦ గుంభభవుం డా
రాక్షసునకు ననియెన్ హృద,యక్షోభముగాఁగ నగుచు ♦ నమరవిరోధీ! ౫౮౨

కుక్షి = కడుపు, హృదయక్షోభము = హృదయము కలఁతపడునట్లు.

తా. భక్షింపఁబడి యతఁడు కడుపులోనుండి లేచుటకు యత్నించు సమయమున నగస్త్యుఁ డారాక్షసునితో వానిమనస్సు వ్యాకులపడున ట్లిట్లు పలికెను. ఓరీ రాక్షసుఁడా!

తే. సరకు సేయక బ్రాహ్మణ♦సంతతులను, నీదు తేజంబునను జంపి♦నిష్ఠురతను
బాపచరితుండవైతి వి♦ప్పాట నీవు, జీర్ణమైపొమ్ము నాగర్భ♦సీమ ననియె. ౫౮౩

సరకుసేయక = లక్ష్యములేక, నిష్ఠురతను = కఠినత్వముచే, ఇప్పాట = ఈ విధముగనే, ఈ యర్థమునం దిది ఆ ఈ ఏ శబ్దాదిపూర్వకముగానే ప్రయోగింపఁబడును.

తా. బ్రాహ్మణు లనిన నీకు లక్ష్యములేక నీశక్తిచే దయాహీనుఁడవై పాపపునడవడి గలవాఁడవై, వారి నందఱఁ జంపితివి. ఇప్పుడు నీ వుండు విధముగానే నాగర్భమున నీవు జీర్ణమైపొమ్ము అనెను. ఆ విధముగా నగస్త్యుఁడు వానిని జంపెను.

కం. ఈతండును జూడఁగ నా, వాతాపిని బోలఁడా య♦వశ్యము ఘటసం
జాతునిచే నతఁ డీల్గిన, భాతిని నాచే నితండు ♦ పైపడి చచ్చున్. ౬౯౪

తా. వీఁ డా వాతాపివంటివాఁడు కాఁడా యేమి? కావున నగస్త్యునిచే నెట్లు వాఁడు చచ్చెనో వీఁడు మనల మోసగింపవచ్చెను గావున నాచేఁ జావవలసినవాఁడే.

కం. సన్నాహంబున జానకిఁ, బన్నుగ రక్షింపు మీవు ♦ పదిలంబుగ నీ
కన్నియుపై నున్నవి మన,యన్ని ప్రయత్నములు కావు♦మా సతి శ్రద్ధన్.

సన్నాహంబునన్ = దృఢప్రయత్నముతో, పదిలంబుగన్ = అపాయము గాని విధముగ.

తా. నేను వేఁటకై పోయెదను. నీవు దృఢప్రయత్నముతో నీ సీత కపాయము గాకుండునట్లు కాపాడవలయును. మనప్రత్నయము లన్నియు నీమెపై నాధారపడియున్నవి. కావున శ్రద్ధతో రక్షింపుము.

(మనము పూనిన రాక్షసవధాదికార్యములకు నీమె మూలము. ఈమె వేదవతిగా నున్నప్పుడు రావణాది రాక్షసవధ సంకల్పించెను. అది నెఱవేర్చు భారము మనయందున్నది. దానికి భంగము గాకుండునట్లు నీమెను రక్షింపుము.)

కం. ఈ మృగమును వధియింపఁగ,నో మెలపునఁ బట్టుకొనఁగ♦నో నేఁ బోదున్
సౌమిత్రి! కంటె జానకి, యీమృగచర్మంబుఁ జూచు ♦ వ్యామోహంబున్.

తా. ఈ మృగము నీవు చెప్పినట్లు రాక్షసమాయ యాయెనా చంపుదును లేక సహజమృగ మయ్యెనా హెచ్చరికగా పట్టి తెత్తును. ఈ రెంటిలో నొకటి చేయుటకుఁ బోయెదను. లక్ష్మణా! సీతాదేవిని జూడుము. ఆ మృగచర్మముమీఁద నెంత మోహము పెట్టుకొని చూచుచున్నదో.

ఉ. కావున నొక్క శాతతర ♦ కాండమునన్ హరిణంబుఁ ద్రుంచి నే
నావరచర్మముం గొని ర♦యంబున వచ్చెద, నంతదాఁక నీ
తావరవర్ణినిన్ మిగులఁ ♦ దత్పరతం గడు నప్రమాద మే
ధావిభవంబు మీఱఁగ స♦దా పరిరక్ష యొనర్పు తమ్ముఁడా. ౬౯౭

శాతతరకాండమునన్ = పదునైన యొక బాణముచేతనే. వరవర్ణినిన్ = ఉత్తమస్త్రీని.

శీతే సుఖోష్ణ సర్వాంగీ, గ్రీష్మేతు సుఖశీతలా.

భర్తృరక్తా చ యా నారీ సా భవే ద్వరవర్ణినీ ఇతి రుద్రః చలికాలమందు సుఖోష్ణమైన సర్వావయవములు గలది, ఎండకాలమందు సుఖమైన చల్లఁదనము గలది. భర్తయందుఁ బ్రీతిగలది వరవర్ణిని యనఁబడును. తత్పరతన్ = ఆపని

యందే యాసక్తిగలవాఁడవై అనఁగా దిక్కులు చూచుచు నేమఱి యుండక, అప్రమాద = హెచ్చరిక తప్పని, మేధావిభవంబు = బుద్ధిసంపద.

తా. కావున నొక్కవాఁడిబాణముచే నీ జింకను జంపి చర్మము తీసికొని శీఘ్రముగ వత్తును. ఒక బాణప్రయోగమున కెంతకాలమో యంతమాత్రము కాలములోనే వత్తును. నేను బాణము ప్రయోగించుటకు యాలస్యము. నేను వచ్చు వఱకు యీసీతను నీవు లక్ష్యమైన హెచ్చరిక తప్పక యేకాగ్రమనస్సుతో తమ్ముఁడా సర్వథా కాపాడుము.

మత్తకోకిలము. దక్షుఁడుఁ దృఢసత్త్వుఁడుఁ మతిధైర్యయుక్తుఁడు లక్ష్మణా!
పక్షిరాజు జటాయు విద్యోడ సాహ్యుఁడై చరియింపఁగా
రక్షణంబు ఘటింపుమీ యుడురాజబింబసమాస్యకున్
దీక్షఁ బూని ప్రమాద మేది ప్రతిక్షణంబును శంకివై. ౯౫

దక్షుఁడుఁ = కార్యముచేయుటయందు సమర్థుఁడు, దృఢసత్త్వుఁడు = మిగులబలముగలవాఁడు, మతిధైర్యయుక్తుఁడు = ఆలోచన, ధైర్యముతోఁ గూడిన వాఁడు, సాహ్యుఁడై = సహాయుఁడై, ఉడురాజబింబ = చంద్రబింబముతో, సమాన = పోలికగల, ఆస్యకున్ = ముఖముగలదానికి, ప్రమాదమేది = ప్రమాదములేక, శంకివై = సందేహించువాఁడవై, దీక్షఁబూని = ఇది యొక వ్రతముగా నెంచి-ఇచ్చట జటాయుప్రశంస కాఁగలదానిని సూచించుచున్నది.

తా. పక్షిరాజగు జటాయువు కార్యసాధన సమర్థుఁడు. మిగుల బలముగల వాఁడు. కార్యాలోచనము, కార్యముచేయు ధైర్యము గలవాఁడు. ఆయన నీకు సహాయుఁడుగా నీసీతాదేవిని ప్రతిక్షణము ఏ కాలమున నేమి యాపదవచ్చునో యని శంక గలవాఁడవై పొరపాటుపడక యిదియొకవ్రతముగా నెంచి రక్షింపుము. శ్రీరామచంద్రమూర్తి యాచర్యగుఱించి భారతమునఁ గొన్ని శ్లోకములు గలవు.

అసంభవం హేమమృగస్య జన్మ, తథాపి రామో లులుభే మృగాయ।
ప్రాయః సమాసన్నవిపత్తికాలే, ధియోపి పుంసాం మలినీభవంతి.

బంగారుమయమైన జింక లోకమునఁ గలుగదు. అట్లుండియు రాముఁ డట్టి మృగమునకై యాసపడెను. ఆపత్కాలము సమీపించినపుడు పురుషులమనస్సులు ప్రాయికముగ మలినము లగుచున్నవి.

కర్మణా బాధ్యతే బుద్ధిః, న బుద్ధ్యా కర్మ బాధ్యతే।
సుబుద్ధి రపి యద్రామో, హైమం హరిణ మన్వగాత్॥

కర్మముచే బుద్ధి బాధింపఁబడునుగాని బుద్ధిచేఁ గర్మము బాధింపఁబడదు.

మంచి బుద్ధిబలముగల రాముఁడు బంగారుజింక వెంటఁ బోయెను. బుద్ధిః కర్మానుసారిణీ = బుద్ధి కర్మమున ననుసరించి పోవును.

న భూత పూర్వో నచ కేన దృష్టో, హేమ్నః కురంగో న కదాపి వార్తా,
తథాపి తృష్ణా రఘునందనస్య, వినాశకాలే విపరీతబుద్ధిః.

బంగారుజింక పూర్వమున లేదు, ఎవరు చూచినదిలేదు, అట్టి దున్నదన్న వార్తయు నెవఁడు వినలేదు. అట్లుండియు రామచంద్రునకు దానిపై నాశకలిగెను. చేటుకాలమునకుఁ జెడుబుద్ధి పుట్టును.

శ్రీరామచర్యవలన గ్రహింపవలసిన నీతు లివి. అందు విశేష మేమనఁగా దాను భ్రమపడుటయేగాక లక్ష్మణుఁడు చెప్పినను విన్నవాఁడుగాఁడు. మారీచ మాయ యని విశ్వాసముండిన నున్నచోటున నుండియే బాణము ప్రయోగించి యుండవచ్చును. దాని వెంటఁ బోవలసిన పనిలేదు రాక్షసునివెంటఁ బోయెనా? కావున ఆయనకును నది నిజమైన జింకగా నుండవచ్చు ననుభ్రాంతి వదలినదిగాదు.

సీతాదేవి లోకసామాన్యస్త్రీ యగునా? ఆమెకు దెలియని విషయములు లేవు. బంగారుజింక లోకమున లేదని యామెకుఁ దెలియదా?

'నిన్నుఁబాసి ధరాతనూజయు నేను నొక్కముహూర్తమేని! నిన్నిలం గల వారమె తమ నీటిఁబాసిన చేప లట్లన్న' యని లక్ష్మణుఁడు చెప్పినట్లు 'నను వీడి తేని మెయిఁదాల్ప నిజంబుగ' ననిన యంతటిపరమభక్తిగల సీత యెట్లు క్షుద్రమృగమునకై భర్తను దొలఁగియుండ నాలోచించెను? కావున కర్మానుసారము బుద్ధి యను నీతి ప్రాతీతికార్థమున నెఱుఁగనగును.

పరమార్థము విచారింతము. మనుష్యులకుఁ గోరికలు గోరు స్వాతంత్ర్యము కలదు. దాని నెఱవేర్చుభారము భగవంతునియందుఁ గలదు. ఎవరేకోరికలు దృఢముగఁ గోరినను భగవంతుఁడు దాని నెఱవేర్చును. కాని దానిఫల మనుభవింపు మనును. కావున మంచికోరికలు కోరువారికి మంచిఫలమే కలదు. చెడుకోరికలు గోరువారికిఁ జెడుఫలమె కలుగు. ప్రకృతివిషయమైన కోరికలు గోరువారి కందఱకు సీతాదేవికి వచ్చినగతియే వచ్చును. మారీచునిమాయయే ప్రకృతి. ప్రపంచమున మనము చూచునవి వినునవి యన్నియు ప్రకృతిచిత్రములే. సీతాదేవి మాయజింకను జూచి భ్రమించి యాశపడినట్లు మనము చిత్రవిచిత్రములైన ప్రకృతిపదార్థములను జూచి సత్యమని భ్రమపడుచున్నాము. ఇవి నిత్యములుగావు. క్షణభంగురములు. ఆ జింక వలన సీతాదేవి యెట్లు సుఖింపఁగోరెనో అట్లులే మనము ప్రకృతిపదార్థములవలన నానందింపఁ గోరుచున్నాము. రామచంద్రమూర్తి సీతాదేవికోరిక నెఱవేర్చినట్లు

మనకోరిక నెఱవేఱ్చును. సీతాదేవి యనుభవించిన ఫలమునంటి ఫలము మన మనుభవించుచున్నాము. సీత కేమిఫలము గలిగెను? అది ముందు విచారింపఁబడును.

—♦ ౪౪ వ సర్గము. శ్రీరాముఁడు మాయామృగముకొఱకుఁ బోవుట. ♦—

కం. అని మువ్వంపువిలుఁ గొని, కనకమయత్సరు కృపాణ♦కాండధియుగమున్
మనుకులుఁడు కట్టుకొని వెసఁ జనె మాయామృగముఁ బట్టు సంరంభమునన్.

మువ్వంపువిలు = మూఁడువంకరలుగల విల్లు, కనకమయ = బంగారుమయమైన త్సరు = పిడిగల, కృపాణ = కత్తిని, కాండధియుగమున్ = రెండంబుల పొదులను. సంరంభమునన్ — త్వరగా.

తా. మూఁడువంకరలుగల విల్లు, బంగారుపిడిగల బాకు, అంబులపొదులు రెండు ధరించి యా మృగమును బట్టుకొను త్వరతో బయలుదేరెను.

ఉ. వింటినిఁ గేలఁ బూని తన♦వెంటన వచ్చెడు రాముఁ జూచి లోఁ
దంటమలాడ గుండెలు త♦టాలునఁ గన్పడ కేగి పొంచియున్
గంటికిఁ దోఁప దూరముగఁ♦ గాంచి రఘూత్తముఁ డుగ్రవేగుఁడై
వెంటనె కూడఁబాఱ నది వృక్షచయంబుల మాఁగుఁ దోఁచెడున్. ౨౦౦

తా. చేత ధనుస్సు ధరించి తనవెంట వచ్చు రామచంద్రుని జూచి చాపను వచ్చుచున్నాఁడురా రాముఁడని దిగులుపడి గుండెలు దడదడ కొట్టుకొనఁగా తటాలునఁ గానరాకపోయి యల్లో పొదమనిన రావణుఁడు చంపునని భయపడి మరల దూరమునఁ గానరాఁగాఁజూచి రామచంద్రుఁడు మిగుల త్వరగలవాఁడై వెంటనే పట్టుకొనుటకై పరుగెత్తఁగా నది చెట్లగుంపుల చాటున డాఁగును. కానరాలేదు పోనిమ్మనిన మరలఁ గానవచ్చును.

సీ. చేపడె నిదె యని ♦ వే పట్టఁ బోయినఁ, జంగున మెలపునఁ ♦ జెంగలించు
గడువవ్వ చనె నిది ♦ గను మనుచు నిలిచినఁ, దారిసంబున నటఁ ♦ దారుచుండుఁ
బరువువాఱుచు దీని ♦ బట్టెద నని పాఱ, బొదలలోపలఁ గాలి ♦ యొదిగియుండు
జిక్కెఁ బో యిది యనిచే ♦ చాఁపఁబోవఁ జి, పుక్కున నొక్కపై ♦పు చిక్కకుఱుకుఁ
తే. దోఁచు దోఁపకుండు ♦ దూరంబుచను డాయు, నెదురునవ్వు మిగుల ♦ బెదరి చూచు
మాఱుమొగము పెట్టు ♦ దూఱాడు తాఁగాడు, లేఁతగసవు మేయు ♦ లీలఁదిరుగు.

చేపడె = లభించె, చంగున = దాఁటుటయందు ననుకరణము. ఇందుఁ బ్రభ మాకర మనంతమే కాని ప్రశాంతము గాదు. 'చంగున గోడదాఁటు నగసాలశిఖామణిఁ జూచితే సఖా'— యని శ్రీనాథ ప్రయోగము. మెలపునన్ = హెచ్చరికతో,

చౌకళించుట = నాలుగుకాళ్ళు కుప్పించిదాటుట, గడుసు = కష్టకార్యము, తారసంబునన్ సమీపమునందు, అటన్ = అచ్చోటనే, తారుచుండున్ = సంచరించుచుండును.

తా. నారికెరాయని పట్టుకొనంబోఁగా చెంగున నాలుగుకాళ్ళతోఁ నెగిరి యావల దుముకును. దూరము పోయినది యింకఁ జిక్కదు వ్యర్థశ్రమమేల యని వెనుక ముఖమైన సమీపమునందే తిరుగుచుండును. పరువెత్తి పట్టుకుందమని పరువెత్తఁగాఁ బొదలలోఁ దూటి యొదిగియుండును. చిక్కెనని పొదలలోకి చేయిచాపఁగా చివుక్కున యావలవైపు దూకి పరువెత్తును. కానవచ్చును. కానరాకపోవును. దూరమునుండి మరల సమీపించును. ఎదురుగా వచ్చును. బెదరినట్లు చూచును. పూలు మొగము పెట్టును. పోవుచవచ్చును. కదియవచ్చును. పచ్చిక మేయును. వినోదముగాఁ దిరుగును.

మాలి. కనఁగఁ గనఁగఁ గాంతుల్ ♦ గ్రక్కు దన్ విల్లు ధన్విన్
గనుచుఁ గనుచుఁ బాఱు ♦ దవ్వుగాఁ జిక్కకుండన్
మునుఁగు వెఱను బాణం♦బుం గనున్ మింట నాడున్
వనుల దరుల డాఁగున్ ♦ వంచనన్ గాసి బ్రాఁగున్. ౨౦౨
బ్రాఁగున్ = సోలును.

తా. రామచంద్రమూర్తి చూడఁజూడఁ గాంతులు గ్రక్కుచున్న దానివలె మెఱయుచు నిలుచును. ఆయన విల్లెత్తినా దృష్టి దానిమీఁద నేయుంచి దూరముగాఁ జిక్కకుండఁ బరువెత్తును. భయమున మునిఁగినట్లయి బాణమును జూచును. ఆకాశమందే గంతులువెట్టుచు నాడును. అడవులందుఁ జెట్లచాటున గుహలలోఁ దాఁగును. గాసిపడినదానివలె వంచనచే సోలును.

సీ. వెఱచెఁ బో యసి విల్లు♦మఱుఁగిడి డాయంగఁ, దిన్నతిన్నఁగ మును♦మున్నుపోవుఁ
జంపెద గాఁ కంచుఁ ♦ జాపంబుఁ దీసిన, బెదరినభంగిఁ గు♦ప్పించి యెగయు
దన వెంట వచ్చెడు♦జననాథుఁ జూడని, యట్టులె పచ్చిక ♦ నాడుచుండు
రద్దు సేయక పోవు♦రాము లీలాగతి, నోరచూపులఁ జూచు ♦ నొంటికంట

ఆ. మఱుఁగుఁ జేరు బయఁట♦ మెఱయును మబ్బుల, సడిచుచందురుండు ♦ నాఁగ నిట్లు
కాన వచ్చి కొంత ♦ కానరాక యొకింత, నేఁగెఁ దీసికొనుచు♦ నెంతొ దవ్వు. ౨౦౩

తా. నన్నుఁజూచి భయపడినదని తలఁచి శ్రీరామచంద్రమూర్తి విల్లువెనుకవైపుగా నుంచుకొని దగ్గఱకుఁబోఁగా నదియును మెల్లగనే ముందుముందుగఁబోవును. ఇది చిక్కదు. దీనిని జంపెదనని విల్లు దీయఁగానే బెదరినదానివలెఁ గుప్పించి యెగయును. తనవెంట వచ్చుచున్న రామచంద్రునిఁ జూడనిదానివలెఁ బచ్చికలందు నాడుచుండును. రద్దుసేయక పోవు రామచంద్రమూర్తిని నోరగంట నొకకంటితోఁ

జూచును. కొంతసేపు చాటుగఁ బోవును. కొంతసేపు బయలునందుఁ దిరుగును. మబ్బుల నడిమి చందురువలె నిట్లు కొంతసేపు కానవచ్చి కొంతసేపు కానరాక యాశ్రమమునుండి రామచంద్రుని మిగుల దూరము తీసికొనిపోయెను.

సీ. ఒకమాఱు పొదలలో♦నొదిగినట్టులె యుండు, నంచునఁ జేరఁ ద ♦ వ్వరిగి యుండు
నొకసారి నేలపై ♦ నొయ్యనఁ బన్నుండుఁ, జేసాఁచునంతలోఁ ♦ జిక్కకుండు
నొకతూరి నాయాస♦వికలత నిలుచుండు, బడలెనం చేరఁ గ♦న్పడక యుండు
నొకసారి వింత వే♦డుకల నాడుచు నుండుఁ, బట్టఁజూచినయంతఁ♦బాఱుచుండు

ఆ. వికటహారిణ మిట్లు ♦ గికురించి వంచించి, యటమటించి మిగులఁ ♦ గటమటించి
మోసగించి మాయ♦ముంచి తా బేలించి, తచ్చనలను రాము♦దవ్వులాగె. ౨౦౪

తా. ఒక్కొక్కసారి పొదలలో దాఁగినట్టులే యొదిగి కానరాకయుండును. రామచంద్రమూర్తి దగ్గఱపోవునప్పటికి దూరముపోయియుండును. ఒక్కొక్కసారి నేలమీఁదఁ బండుకొనును. చేసాఁచిపట్టుకొను లోపలఁ జిక్కకుండఁ బోవును. ఒక్కసారి చాల బడలినదానివలె రొంజుచు నిలుచుండును. బడలినది చిక్కినది యని చేరఁ బోవఁ గానరాకయే పోవును. ఒకసారి వింతవింత యాటలాడును. పట్టఁజూచినఁ బఱు వెత్తును. ఆ కుత్సితపుజింక యీ విధముగ మోసగించి వంచించి బేలించి రాముని మిగుల దూరమునకు నాకర్షించెను.

ఇందలిగీతమున శ్రీనాథుశైలి యనుకరణము గానఁబడు. మోసముయొక్క యతిశయము రామచంద్రుని మోహాతిశయము రూపింప సమానార్థక పదములే పెక్కులు ప్రయోగింపఁబడెను.

కం. అంత రుషావివశత సం,భ్రాంతుం డయి రామవిభుఁడు ♦ బడలిక నిలిచెన్
బ్రాంతమహావృక్షచ్ఛా,యాంతరమున శాద్వలమున ♦ నంతట నదియున్.

అంతన్ = ఈప్రకారము దూరము పోయిన పిదప, రుషావివశతన్ = కోపమువలనఁ గలిగిన పారవశ్యముచే, సంభ్రాంతుఁడయి = కలఁతఁజెందినవాఁడై, బడలికన్ = గాసిచే, ప్రాంత = సమీపమునందు, మహావృక్ష = పెద్దచెట్టుయొక్క, ఛాయాంతరమునన్ = నీడయందు, శాద్వలమునన్ = పచ్చికభూమియందు.

తా. చాలదూర మిట్లు పోయిపోయి కోపముచేఁ బరవశుఁడయి, మనస్సు కలఁతఁజెంద బడలి యొకపచ్చికగల ప్రదేశమున పెద్ద చెట్టునీడ నిలుచుండెను. అంతట నా జింకయు.

కం. జింకలమందలలోపలఁ, బొంకంబుగఁ గూడిమాడి ♦ పొదలుచుఁ దోఁచెన్
సంకటతలమున రాముఁడు, బింకంబునఁ బట్టఁబోవఁ ♦ బెల్కుటి యుఱికెన్.

సూడి = మలసి, ఈ శబ్ద మెప్పుడు కూడి శబ్దముతోఁ గూడియే వచ్చును.

తా. జింకల మందలలోఁ గూడి తిరిగి రామచంద్రమూర్తికి నిలుకు స్థలంబునఁ గానవచ్చెను. చిక్కెనులే ఇఁక నెక్కడికిఁ బోవునని పట్టుకొనఁబోఁగా, పెల్కుటి = భయముచే విలవిలఁ దన్నుకొని యెగిరి పరువెత్తెను.

ఉ. వెండియు వృక్షషండపద ♦ వీగతమై కనఁబడ్డ రామచం
ద్రుండు నితాంతరోషమునఁ ♦ ద్రుంచెద దీని నటంచుఁ బూని మా
ర్తండరుచిప్రచండభయ ♦ దద్రుహిణప్రవినిర్మితాస్త్రము
ద్దండత నారిఁ గూర్చి మృగ ♦ దానవునిన్ గుఱిచూచి వైచినన్. ౮౦౮

వృక్షషండపదవీగతమై = చెట్లసమూహముగల ప్రదేశమున నుండునదియై, మార్తండ = సూర్యునియొక్క, రుచి — కాంతివంటి కాంతితో, ప్రచండ = మిగుల తీక్ష్ణమైన, భయద = భయము గలిగించు, ద్రుహిణ = బ్రహ్మచే, ప్రతినిర్మితాస్త్రమున్ = చక్కఁగా నిర్మింపఁబడిన యస్త్రమును, ఉద్దండత = భయంకరముగ, నారిన్ = అల్లెత్రాటియందు. ఈ యర్థమున నిది దేశ్యమని శబ్దరత్నాకరమునఁ గానవచ్చుచున్నది కాని నారీ యోషితి మౌర్వ్యాంచ. అను రభసుని ప్రయోగము వలన నిది సంస్కృతశబ్దమే యని గ్రహింపదగు. మృగదానవునిన్ = మృగరూపము ధరించిన దానవుని. మధ్యమపదలోపి సమాసము.

తా. మఱియును నది చెట్లగుంపులుండు ప్రదేశమునందు కానరాఁగా రామచంద్రుఁడు మిగుల గోపించి దీనిని జంపెదనని సూర్యకాంతిగల బ్రహ్మాస్త్రమును వింట సంధించి యామృగరూపధారియైన రాక్షసుని గుఱిచూచి వేయఁగా.

శ్రీరాముని బాణముచే మారీచుఁడు హాలక్ష్మణా యని యఱచి చచ్చుట.

శా. ఆనారాచము తాటకాతనయు మా♦యాదేహముం దూఱి వే
గానన్ వానిద యాహృదిం బగుల ఘ♦ట్కారంబుతోఁ జీల్పఁగా
నానాకీశవిరోధి తాటిపొడ వా♦యస్త్రాహతి న్మిట్టిపా
టై నేలం బడె భైరవారవముతో ♦ నల్పాయువు వీరితిన్. ౮౦౯

నారాచము = బాణము, హృదిన్ = వక్షమును, నాకి + ఈశ + విరోధి = దేవతాప్రభువైన యింద్రునకుఁ బగవాఁడు — తాటిపొడవు = తాటిచెట్టునెత్తు, మిట్టిపాటై = ఎగిరిపడినవాఁడై, భైరవారవముతో = భయంకరధ్వనితో, అల్పాయు = ఆయుస్సు లేనివాఁడు, ఘట్కారంబుతోన్ = ఘట్టనుశబ్దముతో—వానిదయా హృదిన్ = రాక్షసుని దేయగు హృదయమును—ఇట్లు చెప్పుటచే రాక్షసుఁడు తనయోగబలముచే

జింకగా మాఱినను హృదయము మునుపటి హృదయమే కలవాఁడై దానియం దున్నాఁడని యెఱుఁగవలయు. హృదయమునఁగాక మఱియెక్కడ దెబ్బతగిలినను జచ్చియుండఁడు. తప్పించుకొని పోయియుండును మాయా దేహము అనుటచే, దేహము మాత్రమే యోగశక్తిచేఁ గల్పితము. ఇచ్చట మాయ యనునది యోగశక్తియే.

తా. ఆ బాణము మారీచుఁడు తన యోగశక్తిచేఁ గల్పించుకొనిన శరీరమున దూఱి శీఘ్రముగ మారీచునిదే యైన హృదయము ఘట్టని శబ్దమిచ్చునట్లు చీల్పఁగా ఆ రాక్షసుఁడు ఆ దెబ్బ వేగమునకు తాటిచెట్టు పొడవున భయంకర ధ్వనితో నెగిరిపడెను. ఆ క్షీణించిన యాయుస్సుగల రాక్షసుఁడు.

చ. మరణముఁ గూరుచుం దనదు ♦ మాయశరీరము వీడి యెట్లు లా
ధరణితనూజ లక్ష్మణుని ♦ దవ్వుగఁ బంపును, రావణుండు నే
కరణి హరింపఁ గల్గు నల ♦ కంజదళాక్షి నటంచు యోజనా
పరుఁ డయి యర్హ్వభంగి రఘు ♦ పర్యు నెలుంగునుబోలు నెల్గునన్.　　౨౦౯

వీడి = వదలి, మాయశరీరము వదలకున్న లక్ష్మణాయని యఱవ సాధ్యపడదు. ఏకరణిహరింపఁగల్గున్ = ఏమిచేసిన రావణుఁడు సీతను హరింపఁగలఁడు. తా నూరక చచ్చిన రావణుఁడు బ్రతికిపోవును. తన్నుఁ జంపించిన కారణముచే వాఁడును జచ్చునుగాక యనిదో యోజించెను. ఇప్పుడఱవకున్నను రావణుఁడు చేయఁగలిగినది యేమియు లేదుకదా. కావున తనతోపాటు రావణాసురుఁడు చావవలయు ననియే మారీచుని యుద్దేశము.

తా. ఈ ప్రకారము దెబ్బతిని మరణించుచు తన మాయశరీరము వదలి యేమిచేసిన సీత లక్ష్మణుని దూరముగాఁ బంపును. రావణుఁ డెట్లు సీతను హరింపఁ గలుగును, అని యోజించి తగినరీతిని రాముని కంఠధ్వనివంటి కంఠధ్వనితో.

కం. హాసీత లక్ష్మణా యని, మాసరరవ మార నఱచి ♦ మనుజాదుఁడు నై
జాసురరూపముతోడ ని, జాసువులన్ విడిచి యవని ♦ నాక్షణమ పడెన్.　　౨౧౦

మాసరరవము = అధికమైన ధ్వని, మనుజాదుఁడు = రాక్షసుఁడు, నైజాసురరూపముతో = తన సహజమైన రాక్షసరూపముతో, నిజాసువులన్ = తన ప్రాణములను, అవనిన్ = భూమిమీఁద.

దీనివలన మారీచుఁడు మారీచాకారముతోనే చచ్చిపడె నని యేర్పడుచున్నది. మారీచుఁడు మాయామృగ మగుట యోగబలముచే నని తెలియనగు. యోగబలముచేఁ బరకాయప్రవేశము చేయవచ్చును. దీనియందుఁ జీవుఁడు ప్రాణేం

ద్రియములనుగూడఁ దీసికొని మఱియొక దేహమునందుఁ బ్రవేశించును. మొదటి దేహమాకారణమున శవమై పడియుండును. దేహము వేఱు తాను వేఱను జ్ఞానసిద్ధి పొందినవారు దీనిని జేయవచ్చును. శ్రీ శంకరాచార్యులవారిట్లు చేసినవారే. ఇది పరకాయ ప్రవేశము కాదు.

ఇంద్రియములందు సంయమము చేసిన దో తీవ్రధారణాబలమున నొక దేహమే మఱియొక దేహముగ కీటకము భ్రమరమైనట్లు లగును.

కావుననే భగవత్సారూప్యము సాయుజ్యము కోరువారు ఆయన రూపమునే సర్వదా-అంతకాలమందు సహితము తీవ్రముగ ధ్యానించిన భగవత్స్వరూప సాయుజ్యములు లభించును. తక్కినవారి కిది యెంతో కాలము పట్టును. యోగసిద్ధులం దీమార్పు త్రుటిలోనే వచ్చును. వారి ధారణశక్తి యట్టిది. ఇందొక దేహమే మఱియొక దేహముగా మాఱునుగాని ధారణాశక్తి యెంతవఱకుండునో అంతవఱకే ఆ శరీరముండును. ముక్తుని శరీరము భగవద్దత్తము కావున దానికి మార్పు రాదు. శాశ్వతముగానే యుండును. మనశక్తిచే దెచ్చుకొన్నది మనమనోబలముకొలఁది యుండును. ఎప్పుడు మనస్సు చెదరునో యప్పుడా దేహముపోయి యథాప్రకారమగును. కావుననే మరణ-సురత-నిద్రలందు మాయాశరీరములు నిలువవు. ఆ దశలందు ధారణ లేదుగదా ; మారీచుఁ డీ తెగలోఁ జేరినవాఁడు.

దేవతల వరముచే గోరినరూపములు ధరించుశక్తి గలుగును. వారికి సంకల్పము మాత్రము గలిగినఁ జాలును. రావణాసురుఁ డి తెగలోఁ జేరినవాఁడు. ఈ తెగలోఁ జేరినవా రేరూపముతోఁ జత్తురో నిద్రింతురో యప్పుడును, వారి కా దేహములే యుండునుగాని మాఱవు.

రావణాసురుఁడు సహజముగ పదితలలవాఁడు. కోరినపుడు రెండుతలలవాఁడగును. మఱి యే రూపమైన ధరించును. ఈ కారణముచేత వాఁడు రెండు తలలవాఁడై చచ్చిపడెనేకాని పదితలలవాఁడు గాలేదు. వానికిఁ దలలు సహజముగ రెండని శత్రువులను భయపెట్టవలసినపుడు పీర్లపండుగులో బచ్చెన తలకాయలు తగిలించుకొనునట్లు వాఁడును దగిలించుకొనుచుండె నని కొందఱు వ్రాయుట పరిహాసాస్పదము. బచ్చెనతలలు తెగఁగొట్టిన మరల నెట్లు మొలచును. విశాల లక్ష్యము నివారించుటకుఁగాను రామునితో యుద్ధము చేయునపుడు రెండు తలలవాఁడే యయ్యెను.

ఈ కారణముచేతనే

భక్తాస్తే యాదృశేరూపే, సంసారపద మాశ్రితాః
తాదృశం తే సమీక్షంతే పరమవ్యోమవాసినా॥

గృహస్థు లేరూపమునందు భక్తి చేయుదురో పరమపదమందు వారలు నట్టి రూపమే చూతురు. అనఁగా సీతారామభక్తులు సీతారామలక్ష్మణాంజనేయులనే దర్శింతురు. లక్ష్మీనారాయణుల ధ్యానించువారు ఆ స్వరూపమునే దర్శింతురు. పాషాణము గాఁగోరువారు పాషాణమే యగుదురు—లయము కోరువారు లయమే యగుదురు.

తే. హేమమాలి మహాదంష్ట్రు ♦ హేమభూషుఁ, జిత్రకేయూరమండితు ♦ శితకలంబ
నిహతు రాక్షసరూపు ని♦ర్భిద్రభయద, వేషు రక్తాంగు క్షితితల♦వేష్టమాను.

హేమమాలిన్ = బంగారుమాలికగల వానిని, మహాదంష్ట్రున్ — పెద్ద కోఱలుగలవానిని, హేమభూషున్ = బంగారాభరణములు గల వానిని, చిత్రకేయూరమండితున్ = వింతయగు భుజకీర్తులచే నలంకరింపఁబడిన వానిని, శితకలంబనిహతున్ = వాఁడి బాణముచేఁ జచ్చినవానిని, రాక్షస రూపున్ — రాక్షసాకారముగల వానిని - నిర్భిద్ర భయద వేషున్ — హెచ్చరికతోఁగూడిన భయంకర వేషము గలవానిని, రక్తాంగున్ = ఎఱ్ఱని దేహము గలవానిని, నెత్తుటిచేఁ దడియుటచే రక్తాంగుఁడు, క్షితితల వేష్టమానున్ = భూమిమీఁద పొరలెడివానిని.

తా. బంగారుహారములు, పెద్దకోఱలు, బంగారుసొమ్ములు, చిత్రమైన భుజకీర్తులు గలిగి భయంకరాకారముతో నెత్తుటఁ దడిసిన యెఱ్ఱని దేహముగా వాఁడి బాణముచేఁ గొట్టఁబడి నేలఁబడి పొరలుచుండు రాక్షసరూపుని.

మ. కని సౌమిత్రి వచించినట్టి యలవా♦క్యంబుల్ మదిం దోఁపఁగా
జనకాపత్యముపై మనం బొసఁగఁ గౌ♦సల్యాత్మజుం డాత్మలో
ననుజుం డియ్యది తాటకాతనయుమా♦యల్ పో యటం చెంచె మ
త్సునిశాతాస్త్రనిహన్యమానుఁ డితఁ డా♦దోషాటనాథుండె యౌ. ౨౮

జనక + అపత్యము = జనకునిబిడ్డ - సీత, అనుజుండు = లక్ష్మణుఁడు, మత్ — నాయొక్క - సునిశాత = మంచి పదునైన, అస్త్ర = అస్త్రముచే, నిహన్యమానుఁడు = కొట్టఁబడినవాఁడు, దోషాటనాథుండె = రాక్షసుఁడె, దోషా + అటుఁడు = రాత్రియందుఁ దిరుగువాఁడు.

తా. చూచి లక్ష్మణువాక్యములు స్మరణమునకురాఁగా సీతమీఁద మనస్సు పోఁగా రాముఁ డిట్టులు తనలోఁ దలఁచెను. లక్ష్మణుఁ డిది మారీచుమాయలే యని తలంచెను. ఇప్పుడు నా బాణముచేఁ జంపఁబడినవాఁడు ఆ రాక్షసుఁడే యగును.

కం. హాసీతా లక్ష్మణ యని యాసురనాథుండు బిగ్గ ♦ నఱచుచుఁ జచ్చెన్
భూసుతయును సౌమిత్రియు, నేసందమువార లైరొ ♦ యెలుఁగున్ వినుటన్.

చచ్చెడివాఁ డూరక చావక హా సీతా లక్ష్మణా యని యా రాక్షసుఁడు గట్టిగా నఱచి చచ్చెను. ఈ మాటవిని సీతయు లక్ష్మణుఁడు నీధ్వని విని యెట్లయిరో.

ఏసంచము = ఏ + చందము, ఇది త్రికపూర్వక కర్మధారయ సమాసము. కర్మధారయంబునఁ బరంబైన పరుషములకు గసడదవలు వైకల్పికముగనగు. సు. వ్యా. సంధి ౬౧.

ఓ స్వామీ యిటువంటి కొండదరిలో నొంటిం బులుల్ సింగముల్
గాసింబెట్టెడు కుట్ర నట్టడవిలో గల్జువ్వి క్రీనీడ నే
హాసం గట్టితి వేటిగడ్డ నిలు నీ వాకొన్నచోఁ గూడు నీ
క్కీ సుట్టంబులు దెచ్చిపెట్టెదరు నీ కిందేటికే లింగమా॥ కాళ. స్వా.

విశ్వామిత్రుని యాగవేళ రామచంద్రమూర్తి మారీచునిఁ జంపక విడిచినది ఈ సాయుజ్యము నిమిత్తమే.

యన్నామాఽన్యోపిమరణే స్మృత్వా। తత్సామ్య మాప్నుయాత్ । కిము తాగ్రే హరిం పశ్యం స్తేనైవ నిహతో సురః । తద్దేహా దుత్థితం తేజః సర్వలోకస్య పశ్యతః । రామమేవావిశద్దేవా విస్మయం పరమం జగుః । కింకర్మ కృత్వా కిం ప్రాప్తః పాతకీ ముని హింసకః । అథవా రాఘవస్యాయం మహిమా నాత్ర సంశయః । రామ బాణేన సంవిద్ధః । పూర్వం రామ మనుస్మరన్ । భయాత్సర్వం పరిత్యజ్య గృహవిత్తాదికంచ యత్ । హృది రామం సదా ధ్యాత్వా నిర్ధూతాశేషకల్మషః । అంతేరామేణ నిహతః పశ్యన్రామ తాపసః । ద్విజోవా రాక్షసోవాపి, పాపీవా ధార్మికోపివా। త్యజన్ కళేబరం రామం స్మృత్వా యాతి పరంపదమ్. అధ్యాత్మ 3.

ఎంతటి యజ్ఞుఁడైనను మరణ కాలమందు నెవని నామము స్మరించినచో నాపుణ్యో సముఁడగునో (దీనికే సాయుజ్యమనిపేరు) యట్టి హరి నెదుటఁజూచుచు నాయనచేతనే రాక్షసుఁడు చంపఁబడెను. ఆ దేహమునుండి లోకమంతయుఁ జూచుచుండ నొక తేజస్సు వెలువడి రాముని దేహమునందుఁ బ్రవేశించెను. మునుల హింసించుచుండిన పాపి వీఁడుచేసిన కార్యము లేమి వీనికిఁ గలిగిన భగవత్ప్రాప్తి యేమి యని దేవత లాశ్చర్యపడిరి. ఇది రాముని మహిమయే సందేహము లేదనుకొనిరి. రామబాణముచేఁ గొట్టఁబడుటను, బూర్వమందు రాముని స్మరించుటచేతను, భయముచే విల్లు, ధనము సర్వము వదలి (౬౧౫ – ౬౧౮ పద్యములు చూడుము) హృదయమందు సర్వదా రాముని స్మరించి సమస్త పాపములు నాశము చేసికొని మరణకాలమందు రామునిచేఁ జంపఁబడి యాయనను జూచుచు ప్రాణము విడిచి రామునిఁబొందెను. బ్రాహ్మణుఁడైనను, రాక్షసుఁడైనను పాపి

మైనను ధర్మాత్ముఁడైనను, రాముని స్మరించుచుఁ బ్రాణము విడుచువాఁడు పరమపదమునకుఁ బోవును.

పరుసవేది లోహాభగవద్విగ్రహామువలెనే కటికవాని కత్తిని బంగారు చేయును. దానిస్పర్శ యుండినఁ జాలును.

కం. అని భీతి మేనఁ బులకలు, జనియింపఁగ నొండుమృగముఁ ♦ జంపినమాంసం
బును గొని యాశ్రమభూమికిఁ, జనుచుండెను రాముఁడెంతొ ♦ సత్వరుఁడగుచున్.

పులకలు...రూ. పులకములు. గగ్గురులు.

తా. అని భయమున దేహామునందు గగ్గురు జనింపఁగా నొక్కమృగమును జంపి యామాంసమును గొని శీఘ్రయానమున రామచంద్రమూర్తి యాశ్రమమునకు వచ్చుచుండెను.

—♦ ౪౫-వ సర్గము. సీత లక్ష్మణుని రామునకు సహాయుండుగఁ బొమ్మనుట. ♦—

ఉ. అక్కడ భర్తృకంఠసదృ ♦ శార్తరవంబును నాలకించి య
మ్మక్క యిదేమి లక్ష్మణ ! ర ♦ యంబునఁ బర్విడు రాముఁ జూడ నా
కక్కట గుండె ఝల్లు మనెఁ ♦ బ్రాణము తత్తఱలాడఁ జొచ్చెఁ దా
నెక్కటి యందుఁ జిక్కెనొ మ ♦ ఱేమి ఘటిల్లెనొ యేమి సేయుదున్. ౨౧౫

అక్కడన్ = ఆశ్రమమందు, భర్తృ — పెనిమిటియొక్క, కంఠ - గళస్వరముతో, సదృశ = సమానమైన, ఆర్తరవంబును = దుఃఖశబ్దంబును, ఆలకించి = సీత యథ్యాహారము, అమ్మక్క = అయ్యో, ఎక్కటి - ఒంటరిగాఁడు.

తా. ఆశ్రమమందు సీతాదేవి తనపెనిమిటి కంఠస్వరము దుఃఖముతోఁ గూడినదై వినిపింపఁగా విని లక్ష్మణుఁ జూచి యయ్యో లక్ష్మణా ! యిది యేమి విపరీతము ? రామచంద్రునిఁజూచుటకుఁ ద్వరగాఁ బరువెత్తుము. ఆధ్వని వినఁగానే గుండెలు ఝల్లు మనుచున్నది. ప్రాణము చలించుచున్నది. రామచంద్రమూర్తి యొంటివాఁడు ఎక్కడ నెవరిచేతులలోఁ జిక్కెనో లేక మత్తేమైన నాపద గలిగెనో నే నేమి సేయుదును.

పదునాలుగు వేలమంది యోధుల నొక్కరుఁడు తనకన్నులయెదుటఁ జంపఁగాఁ జూచియు నాయన కేమో యాపద వచ్చిన దని తలఁచుట కర్మబలిష్ఠ మగుటచేతనే కదా. 'అయ్యవారి పెండ్లాని కాపదవచ్చినను గష్టమే సంపదవచ్చినను గష్టమే' యన్నట్లు స్త్రీలకు సంతోషమువచ్చినను దేహము తెలియదు. శోకమువచ్చినను దేహము తెలియదు. ఉన్న తెలివి యూడిపోవును.

చ. అఱచుచు నున్నవాఁడు భవ ♦ దగ్రజుఁ డాతనిఁ గావఁ బోఁగదే
బిఱబిఱ నాదుతమ్ముఁ డతి ♦ వీరుఁడు బాసట యౌ నటంచు నె
త్తెఱఁగున నాసలం గొనెనొ ♦ ధీరుఁడు రాక్షసకోటి ముట్టఁ బె
ల్కుఱి హరిసంచయావృతము ♦ కోడెవిధంబున నుమ్మలింపఁడే. ౨౧౬

భవత్ + అగ్రజుఁడు = మీ యన్న, బాసట = సహాయుఁడు, పెల్కుఱి = భయపడి, విలవిలలాడుచు, హరిసంచయావృతము = సింహముల గుంపుచేఁ జుట్టఁబడినది, ఉమ్మలింపఁడే – దుఃఖింపఁడా.

తా. లక్ష్మణా! మీ యన్న యఱచుచున్నాఁడు. త్వరగా నాయనను గావఁ బోవయ్యా. నాతమ్ముఁడు మిగుల పరాక్రమవంతుఁడు. నాకు సహాయుఁడగును. అని యెంతయాశ పెట్టుకొనియున్నాఁడో రాక్షసకోటులు చుట్టుకొనఁగా సింహముల గుంపులు చుట్టుకొనఁగా నుండెడి కోడెవలె నెంత దుఃఖించుచున్నాఁడో ?

కం. అని చెప్ప లక్ష్మణుండును, దనయగ్రజు శాసనంబుఁ ♦ దలఁచి చనక ని
ల్చినఁ గని కుపితాత్మికయై, జనకతనూజాత యిట్లు ♦ సౌమిత్రి కనున్. ౨౧౭

అగ్రజుశాసనంబు = సీతను సర్వవిధములఁ గాపాడుమనిన యన్న యాజ్ఞను, కుపితాత్మికయై = కోపించిన మనస్సు గలదై.

తా. అని చెప్పఁగా లక్ష్మణుఁడు సీతను గాపాడుమని చెప్పిన యన్న యానతి దలఁచి పోక నిలిచియుండఁగాఁ జూచి కోపించి సీత లక్ష్మణునితో నిట్లనెను.

—♦ సీత లక్ష్మణునిఁ గోపించి పలుకుట ♦—

శా. సౌమిత్రీ! భవదగ్రజాతునకుఁ గ♦ష్టంబైన యీకాలమం
దేమాత్రంబును నీవు దోడ్పడఁగ నూ♦హింపంగనున్ లేమి నో
రా మిత్రాకృతి సంచరించెడి మహా♦ప్రత్యర్థి వం చెంతు దు
ష్కామీ! రాముఁడు నీకు నేచెడుగులం♦గావించె నో వంచకా. ౨౧౮

సౌమిత్రీ = సుమిత్రానందనా. అడవికి వచ్చునపుడు మీయమ్మ నీ కేమి చెప్పెను నీవు చేయునది ఏమి అని భావము. భవత్ + అగ్రజాతునకు = మీ అన్నకు, లోకములో మఱి యెవ్వరికో కాదు. మిత్రాకృతిన్ = మిత్రుని యాకారముతో అనఁగా మిత్రునివలె వేషము వేసికొని, మహాప్రత్యర్థివి = గొప్ప శత్రువవు, దుష్కామీ = చెడ్డ కామము గలవాఁడా, వంచకా = మోసగాఁడా.

తా. సుమిత్రపుత్రా! మీ యన్నకుఁ గష్టము ప్రాప్తించిన యీ కాలమునఁ గొంచెమైన సాహాయ్యము చేయుద మని యూహించినవాఁడ వైనను గావు. ఆ కారణముచే స్నేహితుని వేషము వేసికొని తిరుగుచుండు గొప్ప శత్రు

వని నేను దలంతును. దుష్ట కామము కలవాఁడా! ఓరీ వంచకుఁడా! నీకు రామ చంద్రమూర్తి యేచెడ్డ గావించెను.

చ. ఎఱిఁగితి లెమ్ము నీ తెఱఁగు ♦ లెల్లను లక్ష్మణ! రామచంద్రుచాఁ
గఱ యభిలాష చేసెదవు ♦ కల్మషచిత్తుఁడ! నానిమిత్త మా
మొఱ చెవులారఁగా వినియు ♦ మోహము మై నడు గత్తి పెట్ట కి
ట్లుఱక తిరుండ వైతి, విటు ♦ లోర్పు మెయిన్ సుజనుండు నిల్చునే! ౭౧౯

చాఁగఱ = మరణము.

తా. లక్ష్మణా! నీ విధము నీయాలోచన తెలిసికొంటిని లే. పాపపుమనస్సు గలవాఁడా! ఆయనయార్తధ్వని స్పష్టముగ వినియును, నామీఁద నుండు మోహముచే నన్ను గ్రహింపఁ గోరి యచటికిఁ బోవుటకై యొక యుపాయమైన నెత్తిపెట్టక స్థిరముగ నిలుచున్నవాఁడవైతివి. అన్నకు నాపద వచ్చినవేళలో సుజనుఁ డయిన వాఁడు పోక యిట్లు నిలుచునా ?

రామునిఁ గాచియుండు మని నీ తల్లి నీకుఁ జెప్పెనుగాని నన్నుఁ గాచియుండు మని చెప్పలేదు గదా. ఆమెమాటనే నీ వలక్ష్యము చేసినవాఁడవు. నా మాట యలక్ష్యము సేయకుందువా.

ఉ. అన్నకుఁ జేటు గూరుట ప్రి♦యం బగు నీ కెద స్నేహ మన్నపై
నున్న నిజంబు నీవు వనిఁ ♦ జొచ్చుట ముఖ్యము రాముకై కదా
యన్నిరఘూత్మప్రాణమున ♦ కాపద వచ్చినవేళ నేమిగా
నన్నిటఁ గాచి యుండెదు మ♦నంబున జంకవ యెంత చెప్పినన్. ౭౨౦

తా. ఏల నిలిచితినందువా? అన్నకుఁ గీడుమూఁడుట నీకు సమ్మతము గనుక నిలిచితివి. నీకు నన్నపై స్నేహము నున్న. ఇది నిజము. నీ వడవులకు వచ్చిన యుద్దేశ మేమి? నీతల్లి నీకేమి చెప్పెను? ముఖ్యముగ రామచంద్రుసేవకై కదా వచ్చితివి? రాముని సేవింపుమని కదా నీతల్లి నీకుఁ జెప్పెను. అటువంటి నీ విషయమున నేపాప మెంచనట్టి రామచంద్రునకుఁ బ్రాణాపాయము వచ్చినపుడు అచ్చటికిఁ బోక యేమని నన్నుఁ గాచుచుండెదవు. ఇంత చెప్పినను లక్ష్యములేక మనస్సునందైనఁ గొంచెమైన జంకవే? రాముని రక్షించిన నాప్రాణము రక్షించినట్టులగునుగాని రాముఁడు లేకున్న నా ప్రాణము నీవు కాపాడిన నిలుచునా ?

కం. భీతహరిణాక్షి యీగతి, భీతహరిణిచందమునను ♦ బెగ్గిలి బాష్ప
వ్రాతములు దొరఁగఁ బలికిన, క్ష్మాతనయామణిని గాంచి ♦ సౌమిత్రి యనున్.

భీతహరిణాక్షి = బెదరిన జింకకన్నులవంటి కన్నులు గలది, భీతహరిణి

చందమునను = భయపడిని యాఁడుజింకవలె, బెగ్గిలి = భయపడి, బాష్పవ్రాత ములు = కన్నీళ్ళ సమూహములు, తొరఁగన్ = రాలఁగా.

తా. స్వభావముచేతనే బెదరిన జింక కన్నులవంటి కన్నులు గలది. దానికిఁ దోడుగా నిపుడు రామున కేమియో యాపద వచ్చెనని భయపడినది కావున భయ పడిన యాఁడుజింకకన్నులవంటి కన్నులుగల సీత కన్నీళ్ళు రాలఁగా పలుకుట విని యామెను జూచి లక్ష్మణుఁ డిట్లనెను.

—♦ లక్ష్మణుఁడు సీతకు సమాధానముఁ జెప్పుట. ♦—

చ. వదినె! యి కేటి కమ్మ భయ♦పాటునఁ గుందెదు, నీమనోహరున్
త్రిదశమనుష్యయక్షఫణి♦ దేవవిరోధిపిశాచనాయకుల్
కదనమునందుఁ దాఁకియు ము♦ఖాముఖి నిల్వఁ గలారె! వారికిన్
బ్రదుకులు దీపుగావె? మఱి♦ప్రాణము లంతటిచేఁదె యేరికిన్? ౭౨౨

వదినా = వదినె—వదిన యని రెండు రూపంబులు గలవు - అన్నభార్య - భార్యయక్కకు వదినె యనియే పేరు. వధూశబ్దభవము. మనోహరున్ = భర్తను, త్రిదశ = దేవతలయు, మనుష్య = మనుష్యులయు, యక్ష = యక్షులయు, ఫణి = సర్ప ములయు, దేవవిరోధి = రాక్షసులయు, పిశాచ = పిసాసులయు, నాయకుల్ = ప్రభు వులు, కదనమునందున్ = యుద్ధమునందు, ముఖాముఖి = ఎట్టయెదుట.

తా. వదినా! యేలమ్మ యింతేఁగా భయపడి దుఃఖించెదవు. నీపతి దేవ తల, మనుష్యుల, యక్షుల, సర్పముల, రాక్షసుల, పిశాచముల నాయకులైనను, యుద్ధమునఁ దాఁకి యెట్టయెదుట నిల్వఁగలరా ? వారికి మాత్రము బ్రదుకవలెనను నాశలేదా. ఎవరికైనఁ బ్రాణములు చేఁదా ? ఏది తీపనినఁ బ్రాణము తీపు అను సామెత వినలేదా ?

చ. ఇటు తగు నమ్మ నీకు వచి♦యింపఁగ, రాముఁ డవధ్యుఁ డెందు, నె
క్కటి నిను వీడి నాకుఁ జనఁ♦గా లెటులాడెడి, ముజ్జగంబు లొ
క్కటఁ బయి నెత్తెనేని సన♦గప్రతిపంథిమరుద్గణంబునేన్
దిటముగ రాముఁ డాశుగ త♦తిం బరిమార్చును దీర్చు నందఱన్. ౭౨౩

నీకున్ = గొప్పవంశమునఁ బుట్టిన నీకును అయోనిజగాఁ బుట్టిన దేవతవంటి నీకును, శ్రీరామచంద్రుడు సంతటివానికి భార్యవైన నీకును, క్షత్రియ కన్యవైన నీకును, స్వభావముచే సాధ్వీ గుణములు గల నీకును, అవధ్యుఁడు = చంపఁబడ సాధ్యముగాని వాఁడు, ఎక్కటి = ఒంటరిగా, స + నగ ప్రతిపంథి + మరుత్ + గణంబునేన్ = ఇంద్రునితోడి దేవతా సమూహమునైనను, ఆశుగతతిన్ = బాణ సమూహముచే, పరిమార్చును = చంపును.

తా. నీనోర వచ్చిన మాటలు నీవు చెప్పఁదగినవి కావు. రామచంద్రమూర్తి యెవరిచేతను జంపఁబడువాఁడు కాఁడు. ఒంటిగా నిన్ను విడిచిపోవుటకుఁ నే నొకయడు గైన నెత్తిపెట్ట నెట్లు సాధ్యము ? మూఁడులోకము లొక్కటిగాఁ జేరి దండెత్తి వచ్చినను, ఇంద్రుఁడు దేవతలు గలసి వచ్చినను, ధీరుఁడై చలింపక నిలిచి రామచంద్రుఁడు బాణములచేఁ జంపును. అందఱను నాశముచేయును.

కం. నమ్ముము నా మాటను, మది, నమ్మళముం గనుమా దేవి ♦ నీనాథుఁడు శీ
ఘ్రమ్మున మృగముం జంపి సుఖమ్ముగ నిట వచ్చు నేల ♦ కళవళపడఁగన్. ౭_౨౪

కళవళపడఁగన్ = వ్యాకులపడఁగా.

తా. అమ్మా నామాట నమ్ముము. మనస్సున నిబ్బరించుకొనుము. నీ భర్త శీఘ్రముగ మృగమును జంపి సుఖముగ నేకీడు లేక యిచ్చటికి వచ్చును. ఏల కలఁత చెందెదవు ?

కం. రామునిస్వరంబు గా దది, యేమాయావియొ రవంబు ♦ నెసఁగించెఁ జుమీ
యే మన గంధర్వనగర, మా మాడ్కిని గలుగఁజేసె ♦ నాయసురుండే. ౭_౨౫

తా. మనము విన్నది రామచంద్రమూర్తి కంఠస్వరము గాదు. ఏ మాయల మారియో యీ విధముగ ధ్వనించెను. ఆ మారీచ రాక్షసుఁడే గంధర్వనగర మగుట వలె స్వరము కలిగించెను. గంధర్వ నగరము. మేఘముల చిత్రసన్నివేశము – గంధర్వ నగరం ప్రోక్త మింద్రజాలం మనీషిభిః॥ అని గంధర్వనగర మనఁగా, నింద్రజాలమనియుఁ గలదు. లేని దున్నట్లు కనఁబడఁజేయు శక్తి.

ఉ. ఇల్లడపెట్టి పోయె నిను ♦ నియ్యెడ రాఘవుఁ డమ్మహాత్ము న
ల్కెల్లను బొల్లు చేసి యెటు ♦ లేగుదు, వైరము పూని యున్నవా
రల్లఖరుండు చచ్చినది♦యాదిగ రాక్షసు లెల్ల, వారలే
కల్లరవంబు నించెదరు♦ఘాతుకులై సతి యేల చింతిలన్. ౭_౨౬

తా. నీవు పో నీవు పో యనెదవే నే నెటులమ్మా పోదును. నిన్ను నా రక్షణమునం దుంచికదా రామచంద్రమూర్తి పోయెను. ఇల్లడ యుంచిన సొమ్ము పాఱవేసి పోవువాఁడు సొమ్ముకాఁడు వచ్చి యడిగిన నేమి యుత్తరము చెప్ప గలను ? రామచంద్రమూర్తి వచ్చినాఁ యిదియా నిన్ను జేయుమని చెప్పిన పని యని యడుగఁడా ? ఆయన యాజ్ఞ నుల్లంఘించి యాయన మాట వ్యర్థము చేసి నేనెట్లు పోదును ? నేను వెడలిపోయిన నీగతి యేమి ? నా కేమి యపాయము వచ్చె ననెదవా ? ఖరుఁడు చచ్చినది మొదలు రాక్షసు లందఱు మనమీఁద పగ పూని యున్నారు. ఏ విధముగనైన మనలను జంపవలయునని కుట్రలు పన్ను

చున్నారు. వారే మనలను వేఱుచేయుటకై యిటువంటి మోసపుధ్వనులు చేయు చున్నారు. ఇది యాలోచింపక నీవేల దుఃఖపడెదవు.

♦— సీత లక్ష్మణుని నిష్ఠురంబులు పలుకుట ♦—

కం. అని సౌమిత్రి వచించిన, జనకతనూజాత కోప♦సంరక్తవిలో
చనయై పరుసనివాక్యుల, ననియెఁ బుతవాదియైన♦యాలక్ష్మణునిన్. ౭౨

కోపసంరక్త విలోచనయై = కోపముచే నెఱ్ఱనైన కన్నులు గలదై, పరుసని = కఠినపు, ఋతవాది = సత్యము చెప్పువాఁడు.

తా. లక్ష్మణుఁ డిట్లు చెప్పఁగా విని సీత కోపముచే కన్ను లెఱ్ఱచేసి సత్యము చెప్పుచున్న లక్ష్మణుని నిట్లు కఠినముగా మాటలాడెను.

ఉ. ఓరి దయావిహీన! విన♦రోరి నృశంస! యనార్య! వంచకా!
యోరి సువంశపాంసన! గు♦ణోన్నతుఁడౌ రఘురాముచేటు నీ
కారయ సమ్మతం బిది య♦థార్థము సుమ్ము కానిచోటఁ గ
న్నారఁగఁ గీడు గాంచి యిటు♦లాడెదవా చెడుగా దిటంబుగన్. ౭౩

ఓరి = ఇచ్చట నిందయందుఁ బ్రయుక్తము, దయావిహీన = దయ లేనివాఁడా, అన్యులైనను నాపదయందు రక్షించుట దయావంతుల లక్షణము. అట్టితరుల యందు జూపవలసిన దయయు అన్నయందుఁ జూపకున్నావే, నీవేమి మనుష్యుఁడవు. వినరోరి = వినుము + ఓరి = వినరోరి, నృశంస = క్రూరుఁడా, అనార్య = ఆర్య జాతియం దుండవలసిన గొప్ప గుణము లేనివాఁడా, వంచక = మోసగాఁడా, సువంశ పాంసన = మంచివంశమును జెఱుచువాఁడా, గుణోన్నతుఁడు = గుణములచే గొప్పవాఁడు, ఆరయన్ = ఆలోచింపఁగా, చెడుగా = దుష్టుఁడా, దిటంబుగన్ = ధైర్యముతో.

తా. ఓరీ మనుష్యుఁ డగువానికి పరాయివారియం దుండవలసిన దయయు నీ యన్నయందు లేదు. విన రా దయ లేకుండినఁ బోనిమ్మనిన చచ్చినఁ జావనీలే యను క్రూరత్వమును గలదు. దీనివలననే నీవు ఆర్యజాతియందుఁ బుట్టవలసిన వాఁడవు కావు. ఏలన ఆర్యుల కుండవలసిన దయాది గుణములు లేకుండుటయే గాక క్రూరత్వము మోసముకూడ నీయందున్నది. నేనేమి వంచన చేసితి ననె దవా. నీకు సేవ చేసెద నని కూడ నమ్మించి వచ్చి యాపదవేళ కాదుకొనకపోవుట వంచన కాదా. ఇటువంటి గొప్ప వంశమునకు నపకీర్తి తెచ్చి దాని గౌరవము నాశముచేయ నెట్లు పుట్టితివిరా. దుర్మార్గుఁడు చచ్చినఁ జావనీలే యనుటకు రామ చంద్రమూర్తి సద్గుణములచే గొప్పవాఁడు కదా. అట్టివాని కీడు నీకు సమ్మతమై

నవుడు నీ వెట్టివాఁడ వనవలెను? నీవు నిజముగా రామచంద్రుని కీడు గోరువాఁడవే. లేకున్న కన్నారఁగాఁ గీడు వచ్చి యుండుట చూచి యార్తప్రలాపము విని దుష్టుఁడా ధీరుఁడవైన కొంచెమైన సంకోచముగాని యయ్యోపాపమని పరితాపముగాని లేక నేను పోను అని కూడఁ జెప్పుదువా ?

కం. కా దిట్టిది చిత్రము దాయాదులు ప్రచ్ఛన్న వేషు ♦ లై నిత్యంబున్.
లో దయ మాలుచు, నీవలె, నో దుర్మతి కీడు సేయ ♦ నులుకరు వింటే. ౭౨౯

ప్రచ్ఛన్న వేషులై = మాఱు రూపములు ధరించినవారై. దయమాలుచు = దయ వదలిపెట్టుచు, దుర్మతి = చెడు మనస్సు గలవాఁడా, ఉలుకరు = భయపడరు.

తా. నీనడవడియందు వింత యేమియు లేదు. లోకమున జ్ఞాతులు మాఱు వేషములు ధరించి దయవదలి ఎప్పుడు నీవలెఁ గీడుచేయ భయపడరు- వింటివా.

శా. నీవే వచ్చితొ కైకయీతనయుఁడే ♦ నిన్నంపెనో కాని మా
యావేషం బిటు లూని నాకొఱక దు♦ష్టా! యొంటిమై నొంటివాఁ
డౌ వాత్సల్యపయోధి రాముబడి ఘో♦రారణ్యముల్ సొచ్చి దు
ర్భావా వచ్చితి వీవు దోడ్పడఁగ స♦ద్భావంబునన్ వచ్చితే. ౭౩౦

వాత్సల్యపయోధి = దయారసమునకు సముద్రుఁడగు వాఁడు, దుర్భావా = చెడ్డ తలంపు గలవాఁడా, వాత్సల్యము = తల్లిదండ్రులకు బిడ్డలయందుండు ప్రేమకు వాత్సల్య మనిపేరు, దోషముల నెన్నక గుణములనే భావించుట - దోషములున్నను సజ్జనులు దాని గ్రహింపరనికదా రామచంద్రమూర్తి చెప్పెను. రాము బడి = రాము వెంబడి, సద్భావంబునన్ = మంచి యభిప్రాయముతో, రామున కుపకరింప వలెనని వచ్చితివా ?

తా. లక్ష్మణా! నీవు నిజముగా నన్నకుఁ దోడుపడవలయు నని, మంచి యభిప్రాయముతో వచ్చితివా ? లేదు-చెడ్డయభిప్రాయముతోనే వచ్చితివి. ఏమి నా చెడ్డ తలంపు అనెదవా చెప్పెద విను. భరతుఁడు నీవు రామచంద్రమూర్తికి సవతి తల్లి కొడుకులు. ఒక సవతితల్లి కొడుకు రాజ్యము నపహరించిన నీవు నన్నపహరింపవలె నని నీవే స్వయముగ వచ్చితివో లేక రాజ్య మపహరించినట్లె భార్యను అపహరించెదను, నీ విందు సాహాయ్యము చేయు మని భరతుఁడు పంపఁగా నొంటిగా భయంకరములైన యడవులకు వచ్చి రాముని వెంబడి వచ్చితివో-ఆయన నీవు చంపుటకు శక్తిలేని కారణముచే నెప్పుడు చచ్చునా యని కాచియున్నావు.

కం. నీకోరికయో మఱి యా, కైకేయీతనయుతలఁపొ ♦ కడఁ గనునటరా
యాకమలాక్షుని భార్యను, గైకొందునె యొందువానిఁ ♦ గలలో నైనన్. ౭౩౧

కడఁగను నటగా — తుదముట్టునా? కార్యాపేక్షా హి వర్తంతే భావస్నిగ్ధాః సుదుర్లభాః. (భా. 12-111-86)

వారివారి కార్యము నిమిత్తము వర్తించువారే కాని మనస్సున స్నేహము గలవారు మిగుల దుర్లభులు.

తా. ఇది నీయాలోచన గానీ భరతునియాలోచనగానీ ఇది తుదముట్టునది కాదు. ఏల యందువా? ఆపుండరీకాక్షుని భార్యను మఱియొకనిఁ గలలోనైన గ్రహింతురా.

కం. రాముండు లేకయుండిన, నీమేనఁ నిలుపుదాన • నే ప్రాణంబుల్
సౌమిత్రీ! నీవ చూడఁగ, నే మరణించెదను గనుమ • యీనిమిషమునన్. ౨౩_౨

తా. రామచంద్రుఁడే లేకుండెనా ఈ దేహమందుఁ బ్రాణముల నుండనిత్తునా? లక్ష్మణా! నీవు చూచుచుండఁగనే నీ కన్నుల యెదుటనే యీ నిమిషమందే ప్రాణములను విడిచెదను. చూడుము.

సీతాదేవి సాక్షాల్లక్ష్మీదేవి. అంతకుమించిన యుత్తమురాలే లోకమున లేదు. అటువంటిది లక్ష్మణుతత్త్వము తెలిసి తెలిసి యిటు లాడవచ్చునా యని సందేహము. మనుష్యభావనచే గ్రహింపవలసిన దేమన:—ఏ లోకమున నుండి నను ఎటువంటి యుత్తమురాలైనను స్త్రీ స్త్రీయే. ఉత్తమస్త్రీలకు సాధారణ స్త్రీలకుఁ దరతమ భేదమే కాని స్త్రీస్వభావము బొత్తిగ లేని స్త్రీ యుండదు. ఆ యల్పగుణము దాని కనుకూలసమయము తటస్థించినపుడు బయలుపడును గాని పడక పోదు. ఆ సమయము వచ్చునంతవఱకు నందఱు నుత్తమురాండ్రే. అందఱు మహిళలే. వారి కప్రియకార్యము జరుగునేని యందఱు ప్రతీపదర్శినులే. అందఱు వామలే—అను విషయము దీనివలన గ్రహింపఁదగి యున్నది. వారికిఁ గోపము వచ్చినపుడు వారనరానిమాట చేయరానిపని యుండదు. మనుష్యత్వము వారియందే సువాడల నుండదు.

లక్ష్మణుఁడు నిష్కారణముగా భరతుని ననరాని మాట లనెను. కావున నిపుడు నిష్కారణముగాఁ బడరాని మాటలు పడెను.

నిష్పాపుల నన్నదమ్ముల నిరువుర దిట్టుటచే సీతాదేవియు నిట్టి నిందలకే యావజ్జీవము పాలుగావలసి వచ్చెను. వాక్కుచేఁ జేసిన పాపము వాగ్రూపముగ ననుభవించెదము. ఒకని మన మెట్లు చేయుదుమో మన కట్లే కలుగును.

ఇఁక నవతారవిషయమున నాలోచించితిమేని వాస్తవ మేర్పడును. సీత పుట్టినది లంక చెఱుచుటకే. సమూలము రావణుఁ జంపుటకే. 'నీ పీచం బడఁగింతు వెండియును జన్మింతుం జుమీ రావణా' యని కదా వేదవతి చెప్పెను.

ఆకార్యము తాను జేయవలసి యున్నది. ఆ నిమిత్తము లంకకుఁ బోవలసి యున్నది. రామలక్ష్మణులు తనయొద్ద నుండిన యెడల రావణుఁడు రాఁజాలఁడు. కావున మాయామృగము నెపముఁబెట్టి రాముని నయవాక్కులతో దూరము పంపెను. లక్ష్మణుఁ డట్లు పోవువాఁడు కాఁడు. రామాజ్ఞను గూడ నుల్లంఘించి పోవునంత కార్యము చేసినఁగాని యాయన పోఁడు. ఇట్లు నిందలాడినఁ బోవును. అని కార్య సాధనమార్గ మాలోచించి యిట్లు పంపెనుగాని జ్ఞానహీనయై దుష్టురాలై పలికినది గాదు.

ఈ విషయమే కౌసల్యాపరిణయము పీఠికపద్యములం దీ కవియే యిట్లు వ్రాసెను.

చ. తెలివిడొఱంగి నీవు దెగి తిట్టితి వందురు నీ మఱందినిం
దెలియనివారు, రాక్షసతతిన్ వధియింపఁగఁ బ్రాణనాథుఁడుం
బలికిన బాస దీర్ప నటు పన్ని తుపాయము గాక నీకునుం
గలుగు నటమ్మ సీత! యొకకాలమునన్ భ్రమ మానసంబునన్.

— లక్ష్మణుఁడు సీతపై గోపించి రామునొద్దకుఁ బోవుట —

చ. అని వినరాని వాక్కు లిటు లాడిన జానకిఁ జూచి మేనియం
దొనర గగుర్పు రోఁజి కరయుగ్మము మోడ్చి జితేంద్రియుండు ప
ల్కెను బదులాడఁగా మనసు లేదిఁక, దైవత వీవు నాకు, ని
ట్లనుచిత నిష్ఠురోక్తి జనకాత్మజ వింతలు గావు స్త్రీలకున్. ౨౩౩

వినరాని మాటలు = సీతాదేవి మాటలు వినుటకే యోగ్యము కావు. ఇఁక ననుట విషయమై చెప్పనేల? మేనియందున్ = దేహమునందు, గగుర్పు = పులకలు-రోమాంచము, ఒనరన్ = కలుగఁగా, రోఁజి = ఉస్సని బుసగొట్టి, జితేంద్రియుఁడు = ఇంద్రియ జయము గలవాఁడు. ఇట్లనుటచే సీతాదేవి యారోపించిన దోషములు లక్ష్మణునందు లేవని కవి యభిప్రాయము. అనుచిత = తగని, నిష్ఠురోక్తి = పరుషపు మాటలు, అనుచిత నిష్ఠురోక్తి వింతలుగావు స్త్రీలకున్, అనునది సర్వ స్త్రీసామాన్య గుణమని భావము. వారికిఁ గోపము వచ్చినపుడు ఇది యసత్యము, ఇది సత్యమని కాని, యీమాట యనవచ్చును, యీ మాట యనఁగాదనిగాని తెలివి బొత్తిగా నుండదు.

తా. ఈ ప్రకారము వినుటకుఁ గూడ యోగ్యములుగాని మాటలను జానకి పలుకఁగా జితేంద్రియుఁ డగు లక్ష్మణుఁడు దేహమున గగ్గురు పొడువ రోఁజి రెండుచేతులు మోడ్చి నీకు బదులు చెప్పుటకు నాకు మన స్సంగీకరింపలేదు. నీవు నాపాలి దేవతవని నా యభిప్రాయము. యోగ్యాయోగ్య విచారము లేక నోటికి వచ్చినట్లు కఠినముగ మాటలాడుట స్త్రీలయందుఁ గ్రొత్తవిషయము గాదు.

చెడుకార్యమునందైనను మంచికార్యమందైనను వారి యిష్టప్రకారము నడవని పురుషులను నోటికి వచ్చినట్లు తిట్టుదురు. (౨౦౭ ప. చూడు).

చ. ఇది సహజంబు లోకమున ♦ నింతుల కెల్ల, విముక్తధర్మదు
ర్హృదయులు చంచలాత్మికలు ♦ నెంతయుఁ గ్రూరలు భేదకారిణుల్
ముదితలు, కొట్టుగాల్పి చెవి♦లోపలఁ గ్రుచ్చినయట్టు లయ్యెనో
మదవతి నీదుపల్కు రవ♦మాత్రము యేని సహింప నేర్తునే. ౭౩౪

ఇది సహజంబు = స్త్రీల కీదుర్గుణము ఒకరు చెప్పిన వచ్చినది కాదు. నడుమంతరమున వచ్చినది కాదు. పుట్టువుతోడనే దేహము వచ్చినట్లు అది వచ్చినది. విముక్తధర్మ = విడువఁబడిన ధర్మముగల, దుర్హృదయలు = దుష్టహృదయము గలవారు, చంచలాత్మికలు = చపలచిత్తలు–చపల స్వభావము గలవారు, ఎంతయుఁ = మిక్కిలి, క్రూరలు = దయా దాక్షిణ్యములేని కఠినమనస్కలు, భేదకారిణుల్ = విరోధములు కల్పించి భేదభావము కల్పించి యెంతటి మైత్రిగలవారి నయిన వేఱుగఁ జీల్చుటయందు నేర్పరులు, ముదితలు = స్త్రీలు, కొట్టు = ఇనుపకడ్డి, మదవతి = స్త్రీ - మదముగలది.

తా. స్త్రీల కందఱకు లోకమునం దిట్లు పరుషముగా ననుచితభాషణము లాడుట స్వభావము. స్త్రీలు ధర్మజ్ఞానము లేనివారు. కావుననే దుష్టహృదయము గలవారు. దానికితోడు స్థిరబుద్ధి లేనివారు. చపలచిత్తలు. ఎంత క్రూరకార్యమునకైనను వెనుదీయరు. దయా దాక్షిణ్యములు లేవు. అన్నదమ్ములకో తండ్రిబిడ్డలకో, ఒకరితో నొకరు కూడియుండక కొంపలు రెంటుమూఁడుగాఁ జేయు నేర్పు గలవారు. మదించినదానా! నీమాట కొట్టుగాల్చి చెవిలోఁ గ్రుచ్చినట్టు లయ్యెను. దానినే నేమాత్రము సహించువాఁడఁ గాను.

ఆ. సాక్షిభూతు లగుచు ♦ సర్వవనేచరు, ల్వినెడివారు గాక ♦ విశదముగను
న్యాయవాది నగుచు ♦ న్యాయంబుఁ బలికిన, నన్ను నీ వనిన చె♦నంటిపల్కు. ౭౩౫

సర్వవనేచరుల్ = వనమునఁ జరించు దేవత లందఱు, చెనంటి పల్కు = చెడ్డమాట.

తా. న్యాయము చెప్పినవాఁడనై న్యాయమాడుండు నన్ను నీవు పలికిన దుష్టవాక్యములను, ఈ వనదేవత లందఱు విశదముగ సాక్షులై విందురు గాక.

కం. ఛీ పో పాడుగ నీ విపు, డే పాపిష్ఠంబు స్త్రీత్వ ♦ మిల సహజముగాఁ
గోపన గురువాక్యస్థితు, నీ పగిది న్నన్ను సంశ♦యించినకతనన్. ౩౭౬

పాపిష్ఠంబు = మిగుల పాపాత్మకమైనది, కోపన = కోపస్వభావము గల

దానా, 'కోపనా సైవ భామినీ' అమరకోశము. గురువాక్యస్థితుఁ = పెద్దవాఁడగు నన్న చెప్పిన మాటయందు నిలిచిన వానిని.

తా. ఛీ సహజముగా స్త్రీత్వమే పాపాత్మకము. కోపస్వభావము గలదానా! పెద్దవాఁడు తండ్రితో సమానుఁడగు నన్న శాసనమందుండు నన్ను నీవిధముగా సందేహించిన కారణముచే నీవిపుడే పాడైపొమ్ము.

తమకై తన సర్వసౌఖ్యములు విడిచి యడవులపాలై తల్లికిఁ జేయు సేవకంటెఁ దనకు నెక్కుడగ సేవ సేయువానిని నిట్టి నోటఁబట్టరాని మాటలాడిన నెవరి మనస్సు విఱుగకుండును? మరల దాని ముఖమైనఁ జూడ బుద్ధి పుట్టియుండునా? కావుననే తగిన ప్రాయశ్చిత్త మనుభవించువఱకు భగవంతుఁడు ముఖావలోకనమే లేకుండఁ జేసెను. దీనివలన నెంతటి జితేంద్రియులైనను నెంతటి నిష్కాపమనస్కులైనను యౌవనవంతులు వయస్సుస్త్రీతోడ నొంటరిగా నే సమయమందు నుండరాదు. నింద తప్పదు.

కం. పోయెద రామునికడ కిపు, డే యబలా! నీకు స్వస్తి ♦ యొసఁగుత దేవీ
యీ యటవి దేవతావళి, పాయక రక్షించుఁగాక ♦ పద్మాక్షి నినుఁ. ౨౩౭

అబలా — యిచ్చట నఞ్ అల్పార్థమును దెలుపుచున్నది. అల్పబలము కలదని యర్థము. అటవి దేవతావళి = వన దేవతా సమూహము, పాడై పొమ్మనిన వాఁడు. ఇప్పుడు నీకు స్వస్తి యగుఁగాత, వన దేవతలు నిన్ను రక్షింతురుగాక! యని యెట్లనెను. పాడై పొమ్ము అన్న తర్వాత రామస్మరణ లాభించుటచే నయ్యో రామునకు సంబంధించినదానిని రామునకుఁ బ్రియమైనదాని నే నిట్లంటిని. అని స్మృతి తెచ్చుకొని నీ దోషఫలము నీవే యనుభవించెదవు. నే నేల తిట్టవలెనని తలఁచి స్వస్తి యగుఁగాక యనెను. దీనివలన రామునకు సంబంధించిన దానిని దేనినిగాని రామభక్తులు పరుషముగ మాటలాడరాదని యేర్పడుచున్నది. ఇతరులు దూషించిరా దూషింపనిండు. వారి పాపఫలము వారే యనుభవింతురు.

కం. నాకు నిమిత్తము లెంతయుఁ, భీకరమై తోఁచె రామ ♦ వీరునితోనే
నీకడకు వచ్చివై దేహీ! కందునొ కానలేనొ ♦ యిచ్చట నిన్నుఁ. ౨౩౮

నిమిత్తములు = శకునములు, భీకరమై = చెడ్డ సూచించునవి యగుటచే భయము కలిగించునవి, ఇచ్చట = ఈ ప్రదేశమందు, పునర్దర్శనము లంకయందే కదా.

తా. నాకుఁ జెడ్డసూచించు నపశకునము లగుచున్నవి. రామచంద్రునితో నేనిటకు మరలివచ్చి యిచ్చట నిన్నుఁ జూడఁగలనో చూడలేనో.

చ. అనుచు సుమిత్రపట్టి దను ♦ నాడిన జానకి బాష్పపూరముల్
కనుఁగవఁ గాఱ నేడ్చుచును ♦ గర్ణకఠోరముగాఁగఁ బల్కె నేఁ
దినెద విషంబు, గౌతమిని ♦ దీఱెద, నే నురిపోఁతఁ జత్తు, వ
హ్నిని బడుదానఁ, గాక పరు♦నిన్ స్పృశియింతునె కాలివ్రేలనేన్. ౭౩౯

పట్టి = బిడ్డఁడు, కర్ణకఠోరముగాఁగన్ = చెవులవినుటకుఁ బరుషముగా, గౌతమిని = గోదావరియందు, తీఱెదన్ = దూఁకిచచ్చెదను, ఉరిపోఁతన్ = ఉరిపోసికొనుటచే, వహ్నిని = అగ్నియందు.

తా. ఈప్రకారము లక్ష్మణుఁడు పలుకఁగా జానకి కన్నీళ్ళు కార్చుచు నేడ్చుచు కర్ణశూలములవంటి మాటలు పలికెను. నేను విషము దిని చచ్చెదను. గోదావరిలో దూఁకెదను. ఉరిపోసికొందును. మంటలో బడి చత్తునుగానిఁ యితరుని కాలివ్రేలిచేనైనఁ దాఁకుదునా.

ఇచ్చట నగ్నిలో దూఁకెదను. అని చెప్పుటచే యగ్నిలో దాఁగెనని కొందఱొకయుక్తి కల్పింతురు. ఉరిపోఁతచే, విషము దినుటచే, నీళ్ళలో దూఁకుటచే చావకుండెనగదా యావల నగ్నిమాట.

కం. అని పల్కె బిగ్గ నేడ్చుచుఁ, దనయుదరము బాఁదుకొనుచుఁ ♦ దనహస్తములన్
జనకజ యుండిన లక్ష్మణుఁడను నయములుపల్కె మాట ♦ లాడదు సతియున్.

బిగ్గ = గట్టిగా, బాఁదుకొనుచున్ = దబాదబాకొట్టుకొనుచు, అనునయములు — ఓదార్పులు, మాటలాడదు — బదులుచెప్పచుండిన నీ ముచ్చటలతో నాలస్యమైపోవును. ఈలో రాముఁడు వచ్చినా నేనపన్నాగమంతయు వ్యర్థమై పోవును.

తా. అనిచెప్పి గట్టిగా నేడ్చుచు రెండుచేతులతో దబాదబాయని కడుపు మీఁద కొట్టుకొనుచుండెను. లక్ష్మణుఁ డూరార్చినను బదులుచెప్పినదికాదు.

సీతకంటె పెద్దగయ్యాళి లోకమున నెవతెయో, యెంతటిగయ్యాళియైన సీతచేసినదానికంటె నెక్కువ యేమిచేయఁగలదో తెలియ లేదు.

సీత చిలుకవంటిదే కాని రేఁగిన తేఁచుకుక్క యనుసామెత యీనాఁడు పుట్టినదే.

ఈ సీతాలక్ష్మణసంవాద మిచ్చోటఁదప్ప మఱియెచ్చటను రామాయణమునఁ బ్రస్తాపింపఁబడలేదు. దానివలన నిది ప్రక్షిప్తమని కొందఱయభిప్రాయము. భాస్కరరామాయణమున "అన్నా లక్ష్మణ నిన్నుఁ బుణ్యనిధి నే నజ్ఞానినై పల్కితిన్ । నన్నాపాపమువచ్చి చుట్టుకొనియె"నని యేడ్చినట్లు వ్రాయఁబడెనుగాని యది నిరాకరము.

ఒకవిషయము రెండవసారి చెప్పఁబడదేని యది ప్రక్షిప్తమనువాదమే సరి గాదు. కాకాసురవృత్తాంతము రెండవసారి చెప్పఁబడలేదు. సీతాలక్ష్మణ సంవాదము వారి కిరువురకే తెలియును. లక్ష్మణుఁడు చెప్పఁగాఁ గొంచెము రామచంద్రు నకుఁ దెలియును. ఇఁక నిది బైటపడు విధ మెట్లు? నేను లక్ష్మణు నిట్లంటి నని సీత యేమని యెవరితోఁ జెప్పుకొనును ? ఎవరితోఁ జెప్పినను చకారగుడులే యామెకు ప్రాప్తించును. రామలక్ష్మణులు చెప్పెడివారుగారు. ఆ కారణమున రెండవసారి ప్రస్తావింపఁబడలేదు. బ్రహ్మవరముచేతను యోగదృష్టిచేతను నీరహస్యము దెలిసిన వాల్మీకి బయటఁబెట్టెను.

ఈవాదము కారణము గాదేని లక్ష్మణుఁడు సీతను విడిచిపోవలసిన కారణము గలుగదు. లక్ష్మణుఁడు పోకుండిన రావణవధగాని యావల రామాయణచరిత్రము గాని లేదు. వేదవతి వ్యర్థసంకల్పయై యుండును. రావణుఁడు సుఖజీవియగును.

క౦. సౌమిత్రి యంత నించుక, కై మోడ్పున నతియొనర్చి ♦ కదలి పలుమఱున్
భూమిజఁ గనుచుం గుపితుఁడు, దా మది గొల్పకయుఁబోయెఁ ♦ద్వరఁ జనినట్టుల్.

అంతన్ = ఈగయ్యాళితనమునుజూచి స్త్రీలెంతకైన సాహసింతురు. ఇఁక నుండిన నింకేమి చేయునో యని సౌమిత్రియంతటివాఁడు భయపడి, ఇంచుక కై మోడ్పునన్ = కొంచెముసమస్కారముతో, అనఁగా నెప్పటివలె వంగిగాని, ముఖము నెఱకు చేతులెత్తిగాని నమస్కరింపక బొడ్డునఱకే చేతులు రానిచ్చి ఇట్టి యనిష్ట నమస్కారములు చేయువారిని దేవాలయములందు-పెద్దలయొద్దకుఁ బోవువారి యందుఁ గొందఱయందుఁ గానఁగను. లక్ష్మణువిషయమునఁ గోపము కారణము. ఈ పెద్దమనుష్యులయందు నభిమానము కారణము-, కుపితుఁడు = కోపించినవాఁడు. మదిగొల్పకయు = పోవ మనసున నిష్టములేక, పోకున్న వేఱుమార్గములేక. త్వరఁ జనినట్టుల్ = త్వరగాఁబోవువానివలెనే-త్వరగాఁ బోవుటకు కాళ్ళు సాగినవికావు. ఈమె కేమియపాయము వచ్చునో యని భయముచే ప్రయాణము సాగలేదు.

ఇచ్చట నొకసందేహము. శ్రీరామచంద్రమూర్తికి శత్రుభయము లేదని సీతాదేవి ప్రేమాంధయై భర్తృక్షేమము గోరి యజ్ఞానముచేఁ దన్ను దూషించు చున్నదని లక్ష్మణుఁ డెఱుఁగనివాఁడుకాఁడు. సీతకు నపాయము రాఁగలదని భయ మునుగలవాఁడు. ఇట్టివాఁడు పోకయేయుండరాదా? ఒకవేళపోయినను చూపుమేరము నందుఁ బొదలమాటుననుండి కాచియుండరాదా ? పోయినదేపోకగా నేలపోవలెను ? ఈ రెండును సీతాసందేహమును బలపఱచునవే యగును.

పోక నిలిచినాఁడనుకొందము. సీత తానుజెప్పినట్లు చేయునేమో ? ఉరిపోసి కొనియో మఱియొక విధముననో చచ్చె ననుకొందు. అప్పుడు రామునకు లక్ష్మణుఁ

డేమని చెప్పఁగలఁడు? ఉన్నవాస్తవము చెప్పిన సీతకుఁ గలిగిన యనుమానమే రామునకును గలుగును. అటుచేయకయుండదే రామచంద్రమూర్తి వచ్చెననుకొందము. సీత జరిగిన విషయమంతయుఁ జెప్పి నేనెంత చెప్పినను గదలినవాఁడుకాఁడు. ఇతఁడు దురుద్దేశము కలవాఁడని నాకు సందేహముగా నున్నది. కావున వీఁడు మనతోడ నుండరాదని చెప్పునేమో? అప్పుడు రామచంద్రమూర్తి నిరపరాధి లక్ష్మణుని విడువనా? మూర్ఖురాలు సీతను విడువనా? లక్ష్మణుఁడిన్నినాళ్ళు చేసిన కైంకర్యము, ఏటఁబెట్టినశూన్యమగునుకదా. లోకనింద తప్పదుగదా. వీఁడు చెడుకార్యము చేయకుండిన రామచంద్రుఁడు వీనిని బొమ్మనునా యనికదా లోకమనును.

పొదలచాటున డాఁగియుండెనా రామచంద్రుఁడు వచ్చినపుడు లక్ష్మణుని నేను బంపితినే రాలేదా యని సీత యడుగును. రాలేదని రాముఁడు చెప్పును. అప్పుడు జరిగిన వృత్తాంతము చెప్పి, వాఁడు మీయొద్దకు రాలేదు. ఇక్కడ నుండలేదు. నా సందేహ మిది యని చెప్పును. ఇది ఎక్కువ సందేహమునకుఁ గారణమగును. ఇవన్ని యాలోచించియే లక్ష్మణుఁడు ఋజుత్వమే మేలని సరిగా రామునొద్దకే పోయెను.

♦ ౪౬-వ సర్గము. రావణుఁడు యతివేషము ధరించుట. ♦

సీ. అదె సందుగాఁ గొని ♦ పదిశిరంబులవాఁడు, డాసీత డాయంగ ♦ సమయ మెంచి
సన్న్యాసి వేషంబు ♦ సరగున ధరియించి, శ్లక్ష్ణకాషాయవ ♦ స్త్రంబు గట్టి
వామభుజంబున ♦ వెదుల యష్టి కమండ, లువులు ఛత్రము శి ♦ ఖలును వహించి
పానలు దొడిగి యా ♦ పద్మాక్షి సోదరు, ల్విడిచి పోవఁగ రవి ♦ విధులు లేసి

తే. సంధ్యవలె మెడి యిరులన ♦ శశివిహీన, రోహిణిని డాయు గ్రహమన ♦ గ్రూరబుద్ధిఁ
గదిసె నాతని రాకకు ♦ ధాత్రీరుహములు, కదలవయ్యె సమీరంబు ♦ మెదలదయ్యె.

ఇఁక రామభక్తుని దూషించిన ఫలము చెప్పుచున్నాఁడు. సోకుఁడు = రాక్షసుఁడు, శ్లక్ష్ణ = సన్నని, యష్టి = త్రిదండము, శిఖ చెప్పుటవలన త్రిదండి యనియే చెప్పవలెను. పానలు = పాదుకలు, రవివిధులు = సూర్యచంద్రులు, ఇరులు = చీకట్లు, ఇది నిత్యబహువచనాంతము. 'కురులు' అనునది యిట్టిదే. శశివిహీన = చంద్రుని విడిచియుండు, గ్రహము = రాహువు, సమీరంబు = గాలి, ఇచ్చట రావణుఁడు ధరించిన సన్న్యాసివేషము వర్ణింపఁబడినది. ధర్మప్రధాన = జనకవంశమున జనించినదికదా సీత. జనకునియొద్దకు వచ్చు సన్న్యాసుల వేషములు ఆచారములు అందుఁ దారతమ్యములు సీతకుఁ దెలిసినవే. అట్టియామెను మోసగింపవలయు ననిన నుత్తమ వాస్తవ సన్న్యాసివేషమునే వేయవలయును. లేనియెడల వాస్తవ సన్న్యాసిగాఁడని నమ్మదు. కావున కాషాయవస్త్రము కట్టి, యెడమభుజముమీఁద త్రిదండము మోపి, కమండలువు, గొడుగు, శిఖ ధరించి పాదుకలు దొడిగికొని,

రావణుఁడు సీతయొద్దకుఁ బోయెను.

ఇదియే సరియైన సన్న్యాసివేష మని యంగిరసుఁడు చెప్పెను.

యతే ర్లింగం ప్రవక్ష్యామి యేనాసౌ లక్ష్యతే యతిః
బ్రహ్మసూత్రం త్రిదండంచ, వస్త్రం జంతునివారణం
శిక్యం పాత్రం బృసీంచైవ కౌపీనం కటివేష్టనమ్
యస్యైతాని ద్విద్యతే లింగం స యతి ర్నేతరో యతిః॥

ఏమి యుండిన యతి యనఁబడునో యాయతి చిహ్నములు చెప్పెదను. యజ్ఞోపవీతము, త్రిదండము, వస్త్రము, చిక్కము, కమండలువు, బృసి, కౌపీనము, నడుముగుడ్డ, ఇవిగలవాఁడే యతి. ఇవి లేనివాఁడు యతి కాఁడు. నసేంశ్వరతీరీయ మందును, రావణుఁడు త్రిదండి వేషమే వేసెననియున్నది.

అథాశ్రమం చరమం సంప్రవిశ్య యజ్ఞోపవీతిం, పంచసూత్రాం సధాన్యః। త్రిదండ ముపవీతం చ వాసః కౌపీన వేష్టనం॥ శిక్యం పవిత్ర మిత్యేత ద్బిభృయాద్యావ దాయుషం।పంచైతా స్తుయతే ర్మాత్రాస్సూత్రా బ్రహ్మణేశ్రుతాః॥త్రిదండం వైష్ణవం లింగం విప్రాణాం ముక్తిసాధనం నిర్వాణం సర్వధర్మాణా మితి వేదానుశాసనమ్॥

గీసినలన సన్న్యాసులై ముక్తికాంక్షగల విప్రులు త్రిదండిసన్న్యాసులు విష్ణుచిహ్నధారులు కావలయునని యేర్పడుచున్నది. ఈ చిహ్నములన్నియు నిందుఁ జెప్పఁబడకపోయినను సన్న్యాసి యని చెప్పుటచేతను శిఖాదులు చెప్పుటచేతను సన్న్యాసికుండవలసినవన్నియు రావణుఁడు ధరించెనని యూహింపవలెను.

బ్రాహ్మణానా మయం ధర్మో యద్విష్ణో ర్లింగధారణమ్॥ విష్ణుచిహ్నములు ధరించుట బ్రాహ్మణధర్మము—బోధాయనుఁడు. ఏకవాసా ద్వివాసావా శిఖీ యజ్ఞోపవీతవాన్। కమండలుకరో విద్వా న్యాతి తత్పరమం పదమ్॥ వ్యాసులు. మౌనవన్స్త్రయోదండా స్త్వన దేకేన పర్యసేత్॥ మేధాతిథి. ఏకంతు వైణవం దండం పాలాశం బైల్వమేవవా। గృహీత్వా విచరే ద్వావ ద్వ్యావల్లభ్యే త్త్రిదండకమ్॥

ఇత్యాదివాక్యములు పెక్కులు గలవు. పైవాక్యముల నాగాంశ మేమన త్రిదండి సన్న్యాసము సామ్యము, వైష్ణవమనియు, నదియే ముక్తిప్రదమనియు త్రిదండ ధారణశక్తి గలుగునటు ఏకదండిగా నుండవలయుననియు—వైష్ణవసన్న్యాసులు మూఁడుదండముల నొకటిగాఁగట్టి ధరింతురు. దానియర్థము చిత్తు, అచిత్తు, ఈశ్వరుఁడు మూఁడుభిన్నములయినను శరీర శరీరి భావముచే నొకటియే, యని సూచించు నందురు. దీనికి మనుస్మృతియం దిట్లు లర్థము వ్రాయఁబడినది.

వాగ్దండశ్చ మనోదండః కాయదండ స్తథైవచ
యస్యైతే నిహితా బుద్ధౌ స త్రిదండీతి చోచ్యతే

దండమనఁగా దమనము అణఁచుట. వాక్కును మనస్సును కాయమును యీ మూఁటిని నణఁచుట త్రిదండమనఁబడును.

వాగ్దండో మౌనతా ప్రోక్తా కర్మదండ స్త్వనీహతా
మానసస్య తు దండస్య, ప్రాణాయామో విధీయతే.

మౌనము వాగ్దండము, కర్మదండము — కోరికలు లేకుండుట, ప్రాణాయామము మనోదండము. పరమహంస యుత్తమసన్న్యాసి. ఈయనకు జ్ఞానము లక్షణము. జ్ఞాని యగు సన్న్యాసికి "స దండం నశిఖాం నాచ్ఛాదనం చరతి పరమహంస॥ మహోపని షత్ —యథా జాతరూపధరో౽నాచ్ఛాదనం చరతి పరమహంసః॥ దండముగాని శిఖ గాని, వస్త్రముగాని పరమహంసకు పనిలేదు. అట్టి జ్ఞానము లేనివాఁ డేక దండము ధరింపవలెను. 'సాప్య విదుషః' నిర్ణయసింధువు-వాఁడు తెలిసినవాఁడు కాఁడు. త్రిదండ ధారణము పరమహంసకుఁ గలదు. 'యతిః పరమహంసస్తు తుర్యాఖ్యః శ్రుతిచోదితః యమైశ్చ నియమైర్యుక్తో విష్ణురూపీ త్రిదండభృత్ —పితామహస్మృతి. పరమహంస సన్న్యాసి తురీయుఁడు, వీఁడార్తప్రపన్నునివంటివాఁడు.

స్వసంప్రదాయాగ్రహపిశాచమును బాఱఁద్రోలి శ్రుతులవాక్యములు స్మృతి వాక్యములు శోధించినచో నీకాలమున సన్న్యాసమే నిషిద్ధమగుచున్నది. అధికారి దుర్లభుఁడు.

అశ్వాలంభం గవాలంభం సన్న్యాసం పలపైతృకమ్। దేవరాచ్చసుతోత్పత్తిఃకలౌ పంచ వివర్జయేత్.—పరాశరుఁడు. అశ్వమేధము, గోమేధము, సన్న్యాసము, మాంస శ్రాద్ధము, దేవరనియోగము ఈయైదు కలియుగమందు నిషిద్ధము. అశ్వాలంభమను చోటను అగ్నిహోత్ర మనునది పాఠాంతరము కానవచ్చెడిని.

యావద్వర్ణ విభాగో౽స్తి యావద్వేదః ప్రవర్తతే
సన్న్యాసంచాగ్నిహోత్రం చ తావత్కుర్యా త్కలౌయుగే.

వర్ణభాగము చక్కఁగా నుండువఱకు వేదప్రవర్తన ముండువరకు సన్న్యాసము అగ్నిహోత్రము కలియుగమందుఁ గలవు. ఈ కాలమున వాస్తవ వైరాగ్యము కల వాఁడు ప్రాణోత్క్రమణ సమయంబున నాతురసన్న్యాసముగ సన్న్యసించితినని చెప్పుట యొప్పునని తోఁచుచున్నది. ఇట్టివానికిఁ బ్రేతత్వము లేదు.

దీని కపవాదము :—

చత్వార్యబ్ద సహస్రాణి చత్వార్యబ్ద శతానిచ
కలేర్యదా గమిష్యంతి, తదా త్రేతా పరిగ్రహః ॥

సన్న్యాసశ్చ నకర్తవ్యో బ్రాహ్మణేన విజానతా॥ వ్యాసులు - కలియుగమందు నాలుగువేల నాలుగువందల సంవత్సరములు దాటిన తరువాత త్రేతాగ్ని పరిగ్రహము, సన్న్యాసము తెలివిగల బ్రాహ్మణుడు పరిగ్రహింపరాదు.

ఊర్ధ్వపుండ్రాదులవలెఁ త్రిదండము స్వకృత్యము జ్ఞప్తికిఁ దెచ్చుచుండును. త్రికరణములను జయించువఱకుఁ దొలుత శరీరమునైన నిగ్రహింపవలెను. ఇది దండధారణోద్దేశము. స్వమతాగ్రహము లెచ్చగుటచే వీనికి భిన్నార్థములు కల్పితములయినవి.

ఏకదండం సమాశ్రిత్య, జీవంతి బహవో నరాః।
నరకే రౌరవే ఘోరే, కర్మత్యాగా త్పతంతి తే.

ఏకదండము ధరించి యనేకులు జీవించుచున్నారు. కర్మత్యాగమువలన వీరు ఘోర రౌరవ నరకంబునఁ బడుదురు. రావణాసురునివలెఁ బరుల మోసపుచ్చుటకై ధరించినవాఁడు సన్న్యాసి కాఁడు.

వీఁడు నిజమైన సన్న్యాసి, సౌమ్యుఁడు, విష్ణుభక్తిపరుఁడు, వాఙ్మనః కాయముల నియమించినవాఁడు, నిషిద్ధకార్యప్రవర్తనము లేనివాఁడని నమ్మించుటకుఁగాను రావణుఁ డిట్టి వేషము వేసెను.

సన్న్యాసులు సన్న్యాసము తీసికొనుచు సర్వము వదలి జలాంజలి యిచ్చి యిట్లు చెప్పెదరు.

దత్వా తోయాంజలిం విప్రో, భక్త్యా సంప్రార్థయే ద్ధరిమ్।
సర్వదేవాత్మకే తోయే, తోయాహుతి మహం హరే।
దత్వా సర్వేషణా స్త్యక్త్వా, యుష్మచ్చరణ మాగతః।
త్రాహి మాం సర్వలోకేశ, గతి రన్యా నవిద్యతే।
సన్న్యస్తం మే జగన్నాథ, పాహిమాం మధుసూదన।
త్రాహిమాం సర్వ సర్వేశ, వాసుదేవ సనాతన ।
సన్న్యస్తం మే జగద్యోనే, పుండరీకాక్ష మోక్షద।
అహం సర్వాభయం దత్వా,భూతానాం పరమేశ్వర।
యుష్మచ్చరణ మాపన్న, స్త్రాహి మాం పురుషోత్తమ॥　　యమః.

బ్రాహ్మణుఁడు జలాంజలి యిచ్చి సర్వదేవాత్మకమైన జలమందు హరిని భక్తితోఁ బ్రార్థింపవలయును. హరీ నేను జలాహుతి నిచ్చి దారేషణ, ధనేషణ, పుత్రేషణముల వదలి నీచరణము పొందితిని. సర్వలోకేశ నన్ను రక్షింపుము. వేఱు గతి లేదు. జగన్నాథ మధుసూదన సన్న్యసించితిని. సర్వేశ వాసుదేవ సనా

తన నన్ను రక్షింపుము. జగత్కారణా పుండరీకాక్ష మోక్షదా నేను సన్న్యసించి పరమేశ్వర సర్వభూతములకు నభయ మిచ్చి నీచరణములను జేరితిని. పురుషోత్తమా నన్ను రక్షింపుము.

ప్రపన్నుల శరణాగతికిని దీనికిని భేదము గలదేమో పరిశీలింపుడు. స్మృతులు ప్రమాణములైనచో నాలుగువేల నాలుగువందల సంవత్సరములు దాటిన యీ కలియుగమున నెట్టి సన్న్యాసమైన నిషిద్ధమే యని యీవ్యాఖ్యాత యభిప్రాయము. నిషేధ వాక్యములు ఏకదండివిషయ మని నిర్ణయసింధుకారుడు వ్రాయుటయు కమండలుధారణ మనగా, ఓంకారాయుచిప్పలు గోరకాయ లర్థమని వైష్ణవగ్రంథమం దుండుటయు స్వమతాభినివేశముచే నని తోచుచున్నది. శాస్త్రీయపరమహంసలు మహనసునిన్నునందే కాని యీ దేశమున దుర్లభులు.

తా. లక్ష్మణుడు దూరముగ దలిపోగా సమకాశము గోరకే నని రావణుడు సీతను సమీపింపదలచి సన్న్యాసివేషంబు వేసికొని సన్న కాషాయవస్త్రము కట్టుకొని యెడమభుజముమీదుగ త్రిదండము బూని, చేత కమండలువు, గొడుగు పట్టుకొని శిఖ గలవాడై పాపుకోళ్ళు తొడిగికొని యన్నదమ్ము లిద్దఱు విడిచి పోవుటచే సూర్యచంద్రులు లేని సంధ్య నాక్రమించు చీకటివలె చంద్రుడు లేని రోహిణిని శని అంగారకుడు డాసినట్లు సీతయొద్దకు బోయెను. వానికి భయ పడి చెట్లయాకులు కదల నయ్యెను. గాలి వీవ లేదయ్యెను. సంధ్యను సీతతో నుపమించుటచే నిక కొంతకాలమువఱకు సీతాదేవి సంధ్యానామక్రియలు లోక మునకు గానరాక మఱుగుపడి యుండుననియు, చీకటితో రావణుడు బోల్చుటచే గొంతకాలము వాని యుద్ధతి విజృంభించి క్రమముగా రూపుమాసి పోవుననియు నెఱుగనగు.

రోహిణీనక్షత్రమునకు గ్రూరగ్రహపీడనము లోకోపద్రవకారణము. అట్లులే రావణుడు సీతాదేవిని జూచుటయు మహానర్థకర మని భావము.

కం. వావిరి త్వరగ బాతెడిగో,దావరి మెలమెల్ల నడిచె దద్దయు భీతిన్
రావణు డభవ్యుడిటు స,ద్భావపు రూపము దృణావృతము కూపమునన్. ౪౭౩

వావిరి = క్రమముగ, నిలువక యెప్పుడు పాఱునది, లేక వావిరి త్వరన్ = అధిక వేగమున, అభవ్యుడు = దుర్జనుడు, సద్భావపురూపము = సాధువేషము, తృణావృతము = గడ్డిచే గప్పబడినది, కూపము = బావి.

తా. మిగుల వేగముగా బాఱు గోదావరి వానిభయముచే మెల్ల మెల్లగా నడిచెను. దుష్టుడగు రావణుడు గడ్డిచే గప్పబడిన బావివలె సాధురూపము

ఉ. తాలిచి ప్రాణవల్లభుఁడు ♦ దవ్వుగఁ బోవుటకై తపించు న
బ్బాలను నూత్న చంద్రనిభ♦భాలను పార్వణశీతభానన౯
నీలసరోజలోచన వి♦నిర్మలపీతదుకూలఁ గాంచి దు
శ్శీలుఁడు కాలుసోదరుఁడు ♦ చిత్రను జేరెడి మాడ్కిఁ డాపఁగన్. ౭౪౪

ప్రాణవల్లభుఁడు = మగఁడు, నూత్నచంద్రనిభ భాలను = క్రొత్త చంద్రునితో సమానమైన నొసలుగలదానిని, 'భవే త్పాలంచ భాలంచ ఫలితం ఫాలితం తథా' యని శ్రీహర్షుని ద్విరూపకోశము. పార్వణశీతభానన౯ = పున్నమనాఁటి చంద్రుని వంటి ముఖముగలదానిని.

నీలసరజలోచన = నల్లని కలువవంటి నేత్రములు గల దానిని, వినిర్మలపీత దుకూల౯ = మిగుల శుద్ధమైన పచ్చని పట్టువస్త్రము కలదానిని, దుశ్శీలుఁడు = పాపస్వభావముగలవాఁడు, కాలుసోదరుఁడు - శని, యమునితోఁబుట్టువు-యముఁడు, శని - సూర్యపుత్రులు, చిత్రను = చిత్తా నక్షత్రమును.

తా. ధరించి తనమగఁడు దూరము పోవునని సంతాపపడుచున్న యాబాలను క్రొత్తచంద్రునివంటి నుదురు, పున్నమచందమామంబోలు నెమ్మోము, నల్లకలువలవంటి కన్నులు గల దానిని, మురికిలేని పచ్చని పట్టువస్త్రము ధరించిన దానిని దుష్ట స్వభావము గల రావణుఁడు శని చిత్తా నక్షత్రము సమీపించునట్లు.

ఆ. పద్మహీన యైన♦పద్మను బోలుచు, మేనికాంతి దెసల ♦ మెఱుఁగు వెట్ట
నాశ్రమాంతరమున ♦ నాసీన యైయున్న, యొంటిదానిఁ జంచ♦లోపమాంగి.

పద్మను = లక్ష్మీదేవిని, ఆశ్రమాంతరమున౯ = ఆశ్రమములోపల, చంచ లోపమాంగి = మెఱుపుతో సమానమైన దేహముగలదానిని.

తా. చేతఁ గమలము లేని లక్ష్మీదేవివలెనై దేహకాంతి దిక్కులకు మఱింత కాంతిని గలిగింపఁగా నాశ్రమములోపలనున్న మెఱుపుతీఁగతో సమానమైన దేహ కాంతిగలదానిని.

—♦ రావణుఁడు యతివేషంబున సీతయొద్దకు వచ్చుట. ♦—

కం. పంచశరశరావిష్టుఁడు, వంచనమెయి రావణుండు ♦ బ్రహ్మరవంబు౯
నించుచుఁ జేరంజని యా,చంచలలోచనకు వినయ♦సంగతిఁ బలికెన్. ౭౪౬

పంచశరశరావిష్టుఁడు = మన్మథబాణములచే నావేశింపఁబడినవాఁడు. ఇది రావణుఁడు కాముకుఁడయియే సీతయొద్దకుఁ బోయెనని వాల్మీకియభిప్రాయము. రహస్యమెఱిఁగిన వాల్మీకియే రావణుఁడు దుష్టుఁడని కాముకుఁడై సతిను సమీ పించె నని చెప్పఁగుండ నితరులు వాఁడు భక్తిచేఁ బోయె ననుట, వాస్తవవిరుద్ధము

గద్య. వంచనమెయిన్ = మోసముతో, బ్రహ్మరవంబున్ = వేదఘోషమును, ఉపనిషద మంత్ర యుక్తమైన శాస్త్రము. చంచలలోచనకున్ = కదలుచున్న కన్నులుగల దానికి, వినయసంగతిన్ = వినయముతోఁగూడినట్లు.

తా. ఆ వేశించిన కామము గలవాఁడై మోసబుద్ధితో వేదఘోషముచేయుచు దగ్గఱకుఁబోయి సవినయముగా నామెతో నిట్లనియె.

కం. రమణీ పీతసువాసిని, రమణీయ సువర్ణవర్ణ ♦ రాజనిభాస్యా
కమల సుదామాలంకృతి, కమలినివలెఁ వెలిఁగెదవు ♦ కలికి యెవతవే. ౨౪౭

పీతసువాసిని = పచ్చనిచీర గట్టినదానా! రమణీయ = అందమైన, సువర్ణవర్ణ బంగారువంటి దేహకాంతి గలదానా! రాజనిభాస్యా = చంద్రునితో సమానమైన ముఖముగలదానా! కమలసుదామాలంకృత = కమలములచేఁ గూర్పఁబడిన హారముచే నలంకరింపఁబడిన, కమలినివలెన్ = తామరతీఁగవలె, తామరతీఁగయందు దామరపూవులున్నట్లు నీయందు ముఖకమలము, నేత్రకమలములు, హస్తకమలములు, పాదకమలములు గలవు గావున, నీవు తామర తీఁగవలె నున్నదని భావము. కలికి = సుందరీ!

తా. మనోహరమైనదానా! పచ్చనివస్త్రము ధరించినదానా! అందమైన బంగారువన్నె గలదానా! చంద్రునివంటి ముఖము గలదానా! కమలములతోఁగూడిన తామరతీఁగవలె నున్నదానా! సుందరీ! నీ వెవతెవు? ఈ ప్రశ్నలు సల్లాపార్థమే కాని తెలియక కాదు.

కం. ధరణివో కీర్తివొ వెన్నుని, తరుణివొ స్వైరచరి పుష్ప♦ధన్వునిసతివో
హారిణీ సురరమణివో యో, కరిణీగమనా వచింపు ♦ కలరూపంబున్. ౨౪౮

ధరణివో = భూదేవతవా, వెన్నునితరుణివో = లక్ష్మీదేవివా, విష్ణుశబ్దభవము వెన్నుఁడు, స్వైరచరి = ఇష్టానుసారము తిరుగు, పుష్పధన్వునిసతివో = రతీదేవివా, హారిణీ = చూచువారి మనస్సు హరించుదానా. సురరమణివో = దేవతాస్త్రీవో, కరిణీగమనా = ఆఁడేనుఁగువంటి నడకగలదానా, కలరూపంబు = వాస్తవమును.

తా. నీవు భూదేవతవా? కీర్తివా? లక్ష్మీదేవివా? స్వాతంత్రించి తిరుగు రతీదేవివా? దేవతాస్త్రీవా? ఆఁడేనుఁగువంటి నడకగలదానా! నామనస్సు హరించుచున్నదానవు. నీ వెవతెవు? వాస్తవము చెప్పుము.

సీ. నీరదంబులు శుచి♦స్నిగ్ధముల్ సమములు, కుట్మలశిఖరులే ♦ కుందరదన
నేత్రముల్ రక్తాంత♦నిర్మలదీర్ఘముల్, నీలతారములె వి♦శాలనయన

చారుపీనంబు విశాలంబు జఘనంబు, కరికరాకారముల్ కలికి తొడలు
మిట్టలు వట్రువల్ మిగులసంహతములు, సంప్రవల్గితములే స్తనము లబల

తే. తాళఫలసభములును గాంతములు పీన
రోర్ధ్వముఖములు స్నిగ్ధముల్ యువతి నీదు
విరివిచనుదోయి రత్నప్రవేకభూష
ణాంచితమ్ము దిదృక్షుహృద్వంచకమ్ము. ౪౭౯

రదంబులు = దంతములు, శుచిస్నిగ్ధముల్ = నిర్మలములు, నునుపులు, కుట్మల శిఖరులే = మొగ్గలవంటికొనలుగలవి, కుందరదన = మొల్లలవంటి దంతములు గలదానా, రక్తాంతనిర్మలదీర్ఘముల్ = కొనలయందెఱుపుగలిగి నిర్మలములై నిడివి యైనవి, నీలతారములు = నల్లనిగ్రుడ్లుకలవి, విశాలనయన = వెడలుపాటి కన్నులుగలదానా! చారుపీనంబు = మనోహరమై బలిసినది, విశాలంబు = విరివిగలది, జఘనంబు = (i) మొల, (ii) మడికట్టు; కరికరాకారముల్ = ఏనుగుతొండములవంటి యాకారములుగలవి, కలికి = ఒప్పిదమైనదానా. 'కలికియొప్పిదంబు కాంతయు న్యా' మిట్టలు = పైకుబ్బియుండునవి. వట్రువల్ = గుండ్రముములైనవి. మిగులసంహతములు = మిక్కిలికదిసియుండునవి, సంప్రవల్గితములు = పెద్దవిగను నున్నతములుగను నుండుటచే కదలుచున్నవానివలె నుండునవి, స్తనములు = చన్నులు, తాళఫలనిభ ములును = తాటిపండుతో సమానమైనవి, కాంతములు = మనోహరములయినవి, పీనరోర్ధ్వముఖములును = ఒకచోట సన్నము ఒకచోట లావు లేక అంతట బలసిన వైనను, వ్రేలబడక పైకెగసియుండునవి, స్నిగ్ధముల్ = బిగుసు లేక నునుపుగలవి, యువతీ = ప్రాయపుదానా, విరివి = వెడలుపగు, రత్నప్రవేకభూషణాంచితమ్ము = శ్రేష్ఠరత్నముల సొమ్ములచేఁ బ్రకాశించునది. దిదృక్షు = చూచువారి. హృత్ = హృదయమును, వంచకమ్ము = మోసగించునది.

తా. మొల్లమొగ్గలవంటి దంతములుగలదానా! నీదంతములు నిర్మలములు, నునుపులు, సమములు, మొగ్గలవంటి కొనలు గలవి. వెడలుపుకన్నులు గలదానా! నీకన్నులు కడకొలుకులందు నెఱ్ఱనయై నిర్మలములై దీర్ఘములై నల్లనిగ్రుడ్లుగలవి. నీమొల యందముగాబలిసి విశాలమైయున్నది. నీతొడలు ఏనుగుతొండములవలె నున్నవి (చీరెలోపలనుండునవి యెట్లుండినవి నీవికెట్లు తెలిసెను? ఇది తన కామో ద్రేకముఁ దెలుపఁ జెప్పెడుమాటయే) అబలా! నీస్తనము లుబ్బి గుండ్రమై గుంతలు మిట్టలు లేక యంతయు నేకవిధముగనై యొకదానినొకటి యొఱసికొనుచు తాటి పండ్లనుబోలి మనోహరములై బలిసియు వ్రేలపడక మీఁదిచూపుగలవై నునుపులై విరువులై శ్రేష్ఠరత్నభూషణములచేఁ బ్రకాశించుచు చూచువారి హృదయ

మును వంచించి హరించుచున్నవి. ఇవి సీతయందుఁ మాతృభక్తి గలవాఁడు జెప్పెడు మాటలా?

కం. చారుస్మిత చారుదతీ, చారువిలోచన విలాస♦సాగర సుకచా
  హారికరాంతమితవల, గ్నా రమణీ సంహతోరు ♦ కఠినకుచాఢ్యా. ౨౦

చారుస్మిత = మనోహరమైన చిఱునవ్వు గలదానా, చారుదతీ = మనోహర దంతములు గలదానా, చారువిలోచన = మనోహరములైన నేత్రములు గలదానా, చారుస్మితదంతలోచనయసి యొక విశేషణముతోనే చెప్పియుండవచ్చును. ప్రత్యేకముగ చారుచారు అని చెప్పుట కామోద్రేకముచేతనే. ఒక్కొక్క యవయవము వానిని కామదాసుని జేసినని తెలుపుటకే. ఛందోవద్భావేన ఛందసీచేతి సూత్రేణ సమాసాంతో దంతస్య దత్రాదేశోవా యని చారుదతి యను రూపమును సమర్థించినారు. దానిని సందేహించువారు చారురద యని పాఠాంతరము గ్రహింపవచ్చును. విలాససాగర = శృంగారచేష్టలకు సముద్రమా, సుకచా = మంచి నల్లని వెండ్రుకలు గలదానా, హారికరాంతమితవలగ్నా = మనోహరమై పిడికిటిచేఁ గొలువఁదగిన నడుము గలదానా.

తా. అందమైన చిఱునవ్వు, అందమైన దంతములు, అందమైన నేత్రములు, అందములైన వెండ్రుకలు గలదానా! శృంగారచేష్టలకు సముద్రమైనదానా! పిడికిట నడఁగు నడుము గలదానా! హృదయమును కంపైనదానా! ఒండొంటినొఱయు తొడలు గలదానా! కఠినములైన కుచములు గలదానా! చెప్పిన తొడలను, స్తనములను మరలఁ జెప్పుట కామోద్రేకమున నని తెలంపవలయు.

కం. వారక శైవలినీవాః, పూరము తీరంబుఁబోలెఁ ♦ బాలఁతుక నీవు౯
  సారెకు నామనమును సరసీరుహాలోచన హరించి ♦ చెలఁగెదు గదవే. ౨౧

శైవలినీ = ఏటియొక్క, వాఃపూరము = జలప్రవాహము, తీరంబు౯ = ఒడ్డును, పాలఁతుక = చిన్నదానా, సరసీరుహాలోచన = కమలములవంటి కన్నులు గలదానా.

తా. ఏటిప్రవాహము అడ్డములేక తీరమును గోసి లోపలికిఁ దీసికొనినట్లు కమలములవంటి కన్నులుగల చిన్నదానా! నీ చూపులచేత నామనస్సును గరగించి హరించితివిగదా.

ఉ. చూచితి దేవకాంతలను ♦ జూచితి యక్షసరోరుహాక్షుల౯
  జూచితిఁ గిన్నరీమణులఁ ♦ జూడ్కికిఁ బండువుసేయువారల౯;
  జూచి యెఱుంగ నోసుదతి ♦ సుందరతావిభవంబున౯ మృగీ
  లోచన నిన్నుఁబోలు నొక ♦ లోలవిలోచన భూతలంబున౯. ౨౨

సుందరతావిభవంబునన్ =, సౌందర్యసంపదచే, మృగలోచన = ఆడుజింక కన్నులవంటి కన్నులుగలదానా, లోలవిలోచన = చలించుకన్నులుగలస్త్రీని.

తా. నేను దేవతాస్త్రీలను, యక్షస్త్రీలను, కిన్నరస్త్రీలను, కన్నులకు సంతోషము గలిగించువారి నెందఱరో చూచితినిగాని సౌందర్యసంపదయందు నీవంటి దానిని భూలోకమునం జూడలేదు.

కం. ఓకోమలి నీప్రాయము, నీకోమలతావిభూతి ♦ నీరూపం బా
లోకింప నిచట నడవిని, నేకాంతం బుంట వెఱ్ఱి♦యెత్తెడి నాకున్. ౨౩

నీప్రాయము = నీవయస్సు, కోమలతావిభూతి = సౌకుమార్యసంపద, నీరూపంబు, నీసౌందర్యము, ఆలోకింపన్ = చూడఁగా, ఏకాంతము = ఒంటరిగా, వెఱ్ఱియెత్తెడిన్ = (1) నీవయస్సు నీసొగసు నీసౌకుమార్యము లోనైన వెక్కుడు ? ఈవనవాస మెక్కడనని నిశ్చయింపలేకున్నాను. (2) నిన్నుఁజూచుకొలఁది కామోన్మాదము ప్రబలసాగుచున్నది.

తా. సుందరీ! నీవయస్సు నీసౌకుమార్యము నీచక్కఁదనము ఆలోచింపఁగా నీవొంటరిగానుండి యీయడవియందుండుటచే నాకు వెఱ్ఱిపట్టుచున్నది.

ఉ. పొమ్ము లతాంగి యింటికిని ♦ భూరిభయంకర కామరూపులై
త్రిమ్మరుయామినీచరు ♦ లీయెడ యిందుఁ జరింత్రు గాన నీ
విమ్మెయి నొంటి నుండఁ దగ♦దే తగ వేచను రమ్యహేమసౌ
ధమ్ముల నిష్కుటాళి నుచి♦తం బగు నీకు నలంకరింపఁగన్. ౨౪

భూరిభయంకర = మిగులభయము గలిగించువారయి, కామరూపులై = కోరినరూపము ధరింపఁగలవారై, యామినీచరులు = రాక్షసులు. (రేద్రిమ్మరులు) రమ్య = మనోహరములైన, హేమసౌధమ్ముల = బంగారుమేడలను, నిష్కుటాళిన్ = ఉద్యానవనములను.

తా. లతాంగి! నీవింటికిఁబొమ్ము. మిగుల భయంకరులై కోరినరూపముల ధరించి తిరుగు రాక్షసులు సర్వదా యిందుఁ దిరుగుచుండుదురు. కావున నీ విట్లు లొంటరిగానుండరాదు. నీకుఁదగినవగు నగ త్వరగాఁబోయి బంగారు మేడలను,ఉద్యాన వనములను, అలంకరింపఁబొమ్ము. నీవు వాసియుందుంటయే వాని కలంకారము.

కం. వరమాల్యము వరభోజ్యము, వరవస్త్రము వరవరుండు ♦ వర మగు నీకున్
వరమేచకలోచన నా,పరమాభిప్రాయ మిదియ ♦ పంకజనేత్రా. ౨౫

వరమాల్యము = శ్రేష్ఠమైనపూలదండలు, వరభోజ్యము = శ్రేష్ఠమై యింపైన భోజనము, వరవస్త్రము = శ్రేష్ఠమై యమూల్యమైనచీరలు, వరవరుండు =

శ్రేష్ఠుఁడై నీ వయస్సునకుఁదగిన వయస్సు గలవాఁడై, నీయోగ్యతకుఁ దగినట్టి భోగము లమర్పఁగల మగఁడు, వరము = ఇంపు, వరమేచకలోచన = ఇంపైన నల్లని కన్నులు గలదానా, కాటుక పెట్టుకొనకున్నను, కాటుక పెట్టుకొనునట్లుండు కన్నులు-పరమాభిప్రాయము = వాస్తవమైన యుక్తమాభిప్రాయము.

తా. కమలములవంటి కన్నులుగలదానా! శ్రేష్ఠములైన పూలదండలు శ్రేష్ఠమైన భోజనము శ్రేష్ఠమైన వస్త్రము శ్రేష్ఠుఁడైన మగఁడు నీకుఁ దగును. ఇది నా యుక్తమాభిప్రాయము — అల్పుఁడు సామాన్య పురుషుఁడు నీకుఁ దగిన మగఁడు కాఁడు.

ఉ. నిక్కపు దేవకన్యవని ♦ నే మది నమ్మితి రుద్రకాంతవో
నిక్కముగా మరుత్సతివొ ♦ నెమ్మి వచింపుము దేవకిన్నరుల్
ఎక్కువ నిందు రారిదియు ♦ మానవభోజులవాస మౌట, నీ
వెక్కడి దాన వెక్కటి చెలీ యిట నుండఁ గతంబుఁ జెప్పుమా. ౭౫౬

రుద్రకాంతవో - ఏకాదశరుద్రుల యొఁడుదానవా, మరుత్సతివో = మరుత్తుల దానవా? ఎక్కటి = ఒంటరిగా, కతంబు = కారణము.

తా. మనుష్యస్త్రీలయం దిట్టి యందగత్తెలు లేరు. కావున నీవు దేవకాంతవని నమ్మితిని. అటయినవారిలో నెవ్వతెవు. ఏకాదశరుద్రులకు సంబంధించినదానవా? నిజముగా మరుత్తులకు సంబంధించినదానవా. ప్రేమతోఁ జెప్పుము. దేవతాస్త్రీలు కిన్నర స్త్రీలు ఇది రాక్షసవాసభూమి కావున నిందు రారు. నీ వెక్కడిదానవు. ఒంటిగా నిందేలయున్నావు-చెప్పుము.

నీవంటి సుందరి మనుష్యులలో లేదు. కావున నీవు మనుష్యస్త్రీవి కావు. దేవతాస్త్రీగానే యుండవలె. ఇది రాక్షసభూమి కావున దేవతాస్త్రీలు కిన్నర స్త్రీలు లోనగువారు రారు. అయినను నీవు వచ్చియున్నావు. రాక్షసులకు నిష్టదేవత రుద్రుఁడు కావున ఆ రుద్రులకు సంబంధించినదానవా లేక వాయు విందు సంచరించు చుండును, గావున వాయువులకు సంబంధించినదానవా నిజముచెప్పుమనియుఁ జెప్ప వచ్చును.

కం. పులులుం గ్రోఁతులు సింహంబులుఁ జిఱుతలు నెలుఁగుబంట్లుఁ ♦ బురుకంకంబుల్
దళముగ నిందుఁ జరింపఁగఁ, గలికీ! నీ కెట్లు భయము ♦ గలుగదు చెపుమా.

తా. ఇచ్చట పులులు, క్రోఁతులు, సింహములు, చిఱుతపులులు, ఎలుఁగులు, పెద్దగ్రద్దలు, విస్తారముగ నిందుఁ దిరుగుచున్నవే నీ వెట్లు భయములేక యిందున్న దానవు.

కం. మదయుతములు ఘోరంబులు, మదావళము లిందుఁ బెక్కు మలయుచునుండన్
మదిరాక్షి మది భయమ్మును, బొదలక యె ట్లున్నదానవో కదె చెలువా.

తా. మదముపట్టినవై, భయంకరంబులైన యేనుఁగు లిందు మందలు మందలుగాఁ దిరుగుచుండఁగా భయపడక యెట్లుండఁగలిగితివి.

ఉ. ఎవ్వరిదాన వీవు మదిరేక్షణ! యెవ్వతె వీ వి కేటికే
యివ్వని జవ్వనీ! తిరిగె దెక్కటి రక్కసమూఁక లెప్పుడున్
గ్రొవ్వున సంచరించు నిటఁ గ్రూరత, నావుడు విప్రవేషు నా
క్రొవ్విరిఁబోఁడి సత్కృతుల గొబ్బునఁ బూజ లొనర్చి కొండియున్. ౭౫౯

మదిరేక్షణ = మదముకప్పినకన్నులు గలదానా? ఎవ్వరిదానవీవు = నీమగఁ డెవ్వఁడు, ఎవ్వతెవు = ఏజాతిదానవు, ఏకులముదానవు, జవ్వని = ప్రాయముగల దానా, విప్రవేషు = బ్రాహ్మణవేషధారిని, క్రొవ్విరిఁబోఁడి = క్రొత్తగా వికసించిన పువ్వువలె మనోజ్ఞురాలు.

తా. మదిరాక్షి! నీభర్త యెవ్వఁడు? నీకులమేది, నీజాతియేది? వయస్సు దానవయ్యు నిందొంటరిగా నేల యున్నావు? ఇది రాక్షసులగుంపు తిరుగుస్థలము. అని యడుగఁగా బ్రాహ్మణసన్న్యాసి వేషము వేసికొనిన వాని నాసీతాదేవి శీఘ్రముగ యతులను బూజింపవలసిన విధమునఁ బూజచేసి మఱియు.

— సీత యతివేషంబున నున్నరావణు సత్కరించుట. —

సీ. తరుణి పాత్రకుసుంభధారి యాద్విజవేష, సహితు నసహాయదర్శనుని వాని
ద్వేషింప దుస్సాధు విప్రునిభంగిన, బూజించి యి ట్లనుఁ బుష్పగంధి
యిదిగొ దర్భాసనం బిందుఁ గూర్చుండుమీ, యిదె యర్ఘ్యమిదె పాద్యమివిగొ సిద్ధ
వనజాతఫలములు త్వన్నిమిత్తం బివి, యారగింపుము తని వార ననుచుఁ

ఆ. బలుకు చున్నయట్టి ప్రతిపూర్ణభాషిణి, నానరేంద్రపత్ని నవనితనయ
నాత్మవధముపొంటె నసురలోకేశ్వరుం, డపహరింప మనసు నందుఁ బూనె? ౭౬౦

పాత్ర కుసుంభధారి = పాత్రము = పాత్రంభైక్షా చరణార్థమ్మని యుండుటచే భిక్షాన్నము గ్రహించుటకై యుపయోగపడు సొరకాయ చిప్పగాని మంటి పెంకుగాని యని యర్థము. కుసుంభము = కాషాయ వస్త్రముగాని, కమండలువుగాని-ఈ శబ్దమున కీ రెండర్థములు గలవు. కుసుంభం కుసుమే క్లీబం స్యాన్మహారజనేపిచతత్ । కమండలౌపుమాన్-నానా ॥౪॥ కుసుంభం కరకేపుమాన్॥ అమరకోశము. కాషాయవస్త్ర మనుటకంటె నిదియే ప్రశస్తార్థము.

ద్విజవేష సహితః — బ్రాహ్మణ వేషముతోఁ గూడినవానిని, అపాయ దర్శనః — కీడుచేయు తలఁపు గలవానిని అనఁగా నపహరింపఁ దలఁపు గలవానిని — ద్వేషింప దుస్సాధః — విరోధించి సాధింపగానివానిని, విప్రుని భంగిన = విప్రునిఁ బూజించినట్లే, ఇచ్చట విప్రశబ్దము సన్న్యాసపరమని కొందఱు, సన్న్యాసికాని బ్రాహ్మణుఁడు కాషాయవస్త్రము, కమండలువు, దండము, భిక్షాపాత్రము లోనైనవి ధరింపఁడు కదా. క్షత్రియాదులకు సన్న్యాసమం దధికారము లేదు. కావున బ్రాహ్మణుఁ డనియే సీత తలఁచెను. ఇక్కడ నొక సందేహము బాధించుచున్నది. వచ్చినవాఁడు దొంగ సన్న్యాసి యని తెలిసి సీత సత్కరించెనా? నిజమైన సన్న్యాసియని నమ్మి సత్కరించెనా? జనకరాజు కూఁతురై యీ క్రమము దెలిసిన దగుటచే వచ్చినవాఁడు దొంగ సన్న్యాసి యని తెలిసియు విరోధించిన జయింపరాదని తలఁచి 'కాషాయ వస్త్రమాత్రేణ యతిః పూజ్యో నసంశయ' యను వాక్యము చొప్పున సత్కరించె నని గోవిందరాజీయము. కాషాయవస్త్రమున యతి గృహస్థాదులకుఁ బూజ్యుఁడే కాని యతి యనునది వీనియం దన్వయించునా? వీఁడు వాస్తవసన్న్యాసి కాఁడని సీతకుఁ దెలియును గనుక నా వాక్య మిందన్వయింపదు. కాషాయవస్త్రము ధరించిన వారందఱు యతులని యీ వాక్యమున కర్థము గాదు. యత్యాశ్రమము స్వీకరించిన వాఁడు వానియందు యతి కుండవలసిన జ్ఞానాదులు కొఱఁత పడినను బూజ్యుఁడే యని యర్థము — ప్రాధాన్యము యతిశబ్దమున కీయవలెఁగాని కాషాయ వస్త్ర శబ్దమున కీయరాదు. సన్న్యాసి పూజా పరిపాటి తెలిసిన సీతాదేవికి — యతిధర్మ సముచ్చయమున.

యతిర్ద్వయేన పతతి, బ్రహ్మజ్ఞానయుతోపి సః.
ధీపూర్వరేతస్సర్గేణ, తథా ధాతుపరిగ్రహాత్,
యతిహస్తగతం ద్రవ్యం యో గృహ్ణాతి నరః క్వచిత్,
సమూఢో నరకం యాతి, తేనపాపేన కర్మణా
రాత్ర్యధ్వానంచ యానంచ, స్త్రీకథాలౌల్యమేవ చ,
మంచకం శుక్లవస్త్రంచ, యతీనాం పతనాని షట్.

యతి బ్రహ్మజ్ఞానము గలవాఁడైనను బుద్ధిపూర్వకముగ రేతస్సు విడుచుట, లోహముల పరిగ్రహించుట యను రెంటిచేఁ బతితుఁ డగుచున్నాఁడు. సన్న్యాసి చేతి ద్రవ్యమును గొంచెమైనను నెవఁడు తీసికొనునో ఆ మూఢుఁడు ఆ పాపకర్మముచే నరకమునకుఁ బోవును. సన్న్యాసులకు ధన మీయనురాదు. వారిచేతఁ దీసికొనను రాదు. రాత్రి దోవ నడచుట, వాహన మెక్కుట, స్త్రీకథలందు నాసక్తుఁడగుట, మంచము నుపయోగించుట, తెల్లని వస్త్రము గట్టుట ఇవి యాఱు సన్న్యాసులు పతితులగుటకు కారణములు.

పాషండినో వికర్మస్థాన్, బైడాలవ్రతికాన్ శఠాన్।
హైతుకాన్ బకవృత్తీంశ్చ వాఙ్మాత్రేణాపి నార్చయేత్॥ మనుస్మృతి,

పాషండులను, శాస్త్ర విరుద్ధ కర్మములచే జీవించువారిని, పిల్లివలె, కొంగవలె మోసబుద్ధితో సాధువులవలెఁ జరించువారిని, వేదములందు నమ్మకము లేని వారిని, వేదవిరోధి తర్కవాదములఁ జేయువారిని, వీరు అతిథులై సకాలమునకు వచ్చినను, వీరిని మాటలచేనైన నాదరింపరాదు.

వైద్యనాథ దీక్షితీయమున హైతుక లక్షణము పాషండ లక్షణ మిట్లు వ్రాయఁబడినది.

యుక్తిచ్ఛలేన సర్వత్ర, యశ్శాస్త్రవిహితేష్వపి।
సంశయం కురుతే సోయం, హైతుకో నాస్తికాధమః॥ పరాశరుఁడు

శాస్త్ర విహితమైన దానిని కుచ్ఛితపు యుక్తులచే నెవఁడు సందేహించునో యానాస్తికాధముఁడు హైతుకుఁ డనఁబడును.

యస్స్వధర్మపరిత్యాగీ పాషండ ఇత్యుచ్యతే బుధైః।
తత్సంగకృత్తత్సమస్స్యాత్తావుభావపి పాపినౌ।
యేతు నారాయణాదన్యం, మన్యంతే పురుషోత్తమం।
తే వై పాషండినో జ్ఞేయా, నరకార్హా నరాధమాః.

తన శాస్త్రవిహితస్వధర్మము నెవఁడు వదలునో వాఁడు పాషండి యనఁబడును. వాఁడు వానితో సాంగత్యము చేయువాఁడు ఇరువురు పాపాత్ములే.

పురుషోత్తముఁడగు నారాయణుని నితర దేవతలతో సమానుఁడుగ నెవఁడు చెప్పునో వాఁడు పాషండి యనఁబడును. అట్టి నరాధములు నరకమునకుఁ బోదురు. ప్రజాపతి.

వరాహ పురాణమున। కుబుద్ధి రచితం శాస్త్రం పఠిత్వా యే కలౌయుగే, న కుర్వంతి వినిందంతి యజ్ఞాన్ వర్ణాశ్రమోచితాన్, తేవై పాషండినో జ్ఞేయా సర్వ కర్మసు గర్హితాః। తేషాం సంభాషణం స్పర్శం ప్రమాదేనాపి నాచరేత్॥

కలియుగమందు కుబుద్ధులచే రచింపఁబడి శాస్త్రమని పేరు పెట్టఁబడిన దానిని (అచల పరిపూర్ణ గ్రంథములవంటి వానిని) చదివి వర్ణాశ్రమోచితములగు వానిని యజ్ఞములను నెవరు నిందింతురో వారు పాషండులు. వీరి నేకర్మమందు నియమింపరాదు. ప్రమాదముననైన వారితో మాటలాడ రాదు. వారిని దాఁక రాదు.

బౌద్ధభిక్షుకులు, క్షపణకులు, చార్వాకులు, వీరంద ఱీ తెగలోఁ జేరినవారే.

ధర్మధ్వజీ సదా లుబ్ధ శ్ఛాద్మికో లోకదంభకః
బైడాలవ్రతికో జ్ఞేయో హింస్రః సర్వాభిసంధకః॥ మను.

ధర్మము నెపముగాఁజెప్పి స్వలాభమునకై ధనమార్జించుటలో పరస్త్రీలఁ గలియుటలో యిట్టి చెడుకార్యములు చేయువాఁడు ధర్మధ్వజి—పరులధనమునం దాశగలవాఁడు లుబ్ధుఁడు. పరులవంచించువాఁడు, జనులు మెచ్చుకొనవలెనని కార్యములు చేయువాఁడు హింసాస్వభావముగలవాఁడు, పరులగుణములఁ దేరకు నాక్షేపించువాఁడు బైడాలవ్రతికుఁడనఁబడును.

అధోదృష్టి ర్నైష్కృతికః స్వార్థసాధనతత్పరః
శఠో మిథ్యావినీతశ్చ, బకవ్రతచరో ద్విజః॥ మను.

పరులు తన్నుఁజూచినపుడు వినయము గలవానివలె నేల చూపులు గలవాఁడు. నిష్ఠురశీలుఁడు, స్వకార్యధురంధరుఁడు. ఇతరులకార్యము చెఱుచు క్రూరుఁడు దొంగవినయముగలవాఁడు బకవ్రతికుఁడు. ఇట్టిదొంగసన్న్యాసులను మాటచేనైన గౌరవింపరాదని యెఱుఁగదా. వీఁడు దొంగసన్న్యాసియని యామె కెట్లు తెలియునందురా? నీస్తనము లిట్లున్నవి. నీమొల యట్లున్నది. నీతొడ లిట్లున్నవని యెదురుగానే వర్ణించు సన్న్యాసి, దొంగసన్న్యాసిగాక సాధువగునా?

సన్న్యాసుల నోర నీమాటలయిన రావచ్చునా. ఇది తెలిసి యెట్లు సీతాదేవి సత్కరించెను?

కుటిలబుద్ధుల గెలువంగఁ గుటిలమతియ । యవ్వ యగుఁగాని నీతిగా దార్జవంబు. నైషధము.

వంచకులను వంచనచేతనే గెలువవలయునుగాని వారియెడ ఋజుప్రవర్తనము నీతిగాదు, అని నీతిశాస్త్రము చెప్పుచుండ వాని నేదోవిధమున మోసగించి పంపక యున్నదున్నట్లేల చెప్పెను? దీనికిఁ బ్రత్యుత్తరము ౭౬_౨ వ పద్యమునఁ గలదు.

విప్రునిభంగిన యనుటకు సన్న్యాసి బ్రాహ్మణుఁడు తప్ప మఱియొకఁ డుండఁడు కావున బ్రాహ్మణుఁడని పూజించెనే కాని సన్న్యాసియని పూజించినదికాదని యీ వ్యాఖ్యాత యభిప్రాయము.

పుష్పగంధి = పూలవాసనగల దేహము గలది, పుష్పగంధమువంటి గంధమెవతె దేహమునందుఁగలదో యామె పుష్పగంధి. ఇట్లు విగ్రహము చెప్పుటచే నీమెయం దీ పరిమళము సహజమని యేర్పడుచున్నది. కనుకనే యామెకు యోజనగంధి యని పేరు. ఇట్లు సుగంధి – పూతిగంధి – ఉద్గంధి యను శబ్దంబులందును నూవ

గంధి ఘృతగంధి యిత్యాదులందును గంధశబ్ద మికారాంతమగును. ఘృతగంధి భోజనము అనఁగా నేతివాసనగల భోజనము. కొంచెము నేయి గలదని యర్థము. సుగంధిశబ్దమునకు పరిమళద్రవ్యము లమ్మువాఁడని యర్థము. వనజాతఫలము లు- అడవియందుఁబుట్టినపండ్లు—త్వన్నిమిత్తము — నీకొఱకు, తనివారక — తృప్తిగ. తనివి + ఆరక, తనివు + ఆరక, రెండుశబ్దములు గలవందురు. ప్రతిపూర్ణ భాషిణీ — సర్వము సిద్ధము అని యతిపూజచేయువారు చెప్పవలసినమాట చెప్పుచున్నదానిని, సన్న్యాసులను స్త్రీలు పూజింపవచ్చునని 'యతీనాం పూజనం కార్యం స్త్రీయావా పురుషేణవా' యను వాక్యము తెలుపుచున్నది. కావున సీత యితనిఁ బూజించుట యుచితము. ఆత్మవధముపొంటెక — తనచావు నిమిత్తము—చేప యెరను మ్రింగు నట్లని భావము. సీతాహరణ కార్యమువలని ఫలము మరణమేగాని మఱియొకటి గాదని భావము.

ఓయీ! నీ విచ్చట నీయర్థము చెప్పరాదు. పద్మపురాణమందు "జహార భార్యాంరామస్య, భార్యాం స్వవధ కాంక్షయా." యని చెప్పి ఆవెనుక 'అశోక వనికామధ్యే నిక్షిప్య జనకాత్మజామ్, నిధనం రామబాణేన కాంక్షియా స్వగృహం విశత్' అని చెప్పఁబడలేదా యందు రేమో—వాల్మీకి ఆత్మవధాయ — తన చావు కొఱకే యని చెప్పెనుగాని తాను చావఁగోరి యని పద్మపురాణమునఁ జెప్పినట్లు చెప్పలేదు. అదియునుగాక ఇది యే కల్పమందలి రామానువృత్తాంతమో కాని వాల్మీకిరామాయణమందలి రామానువృత్తాంతము కాదు. నీవ్రాసిన వ్యాఖ్యానము వాల్మీకిరచనయందు లేదు.

తా. సీతాదేవి భిక్షాపాత్రము కమండలువు ధరించి బ్రాహ్మణ సన్న్యాసి వేషముతోనుండి తనకుఁ గీడుచేయు నాలోచనఁగలవానిని, విరోధించినను దాను గెలువఁజాలనివానిని (దీనివలన వాఁడు తనకుఁ గీడుచేయవచ్చినాఁడనియు నిరాకరించిన పక్షమున నప్పుడే పైపడి పట్టుకొనిపోవుననియు మంచిమాటలతోఁ గాలక్షేపము చేయుచుండిన నింతలో రామలక్ష్మణులు రాకుందురా యనియు సీత యుపాయము తలఁచి వానితోఁ ముచ్చటలాడఁ జొచ్చెను.) కావుననే రాక్షసుఁడని యెఱిఁగియు బ్రాహ్మణుని బూజించు రీతిగానే పూజించి యిట్లనెను. ఈ కారణముచేతనే యతి యని యామెనోర గానేలేదు. ఇదిగో దర్భాసనము. ఇందుఁగూర్చుండుము. ఇదిగో నర్ఘ్యము. ఇదిగోఁ బాద్యము సర్వము సిద్ధము. ఇదిగో నీయాహారనిమిత్త మడవి యందలి ఫలములు—తృప్తిగా భుజింపుము. అని శాస్త్రప్రకారము సిద్ధమని చెప్పు చున్న యారాజభార్యను, భూపుత్రిని తనచావునిమిత్తము రావణుఁడు బలాత్కార ముగ నపహరింపఁగోరెను.

తరలము. వనికి వేటకుఁ జన్న భర్తయు ♦ భ్రాతతోఁ జనుదెంచునా
యనుచు నాలుగుదిక్కులన్ జల♦జాయతాక్షి వనీదిశన్
గనియెఁ గాని రఘూత్తముల్ పొడ♦కట్టరైరి, యథాస్థితిన్
వనకుజంబులు దోఁచుచుండెను ♦ భామచిత్తము కందఁగన్. ౭౬౧

వనికిన్ = అడవికి, వేటకు = మృగమును వధించుట వేటయేకదా, వనీదిశన్ = అడవియందు దిక్కును, పొడకట్టరైరి = కానరాలేదు, యథాస్థితిన్ = పూర్వమున్నట్టులే, కందఁగన్ = వాడిపోవునట్లు—తరలము నభరస జజగగణములు పండ్రెండవయింట యతి.

వీరుండిన పర్ణశాలకు (ఇప్పటి పర్ణశాలగాదు) నుత్తరమునఁ బర్వతములు, తూర్పున గోదావరి యున్నది, దక్షిణము పడమర యడవి. మారీచుఁడు రామచంద్రమూర్తిని బడమరగానే తీసికొనిపోయెను. రావణాసురుఁడు పోవలసినది దక్షిణమార్గమునఁ గావున నా త్రోవయందు రామచంద్రమూర్తి యుండరాదుకదా.

తా. అడవికి మాయామృగమును వేటాడుటకై పోయిన రామచంద్రమూర్తి లక్ష్మణుతో వచ్చునా యని యడవివైపు నాలుగుప్రక్కల చూచెనుగాని వారు గానరాలేదు. యథాప్రకార మడవిచెట్లు మాత్రము కానవచ్చుచుండెను. అదిగని సీత మనస్సు భయసంతాపములచే వాడిపోయెను.

—♦ ౪౭—వ సర్గము. సీత మాయాయతికిఁ దనవృత్తాంతముఁ జెప్పుట ♦—

ఉ. తన్ను హరింప బోడి యయి ♦ దానవనాథుఁడు ప్రశ్న సేయఁగా
సన్నుతశీల వీఁ డతిథి ♦ బ్రాహ్మసురవర్యుఁడు మద్విధంబు నే
నున్నటు చెప్పకుండినను ♦ నుగ్రరుషన్ శపియించునో యటం
చెన్నుచు మూర్తమాత్ర మెద ♦ నిట్లని చెప్పఁదొడంగె వానికిన్. ౭౬౨

బోడి = సన్న్యాసి—ముండి, సన్నుతశీల = సజ్జనులచేఁ బొగడఁబడిన సదాచారము గలది. అతిథుల నభ్యాగతుల నెట్లాదరింపవలెనో యా మర్యాద పరిపాటి చక్కఁగాఁ దెలిసి వర్తించునది. బ్రాహ్మసురవర్యుఁడు = బ్రాహ్మణశ్రేష్ఠుఁడు, మద్విధంబు = నా చరిత్రమును, ఉగ్రరుషన్ = తీవ్రకోపముచే, మూర్తమాత్రము = అల్పకాలము, ఎదన్ = హృదయమందు.

యస్య నజ్ఞాయతే నామ నచగోత్రం నచస్థితిః
అకస్మాద్గృహ ఆయాతః సోతిథిః ప్రోచ్యతే బుధైః.

ఎవనిపేరు గోత్రము స్థితి తెలియదో యెవఁ డాకస్మికముగ నింటికివచ్చునో వాఁడతిథి.

తా. తన్ను బలాత్కారముగఁ దీసికొనిపోవఁదలఁచి రావణుఁడు ప్రశ్నింపఁగా నతిథుల నభ్యాగతుల నాదరింపవలసిన విధము చక్కఁగాఁ దెలిసిన సీత యింగితజ్ఞ కావున వానిమాటలు వాని సంభ్రమము విని చూచి వీఁడు నిజమైన సన్న్యాసి కాఁడు. ఉదరనిమిత్తమై సన్న్యాసివేషమును ధరించిన బ్రాహ్మణుఁడు అని తెలిసికొని యతిథితో నసత్యమాడరాదు. బ్రాహ్మణునితో నసత్యమాడరాదు. ఇఁక నతిథి బ్రాహ్మణుఁడగువానితో నెట్లసత్యము చెప్పుదును. వీఁడు దొంగసన్న్యాసి గావున వంచకులను వంచించుట దోషముకాదు. కావున నసత్యము చెప్పవచ్చునా యందు నేని బ్రాహ్మణుఁడు కావునఁ గోపించి శపించునేమో. అదియునుగాక వంచకుల వంచింపవచ్చునుగాని వంచింపవలయునని విధిలేదుకదా. అది జఘన్యపక్షమే కాని యుత్తమపక్షము కాదుకదా. కానీ-అయినదగును. సత్యమే చెప్పెదను. అని యల్ప కాల మాలోచించి వాని కిట్లని చెప్ప నారంభించెను.

సీత సన్న్యాసిని బూజింపవలసిన విధముగాఁ బూజింపలేదనియు బ్రాహ్మణాతిథిని బూజింపవలసిన విధముగాఁ బూజించెననియు నెఱుఁగనగు. అదియునుగాక వీఁడు రాక్షసుఁడు. దురుద్దేశముతో వచ్చినాఁడని సీతాదేవి గ్రహించినట్లు 'తన్ను హరింప బోఁడియయి దానవనాథుఁడు ప్రశ్నసేయఁగా' ననుమాట లెడమిచ్చు చున్నవి. వాస్తవార్థమున వచ్చినవాఁడు రావణుఁడని యామె కెఱుకలేదుకదా.

సీ. మిథిలాధినాథుఁడై ♦ ప్రథితమహాత్ముఁడౌ, జనకుపుత్రిని సీత ♦ యనుదు రుర్వి
క్షేమమౌతను నీకు ♦ శ్రీరాముభార్యను, సర్వకామసమృద్ధ ♦ జనసుఖములఁ
బదియు రెండేఁడులు ♦ శ్వశురుల యింటను, గడపితి నేదియుఁ ♦ గడమ లేక
యంతటఁ బదియు మూఁ ♦ డవ వత్సరంబున, రామాభిషేకకా ♦ ర్యంబు పొంటె

తే. రాజు మంత్రులతోడ మం ♦ త్రంబు సేసి, సర్వసంభారములఁ గూర్చఁ♦ జతురతకై క
య నెడినృపుభార్య తనహృద♦యాధినాథుఁ, డైనమామామ సుకృతవ♦శాత్ముఁజేసి.

ప్రథితమహాత్ముఁడు = మహాత్ముఁడని కీర్తింపఁబడినవాఁడు. క్షేమము + అవుతను + నీకు = నీకు క్షేమముగలుగునుగాక. ఇందర్థవిశేషము లేదేని యిది వ్యర్థపదమగును. నీకు మేలగునుగాక యనుటకు నీవు దురుద్దేశముతో వచ్చిన వాఁడవు. నీ యుద్దేశము కొనసాగించితివా చెడెదవుసుమా, ఇప్పటికైనను దెలివి తెచ్చుకో, నిన్ను క్షమించెదను. నిన్ను నాశముచేయఁ బుట్టినదానను సుమా యని హెచ్చరికగా గ్రహింపవలెను. శ్రీరాముభార్యను నేను. శ్రీరాముఁడు శ్రీరాముఁడు గనుక నే నాయనభార్యనే కాని యితరులకుఁగాను సుమా, కావున నీ సంకల్పము వ్యర్థమే యగును. మఱి యనర్థకమగును. క్షేమమౌతను నీకు = నేను శ్రీరాము భార్యను. శ్రీరాముభార్యనగు నన్ను నీవు మాటలాడిన కామోద్రేకపుమాటలు

మిగులఁ బాపకారణములు. అయినను ఆ పాపము నిన్నంటకపోవునుగాక. ఎవ్వతె వనుటకు నా పేరు సీతయని ప్రత్యుత్తరము. యెవ్వరిదానవను ప్రశ్నకు శ్రీరాము భార్యను, అని ప్రత్యుత్తరము. సర్వకామసమృద్ధను = కామింపఁబడునది కామము. ఏవేవి కోరఁదగునో యవియన్నియుఁ గొఱఁతలేక దండిగాఁగలదానను. కామములు అనఁగా భోగోపకరణప్రసక్చందనాదులు. ఇది రావణుఁడు ముందు చెప్పఁబోవు సర్వ సౌఖ్యములు నీకు నేసమర్చెదననుటకు నాకు నీవలనఁ గావలసిన దేదియు లేదని ముందుగానే సూచించుచున్నది. జన సుఖములన్ = మనుష్య సుఖములన్, అనుటచే సామాన్యసుఖములని భావము. మనుష్యసుఖముల నే ననుభవించితి ననుటచే నేను మనుష్యస్త్రీని గానని భావము. 'శీతోదకశిరస్స్నానం, కించిదుష్ణంచ భోజనం మానవానా మిదంపథ్య' మ్మను అశ్వనీదేవతలవాక్కుల స్మరించునది. దీనివలనఁ దన యమానుషత్వము సూచించినదాయెను. సర్వకామసమృద్ధజనుఁడు = శ్రీరామ చంద్రమూర్తి, అవాప్త సమస్తకాముఁడు కదా భగవంతుఁడు. ఆయనవలనఁ గలుగు సుఖము-సర్వకామ సమృద్ధ జనసుఖములు. అనఁగా రామకృత సౌఖ్యములు. ఇక్ష్వాకులయింటను = పూజ్యార్థంబున బహువచనము - శ్రీరామునింట నని భావము. ఇచ్చట సిగ్గుచే నిట్లు చెప్పెనని గోవిందరాజీయము. శ్రీరామమూర్తికిఁ బెత్తనము గాని కారణముచే ఇక్ష్వాకులయింట ననునది మామగారియింట ననియు గ్రహింప వచ్చును. దశరథపర్యాయమునఁ బూజ్యతఁ - కడమ - కొఱఁత, చతుర = నెఱ జాణ, నేర్పుగలది, తన హృదయాధినాథుఁడు = తనభర్త, తన హృదయమునకే యధి నాథుఁడు, తక్కినవారి కూరక నాథుఁడే. తనకు లోపడి నడచువాఁడని భావము. సుకృతివశాత్మన్ = ప్రమాణములచే బద్ధునిఁజేసి, ధర్మమునకు వశపడిన మనస్సు గల వానిఁగాఁజేసి, కైక తాను జేసిన ప్రాణదాన మనెడి యుపకారమును జ్ఞప్తికిఁ దెచ్చి స్వాధీనపఱచుకొని.

తా. మిథిలకురాజై మహాత్ముఁడను కీర్తిగనిన జనకరాజుపుత్రిని-నా పేరు సీత యందురు. నీకు మేలు కలుగునుగాక. నేను శ్రీరాముని భార్యనుజుమీ సర్వవిధము లయిన భోగోపకరణములు గలదానను. మనుష్య సుఖములచే పండ్రెండేండ్లు మా మామగారి యింట నా భర్తతోడ నేకొఱఁతయును లేక గడపితిని. ఆవల మా మామ గారు శ్రీరామునకుఁ బట్టాభిషేకము చేయవలయునని పదుమూఁడవ సంవత్సరమున నాలోచించెను. దానికిఁ గావలసిన పదార్థములనెల్ల సమకూర్చెను. అప్పు డాయనకుఁ బ్రియురాలగు భార్య కార్యసాధనమునందు నేర్పుగల కైక యనునది ముందుగా నీవు కోరినది యిచ్చెదనని ప్రమాణము చేయించుకొని,

కం. నాపతి ప్రవ్రాజనమును, స్వాపత్యం బైనభరతు ♦ నభిషేకంబున్
భూపాలుని సత్యాత్ముని, నాపడఁతి వరద్వయంబు♦ నాకాంక్షించెన్. ౩౬౪

ప్రవ్రాజనమును = దేశము విడిచి పోవుటయును, స్వాపత్యము = స్వ + అపత్యము = తనకుమారుఁడు, సత్యాత్ముని = సత్యము స్వభావముగాఁ గలవానిని, వరద్వయంబు = రెండువరములు, ఆకాంక్షించెన్ = కోరెను.

తా. ఆకైక నాభర్త దేశము వదలిపోవలయునని, తనకొడుకు రాజ్యమునకుఁ బట్టాభిషిక్తుఁడు కావలె నని రెండువరము లా సత్యాత్ముని గోరెను.

కం. తిన నన్నముఁ గొన నీరముఁ, గన నిద్దుర యేమియైనఁ ♦ గానిమ్ము రా
మునినీ వభిషేకించిన, జననాయక నాకు నుసులు ♦ సరి యింతటితోన్. ౭౬౫

ఉసులు = ప్రాణము, సరి = ముగింపు, తినను = తినెడిదానఁగాను, కొనన్ = కొనెడిదానఁగాను.

తా. ఎంతటి సత్యాత్మకుఁడైనను ఇట్టి శాస్త్రవిరుద్ధము లోకవిరుద్ధములైన కోరికల నెట్లు కొనసాగించె నందువేమో. ఆయిల్లాలు నీవు రాముని నభిషేకించితివా నేను గూడు తినను, నీళ్ళు త్రాగను, నిద్దురపోను. నాగతి యేమైనఁ గానిమ్ము. నేనింతటితోఁ బ్రాణములు విడిచెదను, అని మొండికి వేసికొనెను.

కం. అని పలికెడి కైకేయికి, ననఘుఁడు మామామ సార్థ ♦ కార్థంబు లివే
కొను మని యెంతయు వేఁడిన, విన దా యిల్లాలు మగని ♦ విన్నప మేమిన్.

సార్థకార్థంబులు = దానికి ప్రయోజనపడెడి పదార్థములు, సొమ్ములు, చీరలు, ధనములోనైనవి. కైకకోరిన రెండువరములు దాని కుపయోగపడునవి కావు. ఆభరణాదు లామె కుపయోగపడున వని భావము. వేఁడినన్ = ప్రార్థించినను, విన్నపము = మనవి, ఈరెండుశబ్దములచే దశరథుఁ డెంతో దీనుఁడై భార్యను ప్రార్థించె నని, మఱియొకతె యయియుండినచో దాని మనసున జాలిపుట్టియుండు నని కైకకు పరితాపము కాని పశ్చాత్తాపముగాని కలుగలేదని భావము.

తా. ఈ ప్రకారము హఠముచే బందిపఱుచు కైకేయికి దోషమేలుఁగని మామగారు ఆ రెండు వరములవలన నీకు నేమి ప్రయోజనమే, నీ కుపయోగపడు సొమ్ములు చీరలు - ధనము - కావలసినంత యిచ్చెదను దీసికోవే యని యెంతయో ప్రార్థించెను. ఆయన యేమి చెప్పినను ఎంత ప్రార్థించినను ఆయన విన్నపము చెవినిబెట్టినది కాదు.

కం. ప్రతిభటరహితుం డగు నా, పతి కిరువదియేనుసమల ♦ ప్రాయం బపు డీ
క్షితిఁ బుట్టువాదిగాఁ గన, హితగుణ నా కపుడు పదియు ♦ నెనిమిది యేఁడుల్.

ప్రతిభటరహితుఁడు = (1) యుద్ధమున నెదిరించి నిలువగలవాఁడు లేనివాఁడు. (2) ఏఁడు నాకు విరోధియను భావ మెనరియందును లేనివాఁడు - రాముఁడు

విషయమై వైరము మరణాంతము అనికదా రామచంద్రమూర్తి చెప్పెను. సమల సంవత్సరముల-ప్రాయము = వయస్సు, క్షితిః = భూమియందు, పుట్టువాడిగాః పుట్టినది మొదలుకొని, కనః = చూడఁగా, నేను, భూమిమీఁద బుట్టినది మొదలు లెక్కింపఁగా, దీనివలన భూమిలోనున్న కాలము లెక్కింప లేదనుట, తనకుఁ గీడు చేయవచ్చిన వాఁడని తెలిసి యిట్లు హితగుణ యనెనందురేమో. అప్పుడు పుట్టువాడిఁగాఁగః + అహితగుణ యని పదచ్ఛేదముచేసి కీడుచేయు గుణము కలవాఁడా యని గ్రహింపవలెను.

తా. నా భర్తను యుద్ధమున నెదిరింపఁగలవాఁడు లేఁడు. కావున రాజ్యమును భుజబలమున సాధించి యుండవచ్చునుగాని నా భర్త యెవరిని విరోధిగఁ జూచువాఁడు కాఁడు. (క్షుద్ర) రాజ్యమునిమిత్తమై మన మొకరిని బాధింపనా యను నభిప్రాయము గలవాఁడు. ఆ పట్టాభిషేక విఘ్నకాలమునకు నా భర్త కిరువదియైదేండ్లు వయస్సు. నేను భూమిమీఁద బుట్టినది మొదలు నాకు పదునెనిమిదేండ్ల వయస్సు. ఇంతటి లేతవయస్సువారె ట్లడవులలోఁ దిరుగఁగలరనికూడ మా యత్తమామ లాలోచించినవారు గారు.

రామచంద్రమూర్తి విశ్వామిత్రునితో నరణ్యమునకుఁ బోవునప్పటికి పండ్రెండేండ్లు. ఆయేఁటనే సీతావివాహము, పిమ్మటఁ బండ్రెండేండ్లయోధ్యలో సుఖముగా నుండుట. ఆపైయేఁట బట్టాభిషేక ప్రయత్నము కావున రామచంద్రునకు నప్పటి కిరువదియైదేండ్లు. అరణ్యవాసారంభమైన పిదప ఋష్యాశ్రమములలోఁ బదియేండ్లు గడచెను. పంచవటిలో మూఁడేండ్లు గడచినవి. వనవాసారంభము మొదలు పదునాల్గవ సంవత్సరమున సీతాపహరణము కాఁగా నిప్పటికి శ్రీరామచంద్రునకు ముప్పదియెనిమిదవ యేఁడు. సీత జనకునికి లభించినది మొదలు ఆఱు సంవత్సరములు మిథిలయందుండెను. వివాహానంతర మయోధ్యలో పండ్రెండు వత్సరము లుండెను. పదుమూఁడవసంవత్సరమున వనప్రయాణము కాఁగా వనవాసమునకు బయలుదేఱు నప్పటికి సీతాదేవికి పదునెనిమిది సంవత్సరములు గడచినవి. కావున నిప్పటికి సీతకు ముప్పదియొక్క సంవత్సరములు వయస్సు గడచెను. ఇది ముప్పదిరెండవ సంవత్సరము, అని గోవిందరాజీయము. మహేశ్వరతీర్థులును నీ లెక్క ప్రకారమే వ్రాసియున్నారు. పట్టాభిషేక మప్పటికి సీతాదేవికి ముప్పదిమూఁడు సంవత్సరములు. రామచంద్రమూర్తికి ముప్పది తొమ్మిదియవ సంవత్సరము. ౫౭౧ పద్యము బాలకాండమున దీని వివరము చూచునది.

సీ. రామనామంబునఁ ♦ బ్రఖ్యాతుండు జగతిని, సత్యవంతుఁడు గుణ♦శాలి శుచియు
నీరజాతాయత ♦ నేత్రుండు నాజాను, బాహుండు భూతావ♦ళీహితాత్ముఁ

డట్టినాపెనిమిటి ♦ కాలిముచ్చట దీర్చ,నభిషేక మొనరింపఁ ♦ డయ్యె దశర
థుండు కామార్తుఁడై ♦ వెండి తండ్రిని డాయ, వచ్చినరామునిఁ ♦ బలికెఁ గైక

ఆ. వినుమ రామ నీదు♦జనకునియానతి, భరతునందు రాజ్య♦భార మునిచి
వని వసింపు మీవు ♦ వర్షము ల్పదునాల్గు, జనకు సత్యవాది ♦ సలుపవయ్య.

వయసుచే వనవాసమున కనర్హుఁ డనిచెప్పి యిఁక గుణములచేతను ననర్హుఁ డని చెప్పుచున్నది.

ప్రథితుండు = ప్రసిద్ధికెక్కినవాఁడు, జగతిని = ప్రపంచమందు, శుచి = పరిశుద్ధుఁడు, నీరజంతాయతనేత్రుండు = కమలములవలె విశాలమైన కన్నులుగలవాఁడు, ఆజానుబాహుండు = మోఁకాలినంటుచేతులు గలవాఁడు, భూతావళి = జీవకోట్లకు, హితె = మేలుచేయు, ఆత్ముఁడు = మనస్సుగలవాఁడు.

తా. లోకముల జనులయందు రాముఁడు రాముఁడు రాముఁ డని స్మరింపని వారు గొప్పగఁ జెప్పని వారులేరు. అంతటి ప్రసిద్ధి యెట్లు వచ్చెనందువా అసత్యము చెప్పఁడు. సద్గుణములచేతనే ప్రకాశించువాఁడు. కావునఁ దప్పుపట్టు నొక దోష గుణమైనఁ గలవాఁడు కాఁడు. స్త్రీల విషయమైకాని ధనవిషయమైకాని నిష్కల్మష మైన హృదయముగలవాఁడు. సర్వభూతములకు మేలుచేయుటయందే కోరిక గలవాఁడు. ఈ గుణము లీయనయందుఁ గలవని చాటించిచెప్పుచున్నవా యన్నట్లు కమలములవంటి పెద్ద కన్నులు మోఁకాలినంటు చేతులు గలవాఁడు. కన్నులు చేతులు చూడఁగానే యీయన మహానుభావుఁ డను తలంపు గలిగించువాఁడు. ఇటువంటి నా భర్తకుఁ దన భార్య ముద్దుతీర్చుటకై కామార్తుఁడై దశరథరాజు పట్టాభిషేకముచేసిన వాఁడు గాఁడు. తండ్రిని జూడవచ్చిన రామచంద్రునితోఁ గైక రామా మీ తండ్రి యాజ్ఞాప్రకారము రాజ్యము భరతున కిచ్చి నీవు పదు నాలుగేం డ్లరణ్యమున నుండుము. మీ తండ్రిని సత్యవాదిని జేయుము అని చెప్పెను.

కం. అని కైకయి వచియించిన, విని యకుతోభయుఁడు నాదు♦విభుఁ డాపలుకుం
గొని నిశ్చలవ్రతుం డయి, చనుదెంచెఁ జనకు సత్య♦సంధునిఁ జేయన్. ౭౬

అకుతోభయుఁడు = భయమెట్టిదో యెఱుఁగనివాఁడు. దేనివలనను భయము లేనివాఁడు.

తా. సవతితల్లి కైకచెప్పినమాటలు విని దేనికిని భయపడనివాఁడు కావున నరణ్యవాసముచేయుటకు భయపడక పదునాలుగుసంవత్సరము లరణ్యవాసము చేసెద నని యది వ్రతముగాఁ బూని తండ్రిని సత్యవచనుని జేయ నరణ్యములకు వచ్చెను.

తే. ఇచ్చునేకాని యొరులచేఁ ♦ బుచ్చుకొనఁడు, సత్యమాడునకాని య♦సత్యమాడఁ
డెట్టివేళల నివియు మా♦దిట్టమైన, రామచంద్రుని వ్రతములు ♦ బ్రహ్మతేజ. ౭౭౦

బ్రహ్మతేజ = బ్రాహ్మణతేజస్సువంటి తేజస్సు గలవాఁడా. నాభర్తకు రెండు వ్రతములు గలవు. తా నొకరి కేదైన నిచ్చునేకాని యొకరిచే దేనిని బుచ్చుకొనఁడు. ఎట్టి సంకటవేళనైన సత్యము చెప్పునేకాని యసత్యము చెప్పఁడు. ఇవి యాయనకు వ్రతములు.

దద్యాద్రాజ న్న యాచేత, యజేత నచ యాజయేత్,
నాధ్యాపయే దధీయీత । ప్రజాశ్చ పరిపాలయేత్ ।

భార. రాజధర్మ–౬౦ అధ్యాయము.

ధర్మరాజా, క్షత్రియుఁ డియ్యవచ్చును. యాచింపరాదు. యజ్ఞము చేయవచ్చును. చేయింపరాదు. వేదాధ్యయనము చేయవచ్చును. చేయింపరాదు. ప్రజలఁ బాలింపవలెను.

సీ. రాముని వైమాత్రేయుఁ ♦ డైఖ్యుంచు లక్ష్మణ. నాముఁడు శూరతా♦ధాముఁ డన్న
కును సహాయుం డగు♦ననిలోన విజితారి, యతిదృఢవ్రతుఁడు ధ♦ర్మాత్ముఁ డతఁడు
మా వెంటఁ జనుదెంచె♦మహితధనుష్పాణి, యగుచు రాముఁడు జటి♦యగుచుఁ దపసి
యాకృతిఁ గైకొని ♦ యనుజుతో నాతోడ, దండకాటవిఁ జొచ్చెఁ ♦ దండితారి

తే. కైక వలనను రాజ్యంబు♦గరిమఁ బాసి, మేము ముప్ప[illegible] భూమిఁ దిరుగు
చున్నవారము మా స్థిమితముండు వేని, వచ్చు నాభర్త వన్యాళిఁ ♦ దెచ్చు విప్ర.

వైమాత్రేయుఁడు = విమాతృ + కుమారుఁడు = విమాత = సవతితల్లి, వైమాత్రేయో విమాతృజః । అమరకోశము. అపత్యార్థకతద్ధితము, శూరతాధాముఁడు = శౌర్యమునకు స్థానమైనవాఁడు, విజితారి = జయింపఁబడిన శత్రువులు గలవాఁడు, అతిదృఢవ్రతుఁడు = మిగుల స్థిరమైన చలింపని వ్రతము గలవాఁడు, ధర్మాత్ముఁడు = ధర్మము స్వభావముగఁ గలవాఁడు, మహిత ధనుష్పాణి — గొప్పవిల్లు చేతియందుఁ గలవాఁడు. మమ్ము రక్షించుటకై యని భావము. జటి — జటలు గలవాఁడు–జడలుగలవాఁడు, తపసి యాకృతిఁ = తపస్సుచేయు మునులవేషముధరించి, దండితారి = దండింపఁబడిన శత్రువులు గలవాఁడు, గరిమ = గొప్పతనము, కైకవలనను, హేత్వర్థంబునఁ బంచమి, వన్యాలి = అడవియందలి ఫలములు లోనైనవి.

తా. నా భర్తయగు రామచంద్రమూర్తికి సవతితల్లి కుమారుఁడు లక్ష్మణుఁ డనువాఁడు మిగుల శూరుఁడు. అన్నకు సహాయుఁడుగా నుండవచ్చెను. యుద్ధమునందు జయింపఁబడిన విరోధులు గలవాఁడు. వ్రతము ననుష్ఠించుటయందు మిగులఁ బట్టుదల గలవాఁడు. ధర్మస్వభావుఁడు. మమ్ము రక్షించుటకై విల్లు బాణ

ములు ధరించి యీయన మాతోడ నడవులకు వచ్చెను. కైకకారణముగ రాజ్య గౌరవమును బోఁగొట్టుకొని మేము ముప్పదిరము (?) అడవిలోఁ దిరుగుచున్నారము. కొంచెముసేపు నీ విందు నిలిచితివేని నాభర్త వచ్చును. నీకు వనఫలములు లోనైనవి యిచ్చును.

కం. తావకనామము గోత్రము, భూవిబుధా! కులము సత్త్వమును నిక్కముగా
నావిష్కృతి సేయు మిటే, లా విహరించెదవు దండకాటవి నొంటిన్. ౨౪

తావకనామము = నీ పేరు, గోత్రము = వంశము, కులము = జాతి, గృహము, సత్త్వము = బలము, ఆవిష్కృతిసేయుము = వివరింపుము.

తా. బ్రాహ్మణుఁడా నీ పేరేమి. నీగోత్ర మేది? నీ వేకులమువాఁడవు? ఏమి జాతివాఁడవు? వివరింపుము. ఎందైన నాశ్రమమున నుండక ఏల యొంటరిగా నీయరణ్యములందుఁ దిరుగుచున్నావు.

బ్రాహ్మణుఁడా యని సంబోధించుట నీ జాతియేది, కులమేది యని యడుగుటచే నీవు బ్రాహ్మణవేషధారివిగ నున్నావు. నిజము చెప్పు మని సందేహించి యడిగినట్లులు సూచితము. రావణుఁడు నిజమైన బ్రాహ్మణుఁడు కాఁడుగదా. సన్న్యాసులను నీకులమేమి, గోత్రమేమి, యని ప్రశ్నింపరాదుకదా. ఎట్లు ప్రశ్నించెను? సన్న్యాసి యరణ్యములలోఁ దిరుగుట ధర్మమేకదా, ఏల యొంటరిగాఁ దిరిగెదవని యడిగెను? పూర్వాశ్రమ కులగోత్రాదులప్రశ్న యసంగతము కాదు. అందును వేషమొకవిధము మాటలొకవిధముగా నుండుటచే సందేహము కలిగి యిప్పుడు నిజము చెప్పుము. నీవు దొంగవలెనున్నావని యడుగుట తప్పుగాదు. సన్న్యాసి భిక్షచే జీవింపవలసినవాఁడు. ఆకారణమున గ్రామములకు సమీపముననుండు నరణ్యముల సంచరింపవలసినవాఁడై యుండఁగా మనుష్యసంచారములేని యడవిలో నేల యొంటరిగాఁ దిరుగుచున్నావనుట దోషముగాదు.

కం. అని తన్నడిగినసీతా, వనజాక్షికి ననియె నుగ్రవర్తనుఁ డగు న
ద్దనుజేంద్రుఁడు తీవ్రంబుగ, వినవే యోసీత నాదువృత్తాంతంబున్. ౨౫

ఉగ్రవర్తనుఁడు = క్రూరప్రవర్తనగలవాఁడు, తీవ్రంబుగన్ = పరుషముగ.

తా. అని సీతాదేవి యడుగఁగా క్రూరప్రవర్తనగల యారాక్షసశ్రేష్ఠుఁడు నాచరిత్రము చెప్పెద విను మని పరుషముగా నిట్లనెను.

{ రావణుఁడు సీతకుఁ దనవృత్తాంతంబుఁ జెప్పి
యామెను దురుక్తులాడుట. }

ఉ. ఎవ్వనిపేరు విన్న జగ మెల్ల వణంకు సదేవదైత్యమై
యవ్వాఁడు రాక్షసావళుల కెల్లను నాయకుఁ డట్టివాఁడ నో

క్రొవ్విరిఁబోఁడి రావణుఁడఁ ♦ గూరుత క్షేమము నీకు నిన్గనన్
బువ్విలుకానిలీలలకుఁ ♦ బోదు మనంబు స్వదారపాళిపై. ౭౭౪

సదేవదైత్యమై = దేవతలతోఁ దైత్యులతోఁ గూడినదై, కూరుత క్షేమము నీకున్ = నీకు మేలుకలుగునుగాక. ఇది ౭౬౩ లో నీకు క్షేమమాతను - అన్న సీతావచనమునకుఁ బ్రత్యుత్తరము - నా క్షేమము నీవేమికోరెదవు. నీ క్షేమము చూచుకొనుము. నిన్ను వదలిపెట్టిపోను - పువ్విలుకానిలీలలకున్ = మన్మథక్రీడలకు, స్వదారపాళిపైన్ = నాభార్యలసమూహముమీఁద. ఇచ్చట స్వదారపాళిపై మనంబు పువ్విలుకానిలీలలకుఁబోదనుటచే నీవు నాకుఁదల్లివి. నిన్నుఁజూడ కామ్యభోగములపై మనస్సుపోక వైరాగ్యముకలదగుచున్నదని తీర్థీయవ్యాఖ్య.

తనమగఁడు ప్రథితుండు జగతి నని మనుష్యులందుఁ బ్రసిద్ధుఁడని సీతాదేవి చెప్పిన మాటకుఁ, దనపేరువిన్న దేవతలు, దైత్యులుకూడ గడగడలాడుదురని తన ప్రతిష్ఠ చెప్పుకొనుచున్నాఁడు. నీపేరేమి యనిన ప్రశ్నకు రావణుఁడని తనపేరు చెప్పుచున్నాఁడు. పేరువినఁగానే గడగడలాడు సితకు భయపడవలదని నీకు క్షేమము గలుగునుగాక యనుచున్నాఁడు. నీవు మనుష్యుల భక్షించువాఁడవే. నన్ను బ్రతుకనిత్తువా, యనునేమోయని నీమీఁద మోహముకలుగుచున్నది. కావున నిన్నుఁజంపనని చెప్పెను. నీకు భార్యలులేరా యనునేమోయని కలరుగాని నిన్నుఁజూచినది మొదలు వారిమీఁద హేయబుద్ధిపుట్టుచున్నదనుచున్నాఁడు.

తా. ఎవనిపేరువిన్న మనుష్యులుమాత్రమేగాక దేవతలు దైత్యులుకూడ గడగడలాడుదురో యట్టివాఁడను, రాక్షసులనాయకుఁడను, నాపేరు రావణుఁడు, నీకు మేలుగలుగునుగాక. నిన్నుఁజూచినది మొదలు నాభార్యలమీఁదఁ గ్రీడార్థమై మనస్సుపోకున్నది.

ఉ. ఎందఱనో వరాంగనల ♦ నేపున నే హరియించి తెచ్చితిన్
సుందరి! వారి కందఱకు ♦ సొంపుగ దేవివి గమ్ము, నా లస
న్మందిర మామహాంబునిధి ♦ మధ్యమునన్ నగమూర్ధ దేశమం
దుం దిరమైనలంక, యటఁ ♦ దోయజలోచన! నన్నుఁ బొందుమీ. ౭౭౫

వరాంగనల = స్త్రీలయందు శ్రేష్ఠురాండ్రను, ఏపునన్ = పరాక్రమముచే దేవివి = రాణివి, నీయిల్లెక్కడననుటకుఁ బ్రత్యుత్తరము చెప్పుచున్నాఁడు. నా లసన్మందిరము = ప్రకాశించు నాయొక్క గృహము - మహాంబునిధిమధ్యమునన్ = సముద్రము నడుమ, నగమూర్ధదేశమందున్ = పర్వతముయొక్క శిరోభాగమున, తిరమైన = నిలుకడగానుండు.

తా. నాకు స్త్రీలకఱవుగాలేదు. ఉత్తమస్త్రీల నెందఱనో బలాత్కార

ముగఁ బట్టి తెచ్చితిని. అయిన నీక న్నేనేలయందు వేమో వారికందఱకు నీవు ప్రభ్వినై యుండుము. నా గృహము లవణసముద్రము నడుమ కొండశిఖరముమీఁద నున్నది. దానికి లంకయని పేరు అచ్చటికి వచ్చి నాతోఁ గలియుము.

ఉ. అక్కడి ధర్మహర్మ్యముల ♦ నక్కడి సుందరనందనంబులం
దక్కడి సౌధవీథికల ♦ నక్కడి చారువిహార భూములన్
జెక్కువ మక్కువం జెలఁగి ♦ పెంపును సొంపు రహింప నుండెదే
నిక్కడి భీకరాటవు లి ♦ వేల రుచించెడి నీకు మోహినీ. ౨౨౯

మోహినీ = పురుషుల మోహింపఁజేయుదానా! రాక్షసుల మోహింపజేయ మోహిని యవతారమెత్తిన విష్ణువువలె నుండుదానా! అక్కడి = లంకయందలి, ధర్మహర్మ్యములన్ = బంగారు మేడలందును, సుందర నందనంబులన్ = అందమై నందనముఁబోలిన యుద్యానవనంబులందును, సౌధవీథికలన్ = అక్కడి మేడల వరుసలయందును, చారువిహారభూములన్ = మనోహరమై విలాసముగాఁ దిరుగుట కుపయోగపడు ప్రదేశములందును, జెక్కువ మక్కువన్ = హెచ్చగు ప్రేమచే, భీకరాటవులు = భయంకరములైన యడవులు.

తా. ఆ లంకలయందుండు బంగారు మేడలమీఁదను, నందనమువంటియందమైన యుద్యానవనములందును, అక్కడి తెల్లని మేడల చాలులందును, విలాససంచార యోగ్యములైన ప్రదేశములందును, నతిశయప్రీతితో పెంపు సొంపు రాణింపనుండెద వేని యిచ్చటి ఈ భయంకరారణ్యములు నీకెట్లు రుచింపఁగలవు?

కం. నా భార్యవైన నిను స, ర్వాభరణోపేత లైన♦యబ్జాక్షులు శ్ర
ద్ధాభక్తుల భజియించెద, రోభామిని యేనువేవు ♦ రుత్తమ కులజల్. ౨౩౦

సర్వాభరణోపేతలు = సమస్తభూషణములతోఁ గూడినవారు, అబ్జాక్షులు = కమలములవంటి కన్నులుగలస్త్రీలు, ఏనువేవురు = ఐదువేలమంది, ఉత్తమకులజల్ = గొప్ప వంశమునఁబుట్టినవారు, భజించెదరు = సేవించెదరు, రెండవయర్థమున, భార్య = భా + ఆర్య, భా = కాంతిచేత, ఆర్య = పూజ్యురాలు, నా భార్యవు = నాకు నీవు పూజ్యురాలవైతివేని, నాతోడ నైదువేలమంది స్త్రీలు నిన్నుఁ బూజించెదరని గ్రహింపవలయును.

తా. నాభార్యవు నీవైతివా సమస్తాభరణములతో నలంకరింపఁబడిన యైదువేల మంది యుత్తమవంశమునఁ బుట్టినస్త్రీలు శ్రద్ధాభక్తులతో సేవించెదరు.

—♦ సీత రావణు నిష్ఠురంబులు పలుకుట ♦—

కం. రావణుఁ డిట్లు పల్కిన సీ, తా వనజాక్షి యును దీన♦తరరుషచే ర
క్షోవిభుఁ దృణీకరించుచు, నీవిధమున మాటు పలికె ♦ దృఢమానసయై. ౨౩౧

తీవ్రతరరుషచేత = మిక్కిలి తీవ్రమైన కోపముచే, సీతావసజ్జాక్షియును, ఈ సముచ్చయము సీత మునుపటి యుపచారవాక్యములు వదలి యని సూచించును. తృణీకరించుచుక — గడ్డిపోచవలెఁజూచుచు, లక్ష్యముసేయక, దృఢమానసయై = గట్టిమనస్సుగలదియై — రావణుఁడు చెప్పినమాటలు భక్తితోఁ జెప్పఁబడి యుండిన సీత యేలకోపింపవలె ? సీతాదేవి భర్తృసిహృదయము తెలిసికోఁజాలని మూఢురాలా ? దీనికిసమాధానముగ రావణుఁడు పుత్రునితో సమానుఁడని యధ్యాహారముచేయవలయుననియు, వాఁడుచేసినది ప్రార్థనయైనను రావణుఁ డతి తామస భర్తుఁడగుటచే శ్రీరామవియోగము సంపాదించునని కోపించి సీత పలికెనని తీర్థీయము. అధ్యాహార కారులక్షణలచేఁ చేయఁబడు సిద్ధాంతము గ్రాహ్యము కాదని యీవఱకే చెప్పఁబడెను.

తా. ఈప్రకారము రావణుఁడు చెప్పఁగా మునుపటి యుపచారపద్ధతి వదలి, సీతాదేవి మిగులఁ గోపము రాక్షసులకుఁ బ్రభువైనను వానిని లక్ష్యముసేయక గట్టిమనస్సుగలదై యిట్లు బదులుచెప్పెను.

కం. భూమిధ్రమువ నకంప్యుఁడు, భాఁ ఉమరపతి యుదధినాఁగ ♦ నక్షోభ్యుఁడు శ్రీ
రాముఁడు నాహృదయేశుఁడు, రామానువ్రతను నేను ♦ రాక్షసరాజా. ౩౩

భూమిధ్రము = పర్వతము, అకంప్యుఁడు = కదలింపరానివాఁడు, పర్వతమువలె స్థైర్యధైర్యములు గలవాఁడు. భాక కాంతిచేత, అమరపతి దేవేంద్రుఁడు, దీనచే పతిత్వస్వామిత్వములు చెప్పఁబడెను. ఉదధినాఁగక - సముద్రమువలె, అక్షోభ్యుఁడు కలఁతిపట్టరానివాఁడు, సముద్రము పైభాగమున కలఁతఁజెసినను లోపల నే కలఁతయులేకయుండును. అట్లులే రామచంద్రము వర్తిపైక వ్యసనములెన్ని వచ్చినను నది హృదయమున వ్యాకులత కలిగింపఁజాలినదికాదు. నాహృదయేశుఁడు = నాభర్త. నా = అయోనిజనై పుట్టుమాహాత్మ్యముగల నాయొక్క, వీర్యశుల్కనైన నాయొక్క, సహధర్మచారిణినైన నాయొక్క, ఆయన బాహుచ్ఛాయాశ్రయబలమున నిర్భయురాలైన నాయొక్క, నీకొంపకూల్చుటకు వచ్చియుండు నాయొక్క భర్త - నాహృదయేశుఁడు = నాహృదయమునకు నీశురాలను నేను గాను-ఆయనయే-ఆయనహృదయానుసారముగ నాహృదయముండును. ఈశ ఈశితవ్యన్యాయము తప్పించి పోఁజాలదని భావము. కావున నీయిష్టప్రకారము వర్తింప నాహృదయ మంగీకరింపదు. రామ + అనువ్రతను రామునకు ననుకూలనై యుండుటయే వ్రతముగాఁగలదానను, ఆయనకనుకూలనై వర్తించుటే నాకు వ్రతముగాని నాకు మఱియొకవ్రతము లేదు. వ్రతభంగము సైఁచుదానఁగాను. శ్రీరాముఁడు లక్ష్మీదేవియందు రమించువాఁడు - నా భర్త అట్టి భగ

వంటిదాని పూర్వజన్మములందు నాయనకై తపస్సులుచేసి నాకుఁ బతిగా స్వామిగా సంపాదించుకొన్నదానను. నా హృదయేశుఁడు శ్రీ రాముఁడు = నాహృదయమునకు పతిపతి లక్ష్మీవల్లభుఁడే కాని యితరుఁడు కాఁడనుట. నాభర్త పర్వతమువలెఁ బిడుగులు మీఁదఁబడినను చలించువాఁడుకాఁడు. నీవో గాలికి గడ్డిపోచవలె బాణఘాతములకే పడఁకువాఁడవు. 'అట్టివీరుఁడు రామబాణార్తి మిగుల వడలి వడఁకుచు ధనువును విడిచెఁ బుడమి' (యుద్ధ ౧౩-౫౮ వ) నాభర్త భూమరపతి, నీవో యమరపతిచే యుద్ధమున గ్రస్తుఁడైనవాఁడవు. ఆయనకొడుకుచేతను బరాభవింపఁబడినవాఁడవు. రాముఁడక్షోభ్యుఁడు. నీవు కార్తవీర్యార్జునునితో యుద్ధమునఁ గలవరపడి కారాగృహవాసివైనవాఁడవు. అట్టి కార్తవీర్యార్జునునిఁజంపిన పరశురాముని జయించినవాఁడు నాభర్త.

తా. కొండవలెఁ గదలింపరాని స్థైర్యధైర్యములుగలవాఁడు. కాంతియందు దేవతలకు స్వామియుఁ బతియునైన యింద్రునివంటివాఁడు. సముద్రమునవలె కలఁత పెట్ట సాధ్యపడనివాఁడు అట్టి శ్రీరామచంద్రమూర్తి నాహృదయేశ్వరుఁడు. నేను రామున కనుకూలమైన వ్రతముగలదానను.

కం. శ్రీమహితలక్షణుఁడు వట, భూమిజపరిమండలుండు ♦ పురుతేజుఁడు స
త్యామితరక్తుఁడు రాముఁడు, రామానువ్రతను నేను ♦ రాక్షసరాజా. ౪౦

శ్రీమహితలక్షణుఁడు = సంపత్కరములు పూజ్యములు నైన శుభగుణములు గలవాఁడు. నీవో విష మహితలక్షణుఁడవు. శ్రీ — విషము. 'శ్రీర్వేషరచనా శోభా సంపత్పద్మశాభిషు, విషే బిల్వే లవంగేచ॥నానా॥౪॥ వటభూమిజపరిమండలుండు-వటభూమిజ — మఱ్ఱిచెట్టువలె, పరిమండలుండు — విస్తారముగా వ్యాపించియుండువాఁడు, మఱ్ఱివిత్తనమువలె సూక్ష్మదశయందు నణువులలో నణువుగానుండి నను వ్యాపించునప్పుడు జగత్తంతయు స్వరూపగుణములచే వ్యాపించువాఁడు. మఱ్ఱిచెట్టుకొమ్మలచే దిక్కులందు వ్యాపించినట్లు బంధువులచే వ్యాపించినవాఁడు (ii) దానివలె వందఱకు నాశ్రయణీయుఁడు (iii) 'కూపోదకం వటచ్ఛాయా యువతీనాం స్తనద్వయమ్। శీతకాలే భవేత్యుష్ణ ముష్ణకాలేచ శీతలమ్॥' బావినీళ్ళు మఱ్ఱిచెట్టు నీడ వయస్సుస్త్రీల స్తనము లుష్ణకాలమునఁ జల్లగాను, చలికాలమున వేడిగానుండునన్నట్లు సర్వకాలములందు నందఱకు ననుకూలుఁడని భావము — గోవిందరాజీయము. పురుతేజుఁడు = గొప్ప తేజస్సు గలవాఁడవు, సత్యామితరక్తుఁడు = సత్యమునందు నమితప్రేమగలవాఁడు. నీ వసత్యామితరక్తుఁడవు.

తా. శ్రీరామచంద్రమూర్తి సంపత్కరములై యాకారణముచేఁ బూజ్యములైన గుణములే చిహ్నములుగాఁ గలవాఁడు. మఱ్ఱిచెట్టు కొమ్మలచే నలుప్రక్కల

నావరించునట్లు ప్రపంచమంతయు స్వరూపముచేతను, గుణముచేతను వ్యాపించువాఁడు. గొప్ప తేజస్సుగలవాఁడు. సత్యమునందు మితములేనియనురాగముగలవాఁడు. అట్టి రామునకు నే ననువ్రతను.

క౦. రాముఁడు నరకేసరి సిం,హామితవిక్రాంతగామి ♦ హరితుల్యుఁడు దే
జో మేదురభుజవక్షుఁడు, గామానువ్రతను నేను ♦ రాక్షసరాజా. ౭౮౧

నరకేసరి = పురుషసింహము, పురుషులందు శ్రేష్ఠుఁడు పురుషోత్తముఁడు గదా, సింహా = సింహమువలె, అమితవిక్రాంతిగామి = మిగుల గర్వముతోఁ గూడిన గమనముగలవాఁడు, హరితుల్యుఁడు = విష్ణుసమానుఁడు, సమానుఁడనుటచేఁ దద్భిన్నుఁడని యర్థముకాదు. ఆదీపమువంటిదే యీదీపమనినట్లు ఒకపదార్థమే రెండుగాఁ గావచ్చునని యర్థము. పరమపదమందలి హరియే లీలావిభూతిరాముఁడనిభావము. నీవు కప్పవంటివాఁడవు- తేజస్ = పరాక్రమముచే- మేదుర = దట్టమైన, భుజవక్షుఁడు = భుజములు వక్షము గలవాఁడు. నీవు మాంసముచే నిండిన భుజవక్షస్సులు గలవాఁడవు.

క౦. భూమిీశకుమారుఁడు సమ,సోమసమాననుఁడు సద్య♦శోభరితుండున్
రాముఁడు జితేంద్రియుండు (శ్రీ), రామానువ్రతను నేను ♦ రాక్షసరాజా.

రాముఁడు భూమీశకుమారుఁడు = రాజపుత్రుఁడు, నీవో భూమీశ + కు + మారుఁడవు = రాజులపాలిటి కుత్సితశత్రువు, సమసోమ = పూర్ణచంద్రునితో,సమ = సరిపోలు, ఆననుఁడు = ముఖముగలవాఁడు. సద్యశోభరితుండున్ = సత్కీర్తిచే నిండినవాఁడు-నీవు తద్విరోధియగు కేతువుముఖమువంటి ముఖముగలవాఁడు. నీవు దుష్కీర్తిచే నిండినవాఁడవు. జితేంద్రియుఁడు = ఇంద్రియముల జయించినవాఁడు. నీవు ఇంద్రియజితుఁడవు. నీ వింద్రియములచే జయింపఁబడినవాఁడవు.

రామానువ్రతనని నాలుగుమార్లు చెప్పుట దార్ఢ్యము దెలుపుటకు.

ఉ. చెన్నఁటినక్క వీవు, నను ♦ సింహి సుదుర్లభఁ గోరువాఁడవా
నన్ను ఖరాంశుదీధితిని ♦ నా స్పృశియింపఁగ నీకు శక్యమా?
యిన్నిటి రామచంద్రుహృద ♦ యేశ్వరిఁ గోరుట మందభాగ్యుఁడా
కన్నుల నిష్ఠై కాంచెదవు ♦ కాంచనవృక్షచయంబు రాక్షసా. ౭౮౩

సింహి = ఆఁడుసింహమును, సుదుర్లభ = మిగుల, దుర్లభ = లభింపనిది, ఖరాంశు = సూర్యునియొక్క, దీధితినినాన్ = ప్రకాశమునునట్లు, స్పృశింపఁగన్ = తాఁకఁగన్, మందభాగ్యుఁడా = నిర్భాగ్యుఁడా, భాగ్యము క్షయించుకాలము దాపరించినవాఁడా, కాంచనవృక్షచయంబున్ = బంగారువృక్షముల గుంపు. ఇది

మరణచిహ్నము. సూర్యుని ప్రకాశమును దాఁకుటయనఁగాఁ బట్టుకొని వేఱొక చోటికిఁ దీసికొనిపోవుట, ఎట్లు సూర్యకాంతిని మనము పట్టుకొని గాదె బుట్టలో వేసి వేఱొకచోటికిఁ దీసికొనిపోయి రాత్రియందు విడువ సాధ్యపడదో, ఎట్లు ఎండను సూర్యుని వేఱుపఱుప సాధ్యముగాదో యట్లులే నన్ను శ్రీరాముని వేఱుపఱుపఁ జాలవు. నీ యిష్టమువచ్చినట్లు నీ కనుకూలముగా నన్నుపయోగించుకొనుటకు సాధ్యపడను. అని భావము.

తా. నీవు చెడ్డనక్కవలె వంచకుఁడవు, క్షుద్రజంతువవు. నేను ఆఁడుసింహమును-లభింపరానిదానను గాను. ఇట్టి నన్ను నీవాకోరెదవు? సూర్యతేజస్సును పట్టుకొనరాని యట్లు నీవు నన్ను స్పృశింపఁగనైన సాధ్యమా? బలవంతమున నీవున్నచోటికి నెండ వచ్చునా? ఇటువంటి రామచంద్రమూర్తిభార్యను గోరుటచే నీకు మరణకాలమాసన్నమయ్యెను. బంగారు చెట్లను నిపుడే చూడఁగలవు.

ఉ. నిష్ఠురదుఃక్షుధాకుపిత ♦ నిర్భరవేగ మృగేంద్ర గూఢపా
ద్వృష్ఠకఠోరదంష్ట్రలను ♦ బీకఁగఁ బూనుట, ధారిణీధర
శ్రేష్ఠము మందరంబు నఱ ♦ చే హరియింపఁగ నూనుటల్ నర
శ్రేష్ఠరఘూత్తమాత్మసతి ♦ నీ వెదఁ గోరుట యోదురాత్ముఁడా. ౭౮౪

ఈ ప్రకారము రామచంద్రమూర్తి గొప్పతనము ఆయనకుఁ దనకుఁ గల సంబంధము దెలిపి యిఁక రావణుని నీచత్వమును దెలుపుచున్నది.

నిష్ఠుర = క్రూరమైనదియు, దుః = సహింపరాని, క్షుధా = ఆఁకలిచేత, కుపిత = కోపించినదియు, నిర్భరవేగ — అధికవేగముగలదియు నగు, మృగేంద్ర + గూఢపాత్ శ్రేష్ఠ = గొప్ప సింహముయొక్కయు, సర్పముయొక్కయు, కఠోర దంష్ట్రలను — కఠినములైన కోఱలను, ధారిణీధర శ్రేష్ఠము = గొప్ప పర్వతమగు, మందరంబున్ = మందరపర్వతంబును, నరశ్రేష్ఠ = పురుషులందు శ్రేష్ఠుఁడగు రఘూత్తమ + ఆత్మ + సతి = శ్రీరామచంద్రమూర్తికి నాత్మయగు భార్యను, దురాత్ముఁడా = చెడ్డమనస్సు గలవాఁడా.

తా. సహింపరాని యాఁకలిచే నాహారార్థమై వేగముగఁ బోవుచున్న సింహమును బెనుబామును గోఱలు పీకఁ యత్నించుటయు, మందరపర్వతము నఱచేత నిమిడించుకొని పోవఁజూచుటయు నీవు పురుషశ్రేష్ఠుఁడైన శ్రీరామచంద్రమూర్తి కాత్మయగు భార్యను హరించుటయు పాపాత్ముఁడా సమానములు.

రాక్షసులు చేసిన దుష్టకార్యములకుఁ గోపించి వారిని జంపుటకై వచ్చియుండు శ్రీరామచంద్రుని భార్యను హరింపఁజూచుట ఆఁకలిగొన్న సర్ప సింహముల కోఱలు పీకఁబూనుట వంటిది.

ఇందు సింహమునకు - పామునకు - శ్రీరామచంద్రమూర్తికిని, కోఱకు - సీతాదేవికిని నుపమానోపమేయములు. రామ సర్పమునకు, రామసింహమునకు, సీతాదేవి కోఱ-కోఱలో నే సింహము పాము ఎట్లు జంతువుల బాధించునో యట్లే శ్రీరామచంద్రమూర్తి సీతాదేవిమూలమున రాక్షససంహారము చేయనున్నాఁడని భావము. కోఱలేని సింహము పాము-సింహమును పామును విడిచిన కోఱలు దుర్బలములు-కావున సీతలేని రాముఁడు, రాముఁడులేని సీత, దుర్బలులే యనియు, తన కోఱను సింహము పాము రక్షించుకొనువిధమున సీతను రామచంద్రమూర్తి రక్షించుకొనుననియు, ఆ విషయమున సీతాప్రయత్న మనావశ్యకమనియు నేను రామునకు సాధనమాత్ర మనియు భావము.

యథా మయా జగద్వ్యాప్తం, స్వరూపేణ స్వభావతః।
తయా వ్యాప్త మిదం విశ్వం, నియంత్రీచ తథేశ్వరీ॥

అన్నట్లు సమస్త ప్రపంచమున వ్యాపించియుండు నన్ను నీవు మందరమును నఱచేతిలో నిమిడించుకొనఁ జూచెదవే! ఇది నీకు సాధ్యమా?

మందరపర్వతమునకంటె గొప్పవి శ్రేష్ఠములైనవి హిమవత్పర్వతము, మేరు వుండఁగా మదరమును బోల్చి చెప్పనేల? భగవంతుఁడు మందరధరుఁడు గాని హిమవత్పర్వత ధరుఁడు కాఁడు. మేరు ధరుఁడు గాఁడు. మందరపర్వతమునకు విష్ణుఁ డాధారము రక్షకుఁడైనట్లు నాకు శ్రీరామమూర్తి యని భావము. మఱియును మందరము తన్నాశ్రయించిన వారికి నమృత నొసఁగెనో యట్లే నన్నాశ్రయించిన నీకు మేలు గలదు గాని నాతో విరోధించినఁ జెడుదువని భావము. నిదర్శనాలంకారము. సమాన వాక్యార్థముల కైక్యము చెప్పుట నిదర్శనాలంకారలక్షణము.

చ. పటుతర కాలకూటవిష♦పానముఁ జేసియు సౌఖ్యరీతిఁ గో
రుట, శితసూచికాగ్రములఁ♦గ్రొవ్వున లోచనమార్జనంబు సే
యుట, పెనుబండ కంఠమున ♦ నుండఁగ నంబుధి దాఁట నెంచుటల్
చటులపరాక్రమప్రకట♦సత్త్వరఘూత్తముభార్యఁ గోరుటల్. ౭౮౫

కాలకూటవిషపానము జేసియు = కాలకూటమను పేరుగలవిషమును త్రావియు, శిత = కూచియైన, సూచికాగ్రములఁ = సూదికొనలచే, లోచనమార్జనంబు = కన్నులు గోఁకుకొనుట, చటుల పరాక్రమప్రకట = యుద్ధమందు మెఱుఁగుఁదీఁగవలె మెఱయు పరాక్రమముచేఁ బ్రసిద్ధమైన, సత్త్వ = బలముగల, నిదర్శనాలంకారము.

తా. చంపుటయందు మిక్కిలి సామర్థ్యముగల కాలకూటవిషమును త్రావియును సుఖముగా జీవింపఁ గోరుటయు, సూదికొనలచేఁ గన్నులు గోఁకికొను

టయు, పెద్దబండ మెడకుఁ గట్టుకొని సముద్రము నీఁదఁబూనుటయు నెట్టియపాయకరము లైన కార్యములో యుద్ధమునందు మహాబలపరాక్రమసంపన్నుఁడైన శ్రీరాముని భార్యను గోరుటయు నట్టి యుపాయకరమైనదే.

ఆ మాఁటివలనఁ జెడువాఁ డొక్కఁడొక్కఁడే. శ్రీరాముని భార్యను గోరుటవలన వంశమే నాశమగును.

క॥ కాలాయసశూలాగ్రము, పై లాఁగులు వేయఁగనుట ♦ ప్రజ్వలితాగ్నిన్ జేలాగ్రంబున ముడుచుట, నాలుక నసి నాకుటగును♦నను నీ కొనుటల్. ౪౪

కాలాయస = ఉక్కుతోఁ జేయఁబడిన, శూలాగ్రముపైన్ = శూలము కొన మీఁద, లాఁగులు = గంతులు, లంఘన శబ్దభవము లాఁగు. ప్రజ్వలితాగ్నిన్ — మండుచున్న యగ్నిని, చేలాగ్రంబునన్ = వస్త్రము కొనయందు, ముడుచుట = ముడి వేయుట, అసిన్ = కత్తిచే.

తా. నీవు నన్ను గ్రహించుటలు ఉక్కు శూలము కొనయందు లాఁగులు వేయుట, మంటను కొంగున ముడివేయుట, నాలుకతోఁ గత్తిని నాకుట యెట్టిదో యట్టిదే యగును.

కం. ఖరకర హిమకరులను నీ, కరతలములఁ బట్టుకొనుట♦గాఁ దలఁపుము భీకరశరుఁడగు శ్రీరాముని, పరమప్రియ నన్నుఁ బట్ట ♦ భావించుటయున్. ౪౫

ఖరకర-హిమకరులను — సూర్యచంద్రులను, భీకరశరుఁడు — భయంకరములైన బాణములు గలవాఁడు, పరమప్రియన్ — మిగులఁ బ్రియురాలిని, భావించుట — ఆలోచించుట.

తా. సూర్యచంద్రులను నఱచేతఁ బట్టుకొనుట యెట్టిదో, భయంకర బాణములు గల శ్రీరామునికి మిగులఁ బ్రియురాలగు నన్నుఁ బట్ట నాలోచించుట యట్టిదిగాఁ దలంపుము.

చ. హరిమృగధూర్తకంబులకు ♦ నంబుధి కుల్యలకున్ విహంగరా
ట్పరపికవర్ధనంబులకు ♦ వారణమూషక బర్హిమద్గులన్
బరమసురాగ్ర్యకుంజలవి♦భాసిత చందన పంకవారులం
బరఁగెడు నంతరంబె రఘు♦వర్యునకున్ విను నీకు రావణా. ౪౬

హరి = సింహమునకు, మృగధూర్తకము = నక్క, స్త్రియాం శివాభూరిమాయు గోమాయు మృగధూర్తకాః సృగాల వంచకక్రోష్టు ఫేరు ఫేరవ జంబుకాః॥ అమరకోశము. అంబుధి = సముద్రము, కుల్య = చిన్న కాలువ, విహంగరాట్ — పక్షిరాజు, గరుత్మంతుఁడు, పికవర్ధనము = కాకి, వారణ = ఏనుఁగు; మూషక —

ఎలుక, బర్హి = నెమలి, మద్గువు = నీరుకాకి, సురాగ్ర్యము = శ్రేష్ఠమైనకల్లు. కుంజల = పులియఁబెట్టఁబడిన కడుగునీళ్ళు, కుంజలము, ఆరనాళకసౌవీర కుల్మాషాభిషు తానిచ। అవంతీసోమధాన్యామ్లకుంజలానిచ కాంజికే॥ అమరకోశము. విభాసిత = పరిమళముచే మిగులఁ బ్రకాశించు, చందన = శ్రీగంధమునకు — పంకవారులన్ = బురదనీళ్ళయందు, అంతరము = భేదము. అంతరము — అంతర మవకాశావధి, పరిధా నాంతర్ధి భేద తాదర్థ్యే, ఛిద్రాత్మీయవినా బహి రవసర మధ్యేంతరాత్మనిచ ॥ అమరకోశము.

తా. రాముఁడుమాత్రమా మగవాఁడు శూరుఁడు నేను గానా యందువేమో ? సింహమునకు నక్కకు, సముద్రమునకు-వీధుల వెంటఁ బారు చిన్నకాలువకు, గరుత్మంతునకుఁ గాకికి, నేనుఁగునకు నెలుకకు, నెమలికి నీరుకాకికి, శ్రేష్ఠమైన సారాయమునకు పుల్లని కడుగునీళ్ళకు, శ్రీగంధమునకు బురదనీటికి నెంత తారతమ్యముగలదో శ్రీరామచంద్రునకు నీకు నంత తారతమ్యము గలదు.

కం. కాంచన సీసములకు రా,యంచకు గ్రద్దకును గల్గు♦నంతర మే యీరా
సంచితగుణి రామునకు, న్వంచకుఁడగునీకుఁ గలదు♦పరికీలింపన్. ౪౮

రాయంచ = రాజహంస.

తా. బంగారునకు సీసమునకు, రాజహంసకు గ్రద్దకు గల భేదమే సుగుణశ్రేష్ఠుఁడైన శ్రీరామునకు మోసగాఁడగు నీకుఁ గలదు.

ఉ. కర్బురపుంఖసంకలిత ♦ కాండవిభాసితచాపహస్తుఁడై
బర్బరపాణి రాఘవుఁడు ♦ వాసవతుల్యుఁడు నాకుఁ గల్గఁగా
దుర్బల నంచు నీవు నను ♦ దోర్బలవృత్తి హరించి తేనియుం
గర్బురనాథ మక్షికముఁ ♦ గల్గినయాజ్యమ నౌదు నీ కెటుల్. ౪౯౦

కర్బురపుంఖ = బంగారుపిడులతో, సంకలిత = కూడిన, కాండ = బాణములచే, విభాసిత = ప్రకాశింపఁజేయఁబడిన, చాపహస్తుఁడై = విల్లు చేతియందుఁగలవాఁడై, బర్బరపాణి = కఱుకైన హస్తముగలవాఁడు, వాసవతుల్యుఁడు = ఇంద్రునితో సమానుఁడు, దుర్బల = బలహీనురాలు, దోర్బలవృత్తి = భుజబల వ్యాపారముచే, కర్బురనాథ = రాక్షసరాజా, మక్షికము = ఈఁగ, ఆజ్యమను = నేతిని.

తా. బంగారుపిడుగులుగల బాణములచేఁ బ్రకాశించు విల్లు ధరించు రామచంద్రుఁడు యుద్ధమునందు బిఱుసగు చేయిగలవాఁడు నాకు రక్షకుఁడై యుండఁగా నిది యేఁడుది యబల యేమిచేయఁగలదని నీవు నీభుజబలముచే హరించినను, నీఁగతోడ నేతిని గ్రాగిన వానికడుపులో నిండక నేతితోడ నెట్టు లీఁగ వాంతిపుట్టించి

యీ నేతిని జీర్ణముకాకుండఁ జేయునో యట్టులే చేయుదును. నన్ను నీవు జీర్ణించు కొనలేవు. నీవు నీవారితోడఁ జెడుదువు.

కం. అని దృఢమతిఁ బరుసంబుల, ననియు వెఱన్ గాలిఁ గదలు ♦ నలఁతియరఁటియో
యన గడగడనడఁకఁగ న, ద్దనుజుఁడు భయపెట్టఁ బలుకుఁ ♦ దనకులబలముల్.

దృఢమతిన్ = జంకుగొంకులేక దిటమగు మనస్సుతో, పరుసంబులు - కఠినోక్తులు, అనియున్ = పలికియును, వెఱన్ - భయముచే, అలఁతియరటియో - లేఁత యరఁటిచెట్టో. రావణుని సమూలము నాశముచేయవలయునని కంకణము గట్టుకొని వచ్చియుండు నామె సమయమువచ్చినపుడు భయపడనేల? రావణుఁడు హరించి తన్నుఁ జెఱుచునో చంపునోయన్న భయము సీతకులేదు. రామవియోగముకలుగఁ గలదే. అది యెట్లు సహింపఁగలనని భయమేకాని యితరభయ మామెకు లేదు. అదియునుగాక గొప్పకార్యము తలపెట్టినపుడు కార్యారంభమున జంకు కొంచెము సాధారణముగాఁ గలుగును. అన్నిసంవత్సరములు యుద్ధప్రయత్నముచేసి యుద్ధరంగమునవచ్చి నిలిచిన యర్జునుఁడు గెలుతు వారల గెలువందలేమో గెలుతు రేమోవారే యని సందేహించెఁగద. ఈమెకుఁ బాంధవభయములేదుగాని వియోగమునకు వెఱచెను.

తా. అట్టి గట్టిమనస్సుతోఁ గఠినవాక్కులాడియు భయముచే నోరుగాలికి వణఁకు లేఁతయరఁటిచెట్టువలె గడగడవడఁకసాగెను. అదిచూచి యామెను మఱింత భయపెట్ట రావణాసురుఁడు తన కులము బలము వర్ణించుచున్నాఁడు.

—♦౪౭-వ సర్గము. సీతకు రావణుఁడు తనస్వరూపముఁజూపి భయోత్పాదనముగావించుట.♦—

చ. విపులలలాట దేశపరి♦వేల్లితభ్రూకుటిడై సురారి దు
ష్కుపితకఠోరవాక్యములఁ ♦ గోమలి కిట్లను నన్ను నేమిగాఁ
జపలమృగాక్షి చూచెదవు ♦ శంకరమిత్రసహోదరుండ య
క్షుపుఁడు విమాత్రుజుండు దశ♦కంఠుఁడ రావణనామధేయుఁడన్. ౨౯-౧

విపుల = విశాలమైన, లలాటదేశ = నొసటి స్థలమునందు, పరివేల్లిత — ఆడుచున్న, భ్రూకుటిడై = బొమముడిగలవాఁడై, సురారి = దేవవిరోధి, దుష్కుపిత కఠోరవాక్యములన్ = చెడ్డకోపముగలవాని కఠినపుమాటలతో, చపల మృగాక్షి = చలించు జింకకన్నులవంటి కన్నులుగలదానా, శంకరమిత్ర = ఈశ్వరునికి స్నేహితుఁడైన కుబేరుని, సహోదరుడన్ = తోడఁబుట్టినవానిని, తమ్ముఁడను, యక్షుపుఁడు = కుబేరుఁడు, విమాత్రుజుండు = సవతితల్లికొడుకు, దశకంఠుఁడ = నీ

ముగఁ దొక తలగలవాఁడైన నేను బదితలలుగలవాఁడను. రావణు డనుసార్థక నామధేయము గలవాఁడను.

సీ. ఎవ్వానిఁ గని భీతి ♦ మృత్యువుఁ గని నట్లు, పఱచు గంధర్వాహి ♦ పతగవితతు
లెవ్వాని నని దాఁకి ♦ హేత్వంతరంబున, నరవాహనుం డోడి ♦ పరువు వాఱె
నెవ్వానిభీతి స♦మృద్ధిమన్నిజపురి, వీడి శ్రీదుఁడు చేరె ♦ వెండికొండ
నెవ్వఁ డాతని కామ♦గేద్ధపుష్పాఖ్యవి, మానంబు నొడిచె స్వ♦యానముగను

తే. యట్టినామోముఁ జూచిన ♦ నడలి సడలి, వడఁకి తడఁబడి పఱతురు ♦ వాసవాది
విబుధు లెవ్వఁడుగలచోట ♦ వెఱచిగాలి, వీవఁ డుష్ణాంశుఁడగుఁ జలి ♦ వెలుఁగుగాఁగ.

గంధర్వ — అహి — పతగ — వితతులు = గంధర్వులు, పన్నగులు - గరుడులు- పిసిస సమూహములు, హేత్వంతరంబునన్ = వేఱొకకారణముచే, ఇది మయూర వ్యంసకసమాసము. నరవాహనుఁడు = కుబేరుఁడు, సమృద్ధిమత్ = ఐశ్వర్యముతోఁ గూడిన, నిజపురి = తనపట్టనమగులంకను, శ్రీదుఁడు = కుబేరుఁడు, వెండికొండన్ = కైలాసమును, కామగ = కోరినట్లుపోఁగల, ఇద్ధ = ప్రసిద్ధికెక్కిన, పుష్పకాఖ్య విమానము = పుష్పకమనుపేరుగల విమానము, ఒడిచెన్ = లాగుకొనెను, స్వయానముగను = తనవాహనముగ, ఉష్ణాంశుఁడు = వేఁడికిరణములుగల సూర్యుఁడు, చలివెలుఁగు = చంద్రుఁడు.

తా. గంధర్వులు, పన్నగులు, గరుడులు, లోనగువారు, మృత్యువును జూచినట్లు లెవ్వానిఁ జూచినంత మాత్రమునఁ బరువెత్తుదురో, ఏదో యొకకారణముచే యుద్ధమందు నెవనితోఁ డికొని కుబేరుఁడు పరువెత్తెనో, ఎవనికి భయపడి సర్వైశ్వర్య సంపూర్ణమగు తనపట్టనము లంకను విడిచి కుబేరుఁడు కైలాసముఁ జేరెనో, ఎవ్వఁ డతని కామసంచారముచేయు శక్తిగల విమానమును పుష్పకమను దానిని లాగికొని తనవాహనముగఁ జేసికొనెనో యట్టి నాముఖముఁ జూచినంత మాత్రమున భయపడి క్రిందపడి వడఁకి కాళ్ళు తడఁబడ నింద్రుఁడు మొదలైనదేవతలు పరుగెత్తుదురు. నేనున్నచోట గాలి కదలదు. సూర్యుఁడు చంద్రునివలెఁ జల్లగ నుండును.

కం. ఎట నెట నే నిలిచినఁ జన, నట నట నల్లాడ దొక్క ♦ యాకేఁ జెట్లన్
ఝురరయము వదలి నదులును, గుటిలాలక పాఱ వెఱచి♦గుదినడి నిలుచున్.

కుటిలాలక — వంకరయగు ముంగురులు గలదానా, ఉంగరములవలెఁ జుట్టుకొని యుండు ముంగురులు గలదానా.

తా. ఎందెందు నేను నిలుతునో యక్కడఁ జెట్లయం దొక యాకైన నా

భయమునఁ గదలదు. నదులుకూడ వాని వేగము వదలి కట్టచేఁ గట్టఁబడినట్లు కదలక నిలుచును.

సీ. క్రూరులై భీకరా ♦ కారులై వెలసిన, రాక్షసజనులచే ♦ జోకఁ గూడి
పూర్ణమై ప్రాకార ♦ కీర్ణమై కాంచన, కక్ష్యావితతుల సం♦లక్ష్యమగుచు
వారణాదులమణి♦తోరణాదులఁ బొల్చి, తూర్యనినాదగాం♦భీర్య మగుచు
నుద్యానచరశోభి♦తోద్యానసర్వర్తు, సూనఫలావళీ♦స్థాన మగుచు

తే. మత్పురము పొల్చు సాగర ♦ మధ్యమునను శక్రపురితుల్యమగుచు ని ♦ర్వక్రవిభవ
మలర లంకాఖ్యపట్టన ♦ మలరుఁబోణి. కానఁగా రమ్య మ్మె కన్నుల♦కఱవు దీఱ.

ప్రాకారకీర్ణమై = ప్రాకారముచేఁ జుట్టఁబడినదై, పూర్ణమై = మంచిపదార్థములచే నిండినదై, కాంచనకక్ష్యావితతులన్ = బంగారు తొట్టికట్ల సమూహములచే, సంలక్ష్యము = చూడఁబడినది, వారణాదులన్ = ఏనుఁగులు మొదలైన వానిచే తూర్య = వాద్యములయొక్క, నినాద = ధ్వనిచే, తోరణము = బహిర్ద్వారము, ఉద్యానచర = దేవతలచే, శోభిత = ప్రకాశించు, ఉద్యాన = తోఁటలయందలి, సర్వర్తు = అన్ని ఋతువులయందలి, సూన = పుష్పములయొక్కయు, ఫల = పండ్లయొక్కయు, ఆవళీ = సమూహమునకు, స్థానము + అగుచు = నెలవై, మత్ + పురము = నాయొక్క పట్టనము, సాగరమధ్యమునను = సముద్రమునడుమ, శక్రపురితుల్యము = ఇంద్రుని పట్టనముతో సమానము, నిర్వక్రవిభవము = వంకరపోని సంపద, లంకాఖ్య = లంక యను పేరుగల పట్టనము.

తా. క్రూరులును, భయముగలిగించు నాకారముగల రాక్షసులను గలదై, సర్వపదార్థములచే నిండి ప్రాకారముచేఁ జుట్టఁబడి బంగారు మయములైన తొట్టికట్లు, ఏనుఁగులు, రథములు, గుఱ్ఱములుగలదై మణులతోఁ జేయఁబడిన తోరణములుగలిగి మంగళవాద్యములు బోరుకొలుపుచుండ గంభీరమై దేవతలు సంచరించుటచే శోభించు నుద్యానమందలి సర్వఋతువులందుఁ బూచుకాచు పూలు పండ్లుగల చెట్లకు నెలవై సముద్ర మధ్యమునందు నింద్రపురితో సమానమ్మౌ లంక యను పేరుగల నాపట్టనము గలదు. కుసుమకోమలా! చూచుటకు రమ్యము. ఈ పాడవులు చూచిచూచి మంచివస్తువులఁ జూడఁగోరు నీ కన్నులకు సంతోషము కలుగును.

తే. అందు నాతోడ నీవు సా♦నంద వగుచు
మందగమనరో క్రీడల ♦ నుందు వేని
డెందమునయందుఁ దలఁపఁగఁ ♦ గంద మనుజ
సుందరీబృందముల నోసి ♦ కుందరదన.

సానందవు = ఆనందముతోఁ గూడిన దానవు, మందగమనరో = మెల్లని నడకగలదానా, "రోశబ్దంబొండు సంబోధనంబున స్త్రీవాచకంబునకుఁ బరంబుగ నగు-అయ్యాది ప్రహస్వాంతంబును నగు-స్త్రీవాచకమనుటచే, అన్నరో, ఏనుంగురో యనునవి యపప్రయోగములు-బృందములను = సమూహములను, కుందరదన = మొల్ల మొగ్గలవంటి దంతములు గలదానా.

తా. నీవు సంతోషముతో నా పట్టనమందు నాతోడఁ గ్రీడింపఁ గలిగెనేని యావల నీ వేల మనుష్యస్త్రీల గుంపును, మనస్సునందైన స్మరింతువు ?

కం. మానుషసురసుఖములఁ జం, ద్రానన యట మరిగి యవల ♦ నాత్మఁ దలఁతువే
మానవు గతాయు వగు నొక, హీనుని దుర్బలుని భాగ్య ♦ హీనుని రాముఁన్.

౧౬౩-వ పద్యమున మనుష్యసుఖము లెల్ల ననుభవించితిననిన మాటకు రావణుఁడు ప్రత్యుత్తరమిచ్చుచున్నాఁడు. అటన్ = లంకాపురమునందు, చంద్రానన = చంద్రబింబమువంటి ముఖము గలదానా, మానుషసురసుఖములన్ = మనుష్యులనుభవించు సుఖములను దేవతల సుఖములను, మరగి = అలవాటుపడి, గతాయువు = క్షీణించిన యాయుస్సు గలవానిని.

తా. నీ వయోధ్యయందు మనుష్యసుఖము లనుభవించితి నని చెప్పితివి. లంకకు వచ్చితివా యందు మనుష్యసుఖములు దేవసుఖములుగూడ ననుభవింపఁ గలవు. వానికి నలవాటుపడితివా యీ మిమ్మట నిప్పుడు నీవు గొప్పవానిగాఁ దలఁచు రాముని మనుష్యమాత్రుని, నీ వియోగదుఃఖముచేఁ జచ్చినవానిని, నీచుని, బలహీనుని, దరిద్రునిఁ దలఁపనైనఁ దలఁతువా ?

మ. తన రాజకుమారు రాజ్యమున సం ♦ స్థాపించి నీమామ జ్యే
ష్ఠునిఁ దన్ను న్నిరసింప హీనబలుఁడై ♦ పోచ్చెన్ వనాంతంబులన్
జనునే నీ కటువంటి దుర్బలుని రా ♦ జ్యభ్రష్టు నల్పాయువున్
వనచారి న్మునివేషుఁ గట్టుకొని యే ♦ డ్వం గానలో సుందరీ. ౧౬౪

రామునియందలి గుణములను దోషములుగాఁ జెప్పుచున్నాఁడు. రాజకుమారున్ = ముద్దులకొడుకును-భరతుని, జ్యేష్ఠున్ = పెద్దవానిని, నిరసింపన్ = తెలుమఁగొట్టఁగా, హీనబలుఁడై = బలహీనుఁడై, వనాంతంబులన్ = అడవులందు, దుర్బలునిన్ = బలహీనుని, రాజ్యభ్రష్టున్ = రాజ్యమువలన భ్రష్టుని, అల్పాయువున్ = అల్పకాలము మాత్రమే జీవింపఁ గలవానిని, వనచారిన్ = అడవులందుఁ దిరుగువానిని, ఏడ్వన్ = దుఃఖింపఁగ.

తా. తన ముద్దుకొడుకు భరతునకుఁ బట్టాభిషేకముఁ జేసి నీమామ పెద్దవాఁడగుటచే న్యాయముగ రాజుగావలసిన తన్ను నూరనుండి వెడలఁ గొట్టఁగా

రాజ్యము సాధించుబలము లేని కారణమున నడవులందుఁ బ్రవేశించెను. న్యాయముగఁ దనకు రావలసిన రాజ్యమును దక్కించుకొనుశక్తి లేని బలహీనుని, నా కారణమున నూరిలోనైన నుండనీక తఱుమఁగొట్టఁగా రాజ్యమును వదలిన వానిని ఆ కారణముచేత నే జీవనమునకు లేని కారణమున క్షీణించిన యాయుస్సుగల వానిని, ఊరనుండినఁ జంపుదురను భయముతో నడవుల పాలయి యొంటిగా నిందువచ్చి డాఁగినవానిని, "భగ్నాః కృషే ర్భాగవతా భవంతి" యన్నట్లు, కృషిభగ్నము కాఁగా భాగవతుఁడై మునివేషము వేసికొనినవానిఁ గట్టుకొని యడవులలో దుఃఖించుచుండ నెంతో యందకత్తెవగు నీకుఁ దగునా.

ఉ. నీ కిది ధర్మ మా నటవె ♦ నిష్ఠురశీలిని! పంచబాణబా
ణాకులితాంతరంగమున ♦ నాసమెయిం దమిఁ దాన వచ్చి ని
న్నో కమలాక్షి వేఁడికొను ♦ చున్ననిశాచరలోకనాథునిం
బ్రాకటలీల నేల కన ♦ మానముగాఁగఁ దృణీకరింపఁగన్.	౯౯

నిష్ఠురశీలిని = కఠినస్వభావము గలదానా, పంచబాణ = మన్మథునియొక్క, బాణ = బాణములచే, ఆకులిత = కలఁతచెందిన, అంతరంగమునన్ = మనస్సుచే, ఆసమెయిన్ = ఆశచే, తమిన్ = మోహముచే, తృణీకరింపఁగన్ = గడ్డిపోఁచవలె నలక్ష్యముగాఁ జూచుట.

తా. సీతా నీ వెంత కఠినస్వభావము గలదానవే. అట్లుగాకున్న మన్మథ బాణములచేఁ గలఁతచెందిన మనస్సుగలవాఁడై, యెంతో యాశపడి, నీతో సుఖ మనుభవింపఁగోరి వచ్చియున్న రాక్షసలోకమున కంతయుఁ బ్రభువైన నన్ను గడ్డిపోఁచను జూచినట్లు లలక్ష్యముగా నవమానకరముగఁ జూచుచున్న దానవే. ఇది నీకు ధర్మమా, ఎదుటివారి పరు వాలోచింపవలదా.

ఉ. భీరు! నిరాకరించి ననుఁ ♦ బిమ్మట వేఁగెదు మారుకాఁకలన్
ధారుణి మున్ను దాఁ జరణ ♦ తాడితుఁ జేసి పురూరవున్ వ్యథన్
గూరిన యుర్వశీ తరుణి ♦ కోపున, రాముఁడు యుద్ధభూమి నా
గోరికి సాటిరాఁడు, ననుఁ ♦ గూడుటకు న్మది సంశయించెదే.	౧౦౦

భీరు = పిఱికిదానా, వేఁగెదు = సంతాపపడెదవు, మారుకాఁకలన్ = మన్మథ తాపముచే, చరణతాడితున్ = కాలితోఁ గొట్టఁబడినవానిని, ఉర్వశీ = దీనిని గొందఱు ఊర్వశి యని వ్రాసెదరుగాని ఉర్వశి యను రూపమే సాధువని "దధత్యురోజ ద్వయముర్వశీతలం, భువోఽగతేన స్వయముర్వశీతల" మ్మను మాఘయమకము వలనఁ దెలియనగు. నారాయణుని ఊరువులందుఁ బుట్టినది యను నర్థమందును పృషోదరాదులలోఁ జేరుటచే వర్ణము లోపించి హ్రస్వాదితాలవ్యాంతమునగు

రావమే సాధువు అని గోవిందరాజీయము. ఉరు = అధికం, వష్టి = ప్రకాశత యితి ఊర్వశీ-వశకాంతో = మిక్కిలి ప్రకాశించునది. పా - ఊర్వశి - నారాయణుడు తపస్సు చెఱుప నప్సరస్త్రీలు రాగా నాయన తన తొడయందు దీనిని బుట్టించెను. దాని సౌందర్యమును జూచి వారు సిగ్గుపడి దానినే తమకు నాయికగా గ్రహించి కొని పోయిరి. యిది కొన్నాళ్ళు పురూరవు భార్యగా నుండెను. దీని కథకే కాళిదాసు విక్రమోర్వశీయ మనుపేర నాటకము వ్రాసెను. దీని చరిత్రము భారతమున ఆది పర్వమునందును, విష్ణుపురాణము IV 6-15 నందును గలదు. భాగవతము ౯-౧౪ నందును గలదు.

తా. పిఱికిదానా ? యిప్పుడు లోకమునకో - మగనికో బంధువులకో భయపడి నన్ను దిరస్కరించుచున్న దానవు. కాని యీావల నీవే మన్మథ తాపముచే పరితాప పడెదవు. నీవలె పూర్వ మూర్వశి తన్నుఁగోరిన పురూరవుని కాలితోఁదన్ని యీావల నయ్యో యెంత పొరపడితిని. అటువంటివానిఁ పోఁగొట్టుకొంటినే. ఇప్పుడు నా తాప మెవ్వరు తీర్పఁగలరని పశ్చాత్తాప పడలేదా. నీ గతి యంతే యగును. రాముఁ డేమో మహా బలపరాక్రమ సంపన్నుఁడని చెప్పెదవు. నా కాలికిఁ గూడ సమానుఁడు కాఁడు. నన్ను = లోకము లన్ని హాహా యని యేడ్పించువానిని నన్ను - దేవతాస్త్రీల గర్భములు పేరు చెప్పినంత మాత్రమున విచ్ఛిత్తిచేయువానిని నన్ను - పది తలల వానిని నన్నుఁ - కైలాసపర్వత మెత్తిన వానిని నన్ను - కుబేరు నోడించి పుష్పకము హరించినవానిని నన్ను - నిందుని బందీలో నుంచిన వానిని నన్ను బ్రహ్మచే, శివునిచే వరములు నొందినవానిని నన్ను - మూఁడు లోకములు జయించిన వానిని నన్ను - నిట్టి నన్నుఁ గూడుటకు నీకు సందేహమట వే. నీవైన వచ్చి నన్ను ప్రార్థింపవలసి యుండఁగా నేనే వచ్చి వేఁడినఁ గూడుదునా వలదా యని యేమో సందేహించెదవా.

తే. నీ యదృష్టంబు పండుట ♦ నీరజాక్షి
వచ్చినాఁడను బ్రోవంగ ♦ వలదు నన్నుఁ
బొంకుమీ యనఁ గ్రుద్ధయై ♦ భూమిజాత
పరుషవాక్కుల దశకంఠుఁ ♦ బలికె నొంటి. ౨౦

అదృష్టంబు = భాగ్యము, నీవు పూర్వజన్మమునఁ జేసిన పుణ్యము ఫలించుట చేత - క్రుద్ధయై = కోపించినదై.

తా. నీ పూర్వపుణ్యము ఫలించుటచే సీతా ! నేను వచ్చితిని. కావున నన్ను నిరాకరింపవలదు. నన్ను నిరాకరించుట యన నీ పూర్వపుణ్యమును ననుభవింపక పోవుటయే. యని తెలఁపుము. కావున నన్నుఁ గూడుము. అని రావణుఁడు

పలుకఁగా నొంటిదాననే పురుషసాహాయ్యము లేనిదాననే. కఠినపుమాటలాడినచో నీఁడేమి చేయునో యను భయములేక కోపించినదై సీతాదేవి కఠినములైన మాటల నిట్లనియె.

రాగం వివిక్తా ఇతివర్ధయంతి = ఏకాంతము రాగవృద్ధికిఁ గారణమైయున్నను, సీతాదేవి మహాపతివ్రత కావున నామెకు రాగాభివృద్ధి కాలేదు. ఈ విషయమును నీ వాక్యము లనుసంధింపఁ దగినవి.

సకామం వీక్షితాప్యన్యైః, ప్రియైః వాక్యైః ప్రలోభితా ।
స్పృష్టావా జనసమ్మర్దే, నవికార ముపైతి యా ।
పురుషం సేవతే నాన్యం, మనోవాక్కాయ కర్మభిః ।
లోభితాపి పరేణార్థైః, సాసతీ లోకభూషణా ॥

దైన్యేన ప్రార్థితా వాపి, బలేన విధృతాపివా ।
వస్త్రాద్యైర్వాసితావాపి, నైవాన్యం భజతే సతీ ।
వీక్షితా వీక్షతే నాన్యం, హసితా నహసత్యపి ।
భాషితా భాషతేనైవ, సాసాధ్వీ సాధు లక్షణా ।
రూప యౌవన యుక్తాపి, గీతవృత్తేపి కోవిదా ।
స్వానురూపం నరం దృష్ట్వా, నయాతి విక్రియాం సతీ ।
సురూపం తరుణం రమ్యం, కామినీనాంచ వల్లభమ్ ।
యానేచ్ఛతి పరం కాంతం, విజ్ఞేయా మహాసతీ ।
భుంక్తేభుంక్తేథ యాపత్యౌ, దుఃఖితే దుఃఖితాచ యా ।
ముదితే ముదితాత్యర్థం, ప్రోషితే మలినాంబరా ।
సుప్తేపశ్చాచ్ఛయాశేతే, పూర్వమేవ ప్రబుధ్యతే ।
నాన్యం కామయతే చిత్తే, సావిజ్ఞేయా పతివ్రతా॥

ఇతరపురుషులు తన్ను సకామదృష్టిఁ జూచినను, ఇచ్చకముల నాశగొల్పినను, జనులగుంపులోఁ దాఁకినను, ఎవతె వికారము చెందదో యామె పతివ్రత. ఎవతె మనోవాక్కాయముల నైనఁ బరపురుషు సేవింపదో, ఇతరుఁడు ధన మిచ్చెద ననినను నాశపడదో యామె పతివ్రత. ఆమె జనభూషణ మనఁబడును. దీనురాలై యితరులు ప్రార్థించినను బలాత్కారముగ నీడ్చినను, వస్త్రాదులు తెచ్చి యిచ్చినను పతివ్రత యితరుని గామింపదు. ఇతరుఁడు తన్నుఁజూచి నవ్వినను దాను నవ్వదు. తన్ను వాఁడు చూచినను దాను వానిని జూడదు. ఇతరుఁడు పలుక

రించినను పలుకదు. అట్టిది పతివ్రత. సౌందర్యము, యౌవనము గలదైనను సంగీత వృత్తములందుఁ బండితురాలైనను తన కనురూప పురుషుని జూచి యెవతె మనస్సున వికారము చెందదో సుందరుఁడు వయస్కుఁడు స్త్రీజనమనోహరుఁడు, ప్రియుఁడునగు పరపురుషు నెవతె కోరదో యామె మహాపతివ్రత. మగఁడు భుజించెనా తాను భుజించును. మగఁడు దుఃఖించెనా తాను దుఃఖించును. మగఁడు సంతోషించెనా, తాను యెక్కువగ సంతోషించును. మగఁడు గ్రామాంతరము పోయినా మలినవస్త్రము కట్టును. మగఁడు పండుకొనిన తరువాతఁ బండుకొనును. ఆయనకంటె ముందు నిద్ర లేచును. ఇట్టిది పతివ్రత.

—♦ సీత రావణు నిందించుట ♦—

ఉ॥ ఏమిర యక్షగుహ్యకగ♦ణేశ్వరుఁ డై మఱి భూతవంద్యుఁ డై
ధీమహితాత్ముఁడౌ ధనద♦దేవుని తమ్ముఁడ వౌచునా యఘం
బీనొయిఁ జేయఁబూనితి వి♦సె యజితేంద్రియ బుద్ధిహీను నిన్
భూమిపుఁ గాఁగఁ బొంది పరి♦పోదు రవశ్యము సర్వరాక్షసుల్. ౨౨

యక్ష, గుహ్యక, గణ, ఈశ్వరుఁడు = యక్షులయు, గుహ్యకులయు, సమూహములకు నధిపతి, భూతవంద్యుఁడు = దిక్పాలకుఁడు కావున నందఱచే నమస్కరింపఁబడినవాఁడు, ధీమహితాత్ముఁడు = గొప్ప బుద్ధి మనస్సు గలవాఁడు, అఘంబు = పాపము, ఇసి = ఛీ, అజితేంద్రియుని = ఇంద్రియములను జయింపనివానిని, బుద్ధిహీనున్ = బుద్ధిలేని వానిని, పరిపోదురు = చత్తురు, 'తన పరిపోవునంతకు నుదగ్రతయుం గపటంబు మానఁ డెప్పుడును ధృతరాష్ట్రసూనుఁడు'.—భారతము.

తా. ఏమిరా? దేవజాతులగు యక్షులకు, గుహ్యకులకు నాథుఁడై సర్వభూతవంద్యుఁడైన కుబేరుని తమ్ముఁడవయియూ యిట్టి పాపపుఁబనిఁ జేయఁబూనితివి. ఛీ! సిగ్గులేనివాఁడా! ఇంద్రియజయములేని నిన్ను రాజుగాఁ గలవారగుటచే నీ మూలమున రాక్షసులందఱు జచ్చెదరు.

కం. హరిహయుసతిఁ బౌలోమిని, హరియించియు నైన బ్రదుక♦ నగుఁగా కెట్లేన్
వరబలుఁ డగు రాముని సుందరి నను హరియించి బ్రతుకఁ♦దరమా నీకున్. ౨౩

హరిహయు = ఇంద్రుని, సతిన్ = భార్యను, పౌలోమిని = పులోముని కూఁతురగు శచీదేవిని, ఎట్లేన్ = ఏదోయొక విధముగనైన.

తా. ఓరీ! ఇంద్రుని భార్యను శచీదేవిని హరించియైన నేదోయొక విధముగ నెట్లైనను బ్రదికిన బ్రతుకవచ్చునుగాని రామచంద్రమూర్తి భార్యను హరించియు మరల బ్రతుక నీకు శక్యమా.

ము త్తరోక్తితము. దుష్టచిత్తుఁడ వజ్రహస్తుని పౌలోమజాక్షిఁ బులోమజన్
భ్రష్టశీలుఁడ! యాహరించి మనంగవచ్చును గాక యు
త్కృష్టతేజుఁడు రామచంద్రుని యీశ్వరిన్ ననుబోఁటి నీ
కష్టవాక్యము లాడి మోక్షము కానవున్ సుధఁ ద్రావినన్. ౧౦౪

వజ్రహస్తుని = ఇంద్రునియొక్క, పౌలోమజాక్షిని = స్త్రీని, భ్రష్టశీలుఁడ = పతితుల నడవడి గలవాఁడా, మనంగవచ్చును = బ్రదుకవచ్చును, ననుబోఁటిన్ - నావంటిదానిని, అనఁగా నన్ను బోలినదానిని హరించియు బ్రతుకలేవు. ఇఁక నన్ను హరించిన నీగతి చెప్పనేల ? అల్లిలసివారణార్థము నన్ను అనక నావంటి యనెనని గోవిందరాజీయము. కష్టవాక్యము లాడి నీచపుమాటలు పలికి, నీచపు మాట లాడుటచేతనే చెడెదవు. సుధన్ అమృతమును, మోక్షము విడుదల, కానవున్, పొందనే పొందవు.

తా. చెప్పినమాటయే కోపాతిశయమునఁ మరలఁ జెప్పుచున్నది. శఠ! దుష్టమనస్సు గలవాఁడా! యింద్రునిభార్యను హరించియైన బ్రతుక నవచ్చును గాని రామచంద్రునిభార్య నగు నన్నుఁ బోలినదాని నీచవాక్యము లాడుటచేతనే నీ వమృతముఁ ద్రావినను నీకు మోక్షము లేదు. ఇఁక హరించిన నేమగుదువో ? మోక్షము మృత్యువువలన నని శేషము. మృత్యువునుండి నీకు విడుదల లేదు. మిక్కిలి మలినమైన యంతఃకరణము కలవాఁడ వగుటచే జ్ఞానముచేతనే కలుగ వలసిన మోక్షము నీకు లేదని భావము. అని తిలకవ్యాఖ్య.

౪౯-వ సర్గము.

కం. అని పలుకుసీతవాక్కులు, విని దశకంఠుండు కోప వివశుం డగుచుం
దనకరములఁ జఱచుచు ని ట్లనె, వినవే నావిక్రమము వి వేకవిహీనా. ౧౦౫

కోపవివశుండు = కోపముచే పరవశుఁడైనవాఁడు, చఱచుచున్ = కొట్టుచు, వివేకవిహీనా = ఇది తగును ఇది తగదను తెలివిలేనిదానా.

తా. సీతాదేవి యీప్రకారము చెప్పఁగా విని రావణుఁడు, కోపముచే దేహము తెలియనివాఁడై భుజము లప్పళించుచు నిట్లనియె. బుద్ధిలేనిదానా! నా పరాక్రమము చెప్పెద వినుము.

ఉ. ఎత్తుదునో ధరాతలము నేపునఁ జేతులఁ బట్టి మింటికిన్
మొత్తుదునో రణంబునను మొత్తులు పెట్టఁగ మృత్యుదేవతన్
రుత్తుదునో హిమాచలము రూపఱ బ్రద్దలువాఱ సూర్యునే
నొత్తుదునో శరంబుల మహోదధినీరముఁ ద్రావి వైతునో. ౧౦౬

రూక్షతన్ = కోపమున, పత్తుదునో = కొట్టుదునా.

తా. నేనాకాశమున నిలఁబడి భూమిని రెండుచేతులఁ బట్టి పైకెత్తునా? మృత్యుదేవత మొట్టో యని యేదుర్కొన్న యుద్ధమందు మొత్తుదునా? హిమవత్పర్వతమును బ్రద్దలగునట్లు కొట్టుదునా? సూర్యుని నేలఁబడ నొత్తుదునా? సముద్రములోని నీళ్ళన్ని త్రాపుదునా?

కం. వెంబరవిత్తా! కామసుఖంబులఁ గలిగింతుమనన్నుఁ ♦ గామాకృతి నా
ఘుం బరికింపుము యని చూ,పెం బడఁతికిఁ దనదురూపు ♦ భీతిఁ గొలుపన్.

వెంబరవిత్తా = మూఢురాలా! కామాకృతిన్ = మన్మథుని యాకారము గలవానిని, కోరినస్వరూప మెత్తఁగలవానిని.

తా. ఓసి మూఢురాలా! కోరినరూపముల నెత్తఁగల్గిన మన్మథువంటి నాకారముగల నన్ను, సర్వసుఖములఁ గలిగించు నన్ను, నాథుని నిజమైన స్వరూపముఁ జూడుము అని సీతను భయపెట్టుటకై తన నిజస్వరూపమును జూపించెను.

శా. మాయాభిక్షుకరూపము న్విడిచి దు♦ర్మార్గుండు పంక్త్యాస్య మా
స్వాయాకారము సూర్యకల్పదహనో♦ద్వేలంబు సంతప్తగాం
గేయోదంచితకుండలంబును గ్రుధా♦కీర్ణాక్షము న్మేచక
చ్ఛాయాభ్రప్రతిమానముల్ శరశరా♦సస్ఫూర్తి కాలాభముల్. ౯

మాయాభిక్షుకరూపము = దొంగసన్న్యాసి యాకారము, పంక్త్యాస్యము = పదితలలుగలది, స్వాయాకారము = తనరూపమును, సూర్యకల్పదహన ఉద్వేలంబు = ప్రళయకాలసూర్యునివలె నగ్నివలె మితిమీఱి వెలుఁగునది, సంతప్తగాంగేయ = పుటము వేసిన బంగారుచే, ఉదంచిత = ప్రకాశించు, కుండలంబును = కుండలములు గలది, క్రుధా = కోపముచే, ఆకీర్ణ = వ్యాపించిన, అక్షము = కన్నులుగలది. మేచక = నల్లని, ఛాయా = కాంతిగల, అభ్ర = మేఘముతో, ప్రతిమానము = సమానము, శరశరాసస్ఫూర్తి = బాణములచేతను వింటిచేతను ప్రకాశించునదియు, కాలాభముల్ = యమునితో సమానమైనదియు నగు తనరూపము చూపించెను.

తా. దొంగసన్న్యాసివేషము వదలి యాదుష్టుఁడు పదితలలు గలదియు ప్రళయకాలమందలి సూర్యాగ్నులవలె మితిమించిన తేజముగలదానిని పుటము వేసిన బంగారుకుండలంబులు గలదియు కోపయుక్తమైనదియు నల్లని మేఘముతో సమానమైనదియు విల్లుబాణములు కలదియుఁ గాలునితో సమానమైనదగు తన స్వరూపమును చూపించెను.

కం. రక్తాంబరధరుఁడై సం,రక్తాక్షుం డయి నిదాఘు♦గని తేజస్సం
సక్తుం డిట్లనియెం గ్రూ,రోక్తుల దైత్యేశ్వరుఁడు స♦ముజ్జృంభితుఁడై. ౧౦

రక్తాంబరధరుఁడై = ఎఱ్ఱనివస్త్రము ధరించినవాఁడై తమోగుణ ప్రధానమగు క్రూరస్వభావము గలవారు రక్తవర్ణముగల వస్త్రములు, పూలు లోనైనవి ధరింతురు. వీఁడట్టివాఁడు కావుటను సీతాదేవిని భయపెట్టుటకును వాఁడిట్టి వస్త్రములు ధరించెను. సంరక్తాక్షుండయి = మిగుల నెఱ్ఱని కన్నులు గలవాఁడై, నిదాఘ = గ్రీష్మ ఋతువునందలి, రవితేజస్ = సూర్యకాంతితో, సంసక్తుండు = కూడినవాఁడు, సముజ్జృంభితుఁడై = మిగుల దేహము పెంచినవాఁడై.

తా. ఎఱ్ఱని వస్త్రములు ధరించినవాఁడై, ఎఱ్ఱని కన్నులు గలవాఁడై యెండకాలమందలి సూర్యుని తేజస్సు వేఁడిమి కలవాఁడై విజృంభించి కఠినవాక్యముల రావణుఁడు సీతాదేవితో నిట్లనియెను.

—♦ రావణుఁడు సీతను బలాత్కారముగ నెత్తుకొని పోవుట ♦—

మ. వినవే సీత భవత్స్వమానవిభునిన్ ♦ విశ్వత్రయీఖ్యాతునిన్
గనఁగాఁ గోరెదవేని నన్ను లంకాధిపునా ♦ కల్యాణి! శ్లాఘ్యుండ నే
ననురక్తుండను నీకు నప్రియము సే ♦ యం బోను నెన్నండు నా
మనుజున్ వీడుము గూడు నన్ను దనుజున్ ♦ మాంగళ్యసంధాత్రివై. ౮౧౧

భవత్స్వమానవిభునిన్ - నీకు సమానుఁడైన భర్తను, విశ్వత్రయీఖ్యాతునిన్ = మూఁడులోకములందుఁ బ్రసిద్ధికెక్కినవానిని, శ్లాఘ్యుండన్ = పొగడ్తగలవాఁడ, అనురక్తుండను = నీయందు దనురాగము గలవాఁడను, మాంగళ్యసంధాత్రివై = శుభము గూర్చుదానవై.

తా. వినవే నామాట సీతా నీ మనస్సున నీ యోగ్యతకుఁ దగిన పెనిమిటిని మూఁడు లోకములందుఁ బ్రసిద్ధికెక్కినవానిని పొందఁగోరెదవా? కల్యాణి నన్నుఁ గూడుము. నేనట్టి పొగడ్తగన్నవాఁడను. నీయందుఁ బ్రేమగలవాఁడను. నీకు సమ్మతముగానిది యెన్నఁడు చేయను. నామాట విని యామనుజుని వదలి దనుజుఁడనైన నన్నుఁ గూడి నాకు శుభము గూర్పుము.

ఉ. ఏమని మోహ ముంచితివె ♦ యేమిగుణంబులఁ జూచి మెచ్చితే
యోమతిహీనురాల! యొక ♦ యుగ్రలిమాటను బట్టి రాజ్యమున్
భామ సుహృజ్జనంబులను ♦ బాయుచు వ్యాళనిషేవితాటవిన్
దీమస మేది క్రుమ్మరెడి ♦ దీనునిఁ బండితమానినీమణీ. ౮౧౧

వ్యాళనిషేవితాటవిన్ - వ్యాళ = దుష్టసర్పములచేతను దుష్టగజములచేతను, దుష్టమృగములచేతను, దుష్టులగు రాక్షసులచేతను, నిషేవిత = మిక్కిలి యాశ్రయింపఁబడిన, అటవిన్ = అడవియందు. వ్యాళ స్సర్పే దుష్టగజే శ్వాపదే

నా శతే త్రిషు॥ నా. ర. దీమసమేది = ధైర్యములేక, ఉగ్మలి = స్త్రీ, పండితమానిని = పండితురాలనని తలఁచుకొనుదానా.

తా. ఓసి బుద్ధిలేనిదానా! నీవు తెలిసినదాననని తలఁచుకొనుచున్నావుగాని నీకు వివేకములేదు. నీకు వివేకముండెనేని యొక యాఁడుదాని మాటప్రకారము రాజ్యమును స్నేహితులను బంధువులను అందఱను వదలి క్రూరములైన సర్పములు, ఏనుఁగులు, మృగములు, క్రూరరాక్షసులు సంచారముచేయు నడవియందు సంచరించుచు శత్రువుల నెదిరించి రాజ్యము సంపాదించుకొను ధైర్యములేని దరిద్రుని నేమని మోహించితివి? ఏమి గుణములనుజూచి మెచ్చితివే.

కం. అని ప్రియవాదిని సత్ప్రియఁ, గనలున దుష్టుండు పల్కి ♦ కామవివశుఁడై
జనకజను బుధుఁడు రోహిణి, వినువీదిని బట్టునట్లు ♦ వెసఁ బట్టుకొనెన్. ౪౧_౨

అని = ఈ ప్రకారముచెప్పి, ప్రియవాదిని = స్నేహముతోఁ గూడిన యిష్ట వాక్యములు చెప్పుదానిని, ప్రియశబ్దమునకు స్నేహము, సంతోషమను నర్థములఁ బ్రయోగములు గలవు. స్నేహభావముతో సంతోషము గలిగించు వాక్యములు చెప్పుదానిని, సత్ + ప్రియామ్ = సజ్జనులకు నిష్టమైనదానిని, కామవివశుఁడై = కామముచే దేహము తెలియనివాఁడై, ఇట్లని రావణుని భావమును వాల్మీకి తెల్పెడించెను. వినువీదిని = ఆకాశమున, బుధుఁడు = చంద్రుని కుమారుఁడు, రోహిణి — చంద్రునిభార్య అగుటచే రావణుఁడు సీతను బట్టుట కుమారుఁడు కాముకుఁడై తల్లిని బట్టుకొనుటవంటి మహాపాపకార్యము అని కవి యభిప్రాయము.

సీతాదేవి 'శీఘ్రోభవ!' చల్లగాఁ గమ్మనఁగానే యగ్ని హనుమంతుని విషయమునఁ జల్లనయ్యెఁ గదా. ఇప్పుడు తన విషయమున రావణాసురు నేల హాశీభవ = చావుము అనలేదు.

i. ఒకరికి మేలుచేయుటచేఁ దపస్సు వృద్ధియగును. కీడు చేయుటచే క్షీణించును.

ii. తన రక్షాభారము రామచంద్రమూర్తిపై నుంచి కేవల పరతంత్రయై యున్నది. ఆయన నిన్ను నీవు రక్షించుకొనుమని యాజ్ఞ యీయలేదు. ఆ కారణమున దన్నుఁదాను రక్షించుకొనుట స్వాతంత్ర్యము వహించినట్లైన స్వరూప విరుద్ధమగును.

iii. లంకకుఁబోయి రావణు సమూలము నాశము చేయవలయును ననికదా యామె సంకల్పము.

తా. ఈ ప్రకార మయ్యో వీఁడు చెడిపోవునే యని స్నేహభావముచేఁ జెప్పుచున్న దానిని సజ్జనులకు నిష్టమైనదై సంతోషము గలిగించు దానిని, కోపము

తోడఁబలికి కామముచేఁ బరవశుఁడై బుధుఁ డాకాశమునఁ దన తల్లియగు రోహిణిని బట్టినట్లు త్వరగాఁ బట్టుకొనెను.

ఈ సమయమున సీతాదేవి మూర్ఛపోయి యుండినట్లు 'నే వివశగ ప్రాలి. నచో నావపు వతఁడంటెఁగాని నాసమ్మతిఁ గాదు' (యుద్ధ ౨౬.౧౦) 'రామునిఁ దప్ప నొక నెవ్వరిని స్పృశింపనొల్ల, దశవక్త్రుడు. దాఁకడె నిన్ను నంటివా? పరవశురాల దుర్బలను ప్రాపునులేద, యనాథ నొంటి' నను (సుందర ౯.౧౧) సీతాదేవి వాక్యములచే నెఱుఁగనగు. మఱియు నగ్నిహోత్రుఁడును అస్వాతంత్ర యనియే చెప్పెను. (యుద్ధ) ఈ కాండమున ౧౨౧-న పద్యముఁ జూడుఁడు. మూర్ఛపోయి పడియుండిన కారణముననే తొడలక్రిందఁ జేయివేయఁ గలిగెను. కూర్చుండి యుండినచోఁ దొడల క్రిందఁ జేయివేయుటకుఁ గాని తొడల మీఁద జెయివేసి పట్టుకొనుటకుఁ గాని సాధ్యపడదు. సీతాదేవి యసామాన్య బలిష్ఠురాలు. మనోబలమం దెంత యుత్తమురాలో దేహబలమం దంత యుత్తమురాలు. అట్టిదని తెలిసిగదా యీమెకుఁ దగిన వరుఁడు బలిష్ఠుఁడు కావలెనని జనకుఁడు వీర్యశుల్క యని చాటించెను. స్మృతి గలిగి యున్నప్పుడు దాఁకి యుండినచోఁ ద్రౌపదిచే కీచకునివలె రావణుఁడు మూఁడు పొర్లిగింతలు పెట్టియుండును. రావణుఁడు ఇతరుల విషయమున దుష్టాత్ముఁడైనను గామమోహితుఁడైనను సీతా విషయమునఁ గాఁడు. కావుననే బుధుఁడు తన తల్లిని రోహిణిని బూజార్థము గ్రహించినట్లు సీతను రావణుఁడు పూజార్థమై గ్రహించెను. తనయింట నుంచుకొని యిష్టదేవతను బూజించినట్లు పూజించుటకై గ్రహించెనని భావము. ఓయీ! నలకూబర వేదవత్యాదుల శాప ముండఁగా నెట్లు బలాత్కారముగ పరదారను దాఁకెను. అనిన సత్యము రావణుఁడు సీతను సాక్షాత్తుగాఁ దాఁకలేదు. మోఁకాళ్ళయు తల వెండ్రుకలయు నీడను మాత్రమే గ్రహించెను. రాక్షసులకు ఛాయాగ్రహణ శక్తి గలదు.

ఛాయాగ్రాహిత్వ మప్యస్తి సర్వవిద్యావిశారదే
కేశచ్ఛాయాం పరామృశ్య జానుచ్ఛాయాం తథైవచ
గృహీత్వా జానకీం హృష్టో లంకాం ప్రాయాత్సరావణః ॥ అని స్కాందమందు గలదని మహేశ్వరతీర్థీయము.

ప్రియవాదిని = రావణుని విషయమునఁగాక యితరుల విషయమున నని శేషము. సీతాదేవి వాని నాక్షణమే శపించి నాశముచేయఁ గలదయ్యును సమూలము నాశము చేసెదనని వేదవతిగా నున్నప్పుడు సంకల్పించుటచేతను రాముఁడును ఋషుల దేవతల యెదుట నట్లు ప్రతిజ్ఞ చేసియుండుటను దాని నిర్వహించుకొఱకు

శపింపదయ్యెను. తోడ లనఁగాఁ గాళ్లు-కాళ్లు పట్టుకొని లంకకు రమ్మని ప్రార్థించె నని భావమని తిలకవ్యాఖ్య.

కం. సీతాశిరోజముల డాఁ,చేతన్ వలచేతఁ దొడలు ♦ శీఘ్రము కొని మా
యాతతఖరయుత మగు తే, రాతలమునఁ దోఁపఁగా ద♦శాస్యుం డంతన్.

శిరోజములన్ = తలవెండ్రుకలను, డాచేతన్ = ఎడమచేతితో, వలచేతన్ = కుడిచేతితో, మాయాతతఖరయుతము = మాయాశక్తిచే నింతవఱకుఁ గానరాక యిపుడు కానవచ్చి కంచరగాడిదలు కట్టినది, ఆతలమునన్ = ఆశ్రమమునుండు.

తా. ఎడమచేత సీతాదేవి తలవెండ్రుకలను కుడిచేతఁ దొడలను శీఘ్రముగఁ బట్టుకొని మాయారథ మాచోటికి రాఁగా రావణాసురుఁడు

సీతాదేవిని రావణాసురుఁడు ప్రత్యక్షముగఁ దాఁకెనా లేదా యను విషయము విమర్శింపవలసి యున్నది.

వాల్మీకిరామాయణము స్పష్టముగా రావణుఁడు సీతాదేవిని దాఁకి తీసికొని పోయెనని చెప్పుచున్నది. ఇచ్చట, ౧౦౨, ౧౦౩, ౧౦౪ పద్యములందే గాక ౧౧౧ వ పద్యమున, 'మదనతిమిరగనాఁబెనఁగ ఘనవనభోజియు పీడు పీడు నుం।చదలిచి జంకెనల్లలికి యట్టి సతీమణి కేశపాశముల్ వనలకపట్టి యీడ్చె' నని యున్నది.

౧౧౧ అసురనాథాంకగ ౧౯౦ రావణాంక సంకలిత సతీముఖంబు, అని యీవిధముగఁ బెక్కు ప్రయోగములున్నవి. అయినను దుష్టుఁడైన రావణుఁడు సీతను దాఁకుట యనునది సహింపని భక్తులు భక్త్యతిశయముచేఁ గొన్ని వింతలు వ్రాసియున్నారు.

౧. కొందఱు రామచంద్రమూర్తి మాయామృగము వెంటఁ బోవునపుడు నిజమైన సీతను దాఁచి మాయాసీతను నాశ్రమమం దుంచి పోయెననియు, ఈ మాయాసీతను రావణుఁడు గ్రహించెననియు రావణవధానంతరము మాయాసీత యగ్నిలోఁ బ్రవేసించి మాయమయ్యెననియు నిజమైన సీత యగ్నిలోనుండి వెలువడి వచ్చెననియు నందురు.

౨. మఱికొందఱు లక్ష్మణుఁడు రామునిమిత్తమై పోవుచు సీతాదేవిచుట్టు గీఱగీఁచి దీనిని నీవు దాఁటి రావలదని చెప్పినట్టును రావణుఁ డాపెళ్ళను లేవఁదీసికొనిపోయెనే కాని సీతను దాఁకలేదనియు నందురు.

3. మాహేశ్వరతీర్థీయమున నున్నట్టు సీతాదేవివెండ్రుకల మోఁకాళ్ళ చాయ గ్రహించె నందురు.

౪. తతో విదార్య ధరణీం, నఖై రుద్ధృత్య బాహుభిః।

తోలయిత్వా రథే క్షిప్త్వా యయౌ క్షిప్రం విహాయసా॥ ఆధ్యాత్మ.

ఇవన్నియు సద్భావముతో భక్తితో వ్రాయఁబడినవే కాని సత్య చరిత్రములు గావు. వాల్మీకి రామాయణ మొక్కటియే యున్నదున్నట్లు వ్రాయఁబడినది.

వ్యవసాయాత్మికాబుద్ధి రేకేహ కురునందన। బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్॥ అన్నట్లు నిశ్చయవిషయ మొకవిధము. అది తప్పించి చెప్పఁ బూనినఁ బలువురు పలువలు విధములఁ జెప్పుదురు.

ఈ చిత్రకథలు కల్పింపఁగారణ మేమి?

(i) రావణాసురుఁడు తాఁకుటచే సీతాపాతివ్రత్యమునకు హానియనియా, (ii) అట్టి పతివ్రతను దాఁకి రావణుఁడు బ్రదుకుటచే రావణుకపోబలమునకంటె సీతామహిమ తక్కువ యనియా? ఈ రెండు కారణములు సరియైనవి గావు. రావణాసురుఁడు తాఁకుటచే సీతాపాతివ్రత్యమునకు హాని కలుగునేని యామెపాతివ్రత్యము విరాధుఁడు తాఁకియెత్తికొని పోయిననాఁడే నాశనమయి యుండవలె. ఏలన రావణుఁ డేదుష్టభావముతో సీతదు హరించెనో యాదుష్టభావముతోనే విరాధుఁడు హరించెను. ఆరణ్య ౨౨-వ పద్యముఁ జూడుఁడు. 'యీవనితను నాదు పెండ్లముగ వారకకై కొనువాఁడ నమ్ముఁడీ' యని వాఁడును జానకిని యంకతలమునఁ జేర్చినవాఁడేకదా. అప్పుడు పోని పాతివ్రత్య మిప్పుడెట్లు పోయెను? సీతకు మతి మారెనా? స్త్రీలకుఁ బాతివ్రత్యహాని వారి మనోవికారముచేఁ గలుగునా? ఇతరుల సంకల్పముఁ బట్టి కలుగునా? లేక యే పురుషుఁడైనను దాఁకినంతమాత్రముననే పాతివ్రత్యము చెడునా? ఏ పురుషుఁడైనను దాఁకుటచేతనే పాతివ్రత్యమునకు హానికలుగునేని కొడుకులను దమ్ములను దాఁకు స్త్రీలు పతివ్రతలు గారా? సీత దశరథునిఁ దాఁకెను గదా. (అయోధ్య) అంతతో నామెపాతివ్రత్యము చెడెనా? స్త్రీ కామవికారము నొందదేని పరపురుషులు కామదృష్టిఁ జూచినను, దాఁకినను, దమయంతికివలె, ద్రౌపదికివలె, పాతివ్రత్యమునకు హాని లేదు. అట్లులే పురుషుల మనస్సు గామవికారము నొందదేని నగ్నస్త్రీలఁ జూచినను, దాఁకినను దోషములేదు. శుక భీష్మ హనుమంతులు సాక్షులు. సీతాదేవియందుఁ గామ వికారము లేదు గావున విరాధ రావణులు దాఁకినను దానివలన నామెకు శీలహాని లేదు. కీచకుఁడు దాఁకిన ద్రౌపదికి శీలహాని కలిగెనా? సైంధవుఁడు దాఁకుటచే నామె పాతివ్రత్యమునకు హాని కలిగెనా? కావున రావణుఁడు తాఁకినంతమాత్రమున సీతకొక లోపము వచ్చునని తలఁచుటే దోషము. కావున నీ వింతకల్పనములు నిరాధారములు. ఈ విషయమునఁ గొన్ని సందేహము లీవ్యాఖ్యాతను బీడించుచున్నవి.

౧. రావణుఁ డెత్తికొని పోయి యశోకవనమం దుంచి బాధించునది మాయాసీత యగునేని లోక మేల సీతనిమిత్తమై జాలిపడుచున్నది? ఇంద్రజిత్తు కల్పించిన మాయాసీతకై రాముఁడు వానరులు నేడువలేదా యందు రేమో? ఎంత వఱకు? సత్యము తెలియకుండువరకు. ఈ కల్పకులు సత్యము బయటఁ బెట్టిరి కదా? ఇప్పటి కేల లోకము వగచుచున్నది.

౨. నీ వధకు నేను గారణ మయ్యెదనని వేదవతి చెప్పెను గదా? ఆమె యెందో దాఁగియుండెనేని యామెమాట వ్యర్థమైనట్లే కదా.

౩. ఆమె యిట్లు డాఁగఁ గారణమేమి కలిగెను?

౪. గడ్డతోడ సీతాదేవి యెత్తికొనిపోఁబడెనేని జటాయురావణయుద్ధమందు రథముతోడ సర్వము హతమయ్యెఁ గదా? ఇప్పు డాగడ్డ పోయెనా యుండెనా?

౫. సీతాదేవిఛాయను గ్రహించి రావణుఁడు పోయెనేని సీతాదేవి యెందుండెను? రావణుఁ డాకాశమునఁ బోవుచుండిన సీతాదేవి నేలమీఁదఁ బోవుచుండెనా? సింహిక హనుమంతునిఛాయను సముద్రములో గ్రహింపఁగా హనుమంతుఁ డాకాశమున నుండెను గదా? రావణుఁ డాకాశమునఁ బోవునపుడు సీతాదేవి యెందుఁ బోవుచుండెను?

౬. రావణుఁడు చంకలో నిఱికించుకొనినది సీతనా సీతనీడనా? నీడను జంకలో నిఱికించుకొనిపోవు టెట్లు?

౭. సీత భూమిపై నుండిన నీడ యాకాశమున నెట్లుండఁ గలదు?

౮. మాయాసీతను కల్పించి దాని నెత్తుకొని పోవునట్లు మోసముచేసి తనభార్య పోయినట్లు దొంగ యేడ్పు యేడ్చి యానెపమున వాని నిర్వంశముగఁ జంపిన రామచంద్రుఁ డెట్లు ధర్మాత్ముఁడు? రామ రావణ మాయలలో ఘోరమైనది యేది?

౯. మాయచేఁ (నీడ) గల్పించిన మూర్తియందలి సొమ్ములు వేఱుగఁ దీయ సాధ్యపడునా? అట్లు తీసెనేని దీర్ఘకాలము సత్యముగ నిత్యముగ నిలుచునా?

౧౦. (నీడ) మాయాసీతాపాతివ్రత్యమహిమచేతనా హనుమంతుని తోఁక కాలకుండుట.

౧౧. సీతాదేవిని రామచంద్రున కర్పించుచు నగ్నిహోత్రుఁడు 'నిన్నెడఁ బాసి దీనయయి నిర్జరసీమను నస్వతంత్రయై । యున్న సుశీల నీమె దురితోగ్ర చరిత్రుఁడు బల్మిఁ దెచ్చెనుం। చెన్నిజగేహమందు నటు చేసి నను౯ నినుఁ జింత సేయుచు౯ । నిన్నె భజించెఁజూ వికృతనేత్రలు రక్కసు లెప్డు గావఁగ౯; గీ. మోసగించెను నా నెంతొ యాసగుంచె । ధిక్కరించెను బెదరించెఁ గ్రక్కసించె । నేమి

చేసిన లక్షింప దీమె యతని' నను అగ్నిహోత్రుని యీవాక్యములు మాయాసీత యందుఁ గదా నన్వయింపవలె? వాస్తవ సీతయం దెట్లు సార్థకములు? అగ్నిహోత్రుఁడు సమర్పించినది వాస్తవ సీతనే కదా? ఒకతెను జూపించి మఱియొకతె వృత్తాంత మెట్లు చెప్పెను? ఇది బొంకే కదా?

౧౨. సీతాదేవిని విడిచి మారీచుని వెంట రామమూర్తి పోయినపుడు రావణుఁడు వచ్చినపుడు ఆవల వాఁ డెత్తుకొనిపోయినపుడు హనుమంతుఁడు చూచినపుడు సీత పచ్చనిచీరె కట్టియుండెను. వాస్తవసీతనంటిదే కదా మాయాసీతయును? అగ్నిహోత్రునిలో బయలు వెడలినపుడు విభీషణుఁ డిచ్చిన యెఱ్ఱచీరలతోఁ సొమ్ములతోఁ నెలువడెను. వాస్తవసీత కివి యెందుండి వచ్చెను? ఆమె ధరించిన సొమ్ములు చీర యేమాయెను?

౧౩. హనుమంతుఁడు సంభాషించినది యుంగర మిచ్చినది దొంగ సీతకా? రాక్షస స్త్రీల కభయ మిచ్చినది, హనుమంతుని వలన రక్షించినది దొంగ సీతయా? దొంగసీత యిచ్చిన చూడామణి మాయయే కదా?

౧౪. జటాయువు రావణుఁడు సీతను హరించిన ముహూర్తము వానిని నాశము చేయునది యని చెప్పెను గదా. ఇట్టి ఫలము యథార్థవస్తువుల విషయమా? నీడలకు మాయా వస్తువులను హరించిన నిట్టి ఫలము కలుగునా? ఇట్టిది శాస్త్రమం దెందైన నున్నదా?

ఒకవేళ ఛాయాదేవిని దృష్టాంతముగఁ జెప్పెదరేమో? ఛాయాదేవి కాల్పనిక రూపము గాదు. సత్యమూర్తియే. బిడ్డలు గనెను గదా? ఉత్త నీడలు బిడ్డలఁ గనునా? సూర్యునిభార్య స్వశక్తిచేఁ దనవంటిదానిని గల్పించి సూర్యు నొద్దనుంచి తాను బోయెను.

ఇంత యేల? రావణుఁడు హరించినది మాయాసీత యనుటకు వాల్మీకిరామాయణమునఁ బ్రమాణవాక్యము శూన్యము.

కం. దారుణబిభీషికల నా, క్రూరుఁడు బెదరించి యెత్తికొని యంకమునన్
జేరిచె శతాంగమునఁ గమ,లారమణీరూపిణిన్ బలాత్కారముగన్. ౧౯

దారుణబిభీషికలన్ = భయంకరములైన బెదరింపు మాటలచేత, అంకమునన్ = ఒడియందు, శతాంగమునన్ = తేరియందు, కమలారమణీరూపిణిన్ = లక్ష్మీస్వరూపము గలదానిని.

తా. ఆ క్రూరుఁడు భయంకరములైన బెదరింపు మాటలచే బెదరించి బలాత్కారముగ నొడిలో కెత్తుకొనుచు నెత్తుకొని రథమును జేర్చెను.

కం. మృత్యుప్రాయుని భృశతీ,క్ష్ణాత్యంతస్ఫురితదంష్ట్రు ♦ నద్రిసమానున్
దైత్యునిఁ గని వనదేవత, లత్యర్థభయంబునన్ వ♦నాళులఁ బాఱెన్. ౮౧౫

మృత్యుప్రాయుని = మృత్యువువంటి వానిని, భృశ...దంష్ట్రున్ = మిక్కిలి క్రూరములై విశేషించి ప్రకాశించు కోఱలు గలవానిని; అద్రిసమానునిన్ = పర్వతముతో సముఁడగు వానిని, అత్యర్థభయంబునన్ = మిగుల భయముతో, వనాళులన్ = అడవుల వెంట, పాఱెన్ = పరువెత్తెను.

తా. యమునితో సముఁడై మిగుల తీక్ష్ణములై ప్రకాశించు కోఱలుగల వానిని, పర్వతమంత దేహము గలవానిని నా రాక్షసుని జూచి వనదేవతలు భయపడి యడవులలోఁబడి పరువెత్తిరి.

కం. రావణగృహీత యార్తా,రావంబున నఱచె రామ ♦ రామా యని యా
శీవిషసతి యనఁ బొరలెడి,యావనిత నణంచి యగసె ♦ నసురుఁడు దివికిన్.

ఆశీవిషసతి = ఆఁడుపాము, అణంచి = అడఁగఁబట్టి, దివికిన్ = ఆకాశమునకు.

తా. రావణుచేఁ బట్టుకొనఁబడిన సీతాదేవి దుఃఖస్వరముతో రామా రామా యని యేడ్చుచు నాఁడుపామువలెఁ బొరలుచుండఁగాఁ గదలకుండ నణఁగఁ బట్టి యాకాశమున కెగసెను.

కం. ఉప్పరవీదిని నీగతిఁ, దెప్పునఁ జను తేరిమీఁదఁ ♦ దీవ్రాతుర యై
యప్పుడతి వేదు ఱసఁగా, నిప్పగిది నేడ్చె భ్రాంత♦హృదయయు పోలెన్.

ఉప్పరవీదిని = ఆకాశమార్గము, తెప్పునన్ = త్వరగా, తీవ్రాతురయై = క్రూరమైన బాధపడుచున్నదై, వేదుఱు = పిచ్చిపట్టినది, భ్రాంతహృదయయు పోలెన్ = భ్రమచెందిన మనస్సుగల దానివలెనే.

తా. ఈవిధముగ నాకాశమున శీఘ్రముగఁ జను తేరిమీఁద మిగుల బాధ గలదై యా సీతాదేవి పిచ్చిపట్టినదో యన్నట్లు భ్రమచెందిన దానివలెనే యిట్టు లేడ్చెను.

—♦ సీత రామలక్ష్మణులఁ బేర్కొని యేడ్చుట ♦—

కం. హా లక్ష్మణ గురుపదసే, వాలోలా యీరసమునఁ ♦ బాపాత్ముం డ
య్యో లావున నను ముచ్చిలి, వాలాయము చనెడి నెఱుఁగ♦వా భూరిభుజా.

గురుపదసేవాలోలా = పెద్దల (అన్న) పాదముల సేవించుటయం దాశగల వాఁడా, ఈరసమునన్ = ఈర్ష్యచేత, ఖరాసురుని జంపినార మను నీర్ష్యచేత, లావునన్ = బలవంతముగ, ముచ్చిలి = దొంగిలి, వాలాయము = అడ్డములేక, భూరిభుజ = గొప్పభుజములు (బలము) గలవాఁడా.

శ్రీరామచంద్రమూర్తి చాలదూరమున నుండుననియు, వెనుకఁ బోయిన వాఁడు కావున లక్ష్మణుఁడు సమీపమందే యుండుననియుఁ దలఁచి ముందు లక్ష్మణునిపే రఱచుచున్నది.

తా. అయ్యో లక్ష్మణా! పెద్దల పాదసేవ చేయుటయం దాసక్తి గలవాఁడా! మీరు ఖరాదులఁ జంపితి రను నీసుచేత నీపాపాత్ముఁడు నన్ను బలవంతముగా దొంగిలి యడ్డములేక పోవుచున్నాఁడు. మహాభుజబలము గలవాఁడా! ఇది నీకుఁ దెలియ లేదా ?

కం. జీవితమును సుఖ మర్థముఁ, గేవలధర్మార్థముగను ♦ గీడ్పఱచిన నీ
  పీవిధి నధర్మగతిఁ గొని, పోవఁగ న న్నసుర కావ ♦ వో రఘురామా. ౧౧౯

జీవితమును = బ్రదుకు, కేవల ధర్మార్థముగను = ఒకధర్మము నిమిత్తమే, కీడ్పఱచిన = వదలుకొనిన నాలుగవ పాదమున ప్లుతయతి.

తా. నీ బ్రదుకు, సుఖము, ధనము కేవల మాశ్రితరక్షణార్థముగ వదలి పెట్టిన నీవు రామచంద్రా ! నీ యాశ్రితురాలనగు నన్ను వీఁడు ధర్మము తప్పి తీసికొని పోవుట చూడలేదా ?

కం. అవినీతు లైనదుర్జన, నివహంబుల కెప్పుడుఁ వి ♦ నేతుఁడ వయ్యుఁ
  బావరునఁ బాపముఁ జేసెడి, యవినీతు దశాస్యు నేల ♦ యణఁపవు రామా.

అవినీతులు = దుష్టులు, నివహంబులకు = సమూహములకు, వినేతుఁడవు = శిక్షకుఁడవు, పావరునన్ = గర్వముచే, అవినీతు = దుర్మార్గుని.

తా. రామా ! న్యాయము తప్పి చరించు దుష్టుల సమూహముల శిక్షించు వాఁడ వయ్యు గర్వమున నన్ను దొంగిలించుట యను పాపముచేసిన యీ దుష్టుని రావణుని నేల యణఁపవు ?

కం. పాపులఁ బాపఫలంబులు, ప్రాపింపవు తోడుతోన ♦ పరిపక్వము లై
  ప్రాపించుఁ గాలగతి నో, పాపీ యసురేంద్ర పండు ♦ పైరులమాడ్కిన్. ౧౨౧

తా. పాపాత్ముఁడా, రావణా! పాపాత్ములుచేయు పాపముల ఫలములు వెంటనే యనుభవమునకు రావు. కొంతకాలమైన తరువాత పక్వములై ఫల మిచ్చును. విత్తనములు భూమియందుఁ జల్లగానే పైరుపండదు గదా. నీవు చేయు పాపఫలము శీఘ్రకాలమందే యనుభవింపఁ గలవు.

కం. కాలోపహతమనంబున, నీలీలం బాపకృతికి ♦ నే తెంచుటచే
  బాలిశ ! పొందెద వాయరి, కాలునిచే జీవితాంత ♦ కరదుఃఖంబున్. ౧౨౨

కాలోపహతమనంబునన్ = చెడిపోవు కాలము వచ్చుటచేఁ జెదరఁగొట్టఁ

...డిన మనసుచే, ఈ లీలన్ = ఈ విధముగా, పాపకృతికిన్ = పాపకార్యమునకు, బాలిశ = మూర్ఖుఁడా, అరికాలచేన్ = శత్రువులకు మృత్యువగు రామునిచే, జీవితాంత కరదుఃఖంబున్ = ప్రాణమును దీయు కష్టమును.

తా. నీకుఁ జెడిపోవు కాలము దాపరించుటచే గావఁగా ఇటువంటి పాపకార్యము చేయ వచ్చితివి కావున శత్రువులకు మృత్యువగు శ్రీరామునిచే నీ ప్రాణము పోవఁ జేయు కష్టమును బొందఁగలవు.

కం. అయ్యో యిప్పుడు కైకయి, నెయ్యురతోఁ గోర్కి దీర ♦ నెఱ సుఖయించున్
గుయ్యాడ హరియించుటచే, నియ్యధముఁడు ధర్మశీలు ♦ నిల్లాలి ననున్. ౨౯

నెయ్యురు = నెయ్యముగలవారు, నెయ్యము = స్నేహము, తనకుఁ గావలసిన వారు, నెఱ = సంపూర్ణముగా.

తా. అయ్యో! కైక యిట్టియాపద మాకు గావలయునని కోరికదా మమ్మడి పులపాలు చేసెను. ధర్మాత్ముఁడైన రాముని భార్యను నన్ను నీ నీచుఁడు హరించు టచేఁ దన కోరిక నెఱవేఱెను గావునఁ గైక తనకుఁ గావలసిన వారితోఁ బూర్ణముగ సుఖించును. రామచంద్రుని నడవికిఁ బంపినఁ గానుగూడఁ బోదుననియు, నడవిలోఁ దన్నె రాక్షసుఁడో హరించుననియు, నా కారణమున రామచంద్రుఁడు చచ్చు ననియు, ఆవల తన కొడుకు సుఖముగా నిష్కంటక రాజ్య మేలుననియుఁ దలఁచి తమ్ముఁడవుల కంపెనని సీత [illegible] యిప్పుడే కాక యింతకు మున్నె యీ యభి ప్రాయము లంకలోఁ గూడ [illegible] చెను. 'సుప్తమత్తకుపితానాం భావజ్ఞానం దృష్టం' మ్మను న్యాయముచే శోకాతిశయమున [illegible] మనస్సులో నణఁగి యుండిన దానిని బయలు పఱిచెను. ఈ యభిప్రాయము రామునకును గలదు. సత్యమింతయే కదా.

ఉ. వేమఱు మ్రొక్కెదాన నట ♦ విస్ఫలి నున్న ఫలప్రసేనకో
ద్దామములార భూమిరుహ ♦ తండములార లతాళులార యో
వ్యోమచరిష్ణులార యయ ♦ యో రఘురామునిఁ గాంచి చయ్యనన్
రామ! హరించె సీత నిదె ♦ రావణుఁ డంచు వచింపరే దయన్. ౩౦

ఫలప్రసేనకోద్దామములార = పండ్లచేతను పువ్వులచేతను నతిశయించిన వార లారా, భూమిరుహతండములారా = వృక్షసమూహములారా, లతాళులారా = తీఁగల గుంపులారా, వ్యోమచరిష్ణులారా = ఆకాశమున సంచరించు వారలారా.

తా. ఓ యడవియందు పూలతోఁ బండ్లతో నిండియుండు వృక్షసమూహము లారా, తీఁగెలారా, ఆకాశమున సంచరించు వారలారా, యయ్యో! మీరు రామునిఁజూచి రామా! నీ భార్యను రావణుఁడు హరించెనని దయతోఁ జెప్పుఁడు.

శోకాతిశయముచే భ్రమఁగొన్న కారణమున చేతనాచేతనవివక్షలేక యట్లను చున్నది. రామలక్ష్మణులకుఁగాని యాయనపక్షమువారికిఁగాని దనధ్వని వినఁబడ వలయుననియే యామె యుద్దేశము. తొలుత వృక్షములను సంబోధించి యవి రామచంద్రమూర్తి తమయొద్దకు వచ్చినఁగదా చెప్పును అని తలఁచి రాముఁడున్న చోటికిఁబోయి చెప్పుఁడని ఆకాశసంచారముచేయు భూతముల సంబోధించెను. ఎత్తున నున్న కారణముచే నాకాశసంచారులకు రాముఁ డెందుండినను గాన వచ్చును. సమీపమునకు వచ్చినఁగాని చెట్లు తెలిసికోలేవు.

కం. సుందరశృంగాన్వితమా, వందన మోమాల్యవంతి ♦ ప్రస్రవణగిరీ
బృందారకారి యిదెనీ,సుందరి హరియించె రామ ♦ జూఁడుమ యనుమా. ౧౧౫

సుందర = అందమైన, శృంగాన్వితమా = శిఖరముతోఁ గూడినదానా, ప్రస్రవణగిరీ = కొండవంకలు, జలపాతములుగల కొండా, బృందారకారి = దేవవిరోధి = రాక్షసుఁడు–రావణుఁడు.

తా. చక్కని శిఖరముతోను కొండవంకలతోను, జలపాతములతోను గూడిన మాల్యవంతిమను పర్వతమా, దేవవిరోధి రావణుఁడు నీ భార్యను హరించి కొనిపోవుచున్నాఁడు ఇదిగోఁ జూడుమని చెప్పుము.

కం. దండము నీకిదె సారస, కాండసితగరుద్విలాస ♦ గౌతమి యాకో
దండగురుతోడ నీవే,తండగమన ముచ్చిలించె ♦ దశముఖుఁ డనుమా. ౧౧౬

సారసకాండ = హంసల సమూహముల, సితగరుత్ = తెల్లని ఱెక్కలచే, విలాస = అందమైనది.

ఈవిశేషణమువలనఁ బ్రయోజన మేమన, రామచంద్రమూర్తిని నీవు చూచుట కలుగదేని నీలోని హంసలచేనైన నావార్త రామునకుఁ దెలుపుమని భావము.

తా. హంసలతోఁగూడిన గోదావరీ నీకు దండము దండము–కోదండ గురుఁడైన శ్రీరామునితో నీభార్యను రావణుఁడు హరించెనని చెప్పుము.

ఉ. ఈవనసీమలో వివిధ ♦ వృక్షతలంబులయందు నుండునో
దైవతకోటులార యిట ♦ దండక వాసము చేయు మున్ననా
నావిహగోరుసత్త్వమృగ ♦ నాయకులార నమస్కరించెదన్
నావిభు రాముఁ జేరి కరు ♦ ణామతి నాగతి యెల్లఁ జెప్పరే. ౧౧౭

నానా = అనేకవిధములయిన, విహగ = పక్షులయు, ఉరుసత్త్వ = గొప్పబలముగల, మృగ = మృగములయొక్కయు నాయకులారా.

తా. ఈయడవియందు పలువిధములగు చెట్లయందు నుండు దేవతా సమూ-

హాములారా! దండకలో వసించు నానావిధములైన పక్షినాయకులారా! మృగనాయకులారా! మీకు నమస్కారము. నాయందు దయయుంచి శ్రీరామునొద్దకుఁ బోయి నాగతి యిట్లైనదని చెప్పుఁడు. మీకు దయగలదేని త్వరగాఁ జెప్పఁగలరు.

కం. రామా నీప్రాణములకుఁ బ్రేమాస్పదమైన యట్టి ♦ ప్రియను బరవశన్
భూమిజ హరించె రావణుఁ డోమఁగఁ జను మనుచుఁ జెప్ప ♦ లోగిరులారా. ౩౮

పరవశన్ — స్వాధీనము తప్పియున్న దానిని, మూర్ఛపోయి పడినదానిని, ఓమఁగన్ రక్షించుటకు, నాలుగవపాదంబున ప్లుతియతి.

తా. ఓ పర్వతములారా! మీరు రామా నీకుఁ బ్రాణములకంటెఁ బ్రేమకు స్థానమైన నీ ప్రియురాలిని మూర్ఛపోయి పడియుండినదానిని సీతను రావణుఁడు హరించెనని రక్షింపఁగా బొమ్ము అని చెప్పుఁడు.

కం. నాపయి దయ నింతటివాచాపుణ్యము గట్టుకొన్న ♦ సరగున రాముం
డేపున విడిపించును స్వస్థాపితనైనను యముండు ♦ దాఁచిన యేనిన్. ౩౯

వాచాపుణ్యము = వాక్కురూపకమైన సాహాయ్యము, చేయుటచేఁగలుగు పుణ్యము, సరగునన్ — శీఘ్రముగా, ఏపున = పరాక్రమముచే, స్వర్ + స్థాపితనైనను = స్వర్గమందు వీఁడు న న్నునిచినను.

తా. పర్వతములారా! నామీఁద దయయుంచి యింతమాత్రము మీరు మాటమాత్రము సాహాయ్యముచేసినయెడల నన్ను స్వర్గమందున్నను యమలోకమందున్నను రామచంద్రమూర్తి నన్ను విడిపించి తనయొద్దకుఁ దీసికొనును.

పుణ్యములుచేసి స్వర్గమున కర్హులైనవారినైనను, పాపములుచేసి యమలోకమునకు నర్హులైనవారినైనను, పురుషకారబలముచే భగవంతుఁడు సాయుజ్యమొసఁగునని ధ్వని.

——♦ సీత జటాయువుం జూచి విలపించుట. ♦——

కం. అని విలపించుచు సతి యొక ఘనతరువున నున్న గృధ్ర♦కాంతు జటాయున్
గనుఁగొని దుఃఖభయంబులఁ, బెనఁగొనుమతి తోడఁబిల్చెఁ♦బెద్దయెలుఁగునన్.

విలపించుచున్ = ఏడ్చుచు, ఘనతరువునన్ = పెద్దచెట్టుమీఁద, గృధ్రకాంతున్ = గ్రద్దలరాజును. జటాయున్ = జటాయువను పక్షిని. జటాయుశ్చ జటాయుషా'యని ద్విరూపకోశము. 'పటాసంహతమాయురస్య' అని శ్రీ॥ శే॥ వ్యాఖ్య. 'జటాయు పుంసి సంపాతేః కనీయసిచ గుగ్గులౌ' త్రికాండశేషము. జటాయు, జటాయుస్సని రెండు రూపంబులు గలవు.

తా. అని యేడ్చుచు సీతాదేవి యొక్క పెద్దచెట్టుమీఁదనుండిన గ్రద్దఱేఁడు జటాయువునుజూచి రామవియోగమువలన దుఃఖమున రామచంద్రమూర్తి యేమగునో యను భయము పెనసికొనిన మనస్సుతో పెద్దగొంతున గట్టిగాఁ బిలిచెను.

ఉ. అయ్యా జటాయువా! యిదె దు♦రాత్ముఁడు రావణుఁ డుగ్రకర్ముఁడై
కుయ్యిడు చుండ నన్నుఁ గడుఁ♦గ్రూరత దిక్కేది లేనిదాని నా
నియ్యెడఁ గొంచుఁ బోయెడి న♦హీనబలుఁడ్ జితకాశిఁ గ్రూరు దు
ర్జయ్యు దురాత్ము సాయుధుని ♦ సాధ్యముగా దెదిరింప నీ కనిన్. ౧౦౧

అయ్యా = తండ్రీ, మామగారి స్నేహితుఁడు గావున మామగా రెట్టి వరుస వాఁడో యాయన యట్టివరుసవాఁడని తండ్రీ యనుచున్నది. కుయ్యిడుచుండఁగ్ = ఏడ్చుచుండఁగా, జితకాశి = జయశీలుని, దుర్జయ్యు = నీవు జయింప సాధ్యముగాని వానిని, సాయుధుని = ఆయుధములు ధరించియుండువానిని.

ఇఁక జటాయు దాస్య విధముఁ జెప్పఁబడును. స్వామి కార్యము ప్రతిఫలాపేక్ష లేక హెచ్చరికగలిగి చేయువాఁడు దాసుఁడు. దాసుఁడు స్వామికార్యమునందు నీచ మనునది యెఱుఁగఁడు. ప్రాణభయ మెఱుఁగఁడు. లజ్జ యెఱుఁగఁడు. ఈ కార్యము నేను జేయఁగలనా నా శక్తికి మించినదే యనఁడు. యథాశక్తి నిర్వంచనముగాఁ బనిచేయుట నావంతు. జయాపజయములు భగవంతునివంతు అని తలఁచును. ఇట్టివాఁడు గనుకనే ముసలివాఁడు నిరాయుధుఁడు అసహాయుఁడు నయ్యు జటాయువు తనప్రాణ మిచ్చి రామసేవ చేసెను గనుకనే మోక్షఫలము లభించెను. కావున మోక్షమనునది మనుష్యులకుమాత్రమేగాక విష్ణుదాస్యముచేయు భూతకోటి కంతయుఁ గలదు.

తా. తండ్రీ జటాయూ! యిదిగోఁ జూడు. ఈపాపాత్ముఁడు రావణుఁడు క్రూరకార్యము తలపెట్టి నే నేడ్చుచున్నను వదలక దయాహీనుఁడై దిక్కులేనిదాని నగు నన్నిపుడు తీసికొనిపోవుచున్నాఁడు. వీఁడు చాల బలవంతుఁడు. జయములచేఁ బ్రసిద్ధినొందినవాఁడు. దయాదాక్షిణ్యములు లేనివాఁడు. నీకు జయింప సాధ్యపడెడి వాఁడు కాఁడు. ఏల యందువా? వీఁడు సాయుధుఁడు. నీవు నిరాయుధుఁడవు. పాపపుమనస్సు గలవాఁడు కావున నిరాయుధునిఁ గొట్టవచ్చునా యని ధర్మజ్ఞానము లేనివాఁడు.

మత్తకోకిలము. అన్న! తండ్రి! జటాయువా! దురి♦తాత్ముఁ డీయసురుండు న
న్నన్నెఱిన్ హరియించి యేగెడి ♦ నిట్టినాదురవస్థలన్
విన్నవింపఁగదయ్య యిప్పుడ ♦ వేగ మేగి సమస్తమా
యన్నదమ్ములకో మహాత్మక ♦ యార్తనన్ దయఁ బ్రోవుమా. ౧౦౨

దురితాత్ముఁడు = పాపపు మనస్సు గలవాఁడు, ఈనెటిఁ = ఈవిధముగా, దురవస్థలఁ = చెడ్డస్థితులను, ఆర్తఁ = దుఃఖించుచుండుదానను.

తా. అన్నా! తండ్రి! జటాయువా! పాపాత్ముఁడగు నీ రాక్షసుఁడు నన్నీ విధముగా బలవంతముగాఁ బట్టుకొనిపోవుచున్నాఁడు. యుద్ధము చేయవలదంటివే. ఇఁక నేనేమి చేయఁగలనందువేమో? ఇప్పుడే శీఘ్రముగఁ బోయి నా కష్టస్థితి సమస్తము రామలక్ష్మణులకుఁ దెలుపుము. మహాత్మా ఈ మాత్రము సాహాయ్యముచేసి దయతో నీ దీనురాలిని రక్షింపుము.

ఎంత కష్టదశయందున్నను ధర్మాత్ములు ధర్మబుద్ధి వదలరు. అధర్మమార్గమున మేలుపడఁ గోరరు. నీవు యుద్ధముచేసి నన్ను విడిపింపుమని సీతాదేవి గోరినది కాదు. అది యపాయ కార్యమని యామెకుఁ దెలియును. రామలక్ష్మణులకు నావార్త దెలుపుమనియే యామె కోరెను. ఆమె కోరిక నెఱవేర్చును గాని యప్పుడే పోయినవాఁడు కాఁడు. తాను వారియొద్దకుఁ బోయి తోడి తెచ్చులోపల వాఁడు లంకఁ జేరును. ఏమి ప్రయోజనము? ప్రాణభయమున నీ కార్యముఁ జేసినవాఁడు కాకపోవును. అది దాసలక్షణము కాదు. కొంత కాలమైన వీని నిలువఁజేసిన నింతలో రామలక్ష్మణు లెదిగిరా సంతోషము నిదుగకుండిన నేను జేయవలసిన కార్యము చేసినవాఁడ నగుదు నని యతఁడు తలఁచెను.

—♦ ౫౦-వ సర్గము. జటాయువు రావణుని దూషించుట ♦—

చ. కుఱకుఱ కూర్కుచున్న విహ♦గుండు జటాయువు సీత సేయు నా
మొఱ విని లేచి రావణుని ♦ ముగ్ధ ధరాసుతఁ గాంచి రావణా
వినుఁగు సనాతనోల్లసద♦హీనసుధర్మరతుండ సత్యధీ
రాజితలెడివాఁడ గృధ్రపతిఁ ♦ ప్రచురబలుండను నే జటాయువన్. ౧-౩

కుఱకుఱ కూర్కుచున్న = కొంచెము కొంచెముగా నిద్ర కునికిపాటు పడుచున్న, విహగుండు = పక్షి, మహద్ధ్వనియందుఁ గొన్ని యనుకూలశబ్దంబులకు నుజ్జగు. సముద్రుఁడు, మేఘుఁడు, వాయుసుఁడు, వానరుఁడు, ఉరగుఁడు లోనగు శబ్దంబులవలె నిందును 'ఁడు' వచ్చెను. ముగ్ధన్-చక్కనిదానిని - పెద్ద దేహము గల రావణుని తొలుతఁ జూచెను. ఆవల సీతను జూచెను. సనాతన = ప్రాచీనమైనదియు, ఉల్లసత్ = ప్రకాశించునదియు, అహీన = శ్రేష్ఠమైన, ధర్మ = భగవద్దాస్య మను ధర్మమందు, రతుండన్ = ప్రీతిగలవాఁడను-సత్యధీన్ = 'సత్యంజ్ఞాన మనంతంబ్రహ్మ' యనునట్టిపరమాత్మని స్వరూపజ్ఞానముచే, రాజితలెడివాఁడను = ప్రకాశించువాఁడను,

సత్యస్వరూపుఁడగు భగవంతుఁడే రక్షకుఁడను బుద్ధి గలవాఁడును, గృధ్రపతి - గ్రద్దలకు రాజును, క్రూరబలుండను = తీక్ష్ణమైన బలము గలవాఁడను.

తా. కొంచెముగాఁ దూఁగుచున్న జటాయువు సీతచేయుచున్న మొఱ విని లేచి తొలుత మహాకాయుఁ డగు రావణుని, వానియంకమున నున్నసీతను జూచి యడ్డము పోయి, రావణా! నే నెవఁడని తలఁచితివో? శాశ్వతమై శ్రేష్ఠమైన భగవద్దాస్య మను ధర్మకార్యమునందుఁ బ్రీతిగల వాఁడను, సత్యస్వరూపుఁడైన భగవంతుని విషయధ్యానరూపకమైన బుద్ధిగల వాఁడను. కావున నట్టి భగవంతుని భార్యను నీవు హరించుకొనిపోవుటచే నా దాస్యధర్మము నిర్వహింప వచ్చిన వాఁడను. గ్రద్దలకు రాజను-పక్షి! నీవేమి చేయఁగల వందు వేమో? మహాబలుఁడను నా పేరు జటాయువు. ఇట్టి నేను జీవించియుండ నీ వట్టి లీమెను హరింపఁగలవు.

కం. రాముఁడు సర్వజగద్ధిత, ధీమహితుఁడు దాశరథి సుధీమహితుఁడు సు
త్రామాంపతితుల్యుఁడు భూ,స్తోమంబుల కెల్ల రాజు సురశాత్రవుఁడా! ౮౨౮

సర్వజగత్ = సమస్తప్రపంచమునకు, హిత - క్షేమకరమైన, ధీ = బుద్ధిచే, మహితుఁడు - పూజ్యుఁడు, సుధీమంతుఁడు = హితము చేయవలయు నను తలంపు కాక యుల్లు చేసిన లోకము రక్షింపవలెనను యూబుద్ధి యాలోచనగలవాఁడు, సుత్రాము - ఇంద్రునితోడను, అప్పతి - వరుణునితోడను, తుల్యుఁడు - సమానుఁడు, సుత్రాముఁడు లోకములను జక్కఁగాఁ రక్షించువాఁడు. ఇట్టివాఁడు భగవంతుఁడే. ఇది యింద్రునియందు గౌణము. అప్పతి = అపాంపతిః, జలములకు నధిపతి 'సమ్రాడాపో విరాడాపో' అను శ్రుతి వచనమువలనను, 'ఆపోనారా ఇతి'యను వచనము చేతను సమస్త చేతనాచేతనములను పాలించువాఁడు ఇట్టివాఁడు భగవంతుఁడు, భూస్తోమంబుల కెల్లన్ = భూమిమీఁదఁ బుట్టిన జీవజంతువుల కన్నిటికిని, ఇట్లనుటచే నీకును అని భావము. సురశాత్రవుఁడా - దేవవిరోధి సుత్రామాప్పతి - ఉపలక్షణచే నెనిమిది దిక్పాలుర కర్థము.

తా. ఓరీ నాస్వరూపస్వభావములు చెప్పితిని. ఇఁక శ్రీరామచంద్రమూర్తి స్వరూపస్వభావములఁ జెప్పెద వినుము. రాముఁ డనఁగా నేమని తలఁచితివో సమస్త ప్రపంచమునందలి భూతములకు మేలుకోరువాఁడు కావున నీ మేలును గోరువాఁడే. అట్టి నీమేలు కోరువానికిఁ గీడు చేయు నీవు కృతఘ్నుఁడవు కదా.

ప్రపంచక్షేమము కోరువాఁడు భగవంతుఁడు కదా, యందు రేమో? ఆ భగవంతుఁడే దశరథకుమారుఁ డను పేరఁ గానవచ్చుచున్నాఁడు. మేలుచేయ వలంపుండఁగనే లాభ మేమి యందువేమో? ఆయాలోచన కార్యరూపమునఁ

బరిణమింపఁ జేయు బుద్ధిబలము గలవాఁడు. ఆయనయందే సుత్రామ వరుణ శబ్దములు ముఖ్యముగ నన్వయించును నీ వెఱిఁగిన సుత్రామ వరుణాదు లాయన తన శక్తిలవము ననుగ్రహించుటచే గౌణముగ నా పేరు గలవారైరి. కావుననే యింద్రుఁడు తూర్పునకు, వరుణుఁడు పడమరకు రాజులు కాఁగా నీయన సమస్త ప్రపంచమునకు రాజై యున్నాఁడు. రాజ శబ్దము భగవత్పర్యాయముగా యమో వైవస్వతో రాజా యస్తవైష హృది స్థితః । తేనచేద వివాదస్తేమా గంగాం మా కురూన్గమః॥ అని ప్రయోగము గలదు.

ఆయన దేవతలకురాజు మాకుఁ గాదందువేమో, 'దేవానాం దానవానాంచ సామాన్య మధిదైవత' మ్మన్నట్లు నీకును ఆయనయే ప్రభువు.

లోకమున కంతయు నీశ్వరుఁ డొకఁడే కాని పలుగురు లేరని భావము.

సీ. ఆలోకనాథుని ♦ ల్లాలి యశస్విని, సీతను హరియింపఁ ♦ జెల్లు నటర
ధర్మతత్పరుఁ డైన ♦ ధారిణీపతికిని, బరదారహరణంబు ♦ భావ్య మటర
దానిలో విను రాజ ♦ దారి ముఖ్యంబుగఁ, గాపాడఁ దగు నంట ♦ గాన నటర
పరదారమర్శన భావంబు నీచందు, ధీరగర్హిత మాట ♦ తెలియ వటర

ఆ. నీకు బుద్ధిగాదు ♦ నిండలోచనఁ, గొంచు బోప పెంపు ♦ ప్రశాంత చరిత
మాత్మదార రక్ష్య ♦ యగురీతిఁ బరసతుల్, రక్ష్య లనుచుఁ దలఁపు ♦ ప్రాజ్ఞతతిక.

ఆ = అంత ప్రసిద్ధి-మహిమగల, లోకనాథు = జగన్నాథు, యశస్విని = కీర్తిగలది, ధర్మ తత్పరుఁడు = ధర్మమునందు విశేషాసక్తి గలవాఁడు, పరదార హరణంబు = ఇతరుల భార్యలను హరించుట, పరదార మర్శన భావంబు = ఇతరుని భార్యను తాఁకవలయునను తలంపు. ధీరగర్హితము = జ్ఞానులచే నిందింపఁబడినది, రక్ష్య = రక్షింపఁ దగినది.

తా. అంత ప్రసిద్ధికెక్కి యంతటి మహిమగల జగన్నాథుభార్యను మహాసాధ్వి యని జగన్మాత యని ప్రసిద్ధి కెక్కినదానిని నపహరింప నీకుఁ దగునా ? ఆమె యందు నీకట్టి గొప్పభావ ముండిన నుండుఁగాక ! నా కట్టి యభిప్రాయము లే దనెదవా ? నీవు రాజవు గదా. రాజు ధర్మపద్ధతి నడవవలయును గదా. అట్టివాఁడు పరస్త్రీ నెట్టిదానినైన నపహరించుట తగునా ? అందు ముఖ్యముగ రాజుభార్య తల్లి గదా ? తల్లిని గాపాడినట్లు రాజభార్యలఁ గాపాడవలెఁ గదా. ఇతర స్త్రీల నపహరించిన నేమి యందువా ? పగులసొత్తు లవమైన నపహరించుట, నీచకార్యమైనపుడు పరులభార్యను నపహరించుట మఱి యెంత నీచమో యాలోచింప

లేవా? అంతటి నీచకార్యమగుటచేఁ గదా జ్ఞానము ధైర్యము గలవారు దాని నిందించుట. అట్టి యకార్యమువలన నితరులకు నీవు కలిగించు కీడునకంటె నీకు నీవు విశేష హాని కలిగించుకొనుట యాలోచింప లేవా? నహీదృశ మనాయుష్యం లోకే కించన విద్యతే। యాదృశం పురుష స్యేహ, పరదారోపసేవనమ్॥ పరభార్యను గోరుటవలన నగు నాయుఃక్షయము మఱి దేనివలనఁ గాదను మను వాక్యము నీ వెఱుఁగవా? కావున నీమెను నీవు తీసికొనిపోవుట నీకు బుద్ధిగాదు. వదలిపెట్టుము. ఓరీ క్రూరుఁడా, నీ భార్య యెట్టు లితరులు దాఁకరాదో యట్లులే యితరులభార్యను నీవు బుద్ధిగలవాఁడైతివేని దాఁకరా దనుట తలంపుము.

ఆ. ధర్మనిరతులైన♦ధారిణీపాలురు, కాంక్షపడరు శాస్త్ర♦గర్హితంబు
లైన ధర్మములకు ♦ నర్థకామములకు, విను పులస్త్యపౌత్ర♦విశదముగను. ౮-౩౬

తా. ధర్మమందుఁ బ్రీతిగలరాజులు శాస్త్రముచే నిందింపబడిన ధర్మము అర్థము కామము నను వీనికి నాశపడరు. పులస్త్యుని మనుమఁడా? యీ విషయము తెలియఁజెప్పెదవినుము. నీవు పులస్త్య నంతటి గొప్పవానికి మనుమఁడై పుట్టియు ధర్మజ్ఞానము నీకు శూన్యముగదా.

కం. ధర్మార్థకామములకు సు,కర్మపరుండైనరాజు ♦ ఘనతరనిధి యౌ,
ధర్మమొ పుణ్యమొ, పాపమొ, యర్మిలివిను రాజమూల ♦ మైనవి యెల్లన్. ౮-౩౭

తా. ధర్మము, అర్థము, కామముఁ జక్కఁగ నెఱిఁగి ధర్మ మనుసరించి సుకార్యములుచేయు రాజు పెద్దనిధివంటివాఁడు. ధర్మముగాని, పుణ్యముగాని, పాపము గాని రాజు లెట్లుచేయుదురో ప్రజలు నట్టులే చేయుదురు. నీవు దొంగతనము, పర దారహరణము చేసితివేని నీరాజ్యమునందలి ప్రజలు రాజానుమతము ధర్మము 'యథారాజా తథాప్రజా'యన్నట్లు వారును దొంగతనము పరభార్యాపహరణము చేయుదురు. అప్పుడు రాజ్యము ధర్మము నేగతిపట్టునో యాలోచింపుము. కావున ధర్మార్థకామములకు రాజు మూలము. కావున నీవు స్వచ్ఛందవ్యాపారము మాని శాస్త్రప్రకారము నడచుకొనుము.

కం. పాపస్వభావ చపలా, యేపగిదిం గంటి వీ వ♦హీనశ్రీలన్
బాపాత్ముఁడు సురయానముఁ, బ్రాపించినరీతి సాధు♦బాధాచరణా. ౯-౩౮

తా. పాపపు స్వభావముగలవాఁడా! ఇంద్రియచపలత గలవాఁడా! సాధువులకు బాధకలిగించువాఁడా! పాపాత్ములకు దేవలోకమార్గము. అర్చిరాది మార్గము లభించినట్లు నీకు గొప్ప సంపద యెట్లురా లభించెను? సురయానమనుటకు విమాన మనియుఁ జెప్పనగు. ఏదో యల్పపుణ్యముచే స్వర్గము లభించినను శీఘ్రకాలము

నందే క్రిందఁబడునట్లు నీవు నైశ్వర్యము చెడి శీఘ్రకాలమందే భ్రష్టుఁడవయ్యెదవు.

కం. పుట్టఁగ వచ్చినగుణములు, కట్టెలతోఁ గాని పోవ ♦ కలుషాత్ములకున్
గట్టిగఁ జెప్పినబుద్ధులు, పట్టునె మనమునకు నిలువఁ ♦ బడునే తిరమై. ౮౩౯

కలుషాత్ములకున్ = పాపపు మనస్సుగలవారికి.

తా. పుట్టఁగా వచ్చినది పుడుకలతోఁగాని పోదన్నట్టు నీకుఁబుట్టఁగావచ్చిన పాపగుణము నీశవమును గాల్చినపుడుగానిపోదు. కట్టియిచ్చిన సద్ది-చెప్పి పెట్టిన బుద్ధి దీర్ఘకాలముండదన్నట్లు నేను జెప్పిన బుద్ధులు పాపాత్ముఁడవైన నీమనస్సునకుఁబట్టునా? ఒకవేళ నిప్పుడు పట్టినను స్థిరముగా నిలుచునా?

ఉ. నీనగరంబునందో మఱి ♦ నీవిషయంబునయందో జానకీ
జాని విరోధ మేమయినఁ జల్పెనుగా? యిటు లేల రిత్తక
య్యానకుఁ గాలు ద్రవ్వి యన ♦ ఘాత్ముని రామునిపట్ల నేరముం
బూనితి చేయఁగా వినుము ♦ మోసము చేకుఱు నీకు దీనిచేన్. ౮౪౦

జానకీజాని = జానకి యెవని జాయయో వాఁడు జానకీజాని. బహువ్రీహి సమాసాంతమున జాయ జానియగు. జాయాయానిఙ్ - పాణిని ౫-౪-౧౩౪-విషయము = దేశము.

తా. విరోధమునకుఁ గారణముండవలెను. అపకారమా విరోధిలక్షణము. నీలంకానగరమందుఁగాని నీదేశమందుఁగాని శ్రీరామచంద్రమూర్తి నీకేమైనఁ గీడు చేసెనా? ఏల యీయపకారము నిష్కారణముగాఁ గలహమునకు గాలుద్రవ్వి పాపమెఱుఁగని శ్రీరామునివిషయమున దోషముఁ జేయఁబూనితివి? దీనివలన నీకు నపాయమే కాని మేలులేదు.

కాలుద్రవ్వు = దీనిని గొందఱు కాలుదువ్వు అనుదురు. ఎద్దులు క్రుమ్ములాడుటకుముందు కాలిగిట్టతో నేల గీఱును. అనఁగా యుద్ధమునకుఁ బిలుచుట యని యర్థము.

ఉ. దానవలోకనాథ యతి♦దర్పితుఁడై యతివృత్తుఁడై జన
స్థాననివాసి యాఖరుఁడు ♦ చచ్చెను శూర్పణఖానిమిత్తమై
పూని రఘూద్వహుం జెనకి ♦ పూరుషపుంగవుచేసినట్టికా
రానిది యెద్ది తత్సతిని ♦ రావణ నీ విటు ముచ్చిలింపఁగన్. ౮౪౧

అతిదర్పితుఁడై = మిగుల గర్వించినవాఁడై, అతివృత్తుఁడై = మర్యాద నతిక్రమించినవాఁడై, శూర్పణఖా నిమిత్తమై = శూర్పణఖకొఱకై, ముచ్చిలింపఁగన్ = దొంగిలించుటకు.

తా. ఓరీ రాక్షసరాజా! నాతమ్ముఁడు ఖరుఁడు మొదలగువారిని జంపుట నాకపకారముచేసినట్లుగాదా యందువేమో? శూర్పణఖ చెప్పినమాటలు విని గర్వించి మర్యాద దప్పి ప్రయత్నపూర్వకముగా శ్రీరామునిమీఁదికి యుద్ధమునకుఁ బోయి ఖరుఁడు చచ్చెను. యుద్ధమందు తనప్రాణరక్షణము తానుచేసికొనుట తప్పా? అట్లైతే నీవు మగతనము గలవాఁడవైతివేని శ్రీరామునిమీఁదికి యుద్ధమునకుఁ బొమ్ము. ఏదోషమెఱుఁగని సీతను దొంగిలించికొనిపోయి యామెను బాధపెట్టుటకుఁ బురుషశ్రేష్ఠుఁడైన శ్రీరాముఁడు చేసిన నేరమేమి?

మాలిని. వలదు వలదు రక్షో♦వల్లభా నీవు సీతన్
బలిమిని గొనిపోవం ♦ బాప మాభూవరుండున్
దెలిసిన యెడ నిన్నున్ ♦ దృష్టిచేనే దహించున్
గులిశమునను వృత్రుం ♦ గూల్చు జంభారిమాడ్కిన్. ౬౪౨

తా. రాక్షసరాజా! నీవు సీతను బలాత్కారముగఁ దీసికొనిపోవలదు. వలదు. అది మిగులఁ బాపకార్యము. నీవిట్లు చేసితివని రామచంద్రునకుఁ దెలిసినా వజ్రముచే నింద్రుఁడు వృత్రుని వధించినట్లు చూపులచేతనే నిన్ను దహించును.

మాలిని, ననమయయగణంబులు. ౯వ యక్షరము యతి.

కం. కొంగున నాశీవిషము భుజంగమమున్ ముడిచి మెడను ♦ జముపాశముఁ జక్కంగ బిగించికొనియు నెఱుఁగంగాఁ జాలవు దురాత్మ ♦ కాఁగలకీడున్. ౬౪౩

ఆశీవిషము భుజంగమము = కోఱలయందు విషముగల సర్పము, ఆశీవిషమను పేరుగల క్రూరసర్పము. ముడిచి = ముడివేసి, జము = యమునియొక్క, కాఁగల = కలుగఁబోవు.

తా. క్రూరసర్పమును గుడ్డకొంగున ముడివేసికొని మెడకు యమపాశ మురిపోసి బిగించికొనియు వానివలన రాఁబోవు కీడు నెఱుంగలేక యున్నావు. పామును ముడివేసికొనినవాఁడు యమపాశము నురిగా మెడకుఁ దగిలించుకొనినవాఁడెట్లు తప్పక చచ్చునో యట్లనే సీతను హరించి నీవు చత్తువు అనుటచే నలంకారము వ్యాజస్తుతి.

కం. మోవఁగల యంతభారమె, మోవం దలకొనఁగవలయు ♦ మొగి రోగముఁ దేకేవస్తు వెంత యఱుగునొ, యావస్తువు నంతె తినుట♦యర్హము కుమతీ. ౬౪౪

తా. ఓరీ బుద్ధిలేనివాఁడా! యెంతబరువు మోయ సాధ్యమో యంతబరువే తలమీఁది కెత్తుకొనవలయును. ఎంతదినిన రోగము కలిగింపక సులభముగ జీర్ణించునో యంతే తినవలయును. మోయలేని బరువు తలమీఁది కెత్తినను జీర్ణముకాక

రోగము తెచ్చునట్లు తినినను అపాయము కలిగినట్లు సీతను హరించితివేని నీకును అపాయము తప్పదు.

క౦. ఏకార్యంబునఁ జెడునో, లోకమునఁ యశంబు కీర్తు ♦ లున్ ధర్మంబున్
జేకుఱునో దేహఖేదం, బాకార్యము బుద్ధిమంతుఁ ♦ డగునే చేయన్. ౧౪౫

తా. ఏపనిచేసిన లోకమున దానాదులచే వచ్చిన యశము, పరాక్రమముచే సంపాదించిన కీర్తి నాశమగునో, దేనివలన దేహమునకు వ్యసనము ప్రాప్తించునో బుద్ధిమంతుఁడగువాఁడు దానిని జేయరాదు.

చ. అఱువదివేలయేం డ్లిపుడు ♦ ప్రాయమునన్ సురవైరి నాకు నే
యఱగొఱలేక యేలితిని ♦ హాయిగఁ బైతృకమైన రాజ్య మీ
వుఱిది గలట్టియౌవనము ♦ నొప్పగువాఁడవు విల్లు తేరు మై
మఱువు శరంబులుం గలుగు♦ మాసటి వే ముదుకండ, నైనను్. ౧౪౬

అఱగొఱ = కొఱఁత, పైతృకము = పితృ పితామహుల వలన వచ్చిన రాజ్యము, ఉఱిది = దార్ఢ్యము, మైమఱువు = కవచము, మాసటివి = శూరుఁడవు. ఇందు జటాయువు తనకు నఱువదివేల యేండ్లని చెప్పుకొనెను. దశరథుఁడే యీతఁడు వాఁడే కాగా దశరథుని తాతలు, ముత్తాతలు మాంధాత అనరణ్యుఁడు మొదలగు వారితో యుద్ధముచేసిన రావణుఁడు వయస్సువాఁ డెట్లయ్యెను ? జటాయువు ముసలి వాఁడెట్లయ్యెను ? జన్మకాలమునుబట్టి చూచిన జటాయువుకంటె రావణుఁడు పెద్ద వాఁడగుటయందు సందేహము లేదుగాని, కైలాస మెత్తినప్పటికి నెంత యాయుస్సు క్షీణించినదో యంత యాయుస్సు మరలఁ బూర్తిచేసి శివుఁ డిచ్చినట్లు ఉత్తర కాండమున 33౯ - 3౪౦ - 3౪౧ వ పద్యమువలనఁ దెలియుచున్నది' కావున మరల వయస్సు నూతనముగ లభించినట్లు తెలియుచున్నది, దీనివలనను తపోబలము వలనను, ఆహారబలము వలనను జటాయువుకంటెఁ జిన్నవాఁడుగా రావణుఁడు గాన వచ్చుచుండెను.

తా. ఓరీ ! వీఁడు ముసలివాఁడు అని యలక్ష్యము చేయకుము. నిజమే నా కిప్పు డఱువదివేల సంవత్సరముల వయస్సు. ఇన్ని సంవత్సరము లేలోపములేక తండ్రిరాజ్య మును బాలించితిని. నీవో దృఢమైన వయస్సుయందున్నవాఁడవు. విల్లు, తేరు, కవ చము, బాణములు గల శూరుఁడవు, నేను ముసలివాఁడను.

ఉ. జానకినిన్ హరించుకొని ♦ సౌఖ్యముగాఁ జనలేవు చెప్పితిన్
నేను గనంగ నీవ యవ ♦ నీతనయన్ ధ్రువనైగమార్గమున్
బూనిక న్యాయహేతువుల ♦ పోలికగా హరియింప నేర వో
దానవ ! పౌరుషంబు గల ♦ దా నిలుమీ నిమిషంబు పోరఁగన్ ౧౪౭

ధ్రువనైగమార్థములన్ = శాశ్వతమగు వేదముల యర్థమును, న్యాయహేతువులన్ = తర్కయుక్తులచే, పౌరుషంబు = మగతనము - అనుమానప్రమాణము ముఖ్యముగాఁ గలది తర్కము - వేదము స్వతఃప్రమాణము. వేదవిదగ్రేసరుఁడు వినుచుండఁగా వేదార్థములను యుక్తులచేఁ బాడుచేయుట సాధ్యపడనట్లు నేను జూచుచుండఁగా నీవు సీతను హరింపలేవనిభావము. ఆ వేదజ్ఞుఁ డెట్లు తనవలననైనంత శ్రమించి వేదార్థమును స్థిరపఱిచి తప్పు యుక్తులను ఖండించునో అట్లే నేనును నిన్ను ఖండించి సీతను రామునకుఁ జేర్చెదను. వేదార్థవిషయమునఁ గుయుక్తిపరునకు శ్రమమాత్రమే ఫలమైనట్లు సీతావిషయమున నీకును శ్రమము మాత్రమే లాభము.

తా. అయినను సీతను దీసికొని నీవు సుఖముగా నాకన్నులయెదుటఁ బోఁజాలవు. చెప్పినమాట విను. వేదముల యర్థమును తర్కయుక్తులచే హరించి యపార్థము కల్పింప నెట్లు సాధ్యపడదో యట్లు సీతను నీవు హరించి రామునుండి విడఁదీయలేవు. ఓరీ రాక్షసుఁడా పరువెత్తిపోయెదవే, మగవాఁడవైతివేని యల్పకాలము యుద్ధముసేయ నిలుము.

కం. మున్ను ఖరాసురువలె నీ, విన్నేఁడ్ దీర్ఘనిద్ర ♦ నొందెదు రాముం
డెన్నియొ మాఱులు దైత్యుల, మన్నిగొనినయట్లు పిలుకు♦మార్చు న్నిన్నున్.

దీర్ఘనిద్ర=మృతి, మన్నిగొనినయట్లు=చంపినట్లు, పిలుకుమార్చు=చంపు.

తా. అల్పకాలము నిలువఁబడితివా ఖరుఁడు ముందుచచ్చినట్లు నీవును జచ్చెదవు. ఎన్నిమార్లో రామచంద్రమూర్తి రాక్షసుల వధించినట్లు నిన్ను వధించును.

కం. శూరులు రాజకుమారులు, దూరగతుల్ గాఁగఁ జూచి ♦ తొయ్యలి నబలన్
గూరినభీతిని శాతెద,వా రక్కస! కొనుచు; నేమి♦వలఁతిని జేయన్. ౫౪౯

దూరగతుల్ = దూరము పోయినవారు, వలఁతిని = సమర్థుఁడను.

తా. శూరులగు రాజకుమారులు దూరముపోవుటఁ జూచి ఆఁడుదానిని నల్పబలముగలదానిని దీసికొని ప్రాణభయమునఁ బరుగెత్తెదవా ? ఇప్పుడు నేనేమి చేయఁగలవాఁడను ? నీవు నిమిషము నిలిచెదవేని రామలక్ష్మణులఁ దేఁగలను. నేను వారికై పోయితినా నీవు పోయి లంకఁ జేరుదువు.

మ. వినరా నామెయిఁ బ్రాణము ల్గలుగఁ బృ♦థ్వీకన్యకన్ జానకిన్
వనజాతాయతపత్రనేత్రను రఘు♦స్వామీష్టఁ జిత్తేశ్వరిన్
గొనిపోనీ విడె ప్రాణగొడ్డమయినం ♦ గూర్తుం బ్రియం బామహా
త్మునకున్ రామున కాజికిన్ వెలయుదున్ ♦ దుర్వారవిక్రాంతిచేన్. ౫౫౦

ప్రాణగొడ్డము = ప్రాణమునకు నపాయము కలిగించునది, వినరా = వినుమురా. ప్రార్థనార్థకమధ్యమపురుషంబున నెదాదు లన్ప్రయుక్తంబు లగుచో ము-డుజ్జులకు పురు లగు, సు-వ్యా-క్రియ ౩౮ సూ. వినురా, కనురా. ఇత్యాదు

లసాధువులు - వనజాతాయతపత్రనేత్రను =కనులముల విశాలదళములవంటి కన్నులు గల దానిని, ఆజికి = దశరథునకు - స్నేహితుఁడగు దశరథునకు. 'ఉపకారఫలం మిత్ర'మ్మన్నట్లు ఉపకారముచేయుట మిత్రలక్షణము. మిత్రుని కుమారునకు సాహాయ్యముచేసిన మిత్రునకుఁ జేసినట్లే కదా. దుర్వార = అడ్డగింపరాని, విక్రాంతిచేక్= పరాక్రమముచేత.

తా. ముసలివాఁడు వీఁడేమిచేయఁగలఁడులే యని తలఁచెదవేమో? వినరా చెప్పెదను. నాదేహమునందుఁ బ్రాణము లుండువఱకు సీతాదేవిని, రామచంద్రమూర్తి ప్రియురాలిని, యాయన యాత్మేశ్వరిని, దీసికొని నిన్నుఁ బోనీయను. నాప్రాణమునకు నపాయమైనను సంతోషమే. నాచేతనైనంత చేసి మహాత్ముఁడగు శ్రీరామునకు నామిత్రుఁడగు దశరథునకు నా యనివార్యపరాక్రమముచే సంతోషము గలిగింతును.

ఉ. పోకుర పోకు నిల్వు నిలు ♦ పోఁగల వెం దిఁకఁ బంక్తికంఠ నిక్
దీకొని విక్రమంబుకొలఁది ♦ దిక్ సమరూర్జ్యరణాతిథేయముక్
జోక గ్రహింపుమీ కనుమి ♦ శౌరత నిన్న రథంబునుండి య
స్తోకజవంబునక్ ధరణిఁ ♦ ద్రోయుదు వృంతమునుండి పండనక్. ౮౫౧

పోకుర = పోకుమురా. వ్యతిరేకప్రార్థనంబున నన్నాదు లనుప్రయుక్తంబులైనపుడు వు, రు, లు రావు. కావున పోకుర అనియే రూపము. త్రిప్పకుమన్న మామతము దీర్ఘములైన విరోధిపాఠముల్ చెప్పకుమన్న ఇత్యాదులు. వృంతము = తొడిమ.

తా. నీ వేమిచేయఁగల వందువా? పోకు పోకు. నిలువుము. రావణా! నేనేమి చేయఁగలనో చెప్పెదను. నీవు పోఁజూచినను నాకంటఁబడి నీవెందుఁ బోఁగలవు? ఎదిరించి నాశక్తికొలఁది నీకు నుత్సాహముతో యుద్ధభిక్ష పెట్టెదను. దానిని గ్రహింపుము. నాశౌర్యము చూడుము. తొడిమనుండి పండును నేలరాల్చినట్లు నిన్ను రథమునుండి మిక్కిలి వేగముతో నేలఁబడఁగొట్టెదను. జటాయువు నిన్నుఁ జంపెద ననలేదు. పౌరుషమునకైన నసత్యమాడినవాఁడు కాఁడు. చెప్పినంత చేసెను. ఇది దానలక్షణము.

—♦ ౫౧-వ సర్గము. జటాయు రావణుల యుద్ధము ♦—

చ. అది విని పంక్తికంఠుఁడు దు♦రాగ్రహరోషవశాత్ముఁ డౌచు ని
ర్వదికనుల న్మిణుంగురులు ♦ రాల జటాయువుఁ దాఁకెఁ దాఁకినక్
జదల మహాప్రవాలధుత♦సారఘనాఘనయుగ్మ భంగిగక్
ఛదయుతమాల్యవంతముల♦చందమునం గనుపట్టి రిద్దఱుక్. ౮౫౨

దురాగ్రహ = చెడ్డపట్టుదల. వీని నెట్లైన హతునిఁజేయవలయు నను పట్టుదల

రోషము=కోపము, వీనికి-వశ = స్వాధీనపడిన, ఆత్ముఁడు = మనస్సుగలవాఁడు, చరలన్ = ఆకాశమందు, మహాప్రవాత = గొప్పవాయువుచేత, ధుత = ఎగురఁగొట్టఁబడిన, సార = బలిష్ఠమైన, ఘనాఘనయుగ్మము = రెండు మేఘముల, భంగిన్ = వలె, ఛదయుత = ఱెక్కలతోఁగూడిన, మాల్యవంతముల = మాల్యవంత మను పేరుగల.

తా. ఆమాటలు విని దశకంఠుఁడు వీని నెట్లైన హతునిఁ జేయవలయునను పట్టుదలతో కోపించినవాఁడై యిరువదికన్నులనుండి నిప్పులమిణుఁగురులు రాలఁగా జటాయువును దాఁకెను. అట్లు వారిద్దఱు నొకరి నొక రెదిరించుట పెద్దగాలిచేఁ జిమ్మఁబడిన మేఘములు రెండొకదానినొకటి దగిలినట్లును ఱెక్కలు గల రెండు మాల్యవంతములు ఢీకొనినట్లు లుండెను.

ఇరువురు సమానబలవేగములు గలవారై యుండిరని భావము.

ఇంతకుముందు గోదావరీసమీపమున నొకమాల్యవంతము చెప్పఁబడెను. కిష్కింధా సమీపమున నొక మాల్యవంతము చెప్పఁబడును. ఈ రెండు పర్వతములఁ గవి యుద్దేశించెనని తోఁపదు. ఒక్కమాల్యవంతమునే మనస్సునం దుంచుకొని సమానత్వమును జెప్పుటకై యట్టిదే మఱియొకటి యనుటకై పేరు చెప్పెనని తోఁచెడిని.

రథము గుట్టలకుఁ గ్రిందివైపు వారి పర్ణశాల. అక్కడికి జటాయువృక్షము మించు మించు మైలులోఁగా నుండును. అక్కడ యుద్ధము ప్రారంభము చేసి యక్కడికి రమారమి ౫-౬ మైళ్ళ దూరమునఁ గల దుమ్ముగూడెమునొద్ద నున్న జటాయువుగుట్టవఱకు యుద్ధము చేయుచుఁ దఱుముకొని వచ్చి నీ పర్వతమునొద్ద ఱెక్కలు ఖండింపఁబడి పడిపోయెను.

ఉ. వారికి నద్భుతాహవము ♦ వర్తిలు చుండఁగఁ బంక్తికంఠుఁడున్
ఘోరనిశాతబాణములు ♦ కుప్పనఁగూరలు గృధ్రరాజుపై
వారక వృష్టిగాఁ గురియు ♦ వాని జటాయువు చండతుండశా
తోరునఖాగ్రపాళులను ♦ నుర్వరఁ గూలిచి పేర్చి తీవ్రతన్. ౯౫౩

అద్భుతాహవము = ఆశ్చర్యకరమైన యుద్ధము, ఘోర నిశాత బాణములు= భయంకరములైన వాఁడిగల బాణములు, కుప్పనఁగూరలు = కుప్పలుకుప్పలుగా, వృష్టిగాన్ = వర్షమువలె, చండ = తీక్ష్ణమైన, తుండ = ముక్కుతోను, శాత = పదునైన, ఉరు = గొప్పవైన, నఖాగ్ర = గోళ్ళకొనలయొక్క, పాళులను = వరుసలచేతను- ప్రదేశముల చేతను, ఉర్వరన్ = భూమియందు.

తా. ఆ యిరువురకు నాశ్చర్యకరమైన యుద్ధము జరుగుచుండఁగా రావణుఁడు జటాయువుమీఁదఁ గుప్పలు కుప్పలుగా వర్షమువలె వెఱవు పుట్టించు పదును

గల బాణములను నడ్డములేక ప్రయోగింపఁగ్గాఁ జటాయువు వానినెల్ల దన ముక్కుతోను గోళ్ళతోను నేలఁ బడఁగొట్టి విజృంభించెను.

ఉ. దానవుగాత్ర మెల్ల వ్రణి ♦ తంబుగ గోళ్ళను గాళ్ళ గీఱి యెం
తే నొగు లొందఁజేయ నసు ♦ రేశ్వరుఁడుర్ యమధండతుల్యతా
మానితఘోరశాతదశ ♦ మార్గణముల్ గుఱిగా జటాయువా!
వీనను జచ్చితీ వనుచు ♦ వే వయిచెం దెగ నిండఁ దీయుచున్. ౮౫౪

వ్రణితంబుగన్ = పుండువలె నగునట్లు, నొగులు = బాధ, యమదండతుల్యతా = యమ దండముతోడి సమానత్వముచే, మానిత = గౌరవింపఁ దగిన ఘోరశాతదశమార్గణముల్ = భయంకరములై పదునైన పదిబాణములను, వీనను = వీనిచే, వే = త్వరగా, తెగ = అల్లెత్రాడు, నిండన్ = ఆకర్ణాంతము, తీయుచున్ = లాగుచు.

తా. రావణుని దేహమంతయు పుండువలె నగునట్లు జటాయువు గోళ్ళను గాళ్ళను చీల్చి మిగుల బాధ కలిగింపఁగా రావణాసురుఁడు వీనితోఁ జచ్చితివిరా జటాయూ యని పదునైన బాణములు నల్లెత్రాటికిఁ గూర్చి చెవికొనవఱకు లాగి గుఱిచూచి వైచెను.

వీనన్ = అది యిది యెది యనువానికిఁ దృతీయాసప్తమ్యేకవచనములందు దాన దీన దేన ననియు, వాని బహువచనములందు వాన వీన వేన ననియు రూపంబులు. ప్రౌ. వ్యా. శబ్ద ౬౨ సూ.

ఉ. వానికి నీడఁబోక సుర ♦ వైరిరథస్థ సబాష్పలోచనన్
జానకిఁ జూచి వైరిపయి ♦ సాహసికత్వము దోఁప దూఁకి ము
క్తానిచయాన్వితంబు శిత ♦ కాండసమన్విత మైనచాపమున్
దా నిరుతుంటలై పడఁ బ ♦ తంగకులాగ్రణి ద్రుంచి వైచినన్. ౮౫౫

ఈడఁబోక = వెనుదీయక, సురవైరి రథస్థన్ = రావణుని తేరిమీఁద నుండుదానిని, సబాష్పలోచనన్ = కన్నీళ్ళతోఁగూడిన కన్నులుగలదానిని, ముక్తానిచయాన్వితంబు = ముత్యాల సమూహములచేఁ గూడినది. శితకాండ సమన్వితమున్ = పదునైనబాణములతోఁ గూడినదానిని, ఇరుతుంటలై = రెండు తునుకలై, పతంగకులాగ్రణి = పక్షిజాతులందు శ్రేష్ఠుఁడగువాఁడు.

తా. ఆ బాణములకు వెనుదీయక రావణుతేరిపైఁ గన్నీరు కార్చుచున్న జానకిని జూచి మనస్సు తపింప సాహసించి రావణుమీఁద దూఁకి ముత్యాలసరులు వ్రేలఁగట్టినట్టియు ప్రయోగింప బాణములను సంధించియున్నట్టియు వింటిని రెండు తునుకలుగా జటాయువు విఱిచెను.

ఉ. వే తొకవిల్లు పుచ్చికొని ♦ విక్రమవంతుఁడు రావణాసురుం
డాఱనికిన్క బాణనిచ ♦ యాధికవృష్టిని ముంప గూఁట నో

టాటినపక్షి యో యన జ♦టాయువు కొండొకసేపు చిక్కియున్
మీటినపక్షవేగమున ♦ మీటి శరంబులు విల్లు ద్రుంచుచున్. ౮౫౭

ఆజనికిన్కన్ = శమింపని కోపముచే, బాణనిచయాధిక వృష్టిని = బాణసమూహముల పెద్దవర్షమును, గూటన్ = గూఁటియందు, ఓటాటిన = నిస్సత్త్వమైన, పక్షియోయనన్ = బాణముల నడుమఁ జిక్కిన జటాయువు గూఁటియందుఁ జిక్కిన పక్షివలె నుండెనని భావము. కొండొకసేపు = కొంచెము కాలము, పక్షవేగమునన్ = ఱెక్కలవేగముచే,

తా. పరాక్రమశాలి రావణుఁడు మఱియొక విల్లు దీసికొని శమింపని కోపముతో బాణవర్షమున జటాయువును ముంపఁగా నాబాణముల మధ్యమున గూఁటియందుఁ జిక్కి కదలమెదలని పక్షివలెఁ గొంచెముసేపుండి యావల ఱెక్కల వేగముచే వానినెల్లఁ జెదరఁగొట్టి బాణములను వింటిని ద్రుంచివైచెను.

సీ. సురవైరిఘనశరా♦వరము పక్షాహతిఁ, దుత్తుమురై నేలఁ దొరఁగఁ జేసి
కాంచనోరశ్ఛదో♦దంచితదివ్యపి, శాచాస్యఖరముల ♦ క్షమను గూల్చి
కామగంబు త్రివేణు♦కలితంబు పావకా, ర్చిష్కమౌరథము ధ♦రిత్రి ద్రోల్చి
చంద్రసన్నిభసిత ♦ ఛ్ఛత్త్రంబు సగ్రాహి, సవ్యజనంబుగఁ ♦ జదును సేసి
తే. ముక్కునను సూతుతల పట్టి♦నొక్కి త్రుంప
భగ్నచాపుండు హతయంత ♦ పాతితాశ్వుఁ
డగుచు ధారిణిఁ ద్రెళ్లె సు♦రారినేత
యంకమున బిగ్గ గ్రహియించి ♦ యవనిసుతను. ౮౫౮

శరావరము = కవచము, పక్షాహతిన్ = ఱెక్కల దెబ్బచే, తుత్తుమురు = తుమురు + తుమురు = తుత్తుమురు = మిక్కిలి తుమురై, తొరఁగఁజేసి = పడునట్లు చేసి, కాంచన + ఉరశ్ఛద = బంగారుకవచముచేత, ఉదంచిత = బాగుగఁ బ్రకాశింపఁజేయఁబడినవియు, దివ్య = శ్రేష్ఠములయినవియు, పిశాచ + ఆస్యఖరములన్ = పిశాచముఖములగల కంచరగాడిదలను, మగగాడిదలకు ఆఁడు గుఱ్ఱములకుఁ బుట్టినవి కంచరగాడిదలు. క్షమను = భూమిపై, కామగము = కోరినట్లు పోవునది. త్రివేణుకలితంబు = మూఁడువెదుళ్లనొగతోఁ గూడినట్టిది, పావక + అర్చిష్కము = అగ్నివంటి కాంతిగలది, ద్రోల్చి = త్రోసి, సితచ్ఛత్త్రంబు = తెల్లగొడుగు, సగ్రాహిగన్ = దానిని బట్టుకొనువారితోడ, సవ్యజనంబుగన్ = చామరములతోడ, చదును జేసి = నేలతో సమముగాఁ జేసి, సూతు = సారథియొక్క, హతయంత = చంపఁబడిన సారథిగలవాఁడు, పాతితాశ్వుఁడు = పడఁగొట్టఁబడిన గుఱ్ఱములు గలవాఁడు, అంకమునన్ = తొడయందు.

తా. అంతతోఁబోక జటాయువు రావణాసురుని గొప్పకవచమును ఱెక్కల దెబ్బలచే మిక్కిలి పొడిపొడియై నేలఁబడఁజేసి బంగారుకవచములచేఁ బ్రకాశించు

పిశాచముఖములు గల కంచరగాడిదల నేలఁ బడఁదన్ని కోరినటు పోవు నదియు నగ్నివలెఁ బ్రకాశించునదియు నగు మాఁడువెదుళ్ళనొగ గలదియు నగు రథమును నేలఁబడఁ జేసి చంద్రునివంటి తెల్లగొడుగును దానిని బట్టుకొనువారితోడను, చామరములతోడను, నేల సమముచేసి సారథి శిరస్సును ముక్కుతో నొక్కి త్రుంపఁగా-విల్లు విఱిగినవాఁడు సారథి చచ్చినవాఁడు గుఱ్ఱములు నేలఁబడినవాఁడు నగుచు రావణుఁడు సీతాదేవిని రొండిపై గట్టిగఁ బట్టుకొని నేలమీఁదఁ బడెను.

ఆ. భగ్నచాపుఁ డగుచు ♦ భగ్నవాహనుఁ డయి, నేలఁ ద్రెళ్లినట్టి ♦ నిర్జరారిఁ
గాంచి భూతకోటి ♦ ఖగరాజు మెచ్చెను, మేలు మేలటంచు ♦ మేలినుతుల. ౮౫౯

తా. విఱిగిన విల్లు విఱిగినతేరు గలవాఁడై నేలమీఁదఁబడిన రావణునిఁ జూచి భూతమ్ములన్నియు జటాయువును మేలుమేలని స్తోత్రము చేసెను.

కం. ముదుకం డగుటను బడలిన, విదితబలుఁ గృధ్రరాజు ♦ వీక్షించి మహా
మదమున మింటికి నెగసెను, మదిరాయతనేత్రతోడ ♦ మనుజాశనుఁడున్. ౮౫౯

తా. ముసలివాఁ డగుటచే బడలిక చెందిన మహాబలుని జటాయువును జూచి యిఁక వీఁడు నన్నేమియుఁ జేయఁజాలఁడని సంతోషించి సీతతోడ రాక్షసుఁ డాకాశమున కెగసెను.

ఉ. పోవుచు నున్నయాయసుర♦పుంగవుఁ గాంచి జటాయు వంతఁ దెం
పావహిలంగ నడ్డమయి ♦ యాతనితో నను వజ్రతుల్యబా
ణావళిదీపితుం డయిన ♦ యారఘునాయకుదేవి నీవు గొం
పోవుట రాక్షసాన్వయము ♦ మూలముతోఁ జెడిపోఁ గే చుమీ. ౮౬౦

వజ్రతుల్యబాణావళిదీపితుండు = వజ్రముతో సమానమైన బాణసమూహముచే ప్రకాశించువాఁడు.

తా. ఇట్లుగిరిపోవుచున్న రాక్షసుని జూచి చాల బడలినవాఁడయ్యు జటాయువు తెంపుజేసి వానికడ్డమయి యిట్లనియె: ఓరీ! వజ్రసమానములైన బాణములు గల రామచంద్రునిభార్యను నీవు తీసికొనిపోవుట రాక్షసవంశము సమూలము నాశమై పోవుటకే సుమా.

—♦ రావణుని జటాయువు పరుషోక్తు లాడుట ♦—

కం. మిత్రులతో బంధులతోఁ, బుత్రులతో సచివసైన్య ♦ పూగంబులతోఁ
బౌత్రులతో గరళంబుఁ బవిత్రం బని త్రాగెదే వి ♦ వేకవిహీనా. ౮౬౧

సచివ, సైన్య, పూగంబులతోన్ = మంత్రులయు సేనలయు సమూహముతో, గరళంబు = విషము, పవిత్రంబని = మంచినీళ్లని. 'దధికలశగోమయాంబుషు కుశతామ్ర బ్రహ్మసూత్రమంత్రేషు హేమ్ని వ్యక్షేచ పవిత్రం' అని నా॥క॥

తా. స్నేహితులతోఁ, జుట్టాలతోఁ, గొడుకులతో, మంత్రులతో, సేనా

సమూహముతో, మనుమలతో, వివేకహీనుఁడా విషమును మంచినీళ్ళని త్రాగ దవా? ఇందఱితోడ విషము త్రాగుట యెట్టిదో సీతను నీవు హరించి కొనిపోవుట యట్టిదని భావము.

కం. రాఁగలఫలముం దమమది,లోఁ గానఁగ లేక బుద్ధి♦లోపమున జడుల్
రేఁగి యకార్యం బొనరిచి, తోఁగుదురు విపత్తునందుఁ♦దుది నీకరణిన్. ౧౬౨

తా. బుద్ధిలేనిజను లీకార్యముచేసిన నీఫలముగలుగునే యను నాలోచన లేక నీవలెఁ జేయరానిపనిచేసి కడపట నాపదలందు మునుఁగుదురు.

కం. కాలుఁడు పాశము నీమెడఁ, బోలం బిగియింప నెందుఁ♦బోయిన నీకే
లీల మృతి దప్పు మీనము, గాలం బెరతోడ మ్రింగు♦గతి నైతివిరా. ౧౬౩

తా. యముఁడు నీమెడకు పాశము దగిలించి బాగుగ బిగియించెను. కావున నీ వెందుఁబోయినను నీకుఁ జా వేల తప్పును? చేఁప గాలముతోడ నెరను మ్రింగినట్లు నైతివి.

చ. అలవి యెఱుంగనేరక మ♦హాత్ములతోఁ బగఁగొంటి, వారు నీ
కలఁతులు గారు, నీ విటు ని♦జాశ్రమవాసిని సంగ్రహించుటన్
బలితపుఁగోప మెత్తి సహ♦బాంధవుగాఁగ రణంబులో నినుం
బొలియఁగఁ జేయువారు, చెడి♦పోకుము పోకుము కోరి రావణా. ౧౬౪

అలవి = కొలఁది, నీకు = నీకంటె, అలఁతులు = తక్కువవారు. నిజాశ్రమవాసిని = తమయాశ్రమమందున్న దానిని.

తా. రావణా! వారి బలపరాక్రమములపరిమాణము తెలియక నీవు వారితో విరోధించితివి. వారు నీకంటెఁ దక్కువవారు గారు. నీ వీ ప్రకారము తమ యాశ్రమమందున్న దానిని హరించుటచే, వారు మిగులఁగోపించి నిన్ను బంధువులతోడ యుద్ధమందుఁ జంపుదురు. చెడిపోకుము. పరువెత్తిపోకుము. నిలునిలుము.

కం. భీరుత్వంబున నీకర,భోరువు హరియించి కోఁచ ♦ యుఱికెద విది లో
నారయ జగంబు దిట్టెడి,చోరునికర్మంబు గాక ♦ శూరునివిధమే. ౧౬౫

భీరుత్వంబునన్ = పిఱికితనముచే, కరభోరువున్ = స్త్రీని, కరభ + ఊరువున్ = కరభమువంటి తొడలుగలదానిని, కరభము = మణికట్టుమొదలు చిటికెనవ్రేలిమొదలుదాఁకఁ గల చేతి వెలుపలిచోటు, కోఁచ = పిఱికి.

తా. ఓరీ పిఱికీ! ఈ యాఁడుదానిని హరియించి ప్రాణభయమునఁ బరువెత్తుచున్నావే. ఇది లోకమునిందించు దొంగపనియే కాని శూరునివిధమా?

కం. శూరుఁడ వేసియు నిలువుము,రా రావణ మూర్త మొందు ♦ రణమున నీవున్
గూరెదవు పెద్దనిద్దుర, నారామునిచేత నీదు ♦ ననుజునిపోల్కిన్. ౧౬౬

పెద్దనిద్దుర = మరణము.

నీవు శూరుఁడవైతివేని కొంచెముసేపు నిలుము, రామునిచే నీ తమ్ముఁడు చచ్చినట్లు నీవును యుద్ధమునఁ జావఁగలవు.

కం. మరణం బాసన్నంబై, పొరసిన స్వవినాశమునకుఁ ♦ బూనరుచు నఘముం
బురుషుం డట్టియకార్యము, దురుసున నీ విపుడు సేయుఁ ♦ దొడఁగితి వనురా.

ఆసన్నము = దాపు, సమీపించినది.

తా. తనకు మరణకాలము సమీపించినపుడు తననాశమునకై పురుషుఁ డెట్టి పాపకార్యమును జేయునో యటువంటి చేయరానిపనిని నీవు దుష్టతనముచేఁ జేయఁబూనితివి. కావున నీకుఁ జావు సిద్ధము.

కం. పాపానుబంధకార్యం, బేపురుషుఁడు లోక మిల్ల ♦ నేలెడువాఁడే
నాపరమేష్ఠియ యేనియుఁ, బాపాత్మా! చేయఁ బూను ♦ ప్రాభవ మఱఁగన్ ?

పాపానుబంధకార్యము = పాపసంబంధముగలపని, పరమేష్ఠి = బ్రహ్మదేవుఁడు, పరమే = ఉత్కృష్టే పదే బ్రహ్మలోకాఖ్యే తిష్ఠతీతి - పరమేష్ఠి = ఉత్కృష్టస్థానమందుండువాఁడు, ప్రాభవము = ప్రభుత్వము.

తా. ఏపురుషుఁడైనను అనఁగా లోకమునంతయు నేలెడి రాజయినను లోకములను సృష్టించు నాబ్రహ్మదేవుఁడే యైనను తనప్రభుత్వము నశించునట్లు పాపీ యెవఁడురా నీవలెఁ బాపసంబంధముగల కార్యము చేయును. నీవు చేసితివి కావున నీవు నాశము కాఁగలవు. బ్రహ్మదేవుఁడైనను బాపకార్యముచేసెనేని చెడుచుండఁగా నీవనఁగా నెంతమాత్రము.

చ. అని హితనీతివాక్యముల ♦ నాడి జవంబున వ్రాలి వీఁపుపైఁ
దన నఖపాళి నాతని వి♦దారితగాత్రునిఁ జేసి వేగముం
బొనుఁగువడంగఁ జేసె మద♦ముం గొని రేఁగ గజంబు మావటీఁ
డనుపమితాంకుశంబున ర♦యంబునఁ దాఁ గుదియించుకైవడిన్. ౮౬

జవంబునన్ = వేగముగ, విదారితగాత్రునిన్ = చీల్పఁబడిన దేహముగలవానిని, పొనుఁగుపడంగన్ = క్షీణించునట్లు, రేఁగన్ = విజృంభింపఁగా, మావటీఁడు = మావటివాఁడు, అనుపమిత = అసమానమైన, అంకుశంబునన్ - కుదియించుకైవడిన్ = మరలునట్లు చేయు విధముగ; వీఁపుమీఁద వ్రాలినాఁ డనుటచే జటాయుమాట లలక్ష్యముచేసి ముందు పరువెత్తుచున్నాఁడని యేర్పడుచున్నది.

తా. ఈ ప్రకారము హితము నీతి యగుమాటలు చెప్పి జటాయువు వేగముగ వానివీఁపుపై వ్రాలి గోళ్లతో వానివీఁపును జీల్చి మావటివాఁడు మదమున విజృంభించిపోవుచున్న యేనుఁగును అంకుశముపోటున మరలఁజేసినట్లు రావణుఁడు పోకుండఁజేసెను.

కం. తన ఖరనఖరంబులచేఁ, దన ముఖవిశిఖమున దైత్యు ♦ తలవెంట్రుకలన్
ఘనబలుఁడు మెఱికి దైత్యుఁడు, కినుకఁ బెదవిఁగొఱికికొనుచు ♦ గిఱ్ఱునఁదిరిగెన్.

తా. తన వాఁడిగోళ్ళచేతను, బాణమువంటి ముక్కుచేతను, రావణుని తల వెండ్రుకలను, మహాబలుఁడగు జటాయువు పెఱుకఁగాఁ గోపముచే రావణుఁడు పెదవి కొఱుకుచు గిఱ్ఱున వెనుకకుఁ దిరిగెను.

కం. తిరిగియు సవ్యాంకంబున, ధరణిసుతం బొదివి పాణి ♦ తలమున వ్రేసెన్
గురువేగమున జటాయుని, నరుఁజుఁ డది తప్పఁగొట్టి♦యభిముఖుఁ డగుచున్.

సవ్యాంకంబునన్ = ఎడమతొడమీఁద, పాణితలమునన్ = అఱచేతితో, అభిముఖుఁడు = ఎదురుముఖమైన వాఁడు.

తా. ఇట్లు వెనుకకుఁ దిరిగియు సీతను నెడమచేత రొండిపై బిగఁబట్టి కుడి చేత జటాయువును గొట్టెను. ఆయన దానిని వేగముచేఁ దప్పించుకొని వాని కెదురు ముఖమై.

కం. వామకరంబులు పదియును, భూమిపయిం దొరఁగఁ దుండ ♦ మునఁ జిదుమఁ గర
స్తోమము వెంటనె పుట్ట వి,షామితదంష్ట్రాహు లొదవు♦నట్టులు పుట్టెన్. ౮౨౨

వామకరంబులు = ఎడమచేతులు, తొరఁగన్ = పడునట్లు, తుండమునన్ = ముక్కుతో, చిదుమన్ = గిల్లివేయఁగా, కరస్తోమము = చేతులసమూహము, పుట్టన్ = పుట్టయందు, విషామితదంష్ట్రాహులు = విషము విశేషించిన కోరలు గల పాములు. ఇట్లనుటచే సాయుధములై చేతులుపుట్టెనని యేర్పడు చున్నది.

తా. జటాయువు తనముక్కుచే సీతను బట్టుకొనియుండిన యెడమచేతులను బదింటిని ద్రుంపఁగా నవి పుట్టలోనుండి వెలువడు కోఱలతోడి పాములవలె మరలఁ బుట్టెను.

ఈ చేతులు పడిపోయినవే మరల కఱచుకొనెనా, లేక వేఱేపుట్టెనా, యివి కృత్రిమములా నైజములా, యను విచారము మఱియొకచోఁ జేయఁబడును.

ఇచట నొకటిమాత్రము గమనింపవలసియున్నది. ఎడమచేతులు తెగి క్రిందఁ బడియుండెనేని సీతయు నేలఁబడియుండవలెను. అట్లు పడలేదనియు వాఁడే నేల దించెననియు ౮౨౩ వ పద్యము వలనఁ దెలియుచున్నది.

ఉ. అంతటఁ బంక్తికంఠుఁడు దు ♦ రంతరుషానల దీప్తనేత్రుఁ డై
కాంతను వీడి ముష్టిపద ♦ ఘాతములం బతగాన్వయేంద్రు దు
ర్దాంతపరాక్రమం బడరఁ ♦ దాఁచిన నేచెను బోరు ఘోర మై
కొంతవడిన్ శకుంతపున ♦ కుం బలలాశన లోకభర్తకున్. ౮౨౩

దురంత = అంతములేని, రుషానల = రోషమనెడి యగ్నిహోత్రముచే, దీప్త = వెలుంగుచున్న, నేత్రుఁడై = కన్నులుగలవాఁడై, ముష్టి, పద, ఘాతములన్ = పిడికిళ్ళయొక్కయు, కాళ్ళయొక్కయు దెబ్బలచేత, పతగాన్వయేంద్రున్ = పక్షివంశమున శ్రేష్ఠుఁడగు జటాయువును, దుర్దాంతపరాక్రమంబు = అంతములేని శౌర్యము, తాఁచినన్ = కొట్టఁగా, ఏచెను = పెరిఁగెను, కొంతవడిన్ = కొంత

కాలము, శకుంతపునకున్ = పక్షిరాజునకు, పలలాశనలోకభర్తకున్ = మాంసభక్షకు లైన రాక్షసజనముల రాజునకు.

తా. అపిమ్మటఁ దన చేతులు చిదుముటచే మిక్కుటమైన రోషమున మండు చున్న కన్నులు గలవాఁడై రావణుఁడు సీతను వదలిపెట్టి పిడికిళ్ళచేతను పాదముల చేతను జటాయువును గొట్టఁగా నా పక్షి రాక్షసరాజులకు యుద్ధము ఘోరముగాఁ జెరిఁగెను.

— ♦ రావణుఁడు జటాయువు ఱెక్కలు నఱకుట. ♦ —

కం. ఆయెడ శ్రీరామునకై, వ్యాయామము సేయు చున్న ♦ వతగేంద్రుని పా
దాయతపక్షంబులు కా, ళ్ళేయకమున నసుర నఱకె ♦ క్షితిపైఁ గూలన్. ౧౭౪

వ్యాయామము = దేహపరిశ్రమము. 'శరీరాయాసజనకం కర్మ వ్యాయామ ఉచ్యతే'యని వాగ్భటుఁడు. యుద్ధము- పాదాయతపక్షంబులు= కాళ్ళు పెద్దఱెక్కలు, కౌక్షేయకమునన్ = కత్తిచే.

తా. ఇట్లు ఘోరయుద్ధము జరుగుచుండుసమయంబున రావణుఁడు కత్తిచే జటాయువు కాళ్ళను, ఱెక్కలను, నేలపైఁ బడ నఱికెను.

కం. నఱికిన నేలన్ వ్రాలుచుఁ, గొఱకొఱ మని కుత్తుకందుఁ ♦ గుట్టుసు ఱుందన్
బిఱు మఱిన జటాయువునకుఁ, దెఱవ స్వబంధునకుఁబోలె ♦ దీనత నేడ్చెన్.౧౭౫

కుట్టుసురు-కుఱు + ఉసురు=కొంచెము ప్రాణము. కుఱు, చిఱు,కడు,నడు,నిడు శబ్దంబుల ఱడ లకచ్ఛపరంబైనపుడు ద్విరుక్తటకారంబగు. సు. వ్యా, సంధి ౩౯. పిఱుము + అఱిన = పరుషభావము క్షయించిన, తెఱవ = స్త్రీ, సీత.

తా. ఇట్లు రావణుఁడు నఱకఁగా నేలఁబడి కుత్తుకలోఁ గొంచె మూపిరి కొఱకొఱ యని ధ్వనికలుగుచుండ, పారుష్యముచెడిన జటాయువునుజూచి సీతా దేవి తననిమిత్తముగ నాయునకుఁ గలిగిన విపత్తునకై మిక్కిలి దుఃఖించి యేడ్చెను.

తే. కాలజీమూతనిభుఁ డయి ♦ నేలఁబడిన, పాండురోరస్కుఁగ న రావణుండు శాంత
దావదహనునిమాడ్కి ని ♦ ధరణికన్య, రాఘవాశ్రమనికటోర్వి ♦ వ్రాలియున్న.

కాలజీమూతనిభుఁడు = నల్లనిమేఘముతోసమానుఁడు, పాండురోరస్కున్ = తెల్లని ఱొమ్ముగలవానిని, శాంతదావదహనునిమాడ్కిని = చల్లాఱిన కాఱుచిచ్చు వంటివానిని, రాఘవాశ్రమనికటోర్విన్ = రాముని యాశ్రమమునకు సమీప ప్రదేశ మందు.

తా. నల్లని మేఘము వంటివాఁడును, దెల్లని ఱొమ్ముగలవాఁడును నై నేలఁ బడియున్న జటాయువును రావణుఁడు చూచెను. సీతాదేవియును జల్లాఱిన కాఱు చిచ్చువలె నై రామాశ్రమమునకు సమీపమందే పడినట్టి-జటాయువును.

—♦ ౫౭-వ సర్గము. సీత రామలక్ష్మణులఁగూర్చి యాక్రోశించుట. ♦—

ఉ. కంఠగతాయు నాశకున ♦ కాంతునిఁ గాఁగిటఁ గ్రుచ్చి యా పికీ
కంఠ భృశార్తి బాష్పములు ♦ కాల్వలు గట్టఁగ నేడ్చె నిల్లు, ని
ష్కుంఠత సౌఖ్యదుఃఖములఁ ♦ జూపు శరీరజలక్షణంబు లు
త్కంఠ దొలంగఁ బింగళప ♦ తత్రిముఖాండజకంఠరావముల్. ౧౭౭

కంఠగతాయున్ = కంఠమునం దూపిరిగలవానిని, శకునకాంతుని = పక్షిరాజును, పికీకంఠి = ఆఁడుకోవెల కంఠస్వరమువంటి స్వరముగలది. భృశార్తిన్ = మిగుల దుఃఖముచే, నిష్కుంఠత = కొఱఁతలేకుండ, శరీరజలక్షణంబులు = శరీరమునందుఁబుట్టిన కన్ను లదరుట, భుజము లదరుట, తొడ లదరుట, లోనగుగుర్తులు. ఉత్కంఠ = తహతహపాటు, పింగళపతత్రి = పింగళపక్షి, ముఖ = మొదలుగాఁగల, అండజ = పక్షుల, కంఠరావముల్ = కంఠధ్వనులు.

తా. ప్రాణములు వెడలిపోవుటకై స్వస్థానములు విడిచి కంఠముదాఁక వచ్చిన యాపక్షిరాజు జటాయువును జూచి సీతాదేవి మిగులఁ బరితాపముచే కన్నీళ్లు కాల్వలుపాఱ నిట్టు లేడ్చెను. దేహమునందుఁ బుట్టిన లక్షణములు - వెలుపల పైఁడికంటి మొదలగు పక్షులకూఁతలు రాఁగలసుఖదుఃఖములను సంపూర్ణముగాఁ దెలుపును.

కావున రామచంద్రా! నాకుఁ గలిగినకష్టము దెలుప నీకు నెడమకన్ను, ఎడమభుజము అదరియుండునుగదా. పక్షులలో పాల గరుడ భరద్వాజములు దప్పఁ దక్కినవి కుడినుండి యెడమకుఁ బరువెత్తియుండునుగదా. ఈయపశకునముల వలననే నాకేదియో కీడుకలిగియుండును నని నీ వూహించి త్వరగా రావచ్చును.

ఉ. ఈమృగపక్షిసంతతియు ♦ నిప్పుడు పాఱెడి నిన్నుఁ గూర్చి యే
మామకదుర్దశం దెలుప ♦ క్ష్మాధవ నీ విపుడే నెఱుంగ వా
రామ! భవత్సతీగతప ♦ రాభవ మింతకు నీ వెఱుంగఁగా
లేమిని నాదు దుష్కృతము ♦ లేశముగా దని నిశ్చయించితిన్. ౧౭౮

ఈమృగపక్షిసంతతి = ఈమృగములయు పక్షులయు గుంపులు, మామకదుర్దశన్ = నాకష్టదశను, భవత్సతీగతపరాభవము = నీభార్యకు సంభవించిన యవమానము, ఇంతకున్ = ఇప్పటివఱకు, జటాయువువలన నింతయాలస్యము జరిగినను.

తా. రామచంద్రా! నీ దేహమునందును నీవున్నచోట మృగపక్ష్యాదుల వలనను దోఁచునపశకునములే కాక యిచ్చట నుండుమృగములు, పక్షులుకూడ నీకడకు గుంపులుగుంపులుగా వచ్చుచున్నవి. వీనిని జూచియైన నాకుఁ గలిగిన కష్టస్థితి తెలిసికొనియుండవచ్చును. ఇంతవఱకు నీ భార్యకుఁ గలిగిన యవమానము

నీకుఁ దెలియకుండుటచే నేను మహాపాప మేదియో చేసితి నని నిశ్చయించితిని. అల్పపాపమైనయెడల నింతవఱకు ననుభవించినదానితో సమసిపోయియుండును. నీ విచ్చటికైన వచ్చి యెదిగియుండువు.

కం. నన్నుం గావఁగఁ బూనుట, ని న్నీచునిచేత మడసె ♦ నీ పుణ్య ధనుం
డి న్నీడోద్భవుఁ డౌరా, మన్నిరృతి యదేల యితని ♦ మనఁగా నిచ్చెన్. ౮౯
నీడోద్భవుఁడు = పక్షి, జటాయువు-మత్ + నిరృతి = నాపాలిటి పెద్దమ్మ, దౌర్భాగ్యము-మనఁగానిచ్చెన్ = బ్రతుకనిచ్చెను.

తా. నా పాపము గొప్పదనుటకు నావార్త నీకుఁ దెలియకపోవుట యొకటే కాదు కారణము. నన్ను రక్షించుటకుఁ బ్రయత్నించిన యీ పుణ్యధనుఁడు జటాయువు ఈ నీచునిచేఁ జచ్చెను. నాపాపము గొప్పదిగాకున్న నీయన జయించియే యుండును గాని నాపాలి పెద్దమ్మ నావంటిపాపాత్మురాలికి సాహాయ్యము చేయఁ బూనిన యీయన నేల బ్రతుకనిచ్చును ? మహాపాపాత్ములకు సాహాయ్యము చేయఁ బూనిన వారికిని నా పాపాత్ములపాపము వారా సాహాయ్యము చేయకుండునట్లు బాధించును.

శా. రామా ! కావఁగ రమ్ము లక్ష్మణ ! వెసన్ ♦ రక్షింపుమా తండ్రి ! సు
త్రామద్వేషి హరించి వే యరిగెడిన్ ♦ ధాత్రీభవన్ న న్నటం
చీయాడ్కిన్ వినువారుగాక రఘువం ♦ శేశుల్ సమీపక్షితిన్
దా మింటల్ లభియించెనేనియు మదా ♦ ర్తధ్వాన మం చేడ్వఁగన్. ౯౦
సుత్రామద్వేషి=ఇంద్రవిరోధి, ధాత్రీభవన్ = భూపుత్రిని, సమీపక్షితిన్ = దగ్గఱప్రదేశమున, మదార్తధ్వానము = నాయేడుపుధ్వని.

తా. రామా ! నేను సీతను. భూమిపుత్రిని. న న్నీరాక్షసుఁడు పట్టుకొని పోవుచున్నాఁడు. రక్షింపరమ్ము. తండ్రీ ! లక్ష్మణా ! త్వరగా రమ్ము. అని యీ ప్రకారము సీతాదేవి రామలక్ష్మణులు సమీపమం దుండిరేని విని వత్తురుగాక యని యేడ్చెను.

మారీచుఁడు, 'హా లక్ష్మణా! సీతా!' యని యఱచిన నాశ్రమమం దున్న వారికి వినవచ్చెనుగదా! సీతయేడ్పుధ్వని యింతకు కొంచెముముందే పోయిన లక్ష్మణునకైన నేల వినఁబడలేదు ? ఆకాశమునఁబోయిన రావణుఁ డేల వారికిఁ గానరాలేదు ?

(i) గాడిదకూసిన వినవచ్చినంతదూరము చిలుక పలికిన వినరాదు. శంఖధ్వని వినవచ్చినంతదవ్వు వీణానాదము వినరాదు. కావున రాక్షసుని చావుకేక యెక్కడ ? సీతాదేవి కాకలిధ్వని యెక్కడ ? (ii) రావణుఁ డాకాశమున మాయామేఘములచాటునఁ బోయినవాఁడు. "సమీరదుర్దినసమాకులవిస్తృత మాయ గూఢుఁడై రావణుఁ డేగె" నని జటాయువు రామునకుఁ దెలిపెను.

౧౧౬౧-వ పద్యము. ఆకారణముచే సీతారావణులు కానరారైరి. ఆకాశమున మేఘమండలమున నడచిన మనుష్యులధ్వని నేలమీఁదివారి కెట్లు వినఁబడును? జటాయువు గ్రద్ద, గ్రద్దలకు దూరదృష్టిబలము గలదు. అందు నెత్తైన చెట్టుమీఁద నుండినది. కావున జటాయువు వినఁగలిగెను. చూడఁగలిగెను. (iii) ఆరబయలులో వినవచ్చినంతదూరము చెట్లలో ధ్వని వినరాదు. లక్ష్మణుఁడు దూరముపోయి నది చూచియే రావణుఁడు వచ్చెను. (iv) మారీచుఁడు రామచంద్రుని నుత్తరముగాఁ దీసికొనిపోయెను. రావణుఁడు దక్షిణముగాఁ బోయెను. కావున దూర మెక్కునుగాని తగ్గదు.

చ. కదుకొనిబావ్పవారి జడి ♦ కాఱి సమీపధరారుహంబు న
మ్మదవతి తీఁగెనాఁ బెనఁగ ♦ మానవభోజియు పీడు పీడు మం
చదలిచి జంకెన ల్వలికి ♦ యట్టి సతీమణి కేశపాశముల్
వదలక పట్టి యీడ్చె నమ ♦ వర్తి తనుక సిగఁ బట్టి యీడ్వఁగన్. ౮౮౧

కదుకొని = అతిశయించి, జడికాఱక = జడివానవలెఁ గాఱఁగా, సమీప ధరారుహంబుక = దగ్గఱనున్న చెట్టును, జంకెనల్ = బెదరింపుమాటలు, కేశ పాశముల్ = వెండ్రుకలసమూహములు - 'పాశః పక్షశ్చ హస్తశ్చ కలాపార్థాః కచాత్పరే' - అమరకోశము. కచాత్పరే కచపర్యాయశబ్దాత్ పరతః ప్రయుజ్య మానాః పాశాదయ స్త్రయః కలాపార్థా స్సమూహవాచకా భవంతి. కచశబ్ద పర్యాయములైనశబ్దములమీఁదఁ బ్రయోగింపఁబడిన పాశాదిశబ్దములు మూఁడు సమూహవాచకములు. గురు, బాల. కేశపాశమనఁగా కొప్పు అని యొకరు వ్రాసిరి గాని యది సరిగాదు. బహువచనప్రయోగము దానిని బాధించెడిని. ఒక స్త్రీకి రెండు మూఁడు కొప్పు లుండవుగదా. ఒకవేళ సీతాదేవి కొప్పుపెట్టుకొనియే యుండె నని తలఁచినను పొర్లాడుటలో నది నిలిచియుండునా? సమవర్తి=యముఁడు, సిగ = శిఖ - వెండ్రుకలు - పతివ్రతలతలవెండ్రుకలు పట్టుకొనువాఁడు తప్పక నాశమగు నని భావము. రావణుఁడు తన తలవెండ్రుకలు పట్టుకొనుటచేఁగదా వేదవతి నిన్ను నాశముచేసెద నని శపథముచేసెను. సీతాదేవి రావణుఁడు చచ్చువఱకుఁ దల వెండ్రుకలు ముడివైచినదికాదు. ఇట్టులేకదా ద్రౌపదియు దుశ్శాసనుఁడు తన తల వెండ్రుకలు పట్టుకొనె నని దుర్యోధనదుశ్శాసనులు చచ్చువఱకు తల ముడివేసి నదికాదు. "తడసిన యేకవస్త్రపరిధానముతోడ విముక్తకేశియై। తోడరుచు దుఃఖభారమున ద్రౌపది వోయె."-సభాపర్వము. ఈ సందర్భమున ద్రౌపదివాక్యం బులు స్మరింపఁదగినవి.

ఉ. నీవు సుభద్రకంటెఁ గడునెయ్యము గారవముం దలిర్ప సం
భావనసేయు దిట్టి ననుఁ బంకజనేత్ర యొకండు రాజసూ

యావభృథంబునందు శుచియై పెనుపొందిన వేణి పట్టి యీ
దేవురు జూడఁగా సభకు నీడ్చెఁ గులాంగన లిట్టు లోర్తురే॥

సీ. ఈ వెండ్రుకలు పట్టి యీడ్చిన యాచేయి, దొలుతగాఁ బోరిలో దుస్ససేను
తను వింతలింతలు దునియలై చెదరి రా, పఁటియున్నఁ గని యుడుకాఱఁగాక
యలుపాలఁ బొనుపడుసట్టి చిచ్చే యిది."
యని కదా ద్రౌపది శ్రీకృష్ణునితోఁ జెప్పెను.

వేణీసంహారనాటక మీవిషయమును బోధించునదే. నిప్పుదాఁకి బ్రదుక వచ్చునుగాని పతివ్రతలవెండ్రుకలఁ బట్టువాఁడు వాఁడు సమూలముగ రావణ దుర్యోధనులవలె నాశమగును.

తా. విస్తరించి కన్నీళ్ళు జడివానవలెఁ గాఱుచుండ దాపునందున్న చెట్టును సీతాదేవి తీఁగవలెఁ బట్టుకొని పెనఁగులాడెను గాని రాక్షసుఁడు విడు విడు విడిచెదవా తన్నుదునా చంపుదునా యని బెదరింపుమాటలు పలికి యదలించి యక్కడికి విడిచిరాకుండఁగాఁ దన్ను యముఁడు తలవెండ్రుకలు పట్టి లాగుచుండుటచేఁ దాను సీతాదేవి తలవెండ్రుకలు పట్టుకొని లాగెను. ఇచ్చట ఛాయావాదము సరిపడదు.

శా. రామా రామ రఘూత్తమా యని మహా ♦ రావంబుమై నేడ్వ నా
శ్యామారత్నశిరోజము ల్దిగిచె ర ♦ క్షోధీశుఁ డవ్వేళ దు
ర్ధామధ్వాంతసమావృతం బయి యమ ♦ ర్యాదంబునై యాజగ
త్స్తోమంబుల్ సచరాచరంబులు వగం ♦ దూలెన్ విషణ్ణంబులై. ౧౧౨

మహారావంబుమైన్ = గొప్పధ్వనితో, శిరోజముల్ = తలవెండ్రుకలు, దుర్ధామ = అణఁపరాని, ధ్వాంత = చీఁకటిచే, సమావృతంబు = బాగుగ ఆవరింపఁబడినది, అమర్యాదంబు = కట్టుపాటు చెడినది. జగత్ + స్తోమంబుల్ = లోకసమూహములు, సచర + అచరంబులు = కదలునవి కదలనివి యగువానితోడ, విషణ్ణంబులై = దుఃఖించినవై, వగన్ = వ్యసనముచే, తూలెన్ = సోలెను.

తా. రామా రామా రఘురామా యని పెద్దయెలుఁగున నేడ్చుచుండఁగా వాఁ డామెతలవెండ్రుకలను బట్టి యీడ్చెను. ఆసమయంబున జంగమస్థావరములతో లోకములు గాఢమైన చీఁకటిచే వ్యాపింపఁబడి స్వస్థావస్థ తప్పి వ్యసనముచే సోలెను. చీఁకట్లు క్రమ్మ ననఁగా శోకాంధకారమున మునిఁగి దిగ్భ్రమ పొందియుండె నని భావము.

ఉ. వీవఁడు మారుతుం డపుడు ♦ వెల్వెలఁబాఱె దివాకరుండు రా
జీవభవుండు లో నెఱిఁగి ♦ సీతను రావణుఁ డేఁచు చుండుటల్
కావర మెత్తి, చక్కఁబడెఁ ♦ గార్యము పొమ్మనె, శోకమోదముల్
దేవఋషు ల్భజించిరి స ♦ తీవ్యథ రావణుచేఁతు చూచుచున్. ౧౧౩

మారుతుఁడు = వాయువు, దివాకరుండు = సూర్యుఁడు, రాజీవభవుండు = బ్రహ్మ, ఏచుచుండుటల్ = బాధించుటలు, కావఁగ మెత్తి = పొగరుపట్టి, కార్యము = దేవతలకార్యము, రావణవధ. శోకమోదముల్ = శోకము సంతోషము, సీత బాధపడునని శోకము. రావణుఁడు చెడునని సంతోషము. క్రమాలంకారము.

తా. వాయువు విసరలేదు. సూర్యుఁడు వెలవెలఁ బోయెను. బ్రహ్మదేవుఁడు రావణుఁడు సీతను బాధించుట మనస్సునం దెఱిఁగి 'దేవకార్యము చక్కఁబడెను, రావణుఁడు చచ్చెను, నిశ్చయము.' అనెను. దేవతలు ఋషులు సీతపడెడిబాధ చూచి దుఃఖించిరి. రావణునిచేటు చూచి సంతోషించిరి.

—♦ రావణుఁడు సీత నెత్తుకొని పరువెత్తుట. ♦—

కం. రామా రామా యనుచును, సౌమిత్రీ యనుచు నేడ్చు ♦ జనకజ నాజిన్
వ్యోమపథంబునఁ గొని యు, ద్దామజవంబునను బఱచె ♦ దశకంధరుఁడున్. ౧౭

తా. రామా రామా లక్ష్మణా యని యేడ్చుచుండు సీతాదేవిని నాకాశ మార్గమునఁ దీసికొని మిగుల శీఘ్రముగ రావణుఁడు పరువెత్తెను.

ఉ. నీరదదేహుఁడైన రజ ♦ నీచరు చెంగట స్వర్ణవర్ణ క్రో
త్కారు మెఱుఁగునాఁ బొలిచె ♦ గాలికిఁ బై నెగయన్ సతీమణీ
భూరిమయాంశుకాంచలము ♦ పూర్వసుధాశనలోకభర్తయున్
మారుతమిత్ర దీప్తగిరి ♦ మాడ్కి రహించెను జేటు దోఁపఁగన్. ౧౮

నీరదదేహుఁడు = మేఘమువలె నల్లని దేహము గలవాఁడు, చెంగటన్ = ప్రక్కన, స్వర్ణవర్ణ = బంగారుచాయగల దేహముగలది, క్రోత్కారు మెఱుంగు నాన్ = తొలకరిమెఱుపో యన్నట్లు, సతీమణీ = పతివ్రతలలో శ్రేష్ఠురాలైన సీతాదేవియొక్క, భూరిమయ = బంగారుమయమైన, అంశుకాంచలము = చీరకొంగు, పూర్వసుధాశనలోకభర్త = పూర్వదేవతలగు రాక్షసుల సమూహమునకు రాజు, మారుతమిత్ర = అగ్నిహోత్రముచే, దీప్త = మండుచున్న, గిరిమాడ్కి = కొండ వలె, చేటుదోఁపఁగన్ = కీడుసూచింపఁగా = మెఱుపుఁదీఁగ యుపమానముగాఁ జెప్పుటచే నవి యెట్లు క్షణకాలము మేఘమునొద్ద నుండునో యట్లులే యల్పకాలమే రావణునొద్ద సీతయుండు నని వస్తుధ్వని.

తా. నల్లనిమేఘమునంటి కాంతిగల రావణుప్రక్కన బంగారువన్నెగల సీతాదేవి తొలకరిమెఱుపువలెఁ బ్రకాశించెను. బంగారుమయమైన యామెపైఁట కొంగు గాలికి పైకెగసి రావణు కప్పుట చూడఁగా కాలుచున్నకొండవలె నతఁడు కానవచ్చి యతఁ డట్టులే కాలఁగలఁడని రాఁగలకీడును సూచించెను.

కం. తరుణీమణి ధరియించిన, పరిమళభరితములు తామ్ర ♦ పంకజదళముల్
సురశాత్రవనాయకుపై, మరుదాహతిఁ దొరఁగి ధరణి♦ మండలి డొల్లెన్. ౧౯

పరిమళభరితములు = సువాసనచేనిండినవి, తామ్రపంకజముల్ = ఎఱ్ఱని

కమలముల రేకులు, సురశాత్రవనాయకుపై = దేవవిరోధులగు రాక్షసుల రాజుపై, మరుదాహతిన్ = గాలికొట్టుటచే, తొరఁగి = పడి, డొల్లెన్ = రాలెను. దీనివలన రావణునైశ్వర్య మిట్టులే పడిపోవు నని వస్తుధ్వని.

కం. ఆకల్యాణిదుకూలం, బాకాశమునందు వెలిఁగె ♦ హాటకరుచి న
స్తోకాతపమున రవిశో, ణకృతధారాధరంబు ♦ నెఱి చూపట్టన్. ౨౨౧

ఆకల్యాణిదుకూలము = మంగళకారిణియగు సీతాదేవి పచ్చనిపట్టువస్త్రము, హాటకరుచిన్ = బంగారుకాంతితో, అస్తోక = అధికమైన, ఆతపమున = ఎండచే. రవిశోణీకృత = సూర్యునిచే నెఱ్ఱగాఁజేయఁబడిన, ధారాధరంబు నెఱి = మేఘము వలె, చూపట్టన్ = కనఁబడఁగా - అస్తోకాతప మనుటచే నిది మధ్యాహ్నసమయ మని యేర్పడుచున్నది. మధ్యాహ్నసమయమున మేఘ మెఱ్ఱనగుట యశుభసూచకము.

తా. ఆ మంగళకారిణియగుసీత కట్టిన పచ్చని పట్టువస్త్రము ఆకాశమందు సూర్యుని కిరణములచే నెఱ్ఱనైన మేఘమువలెఁ గానవచ్చెను.

కం. అసురనాథాంకగ యగు, నాసుందరి సునసవక్త్ర ♦ మారాముఁడు తోఁ
వాసింపమి భాసిల్లదు, వాసి దఱుగఁ దూఁడులేని ♦ వనజం బనఁగన్. ౨౨౨

అసురనాథాంకగ = రాక్షసనాయకుని తొడయందుండు సీతాదేవియొక్క, సునసవక్త్రము = మంచినాసికగలముఖము, నాసికాశబ్దము ముపసర్గమునకుఁ బరమైనపుడు నసయగు. "ఉపసర్గాచ్చ" పాణిని, ౫-౪-౧౧౯, తోన్ = తోడుగ. వాసింపమిన్ = లేమిచే, తూఁడు = తామరకాఁడ, వనజము = కమలము. దీనిచే సీతా ఖిన్నత విశేషించె నని సూచితము.

తా. రావణాసురునితొడయందుండు నా సీతాదేవియొక్క చక్కనిముక్కుగలముఖము రాముఁడు చెంతలేనికారణమునఁ దామరకాఁడలేని కమలమువలెఁ బ్రకాశింపలేదు.

కం. సులలాటము కురుళాంతము, సలలిత మవ్రణము ఫుల్ల ♦ సారససమ మా
జలజాక్షిమోము పొలిచెను, జలదంబును బ్రచ్చి తోఁచు ♦ చందురుఁ డనఁగన్.

సులలాటము = మంచినొసలుగలది, కురుళాంతము = ముంగురులు కొనగాఁ గలది, సలలితము = అందమైనది, అవ్రణము = దోషములేనిది, ఫుల్లసారససమము = వికసించినకమలముతో సరియైనది, జలదంబును = మేఘమును, బ్రచ్చి = పగులఁ దీసికొనివచ్చి, తోఁచు = కానవచ్చు. ప్రతిచంద్రదర్శన ముత్పాతసూచకము.

తా. మంచినొసలు గలదియు, ముంగురులవలను వ్యాపించినదియు, సందమైనదియు, దోషరహితమైనదియు, వికసించినకమలముతో సమానమైనదియు నగు సీతాదేవిముఖము మేఘమును బగులఁదీసికొని వచ్చి కనఁబడు చంద్రునివలెఁ గానవచ్చెను.

చం. సలలితశుక్లదంతమును ♦ జంపకకుట్మలతుల్యనాసముం
విలసితహాటకాభరణ♦విభ్రమమును బతదుత్పతత్సుకుం
తలమును బక్వబింబఫల♦సన్నిభరోష్ఠము రావణాంకసం
కలితసతీముఖంబు దివి♦గాలె దినోదితచంద్రబింబమై.　　　౨౩

సలలితశుక్లదంతమును = అందమైన తెల్లనిదంతములు గలదియు, తాంబూల మభావముగుటచేఁ దెల్లగా నున్నవి. చంపకకుట్మల = సంపెఁగ మొగ్గతో, తుల్య = సమానమైన, నాసముం = నాసికకలదియు, విలసిత = విశేషముగఁ బ్రకాశించు, హాటకాభరణ = బంగారుభూషణముల, విభ్రమము = విలాసముకలదియు, పతత్ + ఉత్పతత్ + సుకుంతలమును = పడుచు పైకెగయుచు నుండు మంచి వెండ్రుకలు కలదియు, పక్వబింబఫల = పండినదొండపండువలె, సన్నిభరోష్ఠము = మిగుల మనోహరమైన పెదవికలదియు, రావణాంకసంకలిత = రావణునితోడ యుందుండు, సతీ = సీతాదేవియొక్క, ముఖంబు = మోము, దినోదితచంద్రబింబమై = పగలుపుట్టిన చంద్రబింబమువలెఁ గాంతిహీనమై.

తా. అందమైన తెల్లనిదంతములు, సంపెఁగమొగ్గవంటి నాసిక, బంగారు సొమ్ముల విలాసము, పడుచు నెగురుచు నుండు వెండ్రుకలు, దొండపండువంటి పెదవి గలిగి రావణాంకమున నుండుసీతాదేవిముఖంబు పగ లుదయించిన చంద్రబింబము వలె నుండెను. సీతాదేవి సహజసౌందర్యము గలదయ్యును బొగ్గుతోఁ బొదివిన మణివలె రావణునొద్ద నుండుటచే కాంతిహీనమై కానవచ్చెను.

కం. ఎంచఁగ నీలాంగాసురు, నంచునఁ గాంచనసువర్ణ♦యపసీసుత దాఁ
గాంచనకాంచిక హరినీ,లాంచితమై నట్లు పొలిచె ♦ నంబరవీథిన్.　　　౨౪

నీలాంగాసురు = నల్లనిదేహముగల రాక్షసుని, కాంచనసువర్ణ = బంగారు, వంటి మంచివన్నెగలది, కాంచనకాంచిక = బంగారొడ్డాణము, హరినీలాంచిత = ఇంద్రనీలముతోఁ గూడినట్లు, ఇది వ్యతిరేకోక్తి. తెలుపుమీఁద నలుపునకు కాంతియెక్కువ. వెండితోడ నింద్రనీలము విశేషముగఁ బ్రకాశించును గాని పచ్చని బంగారుమీఁదఁ బ్రకాశింపదు. అంబరవీథి = ఆకాశమార్గము.

తా. నల్లనిదేహముగల రావణునొద్ద బంగారువన్నెగల సీత బంగారొడ్డాణము నీలమణితోఁ గూడినట్లు ప్రకాశింపదయ్యెను.

కం. భాసురతప్తసువర్ణో, ద్భాసితభూషామనోజ్ఞ ♦ పంకజగౌర
శ్రీసీత మొగులుచెంగట, వాసించినమెఱుఁగు వోలె ♦ వర్తిలుచుండెన్.　౨౫

భాసుర = ప్రకాశించు, తప్తసువర్ణ = పుటము వేయఁబడిన బంగారుచే, ఉద్భాసిత = మిగులఁ బ్రకాశించు, భూషామనోజ్ఞ = ఆభరణములచే మనోహరమైనది, పంకజగౌరశ్రీ = కమలమువంటి గౌరకాంతిగల సీత.

తా. పుటము వేయఁబడిన బంగారుసొమ్ములచే నింపై కమలమువలె గౌర

కాంతిగల సీత రావణునొద్ద మేఘము చెంగటి మెఱుపువలె నుండెను. అనఁగా మెఱుపువలన మేఘమునకుఁ గాంతియే గాని మేఘమువలన మెఱుపునకు వచ్చు శోభ లేదనిభావము.

తే. పగడపుందీఁగెఁ బోలిన♦పడఁతి సీత, నల్లనగుమేనివాని నా♦నల్లదిండి
బంగరుపుకక్ష్యచేత ని♦బద్ధమైన, వారణంబువిధంబున♦ వఱలఁ జేసె. ౮౯౩

నల్లదిండి = రాక్షసుఁడు, నల్ల = నెత్తురు. ఏనుఁగునకుఁ గట్టఁబడిన గొలుసు మావటివానికి నేనుఁగు పట్టుపడునట్లు చేయును. అట్టులే సీత రావణుఁడు రాము నకు లోఁబడఁజేసెను.

తా. పగడపుఁదీగవంటి సీత నల్లనిరావణురొండినుండి బంగారుగొలుసు గట్టఁబడిన యేనుఁగువలెఁ బ్రకాశింపఁజేసెను.

కం. చంచలనేత్రాసంభృత, కాంచనభూషావితాన ♦ ఘల్ ఘల్ నినదో
దంచితరాక్షసపతి రా,జించె సకంపారసితము ♦ నీరద మనఁగన్. ౮౯౪

చంచలనేత్రా = చలించునేత్రములుగల సీతచే, సంభృత = భరింపఁబడిన, కాంచనభూషావితాన = బంగారుసొమ్ముల సమూహముయొక్క, ఘల్ ఘల్ నినద = ఘల్లు ఘల్లుమను ధ్వనిచే, ఉదంచిత = ఒప్పుచున్న, రాక్షసపతి = రావణుఁడు, సకంపారసితము = మెఱుపుతో నుఱుముతోఁ గూడినది, నీరదము = మేఘము.

తా. సీతాదేవి ధరించిన బంగారుసొమ్ముల ఘలుఘల్లనుధ్వని రావణుని మెఱుపులతోను ఉఱుములతోను గూడినమేఘమువలెఁ గనఁబడఁజేసెను.

ఉఱుములు మెఱుపు లెక్కువగాఁగల మేఘము తక్కువగా వర్షించును. శీఘ్రముగనె దే రూపుమాయును. అట్టులే రావణుఁ డనిభావము.

చ. జనకసుతాశిరస్స్ఖలిత ♦ చారుసుమంబులు నేల వ్రాలు చ
ద్దనుజుఁడు పాఱువేగమునఁ ♦ దద్దయు సుళ్లను బెట్టి కొన్ని యా
తనిమెయిఁ జుట్టుచుం దిరిగెఁ ♦ దారక లోలి సువర్ణమందిరా
వనిధరనాథుఁ జుట్టి చెలు ♦ వంబుగఁ గ్రుమ్మరు చున్నరీతిగన్. ౮౯౫

జనకసుతా = సీతాదేవియొక్క, శిరస్ = తలనుండి, స్ఖలిత = రాలిన, చారుసుమంబులు = మనోహరములైనపూవులు, మెయిన్ = దేహమును, సువర్ణ మందిరావనిధరనాథున్ = దేవతల కాలయమైన మేరుపర్వతమును, 'మేరు స్సుమేరు ర్హేమాద్రీ రత్నసాను స్సురాలయః'—అమరకోశము.

తా. సీతాదేవిశిరస్సునుండి రాలిన యందమైన పూవులు నేలపైఁ బడుచు రాక్షసుఁడు పరువెత్తువేగమునఁ గలిగిన సుడిగాలిచే నవియును సుళ్ళుపెట్టుచు వాని చుట్టు తిరిగి నేలఁబడుట చూడ నక్షత్రములు మేరుపర్వతమును జుట్టి తిరుగు నట్లుండెను. ఇది వానిగమన వేగము సూచించుచున్నది.

కం. ధరణీతనయోదంచిత, వరరత్నవిభూషణంబు ♦ పదకటకం బు
ర్వర జాఱి పడియె మధుర, స్వరయుతముగ మెఱుఁగుఁదీఁగె ♦ చక్రముపగిదిన్.

ధరణీతనయా = భూపుత్రియగు సీతాదేవియొక్క, ఉదంచిత = మిగుల ప్రకాశించు, వరరత్నవిభూషణంబు = శ్రేష్ఠమైన రత్నములు చెక్కిన యాభరణము, అగు పదకటకము = కాలికడియము, ఉర్వరన్ = భూమియందు.

తా. రత్నములు చెక్కఁబడి సీతాదేవి ధరించిన కాలికడియము జాఱి భూమి మీఁద మధురధ్వనితో చక్రాకారమైన మెఱుఁగుఁదీఁగవలెఁ బడెను.

సీ. రావణుం డారాము ♦ రమణి మహోల్కనాఁ, బ్రసభంబునను గొని ♦ పాఱుచుండ
నాసతి యగ్నివ ♦ ర్ణాభరణంబులు, దివినుండి చుక్కల ♦ ట్లవని రాలె
స్తనతలభ్రష్టచం ♦ ద్రద్యుతిహారాళి, యాకాశగంగనా ♦ నమరెఁ బడుచుఁ
బడఁతిఁ ఖగయు ♦ క్తపవనకంపితతరుల్, ధూతాగ్రముల భీతిఁ ♦ దొలఁగు మనియెఁ

ఆ. త్రస్తమీనజలచ ♦ రంబులతో ధ్వస్త, నలినతతులతోడఁ ♦ గొలఁకు లెల్ల
నూర్పు నిలచియున్న ♦ యుత్తమసఖినాఁగ, భూమిసుతకుఁ గాఁగఁ ♦ బొక్కుచుండె.

మహోల్క = పెద్దయుత్పాతసూచకనక్షత్రము. ఉల్క యనఁగా కొఱివి. సీతను రావణుఁడు తన యింటికిఁ దీసికొనిపోవుట కొఱివిని దీసికొనిపోయినట్లని భావము. అగ్నివర్ణాభరణంబులు = అగ్నికాంతిగలసొమ్ములు, దివినుండి = ఆకాశము నుండి, స్తనతల = స్తనప్రదేశములనుండి, భ్రష్ట = జాఱిన, చంద్రద్యుతి = చంద్రుని కాంతిగల, హారాళీ = ముత్యాలదండలవరుసలు, ఖగయుక్త = పక్షులతోఁ గూడిన, పవనకంపిత = గాలిచేఁ గదలుచున్న, తరుల్ = చెట్లు, ధూతాగ్రములన్ = ఎగురుచున్న కొనలచే, త్రస్తమీనజలచరంబులతోన్ = భయపడినచేఁపలు మొదలగు నీటిజంతువులతో, ధ్వస్తనలినతతులతో = ధ్వంసము చేయఁబడిన కమలముల సమూహముతో, ఊర్పునిలిచియున్న = శ్వాసమాడకయున్న, అనఁగా మూర్ఛిల్లిన.

తా. రావణుఁడు సీతను బలవంతముగఁ దీసికొనిపోవుట తనయింటఁ జెక్కుటకుఁ గొఱివిని దీసికొని పోయిన ట్లుండెను. ఆమెధరించిన యగ్నికాంతిగల బంగారు సొమ్ము లాకాశమునుండి చుక్కలు రాలినట్లు నేలఁబడెను. ఆమె మెడలో ధరించిన ముత్యాలసరము లాకాశగంగవలెఁ గానవచ్చెను. పక్షులతోఁగూడి గాలికి కదలు కొమ్మలుగల చెట్లు ఎగురుచున్న కొమ్మలతో భయపడవల దని చెప్పుచు చేత సైఁగలుచేసిన ట్లుండెను. (పక్షుల కూఁతలు అభయవాక్యములుగాను, కొమ్మలు కదలుట అభయహస్తాభినయముగా నెంచవలెను.) సీత భూమిజాత. తాము భూమిజాతములు గావున నీస్నేహప్రదర్శనము. భయపడిన చేఁపలతో చెదరిన కమలములతో సరసులు మూర్ఛపోయిన స్నేహితురాలికివలె సీతాదేవికై పొక్కుచుండెను. (చేఁపలు కన్నులుగాను, కమలములు ముఖములుగాను భావింపవలెను.)

క౦. కలయఁగ నల్లెడ నరయుచు, బలితపుసింహములు పులులు ♦ పక్షులు మృగముల్
తలఁగనిరోసంబున ను, గ్మలినీడలజూడఁ బఱచెఁ ♦ గను చుప్పరముం. ౪౯౮

ఉప్పరముం = ఆకాశమును. ఉగ్మలి = స్త్రీ.

తా. సింహములు, పులులు, పక్షులు, మృగములు, అన్ని చోటుల వ్యాపించి శమింపని కోపంబున సీతాదేవి నీడజూడఁబట్టి యాకాశముఁ జూచుచుఁ బరువు లెత్తెను. భూతమైత్రిగలవారివిషయమున నెంతటిక్రూరజంతువైనను మైత్రినే చూపించును. రావణుఁడు భూమిమీఁద దిగియుండిన నివియన్నియు వానిని బీఁకి తినియుండును.

చ. ఉరలఁగ నిర్ఝరాశ్రుగణ ♦ ముచ్ఛ్రితశృంగకరంబులన్ గుహాం
తరతలనిర్గతానిలన ♦ దంబునెపంబున నేడ్చె సర్వభూ
ధరములు వంచనాపహృత ♦ ధారిణికన్య విపద్దశాప్తికిన్,
సరసిజమిత్రమండలము ♦ సాగెను దీనత వెల్లవెల్లనై. ౪౯౯

నిర్ఝరాశ్రుగణము=కొండవంకలనెడికన్నీళ్లు, ఉరలఁగన్ = రాలఁగ, ఉచ్ఛ్రితశృంగకరంబులన్ = మీఁదికెత్తఁబడిన శిఖరము లను చేతులతో, నిర్గత = వెడలుచున్న, అనిలనదంబునెపంబున = గాలియొక్క చప్పుడు మిషగా, సర్వభూధరములు= అన్ని పర్వతములు, వంచనాపహృత = మోసముచే హరింపఁబడిన, ధారిణికన్య = సీతాదేవికి, విపద్దశాప్తికిన్ = ఆపదదశ లభించినదానికై, సరసిజమిత్రమండలము = సూర్యమండలము.

తా. కొండవంక లను కన్నీళ్లు రాలఁగా నెత్తైన శిఖరము లను చేతు లెత్తి గుహాలలోనుండి వెలువడు గాలిచప్పుడు రోదనధ్వనిగా పర్వతము లన్నియు మోసముచే సీతాదేవికిఁ గలిగిన విపత్తునకై యేడ్చెను. సూర్యమండలము కాంతిహీనమై వ్యసనముతో మెల్లగఁ బోయిన ట్లుండెను.

ఉ. ఎక్కడిధర్మ మింక నిల ♦ నెక్కడిసత్యము నార్జవం బయో
యెక్కడ నానృశంస్య మది ♦ యెక్కడ నిక్కుటిలుండు జానకిన్
దిక్కఱినట్లు వంచనను ♦ నిష్ఠురతం గొనిపోవ లోకమం
దొక్కఁడు నైనఁ గాదనఁ డ ♦ యో యని యేడిచె భూతసంఘముల్. ౫౦౦

ఆర్జవము = కపటములేమి, ఆనృశంస్యము = దయ, కుటిలుండు = మోసగాఁడు, వక్రబుద్ధిగలవాఁడు, దిక్కఱినట్లు = దిక్కులేనిదానివలె, నిష్ఠురతన్ = కఠినమనస్సుచే.

తా. ఈ వంచకుఁడు సీతాదేవిని దిక్కులేనిదానివలె మోసగించి కఠినుఁడై హరించి కొనిపోవుచుండఁగా లోకమున నిండియుండియు నొకరైన నయ్యో పాప మని ఛీ నీ కిది తగదు విడువు మని యనరే? ఇంకను లోకమున ధర్మము సత్యము

ఋజుత్వము దయ యనునవి యున్నవా ? ఈ గుణములు గలవారు లేరు లేరు అని భూతము లేడ్చెను.

కం. వ్రేలెడు మోములతో భయ,లోలత మృగశాబకములు ♦ ఉరుదశ్రులతో
బాలామణి చనుమార్గము, వాలాయము చూచిచూచి ♦ వనరుచు నుండెన్.

మృగశాబకములు = మృగములపిల్లలు, ఉరుత్ + అశ్రులతోన్ = పొరలి పొరలివచ్చు కన్నీళ్ళతో.

తా. పెద్దమృగములు సీత నీడవెంటఁ బరువెత్తుచుండ పిల్లమృగములు ముఖములు వ్రేలవైచికొని భయముచే వణఁకుచు కన్నీళ్ళు పొరలిపొరలిరాఁగా సీతాదేవి పోవుమార్గమును గనుఱెప్ప వ్రాల్పక చూచి చూచి మిగుల దుఃఖించుచుండెను.

చ. కనుఁగొనుచున్ ధరాతలముఁ ♦ గ్రమ్మరవంబున రామ లక్ష్మణా
యని పలవించుచున్ దెసల ♦ నడ్డము రారె మహాత్ము లెవ్వరే
నని తిలకించుచుం జను పు ♦ గాత్రిని గాంచి వణంకు మేనులో
ప్పున వనదేవతావితతి ♦ బోరన యేడ్చె మహాస్వనంబునన్.		౫౦౨

క్రమ్మరవంబునన్ = మనోహరమైన ధ్వనితో, తిలకించుచున్ = చూచుచు.

తా. భూమిపైకిఁ జూచుచు మనోహరధ్వనితో రామా లక్ష్మణా యని యేడ్చుచు పుణ్యాత్ములు గొప్పమనస్సు గలవా రెవ్వరైన నడ్డమురారా విడిపింపరా యని దిక్కులు చూచుచు పోవుచున్న సీతను జూచి తమదేహములు వణఁకుచుండఁగా వనదేవతలు పెద్దపెట్టున నేడ్చిరి.

చ. పెరిగిన తారహారములు ♦ బీఁటలు వాఱిన యోష్ఠబింబమున్,
గరఁగిన చిత్రకంబుఁ గను ♦ కాటుక, వ్యాకులకుంతలంబులన్
బరఁగు సతీమణిన్ నిజవి ♦ నాశముపొంటె గ్రహించి రావణుం
డరుగ వివర్ణవక్త్రయు భ ♦ య వ్యథితాత్మయు నౌచు సీతయున్.		౫౦౩

పెరిగిన = తెగిన, తారహారములు = ముత్యాలసరములు, బీఁటలువాఱిన = పగిలిన, ఓష్ఠబింబమున్ = దొండపండువంటిపెదవి, చిత్రకము = తిలకము, వ్యాకుల = చెదరిన, కుంతలంబులు = తలవెంట్రుకలు, వివర్ణవక్త్రయు = వన్నెమాఱిన ముఖము గలదియు, భయవ్యథితాత్మయు = దిగులుచే బాధపడు మనస్సు గలదియు.

తా. ముత్తెపుసరులు తెగిపోఁగా, పెదవి యూర్పుకాఁకకు పగుళ్లుపాఱఁగా, తిలకము, కాటుక, గరఁగఁగా, వెంట్రుకలు చెదరఁగా, నుండు సీతాదేవిని తన చావు కొఱకే పట్టుకొని రావణుఁడు పోవుచుండఁగా తెల్లబాఱిన ముఖము భయముచే బాధపడు మనస్సు గలదై యామె.

కం. రోదనరోషములను నెఱ, జాఱుకొన నేత్రయుగళి ♦ జనభీకరు వ్యా
పాదరతాత్ముకు మర్మవి, భేదనముగ నిట్టులనియె ♦ బెట్టిదపు నుడుల్.		౫౦౪

రోదనరోషములను = ఏడుపుచేతను కోపముచేతను, నెఱజాదుకొనఁగ = మిక్కిలి యెఱ్ఱనగాఁగా, వ్యాపాదరతాత్మకు = ద్రోహచింతనమందే యాసక్తిగలఁ మనస్సుగలవానిని, వెట్టిదవునుడుల్ = భయంకరములైనమాటలు.

తా. ఏడ్పుటచేతను గోపముచేతను గన్నులురెండెఱ్ఱగాఁ గాఁగా ప్రజలకు భయంకరుఁడై పరులహింసించుటయందే ప్రీతిగలమనస్సుగల రావణుని మర్మములు ఛేదించు భయంకరవాక్యముల నిట్లనెను.

—♦ ౫౩-వ సర్గము. సీత రావణు నిందించుట ♦—

ఉ. ఏమిర సిగ్గు లేదటర ♦ యేకత మే నగు లుండఁ జూచి నీ
వీమెయి ముచ్చిలించుకొని ♦ యెత్తినభీతిని బాఱిపోయెదే
నీ మటుమాయయే కద న ♦ నీగ మృగరూపముచేత నామనో
రాముని దవ్వుగాఁ బనిచె ♦ రాక్షసవంశదవాగ్నిహోత్రుఁడా, ౯౦౫

తా. ఓరీ! రాక్షసవంశమును వెదురుపొదకుఁ గాఱుచిచ్చువంటివాఁడా! ఆఁడుదానను నేనొంటిఁగా నుండుటఁ జూచి నీ వీవిధముగా దొంగిలించికొని పరువెత్తి పోయెదవే నీకుఁ గొంచెమైన సిగ్గులేదేమిరా! నీవు చేసినమాయయే గదా యడవియందు మాయామృగరూపముచేత నా మనోవల్లభుని దూరముగాఁ గొనిపోయినది. రాక్షసవంశ మనెడియడవికి నీవే చిచ్చయినావేమిరా.

ఆ. నాదుమామసఖుని ♦ నన్ను సంరక్షింప, మొనసి వచ్చినట్టి ♦ ముసలిగ్రద్దఁ
పెద్దపెనఁగి నీవు ♦ పిలుకుమార్చితి వౌర, యెంతశూరుఁడవుర ♦ హీనచరిత. ౯౦౬

పెద్దపెనఁగి = దీర్ఘకాలము పెద్దయుద్ధము చేసి, పిలుకుమార్చితివి = చంపితివి, హీనచరిత = నీచపునడవడిగలవాఁడా.

తా. నామామమిత్రుఁడై నన్నుఁ గాపాడుటకై వచ్చిన ముసలిగ్రద్దతోఁ బెద్దయుద్ధముచేసి చంపితివి. నీచచరిత్రుఁడా! ఆహా! నీ వెటువంటిశూరుఁడవురా. ముసలిగ్రద్దతోనే యింత పెద్దయుద్ధము చేసినవాఁడవు రామలక్ష్మణుల బారిపడిన నీగతియేమో.

ఆ. పేరు చెప్పకొనెడి ♦ బింక మేమియు లేక, కలనిలోన నన్ను ♦ గెలువ లేక
దుష్టరాక్షసుండ ♦ దొంగిలి పఱచెదే, యహహ యేమి నీదు ♦ హాబలంబు! ౯౦౭

బింకము = పౌరుషము, కలనిలోన = యుద్ధమందు.

తా. యుద్ధమందు నిలఁబడి యిదిగో రావణుఁడను యుద్ధమునకు వచ్చితిని, అని పేరుచెప్పకొను పౌరుషములేక యుద్ధమందు నాభర్తను గెలువలేక నన్ను దొంగిలించికొని బరువెత్తుచున్నావే? పాపాత్ముఁడా యేమి యహహ నీపౌరుషము!! ఏమి నీబలము?

ఉ. ఈదృశమైన గర్హితపు ♦ హేయపుఁగార్యముఁ జేసి యన్య యా
పైదలి దొంగిలించుకొని ♦ పాఱెదు భీతి దురాత్మ బాలిశా

లేదట రోరి సిగ్గు లవ♦లేశము ఛీ నిను శూరమాని వ్యా
పాదరతాత్ముఁ గాంచి మగ♦వారు హసింతురు సుమ్ము నీచుఁడా. ౨౦౮

ఈదృశము = ఇటువంటి, గర్హితవు = నింద్యమైనది, హేయపుఁగార్యము = నీచమైనపని, అన్య=ఇతరునకుభార్యయగుదాని, పైదలిన్ = ఆఁడుదానిని, బాలిశా = మూఢుఁడా, లవలేశము = మిక్కిలికొంచెము, శూరమాని = శౌర్యములేకున్నను శూరుఁడనని తలఁచువాని, వ్యాపాదరతాత్మున్ = ద్రోహచింతనమందుఁ బ్రీతిగల మనస్సుగలవానిని.

తా. స్త్రీచౌర్యమను నింద్యమైన నీచపుఁగార్యము చేసి యితరునిభార్య యగు నాఁడుదానిని దొంగిలించుకొని భయపడి పరువెత్తెదవే, మూర్ఖుఁడా, నీకుఁ గొంచెమైన సిగ్గులేదటర. ఛీ. శూరుఁడు గాకున్నను శూరుఁ డను పేరుచెప్పుకొను ద్రోహచింతగల నిన్ను మగవారు నవ్వుదురు సుమ్ము.

ఉ. ప్రేలితి కాఱుకూఁతలను ♦ బెద్ద బలంబును శౌర్య మంచు ఛీ
కాలువనే దురాత్మ కల ♦ కాల మకీర్తియు వంశనాశమున్
బోలఁగఁ జేయుకార్యమును ♦ బూని తిసీ నిలు పోటుబంట వై
చాలు ముహూర్త మంత, జనఁ ♦ జాలుదె యీమెయితోడ నీగతిన్. ౨౦౯

ప్రేలితి = వదరితివి - కాఱుకూఁతలను = నిష్ప్రయోజనములైనమాటలను, పోటుబంటవై = శూరుఁడవై.

తా. నేను శూరుఁడ నని దొడ్డబలవంతుఁడ నని వ్యర్థపుఁ గూఁతలు కూసితివిగదా? పాపాత్ముఁడా! కాల మనునది యున్నంతవఱకు నీ కపకీర్తి గలిగించి నీ వంశము నాశముఁజేయు కార్యమును జేయఁబూనితివి. ఛీ, శూరుఁడవై కొంచెము సేపు నిలిచితివేని నీ వీదేహముతో నిట్లు పోఁగలవా? యాంతనాశరీరముతో యమ లోకమునకుఁ బోదువేకాని.

తే. చావుపరువునఁ బరువెత్తించ నెడినిన్ను, నవనివల్లభుఁ డేమి చే♦యంగఁ గలుగు
నేది నిల్వుము క్షణమాత్ర ♦మిందు నీదు, ఘోరకృత్యఫలంబును♦ గుడువఁజేయు.

తా. మృత్యుదేవత తఱుముచున్నట్లు చావుబ్రతుకు దెలియక పరువెత్తుచున్నావే! సిన్నారామరా జేమి చేయఁగలఁడు? ఏదీ మగవాఁడవైతివేని క్షణము సేపు నిలువుము. నీ పాపకార్యఫలము నీ వనుభవింపఁజేయును.

కం. భూవరపుత్రులకంట, న్నీ విప్పుడు పడితివేని ♦ నీసైన్యములున్
నీవును ముహూర్తమైనను, జీవముతో నుండఁగలవె ♦ చెనఁటిపలాశీ. ౨౧౧

పలాశీ = రాక్షసుఁడా, పల + ఆశీ = మాంసము భక్షించువాఁడా.

తా. ఆరాజకుమారులకన్నులకు నీవు కనఁబడితివా నీవు నీసైన్యములు నొక ముహూర్తకాలమైనను బ్రతుకసాధ్యపడునఁటరా? దుష్టరాక్షసుఁడా?

ఆ. కారుచిచ్చు రేఁగఁ ♦ గానసాంతరములఁ, బులుఁగు దానిఁ జేర ♦ బలములేని
యట్లు నీవు వారి ♦ యంబకములఁ దేఱి, చూడఁజాల లేవు ♦ సౌరుతేఁడ. ౧౨

సౌరుతేఁడ = రాక్షసరాజా !

తా. అడవులందుఁ గారుచిచ్చు విజృంభించినపుడు పక్షులు దాని సమీపింప బలములేనియట్లు నీవు రామలక్ష్మణులు ప్రయోగించుబాణములను కన్నెత్తియైన జూడఁజాలవు, ఇఁక నీవు వానిని ఖండించుటేమి ? యుద్ధము చేయుటేమి ?

మ. వినరా నీకు హితంబుఁ జెప్పెద నను ♦ న్వే వీడుమీ నానుడుల్
వినవేనిన్ భృశమత్ప్రధర్షణరుషా ♦ వేశంబునన్ భూమిభృ
త్తనయుం డాత్మసహోదరాన్వితుఁ డనిన్ ♦ దర్పించి యర్పించు నీ
తనువుం గంకసృగాలగృధ్రతతికిం ♦ దన్పిం గొన న్విందుగన్. ౧౩

భృత + మత్ + ప్రధర్షణరుషావేశంబునన్ = అధికమగు నన్ను నవమానపఱుచుటచేఁ గలిగినకోపావేశముచే, భూమిభృత్తనయుండు = రాజకుమారుఁడు, రాముఁడు, అనిన్ = యుద్ధమందు, దర్పించి = బలాతిశయముచే గర్వించి, తనువున్ = శరీరమును, కంక = రాపులుఁగులయు, సృగాల=నక్కలయు, గృధ్ర = గ్రద్దలయు, తతికిన్ = సమూహమునకు, తన్పి = తృప్తి.

తా. ఏలరా చెడిపోయెదవు? నేను జెప్పిన మంచిమాట వినరా. నన్ను మరలఁ దీసికొనిపోయి రామున కర్పింపుము. అట్లు నామాటచొప్పునఁ జేయకపోయితివా నన్ను నీ వవమానించుటచేఁ గలిగినకోపమునావేశంబున యుద్ధమున నీ దేహమును రాపులుఁగులకు నక్కలకు గ్రద్దలకు తృప్తిగలుగ విందుగాఁ జేయును.

శా. ఏమోకోరిక నన్ను హించికొని నీ ♦ వెంతే వడిం బాఱెదే
నామాట ల్విను నీ వయత్నమది యె ♦ న్నండైన నాగంగఁ బో
దోమాయావి మదీయ భర్త నవిజ♦య్యున్ లోకనాథోపమున్
రాముం బాసి చిరంబుగా బ్రదుకనే♦రన్ శాత్రవాధీనన్నై. ౧౪

శాత్రవాధీనన్నై = శత్రువులకు లోఁబడినదాననై.

తా. ఏదో చెడ్డకోరిక మనస్సునందుంచుకొని నన్ను తీసికొని పరువెత్తి పోవుచున్నావు. నామాట విను, నమ్ము. ఎప్పటికైన నీకోరిక కొనసాగునదికాదు.

ఓరీ మాయలమారీ! నామగని జయింపసాధ్యపడనివానిని జగన్నాథసమానుని రాముని బాసి శత్రువు స్వాధీనమందు దీర్ఘకాలము బ్రదుకఁజాలను

కం. కృపణుఁడు మృతికాలంబున, విపరీతమ్ముల భుజించు♦విధమున నీవున్
జపలత నీసేమం బే, వ్యపగతమతి నెఱుఁగ లేవు ♦ పాపాత్మండా. ౧౫

కృపణుఁడు = నీచుఁడు, విపరీతమ్ములన్ = అపథ్యపదార్థములను, చపలత = బుద్ధినిలుకడలేమిని. వ్యపగతమతిన్ = బుద్ధిహీనతచే.

తా. నీచుఁడు మరణకాలము ప్రాప్తించినపు డపథ్యపదార్థములఁ దినునట్లు

నీవును నింద్రియచపలతచే నీకు మేలేదో తెలిసికొనలేక బుద్ధిహీనుఁడవై యున్నావు. ఏలయందువా? నీవు పాపాత్ముఁడవు. కావున నీకు మేలగుమార్గము స్ఫురింపదు.

కం. పథ్యము చేఁదగు నరునకుఁ, దథ్యము చానున్న వేళఁ ♦ దగులదు సుమి వై
తథ్యము నా నుడికిని నా,తిథ్యమునకు నిన్ను నీడ్చు ♦ దినకరసుతుఁడున్. ౯౧౬

తథ్యము=నిజము, చానున్న వేళ = చచ్చుటకు సిద్ధముగానున్న సమయమున, వైతథ్యము = వ్యర్థము, దినకరసుతుఁడు = యముఁడు.

తా. చావు సమీపించిన సమయంబున మనుష్యునకుఁ బథ్యవస్తువులు దిన మనస్సుపోదు. పథ్యము చేఁదగును. చేఁదు పథ్యముగఁ దోఁచును. ఇది సత్యము. నామాట యసత్యముగాదు. ఏమి నీమాట యనెదవా? నిన్ను యముఁడు విందుపెట్ట నీడ్చుకొని పోవుచున్నాఁడు.

ఉ. ఇంతటిపాపకార్య మొక ♦ యింతయుఁ గొంకును జంకులేక ని
శ్చింతతఁ జేయఁ బూనుటను ♦ జెచ్చెరఁ గాంచెదు హేమభూమిరు
ట్సంతతి, నీఁదె దస్రచయ ♦ సద్మము వైతరణిం, గలాఁడవున్
స్వాంతమునందు నమ్ము మసి♦పత్రవనంబునఁ గ్రీడ సల్పఁగన్. ౯౧౭

హేమభూమిరుట్సంతతి = బంగారుచెట్లసమూహమును, అస్రచయసద్మము = నెత్తుటివెల్లువకు స్థానము, వైతరణీ=నిప్పులయేఱు, ఇది యమలోకమును జుట్టి యుండును. పాపాత్ములను కింకరులు దీనిలోవైచి యీడ్తురు. కలాఁడవు = కల వాఁడవు. ఉన్న, కల, న. పద్దులమీఁది తచ్ఛబ్దవకారంబునకు లోపంబు విభాషనగు. సు. వ్యా. క్రియ ౧౨౫. స్వాంతమునందు = మనస్సునందు. అసిపత్రవనము = ఇది యమలోకములోని యొకనరకమునకు పేరు. ఇందలి చెట్లయాకులు కత్తులవలె నుండును.

తా. ఇంతఘోరపాపకార్యమును గొంచెమైన జంకుకొంకు లేక నిర్విచార ముగాఁ జేయఁబూనుటచే శీఘ్రకాలమునందే బంగారు చెట్లను జూడఁగలవు. యమ లోకమందలి నెత్తుటియేఱు నిప్పులయేటియందు నీఁదఁగలవు. అసిపత్రవనంబునఁ గ్రీడింపఁగలవు. నమ్ముము.

క. సంతప్తహేమపుష్పా, క్రాంతము వైడూర్యదళము ♦ కాలాయసశా
ఖాంతదృఢకంటకచితము, సంతకశాల్మలిని గలవ ♦ యాలోకింపన్. ౯౧౮

సంతప్త = బాగుగఁగాల్పఁబడిన, హేమపుష్ప = బంగారు పూవులచే, ఆక్రాంతము = నిండినది, వైడూర్యదళము - సంతప్తయనుపదము వైడూర్య కాలాయసపదములతోను నన్వయింపవలెను. = బాగుగఁ గ్రాఁగిన వైడూర్యమయ ములగు నాకులు గలది, సంతప్త = బాగుగఁగాలిన, కాలాయస = ఉక్కుమయమై, శాఖాంత = వాఁడికొనలుగలదియు, దృఢ = గట్టివియునగు, కంటక = ముండ్లచే, చితము = నిండినదియగు, అంతకశాల్మలిని = యమునిబూరుగువృక్షమును.

ఒక్కొ-కచో సమాసగత పూర్వపదంబు వ్యవహితోత్తరపదం బొంటితో డను వాని పెక్కింటితోడను నన్వయించెడి. ప్రౌ. వ్యా-సమాస ౩౮ - ఈ సూత్ర ప్రకారము సంతప్తశబ్దము వైడూర్యకాలాయసశబ్దములతోడను నన్వయించును.

తా. బాగుగఁగాలిన బంగారుపుష్పములతో నిండినదియు, బాగుగఁ గాలిన వైడూర్యపుటాకులు గలదియు, బాగుగఁగాలిన యుక్కుమయమైన పదునైన కొనలు గలవై దృఢములైన ముండ్లచే నిండినదియు, నగుయమపురంబునఁ గల బూరుగు చెట్టును జూడఁగలవు. పరస్త్రీలఁ గామించిన నీకీ నరకబాధలు తప్పవని యర్థము.

ఉ. అల్పచరిత్ర యంతటిమ♦హాత్ముని వంచనచేసి మేనిలో
నిల్పఁగ నేర్తువా యసుల♦ నిర్ఘృణుఁడా విషపాయిభంగి నీ
కల్పము నేటితో ముగిసెఁ ♦ గాలభటోత్కటపాశబద్ధునిన్
వేల్పులసూడ! రాఘవుఁడు ♦ నిన్వధియించెడి నెందుఁ జొచ్చినన్. ౧౯

అల్పచరిత్ర = నీచపు నడవడిగలవాఁడా! అంతటి జగత్ప్రసిద్ధుఁడైన = మహాత్ముని, ఉసురు = ప్రాణము, నిర్ఘృణుఁడా = దయలేనివాఁడా! విషపాయిభంగిన్ = విషముద్రాగినవానివలె, నీకల్పము = నీ జీవితకాలము, కాలభట = యమకింకరుల, ఉత్కట = భయంకరమైన, పాశబద్ధునిన్ = త్రాళ్ళచేఁ గట్టఁబడినవానిని, వేల్పులసూడ = దేవవిరోధీ!

తా. నీచపు నడవడిగలవాఁడా! యింతింతని చెప్పరాని గొప్పస్వభావము మనస్సుగలవానిని శ్రీరాముని మోసగించి విషము ద్రాగినవానివలె నీ దేహములోఁ బ్రాణములు నిలుపఁగలవా? అది నీకు సాధ్యమా? దయాహీనుఁడా! నీకు జీవితకాలము నేటితో ముగిసెను. నేను లంకలోఁ బ్రవేశించిన రాముఁడు నన్నేమి చేయఁగలఁడందువేమో? దేవతాశత్రువా! యమకింకరులు నీమెడకుఁ బాశములు తగిలించి యున్నారు. కావున నీవు లంకలోనే గాదు స్వర్గపాతాళములఁ బ్రవేశించినను నిన్నుఁ దప్పక రామచంద్రమూర్తి వధింపఁగలఁడు.

ఉ. భ్రాతయుఁ దోడు లేక ఖల ♦ రాక్షసులం బదునాల్గు వేవురన్
జేతులతీట పోఁ దుమురు ♦ సేసె నిమిషములోన రాముఁడా
ఖ్యాతమహాస్త్రవేది సుస ♦ మర్థుఁడు భార్యను ముచ్చిలించు దు
ర్జాతుని నిన్ను సైఁచునె దు♦రంబున వ్రక్కలు చెక్కుకుండునే. ౨౦

ఖ్యాతమహాస్త్రవేది = ప్రసిద్ధికెక్కిన గొప్పయస్త్రముల నెఱిఁగినవాఁడు, సుసమర్థుఁడు = ఎంతటి గొప్పకార్యమయిన సాధింపశక్తి గలవాఁడు, దుర్జాతునిన్ = నీచపుఁ బుట్టువుకలవానిని, దురంబునన్ = యుద్ధమునందు, వ్రక్కలు = వ్రక్కలగునట్లు.

తా. తమ్ముఁడుకూడఁ దోడులేక యొంటరిగాఁడు దుష్టులను రాముఁడు రాక్షసులఁ బదునాలుగువేలమందిని చేతుల దురద పోవునట్లు లల్పకాలములో చూర్ణముచేసెను. అటువంటి గొప్పయస్త్రముల నెఱింగినవాఁడు ఎంతటికార్యమైన

సాధింప మనోబల దేహబల సాధనసంపత్తి గలవాఁడు. తనపెండ్లామును దొంగి లించిన నీచజాతు నిన్ను యుద్ధమందు ముక్కలుముక్కలుగా నఱకక సహించి యూరకుండునా ?

కరిబృంహితము. ఇట్టు పలుకుచుఁ బెక్కువిధముల ♦ నేడ్చి కరుణము దోఁపఁగాఁ
దిట్టుచును ఘనశోకభరమున ♦ దీన యయి స్మృతి దప్పుచున్
గట్టిగను విలపించి పొరలుచుఁ ♦ గంప మొనరఁ దపించుచో
దిట్ట యయి యసురాధముఁడు నృపు ♦ దేవిఁ గొని చనెఁ బాపియై.

తా. ఈ విధముగాఁ బలువిధముల మాటలాడుచు నేడ్చుచుఁ దిట్టుచు శోకా తిశయముచే దీనురాలై స్మృతితప్పి పడుచు గట్టిగా నేడ్చుచుఁ బొర్లుచు దేహమున వణఁకుపుట్టి తపించుచుండఁగా రాక్షసాధముఁడు దిట్టతనంబున సీతను దీసికొని పోయెను.

కరిబృంహితము. భ స భ స ర గణములు, పదుమూఁట యతి.

—♦ ౫౪-వ సర్గము. సీత తనయాభరణంబులు కపులముందట వైచుట. ♦—

చ. అతఁ డటు పోవుచుండ నొకఁ ♦ డైనను గానఁగ రామిఁ బొక్కుచున్
క్షితిసుత గాంచి భూమిధర ♦ శృంగ చరత్కపిపంచకంబు నీ
క్షితిరుహచారు లేనియును ♦ జెప్పక యుందురె రాముతోడ నా
గతి యని కొంగునన్ ముడిచి ♦ కాంచనభూషలు వారి ముంగలన్. ౯౨

భూమిధరశృంగ = పర్వతశిఖరమునందు, చరత్ = తిరుగుచున్న, కపిపంచ కంబు = ఐదుక్రోఁతులను, క్షితిరుహచారులు = చెట్లయందు సంచరించువారు - క్రోఁతులు, కాంచనభూషలు = బంగారు సొమ్ములు.

తా. ఆపాపాత్ముఁ డిట్లు పోవుచుండఁగా నింతవఱ కొకఁడైనఁ గానరా కుండెను. దానికై తపించుచు నొకచోటఁ గొండశిఖరమునందున్న నైదుగురు వాన రులఁ జూచి పిరికైనను నాస్థితి రామునితోఁ జెప్పకుందురా యని తన సొమ్ములను దీసి కొంగున ముడివైచి వారిముందు పడునట్లుగా.

ఉ. వైచెను వైచు టాఖలుఁ డ ♦ వారణసంభ్రమ సాధ్వసాత్ముఁ డై
వే చనుచుంటఁ గన్గొనఁడు ♦ వృక్షచరావళి నిర్నిమేష వా
లోచనముల్ వహించుచు వి ♦ లోలవిశాలవిలోచనామణిన్
జూచెను రామ రామ యని ♦ శోకమునం బలవించు చుండఁగన్. ౯౩

ఖలుఁడు = దుష్టుఁడు, అవారణ = అడ్డములేని, సంభ్రమ = తొట్రుపాటు, సాధ్వస = భయముగల, ఆత్ముఁడై = మనస్సుగలవాఁడై. "సభయహర్షజనితచిత్త క్షోభమువలన నని" తిలకవ్యాఖ్య. రావణుఁడు సీతను జంకలో నిఱికించుకొని పోయినవాఁడు, ఆమె కెదురుగ నుండినది కాదు. ముందువెనుకలకు వ్రాలు

చున్నట్టులు చెప్పఁబడెనుగదా. ఎవరడ్డమువత్తురో యెప్పుడెపుడు పోయి లంకలోఁ బడుదునా యని రావణుదృష్టి ముందుండెను. రామలక్ష్మణులు వత్తురేమో యని సీతాదృష్టి వెనుకప్రక్కనుండెను. ఇట్లు చంకలోఁ బొర్లుటలో వెనుకప్రక్కగ వ్రాలి సీత సొమ్ములుత్తరీయమున ముడిగట్టివైచెను. కొందఱు చెప్పినట్లు పైట కొంగు సీత చింపలేదు. ఇప్పటి స్త్రీల పైఁటవలె సీతకు పైఁటలేదు. కట్టుకొను వస్త్రమొకటి, కప్పుకొను నుత్తరీయమొకటి. ఈ కప్పుకొన్నదానితో సొమ్ములు మూటకట్టివైచెను, కట్టుకొన్నది కప్పుకొన్నది రెండు నొక వన్నె గలవే. ఈ వైచిన సొమ్ములలో కొన్ని దేహమున నొకప్రక్క ధరింపఁబడినవే వైచెను. అనఁగా ఒక చెవికమ్మ, ఒకముక్కుప్రోగు, ఒకచేతి బాజుబందు-వంకీవైచెనని సుందరకాండమందలి హనుమంతుని వాక్యమువలనఁ దోఁచెడి. ఇది తన్ను గుర్తింప నను కూలపడుటకై చేసిన యుపాయము. వే=శీఘ్రముగ-ఆదరబాదర, నిర్నిమేషము = తెప్పపాటులేని లోచనముల్ =కనులు, విలోల=విశేషముగాఁజలించు, విశాల = వెడలుపైన, విలోచనామణిక =కన్నులుగల శ్రేష్ఠురాలిని.

తా. ఆమూటను బడవైచెను. మిగులఁ దొట్రుపాటుతోను భయపడిన మనస్సుతోను, నాదరబాదర వేగముగాఁ బోవుచున్నవాఁ డగుటచే రావణుఁడు దానిని జూచిన వాఁడు కాఁడు. చూచియుండిన నానవాలు లేకుండఁజేయు దానిని హరించి యుండును. ఆ క్రోఁతులు తెప్పపాటులేని దృష్టులతో విశాలములై చలించుచున్న కన్నులుగల దానిని రామరామ యని శోకమున నేడ్చుదానిని జూచిరి. వాఁడు రావణుఁ డని సుగ్రీవాదులు గుర్తించిరి కాని యామె యెవతెయో వారికిఁ దెలియదు. ఈ ప్రకారము వాఁడెందఱినో యెత్తుకొని పోవుచుండును. ఎవతెయో యేమో యని రిత్తకలహము మనకేల యని వారూరకుండిరి. ఎవతెయైన నేమి? ఆఁడుకుయిలు ఆలకుయిలు వినినవారు రక్షించుట ధర్మముగదా యందు రేమి? బలవద్విరోధము. అదియునుగాక వాలికి రావణునకు సఖ్యము గలదు. ఈ వార్త తెలియఁగానే వాఁడు బయలుదేఱి సుగ్రీవుని జంప నిదే సమయమని బయలుదేఱి వచ్చును. అని యివి యన్నియు నాలోచించి వారూరక యుండిరి.

ఉ. అసురభర్తయుం గడుర ♦ యంబునఁ బంపను దాఁటి తీక్ష్ణదం
ష్ట్రాసహితాహికన్యకఁ దా ♦ ల్చక ధరియించినభంగి దోఁప బృ
థ్వీసుత మృత్యుదేవి ననఁ ♦ దెంపున బల్మి గ్రహించి పర్వతా
ళీసరసీనదీవనుల ♦ లీల నిరస్తకరంబుపోలికన్. ౯–౩౪

తీక్ష్ణదంష్ట్రాసహిత = విషముచేఁ గ్రూరమైనకోఱలతోఁ గూడిని, అహికన్యకన్ = ఆఁడుపామును, పర్వతాళి = పర్వతములవరుసలను, సరసీ = సరస్సులను,

నదీ = ఏళ్లను, వనుల౯ = అడవులను. ఇట్లనుటచే నూళ్ళమీఁదుగా వాఁడు పోలే దని కేవలనిర్జనమైన యడవిమార్గముననే పోయె నని యేర్పడుచున్నది.

తా. రాక్షసరాజు మిగులవేగముగఁ బంపను దాఁటి క్రూరవిషముగల కోఱలుగల యాఁడుపామును దొడమీఁద నుంచుకొన్నవానివలె సీతను బట్టుకొని తనమృత్యుదేవతనో యన్నట్లు సీతాదేవిని సాహసముచే బలాత్కారముగఁ బట్టు కొని పర్వతములు తటాకములు నదు లడవులు దాఁటి యవలీలగా వింటినుండి విడిచిన బాణమువలె నడ్డములేక యతివేగముగ చక్కఁగా.

ఆ. వడిగ దాఁటి నక్ర ♦ పాఠీనతిమితిమింగిలచయాన్వితంబు ♦ జలధి డాసి
తీఱెఁ బోనురారి ♦ దీనితో నన సిద్ధవితతి హృష్టుఁ డగుచు ♦ వేగి యగుచు.

నక్ర = మొసళ్లు, పాఠీన = చేఁప, తిమి = ఇదియొకపెద్దచేఁప, తిమింగిల = తిమినిమ్రింగునది తిమింగిలము, వీని-చయ = సమూహముతో, అన్వితంబు = కూడి నది, జలధి౯ = సముద్రమును, డాసి = సమీపించి, సిద్ధవితతి = సిద్ధులసమూహము, దీనితో౯ = ఈ సీతాహరణ కార్యముతో, తీఱె౯పో = నిశ్చయముగాఁ జచ్చెను. హృష్టుఁడు = లంకచేరితిని గదా యిఁక భయములేదని సంతోషించిన వాఁడు, హృష్టుఁడు = కోఁడలు రామునిచేఁ జచ్చుమార్గము గలిగెఁగదా యని సంతో షించెను. పుణ్యము క్షయింపక పాప మతిశయించినఁగాని మృత్యువు కలుగదు, కావునఁ దమోగుణావృతుఁడై తెలిసి తెలిసి తల్లినిగూడ విరుద్ధవువాక్యములు పలికె నని యందురు. దీనికి సర్గాంతమందుఁ జెప్పఁబడు. “ బభూవ మోహాన్మదితః” ‘విమోహి మోఁదిలె౯’ (౯33-వ పద్యము) అసంగతమగుచున్న. అట్లులే “ఆత్మానం బుద్ధివైక్లబ్యాత్ కృతకృత్య మమన్యత, కృతకృత్యుఁడ ననుచు బుద్ధిహీనతఁ దలఁచె౯, ౯ 3౪ పద్యము అనునదియు నసంగతమే అని తిలకవ్యాఖ్య.

తా. శీఘ్రముగ దాఁటిపోయి మొసళ్ళు, పాఠీనములు, తిములు, తిమింగిల ములు గలసముద్రమును సమీపించి గడ్డనఁ బడితిని. ఇఁక భయములే దని రావ ణుడు సంతోషించుచు సిద్ధులు దీనితో రావణుఁడు చచ్చెను, సిద్ధమని యనుచుండ వేగముగ.

—♦ రావణుఁడు సీతతో లంకఁ జొచ్చుట. ♦—

క. తననగరంబు లంకను న ♦ తంద్రగతిం జొరఁబాతి రావణుం
డనయత సీత నుంచెఁ దన ♦ యంతిపురంబున దైత్యశిల్పి ము
న్ననువుగఁ దాను మాయసతి♦యట్టుల, యంతఁ బిశాచకాంతల౯
గనుఁగొని మీరు హెచ్చరికఁ ♦ గావలి యుండుఁడు సీత కెప్పుడు౯. ౯ ౨౬

అతంద్రగతి౯ = హెచ్చరికతో, ఎవ్వరికిఁ దెలియకుండునట్లు, అనయత౯ = నీతితప్పినవాఁడై, దైత్యశిల్పి = మయుఁడు, మున్ను = పూర్వము; మాయ౯ =

మాయచే, సతియట్లులు = తానుంచుకొన్న హేమనువలె-మాయచే తనసతి నుంచి నట్లు లనుటచే (1) ఈగుహ దుర్గమము. దీనిలో నెవరుండునది లోకమునకుఁ దెలియదు. అట్లులే సీత యిందుండుట యెవరికిఁ దెలియ నసాధ్యము. (2) మయునకు హేమ యుంపుడుక_త్తె. వాఁడు దానవుఁడు. అది దేవతాస్త్రీ. ఇక్కడ నట్టిభావమే గ్రహింపవలెను. (3) మయు నింద్రుఁడు చంపినట్లులు యుద్ధమున రామచంద్ర మూ_ర్తి రావణు వధింపఁగలఁ డని యీయుపమానసారస్యము.

పూర్వము దైత్యశిల్పియగు మయుఁడు తా నుంచుకొన్న హేమ యను దానికై తనయద్భుతశ_క్తిచేఁ గల్పించిన గుహయందు దాని నుంచినట్లులు-ఈ కథ కిష్కింధాకాండమందు ౫౧-వ సర్గమునఁ గలదు. ఇచ్చటఁ దిలకవ్యాఖ్యయందు 'మాయామి వాసుర' మ్మని పాఠము గ్రహింపఁబడినది. ఇట్లు గ్రహించి లంకకుఁ దేఁబడిన సీత మాయారూప యనియు ముఖ్యమాత సీత ముందే యగ్నియందుఁ బ్రవేశించె నని ధ్వనిత మనియు, కావుననే రావణు డీసీతను మోయఁ గలిగె ననియు మాయవలననే రావణుఁడు వా_స్తవము తెలిసికొన లేకపోయెననియు వ్రాయఁబడినది. సీత మాయారూపము గనుక రావణుఁడు మోయఁ గలిగె నఁట. విరాధుఁ డీసీతను మోసెను? అప్పు డెవ రేమాయ చేసిరి? కావున నీయభిప్రాయము సరిగాఁ దోఁపదు. ఇఁక నీవ్యాఖ్యాత యభిప్రాయ మేమన, మయుఁడు దానవశిల్పి. వీఁడు దేవతాస్త్రీ యగు హేమను నుంచుకొన్నవాఁడు. దానికై స్వయంప్రభాగుహ తనశ_క్తిచే నిర్మించి యందు దాని దాఁచి యుంచెను. తనకు శత్రువు, దానవుఁడు నగువాఁడు తనజాతి దేవతాస్త్రీ నుంచుకొన్నాఁ డనుట యింద్రునకు సహింపరానిదై వానిని జంపెను. ఈ విధముగ నా దేవతాస్త్రీ మయునిపాలిటికి మృత్యుదేవత యయ్యెను.

అట్లులే సీతయు రావణునకు మృత్యు కారణ మయ్యె నని యుపమాన భావము. కావున నిక్కడ మాయ యనఁగా మయసంబంధమైన యద్భుతశ_క్తియే కాని యింద్రజాలము కాదు. స్వయంప్రభాగృహ యింద్రజాలము కాదు గదా.

మాయ యనఁగా నింద్రజాల మని యర్థము వ్రాసినవారామాయాస్త్రీ యెవ్వతె? అది యెందుకు నేలయుంచఁ బడె నను నైతిహ్యము వ్రాసినవారు కారు.

తా. తనలంకానగరమును మిగులహెచ్చరికతోఁ బరువునఁ బ్రవేశించి సీతి హీనుఁడై రావణుఁడు పూర్వము మయుఁడు మాయచేఁ దాను నిర్మించిన గుహ యందు హేమనువలెఁ దనయంతఃపురంబున నుంచి పిశాచస్త్రీలఁ బిలిచి మీరు సర్వకాల సర్వావస్థల సీతపైఁ గావలియుండుఁడు.

ఉ. కాంతలఁ గాని పూరుషులఁ ♦ గాని యిటం జొరనీయ కుండుఁ, డే
 కాంతము స్వర్ణరత్నవస ♦ నాదుల దేనిని సీతగోర నా

వంతయు నడ్డు చెప్ప కిదుఁ డాసలయు గల్గినయేని మేనిపై;
నింతి నెటింగియే నెఱుఁగ ♦ కేఁ బరుషంబులు పల్కఁబోకుఁడీ. ౯-౨౭

ఏకాంతము = మిక్కిలి, స్వర్ణ, రత్న, వసనాదులన్ = బంగారు మణులు వస్త్రములు లోనైనవానిని, పరుషంబులు = కఠినవాక్యములు.

తా. సీతయున్న చోటికి స్త్రీలనుగాని పురుషులనుగాని రానీయకుడు. ఆమె బంగారో, రత్నములో, వస్త్రములో, యేది కోరిన నది విశేషముగాఁ దెచ్చియిండు. మీకు దేహములమీఁద నాశయుండెనా యడ్డము చెప్పవలదు. తెలిసి కాని తెలియకకాని యామెను కఠినోక్తులు పలుకవలదు.

కం. అని యిట్టు లాజ్ఞయిడి యమ్మనుజాశనుఁ డంతిపురము ♦ మాని యిఁ కేమే
ననువగుఁ జేయఁగనని పర, మున మోహితుఁ డగుచు నెంచి ♦ పురుబలయుతముల్.

తా. అని యీప్రకార ముత్తరువుచేసి యారాక్షసుఁడు అంతఃపురము వదలి యావల వచ్చి యిఁక నేను జేయవలసిన దేమి యని యాలోచించి బ్రహ్మవరము నాకుఁ గలదు. నా కేమిభయ మని బుద్ధిలేనివాఁడై తలఁచి గొప్పబలముతోఁ గూడినవారిని.

—♦ రావణుఁడు జనస్థానమునకుఁ గాపు పంచుట. ♦—

కం. అష్టపలాశినిఁ గనుఁగొని, స్పష్టంబుగ ననియె మీరు ♦ చనుఁడీ మీమీ
యిష్టాయుధములఁ గొనుచు న,వష్టంభముతోడ వేగ ♦ వని దండకకున్. ౯-౨౯

అష్టపలాశిని = ఎనమండ్రు రాక్షసులను, ఇది ద్విగుసమాసము, సంఖ్యాపూర్వోద్విగుః-పాణిని ౨. ౧. ౫౨ సమాహారమున 'ద్విగురేకవచన' మ్మని యుండుటచే నేకవచనరూపము. అవష్టంభముతోన్ = తగినప్రయత్నముతో, వని = అడవి.

తా. ఎనమండ్రుగురు రాక్షసులను జూచి సందేహము లేకయుండునట్లు ఇట్లు పలికెను. మీకు మీకు నిష్టములైన యాయుధము లన్నియుఁ దీసికొని ప్రయత్నముతో దండకారణ్యమునకుఁ బోవలసినది.

సీ. అందుహతస్థాన ♦ మగుజనస్థానంబు,నందు నిల్వుఁడు మీర ♦ లంద ఱరిగి
మున్ను ఖరాసురుం ♦ డున్న చో టది మీరు, సాధ్వసపడక రో ♦ షంబు చలము
పౌరుషమారంగఁ ♦ బరికించు చుండుఁడు, మున్ను నే నుంచిన ♦ యన్నిశాట
నాథుల ఖరదూష♦ణప్రముఖులఁ జంపె, రాముండు దాన వై♦రంబు పుట్టె
తే. వైరనిర్యాతనమునకు♦ వలనురోయు,వాఁడ ధైర్యంబుకంటెఁ గో ♦ పంబు మించె
జానకీనాథు రణమునఁ ♦ జంపి కాని, యీద మఱచి నే నిద్రింప ♦ ననురులార.

అందున్ = ఆదండకయందు, హతస్థానము = ఖరాదులుచంపఁబడినస్థలము, సాధ్వసపడక = భయపడక, పరికించుచుండుఁడు = పరీక్షించుచుండుఁడు, నిశాటనాథు

లన్ = రాక్షసనాయకుల, వైరనిర్యాతనమునకున్ = పగదీర్చుకొనుటకు, వలను = మార్గము, రోయువాఁడన్ = వెదకుచున్నాఁడను, ఆదమఱచి = ఆత్మమఱచి.

తా. ఆ దండకయందు ఖరాదులు చంపఁబడిన స్థలమునందే మీరుండుఁడు. అది పూర్వము ఖరుఁ డున్నస్థలము. మీరు భయపడవలదు. రోషము చలము పౌరుషము అతిశయించునట్లు శత్రువుల పోకలరాకలఁ బరీక్షించుచుండవలయును. పూర్వము నే నందుంచిన ఖరాదు లగు రాక్షసనాయకుల రాముఁడు చంపెను. దానిచే విరోధము కలిగెను. ఆ పగదీర్చుకొనుట కుపాయము నాలోచించుచున్నాఁడను. ప్రత్యక్షముగాఁ బోయి యుద్ధముచేయ ధైర్యముచాలదు. అట్టులని యూరక కుండుటకుఁ గోపము కారణమున వశపడకున్నది. ఏవిధముగనైన రాముని రణమునఁ జంపి కాని మైమఱచి నిద్రింపను.

ఉ. కాపురుఁ బేద విత్తమును ♦ గాంచినయట్లు ఖరారిఁ జంపి సౌ
ఖ్యానహవృత్తి నుందుఁ, జని ♦ యయ్యెడ మీరలు రాముపోకలన్
రేవగ లప్రమాదగతిఁ ♦ ద్రిమ్మరి కాంచుచుఁ దద్విశేషవా
ర్తావళి నాకుఁ బుచ్చుఁడు, నృ ♦ పాత్మజులన్ వధియింపఁ బూనుఁడీ. ౯౩౧

విత్తము=ధనము, ఖరారిన్=ఖరునిఁజంపినరాముని, సౌఖ్యానహవృత్తిన్ = సుఖమును గలిగించు వ్యాపారమునందు, ఈరలు = మీరలు, రేవగలు - రే + పగలు. రాత్రియుఁబగలు = ద్వంద్వంబునఁ బదంబుమీఁది కచటతపలు గసడదవలగు. సమాహారద్వంద్వసమాసము - సమాహారద్వంద్వము తెనుఁగునఁ బ్రాయికంబుగ బహువచనమగు. అప్రమాదగతిన్ = పొరపాటులేనివిధముగ, ద్రిమ్మరి = తిరిగి.

తా. కాఁబట్టి పేదవాఁడు ధనమును సంపాదించుకొన్నట్టు బలవద్విరోధము వలన సుఖవిషయమున దరిద్రుఁడనై కన్నార నిద్రలేక యుండు నేను ఖరుని జంపిన వాని నెట్లు చంపుదునా యని యాలోచించుచుండు నేను రాముని జంపి మరల సుఖపడుదును. మీ రచ్చటికిఁ బోయి రామునిచర్య లన్నియు కనిపెట్టి రాత్రియనక పగలనక దినదినము హెచ్చరిక తప్పక తిరుగుచు నొకచోటనే యుండక యారాముని విషయమైన విశేషవృత్తాంతముల నాకుఁ జెప్పి పంపు చుండుఁడు. మీరు నా రాజకుమారులఁ జంప యత్నింపుఁడు.

కం. మీ బలమును మీ శౌర్యం, బే బహురణములను జూచి ♦ యెఱుఁగుట మిమ్మే
యీ బలితపుఁ గార్యంబున, నో బారకమునకుఁ, బూన్చ ♦ టయ్యెనటంచున్.

బారకము = భారము.

తా. ఇంతయుండఁగా మీ యెనిమిదిమందినే పంప నేల యందురేమో ? మీ బలము మీ శౌర్యము నేను అనేక యుద్ధములందుఁ జూచి మీ విషయము బాగుగఁ దెలిసినవాఁడ నగుటచే నీమహాకార్యభారమును మీయం దుంచినవాఁడనైతిని. ఇతరు లింతకార్యము నిర్వహింపలేరు.

ఉ. ఈనెఱి నింపు పెంప నసు♦రేంద్రుఁడు పల్కిన రాక్షసాష్టకం
బానతిఁ జేసె, రావణుని♦ కానతిఁ జేసి జవంబుమై జన
స్థాన మలక్ష్యదర్శనులు♦దారుణభంగిని జొచ్చి, రీగతిన్
జానకిఁ దెచ్చి రాము నెడ♦శాత్రవ మూని విమోహి మోదిలెన్. ౩౩

ఈనెఱిన్ = విధముగ, ఆనతిన్ = నమస్కారమును, ఆనతిఁ జేసి = ఆజ్ఞచే, జవంబుమై = వేగముచే, అలక్ష్యదర్శనులు = వేగాతిశయముచే నాకారము కనఁబడనివారు, విమోహి = జ్ఞానహీనుఁడు, మోదిలెన్ = సంతోషించెను.

తా. ఈ విధముగ సంతోషమతిశయించు మాటలను రావణుఁడు చెప్పఁగా విని యా యెనమండ్రుగురు రాక్షసులు రావణునకు నమస్కరించి యతని యాజ్ఞ చొప్పున తాము కానరానంతటి వేగాతిశయమున దండకయందుఁ బ్రవేశించిరి. ఈవిధముగ రావణుఁడు రాము నెడ పగపూని సీతను దెచ్చి యజ్ఞానముచేఁ గృతకృత్యుఁడనైతిని-సీత దక్కెను-రాముఁడు చచ్చెను అని సంతోషించెను. 'శాత్రవ మూని విమోహి మోదిలెన్' అను వాల్మీకివాక్యము భక్తిభావనతో రావణుఁడు సీతను హరించె ననుట నిరసించుచున్నది.

—♦ ౫౫-వ సర్గము. రావణుఁడు సీతకుఁ దనసౌధంబుఁ జూపుట ♦—

క. వితతబలిష్ఠాదిత్యా, హితులఁ బనిచి సంతసించె♦నెనమండ్రను దా
జితదిక్పాలుఁడు తనలోఁ, గృతకృత్యుఁడ ననుచు బుద్ధి♦హీనతఁ దలఁచెన్.

వితతబలిష్ఠ = విస్తారమైనబలముగల, ఆదిత్యాహితులన్ = దేవవిరోధులగు రాక్షసులను, జితదిక్పాలుఁడు = జయింపఁబడిన దిక్పాలురుగలవాఁడు. దిక్పాలకులగు ఇంద్రాగ్నియమాదుల జయించినవాఁడు. బుద్ధిహీనతన్ = బుద్ధిలేకపోవుటచే, కృతకృత్యుఁడను = ధన్యుఁడను. చేయవలసినదానిని జేసినవాఁడను అయితి నని తలఁచెను. ఇదియును రావణుఁడు డజ్ఞానమునఁ జేసెనని తెలుపుచున్నది గాని సీతారాములయందు భక్తితోఁ జేసెనని తెలుపదు.

తా. పరాక్రమవంతులని కీర్తిచే వ్యాపించిన బలముగల రాక్షసుల నెనమండ్రను దండకకుఁ బొమ్మని యాజ్ఞచేసి దిక్పాలుర జయించిన రావణుఁ డట్టిదే యిది యనుకొని చేయవలసిన కార్యము చక్కఁగాఁ జేసితిని. ఇఁక నాకు రామువలన భయము లేదని జ్ఞానహీనతచేఁ దలఁచెను.

కం. వెండియు సుమకాండాసన, చండతరాశుగనితాంత♦సంతాడితుఁడై
దండితసురరాజుఁడు వే,తండగమనసీతఁ దలఁచి♦తటుకునఁ జనియెన్. ౩౫

వాల్మీకి రావణునకు భక్తిలేమి యటుండ సీతావిషయమునఁ గామాసక్తి కలదని స్పష్టముగఁ జెప్పుచున్నాఁడు. సుమకాండాసన = పూవిలుతుఁడైన మన్మథునియొక్క, చండతర = మిగులఁ దీక్ష్ణములైన, ఆశుగ = బాణములచే, నితాం

త = మిక్కిలి, సంతాడితుఁడై = బాగుగఁ గొట్టబడినవాఁడై, దంతినురరాజుఁడు = దండింపఁబడిన దేవేంద్రుఁడు గలవాఁడు. ఇది బాహువ్రీహిసమాసము. కావున రాజుశబ్దమునకు డుజ్జు వచ్చెను. వేతండగమనన్ = ఏనుఁగునడకవంటి నడకగల దానిని.

తా. ఇట్లు తలఁచినవాఁడై యింద్రుని జయించిన యారావణుఁడు మన్మథునిబాణములచే బాగుగఁ గొట్టబడినవాఁడై సీతను దలఁచుకొని వెంటనే యామె యున్నచోటికిఁ బోయెను.

చ. చని యట దైత్యనేత నిజ♦శాసితదైత్యసతీపరీత, లో
చనయుగళీగళత్సలిల♦జాత, నతాస్యవరాంబుజాత, భూ
ర్యనిలసమాహతోడుపని♦భాతిసమాకుల ధీసమేత, ద
ర్శనవిముఖీకృతాత్మముఖ♦సాగరజాతను, సీతఁ గన్గొనన్. ౯౩౬

దైత్యనేత = రాక్షసప్రభువు, నిజశాసిత = తనయాజ్ఞకు లోపడిన రాక్షసస్త్రీలచేఁ జుట్టఁబడినదానిని, లోచనయుగళీ = రెండుకన్నులనుండి, గళత్ = జాఱుచున్న, సలిలజాత = నీటిసమూహముగలదానిని, నతాస్యవరాంబుజాత = వంచుకొనఁబడిన ముఖకమలము గలదానిని, భూరి + అనిల = గొప్పగాలిచే, సమాహత = కొట్టఁబడిన, ఉడుప = పడవతో, నిభ = సమానమైన - అతిసమాకుల = మిగులకల వరపడుచున్న, ధీసమేత = బుద్ధితోఁగూడినదానిని, దర్శన = రావణుఁడు చూచుటకు, విముఖీకృత = పెడవాటుగాఁ జేయబడిన, ఆత్మముఖ = తనముఖము నెడి, సాగరజాతను = చంద్రబింబముగలదానిని.

తా. పోయి యాప్రదేశమందు రావణుఁడు తనయాజ్ఞకు లోపడిన రాక్షసస్త్రీలచేఁ జుట్టఁబడి, రెండుకన్నుల నీళ్ళు కాలువలుగాఁ బాఱ, ముఖము వంచుకొని, పెనుగాలిచే సముద్రమునందుఁ గొట్టఁబడుటచేఁగలతచెందిన పడవవలె వ్యాకులపడు మనస్సుగలదై తన్నుఁ జూడకుండునట్లు వానికి మాఱుముఖమై యుండుదానిని సీతను జూచెను.

ఉ. తేఁచులు తన్నుఁ జుట్టుకొని ♦ తేసిన నివ్వెఱ ఊచ్చపాటు దన్
లోఁచఁగఁ జిక్కుస్రుక్కుమృగ♦లోకవిముక్తకురంగిఁ బోలుచున్
డ్రాఁచనదీర్ఘనిశ్వసన♦రాజి నిగుడ్చుచు నున్నదానిఁ దాఁ
బూఁచి బలాత్కృతిన్ నగరు♦పోఁడిమిఁ జూపఁగఁ బట్టి లాగుచున్ ౯౩౭

తేఁచులు = తేఁచుకుక్కలు, తేసినన్ = అతిశయింపఁగా, నివ్వెఱ = నిండు వెఱపుచే, ఊచ్చపాటు = నిశ్చేష్టత, తన్ = తన్ను, లోఁచఁగన్ = అణఁపఁగా, మృగలోకవిముక్త = జింకలసమూహముచే విడువఁబడి యొంటిగానుండు, కురంగిన్ = ఆఁడుజింకను, డ్రాఁచు + అనన్ = డ్రాఁచుపామువలె, దీర్ఘనిశ్వాసనరాజి = నిట్టూ

ర్పసమూహములను, పూఁచి = ప్రయత్నించి, బలాత్కృతిఁ = బలవంతముగ, పోఁడిమి = అందము, లాగుచుఁ = ఈడ్చుచు.

తా. తనతోడి జింక లన్నియుఁ దన్ను వదలిపెట్టిపోఁగా నొంటరిగానై తేఁచుకుక్కలు తన్నుఁ జుట్టుకొనఁగా భయపడి చేష్టలుమాని స్రుక్కిన యాఁడు జింకవలెనై త్రాఁచుపామువలె నిట్టూర్పులు విడుచుచు నున్నదానిని రావణుఁడు ప్రయత్నపూర్వకముగ బలాత్కారముగా తననగరుసౌందర్యముఁ జూపుటకై యీడ్చుకొనిపోయి.

క. ముద్దియలు వేలకోలఁదులు, నిద్దపురతనములతోడ ♦ నెఱి గలమేడల్
మిద్దెలు నగళులు వన్నెల,ముద్దులు గొలిపెడికళుంత ♦ ములు గలయింటన్ ౯౩౮

తా. వేలకొలఁదులు స్త్రీలును,నిగనిగ మనురత్నములు గల యందమైన మేడలును మిద్దెలు నగళ్లు-ముద్దుపెట్టుకొన బుద్ధిపుట్టించు పక్షులుగల యింటియందు.

క. స్ఫాటిక రాజతదాంతక, హాటకవైడూర్యవజ్ర ♦ హారిస్తంభో
త్కూటము కాంచనతోరణ, ఝాటము సోపాన మెక్కి ♦ సతి కనుఁ డనుచున్.

స్ఫాటిక = స్ఫటికమయములను, రాజత = వెండిమయము, దాంతక = దంతమయములునై, హాటక = బంగారుచేతను, వైడూర్య = వైడూర్యములచేతను, వజ్ర = వజ్రములచేతను, హారి = మనోహరమైన, స్తంభ = స్తంభములుగల, ఉత్కూటము = గొప్పచావళ్ళుగలది, కాంచనతోరణఝాటము = బంగారువాకిండ్ల సమూహముగలది, సోపానము = మెట్లవరుస. ఇంతకుముందు తన ప్రభావము తెలిపి సీత కాశగలిగింప యత్నించెను. ఇప్పుడు భోగ్యపదార్థములఁ జూపి యాశగలిగింప యత్నించుచున్నాఁడు.

తా. స్ఫటికములు, వెండి, దంతములు, బంగారు, వైడూర్యములు, వజ్రములు వీనిచే మనోహరములైన స్తంభములు గలపెద్దచావిళ్ళు గలిగి బంగారు వాకిండ్లు గల సోపాన మెక్కి సీతకు రావణుఁ డట్లనియె.

సీ. ఇదె చూడవేసీత ♦ హేమదంతసమేత, పూతవాతాయన ♦ వ్రాతములను
నదె చూడవే భామ ♦ హృదయంగమోద్దామ, ధామనిర్జితసోమ ♦ ధామములను
నటు చూడవే గోల ♦ హారి కేళీలోల, జాలపాదాంగనా ♦ జాలములను
నిటు చూడవే చాన ♦ యింపుసొంపుల సోన, మానితనవనవో ♦ ద్యానములను
తే. జూచితే యల్లకొలఁకుల ♦ సొంపుపెంపు, కోమరుఁజిలుకలపులుఁగుల ♦ గుంపులింపు
నల్లపుష్పితవృక్షంబు ♦ లింపునింపు,మగువరో యింకనైనని ♦ మంపు దింపు. ౯౩౯

హేమదంతసమేత = బంగారుతోను దంతములతోనుకూడిన. పూత = పవిత్రములైన, వాతాయనములను = కిటికీలను, హృదయంగమ = మనోజ్ఞములును, ఉద్దామ = గొప్పవియునయి, ధామ = కాంతిచే, నిర్జిత=జయింపఁబడిన, సోమ = చంద్రునిగల, ధామములను = ఇండ్లను, గోల = ఓముగ్ధా! హారికేళీలోల = మనో

హారక్రీడలయం దాసక్తిగల, జాలపాదాంగనా = ఆఁడుహంసల, జాలములను = సమూహములను, మానిత = పూజ్యమగు, నవనవోద్యానములను = క్రొత్తక్రొత్త తోఁటలను, మంపు = మత్తు - దింపు = తొలఁగింపుము.

తా. ఓ సీతా! యీ ప్రక్కఁ జూడుము. బంగారు-దంతము-వీనితోఁ గూడి నిర్మలములైన కిటికీలెట్లున్నవో, ఆ ప్రక్క మనోజ్ఞములై గొప్పవై చంద్రకాంతివంటి కాంతిగలగృహము లెట్లున్నవో చూడుము. ఓసి ముద్దరాలా! ఆవైపు మనోహరక్రీడ లయం దాసక్తిగల యాఁడుహంస లెట్లున్నవో చూడుము. ఈవైపు ఇంపుసొంపు గలుగు పూజ్యములైన క్రొత్తక్రొత్త ప్రమదావనము లెట్లున్నవో చూడుము. అదో ఆ కొలఁకుల సొంపుయొక్క యాధిక్య మెట్లున్నదో, ప్రాయంపుఁ జిలుకలగుంపుల కల కల ధ్వను లెట్లున్నవో చూచితివా? అన్ని పూచినచెట్లు సంతోషమును నిండించు చున్నవి. చూచితివా. ఇంకనైన నీ మౌనమును వదలుము.

చ. అని యిటు లాత్మదివ్యభవ ♦ నావళినందము నందయాన దాఁ
గనుఁగొనఁజేసి మోసపడఁ ♦ గ్రమ్మఱ నిట్లను నన్నుఁ గొల్చుచున్
గొనకొని యెప్పు డుండుదురు ♦ కోటులు ముప్పదిరెండు రాక్షసుల్
వనిత తలంపు మేఁ ప్రభుత ♦ వాలెద నిందఱ నేలుచున్ సతీ! ౯౮౧

ఆత్మ = తనయొక్క, దివ్య = దేవతలగృహములవంటి, భవనావళి = ఇండ్ల వరుసల, చందము = విధము, మోసపడన్ = మోసపోవుటకై.

తా. అని యీ ప్రకారము దేవతల యిండ్లవంటి తనయిండ్లను జూపి యింకను నామెను మోసగింప నిట్లనియె. నాసేవ సేయుచు ముప్పదిరెండుకోట్ల రాక్షసు లెప్పుడుందురు. నే నిందఱకుఁ బ్రభుఁడనై పాలించుచుందును. చూచితివా నా యైశ్వర్యము ప్రభుత్వము.

కం. పరిచర్యల నొకొక్కపని, యరయఁగ నొకొక్కవేవు ♦ రసురవరేణ్యుల్
పరిగణనము సేయక బా,లుర ముదుకలుఁగలరు సుమ్మ ♦ లోలాక్షి యటన్. ౯౮౨

తా. నాకుఁ జేయవలసిన సేవలయందు నొకొక్క సేవసేయుటకు బాలురు ముసలివాండ్రుగాక యొకొక్క వేయిమంది రాక్షసశ్రేష్ఠులు గలరు.

ఉ. ఈవరమందిరావళులు ♦ నీయసమానసుపూజ్యరాజ్య మిం
దీవరనేత్ర! నాయనుఁగు ♦ దేవులు వేలకొలంది వెండి నా
జీవనమున్ భవద్వశముఁ ♦ జేసెద, నిన్నిటి కీవ యిప్పుడే
దేవివి కమ్ము లెమ్ము పరి ♦ దేవన మేటికిఁ గొమ్ము నన్ బతిన్. ౯౮౩

వరమందిర + ఆవళులు = శ్రేష్ఠములైన యిండ్లవరుసలు, అసమాన = ఈడులేని, సుపూజ్యరాజ్యము = మిగుల గౌరవమునకుఁదగిన రాజ్యము, ఇందీవర నేత్ర = కలువలవంటి కన్నులుగలదానా, అనుఁగుదేవులు = ప్రియురాండ్రగు

రాణులు, జీవనముల్ = బ్రదుకు, భవత్ + వశము=నియధీనము. దేవివి = పట్టపు రాణివి, పరిదేవనము = ఏడ్పు - పతిగ = భర్తగా.

తా. ఈ శ్రేష్ఠములైనగృహములు అసమానమై గౌరవార్హమగు రాజ్యము, వేలకొలందులుగా నుండు నా రాణులు నా బ్రతుకు నివియన్నియు నీ స్వాధీనము చేసెదను. ఇప్పుడే నీవు వీని కన్నిటికి పట్టపురాణివి కమ్ము. ఏల యేడ్చెదవు? నన్ను భర్తగా గ్రహింపుము.

ఉ. ఏల దురంతతాపమున ♦ నేడ్చెద విట్లు? మదీయవాక్యముల్
లాలన నాదరింపుము వి ♦ లాసిని! మే లగుమార్గ మిద్దియే
యాల మిఁ కేల యేవొ యడి ♦ యాసల నేటికి వేఁగ, దర్హ మే
బాలిక! పుష్పచాపశర ♦ బాధితునిన్ ననుఁ బ్రోసి పుచ్చఁగన్ ౯౪౪

దురంతతాపమునన్ = అంతములేని సంతాపముచే, మదీయవాక్యముల్ = నామాటలు, లాలనన్ = బుజ్జగింపుతో, ఆలము = ఉపేక్ష, అడియాసలన్ = వ్యర్థమైనయాశలచే, వేఁగెదు = తపించెదవు, పుష్పచాపశరబాధితున్ = మన్మథ బాణములచే బాధపడువానిని.

తా. సంతాపముచే నేడ్చుచుండెదవా, నీ యేడుపునకు నంతములేదు. యావజ్జీవము నీ విట్లు లేడ్చుచుండవలసినదానవే. అటుగాకపోయినా సుందరీ! నీ యోగ్యతకుఁదగిన మంచిమార్గము చెప్పెదను. నామాట లాదరించి వినుము. 'ఇంకను రాముఁడు వచ్చును నన్నుఁ దీసికొని పోవును ఇంకను నాయడవిలో నల్లాడుచుందును' అని యేవో యాసలు పెట్టుకొని యేల వేఁగెదవు? ఇఁక నామాట నుపేక్షసేయకుము. కామబాణములచేఁ బీడితుఁడైన నన్ను బ్రోచిపుచ్చుట నీకుఁ దగునా?

ఉ. ఏ మని యెంచితే కువల ♦ యేక్షణరో శతయోజనాయతం
బై మహితోగ్రరాక్షస స ♦ హస్ర సమావృత మైన లంక? సు
త్రామముఖామరాసురులు ♦ దాయఁగ నైనను లేరు, నాకు సం
గ్రామమునందు యక్షసుర ♦ కాండములున్ సరిరావు బల్మిచేన్. ౯౪౫

కువలయేక్షణరో = ఓ కలువకంటి! శతయోజనాయతము = నూటామడ నిడివిగలది, మహితోగ్రరాక్షస సహస్రసమావృతము = గొప్ప భయంకరులైన వేలకొలఁదిరాక్షసులచే నావరింపఁబడినది. సుత్రామముఖామరాసురులు = ఇంద్రుఁడు మొదలగు దేవతలు, రాక్షసులు, దాయఁగన్ = సమీపింపఁగా, సంగ్రామమునందున్ = యుద్ధమందు, బల్మిచే = బలముచే.

తా. నామగఁ డేలరాఁడు నావి వ్యర్థాశ లెట్లగు నందువేమో విను. నూటామడ నిడివిగలదై వేలకొలఁది భయంకరరాక్షసులు నిండియుండు లంకను నీ వేమి తలఁచితే? నీయూహవంటిదే యనుకొంటివా? ఇంద్రుడు మొదలైన దేవతలు గాని రాక్షసులుగాని సమీపమునకైన రాలేరు. ఇఁక రాముఁడు లంకలోనికి

వచ్చు టెట్లు సాధ్యపడును? సముద్ర మెట్లు దాఁటును? కోట లెట్లు భేదించును? ఇందఱురాక్షసు లూరక చూచుచుందు రని తలఁచితివా? ఒకవేళ వచ్చినాఁడనుకో-యుద్ధమందు యక్షుల దేవతల సమూహములుకూడ బలమునందు నాతో సరిరావు. ఇఁక నొంటిగాఁడు మనుష్యుఁడా వచ్చి నాతో యుద్ధము చేసి గెలువఁగలవాఁడు? కావున నీ కోరికలు గొంతెమ్మకోరికలే.

ఉ. రాముఁడు రాముఁ డంచు నొక ♦ రాజ్యవిహీనుని దీను జోగినిన్
వేమఱు నల్ప తేజుని న ♦ నేకవిధంబులఁ గూర్చి యేడ్చె దో
భామిని! నీకు యోగ్యుఁ డగు ♦ భర్తను నేన, నన్నున్ భజింపుమీ
శ్యామరో! యౌవనంబు సత ♦ మా పిటికీ! ననుఁ గూడు హాయిగన్. ౯౪౬

దీను = దీనుని, జోగినిన్ = జీవనాధారము లేనివానిని, అల్పతేజుని = కొంచెము తేజస్సుగలవానిని.

తా. రాజ్యములేని వానిని, దీనుని, బ్రతుకుమార్గము లేనివానిని, కొంచెపుఁ దేజము గలవానిని, రాముఁడు రాముఁ డని పలుమాఱు తలఁచితలఁచి పెక్కు-తెఱఁగుల నేల యేడ్చెదవు? అట్టివాఁడు నీకుఁ దగినభర్తగాఁడు. నీకుఁదగినభర్తను నేనే. కావున నన్నుఁ బొందుము. చామా! ఓసీ పిటికిదానా! యౌవనము శాశ్వతమా? కాదు. వృథా వయస్సు పోయెనేని యావల నేమి సుఖింపఁ గలవు? కావున నిప్పుడే నన్నుఁ గూడి సుఖింపుము.

ఉ. ఏటికి రిత్తయాస సుద ♦ తీ రఘురామునిఁ జూతు నంచు, ని
చ్చోటు ఘనస్సుచే నయినఁ ♦ జొచ్చి నినుం గన వాని కౌ నటే?
త్రాటను గట్టఁగా వశమె ♦ తన్వి నభోగత వేగితానిరా
ఘాటసదాగతిన్, శిఖిశి ♦ ఖానిచయంబును బట్ట శక్యమే. ౯౪౭

రిత్తయాస = ప్రయోజనములేనియాశ, నభోగత = ఆకాశమందుండు, వేగితానిరాఘాట = వేగముచే నడ్డములేని, సదాగతిన్ = వాయువును, శిఖిశిఖానిచయంబును = అగ్నిజ్వాలల సమూహమును.

తా. రామునిఁ జూచెద నని యింకను నీకు నేల యుత్తయాశ? దేహముతో వచ్చి నిన్నుఁ జూచుట యటుండనీ. మనస్సుతో నైన నిచటికి రాఁగలఁడా? నీ విం దున్నావని తెలియు టెట్లు? తెలిసెనుబో, వచ్చు టెట్లు? ఆకాశమున నతివేగముగా నడ్డములేక వీచువాయువును త్రాటితోఁ గట్టుటకు సాధ్యపడునా! అగ్నిజ్వాలలఁ జేతఁ బట్టుకొన శక్యమా?

ఉ. లోకమునందు లేఁడు విను ♦ లోలవిలోచన మామకీన బా
హాకులపాలిత న్నినుఁ బ ♦ రాక్రమ వృత్తిని నన్ను గెల్చియున్
దోకొనిపోవువాఁడు, విబు ♦ ధుల్ సచరాచర భూతకోటులున్
నీకు సపర్యఁ జేయఁ, దరు ♦ ణీ నను నేలుము రాజ్యభూతితోన్. ౯౪౮

తా. చలించు కన్నులు గలదానా! వినుము. నాభుజసమూహములచేఁ గాపాడఁబడు నిన్ను పరాక్రమముచే నన్ను గెలిచి తీసికొని పోఁగలవాఁడు లోకము నందు లేఁడు. నన్ను రాజ్యసంపదతో నేలితివా దేవతలు చరాచరములైన భూతసంఘములు నీకు సేవచేయుచుండును.

క. శంకాతంకం బేటికి, లంకారాజ్యంబు నెల్ల ♦ లలనా యభిషే
కాంకితవై యేలుము నీ, కింకరుఁగా నన్నుఁ గొనుము ♦ క్రీడలఁ దేలన్. ౯౮౯

శంకాతంకము = సందేహము, భయము.

తా. నీ వేల సందేహించెదవు? ఎవరికి భయపడెదవు? లంకారాజ్యమున కంతయుఁ బట్టాభిషిక్తవై యేలుము. క్రీడించుటకుఁగాను నన్ను నీకింకరుగా నేలుము. నీ వెట్లు చెప్పిన నట్లు వర్తించుచుందును.

క. మును నీ చేసినపాపము, వనవాసాయాసమున ని♦వర్తించెను నీ
వొనరిచినపుణ్యఫలములు, కనకాంగీ నీవు పొందఁ ♦ గాలం బొదవెన్. ౯౯౦

వనవాస + ఆయాసమునన్ = అడవులందువసించి పడినప్రయాసముచే, నివర్తించెను = తీఱెను.

తా. కష్టము లనుభవించినఁ బాపములు క్షయించును. కావున నీవు పూర్వము చేసిన పాపములు కాఱడవులలోఁ గష్టపడుటచే నశించెను. పూర్వము నీవు చేసినపుణ్యములు నీ వనుభవించు కాలము వచ్చెను.

క. ఈచందన మీసరములు, నీచామీకరవిభూష ♦ లిద్దఱి మిచటన్
వాచాఽగోచరసుఖలీ, లాచతురతఁ బూసి ముడిచి ♦ లలి దొడుగుద మే. ౯౯౧

చామీకరవిభూషలు=బంగారుసొమ్ములు, వాచాఽగోచరలీలాచతురతన్ = మాటలచేఁజెప్పసాధ్యముగాని విలాసచాతుర్యముచే, పూసి = గంధముపూసి, ముడిచి = పూలుముడిచి, లలిన్ = అందముగా, తొడగుదమే = భూషణాదులు ధరింతమా.—క్రమాలంకారము.

తా. వాక్కుచేఁ జెప్ప సాధ్యముగాని విలాసచాతుర్యముచే నీ చందనము మన మిరువురము పూసికొందమా! ఈపూలసరములు ముడుతమా! ఈ బంగారు సొమ్ములు ధరింతమా!

వష్టి భాగురిరల్లోప మవాప్యో రుపసర్గయోః। ఆపం చైవ హలంతానాం యథా వాచా నిశా దిశా॥ అని వాచాశబ్దము.

మత్తకోకిలము. ఇంచుఁబోఁడిరో పుష్పకాఖ్యసు ♦ మిద్ధమైనవిమాన మ
భ్యంచదర్కవిభావికాసము ♦ యక్షునగ్రజుఁ బోర ని
ర్జించి తెచ్చితి హృద్యమయ్యెడఁ ♦ జేరి యిద్దఱ మెంతయున్
జంచదిష్టసుఖోపభోగముఁ ♦ జాన! పొందుచు నుందమా. ౯౯౨

ఇంచుఁబోఁడిరో = చెఱకువలె మనోజ్ఞమైనదానా, పుష్పకాఖ్య = పుష్పక

మను పేరుగల, సమిద్ధవిమానము = మిగులఁ బ్రసిద్ధికెక్కిన విమానము, అభ్యంచత్ = అన్నిప్రక్కలఁ బ్రకాశించు, అర్కవిభా = సూర్యకాంతివంటికాంతిచే, వికాసము = విచ్చినట్లుండినది, హృద్యము = మనోజ్ఞమైనది, చంచత్ = ఒప్పుచున్న, ఇష్ట = మనసునకు సరిపడిన సుఖోపభోగముల్ = సుఖానుభవములను.

తా. సీతా! పుష్పక మని ప్రసిద్ధికెక్కిన యీవిమానము నలుప్రక్కల వ్యాపించు సూర్యకాంతివంటి కాంతిగలది. దీనిని మాయన్నయగు కుబేరుని యుద్ధమందు జయించి తెచ్చితిని. ఇది మిగుల మనోజ్ఞమైనది. దీనియందు మన మిద్దఱము గడియ గడియకు మాఱుచున్న క్రొత్తక్రొత్త సుఖభోగముల ననుభవించుచుందము!

మత్తకోకిలము—ర స జ జ భ ర—౧౧వ యింట యతి.

క. వదనము తామరసశ్రీ, సదనము నునుముద్దు గుల్కు ♦ చందము చెడె నీ యదనున రోదనమున నీ, యదవద నెద వదలి నేలు♦మా నన్ను దయన్. ౯౫౩

వదనము = నీముఖము, తామరసశ్రీ = కమలశోభకు, సదనము = స్థానము, అదనునన్ = సమయమందు, రోదనమునన్ = ఏడ్పుచే, అదవదన్ = కలఁతను, ఎదన్ = హృదయమందు.

తా. కమలములకాంతిగల నీముఖము చూచుటకు ముద్దుగుల్కుచుండునది యీ సమయమున నీ వూరక యేడ్చుటచే దానికి సహజవిధము చెడినది. ఈ వ్యాకులత్వము వదలి నన్ను దయతో నేలుము.

క. ఈ రీతి నసురుఁ డాడఁగ, నారీమణి చీరకొంగు ♦ నం దనవదనం బారఁగఁ గప్పుచుఁ గన్నుల, నీ రోడికఁ గట్టు చుండ♦ నిర్వాఱుమండెన్. ౯౫౪

తా. ఈవిధముగ రాక్షసుఁడు తన్నుఁ బలుకఁగా స్త్రీరత్నమగు సీతాదేవి వానికి ముఖము కానరాకుండునట్లు చీరకొంగునఁ బూర్ణముగఁ గప్పి కన్నుల నీరు కాల్వలుగాఁ బ్రవహింప నిండు భయమున నుండెను.

చ. అది గని రావణుం డను ధ♦రాత్మజతో సతి! ధర్మలోపబు ద్ధ్యుదితము సిగ్గు చాలు, వల ♦ దూరక యేడ్వఁగ, ధర్మలోప మిం దెది వచియింపుమీ, కన ఋ ♦ షీశులు దైవకృతానుబంధముల్ మది గణియింప రోటు, విను ♦ మా పలుమాటలిఁకేల మైథిలీ. ౯౫౫

తనముఖమును వాఁడు వర్ణించుటచే నదియును గానరాకుండునట్లు కట్టుకొన్న చీరకొంగున ముఖము మూసికొనఁగా సిగ్గుచే మూసికొన్నట్టు రావణుఁడు తలఁచి చెప్పుచున్నాఁడు.

ధర్మలోపబుద్ధి + ఉదితము = పతివ్రతాధర్మమునకు హాని వచ్చు ననుబుద్ధి వలనఁ గలిగినది, దైవకృతానుబంధముల్ = దైవముచేఁ జేయఁబడిన సంబంధము గణియింపరోటు = లెక్కింపరాదేమి.

పరపూర్వాః స్త్రియ స్త్వన్యా స్సప్తప్రోక్తా స్స్వయంభువా ।
పునర్భూ స్త్రివిధా తాసాం స్వైరిణీతు చతుర్విధా ।
కన్యా వా క్షతయోని ర్వా పాణిగ్రహణదూషితా ।
పునర్భూః ప్రథమా ప్రోక్తా పునస్సంస్కారకర్మణా ।
దేశధర్మా నపేక్ష్య స్త్రీ గురుభిర్యా ప్రదీయతే ।
ఉత్పన్న సాహసాన్యస్మై సా ద్వితీయా ప్రకీర్త్యతే ।
మృతే భర్తరి తు ప్రాప్తా దేవరాదీ నపాస్య యా ।
ఉపగచ్ఛే త్పరం కామా త్సా తృతీయా ప్రకీర్తితా ।
ప్రాప్తా దేశా ద్ధనక్రీతా క్షుత్పిపాసాతురా చ యా ।
త వాహ మిత్యుపగతా సా చతుర్థీ ప్రకీర్తితా ॥—నారదుఁడు.

రెండుమార్లు పెండ్లాడినదానిపేరు పునర్భువు. ఇది మూఁడు విధములు. అందు స్వైరిణి యనునది నాలుగు విధములు. క్షతయోనికాని యక్షతయోని యైన కన్యకాని ముం దొకని బెండ్లాడి వాని వదలి మఱియొకనిఁ బెండ్లాడవేని యది మొదటిపునర్భువు. ఎవతె దేశధర్మముల నలక్ష్యపఱిచి వ్యభిచరించునో దానిని దాని పెద్దవాండ్రు మఱియొకని కిచ్చిరేని యది రెండవది. మగఁడు మరణింపఁగా మఱఁదుల మాటలో నిలువక మఱియొక మగవాని మన్మథవశయై మఱుగునో యది మూఁడవది. ధనమునకుఁ గొన్నదికాని, యాఁకలిదప్పులు సైఁపలేక నా కన్నము పెట్టి భరింపుము నీయొద్ద నుండెదనని భార్యగా నుండునది నాలుగవది. వీరందఱు ఋషిప్రోక్తలే కావున నిం దేదో యొకవిధము ననుసరించి పునర్భువు ధర్మముచొప్పున నన్ను నీవు గ్రహింపవచ్చునని రావణు నభిప్రాయము—గోవిందరాజీయము. అష్టవిధవివాహములలో రాక్షసవివాహము అనఁగా బలాత్కారముగఁ గన్యను గ్రహించుట (కృష్ణుఁడు రుక్మిణిని హరించినట్లు) ఋషులు గణించియే యున్నారు. కావున నేను నిన్ను బలవంతముగాఁ దెచ్చితిని. కావున నీవు నా భార్య వగుట ధర్మవిరుద్ధము గాదు అని రావణు నభిప్రాయము. రాక్షసవివాహము కన్య విషయమైయేగాని వివాహితస్త్రీ విషయము గాదు. ఇట్లు వాఁడు చెప్పుట తమోగుణప్రాధాన్యమున నని మాహేశ్వరతీర్థీయము. ఇంత తమోగుణప్రధానుఁడు సాత్త్విక భక్తుఁ డెట్లు కాఁగలఁడో వా రాలోచించినవారు గారు. ఈ కారణముచేతనే తిలక వ్యాఖ్య వారివాదమును ఖండించెను.

తా. సీతాదేవి తన ముఖమును గప్పుకొనుట చూచి రావణుఁ డామెతో నిట్లనియె. సతీ! పతివ్రతాధర్మము చెడునను నభిప్రాయముతో సిగ్గుపడుచున్నావు. చాలుఁ జాలు. సిగ్గుపడవలసిన పనిలేదు. ఏడువవలసిన పనిలేదు. ధర్మమునకు

లోపము కలిగించు కార్యమిం దేమున్నది? దైవకృతసంబంధమును వివాహము లందు ఋషీశ్వరు లొకటిగా లెక్కింపలేదా! ఏల యూరక యెక్కువ మాటలు!

ఉ. జానకి త్వత్పదాంబుజర ♦ జస్తిలకాన్విత శీర్షయుక్తిఁ బం
 ప్రానన వేఁడువాఁడను, ద ♦ యామతి నేలుము నీదు దాసుఁడన్
 సూనశరార్తిఁ జిక్కి యిటు ♦ శూన్యతరోక్తులు పల్కినాఁడ నో
 మానిని! రావణుండు నొక ♦ మానవతిం బడ మంటి మ్రొక్కునే. ౯౫౬

త్వత్ = నీయొక్క, పదాంబుజ = పాదకమలముల, రజస్ = ధూళియనెడి, తిలకాన్విత = తిలకముతోఁగూడిన, శీర్షయుక్తిన్ = పదితలలతో, సూనశరార్తిన్ = కామబాధచే, శూన్యతరోక్తులు = నీచపుమాటలు, వాఁడు స్త్రీకి నమస్కరించుట వానికే యాశ్చర్యకరముగా నున్నది.

తా. జానకి! నీ పాదధూళి నాశిరస్సున ధరించి నిన్నుఁ బ్రార్థించెదను. నేను నీ దాసుఁడను. దయతో నన్నేలుము. మన్మథతాపమునఁ జిక్కి యీ ప్రకారము నీచపుమాట లాడితిని. నీ పాదములకు నాపదితలలు సోఁక నమస్కరించితిని గాని రావణుఁ డొక యాఁడుదాని కాలు దాఁకి మ్రొక్కునా? ఇందు రసాభాస మని తీర్థీయులు, రసాభాస మనఁగాఁ దనకు నిష్టములేని స్త్రీతోఁ గలియఁ గోరుట.

తోటకము. అని యిాగతిఁ బల్కి ద ♦ శాస్యుఁడు దా
 జనకాత్మజ నాత్మను ♦ సంతసిలెన్
 వనితామణి దక్కెను ♦ నా కిఁకఁ బో
 యని యంతకపాశవ ♦ శాత్ముఁడై. ౯౫౭

అంతకపాశ = యమపాశమునకు, వశ = స్వాధీనపడిన, ఆత్ముఁడై = ప్రాణము గలవాఁడై.

తా. ఈ ప్రకారము సీతను బలికి రావణుఁడు తనలో నీస్త్రీరత్నము నాకుఁ దక్కెను నిజము అని యమపాశములకు వశపడిన వాఁ డగుటచేఁ దలఁచెను.

తోటకము—నాలుగు స గణంబులు. తొమ్మిదవయింట యతి.

—♦ ౫౬-వ సర్గము. సీత రావణునిఁ బరుషోక్తు లాడుట. ♦—

కం. పలలాశనుఁ డిటు పల్కిన, పలుకులు విని సీత దుఃఖ ♦ భరకర్శితయై
 పులుపోఁచ యడ్డముగఁ దాఁ, బలికెన్ నిర్భీతి నసుర ♦ పాలకుతోడన్. ౯౫౮

పలల+అశనుఁడు = మాంసభక్షకుఁడు-రాక్షసుఁడు, దుఃఖభరకర్శితయై = దుఃఖాతిశయముచేఁ జిక్కినదై, పులుపోఁచ = గడ్డిపోఁచ, నిర్భీతిన్ = భయములేక, పతివ్రతలగు స్త్రీలు పరపురుషులతో సాక్షాత్తుగ సంభాషింపరాదు గనుక గడ్డిపోఁచ యడ్డము వైచెను. నీ వీ గడ్డిపోఁచతో సమాన మని భావము. నిర్భీతిన్ = తన పాతివ్రత్యబలముచే వీఁడు త న్నేమియుఁ జేయఁజాలఁ డను ధైర్యముగలదు

కావున భయములేదు. భయము లేనపుడు దుఃఖ మెట్లు వచ్చు ననిన రామవియోగము కలుగుటచేతను, దననిమిత్తమై రామచంద్రుఁ డెంతశోకించుచున్నాఁడో యను కారణముచేతను శోకించెను. ఈవిషయం దిట్టికక్తిగల దని రామచంద్రమూర్తియె నెఱుఁగు నని యుద్ధకాండము ౨౭౧ వ పద్యము.

చ. చెలువల మిన్న ద న్నపుడు శీలమహత్త్వము పేర్మిఁ గాచుకోఁ
గలదని పంక్తికంధరుఁడు కాండధి వేలను బోలె మీఱఁగాఁ
వలతియుగాఁడటంచు నతిఁబాపుఁడు మండెడుమంటపోలికం
దలఁపున నేని ధిక్కృతి యొనర్పఁగ లేఁడని నే నెఱుంగుదుగా.

స్త్రీలతో బలవంతముగా భోగించినచోఁ దలపగిలి చచ్చె నన్న యప్సరస రావణున కిచ్చిన శాపము మనస్సునం దుంచుకొని నిర్భయ యయ్యెను. బలాత్కరించెనా యోగబలముచే నదృశ్యను అస్పృశ్య నగుదును అనుబుద్ధిచే నిర్భయ యని తిలక వ్యాఖ్య.

బలాత్కారమును నిషేధించు శాపము రావణునకుఁ గలదని సీత కిప్పటికిఁ దెలియదు.

సీ. సత్యసంధుఁడు పరి ♦ జ్ఞాత సుస్థిరుఁడును, ధర్మసేతువు నగు ♦ దశరథునకుఁ
బుత్రుండు త్రిభువన ♦ పూజ్యుండు రాముండు, విశ్రుతనాముండు ♦ విపుల నేత్రుఁ
డాయతబాహుఁ డ ♦ త్యంతధర్మాత్ముండు, ప్రాణవిభుండు దైవంబు సుమ్ము
నిన్నుఁ జంపఁగ నున్న ♦ నిస్తులవీరుఁడు, సహాలక్ష్మణుఁడు హరి ♦ స్కంధుఁ డాతఁ

తే. డవని జనియించె నిక్ష్వాకు♦నన్వయమున, నేమియో ప్రేలెదవు రాముఁ♦ నెదుటనీవు
నన్నుఁ జెనకియుయుండిన ♦ నిన్ను నంద, ధరకు బలిపెట్టియుండఁడే ♦ ఖరునిమాడ్కి.

సత్యసంధుఁడు = సత్యప్రతిజ్ఞగలవాఁడు, సత్యమే మేరగాఁగలవాఁడు, పరిజ్ఞాత = లోకప్రసిద్ధుఁడు, ధర్మసేతువు = ధర్మముయొక్క మర్యాద చెడనీయక నిలువువాఁడు, ధర్మమునకు సేతువు = అనకట్ట = ఏటిలో నీళ్లు వ్యర్థముగాఁ బోకుండ నిలువునది యనకట్ట కావున నట్టులే యాయన ధర్మము చెడకుండ రక్షించువాఁడు (౨) ధర్మమును సేతువుగాఁ గలవాఁడు ధర్మసేతువు. దాఁటరానియేఁటికి నీ ప్రక్కజను లావలికిఁ బోవుటకై సేతువు నిర్మింపఁబడును. కావున సంసారనది తరించుటకు ధర్మమును సేతువుగాఁ గలవాఁడు. ఇట్టివాని కోడలనయియుండి యెట్టులధర్మకార్యమును జేయుదును? దీనివలన నొకకార్యము చేయువారు తమవలనఁ బూర్వుల కపకీర్తి పాపము రాకుండునట్లు కనిపెట్టవలయు నని భావము. పరుల కపకీర్తి నరకబాధ వచ్చుకార్య మెవరును జేయరాదు. దైవంబుసుమ్ము = నాకు మాత్రమే కాదు సర్వలోకములకు. ఇట్టివాని భార్య నే నెట్లు చేయరానిపని చేయఁగలను? నిన్ను జంపఁగ నున్న నిస్తులవీరుఁడు = నిన్ను నెప్పుడెపుడు చంపుదునా దానికిసమయము దొరకునా యని యుండువాఁడు, హరిస్కంధుఁడు = సింహము

మాఁపురములవంటి మాఁపురములు గలవాఁడు, అపసి జపియించె స్వేక్ష్వాకు నన్వయమున=ఏయిక్ష్వాకువంశమునఁ బుట్టినయనరణ్యుఁడు నిన్నుఁజంపునని శపించెనో యావంశమున నాకార్యమునకై పుట్టినవాఁడు, ప్రేలెదవు = వదరెదవు. రాముఁడు దేవెయని, దీనుఁడని, దుర్బలుఁడని మనుష్యుఁ డని రావణుఁ డన్నమాటల కిది ప్రత్యుత్తరము.

తా. ఓరీ! నీవు దిక్కులేని దానిని శీలహీనను బలికినట్లు పలుకుచున్నావు. నన్ను నీ వేమని తలఁచితివిరా? సత్యప్రతిజ్ఞ కలవాఁడును, సత్యము మేరగాఁ గలిగి దానిని దాఁటనివాఁడును, ధర్మాత్ముఁడని జగత్ప్రసిద్ధుఁడును, ధర్మమందు నిలుకడ గలవాఁడును, ధర్మమున కనకట్ట యయి ధర్మమే తరణోపాయముగాఁ గలవాని కోడలను-నీ వొక్కరథము మీఁద నొక్కదిక్కునఁ బోఁగలవాఁడవు, ఆయన పది దిక్కులఁ బోఁగలవాఁడు. ఒక్క తేరిని నడపినట్లు పదితేరుల నేకకాలంబున నడపఁ గలవాఁడు. అట్లైనఁ బండితపుత్రుఁ డన్నట్లు రాముఁడు శూరపుత్రుఁ డని యందువా? ఆయనకొడుకు రామచంద్రుఁడు ముల్లోకములందుఁ బూజ్యుఁడు. నీవలె భయముచేఁ గాదు, భక్తిచేఁ బూజ్యుఁడు. కొందఱిచేత మాత్రమే కాదు. దేవ మనుష్య తిర్యగ్బాల వృద్ధ స్త్రీ పురుష పశు పక్ష్యాదులచేతను బూజ్యుఁడు. రాముఁ డని ప్రసిద్ధి కెక్కినవాఁడు. నీవో హింసించి బాధించి రావణుఁ డని ప్రసిద్ధి కెక్కినవాఁడవు. ఆయనయో రమింపఁజేసి రమించి రాముఁ డని ప్రసిద్ధి కెక్కినవాఁడు. విశాలములయిన నేత్రములు గలవాఁడు. నీవలె భయంకరము లైన మిడిగ్రుడ్లు గలవాఁడుకాఁడు. దీర్ఘములైన బాహువులు గలవాఁడు, ఆయనచేతులు చూడఁగానే యెట్టివారికైన నీయన మహాపురుషుఁ డను నభిప్రాయము గలిగించువాఁడు, నీవలె తుట్టపురుగులవలె విశేషహస్తమస్తక పాదములు గలవాఁడుకాఁడు. మిక్కిలి ధర్మస్వరూపుఁడు. నీవలె ధర్మవిరుద్ధస్వభావుఁడు కాఁడు. నాకుఁ బ్రాణవిభుండు, నా ప్రాణములకు నధిపతి, నా ప్రాణము లాయనస్వాధీనమందు ఆయనధారణ పోషణములకు లోపడియున్నవి. నా ప్రాణములపై విభుత్వము నాకును లేదు. కావున నే నాయనసొత్తు. దీనిని మఱియొకరి స్వాధీనముచేయు నధికారము నాకు లేదు. దీనిని బోఁగొట్టుకొనుట కాపాడుకొనుట యాయనకార్యము. నీవనుకూలుఁడవైతివా నాకువలె నీకును ప్రాణవిభుఁడే, కాక ప్రతికూలించితివా నీకుఁ బ్రాణవిభుఁడే. యముఁడు (ఇచ్చటఁ బ్రాణవిభుశబ్దము జీవితేశశబ్దపర్యాయముగా గ్రహింపవలయును. భవేత్ప్రియే జీవితేశో నాయమే నానా॥ర॥ (ప్రాణములుదీయువాఁడు యముఁడే కదా) కాఁబట్టియే దైవము. నాకు మాత్రమే కాదు నీకును. కావున నీ వాయనను బూజింపవలయును గాని ధిక్కరించి చెడిపోరాదు. నీవు మొదటినుండి యాయనను ధిక్కరించుచున్నాఁడవు కావున నిన్నుఁ జంపుటకై యుండు నసమానశౌర్యముగలవాఁడు, చిచ్చునకుఁ

దోఁడు కరువలి వచ్చినక్రియ లక్ష్మణునితోఁ గూడియుండువాఁడు. ఆయన దరిద్రుఁ డంటివి. కాఁడు, సర్వదా సలక్ష్మీకుఁడు. (చిహ్నానామ్నోస్సలక్ష్మీకే సౌమిత్రౌ సారస స్త్రియాం అని నానా॥ ర॥ లక్ష్మి యాయనను విడిచియుండదు. ఎట్లు తెలియ వలె నందు వేమో? స + హ + లక్ష్మణుఁడు = పరబ్రహ్మలక్షణమువంటి లక్షణ ములు గలవాఁడు. పరబ్రహ్మలక్షణములు పరబ్రహ్మమందుఁ గాక మఱియెందుండును ? పరబ్రహ్మ మంత్రణమో. ॥నానా॥ సింహము మూఁపురములవంటి మూఁపురములు గలవాఁడు కావున సింహము క్షుద్రమృగమును జూచునట్లు నిన్నుఁ జూచును. అట్టి దైవము, లక్ష్మీవంతుఁడు, వైకుంఠమున నుండక యిక్కడి కేల వచ్చెనందువా ? అనరణ్యుని శాపప్రకారము నిన్నుఁ జంపుటకే యిక్ష్వాకువంశమునఁ బుట్టెను. ఈ విషయములు దెలియక యేమేమో వదరెదవు. అట్లయిన నన్నేల యింతవఱకుఁ జంపరాలే దందువా ? నెపమునకై కాచి యున్నాఁడు. నన్ను నీవాయనయెదుట దాఁకియుండిన ఖరుని బలిపెట్టినట్లు నిన్ను నేలకు బలియిచ్చియుండును. ఎదుటఁ బడ లేదు, కావున బ్రతికియున్నావు. ఎదుటఁ బడినఁ జచ్చినవాఁడ వనియే నమ్ముము.

ఉ. భీకరరూప మంచుఁ బటు ♦ భీమబలాఢ్య మటంచు రాక్షసా
నీకము నన్నె దీ విచట ♦ నిర్విష మూచును దార్క్ష్యు మ్రోల ద
ర్వీకరరాజి యట్లు తల ♦ వ్రేలఁగ వైచి పడుఁ మదీశచా
మీకరపుంఖ బాణతతి ♦ మ్రింగఁగ వీచులు గంగయొడ్డునన్. ౯౬౦

భీకరరూపము = భయము కలిగించు నాకారము గలది, పటుభీమబలాఢ్యము = దృఢమై భయంకరమైన బలముయొక్క యతిశయము గలది, రాక్షసానీకము = రాక్షససేన, నిర్విషము = నిర్గతవిషము, పోయినవిషముగలది. తార్క్ష్యుమ్రోలన్ = గరుత్మంతునియెదుట, దర్వీకరరాజి = పాములగుంపు, మత్ + ఈశ = నా భర్తయొక్క, చామీకరపుంఖ = బంగారుపిడులుగల, బాణతతి = బాణముల సమూహము, వీచులు = అలలు.

తా. నాతోరాక్షససేన భయంకరాకారము గలది, దృఢమై భయంకర మైన బలముగలది యని యాఁడుది యగు నా యెదుట నిచ్చట నీ మూలయింట్లో గేహేశూరుఁడవై ప్రజ్ఞలు పలికెదవు. నీ సేనాబలము భయంకరత్వ మెంతవఱకు ? గరుత్మంతుని కంటఁబడువఱకేకదా పాములభయంకరత్వము బలము. ఆవలఁ దల వంచుకొని నేలఁబడునుగదా. అట్టులే నీ బలమంతయు నా భర్త ప్రయోగించు బంగారుపిడులుగల బాణములు గంగానది యల లొడ్డును మ్రింగినట్లు నీ సేనను మ్రింగును.

చ. వరమున దేవదైత్యులక ♦ వధ్యుఁడ వైనను నాదుభర్త కాఁ
కరమును గల్గఁ జేసి బ్రదు ♦ కన్ వశమా రణసీమ నీకు, న

ధ్వరమున యూపబద్ధపశు ♦ భంగిని నీవు మనంగఁ జాల వా
శరవర! రామభీకరని ♦ శాతశరాళికి గోచరుండవై. ౯౬౧

అవధ్యుఁడవు = చంపరానివాఁడవు, ఆఁకరము = ఆగ్రహము, అధ్వరమునన్ = యజ్ఞమందు, యూపబద్ధపశుభంగిని = యూపస్తంభమునకుఁ గట్టఁబడిన పశువువలె, మనంగఁజాలవు = బ్రతుకలేవు, ఆశరవర = రాక్షసశ్రేష్ఠుఁడా! రామ= శ్రీరామునియొక్క, భీకర = భయంకరమైన, నిశాత = పదునైన, శరాళికిన్ = బాణసమూహమునకు, గోచరుండవై = కనఁబడినవాఁడవై.

తా. నీవు వరబలమున దేవతలచే దైత్యులచేఁ జావకపోదువుగాక. నాభర్తకుఁ గోపము వచ్చినట్లు చేసితివేని యుద్ధమందు నాభర్తచేఁ జావకుండ నావరములు కాపాడఁజాలవు. నాభర్త దేవదైత్యుల తెగలలోఁ జేరినవాఁడు కాఁడు. నామగఁడు సంకల్పించెనేని నీకు వరము లిచ్చిన బ్రహ్మరుద్రాదులను గూడఁ జంపఁగలఁడు. ఇఁక వారివరములు నిన్నేమి కాపాడఁగలవు? అదియును గాక మనుష్యులచేఁ జావనట్లు నీకు వరము లేదుకదా. కావున యజ్ఞమందు యూపస్తంభమునకుఁ గట్టఁబడిన పశువు చచ్చుట యెట్లు సిద్ధమో నామీఁద మనస్సు పెట్టిన నీవు చచ్చుట సిద్ధము. రామబాణముల బారిఁబడి నీవా బ్రతుకఁగలవాఁడవు?

కం. రాక్షస! క్రోధోద్దీపిత, చక్షువులన్ నిన్ను రామ ♦ చంద్రవిభుండున్
వీక్షించిన దగ్ధుఁడవై, నిక్షితిఁ దత్క్షణము కూల ♦ వే నీచమతీ. ౯౬౨

తా. నీచబుద్ధిగలరాక్షసా! రామచంద్రమూర్తి కోపముచే మండుచున్న కన్నులఁ జూచినంతమాత్రముచేతనే యానిమిషమునందే కాలి నేలఁబడవా? కుక్కను గొట్టను బచ్చెనకోల కావలయునా, యన్నట్లు నిన్నుఁ జంపుటకు బాణప్రయోగములు కావలయునా?

శా. ప్రాలేయాంశుకబింబమున్ వసుమతిం ♦ బాతంబుఁ గావించు, దో
ర్లీల న్నాశము నైనఁ జేయు జలధిం ♦ గ్రీడాగతిన్ శోషిలన్
హేలారీతిని జేయఁజాలు ఘనుఁ డా ♦ నిస్తుల్యవీర్యుండు ప్రో
యాలిన్ రక్తను బందినుండి విడఁ జే ♦ యం జాలఁడే రక్కసా. ౯౬౩

సముద్రము దాఁటి రాముఁ డెట్లు రాఁగలఁ డను రావణుమాటకు సీతాదేవి ప్రత్యుత్తర మిచ్చుచున్నది.

ప్రాలేయాంశుకబింబమున్ = చంద్రబింబమును, వసుమతిన్ = భూమిమీఁద, పాతంబుఁగావించున్ = పడునట్లుచేయును. ౧౧౧౩ పద్యము చూడుఁడు. దోర్లీలన్ = భుజబలవిలాసముచే, జలధిన్ = సముద్రమును, శోషిలన్ = ఎండునట్లు, హేలారీతిని = అవలీలగా, చేయఁజాలును = చేయశక్తిగలవాఁడు. యుద్ధకాండము ౪౪౪ పద్యము చూడుఁడు. పద్భ్యాం యాంతు ప్లవంగమాః వానరులు

కాలినడకతోఁ బోదురుగాక యని రామచంద్రమూర్తి చెప్పెనుగదా. నిస్తుల్య = సమానములేని, వీర్యుండు = శౌర్యముగలవాఁడు, ప్రోయాలిన్ = ఇల్లాలు, ప్రోలు + ఆలు—ప్రోయాలు. పురశబ్దభవము ప్రోలు, తద్భవమున నర్థభేదము. రక్తను = తనయం దనురాగముగల దానిని, బంది = చెఱ, విడఁజేయంజాలఁడే = విడిపింప లేఁడా!

తా. నీ బలపరాక్రమముల గుఱించి నీవు చెప్పినవి దంభవాక్యములు. వాస్తవము చెప్పెదను విను. రామచంద్రమూర్తికిఁ గోపమువచ్చినా చంద్రునైన నేలఁ బడఁగొట్టును. రూపము కానరాకుండనైన భుజబలముచేఁ జేయఁగలఁడు. సముద్రము నాటవోలె నెండింపఁగలఁడు. అటువంటి యసమానబలుఁ డీతుచ్ఛసముద్రమును దాఁటి వచ్చి తనయం దనురాగముగల తన యిల్లాలిని జెఱనుండి విడిపింపలేఁ డని తలఁచితివటరా, రాక్షసా! అవశ్యము విడిపించును.

కం. గతరముఁడవును గతాయువు, గతేంద్రియుఁడు గతబలుఁడవు ♦ కావుట ఖల నీ
కతమున వైధవ్యంబునఁ, గుతిలపడున్ లంక యేటి ♦ కో యీపోగరున్. ౧౨

నా యైశ్వర్యము చూడు, నా యిండ్లు మేడలు పట్టనము చూడు నుసిన మాటకుఁ బ్రత్యుత్తర మిచ్చుచున్నది.

నీవుగతరముఁడవు = తొలఁగిపోయిన లక్ష్మికలవాఁడవు, నాభర్త రమాగతుఁడు. నీవు గతాయువు = క్షీణించిన యాయువు గలవాఁడవు, ఏకపత్నీవ్రతుఁడైన నాభర్త దీర్ఘాయుష్మంతుఁడు. గతేంద్రియుఁడవు. నీవు స్త్రీవ్యసనాసక్తుఁడవు కావున నింద్రియబలము క్షీణించినవాఁడవు. నాభర్త జితేంద్రియుఁడు. నీవు గతబలుఁడవు = ఆకారణముచేతనే నీవు బలహీనుఁడవు. నా భర్త బలయుతుఁడు. కావుటన్ = అయినకారణముచే, ఖల = దుష్టుఁడా, నీకతమునన్ = నీవు కారణముగా, లంక - వైధవ్యంబునన్ = విధవాత్వముచే, భర్తలేనిదై. ఇక్కడ లంకయనఁగా లక్షణచే లంకాపురస్త్రీలు విధవలగుదురని భావము. కుతిలపడున్ = బాధపడును. "ఆయుర్బలం యశోలక్ష్మీః పరదారాభిమర్శనాత్, సద్యఏవ వినశ్యంతి" యను స్మృతివాక్యము గ్రహింపనగు.

తా. నీ యైశ్వర్యము, నీ గృహములు, లంక నీకింకను గల దని నన్నాశగొలిపెదవు. ఎప్పుడు నీవు పరస్త్రీని కామదృష్టి స్పృశించితివో యప్పుడే నీసంపద నాశము. ఆయుస్సు ఇంద్రియబలము దేహబలము సర్వము నాశమైనదని తలంపుము. నీకారణమున లంకాపురము పతిలేని దగును. అందలి స్త్రీలు విధవ లగుదురు. ఇంతమాత్రమునకా యీపొగరు. వినాశకాలము సమీపించినను పొగరుచేఁ దెలిసికొనలేక యున్నావు. ఎంత మూఢుఁడవురా!

కం. నాపతిపార్శ్వంబును నెడఁ, బావుటచే నన్ను నబలఁ ♦ బాపాత్మ యీ
పాపంబు సుఖోదర్కం, బేపాటియుఁ గాదు చూడు ♦ మీ నీ కిటులున్. ౧౩

అబలన్ = అల్పబలముగలదానను, స్సుఖోదర్కంబు = ముందుసుఖమిచ్చునది, ఏపాటియున్ = ఏమాత్రము, ఎటులు – కళ్ళైనను అర్థవిశేషము మఱిన్, లేకన్, ఉండిన్, మొదలగువానివలెను వర్ణము వచ్చెను.

తా. అల్పబలముగల నన్ను నాభర్తయొద్దనుండి యెడఁబాపుటచే పాపాత్ముఁడా నీపాపము నీకుఁ గొంచెమైనను సుఖము గలిగింపఁజాలదు. చూచుచుండుము.

ఉ. దైవబలంబుఁ గల్గు మహి ♦ తద్యుతిమంతుఁడు ధర్మశీలి స
ద్భావుఁడు నిర్భయుండు వితత ♦ త ప్రతిమానవిహీనశౌరతన్
గేవలుఁ డుగ్రసత్త్వమృగ ♦ కీర్ణమహాటవి నున్నవాఁడు రా
రావణ బాణవర్షమునఁ ♦ గ్రక్కఁగఁ జేయు భవద్బలోద్ధతుల్. ౯౬

మహితద్యుతిమంతుఁడు = గొప్పకాంతిగలవాఁడు, వితత = విస్తారమైన, ప్రతిమానవిహీన = అసమానమైన, శౌరతన్ = శౌర్యముచే, కేవలుఁడు = అద్వితీయుఁడు, అటువంటివాఁడు రెండవవాఁడు లేనివాఁడు. ఉగ్రసత్త్వ మృగకీర్ణమహాటవిన్ = భయంకరమైన బలముగల మృగములచే వ్యాపించిన పెద్ద యడవియందు, భవత్ = నీ, బలోద్ధతుల్ = బలగర్వములను.

తా. నామగనికి దేహబలమే కాదు, దైవబలము గలదు. కావున మిక్కిలి తేజస్సు గలవాఁడు. నీకు దైవబలము లేదు. కావునఁ దేజస్సు లేదు. నీవు చెప్పిన దేబె, జోగి నీవే కాని రామచంద్రుఁడు కాఁడని వానిమాట కిది సమాధానము. ధర్మయుక్తమైన నడవడిగలవాఁడు. మంచిమనస్సుగలవాఁడు. భయమెట్టిదో యెఱుఁగనివాఁడు. విస్తారమై యసమానమైన శౌర్యమునందు నంతటివాఁడు వేఱొకఁడు లేనివాఁడు. భయంకరములైన మృగములచే నిండినయడవియం దున్నాఁడు. నీబలమును నీగర్వమును బాణవర్షమున గ్రక్కించును, ప్రతిమానవిహీనుఁ డనుటచేతనే కేవలత్వము బోధపడుచుండ మరల కేవలుఁ డనుట పునరుక్తికాదా యని శంకింపరాదు. "ఏక మే వాద్వితీయం బ్రహ్మ" అనుచో నన్వయించిన ట్లన్వయింపవలెను. కేవలశబ్ద మేకత్వమును, ప్రతిమానవిహీనుఁ డనుట అద్వితీయత్వమును బోధించెడిని. అట్టివాఁ డాయన యొకఁడే కాని రెండవవాఁడు లేఁ డనుట.

కం. కాలవశులైన పురుషులు, కాలప్రేరణముఁ జేసి ♦ కార్యములందున్
జాలఁ బ్రమాదము పడుదురు, మే లని దుష్కార్యములను ♦ మేకొంద్రు సుమీ.

కాలవశులు = మృత్యువునకు నధీనపడినవారు, ప్రమాదము = పొరపాటు, మేకొంద్రు = అంగీకరింతురు.

తా. మృత్యువు సమీపించినవారు కాలప్రేరణముచేత వారువారు చేయఁదగు కార్యములందు హెచ్చరికదప్పినవారై చేయరాని చెడుకార్యములవలన మే లున్న దని యవి చేయ నంగీకరింతురు.

కం. అట్టివినాశపుఁగాలము, పుట్టెం జుమి నీకు నసుర♦పుంజములకు నీ
గట్టికొని యున్నసతులకు, నిట్టు నను నీవు బల్మి♦నిటఁ దెచ్చుటచేన్. ౯౬౮

అసురపుంజములకున్ = రాక్షససమూహములకు.

తా. ఆ విధముగా నాశమై పోవుకాలము, నీకు రాక్షససమూహమునకు నిన్నుఁ గట్టుకొన్న స్త్రీలకు నీవు నన్ను బలవంతముగాఁ దెచ్చుటచే, నేఁకాలమునఁ గలిగెను.

తే. క్రతువుమధ్యంబునందు స్రు♦గ్భాండమండితంబు బ్రాహ్మణమంత్రపూ ♦ తంబు వేది
మాలఁ డంటఁగ వశమె యా♦లీల సతిని, రామపత్నిని నన్ జూడ♦రా దురాత్మ.

క్రతువు = యజ్ఞము, స్రుగ్భాండమండితంబు = స్రుక్కులు మొదలగు నుపకరణములచే నలంకరింపఁబడినది, బ్రాహ్మణమంత్రపూతంబు = బ్రాహ్మణు లుచ్చరించు వేదమంత్రములచేఁ బవిత్రమైనది, వేది = తిన్నెను, సతిని = పతివ్రతను, రామపత్నిని = రామచంద్రమూర్తి భార్యను, దురాత్మ = చెడుమనస్సు గలవాఁడా!

తా. యజ్ఞశాలమధ్యమున స్రుక్కులు మొదలగు నుపకరణములుగల పాత్రముచే నలంకరింపఁబడి వేదమంత్రములచే బ్రాహ్మణులచే పవిత్రము చేయఁబడిన వేదిని మాలవాఁడు తాఁక వశమా? ఆ విధముగ పతివ్రతను రాముభార్యనైన నన్ను వేదినిగాను నిన్ను మాలవాఁడుగాను నెంచుకొనుము.

ఆ. ధర్మనిత్యుఁడైన ♦ దశరథ సుతవర్యు, ధర్మపత్ని సాధ్విఁ ♦ దం మె నీకు
రాక్షసాధముండ♦యాక్షదుశ్చరితుండ, పాపి నన్నుఁ దాఁక♦శాలితుండ! ౯౭౦

తా. ధర్మము విడనాడని దశరథకుమారుని ధర్మపత్నినై పతివ్రతనైన నన్ను రాక్షసాధముండా! పాపుండా! దుష్టచరితుండా! మూఢుండా! నీవు తాఁక సాధ్యమా?

కం. అరవిందబృందముల నన,వరతము రాయంచతోడ ♦ వర కేళీత
త్పర యగుహంసాంగన యే,కరణిఁ దృణస్థంబు నీరు ♦ కాకిని గనదీన్. ౯౭౧

అరవిందబృందములన్ = కమలసమూహములందు, అనవరతము = ఎల్లప్పుడు, రా+అంచ = రాజహంస, హంసాంగన = ఆఁడుహంస, ఏకరణిన్ = ఏ విధముగ, తృణస్థంబు = గడ్డిలోనుండు.

తా. తామరలసమూహమందు రాజహంసతో నెల్లవేళల విలాసముగాఁ గ్రీడించు నాఁడుహంస యేవిధమున గడ్డిలోఁదిరుగు నీరుకాకిని జూడఁగలదు?

చ. తనువు విసంజ్ఞ మియ్యది మ♦దంబునఁ గట్టెదవేని కట్టుమీ
కనలునఁ దిందు వేని తిను ♦ కా దనుదానను గాను, నాకు నీ
తనువును జీవితం బయిన ♦ దానవ! రక్ష్యము గాదు రోరి, నా
మన మిది మద్వశంబ యవ ♦ మానము పాల్పడ నొల్ల నమ్ముమీ. ౯౭౨

తనువు = దేహము, విసంజ్ఞము = జడము, మదంబునన్ = గర్వముచే,

కనలునన్ = కోపముచే, రక్ష్యము = రక్షింపఁదగినది, మనము = మనస్సు, మద్వశంబ = నాయధీనము.

తా. ఓరీ! నీవలన నేను జెడను. నాకా భయములేదు. నాభర్త యిచ్చటికి రానే వచ్చును. నిన్ను జంపనే చంపును. లంక నాశముచేయనే చేయును. ఇది నిశ్చయము. నీకు నేను భయపడను. వశపడను. నీమగఁడెప్పుడో వచ్చును. నిన్ను రక్షించు వనికదా యనెదవు. ఇప్పుడే నిన్ను నఱకిపాఱవైచిన నేమిచేసెదవు అనెదవా? వినుము. ఈదేహము జడము. దీనిని గర్వించి కట్టెదవా కట్టుము. కోపించి తినెదవా తినుము. నేను వలదనను. ఏలయందువా? దానివలన నా కేహానియు లేదు. ఈదేహము నేను రక్షింపవలసినది కాదు. ఉన్నను బోయినను సంతోషములేదు వ్యసనములేదు. ఇఁక నేదిపోయిన వ్యసన మందువా? నా దేహము చెడిన నేను జెడను. నామనస్సు చెడిన నేను జెడుదును. నామనస్సు నా స్వాధీనమం దున్నది. దానిని నీ వేమియుఁ జేయఁజాలవు. మనస్సు నన్నులకు వశపఱచి యవమానపడ నొల్లను.

కం. అని పరుసంబుగ వాకొని, కనరున మఱియేమి యనక ♦ తూష్ణీకస్థక యుం
డిన నసురుఁడు భయసంద, ర్శనముగ మండుచును ననియె ♦ సస్మితవదనా. ౯౨౩

పరుసంబుగన్ = కఠినముగ, వాకొని = చెప్పి, కనరునన్ = కోపముచే, భయసందర్శనముగ = భయముకలుగునట్లు, సస్మితవదనా = చిఱునవ్వుతోడిముఖముగలదానా! కొందఱియం దేడుపు ముఖము లెట్లుసహజములో కొందఱియందు నవ్వుముఖము లట్లు సహజమగును. అట్లు చెప్పిన మాటయేకాని యీదశయందామె నవ్వుచుండిన దని భావముగాదు. అదియునుగాక యామెముఖము గుడ్డచేఁ గప్పుకొనియుండఁగా నది యెట్లుండినది వాని కెట్లు తెలిసెను?

తా. ఈప్రకారము కఠినముగ మాటలాడి కోపముచే నేమియుఁ బలుకక సీతాదేవి యూరకుండెను. అప్పుడు రాక్షసుఁ డామెకు భయము కలుగునట్లు మండి పడుచు నిట్లనియె. ఓసి నవ్వుమోముదానా!

—♦ రావణుఁడు సీతమీఁద రాక్షసస్త్రీల కావలియుంచుట. ♦—

మ. విను సీతా పదిరెండుమాసములలో ♦ విశ్వాసపూర్వంబుగా
ననుఁ గామింపఁగఁ గోరవేనియును నంతం బ్రాతరాశార్థమై
నిను నావంటలవారు తున్కలుగ ఖండింపంగలా రంచు న
ద్దనుజుం డచ్చటికాపుకత్తెల కనున్ ♦ దైత్యాంగనల్ వింటిరా. ౯౨౪

తా. సీతా! వినుము. ఇఁక పండ్రెండుమాసములలో నీవు నాయందు విశ్వాసము గలదానవై నన్నుఁ గామింపకపోయితివా పండ్రెండునెలలు వెళ్లఁగానే (ప్రాతరాశార్థము) ఉదయమున భోజనమునకై నావంటలవారు నిన్ను ముక్కలుగఁ గోసి

వందుదురు. అని చెప్పి యచ్చటి కాపున్న స్త్రీలను జూచి ఓరాక్షసాంగనలారా! విన్నారా?

ఒకరాజు మఱొకరాజును జయించి యతని స్త్రీలను చెఱగొననేని పండ్రెండు నెలలు గడు వియ్యవలయు ననియు-ఆలోపల వారిమగలు వారిని విడిపించుకొనిపోవ లేని వారు చెఱపెట్టిన రాజుస్త్రీలే యగుదురని భారతమున శాంతిపర్వమున రాజనీతిపర్వమందుఁ గలదు.

ఇది జ్యేష్ఠమాసము. రామరావణయుద్ధము ఫాల్గునమాసమునందుఁ గృష్ణపక్షమున:- హనుమంతుఁడు సీతాదేవిని దర్శించినది ఫాల్గునారంభమున, అప్పటి కది పదియవ నెల జరుగుచున్న దని సీతాదేవి హనుమంతునితోఁ జెప్పెను. కావున రావణుఁడు సీతను హరించినది జ్యేష్ఠమాస మని యేర్పడుచున్నది. హేమంతవర్ణనము నకు-శూర్పణఖాగమనమునకు సంబంధములేదు. అది రామచంద్రమూర్తి తపోవిధము దెలుప వర్ణింపఁబడెను. ఇచ్చట గోవిందరాజీయమందు సీతాపహరణము చైత్రమాసమున ననియు పంచవటీవాసము మూఁడుసంవత్సరము లనియు వ్రాయఁబడినది. ఈ విషయము ముందు చర్చింపఁబడును.

ఉ. దింపుఁడు దీనిక్రొవ్వు కసి ♦ దీఱఁగ నంచు వచింప వారు నై
లింపవిరోధిఁ జూచి ముకు ♦ లింపఁ గరంబులు పాదఘట్టనో
త్కంపితభూమిభాగుఁ డయి ♦ దానవనాథుఁడు దీని నిష్ఠ నా
పంపునఁ గొంచుఁ బొండు నవ ♦ పల్లవపుష్పలతావికీర్ణమై. ౯౨౫

కసి = కోపము, నైలింపవిరోధి = దేవతాసమూహముల శత్రువు, ముకులింపఁగ = మోడ్పఁగా, పాదఘట్టన = కాలిత్రొక్కుడులచే, ఉత్కంపిత = మిగుల వణఁకుచున్న, భూమిభాగుఁడయి=భూమిప్రదేశముగలవాఁడయి, పంపునఁగ = ఆజ్ఞచే, నవ + పల్లవ + పుష్ప + లతా + వికీర్ణమై = క్రొత్తలగు చిగుళ్ళు పూలు గల తీఁగలచే నిండినదై.

తా. నా కోపము చల్లారునట్లు దీనిక్రొవ్వు దిగఁజేయుఁడు అని చెప్పఁగా వా రంగీకారసూచకముగ నమస్కరించిరి. అంతట వాఁడు భూమి యదరునట్లు కాలితో నేల తన్నుచు రావణుఁడు దీని నిప్పుడే క్రొత్తచిగుళ్లు పూలు గల తీఁగలచే నిండినదై.

కం. మానిత మైన యశోకో, ద్యానమునకు నంద మీర ♦ యనవరతము ర
క్షోనియతి నుండి యీవన,జానన నరయుండు కడు ర ♦ హస్యముగాఁగన్. ౯౨౬

మానితము = గౌరవింపఁబడినదైన, అశోకోద్యానమునకున్ = అశోకవృక్షములు విశేషముగాఁగల ప్రమదావనమునకు. అశోకము మన్మథోద్దీపనము కావున నచ్చటికిఁ దీసికొని పొమ్మనెను. అనవరతము = ఎల్లవేళ, రక్షోనియతి = కాపాడు నేర్పాటునందు, అరయుండు = కనిపెట్టియుండుఁడు.

తా. గౌరవింపఁబడు నశోకవనమునకుఁ దీసికొనిపోయి యచ్చట నీమె

నుంచి యెల్లవేళ విడువక యీమె చేష్టలను మిగుల రహస్యముగాఁ గనిపెట్టి యుండుఁడు.

తే. ఘోరదర్శనలార వి ♦ కారరూప, లార మాంసాస్రభోజన ♦ లార సతిని
బెదిదములనొండె మెత్తని ♦ నుడులనొండె, వశమునకుఁదెండు వనగజ♦వధువునట్లు.

తా. భయంకరములగు చూపులుగలవారలారా! వికారములగు రూపములు గలవారలారా! మాంసము నెత్తు రాహారముగఁ గలవారలారా! ఈ స్త్రీని బెదరింపుమాటలచేఁ గాని మంచిమాటలచేఁగాని యడవియేనుంగును మచ్చికపఱచు కొనునట్లు నాకు స్వాధీనపడఁ జేయుఁడు.

కం. అని చనిన నసురవనితలు, జనకసుతం దోడుకొనుచుఁ ♦ జని రనవరతం
బును సర్వకాలఫలపు,ష్ప నికరములు గల యశోక ♦ వనతలమునకున్. ౯౭౮

అనవరతంబును = సర్వదా, సర్వకాల = అన్నికాలములయందలి, ఫలపుష్ప నికరములు = పండ్లయుఁ బూవులయు సమూహములు.

తా. ఈ ప్రకారము చెప్పి రావణుఁడు పోఁగా రాక్షసస్త్రీలు సీతాదేవిని దోడుకొని సదా యన్ని ఋతువుల పండ్లుపూలు గుంపులుగుంపులుగాఁ గల యశోక వనప్రదేశమునకుఁ బోయిరి.

కం. విడువనివగపున మిగులన్, సుడివడుచును నాఁడుపులులు ♦ చుట్టుకొనంగా
మిడికెడుహరిణి యనంగాఁ, బడఁతుక రాకాసిగుమికి ♦ వశపడి యుండెన్. ౯౭౯

హరిణి = ఆఁడుజింక, రాకాసిగుమికిన్ = రాక్షసస్త్రీల గుంపునకు.

తా. వదలని వ్యసనముచే మిగులఁ గళవళపడుచు నాఁడుపులులు చుట్టుకొనఁగా దుఃఖించు నాఁడుజింకవలె సీత రాకాసులగుంపునకు వశపడియుండెను.

కం. అమ్మగుద దుస్సహవ్యస, నమ్మున సంగ్రస్త యగుచు ♦ నవయుచు దృఢపా
శమ్ములకట్టులఁ జిక్కి సు,ఖమ్మెఱుఁగని యాఁడుజింక ♦ కరణిని నుండెన్.౯౮౦

దుస్సహ = సహింపరాని, సంగ్రస్త = మిగులఁ గ్రమ్ముకొనఁబడినది, నవయుచున్ = కృశించుచు, దృఢపాశమ్ముల = గట్టిత్రాళ్ళ.

తా. ఆసుందరి సీత సహింపరాని వ్యసనముచే మిగుల మ్రింగఁబడినదై కృశించుచు గట్టిపగ్గములచేఁ గట్టఁబడి సుఖమెఱుఁగని యాఁడుజింకవలె నుండెను.

కం. భీకరవికటేక్షణ ల, స్తోకము భయపెట్ట మగువ ♦ దూలుచు నుండెన్
శోకమున దయితుఁ బతినిన్, శ్రీకరు దైవతము నెపుడుఁ♦ జింతించు చెదన్.౯౮౧

భీకరవికటేక్షణలు = భయంకరములై విరుపులైన కన్నులు గలవారు, అస్తోకము = మిక్కిలి, దయితున్ = ప్రియుని, శ్రీకరున్ = శుభముకలిగించువానిని.

తా. భయముకలిగించు పెద్ద కన్నులుగల రాక్షసస్త్రీలు భయపెట్టుచుండఁగా

సీతాదేవి శోకమున సోలిపడుచు, తనప్రియుండు శ్రీకరుండు దైవము నగు మగని సర్వదా ధ్యానించుచుండెను.

సందేహము — యుద్ధకాండమున ౧౩౦౭-వ పద్యమున

ఉ॥ మానితశక్తి మేరువును మందరముం దుహినాచలంబు దోః। యానచ రాన్వితంబగు సమస్తజగంబును గేలనెత్తనా। దానవభర్త యాఘరతు తమ్ముని గదల్పంగ నేరండయ్యె బల్। పూనిక పంగటించి పెదవుల్ బిగియించియు నీలకర్బి యుఁ॥ అని - లక్ష్మణు నెత్తఁజాలని రావణుఁడు సీతాదేవి నెట్లెత్తఁగలిగెను ? ఈ రామాయణమందే "శ్రీలక్ష్మియే సీత — విష్ణుండవే నీవు" అని (యుద్ధ ౨౧౦౭) విష్ణుపురాణము. రాఘవత్వే భవే త్సీతా యనియుఁ గలదుగదా. సమాధానము :

లక్ష్మణుఁడు రావణునకు గదలింపరానివాఁ డయ్యెఁగాని హనుమంతునకుఁ దేలికగానేయయ్యెను. "గీ. పవనతనయుండు సుహృదుండుఁ బరమభక్తి। గలుగు వాఁడును నగుట లక్ష్మణుఁడు పగఱ। కప్రకంప్యుఁడు నయ్యు వనాటునకును। దేలికగ నయ్యె నంతనా" అని యుద్ధ ౧౩౧౩, స్మృతితప్పి స్వాధీనత చెడి పడినవాఁ డొకనికి భారముగాను మఱియొకనికిఁ దేలికగను గాఁజాలఁడుగదా. కావున లక్ష్మణుఁడు స్మృతి తప్పినవాఁడు కాఁడు. కావున స్వసంకల్పముచే రావణునకు భారమయ్యెను. స్వసంకల్పముచే భక్తుఁడగు హనుమంతునకుఁ దేలికయయ్యెను. అట్లే సీతాదేవియును.

లక్ష్మీదేవి రావణుఁడు పతివ్రతలఁ బెట్టుబాధ చూడఁజాలక వానిని సంహరింపఁగోరి యేదైన నొక నెపము లేక చంపరాదు. కావున వేదవతిగాఁ బుట్టి వాఁడు తాఁకినాఁ డన్న నెపమున నే నయోనిజగాఁ బుట్టి నీ మరణమునకుఁ గారణ మయ్యెద నని శపించి జానకిగా నవతరించెను. ఆ సంకల్పము నెఱవేఱ వలసి యున్నది. కావున రావణునకుఁ దేలికగ నయ్యెను. తెలిసి తెలిసి తాను చేసికొనిన కార్యమునకు శోకింప నేల యనిన రామవియోగము సహింపలేకయే యని యెఱుంగనగు. తనబిడ్డను బులి పట్టుకొనవచ్చెనేని తాను బులినోటి కడ్డము పోయి తల్లి బిడ్డను రక్షించును. అట్లే తనబిడ్డలయి పతివ్రతలయిన స్త్రీలను రక్షించి చెఱనుండి విడిపించుటకుఁ దానే చెఱలోఁ బడెను.

ఈ యర్థమును సుందరకాండమున ౫౮౪-వ పద్యమున, "హరింపఁజాలుదే దానవ నన్ను నిన్నెడపు తత్పరతన్ విధి యిట్లు చేసెడిన్" — అని సీతయే రావణునకుఁ జెప్పెను.

మఱియొక విచారము — సీతారామాదులు లోకమున నుభయవిధధర్మము ననుష్ఠానముచే నుపదేశింప నవతరించి రని బాలకాండవ్యాఖ్యయందుఁ దెలుపఁ బడెను. సీతాదేవిపాతివ్రత్యధర్మము స్పష్టముగఁ దెలియుచున్నది. ఆమె యుప దేశించిన పారలౌకికధర్మము అనఁగా ముముక్షువునకుఁ గర్తవ్య మేదియో దాని నెట్లు తెలిపెనో విచారింపవలయును. మతతత్త్వజ్ఞులందు ముముక్షుచర్యావిషయమై

రెండు భిన్నాభిప్రాయములు గలవు. మోక్షేచ్ఛగలవాఁ డని యెప్పుడు చెప్పితిమో వాఁడు బద్ధుఁడై చెఱయందుఁ బడియున్నాఁ డని యప్పుడే యేర్పడుచున్నది. బంధములేనివానికి మోక్షములేదు. అయినను అపహతపాప్మత్వాది షడ్గుణ రహితుఁడైన జీవుఁడు జననమరణాదులకు లోపడి సంసారమను చెఱయందుఁ బడఁ గారణ మేమి? అది తొలఁగిపోవు నుపాయ మేది? యని విచారింపఁగాఁ గొందఱు జ్ఞానములేమిచే సంసారప్రాప్తి యనియు మగల జ్ఞాని యయ్యేనేని ముక్తుఁ డగు ననియు నందురు. మఱికొందఱు అది సరిగాదు. భక్తిలేకపోవుటచే జీవునకు సంసార ప్రాప్తి యనియు, భక్తి యుదయించిన సంసారము వదలిపోయి బద్ధుఁడు ముక్తుఁ డగుననియు నందురు. మొదటివారు జ్ఞానవాదులు. రెండవవారు భక్తివాదులు, జీవునకు సంసార మారోపితమే కాని స్వభావసిద్ధము కాదని యుభయవాదు లంగీక రించినవారే. ఇది యెట్లు వచ్చెను? ఎట్లు పోవును? అను విషయమందే యభిప్రాయ భేదము. జీవునకు సంసారము ప్రకృతిసాంగత్యముచేఁ గలిగినది. ప్రకృతిసాంగ త్యము తొలఁగిన సంసారము పోవును. ఎట్లన స్ఫటికమునకు ధావళ్యము సహజము. అయినను దాసానిపువ్వుతోఁ గూడ నేని యెఱ్ఱగాఁ గానవచ్చును. కావున స్ఫటికము నందు రక్తవర్ణ మారోపితము. దాసానిపువ్వు నశించె నేని స్ఫటికమునందలి రక్తవర్ణము తొలఁగిపోయి యథాప్రకారము తెల్లగా నగును. అట్లులే జీవుఁడును ప్రకృతిసాంగత్యమున సంసారి యగుచున్నాఁడు. ప్రకృతి తొలఁగిపోయిన శుద్ధుఁ డగుచున్నాఁడు. ఈ సంబంధము తొలఁగు నుపాయ మేది? జీవుఁడు నిత్యుఁడు శాశ్వ తుఁడు. నశించువాఁడు కాఁడు. ప్రకృతి నిత్యము, శాశ్వతము. నశించునది కాదు. కావున నీ రెంటికిఁ గల సంబంధము దొలఁగింపవలెను. జీవునకుఁ బ్రకృతిసంబంధము జ్ఞానమువలనఁ దొలఁగునా? తొలఁగదు. ఎట్టులన, స్ఫటికము తెలుపన్న జ్ఞానము మనకుఁ గలదు. దాసానిపువ్వుసాంగత్యముచే నెఱ్ఱనిరంగు వచ్చినదన్న జ్ఞానము గలదు. స్ఫటికము తెలుపు అని యెన్నినాళ్లు స్మరించినను స్ఫటికము తెలుపగునా? కానేరదు. అట్టులే జీవుఁడును నేను నిర్మలుఁడను అపహతపాప్ముఁడ నని యెన్ని కల్పములు ధ్యానించినను బ్రకృతి తొలఁగదు. త్రిగుణాత్మకమైన ప్రకృతి తొలఁ గుట కుపాయము భక్తి యని భగవంతుఁడు శ్రీకృష్ణుఁడు భగవద్గీత ౧౪-వ అధ్యాయమున ౨౬ శ్లో.

మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే।
సగుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే॥

అని భగవంతుఁ డగు విష్ణునందు ననన్యమైనభక్తి (పతివ్రతయొక్క పతి భక్తివంటిదిగాని నాకు నందఱు పురుషులు సమానులే యను జారిణివలె నందఱు దేవతలు నాకు సమానులే యను భక్తి గాదు). ప్రకృతిబంధమును దొలఁగించి ముక్తునిఁ జేయు నని చెప్పెను. కావున ననన్యభక్తి లేకపోవుటయే సంసారప్రాప్తి

హేతువు. అనన్యభక్తి కుదురుటయే సంసారముక్తికి హేతు వని యేర్పడెను. ఇది లక్షణము. దీనికి సీతాచరిత్రము లక్ష్యము. ఎట్టులన :—

పంచవటియం దున్నసమయంబున మారీచుఁడు మాయామృగమై వచ్చెను. దానిని జూచి సీతాదేవి రామచంద్రమూర్తితో మృగచర్మమందు లోనంటిన మక్కువం బలికెఁ ప్రాణధవా విను మాసగొల్పెడిఁ. "దయ దానిని బట్టి తేఁగదే." యని కోరెను.

వెంటనే లక్ష్మణుఁడు శ్రీరాముం గని యిట్లు వాకొనియె. "మారీ చాసురుండే తదాకారం బూని మునిశపాళి మృగయాకాంక్షాగతోర్వీశులఁ గ్రూరుండై వధియించు నీయడవి" "మాయావి యల్లయసురుఁడె మాయామృగరూప మెత్తి మలయును గంధర్వాయతపురి యట్టిది యీ కాయము నిక్కంబు గాదు" అని చెప్పెను. దీనివలన సీతాదేవికి మృగవిషయమైన వాస్తవజ్ఞానము లేదని చెప్ప సాధ్యపడదుగదా. ఇట్లు చెప్పినను వినక రామచంద్రమూర్తి తన్ను బాసి మృగము వెంటఁ బోవుట కంగీకరించెను. ఇక్కడ నొకవిషయ మాలోచింపవలయును. ఇచ్చట నీసమయమున సీతాదేవికి రామునందు ప్రేమ యెక్కువయా? మృగమందుఁ గామ మెక్కువయా ? కామమునకంటెఁ బ్రేమ మెక్కువయై యుండెనేని ఛీ యీ క్షుద్రచర్మమునకై నామగని నేను కష్టపెట్టవచ్చునా ? ఆయనను విడిచి నే నుండ వచ్చునా? యని యాలోచించి తననిమిత్తముగా రామచంద్రుని విడనాడియుండుట కంగీకరించియుండదు. ఎక్కడ నొకక్షణమైన వియోగము వచ్చునో యను భయమే పరమభక్తి "పున ర్విశ్లేషభీరుత్వం పరమాభక్తి రుచ్యతే" యని పరమభక్తి లక్షణము. సీతాలక్ష్మణు లిరువురు నిట్టి రామయోగము సైఁపనివారే. కావుననే కదా లక్ష్మణుఁడు "నిన్నుఁ బాసి ధరాతనూజయు నేను నొక్కముహూర్తమేని న్నిలం గలవారమె తమ నీటిఁబాసిన చేఁప లట్లన్న" యని చెప్పెనుగదా. అంతటిభక్తిగల సీత కామముచే రాముని నెడఁబాయఁగోరుటచే నాక్షణంబున కామముకంటె భక్తి తక్కువయనియె చెప్పకతప్పదు.

ఇది మొదటిపొరపాటు. సీతాదేవి యిట్టులే రెండవపొరపా టొకటి చేసెను. అది లక్ష్మణుని నెడఁబాయుట. లక్ష్మణుఁడు పరమభాగవతోత్తముఁడు. భగవంతుని సాహాయ్యము లేకున్నను భాగవతానుగ్రహముండినచో భయము లేదు. భగవంతుఁడు కోపించినవానిని భాగవతుఁడు కాపాడఁగలఁడు. భాగవతాపచారము చేసినవారిని భగవంతుఁడును గాపాడలేఁడు.

అంబరీషోపాఖ్యానమే దృష్టాంతము. ఇట్లు రామలక్ష్మణసాహాయ్యము (భగవద్భాగవతసాహాయ్యము తొలఁగఁగానే) దశకంఠుఁడు, (దశేంద్రియములు) వచ్చి సీతనుఁ (జీవుని) బట్టుకొని పోయి లంకలోఁ (దేహములో) ప్రవేశపెట్టెను. లంక =

లం అనునది పృథివీబీజాక్షరము. కావున పృథివీత్వమును దెలుపును. పృథివి యొక్కవగాఁగలది లంక = దేహము.

సీత జీవునిఁగాఁ జెప్పుటకుఁ గారణ మేమన:- స ఏవ వాసుదేవోఽయం, సాక్షాత్పురుష ఉచ్యతే। స్త్రీప్రాయ మేత త్తత్సర్వం, జగద్బ్రహ్మపురస్సరమ్॥ విష్ణుపురాణము. భగవంతుఁ డొక్కఁడే పురుషుఁడు. తక్కినదంతయు స్త్రీప్రాయమే. కావున స్త్రీ యను సీత జీవుఁడుగాఁ జెప్పఁబడెను. ఎప్పుడు కామ ముదయించి భగవంతునియందుఁ బ్రేమ తగ్గునో యప్పుడే సంసారప్రాప్తి యని తెలియునది. కావున సీతాచరిత్రమువలన భక్తిహీనతయే సంసారహేతువని యేర్పడెను. మోక్షమునకు ననన్యభక్తియే కారణమని సీతాదేవిచరిత్రమునుబట్టి మఱియొకచోఁ దెలుపఁబడును. దీనివలన భక్తిలేనిజ్ఞానము వ్యర్థమని తెలియునది. దేహవంతుఁడైన జీవుఁడు దుఃఖభూయిష్ఠంబైన సంసారమునుండి తరించుమార్గము ఈ ౯౮౧-వ పద్యమున నుత్తరార్ధమునఁ జెప్పఁబడెను. దీని వివరణమె తక్కిన సీతాచర్య సమస్తము. ఈ జీవునకు భగవంతుఁడే దయితుఁడు, ప్రియుఁడు, పతి (ఆత్మేశ్వరగం) శ్రీకరుఁడు దైవము. కావున సీతవలె సర్వదా యాయనను దృఢవిశ్వాసముతోఁ దలఁచుచుండుటే మోక్షోపాయము.

సీతావృత్తాంత మింతతో నిలిపి యిఁక రామచంద్రమూర్తి వృత్తాంతము చెప్పఁబడును.

—♦ ౫౭-వ సర్గము. రాముఁ డపశకునములఁ గని పరితపించుట. ♦—

ఉ. అక్కడఁ గామరూపిఁ బల♦లాశి మృగాకృతిఁ బూని యున్నయా
టక్కరిఁ దుంచి యాశ్రమము ♦ డాయ త్వరం జనుదెంచుచోట వె
న్ప్రక్క శివారుతంబు విని ♦ రాముఁడు దారుణ మీరవంబు నా
కెక్కడు కీడుఁ దెల్పె, నసు♦రేంద్రులు మ్రింగరు గాదె జానకిన్. ౯౮౩

అక్కడన్ = అడవియందు, కామరూపి = కోరినరూప మెత్తఁగలవాఁడు, పలలాశి=మాంసభక్షకుఁడు, రాక్షసుఁడు, మృగ + ఆకృతి = జింకయొక్క యాకారము, టక్కరి = మోసగాని, తుంచి = చంపి, వెన్ప్రక్క = వెనుకతట్టు, శివారుతంబు = నక్కకూఁత, దారుణము = భయంకరము, అశుభసూచకము. రవంబు= ధ్వని, మ్రింగరుకాదె = మ్రింగలేరుకదా.

తా. అక్కడ రామచంద్రమూర్తి కామరూపియు మాంసభక్షకుఁడునై జింకరూపము ధరించిన యా వంచకుని మారీచుని జంపి యాశ్రమమునకు రావలయునని త్వరత్వరగా వచ్చుచు వెనుకప్రక్క నక్కకూఁత విని, యిది యశుభమును దెలుపుచున్నది. దీనివలనఁ గీడుకలుగును. రాక్షసులు జానకిని మ్రింగిరో యేమో!

మ. ఖలమారీచుఁడు మద్రవానుకృతి బి♦ గ్గం గూసె, నానాద మా
జలజాతాక్షియు లక్ష్మణుండు విని రా♦ సంభ్రాంతులై తత్సతీ

తిలకప్రేషితుఁ డై సుమిత్రసుతుఁ, డం ♦ తే వేగ నన్ రోయుచున్
తెలువం గానల వీడి వచ్చె నటపైఁ ♦ జేటేమి గా నున్నదో. ౧౭౩

ఖలమారీచుఁడు = దుష్టుఁడగు మారీచుఁడు, మద్రవానుకృతి = నా కంఠధ్వని వలె, బిగ్గన్ = గట్టిగా, సంభ్రాంతులై = నాధ్వనియే యని భ్రమచెందినవారై, తత్ + సతీతిలక = ఆస్త్రీరత్నము, సీతాదేవిచే, ప్రేషితుఁడై = పంపఁబడినవాఁడై, రోయుచున్ = వెదకుచు.

తా. దుష్టుఁడగు మారీచుఁడు నా కంఠస్వరమువంటి స్వరముతో గట్టిగా నఱచెను. ఆధ్వని సీతయు లక్ష్మణుఁడు వినిరా సీత తప్పక లక్ష్మణుని నానిమిత్తమై పంపును. లక్ష్మణుఁడు నన్ను వెదకుచు నడవిలో సీత నొంటిగా వదలి వచ్చును. ఆవల నేమికీడు గలుగునో యేమో ?

ఉ. ఎక్కడి పైఁడిజింక, నను ♦ నీగతిఁ దాటకసూతి దూరమున్
దక్కక తెచ్చి నాశరము ♦ తాఁకునఁ జచ్చుచు సీత లక్ష్మణా
చిక్కితి నిందటం చఱచె ♦ సిద్ధము దీనను జూడ జానకిం
ద్రెక్కొన నున్నవారు రజ ♦ నీచరు లేవటుమాయచేత నేన్. ౧౭౪

తాటకసూతి = తాటకాకుమారుఁడు, మారీచుఁడు, త్రెక్కొనన్ = చంపఁగా, మ్రింగఁగా, రజనీచరులు = రేద్రిమ్మరులు = రాక్షసులు.

తా. ఔరా చిత్రము ! లోకమున బంగారుజింకయుఁ గలదా ? మారీచుఁడు నన్నీమోసవిధముగా దూరముగా తెచ్చి నా బాణముచేతఁ జచ్చుచుఁ జచ్చెడివాఁడూరకచావక, సీతా లక్ష్మణా యిందుఁ జిక్కులఁబడినా నని యఱచెను. ఇదంతయు నాలోచింపఁగా నాకుఁ బ్రత్యక్షముగాఁ గీడుచేయలేరు కావున రాక్షసు లేగొప్ప మాయచేతనైనను సీతను మ్రింగ నుద్దేశించియున్నవా రనుట సిద్ధము.

సీ. కాన నేకత ముండు ♦ కలికికి నాతమ్ముఁ, గుఱ్ఱకు సేమంబు ♦ గొఱలుఁ గాక
తెగనివైరము గల్గె ♦ దితిజులతో జన,స్థానవాసంబు ని ♦ దానముగను
ఘోరనిమిత్తముల్ ♦ గొల్లలుగాఁ దోఁచె, నఱచుచు నున్నవి ♦ వఱడు లెందు
నే కీడు మూఁడునో ♦ యెది కనఁగల్గునో, యేమి సేయుదు వార ♦ లెట్టులైరొ
తే. యనుచు దీనతఁ జనుచోట ♦ నఖిలపక్షి
మృగవితానము సవ్యంబు ♦ నేగు చతుల
భీకరారావములు నింపఁ ♦ బృథ్వినుతను
దమ్ముఁ జింతించుచును బోయెఁ ♦ దడయ కెందు. ౧౭౫

ఏకతము = ఒంటి, తమ్ముఁగుఱ్ఱకు = చిన్నతమ్మునకు. ఇది విశేష్యపూర్వపద కర్మధారయము. తమ్ముఁడైన కుఱ్ఱవాఁడు. "తమ్ముఁగుఱ్ఱలు నీవుఁ దగ విపినంబున కరిగితిరి." భార, అర ౭. నిదానము = ఆదికారణము, ఘోరనిమిత్తముల్ = భయంకరములైన యపశకునములు, కొల్లలుగా = విశేషముగ, వఱడులు =

నక్కలు, అఖిలపక్షిమృగవితానము = సమస్తములైన పక్షులయు మృగములయు సమూహము, సవ్యంబు = ఎడమవైపుగా, అతుల = అసమానములైన, భీకరారవములు = భయంకరధ్వనులు, తమ్ముఁడ = తమ్ముని, తడయక = జాగుచేయక.

తా. కాఁబట్టి యొంటరిగానుండు కలికి సీతకు, నా పిన్నతమ్మునకు, క్షేమము కలుగునుగాక! జనస్థానవాసము కారణముగా రాక్షసులతో నంతములేని విరోధము సంభవించెను. అపశకునములు విస్తారముగఁ దోఁచుచున్నవి. ఎక్కడఁ జూచిన నక్కలఱచుచున్నవి. ఏమి కీడుమూఁడునో, ఏ ఘోరవిషయము చూచుట తటస్థించునో తెలియదు. ఏమి చేయఁగలను? సీతాలక్ష్మణు లేమిగతి పట్టిరో యనుచు వ్యసనపడుచు, వచ్చుచుండఁగా మృగములు పక్షులు కుడినుండి యెడమవైపుగా భయంకరధ్వనులు గావించుచుఁ బోవుటఁ జూచి లక్ష్మణుని సీతను గుఱించి యాలోచించుచు నెందును జాగుసేయక పోయెను.

—♦ రాముఁడు లక్ష్మణుం జూచి సీతఁ దలంచి దుఃఖించుట. ♦—

ఉ. పోవుచు నిట్లు లాశ్రమము ♦ పొంతకు వేగ నదూరమంద నీ
తావిభుఁ డేగుదెంచు తన ♦ తమ్ముని దీనతరాస్యుఁ గాంచి దుః
ఖావిలచిత్తుఁడై కదిసి ♦ యాతని సవ్యకరంబుఁ బట్టి తా
నీవిధి నార్తిఁ దోఁప ననిఁ ♦ యెం బరుషంబును మార్దవంబుగన్. ౯౮౬

అదూరమందు = మిక్కిలి దవ్వుగాని ప్రదేశమందు, దీనతరాస్యున్ = మిగులఁ జిన్నపోయిన ముఖముగలవానిని, దుఃఖావిలచిత్తుఁడై = దుఃఖముచే వ్యాకులపడిన మనస్సుగలవాఁడై, కదిసి = సమీపించి, సవ్యకరంబు = ఎడమచేయి, పరుషంబుగన్ = కఠినముగ, మార్దవంబుగన్ = మృదువుగ.

తా. ఇట్లు పోవుచు నాశ్రమమునకు సమీపమందే ముఖము వ్రేలవైచుకొని యొంటరిగావచ్చు తమ్మునిఁ జూచి వచ్చెనే యేదో కీడని వ్యసనముచేఁ గలఁత చెందిన మనస్సుగలవాఁడై రాముఁడు నను సమీపించి యెడమచేతిని బట్టుకొని వ్యసనముతోఁ దొలుత బరుషంబుగను, నావల మృదువుగను నిట్లు లనెను. తొలుతఁ దెలివితక్కువపని చేసినాఁడని తలఁచి కఠినముగను, ఇం దతని దోషము లేదని యాలోచించి మృదువుగను బలికెను. కుడిచేతియం దాయుధ ముండుటచేత నెడమ చేతిని బట్టుకొనెను.

శా. అయ్యో లక్ష్మణ యేమి చేసితి విసీ ♦ యాసీత నీ వొంటిగా
నయ్యారణ్యతలంబున న్వదలి యే♦లా వచ్చితిం దక్కటా
యయ్యన్నున్ మనుజాశనుల్ మెసవిరో ♦ హా కొంచునే పోయిరో
యయ్యా సందియ మింతలే దశుభమే ♦ యత్యంతముం గల్గెడిన్. ౯౮౭

అయ్యన్నున్ = ఆ యాఁడుదానిని, మనుజాశనుల్ = మనుష్యులఁదినువారు, రాక్షసులు, మెసవిరో = భక్షించిరో?

తా. అయ్యో లక్ష్మణా ! ఏమిపని చేసితివి ? సీత నేల యొంటిగా నడవిలో విడిచి యిచ్చటికి వచ్చితివి ? రాక్షసు లాయాఁడుదానిని దినిరో, తీసికొనిపోయిరో ? ఈ రెంటిలో నొకటి జరిగియుండును, సందేహము లేదు. అశుభచిహ్నములే కానవచ్చుచున్నవి.

శా. అన్నా ! లక్ష్మణ ! చూడఁగాఁ గల మొకో ♦ యన్నారి జీవంబుతో
నున్నన్ క్షేమముగాఁగఁ, గంటివె యదే ♦ యుగ్రంబుగాఁ గూసె నా
సన్నంబై వఱదుల్ ఖగంబులు మహా ♦ సత్త్వంబులున్ సూర్యసం
పన్నాశాభిముఖంబులై, శుభ మెటుల్ ♦ ప్రాపించు నోతమ్ముఁడా. ౯౮౮

అన్నారి = ఆస్త్రీ, సూర్యసంపన్నాశాభిముఖంబులై = సూర్యుడుండు దిక్కుముఖములు చేసి.

తా. అన్నా ! లక్ష్మణా ! సీతాదేవి ప్రాణముతో నుండఁగా మనము చూడఁగలమా ! లేము. ఏ లందువా ! అదె చూడుము. నక్కలు, పక్షులు, పెద్దమృగములు, సూర్యున కెదురుముఖమై పరుషధ్వనులు చేయుచున్నవి. ఈ యపశకునములఁ జూచిన తమ్ముఁడా మన కెట్లు మేలుగలుగును ? దీనివలన సూర్యున కెదురుముఖమై పక్షులు మృగములు నక్కలు కూసెనేని కీడు కలుగును అని సూచితము.

కం. హరిణమువలెఁ దోఁచిన యీ, ఖరదైత్యుఁడు వాలకమునఁ ♦ గడుదవ్వునకున్
సరగఁ గొనియేగ నెట్లో, పొరిపుచ్చితి వాని మోస ♦ పోకలు దెలియన్.

వాలకమునన్ = మోసమున, పొరిపుచ్చితిన్ = చంపితిని.

తా. జింకవలెఁ గానవచ్చిన యీ దుష్టరాక్షసుఁడు మోసగించి, నన్ను మిగులదూరము తీసికొనిపోయెను. వాని మోసపుఁజేష్టలు మనస్సునకు రాఁగానే వాని నెట్లో చంపితిని.

తరలము. అదరె వామవిలోచనంబు, ప్ర ♦ హర్ష మేమియు లేదు నా
మదిని, నాశ్రమభూమి నిక్కము ♦ మానినీమణి లేదురా
సుదతినిన్ హరియించిరో తమ ♦ సూడు దీఱఁగ రక్కసుల్
ముదిత దా మరణించెనో వని ♦ లోనఁ ద్రోవయె తప్పెనో. ౯౯౦

వామవిలోచనంబు = ఎడమకన్ను, సూడు = పగ.
తరలము. న భ ర స జ జగములు - పండ్రెండవయింట యతి.

తా. లక్ష్మణా ! ఎడమకన్నదరుచున్నది సంతోష మేమియు మనస్సునందు లేదు. నాయనా యాశ్రమమందు సీత లేదురా. తమ పగదీర్చుకొనుటకై రాక్షసులు దానిని పట్టుకొనిపోయిరో లేక వారిచే బాధపడలేక తానే చచ్చెనో లేక మనలను వెదకుచు వచ్చి త్రోవ తెలియక వేఱొకత్రోవ నెందేని పోయెనో.

౫౮-వ సర్గము.

ఉ. ఇమ్మున సౌఖ్యముల్ విడిచి • యెంతయు నావయి భక్తి దండకా
ద్రిమ్మరి రాజ్యహీనుఁడను • దీనుఁడఁ ద్రిమ్మటకాఁడనైన నా
కిమ్మయి దుర్దశాప్తిని సహాయగనై చరియించు జానకిం
దమ్ముఁడ వీడి వచ్చితివి • నాసతి యేగతిఁ బట్టెఁ జెప్పుమా. ౧

ఇమ్మునన్ = సంతోషముతో, ఇంపుగ, త్రిమ్మటకాఁడు = తిరుగుచుండు వాఁడు, దుర్దశాప్తిని = కష్టదశప్రాప్తించినపుడు, సహాయగనై = తోడై.

నాలుగవపాదంబున బిందుయతి, ౦ద = న.

తా. ఇంట సుఖము లమరలే దనియే సాధారణముగ స్త్రీలు దుఃఖింతురు. స్త్రీలబుద్ధితత్త్వ మిట్టిదై యుండఁ దానై యొకరు చెప్పక, బలవంతపెట్టక వినోదములఁ జూచుటకు (సుఖపడుటకుఁ గాదు) దండకారణ్యమందుఁ గాలినడఁ దిరుగుటకు (నావలన సుఖముఁ గోరి కాదు) నాయందలి భక్తిచే వచ్చెను. నే నెటువంటివాఁడను? రాజ్యహీనుఁడను. దుఃఖములఁ దపించువాఁడను. నిలువనీడ నీవా రమ్మని పిలుచువారు లేని త్రిమ్మరిని ఇట్టి నాకు నట్టి కష్టదశయందు సహాయురాలుగనై నాకుఁ దనచేనైన సుఖము కలిగింపఁగోరి తిరుగుచుండు జనకరాజపుత్రికను తమ్ముఁడా వదలి వచ్చితివే. నాభార్య యేమై పోయెనయ్యా చెప్పుము. ఊపిరితో నున్నదా? లేదా? రామచంద్రమూర్తి శోకమునకు ముఖ్యకారణ మిదియే కాని కామము కాదు. అది నాలుగింట నొకటి.

ఉ. ప్రాణసహాయురా లెవతెఁ • బాసి ముహూర్తమ యేని దేహసం
త్రాణపరాయణత్వమునఁ • దాళఁగఁ జాల, ధరాపతిత్వగీ
ర్వాణపతిత్వముల్ కమల • పాణి యెవర్తుక యొద్ద లేనిచోఁ
బోణిమిఁ గోర నట్టిపుడుఁ • బోణి ధరాత్మజ యేది లక్ష్మణా. ౨

ప్రాణసహాయురాలు = నాప్రాణ మీదేహమున నిలుపుటయందు సహాయపడునది. ఆమెసాహాయ్యము లేకున్న, నాప్రాణము లెప్పుడో పోయియుండు నని భావము. దేహసంత్రాణపరాయణత్వమున = దేహమును రక్షించు నభిలాషతో, ధరాపతిత్వ = రాజుగానుండి భూలోక మేలుట, గీర్వాణపతిత్వము = ఇంద్రుఁడుగా నుండి స్వర్గమేలుట, కమలపాణి = (౧) కమలమువంటి చేయిగలది, (౨) కమలమును బాణియందుఁగలది = లక్ష్మి, పోణిమి = సుఖము.

తా. నాప్రాణములు దేహమున నిలుపుటయందు, సాహాయ్యపడు నెవతెను నెడఁబాసి యీదేహమును రక్షింపఁజాలనో, యెవతె నాయొద్ద లేనిచో సార్వభౌమత్వముఁగాని ఇంద్రత్వముగాని కోరనో యటువంటి సుమకోమల సీత యేదిరా లక్ష్మణా? కమలపాణి = లక్ష్మీదేవి. ఈమెసాహాయ్యము లేకున్న భగవంతుఁడు నిష్క్రియుఁడే. ప్రాణముండియు లేనివానితో సముఁడే. ఈ మాయా

శక్తి నాశ్రయించియే దేహధారియై కానవచ్చుట. ఈమె లేదేని భూలోకక్రీడ లేదు. స్వర్గలోకక్రీడ లేదు. లీలావిభూతియందలి క్రీడకు సహాయురా లీమెయేకదే. "స ఏకాకీ నరమేత" యనికదా శ్రుతి చెప్పుచున్నది.

ఉ. ప్రాణముకంటె నాకుఁ బ్రియ ♦ యైనమహీసుత సీత దండకా
ప్రాణముతోడ నున్నదియె ♦ వల్కు-వయా, పదునాలుగేఁడు ల
క్షీణముగా వనీస్థలి వ ♦ సింతునటన్న మదుక్తి బంభరీ
వేణినపానఁ గల్లయయి ♦ పెంపఱఁ జేయదుగా కుమారకా. ౭౭౩

అక్షీణముగాన్ = కొఱఁతలేక, వనీస్థలిన్ = అడవిప్రదేశమందు, మదుక్తి = నామాట, బంభరవేణి = ఆఁడుతుమ్మెదల చాలువంటి జడగలదాని, పెంపఱన్ = గొప్పతనము నశించునట్లు, కుమారకా=నాయనా. ఆదరార్థంబున కప్రత్యయము.

తా. అన్నా లక్ష్మణా ! నా ప్రాణములకంటె నాకుఁ బ్రియమైనది యగుటచే నా ప్రాణ మిచ్చియైన నే నవతెను రక్షింపవలయునో యట్టిసీత దండకయందుఁ బ్రాణముతో నున్నదా లేదా? అది ముందు చెప్పుము. నేను బదునాలుగు సంవత్సరము లరణ్యములందుఁ గొఱఁతలేకుండ వసింతునని చెప్పితిని. ఇప్పుడు సీత లేదాయెనా నేను లేనివాఁడనే కావున నేను జెప్పినమాట సీతకారణముగ నసత్యముకాదు గదా. దానివలన రాముఁడు సత్యప్రతిజ్ఞుఁడను గొప్పతనమునకు హాని రాదుకదా. నాయనా చెప్పరా.

కం. సీతాకారణముగ నే, వీతాసుఁడ నైన నీవు ♦ వే పురి కరుగన్.
జేతము రంజిలఁ గామా, న్వీత యగుచు భరతుమాత ♦ విలసిల్లుఁ గదా. ౭౭౪

వీతాసుఁడను = ప్రాణముపోయినవాఁడను, వే = త్వరగా, చేతము = మనస్సు, కామాన్వీత = నెఱవేఱిన కోరికతోఁ గూడినది.

తా. సీత మరణించిన కారణమున నేను మరణించినవాఁడనే. మే మిరువురము లేనప్పుడు నీ కీయడవులలో నేమిపని ? ఊరికిఁ బొమ్ము. నీ వూరికి వచ్చుటఁ జూచి నే నడవులలోఁ జావఁగోరుచున్నదై కైక తన కోరిక నెఱవేఱఁగా సంతోషించును గదా. మనస్సులో దాఁగియుండినది శోకాతిశయకారణమున స్మృతిదప్పుటచే బయలుపడెను. "సుప్త ప్రమత్త కుపితానాం భావజ్ఞానం దృష్ట"మ్మని న్యాయము గలదుకదా.

కం. సుతరాష్ట్రసహితఁ గైకను, మృతపుత్ర తపోవ్రతాఢ్య ♦ మృదుశీలిని స
న్నుతగుణ కౌసల్య యడే, గతిఁ జిత్త మెఱింగి కొలువఁ ♦ గా నేర్చు నహో.

సుత రాష్ట్ర సహితన్ = కొడుకుతోను రాజ్యముతోను కూడినది, మృతపుత్ర = కొడుకు చచ్చినది; తపోవ్రతాఢ్య = తపస్సులచే వ్రతములచే సంపన్న, మృదుశీలిని = మెత్తని స్వభావము గలది, సన్నుతగుణ = సత్పురుషులచేఁ బొగడఁబడు గుణములు గలది.

తా. కొడుకుతోను రాజ్యముతోను గూడియుండు కైకను కొడుకు చచ్చె నని పుత్రశోకమున నేడ్చునదియు, తపములు వ్రతములు విశేషించిగలదియు, మృదుస్వభావముగలదియు, సత్పురుషులచేఁ గొనియాడఁబడు గుణములు గలదియు నగు.నా తల్లికౌసల్య యేవిధముగఁ గైకమనస్సు నెఱిఁగి సేవింపఁగలదు. ఇందొ క్కొకటి సేవాధర్మమునకు విరుద్ధమైనది. కొడుకు చచ్చెనను శోకముతో వికల మయిన మనస్సుగలది యితరుల చిత్తవృత్తి నెట్లెఱుఁగఁగలదు? అట్టులే తక్కినవి యూహించునది. సేవాభంగమున కొక్కటొక్కటియే చాలియుండఁగా నీక నాలుగుచేరిన నెట్లు సేవచేయ సాధ్యపడును? కావున నాతల్లి యేగతిఁ బట్టునో?

కం. వచ్చెద నాశ్రమమునకును, సచ్చరితా సీత ప్రాణ ♦ సహితయ యేనిఁ
 జచ్చెద నిచ్చట లేదే, న చ్చిగురుంబోఁణి యాశ్ర ♦ మాంతరమందుఁ. ౯౯౬

తా. లక్ష్మణా! సీతాదేవి ప్రాణములతో నుండెనా యాశ్రమమునకు వచ్చె దను. లేదా అంతదూరము రానేల? నే నిందే చచ్చెదను. కావున సీత జీవించి యున్నదా లేదా చెప్పుము.

కం. ముద్దులు గులికెడినవ్వున, ముద్దియ నా కెదురు వచ్చి ♦ మురిపంబున మేల్
 సుద్దులు చెప్పద యేనియు, బిద్దెద నాశ్రనముద్రమోలఁ ♦ బెక్కు లిఁకేలా.

బిద్దెదను = చచ్చెదను.

తా. నేను వచ్చునప్పటికి జీవించియుండెను, ఇప్పు డెట్లున్నదో నాకుఁ దెలియ దనెదవా? ముద్దులుగులుకుచు నవ్వుచు నాకెదురుగ వచ్చి యాముగ్ధ నాకు మంచిమాటలు చెప్పకపోయెనా యాశ్రమములోనికి రాను. దానిముందే మరణించె దను. ఎక్కువ మాటలవలన నేమి లాభము?

కం. పలుకుము లక్ష్మణ జానకి, గలదా ప్రాణంబుతోడఁ ♦ గడ తేఱినదా?
 పలలాశులు భక్షించిరొ, యెలనాఁగను నీవు చిత్త ♦ మేమఱి యుండఁ.

ఎలనాఁగ = స్త్రీ.

తా. లక్ష్మణా! చెప్పుము. సీత ప్రాణముతో నున్నదా, తానై చచ్చినదా, లేక నీవు హెచ్చరిక తప్పియుండు సమయమున రాక్షసులు మ్రింగిరా?

కం. బాలిక యవిదితదుఃఖ సు,శీల సలీల సుకుమారి ♦ సీతాసతి యా
 గోల మదీయవియోగం, బేలాగునఁ దాళఁజాలు ♦ నెటు వగచెడినో. ౯౯౯

బాలిక = చిన్నవయస్సుది, అవిదితదుఃఖ = ఇంతవఱకు దుఃఖమెఱుఁగనిది. సుశీల = మంచిస్వభావము గలది, సుకుమారి = కోమలదేహముగలది, ఆ గోల = అటు వంటి ముగ్ధ.

తా. ప్రాణముతోనే యున్నది. రాక్షసులు హరించి ర నెదవా? అయ్యో చిన్నవయస్సుది. ఇంతవఱకు దుఃఖ మెఱుఁగదు. మంచిస్వభావము గలది. విలాస

ముతోఁ గూడినది. కోమలాంగి యగు సీత నన్ను విడిచి యెట్లు సహింపఁగలదు ? ఎందెట్టు లేడ్చుచున్నదో ?

కం. నీచుఁడు క్రూరాత్ముఁడు మా,రీచుఁడు వంచకుఁడు నాదు♦రీతిని నిన్నుఁ
వాచాకుశలత నఱచిన, నోచెల! నీకును భయంబు ♦ నొదవెన చెపుమా.

నాదురీతిని = నే నఱచినట్టులు, వాచాకుశలతన్ = మాట నేర్పుచేత, ఓ చెల = అయ్యో ! ఇది సంతాపార్థకము - ఓ చెల్లరయొక్క రూపాంతరము.

తా నీచుఁడు, కఠినచిత్తుఁడు, మోసగాఁడు నగు మారీచుఁడు నే నఱచినట్లే గొంతుమార్చుటయందు నేర్పుగలవాఁడు కావున నఱవఁగా నయ్యో నీకును భయము దోఁచెనటయ్యా ! ఆఁడుది కావున సీతాదేవి మోసపోయినఁ బోవచ్చును గాని నీ వెట్లు మోసపోయితివి ?

ఉ. మామకకంఠనిస్వనస ♦ మానవిరావము నాలకించి యా
భూమిజ భీతిఁ జెంది నినుఁ ♦ బొమ్మని నంతనె నానిమిత్తమై
యీమెయి వచ్చినాఁడవు మ♦హీజ మహాటవి నొంటి వీడి, దు
ష్టామిషభుగ్వితానమున ♦ కంతర మిచ్చితి నూడు దీర్పఁగన్. ౧౦౦౧

మామక = నాయొక్క, కంఠనిస్వన = కంఠధ్వనితో, సమాన = సమమైన, విరావము = ధ్వని, ఆలకించి = విని, భూమిజ = సీత, జ్ఞానములేని జడమువంటిది. కనుకనే నా కంఠస్వర మవునా కాదా, నే నట్లఱతునా యని యాలోచింప శక్తి లేని - భూమిజశబ్దము వృక్షమునందు నన్వయించును గావున నీ యర్థము సూచితము. నా నిమిత్తమై = నన్ను రక్షించుటకై. నన్ను నీవా రక్షించువాఁడ వని భావము. దుష్ట = దుర్మార్గవర్తనముగల, ఆమిషభుక్ = మాంసముదిను రాక్షసుల, వితానమునకు = సమూహమునకు, అంతరము = సందు, నూడు = పగ.

తా. నా కంఠస్వరమువంటి స్వరము విని యా యాఁడుది సీత భయపడి నిన్నుఁ బొమ్మని చెప్పఁగానే రక్షింపవలసినదానిని నబలను నొంటిగా నడవిలో విడిచి నన్ను నేను రక్షించుకొనలేనని నీవు నన్ను రక్షింపవచ్చితివి. వచ్చిన నేమి యందువా ? మనకు విరోధులగు రాక్షసులు మనకుఁ గీడుచేయ నెడమిచ్చితివి.

కం. ఖరవధమునకును వగచెడి, సురవైరులు సందు గాంచి ♦ సుందరి నట్లే
బరిమార్చియుంద్రు నిక్కము, పరికింపవ చూవె యింతె♦వట్టు కుమారా. ౧౦౦౨

తా. ఖరుఁడు చచ్చెనని యేడ్చు రాక్షసులు సీత యొంటరిగా నుండుట తెలిసి యిదియే సమయమని యామెను చంపియుందురు. ఇది నిజము నాయనా ! ఇది యిట్లు జరుగఁగలదని యింతమాత్ర మాలోచింపవైతివి గదా !

కం. మునిఁగితి దుఃఖసముద్రము, నను బడితిం జెడితిఁ గూలి♦నాఁడను నింకే
మనుదుం జేయుదు నీగతి, పౌనరుట ప్రాప్తవ్యమంచు ♦ బుద్ధిం దలఁతున్.

తా. నాయనా ! నిన్నని ప్రయోజనములేదు. సీతనని లాభములేదు. దుఃఖ

సముద్రమునందు మునిఁగితిని పూర్ణముగాఁ బడితిని, చెడితిని, చచ్చితిని. ఇంతకెక్కువ నే నేమందును? ఈగతి నాకు రావలసి మీ కీబుద్ధులు పుట్టెనని తలఁతును.

మంజుభాషిణి. అని మంజుభాషిణిని ♦ నాత్మ నెంచుచున్
జనియెం బిపాస క్షుధ ♦ జాలి గొల్ప మో
మును వాఁడగాఁ దొలఁగ ♦ మురువు, స్వాశ్రమం
బున కింతిలేమి నటఁ ♦ బొక్కి యేడిచెన్. ౧౦౦౪

మంజుభాషిణిని = ఇంపైనమాటలుఁగల సీతాదేవిని, పిపాస = దప్పి, క్షుధ = ఆఁకలి, జాలి = దుఃఖము, మురువు = అందము.

తా. అని సీతాదేవిని తలఁచుచు నాఁకలి దప్పి బాధింపఁగా ముఖము వాడఁగా నందము దొలఁగఁగాఁ దనయాశ్రమంబున సీతలేమికై యందు వెక్కి వెక్కి యేడ్చెను.

—♦ {౫౯-వ సర్గము. రాముఁడు లక్ష్మణుని సీతను విడిచి యేల వచ్చితి వని యడుగుట} ♦—

కం. తన యుటజమునకు వచ్చుచుఁ, దనుఁ జూడఁగ వచ్చియున్న ♦ తమ్మునిఁ గని యి
ట్లని ప్రశ్నించెను దెరువున, జనకసుతాధవుఁడు శోక ♦ సంతప్తుండై. ౧౦౦౫

ఉటజమునకున్ = పర్ణశాలకు.

తా. తనపర్ణశాలకు వచ్చుచుఁ దన్నుఁ జూడ వచ్చియున్న తమ్ముని జూచి త్రోవలో రామచంద్రమూర్తి శోకముచేఁ దపించుచు నిట్లనెను.

ఉ. నిన్నద నమ్మికాదె హరి ♦ ణీనయనన్ వని నొంటి వీడి యో
యన్న యిటేను వచ్చితిని ♦ న్యాయమె నీకు నరణ్యమధ్యమం
దన్నవలామిహిన్ విడిచి ♦ యాదరబాదర పాఱుతేర, నిన్
గన్నదియాది నామనము ♦ కాతరతన్ వహియించె లక్ష్మణా. ౧౦౦౬

నవలామిహిన్ = స్త్రీలయందు శ్రేష్ఠురాలు, ఆదరబాదర = త్వరత్వరగా, కాతరత = భయము.

తా. నీవు సీతను రక్షింపఁగల వని నిన్ను నమ్మికదా సీత నొంటిగా నీ స్వాధీనమందుంచి నేనిట్లు వచ్చితిని. నేను గాపాడుకొనలేక నీ కా వని చెప్పితినా? ఆ స్త్రీరత్నమును నడవిలో నొంటిగా విడిచి యుండెదేమో మునిఁగిపోయినట్లు లాదరబాదర పరువెత్తివచ్చితివి. నిన్నుఁ జూచినది మొదలు లక్ష్మణా! నాకు మిగుల భయము కలుగుచున్నది.

కం. సీతావిరహితుఁడవు నీ, వేతెసుట దూరమంద ♦ యేఁ గనినంతన్
జేతం బగలెను నదరెను, నాతమ్ముఁడ వామబాహు ♦ నయనంబు లహో. ౧౦౦౭

సీతావిరహితుఁడవు = సీతను విడిచినవాఁడవు, చెలము = గుండె, అగలెను = పగిలెను, వామబాహునయనంబులు = ఎడమభుజము కన్ను అదరెను.

తా. వచ్చినవాఁడవు సీతనుగూడఁ బిలిచికొని వచ్చియుండరాదా ? ఆమె లేక నీ వొంటరిగా వచ్చుట దూరమునుండి చూడఁగానే నాగుండె పగిలెను. ఎడమ భుజము ఎడమకన్నదరెను. అయ్యో ! మునిఁగెకదా కొంప యనుకొంటిని.

చ. అన భృశ దుఃఖతప్తమతి ♦ యై యను లక్ష్మణుఁ డార్తిఁ దూలు రా
మునకు స్వతంత్రతన్ మతివి ♦ మోహముచే నిట రాను, గావరే
జనకజ లక్ష్మణా యనుచు ♦ శబ్ద మరణ్యమునందుఁ గల్గినన్
విని సతి హాహ్మ హా య్మనియె ♦ నీవయిఁ జెల్మిని భీతి నేఁడుచున్. ౧౦౦౧

భృశదుఃఖతప్తమతియై = అధికవ్యథచే తపించిన మనస్సుగలవాఁడై, స్వతంత్రతన్ = నేనై స్వతంత్రించి, మతివిమోహముచే = బుద్ధిమోసముచే, రాను = వచ్చినవాఁడఁగాను.

తా. ఈ ప్రకారము రామచంద్రమూర్తి తనయందు దోష మారోపించుట చేతను, నాయన పడుచున్న శోకబాధచేతను, నిదివఱకు సీత పలికిన పలుకులకే మిగులఁ దపించిన మనస్సుగల లక్ష్మణుఁడు మఱింత తపించి యిట్లనియె. అన్నా ! యాధ్వని నీకంఠధ్వని యని మోసపోయి స్వతంత్రించి నేనై రాలేదు. సీతా లక్ష్మణా కావరే యను ధ్వని యరణ్యమునందుఁ గలుగఁగా సీత విని భయపడి హాహ్మని నీయందు నుండు స్నేహముచే నన్నుఁ దీవరించెను.

క. ఈరీతిఁ దీవరించిన, నారీతిలకంబుఁ గాంచి ♦ నయమున నంతో
దూరము నమ్మిక పుట్టఁగ, ధీరగుణా నిన్నుఁగూర్చి ♦ తెలిపితి మఱి యున్. ౧౦౦౨

తా. ఈ ప్రకారము తొందరపెట్టఁగా నిన్నుగుఱించి యమ్మా రామునకు భయములేదు. ఆయన కపాయము కలుగఁ జేయువాఁడు లోకమున లేఁడు. అది రామునికంఠధ్వని కాదు. ఎవరో మాయలమారులు చేసినపని. రాముఁడు తన్ను రక్షింపుమని యొకరిని వేఁడునా యని యీ ప్రకారము నమ్మికగలుగుటకై యెంతెంతో చెప్పితిని.

చ. వదిన ! యి టేటికమ్మ భయ ♦ పాటునఁ గుందెదు, రాక్షసాళిచేఁ
గదనమునందు రామునకు ♦ కల్గు భయం ? బది యేటిమాట యి
య్యది రఘురాముప ల్కనుచు ♦ నాత్మ స్ఫురింపదు, దైత్యుఁ డెవ్వఁడో
యదను నెఱింగి యిట్లఱచె ♦ నంగన నెమ్మది నిమ్మళింపుమీ. ౧౦౦౩

తా. వదిన ! ఏలమ్మా, ఇంతభయపడెదవు ? రామచంద్రునకు రాక్షసుల చేతనా యుద్ధమందా భయము కలుగును? ఇది యేమి మాటమ్మా, నమ్మఁదగినదా ? అనఁదగినదా? అది రామచంద్రమూర్తి కంఠధ్వని యని నాకుఁ దోఁపలేదు. ఎవ్వఁడో

రాక్షసుఁడు సమయ మెఱిఁగి యట్లఱచెను. అమ్మా! తొందరపడకుము. నిబ్బరించు కొనుము.

కం. దేవతలన్నను గడిమిని, గావంగాఁ జాలు నట్టి ♦ కడిఁదిబలుండా
యీవిధమున నీచంబుగ, వా విడి ననుఁ గావు మనుచు ♦ వాపోవు సతీ? ౧౧౧

కడిమిన్ = బలముచే, కడిఁదిబలుండా = అధికబలిష్ఠుఁడు, వా విడి = నోరు తెఱచి, వాపోవున్ = ఏడ్చును, అఱచును, నీచంబుగన్ = రక్షింపు మని యాఁడు దానిని బిలుచుట యనునది శూరునకు నీచకార్యము, బలుండా = కాఁడు.

తా. రామచంద్రుఁ డనఁగా నేమని తలఁచితివమ్మా? దేవతలన్ననను దనభుజబలముచేఁ గాపాడఁగల యధికబలముగలవాఁడా తన్ను రక్షింపు మని నిన్నుద్దేశించి నీచముగ నీవిధముగ నోరు తెఱచి యఱచును? ఇది యెట్లమ్మా నీవు నిజమని నమ్మెదవు?

మ. ఎవఁడో యేమినిమిత్తమో యఱచెఁ ద ♦ ల్లి నమ్ము మాయన్న యా
రవముం బోలఁగఁ బాహి పాహి యని యా ♦ రావంబు వైస్వర్య మా
త్మ విలోకింపఁగ రాముకంఠ మని న ♦ మ్మన్ రాదు శాంతింపుమీ
తగునే నీకుఁ గుయోషితాజనముచం ♦ దం బంది దుఃఖింపఁగన్. ౧౧౨

పాహి = రక్షింపు, వైస్వర్యము = మాఱుగొంతు, కుయోషితాజనము = నీచస్త్రీజనసమూహము. యోషిత్, యోషా-యోషితా యను రూపములు గలవు. "స్త్రీ వధూ ర్యోషితా రామా మండయంతీ వధూజనః" అని త్రికాండశేషము.

తా. ఎవఁడో యేదో కారణముగా మాయన్నగొంతువంటి గొంతుతో రక్షింపు రక్షింపు మని యఱచెను. ఆ ధ్వనిమార్పు వినఁగా నది మాయన్నగొంతు కాదు. కావున తొందరపడకుము. శాంతింపుము. నీవును నీచస్త్రీలవలె నిట్లు దుఃఖింపవచ్చునా.

ఉ. పుట్టినవారిలో జగతిఁ ♦ బుట్టెడువారలలో రఘూత్తమున్
గిట్టి రణంబునన్ గెలువ ♦ నేర్చెడువారలు కల్ల రమ్మ, లోఁ
దొట్టినభీతిఁ బో నడిచి ♦ తోయజలోచన స్వస్థచిత్తవై
దిట్టవు గ మ్మజయ్యుఁడు స ♦ తీ రఘురాముఁడు దేవకోటికిన్. ౧౧౩

లోఁదొట్టిన = మనస్సునఁ గలిగిన, పోనడిచి = పోఁగొట్టి, అజయ్యుఁడు = జయింపసాధ్యముగానివాఁడు.

తా. ప్రపంచమందు నింతవఱకుఁ బుట్టినవారిలో, నికఁ బుట్టబోవువారిలో యుద్ధమునందు రామచంద్రు నెదిరించి గెలువఁజాలినవారు లేరు. కావున నీకు మనస్సునఁ గలిగినభయము వదలి స్వస్థచిత్తవు గమ్ము. దేవతలందఱు నేకమైనను రామచంద్రుని యుద్ధమందు జయింపలేరు. ఇఁక నీ ముక్కిడి రాక్షసు లేమిచేయఁగలరు?

కం. నావుడు నతిమోహితమతి, యై వసుధాకన్య యనియె ♦ నగ్రజుఁ డీల్గన్
నీవు నను౯ గోరి కల్మష, భావుఁడ వై తట్టికోర్కి ♦ పారము౯ గనునే. ౧౦౧౪

అతిమోహితమతియై=మిగులనజ్ఞానమునకు వశపడిన మనస్సుగలదై, వసుధాకన్య = సీత, ఈల్గన్ = చావఁగా, కల్మషభావుఁడవు = పాపపుటాలోచన గలవాఁడవు. పారముగనునే = తుదముట్టునా.

తా. అని నేను చెప్పఁగా మిగులమతిభ్రమముగలదై సీత యిట్లనెను. నీవునన్నుఁ గోరి యన్న చావవలయు నను పాపచింతకలవాఁడవైతివి; నీకోరిక కొనసాగునా?

సీ. తెలిసెను లెమ్ము నీ ♦ తెఱఁ గెల్ల భరతుండు, నీవు సంకేతంబు ♦ నిశ్చయించి
కొని రాము వెనువెంటఁ ♦ జనుదెంచితివి నీవు, కాకున్నఁ దనయన్న ♦ కావుమనినఁ
బలుకరింపని యట్టి ♦ భ్రాతయుఁ గలుగునే, ప్రచ్ఛన్నచారి శా ♦ త్రవుఁడ వగుచు
నానిమిత్తంబుగా ♦ నానాథు వెంబడి, నంతరాన్వేషి వై ♦ యరుగుదెంచి
ఆ. తనినఁ బెదవు లదుర ♦ నాగ్రహంబున రక్త, నేత్రకుండ నగుచు ♦ నిలువలేక
యాశ్రమంబునుండి ♦ యరుదెంచినాఁడ నో, యన్న యున్నవిధము ♦ నాడినాఁడ.

ప్రచ్ఛన్నచారి = మాఱువేషము వేసికొని తిరుగువాఁడు, సంకేతము = ఒడఁబాటు. నీ విట్లుచేయుము, నే నిట్లుచేసెదనని యేర్పాటు. శాత్రవుఁడు = విరోధి, అంతరాన్వేషివై = సందువెదకువాఁడవై.

తా. లక్ష్మణా! నీయభిప్రాయము దెలిసె లెమ్ము. నీవు నాకు సీతను లభింపఁ జేయుము. నీకు నేను సహాయము చేసెదనని నీవు భరతుఁ డొడంబడిక చేసికొని రామునివెంట వచ్చితివి. అట్లుకాదేని నన్నుఁ గాపాడుమని యన్న యఱవఁగాఁ గాపాడఁబోని తమ్ముఁడుండునా? నీవు రహస్యవర్తనముగల పగవాఁడవుకాని రామునకుఁ దమ్ముఁడవు కావు. నానిమిత్తముగా నామగనివెంట నెప్పుడు సందుదొరకునా యెప్పుడు సీతను హరింతునా యని వచ్చితి వనెను. ఆ మాటలు వినఁగానే నాకు బెదవు లదరెను. కన్ను లెఱ్ఱనయ్యెను. కోపముపట్టలేక యచ్చట నుండలేక యాశ్రమమునుండి వచ్చితిని. అన్నా! ఉన్నవిధము చెప్పినాఁడ.

—♦ { రాముఁడు లక్ష్మణుతో నతఁడు సీతను విడిచి వచ్చుట తగనిపని యని చెప్పుట. } ♦—

కం. అని లక్ష్మణుఁ డన దశరథ, తనయాగ్రణి శోకమోహ ♦ తాపార్దితుఁ డై
యను సీతవిడిచి వచ్చుట, యనఘా సరిగానికార్య ♦ మన నేమి యికన్. ౧౦౧౬

తా. అని లక్ష్మణుఁడు పలుకఁగా శోకమువలనఁ గలిగిన మోహముచేతను దాపముచేతను బీడింపఁబడినవాఁడై రామచంద్రమూర్తి లక్ష్మణుఁ జూచి, పాపరహితుఁడా! నీవు సీతను విడిచివచ్చుట సరియైనకార్యముకాదు. ఇఁక నేమి యనుకొనిన నేమి ప్రయోజనము? అనఘ యనుటచే సీత సందేహించిన దోషము నీయందు లేదని యా విషయమైన సందేహమును దీర్చెను.

(i) సీతాదేవి ప్రేరింపఁగా రాక్షససంహారమందు నాకు శక్తిలేదని శంకించి వచ్చితివా ?

(ii) సీతపరుషవాక్యములవలన నీకు లోకనిందవచ్చునని శంకించి వచ్చితివా ?

(iii) పరుషవాక్యములు సహింపలేక వచ్చితివా ?

(iv) సీత నేను లక్ష్మణు నిట్లంటిని, అనినను బోలేదని నాతోఁ జెప్పిన నేను నీ విషయమున సందేహింతునని వచ్చితివా—అని వికల్పించుకొని యిందేకారణముచే నీవు వచ్చియుండినను నీవు చేసినది సరిగా దనుచున్నాఁడు. ఇందు నాలవది యనఘా యనుటచేఁ బరిహరింపఁబడెను.

ఉ. ఆఁడుది కింకచేఁ గఱకు ♦ లాడె నటంచును గోప మెత్తి నా
వాఁడిమగంటిమిన్ దనుజ ♦ వారణమందలి శక్తిను త్వమున్
బోఁడిమి నీవెఱింగియును ♦ బొల్తుకఁ గానల వీడి వచ్చితే !
వేఁడిమ కాని నీయెడ వి ♦ వేకము లేదు గదయ్య తమ్ముఁడా. ౧౧౧౭

ఆఁడుది “పెడతలనుండుఁగా యువతిబృందముకెల్లను బుద్ధి” యన్నట్లు సత్యాసత్యవిచారములేని యాఁడుది. కింకచేన్ = కోపముచే, కఱకులు = పరుషపు మాటలు, నా వాఁడిమగంటిమిన్ = నాశౌర్యమును, దనుజవారణమందలి శక్తిమత్త్వమున్ = రాక్షసులనివారించుటయందు శక్తిగలవాఁడనగుటను, వేఁడిమి = తీక్ష్ణకోపమే.

అయ్యో పాపము! లక్ష్మణుస్థితి శోచనీయము. ఇటు చెంపదెబ్బ, అటు చెంపదెబ్బ, సీతారాములవంటివారి సేవయందే నిష్కామసేవయందే యింతకష్టముండెనేని కడుపుకూటికై ప్రతిఫలముగోరి బానిసలై సేవచేయువారిగతి యేమనుకొనవలయును. సేవాధర్మము పరమగహనము, యోగులకు నగమ్యము, అను భర్తృహరినూక్తి గలదుగదా, నిష్కామముగ సీతారామసేవచేయువారికిని నిష్కారణముగఁ జెంపదెబ్బలు తప్ప వనియే యనుభవమునుబట్టి చెప్పవలసియున్నది.

తా. స్వస్థావస్థయందే స్త్రీప్రతీపదర్శిని, వామ, దార, ప్రతీపదర్శిని = వక్రముగా నాలోచించునది, వామ = వక్రమైనశీలముగలది, దార = భర్తను భయపెట్టునది. “ప్రతీపదర్శినీ వామా వనితా మహిళా తథా” యని యమరకోశము. ఇట్టివారికిఁ గోపముకూడ వచ్చిన నెట్లు లాలోచింతురో ఎట్లు ప్రవర్తింతురో యూహింపలేవైతివిగదా.

ఇట్టిది పరుషములాడుట యేమి వింత ? మంచివారికిఁ గోపమువచ్చిననే యిది చెప్పవచ్చును, ఇది చెప్పరాదను జ్ఞానముండదు. (సుందర ౧౨౮౯-౧౨౫౦-౧౨౫౧-౧౨౫౨ పద్యములఁ జూడుఁడు.) ఇఁక స్త్రీలకు గోపమువచ్చిన నడుగవలయునా ? అందుఁ దనభర్త కేదో కీడుమూఁడె నని భయము శోకముచేఁ బీడింపఁబడినదానివిషయము చెప్పవలయునా ? ఇవన్నియు నీ వాలోచింపక యిది

కోపించెనని నీవు కోపించి నాకార్యము రాక్షసుల నణఁచు నాశక్తి నీవు తెలిసి తెలిసి యాఁడుదానిని నొంటిగ నడవులలో విడిచి వచ్చితివే-ఏమందును ? ఎదుటివారు కోపించిన నేను గోపింపవలె నని తలంచితివే కాని తాఁలుతప్పు, దానివలనఁగలుగు నపాయము నాలోచింపవైతివిగదా తమ్ముఁడా !

కం. అంగన నినుఁ బల్కిన దని, చంగునఁ గోపించి యిట్లు ♦ చనుదెంచుటయుఁ
సంగతమే ? నాయాజ్ఞా,భంగముఁ గావించి తిదియుఁ బాడియె నీకుఁ. ౧౧౦

సంగతమే=యుక్తమా ? పాడియె=ధర్మమా ? నీకుఁ=నీవంటి పరతంత్రునకు.

తా. ఆఁడుది నిన్నుఁ గఠినోక్తు లాడె నని కోపించి యిట్లువచ్చుట తగునా ? స్త్రీజాతి కిది స్వభావము, తిట్టినఁ దిట్టనీ, మనకార్యము మనము చేయవలసినదే యని సహించియుండరాదా ? "కలహకుఁదనంబునను వాఁడికత్తుల బిఱుసుఁ," అని యగస్త్యుఁడు స్త్రీలస్వభావము చెప్పెనే మఱచితివా ? తిట్టుచుండిన నెదురుగనుండి యెట్లు వినుచుందు ననెదవా ? ఈవల వచ్చి దూరముందుండి రక్షించుచు నేను రాఁగానే యీ వృత్తాంతము నాకుఁ జెప్పిన నేను విచారింపనా ? నేను పెండ్లాము మాటలు విని నిన్ను సందేహింతు నని తలఁచితివా ? అటుచేయక యిటుచేయక దూరమున విడిచివచ్చుట తగునా ? అట్లు చేయుటచే నా యాజ్ఞ మీఱితివే పరతంత్రుఁడవైన నీ కది తగునా ? ఆమెది యాజ్ఞయే కదా యందువేమో కాదనను. తల్లిదండ్రులయాజ్ఞలు పరస్పరవిరుద్ధములైనపుడు నే నెట్లు వర్తింతునో యదియైన నాలోచింపవైతివిగదా ? రామచంద్రమూర్తి చెప్పిన వన్నియు సత్యములే కాని యాయన యొకవిషయ మాలోచించినవాఁడు కాఁడు. ఆయన చెప్పిన పద్ధతులలో నేది యవలంబించినను ఆయనకు సందేహము లేకుండును గాని సీతకు సందేహము బలపడును. ఈ సందేహము విషమభావమునకు విరోధమునకుఁ గారణ మగును. ఇట్టి సందర్భములందు స్త్రీలు చేయు కుచేష్టలు, భర్త పరోక్షమున మెటికవిఱుపులు, ముక్కువిఱుపులు, మూఁతివిఱుపులు, కనుగిఱుపులు, కూడునీళ్లయొద్ద ననాదరణము, బిగింపులు లోనైన వెన్నియో చేయుదురు. ఇందొకటియైనను భర్తకుఁ దెలియదు. అనుభవించువాఁడు నీభార్య యిట్లు చేయుచున్న దని చెప్పుటకు వలనుపడదు. అనుటకు లేదు. అనుభవించుటకుఁ గాదు. అట్టికొంపలో నెవఁ డెట్లుండఁగలఁడు ? గృహస్థుని యాదరణములేని యింట కొన్నిపూఁట లుండవచ్చునుగాని గృహిణి యాదరణములేని యింట మానవంతుఁ డొకపూఁట యుండుటయుఁ గుంభీపాకమున వాసము చేయుటగా నెంచును. ఈ కష్టము లక్ష్మణుఁ డాలోచించెఁగాని రామచంద్రమూర్తి యాలోచించినవాఁడు గాఁడు. భార్యాభర్తలు సుఖపడియుందురు గాని లక్ష్మణుఁడు చెడియుండును. కావున లక్ష్మణుని ఋజువర్తనమే సాధువు. ఇప్పు డట్టి మనస్తాపములకుఁ గుటుంబకలహములకుఁ గారణము లేదయ్యో.

సీ. హరిణరూపంబున ♦ నాశ్రమంబుననుండి, నన్నుఁ గొని తెచ్చిన♦దనుజుఁ డిదిగొ
నతులశరం బొందు ♦ నవలీల నే వైవ, దానఁ దెగి మృగ♦తనువు విడిచి
కేయూరభూషణా♦ళీయుత దేహుఁడై, ప్రాణముల్ ద న్నెప్డొ ♦ పాసి పోవ
వసుధపైఁ బడి యున్న♦వాఁడు దురాత్ముండు, దారుణంబైన మ♦ద్బాణఘాత
ఆ. మోర్వలేక యాతఁ ♦ డూపిరి విడుచుచు, నెద్ది వినుటఁజేసి ♦ యిచటి కీవు
నాతి విడిచి వచ్చి♦నాఁడవా దూరసం, శ్రవము నించె నాదు ♦ రవముపోల్కి.

హరిణరూపంబునన్ = జింక యాకారమున, మృగతనువు = జింక శరీరము, కేయూరభూషణాళీయుత దేహుఁడై = అంగదములు లోనగు సొమ్ములతోఁ గూడిన దేహముగలవాఁడై, మద్బాణఘాతము = నా బాణముదెబ్బను, నాతిని = సీతను, దూరసంశ్రవము = దూరమునకు వినవచ్చు ధ్వని.

తా. జింకశరీరముతో నాశ్రమమునుండి నన్నుఁ దీసికొని వచ్చిన రాక్షసుఁడు నేనొకబాణ మవలీలగా వేయఁగా నది తగులుటచే జింకశరీరము విడిచి యంగదములులోనగు సొమ్ములు ధరించిన దేహము గలవాఁడై, తీక్ష్ణమైన నా బాణము దెబ్బను సహింపలేక ప్రాణము లెపుడో తన్ను వదలిపోవ భూమిమీఁదఁ బడి యున్నవాఁడు. వాఁ డూపిరి విడుచుచు దూరము వినఁబడ నే నఱచిన ట్లఱచిన యఱుపు విని నీవు సీతను విడిచి వచ్చితివి.

—♦ ౬౦–వ సర్గము. రాముఁడు పర్ణశాలలో సీతలేమిఁ గని దుఃఖించుట. ♦—

కం. అని బిఱబిఱఁ జను రామున,కును క్రిం డాకన్నుకదలెఁ♦గూలెం బదముల్
దనువు వణఁకంగఁ దొడఁగెను, గని యా యవలక్షణములఁ ♦ గళవళపడుచున్.

క్రిం + డా + కన్ను = ఎడమకంటి క్రిందివైపు. ఇది ప్రబలానిష్టసూచకము. "అధో వామదృశో స్స్ఫూర్తౌ బహ్వానిష్టో భవే త్ప్రమాన్" అని లక్షణము. కాళ్ళు కూలఁబడెను. ప్రయాణకాలమునఁ గాళ్లు కూలఁబడుట ఇష్టవిఘ్నమును సూచించును. దశావస్థలయందు నెనిమిదవ యవస్థ వర్ణింపఁబడుచున్నది.

దృఙ్మనస్సంగసంకల్పా జాగరః కృశతారతిః ।

హ్రీత్యాగోన్మాద మూర్ఛాంతా ఇత్యనంగదశా దశ ॥ యని యవస్థలు పది. ఇవి విప్రలంభ శృంగారమునకు నంగములు. ఇం దెనిమిదవయది యున్మాదావస్థ.

తా. ఇట్లు చెప్పి త్వరత్వరగాఁ బోవు రామచంద్రమూర్తికి నెడమకన్ను క్రిందివైపు వదరెను. కాళ్ళు కూలఁబడెను. దేహము వడఁకుటకుఁ బ్రారంభించెను. ఆ యవశకునములఁ జూచి వ్యాకులపడుచు

మ. కలదా యింకను సేమ మా సుదతికిం ♦ గంజాక్షి నేఁ జూడఁగాఁ
గలనా యంచు నిజాశ్రమస్థలిని వే♦గన్స్ఫూర్తిమైఁ జొచ్చి లోఁ

కలనాదామణి లేమిఁ గాంచి భృశశో ♦ కభ్రాంతచిత్తాకృతిన్
గలఁకం బాఱుచుఁ గేల్విదుర్చుచును భూ ♦ కన్యామనోనాథుఁడున్. ౧౦౩౧

కలనాదామణి = సీత, భృశశోక = అధికమైన శోకముచే, భ్రాంత = భ్రమచెందిన, చిత్తాకృతిన్ = చిత్తము ఆకారముగ గలవాఁడై, కలఁకంబాఱుచున్ = వ్యాకులపడుచు, కళంకము (వికృతి) కలఁక.

తా. సీతాదేవి యింకను క్షేమముగా నున్నదా నే నామెను జూడఁ గలనా యని తనయాశ్రమములోఁ ద్వరగాఁ బ్రవేశించి సీత లేకుండుట చూచి యధికశోకముచే భ్రమచెందిన మనస్సు ఆకారము గలవాఁడై చేతులు జోడించుచు రామచంద్రమూర్తి

సీ. సీమంతినీమణి ♦ లేమిచే హేమంత,మునఁ బద్మిని యనంగఁ ♦ బొలుచుదాని
నేడుచు చున్నట్టు ♦ వాడినసుమములు, శకునాళి గల్గువృ ♦ క్షములదానిఁ
గాంతిహీనంబుగఁ ♦ గ్లాంతమృగం బగుఁ చ్యుతవనదేవతా ♦ తతులదాని
విప్రకీర్ణాజిన ♦ విప్రవిద్ధబృసీక, కటకుశం బగుచును ♦ గ్రాలుదానిఁ

ఆ. బాదు పెట్టినట్లు ♦ ప్రభ చెడి యున్నట్టి, స్వాశ్రమంబుఁ జొచ్చి ♦ యరసి చూచి
సీతలేమి దెలిసి ♦ చిత్తముత్తలపడఁ, దలఁచి తలఁచి యేడ్చెఁ ♦ దరుణిఁ గూర్చి.

సీమంతినీమణి = స్త్రీరత్నము, లేమిచే = లేకయుండు కారణమున, హేమంతమునన్ = మంచుకాలమందు, పద్మిని = తామరకొలను, శకునాళి = పక్షులవరుసలు, క్లాంతమృగంబు = డస్సినమృగములుగలది, చ్యుత = విడువఁబడిన, వనదేవతాతతులు = వనదేవతల సమూహములు. విప్రకీర్ణ = చెదరిన, అజిన = జింకచర్మములు, విప్రవిద్ధ = వ్యత్యాసములై పడియున్న, బృసీక, కట, కుశంబు = ఆసనములు, చాఁపలు, కుశలు గలదానిని. రావణుఁడు సీత నీడ్చునపుడు ఆమె వానిని దన కాధారముగఁ బట్టుకొనుట వాఁడు వానిని దీసి పాఱవేయుట మొదలగు కార్యములచే, నాశ్రమములోని పదార్థములు చెల్లాచెదరైన వని భావము. ఇట్లు చెప్పుటచే, సీత గిఱిలో నుండె నని నేలను పెకలించి రావణుడు సీతను దీసికొనిపోయె నని చెప్పఁబడు వాదములు నిరస్తములు. ఆమె తనచేతనైనంత మాత్రము రక్షించుకొన యత్నము చేసె నని యేర్పడుచున్నది. కూర్చుండిన దానినో నిలుచుండినదానినో యట్టులే యెత్తికొని పోయియుండిన నీపదార్థములు చెదరవలసిన కారణము లేదు. ఉత్తలపడన్ = కలఁతపడఁగా, దర్భకట్టలతోను, కృష్ణాజినములతోను, దర్భాసనములతోను, రావణునిఁ గొట్టె ననియు వాఁడు వానిని దీసివైచె ననియుఁ దోఁచెడి. ద్రౌపదీస్వయంవరమునందు "శరణాగతుండయిన ద్రుపదు నోడకుండు మని బ్రాహ్మణులు తమ తమ దండాజినంబు లెత్తి ప్రతిబలంబులపయి వీచుచున్న" ఆంధ్రభారతము, ఆది, ౭-వ ఆశ్వాసము, ౧౯౩. ఏటిలోఁ గొట్టుకొనిపోవువాఁడు సన్నకట్టెగాని గడ్డిగాని దొరకినను నది తన్ను

రక్షించు నని పట్టుకొన్నట్లు సీతయుఁ జేసెనని భావింపనగు. ప్రభ = కాంతి, అరసి = వెదకి.

తా. గృహలక్ష్మియగు స్త్రీరత్నము సీతాదేవి లేనికారణమున మంచు కారునందు కమలములేని కొలనువలె నుండుదాని, వాడిపోయిన చెట్లు మొగములు వ్రేలవైచికొనియుండు పక్షులుగలవై యేడ్చుచున్నట్లుండు వృక్షములు గలదాని, బడలిపడిన జింకలుగలదై వనదేవతలచే విడువఁడుటవలన కాంతిహీనమైన దానిని, చెదరిపడిన కృష్ణాజినములు దర్భాసనములు చాఁపలు దర్భకట్టలు గల దాని, పాడుపెట్టఁబడినట్లు ప్రభచెడి యున్న తనయాశ్రమము ప్రవేశించి వెదకి చూచి సీత లేదని నిశ్చయించుకొని మనస్సు కలఁతచెందఁగా నామెను దలఁచితలఁచి రామచంద్రమూర్తి యేడ్చెను.

సీ. అపహరించిరో కదే ♦ యసురులు పగఁబట్టి, ఘాతుకమృగములే ♦ కాంతఁ దినెనొ
యేహేతువుననైన ♦ నెం దేని యరిగెనో, దాఁగియున్నదొ పినో ♦ దంబుపొంట
భీరువుగానఁ గాం ♦ తారంబు జేరెనో, ఫలపుష్పములఁ దేర ♦ వలచి చనెనొ
స్నానార్థ మేగెనో ♦ సరసులపొంతకు, నంబువులకు నేటి ♦ కరిగె నొక్కొ

ఆ. యేమి సేయువాఁడ ♦ నెక్కడ వెదకుదు, నెందుఁ జొత్తు నిందు ♦ నెవరి నడుగ
ననుచు రోసి రోసి ♦ యంబుజాతేక్షణుఁ, గనులు వాఁచ నేడ్చె ♦ విసవిసఁబడు.

ఘాతుకమృగములు = హింసించుస్వభావముగల మృగములు, భీరువు = పిఱికి, కాంతారంబు = అడవి, వలచి = కోరి.

తా. సీత యేమైయుండునా యని పలువిధముల నాలోచించుచున్నాఁడు. “ సా మృత్కచో నుండిన నవనమ్మక మొక చోట నుండు ” నన్నట్లు సత్యము తెలియువఱకు మనస్సు నానావిధముల నాలోచించుచుండును. సీతను రాక్షసులు పగఁబట్టి యపహరించిరో - క్రూరమృగములే భక్షించెనో - ఏకారణముచేనైన నెందైనఁ బోయెనో - నన్నుఁ బరిహాసింపఁ గోరి దాఁగియున్నదో - పిఱికి గావున నొంటిగా నిందుండలేక యడవులలోనికిఁ బోయెనో - పూవులు పండ్లు తేఁగోరి పోయెనో - సరస్సులయొద్దకు స్నానముచేయఁ బోయెనో - మంచినీళ్లు తెచ్చుటకై యేటికిఁ బోయెనో - నే నేమి సేయుదును - ఎక్కడ వెదకుదును, ఎందుఁ బ్రవేశింతును. ఈ పాడడవిలో నెవరి నడుగుదురు, అని సీతను వెదకి వెదకి కన్నులుబ్బునట్లు రామచంద్రమూర్తి యేడ్చెను.

ఉ. వేఁడుబు గొన్నయట్లు, నెఱ ♦ వెంగలిరీతిని, బిచ్చి యెత్తినాఁ
గాఁ, దలదిక్కుమాలి యన, వి ♦ కారపుదృష్టి వెడంగుభంగిఁ, దా
బూఁదులు చూచు దుఃఖభర ♦ మేదురర క్తవిలోకనంబులన్
మోఁదుకొనున్ శిరంబుఁ దన ♦ ముంగయిచే నిఁక నేది దిక్కనున్. ౧౦-౨౮

వేఁడుబుగొన్నయట్లు = ఉన్మాదముపట్టినట్లు, నెఱ = పూర్ణముగా, వెంగలి =

అవివేకి, వెడంగుభంగి = జ్ఞానహీనునివలె, దుఃఖభర = శోకాతిశయముచే, మేదుర=దట్టముగ, రక్త=ఎఱ్ఱనైన, విలోకనంబులన్ = కన్నులచే, మోఁదుకొనున్ = కొట్టుకొనును, ముంగయిచేన్ = ముందరిచేతితో, వేఁదుఱు = వెంగలి, వెడఁగు = పిచ్చి, యివన్నియు నించుమించు సమానార్థములే - దుఃఖాతిశయముఁ దెలుపఁ బ్రయోగింపఁబడెను.

తా. శోకాతిశయముచే నెఱ్ఱనైన కన్నులతో వికారపుఁజూపులతో పిచ్చిపట్టినవానివలె మూఢునివలె ముంజేతితో తలకొట్టుకొనును - ఏడ్చును - ఇఁక నాకెవరు దిక్కనును.

—♦ రాముఁడు సీతను వెదకుట ♦—

చ. పరువిడుఁ జెట్టుచెట్టునకుఁ ♦ బాఱును బల్వడి గుట్టగుట్టకున్
జరగును బుట్టబుట్టకును ♦ సాగును దొందర వాఁకవాఁకకున్
గరము విలాపయుక్తుఁ డగు ♦ గాఢతరార్తిమహాబ్ధిమున్గు నన్
వరఁకులు పెట్ట నీకుఁ దగ♦వా మగువా యని యేడ్చు దీనుఁడై. ౧౦ ౨౫

బల్వడిన్=మిగులఁద్వరగా, కరము=మిక్కిలి, వరఁకులు=చిక్కులు.

తా. సీతాదేవి మఱుఁగున నున్నదేమో యని చెట్టుచెట్టునకుఁ బరువెత్తును. మిగులఁద్వరగా గుట్టగుట్టకుఁ బరువెత్తును. పుట్టపుట్టకుఁ బోవును. వాఁకవాఁకకు నీళ్ళకై పోయెనేమో యని పోవును. మిక్కిలి యేడ్చును. అతిశయించిన శోకసముద్రమున మునుఁగును. ప్రియులారా! నన్నుఁ జిక్కులఁ బెట్ట నీకు మరియాదా యనును. దీనుఁడై యేడ్చును. ఇప్పుడిచ్చట నొకవిషయము విచారింపవలసి యున్నది. శ్రీరామచంద్రమూర్తి సీతకై యేడ్చిన యేడుపు వగలయేడుపా నిజమైన యేడుపా? లోపల దుఃఖము లేకున్నను తనకార్యము సాధింపఁ బురుషుని మోసగింప స్త్రీలు దుఃఖమున్నట్లు లేడ్చు నేడుపు వగలయేడుపు - మనస్సు నొప్పితగిలి మనసు కరిఁగి యేడుచు నేడుపు నిజమైనయేడుపు. ఈరెంటిలో శ్రీరామచంద్రమూర్తి యేడ్చిన యేడుపేది? మొదటిదా రెండవదా? మహేశ్వరతీర్థులవారిట్లు వ్రాసిరి. వారువ్రాసినది చక్కఁగ బోధపడుటకై మూలశ్లోకముల ననువదించెదను.

యత్నాన్మృగయమాణస్తు, నాససాద వనే ప్రియాం।
శోకరక్తేక్షణ శ్శోకా, దున్మత్త ఇవ లక్ష్యతే॥
వృక్షాద్వృక్షం ప్రధావన్ స గిరేశ్చాద్రిం నదాన్నదీం।
బభూవ విలపన్రామ శ్శోకపంకార్ణవే ప్లుతః॥౧౧॥

శ్లోకార్థము—ఎంత యత్నముచేసి వెదకినను ప్రియురాలు కానరాలేదు. శోకముచే నెఱ్ఱనైన కన్నులుగలవాఁడై యున్మత్తునివలెఁ గానవచ్చెను॥ ౧౦॥ చెట్టునుండి చెట్టునకు కొండనుండి కొండకు నదమునుండి నదికి పరువెత్తుచు - విలపిం

చుచు శోక మను పంకసముద్రమున మునిఁగెను. దీనికి వ్యాఖ్య యిట్లు వారు వ్రాసిరి. ఇందు నున్మత్తునివలె ననుచో నుండు 'వలెను' అనుపదము సర్వత్ర శ్లోకము నందు సంబంధింపఁజేయవలెను. అనఁగా ఎఱ్ఱనైనకన్నులు గలవానివలె, నున్మత్తునివలె, శోకముచేఁ బరువెత్తినవానివలె, నేడ్చినవానివలె, శోకార్ణవమున మునిఁగినవానివలెఁ గానవచ్చెను అని సంబంధము.

వాస్తవ మేమనఁగా శ్రీరాముఁ డట్టివాఁడు కాఁడు అని యర్థము. (అనఁగా నాయనకుఁ గన్నులెఱ్ఱన కాలేదు, ఏడువను లేదు, పరువెత్తను లేదు, శోకమున మునుఁగను లేదు అని వారిభావము.) ఈ కారణముచేతనే సీత నుద్దేశించి యేడ్చుట సీతను వెదకుసమయమున సీత నుద్దేశించి చెట్లను మృగములను ప్రశ్నించుట సర్వము శ్రీరామునిచే లోకమునకు నేర్పుటకుఁగాను నటనము చేయఁబడెను అని తెలుపుటకే సర్వజ్ఞుఁడైన భగవంతుఁడు వాల్మీకి భ్రమగొన్నవానివలె నున్మత్తునివలె నని యగు "వలె" శబ్దమును ప్రయోగించెను. ఆ కారణముచేతనే శ్రీశుకులును "రక్షోధమేన వృకవ ద్విపినే సమక్షం। వైదేహరాజదుహితర్యపి యాపితాయామ్। భ్రాత్రా వనే కృపణవ త్ప్రియయా వియుక్తః। స్త్రీసంగినాం గతిమితి ప్రథయంశ్చచార॥ మర్త్యావతార స్త్విహ మర్త్యశిక్షణం। రక్షోవధాయైవ న కేవలం విభోః। కుతోఽన్యథా స్యాద్రమత స్స్వ ఆత్మని। సీతాకృతాని వ్యసనా నీశ్వరస్య, నవై న ఆత్మాత్మవతా మధీశ్వర స్సక్త స్త్రిలోక్యాం భగవాన్ వాసుదేవః న స్త్రీకృతం కశ్మలమశ్నువీత న లక్ష్మణం చాపి విహాతు మిచ్ఛతి॥ దీని యర్థము — రాక్షసాధముఁడు తోడేలువలె నడవియందు భర్తయెదుట లేనియప్పుడు సీతాదేవిని తొలఁగదీసికొనిపోయెను. అంత రాముఁడు తమ్మునితోడఁ బ్రియురాలిని బాసి దీనునివలె స్త్రీసంగము గలవారిగతి యిట్టిదగును, అని చాటుటకై యడవిలోఁ దిరిగెను. ఆ విభుని యొక్క మనుష్యావతారము రాక్షసవధముకొఱకే కాదు. మనుష్యులకు ధర్మములు నేర్పుటకును, అటుగాదేని తన యాత్మయందే రమించు నీశ్వరునకు సీతవలన నేల వ్యసనములు గలుగును? ఆత్మవంతులకు నెల్లనాత్మయు నధీశ్వరుఁడును, భగవంతుఁడు, వాసుదేవుఁడు నగువానికి స్త్రీ నిమిత్తమైన కశ్మల మెట్లంటును? లక్ష్మణుని విడువఁగోరినవాఁడును గాఁడు" అని చెప్పెను. అట్లే స్కాందమున నుమాసంహితయందు.

"అహం దాశరథిర్భూత్వా, హన్మి రావణ మాహవే।
శ్రీమద్రామావతారేస్మిన్, స్నిగ్ధవ త్క్రియతే మయా।
తత్ర శంకా నకర్తవ్యా, సర్వజ్ఞే నాపి మాయయా।
మన్మాయా మోహితం రక్షో, మనుష్యం మా మవేక్ష్యతి।
అన్యథా తస్య నానూనం, నభవే ద్యత్ర కుత్ర చిత్."

అని విష్ణువు దేవతలకుఁ జెప్పెనని యున్నది. అనఁగా "నేను దశరథునకు

గొడుకనై రావణుని యుద్ధమందుఁ జంపెదను; శ్రీరామావతారమందు సర్వజ్ఞుఁడనైనను మాయ నాశ్రయించి జ్ఞానము లేనివానివలెఁ గార్యములు చేసెదను. అందు సందేహము లేదు. నా మాయచే మోహితుఁడై రావణుఁడు నన్ను మనుష్యునిగానే భావించును. అటుగాదేని వాఁడెందును జావఁడు." అని యర్థము. మఱియు నాత్మవస్తువుగాని దేహాదులందు నాత్మబుద్ధి సేయుటచేతనే అనేకవిధదుఃఖప్రలాపములు కలుగుచున్నవి. అనాత్మయం దాత్మబుద్ధి కజ్ఞానము కారణము. అట్టి యజ్ఞానము సర్వజ్ఞునకు నెందుండి వచ్చును ? మఱియు తనలీలలు వినుటవలన సర్వజనులకు ముక్తి నిచ్చుటకై రాజరూపమును నవతరించిన సచ్చిదానందవిగ్రహుఁడును పరమాత్మయు నగు శ్రీరామునకు మాయాధిష్ఠాతకు పరమేశ్వరునకు భృగుశాపాదులచేనైనను నజ్ఞానవాసన గలదని చెప్పుటకు సాధ్యపడదు. కావున నిట్టి విలాపాదులు సర్వము శ్రీరామునిచే లోకశిక్షార్థమునకే చేయఁబడె నని తెలియవలయును. ఇతరస్థలములందును నిట్టిచోటుల నిట్టులే యర్థము ననుసంధింపవలెను. ఇట్లని మహేశ్వరతీర్థులవారు వ్రాసిరి.

స్వానుష్ఠానముచేత ధర్మములను లోకమున కుపదేశింప వచ్చిన యవతారము శ్రీరామావతార మనుటయు నందు సర్వతీహాని కాని సర్వజ్ఞత్వహాని కాని లేదనియు నంగీకరింపవలసిన విషయములే. విలాపాదులు లోకశిక్షకై చేయఁబడె నని చెప్పఁబడెను గదా ! ఇప్పుడు మీరు చెప్పెడు నర్థప్రకారము లోక మేమి నేర్చుకొనవలెను ? భార్యను గోలుపోయినవాఁడు శ్రీరామచంద్రమూర్తి వలె పగలేడ్పు లేడువవలయు ననియా నేర్చుకొనవలెను ? కోకకుండు నేడువక యే యుండి భార్య పోయినను యెంత యవమానము వచ్చినను పురుషుఁడు నిబ్బరించుకొనవలయు ననియు నేడువరాదనియు నేర్పిన బాగుండును గదా !

ప్రియవియోగమున నేడువవలయు నని లోకమునకు భగవంతుఁ డవతరించి నూతనముగ నేర్పవలయునా ? భగవద్గీత కష్టదశలందు లోకసంగ్రహార్థ మేడువు మని చెప్పుచున్నదా ? సహింపు మని చెప్పుచున్నదా ? సీతాదేవియు శ్రీరామచంద్రమూర్తివలె స్త్రీలకు స్త్రీధర్మము స్వానుష్ఠానముచే నుపదేశింపఁ బుట్టినదే కదా ? ఆమె యేడ్పు పగలేడ్పా ? పతివియోగమున సతులు పగలేడ్పు లేడ్వవలయుననియా యామె యుపదేశము ? కావున శ్రీరామచంద్రమూర్తి పగలేడుపు లేడిచె ననుట నంగీకార్యముగాదు.

శ్రీ శుకులు— "స్త్రీసాంగత్యముగలవారి కిట్టిదశ లభించునని చాటుటకై రామచంద్రమూర్తి చరించెననుటయు నంగీకార్యమే. లోకులారా ! స్త్రీసాంగత్యము వలన నాకీ కష్టము, అవమానము కలిగెను. మీరును స్త్రీసాంగత్యము చేసిన మీకు నిట్టి కష్టదశయే లభించును" అని తాను దుఃఖ మనుభవించుచుఁ జెప్పిన లోకము విశ్వసించునుగాని తాను పగలేడ్పు లేడ్చుచుఁ జెప్పిన లోక మిది టక్కుని

యెంచునేకాని నిజమని విశ్వసించునా? విశ్వసింపదు. కావున వాస్తవముగ రామచంద్రమూర్తి కన్నీరు గార్చెననియు నాయనకుఁ గన్నులెఱ్ఱనగుట ఆయన చెట్టు చెట్టునకు గుట్టగుట్టకుఁ బరువెత్తుట వాస్తవమనియు గ్రహింపవలెను. వాస్తవ దుఃఖ మనుభవించువానివిషయమున లోకము పరితాపపడునుగాని పగలమారుల విషయమునఁ బరితాపపడునా? రావణాసురుఁ డపహరించినది వాస్తవసీతను గాదు గావున రామచంద్రమూర్తియేడుపు వాస్తవము గాదనుట వారివాదము ప్రకారము సరియే. భార్య పోయినఁగదా దుఃఖము! భార్య యింట సుఖముగా నున్న దను జ్ఞానముగలవానికి దుఃఖ మెట్లు వచ్చును? అట్లు వచ్చినట్లు నటించెనేని యది వంచనమే.

శ్రీరామచంద్రమూర్తి లోకమును వంచింప వచ్చినవాఁడు కాఁడు. రావణాసురుఁడు పట్టుకొని పోయినది వాస్తవసీతనే. ఆమె పతివియోగమునకును తన వలనఁ దనభర్తకు మిగులఁగష్టము కలిగెఁగదా ఆయన యెంతపరితపించు చున్నాఁడో యని దుఃఖించుటయు వాస్తవమే. అట్టులే శ్రీరామచంద్రమూర్తి దుఃఖించుటయు వాస్తవమే. వీరు తా ముద్దేశించిన యర్థము సాధించుటకై మాటమాటకు వలెవలె నని కవి చెప్పనిదానిని దాము చేర్చిం దా యీయర్థమును గల్పించిరి? కావున నిది వీరియర్థమేగాని వాల్మీకి యుద్దేశించినది కాదు. వ్యాఖ్యాతలు మూలమున కర్థము వ్రాయునపుడు నాయభిప్రాయము ప్రకారము దీని కీ యర్థ మనవచ్చునుగాని లేనిదానిని లక్షణలచే నధ్యాహారములచే కాకువులచే విరుద్ధార్థముఁ గల్పించి యిది కవియుద్దేశ మనుట సరిగాదు.

ఉన్మత్తునివలె నని వాల్మీకి చెప్పలేదా యందు రేమో! చెప్పెను. సత్యమే. దాని కేమియర్థము? ఒకఁ డున్మత్తుఁ డెప్పు డగును? మతిచెడి యది వాని స్వాధీనమందు లేకపోయినపుడుగదా? అట్టులే శోకాతిశయముచే మతిచెడి స్వస్థావస్థయందుండువాఁడు వర్తింపవలసినవిధముగ వర్తింపకున్నప్పు డున్మత్తునివలెఁ గానవచ్చును. శోకముపోయెనేని మరల స్వస్థుఁ డగును. ఉన్మత్తునివలె ననిచెప్పక యున్మత్తుఁడే యైనాఁడని చెప్పియుండిన శ్రీరామచంద్రమూర్తి వైద్యశాలకుఁ బోవలసినవాఁడే యైయుండును. ఇతరచికిత్సలేక స్వస్థావస్థ వచ్చియుండదు. ఉన్మత్తునివలె నని చెప్పుటకుఁ గారణము చెట్టు చెట్టునకు గుట్టగుట్టకుఁ బరువెత్తుట, మృగపక్ష్యాదులఁ బ్రశ్నించుటవలన ననియు దానికిఁ గారణము శోకసముద్రమున మునిఁగియుండుట యనియు గ్రహింపవగు.

కావుననే వలె (ఇవ) నను నుపమావాచక మొక్కచోటనే ప్రయోగించి తక్కినతావులఁ బ్రయోగింపఁడయ్యె. కావున నున్మత్తునివలెఁ గానవచ్చుటకు శోకాతిశయమే కారణ మని యెంచవలయును. లోకశిక్షకై యిట్టివేషమునటించె ననిరికదా! ఆ యడవియందు మనుష్యుఁడనువాఁడే యానమయమున లేఁడయ్యెఁ

గదా? ఆవల నెన్నిసంవత్సరములకో వాల్మీకి రామాయణము వ్రాయువఱకు నప్పుడు జరిగినవృత్తాంతము లోకమునకుఁ దెలియదయ్యెనుగదా! ఇఁక నాశిక్ష యెవ్వరికి? ఓయీ! రామచంద్రమూర్తి వాస్తవముగ శోకించె నని చెప్పెదవు గదా! ఆయన భగవంతుఁ డనువిషయము నీవు నంగీకరించిన విషయమేకదా! భగవంతునందు హేయగుణమైన శోకముండునా? అను ప్రశ్న వచ్చును. భగవంతుఁడు సమస్తకళ్యాణగుణవిశిష్టుఁడు హేయగుణవర్జితుఁ డనుట నిస్సందేహము. శోకావేశము హేయగుణ మనువారు 'క్రోధ మాహారయ త్తీవ్రం వధార్థం సర్వరక్షసామ్' రాక్షసుల నందఱను వధించుటకై రామచంద్రమూర్తి క్రోధమును గ్రహించె నన్నప్పుడు క్రోధావేశ మెట్లు మీరంగీకరించితిరి! క్రోధము హేయగుణము గాదా! అవతారదశయందే కాక విష్ణుత్వంబునను, మాల్యవదాదులతోఁ బోరినపుడాగ్రహించె నని యుత్తరరామాయణమునఁ జెప్పఁబడెనుగదా! దాని కేమిప్రత్యుత్తరము? శ్రీరామచంద్రమూర్తియందు హేయగుణమైన శోక మెందుండివచ్చె నను వారు రజోగుణతమోగుణవిశిష్టులైన మనుష్యులతో రామచంద్రుని బోల్చి మాటలాడుచున్నారు. అది సరిగాదు. ఒకబిడ్డ తీవ్రవ్యాధిచే బాధపడుచు నాబాధ సహింపలేక యేడ్చును. వానిబాధ చూడలేక తల్లి యేడ్చును. రెండు నొకటి యగునా? మనస్తత్త్వమున భేదములేదా? పరదుఃఖమును దనదుఃఖముగా నెంచి యేడ్చుట రెండవది. దీనికే దయ యనిపేరు. దయ హేయగుణముకాదు - మఱి కళ్యాణగుణమే. ఇట్టిదయ విస్తారముగ రామునియందుఁ గలదు. ఇది వాల్మీకియే వ్రాసియున్నాఁడు: "క. వ్యసనంబులు జనములకును, బొసఁగినఁ దా నధికదుఃఖమును బొందును సం। తసమును గన జనములు సం,తసమును దా నొందుచుండుఁ దండ్రి విధమునన్॥" అయోధ్య ౬౬ ప.

ఇచ్చటఁ దండ్రివిధమున ననునది దుఃఖమందు సంతోషమందుఁ గూడ నన్వయింపవలెను. ఇది హేయగుణమా? కళ్యాణగుణమా? తననిమిత్తమై యితరుల కింతదుఃఖము వచ్చెఁగదా యని రామచంద్రమూర్తి దుఃఖించెనని యయోధ్యాకాండమందుఁ జెప్పఁబడియుండుట పాఠకులకు విదితమేకదా! "నే వనవాస నిష్ఠపై। మనము దిటంబుసేసియును మాన్యుని నబ్బరతుం దలంచినన్। వసటను మానసంబు కడుబాలికవృత్తి భజించు లక్ష్మణా?" యనియు, "సీతావిరహజం దుఃఖం, న మే సౌమ్య తదాగతం। యథా వినాశో దుఃఖస్య మత్కృతేచ పరంతప॥" యనియు రామచంద్రమూర్తియే చెప్పెగదా! కావున సీతావిషయమున దుఃఖించుటకు నిదియే కారణముగాని కేవలకామముగాదు - అజ్ఞానముగాదు - వగలమారితనము గాదు. శ్రీరామచంద్రమూర్తి దుఃఖించుకారణము హనుమంతుఁ డిట్లుచెప్పెను: "క. శ్రీరాఘవుఁ డేమిటఁగాఁ, గారుణ్యం బానృశంస్యగరిమయుఁ గడుదు। ర్వారపుశోకము మదనుఁడు గావింపఁగ వేఁగునట్టి కాంత యిదే యా॥ సీ. ఆపదవేళల

సంగననోర్చు ర్యుఁబోవలేదనని కారుణ్యమునను । నన్ను నమ్మినదాని కిన్నిపాట్లబ్బిన సైఁచితి ననునానృశంస్యమునను । అర్ధాంగలక్ష్మిని నకట గోల్పడితిఁగా సుందరి ననియెడిశోకమునను । నొద్దలేదాయెఁగా యీవ్వాలుకుప్ప నాప్రియ యున్న నెరవేఁకి వేఁకరమున। తే. సకల యీనాలుగింటను సడలుచుండు । రామచంద్రుండు హృదయ మీరామయుంద । నిలిపె నీమేఁయుఁ బతియంద నిలిపె మనముఁ । గాన బ్రదికిరి వీరలు గడియమైన॥” (సుం. ౪౫౨-౪౫౩ పద్యములు.)

ఈపద్యముల కర్థము సుందరకాండమునందు వ్రాయఁబడును. ఆరణ్య ౯౯౧-౯౯౨ పద్యములు చూచునది. కావున శ్రీరామచంద్రమూర్తి శోకించుట కీ నాలుగు కారణములని యెఱుఁగ నగు. తన కేట్టిసంబంధములేని స్త్రీకైనను ఆపదవచ్చెనేని దయతో నామెకు సాహాయ్యము చేయవలసినది పురుషునకు విధి. ఇఁకఁ దన్ను నమ్మి తనసేవకై వచ్చిన దానిసదానికైనను నాపదవచ్చెనేని దాని యందు దయదలఁచి రక్షింపవలసినది విధి. అట్లు వచ్చినది భార్యయగునేని దాని నట్టులే రక్షింపవలసినది పురుషున కవశ్యకర్తవ్యము. అట్టిభార్య పరమపతివ్రతయై తనయం దత్యంతప్రేమగలదై తన్నుఁ బ్రాణముగా నెంచికొని యుండునపుడు దానికై దయదలఁపవలసిన దత్యంతావశ్యకము అని వేఱుగఁ జెప్పవలయునా? పామరజనులవిషయ మిట్లుండ పరమకారుణికుఁడగు భగవంతుఁడు తన్నాశ్రయించిన వారివిషయమున వగలేమ్పులేద్చునా? ననము గ్రహింపవలసిన వాస్తవార్థ మేమనఁగా సీతాదేవి జీవస్థానమున గ్రహింపవలె ననియు, నొకక్షణమునఁ బ్రమాద పడి కామవశమయి భర్తతప్పుటచే నింద్రియములకు వశపడి, దేహప్రాప్తి గాంచె నని ముందు చెప్పఁబడెను. ఇఁక పరమదయాళువగు నీశ్వరునికృత్యము శ్రీరామ చంద్రమూర్తి చర్యవలనఁ దెలియనగు. జీవకోటికంతయు భగవంతుఁడు - మాత - ధాత-శరణము-సుహృత్తు అని యీప్రకారము భగవద్గీత చెప్పుచున్నదికదా! జీవకోటికంతయు ధారణపోషణకర్త భగవంతుఁడేకదా!

ఇట్టిబిడ్డలు సంసారసాగరమునఁ బడి దరిగానక యల్లాడుచుండ కన్నతల్లి దండ్రు లూరక చూచుచుందురా? ఉండరు. కావుననే “ఏవంసంసృతిచక్రస్థే, భ్రామ్యమాణే స్వకర్మభిః । జీవే దుఃఖాకులే విష్ణోః కృపా కా ప్యుపజాయతే.” ఈవిధముగ తాముచేసిన కర్మములచే సంసారచక్రమునఁ దగులుకొని భ్రమించు చుండు జీవులయందు భగవంతుఁడు దయగలవాఁడై వారికి వచ్చిన కష్టములకై యెంతయో పరితపించి వారి నుద్ధరింప యత్నించును. అట్టులే తెలివితక్కు వచే ప్రకృతిపదార్థమందు (మాయామృగము) కామముగలిగిన జీవుఁడు (సీత) లంకయందుఁ (దేహమందు) దగుల్కొని దుఃఖింపఁగా “నన్నకాని యన్య మెన్నఁడు నెఱుఁగనివారి విడువ నెట్టివారినైన” ననియు నన్నే యాశ్రయించినవారి నన్నివిధములఁ నేనే రక్షింతు ననియు వ్రతముగాఁ గొన్న

భగవంతుఁడు ఆర్యో నన్నాశ్రయించిన దానికి (జీవునకు) కష్టమువచ్చెనే యని యాజీవికష్టమునకై పరితపించుట యరణ్యకాండమందును, ఆజీవుని రక్షించుటకై యత్నించుట కిష్కింధా సుందరకాండములందును, రక్షించి యనుగ్రహించి స్వీకరించి సాయుజ్య మిచ్చుట యుద్ధకాండమందును జెప్పఁబడుచున్నది. వక్రమార్గమునఁ బోయిన బిడ్డలకై తలిదండ్రు లెంతపరితపించునది బిడ్డలు తెలిసికొనఁజాలరు. అట్లులే మనకై భగవంతుఁ డెట్లు శ్రమించుచున్నాఁడో మన మెఱుఁగఁజాలము. ఆవిధము రామచంద్రుని చరిత్రమువలనఁ దెలిసికొనవలసియున్నది. కావున మానుష భావముచేతఁ జూచినను రామచంద్రమూర్తిశోకము వాస్తవమే. "తొయ్యలుల కన్న రమ్యవస్తువులు లేవు వారలే కష్టములకెల్లఁ గారణములు" అను నీతియుఁ, బతివ్రతయు ననుకూలయు నగు భార్యవిషయమున భర్త యెట్లుండవలసినదియు మనము నేర్చుకొనవలయును. పరమార్థదృష్టిఁ జూచితిమా. మనము ప్రాకృత విషయములపై మనస్సు పోనీయరాదనియు, దృఢముగ మనము భగవంతున కనుకూలురమై యుండితిమేని మనకే యెన్నికష్టములయినఁ బడి భగవంతుఁడు రక్షించుననియు, దృఢవిశ్వాసము గలిగి ఆత్మనిక్షేపము చేసినవారము కావలయు ననియు నేర్చుకొనవలయును. కావున శోకదుఃఖము మిథ్యగాదు. పరమభక్తిలక్షణ మసియు, రామచంద్రమూర్తి శోకము పరమకారుణికుఁడు భక్తవత్సలుఁ డగు భగవంతునిలక్షణ మనియు గ్రహింపనగు. భగవంతుఁ డింతటి దయాళువు గాకుండిన జీవకోటి యాయన ననుసరింపఁ బనిలేక యుండదు. ఇది భగవంతుని మార్దవగుణమును బ్రకటించుచున్నది. "ఆశ్రితవిరహాసహత్వమ్ మార్దవ"మ్మని సుదర్శనాచార్యులు. ఆశ్రితవిరహము సహింపలేకపోవుట మార్దవ మనఁబడును. బోయవానిచేఁ జంపఁబడిన పక్షిని దానికై వగచు నాఁడుపక్షిని జూచి వాల్మీకి శోకించెఁగదా! కరుణామయుల చిత్తమిట్టిదియై యుండ, స్త్రీ - అందు నాశ్రితురాలు - తన నిమిత్తమై సర్వభోగములు వదలి యడవులపాలైనది - భార్యయగుటచే రక్షింపవలసినభారము దనయందుంచినది యిట్టిదానికి నాపదవచ్చినపుడు మగవాఁడు వగలేడ్పు లేడ్చినన నేమనుకొనవలెను?

భగవంతుఁడు, స్వాభావికానవధికాతిశయ జ్ఞానబలైశ్వర్య వీర్యశక్తి తేజస్సౌశీల్యవాత్సల్యమార్దవార్జవ సౌహార్ద సామ్య కారుణ్య మాధుర్య గాంభీర్యౌదార్యాద్యనేక కళ్యాణగుణములు గలవాఁడు. తన స్వజనుల కాపదవచ్చిన నెట్లు సహింపఁగలఁడు?

అట్లైన నాయనశోకమునకును మనశోకమునకును భేద మేమందువా? మన కొకవస్తువు ప్రియమగుట మనకు దానివలన నొకలాభమో సంతోషమో యేదేనొక ప్రయోజనము సంబంధించియుండుటచేతనే. అట్టి ప్రయోజనము లేనిచోట ప్రేమలేదు. మన బిడ్డలు వృద్ధికివచ్చిన సంతోషించునట్లు వారు చచ్చిన యేడ్చు

నట్లు పరులబిడ్డలకై సంతోషింపను ఏడువను. వారివలన మనకుఁ గలిగిన లాభము సంతోషము దొలఁగె నని మనకై యేడ్తుము. చచ్చినవానికై యేడ్చువారు లేరు. భగవంతుఁ డట్టివాఁడు కాఁడు. అవాప్తసమస్తకాముఁడు. మనవలన నాయన కేప్రయోజనము లేదు. సర్వదా మనశ్రేయస్సు గోరియుండువాఁడు. మనకు దుఃఖముకలిగిన నయ్యో మనబిడ్డల కిట్లు వచ్చెనే యని దుఃఖించును- మనకు స్వలాభాపేక్ష గలదు. ఆయనకు లేదు.

ఓయీ! అట్లైనచో శ్రీరామచంద్రమూర్తి శుద్ధసత్త్వమయచైతన్య స్వరూపుఁడుగదా! ప్రాకృతములైన కన్నీళ్లు కార్చును? కన్నీళ్లు రక్తము లోనైనవి లోకవిడంబనార్థము స్వమాయాకల్పితము. మాయయనఁగా మిథ్యయని యర్థముగాదు. సంకల్పరూపకజ్ఞానశక్తి. సత్యజ్ఞానములేదేని రసోదయములేదు. రసోదయకారణముగాని కావ్య మస్పృశ్యము. కొంద ఱీ వ్యసనమున రామచంద్రమూర్తి తనస్వరూపస్వభావముల మఱచెనందురు. ఇది సరిగాదు. ఆయనకే విస్మృతి వచ్చినచో మఱల నాయనను జక్కఁబఱుచువారెవరు? దీనికి ప్రత్యుత్తరము భగవద్గీత చెప్పుచున్నది.

అవ్యక్తం వ్యక్తి మాపన్నం మన్యతే మా మబుద్ధయః।
పరంభావ మజానంతో మ మావ్యయ మనుత్తమమ్॥ ౭-౨౪.

అనుత్తమము నవ్యయము నగు నాపరమభావము దెలియనిమూఢులు నే నొకప్పు డవ్యక్తుఁడుగా నుండి యిప్పుడు వ్యక్తుఁడ నైతి నని తలఁతురు. "సదా పశ్యంతి సూరయ" యన్నట్లు చూడఁగలవారి కక్కడ వ్యక్తుఁడనే- ఇక్కడ వ్యక్తుఁడనే. తెలిసికొనలేక నేను దమవలెఁ గర్మబద్ధుఁ డనుకొనువారికి నిచ్చట నవ్యక్తుఁడనే. బిడ్డలకు రోగము వచ్చినదని యేడ్చువారు తమ్ము దాము మఱతురా?

సీ. బింబమా! రుచిరక ♦ దంబమా! కంటివే, బింబోష్ఠిని గదంబ ♦ ప్రియను బ్రియను
గీరమా! పక్వమా ♦ లూరమా! కంటివే, కీరవాణిని బిల్వ ♦ హారికుచను
సాలమా! మృగచక్ర ♦ వాళమా! కంటివే, సాలప్రియను గృష్ణ ♦ సారనయనఁ
గకుభమా! చెపుము నేఁగ యిభమా! కంటివే, కకుభోరుఁ గరిరాజ♦గమనరమణిఁ

తే. దిలకనూనమ! ప్రియసతిఁ ♦ దిలకనగము!, నీవయైనను గంటివె ♦ నెలఁతఁ జెపుము
యింపు మీఱఁగ జంబు! నీ♦జాబు చెపుము, జంబుమస్నిగ్ధఁ గంటె వ♦నంబులోన,

బింబమా = దొండతీఁగా, రుచిర = మనోహరమైన, కదంబమా = కడపచెట్టా, బింబ+ఓష్ఠిని = దొండపండువంటి పెదవికలదానిని, కదంబప్రియను = కడపపూవులిష్టముగాఁ గలదానిని, బింబమా! బింబోష్ఠిని జూచితివా? కదంబమా! కదంబప్రియను జూచితివా? యన్నప్పుడు వానిసంబంధము తెలియనగును. ఇట్లె యిఁకమీఁదఁ దెలియవలెను. కీరమా = చిలుకా, పక్వ = పండిన, మాలూరమా =

మారేడుచెట్టా, కీరవాణిని = చిలుకపలుకులవంటి పలుకులుగలదానిని, బిల్వ = మారేడుపండువలె, హారి = మనోహరమైన, కుచను = స్తనములుగలదానిని. దీని వలన సీత పద్మినీజాతిస్త్రీయని యేర్పడెను. "స్తనయుగ మపి యస్యా శ్రీఫల శ్రీవిడంబి" యని పద్మినీజాతిస్త్రీలక్షణము. ఇవి మాత్సర్యముచేఁ బ్రత్యుత్తర మీయలేదని మఱికొన్నిటి నడుగుచున్నాఁడు. సాలమా = మద్ది, మృగచక్ర వాళమా = జింకలసమూహమా, సాలప్రియను = మద్దిపండ్లయందుఁ బ్రీతిగల దానిని, కృష్ణసారనయనన్ = జింకకన్నులవంటి కన్నులుగలదానిని, అవి యూరక యుండుటచే వానికిఁ దెలియ దని మఱికొన్నిటి నడుగుచున్నాఁడు. కకుభమా = ఏఱుమద్ది, ఇభమా = ఏనుఁగా, కకుభోరు = కకుభమువంటి తొడలుగలదాని. ఇచటఁ గొందఱు కకుభోరుని కరభోరు అని పఠించెదరుగాని యది ప్రకృత శైలికి విరుద్ధము. బింబమా బింబోష్ఠిని, కీరమా కీరవాణిని, సాలమా సాలప్రియను, అని యీ ప్రకారము చెప్పుచు నడుమ ఇచ్చటమాత్ర మావరుస దప్పించె ననుట సరిగాదు. కరిరాజగమన = శ్రేష్ఠమైన యేనుఁగునడకవంటి నడకగల దానిని, తిలకనూనమ = బొట్టుగుపుష్పమా, తిలకనగమా = బొట్టుగుచెట్టా, జంబు = నేరేడా, జంబుసుస్నిగ్ధన్ = నేరేడుపండువలె నునుపైన దేహముగల దానిని.

తా. దొండతీఁగా! దొండపండువంటి పెదవిగలదానిని జూచితివా? కడవ చెట్టా! నీపూలయందుఁ బ్రియమువడు నాప్రియురాలిని, జూచితివా? చిలుకా! నీవలెఁ బలుకుదానిని, జూచితివా? మారేడుపండా! నీవంటి స్తనములుగలదానిని కంటివా? మద్దీ! నీపండ్లయందుఁ బ్రియముగలదానిని వీక్షించితివా? జింకలమంద లారా! మీకన్నులవంటి కన్నులుగలదాని నీక్షించితిరా? కకుభమా! నీవంటి తొడలుగలదానినిఁ గాంచితివా? ఏనుఁగా! నీవలెనడచుదాని దిలకించితివా? తిల కమా! స్త్రీలలోఁ శ్రేష్ఠురాలగు నాప్రియురాలిని గంటివా? నేరేడా! నీవైన నిజము చెప్పుము. నీపండ్లవలె నునుపై మినమిన మెఱయు దేహకాంతిగలదానిని నీ వన ములో విలోకించితివా?

కం. శోకాపహామ యశోకమ, శోకోపహతాత్ము నన్ను ♦ శుభ మగుఁ ద్వన్నా
మాకలితునిఁ జేయఁగదే, యాకలకంఠీవిధంబు ♦ నని నాతోడన్. ౧౦౨౭

శోకాపహామ = శోకమును బోఁగొట్టుదానా, శోకోపహతాత్మున్ = శోకముచేఁ గొట్టఁబడినవానిని, త్వన్నామాకలితునిన్ = నీపేరుగలవాని ననఁగా నశోకుని = శోకములేనివానిని, కలకంఠీవిధంబు = మధురస్వరముగల సీతాదేవి తెఱఁగు.

తా. అశోకమా! నీవు శోకమును బోఁగొట్టుదానవు కనుకఁగదా నీ కాపేరు వచ్చెను. నేను శోకముచే బాధపడుచున్నాను. సీతాదేవివృత్తాంతముఁ జెప్పి నన్ను నీపేరుగలవానిఁగాఁ జేయుము.

సీ. తాళమా! యింత కాం♦తాళమా, చెప్పుమా, తాళఫలస్తని ♦ దార లేదె
చూతమా నీదయ♦చూత.మానూతన, చూతపల్లవపాణిఁ ♦ జూడలేదె
నీపమా! వృక్షావ♦నీపమా యియ్యెడ, నీపసుమాధర ♦ నీవు కంటె
జంభమా! యింతటి♦జంభమా చెప్పుమా, జంభపయోధర♦జాడఁ గంటె

తే. పాటలాధరఁ గంటివే♦పాటలంబ, నవయవస్థను గంటివే♦నవవయస్థ
సరళభూజము! కంటివే♦సరళహృదయ, మల్లికావల్లికా కంటె♦వల్లికాంగి.

తాళమా = తాటిచెట్టా, కాంతాళమా = కోపమా, తాళఫలస్తని = తాటి పండ్లవంటి స్తనములు గలది, తారలేదె = నీయొద్దకు రాలేదా, చూతమా = మామిడీ, నూతన = క్రొత్తదగు, చూతపల్లవ = మామిడిచిగురువంటి, పాణిఁ = అఱచేయిగలదానిని, నీపమా = మంకెనా, వృక్షావనీపమా = వృక్షరాజమా, నీపసుమాధర = నీప పువ్వులవంటి పెదవిగలదానిని, జంభమా = నిమ్మ, జంభమా = దంభమా, "జంభాదంభజంబీరదానవాః॥"నానా ॥౧॥ జంభపయోధర = నిమ్మపండ్ల వంటి చన్నులుగలదానిని, పాటలాధరఁ = ఎఱ్ఱని పెదవిగలదానిని, పాటలంబ = కలిగొట్టా, నవవయస్థను = క్రొత్తయౌవనమున నుండుదానిని, నవవయస్థ = క్రొత్త యుసిరికా, సరసభూజము = తెల్లతెగడచెట్టా, మల్లికావల్లికా = మల్లెతీఁగా, వల్లికాంగిఁ = తీఁగవంటి దేహముగలదానిని.

తా. ఓ తాటిచెట్టా! నాపై నీకేల యింతకోపము? నీ ఫలములవంటి కుచములు గలది నీయొద్దకు రాలేదా మామిడీ! నీదయ యెట్టిదో చూతును. నీ క్రొంజిగురు వంటి యఱచేయి గలదానిని నీవు చూడలేదా? ఓ నీవమా! నీవు చెట్లకు రాజవు. నీ పువ్వులవంటి పెదవిగలదానిని జూచితివా? నిమ్మా! ఏల నీకింత దంభము? పిలిచినను బలుకవే. నీపండ్లవంటి పాలిండ్లు గలదానిని చూచితివా? పాటలమా! నీపువ్వులవలె నెఱ్ఱనైన పెదవిగలదానిని జూచితివా? క్రొత్త యుసిరికా! నీవు క్రొత్త వయస్సున నుండుదానిని జూచితివా? సరళమా! సరళమైన హృదయము గలదానిని జూడలేదా? మల్లెతీఁగా! తీఁగెవంటి దేహముగలదానిని కంటివా?

కం. కరిణీ! కరినాసోరువు, హరిణీ! హరిణాక్షి భృంగ♦మా! భృంగకచఁ
హరివర! హరివరమధ్యను, గరిగమనఁ మీర లెందుఁ♦గానఁగ లేదే. ౧౦౨౯

కరిణీ = ఆఁడేనుఁగా, కరినాసోరువు = ఏనుఁగు తొండమువంటి తొడలు గలదానిని, హరిణీ = ఆఁడుజింకా, భృంగమా = తుమ్మెదా, భృంగ కచఁ = తుమ్మెదలవంటి వెండ్రుకలుగలదానిని, హరివర = శ్రేష్ఠమైన సింహమా, హరివర మధ్యను = సింహము నడుమువంటి నడుముగలదానిని.

తా. ఆఁడేనుఁగా! నీముక్కువంటి తొడలుగలదానిని, ఆఁడుజింకా! నీ కన్నుల వంటి కన్నులుగలదానిని, తుమ్మెదా! నీవలె నల్లనగు వెండ్రుకలు గలదానిని.

సింహమా ! నీ నడుమువంటి నడుముగలదానిని, మీరు ఏనుఁగువలె నడచుదానిని చూడలేదా ?

సీ. మీరైనఁ జెప్పరే ♦ మీలోన నున్నదే, మృగవిలోచన చారు ♦ మృగములార
నీ వెఱుంగుదు చూడ ♦ నేలతో యేగినజాడ, గజరాజ ! గజరాజ ♦ గమనలీల
శార్దూలమా ! నీకు ♦ జంకేల చెప్పుమా, యింతి యెందరిగెనో ♦ యెఱుకగలదె
కలకంఠమా ! నీకుఁ ♦ దెలిసి యుండఁగవచ్చుఁ, గలకంఠకంఠిని ♦ గానలేదె
తే. హంసమా ! నీవు కంటివే ♦ హంసయానఁ, గీరమా ! నీవు కంటివే ♦ కీరవాణి
భ్రమరమా! నీవు కంటివే ♦ భ్రమరవేణిఁ, జెప్పరే మీరు కరుణించి ♦ సీతతెఱఁగు.

జంకు=సందేహము, కలకంఠమా = కోకిలా, కలకంఠకంఠిని = కోకిలకంఠము వంటి కంఠముగలదానిని.

తా. మనోహరములైన జింకలారా ! జింకకన్నులవంటి కన్నులుగలది మీలోన నున్నదా ? మీరైనఁ జెప్పుఁడు. గజరాజమా ! ఏనుఁగువలె నడచునది పోయినజాడ నీకుఁ దెలిసియుండవచ్చును. చెప్పుము. పులీ ! ఏల నీకు సందేహము ? నీవు భ్రమింగితి వని నే ననలేదు. సీత యెందరిగెనో చెప్పుము. ఓసీ కోకిలా ! నీకంఠమువంటి కంఠముగలది యెందుపోయెనో నీకుఁ దెలిసియుండవచ్చును. తెలుపుము. హంసమా! హంసగమనను నీవు చూచితివా ? చిలుకా ! నీవలె పలుకుదానిఁ గంటివా ? తుమ్మెదా! తుమ్మెదలవంటి జడగలదానిని జూచితివా? అయ్యో ! నాపై దయయుంచి సీత యేగినది చెప్పుఁడు.

కవిరాజవిరాజితము

నిలు నిలు మేగకు పోకలికీ ! యెద ♦ నిర్దయమే మరుపూములికీ !
యలుఁగఁగ నేటికి ప్రాణసఖీ ! పరి ♦ యాచకమా యిది చంద్రముఖీ !
కులుకుచుఁ గుల్కుచుఁ బర్విడెదే కనుఁ ♦ గొంటిని తే జిగిచీర యదే
పలుకవు కోపమ నీలకచా ! నను ♦ బాలన సేయుము కుంభకుచా ! ౧౦౩౧

కలికీ = కాంతా, నిర్దయమే = దయలేనిదా, మరుపూములికీ = మన్మథుని పుష్పబాణమా, అలుగఁగ = కోపింపఁగా, పరియాచకమా = నవ్వులాటలా, జిగిచీర = కాంతిగలచీర, కుంభకుచ = కుంభములవంటి పయోధరములుగలదానా.

తా. కాంతా! పోకుము. పోకుము! నిలునిలు. మన్మథపుష్పబాణమా ! నీహృదయ మింతదయలేనిదా ? ప్రాణసఖీ ! ఏల నాపై నీవలిగితివి ? ఇది పరిహాసరసమ యమా కులుకుచుఁ గులుకుచుఁ బరువెత్తుచున్నావు. అదో నేను చూచితిలే. నీచీర నాకుఁ గానవచ్చెను. నల్లనివెండ్రుకలుగలదానా! ఇట్లు నేను జూచి పిలిచినను బలుకవే కోపమా ? నన్ను రక్షింపుము.

కవిరాజవిరాజితము—ఒక్క నగణము, ఆఱు జగణములు, వగణము, యతివిషయ మింతకుముందే చర్చింపఁబడినది.

చ. అడిగినవాని నిట్లడిగి ♦ యాడినమాటయె వెండి యాడి బ
ల్వడి మును పోయి చూచినత ♦ లంబులకే మఱిపోయి యాత్మలో
నడలుచు సోలి సొక్కుచును ♦ నారట మందుచు నార్తిఁ గుందు చా
యడవిని ధారిణీతనయ ♦ నంతట నోసియుఁ గాన కెయ్యెడన్. ౧౦౩౨

తా. ఈవిధముగ నడిగినవానినే యడిగి, చెప్పినమాటయే చెప్పి, ముందు పోయిన చోటికే మరలఁబోయి, యందు సీత లేకుండుటచే మనస్సునఁ దల్లడిల్లుచు మూర్ఛపడి, లేచుచు సొక్కుచు నారటపడుచు దుఃఖపడుచు నాయడవియందు సీతను వెదకి యెందును గానక.

— ♦ సీత రాక్షసహత యైన దని యెంచి రాముఁడు పలవించుట ♦ —

కం. వ్యాలోలచేతము నని, ట్లాలోచించెను రఘూత్త ♦ మాగ్రణి యయ్యో
బాలామణి పలలాశన, జాలంబులచేతఁ జిక్కి ♦ సమయఁగఁ బోలున్. ౧౦౩౩

వ్యాలోలచేతమునన్ = వ్యాకులపడినమనస్సుచే, పలలాశనజాలంబుల చేతన్ = రాక్షససమూహములచే.

తా. మిగులఁ గలఁతజెందిన మనస్సుగలవాఁడై రామచంద్రమూర్తి సీతాదేవి రాక్షసులచేతఁ జిక్కి మరణించెను గాఁబోలు ? లేకున్న నింతలో నెందుఁ బోఁగలదు ?

కం. అంగనను బట్టి రక్కసు, లంగంబులఁ బంచికొంచు ♦ హర్షంబున ను
ప్పొంగుచు నుందురు నా లే, మిం గట్టా యెంతచెట్ట ♦ మ్రింగెను సీతన్. ౧౦౩౪

తా. సీతాదేవిని బట్టుకొని రాక్షసులు చంపి 'నీ వీ తల తీసికో, నాకీ చేతి నిమ్ము,' అని యీప్రకార మొకరొక రొక్కొక్క యవయవమును సంతోషముతోఁ బంచుకొనియుందురు. అయ్యో! నేనులేనికారణముచే సీత కెంత చెడ్డ గలిగెను.

సీ. చారుకుండల మబ్జ ♦ సఖ మైన నెమ్మోము, కాంతి వాసెనొ కదే ♦ యింత కయ్యొ
హారచంపకవర్ణ ♦ తారహారోదీర్ణ, యుఱవంగ నసువులు ♦ నఱికి రేమొ
పల్లవకోమల ♦ బాహువుల్ తెగఁద్రుంచి, కొఱికెదరో యింత ♦ వఱకుఁ బగలు
చెఱకుతుంటనుబోలె ♦ విఱిచి నెన్నడుమును, భక్షించు చున్నారొ ♦ పాపమతులు
ఆ. గుంపు విడిచి చనిన ♦ కువలయాక్షిని వన్య, సత్త్వచయము లెల్లఁ ♦ జంపుపగిదిఁ
గానలోన నొంటి ♦ గా వీడి నేఁ బోవ, నంబుజాక్షిఁ జంపి ♦ రసురఖలులు. ౧౦౩౫

చారుకుండలము = మనోహరమైన కమ్మలు గలది. అబ్జసఖము = చందురుతోను, కమలముతోను సమానమైనది. హారి = మనోహరమైన, చంపకవర్ణ = సంపెంగపూవువలె పచ్చనికాంతిగలది, (ఎఱ్ఱసంపెఁగయుఁగలదు) తారహారోదీర్ణ = ముత్యాలసరములచే గొప్పదైనది. "హారోముక్తావళీ" యని యమరకోశము.

హారశబ్దమే ముత్యాలసరమునకుఁ బేరు. తారహారమనుట దోషమనరాదు. ఇట్టిచోట రెండవపదము సామాన్యవాచకముగా గ్రహింపవలసిన దని వామనమతము. పల్లవకోమల = చిగురువలె కోమలమైనది, కుసుమకోమలి, పల్లవకోమలి, యిత్యాదులవప్రయోగములు, పగఱు = పగవారు, అసురఖలులు — విశేష్యపూర్వపదకర్మధారయము.

తా. అయ్యో! అందములైన కన్నులుగలిగి చంద్రబింబముతోను, కమలముతోను సమానమైన ముఖ మిప్పటికి నెంత వాడిపోయినదో కదా? మనోహరమైన సంపెంగపువ్వువలెఁ బచ్చని దేహము గలిగి ముత్యాలసరములు వ్రేలాడుచుండు దానిని నది యఱవఁగ నఱవఁగ రాక్షసులు నఱికిరేమో? చిగురువలెఁ గోమలములైన చేతులు తెగునట్లు విఱిచి చెఱకుతుంటనువలె శత్రువులు నములుచున్నారేమో? చెఱకుతుంటను విఱిచినట్లు నడిమికి రెండుగా నడుము విఱిచి పాపాత్ములు తినుచున్నారేమో? అడవిలో సంచరించు బిడారువారొంటిగా విడిచిపోయిన స్త్రీని నడవిమృగములు భక్షించినట్లు లడవిలో నొంటిగా విడిచి నేఁ బోవుటచే దుష్టరాక్షసులు సీతను జంపిరి.

మొదటి నాలుగుపాదములందుఁ గ్రమము వివక్షితము.

కం. అన్నా! లక్ష్మణ నీకైన న్నవలామిన్న వనిఁ గ♦నంబడియెనె యో
చిన్నారికన్నియా! నా,కన్నారఁగఁ జూడఁగలనె ♦ కాంతా! నిన్నున్. ౧౦౩౬

నవలామిన్న = స్త్రీరత్నము, వనిన్ = అడవియందు.

తా. అన్నా లక్ష్మణా! నేను చిత్తభ్రమ గొనియున్నవాఁడఁ గావున నాకు సీత కానరాలేదేమో – నీకైనఁ గానవచ్చెనా? చిన్నారి చిన్నదానా! నిను నేను మరలఁ గన్నారఁ జూడఁగలనా?

కం. విలపించుచు నిటు రాఘవుఁ, డలఘుగతిన్ వనము వనము ♦ నరయుచు భ్రమచేఁ
బిలుచుచు నిలుచుచుఁ దొలఁగుచు, మలయుచు దూపిల్లె వెకలి♦మాడ్కిన్ సతికై.

తా. ఈ ప్రకార మేడ్చుచు రామచంద్రమూర్తి వేవేగ నొకవనము వెనుక నొకవనము (వీప్స)న వెదకుచు భ్రమచే "సీతా సీతా" యని పిలుచుచు నందు లేదని తొలఁగిపోవుచు నందందుఁ దిరుగుచు వెఱ్ఱివానివలె శోకించెను.

౬౧-వ సర్గము.

కం. దీనుండై భయశోకా,ధీనుండై యాశ్రమాంత♦దేశమునఁ బరి
ద్యూనుండై ధుతవస్తువి,తానముఁ గని చేతులెత్తి♦తద్దయు నేడ్చెన్. ౧౦౩౭

పరిద్యూనుఁడు = మిక్కిలి ఖేదము నొందినవాఁడు, ధుతవస్తువితానము = విసరివేయఁబడిన పదార్థముల సమూహము, దీనివలన నాశ్రమము చుట్టుప్రక్కలఁ

దిరిగి మరల లోపలికి వచ్చెనని యేర్పడుచున్నది. ఇట్టి దశావస్థలలోఁ దొమ్మి దవదగు మూర్ఛావస్థ వర్ణింపఁబడుచున్నది.

తా. దర్పము డిగినవాఁడై, భయముచేతను శోకముచేతను వశపడినవాఁడై యాశ్రమమందుఁ జెదరఁగొట్టఁబడినవి విసరివేయఁబడినవి యగు వస్తువులఁ జూచి మిగుల ఖేదము నొందినవాఁడై రెండుచేతు లెత్తి హా యని యేడ్చెను.

శా. ఏరా లక్ష్మణ! సీత లేదుగదరా ♦ యెచ్చోటికిం బోయెనో
క్రూరంబైన మృగంబె దే మెసవెనో ♦ కొంపోయిరో యెవ్వరేఁ
నీరేజేక్షణఁ బాసి నిల్వఁగలనా ♦ నే నొక్కముహూర్తంబు, క
న్నారన్ నాచెలి! నిన్నుఁ జూడఁగలనా ♦ హా మానినీరత్నమా! ౧౦౩౯

మెసవెనో = తినెనో.

తా. ఏరా తమ్ముఁడా! సీత యాశ్రమమందు లేదుగదరా! ఎక్కడికిఁ బోయెనో కదరా! ఘాతుకమృగ మేదైనఁ దినెనేమోకదరా! ఎవ్వరైనఁ బట్టుకొనిపోయి నారో యేమో! కమలమువంటి కన్నులుగల సీతాదేవిని బాసి నే నొక్క ముహూర్తకాలమైన బ్రతుకఁగలనటరా? నాచెలీ! మరల నిన్నుఁ గన్నారఁ జూడఁ గలనా? అయ్యో స్త్రీరత్నమా!

కం. డాఁగికొని చెట్లమాటున, డాఁగురుమూఁతాడి నన్నుఁ ♦ దపియింపింపం
గాఁ గాలమె యిది యోయెల,నాఁగా! పరిహాస మేల ♦ సన్నేలఁ గదే. ౧౦౪౦

తా. చెట్లచాటున డాఁగి నన్నుఁ దపియింపఁజేయ డాఁగురుమూఁతలాడుటకు నిదియా సమయము? కాంతా! ఏల పరిహాసమాడెదవు? నన్నేలుకొనుము.

కం. బాలామణి! నీ చెలిమిని, కేళీరతి మరగి తిరుగు ♦ క్రీడామృగముల్
హేలావతి! నినుఁ బాయుట, వాలాయము నేడ్చుచున్న ♦ వదె యెఱుఁగుదువే.

తా. బాలారత్నమా! నా యేడుపటుండనీ. నీవు మచ్చికచేయుట నీతోడ నాడ నభ్యాసపడి తిరుగుచుండు క్రీడామృగములు నిన్నుఁ బాయుటచే విశేషముగ నేడుచుచున్నవే! అదియైన నీకుఁ దెలియునా?

శా. భామారత్నవియోగభారమున స్వర్గంబేగ నాతండ్రి యే
మేమీ రాముఁడ! యిందు వచ్చితివు ఈ ♦ రేడేండ్లు దుర్గాటవీ
సీమావాసముఁ జేయుమం చనని? యిన్ ♦ సీ తీఱెనా కాల? మం
చీమాడ్కిన్ ననుఁ గల్లరీనిఁ బలుకున్ ♦ స్వేచ్ఛావిహారున్ శఠున్. ౧౦౪౨

ఈరేడేండ్లు = పదునాలుగు సంవత్సరములు, దుర్గాటవీసీమావాసము = చొరరాని యడవిప్రదేశములందుఁ గాఁపురము, తీఱెనా కాలము = గడువు ముగిసె నదా? కల్లరీనిన్ = అసత్యవాదిని, స్వేచ్ఛావిహారున్ = నియతిదప్పి వర్తించువాని, శఠున్ = మోసగానిని, పదునాలుగు సంవత్సరములు గడచువఱకు నాకుఁ జచ్చుటకు నధికారము లేదుగదా యని భావము.

తా. స్త్రీలయందు శ్రేష్ఠురాలగు సీతాదేవిని విడిచిన దుఃఖాతిశయముచే మరణించి స్వర్గముఁ బోయితినా, యక్కడ నాతండ్రి "ఏమిరా రాముఁడా ! నీకు నేనేమిరా చెప్పితిని ? పదునాలుగేండ్లడవులలో నుండు మనలేదా ? ఆగడువు ముగిసినదా ? ఇక్కడికి వచ్చినావేల ? ఛీ !" యని యీ విధముగ నసత్యవాదిని, మోసగానిని, మర్యాదదప్పినవానిని, నా తండ్రి చీవాట్లు పెట్టును.

ఉ. చక్కటి లేనిపూరుషుని ♦ సద్యశ మెల్లను బాయుభంగి నో
చక్కెరబొమ్మ ! శోకమున ♦ సంతపియింపఁగ నేను దీనతన్
మక్కువలేక పోవఁ దగు ♦ నా నినుఁబోఁటికిఁ, నిన్ను బాసి నే
నెక్కడ కేగువాఁడ ? నిఁక ♦ నేగతి మేను ధరింతు ? సంచితంబుల్. ౧౦౪౩

చక్కటి = ఋజువర్తనము, సద్యశము = మంచికీర్తి.

తా. చక్కనినడవడిలేని పురుషుని మంచికీర్తియుంతయు వదలిపోవు విధముగ చక్కెరబొమ్మవలెఁ దియ్యని గుణముఁ గలనీవు నేను దుఃఖమున నిల్లు సంతాపము నొందుచుండఁగా నాపై దయలేక నన్ను వదలి నీవంటిది పోవచ్చునా ? నన్నుఁ బాసి నీ వెందో పోవఁగలిగితివిగాని నిన్నుఁ బాసి నే నెందుఁ బోఁగలను ? ఇఁక నాగతి యేమి ? ఈ దేహమును నే నెట్లు మోసికొని తిరుగఁగలను ?

క. బిసరుహాలోచన వెదకుచు, నసలున మునిఁగిన గజంబు ♦ నట్టులు భృశదు
ర్వ్యసనమున మునుఁగుచున్నకు, నసదృశహితసూక్తి నిట్టు ♦ లను లక్ష్మణుఁడున్.

బిసరుహాలోచన = కమలమువంటి కన్నులుగలదానిని, అసలునన్ = బురదయందు, అసదృశ = అసమానమైన, హిత = మేలైన, సూక్తి = మంచిమాటలతోఁ.

తా. సీతాదేవి నిట్లు వెదకుచు బురదలో మునిఁగిన యేనుఁగువలె మిగుల సహింపరాని వ్యసనమున మునిఁగిన యన్నకు లక్ష్మణుఁడు హితములైన మంచి మాట లిట్లు లనెను.

—♦ లక్ష్మణుఁడు రామునకు సమాధానము జెప్పుట. ♦—

ఉ. ఏమిటి కన్న ! శోకమున ♦ నింతయు నేఁగెద వీదరీఝరీ
భూముల లోవ త్రోవలను ♦ బొల్పగు కానలఁ గోనలన్ గుహా
సీమల భూమిజన్ వెదకఁ ♦ జేపడ కుండు నె ! ధీరవర్యు లె
మ్మా మహిజాత కానఁ దిరు ♦ గాడఁ బ్రియుంపడు టీ వెఱుంగవే. ౧౦౪౫

వేఁగెదవు=తపించెదవు, దరీ=గుహలయు, ఝరీ = వంకలయు, భూములన్ = ప్రదేశములందు, లోవత్రోవలను = కొండపగుళ్ళమార్గములందు, లోవ = లోయ-రెండుకొండలకు నడిమిసందు, గుహాసీమలన్ = కొండలయందలి గుహాప్రదేశములందు. ముందుచెప్పినది యేళ్ళయొడ్డులనుండునది. చేపడకుండు నే = లభింపకుండునా ?

తా. అన్నా ! ఏల యీ ప్రకారము శోకముచేఁ దపించెదవు ? ఈవంకల వాఁగులయొడ్డులఁ గల గుహాలలో లోయలలో కానలలో గోనలలో కొండగుహాలలో సీతను వెదకితిమేని లభింపకుండునా? ఎక్కడనుండక యెందుఁ బోఁగలదు ? ధీరులలో శ్రేష్ఠుఁడా ! లేలెమ్ము. సీతాదేవి వనసంచారమందుఁ బ్రియము కలదని నీ వెఱుఁగవా యేమి ?

మ. జలకేళిన్ విహరింపఁగాఁ జనియెనో ♦ చంద్రాస్య ఫుల్లాబ్జసం
కులనీరాకరతీరమే తటిసెనో ♦ కూలంకషల్ చూడఁగా
వలపుం గైకొనెనో మఱుంగుపడెనో ♦ వామాక్షి హాసార్థమై
తెలువుల్ చూత మటంచునే మనకు భీతిం గొల్పనే డాఁగెనో. ౧౦౪౬

ఫుల్లాబ్జ = వికసించినకమలములచే, సంకుల = నిండిన, నీరాకర = సరస్సుల, తీరము = ఒడ్డు, కూలంకషల్ = నదులు, వలపుం గైకొనెనో = మోహపడెనో, హాసార్థమై = నవ్వులాటకై, మఱుంగుపడెనో = దాఁచుకొనెనో, తెలువుల్ = మన వివేకము, భీతిం గొల్పనే= భయపెట్టుటకునై.

తా. స్నానముచేయుటకయియే పోయెనో, వికసించినకమలములుగల సరస్సులయొడ్డునకే పోయెనో, ఏళ్లు చూతమని భ్రాంతిపడెనో,మన తెలువు లేమాత్రమో కనుఁగొనఁగలమో లేమో యని నవ్వులాటకై దాఁగుకొనెనో మనలను భయపెట్టుటకే దాఁగెనో ?

ఉ. ఎక్కడ కేగఁజాలుఁ దర ♦ శేక్షణ వే జతనంబు చేసినన్
జిక్కకపోన శోకమున ♦ జిక్కకు మన్న వృథావ్యథామతిన్
దక్కు మటన్న రాఘవుఁడు ♦ తమ్ముని వాక్యము లాలకించి తా
గ్రక్కున లేచి వెండియును ♦ గాంతను రోయఁ దొడంగెఁ గాసలన్. ౧౦౪౭

వే = త్వరగా, జతనంబు = ప్రయత్నము. యత్నశబ్దభవము జతనము. రోయన్ = వెదకుటకు, తొడంగెన్ = ప్రారంభించెను.

తా. సీతాదేవి యెక్కడికి బోఁగలదు ? మనము ప్రయత్నముచేసి వెదకితిమా చిక్కకపోవునా ? అవశ్యము చిక్కును. "ఉద్యోగినం పురుషసింహ ముపైతి లక్ష్మీ" యని కలదుగదా. నీవు నిరుపయోగమైన వ్యసనముగల మనస్సును వదలుము. శోకమున కృశింపకుము. అని చెప్పఁగా రామచంద్రమూర్తి లక్ష్మణుని వాక్యములు విని త్వరగా లేచి యడవియందు మరల వెదక నారంభించెను.

ఉ. కొండలు గుట్టలున్ నదులుఁ ♦ గోనలుఁ గానలు మేల్కొలంకులున్
వెండియు రోసి రోసి వృథివీసుతఁ గానక భ్రాతతోడ నీ
దండక నెల్లఁ గాంచితిమి ♦ దండుగ యయ్యెను గాదె మత్తవే
తండసుయాన యెందరిగెఁ ♦ దమ్ముఁడ యేమిఁకఁ జేయ నంచనన్. ౧౦౪౮

దండుగు + అ- దండుగ = వ్యర్థమే. భార్యలేక యొనర్చువండువు దండువు.

"భూవరునకుఁ గొంతదండువును బెట్టఁదగున్." విజ్ఞా-ప్రా-కాండము. రూ-దండుగ. అట్టులే పండుగు - పండుగ, అనియు రూపాంతరములు గలవు.

తా. కొండలు గుట్టలు నదులు కోనలు కానలు కొలఁకులు మఱిమఱి వెదకి వెదకి సీతాదేవిని జూడలేక రామచంద్రమూర్తి లక్ష్మణునితో ట్లనియె. "లక్ష్మణా! దండకయంతయు వెదకితిమి. వృథాకష్ట మయ్యెనుగదా. ఆ మదగజగామిని యెక్కడికిఁ బోయెనో యేమిసేయుదము." అనఁగా లక్ష్మణుఁ డిట్లనియె :

కం. సౌమిత్రి యిట్టు లను శ్రీ,రామా పొందెదవు మరల ♦ రాజీవాక్షిన్
వామనుఁడు మున్ను బలిమిని, భూమిని బలియొద్దఁ గొన్న♦పోలువున ననిన్.

తా. అన్నా! పూర్వము బలియొద్దనుండి బలత్కారముగ భూమిని గ్రహించి నట్లు నీవు సీతను మరలఁ బొందఁగలవు అని చెప్పఁగా రామచంద్రమూర్తి యిట్లనియె.

కం. వెతకితి మీపర్వంబును, వెత యొక్కట కాక లేదు ♦ వెలఁదుక యెందున్
క్షితిధరము బహుళకందర, మతివను నిఁక నెందు వెదక ♦ ననువగు ననుచున్.

తా. ఈ ప్రదేశమంతయు వెదకితిమి. శ్రమయొక్కటియె కాని సీత యేమో కనఁబడలేదు. ఈ పర్వతమందా యనేకగుహ లున్నవి. ఎక్కడనని మనము వెదకఁ గలము?

కం. వ్రాలున్ మూర్ఛల నేలను, సోలున్ దుఃఖమునఁ దూలు ♦ శోషిలి వ్రేలున్
బాలా! సీతా! సీతా!, యేలాగైతివె యటంచు ♦ నేడ్చుచుఁ బొరలున్.

తా. అని మూర్ఛపోవును, నేలఁబడును, దుఃఖమున శోషిల్లును; బాలా! సీతా! సీతా! ఎక్కడఁ బోయినావే యని నేలఁబడి పొరలుచు నేడ్చును.

కం. తమ్ముం డూఱటగా వాక్యమ్ముల నేవేవొ చెప్పఁ ♦ గైకొనఁ డదె శో
కమ్మున సీతా! యని కడు, నుమ్మలికం బందుఁ గుందు ♦ నుత్తలమందున్.

తా. లక్ష్మణుఁడు సమాధానముమాట లేవేవో చెప్పినను వాని నంగీకరింపఁడు. శోకముచేఁ బరితపించుచుండెను.

కం. నీరజలోచనఁ గానక, నీరజలోచనుఁడు ధర్మ♦నిరతుఁడు సుమనో
నారాచోపహతాత్ముం,డై రోదన మూరఁ జేసె ♦ నతివా! యనుచున్.

నీరజలోచనన్ = కమలములవంటి కన్నులుగలదానిని, నీరజలోచనుఁడు = కమలములవంటి కన్నులు గలవాఁడు. ఇట్లు చెప్పుటచే భర్తకుఁదగిన భార్య - భార్యకుఁ దగిన భర్త యని యభిప్రాయము. ఈ విషయమే సుందరకాండమందు నాంజనేయుఁడును, "రాముని కీయసితేక్షణ రాముఁడు నీ సతికిఁ దగును" అనికదా యొంచెను. (సుందర. ౪౬౦) ధర్మనిరతుఁడు = భార్య భర్తవ్య యనియు నాశ్రిత త్యాగము మహాదోషమనియు నెఱింగినవాఁడు. సుమనోనారాచ = మన్మథునిచే, ఉపహత = కొట్టఁబడిన, ఆత్ముండై = మనస్సుగలవాఁడై.

తా. సీతాదేవిని గానక రామచంద్రమూర్తి భార్యను భర్త భరింపవలసినది-ఆమెకు వచ్చునాపదల రక్షింపవలసినది, భార్యయొక్క భారణపోషణములు భర్తకార్యము, అందు నాశ్రితురాలైన పతివ్రతను వదలుట మహాపాపము, ధర్మవిరుద్ధకామము దోషముగాదు శ్లాఘ్యము-అనుధర్మ మెఱిఁగినవాఁడు. మన్మథబాణపీడితుఁడై "సీతా" యని గట్టిగా నేడ్చెను.

—♦ ౬౨-వ సర్గము. రాముఁ డున్మత్తునివలె దుఃఖించుచు సీతను రోయుట ♦—

ఉ. కన్నులమ్రోల లేకయును ♦ కంజశరవ్యథ మ్రోల నున్నయా
కన్నియఁ గూర్చి దుర్వచము ♦ గా వ్యసనార్తిని బల్కు జానకీ!
క్రొన్ననలందు నీకుఁ గల ♦ కూరిమి పేరిమి బాధపుష్ప సం
పన్న మశోకశాఖఁ గొని ♦ మాటుగ డాఁగితివే యెఱింగితిన్. ౧౦౫౮

దశావస్థలలో నాఱవయవస్థయగు నరతి యిఁక వర్ణింపఁబడును. కంజశరవ్యథన్ = మన్మథబాధచే, దుర్వచముగాన్ = (i) గద్గదకంఠమగుటచే మాట తెలియవచ్చి తెలియరాక యుండునట్లు. (ii) సంతాపవిషయము గావున ననుభవముచేఁ దెలిసికొనవలసినదేకాని చెప్ప సాధ్యముకానట్లు - వ్యసనార్తిని = వ్యసనమువలనఁగలిగిన బాధచే, క్రొన్ననలందు=క్రొత్తపుష్పములందు, క్రొత్త+నన = క్రొన్నన; క్రొత్త-కెంపు-క్రిందు శబ్దముల కాద్యక్షర శేషంబునకుఁ గొన్నియెడల నుగాగమంబును- గొన్నియెడల మీఁది హల్లునకు ద్విత్వంబును నగు. బాధ+పుష్ప+సంపన్నము = విస్తారముగ పూలచే నిండినది.

తా. వాస్తవముగ సీతాదేవి యెదుట లేకుండినను మన్మథతాపముచే ధ్యానబలంబునఁ గన్నులఁ గట్టినట్లున్న యా సీతనుగూర్చి గద్గదస్వరముతో మాట సరిగాఁ దెలియరాకుండునట్లు - ఆ సంతాప మిట్టిదని చెప్ప సాధ్యము కానియట్లు వ్యసనమువలనఁ గలిగిన బాధచే నిట్లనెను : జానకి! క్రొత్తపుష్పములందు నీకుఁగల ప్రేమాతిశయముచే బాగుగ పుష్పించిన యశోకవృక్షపుఁ గొమ్మచాటున డాఁగితివిగే. తెలిసికొంటిని. నేను గనుఁగొన్నతరువాత డాఁగనేల?

కం. కదలీదండనిభంబులు, కద లీలావతిరో నీదు♦కమ్రోరువు లా
కదలీసంవృతములైయె, మదిరేక్షణ యవిగొఁ దోఁచె♦మఱుఁగిడ వశమే.

కదలీదండనిభంబులు = అరఁటిబోదెతో సమానమైనవి, కమ్రోరువులు = మనోహరములైన తొడలు, కదలీసంవృతములు = అరఁటిచెట్లచే దాఁపఁబడినవియై, అవిగో = చూపి తెలుపుటయం దీ శబ్ద ముపయోగింపఁబడును. అవిగో రూపాంతరము. "పూని కర్ణాత్మజుఁడు వృషసేనుఁ డాత్మహయము దాఁటించినట్టి వాఁ డల్లయదిగొ." కర్ణ—౨ ఆ. "రామానుజుం డదిగో మహాయతిరాజునాయకుం డనఁగ నున్నాఁడు వెలసి". పర. ౫ ఆ. ఇవి ద్రుతాంతము. ఈశబ్దములు 'అది కనుఁగొనుము, అవి కనుఁగొనుము' అనువాని హ్రస్వరూపములు. వీనిలోఁ గను లోపింపఁగా అది

కొనుము, అవికొనుము అని, నిలిచి కొనుము, కొకాఁగా, అదిగొ అదిగో, అవిగొ అవిగో యని రూపంబు లయ్యె. ఇవి లింగవివక్షలేక యుపయోగింపఁబడును. రామానుజుం డదిగో, ఈ శబ్దంబులు చూపుట యనునర్థంబునఁ బ్రయోగింపఁబడును. ఆయర్థంబున కో లేకయుఁ గవులు ప్రయోగించియున్నారు. 'ధీరతఁ బుష్కరాదులగు దీవులన్నిటినుండి వచ్చియున్నా రిదె శీతభాను దినదాయక వంశజులైన రాజబృందారకులు', శృం-నై. ౫-౭౯. ఇదె రాజబృందారకులు, అదిగో అవిగో యనుప్రయోగంబులు కానవచ్చుచున్నవి కాని యిప్పటివారి అరుగో-వారుగో ననుశబ్దములకుఁ బూర్వకవిప్రయోగములు మృగ్యములు. 'ఇదిగో, అదిగో' కళలా ద్రుతప్రకృతికములా యనువిషయంబునఁ గవులం దభిప్రాయ భేదము గలదు. పింగళిసూరకవి కళాపూర్ణోదయంబున "కం. పూఁబోఁడి యొరసి కొనిచనఁ, గాఁ బయ్యెద యొడిసి పట్టఁ గనుఁగొంటె చెలీ! లేఁబొన్నను భళిరా యిది, గోఁ బురుషాహ్వాయము నిలుపుకొను సమయంబునన్." ౧ ఆ. అని ప్రయోగించెను.

తా. లీలావతీ! నీయందములైన తొడలరఁటిబోదెలవంటివి కదా! అట్టులయ్యు కదళీవృక్షముల మధ్యమునసుండియు వానికంటె నందముగ నుండుటచే నాకు నదిగోఁ గానవచ్చుచున్నవి. దాఁచిపెట్ట నీకు సాధ్యమా?

ఆ. కర్ణికారవనముఁ ♦ గర్ణాంతలోచన, నవ్వులాట కరిగి ♦ పువ్వుల కని
నన్ను నాలిగొనఁగ ♦ నాయమా యోబాల! నిన్ను గానలేక ♦ నేను మిడుక.

కర్ణికారవమునన్ = కొండగోఁగుతోఁపునందు, కర్ణాంతలోచన = చెవుల వఱకుఁగల కన్నులుగలదానా, ఆలిగొనన్ = పరిహాసముచేయ, మిడుకన్ = దుఃఖింపఁగా.

తా. విశాలములు దీర్ఘములు నైన కన్నులుగలదానా! కొండగోఁగుఁ బూవుల కని కొండగోఁగుఁవనమునకుఁ బోయి నవ్వులాటకని నన్నుఁ బరిహాసము చేయుట నీకు ధర్మమా? నిన్నుఁ జూడఁజాలక మిడుకుచున్నవాఁడనే!

కం. హేలనపర వగు టెఱుఁగుదు, హేలావతి యిదియు సమయ♦మే గేలిగొనన్
బాలా! గాసిలితిని నా, కేలా పరిహాస మిట్టి♦యెడరున నడవిన్. ౧౦౫౭

హేలనపరవు = పరిహాసప్రియవు, గేలిగొనన్ = పరిహాసించుటకు, ఎడరునన్ = ఆపదయందు.

తా. సీతా! నీవు పరిహాసప్రియ వని నాకుఁ దెలియును. అయినను పరిహాస సమయమా యిది? తిరిగి తిరిగి యేడిచి యేడిచి చాల బడలితిని. ఇట్టి యాపదదశ యందు నా కెగతాళితో నేమిపని?

సీ. అన్న! లక్ష్మణ! సీత ♦ యున్న దో యని రా దె, మ్రింగిరో పరులు హ♦రించినారొ
కన్నీరు దొరఁగ మృ♦గంబులు రక్కసుల్, సీతను దిని రని ♦ చెప్పు చున్న

వెటు పోయితే తన్వి ♦ యెం దున్న దానవే, కైక కోరిక నీడు♦కతనఁ దీగు
జానకితో వచ్చి ♦ జానకిఁ గోల్పోయి, యె ట్లంతిపురిలోని ♦ కేగువాఁడ

తే. రిత్త యంబేడ రాముఁడు ♦ సత్తలేదు, నిర్దయుం డని పలుకరే ♦ నిఖిలజనులు
కాంత లేకున్న సౌఖ్యమే♦కరణిఁ గాంతు, లేబరముగాదె యిల్లాలు ♦ లేని బ్రదుకు.

కోల్పోయి = పోఁగొట్టుకొని, అంబేడ = అసమర్థుఁడు, సత్త = సత్తువ, లేబరము = శూన్యము.

తా. అన్నా! లక్ష్మణా! నేనింతగాఁ బిలుచుచున్నానే! ఉండెనా ఓయనిబదులు పలికి రాకయుండునా! శత్రువులు మ్రింగ నేమ్రింగిరో, హరింపనే హరించిరో రెంటిలో నొకటి జరుగకుండిన సీత కానరాకయుండదు. ఈ మృగములు కన్నీరుగార్చుచు సీతను రాక్షసులు దిని రని దుఃఖపడుచున్నవి. ఎందుఁ బోయితివే సీతా? ఎందున్నదానవే? నీవు కారణముగఁ గైక నన్నుఁ జంపఁ దలఁచిన కోరిక నెఱవేఱునా? జానకితోడ నరణ్యమునకు వచ్చి జానకిని బోఁగొట్టుకొని గడువుతీఱఁగానే నే నేమని యంతఃపురమునకుఁ బోదును? పోయితినిబో, లోకు లేమందురు? రాముఁడు కేవల మసమర్థుఁడు చూపుకుఱ్ఱమే కాని సత్తువలేదు సత్తువ లేకేమి కలవాఁడే అయినను జానకిమీఁద దయలేనివాఁడు కావున నామెను దక్కించుకొన నిష్టపడలేదు అని యనరా? ఒకరననీ యనకపోనీ, సీత లేకుండ నేని నాకు సౌఖ్య మెక్కడిది? ఏక పత్నీవ్రతుఁడనే. భార్యలేనివాని బ్రదుకు పాడేగదా? సౌఖ్య మెందుండి వచ్చును?

న గృహం గృహమిత్యాహుః, గృహిణీ గృహముచ్యతే।
గృహంతు గృహిణీహీన మరణ్యసదృశం మతమ్॥ భార 12-244-6.

“భార్యాహీనం గృహస్థస్య, శూన్యమేవ గృహం భవేత్” భార్యలేని గృహస్థునియిల్లు పాడు.

ఉ. త్రచ్చఱఁ దీర్చుచున్ మన మ♦రణ్య నివాసము, నూరి కేగినన్
వచ్చిరి కూఁతు రల్లుఁ డని ♦ వచ్చి మముం గన మైథిలుండు నిం
పెచ్చఁగ క్షేమమా యనిన♦నే మని యాతనిమోముఁ జూతు, నా
సచ్చరితుం డెఱింగి తను♦జాతఁ దలంచి తపించి మూర్ఛిలున్. ౧౦౫

త్రచ్చఱన్ = వేగముగ, మైథిలుండు = జనకుఁడు, సచ్చరితుండు = మంచి యాచారముగలవాఁడు, తనుజాతన్ = పుత్రికను.

తా. అరణ్యమందు మనము కాఁపురముచేయవలసిన గడువు త్వరగాఁ దీర్చి యయోధ్యకుఁ బోఁగా కూఁతురల్లుఁడు దీర్ఘకాలమునకు వచ్చిరని జనకుఁడు చూడవచ్చి సంతోషముతో 'నల్లుఁడా' యందఱు క్షేమమాయనిన నే నేమని చెప్పుదును? 'మీకూఁతురుతప్ప'నని చెప్పుదునా! చెప్పుట యెట్లయిన నగుఁగాక. ఆయన ముఖము నే నేమని చూతును! జానకి లేదనువార్త యితరులచే సాధువర్త

నముగలయీయాయన చెవినిబడెనా కడుపుదుఃఖమునఁ దనబిడ్డన్ దలఁచితలఁచి శోక
ముచేఁ దపించి తపించి యాసాపు చచ్చెనుగదా ?

సీ.*నాకోడ లేదిరా ♦ నాయనా! యని యంత, మాయమ్మ కేమని ♦ మాఱు పలుక
రామ! జానకి యేది ♦ రా యంచు నడుగు మీ, యమ్మ కేమనఁగ నో ♦ రాడు నాకు
ధారపోసితివ సీ ♦ తను గాన కని ముసి, ముసి నవ్వుకై క కే ♦ ముసి వచింతు
వదిన రాదాయె నే ♦ మిది యని ప్రశ్నించు, తమ్ముల కేమి యు ♦ త్తరము లిడుదు
తే. సీత రాదాయె రాముండు ♦ చేతఁగాక
యసురవాతను ద్రోచె ని ♦ ల్లాలి ననుచు
నెల్లిదము సేయు జనుల నో ♦ రెట్లు మూయఁ
జెప్పుమా తమ్ముఁడా ! యేమి ♦ చేయువాఁడ. ౧౦౬౦

ముసిముసినవ్వు = కల్ల చిఱునవ్వు. అతిశయార్థమున ద్విరుక్తి. కేవలము
కల్ల. ఎల్లిదము = చులుకదనము. రూ. ఎలిదము, ఏముసి = ఏమిబొంకు.

తా. నే నింటికిఁ బోగానేఁ మాయమ్మ కౌసల్యాదేవి యెదురుగా వచ్చి
కుమారా ! నాకోడ లేదిరా? యని యడుగునే - నే నేమని చెప్పుదును ? ఆవల మీ
యమ్మ వచ్చి రామచంద్రా యేదిరా జానకి యనునే - ఏమని చెప్ప నోరెట్లాడును?
ఆవలఁ గైకమ్మ కల్లచిఱునవ్వుతోఁ బరిహాసముగా సీతను నడవికి ధారపోసి వచ్చి
తివా యనునే, నే నేమని బొంకుదును? భరతశత్రుఘ్నులు వచ్చి యన్నా! మావదిన
రాలేదా యేమి ? యని ప్రశ్నింతురే, యేమి బదులు చెప్పుదును ? సీత రాలేదు.
రాముఁ డొక్కఁడు దానిని గాపాడుకొనలేక పెండ్లామును రాక్షసులవాతఁ బెట్టి
తానుమాత్రము వచ్చినాఁ డని పలుచఁదనముగా మాటలాడువారి నోళ్లెట్లు మూయు
దును ? లక్ష్మణా ! నే నేమి చేయుదును ? చెప్పుము.

కం. పోనీ భరతునిపురికే, రా నే పో స్వర్గ మేగ ♦ రాకేందుముఖీ
హీనుఁడ నై చనుటను నది, కానంబడు శూన్య మగుచుఁ ♦ గాడుంబోలెన్.

తా. ఇప్పుడు నేను చెప్పినదంతయుఁ బోనిమ్ము. భరతునిపురమునకు నేను
రాను. స్వర్గమునకుఁ బోయెద ననుకో. సీతలేనికారణమున నదియు స్మశానమువలె
శూన్యముగానే కానవచ్చును.

—♦ రాముఁడు లక్ష్మణుని నయోధ్యకుఁ బొమ్మనుట. ♦—

సీ. తమ్ముఁడా! నీ వింకఁ ♦ దడయకు మిచ్చటఁ, బొమ్మయోధ్యాపురం ♦ బునకు వేగ
బిగియార భరతునిఁ ♦ బ్రేమఁ గౌఁగిటఁ గ్రుచ్చి, యనుము నామాటగా ♦ నతనితోడఁ
జిరముగా రాజ్యంబుఁ ♦ జేయుమీ భరత! రా, మునియాజ్ఞ యిది యని ♦ యనుము
మాయమ్మకైకకు ♦ మీయమ్మకును గోస, లాత్మజ కెఱుఁగు నా ♦ యాజ్ఞ భక్తి [నీవు
తే. నడిగితిని జాల ననుమ మా ♦ యమ్మతోడ
సీతపోకయు నాచావుఁ ♦ జెప్పవయ్య

యామె నెల్లవిధంబుల ♦ నరయు రయ్య
పోయి రా నాయనా! నీకుఁ ♦ బాదలు శుభము. ౧౦౬-౭

తా. లక్ష్మణా! నీ విఁక నిచట నాలస్యము చేయక యయోధ్యకుఁ బొమ్ము. భరతుని గట్టిగాఁ గౌఁగిలించి నేను జెప్పితి నని యిట్లు చెప్పుము. "భరతా! నీవు శాశ్వతముగా రాజవై రాజ్యమును బాలింపుము. ఇది రామాజ్ఞ" యని చెప్పుము. ఇంతటికార్యము చేసిన మాతల్లి కైకకు, మాయమ్మకు, కౌసల్యకు నాయాజ్ఞచే భక్తితో నమస్కరింపుము, మాయమ్మను జాల నడిగితి నని చెప్పుము. సీత పోయిన విధము నాచావుకూడఁ జెప్పుము సర్వవిధముల నీ వామెను విచారించుచుండుము. నాయనా! ఇఁకఁ బోయిరమ్ము, నీకు మేలఁగునుగాక!

మాతల్లి కైక యనునది ప్రీతిపూర్వకముగఁ జెప్పినమాటగాదు. శోకము వలనఁ గలిగిన కోపముతోఁ జెప్పినమాట. 'మహా' యనునది తెలుగున 'మా' యగును. మాయమ్మ యనఁగా నాపాలిపెద్దయమ్మ యనియు ధ్వనింపనగు.

కం. నను నీవు కాచి తిరుగఁ, బని లేదిఁక లక్ష్మణా! కు ♦ మారుత లేదే
దనువున బ్రాణము నిల్పఁగ, విను శక్యముగా దటంచు ♦ విహ్వలుఁ డైనన్.

తా. నాయనా! నన్నుఁగాచి నీవు తిరుగవలసిన పనిలేదు. సీతాదేవి లేదా యెనా దేహములందుఁ బ్రాణములు నిల్పఁగ సాధ్యముగాదు, అని వెలవెలఁబోఁగా

కం. హెచ్చిలుతాపభరమ్మున, నచ్చపలాక్షిని దలంచి ♦ హావడి గొని యా
ముచ్చిరి ముచ్చిర లక్ష్మణుఁ, డుచ్చలితమనస్కుఁ డగుచు ♦ నుత్తలపడియెన్.

హావడి = ఆపద, ముచ్చిరి = శోకముగలవాఁడు, ముచ్చిరన్ = శోకింపఁగా, ఉచ్చలితమనస్కుఁడు = మిగులఁ జలించిన మనస్సుగలవాఁడు.

తా. అతిశయించినసంతాపముచే, సీతాదేవిని దలంచి రామచంద్రమూర్తి యుపద్రవపడి శోకింపఁగా లక్ష్మణుఁడు చలించిన మనస్సుగలవాఁడై కలవరపాటు చెందెను.

౬౩-వ సర్గము.

ఆ. స్నేహమోహశోక ♦ సిస్తులసంతాప, భరము పేర్మిఁ దాను ♦ గరము కుంది
తనదు దుఃఖమునకుఁ ♦ దనయట్లతపియించు, ననుజతోడరాముఁ ♦ డనియె మఱియు.

ఇఁకఁ బాపమ నెడి మదనావస్థ చెప్పఁబడును. స్నేహము = కామము, కరము = మిక్కిలి.

తా. ప్రియురాలిని స్మరించుటచేఁ గలిగినకామముచేతను, ఆమెకుఁ గలిగిన యాపదను స్మరించుటచేఁ గలిగిన పరవశత్వముచేతను, ప్రియావిరహముచేఁ గలిగినశోకముచేతను, గలిగిన యసమానమైనసంతాపాతిశయముచేఁ దాను మిగుల శోకించి తనకు వచ్చినదుఃఖమునకుఁగాను దనవలెనే తాపము నొందుచున్న లక్ష్మణుతో రామచంద్రమూర్తి యిట్లనెను.

క. శోకముపై శోకం బస్తోకము నాగుండె లవియఁ ♦ దూలించెడి; నీ
లోకంబున ననువంటిమహాకిల్బిషకారి గలఁడె ♦ యన్యుం డొకఁడున్. ౧౦౬౬

అస్తోకము = గొప్పగా, తూలించెడిన్ = చలింపఁజేయుచున్నది, కళవళ పడఁజేయుచున్నది, అవియన్ = పగులునట్లు, మహాకిల్బిషకారి = మహాపాపము చేసినవాఁడు, అన్యుఁడు = మఱియొకఁడు.

తా. శోకముమీఁద శోకము విశేషముగాఁ బ్రాప్తించి నాగుండెలు పగులునట్లు కళవళపడఁజేయుచున్నది. ఈ లోకమునందు నావంటి మహాపాపి మఱియొకఁ డుండునా ? ఉండఁడు.

ఇది మనుష్యస్వభావము. ప్రతిమనుష్యుఁడు తనకుఁ గష్టమువచ్చినపుడు తన కష్టమువంటి కష్టము లోకమున నెవరికిని లేదు—అని చెప్పుచుండును. ఎవరి కష్టము వారి కట్టులే తోఁచుచుండును. హరిశ్చంద్రుని దుఃఖములో సగముదుఃఖము శ్రీరామునకు లేదని రాములదుఃఖములో సగముదుఃఖము పాండవులకు లేదని నాబాల్యమున మాతండ్రి చెప్పుచుండ వినియుంటిని. ఒకవిధమున నది సత్యమనియే తోఁచుచున్నది.

క. తొలిబామునఁ బాపపుఁబను, లెలమిని నెన్నేనిఁ జేయ ♦ నీబామునఁ ద
త్ఫలమై చేకూరెను ని,స్తులదుఃఖముమీఁద ఘోర ♦ దుఃఖం బిట్లున్. ౧౦౬౭

తొలిబామునన్ = పూర్వజన్మంబునందు, భవశబ్దభవము బాము. "ఏ బాము లెఱుఁగక యేపాటుమేటికిఁ బసులకాఁపరియింట బాము గలిగె"—భాగ. ఎలమిని = సంతోషముతో, ఎన్నేనిన్ = ఎన్నియో - లెక్కలేక.

తా. పూర్వజన్మంబునందు నేను విస్తారముగ నెన్నియో పాపకార్యములు చేసినకారణముచే నీజన్మమునందు వానిఫలముగ పెద్దదుఃఖముమీఁద దుఃఖ మీరీతిఁ బ్రాప్తించెను.

చ. అనుపమరాజ్యనాశము, హి ♦ తాప్తవియోగము, తండ్రిచావు, నా
జననిని బాసి వచ్చుటయు ♦ సర్వము దేహము నిర్దహింపఁగా
వనగతదేహకష్టము న ♦ వంబున నన్నిటి విస్మరించితిన్
వనితను బాయ నింధనవి ♦ వర్ధిత వహ్నియ యయ్యెఁ గ్రమ్మఱన్. ౧౦౬౮

దుఃఖపరంపర చెప్పుచున్నాఁడు — అనుపమ = అసమానమైన, రాజ్యనాశము=రాజ్యము లభింపకపోవుట, హితాప్తవియోగము=నామేలుగోరు ముఖ్యబంధువుల నెడఁబాయుట, నిర్దహింపఁగాన్ = విశేషముగఁ గాల్పఁగా, ఇచ్చట నిర్ అను నుపసర్గము ధాత్వర్థమునకు విశిష్టత్వమును గల్పించుచున్నది. 'ఉపసర్గేణ ధాత్వర్థో బలా దన్యః ప్రతీయతే। ప్రహారాహార సంహార విహార పరిహారవత్ ॥ ధాత్వర్థం బాధతే కశ్చిత్కశ్చిత్త మనువర్తతే। తమేవ విశినష్ట్యన్య ఉపసర్గగతి స్త్రిధా॥,' యని యుపసర్గలక్షణము. నిర్ణయమన్నపుడు ధాత్వర్థమున బాధింపఁబడెను. నిరుద

రుఁడు=అల్పమైన యుదరముకలవాఁడు. ఇట్లులే సందర్భానుసారము గ్రహింపనగు. వనగతదేహకష్టము=అడవియందు దనుభవించు దేహముయొక్క కష్టము, నెపంబున = నెపము రూ - నెవము. సాకు = మిష, విస్మరించితిని=మఱచితిని, ఇంధన = కట్టెలచే, వివర్ధిత = మిగుల వృద్ధిచేయఁబడిన, వహ్ని = అగ్నిహోత్రము.

తా. ఒకటివెంట నొకటిగ వచ్చిన కష్టము లెవియ నడవా ? చెప్పెద వినుము. మొదటిది న్యాయ్యముగ నాకు రావలసిన రాజ్యము నాకు రాకపోవుట - ఆ కారణమున నా మేలుగోరు ముఖ్యబంధువుల నెల్ల వదలుట - నాకమిత్రమై తండ్రి చచ్చుట- తల్లిని దిక్కులేనిదానిని జేసి నేను వచ్చుట యివియన్నియు దేహమును గాల్చుచుండెను గాని యడవులలోఁబడు దేహకష్టము నెపంబున నవన్నియు మఱచితిని. ఇప్పుడు భార్యను బాయుటచే నవన్నియు స్మరణమునకు వచ్చి కుములుచున్న యగ్నికిఁ గట్టెలుచేర్చినట్లయి భగ్గని మండునట్లయ్యెను.

కం. అసురుం డెవ్వఁడొ జానకిఁ, బ్రసభంబునఁ దిగిచి వట్టి ♦ పాఱఁగ దివి సా
ధ్వసమున నపస్వరంబున, దెసమాలినభంగి నేడ్వ♦దే కోమలియుఁ౯. ౧౦౬౯

ప్రసభంబున౯=బలాత్కారముగ, తిగిచి = ఈడ్చి, సాధ్వసమున౯ = భయముతో, అపస్వరంబున౯ = మాఱుగొంతుతో, దెసమాలినభంగి౯ = దిక్కులేనిదానివలె - ఇది యెట్లు రాముఁ డూహింపఁగలిగెననిన :- ఆశ్రమమందుఁ బదార్థములన్నియుఁ జెదరినట్లు విసరిపాఱవైచిన ట్లుండుటచే బలాత్కారముగ గ్రహించిన ట్లూహింపనగును. చంపుటకు వచ్చినవాఁడైనచో నందే చంపియుండును. నెత్తురో శవమో కానవచ్చియుండును. కావున వచ్చినవాఁడు ఆమెను జంపవచ్చినవాఁడు కాఁడు. నేలమీఁదఁ బోయియుండిన మంటియందుఁ గాళ్ళజాడలు కానవచ్చియుండును. అవిలేవు. కావున నాకాశమార్గముననే పోయియుండును. దుస్సహశోకసమయమునఁ గావున డగ్గుత్తికచే గొంతు మాఱియుండును. మనకు విరోధులు రాక్షసులే కావున రాక్షసుఁడే యీపని చేసియుండును.

తా. రాక్షసుఁ డెవ్వఁడో బలాత్కారంబున నీడ్చి పట్టుకొని యాకాశమునఁ బరువెత్తఁగా భయపడి సీతాదేవి మాఱుపడినగొంతుతో దిక్కులేనిదానివలె నేడువకుండునా ?

కం. లోహితచందనలిప్తము, హృద్యములైన నీర♦జాక్షికుచముల్
లోహితధారలు గాఱ న,య్యో హతకుం డెవఁడొ పీఁక♦నొప్పఱకున్నే. ౧౦౭౦

లోహితచందనలిప్తములై =ఎఱ్ఱని శ్రీగంధముతోఁ బూయఁబడినవై, హృద్యములైన = మనోహరము లయిన, లోహితధారలు = రక్తధారలు, హతకుండు = దుష్టుఁడు.

తా. బలవంతముగఁ దీసికొనిపోయి యేమి చేయఁగలఁడు? వశపఱచుకొనుట సాధ్యముకాని కార్యము కావున నాకోపముతోఁ జంపియుండును. చంపి యెఱ్ఱచంద

నములోఁ బూయఁబడిన వపుటచే మనోహరములయిన యామెకుచములను నెత్తురు ధారలు కాఱునట్లు దుష్టుఁడెవఁడో శీఘ్రఁగా నందము చెడియుండునుగదా.

కం. ఆమృదుమధురాలాపం, బా మేచకకేశభార ♦ మాయుచిరం బై
గోముకొను మోము రాహువు, చే మిడికెడు సోముపగిదిఁ♦జెన్నఱ కున్నే. ౧౦౪౧

మేచకకేశభారము = నల్లని వెండ్రుకల గుంపు.

తా. మృదువులై తియ్యనైన యామాటలు, ఆ నల్లనివెండ్రుకలు, అందమైన ముద్దులుకాఱుముఖము రాహువుచేఁ జిక్కి దుఃఖపడు చంద్రునివలెఁ గాంతిహీనమై యుండునుగదా.

సీ. తారహారవిహార ♦ హారికంధరఁ జిల్చి, నెత్తురు ద్రావిరో ♦ నీచమతులు
నే నొంటి విడిపోవఁ ♦ గానలో రాక్షసుల్, హింసింపఁ గురరినా ♦ నేడ్వకున్న
యిదియు గోదావరి ♦ యిది ప్రియురాలికి, నతులితప్రియ మిందు ♦ నగుగుడెంచు
దినము దినం బిట ♦ వనజాక్షి యుండునే, యుండదు రా దెవ్వ ♦ డొంటి నిటకు
ఆ. నీ శిలామనోజ్ఞ ♦ దేశంబునందు ను, దారశీల మున్ను ♦ దా వసించి
కాంతహాస నవ్వ♦ గదుర నీతోఁ బలు,మాట లాడె నాన ♦ మత్సఖుండు. ౧౦౪౨

తారహారవిహారహారికంధర—తారహార=ముత్యాల సరములయొక్క,విహార= సంచారముచే-అనఁగా కదలుటచే; హారి = మనోహరమైన, కంధర = మెడను, (కం + ధర=శిరస్సును ధరించునది) కురరి=ఆఁడు లకుముకిపక్షి, ఉదారశీల = త్యాగస్వభావము గలది, మున్ను = పూర్వము, కాంతహాస = మనోజ్ఞమైన నవ్వుగలది.

తా. ముత్యాలహారములు వ్రేలాడు మెడను జీల్చి నీచమనస్సు గలవారు నెత్తురు ద్రావిరేమో ? నే నొంటిగా నడవిలో విడిచిపోయిన కారణమున రాక్షసులు హింసింపఁగా, నాఁడులకుముకివలె నేడ్వకుండునా? ఇది గోదావరి. దీనియందు సీతకు మిగులఁ బ్రేమ. ఇచ్చటికిఁ బ్రతిదినము వచ్చుచుండును. ఇందున్నదేమో ? ఉండదు. ఏలన నెన్నఁ డొంటిగా వచ్చినదిగాదు. లక్ష్మణా! ఈబండచే నింపైనప్రదేశమునందు-ఉదారశీల=అయోధ్యయందుండుసమయమున సీత యుత్తమాంగులవలని భయముచేఁ దనభర్తతోడ సరసలీలావిహారములలో సంకోచించియుండును. అదియును గాక యయోధ్యయందు రామచంద్రమూర్తి పితృసేవకని, మాతృసేవకని, పినతల్లుల విచారణమునకని, భృత్యవిమర్శకుఁ గార్యాంతరముల సంచరించుచుండి యేకొంచెముకాలమో యంతఃపురంబున నుండువాఁడు. ఆకారణముచే సరసలీలావిహారసంభాషణములు మితములయియే యుండును. ఈ కారణముచేతనే శ్రీరఘురామచంద్రుఁడును సీతను గూడి యని సీత కప్రాధాన్యమీయఁబడెను. (బాల ౧౩౬౮ వ.).ఇప్పుడన్ననో సీతారాముల కిరువురకు నితర కార్యములు లేమిని వియోగము లేదు. విజనస్థలము కావున నేకాంతముగ నుండుటంబట్టి సరసవిహారసౌఖ్యములను శ్రీరామునకు సంపూర్ణముగ నఱగొఱలేక యిచ్చుచున్న దని భావము.

మున్ను శిలామనోజ్ఞ దేశమందుఁ దా వసించి = రామచంద్రమూర్తి సీతా దేవితో గోదావరీజలములందు జలక్రీడ నారంభించి బహుకాలము జరిపి యందు గాసిపడి యొడ్డునకుఁ బోవ నెంచి యొకశిలామార్గమునఁ బోవ యత్నించెను. ఇంగిత జ్ఞానముగల సీతాదేవి యాయనచూపులచేతనే యాయనభావము గ్రహించి యింకను రామచంద్రుని శ్రమపఱుపఁ దలఁచి యాయన పోవఁదలఁచిన రేవునఁ దాను బూర్వమే యెక్కి యొడ్డునకు రాకుండునట్లు ఆయన యేయే రాతిమీఁదఁ గాలు పెట్టఁబోవుచున్నాఁడో యారాయి కనఁబడకుండునట్లు ముఖముమీఁద జల్లు పోరాడఁగాఁ దప్పటడుగుపడెను. ఈ విధముగ నన్నుఁగూడ సీత లీలావిహారము లందు జయించెను గదా యని భావము.

కాంతహాస = అనుకొన్నచోట నడుగుపెట్టలేక తప్పడుగుపెట్టిన నన్నుఁజూచి సీత నవ్వెను. నవ్వుకదుర = ఈజలకేళియందుఁ దాను జయించితి నని యధిక సంతోషము కలదై.

నా సమక్షమందు నీతో పలుమాటలాడెఁ - లక్ష్మణా నే నెన్నఁడును నెచ్చటను పరాజయ మొందినది లేదు. నేఁడు స్త్రీచేఁ బరాభవింపఁబడితినిగదా యని యవమానముచేఁ దలవంచుకొనియుంటిని. కావున నన్ను వదలి సీతాదేవి నీతో మాటలాడ నారంభించె నని భావము.

పలుమాటలాడెఁ = మీ రన్నదమ్ము లిరువురు హేమాహేమీలు, ఘటాఘటీలు, జగజ్జెట్టులు. మీరు పట్టినపట్టు జయింప సామర్థ్యముకలవారుగదా. నేనో యాఁడుదానను, అబలను. మీరు వేట కని యుద్ధమున కని పలుమాఱు పోవుచుందువారు. నే నంతఃపురము విడిచి వెలుపల రానిముగ్ధను, సుకుమారిని. ఇట్లుండ నాఁడుపిల్లనగు నాచే మీయన్న పరాజయము పొందెను గదా లక్ష్మణా యని యిట్టి సరసోక్తులు నాయెదుటనే నిన్న నెనుగదా.

నాసమక్షమంద-'తోడుతో-నైన నందనుతోడనైన నొంటిపాటున భాషించు టుడుగవమ్మ!' యన్నట్టు లొంటిగఁ బరపురుషులతో మాటలాడరాదు.

కం. పద్మాస్య పద్మలోచన, పద్మములకు గౌతమికిని ♦ వచ్చెనొకో తా
సద్మంబు విడువ దెన్నఁడు, పద్మిని నేఁ డేకతంబ ♦ వచ్చునె యిటకున్. ౧౦౭౩

గౌతమికి = గోదావరికి, సద్మము = ఇల్లు, పద్మిని = శ్రీసీతాదేవి, ఏకతంబ = ఒంటిగా.

తా. పద్మమువంటి ముఖము, పద్మములవంటి కన్నులు గల పద్మిని, సీతాదేవి పద్మములకై గోదావరికి వచ్చెనేమో? ఒంటరిగా నెప్పుడిల్లు విడువనిది నేఁడిచ్చటికి వచ్చునా ? రాదు.

కం. అసమసుమవిసరసరసము, భసలికీరవిహంగ♦భరితం బగు నీ
కుసుమకుడుంగము డాసెనొ, పొసఁగదు సతి పిఱికి యొంటిఁ♦బూనున రాఁగన్.

అసమ = అసమానమైన, సుమ = పుష్పముల, నికర = సమూహముచే, సరసము = అందమైనది, భసలీ=ఆఁడుతుమ్మెదలచేతను, కీరీ = ఆఁడుచిలుకలచేతను, విహంగ = పక్షులచేతను, భరితము = నిండినది, కుసుమకుడుంగము = పూలపొద, “బంభరశ్చ, మిళిందశ్చ, హిందోళ, భసలా సమా॥”

తా. అసమానమైన పూలసమూహములచే నందమై ఆఁడుతుమ్మెదలు ఆఁడు చిలుకలు పక్షులు వీనిచే నిండిన యీపూఁబొదయొద్దకు వచ్చెనేమో ? వచ్చి యుండదు. ఏలన నదిపిఱికి. ఒంటిగా వచ్చుటకు యత్నింపదు.

కం. నీకుఁ బ్రమొక్కెద భువనకృ,తాకృతసత్యానృతజ్ఞ ! ♦ యాదిత్య ! రవీ !
నాకాంత యెందుఁ బోయెనొ, యేకతినుండేని కొంచు ♦ నేగెనొ చెపుమీ.

ఇట్లు వెదకి వెదకి యెందునుగానక జగచ్చక్షువు గావున సూర్యునకుఁ దెలిసి యుండవచ్చునని తనవంశమునకు మూలమైనసూర్యు నడుగుచున్నాఁడు: భువన = లోకులచే, కృత = చేయఁబడిన, అకృత = చేయఁబడని, సత్య = సత్యమును, అసత్య = అసత్యమును, జ్ఞ = తెలిసినవాఁడా, ఆదిత్య=సూర్యుఁడా,రవీ ! నాభార్య యెందుఁ బోయెను ? ఏ క్రూరుఁడైన హరించెనా ? చెప్పుము.

తా. రవీ ! నీకు నమస్కారము. లోకమునందలి వారి సత్యప్రవర్తనము అసత్యప్రవర్తనము తెలిసినవాఁడవుగదా ! నాభార్య యెందు బోయెను ? ఎవ్వఁడైన నెత్తుకొని పోయెనా ? చెప్పుము.

కం. పవనా ! నీయెఱుఁగనియది, భువనాళిని లేదు పొలఁతి ♦ పొలిసెనొ లేదే
నెవఁడైన హరించెనొ యీ,దవసీమల జిక్కనోటు ♦ తడయక చెపుమా.

తా. ఆకాశమున నుండెడి సూర్యుఁడు భూమిమీఁద గృహములలో జరుగు నవి చూచి యుండఁడేమో యని వాయుదేవుని బ్రశ్నించుచున్నాఁడు. పవనా = వాయుదేవా ! నీకుఁ దెలియనిది లోకమునందు లేదు. సీత మరణించెనా, లేక యెవఁడైన హరించెనా ? ఈ యడవులలో నెందైనఁ జిక్కువడి త్రోవ తెలియక చిక్కుఁబడినదా ? జాగులేక చెప్పుము.

కం. అని యీగతిఁ గౌసల్యా,తనయుఁడు విలపింప భూరి ♦ ధైర్యాన్వితుఁ డి
ట్లనుఁ గాలోచితవాక్యం, బనఘుఁడు లక్ష్మణుఁడు రాము ♦ నారట మడఁపన్.

తా. ఈ ప్రకారము రామచంద్రమూర్తి విలపింపఁగా మిగులధీరుఁడగు లక్ష్మణుఁడు రామునియారట మడఁపఁ గాలయోగ్యములగు మాటల నిట్లు చెప్పెను.

ఉ. శోకము మాన వన్న ! వెత ♦ సొక్కి తపింపకు మన్న ! ధైర్యముం
జేకొన వన్న ! దీనతఁ గృ ♦ శింపకు మన్న ! తలోదరీమణిం
బ్రాకటరీతి రోయుదము ♦ రాఁగద వన్న ! మహాత్ము లెందు న
స్తోకము గుంద రన్న ! కడు ♦ దుష్కరముల్ ఘటియించు వేళలన్. ౧౦౭౯

తనూదరీమణిన్ = అఱచేయి వలె నుండు కడుపుగలది, స్త్రీలలో శ్రేష్ఠురాలగు సీతను, దుష్కరముల్ = కష్టకార్యములు, ఘటియించు = చేయు.

తా. అన్నా! యేడువకుము. సంతాపముచే శుష్కించి తాపము చెందకుము. ధైర్యముగలవాఁడవు కమ్ము. శోకముచేఁ గృశింపకుము. స్త్రీరత్నమగు సీతాదేవిని వెదకుదము రమ్ము. మహాత్ములగువారలు కష్టకార్యములు చేయుటయందుఁ గొంచెమైనను శోకింపరు.

కం. అని యీగతిని సుమిత్రా,తనయుం డెన్నేవిధాల ♦ ధైర్యముఁ బలుకన్
విననొల్లక దుఃఖించుచు, జనకసుతాధవుఁడు మఱియు ♦ సౌమిత్రి కనున్.

తా. ఈ విధముగ లక్ష్మణుఁ డెన్నివిధముల ధైర్యము తెచ్చుకొమ్మని సమాధానపఱచినను నాయనమాటలు వినక దుఃఖించుచు లక్ష్మణున కిట్లనియె:

ఈ క్రిందివిషయము తిలకవ్యాఖ్యానమందు వ్రాయఁబడినది. ఈ ప్రకారము రామచంద్రమూర్తి యేడ్చుట చారులవలన విని రావణుఁడు మనుష్యుఁడే యని తలఁచునట్లు చేసి తనకు వధ్యుఁడగునట్లు చేయుటకే. బ్రహ్మాండపురాణమున నిట్లు చెప్పఁబడెను—స్త్రీపుంబలానుషంగాత్మా, దేహో నాస్య విజాయతే। కింతు నిర్దోష చైతన్యం, సుఖసిత్యాం స్వకాం తనుం। ప్రకాశయతి సైవేయం, జని ర్విష్ణో నచాపరా। తథా ప్యసురమోహార్థం పరేషాం చ క్వచిత్క్వచిత్। దుఃఖాజ్ఞానశ్రమాదీంశ్చ, దర్శయే చ్ఛుద్ధసద్గుణః। క్వ్రణాది క్వచాజ్ఞానం స్వతంత్రాచింత్యసద్గుణే। మోక్షాభావాయ తేషాంతు దర్శయత్యా నజో హరిః॥

స్త్రీపురుషుల సంయోగమువలనఁ గలిగిన దేహము భగవంతునకు లేదు. అయినను విష్ణుమూర్తియొక్క యితరావతారమేదియుఁ గాక యీ యవతారము మాత్రమే దోషరహితమైన చైతన్యముగలదై నిత్యసుఖస్వరూపమైన తన శరీరమును బ్రకాశింపఁజేయుచున్నది. ఇట్లుండియు రాక్షసులను నొక్కొకచో నితరులను మోహింపఁజేయుటకై దుఃఖము అజ్ఞానము శ్రమము మొదలైనవానిని శుద్ధసత్త్వుఁడు భగవంతుఁడు కనఁబడఁజేయును. ఇంతియకాని స్వతంత్రుఁడు ఇట్టివాఁడని చింతింప సాధ్యముకానివాఁడునై సత్త్వగుణము గలవానియందు గాయము లెక్కడ? అజ్ఞానమెక్కడ? అజుఁడైన విష్ణువు రాక్షసులకు మోక్షము లేకుండఁ జేయుటకై యవి యిట్లు కనఁబడఁజేయును. దీనివలన రామచంద్రమూర్తియందు రావణునకు భగవంతుఁడనుబుద్ధి లేకుండఁజేసి వానికి మోక్షము లేకుండఁ జేయుటయే రామచంద్రుని శోకమునకు ఫలమని చెప్పఁబడెను. ఈ విధముగ రావణునిచే సీతను హరింపఁజేయుటయు, వాని పుణ్యాతిశయమును నాశముచేసి వాఁడు తనచేఁ జంపఁబడునట్లు చేయుటకే. ఆవిధముగ కేదారఖండమున "మహతా తపసా లబ్ధబలో రావణ స్తదధికతపోబలం వినా, జేతు మశక్యో దేవాశ్చ స్వయం తదధికం తపః కర్తు మక్షమా అత స్తేషాం కార్య మత్యంత మనుచిత సీతానురాగమోహాను

వృత్తి సంపాదనేన రావణస్య తపోవీర్యభ్రంశం సంపాద్య కర్తవ్య మితి లక్ష్మ్యా సహ విచార్య తదర్థం విష్ణు స్సీతయా బ్రహ్మవిద్యయా సహావతీర్ణ ఇతి." గొప్పతపస్సు చేసి సంపాదించిన బలముగల రావణుని నంతకంటె నధికతపోబలములేక జయింప సాధ్యముగాదు. దేవత లంతకంటె గొప్పతపస్సు చేయఁజాలరు. కావున మిక్కిలి యనుచితమైన సీతయందలి యనురాగము పుట్టించి దానిచే వానిని మోహితునిఁ జేసి వాని (రావణుని) తపశ్శక్తి నాశముచేసి దేవతలకార్యము చేయవలయు నని లక్ష్మీదేవితో నాలోచించి సీతతో బ్రహ్మవిద్యతోఁడ నవతరించెను అనియున్నది.

రామచంద్రమూర్తి మాయామానుషవేషధారి యనుట యంగీకరింప వలసినదే. అనఁగా నేయేసంద్భములఁ గర్మబద్ధులై జనించిన ప్రాకృతజను లెట్లెట్లు వర్తింతురో యట్లు శ్రీరామచంద్రమూర్తియు వర్తించె నని యర్థము. ఇప్పుడు భార్యయందుఁ బ్రీతిగలభర్త భార్యను బోఁగొట్టుకొనెనేని యెట్లేడ్చునో యట్లేడ్చెను. ఇవి పగలేడ్పులు – కన్నీరు కాఱలేదు – ఏడువలేదు. ఆవిధముగా మాయచేఁ గనఁబడినాఁడని కొందఱ యభిప్రాయము. కన్నీరుకార్చినది ఏడ్చినది సత్యమేకాని యది తామసశోకమువలనఁ గలిగినదికాదనియు సాత్త్వికదయాగుణముచేఁ గలిగెననియు మఱికొందఱవాదము. ఈ వ్యాఖ్యాత యీరెండవతెగకుఁ జేరినవాఁడు. ఇది వాల్మీకి యభిప్రాయానుసారము. మొదటిది యన్యగ్రంథానుసారము. రావణాసురుని మోసగించియైనను వానికి దుర్బుద్ధికలిగించి వానికి మోక్షములేకుండఁ జేయవలయునను పట్టుదల భగవంతున కేల? వానికి మంచిబుద్ధి పుట్టించి శరణాగతునిఁ జేసి రక్షింప నేలసంకల్పింపరాదు? "యదివా రావణ స్స్వయం" ఈవచ్చినవాఁడు రావణాసురుఁడే యైనను నభయ మిచ్చితి ననిగదా రామచంద్రమూర్తి చెప్పెను. ఇతరగ్రంథములు చెప్పు మోసగుణమునకు వాల్మీకి చెప్పినయార్జవమునకు సంబంధము గలదా? రావణుని తపస్సు గొప్పది యనికదా చెప్పెదరు. రావణుతపస్సు గొప్పదా? కార్తవీర్యార్జునుని బలము గొప్పదా? అప్పుడు నిట్టనిల్వున రెండుగఁ జీల్చియుండిన వీనితపస్సుగాని బ్రహ్మవరముగాని రావణుని రక్షింపఁగలిగియుండునా? రావణుని వాలి తనచంక లోనే నలిపివేసియుండిన వీనితపోబలము బ్రహ్మవర మేమైయుండును? వీరిరువుర కంటె భగవంతుఁడు తక్కువవాఁడయియా యీమాయోపాయము చేసెను? రావణునియందుఁ దమోగుణము ప్రకోపించుటచే వాని జారత్వదోషమే వానిని జంపఁ గాచియుండఁగా వానిని జంపుటకు వేఱే మాయోపాయము చేయవలయునా? తవుడు తిని చచ్చువానికి విషముఁబెట్టువాఁడు వెఱ్ఱివాఁ డన్నట్లు వానిసహజదుశ్చేష్టలచేత వాఁడు చెడుచుండఁగా నీకార్యము లేల యని సందేహము బాధించెడిని.

జయవిజయులకు మూఁడవజన్మమందుఁగాని ముక్తిలే దనువిషయము భగవంతునకుఁ దెలియనిదికాదు. రావణకుంభకర్ణులది రెండవజన్మమే కావున ముక్తి

లేదు. ఇట్లు లేనిదానిని లేకుండఁజేయ నిన్ని మాయవేషములు భగవంతుఁడు వేయనేల ?

భగవంతుఁడు రావణునకు మోక్షము లేకుండఁజేయుటకై వానికి దుర్బుద్ధి పుట్టించి వానిచే నొక యకార్యము చేయించి యది నెపముగా వానిని వధించెనేని దానివలన లోకము గ్రహింపవలసిన నీతియేమి ? లోకశిక్షకై వచ్చినవాఁడుగదా రాముఁడు ?

తిలకవ్యాఖ్యాత యభిప్రాయప్రకారము సత్యసీత యగ్నిలో దాఁగుటచే రావణుఁడు నీచోక్తులాడినది మాయాసీతనే. ఈ మాయాసీత రాముని భార్య గాదు కదా-అటులుండ రావణునకు దోష మెట్లు కలిగెను ? ప్రతిబింబమును హరించిన మూలమూర్తిని హరించినదోషము వచ్చునా ?

లక్ష్మీదేవి సహాయురాలుగా వచ్చి రావణవధయం దామె చేసిన సాహాయ్య మేమి ? మూల దాఁగియుండుటయా ?

భుజబలమునందు నస్త్రబలమునందుఁ దపోబలమునందు రావణునికంటె నింద్రాదులు హీనులుగారు. బ్రహ్మవరమున వాఁడు బలిష్ఠుఁడు. దాని నింద్రాదులు మీఱఁజాలరు. యముఁడు దండమెత్తినపుడు బ్రహ్మ యేమి చెప్పెను?

౬౪-వ సర్గము.

శా. హా మా లక్ష్మణ ! గౌతమీనదికి నా కాంతామణి పోనోపుఁ బ
ద్మమ్ముల్ గోయఁగ నన్న లక్ష్మణుఁడు స్రోతస్తీరముం జేరి సీ
తమ్మా ! యోవదినా ! యటం చఱచి ప్రత్యాలాప మాలింపలే
కమ్మార్గంబున నెల్ల రోసి కమలాస్యం గాన కవ్వార్తయున్. ౧౦౨౦

స్రోతస్ + తీరమున్ = నదియొడ్డు, ప్రత్యాలాపము = బదులుమాట, రోసి = వెదకి.

తా. లక్ష్మణా ! నీవు గోదావరికిఁ బొమ్ము. అక్కడ సీతాదేవి పద్మములు గోయుటకై పోయియుండును అని చెప్పఁగా లక్ష్మణుఁ డట్లే గోదావరీతీరము జేరి యోసీతమ్మా యోవదినా యని యఱచి బదులుమాట వినక యా మార్గమంతయు వెదకి కమలముఖిని గానక యా వార్తను

కం. రామునకుఁ దెలిపి యిట్లను, నామహిళారత్న మున్న యడ పొడ గానన్
భూమిజ పలుకదు పిలిచిన, నా మహిపసుతుండు దాన నదినిం గనుచున్.

అడ = ఆకారము, పొడ = జాడ, చిహ్నము, కానన్ = చూచినాఁడను గాను, 'అడపొడ గానరాక తెగటారియు' నను పెద్దన ప్రయోగమునందు, అడ + పొడ గానరాకయని ఛేదించిరి. ఇది తప్పని చెప్ప వలనుపడదుగాని వాడుక యందు వాఁడు అడపొడలేకపోయినాఁడు, వాని అడలేదు పొడలేదు, అని చెప్పుట గలదు. పొడ అనఁగా గుర్తు-మచ్చ-చిహ్నము. కావున అడపొడగానరాక యన్న

వ్వాడు రూపము గానరాలేదు. పోయినజాడయుఁ దెలియుటలే దనీ యర్థము గ్రహించుట బాగని తోఁచుచున్నది.

తా. రామచంద్రమూర్తికిఁ దెలిపి యిట్లనియె-ఆ సీతాదేవి యాకారము కనఁబడలేదు. ఆమె యెందుఁ బోయినదో జాడయుఁ గనఁబడలేదు. పిలిచినను సీత పలుకలేదు. అని చెప్పఁగా రామచంద్రుఁడు నదిని జూచి

కం. తల్లీ! గోదావరి! నా,పల్లవపద సీత యిందు ♦ వచ్చెన చెపుమా
హల్లకపాణి యెటేగెనొ, యెల్లాఁచి హరించెనొక్కొ ♦ యెవ్వం డైనన్. ౧౭౨

పల్లవపద = చిగురువంటి పాదములు గలది, హల్లకపాణి = చెంగలువవంటి చేయి గలది, ఎల్లాఁచి = దొంగ.

తా. తల్లీ గోదావరీ! చిగుళ్ళవంటి కోమలములైన పాదములుగల నా సీత యిచ్చటికి వచ్చెనా? మఱి యెచ్చటికైనను బోయెనా? దొంగ యెవఁడైన వచ్చి హరించికొని పోయెనా? చెప్పుము.

చ. అనవుడు భూతకోటి చెపు♦మూ చెపుమూ యని యెంత చెప్పినన్
మనుజవరుండు వేఁడినను ♦ మౌనముఁ దాల్చె సురారిభీతి నా
ధుని; నది మాఱు పల్క దిఁకఁ♦దోయజలోచన యాళి లేద; త
జ్జనకునకున్ మదంబకును ♦ జానకి యే దన నేమి చెప్పెదున్. ౧౭౩

భూతకోటి = భూతములసమూహము, సురారిభీతి = రావణునివలని భయముచే, ధుని = నది.

> నద్యశ్చ పర్వతాస్సర్వే, ద్విరూపాశ్చ స్వభావతః ।
> తోయం నదీనాం రూపంతు, శరీర మపరం తథా ।
> స్థావరం పర్వతానాం తు, రూప కాయ స్తథాపరః ।
> నదీనాం కామరూపిత్వం, పర్వతానాం తథైవచ ।
> జగత్స్థిత్యై పురా విష్ణుః, కల్పయామాస యత్నతః॥

కాళికాపురాణము.

నదులకుఁ బర్వతములకు స్వభావముచేతనే రెండురూపములు గలవు. నదులకు జల మొకరూపము. రెండవది వేఱుగా నున్నది. పర్వతములకు స్థావరరూప మొకటి కలదు. వేఱుగా మఱియొక దేహము గలదు. నదులకుఁ బర్వతములకుఁ గామరూపిత్వము పూర్వము విష్ణువు జగత్స్థితికై కల్పించెను.

తా. అని రామచంద్రమూర్తి ప్రశ్నింపఁగా భూతములసమూహము రావణుఁడు హరించె నని చెప్పుము చెప్పుము అని యెంతచెప్పినను నది రావణుఁ డేమిచేయునో యనుభయముచే రామచంద్రమూర్తి ప్రార్థించినను జెప్పినదిగాదు. 'ముక్కు దేవరకు వెఱతునా, మొట్టు దేవరలే వెఱతునా?' అని సామెతకలదు కదా. ఇట్లు నది

మానము వహించుటచే నిఁక సీతాదేవి లభించునని యాశలేదు. ఇఁక సీత తండ్రి నా తల్లి సీత యేదని యడిగిన నే నేమని చెప్పుదును ?

కం. ధారిణిఁ గోల్పడి వన్యా,హారంబులఁ గడుపు నించు♦నకటా ఝల్లన్
దూరంబుగ నెట్టెడి యా, సారసదళనేత్ర యెందుఁ♦జనియెనొ వనిలోన్. ౧౦౬౪

తా. రాజ్యమును బోఁగొట్టుకొని యడవులలోఁ బుట్టిన కందమూలాదులచేఁ గడుపునించుకొను కష్టములన్నియు మనస్సునకు రానీయక కాపాడెడి యా కమలదళాక్షి యడవిలో నెందుఁబోయెనో ?

కం. ఏ మను బంధులు లేమిని, రామను బెడబాసి జాగ♦రంబుల స్రుక్కన్
యామవతు లింక బహుళా,యామవతుల్ గావె లక్ష్మణా! యే మనఁగన్.

యామవతులు = రాత్రులు, బహుళ + ఆయామవతుల్ = మిక్కిలి దీర్ఘములు.

తా. సీగతి యేమి యని విచారించి యాదరించు చుట్టములులేని కారణముచేతను సీతాదేవిని బాసి నిద్రలేకుండుటను రేలు మిక్కిలి దీర్ఘములుగాఁ గానవచ్చును గదా.

తే. అహహా జానకి నా కిపు ♦ డబ్బునేని, యీ జనస్థానమందాకి♦నీజలములఁ
బ్రస్రవణగిరిఁ గేల్గేల ♦ రాజిలంగ, నేఁకటలు వాయఁ దిరుగనే ♦ యింతితోడ.

కేల్గేలన్ = సీతాదేవి చేతిని నాచేత, ఏఁకటలువాయ = నా యుపేక్షదీర, 'ఏఁకటవాయంగ భిక్షలిడి యెద రండీ' అని భీమఖండము, ౨ ఆ. మందాకిని = ఈ పేరుగల చిన్ననది యీ ప్రాంతమందుఁ గలదని చెప్పఁబడెను. కాని సమీపమందున్న గోదావరిని విడిచి యెక్కడనో యున్న చిన్ననదికి పోవుదు ననుటకంటె గోదావరి పంచగంగలలోఁ జేరినదగుటచే మందాకిని యనఁగా గోదావరి యని చెప్పుటే బాగని తోఁచినది. కావేరి, తుంగభద్ర, కృష్ణవేణి, గౌతమి, భాగీరథి, యివి పంచగంగలు.

తా. అహా ! ఇపుడు గనుక నాకు జానకి లభించెనా యీ జనస్థానమందుండు గోదావరీజలములందు కొండవంకలు దూఁకుచున్న ప్రస్రవణగిరియందును, సీతాదేవిచేతిని నాచేతఁ బట్టుకొని నా యుపేక్షలన్నియుఁ దీర సంచరింపనా ?

—♦ అడవిమృగములు రామునకు సీతపోబడి సూచించుట. ♦—

సీ. కంటివే లక్ష్మణా ! ♦ కాననమృగములు, సారెసారెకును నా♦చాయఁ జూచి
యేమియో చెప్పంగ ♦ నింగితం బెఱిఁగించు, చున్నవి యెఱుఁగునో♦యువతిజాడ
మృగములారా! మీర♦లెఱుఁగుదురే సీత,పోబడి యని బాష్ప♦ములు పొరంగ
శ్రీరాముఁ డడిగినఁ ♦ జివుకున నవి లేచి, దక్షిణముఖములై ♦ తరలి మోర

ఆ. లాకసమున కెత్తి ♦ యామ్యదిక్కును బట్టి, వారిమోముఁ గనుచుఁ ♦బఱువువాఱ
వానిబాసఁ దెలిసి ♦ వరమతి లక్ష్మణుం, డన్నతోడ నిట్టు♦లనియె నపుడు. ౧౦౬౬

మోరలు = ముఖములు, యామ్యదిక్కును = దక్షిణదిశను, భావ = అభిప్రాయము.

తా. లక్ష్మణా, చూచితివా! అడవియందలి మృగములు పలుమారు నా ప్రక్క చూచి యేమియో చెప్పఁదలఁచినట్లు ముఖనేత్రవికారములు గనఁబడఁ జేయుచున్నవి. వీనికి సీత పోయినజాడ తెలియునేమో అని వానిని జూచి మృగములారా! సీతజాడ మీకుఁ దెలియునా యని కన్నీరుగార్చుచు నడుగఁగా నవి చివాలున లేచి దక్షిణదిక్కుగాఁ బ్రయాణమై తలలు పైకెత్తికొని రామలక్ష్మణుల ముఖములు చూచుచుఁ బరువెత్తెను. అప్పుడు లక్ష్మణుఁడు వాని యభిప్రాయ మెఱిఁగి యన్నతోడ నిట్లనియె.

సీ. సీత యేదనుచుఁ బ్ర♦శ్నించిన నినుఁ జూచి, దివి భువి దక్షిణ♦దిక్కు గాఁగఁ
గానిపించెడిని మృ♦గములు నైఋతదిశ, పోదమా యాదెసఁ♦బోవు చోట
జానకి లభియించు♦నదుపాయ మబ్బదే, నావుడు లెస్సని♦నళిననేత్రుఁ
డనుగతలక్ష్మణుం♦డై యరుగుచు నెల్ల, గోయుచుఁ బోవుచోఁ♦ద్రోవలోన
తే. నేలపైఁ బుష్పచయములు♦రాలి యున్న
వడువుఁ గనుఁగొని దుఃఖిత♦స్వాంతుఁ డగుచు
వానిదెసఁ జూపి రఘువంశ♦వర్ధనుండు
తమ్మునకు నిట్టు లనియె గ♦ద్గదిక దనర. ౧౦౮

నైఋతదిశ = దక్షిణమునకుఁ బడమరకు నడుమమూల, అనుగత = వెంట వచ్చిన, పుష్పచయములు = పూలసమూహములు, వడువు = విధము, దుఃఖితస్వాంతుఁడు = దుఃఖముగల మనస్సుగలవాఁడై, గద్గదిక = డగ్గుత్తిక.

తా. అన్నా! నీవు సీత యేది యని యడుగఁగా నిన్నుఁ జూచి మృగములు భూమి యాకాశము దక్షిణదిక్కుగాఁగఁ జూపుచున్నవి (ఆకాశము రావణుఁడు పోయినమార్గము) దానికి సరిగా భువి వీరు పోవలసినమార్గము. మనము నైఋతిదిక్కుగాఁ బోదమా? చక్కఁగాఁ బోయిన గోదావరి దాఁటి పోవలసివచ్చును. కొంచెము ప్రక్కగాఁ దిరిగిపోయిన నే అడ్డమురాదు. కావున నట్లు పోదము. మన మామార్గమునఁ బోయితిమేని జానకి లభించు మంచియుపాయ మేదైన దొరకకపోవునా - అని చెప్పఁగా రామచంద్రమూర్తి విని బాగున్నది యాలోచన యని లక్ష్మణుఁడు తన వెంటరాఁగా నన్నియు వెదకుచుఁ బోవునప్పుడొకచోట నేలమీఁదఁ బూవులు రాలియుంటఁ జూచి మిగుల దుఃఖముగలవాఁడై వానివైపు లక్ష్మణునకుఁ జూపి రఘువంశవర్ధనుఁడైన రామచంద్రమూర్తి డగ్గుత్తికతో లక్ష్మణుతో నిట్లనియె సూక్ష్మాలంకారము.

కం. కుసుమములు వనమున నేఁ, గోసి ధరాతనయకుఁ గీలుకొ♦గోమలి ముడిచెఁ
భాసురవేణిని శ్వసన, తప్సమనూర్యులు కాచి రిల్లు♦ మత్ప్రియకై. ౧౦౯

భాసురవేణిసి = ప్రకాశించు జడయందు, శ్వసన,క్ష్మా, సూర్యాలు = గాలి, భూమి, సూర్యులు, మత్ప్రీతికైై = నన్ను సంతోషపెట్టుకొఱకు.

తా. ఈ పువ్వులు నేను గోసి తన కీయఁగా సీత తనజడయందు ముడిచెను. ఇవి కొట్టుకొనిపోక దుమ్మునిండక వాడక యుండునట్లు నేను గుర్తించుటకై వాయువు భూమి సూర్యులు రక్షించిరి.

కం. అనుచు మహాభుజుఁ డగు లక్ష్మణుతో వచియించి ధర్మ ♦ సద్భావుం డ
ల్లనఁ జని ప్రస్రవణాకుల, ఘనశైలేంద్రంబు గాంచి ♦ కరుణోక్తి ననుక్. ౧౮౯౦

మహాభుజుఁడు = గొప్పభుజములు గలవాఁడు, అనఁగా విశేషభుజబలము గలవాఁడు అని యర్థము. దీనిచేత శ్రీరామునకు తనబలపరాక్రముతోగాక బలవంతుసహాయ్యముకూడఁ గలదని భావము. ధర్మసద్భావుండు = ధర్మముతోఁ గూడిన మంచి యభిప్రాయము గలవాఁడు, గనుక నే పర్వతము ధ్వంసము చేయలేదని భావము. ప్రస్రవణ = కొండవంకలచే, ఆకుల = కలఁతనొందిన, ఘనశైలేంద్రంబుక్ = గొప్పపర్వతశ్రేష్ఠమును, కరుణ + ఉక్తి = శోకముతోఁగూడిన మాటలచే.

తా. అని మహాభుజబలసంపన్నుఁడైన లక్ష్మణునితోఁ జెప్పి ధర్మముతోఁ గూడిన మంచిభావముగల రామచంద్రమూర్తి మెల్లగఁ బోయి జలపాతముగల పెద్దకొండను జేరి వ్యసనముతోఁగూడినమాటలచే నిట్లనెను.

తే. అబల సర్వాంగసుందరి ♦ యవనిభృద్వ, రా! మనోహర మగువన♦రాజిఁ జూడఁ
బడియెనా సీతనీచేత ♦ విడువఁబడుట, నొంటి నాచేత నడయాడు ♦ చుండ నిచట.

సర్వాంగసుందరి = ప్రత్యవయవము సుందరమైనది. అవనిభృద్వరా = పర్వతశ్రేష్ఠమా, వనరాజి = వనములసమూహమందు, నడయాడుచుండక్ = తిరుగుచుండఁగా.

అన్వయక్రమము

అవనిభృద్వరా యబల సర్వాంగసుందరి సీత మనోహరవనరాజి నాచేత నొంటి విడువఁబడుట నిచట నడయాడుచుండ నీచేతఁ జూడఁబడియెనా ?

ఇది శ్రీరామచంద్రమూర్తి పర్వతము నడిగినప్రశ్న. ఇందుఁ జిత్రాలంకారము గలదు. ప్రశ్నయే ప్రత్యుత్తర మయ్యెనేని చిత్రాలంకార మనఁబడును. పశువులు, పక్షులు, చెట్లు ప్రతిధ్వనులీయవు. పర్వతముగావునఁ బ్రతిధ్వని పుట్టును. ప్రతిధ్వనియందు మన మఱచినధ్వనియే వినవచ్చును గాని మన మొకటియనిన వేఱొక ప్రతిధ్వని పుట్టదు. కావున రామచంద్రమూర్తి చెప్పిన అబల సర్వాంగసుందరి యవనిభృద్వరా, ఇత్యాదివాక్యములే మరల వినవచ్చెను. వాల్మీకిప్రతిభావిశేషమిందుఁ గాననగు. ఇట్లు వినవచ్చిన ధ్వని రామచంద్రమూర్తి ప్రశ్నకు బ్రత్యుత్తరమగుచున్నది ఎట్లన.

అవనిభృత్ + వరా = రాజశ్రేష్ఠా. తక్కినపదములకు ముందరివలెనే యర్థము గ్రహింపవలెను. ఇప్పు డన్వయక్రమ మెట్టులన:—

ఓయవనిభృద్వరా (రాజా) అబల సర్వాంగసుందరి సీత నీచేత నొంటి విడువఁబడుట మనోహరవనరాజి నిచట నడయాడుచుండ నాచేతఁ జూడఁబడియె.

నీవు విడిచిపోయినసీతను నే నిచ్చటఁ జూచితి నని యర్థము-ఈ శ్లోకమును గాళిదాసు తన విక్రమోర్వశీయమందుఁ ననువదించెను. (ఈపద్యవిషయము పీఠిక యందుఁ గనఁదగు.) అడుగఁబడిన ప్రశ్నకుఁ బ్రత్యుత్తర మభిన్నమగునేని చిత్రాలంకారము. దీనినే చిత్రోత్తరాలంకారము - చిత్రాలంకారము సంఘటించుట యొక గొప్పగాదు. ఏమహాకవియైనను వ్రాయఁగలఁడు. జటాయురావణులయుద్ధకాలమున సీత కొంతసే పిందుండుటయు పర్వతము ప్రతిధ్వనియిచ్చునని స్ఫురించుటయు, ఆ ధ్వనిని ప్రత్యుత్తర మగునట్లుచేయుటయు నిట్టి సందర్భోచితప్రతిభ కుదురుట సామాన్యవిషయము కాదు.

క౦. అనఁగఁ దనయట్ల పలికిన, పని క్షుద్రమృగంబుఁ గసరు♦పంచాస్య మనన్
వనరుహనయనుం డాగిరిఁ, గనుఁగొని యిట్లనియె గెంపు ♦ గదురం గనులన్.

అనఁగన్ = రామచంద్రమూర్తి యీప్రకారము ప్రశ్నింపఁగా, తనయట్ల = తానుజెప్పినట్లే, క్షుద్రమృగంబున్ = నీచమృగమును - అల్పమృగమును, కసరు = కోపించు, పంచాస్యమనన్ = సింహమోయనునట్లు, పంచాస్యము = వెడలువయిన ముఖము గలది. వనరుహనయనుండు = కమలనేత్రుఁడు, కెంపు = ఎఱ్ఱనికాంతి.

తా. అని తాను జెప్పినమాటలే మరల వినరాఁగా నిర్లక్ష్యభావమునఁ దన్నుఁ బరిహసించుచున్నది యని కోపించినవాఁడై రామచంద్రమూర్తి యాపర్వతమును సింహ మల్పమృగంబును జూచినట్లు చూచి గన్నులెఱ్ఱనగాఁగా నిట్లనియె.

క౦. బంగారువన్నె గల నా,బంగరుబొమ్మను మృగాక్షిఁ ♦ బర్వతమా! చూ
పం గడఁగ వేని నాకం, బుం గావించెదను నత్త♦ముల గిత్తములన్. ౧౦౯౩

బంగరుబొమ్మయనుటచే లావణ్యము చెప్పఁబడెను. నత్తములన్ = కొండ మీఁద విశాలములైన ప్రదేశములను, గిత్తములన్-ఇది నిందయందుఁ జెప్పునది

తా. బంగారుకాంతియు మెఱపును గల నాసీతను జూపఁ బ్రయత్నముచేయు లేని యోపర్వతమా నిన్ను నీ నత్తములను గిత్తములను నేలఁబడ మొత్తెదను.

క౦. అని పర్వతమును రాముఁడు,జనకసుతం గూర్చి యడుగ ♦ శైలంబు ప్రతి
ధ్వనినెపమున బదు లిడి యా,వనితామణిఁ జూపకున్న ♦ వసుధాధవుఁడున్.

తా. అని రామచంద్రమూర్తి జనకసుతను జూచితివా యని యడుగఁగాఁ జూచితినని ప్రతిధ్వనినెపమున బదులుచెప్పి యూరకుండఁగా రామచంద్రమూర్తియు,

క౦. మంచితనంబున సతి నర్పించిన సరి కాకయున్నఁ ♦ బృథివీధర! కా
రించెద శరముల మసి గా,వించెదఁ బాడగుచు వేరు♦వెల్లంకులతోన్. ౧౦౯౪

తా. మంచిమాటలచే నడిగినపుడు నీవు సౌమ్యమార్గమున సీతను నర్పించితివా సరే-అటు చేయకపోతివా నా బాణములచే నిన్ను బాధించి నీ వేరువెల్లాకులతోఁ గాల్చి బూదిచేసెదను.

కం. చిగురుంబోఁడి తెఱంగును, దగువిధముగఁ జెప్పకున్నఁ♦దమ్ముఁడ! నదినీ
రిగిరించెద నని కినుకం, దెగఁ బల్కుచుఁ జూడ నొక్కె♦డను నేలపయిన్.

తా. సీతాదేవివృత్తాంత మీనది చెప్పకుండిన దీనిలోని నీళ్ళంతయు నిగుడఁ జేసెదను అని కోపముచే సాహసించి పలుకుచు నందు వెదకఁగా నొకచోట నేల మీఁద

—♦ రాముఁడు సీతాదేవిభూషణాదుల నేలపైఁ జూచుట. ♦—

చ. ఇల నట భీతి గొంచుఁ బరు♦వెత్తినజానకి పదచిహ్నముల్
స్ఫుటముగ నామె వెన్క నడి♦పోఁకుల ఱేనివి పెద్దపాదముల్
త్రుటితధనూరథంబులను♦తూణియు నిందును నందు వ్రీలి యుం
డుట గని సంభ్రమించుచు న♦నుంగుసహోదరుతోడ నిట్లనున్. ౧౦౯౬

స్ఫుటముగ = స్పష్టముగ, పోఁకులఱేనివి = రాక్షసరాజువి, త్రుటితధనూరథంబులును = విఱిగిన విల్లు తేరును, తూణి=అంబులపొదియును, సంభ్రమించుచున్ = తొట్రుపాటుపడుచు.

తా. భయపడి యిక్కడ కక్కడకుఁ బరువెత్తిన సీతవి చిన్నపాదములును, ఆపదముల వెంబడి పోయిన రాక్షసుని పెద్దపాదములును, విఱిగిపడిన ధనుస్సు, తేరు, అమ్ములపొదియును, నిచ్చటనచ్చటఁ బడియుండఁ జూచి తొట్రుపడుచు లక్ష్మణునితో నిట్లనియె

సీ. చూడుమా లక్ష్మణ! ♦ సుదతి ధరించిన, జోమాలెపూసలు ♦ సొన్ననగలు
మాల్యముల్ ధరరాలె♦మహినిండఁ బైఁడిపూ,సలువోలె రక్తబి♦oదులు రహించెఁ
గావున నాసతిఁ ♦ గామరూపాసురుల్, ఖండించి ఖండించి ♦ ఖండములుగ
భక్షించిరని యెంతుఁ ♦ బడఁతికై యిద్దఱు, పిరువీఁకులాడుచు ♦ బిరుదు లగుట
తే. రాక్షసులు తమలోన సం♦గ్రామమునకుఁ
దొడరి యిట్లు రటంచును ♦ దోఁచె నాకుఁ
గాక యుండిన నిచ్చోట ♦ గార్ముకాది
ఖండములు రాలుటకు నేమి ♦ కారణంబు. ౧౦౯౭

సొన్ననగలు = బంగారుసొమ్ములు, రక్తబిందులు= నెత్తురుచుక్కలు, కామరూప+అసురుల్ = కోరినరూపము ధరింపఁగల రాక్షసులు, పిరువీఁకులాడుచున్ = సీతకొఱకై పెనఁగులాడుచు, బిరుదులు = సమర్థులు, సంగ్రామమునకున్ = యుద్ధమునకు, తొడరి = ఒకరినొకరు ఎదిరించి, కార్ముకాదిఖండములు = విల్లు మొదలైనవాని తునుకలు.

తా. లక్ష్మణా ! సీతాదేవి ధరించిన జోమాలెపూసలు బంగారుసొమ్ములు నివె చూడుము. ఆమె ధరించియుండిన పూలదండలు నేలరాలినవి. నేలమీఁద బంగారుపూసలవలె నెత్తురుబొట్లు పడినవి. కాఁబట్టి కోరినరూపము ధరింపఁగల రాక్షసులు నాసీతను బట్టి తెచ్చి యిక్కడ తునుకలు తునుకలుగా నఱికి తిన్నవా రని తలంచెదను. అట్లైన నీవిల్లు లోనైనవి విఱిగి పడనేల యుండువేమో ? సీతా నిమిత్తమై యిరువురు రాక్షసులు నాకు నాకని సుందోపసుందులవలెఁ గలహించి రని తోఁచుచున్నది. ఈ వింటితుంటలు లోనైనవి వారివే. అటుగాకపోయిన నిర్మానుష్యమైన నీయడవియం దిచ్చట నివి యిట్లు లుండుటకుఁ గారణమేమి గలదు ?

క౦. కాంచనభూషాన్వితమై, చంచన్మణిమౌక్తికాదిసంగతమై రా
జించెడివి లేరిదో యీ,సంచున నిట విఱిగి పడినచందం బెటులో. ౧౧౫

కాంచనభూషా + అన్వితమై = బంగారాభరణములతోఁ గూడినదై, చంచత్ + మణిమౌక్తికాది సంగతమై = మెఱయుచున్న రత్నములు, ముత్తెములు, మొదలయినవానితోఁ గూడినదై, ఈసంచునన్ = ఈవిధముగ.

తా. లక్ష్మణా ! బంగారుసొమ్ములచే నలంకరింపఁబడి తళతళ మెఱయు రత్నాలు ముత్యాలు గలిగియున్న యీవిల్లెవరిదో కదా! ఇది యిచ్చట విఱిగిపడి యుండఁ గారణమేమో ?

క౦. తరుణార్కనిభము చామీ,కరకృతము విదూరజమణిఖచితం బగుచున్
ధరణిపయిఁ దునుక లగుచును,దొరఁగిన యది కవచ మెవరిదో యనఁగలవే.

తరుణార్కనిభము = లేతసూర్యునివంటి కాంతిగలది, చామీకరకృతము = బంగారుతోఁ జేయఁబడినది, విదూరజమణిఖచితంబు = వైదూర్యములచేఁ జెక్కఁ బడినది.

తా. లేతసూర్యునివలె నెఱ్ఱనైయుండునదియు బంగారుతోఁ జేయఁబడి నదియు వైదూర్యములు చెక్కఁబడినదియు నయ్యు నేలమీఁదఁ దునుకలై పడిన యీకవచ మెవరిదో చెప్పఁగలవా ?

ఆ. శతశలాకమైన ఛత్రంబు దివ్యమా,ల్యోపశోభితంబు నుర్విమీఁద
భగ్నదండ మగుచుఁ బడియున్నది ట్లాట, కేమిహేతువొక్కొ యెవరిదొక్కొ.

శతశలాకము=నూఱుకమ్ములు గలది, ఛత్రము = గొడుగు, దివ్యమాల్యోప శోభితంబు = శ్రేష్ఠములైన పూలదండలచేఁ బ్రకాశించునది, భగ్నదండము = విఱిగినదండము గలది.

తా. నూఱుకమ్ములు గలిగి మేలైలపూలదండలతోఁ బ్రకాశించునదియై పట్టుకొనుకట్టె విఱిగినదై యీగొడుగు భూమిమీఁద నిట్లు పడియుండ నేమి కారణము ? ఇది ఎవరిది ?

క౦. హేమతనుత్రాణంబులు, భీమాకృతు లురుతనువులు ♦ భీష్మపిశాచో
ద్దామాస్యంబులు ఖరములు, భూమండలిఁ దెరలె నెవరి♦వో యివి తెలఁపన్.

హేమతనుత్రాణంబులు = బంగారుజీరాలు, భీమాకృతులు = భయంకరాకారములు, ఉరుతనువులు = గొప్పదేహములు, భీష్మ = భయంకరమైన, పిశాచోద్దామాస్యంబులు = పిశాచములముఖములవంటి పెద్ద ముఖములు గలవి, ఖరములు = కంచరగాడిదలు, తెరలెన్ = పడెను.

తా. బంగారుకవచములు, భయంకరాకారములు, పెద్ద దేహములు, భయముగలిగించు పిశాచముఖములు గల కంచరగాడిద లిచ్చటఁ బడియుండనేల ? ఇవి యెవరివి ?

సీ. దీప్తాగ్నినిభ మయి ♦ తేజరిల్లుధ్వజంబు, విఱిగినయదియు నే♦వీరునిదియొ
యగ్రముల్ దునిఁగిన ♦ యక్షమాత్రస్వర్ణ, పుంఖబాణంబు లే♦పురుషునివియొ
నించినబాణముల్ ♦ నించినట్లున్న వీ,దోనలను గంటివే ♦ తునిఁగి పడియె
నొకచేత ఖడ్గంబు ♦ లొకచేత సెలగోల, యొసఁగి సారథి చచ్చె ♦ నెవరివాఁడొ
ఆ. చెవులఁ గుండలములు♦శిరమునఁ బాగయుఁ, గొమరుమీఱ నేలఁ♦గూలినారు
చామరములు దాల్చు♦జను లిర్వురిదెవాఁడు, మెవరివారొ వీరు♦హితచరిత్ర.

దీప్తాగ్నినిభము = మండుచున్న యగ్నితో సమానమైనది, అగ్రముల్ = కొనలు, అక్షమాత్ర = ఇరుసంతపొడుగై, స్వర్ణపుంఖ = బంగారుపిడిగల బాణంబులు, ఇరుసనిచెప్పుటచే శిల్పశాస్త్రప్రకార మెనుబదినాలుగంగుళములుగల పొడుగని యేర్పడెడిని. నించినబాణముల్ = నిండించిన బాణములు, దోనలను = అంబుల పొదులను, దీనివలన నివి యక్షయబాణతూణీరములని యేర్పడుచున్నవి. సెలగోల = కొఱడా - చబుకు.

తా. మండుచున్న యగ్నితో సమానమై ప్రకాశించు టెక్కెము విఱిగిపడినది. ఇది యేవీరునిదో ? ములుకులుండుకొనలు విఱిగి యిరుసు పొడవుగలవై బంగారు పిడిగలిగిన యీ బాణము లెవరివో ! ఈ పొదులందు బాణములు నిండించినవి నిండినట్లే యున్నవి. వెలితిపడలేదు. తునిఁగిపడియున్నవి. ఒకచేతఁ ఖడ్గములు నొకచేత కొఱడా పట్టుకొని సారథి చచ్చిపడియున్నాఁడు. వీఁ డెవని సారథియో ? చెవులందుఁ గుండలములు తలమీఁద పాగా కలవారై చామరములు పట్టుకొన్నవా రిరువురు నేలఁబడియున్నారు. వీ రెవరివారో !

జటాయువుచేఁ ద్రుంపఁబడిన పదార్థములన్నియుఁ దెలుపఁబడినవి. కాని యిందుఁ దెగిపడిన రావణాసురుని చేతులు చెప్పఁబడలేదు. దానివలనఁ గాండీవము నల్లెత్రాటివలెఁ దెగిపడిన చేతులే మఱలఁ గఱమకొననని యెంచవలసి యున్నది.

—♦ రాముఁడు దేవతలపైఁ గోపించి జగత్సంహారముఁ జేయఁబూనుట ♦—

ఉ. ఈవిధ మంతయుం గనఁగ ♦ నెవ్వఁడొ రాక్షసుఁడే యిటేవనిఁ
నావనితన్ హరించె నని ♦ నాకు నిజంబుగఁ దోఁచెఁ దమ్ముఁడా
యీవల కేమిలే యనుచు ♦ నెంచితి నిం కిట జీవితాంతకం
బై విడరానిసూడు దను♦జావళితో ఘటియిల్లె దీనిచేన్. ౧౦౪

జీవితాంతకము = ప్రాణముపోవువఱకుండునది. సూడు = పగ.

తా. ఇక్కడ జరిగియుండువిషయ మంతయు నాలోచింపఁగా నెవ్వఁడో రాక్షసుఁడే యీప్రకార మీయడవియందు నాభార్యను హరించె నని నిజముగాఁ దోఁచుచున్నది. ఇంతవఱకు సీతయే తనంతటఁ దాసే యెందైనఁ బోయెనో, మృగములే భక్షించెనో, మాంసార్థియైన యొక్కరాక్షసుఁ డెవఁడైన హరించెనో యని యెవరియందును నిందమోపలేక యెట్లు పోయినదో యేమో యని యుపేక్షవహించియుంటిని. ఇఁక నిక్కడస్థితినిఁ జూడ బలిష్ఠుఁడైన రాక్షసుఁడే విరోధబుద్ధిచే నా కపకారముచేయఁగోరి సీతను హరించె నని తోఁచుచున్నది. కావున మనకు రాక్షసులతో ప్రాణాంతకమైన విరోధము కలిగెననుట నిశ్చయము

కం. హృతయో మృతయో సతి భ,క్షితయో రాక్షసులచేత ♦ క్షితిసుత రక్ష
స్తతిచేతఁ జిక్కఁగా న,క్షతధర్మం బైనఁ గావఁ♦జాలదు కంటే. ౧౦౫

హృత = పట్టుకొనిపోఁబడినది, మృత = చంపఁబడినది, భక్షిత = తినఁబడినది, రక్షస్తతిచేత = రాక్షససమూహముచేత, అక్షతధర్మము = నే ననుష్ఠించు కొఱఁతలేని ధర్మముకూడ.

తా. రాక్షసులు సీతాదేవిని హరించి యెందైన దాఁచియుయిన నుంచి యుండవలయును, లేక యామె చచ్చియైన నుండవలెను, లేదా రక్షస్సులు తిని యైన నుండవలయును. ఇందేదియో యొక్కటి జరిగియుండుట సత్యము. ఇట్లు రాక్షసులు బాధపెట్టఁగా అస్ఖలితముగ ననుష్ఠింపఁబడుచున్న ధర్మమైనను రక్షింపదుగదా! ధర్మో రక్షతి రక్షితః-అవత్సు రక్షకో ధర్మ యని,ధర్మము తన్ను రక్షించు వారిని రక్షించు ననుటయు సరిగాదుగదా! తన యిష్టము వచ్చినపుడు తనయిష్టము వచ్చినవారిని రక్షించునేగాని సర్వత్ర సర్వజనులను సర్వవిధములఁ బ్రతిసమయ మందును రక్షించు ననుట సత్యమని నమ్మరాదు.

కం క్షితిసుత యపహృత యై భ,క్షితగా సౌమిత్రి సురలు ♦ కెలసము దీర్పన్
మతిగొనరు వీరె నా కప,కృతిఁ జేసియు క్షేమముగను♦గాఁ లెడివారల్. ౧౦౬

క్షితిసుత = భూపుత్రి, అపహృతయై = అపహరింపఁబడినదై, భక్షితగాన్ = భక్షింపఁబడినదియగుచుండఁగా, కెలసము = కార్యము, మతిగొనరు = ఇష్టపడరు, అపకృతి = అపకారము.

తా. రాక్షసు లీప్రకారము సీతను భక్షించుచుండ, లక్ష్మణా! ధర్మఫలదాత

లగు దేవతలైనను నక్కాలమువేళ నాదుకొనఁ దలఁపరైరికదా! కావున వీరును నా కపకారము చేసినవారే. వీ రిట్లు నాశత్రువుల కనుకూలురై నాకు నపకారము చేయఁ బూని సుఖపడఁగలరా?

ఆ. భువనసంఘములను ♦ బుట్టింపఁ బొలియింప, శక్తి గలిగి కరుణ ♦ సాధు వైన
యట్టిపురుషు లక్ష్మణా! యెల్లవా రవ,మానపఱుచు వారు ♦ జ్ఞానమేది. ౧౧౦౭

భువనసంఘములను = లోకసమూహములను, పొలియింపన్ = సంహరించుటకును, జ్ఞానమేది = జ్ఞానములేక.

తా. దేవతలు ధర్మపక్షమువారుగదా! వారేల నీ కపకారము చేసెద రందువా? లక్ష్మణా! బ్రహ్మాండకోటులను బుట్టింపను గిట్టింపను శక్తిగలిగియు నట్టి శక్తిచూపక దయచే సాధువగువానిని జ్ఞానము లేనికారణమున ధర్మపక్షమువారు నధర్మపక్షమువారు నందఱు నవమానపఱచువారే. శిష్టులు శిష్టులచేతనే పూజింపఁ బడుదురు. దుష్టులు సర్వత్ర పూజింపఁబడుదురు. కేవలశుద్ధసాత్వికులగువారిని మిశ్రసాత్వికులుకూడ నధిక్షేపింతురు. అనాదరింతురు. అపకారముకూడఁ జేయుదురు. జగత్సృష్టిసంహారశక్తి నాయందుండినను దయను బురస్కరించుకొని సాధువృత్తినుండుటచే కేవలతామసులు రాక్షసులేగాక మిశ్రసాత్వికులు దేవతలుకూడఁ జులకనచూతురు.

కం. లోకహితయుక్తు సాధువుఁ, బ్రాకటకరుణాత్ము దాంతు ♦ బలహీనునిఁగా
లోకంబు దలఁచు సత్యము, నాకథ యిప్పు డట్టిదయ్యె ♦ నాయన వింటే. ౧౧౦౮

లోకహితయుక్తున్ = లోకమునకు మేలుచేయుతలంపుతోఁ గూడినవానిని, సాధువు = అపకారముచేయక నుపకారమేచేయువానిని, ప్రాకటకరుణాత్మున్ = స్పష్టముగాఁ గరుణతోఁగూడినమనస్సుస్వభావము గలవానిని, దాంతున్ = ఇంద్రియనిగ్రహముగలిగి శాంతిపరుఁడైనవానిని, బలహీనునిఁగా = బలములేనివానిఁగా లోకము తలఁచును.

తా. లోకమునకు మేలుచేయఁగోరి యాకారణముచే నెవ్వరికి నపకారముఁ గోరక మెత్తనివాఁడై మిక్కిలిదయయే స్వభావగుణముగాఁ గలవాఁడై యాకారణముచే శాంతుఁడైనవానిని, లోకము వీఁడు బలహీనుఁడు కావున నా లోపమును గుణముగాఁ గనఁబడునట్లు నటించుచున్నాఁడుగాని సామర్థ్యము కలిగి యూరకున్నవాఁడు కాఁడని లోకముఁ దలఁచి యాదరింపదు. ఇది సత్యము నా చరిత్ర మిప్పు డిట్టిదే యయ్యెను. సంహారశక్తి, దండించునధికారము గలిగియు దానిని వెలిపెట్టక మేలే చేయవలయు ననిపూనిన కారణముచే సురాసుర లిరువురు నన్ను దుర్బలుఁడగుటచే సాధువువలె నటించుచున్నాఁ డని తలంచుచున్నారు.

హ్రీరమ్యాన్ జడుఁగాఁగ, సువ్రతుని మాయింగా, శుచిం దంభిగా। సూరున్ నిర్దయుఁగా మునిన్ విమతిఁగా శ్రోత్రప్రియాలాపు నిఃస్సారుంగా, బలవంతు గర్వి

తునిఁగా, సద్వ్యక్త వాచాలుఁగాఁ। క్రూరుం డెన్ని సుధీగుణంబు, దురితారూఢంబుఁ జేయుంగదా.—”భర్తృ.

ఏకః క్షమవతాం దోషో, ద్వితీయో నోపపద్యతే।
యదేనం క్షమయా యుక్తం, మశక్తం మన్యతే జనః॥ భార.౦౫-౩౩-౪౮.
క్షత్రియాణాం బలం తేజో, బ్రాహ్మణానాం క్షమా బలమ్।
క్షమమాణం నృపం నిత్యం, నీచః పరిభవే జ్జనః।
హస్తియంతా గజస్యేవ, శిర ఏవారురుక్షతి।
క్షమా గుణో హ్యశక్తానాం, శక్తానాం భూషణం క్షమా।
క్షమా ప్రశస్యతే లోకే, నతు పాపేష్వతి క్షమాః।
క్షమావంతం హి పాపాత్మా, జితోఽయమితి మన్యతే।
క్షమా వాన్ నిరమర్షశ్చ నైవస్త్రీ న పునః పుమాన్ ॥

క్షమగలవానిని లోకు లశక్తుఁ డందురు. ఆయొక్క దోషముతప్ప రెండవ దోష మతనియందు లేదు.

క్షత్రియులకుఁ దేజస్సు బలము. బ్రాహ్మణులకు క్షమ బలము. సర్వదా క్షమయేగల రాజును నీచులు పరిభవింతురు. ఏనుఁగు క్షమగలదగుటచే మావటి వాఁడు తలపై కెక్కుచున్నాఁడు. అశక్తుల గుణము క్షమ. శక్తుల కది భూషణము. క్షమ లోకమునఁ బ్రశంసింపఁబడునుగాని పాపులను క్షమింపరాదు. పాపాత్ములు క్షమ గలవానిని జూచి మనమే గెలిచితిమని తలఁతురు. కోపమే లేక క్షమయే గలవాఁ డాఁడుదిగాఁడు-మగవాఁడు గాఁడు.

కం. కుట్టినచోఁ దే లందురు, కుట్టకయే యుండెనేని ♦ కుమ్మరపురువం
చెట్టును లక్ష్యముసేయరు, కట్టిఁడిజను లిదియు జగము ♦ క్రమము కుమారా.

కట్టిఁడిజనులు - కట్టు + ఇఁడి = కట్టుబాటు లేనివారు, బుద్ధిహీనులు.

తా. లోకమువిధ మెట్టిదనఁగా కుట్టునా తేలు తేలని భయపడి దూరదూర మునసే జనులుందురు. కుట్టకయేపోయెనా ఇది కుమ్మరపురుగు అని దానిని లక్ష్యమే సేయరు. పుల్లలతోఁ బొడిచి బాధయుఁ బెట్టుదురు. ఇది బుద్ధిహీనులగు లోకుల లక్షణము.

కం. నాయెడఁగల సద్గుణతతు, లీయెడ దోషంబు లగుచు ♦ నేర్పడెఁగద తా
నీ యసురభూతచయములు, పాయక కను మిప్పు డెట్టి♦పాటులు పడునో. ౧౧౧౦

తా. నాయందుఁగల కళ్యాణగుణము లీసమయంబున వీరిచే దోషంబులుగా భావింపఁబడెనుగదా! కానిమ్ము. రాక్షసులు, భూతసమూహము లిఁక నాపౌరుషగుణముచే నెట్టిపాటులు పడునో చూచుచుందుము.

కం. కటకట మని తొలిమలపైఁ, గటకువెలుఁగు దోఁచి శీత♦కరు తేజంబుల్
బిటబిట హరించు గతి నే, బిటుసున మృదుగుణములణఁచి ♦ వెలిఁగెదఁ గనుమీ.

కఱకువెలుఁగు = సూర్యుఁడు, బిఱుసున = బరుసగుణముచే, తొలిమల = తూర్పుకొండ.

తా. తూరుపుకొండమీఁద కఱకఱమను చుఱుకుగలకిరణములతో ఖరకరుఁడగుసూర్యుఁ డుదయించి చంద్రుని తేజస్సు హరించువిధమున నేనును బరుసగుణములను గలవాఁడనై మృదుగుణములను నణఁచి ప్రకాశించెదను. అప్పటికిఁ గాని వీరికి నాయందు భయభక్తులు పుట్టవు.

కం. రాక్షసపిశాచకోటుల, యక్షులగంధర్వతతుల ♦ నవనీజనులన్
వీక్షింపు మొక్కఁడేనియు, నీక్షణమున సుఖముగాఁగ ♦ నెసఁగెడి నేమో. ౧౧౧౨

తా. రాక్షసులందును, పిశాచములందును, యక్షులందును, గంధర్వులందును, భూమిజనులందును నొకఁడైన సుఖపడునేమో నీక్షణమున నా పరాక్రమముఁ జూపెదఁ జూడుము.

చ. హతమరుదర్క పావక మ♦హాప్రభ మై మథితాద్రిశృంగ మై
గతిరహితగ్రహంబు నయి ♦ స్ఖన్ననిశాకరబింబ మోచు శో
షితజలరాశిసంఘ మయి ♦ ఛిన్నలతాద్రుమగుల్మ మై జగ
త్తతి పొలియంగఁ జేసెద శి♦తప్రదరప్రకరప్రభాళులన్. ౧౧౧౩

హత = కొట్టఁబడిన (చెడిన), మరుత్ + అర్క + పావక + మహాప్రభమై = వాయువు, సూర్యుఁడు, అగ్నిహోత్రుఁడు, వీరియొక్క గొప్పకాంతిగలదై, మథితాద్రిశృంగమై = పిఱువఁబడినకొండశిఖరములుగలదై, గతిరహితగ్రహంబులయి = పోవుటకుమార్గములేని గ్రహములుగలదై, స్ఖన్ననిశాకరబింబము = జాఱిపడిన చంద్రబింబము, ఓచు = గలదై, శోషితజలరాశిసంఘమయి = ఎండినసముద్రముల గుంపులుగలిగి, ఛిన్న = ఛేదింపఁబడిన, లతా + ద్రుమ + గుల్మము = తీఁగలు, చెట్లుఁ పొదలు, జగత్ + తతి = లోకములసమూహము, పొలియంగన్ = నాశమగునట్లు, శిత = పదునైన, ప్రదర = బాణములయొక్క, ప్రకర = సమూహములయొక్క, ప్రభాళులన్ = కాంతులసమూహములచే.

తా. లక్ష్మణా! వాఁడిగల నాబాణపరంపరల తేజస్సులచే వాయుసూర్యాగ్నిహోత్రులప్రభ చెడ, కొండలశిఖరములు విఱిగిపడ, గ్రహంబులు దోవలు లేక తికమకలాడ, చంద్రబింబము జాఱిపడ, సముద్రము లన్నియు నెండిపోవ, చెట్లు తీఁగలు పొదలు తెగిపడ, లోకములు నాశమగునట్లు చేసెదను.

మ. అదిగోఁ జూడు మదస్త్రబాణనిచయ ♦ వ్యాప్తంబు నాకాశమున్
ఛిదులం జేసెద వ్యోమచారులను సం♦పీడింతు ముల్లోకముల్
సుదతిం జెప్పకచెమర్ప కుండ విబుధుల్ ♦ చూపంగఁ దా రొల్లరేన్
విదితామోఘమదీయవిక్రమ మిదే ♦ వీక్షింత్రు గా కేడ్చుచున్. ౧౧౧౪

మత్ = నాయొక్క, అస్త్రనిచయ = అస్త్రసమూహములచే, వ్యాప్తంబున్ =

వ్యాపింపఁబడినదానిని, ప్రిదులన్ = పడునట్లు, వ్యోమచారులను = ఆకాశమున సంచరించు దేవతలను, చెక్కుచెమర్పకుండ = కొంచెమైనను బాధలేకుండునట్లు, విబుధుల్ = దేవతలు, ఒల్లరే = ఇష్టపడరేని, విదిత = ప్రసిద్ధికెక్కిన, అమోఘ = వ్యర్థముకాని, మదీయవిక్రమము = నా పరాక్రమము, ఇదే = ఇప్పుడే, వీక్షింతురు గాక = చూచెదరుగాక.

తా. అదిగో నా యస్త్రములచే వ్యాపింపఁబడిన యాకాశమును దలయెత్తి చూడుము. విమానములమీఁదఁ దిరుగు దేవతలను నేలఁబడఁగొట్టెదను. మూఁడు లోకములు బాధపడఁజేసెదను. నాసీతకేబాధ లేకుండునట్లు మంచితనమునఁ దెచ్చి దేవతలు సమర్పించిరా సరి - లేదా ప్రసిద్ధమై వ్యర్థముపోని నా పరాక్రమమును నేఁడు చూచుఁ జూతురుగాక.

సీ. అతలసుతలములై ♦ హల్లకల్లోలమై, చెల్లాచెదరు నయి ♦ చెల్లచెదరు
పచ్చుముపాడునై ♦ పంచబంగాళమై, పాండవబీడునై ♦ పగులువాఱి
మఱి పటాపంచమై ♦ మామకీనాకర్ణ, పూర్ణబాణావళీ ♦ పూర్ణభువన
మిపు డమర్యాదమై ♦ యేర్పడఁగల దిదే, చూడుమీ లక్ష్మణ ♦ చొక్కి సోలి
ఆ. ప్రాలి తూలి ప్రేలి ♦ మాలి యీ దేవతల్, యతురాక్షసాళు ♦ లదవదపడి
పటుతరాస్మదీయ♦బాణనికృత్తులౌ, వారు వీరె యోర్చు♦వారు నన్ను. ౧౧౧౫

అతలసుతలములై = క్రిందిదిమీఁద పైదిక్రింద, అతలము = అధోలోకము లలో నొకటి. ఇది భూమికిఁ గ్రిందిలోకము. సుతలము = భూలోకము, అతలము భూలోకమగునట్లు. హల్లకల్లోలము రూ. అల్లకల్లోలము = తాఱుమాఱు, చెల్లాచెదరు రూ. చెల్లచెదరు = మిక్కిలిచెదరు. పచ్చుముపాడు = పాడు + పాడు = పచ్చుముపాడు = మిక్కిలిపాడు, పంచబంగాళము = మిగులదూరము, పాండవబీడు = ఏభూమియైనను తరాలనాఁటినుండి చిరకాలముగ దున్నఁబడకయుండునది పాండవబీడు అందురు. పాండవులనాఁటికాలమునుండి బీడని యర్థము. పటాపంచము = అగోచరము - కానరాకపోవుట. రూ. పటాపంచ. మామకీన = నాయొక్క, ఆకర్ణపూర్ణ = చెవులవఱకు పూరింపఁబడిన, ఆకర్ణపూర్ణము - అవ్యయీభావసమాసము. ఆబాలగోపాలము ఇత్యాదులు. ఆ = వఱకు - బాణావళీ = బాణములవరుసలచే, పూర్ణ = నిండిన, భువనము = ప్రపంచము, అమర్యాదమై = కట్టుపాటుతప్పినదై, మర్యాద = మేర, అదిలేనిది అమర్యాదము. చొక్కి = దేహము తెలియకపోయి, సోలి = నేలఁబడి, ప్రాలి = వంగఁబడి, తూలి = స్థానభ్రష్టమై, ప్రేలి = ప్రేలాడి, మాలి = చెడి, అదవదపడి = కలఁతపడి, పటుతర = మిగుల బలముగల, అస్మదీయ = నాయొక్క, బాణ = బాణములచే, నికృత్తులు = ఖండింపఁబడినవారు.

తా. నేనిపు డాకర్ణాంతము లాగివిడిచిన బాణముల సమూహములచే ప్రపంచ మతలసుతలమై యల్లకల్లోలమై చెల్లాచెదరై పచ్చుముపాడై పంచబంగాళమై

శక్తిమై పొండఁబీడునై ప్రగుళ్ళుపాతి పటావంచన్ని మర్యాదతప్పినది కాఁగలదు చూడుము. ఈ దేవతలు రాక్షసులు లోనగువారు చొక్కి సోలి వ్రాలి కూలి తూలి వ్రేలి మాలి నా బాణములచే ఖండితులగుదురు. నేను ధ్వంసము చేయఁబూనిన వీరా సహింపఁగలవారు ?

కం. నాముద్దురాలి సీతను, సామంబునఁ దెచ్చి యీయఁ జాలక యున్నన్
సౌమిత్రీ! భువనత్రయి, దోఁమెయి రూపఱునో చూడుమీ నాశక్తిన్. ౧౧౧౬

ముద్దు + ఆలు = ముద్దురాలు. కర్మధారయము. కావున రకారాగమము. సామంబున = మంచిమాటలచే, భువనత్రయి = మూఁడులోకములు, రూపఱునో = రూపములేకపోవునో.

తా. నాకుఁ బ్రియురాలగు సీతను మంచితనమునఁ దెచ్చి దేవతలులోనగువారీయరేని, లక్ష్మణా ! యీ మూఁడులోకము లేవిధముగా రూపములేక నాశమగునో నాశక్తి చూడుము.

చ. అని కటముల్ చలింప భయదాసమరోషకషాయితాక్షుఁడై
ఘనతరకార్ముకంబు వెరన్ గైకొని భీమణపన్నగోపమం
బనుపమతేజమైన వికటాశుగ మొందు గుణంబుఁ గూర్చి యి
ట్లను ననుజాతుతోడఁ బ్రళయాగ్నివిధంబునఁ దేజరిల్లుచున్. ౧౧౧౭

కటముల్ = చెక్కిళ్ళు, భయద = భయముగలిగించు, అసమ = అసమానమైన, రోష = కోపముచే, కషాయిత = ఎఱ్ఱవాఱిన, అక్షుఁడై = కన్నులు గలవాఁడై, ఘనతర = మిగుల గొప్పదగు కార్ముకంబు = విల్లు, వెరన్ = శీఘ్రముగా, కైకొని = చేత గ్రహించి, భీషణ = భయంకరమైన, పన్నగోపమంబు = పాము వంటిది, అసమతేజము = అసమానమైన కాంతిగలది, వికటాశుగము = చక్కని బాణమును, గుణంబున్ = అల్లెత్రాటియందు, ప్రలయాగ్నివిధంబునన్ = ప్రలయకాలమందు లోకము దహించుటకై ప్రజ్వరిల్లు నగ్నిదేవునివలె, తేజరిల్లుచున్ = ప్రకాశించుచు

అని చెక్కిళ్ళదరుచుండ భయంకరమైన కోపముచే నెఱ్ఱనైన నేత్రములు గలవాఁడై తన పెద్దవింటిని జేతఁ దీసికొని భయంకరమైన పామువంటిదై మిగులఁ దేజముగల చక్కని బాణము నల్లెత్రాటియందు సంధించి ప్రలయకాలాగ్నివలె మండుచుఁ దమ్మునితో నిట్లనియె.

కం. ఏవిధి జరయును మరణం, బేవిధిఁ గాలం బదృష్ట మెట్లనివార్యం
బావిధిఁ గోపప్రాప్తిని, నేవిధి నప్రతిహతుండ నే సౌమిత్రీ. ౧౧౧౮

జర = ముసలితనము, మరణము = చావు, అదృష్టము = పూర్వజన్మమునఁ జేసిన కర్మముల ఫలము, అనివార్యంబు = నివారింపరానిది, కోపప్రాప్తిని = కోపము వచ్చినపుడు. అప్రతిహతుండన్ = ఎదిరించి చెఱుచువాఁడు లేనివాఁడను, అడ్డము

లేనివాఁడను. ఇది శ్రీరామచంద్రమూర్తిసంకల్పము నకు నడ్డములేదనియు, ఆయ నను దిరస్కరింప నెట్టివారు చాలరనియుఁ దెలుపుచున్నది. 'సత్యకామ స్సత్య సంకల్ప' యను శ్రుతి స్మరింపఁదగును. దీపకాలంకారము.

తా. ఎవ రెన్ని విఱుగుడులు చేసినను ముసలితనము, మరణము, కాలము, అదృష్టము వానివాని కాలమున నవి రాకతప్పనట్లు నాకును గోపమువచ్చినపుడు నేను జేయఁబూనినపనిని నివారించువాఁడు లేఁడు.

కం. సల్లలితచరిత స్మితముఖి, మెల్లన నర్పించిరేని ♦ మేలగుఁ గాదే
నుల్లల నుడికించుచును జుమి,హల్లోహలముగ జగంబు ♦ లని రోషింపన్. ౧౧౭౯

సల్లలితచరిత = మిగులమనోహరమైన నడవడికలది, స్మితముఖి = నవ్వుతోఁ గూడిన ముఖము గలది, అర్పించిరేని = తెచ్చియిచ్చిరేని, మేలగున్ = దేవతలు మొదలగువారికి శుభమగును. ఇట్లనుటచే నాయాశ్రమమునొంతకు మాయా మృగము వచ్చినపుడు ఏనవ్వుముఖముతో సీతాదేవి నాకామృగమును బట్టి తెమ్మని కోరెనో-అటువంటి నవ్వుముఖముఁ గలదానినిగాఁ దెచ్చి యియ్యవలె ననిభావము. ఉల్లలనుడికించుచును - ఉల్లల = ఉడుకుటయందు ధ్వన్యనుకరణము. కుతకుతలాడిం చును. హల్లోహలముగన్ = మజ్జనోన్మజ్జనముగ, మునుఁగుచుఁ దేలుచుఁ దేలుచు మునుఁగుచు-ఈశబ్దమును ఓగిరాలజగన్నాథకవి తన సుమనోమనోభిరామంబునను అలసానిపెద్దనయుఁ బ్రయోగించియున్నారు. ఈశబ్దము నునికి తెలియక మనుచరిత్ర వ్యాఖ్యాతలు ప్రమాదపడినారు. సుమనోమనోరంజనము - ప్రథమోల్లాసము, "శ్రీనారాయణదేవ దివ్యపదరాజీవద్వయీ సంతత ధ్యానానూన సుధాపయోధిలహరీ హల్లోహలాత్మీయచేతోనాళీకుఁడనై తదంచితకథాస్తోమంబు లానక్కి కౌతుక్యా నందంబుగ నాలకించుచు సమస్తాహోనిశల్ పుచ్చుదున్." ౯౭

నారాయణదేవునియొక్క ధ్యానమనెడి సుధాసముద్రప్రవాహమందు మునుఁ గుచుఁ దేలుచున్న మనఃపద్మము కలవాఁడనై యన్ని రేలుంబగళ్లు గడుపు చున్నాఁడను. హల్లోహలము = మగ్నోన్మగ్నము. 'పరిమళలహరీ హల్లోహలమద బంభర' అని మనుచరిత్ర. 'ప్రగల్భాంగనాకలనాదోదిత పాహిపాహి ముఖవా క్కల్లోలహల్లోహల', అని, ద॥ గంగాహల్లోహల వాగ్విలాస॥ పాం॥

తా. మనోజ్ఞమైన నడవడికలదియు నవ్వుముఖముగలదియు నగు నాసీతను మృదుమార్గమునఁ దెచ్చియిచ్చిరా సురాసురులు లోనగువారు బాగుపడుదురు. ఈయక పోయిరా కుతకుత యుడికించి యాపత్సముద్రమున ముంచి తేల్చెదను - అని కోపింపఁగా

— ♦ ౬౫-వ సర్గము లక్ష్మణుఁడు శ్రీరాముని శాంతునిఁ జేయుట. ♦ —

సీ. సీతాపహారణక ♦ స్థితుఁ దవ్యమానుని, సంవర్తకాగ్నిరో ♦ జను జగంబు
న్నిర్దగ్ధముగఁ జేయు ♦ నిష్ఠురం డగువాని, సజ్యకోదండంబు ♦ చాయఁ జూచు

చున్నవానిని వేఁడి♦యూర్పులూర్చెడువానిఁ, బ్రళయరుద్రునియట్లు♦వెలుఁగువాని
నెన్నఁడుఁ గోపించి ♦ యెఱుఁగనివానిని, రాముఁ గన్గొని సుమి♦త్రాసుతుండు

ఆ. పెదవు లెండ ముఖము ♦ వెలవెలఁ బోవఁగ, నిట్టు లనియె భూత♦హితరతుండ
వెపుడు శాంతమతివి ♦ మృదువవు తగునయ్య,కోపమెత్తి నైజ♦గుణము విడువ.

ఇట్లుచేసినను ప్రాజ్ఞులు నన్ను నిందింపరు, అనిభావము. 'ఈమెకై రాముఁడు లోకమెల్ల దహియించిన యుక్తమ నాకుఁజూడఁగన్', అనికదా హనుమంతు నంతటి వాఁడు చెప్పెను. సుం. ౪౬౩ ప. సీతాపహరణకర్శితుస్ = సీత యపహరింపఁబడిన కారణముచే గృశించినవానిని, తప్యమానుని = తపించుచున్నవానిని, సీతాపహరణము తాపమునకుఁ గారణము. తాప మీ క్రోధమునకుఁ గారణము. ఇట్లనుటచే సీతను మరల గ్రహించుటకై తెచ్చుకొన్న కోపావేశమేకాని స్వభావ సిద్ధమైనది ద్వేషమువలన వచ్చినది కాదనియుఁ గార్యము నెఱవేఱిన నుండునది కాదనియు భావము. సంవర్తకాగ్ని రెూజను = ప్రళయకాలమందలి యగ్ని విధమున–సంవర్తః ప్రలయః కల్పః క్షయః కల్పాంత 'ఇత్యపి' అమరకోశము.

నిర్దగ్ధముగన్ = పూర్తిగఁగాలినదిగ, సజ్య = ఎక్కుపెట్టఁబడిన, కోదండంబు= విల్లు, భూతహితరతుండవు = భూతములకు మేలుచేయుటయందే ప్రీతిగలవాఁడవు, శాంతమతివి = శాంతిగల మనస్సుగలవాఁడవు కోపములేనివాఁడవు, మృదువవు = కఠినత్వము లేనివాఁడవు మెత్తనివాఁడవు, నైజగుణము = సహజగుణము.

తా. సీతాదేవి యపహరింపఁబడిన కారణమునఁ గలిగిన దుఃఖముచేఁ జిక్కినవానిని, శోకముచేఁ దపించుచున్నవానిని, ప్రలయకాలాగ్నివలె లోకమును సమూలముగఁ గాల్చివేయఁ బరువగుణము వహించినవానిని, ఎక్కుపెట్టిన వింటి చాయఁ జూచుచున్నవానిని, వేఁడినిట్టూర్పులు విడుచుచున్నవానిని, సర్వప్రాణి సంహారముచేయ విజృంభించిన ప్రలయకాలరుద్రునివలె వెలుఁగుచున్నవానిని, శత్రుసంహారము నిమిత్తమైతప్ప నెన్నఁడుకోపించి యెఱుఁగనివానిని, రామచంద్రునిఁ జూచి లక్ష్మణుఁడు పెదవు లెండ ముఖము వెలవెలఁబోవ నిట్టులనియె. అన్నా ! నీవు సర్వదా జగమునకు మేలుచేయుటయందుఁ బ్రీతిగలవాఁడవే, కోపములేని వాఁడవే, మృదుస్వభావుఁడవే, ఇట్టి నీ విపుడు కోపము దెచ్చుకొని నీసహజగుణమును విడువవచ్చునా ? ఇది నీకు ధర్మమా ?

దీనివలనఁ దన్నే నమ్మియుండువారి కాపదగలిగినపుడు భగవంతుఁడు వారిని రక్షించుటయం దెట్టివాఁ డగునో తెలియనగు. ఇది యాశ్రితవాత్సల్యాతిశయమును దెలుపును. ఇట్లే తాము నాశ్రితుల రక్షించుటయందు సర్వవిధప్రయత్నములు చేయవలె నని సూచన.

ఉ. ఇందునియందు లక్ష్మియు, న♦హీనతరప్రభ సూర్యునందునున్
దండడిరెూర్పు ధాత్రిని, స♦దాగతియందు సదాగతిత్వ, మ

స్ఖలదగతిం దిరం బగుచు ♦ జా నగు; నిన్నియుఁ గీర్తిఁ బొంద నీ
యంద వసించు నిత్యముగ ♦ హానడి పెట్టఁగఁ జన్నె లోకముల్ ? ౧౧ ౨౧

ఇంద్రునియందు = చంద్రునియందు, లక్ష్మి = శోభ, లక్ష్మీస్సంపచ్ఛ్రమా శోభా' ఇతి నానా॥ ర॥ చంద్రునికాంతి సౌమ్యమై ఆబాలగోపాలమును సంతోషపెట్టి సుఖ మిచ్చునది. అమావాస్యయందు చంద్రకాంతి లేదుగదా యందు రేమో ? మనకు లేదు. అతియుకాని చంద్రకాంతికి హానిలేదు. గ్రహణకాలమున మనకు నెండలేనికాలమున సూర్యకాంతి లేదనవచ్చునా ! అదియునుగాక సూర్యుని యందు నారాయణుఁ డున్నట్లు. చంద్రునియందు లక్ష్మీదేవి కలదు. సినీవాలీశబ్ద మీయర్థమునే బోధించుచున్నది. అ॥ అనఁగా విష్ణువు, స + అ = సా అనఁగా విష్ణువుతోఁగూడినది లక్ష్మి, ఆలక్ష్మి కలది కనుక సిని యనఁగాఁ జంద్రకళ, ఆ చంద్రకళ దీనియందు లేతదై యుండునుగాన సినీవాలి, పబల కభేదము అని గురుబాలప్రబోధిక, అహీనతరప్రభ = మిక్కిలిగొప్పదగుకాంతి, దండడియోర్పు = అధికమైనయోర్పు, ధాత్రిని = భూమియందు, సదాగతియందు = వాయువునందు, సదా + గతిత్వము = ఎప్పుడుపోవుచుండుట, అస్ఖలదగతిన్ = జారిపోనివిధముగ, తిరము = స్థిరము, జానగున్ = మనోహరమగును, ఇన్నియు = చంద్రసూర్యాదులం దొక్కొక్క గుణమే యున్నది. నీయందో యివన్నియుఁ గీర్తిఁబొంద వసించును. హానడి = బాధ, ఉపద్రవము, చన్నె = చనునా, ఒకానొకచోఁ దద్ధర్మార్థకంబు లగు నుండు, చను, చేరు, కొనులు ప్రశ్నార్థకైకారపరకంబులగునపుడు వాని కడయచ్చులకు లోపంబు విభాషనగు. అగుచో నుండుడకారంబునకు వకారంబగు. చేసుకొను అనఁగా నన్ప్రయుక్తమగు కొనుధాతు వని యర్థము. ఉండునే = ఉన్నె, కొనునే = కొన్నె, చనునే = చన్నె, ప్రౌ-వ్యా. క్రియ. ౭.

తా. చంద్రునియందు లక్ష్మి, సూర్యునియందు విశేషప్రభ, భూమియందు విశేషముగ నోర్పు, వాయువునందు సదా గమనించుట, కొంచెమైన స్థలనములేక స్థిరముగ నుండును వానియం దొక్కొక్కగుణమే యుండును. నీయం దవి యన్నియు పై పెచ్చు కీర్తితో శాశ్వతముగఁ గాపురము చేయుచుండును. ఇట్టి నీవు లోకములను బాధింప న్యాయ్యమా ?

సీ. అపరాధ మెవ్వఁడో ♦ యాచరించిన నెల్ల,జగముల సమయింపఁ ♦ దగు నటన్న
యీభగ్నమైనతే ♦ రెవ్వనిదో యేల, యెవనిచే హత మయ్యె ♦ నెఱుకపడదు
తుఁసినగాజలు ♦ దొరలిననేమి యై, నెత్తురుబొట్లు నీ ♦ నేల యొప్పె
సైన్యంబు పోరిన ♦ చందంబు లే దొంటె, కాని దురం బయి ♦ కానఁబడియెఁ
ఆ గాన నొకనికై జగంబుల నెల్లను, రూపుమాపఁ దగునె ♦ రూక్షవృత్తి
రాజులైనవారు ♦ రాజిల్ల వలదె మార్దవము శాంతి యుక్త ♦ దండ మొనరి.

ఎవ్వఁడో = ఊరుపేరు తెలియనివాఁడు, ఆచరించినన్ = చేసిన, భగ్న

మైన = విఱిగిన, హతము = విఱుగఁగొట్టఁబడినది, తునిసిన = విఱిగిన, గొఱి జలు = గుఱ్ఱపుగిట్టలు, నేమి = బండికమ్మి, ఓరంబు = యుద్ధము.

తా. శాంతింపుము. ఓర్చుకొనుము నెడవే - ఇంతసే పోర్చుకొనిన నెవరైన నీస్థితియేమి గతియేమి-ఏల యేడ్చెదవు, సీత యిచ్చోటనున్నదని పలుకరించినవాఁ డొకఁడైనఁ గలిగెనా? ఎంతకాల మోర్చుకొనిన నింత యేకదా ఫలము. అందు వేమో? అన్నయ్యా అట్లుకాదు. ఊరుపేరు తెలియనివాఁ డెవ్వఁడో యొక్కఁడు నేరముచేసిన వానిని గనిపెట్టు శక్తిలేక లోకమునంతయు నాశముచేయ న్యాయ్యమా? ఇట్టిపని చేయరాదని నీవే నాకు బోధించితివికదా. (యుద్ధ ౧౬౦౩ పద్యము). ఈ విఱిగిన తే రెవ్వనిదో యేల యెవనిచే విఱువఁబడెనో తెలియలేదు. ఇది మనము విచారించి తెలిసికొనవలసియున్నది. గుఱ్ఱపుగిట్టలు విఱిగినవి. చక్రముల కమ్ములు దొరలినవి. నెత్తురుబొట్లు నేలపడినవి. ఇవన్ని పరిశీలించి చూడఁగా నొకనికే యిన్నియుఁ దటస్థించినవిగాని యుద్ధమునందు రెండవవాఁ డెవఁడో తెలియదు. సేనలు పోరాడినవిధమును లేదు. ఒకఁడే తన రథమును దాను విఱుచు కొని తనసారథిని గుఱ్ఱములను జంపుకొనునా? కావున నివియన్నియు నీ వాలోచింపక యొకనినిమిత్తమై లోకమంతయు నాశముచేయఁదగునా? రాజులగువారు మృదుత్వము శాంతి గలిగి యెవ్వ డెవరి నెట్లు దండింపవచ్చునో యట్లుగదా దండింపవలెను? ఇష్టమువచ్చినట్టు లెవరి ననిన వారినందఱః గఠినముగ దండింప వచ్చునా?

కం. నీ వఖిలభూతములకుం, గేవలము శరణ్యుఁ డవును ♦ గీర్తిత పరమం
బైవఱలు గతియుఁ గావున, నేవాఁడొకొ నీవిపత్తి ♦ కెలమిం గాంచుఁ. ౧౦౨౩

తా. ఎవఁడో యొకఁ డపరాధముచేయఁగా లోకమంతయు దాని నామో దించెను గావున లోకమంతయు వధ్యమని నీవు తలఁచుట పొరపాటు. ఎట్లనః- తమ రక్షణముకోరు సర్వభూతములకుఁ శరణుచొరఁదగినవాఁడవు నీ వొకఁడవేకాని నీవుతప్ప వేఱొకఁడు లేఁడు. అట్టివారు పొందఁదగినదై యన్నిటికంటె శ్రేష్ఠమైన దని కీర్తింపఁబడిన పరమగతియు నీవుతప్ప వేఱులేదు. ఇట్లు ప్రాపకము ప్రాప్యమునై యుండు నీకు నాపదవచ్చిన నెవఁడు సంతోషించును? సహాయము చేయుటకు సామర్థ్యములేక కొందఱు, తెలియక కొందఱు ఉందురుగాని బుద్ధిపూర్వకముగా నీ కపరాధము చేయఁదలఁచినవా రుండరు. ఇందు శ్రీరామచంద్రమూర్తి సర్వ శరణ్యత్వము, సర్వప్రాప్యత్వము చెప్పఁబడెను.

తే. సురలు గంధర్వదానవుల్ ♦ గిరులు నదులు, నీకు విప్రియ మొనరింప ♦ నేరవయ్య
ఋత్విజులు దీక్షితునివట్ల ♦ నెగ్గు దలఁపఁ, జాలనివిధాన యోజింపు ♦ శాంతమతిని.

తా. యజ్ఞమునందు ఋత్విజులు దీక్షుగాని యజ్ఞముచేయువానికిఁ గీడు కోరినఁ దమకే నష్టికావున వానికీడు కోరరు. మేలే కోరుదురు. అట్టులే దేవతలు

గంధర్వులు దానవులు కొండలు నదులు నీకు దుఃఖమును గలిగింపవు. నిబ్బరించు
కొని యాలోచింపుము.

ఉ. కేల శరాసనంబుఁ గొని ♦ క్రేవల నే నడతేరఁగాఁ దప
స్విలుర బాసటన్ వెనుకు ♦ సీతను బర్వతకాననంబులన్
శైలగుహాంతరంగిణుల ♦ సారసకైరవ వాటికాళులం
బాలిమి దేవతాదిభువ♦ నంబుల నెంతయు జాగరూకతన్. ౧౧౫

కేలన్ = చేతియందు, శరాసనంబు = విల్లు, క్రేవల = ప్రక్కల, నడతేరఁగా = నడచిరాఁగా, తపస్విలుర బాసటన్ = తపస్సు చేసికొనువారి సాహాయ్యముచే, వెనుకుము = వెదకుము, శైలగుహాంతరంగిణులన్=కొండ గుహాలందు, నదులందు, సారస+కైరవ+వాటికాళులన్ = కమలములు, కలువలు నుండు ప్రదేశములందు, బాలిమిన్ = ఓర్పు గలిగి, దేవతాదిభువనంబులన్ = దేవతలు మొదలగువారుండు చోటులందు, జాగరూకతన్ = హెచ్చరికతో.

తా॥ చేత విల్లుపట్టుకొని నేను ప్రక్కల నడచిరాఁగా తపస్వుల సాహాయ్యముతో సీతను బర్వతములందు నడవులందు గుహాలయందు నదీతీరములయందు కమలములు, కలువలు నుండు కొలంకుల తీరములందు దేవతాదులుండు స్థలములందు నోర్పుతో హెచ్చరికతో వెదకుము. ఇచ్చటఁ దపస్వుల సహాయముతో వెదకుము అనుమాట యెంతయుఁ దగియున్నది. వీరికిఁ దెలియని ప్రదేశములు వారికిఁ దెలిసి యుండుటేకాక యోగదృష్టిచే సీత యెందుండునది వారు చెప్పగలరు. ఋషీశ్వరుల సాహాయ్యమేల వీరు గోరలేదో - ఇద్దఱు మగవారుండి యొక యాఁడుదాని రక్షింపలేకపోయితిరా యని నవ్వుదురనియో - నీ యాఁడుదానినే రక్షించుకొనలేక, హరించినవానిని శిక్షింపలేనివాఁడవు మమ్మేమి రక్షింపఁగలవని యందురనియో వారి సాహాయ్యమపేక్షింపలేదు. అదియునుగాక యగస్త్యాశ్రమము పోవువఱకు ఋష్యాశ్రమములు లేవు. రాక్షసుల తలవాకిట నెవరుందురు?

కం. అప్పటికి మంచితనమున, నప్పింపరయేని శిత ♦ నమరులు మీఁదం
దప్పక కాలోచిత మగు, నప్పనిఁ గావింప న్యాయ ♦ మగుఁబో నీకున్. ౧౧౬

తా. మనము చేయవలసిన కార్యమంతయుఁ జేసి యప్పటికి మంచితనమున దేవతలు సీతను సమర్పింపకపోయిన పక్షమున నప్పటికి నుచితమగు పని యప్పుడు నీవు చేయుట న్యాయముగా నుండును. నింద నీయందుండదు.

మానిని. సామముచేతను శీలముచేతను ♦ సాధుమతీ! వినయాదులచే
భూమితనూభవ చేపడకున్నను♦ భూవరనందన! యాపయి ను
త్రామకఠోర సుసాధనసన్నిభ ♦ రాజితపుంఖశరౌఘములన్
నీమదివచ్చినచొప్పున లోకము♦ నీఱుగఁ జేయుము యుక్తముగన్. ౧౧౭

చేపడక = లభింపక, సుత్రామ = ఇంద్రునియొక్క, కఠోర సుసాధన =

కఠినమైన మంచియాయుధమగు వజ్రముతో, సన్నిభ = సమానమైన, రాజతపుంఖ= బంగారు పిడులుగల, శరౌఘములఁ = బాణసమూహములచే, నీఱుగఁ = భస్మముగా, యుక్తముగుఁ = న్యాయ్యముగును.

తా. మంచిమాటలచేత, మంచి నడవడిచేత, వినయము మొదలగువానిచేత సీతాదేవి లభింపకపోయెనా, సాధుమనస్సుగల రాజనందనా యీ మీఁద వజ్రముల వంటి కఠోరములై బంగారుపింజలుగల బాణములచే నీ యిష్టప్రకారము లోకమును భస్మముచేయుము. తగిన కార్యముగ నుండును. ఈ విషయమున హనుమంతుని వాక్యములు చూడుడు.

"కం. మేలో త్రిభువనరాజ్యము। మేలో జానకియటన్న మేదినిసుతకుఁ । దై విలోక్యరాజ్యమెల్లను। జాలదుపో యొక్కకళకు సరిపోలంగఁ॥" సుందర ౪౩౪. వాస్తవమింతయేకదా. "విష్టభ్యాహ మిదంకృత్స్న మేకాంశేన స్థితో జగత్." భ. గీ. ౧౦-౪౨. ఛందస్సు—మానినికి నేడు భ గణములు, గురువు. ౧౩ వ యింట యతి.

౬౭-వ సర్గము.

కం. అని పాదంబుల వ్రాలుచు, వినయంబున మఱియు ననియె ♦ విపులతపమునఁ
ఘనసత్కర్మములను నిను।, గనె జనకుఁడు సుధను సురలు ♦ గాంచిన భంగిఁ.

విపులతపమునఁ =విస్తారమైన తపస్సుచేత, ఘనసత్కర్మములను = గొప్ప పుణ్యకార్యములచేతను, సుధను = అమృతమును.

తా. ఈ ప్రకారము చెప్పి యాయన పదములపైఁబడి నమస్కరించి వినయమున మఱియు నిట్లనియె. అన్నా! పూర్వజన్మంబునందే కాక యీ జన్మమందును విస్తారముగఁ దపస్సుచేసి యెన్నియో యశ్వమేధయాగాదులు గొప్ప పుణ్యకార్యములు చేసి మనతండ్రి యతిప్రయాసమున దేవత లమృతమును బడసినట్లు నిన్ను బడసెను.

శ్రీరామచంద్రమూర్తిని అమృతమునకుఁ బోల్చుటచే నీ యర్థములు స్ఫురించెడిని. అమృతమువలన నమృతమున కేలాభము లేదు. దాని ననుభవించిన దేవతలకే లాభము. అట్టులే నీవు దేవతలకు లోకులకు భోగ్యుఁడవై వారికి మేలు చేయ జనించినవాఁడవు. ఇట్లు లోకము నుద్ధరింపఁబుట్టిన నీవు లోకమును నాశనము చేయుట అమృతము చంపుటవలె స్వభావవిరుద్ధకార్యము. ఈ యర్థమునే సీతయుఁ జెప్పెను. అమృతమునకై ముప్పదిమూఁడుకోట్ల దేవతలు చేసిన కష్టమును నీకై దశరథుఁ డొక్కడే చేసెను. అమృత మెట్లు రాక్షసవినాశకారణ మాయెనో యట్లు నీవును రాక్షసులవినాశము చేయవలసియున్నది. కావున దేవతలమీఁద మనుష్యుల మీఁద నితర భూతకోటిమీఁద గోపము మానుము. అమృతమువలె నీవు సదా నిర్మలుఁడవుకదా. కశ్మలభావము తగదు.

క౦. వరకేవలయుష్మద్గుణ, పరవశుఁడై తండ్రి నిన్నుఁ ♦ బాయుటచేతన్
సురలోక మరిగె ననుచున్, భరతుఁడు మనమెల్ల వినఁగఁ♦బలికెను గాదే.

వరకేవలయుష్మద్గుణపరవశుఁడై = శ్రేష్ఠములై నీయందుఁదప్ప నితరుల యందు లేనివగు నీ కళ్యాణగుణములకుఁ బరవశుఁడై తండ్రి నిన్నుఁ నెడఁబాసిన కారణమున మరణించె నని యందఱు వినఁగా భరతుఁడు చెప్పెనుగదా. అట్టి కళ్యాణగుణములను వదలి యిట్టి హేయగుణమును జేపట్టి లోకమున కుపద్రవము గలిగించితివేని నతండు నీ విషయమై యేమి తలంచును? రాముఁడు సౌమ్యుఁడు, సాధువు, జితేంద్రియుఁడు, శాంతుఁడు ననుకొంటినే, యింతటి క్రూరుఁడాయని తలఁ పఁడా? నీవు చేయఁబూనిన లోకోపద్రవము తండ్రికిని జేసినవాఁడవేకదా యగు దువు? తన నాశమునకా నిన్నుఁ దండ్రి కనెను.

క౦. కాకుత్స్థవర్య! నీ వే, శోకము సహియింపలేక ♦ క్రుక్కెద వేనిన్
లోకమున నల్పసత్త్వులు, ప్రాకృతులా సైఁచువారు ♦ పటుదుఃఖంబుల్? ౧౧౩౦

కకుత్స్థవంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుఁడవైన నీవు, మహాశుద్ధసత్త్వము గల నీవు, అప్రాకృతుఁడవగు నీవు, కకుత్స్థునివలె దేవతల లోకుల రక్షింపవలసిన నీవు శోకమును సహింపలేక పరితపించెదవేని యిఁక లోకమునందు కొంచెము సత్త్వ గుణముగలవారు కావుననే దుర్బలులు, ప్రకృతిబద్ధులగుటచేతనే యవశులు, నీచులు నగువారు దుఃఖములను సహింపఁగలరా? అట్టివారియందే శోకమును సహించిన వారు కానవచ్చుచుండ నీవు శోకవశుఁడ వగుట శోచనీయము.

క౦. వలవంత నీవె జగములఁ, బొలియింపఁగఁ జూచె దేని ♦ భూప్రజల కెవం
డలవడును గావ దిక్కై, వెలుగే చేన్మేయఁగాచు♦వెర వెట్టిదియో. ౧౧౩౧

వలవంతన్ = వ్యసనముచే, నీవే = సర్వరక్షకుఁడవైన నీవే - పొల యింపన్ = సంహరింప, అలవడును = లభించును, దిక్కై = రక్షకుఁడై, వెలుగు= కంచె - పైరును పశువులు మేయకుండునట్లు నాటినకంప. చేను = చేనియందలి పైరు, వెరవు = ఉపాయము.

యయాతిమహారాజు బహువిధపుణ్యకార్యములు తపస్సులు చేసి కొంత కాలము బ్రహ్మాదిలోకంబులందును సుఖ మనుభవించి యింద్రునియొద్దకుఁ బోయెను. అప్పు డింద్రుఁడు నీవేమి తపస్సులుచేసి యింతటిపదవి నొందితివనెను. ఆ యయాతి "క౦. సుర దైత్య యక్ష రాక్షస। నరఖేచర సిద్ధ మునిగ,ణ ప్రవరుల భాసురతపములు నాదగు దు। ష్కరఘోరతపంబు సవతు గా వమరేంద్రా'॥ అని యాత్మశ్లాఘ చేసి కొని మహర్షుల నవమానించి పలుకుటచే నీవు గర్వివి - గర్వముగలవారి పూర్వ పుణ్యములు నశించును కావున నీవు మరల భూలోకమునకుఁ బొమ్మని పంపెను. సాధుసాంగత్యముచే నా దోషముఁ బోఁగొట్టుకొని మరల స్వర్గమునకుఁ బోయెను. యాదవపాండవులకు మూలపురుషుఁ డీ యయాతియే.

తా. జగములను బుట్టించుభారము బ్రహ్మది, సంహరించుభారము రుద్రునిదైనట్లు రక్షించుభారము నీయందుఁగల నీవు నీ ధర్మమును వదలి జనుల సంహరింపఁబూనదవేని భూప్రజలకు రక్షకుఁ డెవఁడు దొరకును ? పైరును రక్షించుటకై వేయఁబడిన కంచెయే పైరును మేయఁబూనిన నిఁక దాని రక్షించు నుపాయ మేది కలదు.

సీ. నహుషసూతి యయాతి♦నాకంబునొందియు, నవివేకియయి దుఃఖ♦మందలేదె
మనపురోధవసిష్ఠ♦ముని సుతశతమును, గన నొక్కపరి వారు♦చనరె దివికి
భువనవందిత సర్వ♦భూతధాత్రి ధరిత్రి, గడగడ లాడదే ♦ వడఁకు గదుర
భువనచక్షుస్సులుఁ♦బూజ్యులు సూర్యచం, ద్రులు గ్రహములవాతఁ బడరె

తే. యెంతటిమహాత్ములైన సు♦రేంద్రులైన, దైవసంకల్పమును దాఁటఁ♦గలరె
కట్టమెఱుఁగక కాలంబుఁ♦గడిపినారె, ప్రాణులకు మేలు కీడు స్వ♦భావ మధిప.

నహుషసూతి = నహుషుని కుమారుఁడు యయాతి, నాకంబు = స్వర్గంబు, కము అనఁగా సుఖము. అదిగానిది అకము. అనఁగా దుఃఖము న+అకము = అట్టిదుఃఖము దేనియందు లేదో యది నాకము.-నఞ్ “నభ్రాణ్నపాన్నవే దానా సత్యానముచి”- పాణిని ౬-౩-౬, ౬-3-23-౭౪ ప్రకారము నకారమునకు అచ్చు పరమైనపుడు నకారము అనఁగా మాఱవలయును. న + ఉచితము = అనుచితము. వీని కపవాదములు నాకము, నాసత్యులు, నారాయణుఁడు, (న + అరాయణుఁడు), అవివేకి = వివేకము లేనివాఁడు. ఇచ్చట ఞ్ హల్లు పరముగుటచే అకారముగ మాఱెను. పురోధ = పురోహితుఁడు, ఒక్కపరి = ఒక్కసారిగ - ఏకకాలమున. కొందఱు వసిష్ఠుఁ డొక్కఁడే కాఁడనియు, సూర్యవంశపురాజుల పురోహితులకెల్ల గౌరవార్థము వసిష్ఠనామధేయము కలదనియు నందురు. ఇది వారి వాదమును ఖండించుచున్నది. వసిష్ఠుని కుమారులనందఱ నేకకాలమున నాశముచేసినవాఁడు విశ్వామిత్రుఁడు. ఆ వసిష్ఠుఁడే మన పురోహితుఁడగు వసిష్ఠుఁ డనుటచే నిరువురు భిన్నులుగారనుట నిర్వివాదము. కావున నొక్కొక్కరాజున కొక్కొక్కపురోహితుఁ డుండెననియు నాయన వసిష్ఠుఁడను బిరుదముచేఁ బిలువఁబడుచుండె ననుటయు నిరాకరము. భువనవందిత = విష్ణుపత్నియగుటచే లోకమువారిచే నమస్కరింపఁబడినది, సర్వభూతధాత్రి = సమస్తభూతములను ధరించునది, ధరిత్రి = భూదేవి, భువనచక్షుస్సులు = లోకమునకుఁ గన్నులగువారు. వారికాంతి లేకున్న కన్నులు వ్యర్థములు, పూజ్యులు = లోకులచేఁ బూజింపఁబడువారు, సూర్యచంద్రులు = సూర్యచంద్రులు, గ్రహములవాతఁ = రాహుకేతువుల నోట. ‘ఆదిత్యాజ్జాయతే వృష్టి స్తతోన్న మభిజాయతె’, యని సూర్యునివలన వర్షము, వర్షమువలన నన్నము గలుగును. కావున సూర్యుఁడు పూజ్యుఁడు. ఓషధులకెల్ల చంద్రుఁ డధిపతి, రక్షకుఁడు. కావున లోకపూజ్యుఁడు.

తా॥ లోకమునందు నే నొక్కఁడనే దుఃఖ మనుభవించుచున్నాను. నా కున్నంతదుఃఖ మెవరికి లేదనుకొనకుము. ఇంద్రుఁడుగా నుండిన నహుషుని కుమారుఁడు స్వర్గమునకుఁ బోయియు నవివేకముచే నహంకార కారణమున మరల భూమిపైఁ బడలేదా? మన పురోహితుఁ డగు వసిష్ఠుని పుత్రులు నూర్గురు రేకకాలంబున నశింపలేదా? సమస్త భూతములను సర్వదా మోచియుండు భూదేవి యొక్కొక్కసారి గడగడలాడదా? లోకములకు కన్నులవంటివారగు సూర్యచంద్రులు రాహుకేతు గ్రహములవాతఁ బడరా? ఎంతమహాత్ములైనను దేవతాశ్రేష్ఠులైనను దైవసంకల్పమును దాఁటగలవా రున్నారా? ఎవరైనను గష్టమెఱుఁగక కాలము సుఖముగానే కడపినారా? లేదుగదా. కావున ప్రాణులకు మేలుకీళ్ళు స్వభావముగవచ్చును, పోవును. దైవసంకల్పము దాఁటరా దనుటచే రాముఁడు వేఱు దైవము వేఱని తలఁపరాదు. ఇదంతయు నీవు ముందు సంకల్పించి యవతరించినవాఁడవేకదా! ఇప్పుడేల విచారపడెదవు? అని భావము.

కం. హృత యైనను మృత యైనను, క్షితితనయ తదర్థ మిూవు ♦ చిత్తం బగలన్
వెత నొంద వలదు పామరు, గతి శోకము కార్యలాభ ♦ కరమే చెపుమా.

హృతయైనను = అపహరింపఁబడినను, మృతయైనను=చచ్చినను, తదర్థము = ఆమె నిమిత్తము, అగలన్=పగులునట్లు.

తా. సీతాదేవి రాక్షసులచే నపహరింపఁబడినను, చచ్చినను ఆ నిమిత్తముగా నీవు గుండెలుపగుల నేడ్వవలదు. అది జ్ఞానములేనివాఁడు చేయు కార్యము. ఏడ్చుటవలన రాఁగల లాభమేమి? నీ విట్లేడ్చుచుండిన సీతాదేవి వచ్చునా? ఏడ్చుటవలన దేహము మనస్సు చెడుట లాభమేకాని మఱియేమి లాభములేదు. జ్ఞానము కలవాఁడు దేనికిని దుఃఖింపఁడు.

కం. నినుబోఁటి సత్యదర్శను, లనయము దుస్సహతరార్తు ♦ లంటిన యేనిన్
మనమున నేనియు వగ గొన, రనఘ యనిర్విణ్ణదర్శ ♦ నాఢ్యులు గానన్. ౧౧౩౮

నినుబోఁటి = నీవంటి, సత్యదర్శనులు = యథార్థము తెలిసినవారు, అనయము = ఎల్లప్పుడు - ఏకాలమందైనను, దుస్సహతర + ఆర్తులు = కొంచెమైనను సహింపరాని వ్యసనములు, మనమున నేనియున్ = మనస్సునందైనను, మనస్సునందే లేనపుడు వెలుపల నెట్లు కానవచ్చును? అనఘ = దోషరహితుఁడా, అనిర్విణ్ణదర్శనాఢ్యులు = విషాదములేని యంతఃకరణముచే సంపన్నులు.

తా. అనఘా! జీవకోటుల యథార్థస్థితి యనఁగా జననమరణములు, సుఖదుఃఖములు, శోకసంతోషములు, సంయోగ వియోగములు లోనైనవి నిత్యములు గావు, వచ్చుట, పోవుట వాని స్వభావగుణములు. కావున వానికై పరితాపపడరాదని తెలిసినవారు సహింపరాని యెంతటి వ్యసనము కలిగినను వెలుపల రోదనము మొదలయినవి చేయమి యటుండ మనస్సునందైనను నిట్టి వ్యసనము వచ్చెనేయని తలఁపరు,

కం. వరమతి నాలోచింపుము, సరి యగునే నీకు నిట్లు ♦ సంతాపింపన్
గురుబుద్ధి శుభాశుభములు, పరికింతురు నైజమేధ♦బలమున విబుధుల్. ౧౧౩౫

వరమతి = గొప్ప మనస్సుతో నాలోచింపుము, నైజమేధ = స్వభావసిద్ధమైన బుద్ధియొక్క, విబుధుల్ = జ్ఞానము గలవారు, పండితులు.

తా. నీచమైన హృదయదౌర్బల్యము వదలి గొప్పమనస్సుచేసి యీ ప్రకారము వ్యసనపడుట నీకు దగునేమో యాలోచింపుము. జ్ఞానముగలవారు స్వభావసిద్ధమైన బుద్ధిబలముచే మేలుకీళ్ళను బరీక్షింతురు.

కం. కనరాని దోషగుణతతు, లను గలిగి యనిశ్చితపు ఫ♦లంబును నో క
ర్మనిచయముల నొనరింపక, మనుజుం డిటుసౌఖ్యదుఃఖ♦మగ్నుం డగునే.

ఆ మేలుకీళ్ళు పూర్వజన్మంబులందు మనముచేసిన పుణ్యపాపములని చెప్పుచున్నాఁడు.

కనరానిదోషగుణతతులను = ప్రత్యక్షముగాఁ గనబడక శాస్త్రము చేతనే తెలిసికొనదగిన సుఖదుఃఖము లనెడి గుణదోషములను, అనిశ్చితపు ఫలంబును = ఇట్టికర్మమున కిట్టిఫల మని ప్రత్యక్షముచే నిశ్చయింప సాధ్యముకానిదియగు, కర్మనిచయములన్ = పుణ్యపాప కర్మములను, ఒనరింపక = చేయక, సౌఖ్యదుఃఖమగ్నుం డగునే = సుఖదుఃఖములందు మునుఁగునా ?

తా. పూర్వముచేసిన పుణ్యపాపకర్మముల గుణములుగాని దోషములుగాని మన మిప్పుడు ప్రత్యక్షముగాఁ జూడఁజాలము. మన మీకర్మము చేసితిమి. మనకీఫలము కలుగునని నిశ్చయముగాఁ జెప్పుటకును సాధ్యపడదు. ఈ కర్మము నీవిధముగఁ జేయుటచే నీఫల మిప్పు డనుభవించుచున్నా మని కర్మముచేసిన విధము చెప్పుటకును సాధ్యపడదు. కాని, కారణములేక కార్య మెన్నడును గలుగదు. ఫలమును మన మిప్పు డనుభవించుచున్నాము. కావున దీనికిఁ గారణమైన కర్మమును దేనినో చేసితి మని చెప్పవచ్చును. అట్టి కర్మము చేయుటచేతనే యిప్పుడీ ఫలము గలిగినదనియుఁ జెప్పవచ్చును. మనకుఁ గారణము తెలిసినను దెలియకున్నను ననుభవము తప్పదు. కావున సుఖ మనుభవమునకు వచ్చినపుడు మన మేదో పుణ్యము చేయుటచేగదా మనకీ సుఖము గలిగెను, గనుక మనము పుణ్యమే చేయుదము, అనియు, దుఃఖ మనుభవించునపుడు మనము పూర్వమున నేదోపాపము చేయుటచేఁ గదా మనకీ దుఃఖము ప్రాప్తించెను. మన మిఁకఁ బాపము చేయరాదనియుఁ దెలిసికొని, మనము చేసిన కర్మముఫలము మన మనుభవింపకతీఱదని మనస్సు దృఢపఱచికొని సంతోషమునకుఁ బొంగక, వ్యసనమునకుఁ గ్రుంగక యుండవలెను.

కం. ఈవిధమున రామా! ము, న్నీవే బోధించినాఁడ ♦ వీ విపుడు వగన్
పావడి పడియెదవేనియు, దేవగురుం డైన నీకుఁ ♦ దెలుపం గలఁడే. ౧౧౩౭

తా. ఈ విధముగ రామచంద్రా! నీవే నాకుఁ బూర్వము బోధించితివి.

ఇప్పుడు నీవే వ్యసనముచే బాధపడుచున్నావు. నీవు తెలిసినవాఁడ వనుకొందునా ? తెలియనివాఁడ వనుకొందునా ? తెలిసియుఁదెలియనొల్లని నీకుఁదెలుప దేవతల గురువగు బృహస్పతియుఁ సమర్థుఁడుగాఁడు. ఇంక నేనెంతవాఁడను ?

కం. “ మఱచినఁ దలఁపింపఁగను । నెఱుఁగనినాఁ డెల్లపాట్ల నెఱిఁగింపనగున్ । ఎఱిఁగి మఱి యెఱుఁగనొల్లని, కఱటిం దెలుపంగఁ గమలగర్భుని వశమే ॥ ” భార.
“ తెలిసియుఁ దెలియని నరుఁ దెల్ప బ్రహ్మదేవుని వశమే ” ॥ భర్తృహరి.

కం. నీ నిశ్చలమతి సురలకు, నేనియు దుర్లభము వగవు ♦ నెచ్చిన యుష్మత్
జ్ఞానము ప్రసుప్తమైనను, మానక బోధింపవలసె ♦ మఱుపవ దీఱన్. ౧౧౩౮

తా. రామచంద్రా ! నీవు మూర్ఖుఁడవు గావు. కార్యాకార్య ధర్మాధర్మ విషయమునఁ నీకుఁ గల స్థిరజ్ఞానము దేవతలకును లేదు. అయినను దుఃఖాతిశయముచే నీజ్ఞానము నివురుగప్పిన నిప్పువలె నిద్రబోవుచున్నది. కాఁబట్టి నీమఱపు పోవ బోధింపవలసివచ్చెనుగాని నీకుఁ దెలియనిది నేను క్రొత్తగాఁ జెప్పరాలేదు.

కం. నో రెఱుఁగని నరులను నప,కారులు గానట్టి సురలఁ ♦ గారింపకు నీ
శూరతఁ దలంపు భవదప,కారిం గని పట్టి దండ్యుఁ ♦ గాఁ జేయు మనన్. ౧౧౩౯

నోరెఱుఁగని = చెప్పుకొనుటకుఁ జేతఁగాని, అపకారులు=కీడు చేసినవారు, కారింపకు = బాధింపకుము, శూరతన్ = శౌర్యమును, భవదపకారిన్ = నీకు నపకారముఁ జేసినవానిని, దండ్యుఁగా = శిక్షకుఁ బాత్రునిగా.

తా. రామచంద్రా ! మనుష్యులను జూతమా వారు నీయొద్దకువచ్చి మాపై నీకేల కోపము ? మేమేమి చేసితిమి పాపము ? నీకుఁ గీడుకోరువారము కామే యని యామాత్రము చెప్పుటకుఁ దెలియనివారు. దేవతలందమా నీవలన బాగుపడఁగోరువారు. కావున నీ కపరాధము చేసినవారుగారు. కావున వారి నేలఁ బాధింపఁ దలఁచెదవు. వ్యర్థకోపమువలన వ్యర్థశోకమువలన నేకార్యము కాఁజాలదు. మన కపకారముచేసినవాఁ డెవఁడు అని వానిని గనిపెట్టి నీవు శూరుఁడవు కావున వానిని దండింపుము. దానివలన నీకు సీత మరల లభించును, కీర్తియుఁ గలుగును. ‘ ఉద్యోగినం పురుషసింహ ముపైతిలక్ష్మీః ’ యన్నటు లుద్యోగవంతునిఁగదా సర్వశ్రేయస్సులు వరించును. బంధువియోగముచే దుఃఖించువారికి వారిహితు లిట్లు బోధింపవలయునని సూచన.

{ ౬౭-వ సర్గము. రాముఁడు లక్ష్మణు వాక్యంబుల
శాంతుఁడై సీతను వెదకుట. }

శా. సారంబైనసుభాషితార్థముల నా♦సౌమిత్రి యన్నంతనే
సారగ్రాహి తదగ్రజుఁడును మహా♦సారంబుఁ గైకొంచుఁ గో
పారంభం బుపసంహరించి ధను♦వాధారంబుగా నిల్చి వ
త్సా! రామం గన నెందుఁ బోద మెది సే♦యంబోలు భావింపుమా. ౧౧౪౦

సారంబు = శ్రేష్ఠము, సుభాషిత + అర్థములన్ = యుక్తియుక్తముగా శాస్త్రసమ్మతముగాఁ జెప్పిన మంచిమాటల యర్థమును, తదగ్రజుండును = ఆయనకు జ్యేష్ఠుఁడు, సారగ్రాహి = సారమును గ్రహించువాఁడు కావున తాను పెద్దవాఁడయ్యు చిన్నవాఁడైన లక్ష్మణుని వాక్యములను వినెను. మహాసారంబు = విశేషసారాంశమును, 'యుక్తియుక్తంవచో గ్రాహ్యం, బాలాదపి సుభాషిత'మ్మను నీతివాక్యముప్రకారము - ఉపసంహరించి = తగ్గించి, ధనువాధారంబుగా = విల్లూతఁగా, వత్సా = నాయనా, రామన్ = స్త్రీని, సీతను.

తా. శ్రేష్ఠములైన మంచి నీతివాక్యముల యర్థమును చిన్నవాఁడైనను లక్ష్మణుఁడు చెప్పఁగా విని, పెద్దవాఁడగు రామచంద్రమూర్తి దానియందలి సారము గ్రహించి, కోపముచేఁ జేయఁదలఁచిన పనిని వదలి, విల్లాధారముగా నిలఁబడి, నాయనా! సీతను వెదకుటకు నేమి చేయవచ్చు, నెందుఁ బోదము చెప్పుము.

'యుక్తియుక్తం వచో గ్రాహ్యం, బాలాదపి సుభాషితమ్' యుక్తియుక్తమైన వాక్యము బాలుఁడు చెప్పినను గ్రహింపవలయునను నీతిని బోధించుచున్నది. ప్రమాద మెవరికైనఁ గలుగుననియు, నట్టిచోటఁ బెద్దవారికైనను బిల్లవాండ్రు హిత ముపదేశింపవలయు ననియు, పెద్దవారు బాలుఁడు చెప్పినది యుక్తియుక్తమగునా కాదా యని యాలోచించి యుక్తియుక్తముగ నుండిన గ్రహింపవలయు ననియు, 'బాలుఁడవు నీవా నాకుఁ జెప్పువాఁడ' వని యనరాదనియు బోధ.

ఉ. దీనత రాముఁ డిట్లనిన ♦ ధీరుఁడు లక్ష్మణుఁ డన్న! యీజన
స్థాన మనేకభూరిమృగ♦సంకుల కందర శైలదుర్గసం
తానము కిన్నరాళిభవ♦నప్రచయాన్విత ముగ్ర రాక్షసా
ధీనము భూరిభూరుహతతి♦ప్రవికీర్ణము గానఁ గోమలిన్. ౧౧౭౧

అనేక = పెక్కులగు, భూరి = గొప్పవగు, మృగ = జంతువులచే, సంకుల = నిండిన, కందర = గుహలుగల, శైల = కొండలయు, దుర్గ = చొరరాని ప్రదేశముల, సంతానము = సమూహము కలది, కిన్నర + ఆళి = కిన్నరుల సమూహముల యొక్క, భవనప్రచయ = ఇండ్లగుంపులచే, అన్వితము = కూడినది, ఉగ్ర రాక్షసాధీనము = భయంకరులగు రాక్షసుల యధీనమం దుండునది, భూరి = గొప్పవగు, భూరుహ = చెట్లయొక్క, తతి = సమూహముచే, ప్రవికీర్ణము = మిక్కిలి వ్యాపించి యుండునది.

తా. శోకతప్తుఁడై రామచంద్రమూర్తి యిట్లనుచుఁగా లక్ష్మణుఁ డిట్లనియె. ఈ జనస్థానము పెక్కులు గొప్పవగు మృగములచే నిండిన గుహలుగల కొండలు చొరరాని మార్గములు గలది. కిన్నరుల యిండ్లచేఁ గూడియుండునది. భయంకర రాక్షసుల యధీనమందుండునది. పెద్దచెట్లచే వ్యాపించియుండునది. కావున రాక్షసులు సీతను దెచ్చి యిందే యెందో యుంచియుండవలెను.

కం. ఇందే రోయఁగఁ దగు నీ, చందంబునవాఁడు బుద్ధి సంపన్నుఁ డని
ష్పందుండగు నాపదలం, దెంతేనియు గిరులు కదలుఁ గదలునే గాడ్పునకున్. ౧౧౪౩

నీ చందంబునవాఁడు = నీ విధముగలవాఁడు, నీవంటివాఁడు, బుద్ధిసంపన్నుఁడు = బుద్ధిసంపదగలవాఁడు, అనిష్పందుఁడు = చలింపనివాఁడు, గాడ్పునకున్ = ఓరుగాలికి. ఈ చందంబువాఁ డనుటకు, "ఇట్టినిన్యతేజంబువాఁ డధమాన్వయమునఁ బుట్టునె చెప్పుమా" భార-ఆ-౬-౫౭.

తా. కావున సీతాదేవిని నిచటనే వెదకవలయును. నీవంటి బుద్ధిసంపదగలవాఁ డాపదవేళలఁ జలించునా? ఎంత యోరుగాలి వీచినను కొండలు కదలునా?

కం. అని పలికిన రాముఁడు తన, యనుజుఁడు వెనువెంట రాఁ బ నానని సర్వం
బును రోసెఁ గ్రోధవశతన్, ధనువున క్షురశరము గూర్చి తాలిచి కేలన్.

వనావనిన్ = అడవి ప్రదేశమును, క్షురశరము = మంగలికత్తివలెఁ బదునైన బాణమును,

తా. అని చెప్పఁగా రామచంద్రమూర్తి తమ్ముఁడు తనవెంటరాఁగా నడవి ప్రదేశమును సర్వమును సీతాహర్తయందుఁ గోపము గలవాఁడై ధనుస్సునందు మంగలికత్తివంటి బాణము సంధించి చేత ధరించి వెదకెను.

— రామలక్ష్మణులు జటాయువును చూచుట —

కం. ఇటు వెదకుచుఁ జనఁ జన న, చ్చట నొకచో భూరిశైలసంకాశుని నె
త్తుటఁ దోఁగియున్నపుణ్యుని, జటాయువు మహానుభావు శకునిప్రవరున్. ౧౧౪౪

భూరిశైలసంకాశున్ = పెద్ద పర్వతముతో సమానుఁడైనవానిని, తోఁగి = మునిఁగి, పుణ్యుని = పరోపకారమను పుణ్యము చేసినవానిని, మహానుభావున్ = గొప్ప మహిమ గలవానిని, ప్రాణ మిచ్చియైనను స్వామికార్యము చేయునంతటి భక్తిమహిమ గలవానిని, శకునిప్రవరున్ = పక్షిశ్రేష్ఠుని.

తా. ఇటు వెదకుచుఁ బోఁగాబోఁగా నాపర్వతమందే యొకచోటఁ బెద్ద కొండవలె నుండువానిని, నెత్తుటఁదడిసియున్నవానిని, పుణ్యాత్ముని, ప్రాణము విడిచియైన స్వామికార్యము చేయవలయు నను భక్తివిశేషము గలవానిని, పక్షిశ్రేష్ఠుని, జటాయువును.

కం. వీక్షించి పలుకు ననుజుని, శిక్షితపరిపంథి కంటె సీతను వీఁడే
భక్షించె నిజము గ్రద్దై, రాక్షసుఁ డే యున్నవాఁడు గ్రాలుచు సుఖమై.

వీక్షించి=చూచి, శిక్షితపరిపంథి=శత్రువుల దండించినవాఁడా.

తా. చూచి తమ్మునితో నిట్లనియె: విరోధులను శిక్షించినవాఁడా! చూచి

తివా, వీఁడు రాక్షసుఁడు, సీతను మ్రింగి మనము చంపుదుమను భయముచే గ్రద్దై హాయిగా నున్నాఁడు.

కం. వీనిని మద్ఘోరేషువితానంబులఁ జల్చువాఁడఁ ♦ దడయక యని సీ
తానాయకుఁ డభిముఖుఁడై, పూనఁగ శర మొందు వణఁకె ♦ భూతల మెల్లన్.

మద్ఘోర = నాభయంకరములైన, ఇషు = బాణములయొక్క, వితానంబులన్ = సమూహములచే, అభిముఖుఁడై = ఎదురుగాఁబోయి.

తా. వీనిని నా భయంకర బాణసమూహముచే నిప్పుడే యాలస్యము లేక చీల్చెద నని వెనుకనుండి కొట్టరాదుగావున నెదురుగఁ బోయి యొక తీవ్రబాణమును సంధింపఁగా భూతలము వణఁకెను.

కం. నెత్తురు లాలలు గ్రక్కుచు, హత్తినమరణాంతబాధ ♦ నారటమున డ
గ్గుత్తికతోడ విహంగమ, సత్తముఁ డిట్లనియె రామ ♦ చంద్రునితోడన్. ౧౧౪౭

లాలలు = జొల్లునీళ్ళు, మరణాంతబాధ = మరణము సమీపించినపుడు కలుగు వేదనయొక్క, ఆరటమునన్ = రూ. ఆరాటమునన్ = తాపముచే, డగ్గుత్తికతోడ = గద్గదస్వరముతో, విహంగసత్తముఁడు = పక్షిశ్రేష్ఠుఁడు.

తా. నెత్తురు చొంగ గ్రక్కుచు మరణతాపముచే బాధపడుచు గద్గదస్వరముతో రామచంద్రునితో పక్షిరా జిట్లనెను.

—♦ జటాయువు రామునకు సీతాపహరణవృత్తాంతముఁ జెప్పుట. ♦—

కం. ఆయుష్మంతుఁడ! యోషధి, నో యన వని నెద్ది రోయు ♦ చున్నారో మీ
రా యంగన నా ప్రాణం, బీయెడ రావణునిచేత ♦ హృత మీ రెండున్. ౧౧౪౮

ఆయుష్మంతుఁడ = దీర్ఘాయుష్కలవాఁడా! ఇది దీవన. బిడ్డలను చిరంజీవులన్నట్లు, ఖరాదుల వధవలన రామచంద్రమూర్తి బలాదు లెఱిఁగియు సీతావిషయము వినఁగానే యేమగునోయని శంకించి యాయుష్మంతుఁడా యని దీవించెను. "జీవన్ భద్రాణి పశ్యతి" బ్రతికియుండిన శుభములు పడయవచ్చునని. కావున సాహసము చేయకుము, అని బోధ. ఓషధినో = మూలికయన - ఓషధినోయన్నట్లు. ఓయన - ఉత్ప్రేక్షావాచకము. హృతము = అపహరింపఁబడెను. అడవులలో వెదకువారు మూలికలనేకదా వెదకుదురు.

తా. ఆయుష్మంతుఁడా! అడవియందు నోషధిని వెదకినట్లు దేనిని వెదకుచున్నారో యట్టిసీతయు నా ప్రాణము రెండును రావణుచే నపహరింపఁబడినవి.

ఉ. నీవును లక్ష్మణుండును వ ♦ నీక్షితి నొంటిగ వీడి చన్న యా
పావని సీత నెత్తికొని ♦ బల్మిని రావణుఁ డుప్పరంబునన్
బోవుచునుండఁ జూచి యొక ♦ పూఁపున నడ్డముదాఁకి వానితో
లావునఁ బోరి తద్రథ మి ♦ లాస్థలిఁ గూల్చితి వాని డొల్చితిన్. ౧౧౪౯

పావని = పవిత్ర చరిత్రను, బల్మిని = బలవంతముగా, ఉప్పరంబునన్ = ఆకాశమున, పూఁపున = ప్రయత్నముచే, లావునఁబోరి = బలముతోఁ బోరి, యుద్ధముచేసి, ఇలాస్థలిన్ = భూమియందు, డొల్చితిన్ = పడఁద్రోచితిని.

తా. నీవును లక్ష్మణుఁడు నిరువురు పావనియగు సీతను నొంటిగా నడవిలో విడిచిపోఁగా రావణుఁడు బలవంతముగా సీతను బట్టుకొని యాకాశమునఁ బోవుచుండఁగా నేను జూచి యెుకవిసరున వారి కడ్డముపోయి యెదిర్చి వానితో బలము కొలఁది యుద్ధముచేసి వానిరథమును నేలఁ బడఁగొట్టి వానిని గ్రిందఁద్రోచితిని.

కం. అదె నే విఱిచినచాపం, బదె తూణి మదీయపక్షహతసారథి వా
డదొ తేరు నేను డస్సిన, ముదుక నగుట నతఁడు ఖడ్గమున నా ఱెక్కల్.

తూణి = అంబులపొది, మదీయపక్షహతసారథి = నా ఱెక్కల దెబ్బచేఁ జచ్చినసారథి, డస్సిన = బడలిక చెందఁగా, ముదుకన్ = ముసలివాఁడను.

తా. నేను విఱిచిన విల్లదిగోఁ బడియున్నది. అదిగోఁ బొది. నా ఱెక్కల దెబ్బచేఁ జచ్చిన సారథి యదిగోఁ బడియున్నాఁడు. అదిగో నేను బడఁగొట్టిన తేరు. నేను ముసలివాఁడనై బడలితిని. అప్పుడు తన కత్తిచే నా ఱెక్కలను

కం. తెగ నఱకి తెఱవఁ గొనుచున్, గగనంబునఁ బఱచెఁ బంక్తికంఠుఁడు మున్నే
మగువకయి చంపె నీవుం, దగ నే వెండియును జంప దశరథపుత్రా. ౧౧౪౧

తెగన్ = దేహమునుండి తెగిపోవునట్లు, తెఱవన్ = స్త్రీని.సీతను, మున్నే = ముందే.

తా. తెగి నేలఁబడినట్లు నఱకి సీతను బట్టుకొని రావణుఁ డాకాశమునఁ బరువెత్తెను. నీభార్యకై ముందే దశకంఠుఁడు నన్నుఁ జంపెను. నామిత్రుఁడగు దశరథుని పుత్రా! చావనున్నవానిని నీవుకూడఁ జంపవలయునా?

— జటాయుదుస్థితికి రాముఁడు దుఃఖించుట. —

చ. అన విని బాష్పపూర్ణముఖుఁడై ద్విగుణీకృత తాపకుఁడై
ధను వటు పాఱవైచి నృపతల్లజుఁ డాతని గౌఁగిలించి హా
యని వివశాత్ముఁడై పడి సహానుజుఁడై వలవించె నొంటివా
నిని వనిఁ గాలిత్రోవఁ బడి నిశ్వసనంబులు పుచ్చుచున్యెసన్. ౧౧౪౨

ద్విగుణీకృత = ఇబ్బడించిన, తాపకుఁడై = తాపముతోఁ గూడినవాఁడై, నృపతల్లజుఁడు = రాజశ్రేష్ఠుఁడు వివశాత్ముఁడై = పరవశమైన మనసు గలవాఁడై, సహానుజుఁడై = తమ్మునితోఁగూడినవాఁడై, ఇట్లనుటచే లక్ష్మణుఁడు కూడ నేడ్చెనని భావము. ఈ జటాయువు మురలిగ్రద్ద చేసినంత సేవ నేను జేయలేక పోయితినిగదా! కలకాలము కాచికాచి సమయమునకు ముఖముతప్పించితినిగదా! అని లక్ష్మణుఁడు దుఃఖించెను. వలవించెన్ = విలపించెన్, నిశ్వసనంబులు = నిట్టూర్పులు.

తా. అని చెప్పఁగా విని కన్నీళ్ళచే నిండిన ముఖము గలవాఁడై యిబ్బడించిన తాపముగలవాఁడై విల్లు దూరమున బాఱవేసి రాజశ్రేష్ఠుఁడగు రామచంద్రమూర్తి యతనిని గౌఁగిలించి 'హా' యని పరవశుఁడై పడి తమ్మునితోఁ నేడ్చెను. లక్ష్మణా! ఒంటరివాని నడవిలోఁ ద్రోవలోఁ బడి యెగయూపిరివిడుచు పుణ్యాత్ముని

పరమేశ్వరుఁడగు శ్రీరాముఁడు భక్తవత్సలతమువలన భక్తుఁడగు జటాయువునకుఁ గలిగిన యాపదఁజూచి పరమప్రియయగు సీత రావణునిచే నపహరింపఁబడెననిన విని, "వ్యసనంబులు జనములకును, బొసఁగినఁ దా నధికదుఃఖమును బొందును" (అయోధ్య ౬౫). అని యనుటచే "భక్తాపదఁ జూచి యిబ్బడియగు తాపమున నార్తుఁడయ్యెను" అని మహేశ్వరతీర్థీయము. ఈ న్యాయమే సీతయందు నన్వయింపవలసినదని యీ వ్యాఖ్యాత యభిప్రాయము. ఇది గోవిందరాజ సమ్మతము. ఒకటి వగలేదువు, ఒకటి నిజమైన యేదుపయ్యెనేని యట్టి వగవు ద్విగుణితమనఁదగునా? రెండు సమానములైనఁగదా ద్విగుణితము.

ఉ. తమ్ముఁడ చూడుమీ యకట ♦ ధారిణిరాజ్యము వేఱుపాటు భీ
మమ్ముగు కాననస్థలిని ♦ సంకటపాటు ధరాత్మజాత సిం
దిమ్మెయిఁ గోలుపాటు విహ ♦ గేశ్వరు డ్రుంగుడుపాటు నా యభా
గ్యమ్మెటులుంటిదో కనితె ♦ కాల్పఁగ నోపుఁ గృశానునేనియుఁ౯. ౧౧౫౩

అభాగ్యము = దురదృష్టము, కృశానుఁ౯ = అగ్నిహోత్రుని.

తా. లక్ష్మణా! నా నిర్భాగ్యదశ యెట్టిదో చూచితివా? అయోధ్యా రాజ్యము పోవుట, భయంకరారణ్యముల దుఃఖపడుట, సీతను నిందు పోఁగొట్టుకొనుట, జటాయు మరణము ఇవియన్నియు సర్వము దహించు నగ్నిహోత్రునైనఁ గాల్పఁగ నోపును.

అయోధ్యాకాండమందు రాత్రి చంద్రునికాంతి హరింపలేనట్లు రాజ్యనాశము రామునికాంతిని హరింపలేదు అనియు, రాజ్యాభిషేకము మేలా, వనవాసము మేలా యన్నప్పుడు వనవాసమే మేలని ముందు చెప్పఁబడెను. అట్టిది యిప్పు డేల దుఃఖకరమయ్యె ననిన

"ఒనర భార్యాసమేతుఁడై యున్నవాని
కెంత యాపదలయ్యును నెఱుకపడవు."

కం. అలయునెడ డయ్యునెడనాఁ, కలియుఁ దృషయునైన యెడలఁ♦గడుగొని ధరణీ।
తలనాథపురుషునకు ని,మ్ములభార్యయ పాచుచిత్త♦మున దుఃఖంబుల్‖భా॥

సీ. ధర్మార్థకామసా♦ధన కుపకరణంబు, గృహనీతివిద్యకు♦గృహము విమల
చారిత్రశిక్ష కా♦చార్యకం బన్వయ,స్థితికి మూలంబు స♦ద్గతికి నూఁత
గౌరవంబున కేక♦కారణం బున్నత, స్థిరగుణమణుల కా♦కరము హృదయ
సంతోషమునకు సం♦జనకంబు భార్యయ, చూవె భర్తకు నొండ్లు♦గావు ప్రియము

లెట్టిఘట్టములను♦ నెట్టియాపదలను, నెట్టితీరములను♦ ముట్టఁబడిన
వంతలెల్లఁ బాయు♦నింతులఁ బ్రజలను, నొనరఁజూడఁగనిన♦జనుల కెందు ॥భార॥

అనియుండుటచే నపుడు సీతాదేవికూడ నుండుటచే రాముని కప్పు డట్లుండెను. భర్తకు మనస్సునకు దుఃఖము స్పృశింపరాకుండునట్లు మాటలచేత, నుప చారాదులచేత సంతోషపెట్టుచుండెను. ఇప్పు డామె పోవుటచే నన్నియు దుఃఖ కరములై కానవచ్చెను.

గీ॥ పెక్కుదివియ లున్న♦ జక్కవచెలి యున్న, రిక్కరాయఁడున్న♦జుక్కలున్న
జిన్నిలేడిచూడ్కి ♦ చేడియ నెడఁబాయ, నప్పుడంధకార♦మయ్యె జగము ॥భర్తృ॥

కావున రాజ్యముపోవుట దుఃఖకర మయ్యెను. ఆకస్మికముగ వచ్చిన రాజ్యము పోయినఁబోనీ, లోకములో నందఱు రాజ్య మేలి సుఖించుచున్నారా? అనిన నింటిలోఁ బడియుండుటకై నలేక వనవాసప్రాప్తి, అడవులలో భార్యలతో వానప్రస్థులు సుఖముగ లేరా యనిన భార్యను గోలుపోవుట, అందఱు భార్యల తోనే యున్నారా? బంధువులతోడనైన నుండమనినఁ బ్రాణస్నేహితుఁడు తమకై చచ్చుట యివియన్నియు నుత్తరోత్తరదుఃఖాభివృద్ధికిఁ గారణములు. తగిలినచోటే పలుమాఱు తగిలెనేని మొదట లక్ష్యపెట్టకున్నను మూఁడు నాలుగుమార్లు గాయ పడినపిమ్మట నొప్పి తెలియకపోదు. అప్పుడు ప్రాఁతవికూడ జ్ఞప్తికి వచ్చెను.

కం. ఘోరార్తితాప మాఱఁగఁ, బారావారంబుఁ జొరగఁ♦ బాటితి నేనిఁ
నీరము నాదౌర్భాగ్యము, పేరిమి శోషిల్లు నేల♦ బీటిక లెగయున్. ౧౧౫౭

పారావారంబు = సముద్రమును, బీఁటికలు = పగుళ్లు.

తా. సహింపరాని యీ తాపము చల్లార్చుకొన నేను సముద్రములో దూఁకి నను నా దేహమువేఁడిమిచే సముద్ర మెండుటయేగాక నేలకూడఁ బగుళ్ళు వాఱును.

కం. నాకంటెను నిర్భాగ్యుఁడు, లోకంబున లేఁడు పరివి♦లోకించినచో
నీకరణి దుస్తరం బగు, వ్యాకటమర్వ్యసనవాగు♦రం జిక్కుటచేన్. ౧౧౫౮

వాగురన్ = వలయందు.

తా. ఈ విధముగ దరింపరాని చెడ్డవ్యసన మను వలయందుఁ జిక్కుటచే నెంత వెదకిచూచినను నాకంటె నదృష్టహీనుఁడు లోకమున లేఁడు.

కం. మన జనకుని మిత్రుం డీ, యనఘుఁడు ముదుసఁడు విహంగ♦మాధిపుఁ డయ్యో
వినిహతుఁడై పడియెను ధాత్రిని నాదురదృష్టవశత♦దీనతఁ గంటే. ౧౧౫౯

అనఘుఁడు=పుణ్యాత్ముఁడు, 'పరోపకారః పుణ్యాయ' యన్నట్లు పరోపకార మందు దేహము విడిచినవాఁడు.

తా. ఈయన మనతండ్రి స్నేహితుఁడు, పుణ్యాత్ముఁడు, ముసలివాఁడు, పక్షి రాజు నానిర్భాగ్యదశవలన కొట్టఁబడినవాఁడై నేలఁబడెను చూచితివా!

కం. అని జనకస్నేహమ్మున, ననుజునితో లూనపక్షు నగ్రసనుస క్తుం
దనకేలఁ దడవి యేదీ, యనఘా! నాప్రాణతుల్య యని ధర వ్రాలెన్. ౧౧౫౭

తా. తండ్రి మిత్రుఁడను స్నేహముచేఁ దమ్మునితోఁ జెప్పి ఱెక్కలు నఱకఁబడి నెత్తురుకారుచున్న వానిని తనచేతితోఁ దుడిచి 'పుణ్యాత్ముఁడా' నా ప్రాణములతో సమానురాలగు సీత యేదీ యెందున్నది యని నేలపైఁ బడెను.

—{౬౮-వ సర్గము. జటాయువు రామునకు సీతావృత్తాంతము సవిస్తరంబుగఁ జెప్పుట.}—

ఉ. తెప్పిఱి లేచి లక్ష్మణుని దిక్కుఁ గనుంగొని కంటె తమ్ముఁడా
యిప్పరమోపకారి విహగేంద్రుఁడు నాకయి పూని తెంపుపెం
పొప్పఁగఁ బోరి కూలి కొఱయూపిరితోఁ బడినాఁడు, పల్కఁ న
చ్చొప్పును దోఁప, దెల్లు కడునూత్న మటంచును బక్షి కిట్లనున్. ౧౧౫౮

తెప్పిరి = మూర్ఛనుండి తేఱి.

తా. ఇట్లు మూర్ఛనుండి లేచి లక్ష్మణునితో రామచంద్రమూర్తి యిట్లనియె : 'తమ్ముఁడా మహోపకారముచేసిన యీ పక్షిశ్రేష్ఠుఁడు నాకయి ప్రయత్నించి తెగించి యుద్ధముచేసి పడి కుట్టునుకతోఁ బడియున్నాఁడు. మాటలాడ శక్తి యున్నట్లును గానరాదు. ఏదో యొకమాట చెప్పినను చాల హీనస్వరము' అని జటాయువుతో నిట్లనియె :

శా. ఓదక్షాయ్యకులాధినాయక ! జటాయూ ! పల్కనే ర్తేని సీ
తాదేవిఁగుఱించి నీవధముచందంబున్ ధరాకన్య నే
లా దైత్యుండు హరించె ? నాతఁ డెద నల్గం గారణం బేమి ? మి
త్రా! దేవ్యాస్యము చంద్రతుల్య మెటు తత్కాలంబునం దుండెనో ? ౧౧౫౯

దక్షాయ్యకులాధినాయక = గ్రద్దకులమునకు ప్రభువా, జటాయూ! ఇది సంబోధన ప్రథమ. భూసురోత్తమ 'జగత్కారూ'యని నన్నయభట్టుప్రయోగము. ఈ రూప మాచ్ఛికశబ్దంబుల రాదు. నా కొడుకూ, నా తమ్ముఁడూ అనరాదు. దేవ్యాస్యము-దేవి+ఆస్యము=సీతాదేవి ముఖము. సీతాదేవిముఖ మెట్లుండెననుటకుఁ గారణము, సంతోషముతోఁ బోయెనా దుఃఖించుచుఁ బోయెనా ? తనయందలి ప్రీతి యేమాత్రము తెలిసికొనుటకును సంతోషముతోఁ బోయెనేని యామెకై శ్రమపడవలసినపని లేదనుటకును.

తా. ఓ గ్రద్దఱేఁడా, జటాయూ! మాటలాడ శక్తిగలదేని, సీతాదేవి గుఱించియు నీవు చంపఁబడినవిధము, ఏల సీతను రాక్షసుఁడు పట్టుకొనిపోయెను, వానికేల నామీఁదఁ గోపము కలిగెను ? అప్పుడు సీతాదేవి ముఖ మెట్లుండెను ? చెప్పుము.

ఉ. ఆమెయిఁ గొంచు నేగ దురి♦తాత్ముఁడు తన్ను ధరిత్రికన్య దా
నే మనుచుండె? నప్పలుకు ♦ లేర్పడఁ జెప్పుము, దైత్యుఁ డెట్టివాఁ
డేమియివాఁడు? వానిపుర ♦ మెయ్యది? శౌర్య మదెంతమట్టు? తం
డ్రీ! మనమారఁగాఁ బలుక♦ వే సతి నెట్లు హరించి యేగెనో?. ౧౧౬౦

తా. ఆ విధముగఁ బాపాత్ముఁ డా రాక్షసుఁడు తన్నుఁ దీసికొనిపోవుచుండ నప్పుడు సీత యేమనుచుండెను? ఆమాటలు స్పష్టముగఁ జెప్పుము. ఆరాక్షసు డెట్టివాఁడు, ఏదేహమువాఁడు, వాఁ డుండుపుర మేది? వాఁడేమాత్రము శూరుఁడు? తండ్రీ! సీత నేవిధముగఁ బట్టుకొనిపోయెనో సర్వము చెప్పుము.

'ఛందస్సు-రెండును ప్లుతాక్షరములే యయినప్పుడు సర్వమైత్రియుండినఁజాలును. వ్యంజనమైత్రితోఁ బనిలేదు. దీనికి ప్లుతయుగ విశ్రామయుతి యనిపేరు.

కం॥ తా మేవర్ణములైనను, భూమండలమునను బ్రాణ♦మైత్రిగలిగినన్ ।
దామోదరప్లుతయుగ వి,శ్రామములనఁగా ప్లుతాక్షరద్వయ మమరున్॥ అప్పకవి.

ఇందు నాలుగవపాదంబున రెండును ప్లుతాక్షరములే.

ఉ. ఈవిధి రాముఁ డాడ విహ♦గేంద్రుఁడు మెల్లన విచ్చి ఱెప్పలన్
భూవిభు మోముఁ జూచుచు న♦తుం గడు నీరెలుఁ గొప్ప రామ! మా
యావి సమీరదుర్దినస♦మాకుల విస్తృతమాయ గూఢుఁడై
రావణుఁ డేగె మింటను ధ♦రాసుత బల్మి హరించి క్రూరుఁడై. ౧౧౬౧

విహగేంద్రుఁడు = పక్షిరాజు, జటాయువు, ఈరెలుఁగు = సన్ననిధ్వని. మాయావి = మాయలమారి, సమీర = గాలితోఁగూడిన, దుర్దిన = మేఘములచేఁ గప్పఁబడిన దినముచే, సమాకుల = మిక్కిలి నిండిన, విస్తృత = విస్తరింపఁబడిన, మాయ=అద్భుతశక్తిచే,తన శక్తిచే పెనుగాలి వీచునట్లును ఆకాశమున మబ్బులుక్రమ్ము నట్లును జేసి యెవరికిఁ గనరాని విధమున-గూఢుఁడై = ఎవరికిఁ గానరాక దాఁగినవాఁడై, మింటన్ = ఆకాశమార్గమున, బల్మిన్ = బలవంతముగ.

తా. ఈప్రకారము రామచంద్రమూర్తి యడుగఁగా జటాయువు మెల్లగ ఱెప్పలు తెఱచి రామునిజూచుచు మిక్కిలి సన్ననిగొంతుతో నిట్లనియె: 'రామా! వాఁడు మాయగాఁడు. తనశక్తిచే పెనుగాలిని మబ్బులగుంపును గల్పించి వాని చాటున నెవరికిఁ గానరాకుండ రహస్యముగ సీతాదేవిని శూరుఁడై బలాత్కారముగఁ బట్టుకొని యాకాశమార్గమునఁ బోయెను.

కం. బెడిదపుసంగరమున నే, బడలిన నన్నుఁ గాంచి మీఁదఁ♦బడి ఱెక్కలఁ దా
నడిదమున నడిచి యసురుఁడు, కడువడి దక్షిణముఖంబు♦గాఁ బరువెత్తెన్.

తా. భయంకర యుద్ధమందు గాసిపడిన నన్నుఁ జూచి నామీఁదఁబడి కత్తిచే నాఱెక్కలు నఱికి మిగుల వేగముగ దక్షిణపుదిక్కుగా పరువెత్తెను.

కం. రామా! కన్నులు తిరుగెడి, నామనము వశంబు గాదు♦నాయన! కావుల్

దా మెడలెను బ్రాణంబులు, హేమాగము లవిగో నభయః కృతకేశము లై.

తావుల్ = స్థానములు, ఇది యన్యదేశ్యము. హేమాగములు = బంగారుచెట్లు, అభయ = వట్టివేళ్ళచే, కృత = చేయఁబడిన, కేశములై = వెంట్రుకలుగలవై. మరణ కాలమున నిట్టిచెట్లు కానవచ్చును.

తా. రామా! కన్నులు తిరుగుచున్నవి. నా మనస్సు నా స్వాధీనమందు లేదు. ప్రాణవాయువులు వానివాని స్థానములను వదలినవి. అవిగో వట్టివేళ్ళకొనలు గల బంగారుచెట్లు కానవచ్చుచున్నవి.

ఉ. ఆ యసురారి భూమితనయన్ హరియించినమూర్తముం గనన్
బోయినసొమ్ము స్వామి వెసఁ బొందుట తప్పదు, తత్తఱాన దై
తేయుఁడు తన్ముహూర్తము సుధీ దెలియం, డది విందయండ్రు, నీ
జాయ హరించి వాఁడు బడిశంబును మ్రింగిన చేఁపయట్లు లౌ. ౧౧౬౪

స్వామి = సొమ్ముగలవాఁడు, స్వమ్ము = సొత్తు - అది గలవాఁడు స్వామి. భగవంతుని స్వామి యనుటకు చరాచరము లాయన సొమ్మగుటచేతనే. తత్తఱాన = తొందరచే, జాయన్ = భార్యను, బడిశంబును = గాలమును, వింద = నష్టమైనధనము, దీనిచేఁ బొందునుగాన దీనికి విందయని పేరు. ఇది పగటి పదు నొకండవ ముహూర్తము.

రౌద్ర శ్శ్వేతశ్చ మైత్రశ్చ తథా సారభటః స్మృతః
సావిత్రో వైశ్వదేవశ్చ గాంధర్వ కుతప స్తథా
రౌహిణ స్తిలకశ్చైవ విజయో నైరృత స్తథా
శంబరో వారుణశ్చైవ భగః పంచదశస్మృతః॥ ఈ పదునైదు పగటి ముహూర్తములు. ఇందు విజయముహూర్తమునకు విందయని నామాంతరము - మహేశ్వర తీర్థీయము.

తా. రాక్షసుఁడు సీతాదేవిని హరించిన ముహూర్తమును జూడఁగా నం దపహరింపఁబడిన సొమ్ము మరల స్వామిని జెందును. తప్పదు. ఆ రాక్షసుఁడు తొందరచే దీని గమనించినవాఁడు కాఁడు. ఆ ముహూర్తము పేరు వింద. పోయినసొమ్ము మరల సొమ్ముగలవానిని జేరునుగావున దానికి విందయని పేరు. కావున నీ భార్య నపహరించినవాఁడు గాలము మ్రింగిన చేఁపవలె నగును.

కం. వ్యథపడకుము జనకజకై, ప్రథితగుణా! నీవు ద్రుంచి రాక్షసనాథున్
బ్రధనమున మరల సతిఁగొని, పృథుయశ మొప్పారఁ బురికి నేగెదు నెమ్మిన్.

ప్రధనమునన్ = యుద్ధమందు, పృథుయశము = గొప్ప కీర్తి.

తా. రామా! సీతకై నీవు వ్యసనపడవలదు. కీర్తికరములైన గుణములు గలవాఁడా! నీవు రాక్షసపతిని యుద్ధమునఁ జంపి మరల సీతను గ్రహించి గొప్ప కీర్తిని సంపాదించి సంతోషముతో నయోధ్యఁ జేరఁగలవు.

కం. అని తెలివి చెడక యింతయు, మనుజేంద్రునితోడఁ బలికి ♦ మఱియు వచింపన్
జనునెడ మాంసము నెత్తురు, ఘనముగ వక్త్రంబునుండి ♦ క్రక్కుచుఁ బైపై.

తా. ఇంతవఱకు స్మృతితప్పక తెలివితోఁ బలికి యాయన యడిగిన తక్కిన ప్రశ్నలకు బ్రత్యుత్తర మీయఁదలఁచి మాటాడఁ బ్రయత్నింపఁగా నింతలోఁ మాంసము, నెత్తురు నోటనుండి మీఁదమీఁద విస్తారముగఁ గ్రక్కుచు

కం. ఔరసుఁడు విశ్రవునకున్, గౌరీవల్లభునిమిత్రు♦నకు సోదరుఁ డం
చిరితిఁ జెప్పనాలో, నా రవయూపిరియు నక్కటా వెడలి చనెన్. ౧౧౬౭

విశ్రవునకున్ = విశ్రవసుఁడనువానికి, ఔరసుఁడు = సొంతకొడుకు, గౌరీవల్లభుని = శివునియొక్క, మిత్రునకున్ = స్నేహితుఁడగుకుబేరునికి, సోదరుఁడు = తమ్ముఁడు, రవయూపిరి = కొంచెముగా ప్రాణవాయువు, అక్కటా వెడలిచనెన్ = అయ్యో వెడలిపోయెనే, చెప్పవలసిన విషయము పూర్ణముగాఁ జెప్పకముందే ప్రాణము పోయెఁగదా యని కవి వ్యసనపడుచున్నాఁడు.

దీనికిఁ దరువాత జటాయువు చెప్పఁదలఁచినది "పేరను రావణుఁడు మదంబారఁగ వసియించు లంకయను నగరమునన్" అనునది కిష్కింధాకాండమున సంపాతి యీ పూర్వార్థమునే తీసికొని యుత్తరార్థమును జెప్పఁగలఁడు. ౧౩-౧౩-వ పద్యమును జూచునది. కవితాచమత్కృతి యెంతయు వంద్యము.

తా. విశ్రవుఁ డను ముని కన్నకొడుకు, కుబేరునికి సోదరుఁడు అని యీ మాటలు చెప్పుచుండఁగాఁ గొంచెము మిగిలియుండిన యూపిరియు వెడలిపోయెను.

రామచంద్రమూర్తి శంబరాసురుకొడుకును జయించుటకై దండకారణ్యమునకు వచ్చియుండెను. విశ్వామిత్రుడు, శూర్పణఖ వీరు రావణాసురుని పేరెత్తినవారేకాని వాని యునికిపట్టు లోనగువిషయములు చెప్పినవారు గారు. సముద్రతీర ప్రదేశముతప్ప చిత్రకూటము మొదలు దక్షిణమధురవరకు దండకారణ్యమే. దీనిలో శంబరుఁ డే ప్రదేశమున నుండెనో తెలియలేదు. మునీశ్వరులు రాక్షసులని రాక్షసులని సమష్టిమీఁదను, ఖరుఁడని చెప్పిరిగాని రావణువిషయముఁ జెప్పినవారు గారు. వీ రందఱు శూర్పణఖతప్ప బుద్ధిపూర్వకముగా నా విషయము దాఁచిరనియే యెంచవలసియున్నది. ఏలన, నీలోపల జరుగవలసిన చరిత్ర కొంత గలదుగదా!

కం. నుడువుమునుడువుమటంచుం, బుడమివిభుఁడు కేలుముడువఁ♦బులుఁగులఱేఁడున్
విడిచి తనువు దివికిం జనె, నుడుకుచు రాముండు చూచు♦చుండఁగ వెతచేన్.

నుడువుము = చెప్పుము, కేలుముడువన్ = చేతులుజోడించి నమస్కరింపఁగా.

ఇంతకాలము జటాయు వెట్లు ప్రాణము బిగఁబట్టఁగలిగెను? ఒకనికి మనస్సున బలిష్ఠమైన కోరిక వేదన యుండెనేని యది నెఱవేఱువఱకుఁ బ్రాణముపోదు. ఇది యనుభవవిదితమే. ఆ భారము తగ్గినా వెంటనే ప్రాణముపోవును. నా విషయము రామునకు నీవు చెప్పవలసినదని సీతాదేవి కోరెను. ఈ విధమైన సాహా

య్యమైనను జేయవలయునని జటాయువునకుఁ బూర్ణసంకల్పము సుండెను అది నెఱవేఱఁగానే ప్రాణము పోయెను ఇట్లు జటాయువు జీవించుట సీత యనుగ్రహముచే నని స్కాందమునఁ జెప్పఁబడినది. "దేవీ మాం ప్రాహ రాజేంద్ర యావత్త్వం భాషణం మమ, భవతస్తావదాగస్మత్ప్రాణా ఇత్యాహ జానకీ" నేను నీతో మాటలాడువఱకు నీ ప్రాణములుండునని సీత నాతోఁ జెప్పెను—తీర్థీయము. సీతాదేవియం దిట్టి యనుగ్రహశక్తి పూర్ణముగఁ గలదు. అట్లు సంకల్పించియు నుండవచ్చును. ఈ మాటలు రావణుఁడు వినలేదు కాఁబోలు, విని యుండిన నప్పుడే జటాయు తల నఱికియుండును.

తా. చెప్పుము, చెప్పుము అని రాముఁడు చేతులు జోడించుకొని యడుగు చుండఁగా పక్షులరాజగు జటాయువు రామచంద్రమూర్తి సంతాపపడుచు చూచు చుండఁగా దేహమువిడిచి స్వర్గమునకుఁ బోయెను.

క౦. ఎఱుపొత్తఁ గనులఁ దుండముఁ, దెఱచుచుఁ దల వ్రేలవైచి దిస్సిఁ బాదంబుల్
విఱివిగను సాఁచి దేహము, తఱచు వణఁక నుసుఱు విడిచి ధరపైఁ ద్రెళ్ళెన్.

తుండము = నోరు, తఱచు = విశేషముగ, స్వభావోక్త్యలంకారము.

తా. కన్ను లెఱ్ఱనకాఁగా నోరు తెఱచి తల వ్రేలవైచి భూమిమీఁద పాదములు వెడలువుగను బొడుగుగను జాఁచి దేహము వణఁకుచుండ నూపిరి విడిచి నేలపైఁ బడెను.

—♦ జటాయుమృతికి రాముఁడు శోకించుట ♦—

ఉ. ఆ పడియున్న గృధ్రము జటాయువుఁ గన్గొని రాముఁ డాత్మసం
తాపము దోఁప నిట్లనుఁ దమ్మున కీతఁ డనేకవర్షముల్
పాపపురక్షసావళికిఁ బట్టగు దండక నిర్భయంబుగా
నేపున నుండియుం దుదకు నిచ్చటనే మృతుఁడయ్యెఁ గంటివే. ౧౧౭౦

తా. ఆ విధముగ నేలపైఁబడిన జటాయువును జూచి రామచంద్రమూర్తి మిగులఁ బరితాపముగలవాఁడై లక్ష్మణుతో నిట్లనెను. తమ్ముఁడా! ఇతఁ డనేక సంవత్సరములు పాపాత్ములగు రాక్షసులకు స్థానమైన దండకయందు తన పరాక్రమముచే భయములేక యుండి కడపట యిందే మరణించెఁ జూచితివా!

క౦. బాలత్వం బాదిగ నిట, వేలకొలఁది యేఁడు లిచ్చ విహరించి తుదిన్
గూలి యిచటఁ బడియెఁ గదే, కాలము దాఁటంగ రాదుగా యెవ్వరికిన్.

తా. చిన్నతనము మొదలుకొని యిచ్చట వేలకొలఁది సంవత్సరములు తన యిష్టప్రకార మీ యడవియందు సంచరించి కడపట నిచ్చటనే పడియెను. కాలము దాఁట నెవ్వరికి శక్యము?

ఈ రామాయణమందు కాలము దాఁటరాదు, విధి దాటరాదను నీతి పలు మాఱు చెప్పఁబడినది. కావున శుభాశుభములు భగవత్సంకల్పముకొలఁది మన

యదృష్టముచొప్పున వచ్చును, పోవును. వానినిగుఱించి విచారపడి మనము చేయఁగలది యేమియులేదు. కావున దానికి విచారపడక పరమపురుషార్థము సాధించి మరల నట్టిస్థితికి రాకుండ యత్నముచేయవలసిన దనునీతి బోధింపఁబడుచున్నది.

ఉ. కంటివె లక్ష్మణా! జనకకన్యక ముందట నిల్చి దేవతా
కంటకుతోడ డీకొని యఖండవిహంగమ రాజ్య మాయువుల్
రెంటిని బాసి నాకయి ధరిత్రిపయిం బడినాఁడు; ధాత్రిపైఁ
గంటిమె యెన్నఁ డిట్టి యుపకారపరుల్ సముదారుఁ బుణ్యులన్. ౧౧౬౨

ఇఁక జటాయువు ముక్తికి యోగ్యుఁ డని రామచంద్రమూర్తి చెప్పుచున్నాఁడు.

దేవతాకంటకుతోడన్ = రాక్షసునితో.

తా. లక్ష్మణా! చూచితివా, సీతను రావణుఁడు దాఁకకుండునటుల ఆమె ముందటఁ దాను నిలిచి రాక్షసు నదిరించి యుద్ధముచేసి తన యఖండపక్షిరాజ్యమును ఆయుస్సును రెంటిని నాకయి వదలి నేలఁబడినాఁడు. భూమిపై నిటువంటి పరోపకార పరుని నుదారచిత్తుని పుణ్యాత్ముని఼ జూచితిమా!

లక్ష్మణా! తండ్రినిమిత్తమై నేను రాజ్యము వదలితినని గొప్పగాఁ జెప్పుదురు. తండ్రినిమిత్తమై కొడుకు చేయకుండిన దోషముగాని చేయుట గొప్పగాదు. ఇతఁడో మన మనుష్యజాతియందుఁ జేరినవాఁడుగాఁడు. మనకు బంధువుగాఁడు. మన పోష్య వర్గములోఁ జేరినవాఁడుగాఁడు. జీతము తీసికొను సేవకుఁడుగాఁడు. మన మాయనకుఁ జేసిన యుపకార మేదియులేదు. మనయుపకార మాయన యాశించినవాఁడునుగాఁడు. ఇట్టివాఁ డొకయాఁడుదానిని రక్షింపవలయునని దీర్ఘకాలముగ నేలుచున్న రాజ్యమును అంతకంటెఁ దీపైన ప్రాణమును రెంటిని వదలిపెట్టెను. ఇట్టి కార్యమునకే కదా యుపకారమనియు నౌదార్యమనియుఁ బుణ్యమనియుఁ భక్తియనియుఁ బేరు. ఇతనికి నేను మోక్ష మీయఁదగిన సుకృతవిశేష మితనియందుఁ గలదని చెప్పుచున్నాఁడు. ఎట్టులన అఖండ విహంగమరాజ్యముం బాసి యనుటచే నప్రాప్యప్రాప్తి పరిత్యాగము సూచితము. జటాయువు నీచములును నశ్వరములు నగు నైహికపదార్థములందలి యభిలాష సమూలము వదలెనని భావము. నాకయియనుటచే నన్నొకనినే తన యిష్టసిద్ధికరునిఁగా నెంచెనని భావము. దీనిచే నుపాయానుష్ఠానము చెప్పఁబడెను. దీనివలన ముక్తిఁ గోరువాఁడు ప్రకృతిపదార్థములందు నభిలాష వదలుటయు, రామచంద్రమూర్తి యొకఁడే మన కిష్టార్థసిద్ధికరుఁడని విశ్వసించి యాయన కార్యములు చేయుచుండుటయు నని యేర్పడుచున్నది.

అభ్యాసేప్యసమర్థోసి, మత్కర్మపరమో భవ।
మదర్థమపి కర్మాణి కుర్వన్ సిద్ధి మవాప్స్యసి॥ భ. గీ. ౧౨.

అభ్యాసమందు నీవు శక్తిలేదని నాకార్యములు చేయవలసినది. నానిమిత్తమై కార్యములు చేసిన మోక్షము గాంచెదవు.

కం. శూరులు శరణ్యులును హిత, చారులు సాధువులు ధర్మ♦సత్పథవర్తుల్
ధారిణిఁ గల రెల్లయెడల, ధీరగుణా! యరసి చూడఁ ♦ దిర్యక్కులనేన్. ౧౧౭౩

తా. లక్ష్మణా! పరోపకారులు మనుష్యులందే కలరని, యితరజాతులందు పట్టణములఁదప్ప నితరప్రదేశమందు లేరని తలంపకుము. ఇతరజాతు లగుపశు పక్ష్యాదులందును శూరులు, రక్షించుయోగ్యతగలవారు, పరులకు మేలు చేయఁ దిరుగువారు, సాధువులు, ధర్మమార్గమున వర్తించువారు భూమియందు దన్నిప్రదేశములఁ గలరు.

కం. నాతండ్రియట్లుపూజ్యుఁడు, స్ఫీతయశుఁడు మాన్యుఁడితఁడు♦ప్రియుఁడును జుమ్మీ
యాలినిపాటు గనంగొన, సీతాహరణార్తి సమసెఁ ♦ జిత్తమునందున్. ౧౧౭౪

తా. మనతండ్రి నాకెట్లు పూజ్యుఁడో యితఁడు నట్లు పూజ్యుఁడే అది యెట్లందువా? తండ్రియగుదశరథమహారాజు నాకొఱకై యెట్లు ప్రాణమువిడిచెనో తండ్రిమిత్రుఁ డగునితఁడు నట్లే నాకై ప్రాణము విడిచెను. కావునఁ దండ్రివలె నాచే సంస్కారము పొంద నర్హుఁడు. మంచికీర్తిగలవాఁడు, గౌరవింపయోగ్యుఁడు, ప్రియుఁడు, కావున నితనిపాటు చూడఁగా సీతను గోలుపోయినదుఃఖము నామనస్సునందు లేదు. ఏలయందువా? సీతాదేవి నాసేవవలనఁ గలుగునానంద మనుభవింపఁ గోరిక కలిగి వచ్చెను. అది సకామసేవగదా. ఇతఁడో నావలన నేలాభము గోరక నాకై ప్రాణములనే యిచ్చెను. కావున నిది విశేషదుఃఖకరమై యున్నది.

—♦ రాముఁడు జటాయువున కగ్నిసంస్కారాదులు చేయుట ♦—

కం. సౌమిత్రీ! చితిఁ బేర్చుము, యీ మత్కార్యార్థనిహతు ♦ నీపతగేంద్రున్
నేమమున నగ్ని దరిచి య,థామతి దహియింతు ననుచుఁ ♦ దదభిముఖుండై

చితిన్ = సొదను, మత్కార్యార్థనిహతున్ = నాపనినిమిత్తమై చంపఁబడిన వానిని, పతగేంద్రున్ = పక్షులందు శ్రేష్ఠుని, నేమమునన్ = శాస్త్రప్రకారము, దరిచి = మథించి, తదభిముఖుండై = జటాయువునకెదురై.

తా. లక్ష్మణా! నాకార్యమునిమిత్తమై ప్రాణము విడిచిన యీపక్షిరాజును శాస్త్రప్రకారము నాతండ్రివలె దహింతును. కావున చితిఁ బేర్చుము అని జటాయువుదిక్కుముఖమై

తే. ఏది గతి యజ్ఞశీలుర ♦ కేది యాహి, తాగ్నులకు నపరావర్తు♦లైనవారి
కుర్విదాతల కట్టియ♦నుత్తమగతి, కరుగు మత్సంస్కృతి మదాజ్ఞ ♦ నమితసత్త్వ,

యజ్ఞశీలురకున్ = యజ్ఞముచేయుట స్వభావకృత్యముగాఁ గలవారికి, గృహస్థులకు, ఆహితాగ్నులకున్ = పంచాగ్నిమధ్యమందుండి తపస్సు చేసినవారికి, ఉర్విదాతలకున్ = భూమిభోగత్యాగము చేసినవారికి, నైష్ఠికులకు. అపరావర్తులైన

వారికి = "అరణ్యమియాత్ తతో నపునరేయాత్" అరణ్యమునకుఁ బోయి మరల రాఁగూడదను నియమముగల సన్న్యాసులకు, ఏదిగతి = "గమ్యతఇతిగతిః" పొందవలసిన లోకమో. "ప్రాజాపత్యం గృహస్థానాం బ్రాహ్మ్యం సన్న్యాసినాం స్మృత"మ్మన్నట్లు సన్న్యాసులు పోవు బ్రహ్మలోకమని యర్థము. "నపునరావర్తతే" యని శ్రుతి. మత్సంస్కృతిః = నేను నీకు సంస్కారము చేయుటచేత, అనుత్తమగతిః = దేనికంటె నుత్తమమైనగతి లేదో యట్టిగతిని, మత్ + ఆజ్ఞ = నాయాజ్ఞచే, అమితసత్త్వ = మితిలేని సత్త్వగుణముగలవాఁడా. విశేష సత్త్వగుణముకలవాఁ డగుటచేతనే కదా పరమప్రేమయు, పరార్థము ప్రాణత్యాగము సహించుటయును.

యజ్ఞశీలాదుల లోకమార్గమున పునరావృత్తిరహితులగు ముక్తుల లోకమును వైకుంఠమను పేరుగలదానిని పొందుము. పక్షి కావున కర్మాధికారము లేక పోవుటచేతను, అగ్నిసంస్కారమునకు యోగ్యత లేకపోవుటచేతను, నుత్తమలోకములు లేకపోయినను నాచే నాజ్ఞాపింపఁబడినవాఁడవై ముక్తిని పొందు మని మహేశ్వరతీర్థీయము. అపరావర్తులైనవారి కనఁగా యుద్ధమందు వెనుకంజ పెట్టనివారికని కొందఱు చెప్పెదరు. అట్టిలోకము జటాయు తానే సంపాదించుకొనియున్నాఁడు. దానిని రామచంద్రుఁడిచ్చినాఁడనిన నేమియర్థము ? కావున మరల రానివారనఁగా మోక్షమునుండి యనియే గ్రహింపవలెను. ఇందఱి గతులు చెప్పెనే యేగతి కెప్పుడందురేమో ? ఆ లోకముల మార్గమున మోక్షమునకుఁ బొమ్మని యర్థము. శ్రీరామచంద్రమూర్తి జటాయువునకు మోక్ష మిచ్చినట్లు ఈ గ్రంథముననే గాక మఱికొన్ని పురాణములందును జెప్పఁబడినది.

"ఉవాచ గచ్ఛ భద్రం తే మమవిష్ణోః పరంపద" మ్మని యధ్యాత్మరామాయణము.

సంస్కార మకరో ద్రామః తస్మై బ్రహ్మవిధానతః ।
స్వపదం చ దదౌ తస్మై యోగగమ్యం సనాతనమ్ ।
రాఘవస్య ప్రసాదేన స గృధ్రః పరమంపదమ్ ।
హరేః సామాన్యరూపేణ, ముక్తిం ప్రాయాత్ఖగోత్తమః॥ పద్మపురాణము.

"సుగ్రీవో హనుమాన్ ఋక్షో గజో గృధ్రో వణిక్పథ" యని ముక్తుల నడుమ గణింపఁబడుటచే జటాయువు ముక్తుఁడే.—తిలకము,

రామచంద్రమూర్తి బ్రహ్మవిధిప్రకారము సంస్కరించి యోగులు పొందు సనాతనమైన తనలోకమును నిచ్చెను. రామానుగ్రహముచే నా గ్రద్ద పరమపదమునకుఁ బోయి విష్ణుసారూప్యమును బొందెను.

ఈ విషయమై బాలకాండము ౧౧౬-వ పద్యము వ్యాఖ్య చూడుఁడు.

మోక్షమిచ్చుట పరమాత్మ కార్యము గదా, అట్టి కార్యము రాముఁడు చేయుటంబట్టి యితఁడు పరమాత్మయని స్పష్టమగునుగదా. అట్లైనచో రామ

చంద్రమూర్తి తానందఱకు మనుష్యుఁడుగా కనఁబడవలయునని ప్రయత్నించుట "ఆత్మానం మానుషం మన్యే" నేను మనుష్యుఁడ నని తలఁచెద నని చెప్పుట వ్యర్థమేకదా యని పూర్వపక్షము. సమాధానము—(౧) ఇచ్చట నడవిలో నేమి జరిగినది వాల్మీకి చెప్పువఱకు నెవరికిఁ దెలియదు. రావణవధతో నా రహస్యము బయలుపడెను.—(౨) మనుష్యభావముచేఁ జూచినను "సత్యేన లోకాన్ జయతి" యని సత్యముచే రామచంద్రుఁడు లోకములనెల్లఁ దన స్వాధీనపఱచుకొనెనని కదా యర్థము. విశ్వామిత్రుఁ డల్పతపస్సుచే చండాలుని స్వర్గమునకుఁ బంపఁగలిగె నేని యట్టి విశ్వామిత్రునిచే పరమాత్మగా గ్రహింపఁబడిన రామచంద్రమూర్తి వైకుంఠమును, ముక్తికి యోగ్యుఁడగు జటాయువంటివాని కిచ్చుట యేమి యబ్బురము! కావున నిందు విపరీతచర్య యేదియుఁ గానరాదు.

ఈ రహస్యవిషయము బ్రహ్మవరముచే యోగబలముచే వాల్మీకి తెలిసికొనెనుగాని తక్కినవా రేమి యెఱుఁగుదురు? కావున మానుషత్వమునకు హానిలేదు.

జటాయువు ఋషులవలె మోక్షార్థమై పరమాత్మోపాసనము చేయలేదు. అట్టివానికి రాముఁ డెట్లు మోక్ష మిచ్చెను? అట్లైనచో నందఱ కేల యియ్యరాదు? అని యాక్షేపము. సమాధానము—మోక్షమున కాత్మోపాసన మొకటియే మార్గముకాదు. మార్గములు పెక్కు లున్నవి. భగవద్గీతయందు కర్మము, జ్ఞానము, రాజయోగము, భక్తి, ప్రపత్తి, క్షేత్రక్షేత్రజ్ఞజ్ఞానము, అవతారజ్ఞానము, లోనైనవి చెప్పఁబడెను. బ్రహ్మసూత్రములందు ముప్పదిరెండువిద్యలు చెప్పఁబడెను. ఇం దేది లేకున్నను ప్రేమ యొక్కటియే మోక్షసాధనమని శాస్త్రములు చెప్పుచున్నవి. విష్ణుపురాణమున "తేషు భగవదంశే ష్వనురాగిణః కోసలనగర జానపదా స్తేపి తన్మనసా స్తత్సాలోక్యతా మాపుః" అని కోసలదేశమందలి నగరములవారు పల్లెలవారు రాముని జూచినను జూడకున్నను ఆయనయం దనురాగముగలవారై మోక్షముగాంచిరని విష్ణుపురాణమునఁ జెప్పఁబడెను. శ్రీ భాగవతంబున బృందారణ్యమందలి కృష్ణునందలి యనురాగముచేఁ బశుపక్ష్యాదులు మోక్షముగాంచెనని చెప్పఁబడెను. కామముచే గోపికలు, భయముచేఁ గంసుఁడు, వైరముచే శిశుపాలుఁడు, ముక్తిగాంచిరని చెప్పఁబడెను. కావున ననన్యమనస్కుఁడై భగవంతునకై రాజ్యము ప్రాణము ధారవోసి యాయన సమక్షమందు నాయనపై దృష్టి మనస్సు నిలిపి ప్రాణమువిడిచి యాయనచే శాస్త్రవిహిత సంస్కారము పొందిన జటాయువునకే మోక్షములేదేని మఱి యెవరికిఁ గలదు? ఇట్లు చేసినవారి కెవరికైన శ్రీరామచంద్రమూర్తి మోక్ష మిచ్చునుగాని ప్రకృతిబద్ధులై కామదాసులై భక్తిశూన్యులైన యందఱకు మోక్ష మెట్లు కలుగును? ఏ మార్గముననైన మనస్సును భగవంతునందు నిలుపకున్న ముక్తిలేదు. మార్గము

ప్రధానము కాదు. జటాయువునకంటె నెక్కువత్యాగి యెవఁడు? కావున జటాయువునకు మోక్ష మిచ్చుట యుక్తమే. ఈ జటాయువునకు శ్రీరామచంద్రమూర్తి సంకల్పమాత్రముననే మోక్షమిచ్చుటచే శ్రీరామచంద్రమూర్తి మాయలో మునిఁగినాడనియు స్వరూపజ్ఞానము లేనివాఁ డయ్యెననియుఁ జెప్పెడివారి దుర్వాదము నిర్మూలితము.

౪౦. అని పులుఁగుఱేనిఁ జితపైఁ, దనిచి శిఖిం గొలిపి, రఘుకులోత్తముఁ డార్తిన్
దన చుట్టమువలె దహనం, బును బొనరించి రోహిమాంసమున బిండంబుల్.

తా. అని జటాయువును పాదపైఁ బెట్టి యగ్నిరగిల్చి రామచంద్రుఁడు శోకముతోఁ దన తండ్రికివలెనే నిప్పుపెట్టి జింకమాంసముతోఁ బిండములు చేసి;

తండ్రికివలెనే నిప్పుపెట్టి యనుటచే నౌరసుఁడు కొడుకు తండ్రిని దహించునపు డేమంత్రములు చెప్పునో యామంత్రములు చెప్పెనని భావము.

సీ. ఘటియించి లేఁబచ్చికను వాని నిర్చి ద్వి, జాతులు మానవ ప్రేతమునకు
స్వర్గసంప్రాప్తికై చదివెడు పైతృక, మంత్రంబులెల్ల స్మృతి జపించి
గోదావరిన రాచ కొమరు లిద్దఱుఁ దోఁగి, గృద్ధ్రరాజునకు నుదకంబు లీయ
మిగుల దుష్కరమును మేలి కీర్తికరంబు, కార్యంబు గావించి కదనమునను

ఆ. మృతిని గాంచియున్న గృధ్రరాజు మహర్షి, కల్పుఁడైనయవని కాంతుచేత
సంస్కరణముఁ గాంచి చనె శుభపుణ్యలోకముల కంతఁ బుణ్యకర్మనిధులు.

లేఁబచ్చికఁ = లేఁతపచ్చికమీఁద, ద్విజాతులు = బ్రాహ్మణులు, అనఁగా క్షత్రియుఁడగు రామచంద్రుఁడు కర్తగావున క్షత్రియోచితమైన మంత్రములు బ్రాహ్మణులు చదువునట్టులని చెప్పవలెను. దుష్కరమును కీర్తికరంబు కార్యంబుఁ గావించి యనుటచే నిష్కారణము క్తిప్రసంగము లేదు. మానవప్రేతమునకు = మనుష్యశవమునకు. ప్రేతశబ్దము శవమునకు, దేహము విడిచిపోయిన జీవునికిఁగూడ నన్వయించును. కొన్ని కార్యములు శవమునకై చేయవలయును. కొన్ని జీవునకై చేయవలయును. అవి రెండును చేసెనని భావము. నరకమునకుఁ బోవుజీవుఁడు కదా ప్రేత మనిపించుకొనును? జటాయు వట్టివాఁడుకాఁడే! కావున ప్రేతమునకుఁ జెప్పు మంత్రములు ముక్తుని కన్వయించునా యని సందేహము.

మనకు శాస్త్రము ప్రమాణము. ముక్తునకు సపిండాదులు నిషేధింపఁబడలేదు. ఒకఁడు ముక్తుఁడుకానీ కాకపోనీ, ఈ మంత్రమువలన వానికి లాభముండనీ లేకపోనీ, శాస్త్ర ప్రకారము కర్మమంతయుఁ జరుగవలసిందే. ముక్తుఁ డెవఁడో, ప్రేత మెవ్వఁడో, నిర్ణయింపఁగలవా రెవ్వరు? ఒకఁడు ముక్తుఁ డనుకొని కర్మహాని గావించినమీఁదట వాఁడు ముక్తుఁడు కాకుండినచోఁ ప్రేతమునకుఁ గర్తకుఁ గూడ హాని కలదు. జటాయువు ముక్తుఁడని రామునకుఁ దెలిసియుండియుఁ బ్రేత కార్యములు చేయుటచే నెట్టివానికైన యథావిధి ప్రేతకార్యములు జరుగవలయును. ఇంతకు

సీకర్మము పితృపూజ. కావున పూజాంగముల లోపము కారాదు. మోక్షప్రసక్తి శూద్రాదులకు పశుపక్ష్యాదులకుఁ గలదా? ముక్తిమార్గ మొక్కటియే యను నియమ మెట్లులేదో యొక్క జాతికే ముక్తి యనునియమము లేదు.

గీ॥ దనుజ భుజగ యక్ష ♦ దైత్య మృగాభీర, సుందరీవిహంగ ♦ శూద్రశబరు
లైనఁ బాపజీవు ♦ లైన ముక్తికిఁబోదు, రఖిలజగము విష్ణు ♦ డనుచుఁ దలఁచి.
—భాగవతము.

శ్లో॥ పశు ర్మనుష్యః పక్షీవా యేచ వైష్ణవ సంశ్రయాః ।
తేనైవ తే ప్రయాస్యంతి, తద్విష్ణోః పరమంపదమ్॥

ఇట్టిప్రమాణము లుండుటచే ముక్తి యొకరిసొత్తుగాదు. ప్రేమ సర్వజీవి సామాన్యము. పరమప్రేమయే ముక్తికి సాధనము. కావున నదిగలయేజీవియైనను ముక్తికి యోగ్యతగలదగును. ఆత్మలన్నియు సమానములు, ఏకాకారములు, సచ్చిదానందస్వరూపములు, సచ్చిదానందగుణకములు, కావున భేదములేదు. ప్రేమ ఆత్మగుణముగాని దేహగుణముకాదు. కావున నుపాధులైనదేహము లేవియైనను ప్రేమను బాధింపఁజాలవు. కావున పరమప్రేమగల యేయాత్మయైనను ఏయుపాధి యం దున్నను ముక్తికి యర్హమేయగును, లేదా పరిపూర్ణత్యాగమైన నుండ వలెను. అట్టిగుణము జటాయువునందుఁ గలదు. కావున నట్టిఫలము నొందుట వింత గాదు. సన్న్యాసులు బ్రహ్మలోకమునకుఁ బోయి, పరాంతకాల మందుండి బ్రహ్మ తోడ ముక్తులగుదురు. భక్తులు నూటిగాఁ బోవుదురు. మధ్యమార్గమున నిలువరు. ఇది భేదము.

తా. పిండములుచేసి, లేఁతపచ్చికమీఁద వాని నుంచి బ్రాహ్మణులు స్వర్గ సంప్రాప్తికై మనుష్యప్రేతముల నుద్దేశించి చదువుమంత్రములఁ జదివి గోదావరిలో నిరువురు స్నానముచేసి జటాయువునకు నీళ్లువిడివి చేయుటకు మిగుల నసాధ్యమై నదియు మిక్కిలికీర్తినిగలిగించునది యగుకార్యంబు గావించి యుద్ధమునందు (శస్త్రాస్త్రసంపన్నుఁడైన రామచంద్రమూర్తి రావణు నెట్లుపరిభవించెనో యట్లు జటాయువు నిరాయుధుఁడై బహుగ్గ పరిభవించెను. ఇది యసాధ్యము కీర్తికరము గాదా) మరణించియున్నగృధ్రరాజు మహర్షిసమానుఁడైన రామచంద్రునిచేత సంస్కారమునొంది పుణ్యలోకములకుఁ బోయెను. జటాయువును దహించి యామ్య సూక్త వైష్ణవసూక్తముల జపించి గోదావరిలో స్నానముచేసి తర్పణముచేసి రోహి మాంసమున పిండము లిచ్చి రని క్రమ మెఱుఁగునది. ఈకార్యము దుమ్మగూడె మున కెదురుగాఁ బడమటవైపున నుండుగుట్టయొద్ద జరిగెను. ఇచ్చట నొకయాక్షే పము—రామచంద్రమూర్తి యుత్తమక్షత్రియుఁడుకదా! తిర్యగ్జాతియైన పక్షికిఁ బైతృకకర్మము చేయవచ్చునా? జాతివివక్ష భక్తివిహీను లగువారియందే కాని పరమభక్తిపరులందు గాదు. కావున "నశూద్రా భగవద్భక్తా, విప్రాః భాగవతా

స్మృతాః, సర్వవర్ణేషు తే శూద్రా, యేహ్యభక్తా జనార్దనే." విష్ణుభక్తి గలవాఁడు శూద్రుఁడనఁబడఁడు. వాఁడు విప్రుఁడు, భాగవతుఁడు అని చెప్పబడును. అన్ని వర్ణములయందు విష్ణుభక్తి లేనివాఁడు శూద్రుఁడని యుండుటచే నిచ్చట జాతివివక్ష కారాదు. ఈవచనము "అపశ్శోవా అన్యేగో అశ్వేభ్యః" లోనగువానివలె ప్రశంసాపర మనరాదు. ఏలన నున్నదున్నట్లు గ్రహించుటవలనఁ గలుగుబాధలేదు. మఱియు బ్రాహ్మణత్వము మొదలయినజాతులు శాస్త్రమువలనఁ దెలియఁదగినవే కాని గోవులవలె రూపముచేఁ దెలియఁదగినవి కావు. గోత్వాదులవలెఁ దెలియ సాధ్యమగునేని వానితో సమానముగా శంకింపవచ్చును. ఈ కారణముచేతనే విశ్వామిత్రునికి క్షత్రియత్వము తొలగించి బ్రాహ్మణత్వము కలిగింపఁబడిన దని బాలకాండమునఁ గలదు. ఈయర్థము శబరీవృత్తాంతమందును జెప్పఁబడును. మఱియు నిది ద్రౌపదీవివాహమువలె నితిహాసనంబంధమైన యొకానొక వ్యక్తివిశేషమునకు మాత్రము చెల్లునని చెప్పనవకాశములేదు.—గోవిందరాజీయము.

ఓయీ! మృతు లయినవారికిఁ బుత్రులో జ్ఞాతులో ప్రేతకార్యములు చేయవలయును గాని యితరులు చేయవచ్చునా?

> శ్రాద్ధేన పరదత్తేన గతః ప్రేతోపి సద్గతిమ్ ।
> కిం పునః పుత్రదత్తేన పితా యాతీతి చాద్భుతమ్॥ గరుడపురాణము, 7-64.

మరణించినవానికిఁ బరులు శ్రాద్ధము పెట్టినంతనే ప్రేతత్వము పోయి సద్గతి లభించును. ఇఁక పుత్రులు పెట్టిన శ్రాద్ధముచేఁ దండ్రులకుఁ బరలోకము వచ్చుట చెప్పనేల?

> ప్రేతస్యపుత్రో దాహాది దద్యాదే వౌరస స్సుతః ।
> బహుత్వేతు గుణీ దద్యాత్, సామ్యేతు జ్యేష్ఠఏవతు॥

మరణించినవానికి దహనాదికర్మములు ఔరసుఁడే చేయవలయును. అట్లు తానకన్నకొడుకు లెక్కువమంది యుండిరా వారిలో గుణవంతుఁడు చేయవలెను. అందఱు గుణవంతులేయైరా, వారిలోఁ బెద్దవాఁడు (వయస్సుచేఁగాని సవర్ణస్త్రీయగు పెద్దభార్యకుఁ బుట్టినవాఁడుగాని) చేయవలెను.

> పుత్రాణాం మధ్యమో వాపి కనిష్ఠో జ్యేష్ఠ ఏవవా ।
> పితుర్యస్తు ప్రియతమః సర్వం తేనైవ కారయేత్ ॥

కొడుకులందు నడిమివాఁడుగాని, కడపటివాఁడుగాని, పెద్దవాఁడుగాని తండ్రికెవఁడు ప్రియుఁడో వాఁడే యన్నికార్యములు చేయవలెను.

> పుత్రా స్సర్వే పితుర్ద్విష్టాః, పత్నీ భ్రాతా సఖాపివా ।
> అగ్నిదాహాది కర్మాణి కుర్యుః పుత్రాదయః పితుః॥ వైద్యనాథీయము.

అందఱు కొడుకులు తండ్రికిష్టులు గారేని మరణించినవాని భార్యయో,

సోదరుఁడో, స్నేహితుఁడో, పుత్రికలో, శిష్యులు మొదలైనవారో దహనాదికార్యములు చేయవచ్చును.

ఎవరు చేయలేని యీదేశపు రాజైనఁ జేయవచ్చును. కావున రామచంద్రమూర్తి చేసినది యుక్తకార్యముగాదు.

క౦. మన సెల్ల నతనిపై నిడి, మనమునఁ దద్వాక్యములను ♦ స్మరియించుచు భూ
తనయాధిగమనవాంఛను, వనసీమం జనిరి విష్ణు ♦ వాసవులక్రియన్. ౧౧౭౯

తా. ఇట్లు వారు కర్మము నిర్వర్తించి జటాయువుపై మనస్సుంచి సీతాదేవి మరల నీకు లభించునని యతఁడు చెప్పిన మాటయందు విశ్వాసముంచి సీతాదేవిని బొందు కోరికతో నింద్రోపేంద్రులవలె నడవులజాడఁ బట్టుకొని పోయిరి.

—♦ ౬౯-వ సర్గము. లక్ష్మణుఁ డయోముఖిని విరూపఁ జేయుట. ♦—

చ. పడమరదక్షిణంబుగను ♦ భార్గవపుత్రకు లేగి కొంత యా
యడవికి మూఁడుక్రోసుల మ ♦ హాటవిఁ గ్రౌంచముఁ జొచ్చి యందుఁ దా
రెడ నెడ మార్గఖేదమున ♦ వృక్షముసీడలఁ గూరుచుండుచున్
బడఁతుక రోయుచుం జనిరి ♦ వ్యాళమృగాండజబంధురాటవిన్. ౧౧౮౦

పడమరదక్షిణంబుగను = నైరృతిమూలగ, ఎడనెడన్ = నడుమనడుమ, మార్గఖేదమునన్ = దారినడచుటవలనఁ గలిగిన బడలికచే — ఇట్లు చెప్పుటచే దీర్ఘప్రయాణము చేసినట్లు తోఁచెడిని. వ్యాళ = సర్పములచేతను, మృగ = జంతువులచేతను, అండజ = పక్షులచేతను, బంధుర = నిండిన-దట్టమైన, అటవిన్ = అడవియందు.

తా. ఆ రాజకుమారు లిరువురు నైరృతిమూలగ కొంతదూరము పోయి యా యడవికి మూఁడుక్రోసులదూరమున నున్న క్రౌంచారణ్యమునఁ బ్రవేశించి యందు దారినడచిన బడలికదీఱ నడుమ నడుమ చెట్లనీడలఁ గూరుచుండుచు, సర్పములు మృగములు పక్షులు విశేషముగాఁ గల యా యడవియందు సీతను వెదకుచుఁ బోయిరి.

ఉ. దానిని దాఁటి తూర్పుగ మ ♦ రింతగ నంబున మూఁడుక్రోసులన్
బోన రసాతలాభ మయి ♦ ఘోరమృగంబయి శాశ్వతాంధ మా
దానిని డాయఁ బోవ నలఁతి ♦ దవ్వున భీకరదైత్య తీక్ష్ణదం
ష్ట్రానన ముక్తమూర్ధజ మృ ♦ గాదన లంబచిపిండ వారలన్. ౧౧౮౧

రసాతలాభము = పాతాళముతో సమానమయి, శాశ్వతాంధము = సూర్యరశ్మి ప్రవేశింపకుండుటచే నెడఁదెగని చీఁకటిగలదై, అలఁతిదవ్వునన్ = కొంచెము దూరమునందు, భీకరదైత్య = భయముకలిగించు రాక్షసి, తీక్ష్ణదంష్ట్రానన = వాడి కోఱలుగల నోరుగలది, ముక్తమూర్ధజ = విరియఁబోసికొనిన తలవెండ్రుకలు గలది, మృగాదన = మృగములఁదినునది, లంబచిపిండ = వ్రేలాడు పొట్టగలది.

తా. ఆ క్రౌంచారణ్యము దాఁటి తూర్పుగఁ బోయి, మతంగ వనంబునందు మూఁడుక్రోసులదూరమున పాతాళమువలెనై మిగుల భయంకరమై శాశ్వతమైన గాఢాంధకారముగల యొకకోనను సమీపింపఁగాఁ గొంచెము దూరమునందే భయంకరరాక్షసి వాఁడికోఱలు గలదై తలవెండ్రుకలు విరియఁబోసికొని మృగములఁ దినుచు వ్రేలాడు పొట్టగలది.

చ. కనుగొని చేర వచ్చి మును♦గాఁ జనులక్ష్మణు నాఁగి కేల నా
తని బిగిఁగాఁగిలించి తమి ♦ దానవి యిట్లను నీకుఁ బెండ్లమా
దును జనుదెమ్ము యాడుకొనఁ ♦ దూర్ణమజీవితకాల మంతయుఁ
వనతటినీతటాళిఁ; బ్రియ♦నాథ! యయోముఖి యందు రన్నుల్.　　౧౧౮ ౨

ఆఁగి=నిలిపి, బిగిఁ = గట్టిగా, తూర్ణము = వేగముగ, వనతటినీతటాళిఁ = అడవి ప్రదేశములందు, ఏటియొడ్డులందు.

తా. వారల నడ్డగించి వారిలో ముందుపోవుచున్న లక్ష్మణు నిలిపి చేతులతో నాయనను గట్టిగాఁ గౌగిలించి మోహముతో నారాక్షసి యిట్లనియె 'ప్రియనాథ! నీకు నే బెండ్లము నయ్యెదను. మనము బ్రతికినంతకాలము మాడవులందు నేళ్ళయొడ్డులందు నాడుకొందము. త్వరగా రమ్ము పోదము నా పేరయోముఖి యందురు.' అయోముఖికి హయముఖి యని పాఠాంతరమున గలదు.

కం అనుడు సుమిత్రాపుత్రుఁడు, కనలున ఖడ్గంబు దూసి ♦ క్షణమున ముక్కుం
జనులుఁ వీనులు నఱకిన, ననితయు మొత్తూఁడు చరిగె♦ వచ్చిన త్రోవన్.

కనలునన్ = కోపముచే, వీనులు = చెవులు.

తా. అని చెప్పఁగా లక్ష్మణుఁడు కోపించి కత్తిదూసి దాని ముక్కు చెవులు చన్నులు కఱుక్కున నఱకఁగా నది మొత్తో యని మొత్తుకొనుచు వచ్చినదోవఁ బట్టుకొనిపోయెను.

కం. అది చనఁ జనుచో గహ్వర, పదమున సోదరులు రాముఁ ♦ బలికెం దమ్ముం
డెద చెదరె నెడమ బాహువు నదరెడి నశుభంబు గలుగు ♦ నని తోఁచె జుమీ.

తా. అది వెడలిపోఁగాఁ దమదోవనఁ దా మాయడవియందుఁ బోవు సమయంబున రామచంద్రమూర్తితో లక్ష్మణుఁ డిట్లనియె-'అన్నా! గుండె చెదరెను. ఎడమభుజ మదరుచున్నది. ఏదియో కీడు కలుగునని తోఁచుచున్నది సుమా!

కం. అన్నా! నావలుకులు విని, సన్నాహంబున నుండు ♦ సంకట మొదొ రా
నున్నది వంచులకము మన, కు న్నిశ్చయజయముఁ దెల్పఁ ♦ గూసెడి వింటే.

సన్నాహంబునను=యుద్ధప్రయత్నమున, వంచులకము=ఒకానొక పక్షి పేరు, నిశ్చయజయము=జయము నిశ్చయమని, శూర్పణఖవలె నీ యయోముఖి యెవరినో రాక్షసులను బిలుచుకొని వచ్చునని సందేహము.

తా. అన్నా! నామాట విను. మనకేదో నష్టము రాఁబోవుచున్నది. యుద్ధ

ప్రయత్నమున నుండుము. కష్టమువచ్చినను మనకు నిజముగా జయము కలుగునని యీ పంచులకము కూఁతవలనఁ దెలియుచున్నది.

చ. అని నిటు వార లిర్వురు వ•నాంతరవీథుల రోయుచుం జనన్
ఘనతరనిస్వనంబు వన•కాండ విదారణదక్షమై నభం
బును నిబిరీసవాతపరి•పూరితముం బచరించి వీచినన్
విని యిది యేమటంచు నట•వీస్థలి రోయుచుఁ గాంచి రొక్కెడన్. ౧౧౮౬

ఘనతరనిస్వనంబు = మిగుల గొప్పధ్వని, వనకాండ = వనసమూహములను, విదారణదక్షమై = చీల్చు సామర్థ్యముగలదై, నభంబును = ఆకాశమును, నిబిరీస = దట్టమైన, వాత = గాలిచే, పరిపూరితంబు = నిండినది, పచరించి = చేసి, అటవీస్థలిన్ = అడవియందు

తా. అని లక్ష్మణుఁడు చెప్పఁగా వార లిద్దఱు నడవులలో వెదకుచుఁ బోవుచుండఁగా నా యడవియందు నాకాశమును పెద్దగాలిచే నించి యడవిని చీల్చునట్టి పెద్దధ్వని వినవచ్చెను. అదివిని యేమి యిదియని యడవియందు వెదకుచుండగా నొకచోట.

—• రామలక్ష్మణులు కబంధునిచేఁ జిక్కుట •—

మ. గిరిసంకాశుని భూరివక్షుని శిరో•గ్రీవావిహీనున్ మహా
ఖరరోమావృతు నీలమేఘనిభు మే•ఘస్ఫూర్జదుర్ఘోషు భీ
కరవక్షస్స్థలలాట దేశగపిశం•గస్ఫార పక్ష్మాయతా
గ్నిరుచిస్ఫీతశుభేతరైకనయను•న్దీవ్యన్మహాదంష్ట్రినిన్. ౧౧౮౭

గిరిసంకాశునిన్ = కొండవంటివానిని, భూరివక్షుని = పెద్దఱొమ్ముగలవానిని, శిరోగ్రీవావిహీనునిన్ = శిరస్సు మెడ లేనివానిని, మహాఖరరోమావృతున్ = మిగుల బిఱుసైన వెండ్రుకలచేఁ గప్పఁబడినవానిని, నీలమేఘనిభున్ = నల్లని మబ్బుతో సమానమైనవానిని, మేఘస్ఫూర్జదుర్ఘోషున్ = మేఘధ్వనివలె పెద్దధ్వనిఁ జేయువానిని, భీకర = భయంకరమైన, వక్షస్స = ఱొమ్మునందుండు, లలాటదేశ = నొసటియందలి, పిశంగ = పచ్చవర్ణముచే, స్ఫార = ప్రకాశించు, పక్ష్మ = ఱెప్పలుకలదై, ఆయత = నిడుపైన, అగ్నిరుచి = అగ్నివంటి కాంతిచే, స్ఫీత = ఎక్కువైనదియు, శుభేతర = అశుభమైన, ఏకనయనున్ = ఒంటికన్ను గలవానిని, "ఉరమున రెండుకన్నులు" అను భాస్కరుని వాక్యమునకు నాధారము గానరాదు, దీవ్యత్ + మహాదంష్ట్రినిన్ = ప్రకాశించు పెద్ద కోఱలు గలవానిని.

తా. పర్వతమువలెఁ బెద్దదేహము గలవానిని, పెద్దఱొమ్ముగలవానిని, తల మెడలేనివానిని, బిఱుసువెండ్రుకలు గలవానిని, నల్లనిమబ్బువంటివానిని, ఉఱుమువంటి ధ్వనిగలవానిని, ఱొమ్మునఁగల నొసటియందు పచ్చనివన్నె గలిగి నిప్పులవలెనుండు పెద్దకన్ను నొకటిగలవానిని, పెద్దకోఱలు గలవానిని.

మ. అటవీసత్త్వమృగద్విపాదికవికర్షాకర్షఖేలాప్రలం
పటునిన్ యోజనదీర్ఘబాహుయుగళున్ మార్గస్థితున్ భీముఁ బ్ర
స్ఫుటఘోరాస్యుఁ గబంధుఁ గాంచి తటిత్తుం బోవంగ నా దైత్యుఁడున్
బటుదోర్దర్ప మెలర్ప నాయిరువురన్ బాహాయుగిం బట్టినన్. ౧౧౮

అటవీసత్త్వ = అడవి జంతువులగు జింకలను ఏనుఁగులు మొదలగువానిని, వికర్ష = వదలుట, ఆకర్ష = లాగుకొనుటయనెడి, ఖేలాప్రలంపటునిన్ = ఆటయందు నభిలాషగలవానిని, యోజనదీర్ఘబాహుయుగళున్ = యోజనము పొడవియగు రెండు చేతులు గలవానిని, మార్గస్థితున్ = తమత్రోవ కడ్డముగా నుండువానిని, భీమున్ = చూచువారికి భయము కలిగించువానిని, ప్రస్ఫుటఘోరాస్యున్ = తెఱచిన భయంకరమైన నోరుగలవానిని, కబంధున్ = మొండెము గలవానిన్, బాహాయుగిన్ = రెండుచేతుల.

తా. జింకలు, ఏనుఁగులు మొదలగు నడవిమృగములను విడుచుట లాగుట యనునాటయందు నాసక్తుఁడగువానిని, యోజనము పొడవు చేతులు గలవానిని, తమ త్రోవలో నుండువానిని, నోరు తెఱచికొనియుండువానిని, కబంధుని సమీపింపఁగా నా రాక్షసుఁడు తన భుజబలము పెంపున రెండుచేతులతో వారిని బట్టుకొనెను.

కం. ఖరకర తేజోయుతతను, ధరులు భయంకరశరాసధరులు కృపాణీ
కరులు మహాబలు లిద్దఱు, పరుచేతికిఁ జిక్కి కీడుపడి రవ్వేళన్. ౧౧౯

ఖరకరతేజోయుత=సూర్యుని తేజస్సువంటి తేజస్సుతోఁగూడిన, తనుధరులు=దేహములు ధరించినవారు, భయంకరశరాసధరులు=భయంకరములైన విండ్లను ధరించినవారు, కృపాణీకరులు=చేతఁగత్తులుగలవారు, మహాబలులు = విశేషబలము గలవారు, పరుచేతికిన్ = శత్రువునిచేతికి.

తా. సూర్యుని తేజస్సువంటి తేజముగల దేహముగలవారు, పెద్దవిండ్లను ధరించినవారు, చేతఁ గత్తులుగలవారు, మహాబలము గలవారయ్యును నాసమయమున వారిద్దఱు శత్రువులచేతఁ జిక్కి యాపదపడినవారైరి.

కం. ధీరుఁడు శూరుఁడు రాముఁడు, ధీరతఁ గోల్పడఁడ విగతధృతి తమ్ముఁడు కౌ
మారమున ధైర్య మూనమి, చే రామునితో విషణ్ణచిత్తుం డగుచున్. ౧౨౦

కోల్పడఁడు = పోగొట్టుకొనినవాఁడు కాఁడు, విగతధృతి = ధైర్యముపోయినవాఁడు, కౌమారమునన్ = బాల్యముచేత, విషణ్ణచిత్తుండు = వ్యసనముతోఁ గూడిన మనస్సుగలవాఁడు. రాముఁడుకూడఁ జిక్కుపడుటచే ధైర్యము చెడె నని భావము.

తా. రామచంద్రమూర్తి ధైర్యముగలవాఁడు, పరాక్రమముగలవాఁడు. కావున ధైర్యము వదలినవాఁడు కాఁడు. లక్ష్మణుఁడు చిన్నవాఁడు, ధైర్యము చాలనివాఁడు. కావున వ్యసనపడుచు నన్నతో నిట్లనెను.

వయస్సుపట్టిచూచిన రామచంద్రమూర్తికంటె లక్ష్మణుఁడు రెండు దినములు

చిన్నవాఁడు. ఇంతభేదము వయస్సునుబట్టి వచ్చినదికాదు. పాయసపరిమాణమునుబట్టి వచ్చినది కావున రామచంద్రమూర్తిలో సగమువాఁడే లక్ష్మణుఁడు. ఆ కారణముచే లక్ష్మణుఁడు కుమారుఁ డనఁబడెనుగాని వయస్సుచేఁగాదు.

శా. అన్నా! నాగతిఁ గంటె చిక్కితిని దేవారాతిచే వీనివా
తన్నన్నుం బడ వీడి వర్తిడుము దూరద వ్వీవయే నెట్టులేఁ
జెన్నారన్ సతిఁ గాంచనేర్తు వని తోఁచెన్, రాజ్యలక్ష్మీ సుసం
పన్నత్వంబునఁ గ్రాలువేళ నను మర్వం బోకుమీ యెన్నఁడున్. ౧౧౯౧

దేవారాతిచేన్ = రాక్షసునిచేత, వాతన్=నోట, రాజ్యలక్ష్మీసుసంపన్నత్వంబున = రాజైశ్వర్యము పూర్ణముగా ననుభవించునపుడు.

తా. అన్నా! నాగతి చూచితివా? రాక్షసునిచేతఁ జిక్కితిని. వీనినోటం బడునట్లు నన్ను వదలి నీవైనను దూరముగాఁ బరువెత్తుము. ఇరువురిలో నొకరు బ్రదికినను మేలేకదా! ఏవిధముగానైన నీవు నీభార్యను గలిసికొనఁజాలుదువని తోఁచుచున్నది. కాఁబట్టి నేను నిన్నొకటి ప్రార్థించెదను. నీవు రాజవై రాజ్యసంపద పూర్ణముగా ననుభవించువేళ నన్ను మఱచిపోకుము. జటాయువువలె లక్ష్మణుఁడును రామునకై ప్రాణము గోలుపోయి సేవసేయఁగోరెను.

కం. అని సౌమిత్రి వచించిన, విని రాముఁడు నీవు నిట్టివిధమున వగవన్
జనునే యనుచుండఁగ నద్దనుజుఁడు వారలకు ననియెదారుణ ఫణితిన్. ౧౧౯౨

తా. అని లక్ష్మణుఁడు చెప్పఁగా విని రామచంద్రమూర్తి లక్ష్మణా! నీవు గూడఁ బిఱికివానివలెఁ బామరునివలె వ్యసనపడవచ్చునా! ఇప్పుడేమి మించిపోయినదని చెప్పుచుండఁగా నారాక్షసుఁడు భయంకరమైన విధముగ నిట్లనెను.

ఉ. ఎవ్వరు మీరు? చాపనిశితేష్వసు లూని విషాణులట్లు లి
ట్లివ్వని నేల క్రుమ్మరెద రెంతయు నాఁకొను నాదునోటిలో
నివ్విధిఁ గూల నేమిటికి నిచ్చటికిం జనుదెంచినారు? మీ
కెవ్వలనన్ మనంగ వశమే యిఁక, నిండెను నూఱు వర్షముల్. ౧౧౯౩

చాపనిశిత + ఇషు + అసులు = విల్లు, వాఁడిబాణములు, కత్తులు, విషాణులట్లులు=కొమ్ములుగల యెద్దులవలె, ఆఁకొను=ఆఁకలిగొనిన, ఎవ్వలనన్=ఏయుపాయముచేనైనను, మనంగన్ = బ్రతుకుటకు.

తా. మీరెవ్వరు? విండ్లు, బాణములు, కత్తులు ధరించి వాఁడికొమ్ముల కోడెలవలెఁ దిరుగుచున్నారు. ఆఁకలిగొనిన నా నోటిలోఁ బడుటకై యింత దూరమేల వచ్చితిరి? నాబారిఁబడి మీరేయుపాయముచేనైనను బ్రదుకఁజాలరు. మీకు నూఱు వర్షములు నేఁటితో ముగిసెను.

కం. అని క్రొవ్వడర వచించెడి, దనుజుని పలుకాలకించి తమ్మునితో భూ
తనయావల్లభుఁ డను నో, మున వెల్లఁదనంబుదోఁప మునుకొను వగచేన్.

క్రొవ్వడరన్ = గర్వమతిశయింపఁగా, వెల్లఁదనంబు = తెలుపు.

తా. అని గర్వించి పలుకుచున్న రాక్షసునిమాట విని లక్ష్మణునితో రామచంద్రమూర్తి మోము వెలవెలఁబోఁగా వ్యసనము ముంచుచుండఁ దమ్మునితో నిట్లనియె.

కం. కష్టంబు మీఁదఁ గష్ట ము,నిష్టంబుగ దావరించి ♦ యిటు మనుగడకే
రిష్టంబు గూర్చె వ్యసనం, బిష్టాంగన లభ్యపడక ♦ యే పోయెఁ గదా. ౧౯౫

అనిష్టంబుగన్ = దుఃఖకరముగ, మనుగడకే = బ్రతుకుపాటునకే, రిష్టంబు = అశుభము, ఇష్టాంగన = ప్రియురాలు.

తా. దుఃఖకరముగఁ గష్టముమీఁదఁ గష్టము కలుగుచుఁ దుదకు మనకు బ్రతుకునకే ముప్పువచ్చెను. ప్రియురాలు లభింపకయే పోయెను. భార్యను బోఁగొట్టుకొని మరల రాఁబట్టుకొనకయే రాముఁడడవిలోఁ జచ్చెనను నపకీర్తి వచ్చెను. అట్లు ప్రియురాలిని కష్టమునుండి తప్పించినవాఁడను గాకపోయితిని. ఆ కార్యమైయుండిన మరణభయము లేదు.

కం. అన్నన్న ! కాలశౌర్యం బెన్నఁటి నవ్యాహతంబొ ♦ యెఱిఁగితె భూమ్యు
త్పన్నప్రాణులపై నిను, నన్నున్ దుఃఖములచేత ♦ నవయఁగఁ జేసెన్. ౧౯౬

అవ్యాహతంబొ = ఎదురులేనిదో, భూమ్యుత్పన్నప్రాణులపై = భూమియందుఁ బుట్టిన భూతములమీఁద, మనుష్యవేషములు ధరించినంతమాత్రమున మనకే యిన్నికష్టములు వచ్చుచున్నవే. యిఁకఁ గర్మబద్ధులై పుట్టినవారి గతి యేమియను భావము. నవయఁగన్ = కృశింపఁగ, అన్నన్న-ఆశ్చర్యార్థకము.

తా. ఔరౌర ! ఏమి యీ యాశ్చర్యము ! భూమిమీఁదఁ బుట్టిన ప్రాణులపైఁ గాల మెంతశౌర్యముగలదో చూచితివా ! నిన్ను నన్నుఁగూడ దుఃఖములచేఁ గృశింపఁజేసెను. మనగతియే యిట్లులయినపుడు కాలమున వశపడక తప్పించుకొన నెవనికి సాధ్యము ?

చ. గురుతరధైర్యవంతులు న♦కూటబలుల్ కృతహస్తు లాజి దు
ర్ధరవరతేజు లయ్యు సిక ♦ తామయసేతువుపోలె బీఱుపో
దురు సుమి కాలమో యనఘ ♦ తోడ్పడ కెంతయుఁ దప్పివచ్చినన్;
బరఁగున దుష్కరం బగుచుఁ ♦ బ్రాణుల దైవము చంపఁ జూచినన్. ౧౯౭

గురుతరధైర్యవంతులు = మిక్కిలి గొప్ప ధైర్యముగలవారు, అకూటబలుల్ = వంచనలేని బలముగలవారు, ఆజిన్ = యుద్ధమందు, దుర్ధరతేజులు = శత్రువులకు సహింపరాని తేజముగలవారు, కృతహస్తులు = గురితప్పక కొట్టువారు, సికతామయసేతువు = ఇసుకతో నేర్పఱచిన యనకట్ట, బీఱుపోదురు = దుర్బలులగుదురు.

తా. ఎంత గొప్పధైర్యము కలవారు, సత్యపరాక్రమములు, లక్ష్యసిద్ధి గల

వారు, యుద్ధములందు శత్రువులకు సహింపరాని తేజముగలవారైనను కాల మనుకూలింపక ప్రతికూలించి వచ్చెనేని యిసుకకట్ట యల్ప ప్రవాహమునకే యురువు లేక పోవునట్లు నిర్వీర్యులయి బెండుపడిపోదురు. దైవము ప్రాణులఁ జంపఁ దలఁచిన నసాధ్యమేది కలదు? విధి కసాధ్యము కలదా?

దీనికి దృష్టాంత మర్జునుఁడే. యాదవస్త్రీలను రక్షింపలేక బోయలపాలు చేసి యేడ్చుచు వ్యాసులయొద్దకుఁ బోఁగా "కం. బలమును బుద్ధియుఁ జేవయు, నలఘుమతీ యల్లసిల్లు నగుకాలమునన్ । బొలియుం గాలవిపర్యయ కలనంబున బుధుల కుబ్బు కలఁకయుఁ గలదే." మానల.

రామాయణమున నేర్చుకొనవలసిన నీతులలో ముఖ్యమైన దిదియే. "ఏరికి బుద్ధిబలంబులు, గారణములు గావు చూడ కలరె ధరిత్రిన్ । నేరిచి బ్రతికినవారలు, నేరక చెడ్డట్టివారు నీరజనేత్రా." యన్నట్లు మన సామర్థ్యముచే నొకకార్యము చేసితి మనియు మనయసామర్థ్యముచే నొకటి చేయఁజాలమైతిమనియుఁ దలఁచుట కేవలము మతితక్కువ కార్యము.

అహంకార విమూఢాత్మా కర్తాహమితి మన్యతే॥- భగవద్గీత. అహంకారముచే బుద్ధిలేనివాఁడు నే నీ కార్యము చేసితి ననుకొనును.

—♦ ౭౦-వ సర్గము. రామలక్ష్మణులు కబంధుని బాహువుల నఱకుట ♦—

కం. అని తనమది దిటవఱుచుచు, నినవంశవరేణ్యుఁ డుండ ♦ నిట్లనుఁ బలలా
శనుఁడు ననుఁ జూచి నివ్వెఱఁ, గననేటికి మిమ్ము నోటి♦కడి విధిచేసెన్. ౧౯౮

దిటవఱుచుచున్ = దృఢముచేయుచు, తనమదిన్ = లక్ష్మణుని మనస్సును, నివ్వెఱ—నిండు + వెఱ = పూర్ణభయము, కడి = కబళము, విధి = బ్రహ్మ.

తా. అని లక్ష్మణుని మనస్సునుగట్టిపఱచు రామచంద్రునిఁ జూచి రాక్షసుఁ డిట్లనెను. నన్నుఁ జూచి మీరేల యింత భయపడెదరు, మిమ్ము నా నోటిముద్ద యగునట్లు బ్రహ్మ చేసెను.

ఉ. ఈగతి సోకుఁ డాడఁగ న♦హీనపరాక్రముఁ డుగ్రవిక్రమో
ద్యోగముమై నిజాగ్రజుని♦తో నను లక్ష్మణుఁ డింక వీఁడు బ
ల్యోగమ నిన్ను నన్ను బలి♦పెట్టకమున్న శితాసిధార ర
క్షోగురుబాహుయుగ్మమును♦గూల్చుట మేలు వధింపరామిచేన్. ౧౯౯

సోఁకుఁడు = రాక్షసుఁడు, విక్రమోద్యోగముమైన్ = పరాక్రమముతోడి ప్రయత్నముతో, నిజ + అగ్రజునితోన్ = తనయన్నతో, బలిపెట్టక = చంపక, శితాసిధారన్ = వాఁడిగలకత్తివాదరచే, రక్షో = రాక్షసుని, గురుబాహుయుగ్మమును = పెద్దచేతులరెంటిని, వధింపరామిచేన్ = చంపరాకుండుటచే, తలయుండిన నఱికినఁ జచ్చును. తలలేనివానిఁ జంపు టెట్లు? ఇదియునుగాక చంపరామికి గారణము ౧౨౦౧ వ పద్యమున లక్ష్మణుఁడే చెప్పుచున్నాఁడు.

కం. వీఁడు మహాబలముం గల, వాఁ డెంతయు భీమమైన♦వపువుఁగలాఁడున్
దూఁడరి మనలన్ మ్రింగెడు, వాఁడిమిఁ జగమెల్ల గెలిచి ♦ వర్తిలుచుంటన్. ౧౨౦౦

వపువు = శరీరము, తూఁడరి = దుష్టుఁడు. రూ. తూఁటరి, వాఁడిమిన్ = శౌర్యముచే.

తా. వీఁడు మహాబలము, భయంకరదేహము గల దుష్టుఁడు. పరాక్రమముచేఁ బ్రపంచము నంతయు గెలుచువాఁడు కావున మనలను మ్రింగును గాని వదలఁడు.

కం. ప్రతికార శక్తిహీనుల, మృతిఁ గూర్చుట పాడిగాదు ♦ నృపవర్యులకున్
గ్రతుమధ్యానీతముఁ బశు,తతిఁ గూల్చినభంగిఁ గుత్సి♦తంబు మహాత్మా. ౧౨౦౧

ప్రతికారశక్తిహీనులన్ = ఎదిరించి యుద్ధముచేయ శక్తిలేనివారిని, క్రతుమధ్యానీతము = యజ్ఞకాలమున నడుమఁ దీసికొనిరాఁబడినది-(౧) ఆదినుండి యజ్ఞాంగముగా గ్రహింపఁబడి సంస్కరింపక నడుమఁ దేఁబడినది. (౨) యజ్ఞము నిమిత్తమై యాగశాలకు దేఁబడి యెదిరించి యేమియుఁ జేయఁజాలనిది. ఈ కారణముచేతనే ప్రతికార శక్తిహీన మని చెప్పఁబడెను. (౩) 'పర్యగ్ని కృతా నారణ్యానుత్సృజంత్యహింసాయై' యన్నట్లు అశ్వమేధయాగమునందుఁ దేఁబడిన యరణ్యపశువులను జంపక విడువవలయును. వానిని జంపుట నీచకార్యము. (౪) యజ్ఞప్రదేశమునుండి యీవలఁ దేఁబడినది యూపస్తంభమునొద్దఁ దప్ప నితరప్రదేశముల జంతుహింస చేయరాదు.

తా. మహాత్మా! రాజులగువారికిఁ దమ్మును దాము కాపాడుకొనలేక యెదిరించి యుద్ధముచేయలేక యుండువారిని యజ్ఞమధ్యమునఁ దేఁబడిన పశువుల హింసించుటవలె నీచకార్యము. అది న్యాయ్యముగాదు.

కం. అను లక్ష్మణువాక్యంబులు, విని దనుజుఁడు వారి వాత ♦ వేసికొనంగన్
గను నింతలోన నానృప, తనయమణుల్ దేశకాల ♦ తత్త్వవిధిజ్ఞుల్. ౧౨౦౨

దేశకాల తత్త్వవిధిజ్ఞుల్ = ఏ ప్రదేశమున నేకాలమున నేకార్య మెట్లు చేయవలయునో శాస్త్రప్రకారము దాని వాస్తవార్థము తెలిసినవారు.

తా. లక్ష్మణుఁడు చెప్పినమాటలు విని యారాక్షసుఁడు వారిని నోట వేసికొన నాలోచించులోపలనే దేశము కాలము వీనితత్త్వము దెలిసి పనిచేయువారు.

కం. రాముఁడు దక్షిణబాహువు, సౌమిత్రియు సవ్యభుజముఁ ♦ జటులాసిహతిన్
భీమగతి నఱక వాఁడును, భూమిం బడె దిగ్ధరాది♦వుల్ ధ్వని నిండన్. ౧౨౦౩

దక్షిణబాహువు = కుడిచేయి, సవ్యభుజము = ఎడమచేయి, చటులాసిహతిన్ = తళుక్కని మెఱసి మెఱుపుదీఁగవలెఁ జలించుకత్తిచే, రాముని కుడిచేయి లక్ష్మణుఁ డన్నట్లు రామునకుఁ గుడిప్రక్క లక్ష్మణుఁ డుండినవాఁడు కావున వారి కట్లుచేయ నను కూలపడెను. దిక్ + ధరా + దివుల్ = దిక్కులు, భూమి, ఆకాశము.

తా. రామచంద్రమూర్తి కుడిచేతిని నఱికెను. ఆయనకుఁ గుడిప్రక్కన నున్నవాఁడగుటచే కత్తిదెబ్బచే లక్ష్మణుఁ డెడమచేతిని నఱికెను. ఇట్లు నఱకఁగా వాఁడు భూమి, ఆకాశము, దిక్కులు ధ్వనిచే నిండునట్లు నేలఁబడెను.

—♦ లక్ష్మణుఁడు కబంధునకుఁ దమవృత్తాంతముఁ జెప్పుట ♦—

కం. దీనుండై దోర్యుగళవి,హీనుండై దనుజవర్యుఁ ♦ డెవ్వరు మీరల్
గానఁ బని యేమి యనఁగా, వానికి లక్ష్మణుఁడు పలికె♦స్వచరితమెల్లన్. ౧_౨౦౮

దోర్యుగళవిహీనుండై = రెండుచేతులు లేనివాఁడై.

తా. దుఃఖముతోఁ గూడినవాఁడై, రెండుచేతులు లేనివాఁడై యారాక్షసుఁడు మీరెవ్వరు ? ఈ యడవియందు మీకేమిపని ? యని యడుగఁగా లక్ష్మణుఁడు తమ చరిత్రము నిట్లు చెప్పెను.

సీ. ఇక్ష్వాకువంశభ♦వేంద్రుఁ డీయనఘుండు, రాముఁ డటందురు ♦ ప్రజలు దనుజ !
మాయన్న యితఁడు ల♦క్ష్మణుఁ డంద్రు నాపేరు, దేవప్రభావుండు♦దేవితోడ
దండకాటవిలోన ♦ నుండ సుఖంబుగ, రాక్షసుల్ మాయచే ♦ రాజవదన
ముచ్చిల నామెను♦రోయుచు నిట వచ్చి,నార; మెవ్వఁడ వీవు ♦ కారణం బ
తే. దేమియో కబంధ మైనయా♦కృతి వహింప ?
నురమునను నోరు జంఘల♦యొప్పు లేదు
పొరలు చున్నాఁడ వన వాఁడు ♦ సురచయేంద్రు
వాక్యములు స్మరియించుచు ♦ నఱలి ప్రీతి. ౧_౨౦౯

తా. ఈ పుణ్యాత్ముఁ డిక్ష్వాకువంశమునఁ బుట్టినవాఁడు. ఈయనను లోకులు రాముఁ డందురు. ఈయన మాయన్న. నాపేరు లక్ష్మణుఁ డందురు. దేవతల మహిమగల యీయన తన భార్యతోడ దండకారణ్యమం దుండఁగా రాక్షసులు మాయచేసి యా చంద్రవదనయగు సీతను దొంగిలింపఁగా నామెను వెదకుచు నిచ్చటికి వచ్చితిమి. నీ వెవ్వఁడవు ? ఇట్లు మొండెముమాత్ర ముండు నాకారము ధరింపనేల ? ఱొమ్మున నోరున్నది. పిక్కలులేవు. పొరలెదవు. అనిన వాఁడు దేవేంద్రుని వాక్యములు స్మరించి శాపమోక్షణకాలము వచ్చెఁగదా యని సంతోషముతో నిట్లని బదులుచెప్పెను.

కం. ఉత్తర మిట్లను నో రఘు,సత్తమవరులార ! మీకు ♦ స్వాగత మా నా
హత్తిన భాగ్యంబున మిము, నిత్తఱిఁ బొడగంటిఁ జేతు♦లివి పోఁగంటిన్. ౧_౨౧౦

తా. ఓ రాఘవులారా! మీకు స్వాగతము. నా భాగ్యము పండుటచే మిమ్ము నీ సమయంబున నిందుఁ జూడఁగంటిని. చేతులు పోఁగొట్టుకొంటిని. చేతులు పోవుట నా యదృష్టముచేతనే.

ఆ. అవినయంబుచేత ♦ నబ్బె నీవికృతంపు, రూపు దాని యున్న ♦ రూపు నీకుఁ
జెప్పువాఁడ వినుము ♦ శ్రీరామచంద్ర! ని, ర్వక్రసుగుణసాంద్ర ! ♦ రాఘవేంద్ర !

అవినయంబుచేత = వినయము తప్పినపని చేయుటచేత, వికృతంపురూపు = వికారస్వరూపము, ఉన్నరూపు = యథార్థము, నిర్వక్ర = వంకరలేని, సుగుణ = కళ్యాణగుణములచే, సాంద్ర = దట్టమైనవాఁడా.

తా. శ్రీరామచంద్రా ! గర్వముచే వినయము దప్పినకార్యము చేయుటచే నిట్టి వికారస్వరూపము నాకుఁ గలిగెను. యథార్థము చెప్పెద వినుము.

—♦ ౭౧-వ సర్గము. కబంధుఁడు రామలక్ష్మణులకుఁ దన వృత్తాంతముఁ జెప్పుట ♦—

కం. సోమఖరధామవిబుధ, స్తోమధవసమాన మైన ♦ సుందరరూపం
బే మును దాల్చి జగంబుల, రామా! విశ్రుతిని గంటి ♦ రమణీయతకున్. ౧౨౦౮

సోమ = చంద్రునితోను, ఖరధామ = సూర్యునితోను, విబుధస్తోమధవ = ఇంద్రునితోను, సమానమైన = సరిపోలుచున్న, విశ్రుతిని = ప్రసిద్ధిని, రమణీయ తకున్ = అందమునకు.

తా. నేను దొలుత సూర్యచంద్రేంద్రులతో సమానమైన సుందరాకారము గలవాఁడనై లోకములందు రామచంద్రా ! అందమునకుఁ బ్రసిద్ధిగంటిని.

కం. ఆమిక నే నీరూపము,తో మునులున్ గహనచరులు ♦ దూలఁగ భీతిన్
వేమఱు గోడాడించుచుఁ, దామసమతి స్థూలశిరుని ♦ దలరఁగఁ జేయన్. ౧౨౦౯

ఆమికన్ = గర్వముచే, గహనచరులు = వనములందు సంచారముచేయువారు, గోడాడించుచున్ = బాధపెట్టుచు, తామసమతి = తమోగుణమువలనఁ గలిగిన దుర్బుద్ధిచే, తలరఁగన్ = కలఁతచెందునట్లు.

తా. గర్వముచే నిట్టి యాకారము గలవాఁడనై మునులును అరణ్యవాసులును భయపడునట్లు పలుమాఱు దుఃఖపెట్టుచు తమోగుణము ప్రకోపించుటచేఁ గలిగిన దుర్బుద్ధిచే స్థూలశిరుఁ డనుమునినిఁ గలఁత చెందింపఁగా.

కం. శాపాయుధుఁ డాసంయమి, కోపంబునఁ దిట్టె నన్ను ♦ గుచ్ఛిత మగు నీ
రూపంబున బెదరించెద, వా పాపీ! రూప మిదియె ♦ యగుత సతంబున్. ౧౨౧౦

శాపాయుధుఁడు = శపించుటయే యాయుధముగాఁ గలవాఁడు, సంయమి = ముని, సతంబున్ = ఎల్లప్పుడు. నాలుగవపాదంబునఁ బ్లుతయతి.

తా. శపించుటయే యాయుధముగాఁగల ఋషీశ్వరుఁడు, " ఓరి పాపాత్ముఁడా ! నింద్యమగు నీ రూపమున నన్ను బెదరించెదవా ? నీ కీరూపమే శాశ్వతమగును గాక ! " యని కోపంబున శపించెను.

కం. అని తిట్టిన శాపాంతం, బనఘా ! కరుణింపవే య ♦ టంచును వేఁడన్
వని రాముఁడు నీ కరములు, దునిమి దహించినను గల్గుఁ ♦ దొల్లిటిరూపున్.

తా. అని శపింపఁగా శాప మెప్పుడు పోవునో చెప్పుమని వేఁడఁగా ' నీయడవియందు రామచంద్రుఁ డెప్పుడు నీ చేతులు తెగనఱకి దహించునో, యప్పుడు నీకీ శాపము దొలఁగిపోవును. నీ పూర్వస్వరూపమును నీవు పొందుదువు ' అనెను.

కం. అని యానతిచ్చె శ్రీయుత,దనుసంజాతుండ నేను ♦ దగ వికృతశరీ
రిని నగుటకు లక్ష్మణ, శక్రునికోపము కారణంబు ♦ క్రొవ్వున నతనిన్. ౧౨౧౨

అని యాజ్ఞచేసెను. ఇంకఁ గబంధరూపము వచ్చినకారణము చెప్పెదను వినుము. శ్రీయుతదనుసంజాతుండన్ = (౧) శ్రీతోఁ గూడిన దనువనువాని పుత్రుఁడను. (౨) శ్రీయనుపేరితోఁగూడినవాసివలనఁ బుట్టినవాఁడను, దనువను వాఁడను. 'దనుర్నామ శ్రియఃపుత్రః శాపాద్రాక్షసతాం గతః' అనియుఁ, 'దనుర్నామ దితేః పుత్రః' యనియుఁ బాఠాంతరములు గానవచ్చుచున్నవి. వికృతశరీరిని = వికారపు శరీరము గలవాఁడను.

తా. అని సెలవిచ్చెను. నేను శ్రీయుతుఁడగు దనువువలనఁ గలిగినవాఁడను. ఈ వికారాకారము వచ్చుటకు నింద్రుని కోపము కారణము. ఆయన కేల నీపైఁ గోపము వచ్చెనందువేమో!

కం. నా రిమ్మని రణమునకుం, జీరితి ఘోరంపుఁదపముఁ ♦ జేసి విధాతం
గోరుట దీర్ఘాయుష్యం, బేరీ నాసము లటంచు ♦ నెంచి వెకలినై. ౧౨౧౩

తా. నేను గొప్ప తపముచేసి దీర్ఘాయువు కలుగునట్లు బ్రహ్మచే వరము గొంటిని. ఆ కారణమున నిఁక నాకేమి భయమని బుద్ధిహీనుఁడనై నా సమానులెవరని పొగరున నింద్రుని యుద్ధమునకు రా రమ్మని పిలిచితిని.

కం. ఆతఁడు శతారధారా,పాతంబున శిరము గుదియఁ♦బడ వక్షమునం
దాతొడలు కొని కడుపున, వీతదయుం డగుచు నణఁప♦ వేఁడితిఁ జంపన్. ౧౨౧౪

శతారధారాపాతంబునన్ = వజ్రాయుధము వాదరపడ వేయుటచే తల యొమ్మునందును, కడుపునందుఁ దొడలు కుఱుంచుకొని యుండునట్లు (దిగఁబడునట్లు) చేయుతేసివాఁడై యణఁగఁజేయఁగా 'నయ్యా! నాకీ దురవస్థకంటె మరణము మేలు. చంపు'మని ప్రార్థించితిని.

కం. ఎంతయు వేఁడిన నన్నుఁ దా, సంతకుకడ కనుపఁడయ్యె ♦ నస్మృతమె భాషా
కాంతుని పలుకని సీతా,కాంతా! రెంటికిని జెడితిఁ♦గావర మాఱన్. ౧౨౧౫

తా. ఎంత నేను వేఁడినను బ్రహ్మదేవుని వాక్యసత్యమగునా యని నన్నుఁ జంపఁడయ్యెను. ఈ విధముగఁ బొగరు చచ్చినవాఁడనై చచ్చినవాఁడను గాక బ్రదికి బాగున్నవాఁడనుగాక రెంటను జెడితిని.

ఇట్లు రెంటికిఁ జెడినవారిని రేవణునితోఁ బోల్చుట కలదు. 'ఉంభేకః కారికాం వేత్తి। తన్త్రం వేత్తి ప్రభాకరః। మండన స్తూభయం వేత్తి। నోభయం వేత్తి రేవణః॥'అని కలదు. ఇది తెలిసి అల్లసాని పెద్దన 'రెంటికిం జెడిన రేవణుఁడౌదు నె' యని ప్రయోగించెను. ఇది తెలియక శబ్దరత్నాకరమున రేవడనౌదునె యని సవరించి వ్రాయఁబడి రేవఁడనఁగాఁ జాకలవాఁడని యర్థము కూడఁ గల్పింపఁబడినది. ఈ కబంధునిచరిత్రమువలన గర్వము సర్వానర్థకమనియుఁ బెద్దలతోఁ బరిహాసమాడ

రాదనియు నేర్చుకొనవలసియున్నది. యాదవులు మునులతోఁ బరిహాసమాడి వంశ నాశమై పోయిరికదా! దంభోద్భవుఁడనువాఁడు, గరుడుఁడు గర్వముచేతనే కదా భంగపడినది.

కం. ఏను లక్ష్మణా! నే బ్రదుకుదు, నీను లాహారంబులేక ♦ యేగతిఁ దినుదున్.
గటకట భగ్నముఖుండ విఘటితశిరస్కుఁడ ♦ గరుణింపు మనన్. ౧-౨౧౬

తా. ఈవిధముగా నాహారములేక యెట్లు బ్రదుకుదునయ్యా? అయ్యో! నోరు లేక శిరస్సు తొడలులేక యెట్లు తిందును? నాయందు దయఁదలంపుము.

కం. సురపతి యామడ నిడు పగు, కరములు వదనంబుదరంపు ♦ కలు జఠరమునన్
గరుణించె దాన ద్వీపకే,సరిశార్దూలాదిస త్త్వ ♦ సంతతిఁ దినుదున్. ౧-౨౧౭

తా. అని ప్రార్థింపఁగా ఆమడనిడివిగల చేతులు, కడుపునందు నోరు కోరలు ననుగ్రహించెను. వానిచే నేనుఁగులయు, సింహములయు, పులులయు, నీలోనుగాఁగల మృగసమూహములను భక్షించుచుందును.

కం. రాముఁడు లక్ష్మణయుతుఁడై, నీ మహితకరాళి నిశిత ♦ నిస్త్రింశహతిన్
భూమిఁ బడం నడువ నిర్జర,ధామము నీ కబ్బునని బుధ ♦ ప్రభు వరిగెన్. ౧-౨౧౮

నీమహితకరాళిన్ = నీపెద్ద చేతులను, నిశిత = పదునైన, నిస్త్రింశ = కత్తి యొక్క, హతిన్ = దెబ్బచే, అడువన్ = కొట్టఁగా, నిర్జరధామము = స్వర్గము, బుధ ప్రభుఁడు = దేవేంద్రుఁడు. 'బుధ స్సూరౌ సురే సౌమ్యే' యని నానా ॥ర్థ॥

కల్క్యవతార విషయము మనకిప్పుడు తెలిసినట్లు (శ్రీ)రామావతార విషయము దేవతలకు ఋషీశ్వరులకు ముందుగానే తెలిసియుండెను.

తా. లక్ష్మణునితోడ రాముఁడు నీచేతులను కత్తులతో నెప్పుడు నేలఁబడనఱకునో యప్పుడు మరల నీవు స్వర్గమునకు వత్తువని చెప్పి యింద్రుఁడు పోయెను.

ఉ. ఆమునిమాట నమ్మి వికృ ♦ తాకృతి వేగము వాయఁ గోరి నే
నేమృగ మే పదార్థమును ♦ దృష్టిపథంబునఁ బడ్డఁ బట్టినన్
రాముఁడు చిక్కఁడే యని ఘ ♦ నం బగునాశను నేదియేని నీ
యామడలోనఁ దోఁచిన ర ♦ యంబునఁ బట్టుదు కోటఁ బోదున్. ౧-౨౧౯

వికృతాకృతి = వికారస్వరూపము.

తా. ఆ స్థూలశిరుని మాట నమ్మి యీ వికారస్వరూపము వదలి పోవఁగోరి నాకంటిదృష్టికి నేపదార్థము ఏ మృగము కనఁబడినను దానిని బట్టుకొనుచుంటి నా రాముఁడు చిక్కకపోవునా యను నాశతో నీ యామడలోపల నేది కనఁబడినను బట్టు కొని తినుచుందును.

కం. ఆమౌనివరుఁడు చెప్పిన, రాముఁడ వీవే మహాత్మ! ♦ రణమునన
న్నీమెయి వధియింపఁగ లే, రెమగపంతంబువార ♦ లేనియు రామా! ౧-౨౨౦

తా. మహాత్మా ! నన్ను యుద్ధమం దెంతటి పౌరుషముగలవారైనను నీవిధముగఁ జంపలేరు. కావున ఆ మునీశ్వరుఁడు చెప్పినరాముఁడు నీవే.

మ. మతిసాచివ్య మొనర్తు, మిత్రవరు సం ♦ పాదింతు, న న్నగ్ని సం
స్కృతుఁ గావింపుఁ డటన్న రాముఁ డనియెన్ ♦ స్వేచ్ఛన్ జనస్థానమం
దితఁడు న్నేనుఁ జరింప రావణుఁడు నా ♦ యిల్లాలి గిల్పాడెఁ; దు
ర్మతి పేరొక్కటి మే మెఱుంగుదుము, శౌ♦ర్యం బేని రూపంబు నేన్. ౧౨౨౧

మతిసాచివ్యము = ఆలోచనయందు సాహాయ్యము, మిత్రవరున్ = మంచి గొప్ప స్నేహితుని, అగ్నిసంస్కృతున్ = అగ్నిచే సంస్కరింపఁబడినవానిని, అనఁగా దహింపఁబడినవానిని, గిల్పాడెన్ = హరించెను.

తా. మీకు నాలోచనయందు సాహాయ్యము చేసెదను. మీకు మీ కార్యమనుకూలమగు నాలోచన చెప్పెదను. మీ కార్యము సాధింపఁగల స్నేహితుని దొరకఁ జేసెదను. నన్ను నగ్నిచే దహింపుము. అనఁగా రామచంద్రమూర్తి వీనిని దహించిన పిమ్మట తెలియవలసిన విషయము తెలియకపోవు నని తలఁచి యిట్లనియె. ఇతఁడు నేను జనస్థానమందు మా యిష్టానుసారము తిరుగుచుండ రావణుఁ డను వాఁడు నా భార్యను దొంగిలించెను. ఆ దుర్బుద్ధి పేరుమాత్రము మాకుఁ దెలియును. వాని శౌర్య మేమాత్రమో, వాని రూప మెట్టిదో ?

చ. అతని నివాస మైనఁ దెలి ♦ యంబడ, దాతని నీ వెఱింగినన్
మతి చెడి కానకాన దెస ♦ మాలి చరించెడిమమ్ముఁ దీవ్రదుః
ఖితుల హితత్రిఁన ర్తనులఁ ♦ గేవలసత్కృపఁ జూచి చెప్పవే
స్థితిగతి యిట్టి దంచు నజ ♦ సేయక వీర ! మహోపకారివై. ౧౨౨౨

తా. వాఁడుండుస్థలమైనను దెలియరాదు. వానిని నీ వెఱిఁగియుండినఁ జెప్పుము. మనస్సు వికలతనొంది దిక్కులేక యడవి యడవి తిరిగి బహుదుఃఖ మనుభవించుచున్నాము. మేము పరుల కుపకారము చేయుదుముకాని యపకారము చేయము. నీవు కోరినట్లు నీ కుపకారమే చేయుదుము. కావున మాయందు దయ దలఁచి యలక్ష్యము సేయక వంచింపక గొప్ప యుపకారము చేసినవాఁడవై వాని స్థితిగతి యిట్టిదని చెప్పుము.

కం. కుంజరము లప్పు డప్పుడు, భంజించిన శుష్కకాష్ఠ ♦ పటలంబులు ప్రో
వుం జేర్చి బిలమునను ని, న్నుం జతన మొనర్తు నీదు♦నుడిమైఁ గాల్పన్. ౧౨౨౩

తా. నా కేమి యుపకారము చేసెదనందువా, యేనుఁగు లప్పుడప్పుడు విఱిచిన యెండు కట్టెల గుంపులను కుప్పచేర్చి బిలమునందు నిన్ను నీ మాటప్రకారము కాల్చుటకు యత్నించెదను.

కం. ఎవ్వఁడు హరించె జానకి, నెవ్వలనం దాఁచినాఁడొ ♦ కృపచే మా కా
నవ్వాడి తెలిపి శుభమునన్, నివ్వటిల నొనర్పవయ్య ♦ నీ వెఱిఁగిన నాన్.

తా. నీవలన మాకుఁ దెలియవలసిన దేమనిన జానకిని హరించినవాఁ డెవ్వఁడు? ఆమె నెక్కడ దాఁచినాఁడు? నీకుఁ దెలిసినయెడల ఆజాడ మాయందు దయయుంచి తెలిపి మాకు మేలుసేయుము.

ఉ. తీఁపురముల్ ఘటించి కొని ♦ తెచ్చినయీవికృతంపురూపుతో ।
దోఁపుడుపోయితిం దెలివి ♦ తోయజలోచన సీతగాథయుం
దోఁపదయిప్డు నాతనువుఁ ♦ దూర్ణమ కాల్చిన దాఁపరీని యా
దాఁపఱికంబు నంతయును ♦ దాఁపక నీకు నెఱుంగఁ జేసెదన్. ౧౨౨౬

తీఁపురముల్ = ఆగడము, ఘటించి = చేసి-కొని తెచ్చిన = కావలయుసని తెచ్చికొనిన-ఇచ్చటఁ దెచ్చికొనిన సని యాత్మనేపదముండుట బాగు. అయినను ఆగమసూత్ర మనిత్య మగుటవలన తెచ్చిన యనియె ప్రయోగింపఁబడె. 'పట్టముఁ గట్టి యేలుము కృపన్ మము నెల్లర' యని భారతప్రయోగము కలదు. దాఁపరీని = దాఁచినవాని.

తా. ఆగడములగు కార్యము చేసి కొని తెచ్చికొనిన యీ వికారస్వరూపముతో నా తెలివికూడఁ బోఁగొట్టుకొంటిని. సీత చరిత్రయు నాకు స్ఫురింపలేదు. వేగమే నా దేహమును గాల్చితిరేని నాస్వస్వరూపము నొంది సీతను దాఁచిన వాని రహస్యమంతయు దాఁపక నీకుఁ జెప్పెదను.

కం. అవటమున నన్ను వెస నిడి, సవిత పరిశ్రాంతహయత ♦ జాఱక మున్నే
సవిధిగ దహియింపుము మఱి, యవనిసుతాహర్తఁ దెలియు♦నతని వచింతున్.

అవటమునన్ = బిలమునందు, సవిత — సూర్యుఁడు, పరిశ్రాంత = గాసిపడిన, హయతన్ = గుఱ్ఱములు గలవాఁడగుటచేత, జాఱకమున్నే = అస్తమింపకముందే, సవిధిగ = శాస్త్రప్రకారము, అవనిసుతాహర్తన్ — సీతనుహరించినవానిని, తెలియునతనిన్ = తెలిసినవానిని, వచింతున్ = చెప్పెదను.

తా. నన్ను బిలమునందుంచి సూర్యుఁ డస్తమింపకముందే దహించితివేని సీతను దొంగిలించినవానిని దెలిసినవానిని దెలిపెదను.

ఉ. వాని నెఱుంగఁగా గలుగు♦వాఁ డొకరుండు గలండు, వానితో
మానుగ న్యాయమార్గమున ♦ మైత్రి యొనర్పుము, కారణాంతరం
బైనఁ జరించె వాఁడు భువ♦నావళి నెల్ల, నతండు ధాత్రిపైఁ
గాననిచోటు గల్గ, దుప♦కారము నీకొనరించు నావుడున్. ౧౨౨౭

న్యాయమార్గమునన్ = న్యాయముతోఁగూడిన విధమున, కారణాంతరంబు = వేఱొకకారణము, భువనావళి = లోకసమూహము.

తా. వానిని దెలిసికొనఁగలుగువాఁ డొకఁ డున్నాఁడు. వానితో ధర్మపద్ధతిని నీవు స్నేహము సేయుము. ఒకానొకకారణమున వాఁడు ప్రపంచమంతయుఁ దిరిగెను. వాఁడు చూడనిచోటు భూమియందు లేదు. నీకు వాఁ డుపకారము

చేయును. ఇన్నియుఁ జెప్పి వానిపే రేల చెప్పలే దనిన తన్నుఁ గాల్చుటకుఁ బూర్వమే చెప్పినఁ దన కుత్సితశరీరమును జూచి రోసి త్రాల్పకుండునని యని గోవిందరాజీయము. రాముఁ డసత్యవాదియని తన్ను మోసము చేయునని కబంధుఁడు తలఁచెననుట సరిగా దోఁపదు. చెప్పవలసిన విషయము చాలఁగ నుండుటచేతను ఆ నింద్యశరీరమునఁ జేతులు దెగిన బాధ పడుచు నొక నిమిషమైన నుండుట సహింపలేమిని దన్నుముందు దహింపఁగోరె నని తోఁచెడిని.

—♦ ౭౨-వ సర్గము. కబంధుఁడు స్వస్వరూపంబు నొందుట ♦—

వ. తొఱటను వానిదేహమును ♦ దోఁపి సుమిత్రసుతుండు మండుపె
న్గొఱవులు దెచ్చి కాష్ఠమునఁ ♦ గూరిచి వహ్నుల నూలుకొల్పఁగా
నెఱచిని నేతిముద్దకును ♦ నీ డగు దేహముఁ గాల్ప నగ్నియుఁ
జుఱుకరి గాక మందుఁ డయి ♦ చూఁడుచు నుండఁగ వారు చూడఁగన్.

తొఱటను = బిలమునందు, దోఁపి = తూర్చి, ఎఱచిని = మాంసముచే, ఈఁడగు = సమానమైన, చుఱుకరి = చుఱుకుఁదనముగలవాఁడు, చూఁడుచున్ = కాల్చుచు, వారు = రామలక్ష్మణులు.

తా. వాఁ డీ ప్రకారము చెప్పఁగా వానిదేహమును నొక బిలమందు దోఁపి లక్ష్మణుఁ డెండిసకట్టెలు పేర్చి మండెడు కొఱవి యాకట్టెలలోనుంచి యగ్నులను పురికొల్పఁగా మాంసముసమృద్ధ కావున క్రొవ్వుతో నిండి నేతిముద్దవలె నుండు దేహమును నగ్నిహోత్రుఁడు వేగముగఁ గాల్పక మెల్లగఁ గాల్చుచుండెను. ఇంతలో రామ లక్ష్మణులు చూచుచుండఁగా.

ఉ. మండెడుమంటనుండి యస ♦ మానవినిర్మలచేలుఁ డుజ్జ్వల
న్మండనమండితుండు ఖప ♦ థంబున నుద్గమనం బొనర్చి శ్వే
తాండజయుక్తమైనసుర ♦ యానమునన్ దిశ లెల్ల వెల్గఁగా
నుండి కబంధుఁ డిట్లనియె ♦ నుర్విజఁగాంచు తెఱంగు రామునితోన్. ౧-౨-౯

అసమాన = సమానములేని, వినిర్మల = మలినములేని, చేలుఁడు = వస్త్రము గలవాఁడు, ఉజ్జ్వలత్ = మిగులఁ బ్రకాశించుచున్న, మండన = అలంకారములచే, మండితుండు = అలంకరింపఁబడినవాఁడు, ఖపథంబునకున్ = ఆకాశమునకు, ఉద్గమనం బొనరించి = ఎగసి, శ్వేతాండజయుక్తము = తెల్ల పక్షులగు హంసలతోఁ గూడిన సురయానమునన్ = విమానమునందు - హంసల విమానము బ్రహ్మలోకప్రాప్తిని దెలుపుచున్నది. రామచంద్రమూర్తి కొఱవివేసిన కారణమున నిట్టి యుత్తమలోక ప్రాప్తి.

తా. మండుచున్న మంటలోనుండి మిగుల నిర్మలమైన వస్త్రములు గలిగి తళతళలాడుసొమ్ము లలంకరించుకొని యాకాశంబున కెగసి, హంసలఁ గట్టిన విమా

నముమీఁద దిక్కులు వెల్గఁగానుండి సీతను జూచువిధము రామునితో నిట్లనియెను.

మ. అనఘా! రామ జగంబునందు షడుపా ♦ యజ్ఞుల్ క్రియాళీవిమ
ర్శనముం జేయుదు రందు దుస్థితిసమా ♦ క్రాంతుల్ సమావస్థు లౌ
జనులన్ రోసి ఘటింత్రు మైత్రి నిపుడో ♦ జాయానిమిత్తంబు నీ
వనుజాన్వితుఁడ వౌచు నీచదశచే ♦ నాయాసపా టొందవే ? ౧౨౩౦

షట్ + ఉపాయజ్ఞుల్ = ఆఱుపాయములు తెలిసినవారు-సంధి, విగ్రహము, యానము, ఆసనము, ద్వైధీభావము, సమాశ్రయము-ఇవి యాఱుపాయములు. క్రియా + ఆళీ + విమర్శనమున్ = సమస్త కార్యములను న్యాయ్యముగా నాలోచించుటను, దుస్థితిసమాక్రాంతుల్ = కష్టదశయందుండువారు, సమావస్థులు = తమవలె కష్టదశయందుండువారు, రోసి = వెదకి, జాయానిమిత్తంబు = భార్యకొఱకు, అనుజాన్వితుఁడవౌచు = తమ్మునితోఁ గూడినవాఁడవై, నీ భార్య నిమిత్తముగా నీకుఁ గష్టదశవచ్చినది. నీ నిమిత్తముగా నీ తమ్మునికిఁ గష్టదశవచ్చినది.

తా. రామచంద్రా! లోకమునందు సంధివిగ్రహ యానాసన ద్వైధీభావ సమాశ్రయంబు లను నాఱుపాయములను రాజులగువారు కార్యములు సాధించుట యం దాలోచింతురు. ఈ యాఱింటియందు సంధితప్పఁ దక్కినవి నీకుఁ బ్రకృతము సరిపడునవికావు. విరోధి యునికి తెలిసినఁగదా యుద్ధము ప్రయాణము లోనైనవి. కావున సంధివిషయ మొకటే యాలోచింపవలసియున్నది. ప్రత్యక్ష శత్రు వెవఁ డైనది నీకుఁ దెలియలేదు గనుక నీవు వానితో సంధిచేయుద మన్నను బొసఁగదు. కాఁబట్టి తొలుత నీ శత్రువిషయము - సీతయునికి తెలిసికొనవలసియున్నది. ఇది మీ యిరువురవలన సాధ్యమగునదికాదు. కావున నన్యసాహాయ్య మావశ్యకమై యున్నది. ఇతరులతో సంధి యెట్టివారితోఁ జేయవలయును ? కయ్యమునకు నెయ్యమునకు వియ్యమునకు సమత్వము వలయును. తనకంటె గొప్పవానితోడ స్నేహము కుదురదు. తక్కువవానితో మైత్రిచేసియుఁ బ్రయోజనములేదు. తనకంటె నెక్కువ వాఁడు తన్నుఁ జులుకన చూచునుగాని నిండు మనస్సుతో నాదరింపఁడు. ఇప్పుడు మీ యన్నదమ్ము లిరువురు సమర్థులే యైనను నీ భార్య నిమిత్తమై నీకుఁ గష్టదశ ప్రాప్తించినది. నీ నిమిత్తమై నీ తమ్ముఁడు కష్టదశయందే యున్నాఁడు. ఈ కారణముచే వాలితో మైత్రి నిషేధించుచున్నాఁడు. అది నీతిశాస్త్రానుసారముగాదు.

—♦ కబంధుఁడు రామునకు సుగ్రీవునితో మైత్రి చేసికొనఁ జెప్పుట. ♦—

ఉ. కాన భవత్సమానదశుఁ ♦ గాంచి ఘటించుట మేలు మైత్రి, కా
దేనియు నీదుకార్యము తు ♦ దిం గను టెట్టులొ తోఁపదయ్యె రా

మా! నగచారి క్రుద్ధుఁ డయి ♦ యన్నసురాధిపసూతి వాలి రా
జ్యానకుఁ గాఁగఁ దాఁపఁగ వ♦నాటచతుష్కసహాయుఁడై వెతన్. ౧౨౩౧

కావన్ = కావున, భవత్సమానదశున్ = నీదశవంటి దశయందుండు వానిని, నగచారి = క్రోఁతి, క్రుద్ధుఁడయి = కోపించినవాఁడై, సురాధిపసూతి = ఇంద్రుని కుమారుఁడు, వాలి = వాలియనువాఁడు, తాఁపఁగన్ = తన్నఁగా, వనాట చతుష్క సహాయుఁడై = నలుగురు క్రోఁతులను సహాయులుగాఁగలవాఁడై, వెతన్ = దుఃఖముచే.

తా. కాఁబట్టి నీస్థితివంటి స్థితియందుండువానినిగాఁ జూచి నీవు స్నేహము చేయుటబాగు. అటుచేయనొల్లవేని నీకార్యము కొనసాగు నుపాయము నాకుఁ దోఁపలేదు. అట్టివాఁ డెవఁడైన నున్నాఁడా యందువా? రామా! వానరుఁడును నింద్రునికొడుకును తనయన్నయు నగు వాలియనువాఁడు కోపించి రాజ్యము నిమిత్తమై తన్నుఁ దన్నఁగా నలుగురువానరులను సహాయులుగాఁ దీసికొని దుఃఖపడుచు.

ఉ. పావనఋశ్యమూకగిరిఁ ♦ బంపతటిం జరియించుఁ, బేరు సు
గ్రీవుఁడు, వీర్యవంతుఁడు న♦రీణచరిత్రుఁడు సత్యవాది ప్ర
జ్ఞావిభవుండు ధీరుఁడు ప్ర♦శస్తపరాక్రమశాలి వానితో
నీవు పొనర్పు నెయ్యమును ♦ నీప్రియురాలిని రోయ బాస టౌ. ౧౨౩౨

పావన = పవిత్రమైన, ఋశ్యమూకగిరిన్ = ఋశ్యమూక మనుపర్వతము నందు, పంపతటిన్ = పంపయొడ్డున, అరీణచరిత్రుఁడు = చక్కటినడవడిగలవాఁడు, బాసట ఔన్ = సహాయపడును.

తా. అతఁడు పవిత్రమైనఋశ్యమూక పర్వతమునందు పంపయొడ్డున సంచరించుచుండును. ఆయనపేరు సుగ్రీవుఁడు. అతఁడు పరాక్రమవంతుఁడు. ఋజువర్తనము గలవాఁడు. సత్యము చెప్పువాఁడు. బుద్ధిసంపద గలవాఁడు. ధైర్యవంతుఁడు. శౌర్యమునఁ బ్రసిద్ధుఁడు. వానితో నీవు స్నేహముచేసితివేని నీభార్యను వెదకుటయందు నీకు సహాయుఁ డగును.

కం. ఏలా దుఃఖించెదు నర,పాలా! యెవ్వారికైన ♦ భవితవ్య మిలన్
దూలం బుచ్చఁగ వశమే, కాలము దురతిక్రమంబు♦గా యెవ్వారికిన్. ౧౨౩౩

భవితవ్యము = జరుగవలసినది - అదృష్టము, తూలంబుచ్చఁగన్ = త్రోసివేయుటకు, దురతిక్రమంబు = దాఁటరానిది.

తా. రాజా! నీ వేల దుఃఖించెదవు? ఏది యెట్లుజరుగవలసియున్నదో యది యట్టులే జరుగును గాని దానిని ద్రోచివేయ నెవరికి సాధ్యము? ఎట్టివారికైనను గాలము దాఁటరానిదిగదా!

కం. గమనింపు మచటి కిప్పుడ, యమలమతీ ! యిచటనుండి ♦ యతిజవమున స్నే
హము సుగ్రీవునితోఁ జేయుము వాఁడు మహాబలుం డ ♦ ను త్తమగుణుఁడున్.

అమలమతీ = నిర్మలమైన మనస్సుగలవాఁడా, గమనింపుము = ప్రయాణమై పొమ్ము, అతిజవమునన్ = మిగుల వేగముగ, అనుత్తమగుణుఁడు = మిక్కిలి యుత్తమమైన గుణములు గలవాఁడు.

తా. నిర్మలమనస్సు గలవాఁడా ! నీ వచ్చటి కిపుడే శీఘ్రముగఁ బ్రయాణమై పొమ్ము. సుగ్రీవునితో స్నేహము చేయుము. వాఁడు మహాబలవంతుఁడు. శ్రేష్ఠతమములైన గుణములు గలవాఁడు.

ఉ. వంచన యింతలేక, యొక ♦ వానరుఁ డెయ్యది చేయనోపు నం
చెంచక, చెల్మి సేయుము క ♦ పీశునితోడుత నగ్నిసాక్షిగా;
నంచిత వీర్యవంతుఁడు, స ♦ హాయతఁ గోరినవాఁడు, మేలు గా
వించుఁ గృతజ్ఞుఁ, డెల్లకపి ♦ వీరుల కేలిక, కామరూపియున్. ౧౨౩౫

సహాయతన్ = సాయమును, ఏలిక = ప్రభువు.

తా. మోసబుద్ధిలేక వీఁ డొక క్రోఁతి వీఁ డేమిచేయఁగలఁ డని యలక్ష్యము సేయక యగ్నిసాక్షిగా వానరరాజుతో మైత్రి చేయుము. వాఁడు మిగుల పరాక్రమవంతుఁడు. ఎవరైన సహాయుఁడు దొరకునా యని కోరియున్నాఁడు. మీకు మేలే చేయును. నీవు చేసిన మేలు మఱవఁడు. వానరులకెల్లఁ బ్రభువు. కోరిన రూపము ధరింపఁ గలవాఁడు.

కం. మీ రాతని వాంఛితమును, దీరుపఁ గల రతని కోర్కెఁ ♦ దెప్పున మీరల్
దీరిచినఁ దీర్చ కున్నన, వారణ మీకార్య మతఁడు, ♦ వలనుగఁ గూర్చున్.

వాంఛితమును = కోరికను, తీరుపఁగలరు = చక్కఁజేయశక్తిగలవారు.

తా. ఆతని కోరిక నెఱవేర్పశక్తి మీయందున్నది. ఆయనకోరిక మీరు వెంటనే నెఱవేర్చినను నెఱవేర్పకున్నను మీ కార్య మాతఁడు చక్కఁబఱచును.

సీ. అతఁడు ఋక్షరజుని ♦ యాత్మసంజనితుండు, జలజాప్తు నౌరస ♦ సంభవుండు
పంపాసరోవర ♦ ప్రాంత దేశంబున, నగ్రజుఁ డగువాలి ♦ కాత్మఁ దలఁకి
చరియించుచున్నాఁడు ♦ సకలాయుధంబుల, నంటి ప్రతినచేసి ♦ యతనితోడ
నెయ్యం బొనర్పుము ♦ నిర్జరారులయిక్కె, లతఁ డెఱుంగనియవి ♦ యవని లేవు
తే. తరణికిరణాళి ప్రసరించు ♦ ధరణిలోనఁ గల నదీనదపర్వత ♦ కాననముల
రోయఁ గపులను బంచి నీ♦జాయ వెదక, వార్తఁ దెప్పించు నమ్ముము♦కీర్తిపూత.

ఆత్మసంజనితుండు = దేహమునఁబుట్టినవాఁడు, జలజాప్తు = సూర్యునియొక్క, ఔరససంభవుండు = సొంతకొడుకు. ఇందు స్నానముచేసినవారు స్త్రీలగుదురని పార్వతీదేవి శపించిన యొక సరస్సునందు ఋక్షరజుఁడు స్నానముచేసి స్త్రీయయ్యెను. దానిని ఇంద్రసూర్యులు మోహించిరి. ఇంద్రునికొడుకు వాలి, సూర్యునికొడుకు సుగ్రీ

పుఁడు. తలఁకి = భీతిల్లి. నిర్జరారుల = రాక్షసుల, ఇక్కలు = వాసస్థానములు, తరణికిరణాళి = సూర్యుని కిరణముల సమూహము, నదీ = పడమటి ముఖమై పాఱు నేళ్ళు, జాయన్ = భార్యను.

తా. అతఁడు ఋక్షరజుఁడు స్త్రీయై యున్నకాలమున నామె దేహమున సూర్యునకుఁ జనించినవాఁడు. పంపాసరోవరమున్న ప్రక్కప్రదేశమందు నన్నయగు వాలికి భయపడి తిరుగుచున్నాఁడు. వాఁడు నమ్మునట్లు నీవు సకలాయుధములను దాఁకి ప్రతిజ్ఞ చేసి స్నేహముచేయుము. వాఁడెఱుఁగని రాక్షసులుండుచోటులు భూమిమీఁగ లేవు. సూర్యకిరణములు వ్యాపించు భూమియందుఁగల నదులు, నదములు, కొండలు, అడవులు వెదకి, నీభార్య యెందున్నది వార్త తెప్పింపఁగలఁడు. నమ్ముము.

కం. నీదువియోగముకతమున, ఖేదంబునఁ గుంద విమల ♦ క్షితిసుత సవ్యా
పాదుఁడగు రావణునిప్రా, సాదంబున నుండువార్త ♦ శక్తుఁడు దెలియన్. ౧౭౩౮

వియోగముకతమునన్ = ఎడఁబాసిన కారణమున, ఖేదంబునన్ = శోకంబున, సవ్యాపాదుఁడు = ద్రోహచింతగలవాఁడు, ప్రాసాదంబునన్ = అంతఃపురంబున, మేడయందు, శక్తుఁడు = సమర్థుఁడు, విమలన్ = అనుటచే నామె పాతివ్రత్యము గుఱించి నీవు సందేహింప వలదని భావము.

తా. నిన్నెడఁబాసినకారణమున దుఃఖించుచున్న సీతాదేవి ద్రోహచింతఁగల రావణుని మేడయందుండువార్త తెలిసికొన సమర్థుఁడు.

కం. ఆ రావణుని నిశాంతము, నారసి పాతాళలోక ♦ మం దుండిన రోన్
మేరువుకొన నుండిన సీ, తారమణిం దెచ్చుఁ జంపి ♦ దైత్యచయంబున్. ౧౭౩౯

నిశాంతము = ఇల్లు, ఆరసి = విచారించి, వెదకి, దైత్యచయంబున్ = రాక్షససమూహమును,

తా. ఆరావణునియిల్లు వెదకి వాఁడామెను పాతాళమందు దాఁచినను మేరువు కొనయందుంచినను రాక్షసులగుంపును జంపి సీతాదేవిని దేఁగలఁడు.

—♦ ౭౩-వ సర్గము. కబంధుఁడు రామునకుఁ బంపామార్గంబుఁ జెప్పుట. ♦—

సీ. అనుచు సీతాప్రాప్త్యు ♦ పాయంబు వచియించి, పల్కె వెండియును గ ♦ బంధుఁ డిచట
నుండి ప్రతీచిగా ♦ నొప్పు చుంపు వనాళి, ఫలపుష్పసముదాయ ♦ కలితి మగుచు
మారేళ్ళు నేరేళ్లు ♦ మంచిగన్నేరులు, గోఁగులుఁ బసనలు ♦ రేఁగుచెట్లు
రావులు మావులుఁ ♦ ద్రోవులు ముంతమామిడులు వారిజములుఁ ♦ గడపలాది

తే. గాఁగ ధరణీరుహంబులు ♦ గలవు పెక్కు,
చెట్లు లెక్కియొ ఫలములు ♦ గొట్టి నేలఁ
ద్రోచియో మీరు మెసవుచుఁ ♦ ద్రోవఁ బోవ
నవులఁ బుష్పితతరువనం ♦ బలరు చుండు. ౧౭౪౦

సీతాప్రాప్తి + ఉపాయంబున్ = సీతలభించు నుపాయమును, ప్రతీచిగా = పడ

మరగా, ఫలపుష్పసముదాయకలితము = పండ్లు పూలు వీని రాసులచేఁ గూడినది, మావులు = మామిడిచెట్లు, పుష్పితతరువనంబు = పూచిన చెట్లుగల వనము.

ఇంతవఱకు రామలక్ష్మణులు దక్షిణముగానే పయనించిరి. తూర్పు దక్షిణము పడమర సముద్రములతీరములందు నంధ్ర పాండ్యాది దేశములు గలవు. కావున వారు తూర్పు పోలేదు. అదియునుగాక కొండ లడ్డమునచ్చును. అదియునుగాక జటాయువు దక్షిణముగానే పొమ్మనెను. ఈ మార్గమునకుఁ గిష్కింధ పడమరగానున్నది. అదియునుగాక శబరియాశ్రమము జేరుటకుఁ దూర్పునఁదప్పఁ దక్కిన దిశలఁ బోవ మార్గములేదు. కొండ లడ్డము కావున వీరు పడమరగానే పోయి యావలఁ దూర్పు తిరుగవలసినవారైరి. నాసిక పంపవటి యను వారి వాదమున కిది యడ్డమగుచున్నది.

తా. అని సీతలభించు నుపాయము చెప్పి కబంధుఁడు మఱియు నిట్లనియె. ఇచ్చటనుండి పడమరగాఁ బోయిన పండ్లతోను బూవులతోను నిండిన వనములు గలవు. అందు మారేళ్ళు, నేరేళ్ళు, గన్నేరులు, గోఁగులు, పనసలు, రేఁగులు, రావులు, మామిడులు, క్రోవులు, ముంతమామిడులు, వారిజములు, కడపలు మొదలుగాఁ బెక్కులు చెట్లు గలవు. ఆ చెట్లెక్కిగాని నేలరాలఁగొట్టిగాని, మీరు వాని పండ్లను దినుచుఁ బోఁగా నావల పూచినచెట్లుగల వనమొకటి గలదు.

కం. నందనసుందరమై ని, ష్యందమధురసంబు నగుచు ♦ నఖిలర్తుఫలా
స్పందితవిటపియుతం బై, పొం దగువన ముత్తరకురు♦ భూముల కెనయై. ౧౨౪౧

నందనసుందరము = నందనవనమువలె నందమై, నిష్యంద = కాఱుచున్న, మధురసంబు = తేనెవలెఁ దియ్యనైన రసముగలది, అఖిలర్తు = అన్ని ఋతువుల యందలి, ఫలాస్పందితవిటపి = ఫలములు లేకుండని చెట్లుగలది. అన్ని ఋతువులయం దుండు ఫలములును గలవని భావము. ఉత్తరకురుభూములకుఁ = హిమవత్పర్వతమున కుత్తరమున నుండు కురుదేశమునకు, ఎనయై = సమానమై.

తా. నందనవనమువలె నందమై స్రవించుచున్న తియ్యని రసముగలదై యన్ని ఋతువులయందలి పండ్లు పూలు గల చెట్లతోఁ గూడి యుత్తరభూములకు సమానమై.

కం. ధారాధర ధరణీధర, వారంబులఁ బోలి పక్వ ♦ ఫలభారనతం
బై రమ్యవిటపియుత మై, శ్రీరంజిలు నచట నచట ♦ వృక్షచయంబుల్.

ధారాధర = మేఘములయు, ధరణీధర = పర్వతములయు, వారంబులఁ = సమూహములను, పక్వ = పండిన, ఫల = పండ్లయొక్క, భార = బరువుచే, నతంబు = వంగినది, రమ్యవిటపి = మనోహరమైన చెట్లతో, యుతమై = కూడినదై, శ్రీ = కాంతిచేత, వృక్షచయంబుల్ = చెట్లగుంపులు.

తా. మేఘములతోను పర్వతములతోను సమానమై పండినపండ్ల బరువుచే నేలకు వంగినవై కాంతిచే నచటి వృక్షసమూహములు శోభిల్లుచుండును.

కం. ఆ చెట్టులెక్కి-యో యిలఁ ద్రోచియొ ఫలములను నీకుఁ ♦ దోరము గూర్చెన్
నీచిన్నతమ్ముఁ డటపై, నే చనినం గొండకొండ ♦ విపినముఁ గనుచున్.

దోరము = విశేషముగ, విపినము = అడవి.

తా. ఆ చెట్టు లెక్కిగాని, ఫలములు నేలరాల్చి గాని నీకు విశేషముగా లక్ష్మణుఁడు తెచ్చియిచ్చును. అది దాఁటి కొండకొండ యడవియడవి చూచుచుఁ బోఁగా.

—♦ కబంధుఁడు రామునకుఁ బంపాసరస్సు వర్ణించి చెప్పుట ♦—

మానిని. సారసరాజమరాళరథాంగక ♦ చారురవంబు, లశైవలవ
న్నీరములున్, సికతాతలరాజిత ♦ నిర్మలగాఢసమావను లౌ
తీరములున్, నవసారసకైరవ ♦ దివ్యసుగంధిఘుమంఘుమవాః
పూరములున్, విలసిల్లఁగఁ బంప ♦ యపూర్వముదావహమై యెసఁగున్.

సారస = బెగ్గురులయు, రాజమరాళ = రాజహంసలయు, రథాంగక = చక్రవాకములయు, చారురవంబులు = మనోహరమైనధ్వనులు, అశైవలవత్ = పాఁచిలేని (నాఁచులేని), నీరములు = నీళ్ళు, సికతాతల = ఇసుకప్రదేశములచే, రాజిత = ప్రకాశించు, నిర్మల = మలినములేని, గాఢ = దృఢమైన, సమ = చదరమైన, అవనులు = భూములు, ఔ = కల, తీరములు = ఒడ్డులు, నవ = క్రొత్తగా వికసించిన, సారస = కమలములయు, కైరవ = కలువలయు, దివ్య = మిగుల శ్రేష్ఠములయిన, సుగంధి = మంచివాసనచే, ఘుమంఘుమ = గుమగుమలాడుచున్న, వాఃపూరములున్ = జలప్రవాహములును, అపూర్వముదావహమై = క్రొత్త సంతోషము గలిగించునదియై, ఎసఁగున్ = అతిశయించును.

మానిని–ఏడు భగణములు, గురువు. ౧౩ వ యింట యతి.

తా. బెగ్గురులయు రాజహంసలయుఁ జక్రవాకములయు మనోహరధ్వనులును, పాఁచితీఁగలులేని జలములును, ఇసుకనేలచేఁ బ్రకాశించు నిర్మలమై గట్టియగు చదరపునేలుగల తీరములు, క్రొత్తగా వికసించిన కమలములయు, కలువలయు, మేలగు మంచివాసనలచే గుమగుమలాడు జలప్రవాహములును గలిగి పంప యిదివఱకు ననుభవింపని సంతోషము కలిగించునది యగును.

ఆ. వధముఁ దెలియనట్టి ♦ వనచారిపక్షులు, ముదము మీఱఁ దిరుగు ♦ నదరుబెదరు
గానక నరులు తమ్ముఁ గూడవచ్చిననైన; నేతిముద్ద లట్లు ♦ భాతి మెఱయు.

వధము = చంపఁబడుటను, వనచారి = నీటఁదిరుగు పక్షులు.

తా. వేటలాడువారు లేమిచేఁ జంపఁబడుట యెట్టిదో తెలియని జలముల విహరించు పక్షులు మనుష్యులు తమయొద్దకు వచ్చినను, బెదరక చలింపక సంతోషముతో దిరుగుచు బాగుగఁ బ్రొవ్వి నేతిముద్దలవలె నుండును.

ఉ. మీరలు గండుమీలుఁ జొర ♦ మీలును రొయ్యలుఁ గొజ్జచేప ల
వ్వారిగ బొమ్మిడాయలును ♦ వాలుగలున్ మఱి ముండ్లు లేని వా
వారిచరంబు లెన్నియొ ని ♦ వాసము చేయు సరోవరంబునన్
గోరిన వెల్లనుం గొనుఁడు; ♦ గూల్చుచు వానిని దమ్ముఁ డమ్ములన్. ౧౨౪౬

వారిచరంబులు = జలంబులందు సంచరించునవి, చేఁపలు.

తా. ఆ సరస్సునందు గండుచేఁపలు, చొరలు, రొయ్యలు, కొజ్జలు, బొమ్మిడాయలు, వాలుగలు, మఱియును ముండ్లులేని చేఁపలు ననేకములు వాసముచేయుచుండును. మీకుఁ గావలసినవి గ్రహింపుఁడు. లక్ష్మణుఁడు వానిని బాణములచేఁ గొట్టి.

తే. ఒలిచి చర్మంబు తెక్కలు ♦ దులిచి వైచి
యినుపకాఁడలకును గ్రుచ్చి ♦ యనలమందుఁ
బక్వ మొనరించి చిక్కని ♦ వాని ముండ్లు
దీసి సద్భక్తి నీకయి ♦ తెచ్చి యిచ్చు. ౧౨౪౭

తా. చర్మ మొలిచి తెక్కలు పీఁకివైచి యినుపకడ్డీలకుఁ గ్రుచ్చి నిప్పునందుఁ బక్వముచేసి బలిసినవానిముండ్లు దీసి భక్తితోఁ దెచ్చియిచ్చును.

చ. తనివి సనన్ భుజించి నవ ♦ తామరసామలగంధ మై సుఖో
జ్జనకసుశీతలం బగుచు ♦ స్ఫాటికరౌప్యవినిర్మలంబు నై
యనిశము మోదహేతు వగు ♦ న క్కమలాకరవారిఁ గ్రోలుమీ
యనుజుఁడు పద్మపత్రపుటి ♦ యం దొగిఁ దేరఁగ హాయి మీఱఁగన్. ౧౨౪౮

తనివిసనన్ = తృప్తికలుగ, నవతామరస = క్రొత్త తామరలయొక్క, అమల = శుద్ధమైన, గంధమై = పరిమళముగలిగి, సుఖోజ్జనక = సౌఖ్యమును విశేషముగఁ గలిగించు, సుశీతలంబు = మిగులఁ జల్లనిది, స్ఫాటికరౌప్యవినిర్మలంబు = స్ఫటికమువలెను వెండివలెను దెల్లనిది, అనిశము = ఎల్లవేళల, మోదహేతువు = సంతోషకారణము, కమలాకరవారిన్ = సరస్సునందలి జలము, క్రోలుమీ = త్రాగుము, పద్మపత్రపుటి = తామరాకుదొప్ప, తేరఁగన్ = తీసికొనిరాఁగా.

తా. తృప్తికలుగఁ దిని క్రొత్త తామరపూలవాసన గలదై సుఖకరమగు చల్లఁదనముగలదై స్ఫటికము వెండివలెఁ దెల్లనై సర్వదా సంతోషకరమైన యీ సరోవరజలమును నీ తమ్ముఁడు తామరాకుదొప్పయందుఁ దీసికొనిరాఁగా సంతోషముగఁ ద్రాగుము.

కం. వాలుమెకంబులు నీరము, గ్రోలుతఱిన్ ఱొప్పుకొనుచుఁ ♦ గోడెల రీతిన్
వాలాయము వచ్చుట నర, పాలా ! కానంగఁ గలవు ♦ పంపతటమునన్.

వాలుమెకంబులు = అడవిపందులు.

తా. అడవిపండులు నీరు త్రావుకోరికతోఁ గోడెలవలె ఒప్పుచు విశేషముగ వచ్చుట రాజా! పంపాతీరమందుఁ జూడఁగలవు.

కం. సుమనోభరరంజిత మగు, కమనీయకుజాళి శీత♦కాండము సంధ్యా
సమయమునఁ బచారముగొని, యమలమతీ! యుల్ల మలర ♦ నటఁగనెదు సుమీ.

సుమనోభరరంజితము = పూవుల యతిశయముచేత మనోహరమైనది, కమనీయకుజాళి = అందమైన చెట్లవరుసలు. సాయంకాలముగాన చెట్లు పూచియుండును. శీతకాండము = చల్లని జలము, సంధ్యాసమయమునన్ = సాయంకాలమందు, పచారముగొని = ప్రచారశబ్దభవము-తిరిగి, ఉల్లము = మనస్సు.

తా. సాయంకాలమువేళఁ దిరిగితివేని పూలు విశేషించి పూయుటచే సంతోషకరములైన చెట్లవరుసలను చల్లనినీళ్ళను మన స్సానందింపఁ జూడఁగలవు.

—♦ కబంధుఁడు రామునితో శబరికి దర్శన మిమ్మని చెప్పుట. ♦—

సీ. విరిదమ్మి గలువలు♦వరసుమనశ్చిత, నక్తమాలతిలక♦నవ్యతరులు
సంతసం బిడు మీకు ♦ జనము లాపూవులుఁ ధరియింప రెవ్వరుఁ ♦ దరణికులుఁడ
వాడవు తోడిమెల ♦ నూడ వెన్నఁడును, నచట మతంగసం♦యమివరుండు
తప మొనరింప నా♦తనిశిష్యగణములు, వన్యముల్ దేరంగ ♦ వనిని దిరుగ

తే. నమ్మహాత్ముల చెమ్మట♦లవని వ్రాల, వాన జనియించె నవి గాన ♦ వసుమతీశ!
యట్టిమహిమంబుఁగాంచె న♦య్యాసఘు లచటు, వీడి చన వారివరవుడు♦వీడ దధిప!

విరిదమ్మిగలువలు = వికసించిన కమలములు, కలువలు, వర = శ్రేష్ఠములైన, సుమనస్ = పుష్పములచే, చిత = నిండిన, నక్తమాల = కానుగుచెట్లు, తిలక = బొట్టుగు చెట్లు, నవ్య = అందమైన, తరులు = చెట్లు, తరణికులుఁడ = సూర్యవంశమునఁ బుట్టినవాఁడా, వన్యముల్ = అడవియందు బుట్టినవి కందమూల ఫలాదులు, వానన్ = వానియందు, వరవుడు = దాసి.

తా. వికసించిన కమలములు కలువలు శ్రేష్ఠములై యింపైన పూలచే నిండిన కానుగుచెట్లు బొట్టుగుచెట్లు మొదలగు మనోహరములైన చెట్లు మీకు సంతోషము గలిగించును. ఆ పూవులను మనుష్యు లెవ్వరు ధరింపరు. అవి యెప్పుడును వాడవు. తొడిమ లూడవు. ఆ స్థలమునందు మతంగుఁడను మునిశ్రేష్ఠుఁడు దపముచేయఁగా నతని శిష్యు లడవినుండి కందమూలఫలాదులఁ దెచ్చు సమయంబున వారి దేహములనుండి చెమటలు గాఱఁగా వానివలనఁ బుట్టినవి కావున వాని కట్టి మహిమము వచ్చెను గాని చెమట వలనఁ గలిగినవి కావున నెవరు ధరింపరు. వా రాస్థలము విడిచిపోయిరి కాని వారిదాసిమాత్ర మాచోటు విడిచినది కాదు. ఈ మతంగునకు భారతమందలి చండాలమతంగునకు సంబంధములేదు. ఇరువురు భిన్నపురుషులు. ఈ పేరుగలవారు మఱియు నొకరిరువురు గలరు. చెమట బిందు

వులు చెట్లమీఁదఁ బడి పుష్పము లాయెనని గోవిందరాజీయము. పుష్పములు విస్తారముగ నుండుటచే వీని నెవరు భరింపరని గోవిందరాజీయము.

అచటు, అచోటు, అచ్చటు, అచ్చోటు, అచ్చోటు రూపాంతరములు.

కం. చిరజీవిని శ్రమణీమణి, వరధర్మచరిత్ర శబరి♦స్వర్గముఁ జేరున్
దరిసించి దేవసము నన, వరతంబు సమస్తభూత♦వందితు నిన్నున్. ౧౨౫౨

చిరజీవిని = దీర్ఘకాలముగఁ బ్రదికియుండునది, ముసలిది, శ్రమణీమణి = గొప్ప ఆఁడుసన్న్యాసి, చతుర్థాశ్రమస్వీకారము చేసినదని యర్థముకాదు. సన్న్యాసి ధర్మములైన జ్ఞానవైరాగ్యాదులు కలది. జ్ఞానమే కదా సన్న్యాసలక్షణము. వరధర్మచరిత్ర = శ్రేష్ఠమైన గురుశుశ్రూషాధర్మము నాచరించునది, శబరి = బోయస్త్రీ. దేవసమున్ = నారాయణునితో సముఁడవైనవానిని, అనవరతంబు = సర్వదా, సమస్తభూతవందితున్ = దేవతిర్యఙ్మనుష్యాది సమస్తభూతచయములచే స్తోత్రము చేయఁబడువానిని, దరిసించి = దర్శించి, దీనివలన రామచంద్రమూర్తి పరత్వ జ్ఞానము శబరికిఁ గలదని యేర్పడుచున్నది.

తా. దీర్ఘకాలముగ జీవించియుండునది యతిధర్మమున జరించునది గురుశుశ్రూష యను పరమధర్మ మనుష్ఠించునది బోయెత భగవత్సముఁడవైన నిన్ను సర్వభూతములచే నమస్కరింపఁబడువానిని దర్శించి స్వర్గముఁ జేరును. నీ రాకకై కాచియున్నది.

ఉ. ఆమహి నాగపాళి చరిఁ♦రలాడుచు నుండియు నమ్మతంగు తే
జోమహిమాన నాశ్రమము♦నూరెలఁ జేర దొకండుఁ, దత్సరో
భూమికిఁ బశ్చిమంబునను♦బొల్చును గుహ్యతరాశ్రమోర్వి, యం
దామహిళావతంసము ని♦రంతరముం దప మాచరించెడిన్. ౧౨౫౩

ఆమహిన్ = భూమియందు, నాగపాళి = ఏనుఁగులగుంపు, చరలాడుచున్ = తిరుగుచు, నూరెలన్ = ప్రాంతముల, గుహ్యతర = మిగుల రహస్యమైన, ఆశ్రమోర్వి = ఆశ్రమప్రదేశము, మహిళావతంసము = స్త్రీలయందు శ్రేష్ఠురాలు, నిరంతరమున్ = సర్వదా.

తా. ఆ వనప్రదేశమందు నేనుఁగులగుంపు సంచరించుచు నుండునుగాని మతంగుని తపోమహిమచే నొక యేనుఁగైనను ఆ ప్రక్కలకు రాదు. ఆ సరస్సునకుఁ బడమట మిగుల రహస్యమైన యాశ్రమ మొకటి గలదు. అందా స్త్రీరత్నము సర్వదా తపము చేయుచుండును.

కం. బృందారక వననిభమై, నందనసంకాశ మగుచు♦నవ్యగరుత్మ
ద్బృందాకుల మగునావని, నందింపఁగలాఁడ వీవు♦నానాగతులన్. ౧౨౫౪

బృందారకవననిభము = దేవతల యుద్యానమగు చైత్రరథము మొదలగు వనములతో సమానము, నందనసంకాశము = ఇంద్రుని వనమగు నందనముతో

సమము, నవ్య = క్రొత్తక్రొత్తలగు, గరుత్మత్ = పక్షుల, బృంద = సమూహముచే, ఆకులము = కలఁతచెందినది, వనే = అడవియందు, సందింపఁగలాఁడవు = ఆనందింపఁగలవాఁడవు.

తా. దేవతలచైత్రరథము మొదలగువనములతోను నింద్రునినందనము తోను సమానమై వింతవింతపక్షులగుంపులచే వ్యాకులమైన యాయడవియందు నానావిధముల సంతోషింపఁగలవు.

సీ. ఆమెను గనుఁగొని ♦ యరుగుమీ యావలఁ, బంపాసరోవర ♦ ప్రాంతమునకు
నచ్చట సుమభార ♦ హారిశైలము ఋశ్య, మూకంబు పొలుచు న ♦ నేకపముల
సమ్మర్దమునఁ జేసి ♦ సౌఖ్యంబుగాఁ గొండ, నెక్కంగ, రా దది ♦ నిక్కువంబు
ఆ మలపై నిద్ర ♦ నందువాఁ డేసొమ్ముఁ, గలలోనఁ గాంచు మే ♦ ల్కనినయంత

తే. దానిఁ బడయును; బాపు లా♦ధరణిధరము
పైకిఁ జనరాదు; చని నిద్ర ♦ గైకొనినను
రాక్షసులు వారిఁ బ్రహరింత్రు ♦ రామచంద్ర!
బ్రహ్మనిర్మిత మియ్యది ♦ పార్థివేంద్ర! ౧౨౫

ప్రాంతమునకు = సమీపమునకు, సుమభారహారిశైలము = పుష్పముల యతిశయముచే మనోహరమైనపర్వతము, అనేకపముల = ఏనుఁగుల, సమ్మర్దమునఁ జేసి = రాయిడిచేత, మలపై = కొండమీఁద, ధరణీధరము = పర్వతము, ప్రహరింత్రు = తన్నుదురు, బ్రహ్మనిర్మితము = బ్రహ్మచే నేర్పాటుచేయఁబడినది.

తా. ఆమెను జూచి యాపిమ్మట పంపాసరోవరసమీపమునకుఁ బొమ్ము. ఆసరోవరతీరంబున ఋశ్యమూకమనుపర్వతము విశేషముగఁ బూచినచెట్లచే మనోహరమైనది కలదు. అందు నేనుఁగులు విశేషించి తిరుగుచుండుటచేత వాని రాయిడికిఁ గొంత యెక్కుట సుకరముగాదు. ఇది నిజము. ఆకొండమీఁద నిద్రించువాఁ డేసొమ్ము కలలోఁ జూచునో యాసొమ్ము మేలుకొనఁగానే లభించును. పాపాత్ము లాకొండమీఁద నిదురింపరాదు. అట్లు వారు నిద్రపోయిరా నిద్రలో వారిని రాక్షసులు కొట్టుదురు. రామచంద్రా! ఇది బ్రహ్మచేసిన యేర్పాటు.

తే. మనికిఁ గొనుచు మతంగాశ్ర ♦ మంబునందుఁ
బంపయొడ్డునఁ జరలాడు ♦ వారణముల
పోతములు గీఁక లిడినను ♦ భూమిధరము
మీఁదఁ జక్కఁగ వినవచ్చు ♦ మిహిరవంశ్య. ౧౨౬

మనికిఁగొనుచు = వాసముచేయుచు, చరలాడు = తిరుగు, వారణముల = ఏనుఁగుల, పోతములు = బిడ్డలు, గీఁకలు = ఘీంకారములు, మిహిరవంశ్య = సూర్యవంశమునఁబుట్టినవాఁడా. పంపసమీపమందే పర్వత మున్నదనిభావము.

తా. మతంగాశ్రమంబునందు వాసముచేయుచుఁ బంపాతీరంబున సంచరించు నేనుఁగుపిల్లలు ఘీంకరింపఁ గొండమీఁదికి బాగుగా వినఁబడును.

కం. జలధర వర్ణంబులునై, బలితము లగుకరులు మదము ♦ బలమునఁ దమలోఁ
కలహించి తోఁగి నెత్తుటఁ, దొలఁగి చనున్ వేఱు వేఱు ♦ త్రోవల నచటన్.

జలధరవర్ణంబులునై = మేఘముల కాంతిగలిగి, బలితములు = బలముగలవి, మదము బలమున = గర్వాతిశయమున, తోఁగి = తడిసి.

తా. నల్లమబ్బులవలె నల్లనై బలిష్ఠములైన యేనుఁగులు మదమునఁ దమలోఁ దాము కలహించి గుమ్ములాడి నెత్తుటఁ దడిసి యేదియు నోడిపోనమిచే వేఱు వేఱు త్రోవలఁ బోవును.

కం. విమలం బై శీతం బగు, కమలాకరవారిఁ ద్రావి ♦ కాననగజముల్
తమమీఁఁది నచ్చట యథే, చ్ఛముగా విహరించు సౌఖ్య ♦ సమ్మదమతులన్.

కమలాకరవారిన్ = సరోవరజలమును, కాననగజముల్ = అడవియేనుఁగులు.

తా. పరిశుద్ధమై చల్లనై యుండు కొలనినీటిని ద్రావి యడవి యేనుఁగులు కోరిక లతిశయింపఁగా నచ్చటనే యిష్టప్రకారము సౌఖ్యముచే సంతోషించిన మనస్సులచేఁ దిరుగుచుండును.

సీ. ఎలుఁగులఁ బులులను ♦ నింద్రనీలచ్ఛాయ, మృగములఁ గన శోక ♦ మొసలు నీకు
నాపర్వతమున మ ♦ హాగుహ యొక్కటి, యుర్వీశ యొప్పారు ♦ చుండు నదియు
రాతి పెన్మూఁతచేఁ ♦ గ్రాలెడు నద్దాని, జొరఁగఁ బూనుట సుఖ♦కరము గాదు
తద్గుహకును దూర్పు♦ద్వారంబుకడ నొండు, మంచి చల్లనినీటి ♦ మడుఁగు గలదు
తే. ఆజలాశయతీరంబు ♦ తేజరిల్లు, హరిఫలమూలయుత మయి ♦ హరిణనికర
యుక్తి నాగుహసుగ్రీవుఁ♦డుండు నయ్య, వానరచతుష్కయుతుఁ డయి♦వాలిభీతి.

వానరచతుష్కయుతుఁడు = నలుగురు వానరులతోఁ గూడినవాఁడు, వాలిభీతి = వాలివలనిభయముచే.

తా. అంటిలి ఎలుఁగుగొడ్డులను, పులులను, ఇంద్రనీలముల వన్నెగల జింకలను జూడఁగానే నీకు శోకముపశమించును. ఆ పర్వతమునందుఁ బెద్దగుహ యొక్కటి గలదు. అది పెద్దరాతిమూఁత గలది. దానిలోఁ బ్రవేశించుట సుకరముగాదు. ఆగుహకును తూర్పువాకిట నొకమంచి చల్లనినీళ్ల మడుఁగు గలదు. ఆమడుఁగునొద్దను మంచి ఫలమూలములతోఁ గూడిన చెట్లు జింకలమందలు గలవు. ఆ గుహయందు సుగ్రీవుఁడు వాలివలని భయముచే నలుగురు వానరులతోఁ గూడియుండును.

కం. ఎపుడేనియు గిరిశిఖరము, నుపరితలమునందు నిలుచు ♦ చుండు న టంచున్
విపులాధీశులకును విశదపడన్ వచియించి మింటఁ ♦ దరలుచు నిలువన్. ౧౨౬౦

ఉపరితలమునందు = మీఁదిభాగమున, విపుల + అధీశులకున్ = భూపతులకు, తరలుచున్ = పోవుచు.

కీడుగాఁ బరిణమించునని మనము దేనికి భయపడుదుమో భగవత్సంకల్పము కొలఁది యది మేలుగానే పరిణమించును. తమకు మృత్యువని తలఁచిన కబంధుని వలన నెంత మేలుకలిగెనో చూడుఁడు. మనము మేలు కలుగునని తలఁచినవారి వలనఁ గీడు కలుగుటయు భగవత్సంకల్పమే.

తా. ఒకానొకప్పుడు పర్వతము పైభాగమందు గుహ విడిచి నిలుచుండును అని యా రాజకుమారులకుఁ జెప్పి ప్రయాణమునకు సిద్ధపడఁగా.

కం. పొమ్మని సెలవిచ్చిన వాఁ, డు మ్ముదమునఁ బోయె రాముఁ ♦ డుం దమ్ముఁడు శీ
ఘ్రమ్మునఁ బడమటిదెస గో, త్రమ్ములు మధుమధురఫలయు ♦ తమ్ములు వనముల్.

వాఁడుమ్ముదమునన్ - వాఁడున్ + ముదమునన్ - ప్రాసంబున మకారంబు పరమగుచో ద్రుతమునకు మకారాదేశమగు - త్రి. శే సంధి ౨౨ సూ.

గోత్రమ్ములు=కొండలు, మధు=తేనెవలె, మధుర=తియ్యనైన, ఫల = పండ్లతో, యుతమ్ములు = కూడినవి.

తా. పొమ్మని యాజ్ఞసేయఁగా వాఁడు సంతోషముతోఁ బోయెను. రాముఁడు లక్ష్మణుఁడు త్వరగాఁ పడమటిదిశగా కొండలు, తియ్యని పండ్లుగల యడవులు.

—♦ ౭౪-వ సర్గము. రామలక్ష్మణులు శబరిం జూచుట. ♦—

కం. తరువులు గనుచుం జని భూ, ధరముసమీపమున నాఁటి ♦ తమిఁ బుచ్చి తమో
హరుఁ డుదయించిన నిర్మల, తరవారిమనోజ్ఞపంప ♦ తటముం గనుచున్. ౧-౨

తరువులు = చెట్లు, భూధరముసమీపమునన్ = పర్వతముదగ్గఱ, నాఁటి తమిన్ = ఆ దినము రాత్రి, నాఁడు = ఇచ్చట, నాఁడుశబ్దమునకు ఆదినమని యర్థము. ఇది భూతమునను ప్రయోగింపఁబడును. 'నాఁటి కై దేండ్లవాఁడను నాఁడు నృపాలపుత్రి వనినమ్మి వరించితిఁగాక,' భాస్కరుఁడు. తమోహరుఁడు=చీఁకటిని బోఁగొట్టువాఁడు, సూర్యుఁడు, నిర్మలతర = మిగుల బరిశుద్ధమైన, వారి = నీళ్ళుగల, మనోజ్ఞ = అందమైన, పంప = పంపయొక్క, తటమున్ = తీరమును.

తా. చెట్లుఁ జూచుచుఁబోయి కొండదగ్గఱ నారాత్రి గడపి సూర్యోదయము కాఁగానే పరిశుద్ధజలముగల పంపయొక్క తీరముఁ జూచుచు.

కం. వరుణదిశాతీరంబున, నరసి యచట శబరి రమ్య ♦ మగు నాశ్రమమున్
బరికించి చేరఁజన న, త్తరుణియు వెస లేచి మోడ్చె ♦ తన హస్తంబుల్.

వరుణదిశా = పడమటిదిక్కు, అరసి = వెదకి.

తా. పడమటిదిక్కు నొడ్డునందు వెదకి యచట శబరియుండు రమ్యమగు నాశ్రమమును జూచి సమీపింపఁగా ఆమె త్వరగాలేచి చేతులు మోడ్చె.

పంపయొడ్డున నీ యాశ్రమ మిప్పటికి నున్నది. ఈ గుహావాకిటఁ బట్టపగ

లెండలు మండిపోవునమయంబున(గూర్చుండినను వస్త్రము కప్పుకొనవలసినంత చల్లనిగాలి వీచుచుండును.

కం. వారలపదములు సోకి(గ, సారమతిక్ (ముక్కి పాద్యజల♦మిడి తగు స త్కారములెల్ల యథావిధి(, దీరిచి నిలుచున్న రామ♦దేవుం డనియెన్.

టీ. వారి పాదములంటి నమస్కరించి పాద్యమిచ్చి తగిన యుపచారముల నెల్ల శాస్త్రప్రకారము గావించి నిలువఁబడియుండఁగాఁ శ్రీ రామచంద్రదేవుం డిట్లనెను.

సీ. నీ తపోవ్రతములు♦నిర్విఘ్నితంబులై, సాగుచున్నవిగదా♦సాధుశీల !
యాగ్రహామునయందు♦నాహారమునయందు, నియమంబు గలదుగా♦నిర్మలాత్మ
నీనియమంబులు♦నెఱవేరుచున్నవే, మనసు నిమ్మళమయి♦యొనరు నమ్మ
గురుపరిచర్యలు♦కొనసాగుచున్నవే, సఫలంబులా యవి♦చారుచరిత

ఆ. యనుచు రాముఁ డడుగ♦న తపోధనురాలు, సిద్ధసమ్మతయగు♦సిద్ధురాలు
కౌసలేయుఁజూచి♦ఘనభక్తియుక్తి ని,ట్లనియెఁ దన తెఱంగు ♦ వినయమునను.

నిర్విఘ్నితంబులు = విఘ్నములులేనివి, ఆగ్రహామునయందు=కోపమునందు, ఆహారమునయందు=తినెడి పదార్థమందు మితమందు, నిమ్మళము = శాంతి, కలవర పాటులేనిది, కౌసలేయుఁడ్ = కౌసల్యాపుత్రుఁడగు రాముని-అపత్యార్థకతద్ధితాంతము.

నిర్విఘ్నితంబులు—కామము, క్రోధము, లోభము, వీనివలని విఘ్నములు కలుగుటలేదుకదా. ఈమూఁడును దపస్సు నాశముచేయుటయేకాక నరకమునకు ద్వారము లగును.

త్రివిధం నరకస్యేదం, ద్వారం నాశన మాత్మనః ।
కామః క్రోధ స్తథా లోభ, స్తస్మాదేత త్త్రయం త్యజేత్ ॥

భగవద్గీత, ౧౬-౨౧

కామముచేఁ దపస్సు నాశముచేసికొన్నవారు విశ్వామిత్రాదులు. కావున తపస్వులు రీమూఁటికి నెడమీయరాదు. ఆగ్రహాము తపస్సునకు విఘ్నము కలిగించు నదేయైనను కామాదులకంటె దుర్జయమైనది కావున నిది ప్రత్యేకముగఁ జెప్పఁ బడెను. అక్రోధనుఁడ కరం బధికుఁడం(డు తత్త్వవిధిజ్ఞల్' భార.

ఆహారమునయందు = నిషిద్ధవస్తువులఁ దినకుండుట నిషిద్ధకాలములఁ దిన కుండుట, నిషిద్ధవిధముగఁ దినకుండుట, మితభుక్తి, సాత్త్వికపదార్థభుక్తి లోనైనవి.

ఆహారశుద్ధౌ సత్త్వశుద్ధిః సత్త్వశుద్ధౌ ధ్రువా స్మృతిః" "తపోనానశనా త్పరం" మ్మని యుపనిషత్తులు చెప్పుచున్నవి.

పంక్తిలోభుజించువారితో నుపచారవాక్యములు మాట్లాడవచ్చును. ఇతర విషయములు మాటలాడరాదు. అట్లు మాటలాడినయెడల 'భూర్భువస్సువరోమ్'

అని జపించి శేషమును (మిగిలినపదార్థము) భుజించవచ్చును. నోటినుండి జారి పడినదానిని, భుజింపఁగా మిగిలినపదార్థమును, కబలశేషమును మరల తినరాదు. పిండివంటకము, కూరలు, దుంపలు, ఫలములు మొదలగువానిని చేతితోవిఱిచి తినవలెను. పండ్లతో కొఱికి తినరాదు. విస్తరియందు ఉప్పునొకటి ప్రత్యేకముగా వేయరాదు. పెరుఁగులోఁగాని, మజ్జిగయందుఁగాని చేర్చియుంచవలెను. నూనెతో వండినవిగాని, పచ్చివిగాని, గరిటెలతో నుంచరాదు. అన్నము, వ్యంజనములు (కూరలు, పచ్చడులు), మంచినీరు, పెరుఁగు, పాలు, నెయ్యి చేతితో నుంచరాదు. గరిటెలు మొదలగువానితో వడ్డింపవలెను. అట్టివిలేనిచో ఆకునైన నాధారముచేసికొని వడ్డింపవలెను. అన్నమునందుగాని, వ్యంజనములందుగాని భుజించునప్పుడు దోషములనుఁ జెప్పరాదు.

దేవాలయమందునుఁ, జీకటియందును, బట్టబయటను, మిద్దెలపైభాగమునను, వట్టినేలయందు, పాడుపడినయింటియందు భుజింపరాదు. పగటియందుఁగాని, రాత్రియందుఁగాని, రెండుపర్యాయములు భుజింపరాదు. రాత్రి రెండు జాములు దాఁటినతరువాత, అర్ధరాత్రియందు, పగలు రెండుజాములందు (అనఁగా 12 గంటలప్పుడు) భుజింపరాదు. నిలుచుండిగాని, కుర్చీ మున్నగువానిమీఁదఁ గూర్చుండిగాని, ఆచమనముచేయకుండఁగాని, ఒంటివస్త్రముతోఁగాని, తల గుడ్డతోఁగాని, ఇతరులనుదాఁకిగాని, చండాలురయు, బయటఁజేరినవారియొక్కయు (ముట్టువారు), శూద్రులయొక్కయు మాటలనువినుచుఁగాని, పతితాదులతో సహపంక్తినగాని భుజింపరాదు. చేతియందుఁగాని, దోసిలియందుఁగాని విడిఆకులోఁగాని, మట్టిపాత్రయందుఁగాని, వస్త్రమునందుగాని భుజింపరాదు.

ఒకపంక్తిలో భుజించుచుండఁగాఁ దాను ముందుగా భుజించి లేచి వెళ్ళరాదు. త్వరగా లేచివెళ్ళవలసివచ్చినయెడల అప్పుడు అగ్నిహోత్రము, బూడిద, స్తంభము, ఉదకము, దర్భలు, ద్వారబంధము మొదలగువానిలో నొకదానిని పంక్తిభేదము గల్పించి లేచి వెళ్ళవచ్చును.

నూనెగానుగ, చెఱకుగానుగ, పతితులు, శూద్రులు, ముట్టుతలు, రోఁకలిపోటు, మొదలగువానిశబ్దము వినుచు భుజింపరాదు, భోజనసమయమందు భార్య మొదలగువారితో పోట్లాడుట, పుత్రులు మొదలగువారిని కోపించుట, ఎంగిలిపదార్థములు పెట్టుట పనికిరాదు. పాయసము, పెరుఁగు, క్షీరములు, ఉదకము, నెయ్యి, వీనిని చప్పిడికాకుండఁ (శబ్దము కాకుండ) ద్రాగవలెను. పాత్రలో నున్నయుదకమును గాని, త్రాగఁగా మిగిలిననీరుగాని భూమియందు కొంచెము పోసి పుచ్చుకొనవచ్చును. పెరుఁగు, పాలు, నెయ్యి, నీరు, పిండి, మొదలగునవి పాయసాన్నముతప్ప నన్నియు సశేషముగా భుజించవలెను. రాత్రిభోజనసమయమందు దీప మారిపోయినయెడల ఆసమయమందు సూర్యుని మనస్సున స్మరించి చేతులతో పాత్ర

మును దాఁచియుండి తిరిగి దీపము ంచుటకు భుజింపరాదు. దీపముంచినతరువాత పాత్రయందున్న పదార్థము మాత్రమే భుజింపవలెను. ప్రతికబళమునకు గోవింద నామ ముచ్చరించుచు భుజింపవలెను.

జాతిదుష్టము:—ఎఱ్ఱగడ్డ, తెల్లగడ్డ, ముల్లంగి, తెల్లవంకాయ, సొర కాయ, మునఁగకాయ, తాండ్ర, అడవికంద, ఎఱ్ఱఅవిస, కుమ్మట్టి, తాణికాయ, మునగకూర, చిల్లగింజ, మట్టికాయ, అత్తికాయ, బీరకాయ, గోంగూర, చిట్టి కూర, చేదుపొట్ల, చవిటిఉప్పు, గానుగపిండి (నువ్వుపిండి), ఎఱ్ఱయింగువ, దొండ కాయ, కుక్కగొడుగు, రావి, గంజాయి, సజ్జలు, జొన్నలు, ఆళ్ళు, కునుములు, రాగులు, (నువ్వులు, మినుములు) ఇదిగాక మిగిలిన నల్లధాన్యములు గవ్యానున్నము మొదలైనవి.

క్రియాదుష్టము:— ఋతుస్నానదినమున స్త్రీచే తగిలినపదార్థము (౪-వ దినము), పంచసంస్కారములుగానివారిచే పక్వముచేయఁబడిన యన్నము, చేతితో కలిపినపెరుఁగు, నోటితోనూఁదబడినది, ఇతరులచేతితో ముట్టుకొనఁబడినది, వస్త్రము చేత వడకట్టఁబడని యుదకము, పునఃపాకము చేయఁబడిన యన్నము, విక్రయాన్నము, వేయించిన యుప్పు, సారముతీసికొనఁబడిన పిప్పిపదార్థములు, దీపములేకుండ వెన్నెల, అగ్ని మొదలగు వెలుతురులందు రాత్రులందు భుజించిన యన్నము, భోజన మధ్య మందుంచుకోఁబడిన నెయ్యి, గోటితోఁ జీల్చఁబడిన (గిల్లఁబడిన) వస్తువులు, తాత, ఆచార్యులు, పెద్దఅన్న, భర్త, వీరియొక్క యుచ్ఛిష్టముతప్ప మిగతావారి యెంగిలి (యుచ్ఛిష్టము), కాఁచిన కొబ్బరినీరు మొదలైనవి.

కాలదుష్టము:—మూఁడు సంవత్సరములకు పైఁబడిన ధాన్యము, ఒకమాసము పైఁబడిన బియ్యము, నొకమాసమునకు మించిన వడియములు, పదునైదుదినము లకు పైఁబడిన నెయ్యి, నూనె, పెసరపప్పు, పదునైదు దినములకు మించి వాఁడునట్టి మట్టిపాత్రములయందు వండెడి పదార్థములు, ఒక దినముమించి నిలువయున్న యుద కము, ఒక రాత్రికి పైఁబడిన పక్వపదార్థములు, పాలు, ఉప్పు, వక్కలు, పసుపు, వడియాలు, పిండివడియములు, వేయించినబియ్యము, వేయించిన కందులు, పెసలు, మొదలైనవానికి పర్యుషిత (చలిది) దోషములేదు సున్నము, మిరియాలు, ఊరుఁ గాయలు, అల్లము, బెల్లము పాకము, పిండితోచేరిన పెరుఁగు, అటుకులు, క్షీరా న్నము, పేలాలు, నీటియందుంచిన యన్నము, నూనె, నెయ్యి, పెరుఁగు, వీని యందు దేనితోనైనను చేర్చినయన్నము, ఫలములు, కోవా, మందు, పునఃపాకము చేసిన కూరలు, అకాలమందు ఉత్పత్తిచేయఁబడిన ఫలములు. పాడ్యమినాఁడు గుమ్మడికాయ, విదియయందు వంకాయ, అష్టమిదినమున టెంకాయ, దశమి పొట్ల కాయ, ఏకాదశి చిక్కుడుకాయ, త్రయోదశి నువ్వులు, చతుర్దశి చింతపండు, సప్తమి ఆదివారము ఉసిరిక, పగటియందు పాలు, వెలగపండు, పేలపిండి, రాత్రు

లందు నువ్వులుకలసిన పదార్థములు పెరుఁగు, పిండి, తేనె, నూనె, అల్లము, పితృదినములందు బూడిదగుమ్మడి, వంకాయ, పచ్చిమిరపకాయ, పొట్లకాయ, కొత్తిమీర, ఇంగువ, నిమ్మపండు, బఱ్ఱెపాలు, కందిపప్పు, ఆవాలు, శనగపప్పు, బొబ్బరులు (అలచందలు), ఉలవలు, తెల్లచిక్కుడు, కొయ్యతోటకూర; ద్వాదశిపారణయందు చింతపండు, ఆవాలు, మినుములు, శనగపప్పు, నువ్వులనూనె, వంకాయ, కదళీపంచకము (అరఁటిఆకు, పువ్వు, కాయ, పండు, ఊచ) పనికిరావు.

సంసర్గదుష్టము :— ఉప్పుతోఁగూడిన నెయ్యి, పాలు; పురుగులు, ఈఁగలు, వెండ్రుకలు, గోళ్ళు వీనితోనిండిన యన్నము (ఆపత్కాలమందట్టి యన్నము తినవలసివచ్చినచో వానికి సంబంధించిన పిడికెడు అన్నమును తీసివేసి మిగతా ప్రసాదమందు భగవత్పాదతీర్థము ప్రోక్షించి భుజింపవచ్చును.) సన్న్యాసుల భిక్షాపాత్రమందున్న యన్నము, సన్న్యాసులచేత యియ్యఁబడిన యన్నము, సొంకాయతోఁ జేరినపాలు, చింతపండు చేర్చిన పెసరపప్పు, చిక్కుడు, ధనియాలు, పొట్లకాయ మొదలైనవి.

ఆశ్రయదుష్టము :— కంచుపాత్రయందుంచిన కొబ్బరినీరు, రాగిపాత్రయందుంచిన తేనె, నెయ్యి,పాలు;ఇనుపపాత్రతో వడ్డించిన పదార్థములు, ఇనుపపాత్రమందుంచఁబడిన నీరు, ఆవుయీనిన పదినాళ్ళలోని పాలు, మజ్జిగకలిసిన పాలు, చూడియావుపాలు, దూడచచ్చిన ఆవుపాలు, రెండుదూడలు పుట్టిన ఆవుపాలు (కవలదూడలు), పింగాణి మొదలగు పాత్రములందుంచఁబడిన యుదకము మొదలగునవి.

నిమిత్తదుష్టము:— బ్రాహ్మణులచే విక్రయించఁబడిన పాలు, పెరుఁగు, మజ్జిగ; కుక్క, కాకి, కోడి, ఎలుక, పిల్లి, ముంగిస మొదలగువానిచే తగిలిన యన్నము, కూరలు మున్నగునవి; మనుష్యులు, పశువులు పీనిచే వాసనచూడఁబడిన యన్నము, కాళ్ళుకడుగుకొనఁగా మిగిలిన నీరు, కాలికి తగిలిన యన్నము, కాళ్ళతోఁ దాటిన యన్నము, సత్రమందు పెట్టిన యన్నము, చలివేంద్రయందు ఉదకము, విసుకుకొనుచు (తిట్టుచు) పెట్టిన యన్నము, సింహద్వారముంయుఁగాక దొడ్డివాకిటనుండి లోపలికి తీసికొనివెళ్ళఁబడిన యన్నము, మాడినయన్నము; నాలుగుసారులు బియ్యము కడుగక వండిన యన్నము; పెసరపప్పుకూరలు, ఫలములు, పేరు తెలియని పదార్థములు; తనకొఱకై చేయించుకోఁబడిన పదార్థములు, భూమిమీఁదపడని వర్షపునీరు మొదలగునవి.

తా. సాధుచరిత్రా! నీ తపస్సులు వ్రతములు విఘ్నములులేక జరుగుచున్నవి కదా! కోపమునందు ఆహారమునందు నిర్మలమగు మనస్సుగలదానా! నియమము గలదుకదా! నీవు నియమించుకొన్న వ్రతములు నెఱవేఱుచున్నవా? మనస్సు సర్వదా ప్రసన్నమయి శాంతమైయున్నదా? గురుసేవలు కొనసాగుచున్నవా? దాని

వలనిఫల మనుభవమునకు వచ్చుచున్నదా ? యని రామచంద్రమూర్తి ప్రశ్నింపఁగా తపస్సే ధనముగాఁగల యా పుణ్యస్త్రీ ముక్తులగువారికి సమ్మతమైన నడవడికల యా యోగసిద్ధురాలు కౌసల్యాపుత్రునిఁ జూచి మిగులభక్తితోఁ దనవిధము వినయముతో నిట్లనెను :

గురువు, గురుపుత్రులు లేరుగదా. ఇప్పు డేమి గురుశుశ్రూష యనరాదు. గురువుపోయినను నిజమైనశిష్యులు గురుపాదుకలున్నను నుంచుకొని వానికి గురుపూజ విధముగనే పూజ చేయవలయును. 'యస్య దేవే పరాభక్తి ర్యథా దేవే తథా గురౌ। తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః॥' శ్వేతాశ్వతర. భగవంతుని యందు పరమభక్తియు, దేవునియందువలె గురువునందు నట్టిభక్తియుఁగల మహాత్మునకే యీ చెప్పఁబడిన రహస్యవిషయములు మనస్సునఁ బ్రకాశించును. ప్రత్యక్షగోచరము లగును. కావున గురుబోధ మనస్సునఁ బ్రకాశించి దానిఫలము నంద వలయునను వాఁడు నిర్మలచిత్తుఁడగుటయే గాక దేవునియందు గురువునందు పరమభక్తిగలవాఁడై యుండవలెను. గురుభక్తిలేనివానికి నాయన చెప్పిన విషయములు మనస్సునకేరావు. ఇఁక ఫలానుభవ మెక్కడ ? ఈనిమిత్తమయియే కదా రామచంద్రమూర్తి 'సాధుశీల, నిర్మలాత్మ మనసు నిర్మలమయి యున్నదా' యని ప్రశ్నించి యావల గురుపూజాఫలముగలదా యని ప్రశ్నించెను. సిద్ధురాలనుటచే నీమె యోగారూఢ యనియే చెప్పవలసియున్నది. అందు సిద్ధసమ్మతయుఁట.

సీ. ఇపుడెకా ఫలియించె♦హితగురుశుశ్రూష, నిన్నుఁ జూచుటఁజేసి♦నిర్మలాత్మ
యిపుడెకా సిద్ధించెఁ♦దపములు వ్రతములు, నీదర్శనంబున♦నీరజాక్ష
యిపుడెకా నాజన్మ♦మెల్ల సార్థకమయ్యెఁ, గనులార నినుఁ జూడఁ♦గౌసలేయ
యిఁక నెకా స్వర్గంబు♦నే నేగఁగందును, దివుట నిన్ బూజింప♦దేవవర్య

ఆ. నీ దయార్ద్రదృష్టి♦నిహతపాతకనైతి, నరివిదారి ! యక్ష♦యంబులైన
పదము లందుదానఁ♦బరమభవ్యచరిత్ర, యఘులతాలవిత్ర♦యసితగాత్ర.

రామచంద్రుప్రశ్నకుఁ బ్రత్యుత్తరముగా పరమార్థవాక్యములను నుపచారవాక్యములవలెనే చెప్పుచున్నది. ఇపుడెకా=ఇప్పుడేకదా, దేవవర్య = దేవతలయందు శ్రేష్ఠుఁడా యనుటచే శబరికి శ్రీరామచంద్రమూర్తివిషయమునఁ బరతత్త్వజ్ఞానము గలదని సూచింపఁబడియె. దయార్ద్రదృష్టిన్ = దయారసముచేఁ దడిసిన చూపుచే, నిహతపాతకన్ = నాశము చేయఁబడిన పాపముగలదానను, అరివిదారి = భక్తులయందలి అరిషడ్వర్గమగు కామక్రోధలోభమోహమదమాత్సర్యములను జీల్చువాఁడా, కామాదిజయము భగవదనుగ్రహమునఁ గలుగవలయునే కాని కేవల స్వప్రయత్నమున నగునదికాదు. భగవంతుఁడు హృషీకేశుఁడు (ఇంద్రియముల శాసించువాఁడు) చ॥ యమనియమాదియోగముల నాత్మ నియంత్రితమయ్యుఁ గామరోషములఁ బ్రచోదితంబ యగు శాంతిపహింపదు విష్ణుభక్తిచేఁ గ్రమమున శాంతి

నైకొనినక్రైవడి॥ భాగ॥ అట్టులే పాపములు భగవదనుగ్రహముచే నశింపవలయును గాని కేవల మచేతనకర్మములగు కృచ్ఛ్రచాంద్రాయణాదులచే నశింపవు. అక్షయంబులు = ఇంద్రలోకబ్రహ్మలోకాదిసౌఖ్యములు, నశ్వరములు = శాశ్వతంబులుగావు, 'ఆబ్రహ్మభవనాల్లోకాః పునరావర్తినోర్జున' అన్నట్లు కావున పునరావృత్తిలేని లోకములను - ముక్తిని, అఘులతాలవిత్ర = పాపమనుతీఁగలకు కొడవలియైనవాఁడా, అసిత = నల్లని, గాత్ర = దేహముగలవాఁడా: నీదయార్ద్రదృష్టి నిహతపాతకనైతి. నీదయార్ద్రదృష్టి యరిషడ్వర్గము జయించితిని. నీదయార్ద్రదృష్టి యక్షయపుణ్యలోకములను గందు నని యన్వయము.

ఐహికసుఖములైనను ఆముష్మికసుఖములైనను మోక్షమైనను భగవదనుగ్రహముచే లభించునుగాని మనము చేయుకర్మజ్ఞానయోగములచేఁ గాదు. ఇవి వ్యవధానకారణములు. అవ్యవధానకారణము భగవత్సంకల్పమే. అది వచ్చునట్లు చేయునది భక్తియే. దానికి కర్మజ్ఞానయోగములు సాధనములు. భక్తితోఁ గూడిననే ఫలవంతములు, లేకున్న వ్యర్థములు.

మనస్సు వాక్కు కాయము శుద్ధములుగా నుంచుకొని గురుభక్తి దైవభక్తి గలవారమైతిమేని భగవంతుఁడు మనల వెదకికొనుచుఁ దానే వచ్చునని యీశబరీ రామచరిత్రమువలన నేర్పడుచున్నది. భగవద్దర్శనాపేక్షయుండినఁ జాలును. రామచంద్రమూర్తిని వెదకుచుఁ బోయి దర్శింప శబరికి సాధ్యమా?

తా. అపహతపాపా! నాగురుశుశ్రూషకు ఫలము నిన్నుఁ జూచుటచే నిప్పుడే కదా ఫలించెను. గురుశుశ్రూషకు ఫలము భగవత్సాక్షాత్కారము. అది నాకిప్పుడే కలుగుటచే గురుశుశ్రూష యిప్పుడే ఫలించెను. అట్టులే నాతపములకు వ్రతములకు ఫలమేమి? భగవత్సాక్షాత్కారమే. అదియు నీదర్శనంబునఁ బుండరీకాక్షా! ఇపుడే ఫలించెను. భూమి జన్మించినవారిలో సార్థకజన్ముఁ డెవఁడు? భగవంతుని సాక్షాత్కరింపఁజేసికొనినవాఁడే. ఇప్పుడు నేను నిన్నుఁ గన్నులారఁ బ్రాకృతచక్షువులచేఁ జూడఁగలుగుట నాజన్మము సార్థకము. దేవతాశ్రేష్ఠుఁడా! నిన్నుఁ జేతులారఁ బూజించుటచే నిఁకఁగదా మోక్షము పొందఁగలను. నీదయార్ద్రదృష్టి పాపములు నశించెను. అరిషడ్వర్గము హతమయ్యెను. మోక్షము లభించెను.

ఉ. శ్రీరఘురామ! నేఁ బరిచరించుచు నుండినమద్గురూత్తముల్
పారతపోధనుల్ చనుచు స్వర్గముఁ జేరఁగ మీరు చిత్రకూ
టోరుధరంబునం దుఃకియుం బిఁతమ్ముఁడు నీవు నీయెడన్
జేరఁగ వత్తురంచును విశిష్టగతిన్ మిముఁ జూచినంతటన్. ౧౫

పరిచరించుచున్ = సేవసేయుచు, చిత్రకూటోరుధరంబునన్ = చిత్రకూటపర్వతంబున, విశిష్టగతిన్ = మిగుల శ్రేష్ఠమైనవిధముగ.

తా. శ్రీరఘురామచంద్రా! నేను శుశ్రూషచేయుచుండిన నాగురువులు

మీరు చిత్రకూటమునకు వచ్చినారనియు నిందు వచ్చెదరనియు. మీ దర్శనము చేసి కొంటినేని.

చ. ఒదవెడు నవ్యయం బగు న ♦ నుత్తమలోకము లంచుఁ జెప్ప స
న్మదమెదఁ గ్రమ్మ నీ కొఱకు ♦ మంచివి మంచివి యేఱి కోరి పె
క్కు దెగల వన్యసంతతులఁ ♦ గూరిచి యుంచిన దాన; నన్ను ని
ర్వ్యదళితవైరి జ్ఞానపద ♦ పీవరిణద్ధ దృఢాత్మమానసా. ౧౨౬౮

తా. మరల జన్మమునకు రాని లోకము లభించు నని చెప్పిన కారణమున సంతోషముతో మీకయి మంచివి కోరి యేఱి నానావిధములయిన కందమూల ఫలాదులు సంపాదించియుంచితిని. అని చెప్పఁగా శత్రుసంహారకుఁడగు రామచంద్రమూర్తి జ్ఞానపదమునఁ జక్కఁగాఁ గట్టఁబడినదానిని, దృఢాత్మమానసా = దృఢమైన పరమాత్మవిషయమైన మనస్సుగలదానిని.

ఉత్తమలోకము ఆత్మావలోకనపరులకు లభించు కైవల్యమనియు, అనుత్తమ లోకము భగవదవలోకనపరులకు లభించుముక్తియనియు గోవిందరాజీయము. జ్ఞానపదపీవరిణద్ధ - దృఢాత్మమానస ననుటచే, జీవాత్మపరమాత్మసంబంధజ్ఞానము దృఢముగఁగలదని యేర్పడుచున్నది. దీనిచే నీమెకు యోగమందేకాక జ్ఞానమందును భక్తియందును పారముముట్టినట్లు గ్రహింపనగు.

ఇచట శబరియందు సహజస్త్రీత్వము వ్యక్తము. శరభంగాది పురుషఋషులు రామునిరాక ముందుగ నెఱిగినవారే. ఆవేళకు నాశ్రమమున నున్న పండో కాయో సమర్పించినవారే. శబరియో ముందుగానే యేర్పఱిచి తెచ్చియుంచినది. 'మాతాసమో నాస్తి శరీరపోషణే' యన్నట్లు దేహపోషణ ముత్తమస్త్రీల లక్షణము. అది వారికి సహజగుణము. అతిథి వచ్చిన నాఁకలిదప్పులు విచారించువారు వారేకదా.

చ. శ్రమణిని గాంచి యిట్లనియె ♦ రాముఁడు త్వద్గురుసత్ప్రభావము౯
శ్రమణిరో యాదనుప్రభవు♦సన్నిధి వింటిని, గన్నులార నా
శ్రమమువిచిత్రముల్ గనఁగఁ ♦ జాలఁ గుతూహల మయ్యె వానిని౯
గ్రమముగఁ గానిపింపు మది ♦ గల్గినయేని యటన్న నామెయు౯. ౧౨౬౯

తా. శబరిని జూచి రామచంద్రమూర్తి యిట్లనియె. 'అమ్మా! నీ గురువుల ప్రభావము దనుపుత్రుఁడు చెప్పఁగా వింటిని. అది ప్రత్యక్షముగాఁ జూడఁగోరెదను. కావున నీకు నిష్టమున్నయెడల నాచిత్రములను గనఁబఱుపుము.'

—♦ శబరి రామలక్ష్మణులకు మతంగాశ్రమమునందలి వింతలు చూపుట. ♦—

సీ. ఇదె ఘనాఘనతుల్య ♦ మృగపక్షిసంకీర్ణ, మైనమతంగవ ♦ నాంతరంబు
ఇచ్చోటఁ దమమంత్ర ♦ భృశశక్తిఁ దీర్థముల్, కల్పించి మాగురుల్ ♦ గ్రాలినారు
పఠకుటివేది మ ♦ త్స్వాములు వణఁకుచే,తులఁ బూలఁ బూజలు ♦ సలిపినారు

వారితపఃప్రభా♦వంబున వేదులు, నేఁడును వెలిఁగించె ♦ నిఖిలదిశల
ఆ. నిట్టుపాసములను♦నిర్గతసత్త్వులై, నడువలేమిఁ జింతఁ♦దంబు సేయ
సప్తసాగరములుఁ♦దనుదెంచె నిచటికిఁ, జూడవయ్య రామ♦సుగుణధామ.

ఘనాఘనతుల్య=వర్షించు మేఘముతో సమానమైన, "ఘనాఘన స్స్వేంద్రే వర్షుక మేఘే, ఘాతుకమత్తేభే, త్రిషు త్వయం సాంద్రే ॥నానా॥ర॥ మృగపక్షిసంకీర్ణము మృగములచేతను పక్షులచేతను నిండినది. ఇది విశేషణోభయపదకర్మధారయము. భృశ=అధికమైన, నిట్టుపాసములను=శుష్కోపవాసములచే, నిర్గతసత్త్వులై=సత్తువలేనివారై.

అని యడుగఁగా శబరి యిట్లనియె. రామచంద్రా! వర్షించు మేఘమువలె నల్లనై వ్యాపించి మృగములచేతను పక్షులచేతను నిండియుండు నిదియే మతంగవనము. ఈ స్థలమునందుఁ దమ మంత్రముల యధికశక్తిచే మా గురువులు తీర్థములను గల్పించినారు. పడమటివేదిమీఁద మాస్వాములు (శిష్యులు గురువు సొమ్ము కావున స్వామియని ప్రయోగము.) ముసలితనముచే వణఁకుచున్నను భగవదారాధనము మానక పూలచేఁ బూజించినారు. వారి తపోమహిమచే వేదులు వారులేకున్నను దిక్కులనన్నిటిని ప్రకాశింపఁజేయుచున్నవి. దీనివలన నాచార్యులు లేకున్నను వారి కభిమతమైన ప్రదేశములు పదార్థములు శిష్యులకు నత్యంతోద్దేశ్యములని సూచితము. శుష్కోపవాసములుచేసి బలహీనులయి నడువలేని కారణమున సముద్రములకుఁ బోఁజాలక పిలువఁగా నేఁడు సముద్రము లిచ్చటికే వచ్చెను. రామచంద్రా! చూడుము.

ఉ. తానములాడి వల్కపరి♦ధానము లీద్రుమశాఖలం దిడన్
మానవనాథ! యీ యవి♦నాగురువర్యు తపంబు పెంపునన్
మ్లానత నొందకున్నవి సు♦మంబులు చూడుము దేవపూజయం
దా నియమాఢ్యు లుంచినవి♦యాదర మార సుశీలతానిధీ. ౧-౨౭౧

తానములు=స్నానములు, వల్కపరిధానము=నారలచేసైన కట్టువస్త్రము, ద్రుమశాఖల=చెట్లకొమ్మలందు, ఇడన్=ఉంచఁగా, మ్లానత=వాడకుండుట, సుశీలతానిధీ=సద్వర్తనమునకు స్థానమైనవాఁడా, ఈ పద్యమువలన శిష్యుఁడు గురువుమహిమ ప్రకటింపవలయునని సూచితము. 'గురుం ప్రకాశయే ద్ధీమాన్' అని శాస్త్రము.

తా. మా గురువులు స్నానముచేసి తడిసిన నారవస్త్రములను నీ చెట్లకొమ్మలందుంచి పోయిరి. వారి తపఃప్రభావముచే నేఁటికి నవి యాఱకున్నవి. వారు దేవతారాధనమందుఁ బూజించిన పూలు నేఁటికిని వాడకున్నవి.

కం. వింటివి వినఁదగుదానిని, గంటివి వనమెల్ల నింకఁ♦గాయము విడి నే
దంటలగు నాదుగురువులఁ, గంటకుఁ జన నానతిమ్ము♦కాకుత్స్థ యనన్.

కాయము = దేహము,విడి = వదలి, దంటలు = సమర్థులు, కంటకన్ = చూచుటకు, ఆనతి = ఆజ్ఞ.

తా. వినఁదగువాని నెల్ల వింటివి. చూడఁదగినవానిని జూచితివి. ఇఁక నేను నాగురువులున్నచోటికిఁ బోయి వారల దర్శింపవలెను. రామచంద్రా! ఆజ్ఞయిమ్ము.

ఇది యాచార్యాభిమానముచేఁ గలుగుఫలము. ఆచార్య లేలోకమునకుఁ బోదురో వారిశిష్యు లాచార్యునం దభిమానముగలిగి వారిప్రీతికిఁ బాత్రులయిన వారును ఆలోకమునకే పోదురు. ఇది నిర్వ్యంచకశుశ్రూషాఫలము.

కం. అచ్చెలువపలుకులను విని, మెచ్చుచు శ్రీరామవిభుఁడు ♦ మెలఁతకు ననియెన్
వచ్చెను నీమసపర్యలు, సచ్చరిత! యథాసుఖంబు ♦ చను కోర్కిమెయిన్.

తా. ఆపుణ్యాత్మురాలు చెప్పినపలుకులు విని యామెగురుభక్తికి దైవభక్తికి మెచ్చుకొని రామచంద్రమూర్తి యామె కిట్లనియెను. సాధుచరితా! నీవు చేయ నుద్దేశించిన సత్కారములన్నియు గ్రహించినట్లే యెంచుము. నీకోరికప్రకారము పొమ్ము.

ఉ. ఆజనకాత్మజేశుఁ డిటు ♦ లాజ్ఞ యిడన్ ముదిబోయచేడె కృ
ష్ణాజినచేల యాయతజ♦టాన్విత యాత్మసమాధి వహ్నులం
దోజమెయిం గళేబరము ♦ నొప్పగ వీడి లసత్పరిష్క్రియా
రాజితదివ్యదేహ యయి ♦ క్రచ్చఱఁ జేరె మునీంద్రసన్నిధిన్. ౧౨౭౪

కృష్ణాజినచేల = కృష్ణాజినము వస్త్రముగాఁ గట్టుకొన్నది, ఆయతజటాన్విత = దీర్ఘములయినజడలుగలది, ఆత్మసమాధి = ఆత్మవిషయయోగబలముచే, వహ్నులన్ = యోగబలముచేఁ గల్పించినయగ్నులందు, ఓజమెయిన్ = ఉత్సాహముతో, కళేబరము = దేహము, కళే+అవరము = కళేబరము, వబలకభేదము. లసత్ = ప్రకాశించుచున్న, పరిష్క్రియా = అలంకారములచే, రాజిత = ప్రకాశించు, దివ్య = దేవతాసంబంధమైన, దేహయయి = శరీరముగలదై, క్రచ్చఱన్ = శీఘ్రముగా, మునీంద్రసన్నిధిన్ = గురువులగు ఋషుల సమీపప్రదేశమును.

దీనివలన నాచార్యశుశ్రూష భగవదనుగ్రహమును సంపాదించి మోక్షమునకుఁ గారణమగునని యేర్పడుచున్నది.—గోవిందరాజీయము.

ఈశబరిచరిత్రవలన విదురాదిశూద్రవిశేషులకుఁబోలె స్త్రీలకు - జ్ఞానమందు యోగమందు దేవపూజాదులందు నధికారము గలదు. యజ్ఞాదులగు వైదికకర్మములందు నధికారములేదు. వానిస్థానమున గురుశుశ్రూష నియమితము. దీని వలని ఫలము స్వర్గము, అవ్యయలోకము చెప్పఁబడెను. దేవతలుండు స్వర్గము అవ్యయముగాదు. 'ఏవమేవాముత్ర పుణ్యచితోలోకః క్షీయతే' యన్నట్లు స్వర్గాదులు నశ్వరములుకాఁబట్టి పునరావృత్తిలేని వైకుంఠము చేరినదని యెఱుంగునది. —గోవిందరాజీయము, స్వర్గశబ్దము మోక్షస్థానపర్యాయముగఁ బ్రయోగములు

గలవు. 'విద్వేషా దపి గోవిందం దమఘోషాత్మజః స్మరన్ । శిశుపాలో గత స్స్వర్గం కింపున స్తత్పరాయణః' అత్రిస్మృతి.

భక్తిసంజీవని యందలి శబరీవిషయమైన వ్యాసమిందుఁ బ్రకటింపఁబడెను.

—♦ శబరి ♦—

శబరియనఁగా శబరజాతిస్త్రీ. శబరులు బోయలు. శబరి బోయస్త్రీ. ఈమె విషయము శ్రీమద్రామాయణమున నరణ్యకాండమునఁ గలదు. ఈమె శ్రమణి యని చెప్పఁబడెను. శ్రమణియనఁగా సంసారసంగము లేక నియతవ్రతయై యావజ్జీవము బ్రహ్మచర్య మవలంబించి విరక్తురాలై తపస్సుచేయుచుండు స్త్రీ. శ్రీరామలక్ష్మణులు సీతను వెదకుచు నరణ్యసంచారము చేయునపుడు మార్గమధ్యమునఁ గబంధుని వధించిరి. ఆయన దివ్యరూపము ధరించి శ్రీరామున కిట్లు చెప్పెను.

సీ. ...అచట మతంగసం ♦ యమివరుండు, తప, మొనరింప నా ♦ తని శిష్యగణములు
వన్యముల్ దేరంగ ♦ వనిని దిరుగ.

తే. నమ్మహాత్ముల చెమ్మట ♦ లవనిఁ వ్రాల, వానజనియించె నవిగాన ♦ వసుమతీశ
యట్టిమహిమంబుఁ గాంచె న ♦ య్యరణ్య మచటు, వీడిచన వారిపరవుడు ♦ వీడ దధిప.

కం. చిరజీవిని శ్రమణీమణి, వరధర్మ చరిత్రి శబరి ♦ స్వర్గముఁ జేరున్
దరిసించి దేవసము నన, వరతంబు సమస్తభూత ♦ వందితు నిన్నున్.

ఆమెను గనుఁగొని యరుగు మావల నని కబంధుఁడు బోధింప శ్రీరాము లట్లులే యామె యొద్దకుఁ బోయి యామెను దర్శింప నామెయు లేచి మ్రొక్కు లిడియెను. అంత శ్రీరాముఁ డిట్లు లామెను బ్రశ్నించెను.

సీ. నీ తపోవ్రతములు ♦ నిర్విఘ్నితంబులై, సాగుచున్నవిగదా ♦ సాధుశీల !
యాగ్రహమునయందు ♦ నాహారమునయందు, నియమంబుగలదుగా ♦ నిర్మలాత్మ !
నీ నియమంబులు ♦ నెఱవేఱుచున్నవే, మనసునిమ్మళమయి ♦ మొనరునమ్మ !
గురుపరిచర్యలు కొన ♦ సాగుచున్నవే, సఫలంబులా యవి ♦ చారుచరిత !

ఆ. యనుచు రాముఁడడుగ ♦ నత్తపోధనురాలుఁ, సిద్ధసమ్మతయగు ♦ సిద్ధురాలు
కౌసలేయుఁ జూచి ♦ ఘనభక్తి యుక్తి ని,ట్లనియెఁ దన తెఱంగు ♦ వినయమునను.

సీ. ఇపుడెకా ఫలియించె ♦ హితగురుశుశ్రూష, నిన్నుఁ జూచుటఁ జేసి ♦ నిర్మలాత్మ !
యిపుడెకా సిద్ధించెఁ ♦ దపములు వ్రతములు, నీ దర్శనంబున ♦ నీరజాక్ష
యిపుడెకా నా జన్మ ♦ మెల్ల సార్థకమయ్యెఁ, గనులార నినుఁ జూడఁ ♦ గౌసలేయ
యిఁక నెకా స్వర్గంబు ♦ నేనేఁగఁగందును, దివుట నిన్ బూజింప ♦ దేవవర్య

ఆ. నీదయార్ద్రదృష్టి ♦ నిహతపాతకనైతి, నరివిదారి యక్ష ♦ యంబులైన
పదములందుదాన ♦ పరమభవ్యచరిత్ర, యఘులతాలవిత్ర ♦ యసితగాత్ర.

ఉ. శ్రీరఘురామ ! నేఁ బరిచ ♦ రించుచునుండిన మద్గురూత్తముల్
సారతపోధనుల్ చనుచు ♦ స్వర్గముఁ జేరఁగ మీరు చిత్రకూ

టోరుధరంబునం దునికి ♦ యుం బ్రియతమ్ముఁడు నీవు నియెడన్
జేరఁగవత్తు రంచును వి ♦ శిష్టగతిన్ మిముఁ జూచినంతటన్.

చ. ఒదవెడునవ్యయంబగు న ♦ నుత్తమలోకములంచుఁ జెప్ప స
మ్మదమెదఁ గ్రమ్మ నీకొఱకు ♦ మంచివి మంచివి యేఱి కోరి పి
క్కుటెగల వన్యసంతతులఁ ♦ గూరిచియుంచినదాన నన్ను ని
ర్వ్యదళితవైరి జ్ఞానపద ♦ వీపరిణద్ధ దృఢాత్మమానసన్.

చ. శ్రమణిని గాంచి యిట్లనియె ♦ రాముఁడు త్వద్గురుసత్ప్రభావమున్
శ్రమణిరో యాదనుప్రభవు ♦ సన్నిధి వింటిని గన్నులార నా
శ్రమము విచిత్రముల్ గనఁగఁ ♦ జాలఁగుతూహలమయ్యె వా
నిన్ గ్రమముగఁ గానిపింపు మది ♦ గల్గినయేని యటన్న నామెయున్.

— ♦ శబరి రామలక్ష్మణులకు మతంగాశ్రమమునందలి వింతలు చూపుట. ♦ —

సీ. ఇదె ఘనాఘనతుల్య ♦ మృగపక్షిసంకీర్ణ, మైన మతంగ ♦ వనాంతరంబు
ఇచ్చోటఁదమమంత్రభృశ ♦ శక్తిఁ దీర్థముల్, కల్పించి మాగురుల్ ♦ గ్రాలినారు
పడమటివేది మ ♦ త్స్వాములు వణఁకుచే, తులఁ బూలఁ బూజలు ♦ సలిపినారు
వారితపఃప్రభా ♦ వంబున వేదులు, నేఁడును వెలిఁగించె ♦ నిఖిలదిశల

ఆ. నిత్యుపాసములను ♦ నిర్గతసత్త్వులై, నడువలేమిఁ జింత ♦ నంబుసేయ
సప్తసాగరములు ♦ చనుదెంచె నిచటికిఁ, జూడవయ్య రామ ♦ సుగుణధామ.

ఉ. తానములాడి వల్కపరిధానము ♦ లీ ద్రుమశాఖలం దిడన్
మానవనాథ యాఱ వవి ♦ నాగురువర్యతపంబు పెంపునన్
మ్లానత నొందకున్నవి సుమంబులు ♦ చూడుము దేవపూజయం
దానియమార్ఘ్య లుంచినవి ♦ యాదరమార సుశీలతానిధీ.

కం. వింటివి వినఁదగుదానిని, గంటివి వనమెల్ల నింకఁ ♦ గాయము విడి నే
దంటలగు నాదుగురువులఁ, గంటకుఁ జన నానతిమ్ము ♦ కాకుత్స్థ యనన్.

కం. అచ్చెలువపలుకులను విని, మెచ్చుచు శ్రీరామవిభుఁడు ♦ మెలఁతకు ననియెన్
వచ్చెను నీదుసపర్యలు, సచ్చరిత! యథాసుఖంబు ♦ చను కోర్కెమెయిన్.

ఉ. ఆజనకాత్మజేశుఁ డిటు ♦ లాజ్ఞయిడన్ ముదిబోయచేడె కృ
ష్ణాజినచేల యాయతజ ♦ టాన్విత యాత్మసమాధి వహ్నిలం
దోజమెయిం గళేబరము ♦ నొవ్వఁగ వీడి లసత్పరిష్క్రియా
రాజితదివ్యదేహయయి ♦ క్రచ్చఱఁ జేరె మునీంద్రసన్నిధిన్.

ఇప్పుడు మన మాలోచింపవలసిన విషయములు :—

౧. శబరి బోయెతగదా యామెకు బ్రహ్మజ్ఞానమం దధికారము గలదా ?

౨. శూద్రుఁడైన శంబుకుఁడు తపస్సుచేసె నని యతనివధించిన రాముఁడు శబరి నెట్లు గారవించి కృతార్థురాలను జేసెను ?

౩. శబరి రామునకుఁ బెట్టినవి యెంగిలిపండులా ?

—♦ శూద్రులకు బ్రహ్మజ్ఞానమునం దధికారముగలదా? ♦—

ఇది మొదటఁ జర్చింపవలసిన విషయము:—

'రాఘవః ప్రాహ విజ్ఞానే తాం నిత్యమబహిష్కృతామ్,' అని మూలమందుఁ గలదు. అనఁగా విజ్ఞానమునందు నిత్యముగ బహిష్కరింపఁబడనిది యని యర్థము. ఇచట విజ్ఞానమనఁగా, విశేషజ్ఞానము బ్రహ్మజ్ఞాన మనియర్థమే కాని యమరుఁడు చెప్పిన శిల్పజ్ఞానముగాదు శబరికి లభించినబ్రహ్మలోకము శిల్పజ్ఞానముచే రాదు. అదిగాక యోగసమాధిచే దేహము విడిచె నని చెప్పుటచే నామె మహాయోగిని యని స్పష్టపడుచున్నది. కావున శబరికి బ్రహ్మజ్ఞానము లేదనుట సరిగాదు. అట్లైనచో బ్రహ్మసూత్రములందు నపశూద్రాధికరణంబున 'సూ॥ శుగస్య తదనాదరశ్రవణాత్తదాద్రవణాత్సూచ్యతేహి॥'

౩౫ క్షత్రియత్వ గతేశ్చోత్తరత్ర చైత్రరథేన లింగాత్

౩౬ సంస్కారపరామర్శాత్ తదభావాభిలాపాచ్చ

౩౭ తదభావనిర్ధారణేచ ప్రవృత్తేః

౩౮ శ్రవణాధ్యయనార్థప్రతిషేధా త్స్మృతేశ్చ.

ఈ సూత్రములు శూద్రుఁడు బ్రహ్మజ్ఞానమున కధికారికాఁడని స్పష్టముగ నిషేధించుచున్నవి. ఈసూత్రములకు వ్యాఖ్యానము వ్రాసిన శ్రీశంకరరామానుజ మధ్వశుకబలదేవ నింబార్కాచార్యులందఱు శూద్రుల కధికారములేదని వ్యాఖ్యానము వ్రాసియున్నారు.

నారదచరిత్రమునందు నారదుఁడు పూర్వజన్మంబున దాసీపుత్రుఁడై యుండినపుడు ఋషులచే జ్ఞానోపదేశము పొందినట్లు భాగవతమునఁ గలదు. విదురుఁడు బ్రహ్మజ్ఞానియగుట స్పష్టము. ఇట్టివారు మఱికొందఱు గలరు.

ఈ పరస్పరవిరుద్ధవిషయములకు సమన్వయమెట్లు? గతసంచికయందు శూద్రులకు బ్రహ్మజ్ఞానమునం దధికారములేదని శారీరకమీమాంసాసూత్రము లనువదింపఁబడెను. ఆసంచికయందే నారదుఁడు తనపూర్వజన్మమునఁ బరిచారికాపుత్రుఁడుగా నున్నప్పుడు కొందఱుఋషులును, శబరికి మతంగమహామునిశిష్యులును బ్రహ్మజ్ఞాన ముపదేశించినట్లు వ్రాయఁబడెను. ఋషీశ్వరచర్య శాస్త్రవిరుద్ధమా యని యాలోచింపవలసియున్నది. సామాన్యవిధి యని విశేషవిధి యని విధులు రెండువిధములు. "సత్యంవద" సత్యమును జెప్పుము. అని శ్రుతిసామాన్యధర్మము విధించుచున్నది. అట్లుండియు నిష్కారణముగ నిరపరాధులకుఁ గీడుగలుగు నట్లు చెప్పెడుసత్యమువలనఁ బాపము సంభవించుననియు నట్టి సందర్భముల సత్యముఁ జెప్పరాదనియు శాస్త్రములు చెప్పుచున్నవి. మొదటిది సామాన్యవిధి. రెండవది విశేషవిధి. 'అహింసా పరమో ధర్మః॥' అహింసయే యుత్తమధర్మ

మనునది సామాన్యవిధి. యజ్ఞములందుఁ బశుహింసచేయవచ్చు ననుట విశేష విధి. సామాన్యవిధికంటె విశేషవిధి, బలీయము. సామాన్యవిధిననుసరించి దశరథుఁడు భగవంతుఁడైన శ్రీరాముని విడనాడి స్వర్గలోకగతుఁడయ్యెను. విశేష విధి ననుసరించి యసత్యమాడి వసుదేవుఁడు కృష్ణుని దక్కించుకొని ముక్తుఁడయ్యెను. అన్నిసామాన్యవిధులకు ఫలము సోపానమార్గమున భగవత్ప్రాప్తియే. భగవద్ధర్మమునకు ఫలము సద్యోముక్తియే. కావున సామాన్యవైదికధర్మమునకంటె భగవద్ధర్మము బలీయము. అనఁగా నట్టిదావశ్యకమైనపుడు వైదికధర్మము వదలియైనఁ దనకులధర్మమువిడిచియైన భగవద్ధర్మము ననుష్ఠించుట శ్రేయస్కరము. భక్తిసంజీవని బోధించునది భగవద్ధర్మమే. భక్తిప్రపత్తు లనుష్ఠానమార్గములు. కర్మము ప్రధానముగా నెంచి తరించుటకు దానిపై నాధారపడక భగవంతునే యాధారముగాఁ గొని కర్మము గౌణముగా నెంచువారు భగవద్ధర్మనిష్ఠులు. వీరి మతము ననుసరించి శబరికి బ్రహ్మజ్ఞానమం దధికారము కలదు. వైదికధర్మము ప్రకారము సంస్కారార్హులై వైదికకర్మయోగ్యులైన బ్రాహ్మణాదులుమాత్రమే ముక్తి కర్హులు. స్త్రీశూద్రాదులు కారు. భగవద్ధర్మముప్రకారము భగవంతుఁడు సర్వసముఁడు, భక్తప్రియుఁడు, దీనజనపక్షపాతి, లోకజనకుఁడు. కావున నాధర్మమం దుండువా రందఱు జాతివివక్షలేక వీరువారనక, పుణ్యులు, పాపులు, బాలురు, వృద్ధులు, స్త్రీలు, పురుషు లనుభేదములేక భగవంతు నాశ్రయించినవారందఱు భగవత్కటాక్షమునకుఁ బాత్రులే. ఎట్లనః—భక్తులు ప్రపన్నులు, శూద్రులైనను బోయలయినను జండాలురైనను భగవద్ధర్మనిష్ఠులైరేని వారిని జాతిసామాన్యదృష్టి ననఁగా వారిని దక్కిన శూద్రులను బోయలను జండాలురను జూచునట్లు చూచువారు నరకమునకుఁ బోదురని భగవద్ధర్మశాస్త్రము చెప్పుచున్నది.

శ్లో॥ య శ్శూద్రం భగవద్భక్తం, నిషాదం శ్వపచం తథా।
వీక్షతే జాతిసామాన్యా, త్స యాతి నరకం నరః॥

అని ప్రమాణము. అట్లైన వారిని నేదృష్టితోఁ జూడవలయు ననిన

శ్లో॥ నశూద్రా విష్ణుభక్తాశ్చ, విప్రా భాగవతా స్స్మృతాః।
విష్ణుభక్తులు శూద్రులుగారు. విప్రులు, భాగవతులు.

అని చెప్పుటచే నట్టిభక్తులను బ్రాహ్మణులను నందు భాగవతులను జూచు దృష్టిచేఁ జూడవలయునని యర్థము. ఇట్టి విష్ణుభక్తులలక్షణ మెట్టిదై యుండవలయు ననినః—

శ్లో॥ మద్భక్తజనవాత్సల్యం, పూజాయాం చానుమోదనమ్
తత్కథాశ్రవణేభక్తిః, స్వర్వనేత్రాంగవిక్రియా ।
స్వయమారాధనే యత్నో, మదర్థే దంభవర్జనమ్।
మమానుస్మరణం నిత్యం, యచ్చ మాం నోపజీవతి॥

భక్తిరష్టవిధా హ్యేషా, యస్మిన్ మ్లేచ్ఛేపి వర్తతే।
స విప్రేంద్రో, మునిః, శ్రీమాన్, స యతి స్సచ పండితః॥
తస్మై దేయం తతో గ్రాహ్యం, సచ పూజ్యో యథాహ్యహమ్।

అర్థము: నాభక్తజనులయందుఁ బ్రేమ, పూజచేయుటయందు సంతోషము, నాకథలు వినుటయందు దత్యంతానురాగము, నాకీర్తనలు పాడుటయందు నన్ను గుఱించి చెప్పుటయందు డగ్గుత్తిక, దేహమునందు గగ్గురుపాటు, కన్నులయందు నీరు, తాన నన్నారాధించుటయందుఁ బ్రయత్నము (పూజాద్రవ్యములు స్వయంకృషిచే సంపాదించి స్వహస్తములఁ బూజించుట), నానిమిత్తముగ దంభములేక (మెప్పు మెచ్చులకుఁగాదు) కార్యములుచేయుట, ఎల్లప్పుడు నన్నే స్మరించుచుండుట, నన్ను విడిచి జీవింపలేకయుండుట యను నీయెనిమిదివిధములభక్తి మ్లేచ్ఛునియందుండినను వాఁడే విప్రశ్రేష్ఠుఁడు, వాఁడే ముని, వాఁడే శ్రీమంతుఁడు, వాఁడే యతి, వాఁడే జ్ఞాని. వానినిమిత్తమై దానమీయవచ్చును. వానిచే గ్రహింపవచ్చును. నావలె వాఁడును బూజ్యుఁడు, అని భగవద్వాక్యము.

ఇట్టిభక్తిఁగలవాఁడు వర్ణహీనుఁడని నీచదృష్టిఁ జూడరాదు. పూజ్యుఁడనియే గౌరవింపవలయును. ఏలన, అతనియందు మ్లేచ్ఛ, నిషాద, శ్వపచాది శబ్దములు సార్థకములుగావు. ఏల ? ఆ శబ్దార్థముల కతఁడు విషయభూతుఁడుకాఁడు కావున :—

ఈయెనిమిదింటియందు ముఖ్యముగఁ గడపటిదానిగుఱించి కొంచెము చెప్ప వలసియున్నది. అది భక్తికిఁ బరాకాష్ఠ కావునఁ గడపటఁ జెప్పఁబడినది.

"నన్ను విడిచి జీవింపలేకయుండుట" యన నేమి ? ఈ గుణము పరమభక్తిని దెలుపుచున్నది.

శ్లో॥ "మయ్యేవ మనఆధత్స్వ, మయి బుద్ధిం నివేశయ ।
నివసిష్యసి మయ్యేవ, అత ఊర్ధ్వం నసంశయః॥ భగ. ౧౨ వ అధ్యా.

నాయందే మనస్సుంచుము. బుద్ధి నాయందే నిలుపుము. ఇటు చేసినయెడల నిటుపిమ్మట నీవు నాయందే వసింతువు. సందేహములేదు, అనియర్థము.

ఏవకారార్థము (అందే) ప్రాకృతపదార్థములందు విషయములందు నేమాత్ర మైన మనస్సును బోనీయరాదని నిషేధించుచున్నది. అనఁగా నేయుపాయముచే నైన సర్వకాల సర్వావస్థలయందు నేయవయవముతో నేకార్యమును చేయు చున్నను మనస్సు బుద్ధి భగవంతునియందే యుంచవలయును.

అనఁగా ననన్యార్హుఁడై యనన్యశరణ్యుఁడై యనన్యోపాయుఁడై యనన్య ప్రయోజనుఁడై సర్వదా యుండవలయును. అనన్యుఁడు = సూర్యునకు నెండ, చంద్రునకు వెన్నెల, సముద్రమునకు నల, అగ్నిహోత్రమునకు మిణుఁగురు నెట్లో యట్లే

తాను భగవంతునంశమై విశేషణమై ధారణపోషణములకు భగవంతుని యందే యాధారపడి తాను భగవంతునివాఁడేగాని వేఱుగాదను నభిప్రాయము గలవాఁడు.

అనన్యశరణ్యుఁడు = భగవంతునికంటెఁ దన్ను రక్షింపఁగలవాఁడు, తన్ను రక్షింపుమని కోరఁదగిన యోగ్యుఁడు వేఱొకఁడు లేఁడని తలఁచువాఁడు.

అనన్యోపాయుఁడు = తరించుటకు భగవంతుని కృపదప్ప వేఱుపాయము లేదనుకొనువాఁడు.

అనన్యప్రయోజనుఁడు = భగవత్ప్రాప్తి దప్ప వేఱుఫలము కోరనివాఁడు, ఇట్టి వాఁడు భక్తుఁడు. ఇట్టివాని భక్తి యనన్యభక్తి.

భగవదనుగ్రహముఁ దప్ప వేఱేదియుఁ భక్తుఁడు కోరఁడు. కావున నది యెంత శీఘ్రముగా లభించునాయని తహతహపడుచుండును. వీని తహతహ యెట్టిదై యుండు ననిన రామకృష్ణపరమహంస లిట్లు తమశిష్యున కొకనికిఁ దెలిపిరి.

రామకృష్ణపరమహంస శిష్యులలోనొకఁడు భగవద్విషయమైన భక్తుని మన స్సెట్టిదై యుండునని ప్రశ్నించెను. ఆశిష్యుని గంగకు స్నానార్థమై పిలుచుకొనిపోయి గంగయందు వాఁడు మునిఁగినప్పుడు రామకృష్ణ పరమహంసలవారు వానిని నీళ్ళలో నట్టె యదిమెను. కొంతసేపు వాఁడు నీటిలో గిజగిజ తన్నుకొన్న తరువాత చేయి విడిచి వాఁడు లేచినతరువాత నీటిలో మునిఁగినప్పుడు నీ మనస్స్థితి యెట్టిదై యుండె నని యడిగెను. ఎప్పు డీముప్పునుండి తప్పించుకొని బయటఁబడుదునా, యెప్పుడు గాలి పీలుతునా, యని యుండెనని శిష్యుఁడు చెప్పెను. అట్టి పరితాపమే నీకు సంసార విష యమై యెప్పుడు కలుగునో భగవత్కటాక్షమునకై యెప్పు డేకాచుదునో యప్పుడు నీకు భక్తి కలదని యనుకొనుము, అని చెప్పెను.

ఇది నిజమైన భక్తిలక్షణము. దీనికే పరమభక్తి యనిపేరు. ఇదియే యార్త ప్రపత్తి. ఇట్టిదశ వచ్చునఁతకు నెవ్వఁడు భక్తుఁడనుపేర బిలువఁబడుటకు యోగ్యుఁడు కాఁడు. పూజాదులు గౌణభక్తియే. యోగసమాధియు గౌణభక్తియే, గౌణభక్తి యవ్యవధాన మోక్షకారణము గాదు· (క్రమముగనగును. పరమభక్తుఁడే సద్యోముక్తి కర్హుఁడు. అవ్యవధానము = ఎడములేనిది)

శ్లో॥ నచసీతా త్వయాహీనా, నచాహమపి రాఘవ।
ముహూర్తమపి జీవావో, జలాన్మత్స్యావివోద్ధృతౌ॥

నిన్ను విడిచి సీతగాని నేనుగాని రామా! నీటినుండి బయటవేసిన చేపవలెఁ గొంచెము కాలమైన జీవింపఁజాలము, అని లక్ష్మణుఁడు చెప్పెను. అట్టులే చేసెను. ఇది పరమభక్తి. ఇది పరమప్రేమస్వరూపము.

శ్లో॥ యన్ముహూర్తం క్షణంవాపి, వాసుదేవో నచింతితః।
సాహాని స్తన్మహచ్ఛిద్రం, సాభ్రాంతి స్సాచవిక్రియా ॥

ఏకస్మిన్నప్యతిక్రాంతే, ముహూర్తే ధ్యానవర్జితే।
దస్యుభిర్ముషితానేన, యుక్తమాక్రందితుం భృశమ్॥

వాసుదేవుని జింతింపని యొకముహూర్తమైనను క్షణమైనను గలిగెనేని యదియే ప్రాణహాని. అదియే మహాఛిద్రము. అదియే భ్రాంతి. అదియే వికారము. అల్పకాలమైనను భగవద్ధ్యానములేక కాల మతిక్రమించెనేని దొంగలచే సర్వస్వము దోచుకుపోయినట్లు వెక్కివెక్కి యేడువవలయును. ఇది పరమభక్తి లక్షణము. "యచ్చమాం నోపజీవతి" నన్ను విడిచి జీవింపలేకయుండుట యనుట కిది లక్షణమని యెఱుంగవలయును. ఇదియే భగవద్ధర్మసారతమము. శ్రీకోదండరామ సేవక సమాజసభ్యులందఱు నన్ని వర్ణములవారు స్త్రీలు, పురుషులు నిట్టి యుత్తమస్థితి కీ జన్మమందే, దేహము పడిపోవుటకుముందే వచ్చుటకు దృఢప్రయత్నము చేయుదురుగాక యని వాసుదాసుఁడు ప్రణామపూర్వకముగాఁ బ్రార్థించుచున్నాఁడు. ఎట్టిభక్తుఁడైన, మ్లేచ్ఛుఁడైనను, మనీషాపంచకమందు శంకరాచార్యులవారు "చండాలోస్తు సతుద్విజోస్తు" అని చెప్పిన స్థానిమైన చండాలుఁడుగాని తన పూర్వపుణ్యావశమున వాసుదాసుఁడు నెంకు లభించునా యని యేకాంచుచున్నవాఁడు.

బ్రహ్మయు ఘటకారుఁడే, నేను ఘటకారుఁడనే కావున బ్రహ్మవలె నన్ను గౌరవింపుఁడని కుమ్మరవాఁ డనుటయు, ఖద్యోతశబ్దము సూర్యునందు నాయందు వర్తించును గనుక నేను సూర్యుఁడు సమానులమని మిణుగురుపురుగు అనుటయు, శబరి విదురాదులు శూద్రులు కావున వారికివలె మాకును బ్రహ్మజ్ఞానమం దధికారము గలదని జాతిమాత్రసామాన్యముచే వారజాతులవా రనుటయు సమానములు. బ్రహ్మజ్ఞానమునకు నధికారి మహావిశ్వకము. బ్రాహ్మణుఁడైనను జాతిమాత్రోపజీవి యగు బ్రహ్మబంధు వగునేని బ్రహ్మజ్ఞానమున కధికారిగాఁడు. బ్రహ్మసూత్రమునందలి నిషేధసూత్రములు సామాన్యవిధులు. మీఁద వనువదించిన భగవద్ధర్మశాస్త్రవాక్యములు విశేషవిధులు.

మీఁదఁజెప్పిన పరమభక్తి పరజ్ఞానములేక రాదు. పరభక్తిలేక పరజ్ఞానము రాదు. అష్టాంగయోగయుక్తమయిన గౌణభక్తి లేక పరభక్తి లభింపదు.

శ్లో॥ దర్శనం పరభక్తిస్స్యాత్, పరజ్ఞానంతు సంగమమ్।
పునర్విశ్లేషభీరుత్వం, పరమాభక్తిరుచ్యతే॥

అర్థము : దర్శనము (ఆత్మసాక్షాత్కారము) పరభక్తియగును. ఈదశయందు నాత్మను జూచుటమాత్రము కలుగును. దానితోడి కొంచెముకాలము సంగమము పరజ్ఞానము. దానితోడి వియోగము కలుగునేమో యను భీతి పరమభక్తి యగును.

"సాక్షాత్కారతుల్యవిశద్యవతీ ధ్యానశబ్దవాచ్యా పరభక్తిః। తతః సాక్షాత్కారవాణీత్యభిసివేశానంతర తత్కాలనియతసాక్షాత్కారః పరజ్ఞానమ్। తతో నిరంతరసాక్షాత్కారాభినివేశహేతుభూతాసాక్షాత్కృతే బ్రహ్మణి నిరతిశయ విపుల

సుఖత్వవిషయిణీ యావిశేషప్రీతి స్సాపరమభక్తిరితి నిష్కర్షః॥" కనులకు నెదురఁగానవచ్చినపు డెంతవిశదముగా నాకరూపము గానవచ్చునో యంతవిశదముగా ధ్యానవేళ మనస్సున నాత్మగోచరించెనేని యట్టిధ్యానము పరభక్తి యనఁబడును. ఆ పిమ్మట భగవంతునిసాక్షాత్కారము చేసికొందు నని పట్టుదల గలుగఁగా నా సమయమందుమాత్రము కించిత్కాలము సాక్షాత్కారము గలుగుట పరజ్ఞానము. ఇది యాసాక్షాత్కార మెడఁదెగక యెల్లప్పు డుండవలయు ననుపట్టుదలకుఁ గారణమగును. అట్లు సాక్షాత్కరించిన బ్రహ్మమునందు నిరతిశయమై విపులమై సుఖకారణమైన ప్రీతి కలుగును. ఇది విశేషప్రీతికిఁ బరమభక్తి యనిపేరు.

కావునఁ బరభక్తి లభించుటకు నాత్మజ్ఞాన మవశ్యమగుచున్నది. ఈ కారణముచే సప్తవిధభక్తులు సాధించిన యోగసాధనకు నాత్మజ్ఞాన ముపదేశింపవచ్చును.

శబరి యెంతగొప్పతల్లియో యెంతసాధించినదో తెలుపుటకుఁగాను నింత దూరము వ్రాయవలసివచ్చెను.

మోక్షమున కుపాయములు కర్మజ్ఞానభక్తిప్రపత్తులేగాక యాచార్యాభిమాన మనునైదవయుపాయము పేరుకొనఁబడినది. ఇందు శిష్యునకుఁ బరమార్గము పరమోపాయము సర్వస్వము గురువే.

శ్లో॥ యస్య దేవే పరాభక్తి ర్యథా దేవే తథా గురౌ ।

అని శ్వేతాశ్వతరోపనిషత్తు చెప్పినట్లు దేవునియం దెట్టి విశేషభక్తియో యట్టియుత్తమభక్తి గురువులయందుఁ గలిగి శిష్యుఁడు శబరివలె యానిష్ఠనో నారదునకుఁ బూర్వజన్మమందునవలె గురువు లనుజ్ఞ యిచ్చువఱకో యంతేవాసియై యుండి వారలకు సేవలుచేయుచు వారుచెప్పినది విని యా ప్రకారము నడచుకొనుచు వా రనుగ్రహించినది సాధింపవలయును. ఒకఁడు దీపము చేతఁబట్టుకొని ముందుపోవుచుండ మఱికొంద ఱా వెలుతురునందుఁ బోవుట యెట్టిదో యాచార్యాభిమాన మట్టిది. ఇందు శబరివలె శిష్యులు గురువు పోవులోకమునకుఁ బోవుదురు. కావున నీమార్గమున నడచువారు తా మెట్టివానిని గురువుగా గ్రహింపవలయునో వారే యెఱుంగుదురుగాక! గ్రుడ్డివెంటఁ బోవుగ్రుడ్డి గుంతలోఁ గూలును. ఈ కారణముచే శబరిచర్యగాని యామెగురువులచర్యగాని శాస్త్రవిరుద్ధమైనది కాదు. కావున రాముఁ డామెను దప్పుపట్టలేదు. మఱి మెచ్చి పలికెను. అనుగ్రహించెను.

శబరి ముముక్షువు, మోక్షమందాశగలది. శంబుకుఁడు బుభుక్షువు, భోగమం దాసక్తిగలవాఁడు. కావుననే యతఁడు హఠయోగమార్గమున విపరీతకరణి (తలక్రిందుగ వ్రేలాడుట) సాధింపఁజొచ్చెను. శంబుకవధనాటకమందు శంబుకుని ముముక్షువుగాఁ జెప్పుట సత్యవిరుద్ధమైన కవికల్పితము.

శబరితపస్సు సక్రమము, శాస్త్రీయము, ఆచార్యోపదిష్టము, శంబుక తపస్సు అక్రమము, అశాస్త్రీయము, అనాచార్యోపదిష్టము.

మోక్షాధికారికి శాస్త్రము, క్రమము, విధినిషేధములు లేవు.

శ్లో॥ అత్యంతభక్తియుక్తానాం, నచశాస్త్రం నచక్రమః।
నిస్త్రైగుణ్యే పథి విహరతాం, కోవిధిః కోనిషేధః?॥

త్రిగుణాతీతమైనమార్గమందు నడచువానికి విధినిషేధములు లేవు. అత్యంత భక్తియుక్తునకు (పరమభక్తునకు) శాస్త్రము క్రమము లేదు. ఈవాక్యములు త్రిగు ణాతీతుఁడు పరమభక్తుఁడు నగునారూఢునకు కన్వయించునుగాని బిడాలకాదులకుఁ గాదు, సాధకదశయందుండువారికిని గాదు.

ఇట్టి యధికారియైనవాఁ డేవర్ణమువాఁడైనను జ్ఞానోపదేశమునకు సమ్మతుఁడే యనుభగవద్ధర్మశాస్త్రముకూడ హీనవర్ణునకు మంత్రోపదేశాధికార మున్నట్టు చెప్పఁగా నిదివఱకు నేను జదివినగ్రంథములందుఁ గానరాలేదు. అట్టిశాస్త్ర వాక్యము లున్నయెడల నెవ్వరైన వానిననువదించుచు సప్రమాణముగ వ్రాసిరేని సంజీవని సంతోషముతోఁ బ్రకటింపఁగలదు. సంజీవని సత్యాన్వేషియే కాని హఠ వాదినిగాదు. మంత్రోపదేశముచేయువిషయమున శాస్త్రవాక్యములు నాకుఁగాన రాలేదుగాని (అల్పజ్ఞుఁడఁగుటయేకారణము) జ్ఞానోపదేశముచేయు విషయమునఁ బ్రమాణవాక్యములు కానవచ్చుచున్నవి. జ్ఞానమనఁగా హితాహితబోధ. ఇది మంచి యిదిచెడ్డ యని చెప్పుట.

శ్లో॥ ప్రాప్యం జ్ఞానం బ్రాహ్మణా త్క్షత్రియా ద్వా।
వైశ్యా చ్ఛూద్రా దపి నీచా దభీక్ష్ణమ్॥

బ్రాహ్మణునివలనఁగాని క్షత్రియునివలనఁగాని వైశ్యునివలనఁగాని శూద్రుని వలనఁగాని, నీచునివలననైనను జ్ఞానమును బొందవచ్చును.

శ్లో॥ నాచార్యః కులజాతోఽపి, జ్ఞానాభక్త్యాదివర్జితః।

ఉత్తమకులమందుఁబుట్టినవాఁడైనను, జ్ఞాన, భక్తి, సదాచారసంపత్తులు లేనివాఁ డాచార్యుఁడుగా నుండఁడు.

శ్లో॥ స్త్రియశ్శూద్రాదయశ్చాపి
బోధయేయు ర్హితాహితమ్
యథార్హం మాననీయాశ్చ
నార్హంత్యాచార్యతాం క్వచిత్ — భారద్వాజ సంహిత.

స్త్రీలు, శూద్రులు మొదలగువారు హితమిది యిదియహితమని బోధింప వచ్చును. యోగ్యతకొలఁది వీరు గౌరవింపఁదగినవారే యగుదురు. కాని యాచా ర్యత్వమునకుఁ గొంచెమైన నర్హులుగారు.

నజాతు మంత్రదా నారీ నాశూద్రో నాంతరోద్భవః।

స్త్రీగాని, శూద్రుఁడు గాని యొకప్పుడైన మంత్ర మిచ్చువారు కారాదు. అష్టవిధభక్తులుఁగల మ్లేచ్ఛుఁడు విప్రుఁడు, ముని, యతి యని చెప్పుటచే వారికిఁగల యధికారములు వర్తనములు కర్మములు వీనికిఁ గలవని కొందఱు సందేహింప వచ్చునుగాని దాని కవకాశము లేదు. పరమభక్తుఁడైన మ్లేచ్ఛుని మ్లేచ్ఛుఁడని చూడవలదని శాస్త్రము చెప్పెనే కాని విప్రుఁడుగా యతిగా మాటెనని చెప్ప లేదు. పరమభక్తుఁడు బ్రహ్మచారిగానో గృహస్థుఁడుగానో వానప్రస్థుఁడుగానో యే యాశ్రమము లేనివాఁడుగానో యుండవచ్చును. యతి యట్లుండరాదు గదా. పరమభక్తుఁ డే యాశ్రమమందుండి మరణించెనో దానికి హితమైన పరలోక క్రియలే జరుపవలయునుగాని భక్తుఁ డను కారణమునఁ దక్కినవారికిఁ జరుపు పర లోకక్రియలు యతికి జరుపరాదుగదా. భక్తుఁడు బోడియై కాషాయవస్త్రములు దండకమండలువు ధరించి భిక్షాచర్య నడపవలసిన పని లేదుగదా. జనక ప్రహ్లాదా దులు సంసారులు గారా? కావునఁ బరమభక్తుఁడైన మ్లేచ్ఛుఁడు విప్రునితో యతితో సమానముగఁ బూజింపఁబడ నర్హుఁడేకాని విప్రున కున్న యధికారములు గలవాఁ డగునని యర్థముకాదు. ఇచ్చట విప్ర యతి శబ్దములు జీవచ్ఛవ జీవన్ముక్త పురుషసింహములనంటివి. జీవచ్ఛవమనఁగా బ్రతికిన పీనుఁగు. ఒక కళేబరమునందు జీవుఁ డుండువఱకు దానికిఁ బీనుఁ గనుపేరు రాదు. పీనుఁగను పేరు వచ్చిన తరు వాత జీవుఁ డుండఁడు. కావున జీవచ్ఛవమనఁగా బ్రతికియుఁ జచ్చినవానితో సమానుఁ డని యర్థమేకాని శవమునకుఁ జేయు దహనాదిక్రియల కతఁ డర్హుఁడని యర్థము కాదు.

దీర్ఘరోగియుఁ జిరతరప్రవాసియుఁ బరాన్నభోక్తయు జీవన్మృతులని నీతి శాస్త్రము చెప్పుచున్నది. ఇట్టివారిని వారు బ్రదికియుండగానే దహింపవచ్చునా? పూడుపవచ్చునా? (చిరతరప్రవాసి = ఇల్లువిడిచి దీర్ఘకాలము గ్రామాంతరముల దిరుగుచుండువాఁడు. పరాన్నభోక్త = విశేషకాల మితరుల యన్నముఁ దిని బ్రతుకు వాఁడు) అటులే ప్రాకృతదేహధారియగు జీవి ముక్తుఁడుకాఁడు. ముక్తునకుఁ బ్రాకృత దేహ ముండదు. కావున జీవన్ముక్తుఁ డనగా జీవించియుండినను బామరులకువలెఁ బ్రాకృతబంధములు సంసారబాధలు లేనివాఁడని యర్థము. పురుషసింహ మన్నప్పుడు మృగములందు సింహ మెట్లు విక్రమసాహసాదుల శ్రేష్ఠమో యట్లు వీఁడును బురుషు లందు శ్రేష్ఠుఁడని యర్థమేకాని సింహమున కుండు తోఁక కోఱలు మెడవెండ్రుకలు గలవాఁ డని యర్థముకాదు. అట్టులే మ్లేచ్ఛయతి మ్లేచ్ఛవిప్రు డన్నప్పుడు మ్లేచ్ఛుఁడు గుణములందు యతితో విప్రునితోఁ సమానుఁ డని యర్థమే కాని సంబంధబాంధవాదుల కర్హుఁడనియు యజనయాజనాదులకు సపంక్తిభోజనమునకు యోగ్యుఁడనియు నర్థముగాదు.

అధికారముగలవార లే వర్ణమువారైనను, స్త్రీలైనను, బురుషులైనను

బ్రహ్మజ్ఞానోపదేశముగాన నర్హులే యని భగవద్ధర్మశాస్త్రమతము. అధికారులందఱు నట్లులు జ్ఞానము సంపాదించుకొని బాగుపడవలయునియు నధికారము చాలనివా రధికారులగుటకు సాధనముల సాధింపవలయుననియు సంజీవని యభిలాష. ఆ విషయ మందే దాని పరిశ్రమము. నిజముగ బాగుపడఁగోరిక గలవారికి సదుపదేశముఁ జేసి బాగుపఱుచుటయందు సంజీవనికి జాతిమతాదిభేదములు తెలియదు. యోగ్యతానుసారముగఁ గ్రమమార్గమున బోధించును. శిశ్నోదరపరాయణులైన కొందఱు సన్న్యాసులమని యోగులమని వేదాంతులమని వేషములు వేసికొని తెలియనివారిని మోసగించుచున్నారు. ఇట్టివారి మాయమాటలకు లోపడి లోకులు చెడవలదని సంజీవని బోధించుచున్నదిగాని నీచమైన జాతిమతద్వేషమునకు వశించి యెవరిని గాని మీకు జ్ఞానము సంపాదింప నధికారములేదు బాగుపడుయోగ్యత లేని యధమ దశయందే యుండుఁడని చెప్పదు. కామాతురులై దొంగవేషములు వేసికొని తిరుగు వారు తమ యశనశిశ్నములందు సంజీవని మన్ను వేయుచున్నదని వాపోయినఁబోనిమ్ము, కాని తెలివితేటలు స్వచ్ఛందముగాఁ గలవారు వారి మోసపు ప్రలాపవిప్రలాపములు విని చెడకుండవలసినదే.

—♦ శంక ♦—

బ్రహ్మవిద్య వీరికిఁ దెలుపవచ్చును, వీరికిఁ దెలుపరాదను విధినిషేధమేల ? అందఱకుఁ జెప్పిన వారివారి శక్తికొలఁది వారువారు సాధించి బాగుపడరా యనుశంక కొందఱకుఁ గలుగవచ్చును కాని యది సరియైనదిగాదు.

బ్రహ్మవిద్య విచ్చలవిడిగా నెవ్వరికైనఁ జెప్పరాదని శ్రుతిస్మృతీతిహాసపురాణములు చెప్పుచున్నవి. ఇట్లు చెప్పుటకుఁ గారణము లేకపోలేదు.

శ్లో॥ ఉత్తిష్ఠత జాగ్రత! ప్రాప్యవరాన్ నిబోధత । క్షురస్య ధారా నిశితా దురత్యయా దుర్గం పథం తత్కవయో వదంతి॥-కఠోపనిషత్తు. లెమ్ము. మేలుకొమ్ము. సద్గురువులను జేరి చక్కఁగఁ దెలిసికొనుము. ఈ మార్గము మిగుల దుర్గమము. అతిప్రయాసముచే నడవఁదగినది. కష్టముతోడఁ బొందఁదగినది. మంగలకత్తి వాదరవలె మిగులఁ బదునైనది యని బ్రహ్మజ్ఞానులు చెప్పుచున్నారని యర్థము.

లెమ్ము, మేలుకొమ్ము . . తెలిసికొమ్మనుటకు మేలుకొలుపను గ్రంథమునందు విశదముగ వ్రాయఁబడినది. తెలిసికొనఁగోరువా రా గ్రంథమును బఠింపవలయును.

ఈమార్గము మంగలకత్తియొక్క పదునైన కొనమీఁద నడచుట యెట్టిదో యంత కష్టమైనదని యీ మార్గమున నడచిన బ్రహ్మవేత్తలెఱుఁగుదురు. అనిన నేమిభావము ? ఆ మార్గమున నడచువారు మిక్కిలి హెచ్చరికతో నడువవలయునని ప్రమాదపడిన మిగుల నపాయకరమని యట్లు నడువఁబూనినవారు సాధనసామగ్రి యభ్యాసము లభింపఁజేసికొని యుండవలయుననికదా ! ఆ మార్గమునందలి

యపాయము లుపాయములు ననుభవముచేం దెలిసినవారగుటచే వారు మార్గ మున నడువంగోరువారికి హెచ్చరికవాక్యములు పలికియున్నారు. పొగబండిమీంద మనము ప్రయాణముచేయునపుడు ప్రక్కల 'హెచ్చరిక, అపాయము' అని వ్రాసిన పలకలు స్థాపించియుందురే యేల? అట్లులే యిదియును.

ఈ మార్గమందు నడువంబూనినవారికి గాంగలయపాయములు నవి తప్పించుకొను నుపాయములు ముందుగ సాధింపవలసిన సాధనములు చేయవలసిన యభ్యాసములు నివి వ్రాయుట కిది సమయముగాదు.

శ్లో॥ ఇదం తే నాతపస్కాయ, నాభక్తాయ కదాచన ।
నచాశుశ్రూషవే వాచ్యం, నచ మాం యోభ్యసూయతి॥ భ-గీ. ౧౮ అ.

ఈ భగవద్గీతా శాస్త్రము తపస్సులేనివానికి భక్తిలేనివానికి గురుశుశ్రూష చేయనివానికి నాయం దసూయగలవానికి నెప్పుడైనం జెప్పరాదని యర్థము. ఇది శ్రీకృష్ణవాక్యము.

ఇం దసూయయనంగా సర్వత్రభావము. కృష్ణుండు మనవంటి మనుష్యుండే. వాండు చెప్పుట మనము వినుటయా! వాండు మనకంటె నేమిట గొప్పవాండు! అను తిరస్కారభావముతో నుపదేశించువానియందు మనుష్యుండను బుద్ధి లేక యుండుట.

శ్రీమద్రామాయణమందును "శ్రోతవ్య మనసూయయా" అసూయ లేక వినందగినది యని చెప్పంబడెను. ఇప్పుడు కొందఱు తామసులు ననధికారులు యసూయాపిశాచగ్రస్తులగుటచేత నే రామాయణమందును భగవద్గీతయందును భాగవతమందును విపరీతాభిప్రాయము లగుచున్నారు. నిర్మలమైనయద్దమందు గ్రోతులకు గ్రోతుల ముఖములు, మంచివారలకు మంచిముఖములుగాను కనవచ్చును! సాత్వికు లకు సరియైన యర్థమే రామాయణభగవద్గీతాదులందుం దోంచును.

శ్లో॥ నవిశ్వాసః క్వచిత్కార్యో, విశేషాత్తు కలౌయుగే ।
పాపిష్ఠా వాదవర్షేణ, మోహయంత్యవిచక్షణాన్ ।
గోపయే న్నోచ్చరే ద్ధర్మం, నాపృష్టః కించి దుచ్చరేత్ ।
పృష్టోపి న వదే దర్థం, గుహ్యం సిద్ధాంత మేవచ ।
ఆశ్రితా యాతిభక్తాయ, శాస్త్రశ్రద్ధాపరాయచ ।
న్యాయేన పృచ్ఛతే సర్వం, వక్తవ్యం శౌచయోగినే ।
ఆత్మపూజార్థమర్థార్థం, దంభార్థమపి భిన్నధీః ।
అయోగ్యేషు వదన్ శాస్త్రం, సన్మార్గా త్ప్రచ్యుతో భవేత్ ।
ఊషరే నివపే ద్బీజం, షండే కన్యాం ప్రయోజయేత్ ।
న్యజేద్వా వానరే మాలాం, నాపాత్రే శాస్త్రముత్సృజేత్ ॥ శాండిల్యసంహిత.

అర్థము: సదాచారసంపత్తి, భక్తి, గురుసేవ, పెద్దలవలన వినికి లేని

వారలయందు కొంచెమైనను సందువిశేషించి కలియుగమందు విశ్వాసముంచ రాదు. పాపిష్ఠులు వాదవర్షముచేఁ దెలియనివారిని మోహపఱిచెదరు. రహస్య మైన సిద్ధాంతవిషయమును దాఁపవలయునుగాని తానై కొంచెమైనను ధర్మ రహస్య మడుగనివారికిఁ జెప్పరాదు. కొందఱు కడిగినను జెప్పరాదు. (అటయిన శాస్త్ర జ్ఞానము లోకమున నశింపదా యందురేని) ఆశ్రితుఁడుగానుండి యతిభక్తిపరుఁడై శాస్త్రవిశ్వాసముకలిగి న్యాయ్యమైన మార్గమున నాదమునకుఁగాక తత్త్వము తెలిసికొని బాగుపడవలయు ననుతలంపుతో నడిగెనేని మనోవాక్కాయశౌచముగల వానికిఁ జెప్పవలయును. తనగౌరవముఁగోరిగాని ధనాశచేఁగాని దంభమునకై కాని భేదబుద్ధిగలవాఁడు అయోగ్యులకు శాస్త్రవిషయము చెప్పెనేని సన్మార్గమునుండి భ్రష్టుఁడగును. చవిటినేల విత్తనములు నాటవచ్చును. నపుంసకునకుఁ గన్య నీయవచ్చును. క్రోఁతిమెడలోఁ బూలదండ వేయవచ్చును గాని యనర్హునకు శాస్త్ర తత్త్వములు చెప్పరాదు.

ఇట్టివాక్యములు ప్రతితత్త్వశాస్త్రమందును గలవు. ఇట్లు వ్రాయుటయందు శాస్త్రకారుల యభిప్రాయమేమి? లోకమున జ్ఞానము వ్యాపింపరాదనియా? అట యినచో వా రాశాస్త్రములు వ్రాయనేల? ధర్మజ్ఞానముచే లోకము బాగుపడ వలయు ననెడివారియుద్దేశ మెట్లుసార్థకముకాఁగలదు? ఇతరులు నేర్చుకొనినఁ దమ యంతటివారగుటచేఁ దమగౌరవము చెడుననియా? అడవులలోఁ గందమూలా దులు దిని యేకాంతనిరతులై "స్వస్తిప్రజాభ్యః" "లోకాస్సమస్తాస్సుఖినో భవంతు" అని పూఁటపూఁట చెప్పుచుండువారికి తమరు చెప్పినవిషయము లోక మెఱిఁగి బాగుపడవలయు ననునభిప్రాయముండునే కాని దానివలనఁ దమకు గౌరవ హాని కలుగు ననునభిప్రాయ ముండఁజాలదు. పలువురు చదివిన కీర్తి హెచ్చును. 'సమ్మానః కాలకూట'మ్మని గౌరవమును విషముగాఁ జూచువారికి నగౌరవభయ మెందుండివచ్చును? కాఁబట్టి యిట్టిదురభిప్రాయములు వారికి లేవు. సదభిప్రాయము తోనే యోగ్యులుగానివారు పఠింపరా దని శాసించిరి. ఇది వారిమేలు కోరి చేసినపనియే కాని యితరముకాదు. ఈఁతనేరనివారు నీళ్ళలో దుముకవల దనుట యసూయచేతనా? సాము నేరనివాఁడు కత్తిని ద్రిప్పవలదనుట యసూయచేతనా? జీర్ణశక్తిలేనివారు గట్టిపదార్థములు దినవల దనుట యసూయచేతనా? అట్లులే యిదియును. యోగ్యతలేనివారు తత్త్వశాస్త్రము చదివినఁ జెడుదురు. వీనికి ననర్థకరమైన యల్పజ్ఞానముకంటె నజ్ఞానము మేలు. అజ్ఞాని కాపదలేదు. పెద్దలు చెప్పినమాటయందు విశ్వాసముంచి యాప్రకారము వర్తించి బాగుపడును. వీనికి శాస్త్రపఠన మనావశ్యకము. శబరినారదాదులే (పూర్వజన్మమున) నిదర్శనములు. అల్పజ్ఞుఁడో కొంచె మేదో తెలిసి యది యహంకారమునకుఁ గారణముకాఁగా ప్రగ ల్భతచే శాస్త్రవాక్యముల కపార్థముచేసి సర్వజ్ఞత్వభ్రమ నెత్తిపై వేసికొని వక్ర

మార్గములఁ బోయి చెడును. తాను జెడిన మేలే. 'తాఁజెడ్డ క్రోఁతి వనమెల్లఁ జెఱిచినట్లు' లితరులనుగూడఁ . జెఱుచును. అనుభవమే సాక్ష్యము. యెట్లందురా? భగవద్గీతయందు " సోమపాః పూతపాపా " యని యుండుటఁ జూచి సోమమనఁగా గల్లని యర్థముచేసికొని భగవద్గీత కల్లు ద్రాగవచ్చునని చెప్పుచున్నదని యొక ప్రబుద్ధుఁడు వ్రాసెను. 'మద్యాజీ మాం నమస్కురు' అనుచో మద్య + అజ + ఇ = సారాయము మేఁకమాంసము గలవాఁడవై నాకు నమస్కరింపవలయునని కృష్ణుఁడు చెప్పినట్లు కొందరు మాంసభక్షక గురువులు శిష్యులకు శిష్యురాండ్రకు బోధించుచున్నారు. ' ఇంద్రియాణీంద్రియార్థేషు వర్తంత ఇతి ధారయన్ ' ఇంద్రియము లింద్రియార్థములందు వర్తించుచున్నవి. నేను జేయునది యేమియును లేదు. ఇంద్రియము దాని పని యది పనిచేసినపుడు పాపము నా కేల్ల కలుగును ? చేసినవాఁడను నేను గానని వ్యభిచరింప భగవద్గీత యనుజ్ఞ యిచ్చుచున్నదని కొందఱు పరస్త్రీలకు బోధించి వారలఁ జెఱుచుచున్నారు.

కం. జిలపెట్టెనేని వీనులు. కలియంగాఁ బెట్టుటకును గలకాలంబున్
  గలదే పుడకల నియమము, దలఁపఁగ నటుకాదె యోనిధర్మం బకటా.

చెవులందును, గన్నులందును, ముక్కులందును దురద ఎత్తినపుడు యావజ్జీవము నొకవ్రేలే యొకపుల్లయే కాని వేఱొండు కూడదను నియతి గలదా? అట్టులేకదా, యోనిరంధ్రము ధర్మమని యీ దుష్టగురువులు స్త్రీలకు, వయస్సువిధవలకు బోధించుచున్నారు. తక్కెళ్ళపాటిలోను, అచ్చమ్మపేటలోను నిటువంటి మతగురువులకు వాసుదాసునకు జరిగిన సంవాదము మఱియొక పత్రికలో వ్రాయఁబడును. ఇట్టి మతాధిపతులు సన్న్యాసులు అనుపేరి కలిదూతలు పెక్కురున్నారు.

హింసచేసి నేను జేయలేదనుకొనిన హింసాదోషము రాదని భగవద్గీత చెప్పుచున్నది కావున నెవరైన నెవనినైనఁ జంపి నేను గాదనిన దోషము రాదని యొకరు చెప్పిరి. ఇట్టు లర్థము చేసి యట్లు వర్తించువారు చెడుదు రనుటకు సందేహము కలదా ?

అట్టులే కామదాసులు శ్రీకృష్ణచరిత్రము చదివి కామజయము సంపాదించుటకుమాఱు కృష్ణుఁడు జారుఁడైననియు మనమట్టులే చేయవచ్చుననియు కొందఱు వదరుచున్నారు. రాముఁడు దుష్టుఁడు రావణాసురుఁడు శిష్టుఁడని చెప్పు పుణ్యజనులు కలరుగదా!

" ఆకాశో బ్రహ్మ " యను నుపనిషద్వాక్యమునకు నమరమందు " ఆకాశం గగనం శూన్య " మని యుండుటచే బ్రహ్మము శూన్యమని యర్థముచేసి కొందఱు దుర్బోధములు చేయుచున్నారు. శూన్యమనఁగా నాస్తియని యీ మూఢుల తలంపు. "తస్య ధీరాః పరిజానంతి యోనిం" ఆయన యోనిని పండితులు చక్కఁగా నెఱుఁగుదురు అనియుండుటచే బ్రహ్మమునకు స్త్రీలకువలె యోనియున్నదఁట. ఇది "మమ యోని

ర్మహద్బ్రహ్మ" నాయోని పెద్దబ్రహ్మయంతది యని కృష్ణుఁడే యంగీకరించెనఁట. అట్లు యోనిద్వారములేదని "ప్రజాపతి శ్చరతి గర్భే అంతః" ప్రజాపతి గర్భము లోపల సంచరించుచున్నాఁ డనుశ్రుతివాక్యము సార్థకమగునా? యోనిలేకపోయిన ప్రజాపతి గర్భములోని కెట్లుపోవును? ఇది యీ వేదవేత్త లెఱిఁగినయర్థము. ఇది యూహగాదు. కల్పితముగాదు.

నేను వేలుపురుపిగ్రామప్రాంతమందు దిరుగునపు డొకఁడు 'బ్రహ్మముఖము నందుండి బ్రాహ్మణులు పుట్టుచున్నారని వేదముచెప్పుచున్నదే బ్రహ్మకు ముఖము నందుఁగూడ యోనులున్నవా' యని ప్రశ్నించెను. అవునని చెప్పినను లేదనిచెప్పి నను విపరీతప్రశ్నలు వాదములు బయలుదేఱునని తలఁచి 'నీతలలో పేలున్నవే. నీతలలో నెన్నియోనులున్నవని యడిగితిని'. మరలప్రత్యుత్తరము వాదము లేక పోయెను. ఈ కాలపుపండితులకు చెయ్యవలసినవి యిట్టిప్రత్యుత్తరములే. మూఢుల శాస్త్రజ్ఞాన మెట్లుపరిణమించెనో కంటిరిగదా! రహస్యములు గొప్పవిషయము లల్పులు గ్రహింపఁజాలరు. ఆ విషయమందుఁ గొంతపరిచయము జ్ఞానము అను కాలభానము గలవానికిఁగాని చెప్పినను బోధపడదు.

"విటుఁజొక్కించె బ్రఫుల్లపద్మనయనాపీరాయితం బెంతయున్" అను నలం కారశాస్త్రవాక్యమునకుఁ జిన్నప్రాయమందలి సాహిత్యవిద్యార్థికి నుపాధ్యాయుఁ డేమని యర్థముచెప్పి యొప్పింపఁగలఁడు? చెప్పకుండుటకుఁ గారణ మసూయయా, నిజగౌరవహానిభయమా? 'ఒ' ఇట్లువ్రాయునటె 'ఇ' యిట్లు ఏలవ్రాయరాదని చేమిచెప్పవలయును? ౧+౧=౨ అని తెలియనివానికి సిద్ధాంతగణిత మెట్లు బోధపడఁగలదు? ఒకబ్రాహ్మణబాలుఁడు గురువునొద్ద సాహిత్యశాస్త్ర మభ్యసించి పంచకావ్యములు చక్కఁగవల్లించెను. అందు మాఘకావ్యమున స్త్రీయధరా మృతము విశేషించి వర్ణింపఁబడెను. విద్యయంతయు సాంతముగ జదివి గురువు ననుజ్ఞ గైకొని తనయూరికా విద్యార్థిపోవుచుండ దారిలో నొక ఱుకలిది కల్లు ద్రావి నోటఁదమ్ములముగుండ నొడలెఱుఁగక పడియుండ దానినోరినుండి చొల్లు గాఱుచుండెను. ఆ బ్రాహ్మణబాలుఁడు మాఘకావ్యమందుఁ దాఁ జదివిన యధరా మృత మిదియే యనితలఁచి వానియొద్దకుఁ బోయి పెదవులక్రింద దోసిలిపట్టెను. కొంతసేపటికి దోసిలినిండఁగా దానిఁ దననోరఁ బోసికొనెను. కల్లుత్రాగిననోరు పొగాకుతోడితమ్ములము ఆయధరామృత మహాహా (అధరము — పెదవి, అమృతము = నీళ్ళు. పెదవినుండివచ్చు నీళ్ళు) యెంతరుచి యెంతగుచి యెంతరుచిగా నుండెనో! హరిహరీ! ఆవిద్యార్థియవస్థ నేమనిచెప్పను? రుచి తలకెక్కెను. కన్నులు గిఱ్ఱునఁదిరిగెను. వాంతులుపుట్టెను. కడుపులోపలి ప్రేగులు వెలికి వచ్చెను. వాసనకు ముక్కులోనివెంట్రుకలు కమరెను. నాలుక బఱికికొనెను. చింతాకు వేసి రుద్దెను. పుక్కిలించి యుమ్మివేసెను. నోరు తెఱచికొని కూర్చుండెను.

ఏమిచేసిన నేమి? ఆ యధరపీయూషమువాసన నతని వదలలేదు. చాల బాధపడి యా మూషకుఁడు మాఖముపై గోపించి మాఖమును గాల్పవలయునని గట్టిగా నఱచుచుఁ బోయెను. తక్కిన కథ యప్రస్తుతము. ఇప్పుడు కొందఱు వృద్ధసేవ లేక గురుశిక్ష లేక సంప్రదాయజ్ఞానము లేక ప్రతిష్ఠ మాత్రము గోరి యుద్గ్రంథములఁ జదివి యీ విద్యార్థిగతికి వచ్చుచున్నారు. ఇతరులను జెఱుచుచున్నారు. ఎన్ని అసత్యములకు నెన్ని దురూహములకైన జీవబ్రహ్మైక్య వేదాంతరహస్య మను గ్రంథమందు లక్ష్యములు దొరకఁగలవు. ఆ పుస్తకమును జదివి చెడినవా రెందఱో కలరని వింటిని. ఈ గ్రంథములోని కొన్ని యసత్యవిషయములను సంజీవని ముందు ముందు లోకమున నెఱిఁగింపఁగలదు. "మేలుకొలుపు" చూచినఁ గొన్ని తెలియఁగలవు. ఐహికవిషయములందుఁ జెడినను ప్రాయశ్చిత్తము పెట్టుకొనవచ్చును. ఆత్మవిషయమందుఁ బ్రమాదము గలిగిన నధోగతియే. కావుననే యధికారి కాని శిష్యునికి నాత్మజ్ఞానముపదేశింపరాదని శాస్త్రములు శాసించెను. శబరి తొలుత మునీశ్వరులయొద్దఁ బరిచారికగాఁ గుదిరినను గురువాక్య శ్రవణము వలనఁ గలిగిన శ్రద్ధాభక్తులు గలదై యా విషయమునే మననము చేయుచు శిష్యురాలి ధర్మమైన శుశ్రూష చేయుచు "తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా" యని శ్రీకృష్ణభగవాను లుపదేశించినట్లు నమస్కారాదిపూర్వక పరిచర్య చేయుచు గురువాక్యమునమ్మి వితండావాదము సేయక న్యాయ్యమైన ప్రశ్నలు వేయుచు యావజ్జీవ మంతేవాసినియై శిష్యశబ్దమును సార్థకపఱచుచుఁ గ్రమక్రమముగ యోగ్యత సంపాదించుకొని ముముక్షువై యోగసిద్ధికి బ్రహ్మజ్ఞానమునకుఁ బాత్రురాలయ్యెను. ఇట్టిశిష్యులకు శిష్యురాండ్రకు యోగ్యులైన గురువులు తత్త్వరహస్య ముపదేశింపవచ్చును గాని యిట్టి యోగ్యత లేనివాఁ డెంతటివాఁడైన నుపదేశింపరాదు. ఇఁక శిష్యలక్షణ మెఱిఁగించెద. దానివలన శబరి యోగ్యత తెలియును.

శిష్యలక్షణము

ఇది కొంత మేలుకొలుపునందుఁ జెప్పఁబడినది. అయినను మరలఁ గొంత చెప్పవలసియున్నది.

శ్లో॥ సద్బుద్ధి స్సాధుసేవీ, సముచితచరిత, స్తత్త్వబోధాభిలాషీ, శుశ్రూషు, స్త్యక్తమానః, ప్రణిపతనపరః, ప్రశ్నకాల ప్రతీక్షః శాంతో దాంతో౽నసూయు, శ్శరణముపగత, శ్శాస్త్రవిశ్వాసశాలీ శిష్యః, ప్రాప్తః పరీక్షాం, కృతవి, దభిమత, స్తత్త్వత శ్శిక్షణీయః.

అర్థము : సద్బుద్ధి = మంచిబుద్ధి గలవాఁడు, చెప్పిన విషయమును జక్కఁగా గ్రహించుశక్తి గలిగి సాత్త్వికమైన మనస్సు గలవాఁడు, సాధుసేవీ = సాధువుల సేవించినవాఁడు. జ్ఞానవృద్ధులు సదాచారవృద్ధులు నగువారి యొద్దనుండి వారి సేవ చేయుచు వారు చెప్పువిషయములు శ్రద్ధాభక్తులతో వినుచు, వారి యాచారమును

గనుచు లోప మున్న ఘొడల దన నడవడి సవరించు కొనువాఁడు. శ్రేయస్కాము నకుఁ బ్రథమసోపానము సాధుసేవ, సముచితచరితః = గురువుపట్లఁ, బెద్దలపట్ల, విజ్ఞులపట్ల, సమానులపట్ల, నెట్టి మర్యాదతో వర్తింపవలయునో యది యెఱిఁగి భయభక్తులతో వినయవిధేయతలతో స్నేహభావముతో వర్తించువాఁడు. తత్త్వబోధాభిలాషి = ఈశ్వరజీవప్రకృతుల వాస్తవరహస్యమును సలక్షణముగ సప్రమాణముగఁ దెలిసికొనుటయందు మిక్కిలి కోరికగలవాఁడు. శుశ్రూషుః = గురువు చెప్పినది వినుటయం దాసక్తి గలవాఁడై యా ప్రకారము నడచువాఁడు. త్యక్తమానః = లజ్జాభిమానములు వదలినవాఁడు. ఇతరులు చూచుచుండఁ దన గురువునకో తల్లిదండ్రులకో పెద్దలకో చేయుసేవ (కసవు చిమ్ముట, నీళ్లుమోయుట, అలుకుట, పాదము లొత్తుట) లోనగుకార్యములను జేయ బిడియపడుట లేనివాఁడు. నే నింతటి గొప్పవాఁడనే, ధనికుండనే, అధికారము గలవాఁడనే, బలము గలవాఁడనే, దేశప్రభువనే, గొప్ప విద్యావంతుఁడనే, నన్ను వీఁడు నేలఁ గూర్చుండుమనెనే, నా కీ యల్పకార్యము చేయుమని చెప్పెనే, నా గౌరవ మెంచఁడాయెనే, నేలఁ గూర్చుండిన నా చలువదోవతి మాయునే, నేలఁబరుండిన దేహము ధూళియగునే యని యిట్టి దురభిప్రాయములు లేనివాఁడు. ప్రణిపతనపరః = సాష్టాంగనమస్కారముచేయుట యందు నాసక్తిగలవాఁడు. బోరగిలఁబడిన దేహమునకు మట్టియగునే, యెట్లుపడు దునా యని రెండుచేతులు జోడించి కుడిభుజముమీఁదనో యెడమభుజముమీఁదనో యుంచువాఁడు కాఁగూడదు. ముసుఁగులోఁ జేతులు జోడించువాఁడును గాఁగూడదు. ఏ వర్ణము వారైనను దమకంటెఁ దక్కువవర్ణమువారికి నమస్కరింపరాదు.

ఉచ్ఛిష్టము, సూతకము, ఆశౌచము - వీనితోఁ గూడినవానికిని, పరువెత్తు వానికిని, ధనమదముగలవానికిని, చెట్టెక్కియుండువానికిని, అపరిశుద్ధునకును, బరువు మోసికొనిపోవువానికిని, దూరమునందుండువానికిని, తలంటుకొనియుండువానికిని, విరుద్ధకర్మములు చేయువానికిని, పతితునకును, భగవద్భక్తి లేనివానికిని, కర్మచండా లునకును నమస్కరింపరాదు. భరద్వాజులు.

శ్లో. పితాచ మాతాచ పితామహాశ్చ
జ్యేష్ఠః పితృవ్యః శ్వశుర స్తథా ర్త్విక్
మాతామహోధ్యాపక మాతులాశ్చ
మాన్యాస్స్యు రేతే క్రమతోఽభివాద్యాః॥ స్మృతిదర్పణము.

తండ్రి, తల్లి, తండ్రితండ్రి, అన్న, తండ్రి తోఁడఁబుట్టినవాఁడు, మామ, ఋత్వి జుఁడు, తల్లితండ్రి, వేదాధ్యయనము చేయించువాఁడు, మేనమామ, వీరందఱు మాన్యులే. వీరికి వరుసగ నమస్కరింపవలయును.

శ్లో. స్వనామ పూర్వం పరికీర్త్య పశ్చాత్
భోశబ్ద ముచ్చార్య గురోస్తు శిష్యః

వ్యత్యస్య పాణిం పరిలభ్యపాదౌ
పిధాయకర్ణావభివాదయీత॥ స్మృతిదర్పణము.

ముందు తనపేరు ఆవల భోశబ్దము చెప్పి శిష్యుఁడు గురువుకుడిపాదమును కుడిచేత నెడమపాదమును నెడమచేత నంటి రెండుచెవులు మూసికొని గురువునకు నమస్కరింపవలయును. కాని గురువులపాదములు గాయపడునట్లు, నరము లుబ్బునట్లు, ఎముకలు విఱుగునట్లు, పొడిచి, పిసికి, నలిపి, గురువుప్రాణములు కంఠగతములు చేయరాదు. ఈ వైభవము వాసుదాసునకుఁదప్ప నితరులకుండదని తలఁచెదను.

తలవిరియఁబోసికొని యుండువానికి, జపము, హోమము, భోజనముచేయువానికి, చీఁకటియందుండువానికి, నిద్రించువానికి, పతితునకు, శవమునకు, నమస్కరింపరాదు. తలమీఁద ముసుఁగువేసికొనికాని, తలంటుకొనికాని, నమస్కరింపరాదు. క్షత్రియుఁడు వైశ్యునకు నమస్కరించెనేని ౮-౧౦ మందిబ్రాహ్మణులకు నమస్కరించిన శుద్ధుఁడగును. బ్రహ్మక్షత్రియవైశ్యులందెవరైన శూద్రులకు నమస్కరించిరేని కట్టువస్త్రములతో స్నానము చేయవలయును; శివునిఁగాని విష్ణువునుగాని పూజింపవలయును; లేదా మహాభాగుఁడైన బ్రాహ్మణునకైన నమస్కరింపవలయును. దీనికిఁ బ్రమాణవాక్యములు—స్మృతిదర్పణము.

శ్లో. క్షత్రవైశ్యాభివాదేన, ప్రాయశ్చిత్తం కథం భవేత్
బ్రాహ్మణానాం దశాష్టౌ వా, అభివాద్య విశుధ్యతి
అభివాద్య ద్విజ శ్శూద్రం, సచేలస్నాన మాచరేత్
అర్చయే త్పుండరీకాక్షం, దేవం వాపి త్రిలోచనమ్
బ్రాహ్మణంవా మహాభాగ, మభివాద్య విశుధ్యతి॥

శ్లో. ఉదక్యాం, సూతికాం, నారీం, భర్తృఘ్నీం, గర్భఘాతినీమ్
అభివాద్య ద్విజో మోహా, దహోరాత్రేణ శుధ్యతి॥

ఏవర్ణముదైనను ముట్టయినదానికి, పురిటిదానికి, భర్తనుజంపినదానికి, గర్భమును బోఁగొట్టుకొనినదానికి, బ్రాహ్మణుఁడుగాని క్షత్రియుఁడుగాని వైశ్యుఁడుగాని యజ్ఞానముచే నమస్కరించెనేని యొకరేయిపగ లుపవసించి శుద్ధుఁడగును.

పతితుఁడనఁగా భ్రష్టుఁడు. తాను జనించిన వర్ణమునుండి పడిపోయినవాఁడు. పుట్టువుచే బ్రాహ్మణుఁడైనను పతితుఁడయ్యెనేని వానికి జాతిచండాలుఁడును నమస్కరింపరాదు. పతితుఁ డేవర్ణమునందును జేరఁడు. కొట్టకొనకొమ్మనుండి పడినకాయ నేలఁబడునేకాని నడుమఁ గ్రిందికొమ్మలకుఁ దగులుకొనదు కదా!

దీని కపవాదము.

సర్వాత్మకబ్రహ్మోపాసనము చేయువానిని బైసామాన్యవిధులు బాధింపవు. వీఁడు మనుష్యులకేకాదు కుక్కలకు గాడిదలకు ఎద్దులకుఁ జెట్లకుఁగూడ

సర్వము బ్రహ్మకళావిశిష్టమని బ్రహ్మస్వరూపమని నమస్కరించును. దృష్టిభావ భేదము కారణము. ప్రశ్నకాలప్రతీక్షః = ఎప్పుడు గురువు విరామముగా నితరచింతలు లేక యేకాంతియై ప్రసన్నుఁడై యుండునా, యెప్పుడు ప్రశ్న లడుగసమయమగునా, యని సమయము వేచియుండువాఁడు. రాత్రి పదిగంటలమీఁదఁ బరుండిన గురువును లేపి అయ్యా మాకు మంత్రార్థము చెప్పుమని యడుగువారు కాఁగూడదు.

శాంతఃదాంతః = అంతరింద్రియనిగ్రహము బాహ్యేంద్రియ నిగ్రహము గలవాఁడు.

అనసూయుః = అసూయలేనివాఁడు. మనకంటె వీని కెక్కువ యేమి తెలియును? మనముచదివిన పుస్తకములలోవే కాదా వీఁడు చెప్పుచున్నాఁడు. ఇఁక నిన్ని పుస్తకములు చదివిన వీనియంతటివారము మనము కాఁగలము. అనునిర్లక్ష్య భావముకలవాఁడు కాఁగూడదు.

శరణముపగతః = శరణము చొచ్చినవాఁడు. నన్ను రక్షింపఁ బోషింప నీవు దప్ప మఱియెవరులేరు. నీవే నాకుదిక్కు. నన్ను రక్షించుభారము నీది. నీయాశ్రయమునఁ దాపత్రియబాధలులేక సుఖింతును. అని పాదములపైఁబడువాఁడు. అట్టి నిశ్చయము, నిశ్చలమైనశ్రద్ధయు, భక్తియుఁ గలవాఁడు.

శాస్త్రవిశ్వాసశాలీ = శాస్త్రమునందుఁ జెప్పఁబడినది వాస్తవము. ఆప్రకారము నడచుకొనిన నందుఁజెప్పినఫలము తప్పక కలుగును, అని దృఢనిశ్చయము. నమ్మకగలవాఁడు శ్రుతిస్మృతీతిహాస పురాణములందు నమ్మకములేనివానిని దగ్గఱ చేర్పరాదు. శాస్త్రవిశ్వాసలక్షణము శాస్త్రీయాచారము. నాకు శాస్త్రవిశ్వాసము కలదని నోరఁజెప్పుచు శాస్త్రీయాచారము లేనివాఁడు శాస్త్రవిశ్వాసియనఁ బడఁడు.

ప్రాప్తఃపరీక్షాం = శిష్యునినడవడిని భక్తిశ్రద్ధలను సంవత్సరమో, యాఱు నెలలో, మూఁడుమాసములో, మూఁడుపక్షములో (౪౫ దినములు), మూఁడు దినములో, సందర్భముకొలఁది పరీక్షింపవలయును. ఇట్టిపరీక్షయందుఁ గృతార్థుఁడై గురువును మెప్పింపఁగలుగువాఁడు శిష్యుఁడుగానుండ యోగ్యుఁడు.

కృతవిద్ = గురువు తనకుఁ జేసినమే లెఱింగినవాఁడు. నేను 'సేవచేసితిని, ఆయన యుపదేశమిచ్చెను కాయకుఁగాయ చెల్లుపోయెను, ఇఁక నాయనతో నాకేమిపని, యనుట కృతఘ్నుల లక్షణము. ఇట్టివానికి మంత్రము జ్ఞానబోధ ఫలమీయవు. ఎన్నిజన్మములెత్తి యెన్నినరకములపాలై యెంతయో బాధపడు నాకు నీనరకబాధ యైహికబాధ తొలఁగునుపాయము తెలిపిన మహాత్మునకు నే నెంత యిచ్చిన నెంత సేవచేసిన నాయనఋణమును డి ముక్తుఁడఁ గాఁగలను? నే నాయన నుపేక్షించితినేని నాకంటెఁ గృతఘ్నుఁ డెవఁడు? అని తలఁచువాఁడు.

అభిమతః = గురువునకిష్టుఁడై సమ్మతింపఁబడినవాఁడు. ఆయన యనుగ్ర

హాముసకుఁ బాత్రుఁడై యాయనచే నభిమానింపఁబడినవాఁడు. 'వీనివలన నాకుఁ గీర్తిప్రతిష్ఠలు గలుగును. వీనికిఁ జెప్పిన విద్య సార్థకము' అని గురువునకు నమ్మకము గలిగించువాఁడు. ఇట్టి శిష్యుఁడు గురువుచే బోధగొన యోగ్యుఁడు.

అంతేవాసి లక్షణము.

గురువుసమీపమున యావజ్జీవము శిష్యుడుండి చేయవలసిన కార్యములను గుఱించి భగవద్ధర్మశాస్త్రవాక్యము లుదాహరించుచున్నాఁడను.

శిష్యో యావజ్జీవం గురూపదేశ ముపతిష్ఠ, న్నాచార్యాధీనవృత్తిః, స్తమేవ పరంబ్రహ్మేతి మన్వానః, తమేవ సతతం ధ్యాయన్, జపన్, నమన్, అర్చయన్, తన్నామోచ్చారయన్, తత్పదతీర్థం, తదుచ్ఛిష్టం, తదుపభుక్తం, వాసోభూషణాది నిత్యముపయుంజాన, స్తదర్థమేవ శరీరాదిధారయన్, తదనుజ్ఞాప్రతీక్షకో౽వంచన యా వరివస్యన్, సర్వదా స్వాత్మయాత్రా మనపేక్షన్, తచ్ఛరీర సంరక్షణపరో భవన్, గురోర్గురూనపితత్ప్రీత్యైయజన్, తద్దారాదౌ భాగవతేష్వపిచ సబ్రహ్మచారిషు గురువృత్తి ర్యథాయోగ్యంచ తేషువరివస్యన్, గురుకృతముపకారమాదేహ పాతమప్రత్యుపకృత్యానుసందధన్, నవిస్మరన్, తదారాధ్యే భగవతి అధికప్రీతి స్తమేవ ఉపాయోపేయభావేనాలంబమాన స్సర్వశోనద్రుహ్యన్, గురునిందాద్యశృణ్వన్, ఐహికాముష్మికం సర్వం గురురేవేతిభావయన్, నియమాతిక్రమే రహసిబోధయేత్ పతనీయంవారయన్ అతికృచ్ఛ్రగతం భగవత్ప్రపత్త్యాదిభి స్సముద్ధరన్ అవశ్యావారణే తదంతర్యామిణే తదాచార్యంవా భజన్ తన్నివర్తనావకాశం ప్రతీక్షమాణో జాతేవ కాశే సంబోధ్య మార్గే స్థాపయన్ గురుసన్నిధానప్రగల్భమానః స్వసమానశీలై రేవ సహావసన్ యావదాయుషం గురుముపాసీత.

దీని కర్థము

శిష్యుఁడు తాను బ్రదికియుండువఱకు గురు వుపదేశించినపద్ధతి నడచుకొనుచు నాచార్యున కధీనమైనవర్తనముకలవాఁడై యాయన చెప్పినదాని నతిక్రమించి నడవక యాచార్యుఁడే పరబ్రహ్మ మనితలఁచుచు నాయననే నారాయణుఁ డని ధ్యానించుచు జపించుచు నమస్కరించుచు నర్చించుచు నాయన పేరే యుచ్చరించుచు నాయన పాదతీర్థము ఆయనయుచ్ఛిష్టము ఆయన యుపయోగించివిడిచిన వస్త్రములు భూషణము లుపయోగించుచు నాయననిమిత్తమై శరీరము మొదలైనవాని ధరించుచు నాయనయనుజ్ఞను వేచి వంచనలేక శుశ్రూష చేయుచు నెల్లప్పుడుఁ దన దేహయాత్రయందుఁ గాంక్షలేక యాచార్యునితపస్సు కార్యాంతరముల వ్యర్థపడిపోకుండునట్లు ఆయనశరీరరక్షణమం దాసక్తిగలిగి గురువుసంప్రీతినిమిత్తమై యాయనగురువును బూజించుచు నాయన భార్యాదులందు భాగవతులందు తన తోడిశిష్యులందు గురువృత్తిచే యోగ్యతకు దగినట్లు సేవసేయుచు, గురువుచేసిన

యుపకారము తన దేహము పడిపోవువఱకుఁ జేసినను జాలినంత మఱుమేలుచేయ సాధ్యము కానిదని తలఁచుచు; దానిని మఱవక, యాయన యారాధించు భగవంతుని యందు విశేషప్రీతి యుంచి యాయనయే ముక్త్యుపాయము, ముక్తిఫల మను తలంపు గలవాఁడై యెప్పుడుగాని ద్రోహ మొంచక గురునిందాదులు వినక నైహికాముష్మికములు సర్వము గురువని తలఁచుచు గురువు నియమ మతిక్రమించెనేని రహస్యముగ బోధించుచు పతితుఁడుగాకుండ నేవిధముగనైన వారించుచు నదియు నతికష్టమైనయెడల భగవత్ప్రపత్త్యాదులచే నతని నుద్ధరించుచు నట్లును వారింప నసాధ్యమైనయెడల తదంతర్యామియైన భగవంతునిఁగాని యాయన గురువునుగాని భజించుచు నాయనను జక్కఁజేయ నెప్పుడవకాశము దొరకునా యని యెదురుచూచుచు నవకాశము దొరకినపుడు బోధించి సరియైన మార్గమున నుంచి గురుసన్నిధియందుఁ బ్రగల్భములు మాని తన నడవడికి సమానమైన నడవడిగల వారితోఁ గలిసి వర్తించుచు నాయుస్సుండువఱకు నాచార్యు నుపాసింపవలయును. ఇదియంతయు యావజ్జీవము గురువుల సమీపమందుండి సేవించు నంతేవాసుల లక్షణము. అట్లుండుటకు సాధ్యపడనివారు దూరమునందుండినను దేహముతో శుశ్రూష చేయకపోయినను మానసికారాధనము, చేతనైన సాహాయ్యము, యోగక్షేమవిచారణము లోనైనవి చేయుచుండవలయును. శబరి యావజ్జీవము గురువులఁ గొలిచి వారి యుపదేశప్రకారము వర్తించి దానిఫలముగ భగవత్సాక్షాత్కారము దాని ఫలమైన పుణ్యలోకము సంపాదించెను. మీఁదఁజెప్పినట్లు గురుభక్తి దైవభక్తి గలిగి వర్తించువారికే తత్త్వార్థము స్ఫుటముగ మనస్సునఁ బ్రకాశించునుగాని తక్కినవా రెంత శ్రమించినను నావిరికప్పిన యద్దమువలె నుండును.

మీఁదఁజెప్పిన వాక్యములందలి గురుశరీరరక్షణము గురూచ్ఛిష్టభోజనము గుఱించి కొంచెము చెప్పవలసియున్నది. గురుశరీరరక్షణము శిష్యునికార్యము. శిష్యుని యాత్మరక్షణకార్యము గురువుకార్యము. శాస్త్రము గురుశరీరరక్షణ మని చెప్పెనేకాని గురుశరీరపోషణమని చెప్పలేదు. గురువు తన కడుపుకూటికై దేవురులాడుచుండినయెడల నాయన తపస్సు పూర్ణముగఁ జేయఁజాలకపోవును. ఆకారణముచేఁ గొంతయాయు స్సుదరనిమిత్తమై వ్యర్థమగును. ఆ విచారభారము గురువునకుఁ దప్పించినయెడల నాయన శీఘ్రముగఁ గృతకృత్యుఁ డగును. అందు సగభాగము ఫలము శిష్యునికి లభించును.

శ్లో॥ యస్యాన్నపానపుష్టాంగః, కురుతే ధర్మసంగ్రహమ్ ।
అన్నప్రదాతు స్తస్యార్ధం, కర్తుశ్చార్ధం నసంశయః॥

అని ప్రమాణము గలదు.

శరీరపోషణమనఁగా శరీరము బలియునట్లు చేయుట. ఇట్టితిండి శిష్యుఁడు పెట్ట

రాదు. శిష్యుఁడు బీదవాఁడై సజాతీయుఁడైనచో మాధుకరమెత్తి తెచ్చినదాని నాయనముందుంచి యాయన కావలసినది తీసికోఁగా, మిగిలినది తాను భుజింప వలయును. మాధుకరమెత్తునపుడు గురువునిమిత్తమై బిచ్చమెత్తుచున్నానని చెప్ప వచ్చును. గురువునకు శిష్యుఁడు పెట్టునది మితాహారపదార్థముగా నుండవలయును. కాని యాహారములుగాని కాఫీ, టీ, కోకో, పొగాకు, సారాయి, కల్లు, గంజాయి, లోనగువదార్థములుగ నుండరాదు. గురువులవారు దీనికై లబలబ నోరుకొట్టు కొన్నను శిష్యుఁ డీయరాదు. ఆహారపదార్థమైనను తామసాహారములైన మాంసము గ్రుడ్లు మొదలైన వీయరాదు. సాత్త్వికాహారమైనను మితిమించి యీయ రాదు. అమితాహారమైనను తపోవిఘ్నకారియే. అమితసాత్త్వికాహారము తామ సాహారము సమానములు. ఎక్కువతినుటచే నొడలు మాఱునుసలును, చిత్తము స్వస్థముగాదు. కావున నిట్టి దుష్టాహారము నిచ్చు శిష్యుఁడు గురువును జెఱచినవాఁ డగును. ఆ పాపఫల మనఁగా తపస్సునకు విఘ్నముఁ గలిగించినపాపము శిష్యుఁ డను భవింపవలసియుండును. చేయుసత్కార్యమునకు శిష్యుఁడు యథాశక్తి సాహా య్యముచేయవచ్చునుగాని గురు వకార్యము చేయఁబూనిన నేమాత్రమైన సాహా య్యముచేయరాదు. ముందుపోవువాఁడు తప్పుత్రోవఁబోయి గుంతలోఁబడిన వాని నాధారముగఁ గొనివచ్చు గ్రుడ్డివాఁడును వానివెంట గుంతలోఁబడినట్లు గురువు దుర్గతికిఁబోయిన శిష్యులును బోవకతప్పదు. కావునఁ దెలివిగలవారు సరియైన నడవడి జ్ఞానము గలవానిఁగాఁ జూచి గురువుగ గ్రహింపవలయును. గురువుచేత సత్కార్యములే చేయింపవలయును. గురువు తెలిసి గర్వముచేతఁగాని తెలియక గాని యతిక్రమించిపోవుచుండెనేని బోధింపవచ్చును. ఎటువినకపోయిన దండింప వచ్చును.

శ్లో॥ గురోరప్యవలిప్తస్య కార్యాకార్యమజానతః।
ఉత్పథం ప్రతిపన్నస్య కార్యంభవతి శాసనమ్॥

ఇట్టికష్టదశ కోదండరామసేవకసమాజమువారికిఁ గలుగకయుండునుగాక !

గురుశరీరరక్షణ మనునది యాహారవిషయమాత్రముగాదు. సన్న్యాసుల కేకభిక్ష నిషిద్ధము. (ఏకభిక్షయనిన నొకయింటమాత్రమే కావలసిన యాహారము తినుట) కావున 3, 5, 7 యిండ్లభిక్షమెత్తి తినవలయును. ఇట్లు భిక్షకుఁ దిరుగుకాల ములో నెవ్వరైన నమస్కరించిరేని యానాఁ డుపవసింపవలయును.

శ్లో॥ భిక్షాకాలేచ కేనాపి, నమస్కారః కృతో యది।
తదన్నంతు పరిత్యాజ్యం, భుక్త్వా చాంద్రాయణం చరేత్॥

భిక్షాకాలమం దెవ్వఁడైన నమస్కరించెనేని యాయన్నము పరిత్యజింప వలయును. తినినా చాంద్రాయణము జరుపవలయునని ప్రమాణము.

శ్రీరామానుజాచార్యులవా రొకనాఁ డిట్లు తిరుగుకాలమునం దొకయింటికి

భిక్షుకుఁ బోఁగా నాయింటియిల్లాలు భిక్షవేసి తటాలున నమస్కరించి గిఱ్ఱునతిరిగి పోయెను. మతవిద్వేషకారణమున నామె మగఁడు భిక్షాన్నములో విషముకలిపి యాయన్న మాయనకుఁ బెట్టుమని బలవంతపఱచి పంపెను. బిచ్చగాఁడు బ్రాహ్మణుఁడు యతి ఇట్టివానికి నెట్లు విషము పెట్టుదునా యని యాయిల్లాలు లేమిచేయుటకుఁ దోఁపక మగని పోరుపడలేక యా విషాన్నముపెట్టి ధర్మశాస్త్రము తెలిసినది గావున నమస్కరించెను. అట్లు చేయుటచే నాయన యా యన్నము తినఁ డని యెఱుఁగును.

భిక్షవేసి యా యిల్లాలు నమస్కరింపఁగనే యాయన తటాలున మఠమునకుఁ బోయి యాయన్న మావలవైచి యాదిన ముపవాసముందునని శిష్యులకు జెప్పెను. వారును దానిలో నేదో కృత్రిమ మున్నది. లేకుండిన నాయిల్లా లట్లుచేసియుండదు. ఈ యన్నము మీరు తినరాదని యామె యభిప్రాయము అని చెప్పి పరీక్షార్థ మాయన్న మొక కుక్కకు వేయఁగా నది తిని వెంటనే చచ్చెను. వారి సందేహము స్థిరపడెను. ఇంతటి విరోధులు గల గ్రామమందు వసింపరాదని యాయన శిష్యులతోడ వెంటనే బయలుదేఱి యెండల నిలువక చక్కగ శ్రీరంగమునకు వెళ్ళెను. అప్పుడు మధ్యాహ్నవేళ యయ్యెను. కావేరి దాఁటి వారు వెళ్ళునప్పటికి శ్రీరామానుజాచార్యులవారి గురువు కావేరికి మధ్యాహ్నస్నానార్థమై వచ్చుచుండెను. గురువును జూడఁగానే రామానుజాచార్యులవా రాయనపదములపైఁ బడిరి. నిండువేసంగి మండు నెండలు. ఇసుక పెనమువలెఁ గాలుచుండెను. ఆ మండు నిసుకలోనే యాయనపడెను. ఎంతసేపైనను గురువు లెమ్మన్నవాఁడుకాఁడు. శిష్యుఁడు గురువునాజ్ఞ లేక లేచినవాఁడుకాఁడు. అప్పుడు రామానుజాచార్యులవారి శిష్యులలో నొకశిష్యుఁడు కోపముచే మండిపడుచు నా గురువును బలువిధముల దూషించి యీ కోమలశరీరుని జంపఁజూచెదవా యని తా నాయిసుకలోఁబడి తనపై రామానుజాచార్యులవారిని వేసికొని యింక నెంతసేపు ఊరకుండెదవో యందుమనెను. అప్పు డాగురువు, నాయనా! యీయనకు మీరిందఱు శిష్యులున్నారు. ఈయనదేహరక్షణమం దెక్కువ శ్రద్ధగలవాఁ డెవఁడో తెలిసికొనఁగోరి యిట్లు పరీక్షించితిని. ఇఁకమీఁద నీ వొకఁడవే యీయనకు నాహారము కల్పించుచుండుము. ఏకభిక్షకనుజ్ఞ నిచ్చితి ననెను. ఈ శిష్యుఁడే రామానుజాచార్యులవారి కాదినమునుండి యాహారముచేసి పెట్టుచుండెను. ఇట్లుండ నొకనాఁడు శ్రీరంగములో స్వామి యూరేగింపు జరుగఁ బెరుమాళ్ళు వీథులవెంట వచ్చిరి. రామానుజాచార్యులవారు పోయి నమస్కరించిరి కాని లోపలనున్న యా శిష్యుఁడు పాలుగాఁచుచు స్వామిని దర్శింపరాఁడయ్యెను. రామానుజాచార్యులవా రావల లోపలికిఁబోయి, ఏమిరా! పెరుమాళ్ళు వాకిట విచ్చేసియుండఁగా నీవు వచ్చి దర్శింపవైతివని యడిగిరి. సరేసరే మీ స్వామిని నేను దర్శింపవచ్చిన నా స్వామికి పాలెవరు కాఁచి యిత్తురు అనెను.

చోళదేశంబునఁ గ్రిమికంఠుఁ డనునొక ప్రభువుండెను. ఈయన కేవల శైవమతపక్షపాతి. ఇతఁ డొకపత్రముమీఁద 'శివాత్ పరతరం నాస్తి' శివుని కంటె గొప్పవాఁడు లేఁడు, అని వ్రాసి వైష్ణవులందఱచేత చేవ్రాలుచేయించుకొని రమ్మని సేవకుల కాజ్ఞాపించెను.

దుష్టుఁడైన యతనికి భయపడి యందఱు సంతకములుచేసిరి. రాజభటులు రామానుజాచార్యులవా రున్నచోటికి వచ్చిరి. వారు లోపలనుండిరి. శిష్యులందఱు వాకిటనుండిరి. సేవకులు వారిచేత నాకాగిద మిచ్చిరి. అందొకశిష్యుఁడు దానిని జూచి 'ద్రోణమస్తి తతఃపరం'అని దాని క్రింద వ్రాసెను. సేవకుఁ డావ్రాసినవాఁడే రామానుజాచార్య లనుకొని పోయెను. ఈ సంగతిని రామానుజాచార్యులవారికి శిష్యులు తెలిపిరి. ఇఁక నిచ్చటనున్న యుపాయముతప్ప దని వారెల్ల నొక యాలోచనచేసిరి. ఆవ్రాసినశిష్యుఁడే తాను రామానుజాచార్యుల నని యీసారి భటులు వచ్చినపుడు చెప్పనంగీకరించెను. ఇట్లు తన్ను భటులు పట్టుకొని పోయినయెడల నక్కడివారు వీఁడు రామానుజాచార్యులుకాఁ డని చెప్పినఁ దన్ను రాజు విడిపించును. ఈ మధ్యకాలములో రాజ్యముపొలిమేర దాఁటి రామానుజాచార్యులు తక్కినశిష్యులు పోవచ్చునని యీ యుపాయముచేసిరి. రామానుజాచార్యులవారొక్కని నాతనితోడ నుంచి తక్కినశిష్యులతోడ శీఘ్రగమనంబున నాయూరువిడిచి పలాయనమైరి. రా జాపత్రమునుజూచి మండిపడెను. 'శివాత్ పరతరం నాస్తి' యనుటకు శివునికంటె గొప్పవాఁడులేఁడని రాజు నభిప్రాయము. వైష్ణవశిష్యుఁడు శివ శబ్దము సేరువంటికొలఁతపాత్ర కర్థముగలదియు నగుటచే నాయర్థము గ్రహించి సేరుకంటె తూముపెద్దదున్నదని యర్థమగునట్లు 'ద్రోణమస్తి తతఃపరం' దానికంటెఁ బెద్దది తూముగల దని యర్థ మిచ్చునట్లు వ్రాసెను. ఇది యెవరువ్రాసిన దని రా జడుగ రామానుజాచార్యులవారువ్రాసిరని వారు బదులుచెప్పిరి. వెంటనేయాయనను బట్టితెమ్మని భటులఁ బంపెను. వారు వెదకుచు వచ్చి యెవరు రామానుజాచార్యులనియడుగ నేనే యని యాశిష్యుఁడు చెప్పెను. వెంటనే యాయనను గట్టి భటులు కొంపోయిరి. రాజు నీ వెవఁడ వేమని విచారింపక యాయనయే రామానుజాచార్యులని కొట్టులు గాల్చి యతనికండ్లు రెండుకన్నులఁ బొడిపించెను. ఆవల నీవార్త రెండవశిష్యుఁడు వచ్చి తెలిపెను. ఆ రాజు కుత్తుకలో పురుగులుపుట్టి చచ్చెను. ఈ విధముగ నీశిష్యుఁడు గురువుప్రాణము రక్షించెను.

గురువుదేహమును శిష్యుఁడు తనసొంతధనముతోనో బిచ్చమెత్తిపెట్టియో రక్షింపవలయునుగాని తనదేహమును గురుద్రవ్యముతోఁ బోషించుకొనరాదు. ఇట్టివాఁడు శిష్యుఁడుగా నుండఁదగఁడు. గురువు తానై యేదైన నిచ్చిన గ్రహింపవచ్చునుగాని నిరాకరింపరాదు.

గురూచ్ఛిష్టభోజనము — ఉచ్ఛిష్టము=ఉత్ + శిష్టము, భుజించి ఎక్కువ

కాఁగా మిగిలిన దనియర్థము. భుజించుట యనఁగా నేయింద్రియముతోనైన ననుభవించుట. ఒకఁ డొక యరఁటిపండులోఁ గొంచెము త్రుంచి నోర వేసికొనినఁ దక్కినపండు ఉచ్ఛిష్టము. కొఱికి తినవలసినపనిలేదు. గిల్లి నోర వేసికొనినను జాలును. ఒకగెలలో నొకపండు తినినఁ దక్కినపండ్లన్నియు వానియుచ్ఛిష్టమే. ఒకతపిలెఁడన్నములోఁ గొంత నొకఁడు ముందు తినినఁ దక్కినదంతయు యుచ్ఛిష్టమే. ఇట్టి గురూచ్ఛిష్టమును శిష్యుఁడును, భర్తయుచ్ఛిష్టమును భార్యయుఁ దినవచ్చును కాని యొకఁడు కొఱికి తినఁగా మిగిలినది నమలుచు నోటనుండి తీసినది సర్వథా దుష్టములు. ఇట్టియెంగిలి గురూచ్ఛిష్టమని శిష్యుఁడు తినరాదు. ఇప్పుడు కొందఱు పరమనీచు లెక్కువకులమువారిని జెఱుపుటకై తమనోటి యెంగిలి తీసిపెట్టుచున్నారు. బుద్ధిలేని పశుప్రాయులు తినుచున్నారు. ఇగుపును పావులే. 'కూటికిఁ దక్కువయైనఁ గులమునకుఁ దక్కువా' యనుసామెతయైన మనసునఁ దలఁపకఁ గొందఱు కమ్మవారు కమసాలులు కాఁపువారు కొందఱు బ్రాహ్మణులు తమకులగౌరవమును గోదావరిపాలుచేసి నీచులనోటియెంగిలి తినుచున్నారు. రామరామ! ఇదియేమి కలికాలమహిమయో యెఱుఁగరాకున్నది. మేము బ్రాహ్మణుల మని మేము క్షత్రియులమని చెప్పుకొను వర్ణములవారు ఉత్తమాచారముల నవలంబించి బాగుపడుటకుమాఱుగా నిట్లు లోఁగులై పోవుటకు సంజీవని దుఃఖించుచున్నది. సత్యముగాని యసత్యముగాని యెవ రేవర్ణమువారని చెప్పుకొనినను సంజీవని తప్పుపట్టదుగాని చండాలుఁడైనను నేను బ్రాహ్మణుఁడ ననిచెప్పెనేని బ్రాహ్మణాచారమందుండుమని బోధించును. ఉండకుండిన దుఃఖించును. మరియొక భ్రష్టుఁడు దేశమునఁ జేరెఁగదా యనితలంచును. ఇటుండ గొప్పకులమువారు దొంగపరమహంసల మాయాయోగీశ్వరుల మాటలు నమ్మి పశువులును దినఁ గూడని యితరులనోటియెంగిలి దిని భ్రష్టులగుచున్నారుగదా యని సంజీవని యెంతపరితపించుచున్నదో శ్రీరామునకే యెఱుక. ఈ సందర్భమున నాచిన్ననాఁడు మాపినతండ్రి లక్ష్మణరావుగారు చెప్పిన యొక చరిత్రము స్మృతికివచ్చుచున్నది.

ఆంధ్రదేశము తురకలకు లోఁబడిపోయినపిమ్మట మన స్వదేశ ప్రభువునకు రెండుకన్నులు పోయెను. ఆయన యెంతో పుణ్యాత్ముఁడు, భక్తుఁడు. ఇట్టివాఁడు తనకుఁ గన్నులుపోయెనే యని వ్యసనపడి భగవంతు ననేకవిధముల నారాధించెను. ఒకనాఁటిరాత్రి స్వప్నమందు శ్రీరాముఁడు ప్రత్యక్షమై 'రాజా! నీవు గోల్కొండనవాబు నుచ్ఛిష్టము తింటివేని నీకుఁ గన్నులు వచ్చు' నని చెప్పెను. రాజు మేలుకొని భగవదనుగ్రహమునకు సంతోషించెను గాని తురకవాని యెంగిలి యెట్లు తిందునా యని చాలవిచారపడి కానీ కన్నులువచ్చినతరువాతఁ బ్రాయశ్చిత్తమైనఁ బెట్టుకొందునని తగినపరివారముతోఁ గోల్కొండకుఁ బోయి నవా

బునకుఁ జెప్పిపంపెను. నవాబు సభతీరి రాజునకు వార్తనంపెను. రాజొక వెండి పళ్ళెరమందుఁ గొన్ని యరఁటిపండ్లు మొదలైన ఫలములు తగిననజరానా తీసికొని పోయి నవాబున కర్పించి తనస్థితి యున్నదున్నట్లు చెప్పెను. ఆ నవాబు సరే యని యరఁటిగొలలో నొక పండు తిని మఱియొకపం డొలిచి రాజు చేతిలోఁ బెట్టి 'తిను' మనెను. ఆపం డారాజు దినెను. రెండు కన్నులు వచ్చెను. రా జాశ్చర్యపడి నవాబునకు సలాములుగొట్టి 'మహాప్రభూ! మీ యుచ్ఛిష్టము దినినఁ గన్నులువచ్చు నని భగవంతుఁడు చెప్పెనుగదా! మీ రూరక యిచ్చినదానితోనే కన్నులువచ్చె నే యిదియెట్లని ప్రశ్నించెను. అప్పు డానవాబు 'రాజా! గొలలో నే నొకపండు తిని నీ కొకపం డిచ్చితిని. ఎప్పుడు నే నొకపండు తింటినో యప్పుడే తక్కినపండ్లు నా యుచ్ఛిష్టము లయ్యెను. ఆకారణముచే నీకుఁ గన్నులు వచ్చెను. దైవ మసత్య మాడునా' యనెను. రా జానవాబుఁ జూచి మీ రింత గొప్పవారు గనుక నే భగవంతుఁడు మీ యొద్దకుఁ బొమ్మని చెప్పెను. మఱియొకఁడై యుండిన నేను గుల భ్రష్టుఁడనై యుందుఁగదా యని యభివాదనము లాచరించి తన రాజ్యమునకు వచ్చెను.

తన వెనుకఁ దన యుచ్ఛిష్టము దినువారుఁ డిరేని భర్తలైనను విస్తరిలోని కూరలుగాని యూరుగాయలుగాని యప్పళములుగాని మఱియేదైన కొఱికి సగము నోరనుంచుకొని సగ మాకులో వేయరాదు. చేతనుంచుకొనరాదు. నోటికిఁ బెద్ద దిగా నుండిన నాకులోనే త్రుంచి నోర వేసికొనవలయును. సగము నమలి తక్కినది తుప్పుక్కన విస్తరిలో నుమ్మివేయరాదు. చేతఁదీసి యాకులో నుంచరాదు. ఒక వేళ నోటినుండి తీయవలసి వచ్చెనేని తీసి యాకున కెడముగా నుంచి చేయి కడుగు కొని మరల భుజింపవలయును. ఎంగిలిచేతితో భుజింపరాదు. ఒక పెద్దమనుష్యుని యింటికి నొక యాచకుఁడు వచ్చెను. ఆ పెద్దమనుష్యుఁ డాయనను జూచి నీకేవిద్య యందుఁ బ్రవీణత గలదని యడిగెను. భోజనమందని యాచకుఁడు చెప్పెను. భోజ నముచేయ నీకు వచ్చునా యని పెద్దమనుష్యుఁ డడిగెను. వచ్చునని యాచకుఁడు చెప్పెను. అయైన రమ్మని తన ప్రక్కనతనికి విస్తరివేయించి తనతోపాటు పదా ర్థములన్నియుఁ బిండివంటలతోడ వడ్డింపఁజేసెను. ఇరువురు భోజనమున కుపక్ర మించిరి. పెద్దమనుష్యుఁ డేమియు మాటలాడినవాఁడు గాఁడు. యాచకుఁడు మౌనము వహించియే యుండెను. మజ్జిగ వడ్డించిరి. ఆ యన్నము తినుచు యాచకుఁ డూరు గాయ తటాలున నోరనుంచి కొఱికెను. అప్పు డా గృహస్థుఁడు అయ్యా మీ దేయూ రని యడిగెను. తన తెలివితక్కువచేష్ట తెలిసికొనినాఁడురా యని లజ్జించి యాచకుఁడు అయ్యా యూరుపేరు చెప్పను. ఊరుగాయ కొఱికనను. గృహస్థుఁడు నవ్వుకొని ప్రమాదపడె నని తలఁచి తోఁచిన సత్కారము, చేసి పంపెను. ఇట్టిది భోజనలక్షణము. ఈ విషయమున శాస్త్రవాక్యములు కొన్ని యనువదించెద.

శ్లో॥ వక్త్రప్రమాణపిండాంశ్చ, గ్రసేదేకైకశః పునః
నక్త్రాధికంతు యత్పిండ, మాత్మోచ్ఛిష్టం తదుచ్యతే
పిండావశిష్ట మన్నంచ వక్త్రాన్నిస్సృతమేవచ
అభోజ్యం తద్ద్విజానీయా ద్భుక్త్వా చాంద్రాయణం చరేత్॥

అశ్వమేధికము.

నోట నెంతమాత్రము ముద్దపట్టునో యంతమాత్రము ప్రమాణముగల ముద్దనే యొక్కొక్కసారిగ నోర నుంచుకొని తినవలయును. నోరఁబెట్టుకొనఁగా ముద్దలో మిగిలినయన్నము ఆత్మోచ్ఛిష్ట మనఁబడును. నోరఁబెట్టుకొనఁగా ముద్దలో మిగిలిన యన్నముగాని నోటనుండి వెలువడినదిగాని మరల భుజింపరాదని తెలియ వలెను. అట్లు భుజించెనేని చాంద్రాయణవ్రతము జరుపవలయును. (చాంద్రాయణ వ్రతమనఁగా శుద్ధపక్షమునఁ బాడ్యమినాఁ డొక ముద్ద యన్నము, విదియనాఁడు రెండు, తదియనాఁడు మూఁడు యిట్లులే హెచ్చించి పున్నమనాఁడు 15 ముద్దలు తినవలయును. ఆవల మరల బహుళమునఁ బాడ్యమినాఁడు 14, విదియనాఁడు 13, ఇట్లు వరుసగ అమావాస్యనాఁటివఱకుఁ దగ్గింపవలయును.) ఇట్లుచేయుట చాంద్రాయణవ్రత మనఁబడును.

దీనివలనఁ దన యెంగిలికూడుఁ దాను దినరాదని యేర్పడుచుండ నితరుల నోటి జొల్లుతోడికూడు తినుట నిషిద్ధకార్య మని వేఱుగఁ జెప్పవలయునా?

శ్లో॥ ఏకపంక్త్యాషు భుంజానా, ఉచ్ఛిష్టం స్పృశతో యది।
ద్వావిప్రౌ విసృజేదన్నం, భుక్త్వా చాంద్రాయణం చరేత్॥

ఆచారసంగ్రహము.

ఏకపంక్త్యుపవిష్టానాం, విప్రాణాం సహభోజనే।
యద్యేకోపి త్యజేత్పాత్రం, శేషమన్నం నభోజయేత్।
మోహాద్భుంజీతచే ద్విప్రః, పంక్త్యాముచ్ఛిష్టభోజనమ్।
ప్రాయశ్చిత్తం చరేద్విప్రః, కృచ్ఛ్రం సాంతపనం స్మృతమ్॥ పరాశరము.

ఒకపంక్తిలో భోజనముచేయుటకుఁ గూర్చుండినవారిలో నొకఁ డాకువిడిచి లేచిపోయెనేని తక్కినవారు తమ యాకులలోని మిగిలిన యన్నము తినరాదు. మోహముచే బ్రాహ్మణుఁ డాయుచ్ఛిష్టమును దినెనేని కృచ్ఛముగాని సాంతపనము గాని ప్రాయశ్చిత్తము పెట్టుకొనవలయును. ఇది బ్రాహ్మణులకు నన్వయించును. ఇతరులును దీనిని బాటించినఁ బాటింపవచ్చును.

శ్లో॥ భార్యాభృతకశిష్యేభ్యః ఉచ్ఛిష్టం శేష యేద్బుధః।
భోజనంతు సనిశ్శేషం కుర్యాత్ప్రాజ్ఞః కదాచన॥

వంటచేసినదానిలో భార్యకు పోష్యులకు శిష్యులకు మిగులునట్లు బుద్ధిమంతుఁడు తినవలయును. వీరికి మిగులకుండునట్లు చేసినదంతయుఁ దానే తినరాదు,

ఇది పాత్రలందు మిగిలిన శేషముగురించియే కాని, యాకులో మిగిలిన యన్నముగురించి కాదు.

తనయెంగిలియే తనకుఁబనికిరాదని శాస్త్రము మొఱలుపెట్టుచుండ, నారోగ్య శాస్త్రము నిషేధించుచుండ, కన్నకనుమూలపు నీచజాతివానియెంగిలి కన్ను, కాఁపు, కమసాలులు, (బ్రాహ్మణులుకూడ) తినుట దోషమని వేఱే చెప్పవలయునా! ఈ దోష మన్నవిషయమాత్రమే కాదు. త్రాగినీటికి నన్వయించును.

శ్లో॥ నహా స్తేన పిబేత్తోయం, నపిబ౯ శయనం చరేత్।
పీత్వావశిష్టం చమకే, పున స్తన్నపిబే జ్జలమ్॥

భోజనకాలమందును, గుడిచేతితో నీళ్ళు త్రాగుటకు సాధ్యపడని సమయంబులందుఁ దప్ప నెడమచేతితో నీళ్ళు త్రాగరాదు. నీళ్ళు త్రాగి పండుకొనరాదు. త్రాగగాఁ బాత్రయందు మిగిలిన నీటిని మరలఁ ద్రాగరాదు. అనఁగా జలపాత్రము నోటఁ గఱచుకొని యెంగిలిచేసి త్రాగరాదు. పాత్రలోనినీళ్ళు కొంతత్రావి తక్కిన నీళ్ళు పాత్రమునం దట్లేయుంచి మఱియొకసారి దానిని ద్రావరాదు. పాత్రమునందు నీరు మిగులకుండునట్లు ద్రావవలయును. పాత్ర చేతనుండఁగా నే గుటకలుగాఁ ద్రాగవచ్చును గాని క్రిందనుంచిన తరువాత మరల దాని నెత్తి త్రాగరాదు. ఈ విషయ మింకను సదాచారపద్ధతి వ్రాయునపుడు విపులముగ వ్రాయఁబడును.

ఉచ్ఛిష్టమనఁగా ననుభవింపఁగా మిగిలినదని చెప్పుట యేల? ఒకరు ముడిఁచి తీసినపూలు మూచూచినపూలు మఱియొకరు ధరింపరాదు.

ఒకరు కట్టివిడిచిన వస్త్రముగాని యుపయోగించిన వస్త్రముగాని యితరులుపయోగింపరాదు. కట్టరాదు. ఒకని శయ్య పాదుకలు మఱియొకఁ డుపయోగింపరాదు.

ఒకఁడు స్నానముజేయఁగా మిగిలిననీళ్ళు మఱియొకఁడు స్నానమాడరాదు.

ఒకఁడు పీల్చి విడిచినగాలి మఱియొకఁడు పీల్వరాదు. ఒకఁ డనుభవించిన స్త్రీని మఱియొకఁ డనుభవింపరాదు. ఇది యుచ్ఛిష్టలక్షణము. ఇఁక శబరి శ్రీరామునకు నెట్టి ఫలము లిచ్చెనో చూతము.

ఉచ్ఛిష్ట (ఎంగిలి) మనఁగా నెట్టిదైనదియు నెట్టిది యెవరికి గ్రాహ్యమయినదియు నెట్టిది యెవరిది త్యాజ్యమయినదియుఁ బూర్వసంచికయందు వ్రాయఁబడెను. ఇప్పుడు కొందఱు నీచజాతి గురువులు తమ నోటి యెంగిలి శిష్యులకు గురూచ్ఛిష్టమని పెట్టి వారిని కులభ్రష్టులను జేయుచున్నారు. అంతియకాదు. వైద్యశాస్త్ర ప్రకారముగను, అనుభవమువలనను, ఒకని ఎంగిలి మఱియొకఁడు తిననేని వానిరోగములన్నియు నీ తినినవానికి లభించును. ఇందు సందేహములేదు. మోక్షమునకు ననిపోయిన మొసలి యెత్తుకొనిపోయినట్లగును. కావున నీమోసగురువులు తమ్మునమ్మి బాగుపడఁదలచిన శిష్యులను నుభయలోకభ్రష్టులఁ జేయుచున్నారు.

ఎవరైన నాక్షేపించిన శబరి శ్రీరామున కెంగిలిపండులు పెట్టలేదా యని బదులు చెప్పుచున్నారు. ఈ యుపమానము వీరు చెప్పుటచేతనే వీరి యవివేకము జ్ఞానహీనత బయలుపడుచున్నది. ఎట్లనగ—

నీచపుగురువులుకదా శిష్యురాండ్రకు నోటియెంగిలి పెట్టుచున్నారు? శబరి కదా శ్రీరామునకు నెంగిలిపండ్లుపెట్టినది? శబరి శ్రీరామునకు గుర్వా? కాదేని వీరియుపమాన మెట్లుసార్థకము? శబరి వీరియుపమానప్రకారము శిష్యురాండ్ర నోటియెంగిలి గురువులుకదా తినవలయును? అందఱు శిష్యుల శిష్యురాండ్ర నోటి యెంగిళ్లు దొంగగురువులు తినుచున్నారా? శబరి శ్రీరామునకుఁ దాను గొఱికి వదలిన ఫలములా పెట్టెను? శ్రీమద్రామాయణమునఁ దివ్యాని యడవిపండ్లు తెచ్చి పెట్టె నని యున్నది. అన్ని యేండ్లుగా గురువులకు నడవిఫలములఁ దెచ్చియిచ్చుచున్న శబరికి నేచెట్టుపండ్లు తియ్యనివో తెలియకుండునా? కొఱికి తిని రుచిచూడవలసిన పనియేమి?

చిత్రకూటమందు రాముడుండఁగానే శబరి కామెగురువు లావిషయముఁ దెలిపి శ్రీరాముని నీవు పూజించి కడతేఱు మని చెప్పిరి. ఏరూపముగనో భగవత్సాక్షాత్కారము లేక ముక్తిలేదు. శబరిగురువులు తమయోగదృష్టిచే శ్రీరాము దర్శించి తరించిరి. శబరి కంతటిశక్తిలేదు. కాని భగవత్కటాక్షమునకుఁ దద్దర్శనమునకు యోగ్యురాలు కావున వా రామె కట్లుబోధించిరి.

చిత్రకూటమునువిడిచిన పదునాలుగవసంవత్సరమందు శ్రీరాముఁడు పంప చేరెను. అప్పటినుండి ఫలము లెత్తియుంచినఁ గుళ్లక చెడక యుండునా? శ్రీరామలక్ష్మణులు పంపాతీరమును జేరవచ్చువార్త గురువాక్యములవలన శబరికి ముందుగాఁ దెలియును. ఏదినమువచ్చునదియును వారు ముందే చెప్పియుందురు. అట్లు తెలియదేని ముందుగా ఫలము లెత్తి దాఁచ సాధ్యపడియుండదు. ఇట్లు దాఁచిన ఫలములను శబరి ముందుగాఁ గొఱికి తినియుండెనా యవి చెడియే యుండును. కావునఁ గొఱికితినిన యెంగిలిపండ్లు రామలక్ష్మణులకుఁ దిన శబరి యిచ్చెననుట యసంగతము. అన్నిసంవత్సరములు గురుశుశ్రూషచేసి శబరి నేర్చుకొనిన యాచార మిదియా? గురుభక్తికలదిగదా! శబరి గురువుల కిట్లే యెంగిలిపండ్లిచ్చుచుండెనా? ఇట్లు లామె యశాస్త్రీయమై లోకగర్హితమై పాపావహమైన కార్యమును జేయుచుండెనని బుద్ధికలవాఁడు నమ్మునా? కావున శబరి తానుగొఱికి తినిన యెంగిలి పండ్లు రామలక్ష్మణులకు నిచ్చెననుట సర్వథా దుష్టము. అటయినచో

శ్లో॥ ప్రత్యుద్గమ్య ప్రణమ్యాథ నివేశ్య కుశవిష్టరే
పాదప్రక్షాళనం కృత్వా, తతోఽయం పాపనాశనమ్॥
శిరసా ధార్య పీత్వాచ, వన్యైః పుష్పై రథార్చయత్
ఫలానిచ సుపక్వాని మూలాని మధురాణిచ

స్వయమాసాద్య మాధుర్యం, పరీక్ష్య పరిభక్ష్యచ
పశ్చాన్నివేదయామాస, రాఘవాభ్యాం ధృఢవ్రతా
ఫలాన్యాస్వాద్య కాకుత్స్థ, స్తస్యై ముక్తిం పరాం దదౌ

అని పాద్మపురాణంబున నున్నట్లు కొందఱువ్రాసియున్నారుకదా! ఇందు శబరి ఫలములను దెచ్చి తీపుపరీక్షించి భక్షించి యావల రామలక్ష్మణుల కిచ్చెనని యున్నది గదా యందు రేమో? పై పాఠ మెందుండి గ్రహింపఁబడినదో నాకుఁ దెలియదుగాని ముద్రితములైన పాద్మపురాణములం దావాక్యములు లేవు.

శ్లో॥ ప్రత్యుద్గమ్య ప్రణమ్యాథ నివేశ్య కుశవిష్టరే
పాదప్రక్షాళనం కృత్వా వన్యైః పుష్పై స్సుగంధిభిః
అర్చయామాస భక్త్యావై హర్షనిర్భరచేతసా
ఫలానిచ సుపక్వాని, మూలాని మధురాణిచ
నివేదయామాస తదా, రాఘవాభ్యాం దృఢవ్రతా
ఫలాన్యాస్వాద్య కాకుత్స్థ స్తస్యై ముక్తిం వరామ్ దదౌ

అనియే యున్నది. అనఁగా—

శబరి శ్రీరామలక్ష్మణుల కెదురుగాఁ బోయి నమస్కరించిన దర్భాసనమునఁ గూర్చుండఁబెట్టి పాదములు కడిగి మంచివాసనగల యడవిపూలచే పూజించి భక్తిచే సంతోషముచే నిండినమనస్సుగలదై మాగినపండ్లను తియ్యనిమూలములను దృఢవ్రతయగు శబరి రామలక్ష్మణులకు నివేదించెను. శ్రీరాముఁ డాఫలముల నారగించి యామెకు శ్రేష్ఠమైన ముక్తి నొసఁగెను.

ఇందు ముందుగాఁ దిని యాఫలములను శ్రీరామలక్ష్మణుల కిచ్చినమాటయే లేదు.

పాఠాంతరమందున్నదిగదా యందురా? అందు "భక్షించి" యని యున్నది కాని "కొఱికితిని" యనిలేదు. కావున భక్షించియనుటకు మనము దోసపండ్లను టాకావేసి కొంచెము గిల్లి నోర వేసికొన్నట్టు లెంచవలయునే కాని యితరముగు కాదు. శబరి శ్రీరాముని భగవంతుఁడని భక్తిచేఁ గలిగినసంతోషాతిశయముచే మైమఱచి నదై పూజించెనుగాని మనుష్యుఁ డనుదృష్టిచేఁ గాదు. ఇది నిస్సందేహము. భక్త్యతిశయముచే స్త్రీలు దేహము మఱచుట యీ కాలమందును బ్రత్యక్షముగఁ గానఁబడుచుండుట యనుభవైకవేద్యము. ఇట్టి భక్తిపరవశలయిన స్త్రీలు కార్యములు తాఱుమాఱు చేయుటయుఁ గలదు. భక్తిలక్షణము భావోల్బణము విధము నెఱిఁగిన భాగవతులు దానిని దోషముగ గ్రహింపరు; మఱి యనుగ్రహింతురు.

కృష్ణుఁడు విదురునింటికి విందునకై పోయినపు డాయనభార్య 'కృష్ణా! భోజనమునకుఁ బ్రొద్దుపోవును. ఆఁకలి తాళఁజాలవు. ఫలాహారము పెట్టెద'రమ్మని యెదురుగఁ గూర్చుండఁ బెట్టుకొని సంతోషాతిశయముచే మైమఱచి యరఁటిపండు

లొలిచి చెక్కను కృష్ణునిచేతిలోనుంచి పండు పాఱవైచెను. ఇట్లు కొన్ని పండు లిచ్చినతరువాత దేహస్మృతిగలదై చూడఁ బండ్లు పడియున్నవి. చెక్కలు కానరా లేదు. కృష్ణుఁ డా చెక్కలే నమలుచుఁ దినుచుండెను. అప్పు డా యిల్లాలు మిగులఁ బరితపించి యెంతటి పాపి నని యావల మఱియొకపం డొలిచి చెక్క పాఱవేసి పండు కృష్ణునిచేతిలో నుంచెను. కృష్ణుఁడు దానిని నోరనుంచుకొని యబ్బబ్బా యిది బాగుగలేదు నా కా చెక్కే యిమ్మనెనఁట.

దీనివలన గ్రహింపవలసినదేమి ? భక్తి ప్రధానముగాని వస్తువుగాదు పూతన విషము, కారుచిచ్చు, యశోద చనుఁబాలు, గొల్లెతల పాలు పెరుఁగు సమానముగ నారగించువానికి భగవంతునకు విధినిషేధములు గలవా ? గుణాతీతుఁడైన మనుష్యు నకే విధినిషేధములు లేవే ? భగవంతున కెందుండి వచ్చెను? అంతటి భక్తి గలిగిన దనుటచేతనేకదా శబరికి వెంటనే ముక్తి లభించెను.

ఈనాఁటి నీచగురువులు తమనోటియెంగిలి శిష్యురాండ్రకుఁ బెట్టుట ప్రేమ చేతనా ? కామముచేతనా ? మోక్షాసక్తిచేతనా ? నీవిమోక్షాసక్తిచేతనా ? ఏమని వీరు తమ దుష్టచరిత్రమునకుఁ బ్రమాణముగాఁ బరమభాగవతురాలు దృఢవ్రత మహాతపస్విని యోగసిద్ధయగు శబరిచరిత్రమును దృష్టాంతముగాఁ జెప్పెదరు. వినెడివారు పశువులు. తామేమి చెప్పినను వారు చెవులు వ్రేలవైచి విందురుగదా ! అనియేకదా యిట్టి కుచేష్టలు చేయుట.

(1) తక్కువకులమువా రెక్కువకులమువారికి మహామంత్రోపదేశము చేయుట (2) ఎవరైన నెట్టివారికైనఁ దమనోటి యెంగిలి పెట్టుట, యీ రెండును దుష్టకార్యములనియే సంజీవని యభిప్రాయము. అయినను సంజీవని సర్వజ్ఞత్వము నభినయింపదు కావున నది పొరపడి యుండవచ్చును. కావున సత్యము స్థిరపడుటకై యది పై రెండు విషయములు శాస్త్రీయములని శ్రుతిస్మృతీతిహాస వాక్యములు ప్రమాణములుగ ననువదించుచు, సిద్ధాంతముచేసి పై రెండు కార్యములు చేయు చుండు గురునామధారులు వ్రాసిరేని యీ వ్యాసమును సంజీవని ప్రకటించును. అట్లు సిద్ధాంతము చేయఁజాలరేని యీ గురువులు చేయు కార్యము మహాపాపకార్య మని లోక మెఱుంగఁగలదు.

—♦ గురులక్షణము ♦—

మీఁద వివరించిన లక్షణములు గల శిష్యునకు గురు వెట్టివాఁడై యుండ వలయును ?

శ్లో. సిద్ధం, సత్సంప్రదాయే స్థిరధియ, మనఘం, శ్రోత్రియం, బ్రహ్మనిష్ఠం,
సత్త్వస్థం, సత్యవాచం, సమయనియతయా సాధువృత్త్యా సమేతమ్,
దంభాసూయాదిముక్తం, జితవిషయగణం, దీర్ఘబంధుం, దయాళుం,
స్ఖలిత్యే శాసితారం స్వపరహితపరం, దేశికం భూష్ణురీప్సేత్.

సిద్ధం=మంత్రసిద్ధుఁడుగానైనను, యోగసిద్ధుఁడుగానైన నుండవలయును.

సత్సంప్రదాయే స్థిరధియం = శాస్త్రసమ్మతమై పూర్వాచార్యులచే ననుష్ఠింపఁబడినదై యుండు సంప్రదాయంబున స్థిరమయిన మనస్సు గలవాఁడై యుండవలయును. దురాచారములు దుష్ట సంప్రదాయములు గలవాఁడు, గురువుగా నుండ యోగ్యుఁడు కాఁడు.

శ్రోత్రియం = వేదములు నేర్చి పెద్దలవలన వినికిడి కలిగినవాఁడుగా నుండవలయును.

బ్రహ్మనిష్ఠం=బ్రహ్మవిచారమందు విశేషముగ మనసునిలిపి దానియందే విశేషకాలము గడుపువాఁడు.

సత్త్వస్థం = సత్త్వగుణమును విడువక దానియందే స్థిరముగా నుండువాఁడు.

సత్యవాచం=సత్యము చెప్పువాఁడుగా నుండవలయును. శాస్త్రమునందున్నదున్నట్లు చెప్పిన శిష్యులు మనస్సు నొచ్చుకొని తొలఁగి పోదురేమో ? దానివలన లాభము తగ్గునేమని యిచ్చకములు చెప్పువాఁడుగా నుండరాదు.

సమయనియతయా=శాస్త్రము విధించిన కట్టుపాటుల యందలి నియతిచేతను.

సాధువృత్త్యా=సాధువర్తనముచేతను.

సమేతం=కూడినవాఁడుగా నుండవలయును.

దంభాసూయాదిముక్తం=మోసబుద్ధి, ప్రతిష్ఠయందు గాంక్ష, మనకుఁ దెలిసినదంతయు నేర్పిన శిష్యుఁడు మనలను మించినవాఁ డగునేమో యనుతలంపు లోనైనవి లేనివాఁడుగ నుండవలెను.

ఆదిశబ్దముచే దుష్కామక్రోధలోభాదులు లేనివాఁడని గ్రహింపవలయును.

జితవిషయగణం=విషయసమూహములను జయించినవాఁడుగా నుండవలెను. విషయము లీడ్చినట్లు పోవు మనస్సుగలవాఁడుగా నుండరాదు.

దీర్ఘబంధుం = యావజ్జీవము నెనరుగల చుట్టమువలెఁ బ్రేమగల వాఁడయి యుండవలయును.

దయాళుం=దయగలవాఁడుగా నుండవలయును.

స్ఖలితే శాసితారం=శిష్యునిపడవడియందు దోషము గలిగెనేని వానిని దండించియైనఁ జక్కదిద్దువాఁడుగా నుండవలెను.

స్వపరహితపరం=తన మేలు, ఇతరుల మేలు కోరువాఁడు పరులనిమిత్తమై తాను జెడరాదు. తననిమిత్తమై పరులను జెఱుపరాదు.

ఉపదేశము చేయఁ తగినదాని నుపదేశించినను ఉపదేశము చేయరాని వాని కుపదేశించినను గురువు చెడును.

స్వశ్రేయస్కాముఁడగు శిష్యుఁ డిట్టి గుణము గలవానిని గురువుగా గ్రహింపవలయును.

మీఁద దీర్ఘబంధువై గురువుండవలయునని చెప్పఁబడెను. దీర్ఘబంధువగు గురు వెట్టివాఁడన—

—♦ దీర్ఘబంధువగు గురువు లక్షణము ♦—

గురు రపి శిష్య మౌరసవ త్పశ్య న్నుపాధిం వినా విద్యా
గ్రాహయన్ స్వదేహయాత్రానపేక్ష మేత దుజ్జీవన
వదో యథాగ్రహణ మౌపనిషదీం విద్యాం మాతృ
వత్స్వయమే వాస్య రక్షణే ప్రవృత్తో ధర్మాన్ పూర్వా
చార్య పరిగృహీతాన్ చిన్వ, న్నతి దుష్కరే కర్మణ్య
నియోజయన్. అర్థలోభే నాగర్హయన్, అంతరాంత
రానధ్యయన విఘ్నం దాస్యేషు నియుంజానః స్ఖలనే
భర్త్సయన్ స్ఖలనం పరేభ్యః ప్రకాశయన్, అస్ఖలనే
ఉపలాలయన్, మనసి ప్రియమాణే విద్యమానస్య
గుణస్యాభినందయన్, అవిద్యమానస్య శిక్షయన్,
అనుగృహ్ణాన్, మార్గాత్ప్రతంతం వారయన్, అతిక్ర
భగతం భగవత్ప్రపత్త్యాదిభి రుద్ధరన్, అశక్యవార
ణేపి స్వకృపయా సముద్ధరన్, ఏవ మన్యద్యథా
శాస్త్రమాచరన్ దీర్ఘబంధు ర్భవేత్.

అర్థము: గురువు తనశిష్యుని దన కడుపునఁ బుట్టిన బిడ్డవలెఁ జూచుచుఁ బ్రతిఫలమేదియుఁ గోరక విద్య గ్రహింపఁ జేయుచుఁ, దన దేహయాత్రకూడ నుపేక్షించిన శిష్యుని నుజ్జీవింపఁ జేయుటయం దాసక్తి గలవాఁడై వాఁడు గ్రహింపఁ గలిగినంత యుపనిషద్విద్యను నేర్పుచుఁ దల్లివలెఁ దానే యతని రక్షణమునకుఁ జేయవలసినపనులు చేయుచుఁ బూర్వాచార్యు లనుష్ఠించిన ధర్మములను దెలుపుచు మిక్కిలి కష్టమైన పనులుచెప్పక ధనలోభముచే నిందింపక, యతఁ డెంతయిచ్చునో యంతతోనే తృప్తిపడుచు నతఁడు సమర్పించిన దానియందు భేదబుద్ధివదలి వాని యభ్యాసమునకు విఘ్నము కలుగకుండునట్లు విరామకాలములందుఁ బనులు చెప్పుచు నేదైనలోపముచేసినా బెదరించుచు ఆలోపములను నితరులకుఁ జెప్పక దానిని మనస్సున నుంచుకొనక, స్ఖలనములేక యభ్యసించు శిష్యుని లాలించుచుఁ దన మనస్సునకుఁ బ్రియమైన కార్యములను జేసినయెడలఁ దనకుఁ దెలియవచ్చిన

వానిని మెచ్చుకొనుచుఁ దెలియనివి నేర్పుచు ననుగ్రహించుచు సరియైన త్రోవ నుండి పడిపోకుండ నివారించుచు శిష్యునికి మిక్కిలి కష్టము ప్రాప్తించినపుడు భగవత్ప్రవృత్తిచేయించి యుద్ధరించుచు వారించుటకు నశక్యమైనవాని విషయమునఁ దానే కృపచే నుద్ధరించుచు నీవిధమున శాస్త్రప్రకార మితరకార్యములను జేయు గురువు దీర్ఘబంధువనఁబడును.

ఇది యంతేవాసియగు శిష్యునియందు నన్వయించునుగాని భిన్నదేశముల నుండువారిపట్లఁ బూర్ణముగ నన్వయింపదు.

బుభుక్షువై స్వైరుఁడగు శంబుకునకు, ముముక్షువై శాస్త్రబద్ధయగు శబరికిఁ గల తారతమ్య మెఱిఁగి వారివిషయమున నజ్ఞలోకము దురభిప్రాయములు మానునుగాక !

—♦ ౭౫-వ సర్గము. రామలక్ష్మణులు పంపాతీరంబుఁ జేరుట. ♦—

కం. అరతి యీగతిఁ బరగతి, దాసిన నేకాగ్రచిత్తుఁ ♦ దమ్ముని హితునిన్
వాసవనిభుఁ డగురాముఁడు, మాసరముదమునను బల్కె ♦ మానివిషయమై.

పరగతి = పరమపదము, ఏకాగ్రచిత్తున్ = గురుశుశ్రూషమహిమ యేమని చెప్పుదురు. క్రూరాత్మకమైన బోయకులమునందుఁబుట్టియు, నాఁడుదియయ్యు గురుశుశ్రూషామహిమచే నిట్టి యుత్తమయోగ్యత సంపాదించెఁగదా! నేనిట్టులే నాగురువగు శ్రీరామచంద్రమూర్తికి శుశ్రూషచేసితినేని నాకు నిట్టి యోగ్యత గలుగునుగదా, యని యీ విషయమందే మనస్సునిలిపి యాలోచించుచున్నవానిని, మాసరముదము = అధిక సంతోషము. ఇది యస్థానసంతోషముకాదు. పుణ్యాత్ములదర్శనము లభించెను. ఇఁక నిది మొదలు మనకష్టములు నశించును. కార్యము జయమగును. మహాత్ములదర్శనము శుభము గలిగించునుగాని వ్యర్థముపోదు అని సంతోషము.

తా. ఆమె యీవిధముగఁ 'దద్విష్ణోః పరమంపద'మ్మన్నట్లు పరముపదము నకుఁబోఁగా నేకాగ్రమనస్కుఁడయి తనమేలుకోరు లక్ష్మణుని జూచి యింద్రునితో సమానుఁడగు రామచంద్రమూర్తి యధికసంతోషముతో మతంగమునివిషయమై యిట్లు చెప్పెను.

శా. ఏమీ వారలసత్ప్రభావము! ల వెంతే నక్కజం బయ్యెడిన్
సౌమిత్రీ! మృగముల్ పులుల్ చనవు హెచ్చన్ నమ్మికం గ్రుమ్మరెన్
నేమం బారఁగఁ బైత్రతర్పణము మానిన్ శ్రేష్ఠసంస్పృష్టత
త్సామ్రాజ్యంబుల దీర్చినారము శుభోదర్కంబుగా నీయెడన్. ౧౭౭౬

అవి + ఎంతేన్ = ఆప్రభావములు మిక్కిలి, అక్కజంబు = ఆశ్చర్యము, పైత్రతర్పణము = తీర్థములకుఁబోయినపుడు పితృతర్పణము చేయవలయును.

ఇచ్చట సముద్రతీర్థములు లభించుటచే పితృతర్పణము చేయఁబడెను. మునిశ్రేష్ఠ = మునులందు శ్రేష్ఠుఁడైన మతంగునిచే, సంసృష్ట = సృజింపఁబడిన, తత్సాముద్రాంబుల౯ = ఆ సముద్ర సంబంధ జలములచే, శుభోదర్కముగా = ముందు శుభము గలుగునట్లు.

తా. ఆహా! ఏమి యీ ఋషుల మహామహిమ! అవి చూడఁజూడ మిక్కిలి యాశ్చర్యమగుచున్నది. లక్ష్మణా! ఇచ్చట జింకలు, పులులు మచ్చికచేత సహజ విరోధము మాని నమ్మికతోఁ దిరుగుచున్నవి. మునీశ్వరు లున్నప్పుడేగాక వారు పోయిన తరువాతఁ గూడ వారి తేజస్సు వ్యాపించియుండుటచే హింస యనునది కనరాకయున్నది. మునీశ్వరుఁడు సృష్టించిన సముద్రజలములతో పితృతర్పణము చేసితిమి. ఇఁక మనకు మేలగును.

ఉ. హావడి దీఱె, సౌఖ్య మిఁక ♦ నబ్బెడుఁ, జిత్తము తుష్టి చెందె, సు
గ్రీవుఁడు సంచరించెడి గి ♦ రిం గడుదూరము లేదు, పంపకై
పోవలదా యిఁక౯ మనము ♦ పోల్చుఁ గదా యట ఋష్యమూక మ౯
గ్రావము, సూర్యపుత్రుఁ డటఁ ♦ గ్రాలుఁ గపీంద్రచతుష్కయుక్తుఁడై. ౧౪౭౭

హావడి = ఉపద్రవము, కష్టకాలము, తీఱె౯ = నశించెను.

తా. లక్ష్మణా! మన కష్టకాలము నశించెను. ఇఁక సౌఖ్యమే కలుగును. మనస్సుకూడ వ్యసనము దొలఁగి సంతోషముతోఁ గూడియున్నది. ఇక్కడికి సుగ్రీవుఁడుండు పర్వతము సమీపమే. మిగుల దూరముగాదు. ఇఁక మనము పంపకై పోదము. అచ్చటఁగదా సుగ్రీవుఁడు నలువురు వానరులతో నుండు ఋష్యమూక మున్నది.

ఉ. పోదము లెమ్ము పద్మహిత ♦ పుత్రునిఁ గానఁగ వేగ, వానిచేఁ
గాదె ధరాతనూజ వెద ♦ కం దగు కార్యము తీరు, నన్న సీ
తాదయితుం౯ వచించు విను త ♦ ద్విషయంబునయంద నామనం
బాదటఁ దీవరించెఁ బద ♦ మా యనివారలు చేరి పంపనున్. ౧౪౭౮

పద్మహితపుత్రుని౯ = సూర్యునికొడుకును, తీరు౯ = చక్కఁబడును, ఆదట౯ = ప్రేమచే.

తా. మనము సుగ్రీవుని జూచుటకుఁ బోదము లెమ్ము. సీతను వెదకుకార్యము వాఁడుగదా చేయవలసియున్నది. అని చెప్పఁగా లక్ష్మణుఁడును 'నే నా విషయమే యాలోచించుచున్నాను. ఇక్కడ జాగుసేయక పోదమని తొందరపడుచున్నాను.' అని వారలు పంపాతీరముఁ జేరి.

సీ. నానాలతాకీర్ణ ♦ నవ్యభూరుహాపూర్ణ, పానీయవాహినీ ♦ భవ్య మగుచు
నిష్యందమకరంద ♦ నీరంధ్రపరవింద, కహ్లారవితతి ర ♦ క్తంబు నగుచుఁ

బుండరీకవితాన♦పురుకైరవాదీన, లలితరోచులచే వ♦ళక్షు మగుచు
నవగణనాతీత♦కువలయసంజాత, నిబిడకాంతులచేత ♦ నీలమగుచు

తే. గుథముఁబోలిన యాపంప♦కొలఁకుఁ గాంచి
నియమసముదార జనసమ♦న్వితమైన
దాని మహిమకు మిగులఁ జో♦ద్యంబు నొంది
కనులపండువుగా దానిఁ ♦ గనుచు నరిగి. ౧౨౭౯

నానా...భవ్యము = పెక్కుతీఁగ లల్లుకొనిన యనేక వృక్షములచేత నిండినదియయి, పానీయవాహినీ భవ్యము = త్రాగుటకు యోగ్యమైన జలముచే శుభమైనది, నిష్యంద = స్రవించుచున్న, మకరంద = తేనెచే, నీరంధ్రత్ = ఎడములేనిదగు, అరవింద = ఎఱ్ఱకమలములయు, కహ్లార = ఎఱ్ఱకలువయు, సంస్కృతమున కహ్లారమనియే రూపము. దీనికిఁ బ్రాకృతరూపము కల్హారము. ఇక్కడ సంస్కృతసమాసమున నుండుటచేఁ గహ్లారమనియే పఠింపనగు.–హ్లోల్హః॥ హ్లాకారస్య లాక్రాంత హాకారస్స్యాత్ । అత్రప్రాయోలుగితి దలోపః–కహ్లారపరః, కహ్లారపరః॥ ఇట్టిదే ప్రహ్లాదశబ్దము–సంస్కృతమున హ్లా, ప్రాకృతమున ల్హాయగు. షడ్భాషాచంద్రిక ౧-౪-౬౬. వితతిఁ = సమూహముచే, రక్తంబయి = ఎఱ్ఱనికాంతి గలది, పుండరీక వితాన = తెల్లతామరలసమూహముయొక్కయు,పురు = గొప్పవగు,కైరవ = తెల్లకలువలయు,అదీన = విస్తారమగు, లలిత = మనోహరమైన, రోచులచేఁ = కాంతులచే, వళక్షము = తెల్లన, నవ = క్రొత్తవగు, గణనాతీత = లెక్కకుమించిన, కువలయ = నల్లకలువలచే, సంజాత = పుట్టిన, నిబిడ = దట్టమైన, కాంతులచే నీలమగుచు = నల్లనై, గుథముఁ = తివాసిని, నియమ = వ్రతములచే, సముదార = గొప్పవారగు, జన = ఋషులచే, సమన్వితము = కూడినది.

తా. అనేకవిధములైన తీఁగలచే నల్లుకొనఁబడి యందమైనచెట్లు తీరమునందు గలదై త్రావుట కుపయోగించు మంచినీళ్ళు గలదియు, తేనెచే నిండిన ఎఱ్ఱని కమలములచేతను, ఎఱ్ఱని కలువలచేతను నెఱ్ఱనై, తెల్లదామరలచేతను, దెల్లకలువలచేతను తెల్లనై, లెక్కకు మిక్కుటమైన నల్లకలువలచేఁ దట్టమగు కాంతులచే నీలనై, నానావర్ణములు గల తివాసివలె నుండు పంపాసరోవరముఁజూచి వ్రతనిష్ఠగల మునులతోఁ గూడిన దాని మహిమకు నాశ్చర్యపడి నేత్రానందముగా దానిని జూచుచుఁబోయి.

తే. దానికిని నాతిదూరాన♦మాననీయ, మగు మతంగసరసమున ♦ నా ధరాధి
పతికుమారులు దోఁగి త♦త్ప్రాంతరమ్య, వనములను తిలకించుచుఁ జనుచునుండ.

నాతిదూరాత్ = కొంచెము దూరమున, మాననీయ = గౌరవింపదగినది, మతంగసరసమున = మతంగుని సరోవరమునందు, తోగి = మునిఁగి, తత్ = దానికి, ప్రాంత = సమీపమున నుండు, రమ్య = మనోహరములగు, తిలకించుచుత్ = చూచుచు.

తా. దానికిఁ గొంచెము దూరమునందు గౌరవయోగ్యమైన మతంగు కొలని యందు స్నానముచేసి యా రాజకుమారులు ఆ సమీపముననున్న యందములైన వనములను జూచుచు పోవుచుండఁగా.

తే. లలితలతికావిరాజిత♦తిలకబీజ, పూరకకరవీరకుంద భాం♦కీరసప్త
పర్ణకేతకనిచుళామ్ర♦వనవిభాసి,త మయి భూషితప్రమద నాఁ♦ దనరుదాని.

లలిత + లతికా + విరాజిత = అందములైన తీఁగలచేఁ బ్రకాశించు, తిలక = బొట్టుగుచెట్లు, బీజపూరక = మాదిఫలముచెట్లు, కరవీర = గన్నేరుచెట్లు, కుంద = మొల్లతీఁగలు, భాంకీర = మట్టిచెట్లు, సప్తపర్ణ = ఏడాకుల యరఁటిచెట్లు, కేతక = మొగలిచెట్లు,నిచుళ = ఎఱ్ఱగన్నేరు,ఆమ్రవన = (ఆమ్ర + వన) మామిడితోఁపు వీనిచే, విభాసితమై = ప్రకాశించునదియై,భూషితప్రమదనాత్ = అలంకరింపఁబడిన తరుణియో యన్నట్లు, తనరుదాని = ఒప్పుచున్నదానిని.

తా. అందములైన తీఁగలచేఁ బ్రకాశించు బొట్టుగుచెట్లు, మాదిఫలవృక్షములు, గన్నేరులు, మొల్లతీఁగలు, మట్టులు, ఏడాకుల యరఁటులు, మొగలిచెట్లు, ఎఱ్ఱ గన్నేరులు, మామిడితోఁపులు వీనిచేఁ బ్రకాశించుచు నలంకరింపఁబడిన పడుచువలె నుండుదానిని.

తే. కీరకోయష్టికార్జున♦హారిపక్షి, చయనినాదితవనమును ♦ స్ఫటిక శుద్ధ
వారి నిర్మలవాలుకఁ ♦ బంప వెండి, జేరి తమ్మున కనియె శ్రీ ♦ సీతనేత.

కీర = చిలుకలు, కోయష్టిక = చీఁకుకొక్కెరలు, అర్జున = నెమిళ్ళు అనెడి, హారి = మనోహరములయిన, పక్షిచయ = పక్షులసమూహముచే, నినాదిత = ధ్వని, కలదిగాఁ జేయఁబడిన, వనమును = తోఁపును, ఎలమి = సంతోషముతో, రాగము = ప్రేమ.

వనము పై పద్యమున శృంగారవతియగు పడుచుగాఁ జెప్పుటచేఁ గంఠ స్వరము దానికిఁ దగినట్లు చెప్పఁబడెను. శుభశకునమైన ముత్తైదువ దర్శనము సూచితము.

తా. చిలుకలు గ్రుడ్డికొంగలు నెమిళ్ళు అను మనోహరములైన పక్షుల ధ్వని కల వనమునుఁ జూచుచు సంతోషముతోఁ బోయి పంపఁ జేరి రామచంద్రమూర్తి లక్ష్మణునితో నిట్లనియె.

కం. ఈ పంపాతీరంబున, నేపారెడు ఋశ్యమూక♦పృథివీధర మం
దాపుణ్యుఁడు సుగ్రీవుం, డీపట్ల వసించుచుండు♦నిష్టులతోడన్. ౧౨౮౩

పృథివీధరము = పర్వతము.

తా. ఈ పంపయొడ్డుననుండు ఋశ్యమూక పర్వతమునందు ఆ పుణ్యాత్ముఁడైన సుగ్రీవుఁ డిప్పుడు మిత్రులతోఁ వసించుచుండును.

కం. దీనుఁడ నై రాజ్యశ్రీ, హీనుఁడ నై సీతఁ బాసి ♦ యెట్లు మనవచ్చున్
గాన దివాకరతనయునిఁ, గానఁగ నీ వరుగ వయ్య ♦ కార్యము పొంటెన్.

దీనుఁడనై = దుఃఖతప్తుఁడనై, రాజ్యశ్రీహీనుఁడనై = రాజ్యలక్ష్మి లేనివాఁడనై, మనవచ్చున్ = బ్రతుకవచ్చును, దివాకరతనయున్ = సూర్యపుత్రుఁడగు సుగ్రీవుని, కార్యముపొంటెన్ = మనపనికొఱకు.

తా. శోకతప్తుఁడనై రాజ్యము గోల్పోయి, భార్యను బోఁగొట్టుకొని యెట్లు బ్రదుకనేర్తును? కావున మనకార్యము నిమిత్తమై సుగ్రీవునిఁ జూడ నీవు పొమ్ము. నేను బోవుట మర్యాదగాదు.

దుఃఖమువచ్చినను రాజ్యమైన నుండిన నది సహ్యముగ నుండును. రాజ్యము పోయినను భార్యయైననుండిన ఆదుఃఖము తెలియకయుండును. అన్నిటిని పోఁగొట్టుకొని దుఃఖించుచు మనచేతి క్రిందివాఁడగు వానియొద్దకు నే నేగుని వత్తును? నీవే పోయి సంధి కుదుర్చుకొని రమ్ము.

కం. అని లక్ష్మణసహితుండై, యినకులచంద్రుఁడు విషాద♦భృశతాపితుఁడై
తనయనుఁగుఁదమ్మునితోఁ బంపను దృష్టిమనోహరైక♦భాగముఁ జేరెన్.

తా. ఈప్రకారము లక్ష్మణునితోఁ జెప్పుచు రామచంద్రమూర్తి యధిక దుఃఖముచేఁ దపించి (తన సామంతరాజునొద్దకుఁ దాను దీనుఁడై కార్యార్థియై పోవుట దుఃఖకరము గదా) తన చిన్నతమ్మునితోఁ పంపాతీరమునఁ జూచుటకు నింపైన స్థలముఁ జేరెను.

మాలిని. ఈవిధి దుఃఖకరంబులఁ గానల ♦ నెల్లను దాఁటి క్రమంబుగ వి
ఘ్నావళిఁ బాయఁగఁ జేయుచు దవ్వు ప్ర ♦ యాణముచేసి మనోజ్ఞకనా
నావిధపక్షిసమాకులఁ బంపను ♦ నవ్యజలాశయసత్తమ నా
భూవరనందనయుగ్మము గాంచి య♦పూర్వముదంబున నుల్లసిలెన్.

తా. ఈ ప్రకారము దుఃఖముల కలిగించు నడవులనెల్ల నునసగదాఁటి నడుమ నడుమవచ్చిన విఘ్నములనెల్లఁ దొలగించుకొనుచు మార్గప్రయాణముచేసి మనోహరములై యనేకవిధములయిన పక్షులచేనిండిన యందమైన కొలఁకగు పంపను జేరి, యిన్ని దినములుగ నెఱుంగని సంతోషముచే రాజకుమారు లిరువురు ముఖ వికాసము నొందినవారైరి.

అభ్రమండలమునుజొచ్చు జలజాప్తులీల మబ్బుమాటునకుఁ బోయిన సూర్యుని

వలెనని చెప్పఁబడెను. ఇప్పుడా మబ్బు తొలఁగిపోయెను. సూర్యుఁడు యథాప్రకారము ప్రకాశింపఁబోవుచున్నాఁడు.

ఆరణ్యకాండాంతపద్యములు

కం. రామా! గుణధామా! రిపు, భీమా! సౌందర్యకామ! ♦ విశ్రుత తేజ
  స్సోమా! శుభనామా! రుచి, సీమా! లసదొంటిమిట్ట ♦ సీతారామా! ౧_౭౮౨

రామచంద్రా! ఆశ్రితరక్షణాది కల్యాణగుణములకు స్థానమైనవాఁడా! దీనిచే ఋషుల శరణాగతి నభయప్రదానము చెప్పఁబడెను. రిపుభీమా = శత్రువులకు భయంకరుఁడా! దీనిచే విరాధఖరాది రాక్షసవధ చెప్పఁబడెను. సౌందర్యకామా = అందమునందు మన్మథుఁడా! తరుణులు ప్రాప్తరూపులని చెప్పిన శూర్పణఖావాక్యములు స్మరింపనగు. విశ్రుత = ప్రసిద్ధికెక్కిన, తేజస్ = తేజమునందు. సోమా = చంద్రుఁడా, శుభనామా = పాపముల హరించి మేలును గలిగించు నామము గలవాఁడా, రుచి సీమా = కాంతికి పొలిమేరయైనవాఁడా. అందఱ కాంతులు నీయనకాంతికి లోపడిన వని భావము. లసత్ = ప్రకాశించు, ఒంటిమిట్టయందలి సీతావిశిష్టుఁడైన శ్రీరామచంద్రమూర్తీ! పాహి పాహి పాహి!

చ. అయగతి వందనీయ దుర♦వాప్తపదార్థరతైకచేతనో
  చ్చ్రయసువిదూర యింద్రియవ♦శంగత దేహింభృశార్తిమోక్షణా
  వ్యయదయ యాజవంజవని♦బద్ధసదైకగతీ మహామతీ
  జయజయ ధర్మభృద్వర ప్ర♦శస్తసమస్త గుణైకమందిరా. ౧_౭౮౮

అయగతి = శుభకరమైన నడకగలవాఁడా. ఈయన యరణ్యమునకు వచ్చుటకు వాస్తవకారణము ఋషులకు మేలుచేయనేకదా. వందనీయ = ఋషుల నమస్కారమునకుఁ యోగ్యుఁడైనవాఁడా. దురవాప్త = పొందఁదగని, పదార్థ = వస్తువులయందు, రత = ఆశగల, ఏకచేతన = ప్రధానముగాఁగల మనస్సు గలవారి, ఉచ్ఛ్రయ = సమూహామునకు, సుదూర = మిగుల దవ్వైనవాఁడా. సీతాదేవి ప్రాకృత మాయామృగముపై మనస్సు పోనిచ్చుటచేఁగదా శ్రీరామచంద్రమూర్తి యామెను వదలిపెట్టి దూరము పోయెను, ఇంద్రియ వశంగత = వంశగతేంద్రియుఁడనిభావము. ఇంద్రియములను తన వశముచేసికొనిన దేహి = జీవుల = ఋషుల, భృశార్తి = విస్తారమైన దుఃఖమును, మోక్షణ = పోఁగొట్టుటయందు, అవ్యయదయ = క్షీణింపని దయగలవాఁడా, ఆజవంజవ = సంసారమున, నిబద్ధ = బాగుగఁగట్టఁబడిన, సత్ = మంచి, ఏక = ఒకటేయగు, సదా = సర్వదశల—ఏక = ఒక్కటేయగు, గతీ = యుపాయమైనవాఁడా, జటాయువునకు మోక్షము దీనిచే సూచితము. సంసారులకు మోక్షము కైంకర్యముచేఁదప్ప వేఱొకవిధముగా రాదనిభావము. మహామతీ = గొప్పమనస్సు గలవాఁడా, జయజయ = జయముకలుగునుగాక! జయ

ము కలుగునుగాక! ధర్మభృత్ + వర = (1) వింటిని పట్టెడువారిలో శ్రేష్ఠుఁడా, (2) ధర్మమును భరించి రక్షించువారిలో శ్రేష్ఠుఁడా, ప్రశస్త = మిగులఁ గొనియాడఁబడు, సమస్త = సకల, గుణ = వాత్సల్యసౌశీల్యౌదార్యదయాదిగుణములకు, ఏక = ఒకటియేయైన, మందిరా = వాసస్థానమైనవాఁడా.

మందాక్రాంత. ధీరా! యూర్ధ్వేశ శుచినముచి ♦ ద్వేషిదిక్సాంఖ్యపద్యో
దారారణ్యప్రథితచరితో ♦ ద్దామ వాత్సల్యసీమా
క్రూరారాతిక్రథనకలిత ♦ క్రూరకోపా యపాపా
వారాశీజాకమలమధుపా ♦ భక్తహృత్పద్మసద్మా. ౧౨౮౯

ధీరా = ధైర్యముగలవాఁడా, ఊర్ధ్వ = పదిదిక్కులలో నూర్ధ్వము తొమ్మిదవది, ఈశా = ఈశాన్యదిక్కు ఎనిమిదవది, శుచి = ఆగ్నేయము రెండవది, నముచిద్వేషిదిక్ = ఇంద్రునిదిశ మొదటిది, ౯–౮–౨–౧ వీనిని తలక్రిందుగఁ జూచిన ౧౨౮౯ యగును. సాంఖ్య = సంఖ్యగల, పద్య = పద్యములచేఁ (అనఁగా నీకాండమందు ౧౨౮౯ పద్యములున్నవని యర్థము.) ఉదార = గొప్పదగు, అరణ్య = వనమునందు, ప్రథిత = ప్రసిద్ధికెక్కిన, చరిత = చరిత్రముచే, ఉద్దామ = గొప్పయైనవాఁడా, వాత్సల్య = కరుణకు, సీమా = ఎల్లయయినవాఁడా, క్రూరారాతి = క్రూరులైన శత్రువుల, క్రథన = వధించుటయందు, కలిత = తెచ్చుకొనఁబడిన, 'కలిః కామధేనుః' అని ప్రమాణము. క్రూరకోపా = తీవ్రమైన కోపముగలవాఁడా! శత్రువు లెంత క్రూరులో యాయనకోప మంత క్రూరమని తెలుపుటకై క్రూరశబ్దమే రెండుస్థలములఁ బ్రయోగింపఁబడెను. అపాపా = అపహతపాప్మా, పాపస్పర్శ లేనివాఁడా, వారాశిట్ + జా = సముద్రతనయ యగు లక్ష్మీదేవి యనెడి, కమల = తామరకు, మధుపా = తుమ్మెదయగువాఁడా, భక్తహృత్ = భక్తుల హృదయమనెడి, పద్మ = కమలము, సద్మా = గృహముగాఁ గలవాఁడా.

— గద్యము. —

సీ. తనపాదభక్తుల ♦ తనయునిగాఁ జేసి యనుకంపవీక్షించె ♦ జననమంద
ఆవలఁ దాలక్ష్మ♦ణార్యుఁడై రక్షించి రామాయణం బను♦గ్రహముచేసె
స్వీయమంత్రంబును♦జెట్లూరినరసింహ, దేశికుండై యుప♦దేశమిచ్చె
ఏకశిలానగ♦రౌకుఁడై గ్రహియించి, యాంధ్రవాల్మీకిరా♦మాయణంబు
వ్యాఖ్యదానికిపుడు♦వ్రాయించుకొనియెను, గరిమెతోడను వన♦కాండమునకు
వాసుదాసుచేత స్వ♦ప్రభావంబును, బ్రకటపఱుప రామ♦భద్రవిభుఁడు.

ఇది శ్రీమద్రామచంద్ర చరణారవింద మిళిందాయమాన,
మానసత్వమహావైభవ వావిళ్ళకొలను రామచంద్ర
రాయతనూభవ స్వజనవిధేయ సుబ్బరాయ
(వా సు దా స) నామధేయప్రణీతంబైన
మందరాఖ్య స్వయంకృత వ్యాఖ్యాన
సమేత శ్రీమదాంధ్ర వాల్మీకి
రామాయణమను నిర్వచన
మహాకావ్యంబునందు
నారణ్యకాండము

శ్రీ రా మా ర్ప ణ మ స్తు.

శ్రీ. శ్రీ. శ్రీ.

శ్లో॥ నమోస్తురామాయ సలక్ష్మణాయ, నమోస్తు దేవ్యై జనకాత్మజాయై।
నమోస్తు వాతాత్మభువే వరాయ, నమోస్తు వల్మీకభవాయ తస్మై॥